శ్రీ రామ సేవ

శ్రీ మదాంధ్ర వాల్మీకి రామాయణము

(మందరము) ఉత్తర కాండము

గ్రంథకర్త:
వావిలికొలను సుబ్బారావు



తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి

శ్రీమదాంధ్ర

వాల్మీకి రామాయణము

(మందరము) ఉత్తర కాండము

రచన

వావిలికొలను సుబ్బారావు

ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

SRI MADANDHRA VALMIKI RAMAYANAMU

(MANDARAMU) UTTARA KANDAMU

T.T.D. Religious Publication Series No:
© All Rights Reserved

e_Book Edition : 2023

Copies:

Published by :
Sri A.V. Dharma Reddy, IDES
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

D.T.P:
Publications Division,
T.T.D, Tirupati.

Printed at :
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati.

శ్రీరస్తు

శ్రీమదాంధ్రవాల్మీకిరామాయణ

విషయసూచిక

ఉత్తరకాండము

సర్గసంఖ్య.		పుటసంఖ్య.
౧	అగస్త్యాది మహర్షులు శ్రీరామదర్శనార్థులై వచ్చుట	౪
,,	మౌనులు శ్రీరాముఁ బ్రశంసించుట	౮
,,	శ్రీరాముఁడు మునుల నింద్రజిత్తు నాధిక్యమునకుఁ గారణ మడుగుట	౧౨
౨	అగస్త్యుండు శ్రీరామునకు రావణజన్మాది వృత్తాంతముఁ దెలుపుట	౧౩
,,	తృణబిందుఁడు తనకూఁతుఁ బులస్త్యునకు నర్పించుట	౧౮
౩	విశ్రవసునకుఁ గుబేరుండు జన్మించుట	౨౨
,,	బ్రహ్మ కుబేరు నుత్తరదిక్కున కధిపతిఁ జేయుట	౨౪
౪	శ్రీరాముఁ డగస్త్యునిఁ బూర్వరాక్షసుల వృత్తాంత మడుగుట	౨౬
,,	యక్షరాక్షసుల యుత్పత్తి	౨౭
౪౫	సుకేశుని జన్మవృత్తాంతము	౩౦
౫	సుకేశునకు మాల్యవదాదులు జన్మించుట	౩౩
,,	మాల్యవదాదులు లంకయందు జేరుట	౩౫
,,	మాల్యవదాదులకు వెరచి సురలు శివుశరణముఁ జొచ్చుట	౩౮
,,	దేవతలకు విష్ణు వభయం బిచ్చుట	౪౧
౬	మాల్యవంతుఁడు సురలపై దండెత్త నాలోచించుట	౪౪
,,	మాల్యవంతుఁడు దేవతలమీఁదికి యుద్ధంబునకుఁ బోవుట	౪౯
౬౭	విష్ణువు దేవతలకుఁ దోడ్పడి రాక్షసులఁ బాఱఁదోలుట	౫౧
౭	విష్ణువు సుమాలితోఁ బోరుట	౫౯
,,	విష్ణువు సుమాలిని వధించుట	౬౧
,,	రాక్షససేన పలాయిత మగుట	౬౩
౮	మాల్యవంతుఁడు విష్ణుని నిష్ఠురము లాడుట	౬౫
,,	రాక్షసులు పరాజితులై లంకఁ జొచ్చుట	౬౮
,,	సుమాలి కూఁతుం దోడ్కొని భూలోకంబునకు వచ్చుట	౭౨
,,	కైకసి విశ్రవసు నాశ్రమంబునకు వచ్చుట	౭౪
,,	రావణ కుంభకర్ణ విభీషణ జననము	౭౭
౧౦	అగస్త్యుఁడు శ్రీరామునకు రావణాదుల తపోవిధముఁ జెప్పుట	౮౦
,,	బ్రహ్మ రావణునకు వరములిచ్చుట	౮౨

సర్గసంఖ్య.		పుటసంఖ్య.
౧౦	బ్రహ్మ విభీషణునకు వరంబులిచ్చుట	౮౪
,,	బ్రహ్మ కుంభకర్ణునకు నిద్ర నిచ్చుట	౮౫
౧౧	సుమాలి రావణాదులఁ జూడ భూలోకంబునకు వచ్చుట	౮౮
,,	ప్రహస్తుఁడు లంక గ్రహింప రావణునకు బోధించుట	౮౯
,,	రావణుఁడు ప్రహస్తునిఁ గుబేరునొద్దకు బంపుట	౯౧
,,	కుబేరుఁడు లంక విడిచిపోవ సమ్మతించుట	,,
,,	రావణుఁడు లంకాప్రవేశము సేయుట	౯౪
౧౨	రావణునకు మయుఁడు మండోదరీ వృత్తాంతముఁ జెప్పుట	౯౫
,,	మయుఁడు రావణునకు మండోదరినిచ్చి వివాహముఁ జేయుట	౯౮
,,	రావణుఁడు తన సోదరులకు వివాహములు చేయుట	౯౯
౧౩	రావణుఁడు లోకంబుల బాధించుట	౧౦౦
,,	కుబేరుఁడు రావణునకు నీతిఁ దెలుప దూత నంపుట	౧౦౨
,,	రావణుఁడు కుబేరు దూతను వధించుట	౧౦౫
,,	రావణుఁడు కుబేరు జయింపఁ బోవుట	౧౦౬
,,	యక్ష రాక్షస యుద్ధము	౧౦౭
౧౫	కుబేరుఁడు రావణు నిష్ఠురంబు లాడుట	౧౧౩
,,	రావణ కుబేర యుద్ధము	౧౧౬
,,	రావణుఁడు కుబేరు జయించుట పుష్పకంబుఁ గొనుట	౧౧౮
౧౬	కైలాస ప్రాంతంబునఁ బుష్పకంబు చనకుండుట	౧౨౦
,,	నందీశ్వరుఁడు రావణు శపించుట	౧౨౨
,,	రావణుఁడు కైలాసముఁ బెల్లగించుట	౧౨౩
,,	శివుఁడు రావణునకు వరంబులిచ్చుట	౧౨౫
౧౭	రావణుఁడు వేదవతితో సంభాషించుట	౧౨౮
,,	వేదవతి రావణునకుఁ దన వృత్తాంతముఁ దెలుపుట	౧౨౯
,,	రావణుఁడు వేదవతిని దురుక్తులాడుట	౧౩౧
,,	వేదవతి రావణు శపించి యగ్నిలోఁ జొచ్చుట	౧౩౩
౧౮	రావణుఁడు మరుత్తు యజ్ఞశాలకుఁ బోవుట	౧౩౬
,,	సంవర్తుఁడు మరుత్తుని శాంతుఁ జేయుట	౧౩౯
,,	ఇంద్రాదులు మయూరాదులకు వరములిచ్చుట	౧౪౦
౧౯	అనరణ్యుఁడు రావణుతో యుద్ధం బొనర్చుట	౧౪౨
,,	అనరణ్యుఁడు రావణు శపించుట	౧౪౫
౨౦	నారదుఁడు రావణునకు మనుష్యవధ మాన బోధించుట	౧౪౭
,,	నారదునితో రావణుఁడు తాను యముని జయింపఁ బోయెదననుట	౧౪౯
,,	నారదుఁడు రావణుఁ డెట్లు యముని జయించునని యోజించుట	౧౫౧
౨౧	రావణు నుద్దేశము నారదుఁడు యమునితోఁ జెప్పుట	౧౫౨

వర్గసంఖ్య.		పుటసంఖ్య
౨౧	రావణుఁడు యమలోకంబున బాధింపఁబడు జీవులఁ జూచుట	౧౫౩
,,	యమభటులు రావణుతోఁ బోరుట	౧౫౬
,,	రావణుఁడు పాశుపతాస్త్రంబున యమకింకరుల దహించుట	౧౬౦
౨౨	యముఁడు రావణుతో యుద్ధమునకై వెడలుట	,,
,,	యమ రావణ యుద్ధము	౧౬౨
,,	యముఁడు రావణుపై యమదండము వైవఁబూనుట	౧౬౬
,,	దండము వైవవలదని బ్రహ్మ యముని నివారించుట	౧౬౭
౨౩	రావణుఁడు నివాతకవచులతో సంధి చేసికొనుట	౧౭౦
,,	రావణుఁడు కాలకేయుల జయించుట	౧౭౨
,,	రావణుఁడు వరుణ నగరముపైఁ బోవుట	౧౭౩
,,	వరుణ తనయులు రావణునితో బోరి యోడిపోవుట	౧౭౫
౨౪	రావణుఁడు నానా స్త్రీలఁ జెఱపట్టుట	౧౭౯
,,	చెఱఁబడిన స్త్రీలు విలపించుట	౧౮౨
,,	చెఱఁబడిన స్త్రీలు రావణు శపించుట	౧౮౯
,,	శూర్పణఖ రావణు నిష్ఠురంబు లాడుట	౧౯౦
,,	రావణుఁడు శూర్పణఖ నూరార్చుట	౧౯౨
౨౫	రావణుఁ డింద్రజిత్తుం జూడ నికుంభిలకు బోవుట	౧౯౩
,,	విభీషణుఁడు రావణుతో మధుఁడు కుంభీనసి నపహరించిన వార్తఁ దెల్పుట	౧౯౬
,,	రావణుఁడు మధునిమీఁదికి దండయాత్రపోవుట	౧౯౯
,,	కుంభీనసి మధుని గాపాడ రావణు వేఁడుకొనుట	౨౦౦
౨౬	రావణుఁడు మధునితోఁ గైలాసప్రాంతంబున విడియుట	౨౦౨
,,	రావణుఁడు వెన్నెలకాఁకకు వేఁగుట	౨౦౪
,,	రంభ కై సేసికొని రావణసేనా మధ్యంబునఁ జనుట	౨౦౬
,,	రంభారావణ సంవాదము	౨౦౮
,,	రావణుఁడు రంభను జెఱచి విడుచుట	౨౧౪
,,	రంభ రావణు నకృత్యంబు నలకూబరుతోఁ దెలుపుట	౨౧౫
,,	నలకూబరుఁడు రావణు శపించుట	౨౧౭
౨౭	రావణుఁ డింద్రపురిపై దాడిపెట్టుట విని సురలు యుద్ధప్రయత్నులగుట	౨౧౯
,,	ఇంద్రుఁడు విష్ణువుఁ జూడఁ బోవుట	,,
,,	విష్ణు వింద్రుతోఁ దాను యుద్ధమునకు రానని చెప్పుట	౨౨౦
,,	దేవరాక్షస యుద్ధము	౨౨౨
,,	జయంత మేఘనాదుల యుద్ధము	౨౨౬
,,	ఇంద్రుఁడు యుద్ధమునకు వెడలుట	౨౨౮
,,	కుంభకర్ణుఁడు దేవతలతోఁ బోరుట	౨౩౦
,,	సుర సహాయుండై యింద్రుఁడు రాక్షసుల వధించుట	౨౩౧

సర్గసంఖ్య.		పుటసంఖ్య.
౨౯	రావణుఁడు సురసేనా మధ్యంబునఁ జొచ్చి యుద్ధము సేయుట	౨౩౩
,,	ఇంద్రుఁడు రావణుని బంధింపఁ బ్రయత్నించుట	౨౩౪
,,	మేఘనాదుఁడు మాయచే నింద్రుని బంధించుట	౨౩౬
,,	రావణుఁడు యుద్ధముఁ జాలించి మేఘనాదుని బ్రశంసించుట	౨౩౮
౩౦	బ్రహ్మ లంకకుఁబోయి రావణ మేఘనాదులఁ బ్రశంసించుట	౨౪౦
,,	బ్రహ్మ మేఘనాదుఁడు కోరినవరమిచ్చి ఇంద్రుని విడిపించుకొనిపోవుట	౨౪౧
౩౧	బ్రహ్మ ఇంద్రునితో నతఁడు బద్ధుఁడగుటకుఁ గారణముఁ జెప్పుట	౨౪౩
,,	రావణుఁడు కార్తవీర్యార్జును గెలువఁ బోవుట	౨౪౯
,,	కార్తవీర్యార్జునుఁడు నర్మదయందు స్త్రీలతోఁ గ్రీడించుట	౨౫౧
,,	రావణుఁడు నర్మదాతీరమున విడియుట	౨౫౨
,,	రావణుఁడు శివలింగ పూజ సేయుట	౨౫౬
౩౨	అర్జునుడు తన భుజములచే నర్మద నడ్డగించుట	౨౫౭
,,	నర్మద యెదురొడ్డిపారి రావణ పూజాద్రవ్యంబుల ముంచుట	౨౫౮
,,	శుకసారణులు నర్మద యెదురెక్కి పారుకారణము రావణుతోఁ జెప్పుట	౨౫౯
,,	రావణుఁడు కార్తవీర్యార్జునునితోఁ బోరఁ జనుట	౨౬౦
,,	అర్జున రావణమంత్రుల యుద్ధము	౨౬౨
,,	కార్తవీర్యార్జునుఁడు బ్రహస్తునిఁ బడ నడఁచుట	౨౬౩
,,	రావణ కార్తవీర్యార్జునుల గదాయుద్ధము	౨౬౪
,,	కార్తవీర్యార్జునుఁడు రావణు బంధించి పురికిఁ గొనిపోవుట	౨౬౫
౩౩	పులస్త్యుఁడు రావణుని విడిపించుకొని పోవుట	౨౬౭
౩౪	రావణుఁడు వాలితో యుద్ధంబు సేయఁ గిష్కింధకుఁ బోవుట	౨౭౧
,,	వాలి రావణుఁ జంక నిరికి సముద్రంబుల ముంచుట	౨౭౫
,,	రావణుఁడు వాలితో స్నేహ మొనర్చుట	౨౭౭
౩౫	శ్రీరాముఁ డగస్త్యుని హనుమంతుఁ గూర్చి ప్రశ్నించుట	౨౮౦
,,	ఆంజనేయోపాఖ్యానము	౨౮౩
,,	వాయు నిరోధంబున లోకంబులు బాధపడుట	౨౮౭
౩౬	బ్రహ్మాదులు హనుమంతునకు వరంబు లిచ్చుట	౨౯౦
,,	మునులు హనుమంతు శపించుట	౨౯౪
౩౬,౩౭	అగస్త్యాదులు శ్రీరాముచే ననుజ్ఞగొని పోవుట	౨౯౮
౩౮	శ్రీరాముఁడు జనకాది రాజుల వారివారి పురంబుల కనుపుట	౩౦౪
,,	రావణయుద్ధమునఁ దనకుఁ దోడ్పడమూఁగిన రాజుల శ్రీరాముఁడు	౩౦౬
,,	రాజులు శ్రీరాముఁ గొండాడి సెలవుగొని పోవుట[సత్కరించుట]	౩౦౯
౩౯	సకల రాజులు వారివారి రాజ్యంబులకుఁ బోవుట	౩౧౦
,,	శ్రీరాముఁడు సుగ్రీవాంగద హనుమదాదుల బహూకరించుట	౩౧౨

సర్గసంఖ్య		పుటసంఖ్య
౪౦	శ్రీరాముఁడు సుగ్రీవాదులఁ గిష్కింధ కనుచుట	౩౧౪
,,	శ్రీరాముఁడు విభీషణు లంక కనుచుట	౩౧౫
,,	శ్రీరాముఁడు హనుమంతునకు వరములిచ్చుట	౩౧౬
౪౧	కుబేరునొద్దనుండి పుష్పకము శ్రీరాముఁ గొల్వవచ్చుట	౩౨౦
,,	భరతుఁడు శ్రీరామునకుఁ బ్రజల సుఖస్థితిఁ దెలుపుట	౩౨౧
౪౨	శ్రీరాముఁ డశోకవనమున సీతాదేవితోఁ గ్రీడించుట	౩౨౩
,,	సీతాదేవి ఋష్యాశ్రమములకుఁ బోవఁగోరుట	౩౨౭
౪౩	శ్రీరాముఁడు భద్రుని లోకవార్త లడుగుట	౩౨౯
,,	భద్రుఁడు శ్రీరామునకు సీతావిషయక లోకాపవాదముం దెలుపుట	౩౩౦
౪౪	శ్రీరాముఁడు సోదరులఁ బిలిపించుట	౩౩౨
౪౫	శ్రీరాముఁడు భరతాదులకు లోకాపవాదవిధంబుఁ దెలుపుట	౩౩౫
,,	శ్రీరాముఁడు సీతాదేవిని వాల్మీకి యాశ్రమంబుపొంత విడువ లక్ష్మణు నాజ్ఞాపించుట	౩౩౮
౪౬	లక్ష్మణుఁడు సీతాదేవిని ఋష్యాశ్రమంబులకని పిలుచుకొనిపోవుట	౩౪౦
,,	సీతాదేవి యపశకునంబులఁ గని పరితపించుట	౩౪౧
,,	సీతాదేవి లక్ష్మణుఁడు దుఃఖింప నూరార్చుట	౩౪౩
౪౭	లక్ష్మణుఁడు శ్రీరామాజ్ఞ చెప్పలేక యేడ్చుట	౩౪౫
,,	లక్ష్మణుఁడు సీతాదేవికి శ్రీరామాజ్ఞ నెఱింగించుట	౩౪౭
౪౮	శ్రీరామాజ్ఞ విని సీతాదేవి విలపించుట	౩౪౯
,,	సీత శ్రీరామాదులకుఁ గడవాక్యంబులు చెప్పి కంపుట	౩౫౧
,,	లక్ష్మణుఁడు సీతాదేవిచే ననుజ్ఞగొని మరలి గంగ దాఁటుట	౩౫౩
౪౯	మునికుమారులు వాల్మీకికి సీతావృత్తాంతము దెలుపుట	౩౫౫
,,	వాల్మీకి సీతాదేవి నూరార్చి యాశ్రమంబునకుఁ దోడ్కొని చనుట	౩౫౬
,,	వాల్మీకి సీతాదేవిని మునిసతుల కప్పగించుట	౩౫౮
౫౦	లక్ష్మణుఁడు శ్రీరాముని గుఱించి సుమంత్రునితోఁ జెప్పి యేడ్చుట	౩౫౯
,,	సుమంత్రుఁడు లక్ష్మణునకు మనస్తాపోపశమనంబు సేయుట	౩౬౧
౫౧	దశరథదుర్వాసులసంభాషణము సుమంత్రుఁడు లక్ష్మణునకుఁ దెలుపుట	౩౬౨
,,	భృగుమహర్షి విష్ణువును శపించుట	౩౬౩
,,	శ్రీరామవృత్తాంతము దుర్వాసుఁడు దశరథున కెఱింగించుట	౩౬౫
౫౨	లక్ష్మణుఁడు శ్రీరాము దర్శింపఁ బోవుట	౩౬౭
,,	లక్ష్మణుఁడు సీతావృత్తాంతముఁ దెలిపి శ్రీరాము నూఱడించుట	౩౬౮
౫౩	శ్రీరాముఁడు లక్ష్మణునకు నృగుచరిత్ర దెలుపుట	౩౭౦
౫౪	నృగోపాఖ్యాన శేషము	౩౭౪
౫౫	శ్రీరాముఁడు లక్ష్మణునకు నిమికథఁ దెలుపుట	౩౭౬
౫౬	వసిష్ఠుఁడు దేహము ధరించుట	౩౭౮

సర్గసంఖ్య.		పుటసంఖ్య.
౫౭	వసిష్ఠుఁడు మైత్రావరుణుఁడయి జన్మించుట	౩౮౧
,,	దేవతలు ఋషులు నిమికోరిన వర మిచ్చుట	౩౮౩
౫౮	శ్రీరాముఁడు లక్ష్మణునకు యయాతి చరిత్రముఁ దెలుపుట	౩౮౪
౫౯	యయాతి పూరునకు వార్ధకమిచ్చి యౌవనముఁ గొనుట	౩౮౭
౬౦	చ్యవనాదులు శ్రీరాము దర్శింప వచ్చుట	౩౯౧
౬౧	చ్యవనుఁడు లవణ వృత్తాంతము శ్రీరామునకు దెలుపుట	౩౯౩
౬౨	శ్రీరాముఁడు మానులను లవణునాచారాదుల నడుగుట	౩౯౮
,,	శత్రుఘ్నుఁడు తాను లవణుఁ జంపఁ బోయెదననుట	౩౯౯
,,	శ్రీరాముఁడు లవణుఁ జంపి మధురాపురినేల శత్రుఘ్ను నాజ్ఞాపించుట	౪౦౦
౬౩	పట్టాభిషేకం బొల్లక శత్రుఘ్నుఁడు పరితపించుట	౪౦౧
,,	శ్రీరాముడు శత్రుఘ్నుని మధుర కభిషిక్తుని జేయుట	౪౦౨
౬౩,౬౪	శ్రీరాముఁడు శత్రుఘ్నునకు నారాయణాస్త్రం బొసంగి లవణుఁ జంపు నుపాయంబు దెల్పుట	౪౦౩
౬౪	శత్రుఘ్నుఁడు సేనల ముందుగనంపి తానొంటిగ లవణునిపై బోవుట	౪౦౭
౬౫	శత్రుఘ్నుఁడు వాల్మీకి యాశ్రమంబునఁ జేరుట	౪౦౮
,,	వాల్మీకి శత్రుఘ్నునకు సౌదాసు చరిత్రముఁ దెలుపుట	౪౦౯
,,	వసిష్ఠుఁడు సౌదాసుని శపించుట	౪౧౧
౬౬	సీతాదేవి కుమారులఁ గనుట	౪౧౩
౬౭	శత్రుఘ్నునకుఁ జ్యవనుండు లవణుచే మాంధాతమడిసిన విధంబుఁ దెల్పుట	౪౧౫
,,	మాంధాత లవణుచే హతుఁడగుట	౪౧౬
౬౮	శత్రుఘ్నుఁడు లవణుఁ బురంబులోనికిఁ బోకుండ నిరోధించుట	౪౧౮
౬౯	లవణశత్రుఘ్నుల యుద్ధము	౪౨౦
,,	శత్రుఘ్నుఁడు లవణు వధించుట	౪౨౨
౭౦	దేవతలు శత్రుఘ్నునకు వరమిచ్చుట	౪౨౫
,,	శత్రుఘ్నుఁడు మధురాపురంబు నభివృద్ధి పఱుచుట	౪౨౬
,,	శత్రుఘ్నుఁడు వాల్మీకి యాశ్రమంబున విడియుట	౪౨౮
,,	శత్రుఘ్నుఁడు శ్రీరామాయణమును వినుట	౪౨౯
౭౨	శత్రుఘ్నుఁడు శ్రీరాము దర్శింప నయోధ్య కేగుట	౪౩౦
,,	శ్రీరామ శత్రుఘ్నుల సంభాషణము [వాకిటవైచి యేడ్చుట]	౪౩౨
౭౩	బ్రాహ్మణుఁడు మృతబాలుని కళేబరమును శ్రీరాముని యింటి	౪౩౩
౭౪	నారదుఁడు శ్రీరామునకుబాలకుండు మృతుండైన కారణముఁ దెలుపుట	౪౩౭
౭౫	శ్రీరాముఁడు పుష్పకంబుపై నెక్కి శూద్రమునిని వెదక నేగుట	౪౪౩
౭౬	శ్రీరాముఁడు శంబుకుని వధించుట	౪౪౪
,,	శ్రీరాముఁ డగస్త్యుఁ జూడఁబోవుట	౪౪౭
,,	అగస్త్యుడు శ్రీరామునకు దివ్యాభరణ మొసఁగఁబోవుట	౪౪౮

సర్గసంఖ్య		పుటసంఖ్య
౭౬	దివ్యాభరణముఁ గొనవచ్చునని యగస్త్యుఁడు శ్రీరామునమాధాన	౪౪౯
౭౭	శ్వేతోపాఖ్యానము [పఱచుట]	౪౫౧
౭౮	శ్వేతుఁడు తనవృత్తాంత మగస్త్యుతోఁ దెల్పుట	౪౫౩
౭౯	దండకారణ్య చరిత్ర మగస్త్యుఁడు శ్రీరామునకు దెలుపుట	౪౫౭
౮౦	దండుఁడు శుక్రు కూఁతు నరజను జెఱుచుట	౪౫౯
౮౧	శుక్రుఁడు దండుని దేశముపై మట్టివాన గురియ శపించుట	౪౬౦
౮౨	శ్రీరాముఁ డగస్త్యుచే నాజ్ఞగొని యయోధ్యకు మరలిచనుట	౪౬౪
౮౩	శ్రీరాముఁడు రాజసూయంబుఁ జేయఁదమ్ములతో యోజించుట	౪౬౬
,,	భరతుఁడు రాజసూయ మర్హముగాదని నుడువుట	౪౬౭
౮౪	లక్ష్మణుఁడు వృత్రకథ శ్రీరామునితోఁ జెప్పుట	౪౬౯
౮౫	విష్ణువు వాసవుతో వృత్రుఁ జంప నుపాయంబుఁ దెలుపుట	౪౭౧
,,	ఇంద్రునకు బ్రహ్మహత్య ప్రాప్తించుట	౪౭౩
౮౬	ఇంద్రుఁ డశ్వమేధ మొనర్చి బ్రహ్మహత్యఁ దొలగించుకొనుట	౪౭౪
౮౭	శ్రీరాముఁడు లక్ష్మణునకు నిలుని వృత్తాంతముఁ దెలుపుట	౪౭౬
,,	ఇలుఁడు స్త్రీయై పార్వతీ పరమేశ్వరుల శరణు జొచ్చుట	౪౭౮
,,	ఇలుఁ డొకనెలస్త్రీగను నొకనెలపురుషుఁడుగ నుండఁ బార్వతియను	౪౭౯
౮౮	ఇలుఁడు స్త్రీయై బుధుని యాశ్రమంబుఁ జేరుట [గ్రహించుట]	౪౮౦
,,	బుధుఁ డిలాదేవిని జూచి మోహించుట	౪౮౧
౮౯	ఇలాదేవి బుధునితోఁ గలియుట	౪౮౩
,,	ఇలాదేవి పురూరవుం గనుట	౪౮౬
౯౦	బుధుఁడిలునకు శాశ్వత పురుషత్వముఁ గలిగింపనశ్వమేధంబు సేయుట	౪౮౭
,,	ఇలుఁ డెప్పటియట్ల పురుషత్వముం గనుట	౪౮౯
౯౧	శ్రీరాముఁడు పురోహితాదులఁబిలిపించి యశ్వమేధంబొనర్తునని	౪౯౧
౯౨	శ్రీరాము డశ్వమేధ యాగముసేయ నుపక్రమించుట [చెప్పుట]	౪౯౨
౯౩	వాల్మీకిమహర్షి కుశలవుల రామాయణముగానము సేయనియమించుట	౪౯౫
౯౪	కుశలవులు రామాయణము గానముసేయ శ్రీరాముఁడు వినుట	౪౯౯
,,	కుశలవులయెడ శ్రీరాముని పోలికట్లు చూచి జనులువిస్మితులగుట	౫౦౨
౯౫	శ్రీరాముఁ డిచ్చిన కానుకలఁ గుశలవులు నిరాకరించుట	౫౦౩
,,	రామాయణముఁగూర్చి శ్రీరాముఁడు కుశలవులఁ బ్రశ్నించుట	౫౦౪
,,	కుశలవులు దన కొమరులని శ్రీరాముఁ డెఱింగి వాల్మీకి మహర్షి యొద్దకు [దూతలనంపుట]	౫౦౬
,,	సీత శపథంబు సేయునని వాల్మీకిమహర్షి శ్రీరామునకుఁ జెప్పిపంపుట	౫౦౭
౯౬	సీతా శపథముఁ జూచుటకు లోకులు గుంపులు చేరుట	౫౦౮
,,	సీతాదేవిని దోడ్కొని వాల్మీకిమహర్షి యజ్ఞశాలకు వచ్చుట	౫౦౯
,,	సీతాదేవిపతివ్రతయనివాల్మీకిమహర్షి సత్యముజేసిచెప్పుట[శ్రీరాముఁడనుట	౫౧౦
౯౭	లోకాపవాదముఁ బాపుకొన సీతాదేవి శపథము సేయవలయునని	౫౧౨

సర్గసంఖ్య.		పుటసంఖ్య.
౯౭	సీతాదేవి శపథంబు సేయుట	౫౧౪
,,	సీతాదేవి రసాతలంబునకు బోవుట	౫౧౫
౯౮	సీతావియోగంబునకు శ్రీరాముఁడు పరితపించుట	౫౧౭
,,	శ్రీరాముఁడు భూదేవిపై గోపించుట	౫౧౮
,,	బ్రహ్మ శ్రీరాముని శాంతుఁజేయుట	౫౧౯
,,	రామాయణ శేషము వినుమని బ్రహ్మ శ్రీరాముని వేఁడుట	౫౨౦
౯౯	శ్రీరాముఁ డుత్తర కాండ శేషమును వినుట	౫౨౩
,,	శ్రీరాముఁడు కొడుకులతో నయోధ్యకుఁ బ్రవేశించుట	,,
,,	కౌసల్యా సుమిత్రా కైకేయులు మరణించుట	౫౨౫
౧౦౦	యుధాజిత్తుండు గార్గ్యుని శ్రీరామునొద్దకుఁ బంపుట	,,
,,	గార్గ్యుఁడు యుధాజిత్తు సందేశమును శ్రీరామునితోఁ జెప్పుట	౫౨౬
,,	శ్రీరాముఁడు సపుత్త్రు భరతుని గంధర్వుల జయింపఁ బంపుట	౫౨౭
౧౦౧	భరతుండు గంధర్వుల జయించుట	౫౨౯
,,	భరతుండు తక్ష పుష్కలులకుఁ బట్టాభిషేకంబు సేయుట	౫౩౦
౧౦౨	శ్రీరాముఁడు లక్ష్మణకుమారులను గారుపథ చంద్రకాంతములకుఁ [బ్రభువులఁ జేయుట]	౫౩౧
౧౦౩	శ్రీరాముని సందర్శింపఁ గాలుఁడు వచ్చుట	౫౩౪
౧౦౪	బ్రహ్మసందేశమును గాలుండు శ్రీరామునకుఁ దెల్పుట	౫౩౬
౧౦౫	దుర్వాసుండుతనరాక శ్రీరామునికెఱింగింపుమని లక్ష్మణునితో జెప్పుట	౫౩౭
౧౦౬	లక్ష్మణుఁడుశ్రీరామునితోఁదన్ను వధించిసత్యమురక్షింపుమనిచెప్పుట	౫౪౧
,,	వసిష్ఠు వాక్యంబున శ్రీరాముఁడు లక్ష్మణుని విడనాడుట	౫౪౩
,,	లక్ష్మణుఁడు మేనితో దివంబున కేగుట	౫౪౪
౧౦౭	శ్రీరాముండు మహాప్రస్థానంబేగ నిశ్చయించుట	౫౪౫
,,	శ్రీరాముని వెంటఁబోవఁ బౌరు లనుజ్ఞ గోరుట	౫౪౭
౧౦౮	శత్రుఘ్నుఁడు కొడుకులకుఁ బట్టాభిషేక మొనర్చియయోధ్యఁజేరుట	౫౪౮
,,	సుగ్రీవ విభీషణాదులు శ్రీరామునిఁ జూడవచ్చుట	౫౫౦
,,	శ్రీరాముఁడు హనుమద్విభీషణాదులకు వరంబు లిచ్చుట	౫౫౧
౧౦౯	శ్రీరాముఁడు సకల ప్రాణులతో మహాప్రస్థానమేగుట	౫౫౩
౧౧౦	బ్రహ్మాదులు శ్రీరాము దర్శింప వచ్చుట	౫౫౭
,,	శ్రీరాముఁడు సానుజుఁడై సశరీరుండై వైష్ణవ తేజంబుఁ జొచ్చుట	౫౬౦
,,	బ్రహ్మ సమస్త జనంబుల నుత్తమలోకంబుల నుంచుట	౫౬౧
౧౧౧	శ్రీరామాయణ ఫలశ్రుతి	౫౬౪
,,	ఆంధ్రకవికృత గ్రంథాంత నమస్కారము	౫౭౧
,,	కవి యీగ్రంథము నొంటిమిట్ట శ్రీరాముల కర్పించుట	౫౭౬
,,	ఉత్తరకాండాంత పద్యములు	౫౭౯

శ్రీ

శ్రీ సీతా లక్ష్మణ భరత శత్రుఘ్న హనుమత్సమేత శ్రీరామచంద్ర పరబ్రహ్మణేనమః

శ్రీ హయగ్రీవప్రసన్న

శ్రీ శా ర దా యై న మః

శ్రీమతే రామానుజాయ నమః

శ్రీ మదాంధ్ర వాల్మీకి రామాయణము

ఉ త్త ర కాం డ ము

శ ! నతకమల భవ ! సీ
తేశా ! దేవాధినాథ ! ధృతధీరా ! గా
రీశేడ్యా ! యమిరాట్పుర
గా ! శివకర ! యభవ ! మందనప్రియక నమః

మం ద ర ము

సీ. ఆఱుకాండంబులు ♦ నాఱుసముద్రంబు, లాఱుప్రాకారంబు ♦ లాఱుదశలు
నాఱువికారంబు ♦ లత్యమోఘంబైన, భవదీయకరుణను ♦ బరమపురుష !
తరియింపఁగంటిని ♦ దారిని సలయక, త్వచ్చరిత్రాంబుధిఁ ♦ ద్రచ్చుచోట
నాదిని ప్రభవించె ♦ హాలహాలం బది యూంతెఁ దావకకరుణ నీ ♦ తాకశత్ర !

గీ. కామధేను చింతామణి ॰ కల్పవృక్ష, కౌస్తుభంబులు లక్ష్మియుఁ ♦ గలిగె నింక
నమృత మిద్దానఁ గలిగించి యఖిలబుధుల, నందఁ జేయు మము త్వత్వ॰మాదిదేవ

శ్రీశ=లక్ష్మీదేవికి నియామకుఁడైన వాఁడా, నతకమలభవ = నమస్కరించు బ్రహ్మదేవునిఁ గలవాఁడా! సీతేశా=సీతావల్లభా, దేవాధినాథ=దేవతలకందఱకు నధిపతియైన వాఁడా, ధృతధీరా=మందర పర్వతమును ధరించినవాఁడా, గౌరీశేడ్యా=శివునిచేస్తోత్రము చేయఁబడినవాఁడా, యమిరాట్ శరణా=యోగీశ్వరులకు రక్షకుఁడైన వాఁడా. శివకర=మేలుచేయువాఁడా, అభవ=జన్మము లేనివాఁడా, మండన ప్రియక=అలంకార ప్రియుఁడా, 'అలంకార ప్రియోవిష్ణుః, అభిషేక ప్రియ శ్శివ' యని నమః=నమస్కారము.

ఈపద్యమునందుఁ బ్రథమాక్షరము, 'శ్రీ', తరువాత నైదవయక్షరము'మ' తరువాత నైదవ యక్షరము 'తే' తరువాత నైదవయక్షరము'నా'తరువాత నైదవ యక్షరము 'రా' తరువాత నైదవయక్షరము 'య' తరువాత నైదవ యక్షరము 'ణా', తరువాత నైదవ యక్షరము 'య', తరువాత నైదవ యక్షరము 'న' దానికైదవ యక్షరము 'మః',

ఈ యక్షరములు కలిపి చదివిన 'శ్రీమతే నారాయణాయ నమః' అని యేర్పడును.

శ్రీమద్రామాయణము ద్వయమంత్రార్థమును బోధించునది కావున నా మంత్రేమున నుత్తరార్థముత్తరకాండమున మొదట సూచింపఁబడియె. పూర్వార్థము పూర్వరామాయణముతో ముగిసెను. ఈ ద్వయమంత్రార్థము కాండాంతమునఁ జెప్పఁబడును.

శ్రీరామపట్టాభిషేకమున కుత్తర చరిత్ర మిందుఁ జెప్పఁబడుటను, సాధుపరిత్రాణము దుష్టవినాశముజరిపిన పిమ్మట చేయఁబడిన ధర్మసంస్థాపన మిందుఁ జేరొ్కనఁబడుటను, తక్కిన గుణములకంటెఁ బరత్వసూచకమగు మోక్ష ప్రదాన గుణ మిందు బోధింపఁబడుటను, ఈకారణములచేఁ దక్కిన కాండములకంటె నిది శ్రేష్ఠమైనది కావున నిది యుత్తరకాండ మనఁబడెను.

కొందఱనభిజ్ఞులు దీని నెవరో తరువాత నే కాలమందో వ్రాసి రామాయణమునఁ జేర్చిరనియు, నిది వాల్మీకికృతము గాదనియు నందురు.

౧. ఇది వాల్మీకికృతము గాదేని యిరువది నాలుగు గాయత్ర్యక్షరములకు నిరువదినాల్గువేల శ్లోకముల రచించె ననుట మిథ్య యగును.

౨. నారదోపదేశమందు 'నపుత్రమరణం కించి ద్ద్రక్ష్యంతి పురుషాః క్వచిత్' కానరు పుత్రుల మరణము, 'బ్రహ్మలోకి మనుగుఁ బ్రథితగుణుఁడు "నాల్గువర్ణముల జనంబులఁ దమ తమ ధర్మమందు నిలుపు" అని చెప్పఁబడిన విషయమును గుఱించి వాల్మీకి యేమియుఁ జెప్పినవాఁడు గాకుండును.

౩ 'రామస్య చరితం సర్వం కుశ త్వౌ ఋషిస త్తమ వృత్తం కథయ వీరస్య యథాతే నారదాచ్ఛ్రుతమ్' ఋషీశ్వరా! నారదు వలన నీవు వినిన రామచరిత్ర మంతయుఁ గావ్యముగఁ జేయుము అనిన బ్రహ్మవాక్యము వ్యర్థమగుచున్నది.

౪. 'కృత్స్నం రామాయణం కావ్య మీదృశైః కరవా ణ్యహమ్' రామాయణము సర్వము నిట్టి వృత్తములతో రచించెదను అను సంకల్పము.

'స్వ రాష్ట్రరంజనంచైవ వైదేహ్యాశ్చ విసర్జనమ్
అనాగతంచ యత్కించి ద్రామస్య వసుధాతలే
త చ్చకారో త్తరే కావ్యే వాల్మీకి ర్భగవా నృషిః'

తన రాష్ట్రజనుల సంతోషింపఁ జేయుట, సీతను వదలుట, భూలోకమందు రాముని భవిష్యచ్చరిత్రము వాల్మీకి యుత్తరకావ్యముగ రచించెను.

'ప్రాప్త రాజ్యస్య రామస్య వాల్మీకి ర్భగవాన్ ఋషిః
చకార చరితం కృత్స్నం... కావ్యం రామాయణం
కృత్స్నం సీతాయాశ్చరితం మహత్ ......

రాముడు రాజ్యమేలుచుండఁగా వాల్మీకి రామాయణ మంతయు వ్రాసెను. సీతాదేవి మహాచరిత్రమును వ్రాసెను.

అను వాక్యములు మిథ్య లగుచున్నవి.

౫. రామాయణమును గానము చేసిన కుశలవు లెవరో లోకమునకుఁ దెలిసియే యుండదు.

౬. సీతాదేవివంటి మహాపతివ్రతా శిరోమణికి నిష్కారణనింద వచ్చుట సహింపక వాల్మీకి యామె నిందఁ బోఁగొట్టి రామాయణము వ్రాసెననుటపొసఁగి యున్నది. అటు గాదేని తన యాశ్రమమందుఁ దన రక్షణమం దున్నదాని విషయమై చెప్పక పూర్వరామాయణముమాత్రము చెప్పి వినిచె ననుట యసంభావితము.

౭. కృతజ్ఞులైన మునులు తమ్ము రాక్షసబాధనుండి రక్షించినవారిని ప్రశంసింప వచ్చుటయు, నా సందర్భమున రావణేంద్రజిత్తుల పరాక్రమము వర్ణించుటయు, వారి చరిత్రమును శ్రీరామచంద్రమూర్తి ప్రశంసించుటయు, వారు రావణాదుల పుట్టుపూర్వోత్తరములు చెప్పుటయు ననందర్భోచితములు గావు.

౮. లోకులు కాకు లన్నట్లు సీతాదేవిపై లోకులు నిందమోపుట స్వభావ విరుద్ధము గాదు. దానిపై నుత్తమ నాయికానాయకు లెట్లు చరింపవలయునో యట్లు చరించుటయు ననంభావితము గాదు. ఆమె విషయమై వాల్మీకి పరితాపపడి గ్రంథము వ్రాసి రామచంద్రమూర్తి వినునట్లు చేయుటయు నాయన పరీక్ష గోరుటయు సీతాదేవి పరీక్షకుఁ బాలుపడుటయు విరుద్ధవిషయములు గావు. కారణ

కార్య సంవిధానమందు వాల్మీకి కల్పింపవలసిన దేదియులేదు. తరువాత వారెట్లు ప్రవర్తించిరో చెప్పుటయు విరుద్ధము కాదు. రామచంద్రమూర్తి విష్ణునవతార మని పలుతావులఁ జెప్పిన వాల్మీకి యాయన పరత్వప్రకటన విషయము చెప్పుట సముచితమే.

౯. ఉత్తరకాండమందలి కథాసంవిధానము వాల్మీకికిఁ దప్ప మఱియొకనికి నట్లు కుదరఁజాలదని చెప్పుచు పూర్వరామాయణ శైలికి నుత్తరకాండ శైలికి భేద ముండుటచే గ్రంథకర్తలు భిన్నులని సంశయించుచున్నారు. శైలిపటుత్వము కథాసందర్భము ననుసరించి యుండును, పూర్వరామాయణమున నాయికానాయకులు ప్రధానపాత్రములు సీతారాములు, లక్ష్మణాంజనేయులు లోనైనవారు, ఉత్తరకాండమున రావణాది రాక్షసులు లోనైనవారిని గురించి ఇతరులు చెప్పినవారు, ఇట్టి సందర్భమునందు నా శైలి యిందు రమ్మైన నెట్లు రాఁగలదు? అట్లున్నను సీతారాముల చరిత్రము చెప్పుచోట నందుగనఁబఱుపఁబడిన గుణములే యిందును గనఁబఱుపఁబడినవి అందుఁ గొంచెమైనఁ దారతమ్యము గానరాదు. ఒక్క గ్రంథమునందే పూర్వభాగమున నుండు రసపోషణము, వాక్యచమత్కృతి యుత్తరభాగమున నుండదు. తిక్కన విరాటోద్యోగ పర్వము లెట్లున్నవో కడపటి పర్వము లెట్లున్నవో మనుచరిత్రమునందుఁ బూర్వభాగ మెట్లున్నదో కడపటి యాశ్వాసము లెట్లున్నవో చూచిన స్పష్టమగును.

౧౦. కొందఱు మతిమాలినవారు అధిక పాఠము లని, ప్రక్షిప్తసర్గము లని కొన్ని చిత్రకథలు చేర్చియున్నారు. పూర్వవ్యాఖ్యాత లవి యెల్లనేర్పఱిచి యవి వాల్మీకికృతములు గావని వ్రాసివైచియున్నారు. అట్టివి కొన్ని యుండుటచేఁ గాండ మంతయుఁ బ్రక్షిప్తమనుట యనాలోచితభాషణము.

—* అగస్త్యాదిమహర్షులు శ్రీరామ దర్శనార్థులై వచ్చుట *—

ఆ. ప్రబలరాక్షసులను • భండనంబునఁ ద్రుంచి, ప్రాప్తరాజ్యుఁడగుచు • రామవిభుఁడు
వఱలుచుండఁ జూడ • వచ్చిరి రాఘవు, స్తవమొనర్పఁ బొంటె • సకలమునులు. ౨

అర్థములు. ప్రబల రాక్షసులను=మిక్కిలి బలవంతులైన రాక్షసులను, భండనంబునన్=యుద్ధమందు, ప్రాప్తరాజ్యుఁడు=రాజ్యమును బొందినవాఁడు, రాజుగాఁ బట్టాభిషిక్తుఁడైన వాఁడు, రాఘవుల్=(౧) రామచంద్రుని, (౨)లక్ష్మణుని, స్తవము=స్తోత్రము, పొంటెన్=కొఱకు. ఇందుఁ బ్రథమాక్షరము గాయత్రిలోని యిరువది యొకటవ యక్షరము.

తాత్పర్యము

మిక్కిలి బలవంతులగు రాక్షసులను యుద్ధమందుఁ జంపి పట్టాభిషిక్తుఁడై రాజ్యభారమునవహించిన రామచంద్రమూర్తిని స్తోత్రముచేయ మునీశ్వరులందఱు వచ్చిరి.

రావణునిఁ జంపుటకంటె నింద్రజిత్తును జంపుట కష్టకార్యముకావున లక్ష్మ ణుని స్తోత్రము చేయ మునులు వచ్చిరని కొందఱ యభిప్రాయము. కనుక నే యిచ్చట సర్వనామము ప్రయోగింపక రాఘవశబ్దము ప్రయోగింపఁబడెను.

తే. కౌశికుండు యవక్రీత•గార్గ్యకణ్వ మునివరులును మేధాతిథి•పుత్రకుండు
గాలవుండునులోనుగాఁ•గలమహర్షి, వరులు తూరుపుదెసవారు•భవ్యమతులు ౩

తా త్ప ర్య ము

తూర్పుదిక్కున నుండు కౌశికుడు, యవక్రీతుఁడు, గార్గ్యుఁడు, కణ్వుఁడు మేధాతిథి పుత్రుఁడు, గాలవుఁడు మొదలుగాఁగల మునులు వచ్చిరి.

క. నముచియు స్వస్త్యాత్రేయుఁడుఁ, బ్రముచియు ఘటసంభవుండు•భగవంతుండా
సుముఖుండు నత్రివిముఖ, ప్రముఖులు దక్షిణదిశా ని•వాసకు లెల్లన్. ౪

తా త్ప ర్య ము

దక్షిణ దిక్కున నుండువారు నముచి, స్వస్తికరుఁడైన యాత్రేయుఁడు (దుర్వాసుఁడు) ప్రముచి, అగస్త్యుఁడు, భగవంతుఁడు సుముఖుఁడు, అత్రి విముఖ ప్రముఖులు వచ్చిరి.

క. పడమటిదెస నుండెడి యా, జడదారులు కవష ధౌమ్య•సంయమివరులున్
గడుధన్యుఁడు రౌద్రేయుఁడు, జడజాప్తద్యుతిసృష•ద్గు•సత్యవచనుఁడున్. ౫
అర్థములు. జడజాప్తద్యుతి=సూర్యుని కాంతిగల, జలజాప్త. డలయోరభేదః

తా త్ప ర్య ము

పడమటిదిశ నుండువారు కవషుఁడు ధౌమ్యుఁడు, రౌద్రేయుఁడు సూర్య తేజస్సుగల సృషద్గుముని లోనగు జటాధరులు వచ్చిరి.

తే. ఉత్తరంబున నెప్పుడు•నుండువారు, కశ్యప వసిష్ఠ జమదగ్ని•గౌతమాత్రి
గాధితనయ భరద్వాజ•కలితనామ, కులు మునీశ్వరు లేడ్వురు•కుతుకమునను. ౬

తా త్ప ర్య ము

ఉత్తరదిశయం దెప్పుడు నుండు మహర్షులు కశ్యప వసిష్ఠ జమదగ్ని గౌత ములు అత్రి విశ్వామిత్రుఁడు భరద్వాజుఁడునను ఋషు లేడ్వురువచ్చిరి. వసిష్ఠుఁడు అయోధ్యయందే యుండి కార్యములు నిర్వహించుచుండఁగా నెందుండియో వచ్చి నట్లు చెప్పుటెట్లు? ఈసప్తఋషులు నిచ్చటికి వచ్చిన కారణమున నాకాశమున సప్తర్షిమండలము కానరాక పోయెను.

రామచంద్రమూర్తి అత్రి విశ్వామిత్ర భరద్వాజులను, అగస్త్యుని భూమి యందుఁ జూచెను గదా? ఈమహర్షులపార తపోవిభవముగలవారగుటచే సాధారి

వలెనెన్ని దేహము లయిన నెత్తఁగలరు. అధికారవశమున నాకాశమున మండల ముననుండినను దపోవృద్ధికై భూమియం దొక మూర్తిధరించియుందురు. సత్రాజిత్తు నొద్దకు, కుంతీదేవి యొద్దకు సూర్యుఁడు వచ్చినపు డాకాశమున సూర్యమండలము లేకుండెనా? అట్లే యిచ్చటను గ్రహించునది. జమదగ్ని కార్తవీర్యార్జునుని పుత్రు లచేఁ జంపఁబడినను నిచ్చట దేహము పోయెనేకాని నక్షత్రమండలమందలి దేహము పోలేదు. కావుననే యిప్పుడు మరల రాఁగలిగెను.

ఉ. అందఱు వహ్నితేజులు మహాత్ములు వేద తదంగవిత్తముల్
దొందడిగాఁగ వచ్చి నృపధూర్జటి మోసల నిల్చి రంత న
య్యందఱిలో నగస్తి ప్రతిహారుఁ గనుంగొని నీవు భూపసం
క్రందనుతోడ నీమునులు రాక వచింపు మటంచుఁ బల్కినన్. ౭

అర్థములు. వహ్నితేజులు=అగ్నితేజస్సువంటి తేజస్సు గలవారు, వేద+తదంగ+విత్+తముల్=వేదములను వేదాంగములను దెలిసిన వారిలో శ్రేష్ఠులు, దొందడి=సందడి, నృపధూర్జటి=రాజశ్రేష్ఠుఁడు, మోసల=ముఖశాల=ముంగిలి, ప్రతిహారున్=ద్వారపాలకుని.

తాత్పర్యము

అగ్నితేజులు, మహాత్ములు, వేదవేదాంగములఁ దెలిసిన వారిలో శ్రేష్ఠులు నగు మునులందఱు గుంపుగా వచ్చి రామచంద్రు నగరివాకిట నిల్చిరి. అందగస్త్య మహర్షి ద్వారపాలకునిఁ జూచి నీవు రామచంద్రమూర్తితో మునులందఱు వాకిట వచ్చి నిలిచియున్నారని చెప్పుము అని చెప్పఁగా.

క. ధీరుఁడు దక్షుఁడు విహితా, చారుండు నయేంగిత ప్రచారుండు ప్రతీ
హారుఁడు బిర బిర సని రా, కారాజసమానతేజుఁ గాకుత్స్థమణిన్. ౮

అర్థములు. ధీరుఁడు=ధైర్యము గలవాఁడు. దక్షుఁడు=సమర్థుఁడు, విహితాచారుండు=యోగ్యమైన నడవడి గలవాఁడు నయ+ఇంగిత+ప్రచారుండు=నీతియు నింగితము దెలిసి వర్తించువాఁడు, రాకారాజు=పదునాఱు కళలు గల చంద్రునితోఁ గూడిన రాత్రియందలి చంద్రునితో, సమానతేజున్=సమానమైన కాంతి గలవానిని.

తాత్పర్యము

రాజు నెదుటికి దిగులుపడక పోఁగలవాఁడును. కార్యమునందు సమర్థుఁడును, ఎప్పు డెట్లు నడవ వలయునో యాయాచారము తెలిసినవాఁడును, నీతి యింగిత జ్ఞానము గలవాఁడును నగు ద్వారపాలుఁడు త్వరగాఁ బోయి పూర్ణచంద్రునివలెఁ బ్రసన్నమైన ముఖముగల రామచంద్రుని జూచి యిది చెప్పసమయ మనిగ్రహించి రామచంద్రమూర్తిని,

ఉ. చేరి నమస్కరించి నృపశేఖర! కుంభభవాదిమౌనిరా
ద్వారము మిమ్ముఁ జూచు తమిద్వారతలంబున నిల్చె నన్న నీ
తారమణుండు బాల రవిధాముల రాకకు మోద మంది పెం
పారఁగ దోడి తెమ్మనిననాతఁడు నట్ల యొనర్చె భక్తిమై.

అర్థములు. కుంభభవాది మౌనిరాద్వారము=అగస్త్యుఁడు మొదలగు మునుల సమూహము, బాల రవి ధాముల=లేతసూర్యుని కాంతిగల వారియొక్క.

తా త్ప ర్య ము

సమీపించి నమస్కరించి రాజేంద్రా? యగస్త్యుఁడు లోనగు మునులు మిమ్ముఁ జూడఁగోరి గుంపుగా వచ్చి వాఁకిట నిలిచి యున్నారని చెప్పఁగా రామ చంద్రమూర్తి సంతోషించి వారిని తోడుకొని రమ్మనఁగా వాఁడును భక్తితో నట్లే యొనర్చెను.

చ. ఋషితతిరాకఁ గాంచి యెదురేగి కృతాంజలి యౌచు భూమిభృ
ద్వృషభుఁడు పాద్య మర్ఘ్యమునునింపు దలిర్పఁగ గోవు నిచ్చి క
ల్మషరహితంబులౌ కనకమండిత చిత్రకుశాసనంబులన్
విషనిధిపాయిముఖ్యులకు వేలుగ వేలుగ సంఘటించినన్. ౧౦

అర్థములు. భూమిభృత్+వృషభుఁడు, రాజశ్రేష్ఠుఁడు, అర్ఘ్యము=పూజ కొఱకైనవి, అష్టార్ఘ్యములు=పెరుగు తేనె, నెయ్యి, అక్షతలు, గఱిక, నువ్వులు, దర్భ, పుష్పము, పాద్యము=కాళ్ళు కడుగుకొను నీళ్ళు, ఇది కంచుపాత్రతో నీయ రాదు. కల్మషరహితంబులు=పరిశుద్ధములైనవి, దుమ్ము మొదలైనవి లేనివి, కనకమండిత=బంగారుచే నలంకరింపబడిన, చిత్రకుశాసనంబులన్=చిత్రాసనంబులను కుశాసనంబులను, విషనిధిపాయి=సముద్రము పానముచేసిన యగస్త్యుఁడు.

తా త్ప ర్య ము

ఋషి సమూహము వచ్చుట చూచి యెదురుగాఁ బోయి చేతులు జోడించి రాజశ్రేష్ఠుఁ డగు రామచంద్రమూర్తి యర్ఘ్యపాద్యములను ధేనువు నొసఁగి నిర్మలములై బంగారుచే నలంకరింపఁబడిన చిత్ర దర్భాసనములను నగస్త్యుండు మొదలగు ఋషీశ్వరుల కందఱకు వేలువేలుగా సమకూర్చగా.

క. వారెల్ల నిండుప్రమదం, బారగఁ గూర్చున్నతఱి మహాత్మకులారా!
మీరెల్లసుఖులె? శిష్యుల, కారోగ్యమె? నిర్భయములె కాననులనుచున్. ౧౧

తా త్ప ర్య ము

వారందఱు సంతోషముగఁ గూర్చుండిన సమయంబున మహాత్ములారా! మీకందఱకు సుఖమేకదా. శిష్యులారోగ్యవంతులేకదా. అడవులం దేవిధభయము లేదు కదా.

క. రాముఁడు కుశలప్రశ్నముఁ, బ్రేమంబునఁ జలుప వేద॰వేదాంతవిదుల్
సామోదమనంబుల సు, శ్రీమహితుం జూచి యిటు వ॰చించిరి రక్తిన్. ౧౭

అర్థములు. సామోదమనంబులన్=సంతోషముతోఁ గూడిన మనస్సులతో

తాత్పర్యము

శ్రీరామచంద్రప్రభువు ప్రేమతోఁ గుశలము నడుగఁగా వేద వేదాంత విదులయిన యగస్త్యాదు లానందము నంది శ్రీరామమూర్తినిఁ జూచి యనురాగముమీఱ నిట్లని పలికిరి.

—* మౌనులు శ్రీరాముఁ బ్రశంసించుట *—

క. మాభాగ్యవశంబున సీ, తాభామారమణ! నిహత॰దర్పితవైరిన్
శ్రీభద్రుని నినుఁ గంటిమి, మాభద్రంబులకుఁ గొఱఁత॰మాటయు నున్నే? ౧౮

అర్థములు. నిహత,=చంపఁబడిన దర్పిత=గర్వించిన, వైరిన్=పగవానిని, శ్రీభద్రునిన్=సంపదచే మేలుపొందిన వానిని.

తాత్పర్యము

సీతానాథా! మాభాగ్యము ఫలించుటచే గర్వించిన శత్రువులఁ జంపి రాజ్యలక్ష్మి ననుభవించి నిన్నుఁ జూడఁగంటిమి. ఇఁక మా శుభములకుఁ గొఱఁతయను మాటయు నుండునా?

క. నీవు ధను వందుకొన లో, కావళి హావళి భజించు॰నన భువనాళీ
రావణు రావణుఁ గొడుకుల, తో వారల సుతులతోడఁ॰ద్రుంచుట బరువే! ౧౯

అర్థములు. హావళి=ఆపద, భువనాళీరావణున్=ప్రపంచసమూహముల నేడిపించు వానిని.

తాత్పర్యము

నీవు విల్లు చేతికిఁ దీసికొనినంత మాత్రముననే భయపడి లోకము కీడుపాలగును. ఇట్టి నీవు లోకమును బీడించుచుండిన రావణునిఁ గొడుకులతో మనుమలతోఁ జంపుట కష్టకార్యమా?

శా. మాపుణ్యంబున మిమ్ముఁ గంటిమి మహా॰త్మా! దుష్టచారిత్రులా
నా పౌలస్త్యుల సంహరించి జయివై॰యూ శ్మోశ్వరిం ద్వన్నమ
స్యాపాదంగతునిన్ హితాచరణునిన్॰ సౌమిత్రినిం గూడి యి
ట్లీ పైత్రం బగు లక్ష్మినొంది సుఖవై॰యేపార భూపాలకా! ౨౦

అర్థములు. పౌలస్త్యులన్=పులస్త్య వంశమునఁ బుట్టిన రాక్షసులను, ఆత్మేశ్వరిన్=సీతాదేవిని, త్వత్+వమస్యా+పారంగతునిన్ = నీశుశ్రూషయందు పూర్ణుఁడైన వానిని, హిత+ఆచరణునిన్=నీకు మేలు చేయువానిని, పైత్రమః= తండ్రికి సంబంధించినది.

తా త్ప ర్య ము

మహాత్మా! మాపుణ్యముచే చెడునడవడి గల రాక్షసులఁ జంపి జయము గొని ప్రియవల్లభ యగు సీతాదేవితోడను, నీకైంకర్యమునందుఁ గృతార్థుఁడై నీకు హితముసేయు లక్ష్మణునితోడను గూడి తండ్రి రాజ్యమును బొంది సుఖముగా రాజువై యుండఁగాఁ జూడఁ గంటిమి.

క. తల్లులతోఁ దమ్ములతో, నల్లం బలరంగ నుండి॰యుర్విం బ్రోవం
దల్లివలెఁ గంటి మక్షులు చల్లఁగ మా పూర్వపుణ్య॰సంపత్తి నృపా! ౧౯

అర్థములు, అక్షులు=కన్నులు, తల్లివలె భూమిని బాలింపఁగా.

తా త్ప ర్య ము

(రాజా! మీరు మీతల్లులతోఁ దమ్ములతో సంతోషముగానుండి తల్లివలె భూమినిఁ బాలించుచుండ మిమ్ము మాపూర్వపుణ్య సంపదచేఁ గన్నులుచల్లఁగాఁ జూడఁ గంటిమి.)

సీ. ఏవారి యాకారఁ॰మీక్షించి నంతనే, బ్రద్దలౌ గుండియల్॰పగతురకును
నే క్రూరచారిత్రుఁ॰లెఱుఁగని శస్త్రాస్త్ర॰ బృంద మిం కెందును॰ వినఁగరాదు
ఏవారి రణములో॰నెదిరించి మానంబు॰ దక్కించుకొనలేరు॰ధాత్రి నెవ్వ
రట్టి కాలాంతక॰యమతుల్యమత్తయు, ద్ధోన్మత్తుల నకంప॰నోగ్రచరితు

తే. నట్టి దేవాంతకనరాంత॰కాతికాయ, కుంభవికటప్రహస్తన॰కుంభముఖుల
త్రిశిరుమత్తవిరూపాక్ష॰దివిజరిపుని, నలమహోదరు ధూమ్రాక్షు॰యజ్ఞకోపు.

తా త్ప ర్య ము

ఎవరి రూపమును జూచినంత మాత్రముననే శత్రువులకు గుండెలు పగులునో యే క్రూరు లెఱుఁగని శస్త్రాస్త్రము లెందును లేవో యెవ్వారిని యుద్ధమందు నెదిరించి భూమియం దెవ్వారైనను గౌరవము కాపాడుకొనలేరో ప్రళయ కాలమందు లోకము నాశము చేయు యమునివంటి వారైన, మత్తుని, యుద్ధోన్మత్తుని, అకంపనుని, దేవాంతక, నరాంతక, అతికాయ, కుంభ, వికట, ప్రహస్త, నికుంభ ముఖ్యులను త్రిశిరుని, మదించిన విరూపాక్షుని, మహోదరు, ధూమ్రాక్షు, యజ్ఞకోపుని,

చ. మఱియుఁగఁ జేసి తౌర! పరి•మాణమునన్ సరి చెప్పరాని యా
బెడిదపు రూపువాని సుర•భీకరశీలునిఁ గుంభకర్ణునిన్
బొడ వడఁగించి తో మనుజ•పుంగవ! మా సుకృతంబుచే, ననిన్
ముడిబొమ గైన లేని నిను•ముక్కున వ్రేలిడి చూచె లోకముల్. ౧౮

తాత్పర్యము

చంపితివి. ఏమి యాశ్చర్యము? దేహపరిమాణమందు నెవ్వనితో సమానుఁ డని మఱియొకనిఁ జెప్ప సాధ్యపడదో, యట్టి భయంకరమైన యాకారము గలిగి దేవతలకు దిగులు పుట్టించు నడవడిగల కుంభకర్ణుని మాపుణ్యము ఫలించుటచేతఁ జంపితివి. యుద్ధమునందుఁ గోపముచేఁ గనుబొమలు ముడియైనఁ బెట్టని నిన్నుఁ జూచి లోక మాశ్చర్యపడెను.

క. బంధుర మగు జవమున దశ, కంధరు సురదానవహ్ని•కంధరుఁ ద్రిజగ
త్సంధాహరు వధియించితి, సింధురపరనఖరతుల్య•శితకాండములన్. ౧౯

అర్థములు. బంధురము=అధికము- దశకంధరు=పదిమెడలు గల రావణుని- సుర=దేవతలనెడి- దావవహ్ని=కాఱుచిచ్చునకు- కంధరున్=మేఘము వంటి వానిని- ప్రతాపమార్పుటయందు మాత్రమే యుపమానము- త్రిజగత్=మూఁడు లోకముల- సంధా=నియమమును- హరున్=హరించిన వానిని- పాడుచేసినవానిని- సింధురపర=ఏనుఁగులకు శత్రువగు సింహము యొక్క- నఖరతుల్య=గోళ్ళతో సమములైన- శిత=పదునైన- కాండములన్=బాణములచే.

తాత్పర్యము

దేవతల గర్వమణఁచి లోకముల మర్యాద చెఱిచిన రావణుని మిగులశీఘ్రముగ సింహము గోళ్ళవంటి బాణములచేఁ జంపితివి.

చ. అలఁతులఁ దీరుకార్య మొకొ•యాతనిఁ ద్రుంచుట దట్టు లుండనీ
కలనను వైరిజాల లయ•కాలు సురస్మయసంవిఘాలు ని
స్తులకపటైకశీలుఁ బెను•దొమ్మిదురమ్మున రావణాత్మజున్
బొలియఁగఁ జేయుటే పురుష•పుంగవ! యద్భుతకార్య మిన్నిటన్. ౨౦

అర్థములు. అలఁతులన్=అల్పులచే, తీరు=చక్కఁబడు, వైరిజాల లయ కాలున్=శత్రు సమూహములకుఁ బ్రలయమందలి యమునివంటి వానిని. సుర స్మయ సంవిఘాలున్=దేవతల గర్వము నాశము చేసినవానిని, నిస్తుల=అసమానమైన, కపటైక శీలున్=వంచనమే ప్రధానముగఁగల నడవడి గలవానిని, పెను=గొప్పదగు, దొమ్మిదురమ్మునన్=ద్వంద్వయుద్ధమందు.

తాత్పర్యము

ఇది యల్పులు చేయు కార్యమా? కాదు. ఆ రావణాసురుని జంపుటయదట్టు లుండనీ కాని, యుద్ధమందు శత్రువులపాలి ప్రలయకాల యముఁడును దేవతల గర్వము నణఁచిన వాఁడును, మోసమే ముఖ్యవ్యాపారముగఁ గలవాఁడును నగు నింద్రజిత్తును ద్వంద్వయుద్ధమునఁ జంపుటే యన్నిటిలో మిక్కిలి యాశ్చర్యకర మైనపని.

క. అంతక నిభ ఫణిశరములు, దొంతరలై కురిసి మిమ్ముఁ దూలింప ధరా
కాంత విడివడితి రౌరా!, యంతింతన వశమె మా మహాపుణ్యంబున్. ౨౧

అర్థములు. అంతకనిభ=మృత్యువుతో సమానములైన, ఫణిశరములు= నాగాస్త్రములు, దొంతరలై=రాసులై.

తాత్పర్యము

మృత్యువు వంటి నాగాస్త్రములను కుప్పలు కుప్పలుగాఁ గురియించి మిమ్ము నేలఁబడఁద్రోయఁగా వానినుండి తప్పించుకొని లేచితిరి. ఆహా, యేమి మాపుణ్యము ఇంతంతని చెప్పసాధ్యమా.

మత్తకోకిలము. ఎన్ని మాయలయందొ ప్రోడయు నెట్టివారి కజయ్యుఁడున్
గన్నదోయికిఁ గానరాఁ డనిఁ గర్కశుండు సురేంద్రజి
త్తన్నిశాచరుఁ డాజిఁ గూలుట యాలకించినయంత య
న్నన్న! మమ్ముఁ బ్రమోదమున్ బర మాద్భుతంబును ద్రెక్కొనెన్

అర్థములు. కర్కశుండు=కఠినచిత్తుఁడు, త్రొక్కొనెన్=ముంచెను

తాత్పర్యము

ఎన్ని మాయల యందో సమర్థుఁడు, ఎటువంటి వారికైనను జయింపసాధ్య పడనివాఁడు. యుద్ధమందుఁ గన్నులకుఁ గానరాఁడు, క్రూరుఁడు, అట్టివాఁడు ఇంద్రజిత్తు, అట్టివాఁడు యుద్ధమందుఁ జెచ్చెననిన మాటవినగానే ఆహాహా! యేమి చెప్పుదుము, మేము, సంతోషమందు నాశ్చర్యమందు మునిఁగి పోయితిమి.

ఆ. కామరూపధరులఁ గఠినవిగ్రహులను, రాక్షసులను గ్రాగ్యాంరతుల నీవు
హతులఁ జేసి మాకు నభయదక్షిణ నిచ్చి, తిటులు మాయదృష్ట మేమనంగ.

అర్థములు. కామరూపధరులన్=కోరినరూపము ధరింపఁ గలవారిని, కఠిన= గట్టియగు, విగ్రహులను=దేహములు గలవారిని.

తాత్పర్యము

(కోరిన రూపముల ధరింపఁ గలిగినవారును, గఠిన దేహము గలవారును, క్రూరాత్ములు నగు రాక్షసులను సంహరించి మాకీ విధముగా నభయ దక్షిణ నొసంగితివి. మాపుణ్య మేమని పొగడఁ గలము?)

క. అను ఋషివరవచనంబుల, విని సీతానాయకుండు♦విస్మయవార్ధిన్
మునుఁగుచుఁ బ్రాంజలి యగుచున్, వినుత తపోధనుల కిట్లు♦విజ్ఞాపించెన్. ౨౮

అర్థములు, విస్మయవార్ధిన్=ఆశ్చర్య సముద్రమున, విజ్ఞాపించెన్=విన్నవించెను.

తాత్పర్యము

(అని పలుకుచున్న యగస్త్యుఁడు మున్నగు ఋషిశ్రేష్ఠుల మాటలను విని శ్రీరామచంద్రమూర్తి యాశ్చర్యసముద్రమున మునిఁగినవాఁడై యంజలిబద్ధుఁడై వారితో నిట్లని విన్నవించెను.)

శ్రీరాముఁడు మునుల నింద్రజిత్తు నాధిక్యమునకుఁ గారణ మడుగుట.

మ. అతిదుర్దాంతపరాక్రమాఢ్యుఁ డయి ర♦క్షోధీశుఁ డౌ రావణుం
డతులామేయతనూబలుండు ఘటక♦ర్ణాఖ్యుండు పీ రుండఁగా
నతికాయత్రిశిరఃప్రహస్తఖరధూ♦మ్రాక్షోగ్రకుంభాదు లౌ
కృతకర్ముల్ రహిమించ రావణిని మీ♦రేలా ప్రశంసింపఁగన్. ౨౯

అర్థములు. అతి=మిక్కిలి, దుర్దాంత=అణఁపరాని, పరాక్రమాఢ్యుఁడు=పరాక్రమ సంపత్తిగలవాఁడు, అతుల=అసమానమను, అమేయ=కొలఁత చెప్పరాని, తనూబలుండు=దేహబలము గలవాఁడు.

తాత్పర్యము

తపస్సుచే మిగుల నణఁపరాని పరాక్రమముగల రావణు డుండఁగా, సహజమైన దేహబలముగల కుంభకర్ణుఁ డుండఁగా అతికాయుఁడు త్రిశిరుఁడు ప్రహస్తుఁడు ఖరుఁడు ధూమ్రాక్షుఁడు కుంభుఁడు మొదలగు నాఱితేఱిన వారుండఁగా నింద్రజిత్తు నేల మీరు విశేషించి పొగడెదరు.

క. మత్తుని దేవాంతకు న, న్మత్తు మహోదరుని వికటు♦ మకరాక్షు ననిన్
మిత్తుల నెన్నక వాసవ, జిత్తును మీ రిటు ప్రశంస♦ సేయఁగ నేలా?

అర్థములు. మిత్తులన్=మృత్యువువంటి వారిని.

తాత్పర్యము.

(యుద్ధమున మృత్యుదేవతవంటి వారయిన, మత్తుఁడు, దేవాంతకుఁడు, ఉన్మత్తుఁడు, మహోదరుఁడు, వికటుఁడు, మకరాక్షుఁడు నుండగా, వారిని మాని యింద్రజిత్తు నింతగాఁ బొగడెద రేల?)

ఉ. వానిప్రభావ మెట్టిదొకో? • వాని పరాక్రమ మేకొలంది? య
వ్వానిబలం బదెంత? దశ • వక్త్రునికంటెను శౌర్యధైర్యముల్
వానికి నెట్లు లగ్గలము? • పల్కుఁడు గోప్యము గాద యేని స
మ్మానితశీలురార! విన • మానస ముఱ్ఱుట లూఁగెడిం జుఁడీ. ౨౮

అర్థములు అగ్గలము=అధికము, గోప్యము=రహస్యము ఉఱ్ఱుట లూఁగెడిన్=మిక్కిలి కాంక్ష చేయుచున్నది.

తాత్పర్యము

(వాని ప్రభావమెట్టిది? వాని పరాక్రమ మే మాత్రము? వాని బలమెంత? తండ్రియయిన రావణునికంటెవాఁడు శౌర్యమున ధైర్యమున నధికుఁడెట్లయ్యెను? ఇది రహస్యము గాదేని మునీశ్వరులారా! వినిపింపుడు. ఈ విషయము విన నా మనసు మిగుల నభిలాష కలిగియున్నది.)

క. వినఁగా నర్హుఁడ నేనియు, వినిపింపుఁడు వినయమునను • వేడుకొనియెదన్
మునివర్యులార! యియ్యది గనఁబోకుం డాజ్ఞగాఁగఁ • గరములు మోడ్తున్.

తాత్పర్యము

(మునీశ్వరులారా! దీనిని వినుటకు నే నర్హుఁడ నగుదునేని వినిపింపుఁడు. చేతులు మోడ్చి వినయముతోఁ బ్రార్థించెదను. ఇది యాజ్ఞగాఁ దలఁపకుఁడు)

క. ఏరీతి గెలిచె శక్రునిఁ, నేరీతి వరంబు లొందె? • నెటు జనకునకున్
శూరుఁ డయి నెగడెఁ? దద్వ్యా పారంబు సమస్తమెఱుక • పఱుపుఁడుమౌనుల్

అర్థములు. జనకునకున్=తండ్రికంటె, మౌనుల్=మునులారా.

తాత్పర్యము.

(మునులారా! వాఁ డేవిధముగా నింద్రుని గెలిచెను? ఏ ప్రకారమువరములను బొందెను? ఎట్లు తండ్రికంటె శూరుఁడయ్యెను. వాని వ్యాపార మంతయు నెఱిఁగింపుఁడు.)

౨.వ సర్గము. అగస్త్యుఁడు శ్రీరామునకు రావణు జన్మాదివృత్తాంతముఁ దెలుపుట.

క. అను రామధరావరచం, ద్రునిఫణితుల నాలకించి • తొలఁకాడుముదం
బునఁ గుంభభవుఁడు రామునిఁ, గనుఁగొని యిట్లనియె వా • క్యకౌశలమెసఁగన్.

అర్థములు. ధరావరచంద్రునిన్=రాజశ్రేష్ఠుని, ఫణితులు=వాక్యములు.

తాత్పర్యము

(అని పలుకుచున్న శ్రీరామ విభుని మాటల నాలించి పరమానందమున నగస్త్యుఁడు రామచంద్రమూర్తినిఁ జూచి మాటల నీటు తేటపడ నిట్లనెను.)

ఉ. రామ! గుణాభిరామ! యల • రావణి తేజము తద్బలం బరి
స్తోమము గెల్చుపెంపు బల • సూదనగర్వహరత్వ ముగ్ర సం
గ్రామములం దజయ్యుఁ డయి • గ్రాలిన హేతువు విన్ము చెప్పెదన్
నీమది సంతసిల్ల రజ • నీచరసాధునిశాబ్జ భాస్కరా! ౩౧

అర్థములు. అరిస్తోమమున్=శత్రుసమూహమును. బలసూదన గర్వహరత్వము=ఇంద్రుని పొగరణఁచుట, ఉగ్ర సంగ్రామములన్=భయంకర యుద్ధములందు, రజనీచర=రాక్షసులనియెడి సాధు=భక్తులనియెడి. నిశా=రాత్రికి, అబ్జ=కమలములకు, భాస్కరా=సూర్యుఁడ వైనవాఁడా, సూర్యుఁడు రాక్షసులను రాత్రిని హరించి భక్తులను కమలముల వికసింపఁ జేయును, క్రమాలంకారము.

తాత్పర్యము

రాక్షసుల వధించి సజ్జనుల మనస్సు సంతోషింపఁజేసిన రామచంద్రా! ఇంద్రజిత్తు తేజము, వానిబలము, శత్రువుల గెల్చుటయందు వాని గొప్పతనము, ఇంద్రుని గర్వము వాఁడు హరించిన విధము, భయంకర యుద్ధములం దెట్టి వారికి వాఁడు జయింపఁరానివాఁ డయిన కారణము నీవు సంతోషింప జెప్పెదవినుము.

క. రావణిచరితమునకు మును, రావణుకులజన్మములు వ • రప్రతిలబ్ధిన్
నే వివరించెద వినుమా, యావద్వృత్తంబుమూల • మై యది యునికిన్. ౩౨

అర్థములు. రావణి చరితమునకు=ఇంద్రజిత్తు నడవడి చెప్పుటకు మును ముందు.

తాత్పర్యము

ఇంద్రజిత్తు చరిత్రము చెప్పుటకు ముందుగ రావణుఁ డే కులమువాఁడో వాఁ డెట్లు పుట్టెనో, వాఁ డెట్లు వరముల సంపాదించెనో, వారిచరిత్ర మంతయుఁ జెప్పెద వినుము. అదియెకదా సర్వమునకు మూలము.

సీ. పూర్వంబు కృతయుగం • బునఁ గంజలోచన!, పరమేష్ఠితనయుండు • వరగుణుండు
మాఱటబ్రహ్మ యై • మలసెడి బ్రహ్మర్షి, పేరఁ బులస్త్యుండు • వినుతశీల
మహిమ ధర్మమున నెమ్మహనీయుఁ గీర్తింప వచ్చునే ధరనెట్టి • వారికైన
బ్రహ్మపుత్రుం డను • పలుకుమాత్రమె శక్య, మతఁ డజుసుతుఁడై నెఱకతనఁ జేసి
ఆ. విబుధకోటి కెల్ల • ప్రియుఁ డయి శుభగుణ పూగములను సకల • భువనములకు
నిష్టుఁ డగుచు ధర్మ • వృత్తంబు వీడక, హేమకుధరపార్శ్వ • సీమయందు. ౩౩

అర్థములు. పరమేష్ఠితనయుండు=బ్రహ్మపుత్రుఁడు, మాఱటబ్రహ్మ=రెండవ బ్రహ్మ, శుభగుణ పూగములను=మంచిగుణ సమూహములను, హేమకుధరపార్శ్వ సీమయందు=మేరుపర్వతముయొక్క ప్రక్క భాగమున.

తాత్పర్యము

రామచంద్రా! పూర్వము కృతయుగంబున బ్రహ్మమానస పుత్రుఁడుత్తమ గుణములు కలవాఁడు, రెండవ బ్రహ్మయై పులస్త్యుఁడను పేర నొక బ్రహ్మర్షి గలఁడు. బ్రహ్మపుత్రుఁ డగుటచే బ్రహ్మకొడుకని మాత్రము చెప్పవచ్చునే కాని మహిమయందు ధర్మమునందు నతఁ డింతవాఁడని చెప్పనెవ్వరికి సాధ్యపడదు. ఆయన దేవతలకెల్లఁ బ్రియుఁడై, సాధుగుణము లనేకములు గలవాఁడై, సమస్త ప్రపంచమునకు నిష్టుఁడై ధర్మప్రవర్తనము విడువక మేరుపర్వతము ప్రక్కన

క. వెలయు తృణబిందునాశ్రమ, తలమునఁ బుణ్యార్జనేచ్ఛ◆దప మొనరించెన్
దొలిచదువులు చదువు చచం, చలమతి నియతేంద్రియుండు◆సద్వ్రతుఁడగుచున్

అర్థములు. తొలిచదువులు=వేదములు, అచంచలమతిన్=చలింపని మనస్సుతో, నియతేంద్రియుండు=ఇంద్రియముల నియమించినవాఁడు, సద్వ్రతుండు=మంచి వ్రతములు గలవాఁడు.

తాత్పర్యము

ఉండు. తృణబిందుఁడను రాజర్షి యేర్పఱచుకొనిన యాశ్రమమందుపుణ్యము సంపాదించు కోరికతో వేదాధ్యయనము చేయుచు స్థిరచిత్తుఁడై యింద్రియముల జయించి గొప్ప వ్రతములఁ బూని తపస్సు చేసెను.

ఉ. ఆఋషియాశ్రమోర్వి యన◆యంబు సమస్తఋతూపభోగ్యమై
హారిమరాళసారసవి◆హారమనోహరసారసాకరో
దారము నై సుకుట్మల ల◆తాంతఫల ప్రకరాభిరామభూ
మీరుహరాజితం బగుచు◆మీఱు సుఖాశ్రయగంధవాహమై. ౯౬

అర్థములు. అనయంబు=ఎల్లప్పుడు, సమస్త ఋతూపభోగ్యమై=అన్ని ఋతువులందు నుపయోగింపఁదగినదై, హారి=మనోహరమైన, మరాళ=హంసలయు, సారస=బెగ్గురులయు, విహార=సంచారముచే, మనోహర=అందమైన, సారసాకరోదారమునై=విస్తారముగఁ గొలఁకులు గలదై, సుకుట్మల=మంచి మొగ్గల మొక్కలయు, లతాంత=పూల మొక్కలయు, ఫల=పండ్ల మొక్కలయు, ప్రకర=సమూహముచే, అభిరామ=అందమైన, భూమీరుహ=చెట్లచే, రాజితంబు=ప్రకాశించునది, సుఖాశ్రయ గంధవాహమై=సౌఖ్యమునకు స్థానమైన గాలి కలదై.

తాత్పర్యము

ఎల్లప్పుడు నన్ని ఋతువులందు నుపయోగింపఁదగినదై హంసలు బెగ్గురులు సంచరించుటచే నింపైన కొలఁకులు, మొగ్గలు పూలు పండ్లుగల చెట్లు, సుఖకరమైన గాలి గలదై యా ఋషియాశ్రమ ముండెను.

ఉ. ఆ రమణీయ దేశమున ♦ నాడుచుఁ బాడుచుఁ జిత్రచిత్రఖే
లారమమాణ లామను వి ♦ లాసముగాఁగ విపంచి మీటుచున్
సారెకు సారెకున్ విబుధ ♦ సారసనేత్రలు భోగికన్యకల్
భూరమణాత్మజల్ ముదము ♦ పొంపిరి వోవఁ జరింతు రర్మిలిన్. ౩౬

అర్థములు. ఖేలారమమాణలు=ఆటలాడు చున్నవారు, విపంచి=వీణె, విబుధసారసనేత్రలు=దేవతాస్త్రీలు, భోగికన్యకల్=నాగకన్యకలు, భూరమణాత్మజల్=రాచకూఁతులు, పొంపిరివోవన్=అతిశయింపఁగా, అర్మిలిన్=ప్రేమతో.

తాత్పర్యము

అందమైన యీ ప్రదేశమందు దేవకన్యకలు, నాగకన్యకలు, రాజకన్యకలు సంతోషముతో చిత్రవిచిత్రముగా నాడుచుఁ బాడుచు వీణె మీటూచు సంచరించు చుండిరి.

తే. ఆ యనిందిత చరితల♦యాటపాట, గూ పులస్త్యుని నియతికి♦హానిఁ గూర్చ
దానఁగోపించి యమ్మౌని♦తరుణియెవ తె,వచ్చు ననుఁజూడ నద్దిగ♦గర్భము
వహించు

అర్థములు. అనిందిత చరితల=నిందింపఁ బడని నడవడిగల వారియొక్క, ఇట్లు చెప్పుటచే వారు తృణబిందుని తపస్సు చెఱుపవలయునని తలంచినవారు కారు. కన్యకలు కావున వినోదముగ వా రాడుచుఁ బాడుచు వారిలోవారు వినోదించుచుండిరని భావము. ఆటపాట=ఆచ్ఛిక సమాహారద్వంద్వము కావున నేకవచనము, కూడదు గుడ్డ. తిక్కన, నియతికి=నియమమునకు=తపస్సునకు.

తాత్పర్యము

నిర్మలమైన మనస్సుగల యాకన్యకల యాటలు పాటలు పులస్త్యుని యేకాగ్ర చిత్తతకు హానికలిగింపఁగా నాయన కోపించి యిఁక నేస్త్రీ నన్నుఁజూడ వచ్చునో యది గర్భిణి యగును గాక యని శపించెను.

క. అనవుడు నాపలుకుల విని, వనజేక్షణలెల్ల శాప♦భయమున నచ్చో
టను జేరర; తృణబిందుని, తనయామణి యొర్తు వినమిఁ♦దచ్ఛాపంబున్. ౩

తాత్పర్యము

ఆశాపము విని స్త్రీలందఱు భయమున నా ప్రాంతమునకు వచ్చినవారు కారైరి. తృణబిందుని కూఁతురు మాత్ర మప్పు డచ్చోట లేమిని వినినది కాదు.

క. ఎప్పటియట్ల చరించుచు, నప్పట్టునఁ గనదయొక్క♦యలికుంతలనే
నప్పుడు పులస్త్య శ్రుతిరవ, ముప్పతిలెన్ శ్రవణమాన♦సోల్లాసకమై. ౩

అర్థములు. శ్రుతిరవము=వేదాధ్యయనధ్వని, శ్రవణమానసోల్లాసకమై=చెవులకు మనస్సునకు సంతోషకరమై.

తా త్ప ర్య ము

పూర్వమునవలెనే సంచరించుచు నొకకన్యక యైన నా యాశ్రమంబునం గానక తిరుగుచుండఁగా బులస్త్యుఁడు వేదము చదువు ధ్వని వినుటకు మనస్సునకు సంతోషకరమై వినవచ్చెను.

క. విని యెవ్వరిధ్వనియో యిది, యని డాయఁగ నేగి కాంచె•నమ్మునిఁ దోడ్తోఁ
దనువెల్లఁ బలుక పాఱెను, మునుకొనియెన్ గర్భచిహ్న•ములు కన్యకకున్. ౭౦

అర్థములు. తోడ్తోన్=వెంటనే, పలుకఁబాఱెను=తెల్లనయ్యెను, తనువు=దేహము.

తా త్ప ర్య ము.

(విని యిది యెవ్వరి ధ్వనియో యని సమీపమునకుఁ బోయి, యా మునిని జూచెను. వెంటనే యా కన్యకకు శరీరమంతయుఁ దెల్లనయ్యెను. గర్భచిహ్నములు కానవచ్చెను.)

క. చెలి యాప్రేఁకటిగుర్తులు, తిలకించి యిదే మటంచు•దిగులుం గొని తా
నలసత జనకునియాశ్రమ, తలమునకుం బోయి తండ్రి•దాపున నిలువన్. ౭౧

అర్థములు. ప్రేఁకటి గుర్తులు=గర్భధారణ చిహ్నములు, తిలకించి=చూచి, అలసతన్=మెల్లగా, తలమునకున్=ప్రదేశమునకు.

తా త్ప ర్య ము

(ఆమె యా ప్రేఁకటి గుర్తులు చూచుకొని, యిదేమని దిగులుపడి మెల్లఁగాఁ దన తండ్రి యాశ్రమ ప్రదేశమునకుఁ బోయి, జనకుని దాపున నిలువఁగా.)

ఉ. కన్నియవంక నాతఁడు నె•గాదిగఁ బాఱఁగఁ జూచి గర్భపుం
జిన్నెలు మేనఁ గాంచి యిసి•సీ యని యా తరళాక్షిఁ జూచి నీ
కన్నెఱికంబు దూలి యిటు•కాఁ గత మేమి యయోగ్యరీతి నో
చిన్నికుమారి యన్నఁ జెలి•సిగ్గున భీతిని గ్రుగ్గు చిట్లనున్. ౭౨

అర్థములు. ఇటుకాన్=ఇట్లు లగుటకు, కతము=కారణము.

తా త్ప ర్య ము.

కన్నియవంక నా తృణబిందుఁ డెగాదిగఁ బాఱఁజూచి యామె శరీరమునఁ దోఁచు గర్భపుఁ జిన్నెలు గని ఛీఛీ! యని, నీ కన్నెఱికము చెడ నిట్లగుట కేమి కారణము? పనికిమాలిన పనిచేసితి వేమమ్మా, యనఁగా సిగ్గున భయమున గ్రుగ్గుచుఁ దండ్రితో నామె యిట్లనెను.

ఉ. అన్నముఁ బున్నెమే నెఱుఁగ ♦ నయ్యయి పాటకుఁ గారణంబు నేఁ
గన్నది లేద, యెప్పటి ప్ర ♦ కారమునన్ విహరింపఁ గోరి నే
మున్నుగ నొంటిమై సఖుల ♦ మొత్తము రోయఁ బులస్తి యాశ్రమం
బు న్నెఱిఁ జొచ్చి యందుఁ బుఁ♦బోణి యొకర్తెయుఁ గానరామికిన్. ౨౩

అర్థములు. అన్నెము=అన్యశబ్దభవము, ఇతరము, పాపము, రోయిన్=వెదుకఁగా, పులస్తి=పులస్త్యుని, ఇది అగస్త్యశబ్దము వంటిది.

తాత్పర్యము

తండ్రీ! నేను బుద్ధిపూర్వకముగాఁ బాపము చేయలేదు. పుణ్యము చేయలేదు. ఈ ప్రకార మగుటకుఁ గారణ మేమో నాకుఁ దెలియదు. మునుపటివలెనే నేను వినోదముగాఁ దిరుగఁగోరి నేను ముందుగాఁ బోయి నా స్నేహితురాండ్రను వెదుకఁగా నొక్కతెయుఁ గానరాలేదు.

క. కారణ మే మని యిట నటు, నారయుచుండంగ నిట్టి యాకృతి గలిగెన్
గూరిన భీతిని మిమ్ముం, జేరఁగఁ బరువెత్తితిన్ విశిష్టచరిత్రా! ౨౪

తాత్పర్యము

(కారణమేమై యుండునా యని యటు నిటు విచారించుచుండఁగా నీ స్థితి గలిగెను. నాయనా! దానిఁగని భయముచే మీదగ్గఱకుఁ బరువెత్తుకొని వచ్చితిని.)

తృణబిందుఁడు తనకూఁతుఁ బులస్త్యున కర్పించుట.

చ. అనవుడు నల్లరాజఋషి ♦ ధ్యానసమాస్థితుఁడై సమస్తముం
గని యిది మౌనిచేత యని ♦ గ్రక్కునఁ గన్యను దోడికొంచు న
మ్మునివరుపాలి కేగి ప్రియ ♦ ముం బచరించు మహాత్మ! దీని నా
తనయ స్వభావ సద్గుణ వి♦తానవిభూషితఁ గన్యకామణిన్. ౨౫

అర్థములు. ధ్యానసమాధిస్థితుఁడై = యోగసమాధియందున్నవాఁడై; మౌనిచేత=ముని చేసినపని, గ్రక్కున=శీఘ్రముగా, స్వభావ=సహజముగ, సద్గుణ వితాన=మంచి గుణముల సమూహముచే, విభూషితన్ = అలంకరింపఁ బడిన దానిని.

తాత్పర్యము

(అని చెప్పఁగా రాజఋషియగు నాతృణబిందుఁడు యోగసమాధి యందుండి, సర్వమును దెలిసి యిది పులస్త్యముని చేసినపని యని వెంటనే యా కన్నెను వెంటఁ బెట్టుకొని యా మునిశ్రేష్ఠుని దగ్గఱకుఁబోయి మంచిమాటలాడి మహాత్మా! సహజ సద్గుణములుగల కన్యారత్నము నా కూఁతురిది;)

క. మాన్యవరా! స్వయముద్యత, నన్యాసులభాభిరూప్య ♦ నతులితవరసౌ
జన్య నన్నుం గృపఁ గని, కన్యాభిక్షగను దీనిఁ ♦ గైకొనఁగదవే. ౪౯

అర్థములు. స్వయముద్యతన్=అయాచితముగ నీయఁబడిన దానిని, ఉత్తమ బ్రాహ్మణునకుఁ బ్రతిగ్రహము నిషిద్ధము, అయినను "ఉద్యతామాహృతాం భిక్షాం పురస్తా దప్రవేదితామ్ (చోదితామ్మని పాఠాంతరము) భోజ్యాం మేనే ప్రజానాథో హ్యపి దుష్కృతకర్మణః" తానై యాచింపక ముందుగాఁ జెప్పక తీసికొమ్మని తెచ్చి ముందుంచిన దానిని పాపు లిచ్చినను దీసికొనవచ్చునని ప్రజాపతి యభిప్రాయము. పాపకర్ములనఁగా 'కులటాషండ పతిత వైరభ్యః కాకణీమపి, ఉద్యతామపి గృహ్ణీయా న్నాపద్యపి కదాచన' అంకుటాండ్రు, నపుంసకులు, పతితులు, విరోధులు=వీరు తెచ్చినది పుచ్చిన గవ్వయైనను ఎంతయాపద్దశయం దుండినను గ్రహింపరాదు.

'తస్కరాత్ కితవాత్ షండాత్ దంభలోభమదాన్వితాత్, మాత్రా విత్తన్నగృహ్ణీయా దభక్తాదపచారతః.' దొంగలు జూదగాండ్రు షండులు వంచకులు లోభులు గర్వులు భక్తులు గానివారు అపచారములు చేయువారు వీరి వలన నాహార పదార్థములు దీసికొనరాదు.

'న తస్య పితరోశ్నంతి దశవర్షాణి పంచచ, నచ హవ్యం వహ త్యగ్ని ర్యస్తా మభ్యవమన్య తే॥' స్వయముద్యతమగు దానిని నిరాకరించువాఁడు పెట్టు శ్రాద్ధమందు వాని పితరులు పిండమును పదునైదు సంవత్సరములు గ్రహింపరు. వాని హవ్యమును. నగ్ని దేవతల కొసంగఁడు.

ఆ పద్వశమున గ్రహింపక తప్పనపుడు 'దానం దదద్భిర్వైరుక్త మచ్యుతః ప్రీయతా మితి, ప్రతిగ్రహీతృభిశ్చైవ న తే మద్విషయోపగాః' అను శౌనక వచనము ననుసరించి ఇచ్చువాఁడు పుచ్చుకొనువాఁడు 'అచ్యుతః ప్రీయతా'మ్మని చెప్పి ప్రతి గ్రహింపవచ్చును. బలాదిమంత్రనిష్ఠులు బలాదిమంత్రము చెప్పి గ్రహింపవచ్చును. ఈనిషేధములు స్వార్థముగ గ్రహించునపుడే యనియు, గుర్వర్థమో దేవతా కార్యార్థమో యైనపుడు పక్వాన్నము తప్ప మఱి దేనినైన గ్రహింపవచ్చునని యెఱుఁగనగు.

'అయాచితోపపన్నేషు నాస్తి దోషః ప్రతిగ్రహే, అమృతం తద్విదు ర్దేవా స్తస్మాత్తం నైవ నిర్ణుదేత్. తానై యాచింపక లభించినదానిని ప్రతిగ్రహించిన దోషములేదు. అది దేవత లమృతముగా గ్రహింతురు. కావున దానిని నిరాకరింపరాదు. ఇది శాండిల్యమతము.

అన్య+అసులభాభిరూప్య=ఇతరకన్యలకు సులభముకాని సౌందర్యముగలది. అతులిత వర సౌజన్య=అసమానమైన శ్రేష్ఠమైన సద్గుణముగలది.

తాత్పర్యము

ప్రజాపతివై బ్రహ్మపుత్రుఁడ వౌటచేఁ బూజ్యులందు నుత్తముఁడా! నీవు యాచింపక నేనై తెచ్చి తీసికొమ్మని ప్రార్థించుదానిని, ఇతరకన్యకలందు లేని సౌందర్యము కలదానిని, సాధుగుణము గలదానిని నీ వూర్ధ్వరేతస్కుఁడ వగుటచేఁ గన్యలతోఁ నీకుఁ గార్యము లేకున్నను నాయందు దయ తలఁచి నన్ను గృతార్థుని చేయుటకై నీకు శుశ్రూష చేయుటకై సమర్పించుచున్నాను. ఈకన్యను భిక్షగాఁ గైకొనుము.

చ. అతులతపస్సమాధి శ్రమ ♦ మందిన నీకు మహాత్మకా! యనా
రతపరిచర్య దృప్తియొన ♦ రం జరియించు నిజంబు, వహ్నులన్
సతతముఁ గాచు నన్న ముని ♦ చంద్రముఁ డీప్సితధర్మపద్ధతిన్
హితమతిఁ గా, గ్రహించెఁ, జని ♦ యెం దృణబిందుఁడు స్వాశ్రమోర్వికిన్. ౮౭

అర్థములు. అతుల తపస్సమాధిన్ = అసమానమైన తపస్సుచే సమాధి వలన, శ్రమము=బడలిక, అనారత=విడువక, పరిచర్య=సేవ, వహ్నులన్=అగ్నులను, ఈప్సిత ధర్మపద్ధతిన్=తృణబిందుఁడు కోరిన ధర్మమార్గము ననుసరించి హితమతిన్=మేలు చేయు కోరికతోఁ, స్వాశ్రమోర్వికిన్=తన యాశ్రమ భూమికి

తాత్పర్యము

దీనివలన నాకే కార్యముగలదు, నాకిది యేమిచేయు ననకుము. నీవుతపస్సు వేళ సమాధియందుండి లేచిన పిమ్మట నీకు బడలిక పోవఁ బదసేవ చేసి నీకుఁ దృప్తి గలిగించును. నీ యగ్నులను రక్షించును అని చెప్పఁగా నామునీంద్రుఁడు రాజుకోరిన ధర్మపద్ధతి నాలోచించి తాను గ్రహింపకుండిన నా కన్య భ్రష్టురాల గునే యని దాని మేలునకై గ్రహించెను. ఆ కన్య నచట విడిచి తృణబిందుఁడు తనయాశ్రమమునకుఁ బోయెను.

చ. లలనయు సద్గుణంబులఁ బు ♦ లస్త్యునకుం బ్రమదంబుఁ గూర్చుచున్
గొలుచుచు నుండ నా కుసుమ ♦ కోమల నిర్మలశీలవృత్తముల్
జలజభవాత్మజాతునకు ♦ సమ్మదమున్ ఘటియింప నొక్కనాఁ
డల జలజాస్యఁ గాంచి ప్రియ ♦ మారఁగ నిట్లనె వామలోచనా! ౮౮

అర్థములు. ప్రమదంబు=సంతోషము, కుసుమకోమల = పుష్పము వలె మృదువైన దేహము గలది. కుసుమకోమలి యనునది యపశబ్దము, నిర్మల శీల వృత్తముల్=శుద్ధమైన యాచారము, నడవడి, జలజభవాత్మజాతునకున్=బ్రహ్మపుత్రుఁడగు పులస్త్యునకు.

తా త్ప ర్య ము

ఆ కన్యయు మంచిగుణములచేఁ బతికి సంతోషము గలిగించుచు సేవసేయు చుండఁగా నామె పరిశుద్ధమైన యాచారము నడవడి చూచి పులస్త్యుఁడు సంతో షించి యామెను జూచి యిట్లులనియె.

క. మెచ్చితి నీ గుణములకును, నిచ్చెద నీకున్ వరం బ ॰ హీనగుణాఢ్యున్
సచ్చరిత! మత్సమానునిఁ బ్రచ్ఛలఁ గనుఁగొనఁగఁ గలవు ॰ కాంతా సుతునిన్.

అర్థములు. అహీనగుణాఢ్యున్ = గొప్పగుణములను సంపత్తిగలవానిని, మత్సమానునిన్= నాతో సమానుఁడగు వానిని.

తా త్ప ర్య ము

(కాంతా! నీ గుణములకు మెచ్చితిని-నీకు వరమిచ్చెదను-నాతో సమానుఁ డగు గొప్పగుణములుగల కొడుకును ద్వరలోఁ గనెదవు.)

గీ. ఉభయవంశంబులను నాతఁ॰డుద్ధరించు, వెలఁది పౌలస్త్యుఁడని కాంచు॰వినుతినీవు
నాదునధ్యయనము విని॰నాఁడుచూలు, పడుట విశ్రవసుం డను॰వాఁడు వెలయు

అర్థములు. ఉభయవంశంబులను=తల్లిదండ్రుల వంశములను- నావంశము నీ తండ్రివంశము, వినుతి=కీర్తి, నాఁడు=ఆదినమునందు, చూలుపడుట=గర్భిణి వగుటచే, విశ్రవసుఁడు=శ్రవణమువలన జనించినవాఁడు.

తా త్ప ర్య ము

(ఆతఁడు నా వంశమును నీతండ్రివంశమును నుద్ధరింపఁగలడు. పౌలస్త్యుఁడని కీర్తి పడయును. నేనుచేయు నధ్యయనము విని, యప్పుడు గర్భిణివగుటచే విశ్ర వసుఁడని ప్రసిద్ధి నొందును.)

చ. అనవుడు సంతసిల్లె వికచ॰ చాంబుజలోచన కొంతకాల మే
విన జనియించె సాధుమతి ॰ విశ్రవసుండు త్రిలోకవిశ్రుతుం
డనుపమతుల్యదర్శి సుయ ॰ శోంచితుఁ డుత్తమధర్మవర్తి త
జ్జనకనిభుండు సద్వ్రతుఁడు ॰ సర్వకళాఢ్యుఁడు వేదవంతుఁడై. ౫౧

అర్థములు, వికచాంబుజ లోచన=వికసించిన కమలములవంటి కన్నులు గలది. ఏవినన్, ఏగినన్=పోఁగా, త్రిలోక విశ్రుతుండు=మూఁడు లోకములఁ బ్రసిద్ధి కెక్కినవాఁడు, అనుపమ=అసమానమైన, తుల్యదర్శి=సమదృష్టిగలవాఁడు, సుయశోంచితుఁడు=సత్కీర్తిచే నొప్పువాఁడు, ఉత్తమ ధర్మవర్తి=ఉత్తమమగు ధర్మమందు వర్తించువాఁడు తత్+జనక నిభుండు=ఆ తండ్రితో సమానుఁడు, సద్వ్రతుఁడు=మంచివ్రతములు గలవాఁడు, సర్వకళాఢ్యుఁడు=అన్ని విద్యలు తెలి సినవాఁడు, వేదవంతుఁడు=వేదము లెఱిఁగినవాఁడు

తాత్పర్యము

అని చెప్పఁగా నామె సంతోషించెను. ఆవలఁ గొంతకాలమునకు నామెకు మంచి మనస్సుగలవాఁడును మూఁడులోకములఁ బ్రసిద్ధుఁడును సర్వమునందు సమానభావము గలవాఁడును కీర్తిమంతుడును ఉత్తమధర్మమార్గమందు సంచరించువాఁడును తండ్రితో సమానుఁడును వ్రతములు గలవాఁడును సర్వవిద్యలు నేర్చినవాఁడును వేదజ్ఞుఁడును నగు విశ్రవసుఁడు జనించెను.

3వ సర్గము

ఉ. ఆతఁడు తండ్రిఁ బోలి నియ ♦ మాధికుఁడై తపముండి సత్యశాం
త్యాతతశీలవంతుఁ డయి ♦ యధ్యయనావిరతిన్ సమస్తభో
గేతరచిత్తవృత్తి యయి ♦ యెంతయు ధర్మపరాయణుండునై
ఖ్యాతి నెసంగె నాతనిగు ♦ ణాఢ్యత వినిఁ బ్రహృష్టచిత్తుఁడై. ॥౨

అర్థములు. సత్యశాంత్యాతత శీలవంతుఁడయి=సత్యము శాంతి విశేష శీలము గలవాఁడై, అధ్యయన+అవిరతిన్=విడువక యధ్యయనము చేయుటచేత, సమస్త భోగేతర చిత్తవృత్తి=అన్నివిధములయిన భోగములకు నితరమైన మనోవ్యాపారము గలవాఁడై.

తాత్పర్యము

ఆ విశ్రవసుఁడు తండ్రివలె నధికనియమము గలవాఁడై తపము చేయుచు సత్యవంతుఁడు శాంతిమంతుఁడు శీలవంతుఁడునై విడువక యధ్యయనము చేయనాసక్తిచే నితరభోగములందు దేనియందు మనస్సుపోనీయక ధర్మమే పరమగతి యని తలఁచినవాఁడై ప్రసిద్ధివహించెను. ఆయన గుణసంపద విని సంతోషించినవాఁడై.

—*విశ్రవసునకుఁ గుబేరుండు జన్మించుట*—

సీ. ముని భరద్వాజుండు ♦ తన తనూజాతను దేవవర్ణిని మహా ♦ భావునకును
నిచ్చి పెండిలి సేయ ♦ నింతిని గ్రహియించి, రెండవయాశ్రమ ♦ ముండి భద్ర
గుణుని శ్రేయోవంతుఁ♦గొమరు నా సతియందు,వీర్యాధికుని,గాంచె♦విశ్రవుండు
బ్రహ్మసద్గుణయుతు ♦ భావి ధనాఢ్యక్షుఁ, గని తాత సంతోష ♦ గరిమఁదనరి
ఆ. విబుధఋషులఁ గూడి ♦ విశ్రవుతనయుండు, వైశ్రవణుఁడనంగ♦వఱలునను చుఁ
బేరు పెట్టె నతఁడు♦పెద్దవాఁడయి తపో, వనముఁ జేరి నియతి♦పరతనుండె. ॥౩

అర్థములు. దేవవర్ణినిన్=దేవతల కాంతిగలదానిని, మహాభావునకున్=గొప్ప మనస్సుగలవానికి, రెండవ యాశ్రమము=గృహస్థాశ్రమము, సప్తమ్యతిమునఁ బ్రథమ, కొమరున్=కొడుకును, బ్రహ్మసద్గుణయుతున్ = శాంతిదాంర్థ లోనగు బ్రాహ్మణగుణములు గలవానిని, భావిధనాధ్యక్షున్=రాఁగల కాలమున

ధనపతి యగువానిని, లగ్నవేళఁబట్టి తెలిసికొనెనని భావము. తాత=పులస్త్యుఁడు వైశ్రవణుఁడు=విశ్రవణుని కుమారుఁడు కావున వైశ్రవణుఁడు. అపత్యార్థక తద్ధితము. "విశ్రవసో విశ్రవణంవా" యని విశ్రవణాదేశము.

తాత్పర్యము

భరద్వాజుఁడను ముని తన పుత్రికను దేవసమాన సౌందర్యము గలదగుటచే దేవవర్ణిని యను పేరుగల దానిని నాయనకిచ్చి పెండ్లి చేసెను. ఇట్లు విశ్రవుఁడామెను భార్యగా గ్రహించి గృహస్థాశ్రమము నున్నవాఁడై యామెయందు నధికబలము గలవానిని శమదమాది గుణములు గలవానిని ముందు ధనపతి కాఁగల వానిని గనెను. ఆ బాలునిజూచి పులస్త్యుఁడు సంతోషించి విశ్రవణుని కుమారుఁడు కావున వైశ్రవణుఁడని నామకరణము గావించి సంతోషించెను. ఆవైశ్రవణుఁడు పెద్దవాఁడయి తపోవనమునకుఁ బోయి యచట నియమవంతుఁడై యుండెను.

ఆ. ఆహుతులను మండు ననలుండు నాఁ దప, శ్శ్రీ నతండు వెలిఁగించిత్తమునను
దలఁచె ధర్మ మొక్కఁడెంతగు నుత్తమోత్తమం, బైనగతి యటంచు నట్లుదలఁచి

అర్థములు. అనలుండు=అగ్నిహోత్రుఁడు.

తాత్పర్యము

నేతిని హోమము చేసిన మండు నగ్ని దేవునివలె నతఁడు తపస్సంపదచేఁ బ్రకాశించి ధర్మ మొక్కఁడే లెసకుఁ బరమగతి యని తలఁచెను.

క. అతులితనిశ్చల నియమ, వ్రతుఁడై యుదకాశనుండుఁ బవనాశనుఁడున్
చ్యుతభుక్తుఁడునై యొక్కొక, శతదశవర్షంబు తపముంసలుపన్ సొరిదిన్. ౧౧

అర్థములు. అతులిత=అసమానమైన, నిశ్చల=చలింపని, నియమ=నియమములతోఁ గూడిన, వ్రతుఁడై=వ్రతములు గలవాఁడై, అవి యేవి యనిన, ఉదకాశనుండు=జల మాహారముగాఁ గలవాఁడు, పవనాశనుండు=గాలి యాహారముగాఁ గలవాఁడు, చ్యుతభుక్తుండు=ఏయాహారము లేనివాఁడు, శతదశవర్షంబు=నూరుపదుల సంవత్సరములు, ద్విగురేకవచనమ్మని యేకవచనము, సొరిదిన్=వరుసగా.

తాత్పర్యము

అసమానమైన చలింపని నియమవ్రతములు గలఁవాఁడైతొలుతఁ గొన్నిదినములు జలమును ఆవలఁ గొన్నిదినములు గాలిని నాహారముగఁ గలవాఁడైయావల నదియు వదలి యీ ప్రకారము పదినూర్ల సంవత్సరములు తపము చేసెను.

చ. ఇటు లొక వేయియేఁడు లోక ◊ యేఁడుగ ఘోరతపం బొనర్ప న
చ్చటికి విధాత దేవగణ ◊ సంవృత్తుఁడై చనుదెంచి ప్రీతి నీ
పటుతరనిష్ఠ మెచ్చితిని ◊ వత్సక! లెమ్ము వరంబుఁ గోరుమీ
తటుకున నన్న నాతఁడు య ◊ థావిధి మ్రొక్కి వచించె నీగతిన్. ౧౮

అర్థములు. దేవగణ సంవృత్తుఁడై = దేవతాసమూహములతోడఁ జుట్టఁబడినవాఁడై.

తాత్పర్యము

ఈ ప్రకారము వేయిసంవత్సరము లొక సంవత్సరమువలె ఘోరమైన తపస్సు చేయఁగా దేవతలతోడ బ్రహ్మవచ్చి నాయనా! లెమ్ము! నీ దృఢనిష్ఠకు మెచ్చితిని. నీ వేది కోరెదవు కోరు మనిన నతడు శాస్త్రప్రకారము నమస్కరించి యిట్లనెను.

క. కోరెద దిగధీశత్వముఁ, గోరెద ధనరక్షణంబుఁ ◊ గూర్మి నొసఁగవే
గీరమణీరమణ యనన్, గారవమున నతనిఁ జూచి ◊ కంజజుఁ డనియెన్. ౧౯

అర్థములు. దిక్+అధీశత్వము=దిక్పాలకత్వము, గీరమణీ రమణ=సరస్వతీ వల్లభా.

తాత్పర్యము

దిక్పాలకత్వము ధనరక్షణము కోరెదనిమ్మనిన బ్రహ్మయతనిఁజూచి యిట్లనియె.

—* బ్రహ్మ కుబేరు నుత్తర దిక్కున కధిపతిఁ జేయుట *—

సీ. లోకపాలురను న ◊ ల్వుర నేను సృజియింప, జతనంబుఁ గావించి ◊ శక్రరవిజ
వరుణుల నిలిపితి ◊ వరుసఁ దత్పదముల, నందు నాలవవాఁడ ◊ వగుము నీవు
నిధులకు నేతవై ◊ నెగడుము దివ్య మీ, మార్తండనిభము వి ◊ మానవరము
దీనిని గైకొని ◊ దేవతాసముఁడవై, విహరించుచుండుము ◊ వేడ్కకోలఁది

తే. స్వస్తియగుఁ గాక నీకు నేఁ జనెద నింక, నీకు వరముల రెండింటి నిచ్చుకతన
నేనుఁ గృతకృత్యుఁడ నటంచు నిర్జరాళిఁ గలసి స్వస్థానమునకేఁగెం జలజభవుఁడు.

తాత్పర్యము

నేను లోకపాలురను నలువుర సృజింప యత్నించి ఇంద్ర యమ వరుణులను సృజించి వారికి వరుసగా తూర్పు దక్షిణము పడమరదిక్కులఁ బాలింప నియమించితిని. ఉత్తరదిశ నిలువయున్నది. నీవు దానికిఁ బతివై నిధుల నెల్లఁ బాలింపుము. సూర్యునితో సమానమైన యీదివ్యవిమానము దీసికొని దేవతలతో సమానముగ విహరింపుము. ఋషిపుత్రునివలె నుండకుము. నీకు మేలగునుగాక, నేనుబోయి వచ్చెదను, నీకు రెండువరములిచ్చుటచే నేను జేయవలసినపని చేసినవాఁడనైతినని చెప్పి దేవతలతోడ బ్రహ్మ తనలోకమునకుఁ బోయెను.

చ. వనజజుఁ డిట్లు పోవుటయు ◊ వైశ్రవణుండును దండ్రిఁ గానఁగాఁ
జని కరముల్ మొగిడ్చి జల ◊ జప్రభవుండు ప్రసన్నుఁడై యొసం
గినవరముల్ వచించి యొక ◊ గేము విధింపఁడు నిల్వ ధాత నా
కనయము సౌఖ్యదాయి నిల ◊ యంబు నబాధ మెఱుంగఁ దెల్పవే. ౨౯

అర్థములు. జలజప్రభవుండు = బ్రహ్మ, గేము = గేహశబ్దభవము, వాసస్థానము, అబాధము=బాధ లేనిది.

తాత్పర్యము

ఇట్లు చెప్పి బ్రహ్మ వెడలిపోఁగా వైశ్రవణుఁడు తండ్రిని జూడఁబోయి నమస్కరించి బ్రహ్మయనుగ్రహించి తన కిచ్చిన వరములఁ దెలిపి, యాయన నాకు నివాసస్థానము చెప్పిన వాఁడు కాఁడు, నాకు సర్వదా సుఖము గలిగించునదియు బాధలేనిదియు నగు వాసస్థానముఁ జెప్పుము.

మ. అనుడున్ దక్షిణవారిరాశిని త్రికూ ◊ టాఖ్యాద్రిశృంగంబునన్
గొనబౌ లంక యనంగ నొక్కపురి ర ◊ క్షోనాథవాసార్థమై
మునుపానిర్జరశిల్పినిర్మితము సొం ◊ పుం గూర్చు నెంతేని నీ
వనుమానింపక శక్రపట్టనము తీ ◊ రై యుంచు ధాత్రీస్థలిన్. ౩౦

అర్థములు. నిర్జరశిల్పి=విశ్వకర్మచే.

తాత్పర్యము

అని చెప్పఁగా విశ్రవసుఁ డిట్లనియె, దక్షిణసముద్రమునందుఁ ద్రికూటమను పేరుగల పర్వతము శిఖరమునందు నొక యందమైన పురము లంక యనునది గలదు. అది రాక్షసులు కాపురము చేయుటకై విశ్వకర్మ పూర్వము నిర్మించెను. అది మిక్కిలి యందమైనది. ఇంద్రుని పురమువలె నుండును. అది రాక్షసపురమే, నే నెట్లుండు నుందునని సందేహింపకుము.

సీ. స్వర్ణవప్రంబున ◊ శస్త్రయంత్రావృత, పరిఖ వైడూర్యసు ◊ వర్ణతోర
ణంబులతోఁ గడుఁ డంబుమీఱుచు నుండు, హరికిని వెఱచి మున్న సురవరులు
దానిని విడనాడి ◊ తరలి రసాతల, వసుధఁ జేరుట నిప్డు ◊ ప్రభువు లేక
శూన్యమై యున్నది ◊ సుఖద మబాధంబు, నిర్దోష మది నీవు ◊ నెలవు కొనుము

ఆ. యచట నన్న జనకు ◊ వచనంబులకుఁ బొంగి, లంక కేగి యందు ◊ శంక లేక
నైరృతాళిఁగూడి నానావిధార్థ స, మృద్ధిఁ గూడి యుండె ◊ నిచ్చకొలఁది. ౩౧

అర్థములు. స్వర్ణవప్రంబును=బంగారు ప్రాకారము గలది, శస్త్రయంత్రావృత పరిఖ=శస్త్రములతో గూడిన యంత్రములచే నావరింపఁబడిన యగడ్తగలది.

హారికిని=విష్ణు దేవునకు సుఖదము=సుఖము నిచ్చునది, అబాధంబు=బాధ లేనిది నైరృతులు=యక్షులు, యక్షరాక్షస పిశాచాదు లేక రాశివారే.

తాత్పర్యము

బంగారు ప్రాకారము శస్త్రములతోడి యంత్రములు గల యగడ్తగలదై వైడూర్యములు బంగారు వీనితోడి గోపురములు గలదై మిగులఁ బ్రకాశించుచుండును. విష్ణువునకు భయపడి రాక్షసులందుండక రసాతలమునకుఁబోయినారు. ఇప్పుడం దెవ్వరు లేరు. దానికిఁ బ్రభువు లేఁడు. దిక్కులేక యున్నది. అది బాధ లేనిది, సుఖకరము, దోషము లేనిది కావున నీవు పోయి యందు వసింపుము అని చెప్పఁగాఁ దండ్రిమాటలకు సంతోషించి లంకకుఁబోయి యందు సందేహము లేక యక్షులతోడ అనేకవిధములయిన పదార్థములు విస్తారముగ నుండఁగా దన యిష్ట ప్రకారముండెను.

చ. కలుముల రాయఁ డిట్లు పరి ◊ ఖాయితవార్ధి పురంబులోనఁ దా
నెలయుచు యోగవన్మరుద ◊ భిష్టుతుఁడై సురసుందరీ విలా
స లలితమైన యానమున ◊ సారసమిత్రుఁడువోలె భానులన్
వెలుఁగుచు రాకపోకలను ◊ బ్రీతిని గూర్చుచు నుండెఁ దండ్రికిన్. ౬౨

అర్థములు. కలుముల రాయఁడు = ధనముల కధిపతి, పరిఖాయిత= అగడ్తవలెనైన, వార్ధి=సముద్రముగల, పురంబులోనన్=పట్టణమందు, యోగవత్ + మరుత్ + అభిష్టుతుఁడై=యోగులచేతను దేవగంధర్వాదులచే స్తోత్రము చేయఁబడినవాఁడై.

తాత్పర్యము

ధనపతి యగు నావైశ్రవణుఁడు సముద్రమే యగడ్తగాఁగల పట్టణమందు యోగులు దేవగంధర్వులు లోనగువారు స్తుతించుచుండఁగా దేవతా స్త్రీలచే నందమైన యింటియందున్నవాఁడై కిరణములచే సూర్యుఁడు ప్రకాశించునట్లు ప్రకాశించుచుఁ బుష్పక విమానముపైఁ బోవుచు వచ్చుచుఁ దల్లిదండ్రులకు సంతోషము గలిగించుచుండెను,

౪వ సర్గము

—❋ శ్రీరాముఁ డగస్త్యునిఁ బూర్వరాక్షసుల వృత్తాంత మడుగుట ❋—

చ. అనుచు నగస్తి పల్కఁగ హు ◊ తాశనతుల్యు మునీంద్రుఁ బల్కుచున్
గనుచు సవిస్మయాత్ముఁడల ◊ కంజనిలోచనుఁ డేమి లంక ము
న్దనుజుల కాటపట్టొకో? వి ◊ నం గడువిస్మయ మయ్యె; రాక్షసుల్
మునిప! పులస్త్యవంశ్యు లనిమున్ వినియుంటిమి, మీర లియ్యెడన్. ౬3

అర్థములు. అగస్తి=అగస్త్యుఁడు, హుతాశనతుల్యున్=అగ్నితో సమానమైన వానిని.

తాత్పర్యము

ఈప్రకారమగస్త్యుఁడు చెప్పఁగా నగ్నితేజుఁడైన యామునిశ్రేష్ఠునిఁ బలుమాఱు చూచి యాశ్చర్యపడి రామచంద్రమూర్తి యిట్లనియె. ఏమి! లంక పూర్వముకూడ రాక్షసస్థానమా? ఇది వినుటకు నాశ్చర్యముగా నున్నది. రాక్షసులు పులస్త్యవంశమునఁ బుట్టినవా రని వినియుంటిమి.

సీ. అన్యులుగలరని ◊ యాడితి రిప్పటి, దశకంఠ ఘటకర్ణ ◊ తత్తనూజ
మంత్రులే బలియుర ◊ మఱి తొల్లి వారలే, శూరులో? చెప్పుమీ ◊ వారలెవరు?
వారల పేర్లెవ్వి? ◊ వారల బల మెంత? యేమి దోషంబున ◊ నెట్లు శౌరి
దఱిమె లంకాపురిఁ ◊ దలఁగి పర్వెత్తఁగ? నీ వాదుకుతుకంబు ◊ భానుమాలి

ఆ. యిరుల జోపురీతి ◊ హరియింపవే యన, నలఁతినగవుతో ◊ డంనమ్మహాత్ముఁ
డాధరాసుతామ◊నోబ్జభాస్కరుఁగని యను, వినుతు వినుము పూర్వ◊వృత్తమెల్ల.

అర్థములు. భానుమాలి = సూర్యుఁడు, ఇరులన్=చీఁకట్లను, జోపురీతి= పోఁగొట్టు విధముగ, అలఁతి నగవు=చిఱునవ్వు, తాను జేసినది తనకుఁ దెలియనట్టు లడుగుచున్నాఁడే యని, ధరాసుతామనోబ్జభాస్కరున్ = సీతాదేవి హృదయ కమలమునకు సూర్యుఁడైనవాఁడు, పూర్వవృత్తము=ముందు జరిగినది.

తాత్పర్యము

(ఇతరు లున్నారని 'చెప్పితిరి. ఇప్పటి రావణుఁడు కుంభకర్ణుఁడు యింద్రజిత్తు మంత్రులు బలవంతులా? వెనుకటివారు శూరులా? వారలెవరు? వారల పేర్లెవ్వి? వారి బలమెంత? వారేమి తప్పుచేయుటచే విష్ణుమూర్తి వారలను లంకాపట్టనమునుండి తఱిమివేసెను? ఇది వినవలెనని కోరిక గలదు సూర్యుఁడు చీఁకట్లను బోఁగొట్టునట్లు నా సంశయమును బాపుడు' అని శ్రీరామచంద్రమూర్తి యడుగఁ జిఱునవ్వు నవ్వి యగస్త్యుఁడు 'శ్రీరామమూర్తితోఁ బూర్వ వృత్తాంత మంతయు వినుపించెద వినుము' అనెను.)

—* యక్షరాక్షసుల యుత్పత్తి *—

ఉ. అంబుజసంభవుండు మును ◊ యంబువులన్ సృజియించి పెక్కు స
త్త్వంబుల దాని రక్షకయి ◊ తా నొనరింపఁగ క్షుత్పిపాసలన్
డంబఱి యవ్వి దైన్యమున ◊ డాసి స్వకర్తను మాకు నేమి కా
ర్యంబు వచింపు మంచు విన ◊ యంబున సన్నియు విన్నవించినన్. ౬౫

అర్థములు. అంబుజసంభవుండు = బ్రహ్మ, అంబువులన్ = జలములను, సత్త్వంబులను=ప్రాణములను, క్షుత్ + పిపాసలన్=ఆకలిదప్పుల చేత, డంబఱి=కాంతి క్షీణించి.

తా త్ప ర్య ము

బ్రహ్మదేవుఁడు తాను రాత్రివేళ కమలమందు నిద్రించుసమయంబున జలముల రక్షించుటకై కొన్ని ప్రాణులను సృజించెను. అవి యాఁకలిదప్పులచే నలఁగి బ్రహ్మదేవుని జూచి మమ్మేల సృజించితివి? మాతోఁగాఁగల కార్యమేమి యని యడిగెను.

క. వానిని గని నవ్వుచు నా, మానదుఁ డిట్లనియె మీరు ◊ మత్సృష్టజలం
బూనిక రక్షింపుఁడు మీ, కీనెఱి కర్తవ్యమంచు ◊ నెలమి వచింపన్. ౧౫

అర్థములు. మత్సృష్టజలంబు=నేను సృజించిన జలమును, నెఱి=విధము, కర్తవ్యము=చేయఁదగినపని.

తా త్ప ర్య ము

(వానినిజూచి బ్రహ్మ యిట్లనియె. నేను సృష్టించిన జలమును మీరు రక్షింపుఁడు అది మీకు విధి-అని చెప్పఁగా.)

క. రక్షామ యనియె నం దబు, భుక్షిత సత్త్వములు దేవ ◊ పూజితుతోడన్
జక్షామ యనుచుఁ బలికెఁ బు, భుక్షితములు బ్రహ్మ యంత ◊ భూతములకనెన్.
రక్షామ=రక్షించెదము, అబుభుక్షితసత్త్వములు=ఆఁకలిగొననిప్రాణులు, జక్షామ=భుజించెదము, బుభుక్షితములు=ఆఁకలిగొన్నవి.

తా త్ప ర్య ము

బ్రహ్మ యిట్లు చెప్పఁగా నందు నాఁకలిగొననివి రక్షింతుమనియెను. ఆఁకలి గొనినవి భక్షింతుమనియెను. అప్పుడు బ్రహ్మ భూతముల కిట్లు చెప్పెను.

క. రక్షామ యనిన వారలు, రాక్షసు లగువారు భూత ◊ రాసులలోనన్
జక్షామ యనిన వారలు, యక్షులు రగుఁడంచు ననియెఁనవ్వారజులోలన్. ౧౬

తా త్ప ర్య ము

రక్షామ యనినవారు రాక్షసులుగను జక్షామ యనినవారు యక్షులుగను గండని బ్రహ్మ చెప్పెను, వారిలో

క. హేతిప్రహేతినాములు, భ్రాతలు జనియించి రుగ్ర ◊ రాక్షసు లతి స
త్త్వాతులమధుకైటభనిభు, లాతతబలదర్ప శౌర్య ◊ హతపరిపంథుల్. ౧౭

అర్థములు. అతిసత్త్వ=మిగుల బలమునందు, అతుల=అసమానులైన, మధుకైటభనిభులు = మధుకైటభులతో సమానులు, పరిపంథుల్ = శత్రువులు గలవారు.

తాత్పర్యము

ఆరాక్షసులలో హేతియని ప్రహేతియని పేరుగల వారిరువురు రాక్షసులు బలమునందు మధుకైటభులతో సమానులు, విస్తార బలదర్పశౌర్యములచే శత్రువుల వధించువారు జనించిరి.

ఉ. అందుఁ బ్రహేతి ధర్మనిర ◊ తాత్మకుఁడై వనసీమ కేగ, రా
కేందునిభాననన్ శమను ◊ నిష్టసహోదరునిన్ భయాఖ్య బ్రే
మం దగ వేఁడి పెండ్లి యయి ◊ మానితరీతిని హేతి గాంచె నా
సుందరియందు నందనుని ◊ శూరవరేణ్యు విభావిభావసున్. ౨౦

తాత్పర్యము

ఆ హేతి ప్రహేతులను నిరువురిలోఁ బ్రహేతి యనువాఁడు ధర్మమునం దాసక్తిగల మనస్సుగలవాఁడై తపము చేయ నడవులకుఁ బోయెను. రెండవ వాఁడగు హేతి యముని చెల్లెలును పూర్ణచంద్రుని వంటి ముఖము గల భయ యను పేరు గలదానిని పెండ్లియాడి దానియందు శూరులలో శ్రేష్ఠుఁడును కాంతి యందు నగ్నిహోత్రుని.

క. విద్యుత్కేశుని నాతఁడ, వద్యేతరతేజుఁడగుచు ◊ వాలుచును బయః
ప్రోద్యత్కమలముభంగిని, మాద్యద్గతి సొరిది వృద్ధి ◊ మంతుఁడు కాఁగన్. ౨౧

అర్థములు. అవద్యేతరతేజుఁడు = దోషములేని తేజస్సు గలవాఁడు వాలుచు=విక్రమించి, పయఃప్రోద్యత్+కమలము భంగిని=జలములందుఁ బుట్టిన కమలమువలె, మాద్యద్గతిన్=గర్వించిన విధముగ, సొరిదిన్=క్రమముగ, వృద్ధిమంతుఁడు=వృద్ధినొందుచున్నవాఁడు.

తాత్పర్యము

విద్యుత్కేశుఁడను వానిఁ గనెను. వాఁడు నిర్దోషమైన తేజస్సు గలవాఁడై యతిశయించు జలములందుఁ బుట్టిన కమలమువలెఁ బురిగొని క్రమక్రమముగ వృద్ధి పొందెను

సీ. యౌవనవంతుఁడై ◊ యలరుపుత్రునిఁ గాంచి, హేతి సంప్రీతి మైనాతనికిని
బెండ్లిసేయఁగ గోరి ◊ పెంపున సంధ్యను, హసియించుదాని సం ◊ ధ్యాత్మజాతఁ
బుత్రునిమిత్తమై ◊ పొలఁతిని వేఁడంగఁ, బడఁతి పుట్టినయప్డె ◊ పరులసొమ్ము
గావుట భావించి ◊ కన్నెసాలకటంక, టాఖ్య నొసంగిన ◊ నమరవిభుఁడు
ఆ. శచియుఁ బోలె నసురదంపతుల్ దమి మీఱ, సుఖపయోధిఁ దేలి సోలుచుండ
గంధివలన మబ్బు ◊ గర్భంబుఁ దాల్చిన, కరణిఁ దరుణి దాల్చె ◊ గర్భమంత.

అర్థములు. కంధి=సముద్రము.

తాత్పర్యము

ప్రాయము వచ్చినకొడుకునుజూచి హేతి సంతోషించి యతనికిఁ బెండ్లిఁ జేయఁగోరి సంధ్యవంటి కాంతిగల దానిని సంధ్యయనుదాని పుత్రికను దను కొడుకున కిమ్మని కోరఁగా స్త్రీ పుట్టఁగానే పరులసొత్తగుట నాలోచించి సంధ్య తన పుత్రి సాలకటంకట యను దానిని విద్యుత్కేశున కిచ్చి వివాహము చేసెను. అతఁడు శచితోడ దేవేంద్రుఁడు భోగించునట్లు దానితో భోగింపఁగా సముద్రము వలన మేఘము గర్భము ధరించినట్లు ఆ రాక్షసుని వలన గర్భము ధరించెను.

—* సుకేశుని జన్మవృత్తాంతము *—

ఉ. అంగన మందరాద్రికడ ◊ నగ్నిభవం బగు భూరిగర్భమున్
గంగ యనంగ వారిధర ◊ గర్భనికాశము నాత్మగర్భమున్
వెంగలి యొంటి నేగి ప్రస ◊ వించి నిసుంగును నంద వైచి తా
నంగజకేళికారతిని ◊ నాత్మధవుం దఱిసెన్ = యథామతిన్. ౬౩

అర్థములు. అగ్నిభవంబు=అగ్నివలనఁ గలిగినది ఇది బాలకాండమందు వివరింపఁబడినది. చూ. బాల. ౮ ౨౪-౮ ౨౭ పద్యములు. వారిధరగర్భనికాశము= పిడుగుతో సమానమైనది, వెంగలి=బుద్ధిలేనిది, నిసుంగును=బిడ్డను, అంగజ కేళికా రతిని=మన్మథక్రీడల యందలి యాసక్తిచేత.

తాత్పర్యము

ఆ సాలకటంకట యనునది మందరాద్రి సమీపమందు గంగాదేవి యగ్ని వలనఁ గలిగిన గర్భమునుబోలె పిడుగుతో సమానమైన తన గర్భమును తెలివి మాలినదై యొంటరిగాఁ బోయి శిశువును గని యా శిశువును నందే విడిచి యిష్ట ప్రకారము రతికేళిమీఁద యాశచే భర్తయొద్దకుఁ బోయెను.

గంగను నుపమానముగఁ జెప్పుటచే నిదియుఁ గడుపు దించుకొని యాబిడ్డ నందే పాఱవైచి పోయెనని యేర్పడుచున్నది. నెలలు నిండి ప్రసవించినది కాదు. కావుననే వెంగలి యని చెప్పఁబడెను.

క. పుట్టినబిడ్డం దేగాతిఁ, బట్టెనొ యోజింప మఱచెఁ ◊ బడఁతుక కట్టా!
యెట్టెట్టి పనులు సేయరు, కట్టిడిజంతలు మనోజ ◊ కాండాహతలై? ౭౪

అర్థములు. కట్టా=అయ్యో! కట్టిఁడి = కట్టు+ఇఁడి = నియమహీనలైన, జంతలు=ధూర్తస్త్రీలు, మనోజ కాండాహతలై=మన్మథ బాణములచేఁ గొట్ట బడినవారై.

తా త్ప ర్య ము

పుట్టిన బిడ్డఁ డేగతిఁ బట్టెనో విచారించుటకే యా పాపాత్మురాలు మఱచెను అయ్యో! ధర్మపద్ధతిఁ గట్టుకొన్న మగనికిఁ బుట్టిన బిడ్డను అంకటాలువలె పాఱవైచెనుగదా. దుష్టస్త్రీలు కామాతిశయముచే నెంత పాపకార్యమైనఁ జేయ జంకరుగదా!

అర్థాంతరన్యాసాలంకారము.

ఉ. బాలుఁడు శారదాబ్జహిత ♦ భాపటలిన్ వెలుఁగొందె తానుగా
  వ్రేళుల నోరఁ గూరుకొని ♦ పెద్దగ నేడ్వఁగ నాలపోతుపై
  నాలును దాను బోవుచుఁ బు ♦ రాహితుఁ డవ్యయుఁ డక్షరుండు శై
  లాలయుఁ డభ్రవీథిఁ జను ♦ చా రవమున్ విని గౌరిప్రేరణన్. ౭౫

అర్థములు. శారదాబ్జ హితభాపటలిన్ = శరత్కాలమందలి సూర్యుని కాంతి సమూహముచే, ఆలపోతుపై = ఎద్దుమీఁద, పురాహితుఁడు = శివుఁడు, శైలాలయుఁడు = కైలాస పర్వతమం దుండువాఁడు, అభ్రవీథిన్ = ఆకాశమార్గమున, రవమున్ = ధ్వనిని, అక్షరుఁడు = అవ్యయుఁడనుటచే షడ్భావరహితుఁడని యర్థము.

తా త్ప ర్య ము

ఆ పిల్లవాఁడు శరత్కాల సూర్యుని కాంతిగలవాఁడై ప్రకాశించుచుఁ దానే వ్రేళ్లు నోరఁ గూరుకొని గట్టిగా నేడువఁగా వృషభవాహనముపైఁ బార్వతితోడఁ బోవుచు నవ్యయుఁడు నక్షరుఁడు నగు శివుఁడు వాని జూచి దయావతి యగు పార్వతీదేవి ప్రేరింపఁగా.

క. కరుణార్ద్రచిత్తుఁడై యా, శరబాలకుఁ గాంచి యిచ్చె ♦ జననివయస్సున్
  బుర మాకాశగ మమరత, గిరిజయు నబ్బాలుఁ గాంచి ♦ కృప దళుకొత్తన్.

అర్థములు. కరుణార్ద్రచిత్తుఁడై = దయారసముచేఁ దడిసిన మనస్సుగలవాఁడై ఆశరబాలకున్ = రాక్షసబాలుని, ఆకాశగమన = ఆకాశమునఁబోవునది, అమరతన్ = చావులేమియును, గిరిజ = పార్వతి.

తా త్ప ర్య ము

దయారసముచేఁ దడిసిన మనస్సుగలవాఁడై రాక్షసబాలునిఁ జూచి తల్లి యొక్క వయస్సును ఆకాశమునఁ బోఁగల విమానమును చావులేమియు నిచ్చెను. పార్వతీ దేవియు నా బాలునిఁ జూచి దయ యతిశయింపఁగా.

క. సద్యోగర్భప్రాప్తియు, సద్యఃప్రసదంబు జనని ♦ నమ మగు వయసున్
  సద్యోవయోప్తి యొసఁగెను, జోద్యంబుగ నసురతతికి ♦ సుర లరుదందన్. ౭౭

అర్థములు. సద్యోగర్భప్రాప్తియు = వెంటనే గర్భము వచ్చుట, సద్యః ప్రసవంబు=గర్భము వచ్చిన వెంటనే కనుట, సద్యోవయోప్తి = సద్యోవయ ఆప్తి=అప్పుడే వయస్సు వచ్చిన వా రగుట, వయస్+ఆప్తి=వయః ఆప్తి=వయ ఆప్తి=విసర్గమునకు హ్రస్వమైన అకారముతప్ప మఱి యే యచ్చు పరమైనను విసర్గకు లోపము.

తా త్ప ర్య ము

రాక్షసబాలునకుఁ బరమేశ్వరుఁ డిచ్చిన వరములతో సంతుష్టిపడక క్రూర లైన రాక్షసస్త్రీ లిట్టు లే బిడ్డల విషయమై ప్రవర్తింతు రని తలఁచి యాఁబాలుర యందుఁ బ్రేమగలదై దేవత లాశ్చర్యపడునట్లు రాక్షసుల కందఱకు గర్భము వచ్చిన వెంటనే నెలలు నిండుట వెంటనే ప్రసవించుట ఆ పుట్టిన బిడ్డల కప్పుడే వయస్సు వచ్చుట యను వరము లొసఁగెను.

చ. హరవరదానగర్వమున ◊ నా యసురుండు సుకేశనాముఁ డం
బరచర మా పురంబుఁ గొని ◊ స్వైర విహారరతిం ద్రిలోకసం
చరణధురీణుఁ డయ్యె బల ◊ శాసనుమాడ్కి, నసహ్యవిక్రమ
స్థిరుని సుకేశు ధర్మరతు ◊ సిద్ధవరుం గని ప్రీతియుక్తుఁడై. ౨౮

అర్థములు. హరవరదాన గర్వమునన్=శివుఁడిచ్చిన వరము వలన గర్వముచే, అంబరచరము=ఆకాశమున సంచరించునది, పురంబు=పురమువలె నుండు విమానము, స్వైరవిహారరతిన్ = స్వేచ్ఛగా సంచరించుటయందు ఆసక్తి గల వాఁడై, త్రిలోక సంచరణ ధురీణుఁడు=మూఁడు లోకములందు దిరుగు సామర్థ్యము గలవాఁడు, బలశాసనుమాడ్కిన్=ఇంద్రునివలె, సిద్ధవరున్=వరములు పొందినవానిని, (౨) సిద్ధులలో శ్రేష్ఠుని-సిద్ధులయందుండు నాకాశగమనాదులు వానియందుఁ గలవుకదా.

తా త్ప ర్య ము

శివుఁడిచ్చిన వరముచే గర్వించిసుకేశుఁడను పేరుగల యారాక్షసుఁడు ఆకాశ గమనముగల విమానము గ్రహించి యిష్టము వచ్చినట్లు మూఁడులోకములనింద్రుని వలె సంచరింపఁ సమర్థుఁడయ్యెను. సహింపరాని పరాక్రమము గలవాఁడును ధర్మమందాసక్తిగలవాఁడును వరములనొందినవాఁడును నగు సుకేశునిఁ జూచి ప్రీతిగలవాఁడై.

౫వ స ర్గ ము

క. గ్రామణి యను గంధర్వ, గ్రామణి విశ్వావసునిభ ◊ ఘనతేజుఁడు శ్రీ
భామానిభ సుందరతా, ధామం దనముద్దుఁగూతుఁ ◊ దారుణ్యానిధిన్. ౨౯

అర్థములు. గంధర్వగ్రామణి = గంధర్వశ్రేష్ఠుఁడు, విశ్వావసు నిభఘన తేజుఁడు=అగ్నితో సమానమైన గొప్ప తేజస్సు గలవాఁడు, శ్రీభామానిభ=

లక్ష్మీదేవితో సమానురాలు, సుందరతాధామన్=సౌందర్యమునకు స్థానమైనది, తారుణ్యసధన్=వయస్సు వచ్చినదానిని.

తా త్ప ర్య ము

గ్రామణియను పేరుగల గంధర్వ శ్రేష్ఠుఁడు,అగ్నివంటి తేజస్సుగలవాఁడు, సౌందర్యమున లక్ష్మీదేవితో సమానురాలయి ప్రాయమువచ్చిన తన పుత్రికను దేవవతి యనెడు దానిని.

క. ఇచ్చి వివాహ మొనర్చిన, నచ్చెలి వరలబ్ధనిస్తు ◆ లైశ్వర్యయుతున్
సచ్చరితుఁ బ్రాణధవుని, నిష్పచ్చరమున వేఁగుజీవి ◆ భాగ్యముఁ బోలెన్. ౨౦

అర్థములు. వరలబ్ధ=వరములచే లభించిన, నిస్తుల=అసమానమైన, ఐశ్వర్య యుతున్=ఐశ్వర్యముతోఁ గూడిన వానిని, నిష్పచ్చరమునన్= దారిద్ర్యముచే, వేఁగు=సంతాపపడు.

తా త్ప ర్య ము

ఇచ్చి పెండ్లి చేయఁగా వరములచే లభించిన యైశ్వర్యముగల మగని, మంచి నడవడి గలవానిని పేదఱికముచే బాధపడు ప్రాణి భాగ్యము పొందినట్లు పొందినదై.

క. పొంది యమందానందము, నం దనిసె నతండు నంగ ◆ నం గూడి యనం
గుం దగుగతిఁ బూజించుచుఁ, నందించెను నంజనభవ ◆ నాగం బనఁగన్. ౨౧

అర్థములు. తనిసెన్=తృప్తిపడెను, అనంగున్ దగుగతిఁ బూజించుచున్= మన్మథ సేవసేయుచు, రతిక్రీడలన్ దేలుచు, నందించెను=సంతోషించెను, అంజన భవనాగంబు=అంజనమను నేనుఁగునకుఁ బుట్టిన యేనుఁగువలె.

తా త్ప ర్య ము

(అమితానందమునఁ దృప్తిపడెను. అతఁడును తన భార్యనుగూడి మన్మథ క్రీడలఁ దేలుచు నంజనమను నేనుఁగునకుఁ బుట్టిన యేనుఁగువలె నానందించెను.)

—*సుకేశునకు మాల్యవదాదులు జన్మించుట*—

సీ. తేజరిల్లగ వారు ◆ దేవవతీసతి, మూడులోకంబుల ◆ మూఁడుకనుల
నగ్నిత్రయంబును ◆ నామయత్రయమును, మంత్రత్రయంబును ◆ మచ్చరించు
వారల ముగురఁ గు ◆ మారులఁ గాంచెను. మాల్యవంతుండు సు◆మాలినాఁగ
మాలి నాఁ బరఁగెడి ◆ మహితబలాఖ్యుల, వార లుపేక్షిత ◆ వ్యాధులనఁగ
తే. క్రమముగావృద్ధిఁజెంది వరంబుపేర్మిఁ, గలుములెల్లను జనకుండు◆గాంచు
టెఱిఁగి
తపము సేయఁ దలంచి భ్రా ◆ తలు సునర్ణ, శైలనికటంబునకు నేగి◆సారనిష్ఠ

అర్థములు. అగ్నిత్రయము=ఆహవనీయము, దక్షిణాగ్ని, గార్హపత్యము, ఆమయత్రయము=వాతపిత్త శ్లేష్మములు, మంత్రత్రయము=(౧) మూఁడు వేదములు, ప్రభు మంత్రోత్సాహములు, మూఁడులోకము లనుటచే స్థిరత్వమును, మూఁడగ్నులనుటచేఁ దేజస్విత్వము, మూఁడు మంత్రములనుటచే నపరిమిత సామర్థ్యము, మూఁడు వ్యాధులనుటచే హింసకత్వము గ్రాహ్యము, ఉపేక్షితవ్యాధులు=చికిత్స చేయక యలక్ష్యము జేసిన రోగములు, సువర్ణశైలనికటంబునకు=మేరు పర్వత సమీపమునకు.

తాత్పర్యము

ఆ దంపతులిట్లు ప్రకాశించు చుండఁగా నా దేవవతి మూఁడు కన్నుల శివునితో సమానులగు వారిని మూఁడులోకములు మూఁడగ్నులు మూఁడురోగములు మూఁడు మంత్రములు వంటి వారిని ముగ్గురఁ గొడుకులను మాల్యవంతుఁడు సుమాలి మాలి యను పేరులు గలవారిని మిగుల బలవంతులఁ గనెను. వారు చికిత్సను చేయక యుపేక్షించిన రోగములవలెఁ గ్రమముగ వృద్ధి చెంది తమ తండ్రి తపస్సు చేసి వరములు సంపాదించి యైశ్వర్యవంతుఁ డయ్యెనని తెలిసికొని ముగ్వు రన్నదమ్ములు మేరుపర్వతము సమీపమునకుఁబోయి దృఢనిష్ఠ గలవారై.

తే. శమము సత్యార్జవంబు ల♦స్ఖలితములుగ, నఖిలభూత భయావహ♦మైనఘోర
తపముఁ గావింప దేవగం♦ధర్వమాన, వాది లోకత్రయంబును♦హావళించె. ౧౩

అర్థములు. ఆర్జవంబు=చక్కఁటి నడవడి, అస్ఖలితములుగన్ = వదలకుండ, హావళించెన్=బాధపడెను.

తాత్పర్యము

శమము సత్యము ఋజుత్వము వదలక సర్వప్రాణులు భయపడునట్లు ఘోరమైన తపస్సు చేయఁగా దేవతలు గంధర్వులు మనుష్యులు హాహాకారము గావించిరి.

ఉ. అంతఁ జతుర్ముఖుండు విబు ♦ ధావళితోడ సుకేశనందనా
భ్యంతిక దేశముం దఱిసి ♦ వాంఛిత మెయ్యది దీర్తునన్నఁ బా
కాంతక ముఖ్యదైవత స ♦ మావృతుఁ డిష్టదుఁ డైన భారతీ
కాంతుఁ డటం చెఱింగి ద్రుమ ♦ కాండములట్లు ప్రకంపితాంగులై. ౧౪

అర్థములు. అభ్యంతికదేశము=సమీపభూమి, తఱిసి=సమీపించి, పాకాంతక=ఇంద్రుఁడు, ఇష్టదుఁడు=వరముల నిచ్చువాఁడు, భారతీకాంతుఁడు=బ్రహ్మ, ద్రుమకాండములట్లు=చెట్లసమూహములవలె, ప్రకంపితాంగులై=వణఁకు దేహములు గలవారై.

తా త్ప ర్య ము

అట్లు తపస్సు చేయఁగా బ్రహ్మదేవతలతోడ వారిసమీపమునకుఁ బోయి మీ కేమికోరికలు గలవు చెప్పుడు, ఇచ్చెదనని చెప్పఁగా ఇంద్రాది దేవతలతో నుండు వాఁడు బ్రహ్మయని తెలిసికొని భయభక్తులచే వణకినవారై.

చ. కరములు మోడ్చి యిట్లనిరి ॥ కంజభవా! వరదుండ వేనియున్
జిర మగు జీవితంబును న ॥ జేయత శత్రునిహంతృతం బర
స్పర మనురక్తియుం బ్రభవ ॥ శాలితయుం గరుణింపవే దయా
కర! నతకంజభాస్కర! వి ॥ కారవిదూర! యటంచు మ్రొక్కినన్, ౧౫

అర్థములు. వరదుండవు=వరము లిచ్చువాఁడవు, అజేయత=పరులచే గెలువఁ బడకుండుట, శత్రునిహంతృతన్=శత్రువుల వధించుట, పరస్పరము= ముగ్గురన్నదమ్ములలో నొకరితో నొకరికి, ప్రభవశాలితయు = పరాక్రమముచేఁ బ్రకాశించుట, నతకంజభాస్కర=నమస్కరించువారనెడి కమలములకు సూర్యుఁడ వగువాఁడా.

తా త్ప ర్య ము

రెండు చేతులు జోడించి యిట్లు చెప్పిరి. బ్రహ్మదేవా! నీవు మాకు వరము లీయఁ దలఁచెదవేని దీర్ఘకాలము బ్రదికి యుండునట్లు, మమ్మెవ్వరు జయింప లేనట్లు, శత్రువుల మేము జయించునట్లు మాలో మాకనురాగ ముండునట్లు పరాక్రమము కలుగునట్టు లనుగ్రహింపుము అని మ్రొక్కఁగా,

తే. అట్టులగునంచు వచియించి॥యవ్విరించి,బ్రహ్మపురి కేగె॥బ్రాహ్మణవత్సలుండు
వరములను బొంది యాని శా॥చరులు వెఱపు,లేక గారింపఁదొడఁగిరి॥లోకములను.

అర్థములు. విరించి=బ్రహ్మ, బ్రహ్మపురికిన్=సత్యలోకమునకు, కారింపన్= బాధపెట్టుటకు, తొడఁగిరి=ప్రారంభించిరి.

తా త్ప ర్య ము

(అట్టులే యగునని చెప్పి బ్రహ్మ సత్యలోకమునకుఁ బోయెను. బ్రహ్మచే వరములు పొంది యారాక్షసులు వెఱపులేక లోకములను బాధింపఁబూనిరి.)

—*మాల్యవదాదులు లంకయందుఁ జేరుట*—

ఉ. వారు సురాసురాళిముని ॥ వర్గములన్ వధియింపఁ జొచ్చినన్
జేరుగ డేఁడు లేక కడుఁ ॥ జేడ్పడి నారకజీవకోటినా
నారజనీచరుల్ పిడప ॥ నామరశిల్పిని విశ్వకర్మనిన్
జేరి వచించి రిట్లుగృహ ॥ సీమ మొకం డొనరింపుమీ వెసన్. ౧౭

అర్థములు. చేరుగడ=రక్షించుదిక్కు, అమరశిల్పిని=దేవతల శిల్పిని,

తాత్పర్యము

వారు దేవతలను రాక్షసులను మునుల సమూహములను చంపఁబూనఁగా రక్షించు దిక్కులేక లోకము నరకమందుఁ బ్రాణులు బాధపడునట్లు, బాధపడ సాగిరి. ఆ రాక్షసు లావల దేవశిల్పి విశ్వకర్మను బిలిచి మాకు మంచి భవనము త్వరగా నిర్మింపు మని చెప్పిరి.

క. ఓజస్తేజోబలయుతు, లాజేజేశ్రేండ్ల కీవ । యతిహృద్యంబై
రాజిలుదివ్యనికేతన, రాజిన్ నైపుణి రహింప । రచియింతు గదా. ౨౦

అర్థములు. ఓజస్ + తేజస్ + బల యుతులు = వీర్యము తేజస్సు బలముతోఁ గూడిన వారికి, జేజేశ్రేండ్లకున్ = దేవతలయందుఁ బ్రభువులగువారికి, అతి హృద్యము = మిగుల మనోహరము, నైపుణిన్ = చమత్కారమున.

తాత్పర్యము

వీర్యతేజోబలవంతులగు దేవశ్రేష్ఠులకు నీవేకదా మిగుల మనోహరమైన దివ్యగృహములు నిర్మించి యిచ్చువాఁడవు.

ఉ. మాకును నీవ మేరుగిరి । మందరహైమధరాశ్రయంబు సు
శ్రీకము శంకరాలయస । దృక్షము నౌగృహ మొండు దీర్పు మ
స్తోకవిభాయుతంబనఁగఁ । దోడనె యాతఁడు దక్షిణాబ్ధితీ
రాకలితత్రికూటకుధ । రాగ్రము పొల్పగుఁ దద్ద్వితీయమై ౨౧

అర్థములు. మేరుగిరి మందర, హైమ ధర ఆశ్రయము = మేరుపర్వతము మందర పర్వతము హిమవత్పర్వతము నాశ్రయించి యుండునది, సుశ్రీకము = మంచి రచన గలది, శంకరాలయ సదృక్షము = కైలాసముతో సమానమైనది, అస్తోక విభాయుతంబు = అధిక కాంతి గలది, దక్షిణాబ్ధితీర + ఆకలిత = దక్షిణ సముద్రతీరమునందుఁ గల, త్రికూటకుధరాగ్రము = త్రికూటపర్వత శిఖరము, తత్ = ఆ కైలాసమునకు, ద్వితీయమై = రెండవదియై.

తాత్పర్యము

మాకును నీవే మేరుపర్వతమునో మందరపర్వతమునో హిమవత్పర్వతమునో యాశ్రయించి యుండునదియు మంచి రచన గలదియు కైలాసమునకు సమానమైనదియు నగు గృహ మొకటి విశేషకాంతిగల దాని నిర్మింపుమని చెప్పఁగా నతఁడు దక్షిణ సముద్రతీరమునఁ ద్రికూటపర్వత శిఖరము కైలాసమునకు రెండవదియై యున్నది.

సీ. అంబుదసన్నిభం ◊ బై న త న్మధ్యము, కూటంబునను బక్షి ◊ కోటికైన
దుష్ప్రాపమయి దిక్చ◊తుష్కంబునను టంక, సంభిన్న మగుచు యోజనశతంబు
నిడివియు ముప్పదా ◊ మడ వెడలుపు నయి పసిఁడి ప్రాకారముల్ ◊ పైఁడితోర
ణంబుల నింపయి ◊ శంబసాధనునాజ్ఞ, మయుఁడు నిర్మించిన ◊ మహితనగరి
తే. లంక యన నొప్పు దాని ని◊శ్శంకముగను,జొచ్చి యమరావతీపురి◊సురలయట్లు
పాలనము సేయుఁడీ శత్రు◊వర్గములకుఁ, దలఁపునందేని మీరు దుర్ధర్షులగుచు,

అర్థములు. అంబుద సన్నిభము = మేఘముతో సమానము, తన్మధ్యమ కూటంబునను=దాని నడిమి శిఖరమందు, దుష్ప్రాపము=పొందరానిది, దిక్ + చతుష్కంబునను=నాలుగు దిక్కుల, టంకసంభిన్నము=ఉలితోఁ జెక్కఁబడినది, శంబసాధను=ఇంద్రుని యొక్క, దుర్ధర్షులు=తిరస్కరింపరానివారు.

తా త్ప ర్య ము

ఆకాశమున మేఘమువలె నాపర్వత శిఖరములలో నడిమిది పక్షులకైనను బొందరానిది. అంతయెత్తు పక్షులు నెగురఁజాలవు. దానికి నాలుగు ప్రక్కల నులితోఁ మలవఁబడి యున్నది. కావున నెవరైన నెక్కివచ్చుటకు సాధ్యపడదు. అది నూఱామడ పొడుగు ముప్పదామడ వెడల్పుగలదై బంగారు ప్రాకారములు గోపురములు గలదై యున్నది. దానిని బూర్వమున నింద్రునియాజ్ఞచే మయుఁడు నిర్మించెను. ఆ నగరముపేరు లంక. దానియందు మీరు ప్రవేశించి నిశ్శంకముగ దేవత లమరావతియందువలె మీరు విరోధులకుఁ దిరస్కరింపరానివారై పాలనము చేయవచ్చును

క. అని విశ్వకర్మ చెప్పిన, ననుచరసాహస్రయుక్తులై యా రక్షో
జననాథులు చని పరిఖా, కనకగృహాన్విత లంకఁ ◊ గ్రాలిరి సుఖులై.   ౯౧

అర్థములు. అనుచర సాహస్రయుక్తులై=వేలకొలఁది భటులతోఁగూడిన వారై, పరిఖా=అగడ్తలతోడను, కనకగృహ=బంగారిండ్లతోను, అన్విత=కూడిన.

తా త్ప ర్య ము

(అని విశ్వకర్మ చెప్పఁగా వేలకొలఁది భటులతోఁ గూడినవారై యగడ్తలతో, బంగారిండ్లతో నొప్పు లంకకుఁ బోయి సుఖముగా నుండిరి.)

సీ. వా రిట్లు స్వేచ్ఛావి ◊ హారులై వర్తిల్ల, నర్మద యనెడు గం ◊ ధర్వతరుణి
కీర్తి ధీ శ్రీ సమ ◊ మూర్తుల ముగ్వురఁ, దనయల నిచ్చెనా ◊ దనుజులకును
వారును నరుసగ ◊ వారి నుత్తర ఫల్గు, నీ తారఁ బెండ్లాడి ◊ నిర్జరాంబు
జాక్షులతో సుర ◊ లట్లు క్రీడించిరి, మాల్యవంతుం డాత్మ ◊ మహిషి యైన

ఆ. సుందరీసమాఖ్య • సప్తఘ్న దుర్ముఖో, న్మత్తయజ్ఞ కోప • మత్తవజ్ర
ముష్టులను విరూప • దృష్టి విరూపాక్షు, సుతుల ననల యనెడు•సుతనుగనియె

అర్థములు. నిర్జర+అంబుజాక్షులతోన్=దేవతాస్త్రీలతో.

తాత్పర్యము.

ఈ ప్రకారము వారు స్వేచ్ఛగా సంచరింపఁగా నర్మద యనెడి గంధర్వ స్త్రీ, కీర్తి, ధీ, శ్రీలను బోలిన తన ముగ్గురు కొమారితలను ఆ మువ్వురు రాక్షసులకు వరుసగనిచ్చి వివాహము చేసెను. వారు వారిని నుత్తరఫల్గునీ నక్షత్రమందు వివాహమాడి దేవతలు దేవతాస్త్రీలతోఁ గ్రీడించునట్లు క్రీడించిరి. అందు మాల్యవంతుఁడు తన భార్యయగు సుందరి యని పేరుగల దానియందు సుప్తఘ్నుఁడు దుర్ముఖుఁడు ఉన్మత్తుఁడు యజ్ఞకోపుఁడు మత్తుఁడు వజ్రముష్టి విరూపాక్షుఁడు అను కొడుకులను అనల యను పుత్రికను గనెను.

సీ. ప్రాణంబులకుమిన్న•యగు కేతుమతియందుఁ, గనియె సుమాలి య•కంప నాఖ్యుఁ
గాలకార్ముక భాస • కర్ణ సుపార్శ్వుల, సంహ్రాదినిం బ్రఘు • సప్రహస్త
వికటధూమ్రాక్షుల•వికటనీలుండైన, దండుఁ డన్ సుతులను•ద్దండబలుల
రాకఁ బుష్పోత్కట, • కైకసీ కుంభీన, సీ సమాఖ్యలు గల • స్త్రీల నవల

తే. మాలివసుధాఖ్యయనియెడి•మగువయందు, ననిలుననలుని సంపాతి•హరుని గనియె
వీరలె విభీషణునిమంత్రు•లై రహించి, రనల నిట్లు తదీయాన్వ•యంబు పెరిఁగె.

తాత్పర్యము.

సుమాలి యనువాఁడు తన ప్రాణము కంటెఁ బ్రియమగు కేతుమాలియను దానియందు నకంపనుఁడు కాలకార్ముకుఁడు భాసకర్ణుఁడు సుపార్శ్వుఁడు సంహ్రాది ప్రఘసుఁడు ప్రహస్తుఁడు వికటుఁడు ధూమ్రాక్షుఁడు దండుఁడు అను మహా బలవంతులఁ బుత్రులను కాక, పుష్పోత్కట కైకసి కుంభీనసి యను పుత్రికలను గనెను ఆవల మాలి యనువాఁడు వసుధ యను పేరు గల భార్యయందు అనిలుఁడు అనలుఁడు సంపాతి హరుఁడు నను నలువురఁ బుత్రులఁ గనెను. ఈ నలువురే వెనుక విభీషణుమంత్రులైరి. ఈ విధముగ వారి వంశము వృద్ధియయ్యెను.

—*మాల్యవదాదులకు వెఱచి సురలు శివుశరణముఁ జొచ్చుట*—

కవిరాజవిరాజితము. సుతశతకంబునుగూడి నిశాచర•సూరులు మువ్వురు గర్వితులై
హితముఁదలంపక బ్రహ్మవరంబున • నెల్లజగంబుల రేఁగి సదా
గతిగతిఁ ద్రిమ్మరుచున్ ఋషిపన్నగ • కాండములన్ సహశక్రమరు
త్తతులను యక్షుల నేచిరి వేఁచిరి•తాఁచిరిపూఁచి దురాసదులై. ౧౪

అర్థములు. సదాగతిగతిన్=వాయువువలె; పన్నగకాండములన్ = సర్ప సమూహములను, సహశక్ర=ఇంద్రునితోఁడి, మరుత్తులను=దేవతలను, ఏఁచిరి= బాధించిరి, వేఁచిరి=పరితపింపఁ జేసిరి. తాఁచిరి=కొట్టిరి, పూచి=పూని.

తా త్ప ర్య ము

ఆ రాక్షసశూరులు ముప్వురు ననేకపుత్రులతోఁ గూడి గర్వించి మేలు నాలోచింపక బ్రహ్మవరము గలదని విజృంభించి గాలివలె నెందును నడ్డము లేక తిరుగుచు ఋషులను పన్నగులను ఇంద్రునితోఁడి దేవతలను పని పూనికొట్టితపింపఁ జేసి బాధించిరి.

౬వ స ర్గ ము

అంబురుహము. వారలు పెట్టెడి బాధల నెల్ల సు ◆ పర్వకోటులు మానులున్
సైరణ సేయఁగఁ జాలక యెల్లరు ◆ సాధ్వసార్తులు నొక్కటై
మారునివైరిఁ బురారిఁ ద్రినేత్రు ను ◆ మాధవున్ హరునిన్ జగ
త్కారణు మారణు లోకనమస్కృతు ◆ దైవతాధిపు శంకరున్.

అర్థములు. సుపర్వకోటులు = దేవతాసమూహములు, సాధ్వసార్తులు= భయముచేఁ బీడింపఁబడినవారు, మారునివైరిన్ = మన్మథునకు విరోధి యగు వానిని, పురారిన్=మూఁడు పురములు దహించినవానిని, త్రినేత్రున్ = మూఁడు కన్నులు గలవానిని, ఉమాధవున్=పార్వతి భర్తను, జగత్కారణ = ప్రపంచము నకుఁ గారణమైన వానిని, మారణు=లోకసంహారము చేయువానిని.

అంబురుహ వృత్తమునకు నాలుగు భగణములు ర, స, లగములు, పదమూ డవ స్థానంబున యతి.

తా త్ప ర్య ము

దేవతలు మునులు వారు పెట్టెడి బాధలు సహింపలేక భయపీడితులై యందఱొక్కటిగఁ జేరి మన్మథుని జయించి పురములు దహించి మూఁడుకన్నులు గల వానిని ప్రజాపతులలోఁ జేరినవాఁ డగుటచేఁ జగత్తునకు కారణమైన వానిని కాలాగ్ని రుద్రుఁడగుటచే సంహారము చేయువానిని లోకముచేఁ బూజింపఁబడు వానిని దేవతల కధిపతియగువానిని శివుని.

ఉ. చేరఁగ నేగి హస్తములఁ ◆ జేరిచి తొట్రిల మాట భీతిచే
నీరజసూతిదత్తవర ◆ నిర్భరగర్వము పేర్మి దేవతా
వారములం బ్రజావళుల ◆ బాధలు పెట్టిరి భూతకోటికిన్
గూరిచి రెల్లకీడులను ◆ గ్రూరతఁ బేర్చి సుకేశనందనుల్. ౬౬

అర్థములు. తొట్రిలన్=తడబడఁగా, నీరజసూతిదత్త=బ్రహ్మచే నీయఁ బడిన, వర=వరములచే, నిర్భర=అధికమైన, గర్వము పేర్మిన్=పొగరు యొక్క యతిశయముచే.

తా త్ప ర్య ము

సమీపించి రెండు చేతులు జోడించి నమస్కరించి భయముచే మాటతడఁ బడుచుండ బ్రహ్మ యిచ్చిన వరములచే గర్వించి సుకేశుని కుమారులు క్రూరులై దేవతలను మనుష్యులను భూతములను మిగులఁ గీడులపాలు చేయుచున్నారు.

క. దేవా! నాకమువలనన్, దేవతలను దఱిమి వైచి ◆ దేవతలవలెన్
దేవనముల నుపవనముల, వావిరి క్రీడించు చున్న ◆ వార లభీతిన్. ౯౭

అర్థములు. నాకమువలనన్=స్వర్గమునుండి, దేవనములన్=క్రీడలను, ఉపవనములన్=ఉద్యానవనములందు, అభీతిన్=భయములేనివారై.

తా త్ప ర్య ము

(దేవా! దేవతలను స్వర్గమునుండి తఱిమివేసి దేవతలవలె నుద్యానవనములలో నిర్భీతిగాఁ గ్రీడించుచున్నారు.)

శా. నేనే విష్ణుఁడ నేన రుద్రుఁడను నేనే ◆ బ్రహ్మ నే నింద్రుఁడన్
నేనే కాలుడ నేన చంద్రుఁడను నే ◆ నే పాశి నే సూర్యుఁడన్
నేనే యప్పతి నంచు సంగరమదో ◆ న్మేషంబునన్ సర్వలో
కానీకంబుల ఱంపు చేసెదరు భ ◆ ర్గా! మమ్ము రక్షింపవే. ౯౮

అర్థములు. పాశి=యముఁడను, అప్పతి=వరుణుఁడ, సంగరమదోన్మేషంబునన్=యుద్ధమందలి గర్వాతిశయముచే.

తా త్ప ర్య ము

నేనే విష్ణుఁడను నేనే రుద్రుఁడను నేనే బ్రహ్మను ఇంద్రుఁడను నేనేమృత్యుదేవత నేనే నేనే చంద్రుఁడను నేనే యముఁడను నేనే సూర్యుఁడను నేనే వరుణుఁడను నాకంటె వేఱుదేవత లెవ్వరు గలరని యుద్ధమునందు జయింపఁగలమను గర్వాతిశయముచే సమస్త లోకులను బాధపెట్టుచున్నారు భర్గా! మమ్ము రక్షింపుము.

క. క్రూరరూపముఁ గొని యమ, రారిని నమ్మాల్యవంతు ◆ ననుజసమేతున్
బోర వధించి జగంబుల, నారయు మనఁగా సుకేశు ◆ నందలి ప్రేమన్ ౯౯

తా త్ప ర్య ము

క్రూరమైన యాకారమును ధరించిన వాఁడవై తమ్ములతోఁగూడినవాఁడును దేవవిరోధియు నగు మాల్యవంతు యుద్ధమునఁ జంపి లోకముల రక్షింపుమని వేఁడఁగా సుకేశునందలి ప్రేమచే మాల్యవదాదులయందుఁ బక్షపాతముగలవాఁడై,

చ. హరుఁడు వచించె నో యమరు ♦ లార! యవధ్యులు వారు నాకు, నేఁ
బోరిగొన నేర, నైన నొక ♦ పోఁడిమి చెప్పెద వారు ద్రుంగఁగా
హరి శరణంబు వేఁడుఁడు, మ ♦ హావిభుఁ డాతఁడు వారినెల్ల రన్
బరువడిఁ ద్రుంచుఁ బొం డనఁగ ♦ వారు జయోక్తులు పల్కుచున్ వెసన్. ౧౦౦

అర్థములు. అవధ్యులు = చంపరానివారు, వారిని నను నేజయింపలేనని యర్థముగాదు; నేను వారిని జంప నిష్టపడను, పోఁడిమి = ఉపాయము, మహావిభున్=మీకును నాకును గొప్ప ప్రభువు.

తాత్పర్యము

శివుఁ డిట్లనియె. దేవతలారా! వారిని నేను జంపశక్తుండనుగాను. వారినినేను జంపలేను. వారియందు నాకుఁగల ప్రేమయే కారణము. అయినను వారు చచ్చుటకు మీకొక యుపాయము చెప్పెదను. విష్ణువునకు మీరు శరణాగతులు గండు. విష్ణువునకు శరణాగతుల రక్షించుట దీక్ష గావున మీశరణాగతి వ్యర్థము పోదు. ఆమహాప్రభువు వారి నందఱ శీఘ్రముగ వరుసపెట్టి చంపును పొండు అనిచెప్పఁగా వారు జయజయ యంచు త్వరగా.

—* దేవతలకు విష్ణు వభయ మిచ్చుట *—

క. చని శంఖచక్రధరునిం, గని తమదుఃఖంబు లెల్లఁ ♦ గమలాధవుతో
మనవి యొనర్చిరి దేవా!, వినవే మాపడెడిపాట్లు ♦ విశ్వశరణ్యా! ౧౦౧

అర్థములు. శంఖచక్రధరునిన్=ఎవరు శరణు అందురో, ఆయుధముల వెదకుకొనుచుఁ బోయి యాలస్యము చేయక వెంటనే వారి రక్షింపవలయునని శంఖచక్రాద్యాయుధముల సదా ధరించియుండువానిని, కమలాధవుతోన్ = లక్ష్మీవల్లభునితో, విశ్వశరణ్యా=ప్రపంచరక్షకా.

తాత్పర్యము

(పోయి, శంఖచక్రధరు లక్ష్మీవిభుని శ్రీమహావిష్ణునిఁజూచి, దేవా! విశ్వశరణ్యా! మేము పడుచున్న బాధలు వినవే యని తమ దుఃఖములన్నియు మనవి చేసిరి.)

సీ. అగ్నిత్రయముఁ బోలు ♦ వసువులు ముగురు సు, కేశుని సుతులు సురేశవైరు
లల త్రికూటాద్రి లం ♦ కాఖ్యపురంబును రాజధానిఁగఁ గొని ♦ క్రాలువారు
కమలజువరమున ♦ గర్వించి దర్పించి, కావు సేసెద రయ్య ♦ లోకములను
మాదుఃఖముల నెట్లు ♦ మనవి యొనర్తుము, త్రుంపవే వారలఁ♦దూర్ణముగను

ఆ. నీవ మాకు దిక్కు ♦ నిఖిలలోకేశ్వర!; శరణ మీవ భూత ♦ చయశరణ్యా!
యొకఁడీవు దక్క ♦ దిక్కెవ్వరును లేరు, మాభయంబుఁ బాపు ♦ మాకశత్ర.

అర్థములు. కాకు=కలఁతనొందినది, మాకళత్ర=లక్ష్మీదేవి భార్యగాఁ గలవాఁడా.

తాత్పర్యము

(నిఖిలలోకేశ్వరా! త్రేతాగ్నులవంటి రాక్షసులు ముగ్గురు. సుకేశుని కొడుకులు. దేవతలకు విరోధులు-ఆ త్రికూట పర్వతము మీఁద లంకయను పట్టనమును రాజధానిఁగాఁజేసికొని యున్నవారు. బ్రహ్మవరమున గర్వించి, లోకములను బీడించుచున్నారు. మా దుఃఖముల నేమని మనవి యొనర్చెదము? వారలను శీఘ్రముగాఁ ద్రుంపుము. నీవే మాకు దిక్కు. నీవే శరణమవు. నీకంటె మాభయమును బోఁగొట్టఁగల రక్షకు లితరులెవరులేరు)

క. మంచు విరియించురవిగతిఁ, ద్రుంచి నిశాచరుల హితుల ♦ తో బంధులతో
నించి జగంబుల ముదమునఁ, బంచాయుధహస్త! మమ్ముఁ ♦ బాలింపుమనన్

అర్థములు. పంచాయుధహస్త=ఐదాయుధములను జేతఁగలవాఁడా, విల్లు=శార్ఙ్గమ్ము, చక్రము=సుదర్శనము, శంఖము=పాంచజన్యము, కౌమోదకి=గద, ఖడ్గము=నందకము-ఈ యైదాయుధముల ధరించిన ఫలము సార్థకము చేసికొనుము అని భావము.

తాత్పర్యము

(సూర్యుఁడు మంచును నశింప జేయునట్లు హితులతో బంధువులతో రాక్షసులను సంహరించి, జగములను నానందమున ముంచి, మమ్ముఁ బాలింపుము-అని ప్రార్థింపఁగా.)

ఉ. వారలభీతిఁ దీర్చి నవ ♦ వారిజలోచనుఁ డిట్లు పలుకు న
వ్వారల నే నెఱుంగనె శి ♦ వాధవ లబ్ధవరప్రమత్తునిన్
వీరు సుకేశు నయ్యసురు ♦ పెద్దకుమారుని మాల్యవంతునిన్
నీరజగర్భదత్తవర ♦ నిష్ఠురశీలుని సానుజన్మునిన్ ౧౦౪

అర్థములు. నవవారిజలోచనుఁడు=క్రొత్త తామర పూవులవంటి కన్నులు గలఁవాఁడు, ఇది రక్షింపఁదగినవారు దొరకిరిగదా యను సంతోషమును దెలుపును. శివాధవ=పార్వతీపతియగు శివునిచే, లబ్ధ=పొందఁబడిన, వర=వరములచే, ప్రమత్తునిన్=మిగుల మదించిన వానిని, నీరజగర్భదత్తవర=బ్రహ్మచే నీయఁబడిన వరములుగల, నిష్ఠురశీలుని=కఠినస్వభావుని, సానుజన్మునిన్=తమ్ములతోఁ గూడిన వానిని.

తాత్పర్యము

వారల కభయహస్తమిచ్చి వారిభయము తొలఁగఁజేసి క్రొందామరలఁబోలిన కన్నులుగల విష్ణుమూర్తి యిట్లనియె. దేవతలారా! శివునిచే వరములఁబొంది గర్వించ

చిన సుకేశుని, బ్రహ్మచే వరములు పొందిన కఠినశీలుఁడగు వానిని, తమ్ములతో గూడిన మాల్యవంతుని నే నెఱుఁగనాయేమి ?

చ. తనుకోలఁదుల్ దలంపక ను ♦ దంబున రేఁగి చరించు దుష్టులన్
విమతుల రాక్షసాగ్రణుల ♦ వే వధియించెదఁ గ్రమ్మఱుండు మో
దమునను మీరు మీ నిలుచు ♦ తావులకున్ విగతామనస్యులై
యమర వరేణ్యులార! యన ♦ హర్షరసోల్లసితాంతరంగులై. ౧౦౫

అర్థములు. తమకోలఁదులు=తమశక్తి సామర్థ్యములు, విమతులన్=విరోధులను-విరుద్ధమగు నభిప్రాయము గలవారిని, విగతామనస్యులై = బాధలేనివారై, 'పీడా బాధా వ్యథా దుఃఖ మామనస్యం ప్రసూతిజమ్-ఆమనస్యము-నా- అమానస్యము=ఇది మనఃకష్టమునకుఁ బేరు,' హర్షరస=సంతోషరసముచే, ఉల్లసిత= మిగులఁ బ్రకాశించు, అంతరంగులై=హృదయముగలవారై.

తాత్పర్యము

తమశక్తిసామర్థ్యము లేమాత్రమో, బ్రహ్మరుద్రాదుల వరములుతమ్మెంత మాత్రము కాపాడఁ గలవో యది యాలోచింపక గర్వముచే విజృంభించి తిరుగు దుష్టులను మీ విషయమున విరుద్ధాభిప్రాయము గల శత్రువులను రాక్షసశ్రేష్ఠులను నేను జంపెదను. మీమీ స్థలములకు మీరు పొండని చెప్పఁగా వారు దుఃఖమును వదలి సంతోషించినవారై.

క. విష్ణుని బ్రభవిష్ణుని రో, చిష్ణు నరినిరాకరిష్ణు ♦ జిష్ణున్ బలవ
ర్థిష్ణుని నలంకరిష్ణు స,హిష్ణుని నిజభక్తలోక ♦ హితవర్తిష్ణున్. ౧౦౬

అర్థములు. విష్ణుని=సర్వవ్యాపిని, ప్రభవిష్ణుని = కోరినప్పుడు కోరిన రూపముతో జనించు వానిని, రోచిష్ణున్=ప్రకాశించు స్వభావము గలవానిని, అరి=శత్రువులను, నిరాకరిష్ణున్=తిరస్కరించు స్వభావము గలవానిని జిష్ణున్= జయించు స్వభావము గలవానిని, బలవర్థిష్ణున్=బలముచే వృద్ధిపొందు స్వభావము గల వానిని, అలంకరిష్ణున్ అలంకరించుకొను స్వభావము గలవానిని, సహిష్ణునిన్= సహనము గలవానిని, నిజభక్తలోక=తనభక్తులగు జనములకు, హిత = మేలగు రీతిగ, వర్తిష్ణున్=వర్తించు స్వభావము గలవానిని.

తాత్పర్యము

'అజాయమానో బహుధావిజాయతే' యన్నట్లు జన్మములు లేకున్నను భక్తుల నిమిత్తమైపుట్టు స్వభావము గలవానిని, ప్రకాశించు వానిని, శత్రువులఁ దిరస్కరించు వానిని, గెలుచు స్వభావము గలవానిని, బలముచే వృద్ధినొందు వానిని,

అలంకరించుకొను స్వభావము గలవానిని, భక్తుల యపరాధముల సహించువానిని, తనభక్తులకు మేలగు మార్గమున వర్తించువానిని, విష్ణుదేవుని.

చ. తెలచుచు మ్రొక్కుచున్ మునులు ♦ దేవతలుం దమవీడుపట్లకై
యెలమిఁ జనంగ నయ్యమర ♦ వృత్తమెఱుంగుచు మాల్యవంతుఁడున్
బలియురఁ దమ్ములం బిలువఁ ♦ బంచి వచించెను దమ్ములార! మీ
రలు వినలేదె వార్తయమ ♦ రప్రముఖాచరితంబు నిశ్చ్యోడన్. ౧౦౭

అర్థములు. తెలచుచున్= పొగడుచు, ఎలమిన్=సంతోషముతో, అమర వృత్తము=దేవతల వర్తనము, అమరప్రముఖ+ఆచరితంబు = దేవ శ్రేష్ఠులచే గావింపఁబడినది.

తాత్పర్యము

పొగడుచు నమస్కరించుచు మునులు దేవతలు సంతోషముతో వారి వారి స్థలములకుఁ బోయిరి. దేవతలచర్య యంతయుఁ దెలిసికొని మాల్యవంతుఁడు బలవంతులగు తన తమ్ములఁ బిలిపించి ఇట్లు చెప్పెను. తమ్ములారా! దేవతాశ్రేష్ఠులు చేసిన కార్యము మీరు వినలేదా?

—* మాల్యవంతుఁడు సురలపై దండెత్త నాలోచించుట *—

చ. సురలును మానులున్ హరునిఁ ♦ జూడఁగ నేగి సుకేశు నందనుల్
వరబలదర్పితుల్ పఱచు ♦ పాటుల నేమని యుగ్గడింప మా
యిరవుల నుండుటే కడిఁది ♦ యింకఁ ద్రిలోచన! వారి నెల్లరం
బొరిగొనుమీ జగంబు హిత ♦ ముం దలపోసి పురాసురాహితా! ౧౦౮

అర్థములు. ఉగ్గడింపన్=చెప్ప, ఇరవులన్ = స్థానములందు, కడిఁది= కష్టము, పొరిగొనుమీ=చంపుమా.

తాత్పర్యము

(దేవతలును, మునులు, శివునిఁ జూచుటకుఁ బోయి, సుకేశుని కొడుకులు వరబలమున గర్వించి, మమ్ముఁ బెట్టు బాధల నేమని చెప్పగలము మా స్థానములందుండుటే కష్టము-త్రిపురాసురాంతకా! లోకహితము నెంచి వారి నందఱఁ బొరిగొనుము.)

క. అని విన్నవింప శివుఁడును, దనహస్తములన్ విదిర్చి ♦ తల యాడఁగ ని
ట్లనె నట వారలతో నో, యనిమిషవరులార! యాసురాధిపుల నాకున్ ౧౦౯

అర్థములు. హస్తములన్ విదిర్చి=చేతులు విదలించి, తలయాడఁగన్= తల నడ్డముగాఁ ద్రిప్పి, తన యాశ్రితులను జంపుమని దేవతలు చెప్పినమాట విని

సహింపలేక తన యనంగీకారమును, తలయడ్డముగా నాడించి చేతులు విదర్చి చూపెనని భావము. మిక్కిలి యసహ్యమగుటచే నోటఁ జెప్పుటయేగాక దేహాభినయముతోను దెలిపెను.

తా త్ప ర్య ము

(అని విన్నవింపఁగా, రుద్రుఁడును, దలనడ్డముగాఁద్రిప్పి చేతులు విదలించుచు వారలతో నిట్లనెనఁట, ఓ దేవతలారా! యా రాక్షసులను నాకును.)

ఉ. త్రుంపఁగ రాదుగాని యలదుష్టులు ♦ త్రుంగు నుపాయ మొండు భా
  షింపుదు శంఖచక్రధరు ♦ శ్రీరమణీరమణున్ ముకుందు సే
  వింపుఁడు భక్తిమైశరణు ♦ వేఁడిన రక్తి జనార్దనుండు దీ
  పింపఁగ వారిఁ ద్రుంచి సుర ♦ బృందము డెందము కుందు మాన్పెడిన్. ౧౧౦

అర్థములు. త్రుంపఁగరాదు = చంపుటకు సాధ్యపడదు, 'విషవృక్షోపి సంవర్ధ్య స్వయం ఛేత్తు మసాంప్రతమ్' తాను బెంచిన విషవృక్షమును దానుగొట్టరాదను న్యాయము ననుసరించియని భావము, త్రుంగు=చచ్చు, డెందము కుందు= మనోవేదన.

తా త్ప ర్య ము

(చంపుటకు సాధ్యపడదు—కాని యా దుష్టులు చచ్చుట కుపాయ మొకటి చెప్పెద-శంఖచక్ర ధరు శ్రియఃపతిని ముకుందు నాశ్రయింపుఁడు-భక్తితో శరణు వేఁడినచో జనార్దనుఁడు వారలఁ జంపి దేవతల దుఃఖమును బోఁగొట్టఁగలఁడు.)

క. గౌరీపతి యిటు చెప్పిన, నారాయణు నిలయమునకు ♦ నరిగి ముని మరు
  ద్వారము లింతయుఁ జెప్పిన, వారల వెఱమాన్ప శౌరి ♦ వఱలిన ప్రీతిన్. ౧౧౧

అర్థములు. నారాయణు నిలయమునకున్=నారాయణుఁడున్న ప్రదేశమునకు, ముని మరుత్+వారము=మునులయు దేవతలయు సమూహము, వెఱ= భయము.

తా త్ప ర్య ము

(అని గౌరీపతి చెప్పఁగా, మునులయు, దేవతలయు సమూహముశ్రీమన్నారాయణుఁడున్న తావునకుఁబోయి యీ సమాచారమంతయు నివేదింపఁగా, శ్రీహరి వారల వెఱపు దీర్చి ప్రేమతో.)

క. సురలార! సురారుల నేఁ, బరిమార్చెద మీకు సుఖముఁ ♦ బరఁగించెద మీ
  యిరవులకు యథాసుఖముగ, నరుగుండా యని వచించె ♦ నంట నే వింటిన్.

అర్థములు. పరిమార్చెదన్=చంపెదను, ఇరవులకు=గృహములకు, యథాసుఖముగన్=సుఖమగునట్లు, అరుగుఁడా=పొండు.

తాత్పర్యము

(దేవతలారా! రాక్షసులను నేను సంహరించెదను. మీకు సుఖము గలిగించెద—మీరు మీయిండ్లకు సుఖముగాఁ బొండు అని చెప్పెనఁట. నేనువింటిని.)

ఆ. అభయ మిచ్చె నఁట సురావళి కెల్లను, మనలఁ జంపఁ బ్రతినఁ గొనియెనఁట
చక్రి యిపుడు మనకుఁ జలుపఁగ నర్హమౌ, తంత్రమెద్ది చెపుఁడు తమ్ములారా!

అర్థములు. చక్రి=విష్ణువు,

తాత్పర్యము

(చక్రి దేవతలకందఱ కభయమిచ్చెనఁట—మనలఁ జంపఁ బ్రతినపూనెనఁట. తమ్ములారా! మన మిపుడు చేయఁదగిన కార్యమేమి? చెప్పుడు.)

సీ. ఖండించెను హిరణ్య ♦ కశిపునంతటివానిఁ, గాలనేమిని బంచెఁ ♦ గాలుపురికి
హ్రాదిని యయ్యె సం ♦ హ్రాదశైలమునకు, నముచి మహాబలు ♦ నామమణఁచె
శుంభ నిశుంభుల ♦ జృంభణంబు నణఁగించె, హార్దిక్య మర్దించె ♦ నమితశౌర్యు
యమళార్జునులసమూ ♦ లము రూపుమాపెను, బహుమాయి రాధేయు ♦ భంగపఱిచె
తే. సత్త్వవంతుల ధీరుల ♦ సాహసికుల, నఖిలశస్త్రాస్త్రనిపుణుల ♦ నసురవరుల
దానవుల సంహరించె దో ♦ ర్దర్పమునను, బీతవసనుండు సామాన్యుఁ ♦ డే తలంప

అర్థములు. హ్రాదిని=వజ్రము, సంహ్రాదశైలమునకు=సంహ్రాదమను పర్వతమునకు, బహుమాయి=అనేక మాయలు గలవానిని. రాధేయున్=వీఁడొక రాక్షసుఁడు, రాధాయను రాక్షసికొడుకు, పీతవసనుండు=పచ్చని వలువగలవాఁడు.

ఇందుఁ జెప్పఁబడిన రాధేయుఁడు కర్ణుఁడుగాఁ బుట్టిన రాక్షసుఁడని తోఁచుచున్నది. పూర్వము సహస్రకవచుఁ డని యొక రాక్షసుఁడు గలఁడు. వాఁడు తనకు వేయి కవచములు కావలయుననియుఁ బదివేల సంవత్సరములు తపస్సు నిర్విఘ్నముగాఁ జేసిన వాఁడొక కవచము తెగఁగొట్ట సమర్థుఁడు కావచ్చునని బ్రహ్మను వరము గోరెను. ఆయనయు నట్లే యిచ్చెను. వానిని జంప నరనారాయణులు పూని బదరికాశ్రమమందుఁ దపస్సు చేయసాగిరి. పదివేల సంవత్సరము లొకరు తపస్సు చేయుచుండఁగాఁగా మఱియొకరు సహస్రకవచునితో నంతకాలముయుద్ధము చేయుచు నొక్కొక్క కవచమును మార్చిమార్చి తెగఁగొట్టిరి. ఒక్కకవచముతో వాఁడు తప్పించుకొని పారిపోయి కాలాంతరమున సహజ కవచకుండలుఁడై కర్ణుడై పుట్టెను.

తాత్పర్యము

(హిరణ్యకశిపు నంతటివానిని ఖండించెను. కాలనేమిని గాలునిపత్తనమునకుఁ బంపెను. సంహ్రాదుని సంహరించెను. మహాబలుఁడగు నముచి నామ మణఁచెను.

శుంభ నిశుంభులఁ గెడపెను. హార్దిక్యుని మర్దించెను. యమళార్జునుల సమూలముగ నాశము చేసెను, అనేక మాయలుగల రాధేయునిఁ ద్రుంగించెను. సత్త్వవంతులను ధైర్యవంతులను సాహసవంతులను, శస్త్రవంతులను బాహుబలమున దైత్య దానవుల సంహరించెను. పీతాంబర ధరుఁడగు శ్రీహరి సామాన్యుఁడా!)

క. ఎల్లరు మాయాకుశలులు, నెల్లరు శతయజ్ఞకర్త ◊ లెల్లరు శూరుల్
పొల్లునడిపోయి రెందఱొ, యల్లోకాధ్యక్షుచేత ◊ నసుర వరేణ్యుల్. ౧౧౫

అర్థములు. పొల్లువడి పోయిరి=నిర్వీర్యులయి చచ్చిరి.

తా త్ప ర్య ము

(మాయలయందు నేర్పరులు, నూఱు యజ్ఞములు చేసినవారు, శూరులునగు రాక్షసశ్రేష్ఠులందఱు నాలోకాధ్యక్షుఁడగు విష్ణువుచేత నిర్వీర్యులయిచచ్చిరి.)

ఉ. యోజనచేసి యింతయు సు ◊ యోగ్యముఁ గార్యముఁ జెప్పరయ్య యే
యోజఁ జరింతువార మన ◊ నుగ్రబలాఢ్యుని నగ్రజాతు స్వా
రాజును నశ్వులట్లు గని ◊ భ్రాతలు పల్కిరి లోకపాలకో
ద్వేజనకారణా! మనము ◊ వేఁడిమిఁ జూపుటె కార్య మిత్తఱిన్. ౧౧౬

అర్థములు. స్వారాజును=స్వర్ + రాజు=స్వారాజు, ఇంద్రుని, అశ్వులు=అశ్వినీ దేవతాకుమారులు, వీరు సూర్యునకు అశ్వస్త్రీ రూపము ధరించిన భార్యయందు జనించినవారు. ఇరువురు, లోకపాలకోద్వేజనకారణా=దిక్పాలురను గలఁతపొందింపఁ గారణమైన వాఁడా, వేఁడిమి=ప్రతాపము, అనఁగా మనము సంధికిఁ బోరాదు. దేవతలతో మన విరోధము మానరాదు.

తా త్ప ర్య ము

(కావునఁ జక్కఁగా ఆలోచించి మన మనుసరింపఁదగు గార్యము జెప్పుఁడని అన్నయనఁగా- "మన మీసమయమున బ్రతాపము బ్రకటించుటయే కార్య" మని మహాబలాఢ్యుఁడగు అన్నకుఁ దమ్ములు, ఇంద్రునికి అశ్వినీ దేవతలవలె విన్నవించిరి.)

చ. చదివితి మెల్ల వేదములు ◊ శాస్త్రములున్ మితిమీఱు భాగ్య సం
పదలను నోలలాడితిమి ◊ భద్రగతిం గొదలేక దానముల్
విదితముగా నొసంగితిమి ◊ లెస్స నిరామయమైన యాయువున్
బొదలెద మర్థ్యాకర్మములు ◊ పూర్ణముగా నొనరించి వెండియున్. ౧౧౭

అర్థములు. కొద=కొఱఁత, విదితముగాన్=ప్రసిద్ధముగా, నిరామయము=బాధలేని.

తాత్పర్యము

వేదములు శాస్త్రములు నన్నియుఁ జదివితిమి అపరిమిత భాగ్యము నందుఁ దేలాడితిమి. కొఱఁతలేక చేయవలసిన దానము లన్నియుఁ బ్రసిద్ధముగాఁ జేసితిమి. మన యాయువునకు బాధ లేదు. చిరకాలము జీవింపఁ గలవారము. మనకు యోగ్యములైన ధర్మము లన్నియుఁ జేసితిమి.

క. అనివార్యసురాంభోనిధి, ఘనశస్త్రవితానములనె ◊ కలఁగించి మఱిన్
దునిమి యరాతుల నెల్లర,మనుచో మరణంబు భయము◊మనకుం గలదే? ౧౮౭

అర్థములు. అనివార్య=వారింపరాని, సురాంభోనిధిన్=దేవత లను సముద్రమును, ఘన=గొప్పవగు, శస్త్రవితానములనె=ఆయుధసమూహముచే,కలఁగించి=కలఁతపెట్టి, అరాతులన్=శత్రువులను, మనుచోన్=బ్రదుకుచుండఁగా.

తాత్పర్యము

దేవతలను సముద్రమును నాయుధసమూహముచేఁ గలఁతపఱిచి శత్రువుల నందఱిఁ జంపి బ్రదుకు మనకు మరణభయ మెక్కడిది? మనలఁ జంపువా రెవరు?

క. నారాయణుఁడును శక్రుఁడు, గౌరీనాథుఁడును దండ ◊ కరుఁడును మనలన్
బోర నెదుర్కొందురె మన, పై రన్నన్ వణఁకుచుంద్రు◊భీతి సతంబున్. ౧౮౯

తాత్పర్యము

(నారాయణుఁడును, నింద్రుఁడు, రుద్రుఁడు, యముఁడు మన పై రనినభయముతో సదా వణఁకు చుందురు. అట్టివారు మనలను యుద్ధముగో నెదుర్కొన గలరా?)

ఉ. దోషము లేదు శౌరియెడఁ ◊ దోయజలోచను మానసంబు వి
ద్వేషులదోష హేతువునఁ ◊ దీరు చెడెంజుమి గాన నిప్పుడా
దూషణశీలురగన్ సురలఁ ◊ దూర్ణమ హింసయొనర్చి వారి ని
శ్శేషులఁ జేసి వచ్చుటయె ◊ చిత్తములన్ శుభమంచుఁ దోఁచెడిని. ౧౨౦

తాత్పర్యము

విష్ణువునందు దోషము లేదు. ఆయన మన కపకారము చేసినవాఁడు కాఁడు. చేయఁదలఁచినవాఁడునుగాఁడు కాని మన పగవారు మనపై దోషములు చెప్పుటచే నాయనమనస్సు మాఱినది. కావున మనమై విష్ణువుమీఁదికిఁ బోవలసిన పని లేదు. మనకు విరోధులు దేవతలు వారీ కుట్రచేసిరి కావున వారిపై దండెత్తిపోయివారిని సమూలముగ దేవతయనువాఁడు లేకుండునట్లు నాశముచేసి వచ్చుటయే తగిన కార్యమని తోఁచుచున్నది.

చ. అనుచు సుమాలి మాలు లిటు ◊ లాడిన వల్లె యటంచు దేవతా
జనములమీఁద దాడి చన ◊ సర్వసురారుల కాజ్ఞ చేయుచున్
మొనలను దీర్పఁగా నసుర◊ముఖ్యుఁడు సైన్యపులన్ విధించినన్
ఘనతరశౌర్యధుర్యులు ర◊ణంబునకున్ జతనంబు సేయుచున్. ౧౨౧

అర్థములు. సర్వసురారులకున్=రాక్షసుల కందఱకు, మొనలను = సేనా వ్యూహములను, సైన్యపులన్=సేనానాయకులను, జతనంబు=ప్రయత్నము.

తాత్పర్యము

మాలి సుమాలు లిటు చెప్పఁగా సరి యని మాల్యవంతుఁ డంగీకరించి సేనానాయకులఁ బిలిపించి దేవతలమీఁద దండెత్తిపోవుటకు రాక్షసుల నందఱను సేనలను వ్యూహములుగా నేర్పాటు చేయవలసినదని యాజ్ఞ చేయఁగా వారుయుద్ధ ప్రయత్నము చేయఁగా.

—* మాల్యవంతుఁడు దేవతలమీఁదికి యుద్ధంబునకుఁ బోవుట *—

చ. ఉరవడి స్యందనద్విపహ ◊ యోష్ట్రఖరర్ష భశింశుమారభీ
కరపవనాశనాండరుహ ◊ కచ్ఛపమత్స్యసుపర్ణ తుల్యవి
ష్కిరకిరినక్రఖడ్గవర ◊ సింహపృదాకుముఖాన్యసత్త్వముల్
పరఁగఁగ వాహనంబులుగ ◊ స్వర్గము ముట్టఁగ దాడి వెట్టినన్. ౧౨౨

అర్థములు. స్యందన=రథములు, ద్విప=ఏనుఁగులు, హయ=గుఱ్ఱములు, ఉష్ట్ర=ఒంటెలు, ఖర=కంచరగాడిదలు, ఋషభ=ఎద్దులు, శింశుమార=నీరికోళ్లు, భీకర=భయము గలిగించు, పవనాశన=సర్పములు, అండరుహ=పక్షులు, కచ్ఛప=తాఁబేళ్ళు, మత్స్య=చేఁపలు, సువర్ణతుల్యవిష్కిర=గరుడునితో సమానములైన పక్షులు, కిరి=పందులు, నక్ర=మొసళ్లు, ఖడ్గ=ఖడ్గమృగములు, వరసింహ=శ్రేష్ఠములైన సింహములు, పృదాకు=నాగములు, ముఖ=మొదలుగాఁ గల, అన్యసత్త్వముల్=ఇతరజంతువులు, ముట్టఁగన్=ముట్టడి వేయుటకు.

తాత్పర్యము

(రథములు, యేనుఁగులు, గుఱ్ఱములు, లొట్టియలు, కంచరగాడిదెలు, ఎద్దులు, నీరికోళ్లు, పాములు, పక్షులు, తాఁబేళ్లు, చేఁపలు, గరుడునితో సమానమయిన పక్షులు, పందులు, మొసళ్ళు, ఖడ్గమృగములు, సింహములు, నాగములు మొదలగు నితర జంతువులు వాహనములుగాఁ గొని స్వర్గమును ముట్టడి వేయుటకు దాడి వెట్టఁగా.)

సీ. లంకకుఁ జేకుఱు◊లయము భావించి లం◊కను వసించెడి భూత◊గణము లెల్ల
దైవతంబులతోడ ◊ దైన్యంబునొందుచు, వానితోఁ బురమును ◊ బాసిపోయె
సురవైరినాశంబు ◊ సూచించుచును మింట ధరణిని జెలఁగె ను◊త్పాతకములు
కాలేరితంబులై ◊ కడుభీకరంబులై, యెమ్ములు వేఁడి ర ◊ క్తమ్ముతోడ
ఆ. వృష్టిగురిసె శైల ◊ బృందంబు లురియాడెఁ, బొంగి పొరలి వేల◊క్రమింగె జలధి
యుఱుమినట్లు వఱదు◊లఱచె భీమంబుగ, గ్రద్దపిండు మీఁదఁ◊దద్దతిరిగె. ౧-౨౩

అర్థములు. కాలేరితంబులై=కాలముచేఁ బ్రేరింపఁబడినవై, ఉరియాడెన్= చలించెను. వేల=చెలియలికట్ట, వఱదులు=నక్కలు.

తాత్పర్యము

లంక నాశము కాఁగలదని తెలిసి లంకయందు వసించు భూత సమూహము లన్నియు గ్రామదేవతలతోడ దుఃఖపడుచు లంక వదలిపోయెను. రాక్షసులు నాశమగుదు రని సూచించు నుత్పాతములు భూమియందు నాకాశమందుఁ గాన వచ్చెను. మృత్యువుచేఁ బ్రేరింపఁబడి భయంకరముగ నెముకలు వేఁడి నెత్తురు వానగాఁ గురిసెను. కొండలు కదలెను. సముద్ర ముప్పొంగి చెలియలికట్ట దాఁటి వచ్చెను. నక్కలు మేఘము లుఱిమినట్లు ధ్వనించెను. గ్రద్దలు రాక్షసుల మీఁదఁ దిరిగెను.

క. కాలగతి నసురసేనా, జాలముపైఁ దిరిగె రక్త ◊ చరణములు కపో
తాళులు గూసెను గాకబి,డాలంబులజాల ముద్భటంబగు ధ్వనులన్. ౧-౨౪

అర్థములు. కాలగతిన్ = మృత్యుప్రేరణముచే, రక్తచరణములు=ఎఱ్ఱని కాళ్లు గలవి, కపోతాళులు=పావురముల గుంపులు, కాక=కాకులయు బిడాల= పిల్లులయు, జాలము=సమూహము.

తాత్పర్యము

మృత్యువు సూచించుచు రాక్షససేనలమీఁద నెఱ్ఱ కాళ్లుగల పావురములు దిరిగెను. కాకులు పిల్లులు భయంకరముగ గట్టిగఁ గూసెను.

చ బలముగఁ గాలపాశచయ ◊ బద్ధులు కావుట మాల్యవత్సుమా
లులు నల మాలి యేమియును ◊ లోఁగక జంకక కీడుగూర్చు చి
హ్నాలఁ గనియున్ బలంబునకు ◊ నంతటికిన్ మునుమున్నవోయి రు
జ్జ్వలదహనాకృతిం దనుజ ◊ వర్యులు నెన్నడి వచ్చుచుండఁగన్ ౧-౨౫

అర్థములు. కాలపాశచయబద్ధులు=యముని పాశసమూహములచే గట్టఁబడినవారు, కావుటన్=అగుటచే, లోఁగక=లొంగిపోక, అధైర్యపడక, ఉజ్జ్వలదహనాకృతిన్=మండు నగ్నివలె.

తాత్పర్యము

విడిపించుకొనుటకు సాధ్యము కానట్లు యమునిపాశములచేఁ గట్టఁబడిన వారగుటచే మాల్యవంతుఁడు, సుమాలి, మాలి యనువారు అపాయము కలిగించు శకునములఁ జూచియు నధైర్యపడక సందేహింపక తమవెంట రాక్షసులు రాఁగా సేనల కన్నిటికి ముందు ముందుగ మండు నగ్నివలెఁ బోయిరి.

ఆ. మాల్యవంతమునకు॰మాద్రిగా యచలుఁడౌ,మాల్యవంతు బలసి॰మహిమనెలసి
యసుర లందఱేగి ॰ రబ్జసూతిని గొల్చు, నాకవాసు లనఁగ ॰ జోక మెఱసి.

అర్థములు. మాద్రి=మాదిరి, సమానము, బలసి=చుట్టుకొని, అబ్జసూతిని=బ్రహ్మను, నాకవాసులు=దేవతలు, జోక=ఉత్సాహము.

తాత్పర్యము

(మాల్యవంతముతో పాటియయి ధీరుఁడైన మాల్యవంతుని చుట్టుకొని రాక్షసు లందఱున, బ్రహ్మను సేవించు దేవతలవలె నుత్సాహముతో నేగిరి.)

క. మాలికి వశగతమై విబు, ధాలయవిజిగీష దాన ॰ వానీకము మే
ఘాళులపోలికఁ గర్జిలఁ, దూలించుచు దిక్తటంబు॰తోడీఁదోడి చనియెన్. ౧౨౭

అర్థములు. వశగతమై=స్వాధీనపడి. విబుధాలయ విజిగీషన్ = స్వర్గమును గెలుచు కోరికచే, దానవానీకము=రాక్షస సమూహము మేఘాళుల పోలికన్=మేఘసమూహములవలె, తోడీఁదోడిన్=వేగముగ.

తాత్పర్యము.

రాక్షససేన స్వర్గమును గెలువవలయునను కోరికతో మాలికిక వశమై దిక్కులు తూలిపోవ మేఘములవలె గర్జించుచు వేగముగఁ బోయెను.

—* విష్ణువు దేవతలకుఁ దోడ్పడి రాక్షసులఁ బాఱఁదోలుట *—

చ. దనుజసమూహముల్ విబుధ॰ధామముపైఁ జనుదెంచుటన్ సురల్
పనిచినమాత దెల్పుటయు ॰ భండనతత్పరుఁడై రమాధవుం
డనుపమకోటిసూర్యనిభ ॰ మౌ కవచంబును దొడ్గి భీమ రో
పనిచయపూర్ణతూణపరి ॰ భాసితుఁడై కటిసూత్రయుక్తుఁడై. ౧౨౮

అర్థములు. విబుధధామము=స్వర్గము, భండనతత్పరుఁడై=యుద్ధమునందు నాసక్తిగలవాఁడై, భీమ=భయంకరమైన, రోపనిచయ = బాణసమూహములచే, పూర్ణ=నిండిన, తూణ=అంబులపొదులచే, పరిభాసితుఁడై=మిగులఁ బ్రకాశించు వాఁడై, కటిసూత్ర యుక్తుఁడై=దట్టి కట్టినవాఁడై.

తాత్పర్యము

రాక్షససేనలు స్వర్గము మీఁదికి వచ్చినవార్త దేవతలు పంపిన దూత తెలుపఁగా విని లక్ష్మీనాథుఁడగు నారాయణుడు యుద్ధమం దాసక్తిగలవాఁడై అసమానమై కోటిసూర్యుల కాంతిగల కవచంబును దొడిగి భయంకర బాణముచే నిండిన పొదుల ధరించి ప్రకాశించుచు ఖడ్గము చెక్కుటకై దట్టికట్టి.

చ. అరిదర శార్ఙ్గనందక ము ♦ ఖాయుధుఁడై కనకాద్రిఁబోలు న
గ్గరుడుని నెక్కి దుష్ట సుర ♦ కంటక నాశన సంభ్రమంబునన్
వెరపడి నిర్గమించె విబు ♦ ధుల్ ఋషిసిద్ధులు యక్షులున్ మునుల్
కరములుమోడ్చి మ్రొక్కి తనుఁ ♦ గ్రమ్మధురోక్తుల సన్నుతింపఁగన్. ౧౭౯

అర్థములు. అరి=చక్రము. దర=శంఖము, శార్ఙ్గ=విల్లు, నందక=నందకమను ఖడ్గము, ముఖ=మొదలుగాఁగల, ఆయుధుఁడై=ఆయుధములు గలవాఁడై, కనకాద్రిఁబోలు=మేరుపర్వతమువంటి, దుష్ట=దుష్టులైన, సురకంటక = రాక్షసుల యొక్క, నాశన=నాశము చేయుటయందలి, సంభ్రమంబునన్ = వేగిరపాటుచే క్రమ=మనోహరములైన, మధురోక్తులన్=తియ్యనిమాటలచే.

తాత్పర్యము

చక్రము శంఖము విల్లు నందకము కౌమోదకి యను గద లోనగు సాధనముల ధరించి మేరుపర్వతమువలె నత్తైబంగారు చాయఁగల గరుత్మంతు నెక్కి రాక్షసులను ధ్వంసము చేయు వేగిరపాటుతో వేగముగ నెక్కి దేవతలు ఋషులు సిద్ధులు యక్షులు మునులు చేతులు జోడించి నమస్కరించి స్తుతించు చుండఁగా బయలుదేఱెను.

క. హేమాంబరుఁ డగు జలదశ్యాముఁడు లక్ష్మీవిభుండు ♦ సంశోభించెన్
హేమాద్రిమీఁది సతటిజ్జీమూత మనంగ సంత ♦ సింపఁగ జగముల్. ౧౮౦

అర్థములు. హేమాంబరుఁడు = బంగారువస్త్రము గలవాఁడు, జలదశ్యాముండు=మేఘమువలె నల్లనివాఁడు, హేమాద్రి మీఁది = బంగారు కొండ మీఁద నున్న, సతటిత్=మెఱుపుతోఁగూడిన, జీమూతము=మేఘము.

తాత్పర్యము

బంగారు కాంతిగల మేరుపర్వతము మీఁద నల్లని మబ్బువలెబంగారురంగుగల గరుత్మంతునిమీఁద నల్లని విష్ణుమూర్తిలోకములు సంతోషింపఁబ్రకాశించెను.

ఉత్సాహము. పక్షిరాజ పక్షజాత ♦ వాతధూతకేతువై
యాక్షణంబ కీర్ణ శస్త్ర ♦ మై చలోపలంబు నీ
లక్షమాధరాగ్ర మనఁగ ♦ లక్షితంబునౌచు నా
రాక్షసేంద్రసైన్య మెల్ల ♦ భ్రాంతిఁ దూలి బెగ్గిలన్. ౧౩౧

అర్థములు. పక్షిరాజ=గరుత్మంతునియొక్క, పక్ష=ఱెక్కలవలన, జాత=పుట్టిన, వాత=గాలిచే, ధూత=ఎగురఁ గొట్టఁబడిన, కేతువై=ధ్వజములు గలదై, కీర్ణశస్త్రమై=చెదిరిన యాయుధములు గలదై, చలోపలంబు = కదలుచున్న ఱాలుగలది, నీలక్షమాధరాగ్రము=అంజనాద్రి శిఖరము, లక్షితంబు=కానవచ్చునది, బెగ్గిలన్=భయపడఁగా.

తా త్ప ర్య ము

గరుత్మంతుని ఱెక్కల గాలిచే నెగురఁ గొట్టఁబడిన ధ్వజములు గలదై చెదరిన యాయుధములు గలదై రాక్షససేన కదలుచున్న ఱాలుగల కాటుక కొండ శిఖరమువలెనై భ్రమగొని భయపడి తూలిపోయెను.

క. అడ్డంబై శరముల ముజ్జిడ్డుగఁ గవయంగఁ జేయఁ ♦ జేడ్పడ కసురల్
గడ్డుకొనురోషమునఁదమ, యొడ్డెల్లను నేకముగ మ♦హోత్సాహమునన్. ౧౩౨

అర్థములు. ముజ్జిడ్డు=మూఁడు చమురులు గలిసినట్లుగ, చేడ్పడక=చలింపక గడ్డుకొను=అతిశయించిన, ఒడ్డు=సేన.

తా త్ప ర్య ము

విష్ణువు పైబడి వచ్చుచున్న రాక్షస సేనల కడ్డపడి ముజ్జిడ్డుగ మిగులదట్టముగ బాణవర్షము గురియింపఁగా రాక్షసులు చలింపక యతిశయించిన కోపముచేఁ దమ సేన లెల్ల నేకముఖముఁ జేసి మిగుల నుత్సాహముతో.

క. నెత్తుట నెఱచిని మేనులు. జొత్తిలియున్నను సురారి♦సూదను మీఁదన్
మొత్తమ్ములుగాఁ గురిసిరి, తత్తఱ మొకయింత లేక ♦ దనుజవరేణ్యుల్. ౧౩౩

అర్థములు. ఎఱచిని=మాంసముచే. జొత్తిలి=ఎట్టిపాటి, సురారి సూదను మీఁదన్=విష్ణువుమీఁద.

తా త్ప ర్య ము

తమ దేహములు నెత్తుటిచే మాంసముచే నెట్టిపాటి యున్నను రాక్షస శ్రేష్ఠులు బాణములను గుంపులు గుంపులుగా విష్ణుదేవునిపై గురియించిరి.

౭వ సర్గము

ఆ. రాక్షసాంబుదములు ♦ ప్రకటగర్జారవ, త్రుటితదిక్చయములు ఘోరముగను
బరభయంకరముగ ♦ శరవృష్టిఁగురిసె నా, రాయణాద్రిమీఁదఁ♦నాఁకగొనక, ౧౩౪

అర్థములు. రాక్షసాంబుదములు=రాక్షసులను మేఘములు, ప్రకట గర్జారవ=స్పష్టములైన సింహనాదము లను నుఱుములచే, త్రుటిత=భేదింపఁబడిన, దిక్+చయములు=దిక్సమూహములు గలదై, పరభయంకరముగన్ = శత్రువులు భయపడునట్లు, శరవృష్టి=బాణము లను వానను, నారాయణాద్రి మీఁదన్=నారాయణుఁ డను కొండమీఁద, అరకొనక = అడ్డములేక, నాలుగవ పాదంబున నుభయ యతి.

తా త్ప ర్య ము.

సింహనాదము లను నుఱుములచేఁ బగల్పఁబడిన దిక్కులుగల రాక్షసు లను మేఘములు పరులకు భయము కలుగునట్లు నారాయణుఁ డను పర్వతముమీఁద నడ్డము లేక బాణములను వర్షమును గురియించెను

క. శ్యామావదాతుఁడగు హరి, శ్యామాసురపంక్తి బాణజాలము గుఱియం
 గా మెఱసె వర్షమాణ మహాముదిరాచ్ఛాదితాంజ నాద్రివిధమునన్. ౧౩౫

అర్థములు. శ్యామావదాతుఁడు=నలుపై శుభ్రమైనవాఁడు, నిర్మలమైన నలుపు గలవాఁడు, శ్యామాసురపంక్తి=నల్లని రాక్షస సమూహము, బాణజాలమున్=బాణముల సమూహమును, వర్షమాణ=వర్షించుచున్న, మహాముదిర=గొప్ప మేఘముచే, ఆచ్ఛాదిత=కప్పఁబడిన, అంజనాద్రి=కాటుకకొండ, విధమునన్=వలె.

తా త్ప ర్య ము

నిర్మలమైన నల్లనికాంతిగల విష్ణువు నల్లని రాక్షససమూహము బాణములు గురియఁగా వర్షించు గొప్ప మేఘముచేఁ గప్పఁబడిన కాటుకకొండవలెనుండెను.

సీ. మడిమీఁద మునరెడి మిడుతల పోలిక, మంటపై వ్రాలు దోమలవిధానఁ
 దేనెకుండకు మూఁగు దివురు నీఁగలభంగి, సంద్రంబునందు మోసళ్ళలీల
 దానవచాపముక్తంబులు శరములు, కల్పంబువేళ లోకంబులట్లు
 హరిఁ జొచ్చె రథికులు కరిగతుల్ రౌతులు, బంటులు నట్లట్లమింటికెగసి

తే. యసురవర్యులు బాణాళియస్త్రితోమ, రాదులను జిమ్మిచిమ్మి దానోదరుండు
 నవనిసురుఁడుప్రాణాయామ మంచుఁబోలె,
 స్తంభితోచ్ఛ్వాసుఁడుగ వేగ సలిపిరపుడు

అర్థములు. మడి=పైరుగల పొలము. ఉపమానము గుంపునందు మాత్రమే సంద్రంబు=సముద్రము. కల్పంబువేళ లోకంబులట్లు=ప్రలయ కాలమందు లోకములు భగవంతునందు లీన మగునట్లు, ప్రలయ కాలమందు లోకములన్నియు స్థూలరూపముల వదలి సూక్ష్మరూపముల భగవంతునందు లీనమై యుండును. మరల సృష్టికాలమున వాని నెల్ల బయల విడుచును. ప్రపంచమునకు

స్థూల సూక్ష్మ దశా భేదములు గలవు గాని నాశ మేనాఁటికి లేదు. అది నిత్యమైనది, కరిగతుల్=ఏనుఁగుల మీఁదనుండి యుద్ధము చేయువారు, యష్టి=కట్టెలు, తోమరాదులను = చిల్లకోలలు మొదలుగువానిని, స్తంభితోచ్ఛ్వాసుఁడుగ=శ్వాసము వెలికి రాక లోపలనే నిలిచి పోయిన వానిఁగ.

తాత్పర్యము

మడిమీఁద వ్రాలు మిడుతలవలె, మంటలపైఁబడు దోమలవలె, తేనె కుండకుఁ గ్రమ్ముకొను నీఁగలవలె, సముద్రమునందు మొసళ్ళవలె, ప్రళయ కాలమందు లోకములు నారాయణునందువలె రాక్షసులు విడిచిన బాణములగుంపులు విష్ణునందుఁ బ్రవేశించెను. రథములమీఁద నేనుఁగులమీఁద, గుఱ్ఱముల మీఁద నుండి యుద్ధము చేయువారును కాలిబంటులును నగు రాక్షసులు బాణములను, గట్టెలను, చిల్లకోలలను, ఈ మొదలైన యాయుధములను ఆయనపైఁజిమ్మిచిమ్మి బ్రాహ్మణుఁడు ప్రాణాయామ సమయంబునందుఁ గుంభకంబునందున్న విధముగ శ్వాసము వెలికి రాకుండఁ జేసిరి.

మ. శకులిక్షోభితవారిరాశియటులై ◆ శార్ఙ్గంబు మ్రోయించి నం
దకహస్తుండు స్వరూపమానపవమానక్షిప్రతాభీల పూ
ర్ణకరాకృష్టనిశాతసాయకములన్ ◆ రాత్రించరశ్రేష్ఠులన్
వికలీభూతశిరస్కులం జలిపె వే ◆ వే వేలుగాఁ గూలఁగన్. ౧౩౭

అర్థములు. శకులిక్షోభితవారిరాశి=చేఁపలచేఁ గలఁత పెట్టఁబడిన సముద్రము, రాక్షసు లిన్ని బాణములు ముమ్మరముగా వేసినను లక్ష్యము చేసినవాఁడు కాఁడయ్యెనని భావము, నందక హస్తుండు=నందకమను ఖడ్గమును జేత ధరించిన వాఁడు, విష్ణువు, స్వరు+ఉపమాన=వజ్రముతో సమానమైన, పవమానక్షిప్రతాభీల=వాయువేగమువంటి వేగముతో భయంకరమైన, పూర్ణకరాకృష్ట=నిండుగఁ జేత లాగఁబడిన, నిశాత=పదునైన, సాయకములన్=బాణములను, రాత్రించర శ్రేష్ఠులన్=రాక్షసులందు ముఖ్యులగువారిని, వికలీభూత శిరస్కులన్ = పగిలి పోయిన తలలు గలవారిఁగా, వేవే=త్వరత్వరగా, వేలుగాన్—వేలకొలఁదిగా.

తాత్పర్యము

చేఁపలచేఁ గలఁతపెట్టఁబడిన సముద్రమువలెనై విష్ణుమూర్తి కోదండము మీఁటి వజ్రాయుధములతో సమానములై, వాయువేగములై, భయంకరములై యాకర్ణాంతము లాగి విడువఁబడిన బాణములను త్వరత్వరగాఁ బ్రయోగించి వేలకొలఁది రాక్షస శ్రేష్ఠుల తలలు నఱికెను.

ఉ. దైన్యముగూర్చి యిట్లు నిశి ♦ తప్రదరప్రకరైకవృష్టి సా
జన్యధనుండు శౌరి బల ♦ శాలిత నొత్తఁగఁ బాంచజన్యమున్
జన్యసమాగత త్రిదశ ♦ శాత్రవకోటులు సింహగర్జనన్
వన్యగజంబులట్లు పఱ ♦ వందొడఁగెన్ హృదయంబు బెగ్గిలన్. ౧౩౮

అర్థములు. నిశితప్రదరప్రకరైకవృష్టిన్=వాఁడిగల బాణముల సమూహములు విడువని వర్షముచే, జన్యసమాగత=యుద్ధమునకై వచ్చిన, త్రిదశ శాత్రవ కోటులు=రాక్షస సమూహములు. వన్యగజంబులట్లు=అడవి యేనుఁగులవలె, పఱవఁదొడఁగెన్=పరువెత్తిపోవ నారంభించెను.

తాత్పర్యము

వాఁడిబాణముల వర్షముచే రాక్షససేన దుఃఖపడజేసి విష్ణుమూర్తి పాంచ జన్యముఁ బూరించెను. ఇట్లా బలశాలి యూఁదిన శంఖము ధ్వనిచే యుద్ధమునకు వచ్చిన రాక్షసులు సింహధ్వని విన్న యేనుఁగులవలె భయపడి గుండెలు పగిలి పరువెత్త నారంభించిరి.

శా. త్రైలోక్యంబు వ్యథాప్రపూర్ణముగ నా ♦ ధ్వానంబు నిండారినన్
సోలెన్ దంతులు నేల నిర్మదములై ♦ స్రుక్కెం దురంగంబులున్
వ్రాలెన్ స్యందనముల్ దొఱంగి రథిక ♦ వ్రాతంబు నిస్తేజమై
తూలెం బద్ధసముత్కరంబు ధరణిం ♦ దోడ్తోడ నిశ్చేష్టమై. ౧౩౯

అర్థములు. వ్యథాప్రపూర్ణముగన్=వేదనచే నిండినదిగా, ధ్వానంబు= ధ్వని, నిర్మదములై = మదము పోయినవై, స్యందనములు = రథములు, రథిక వ్రాతంబు=రథముమీఁదనుండి యుద్ధము చేయువారి సమూహము, నిస్తేజము= కాంతి తొలఁగినది, పద్ధ=కాలిబంటులయొక్క, సముత్కరంబు=సమూహము.

తాత్పర్యము

ఆ ధ్వని మూఁడులోకములకు పూర్ణముగ బాధ కలిగించునదియై వ్యాపింపఁగా నేనుఁగులు మదముచెడి పడెను. గుఱ్ఱములు నేలవ్రాలెను. తేరులు నందలి రథికులు కాంతిహీనతచేఁ బడిపోయెను. భటులు నిశ్చేష్టులైరి.

శా. నీరంధ్రంబుగ బాణవర్షమసురా ♦ నీకంబుపై వేగిమై
నీరేజాంబకుఁ డంతటం గురియఁగా ♦ నిర్భిన్నగాత్రంబులై
స్వారాట్శత్రువిదారితాద్రులన ర ♦ క్షఃపాలకస్తోమముల్
తీరుం బాసెఁ జెడెం బడెన్ సమసె బి ♦ ద్దెం డింక వేసెం దెగన్. ౧౪౦

అర్థములు. నీరంధ్రంబుగన్=నిర్+రంధ్రము = సందులేకుండునట్లు, నిర్భిన్నగాత్రంబులై=భేదింపఁబడిన దేహములు గలవారై, స్వారాట్+శత్రు=

ఇంద్రుని వజ్రాయుధములచే, విదారిత=చీల్చఁబడిన, అద్రులనన్=కొండలో యను నట్లు, రక్షఃపాలక=సేనానాయకుల, స్తోమముల్=సమూహములు, బిద్దెన్=చచ్చెన్ డింకవేసెన్=సనుసెను.

తా త్ప ర్య ము

ఒకదాని కొకదానికి నసుమసందు లేనట్లు రాక్షసుల సేనమీఁద విష్ణుమూర్తి బాణవర్షము గురియింపఁగా రాక్షసనాయకుల సమూహముపై దేహములు చీలి వజ్రాయుధముచేఁ జీల్పఁబడిన కొండల వలెనై చచ్చిపడిరి.

క. హరిచక్రకృతవ్రణములఁ దొరఁగెన్ నెత్తురులు సోఁకు ♦ తుటుములమేనన్
ధరణీధరములఁ గాఱెడి, గిరిభవధాతువు లనంగఁ ♦ గెంజాయలతోన్ ౧౭౧

అర్థములు. హరిచక్రకృతవ్రణములన్=విష్ణుచక్రముచేఁ జేయఁబడిన గాయములనుండి, సోఁకుతుటుముల=రాక్షస సమూహముల, మేనన్ = దేహములనుండి, గిరిభవధాతువులు=కొండయందుఁ బుట్టిన లోహసారములు, కెంజాయలతోన్= రక్తకాంతులతో.

తా త్ప ర్య ము

విష్ణుచక్రమువలనఁ గలిగిన గాయములనుండి రాక్షస దేహములందు నెఱ్ఱని కాంతులతోఁ బర్వతము లందలి ధాతువుల వలె నెత్తురు కాఱెను.

తే. పాంచజన్యరవంబు దుః♦ర్వారమైన, శార్ఙ్గమౌర్వీనినాదంబు ♦ శత్రునికర
కంఠరవమునునిన్నింటిఁ♦గడచిమింగెఁ, గాంచనాంబరుభయదహుం♦కారరవము.

అర్థములు. పాంచజన్యరవంబు=శ్రీ మహావిష్ణువుయొక్క శంఖధ్వని, శార్ఙ్గమౌర్వీనినాదంబు=విష్ణుధనస్సునకు శార్ఙ్గమని పేరు; ఆ ధనస్సుయొక్క శబ్దము, శత్రునికర=విరోధుల సమూహము, కంఠరవము = కంఠములనుండి వెలువడు నాదము, భయదహుంకారరవము=భయంకరమగు "హు"మ్మను నాదము.

తా త్ప ర్య ము

విష్ణుదేవుని భయంకరమైన హుంకారధ్వని పాంచజన్యరవమును కోదండ ధ్వనిని శత్రువులగు రాక్షసుల కంఠధ్వనిని నన్నింటిని మించియుండెను.

సీ. తరణిబింబమునుండి ♦ కిరణంబు లట్టుల, జలనిధినుండి యే ♦ అలవిధాన
నగరాజముననుండి ♦ నాగరాజులభంగి, వారిదంబుననుండి ♦ ధారలట్లు
శౌరిసంప్రేరిత ♦ శార్ఙ్గ వినిర్ముక్త, కాండముల్ దమమీఁదఁ♦గవయుటయును
దునిఁగిన మెడలును ♦ దునిసినమొడలును. బగిలిన తేరులు ♦ నొగులువిండ్లు

ఆ. మ్రొగ్గువాహనములు ♦ స్రగ్గెడికరులును, వెగయు కేతనములు ♦ తెగినకేలు
గాఁగ నసురసేన ♦ కళవళించెదపించె, గండెఁ గుండె డిండె ♦ గ్రమ్మందె నపుడు.

అర్థములు. తరణిబింబము=సూర్యబింబము, నగరాజముననుండి = పర్వత శ్రేష్ఠముననుండి, నాగరాజుల భంగిన్=సర్పశ్రేష్ఠములవలె, వారిదంబు=మేఘము, శౌరిసంప్రేరిత=విష్ణువుచే త్రేయఁబడి, శార్ఙ్గవినిర్ముక్త=శార్ఙ్గమునుండి విడువఁబడిన, కాండముల్=బాణములు.

తాత్పర్యము

(సూర్యబింబమునుండి వెడలు కిరణములవలె, సముద్రమునుండి వచ్చు నోటుల తీరున, పర్వతమునుండి వెలువడు పాములవలె మేఘములనుండి పడు వర్షధారలవలె, విష్ణుమూర్తియొక్క శార్ఙ్గమునుండి బయలుదేఱిన బాణపరంపరలు తమమీఁదఁబడి, మెడలు తెగి, గొడలు తునిగి, రథములు పగిలి ధనస్సులు విఱిగి, వాహనములు చచ్చి, కరులు మొరఁగి రాక్షససేన ఛిన్నాభిన్నమయి నశించెను.)

సీ. శరభంబులకుఁ బాఱు ♦ హరిసంఘములభంగి, హరికిని వెఱచెడి ♦ కరులసరణి
వారణంబుల కులుకు ♦ వ్యాఘ్రంబులట్టుల, వ్యాఘ్రంబునకును జీవ్వంగులట్లు
చివ్వంగికిని గ్రామసింహముల్ తీరున, శ్వానంబునకును మార్జాలరీతి
మార్జాలమున కహిమండలంబులత్రోవ, కాకోదరమున కెలుకలవిధాన

ఆ. హరికి వెఱచి పఱచి ♦ ధరణిని బన్నుండి, యసురవరులసేన ♦ హతముగాఁగ
వారిధరవరంబుఁ బర్జన్యునట్టులు, నించె వారిజంబు ♦ నీలతనుఁడు. ౧౪౪

అర్థములు. హరిసంఘములభంగిన్= సింహసమూహములవలె, హరికిని= సింహమునకును, కరులసరణిన్=ఏనుఁగులవలె, వారణంబులకున్ = ఏనుఁగులకు, ఉలుకు=భయపడు, గ్రామసింహముల్, తీరున=కుక్కలవలె, శ్వానంబునకున్= కుక్కకు, మార్జాలరీతిన్=పిల్లులవలె, అహిమండలములు = పాములు సమూహములు, కాకోదరమునకున్=పామునకు, పఱచి=పరువెత్తి, పన్నుండి=పండుకొని, వారిధరవరంబు=గొప్పమేఘము, వారిజంబు=శంఖము,నీలతనుఁడు=నల్లని దేహము గల విష్ణువు

తాత్పర్యము

(శరభమునుగని పాఱిపోవు సింహములవలె, సింహమునకు వెఱచి పఱచు నేనుఁగులవలె, నేనుఁగుల కులికిపడు కుక్కలవలె, కుక్కనుజూచిన పిల్లులవలె, పిల్లినిఁగన్న పాములవలె, పామునుఁగనిన యెలుకలనలె శ్రీమహావిష్ణువునకు వెఱచి పరుగెత్తి నేలఁబడి రాక్షసులసేనలు హతముకాఁగాఁబర్జన్యుఁడు గొప్పమేఘమును బలె నీలమేఘ శరీరుఁడగు శౌరి శంఖమును బూరించెను.)

క. నగధారిబాణములకున్, బెగడుచుఁ బలలాశిబలము ♦ బిగిచెడి లంకా
నగరాభిముఖముగాఁ జన మగిడిన రోసంబుతో సుమాలియుఁ గడిమిన్. ౧౮౫

అర్థములు. నగధారి=పర్వతము ధరించినవాఁడు, విష్ణువు, బెగడుచున్=భయపడుచు, పలలాశిబలము=రాక్షస సేన, బిగిచెడి=బిగువు చెడిపోయి, మగిడిన=మరలిన, రోసమును మరలఁ దెచ్చుకొని, కడిమిన్=బలముతో.

తాత్పర్యము

విష్ణువువేయు బాణములకు రాక్షససేన భయపడి ధైర్యము గర్వము చెడి లంక ప్రక్కముఖము చేసి పోఁగా సుమాలి బలమున మరల రోషము దెచ్చుకొని.

—* విష్ణువు సుమాలితోఁ బోరుట *—

చ. తరణిని ముంచు మంచుగతిఁ ♦ దాఁకి శరంబుల విష్ణు ముంచినన్
మరలిన సైన్య మంతయు సమ ♦ గ్రధృతిం జెలరేఁగి క్రమ్మఱన్
సురపరిపంథియున్ దనుజ ♦ సూదనుఁ గిట్టి సురారిజీవసం
భరణచణంబుగా గళర ♦ వంబును నించె నితాంతధీరతన్. ౧౮౬

అర్థములు. తరణి=సూర్యుని. సమగ్రధృతిన్=నిండు ధైర్యముతో, సురపరిపంథియున్=దేవవిరోధి సుమాలి, కిట్టి=సమీపించి, సురారిజీవ=రాక్షసుల ప్రాణములను, సంభరణచణంబుగాన్=భరించు సామర్థ్యము గలదిగా, గళరవము=కంఠధ్వని, నితాంత ధీరతన్=మిగుల ధైర్యముతో.

తాత్పర్యము

సూర్యుని మంచువలె సుమాలి విష్ణువు నెదిరించి బాణముల ముంచఁగా బయనెత్తుచున్న సేనయంతయు ధైర్యము తెచ్చుకొని మరలి విజృంభించెను. ఆ రాక్షసుఁడును విష్ణువును సమీపించి ధైర్యము చెడి శవముగా నున్న రాక్షససేనకు మరలఁ బ్రాణము వచ్చునట్లు మిగుల ధైర్యమున కంఠధ్వని గావించెను.

ఉ. తపనీయాభరణోజ్జ్వలం బగు నహ ♦ స్తం బుద్ధతిన్ వీచుచున్
దపనీయాంశుకుఁ బిల్చుచున్ సహతటి ♦ ద్ధారాధరంబో యనన్
విపులారావము రోదసీకుహరని ♦ ర్భేదంబుగా నించినన్
దపనాభప్రదరంబునన్ హరియుఁ ద ♦ త్కర్ణోజ్జ్వలద్భూషలన్. ౧౮౭

అర్థములు. తపనీయాభరణ=బంగారు భూషణముచే, ఉజ్జ్వలము = ప్రకాశించునది, తపనీయాంశుకు=బంగారు వస్త్రముగల విష్ణువును, సహతటిత్ + ధారాధరంబు=మెఱపుతోఁ గూడిన మేఘమో, విపులారావము = గొప్పధ్వని, రోదసీకుహర నిర్భేదంబుగాన్=భూమికి నాకాశమునకు నడుమ గుహవలె నుండు

ప్రదేశము పగులునట్లు, తపనాభప్రదరంబునన్ = సూర్యునితో సమానమైన బాణముచే, తత్=ఆ రాక్షసుని, కర్ణోజ్జ్వలత్ భూషలన్=చెవులయందు ప్రకాశించు నాభరణములను.

తా త్ప ర్య ము.

బంగారు భూషణములచేఁ బ్రకాశించు చేయియెత్తి విష్ణుదేవుని బిలువఁగా, విష్ణుదేవుఁడును మెఱుపులతోడి మేఘమువలె నంతరాళము పగులునట్లు గట్టిగా ధ్వనించుచు సూర్యునివంటి కాంతిగల బాణములచే నారాక్షసుని చెవులయందున్న సొమ్ములను.

క. త్రుంచియు హారథిశిరముం, ద్రెంచినఁ దత్సైంధవములు ♦ తికమక గొనుచున్
మించిన వెఱ గిరగిర మని, పంచజనాదునిరథంబు ♦ బలువిడిఁ ద్రిప్పెన్. ౧౪౫

అర్థములు. సైంధవములు=గుఱ్ఱములు, పంచజనాదుని = మనుష్యభక్షకుని,

తా త్ప ర్య ము

త్రుంచి సారథి తల త్రెంచివేయఁగా నా గుఱ్ఱములు తికమికగొని భయపడి గిరగిర మని యా రాక్షసు తేరిని విచ్చలవిడి త్రిప్పెను.

కం. భ్రాంతము లగుడును రథహయ, సంతతి భ్రమచే సుమాలి ♦ చలియించెఁ బరి
భ్రాంతేంద్రియాశ్వములచేఁ, జింత ధృతి వోఁడిగు నరుని ♦ చెలువుననాలోన్.

అర్థములు. భ్రాంతములు=భ్రమగొన్నవి, భ్రాంత=భయపడిన, ఇంద్రియాశ్వములచే=ఇంద్రియములను గుఱ్ఱములచే, చింతన్ = విచారముచే, ధృతి దొఱఁగు=ధైర్యము విడిచిన.

తా త్ప ర్య ము

గుఱ్ఱములు భ్రమగొని తిరుగుటచే సుమాలియు దిక్కు తెలియక యింద్రియములను నశ్వములు భ్రమపడఁగాఁ జింతచే ధైర్యము చెడిన మనుష్యునివలె భ్రమగొనెను. అంతలో

చ. సుడివడు చున్నయగ్రజునిఁ ♦ జూచి మహోగ్రహవృత్తి మాలియున్
బిడుగులఁబోలుబాణములు ♦ వెన్నుని హంసలు క్రౌంచశైలమున్
గడువడిఁ దూఱి యేగుగతి ♦ గా నిగిడించిన నాధికిన్ వశం
పడని జితేంద్రియుం డనఁగ ♦ మాధవుఁ డేమి చలింప కాత్మలోన్. ౧౪౭

అర్థములు. సుడివడు=చిక్కువడు, అగ్రజుడు=అన్న, వెన్నుఁడు = విష్ణువు' క్రౌంచశైలము=క్రౌంచమను పర్వతము, ఆధి=మానసిక దౌర్బల్యము, జితేంద్రియుఁడు=ఇంద్రియములను జయించినవాఁడు, చలింపక=చెదరక.

తా త్ప ర్య ము

తన యన్న నుడివడుచుండుట చూచి మిగులఁ గోపించి మాలి క్రౌంచ పర్వతమున హంసలు దూఱిపోవునట్లుగా బిడుగులుపోలిన బాణములు విష్ణుని మీఁద వేయఁగా మనోవేదనకు వశపడని జితేంద్రియునివలె విష్ణువు వారికిఁ జలింపక.

—* వి ష్ణు వు సు మా లి ని వ ధిం చు ట *—

శా. మౌర్వీరావము దిక్ప్రపూర్ణముగ భీ ♦ మప్రహ్లాదినీవజ్రభా
దుర్వారాశుగ వేగ బాణముల దై ♦ త్యున్ నాటఁగా నేసినన్
సర్వాంగంబులఁ దూఱి పాములు సుధా ♦ సారంబుభంగిన్ మనః
పర్వం బారఁగఁ గ్రోలె నెత్తురులు వి ♦ భ్రాంతిం గొనన్ వైరియున్. ౧౫౧

అర్థములు. మౌర్వీరావము = అల్లెత్రాటి మ్రోఁత, దిక్ప్రపూర్ణముగన్= దిక్కులు నిండునట్లు, భీమ=భయంకరమైన, ప్రహ్లాదినీవజ్రభా=పిడుగులవంటి, వజ్రములవంటి కాంతిగల, దుర్వార=వారింపరాని, ఆశుగ = వాయువువంటి, వేగ= వేగముగల, బాణములన్=సుదాసారంబున్=అమృతసారమును, మనఃపర్వంబు= మనస్సుకు సంతోషము.

తా త్ప ర్య ము.

అల్లెత్రాటి ధ్వని దిక్కులు నిండఁగా భయంకరమైన పిడుగులయు వజ్రములయు కాంతిగలవియు వాయువేగము గలవియు నగు బాణములను రాక్షసుని యవయవము లన్నియు దూఱిపోవ వేయఁగా పాము లమృతమును ద్రావినట్లులవి వాని నెత్తురులు ద్రావెను. వాఁడును దానికి భ్రాంతిగొనెను.

ఉ. అంతటఁ బోక శౌరి యసు ♦ రాధము మౌళి ధ్వజంబు చాప మిం
తింతలుగాఁగఁ ద్రుంచి హయ ♦ బృందములన్ వధియింప మాలిదు
ర్దాంతజవంబుతోడుత గ ♦ దాధరుఁడై చని పక్షిరాట్ఛిరః
ప్రాంతమునందు మోఁదె హరు ♦ డంతకున ట్లిరుకేల హుంకృతిన్. ౧౫౨

అర్థములు. మౌళి=కిరీటము, పక్షిరాట్+శిరః ప్రాంతమునందున్=గరుత్మంతుని తలప్రక్క భాగమున.

తా త్ప ర్య ము

విష్ణుదేవుఁడంతతో వదలక యా నీచ రాక్షసుని కిరీటము, ధ్వజము, విల్లు తునకలు తునకలుగా ఖండింపగా మాలి గద దీసికొని మిగుల వేగముతోఁబోయి గరుత్మంతునితల ప్రక్క భాగంబున రెండుచేతులతో శివుఁడు యమునివలెఁగొట్టెను

మ. స్వరుధారాహతి నద్రియట్లడలి యా ♦ సర్పారి దిగ్భ్రాంతి మై
మరలం బాఱె భృశార్తిమాధవునకున్ ♦ మారోన్ముఖం గావించినన్
సురవైరిప్రకరంబులందు గగన ♦ స్ఫోటంబుగా రావము
ద్ధురతన్ వెల్వడె హర్షహేతు వయి త ♦ ద్ఘోరారవోద్భూతికిన్. ౧౯౩

అర్థములు. స్వరుధారాహతిన్ = వజ్రాయుధము వాదర దెబ్బచే, అద్రియట్లు=కొండవలె, సర్పారి=గరుడుఁడు మారోన్ముఖము=పెడమర ముఖము, గగన స్ఫోటంబుగాన్=ఆకాశము పగులునట్లు, రావము=ధ్వని, తత్=ఆ రాక్షసుల, ఘోరారవ=భయంకరధ్వనియొక్క, ఉద్భూతికిన్=పుట్టుటకు.

తాత్పర్యము

వజ్రాయుధము దెబ్బచేఁ గొండవలెఁ జలించి యాగరుడుఁడు దిగ్భ్రమగొని మిగుల వేదనచే వెనుక ముఖమై పరువెత్తి రాక్షసునకా విష్ణువు పెడవాటగునట్లు చేయఁగా రాక్షసు లాకాశము పగులునట్లు కేకలు వేసిరి. ఆఘోరమైన ధ్వని పుట్టుటచూచి.

ఉ. ఆగ్రహమార శ్రీరమణుఁ ♦ డడ్డముగాఁగ మలంగి తార్క్ష్యుపై
వ్యగ్రతఁ గేలఁ దాల్చి పెడ ♦ వాటుగ నయ్యును మైచె భాస్కరో
దగ్రవిభావిభాసము ది ♦ శావళిసంగతనైజతేజమున్
విగ్రహభీషణంబు నరి ♦ వీరశిరః ప్రతిభేదదక్షమున్. ౧౯౪

అర్థములు. మలంగి=తిరిగి, తార్క్ష్యుపై=గరుత్మంతునిమీఁద, వ్యగ్రతన్=వేగముగ, భాస్కరోదగ్రవిభా=సూర్యకాంతియొక్క యతిశయముచే. విభాసము=ప్రకాశించునది, దిశావళిసంగతనైజతేజమున్=దిక్కులయందు వ్యాపించిన తన కాంతిగల దానిని, విగ్రహభీషణంబు=యుద్ధమందు భయంకరమైనది, భయంకరమైన యాకారముగలది, అరివీర=వీరులగు శత్రువులయొక్క, శిరః=శిరస్సులను ప్రతిభేద=తెగఁగొట్టుటయందు, దక్షము=సామర్థ్యముగలది.

తాత్పర్యము

విష్ణుమూర్తి కోపించినవాఁడై గరుడుని మీఁదఁ దోఁకదిక్కు ముఖముగాఁ దిరిగి పెడవాటుగా నున్నను వేగముగ సూర్యకాంతి గలదియు దిక్కుల యందు వ్యాపించిన తేజస్సు గలదియు భయంకరాకారము గలదియు శత్రువుల శిరస్సులు ఛేదించు సామర్థ్యము గలదియు.

తే. కాలచక్రంబుఁబోని చక్రంబు నసుర,వరునిపై వైవనది రాహుశిరముఁద్రుంచు
కరణి మాలిశిరంబునుద్ధరణిఁ గూల్చె, నమరు లరుసంబునను గర్జిలారనింప.

అర్థములు. అసురవరునిపై=రాక్షసశ్రేష్ఠునిపై, అమరులు=దేవతలు, అరుసము=సంతోషము, గర్జలు=కేకలు, ఆరనింప=తెఱపిలేకుండ (నిండుగా).

తాత్పర్యము

కాలచక్రమువంటి తన చక్రంబును వేయగా, నది పూర్వము రాహు శిరస్సును ఖండించినట్లు మాలి శిరస్సును ఖండించి నేలఁ ద్రోచెను. దేవతలు సంతోషించి సింహనాదములు చేసిరి.

—* రాక్షససేనపలాయితమగుట *—

సీ. మాలి గూలినఁజూచి ♦ మాల్యవంతుండు సు,మాలియు శోకనిర్మగ్నులగుచు
బలగంబు భీతిఁ ♦ బాఱిరి లంకాము,ఖమ్ముగ నింతలో ♦ ఖగవరుండు
తెప్పిఱి తత్క్రోధ ♦ తీవ్రత నిజపక్ష, వాతూల నిహతిని ♦ వారి నొంపఁ
బెనుగాలి నొగుడాకు ♦ లనఁ జెల్లచెదరులై సేనలువారలు ♦ చెదరిపోవ

తే. శరగణచ్ఛిన్నగాత్రులు♦చక్రకృత్త, మూర్థు లసిదారితాంగులు♦ముసలహతివి
ఘటితశీర్షులు లాంగల♦గ్లపితకంఠ,కులు గదాహతవక్షులు♦త్రుటితకరులు. ౫౫

అర్థములు. శోకనిర్మగ్నులు = శోకమున మునిఁగినవారు, తత్+క్రోధతీవ్రతన్=ఆకోపాతిశయముచే, నిజపక్ష=తిన ఱెక్కలవలనఁ గలిగిన, వాతూలనిహతిని=గాలిదెబ్బచే, ఒగుడాకులు=ఎండిన యాకులు,శరగణచ్ఛిన్నగాత్రులు=బాణసమూహములచే ఛేదింపఁబడిన దేహము గలవారు చక్రకృత్తమూర్థులు=చక్రముచే ఖండింపఁబడిన తలలుగలవారు, అసిదారితాంగులు=కత్తిచేఁ జీల్పఁబడిన దేహములు గలవారు, ముసలహతి=రోఁకలిదెబ్బలచే, విఘటితశీర్షులు=తలలు పగిలినవారు, లాంగల=నాఁగేలిచే, గ్లపితకంఠకులు = నొచ్చిన మెడలు గలవారు, గదాహతవక్షులు=గదచేఁ గొట్టఁబడిన ఱొమ్ములు గలవారు, త్రుటితకరులు=విఱిగిన చేతులు గలవారు.

తాత్పర్యము

మాలి చచ్చుట చూచి మాల్యవంతుఁడును సుమాలియు శోకమునమునిఁగి భయపడి సేనతో లంకవైపుతిరిగి పరువెత్తిరి. ఇంతలో గరుత్మంతుఁడు తెప్పఱిల్లుకొని తనఱెక్కలు విదుర్చఁగా రాక్షసులు పెద్దగాలికి నొగుడాకులవలెఁ జెదరిపోయిరి. బాణములచే నఱకఁబడిన యవయవములు గలవారును జక్రముచే ఛేదింపఁబడిన తలలు గలవారును గత్తిచేఁ జీల్పఁబడిన దేహములు గలవారును రోఁకటిదెబ్బలచేఁ బగిలిన తలలు గలవారును నాఁగేటి దెబ్బలచే నొచ్చిన మెడలుగలవారును గదచేఁ గొట్టఁబడిన వక్షస్సులు గలవారును చేతులు తెగినవారునునైరి.

చ. అగుచును వెంట్రుకల్ విరియ ♦ నాహవమున్ విడి పాఱ రాక్షసుల్
నగధరుఁడున్ శతాయుతక♦లంబక వృష్టిని నాతపత్రముల్
తెగఁ దురగాళిఁ గూలఁ బెడఁ ♦ దేరులు ప్రేవులు ప్రోవులై పడన్,
బిగిచెడఁ దత్తఱింపఁ బురి♦విచ్చఁగఁ దద్దఱిలంగఁ జేసినన్ ౧౫౭

అర్థములు. ఆహవమున్=యుద్ధమును, నగధరుఁడు=విష్ణువు, శతాయుత=వేయివేల, కలంబక=బాణముల, వృష్టిని=వర్షముచే, ఆతపత్రముల్=గొడుగులు, పురివిచ్చఁగన్=వేఱుపడఁగా.

తాత్పర్యము

ఈ ప్రకారము రాక్షసులు తలవెంట్రుకలు విరియఁబోసికొని యుద్ధభూమి విడిచి పరువెత్తఁగా విష్ణుమూర్తి పదునుగల వేయివేల బాణముల వర్షముచే గొడుగులు తెగిపడ గుఱ్ఱములు చచ్చిపడ తేరులు తునుకలైపడ ప్రేగులుప్రోగులు పడ బిగువుచెడ భయపడ నొకరితో నొకరు వేఱుపడ గడగడ వడఁకచేయఁగా

క. సుడివడఁగా నేత్రంబులు, తడఁబడఁగా బాదములును ♦ దటతట మనఁగా
నెడదలు సైనికులందఱు, వెడఁగులవలె నగుడుఁ జలము ♦ వీడ్కొనిపఱవన్.

అర్థములు. ఎడదలు=గుండెలు, (మనస్సులును) వెడఁగులు = తెలివిలేనివారు, అగుడున్=కాగా, చలము=పట్టుదల, వీడ్కొని పఱవన్ = వదలుకొని పఱువెత్తగా.

తాత్పర్యము

కన్నులు తిరుగఁగాఁ కాళ్ళు తడఁబడఁగా గుండెలు తటతట కొట్టుకొనఁగా సైనికులందఱు పిచ్చివాండ్రవలెనై చలమువదలి పరువెత్తగా.

చ. కని నరసింహమూర్తి ఘన ♦గర్జల నించిన సింహగర్జలన్
వినిన మతంగజంబు లన ♦ విభ్రమ మొందుచుఁ జాపముక్త రో
ప నికర మారుతాహతికి ♦ వారిదసంఘము లట్టులైరి త
త్కనకమణీమయాభరణ ♦ కాండములన్ ధరయెల్ల నిండఁగన్. ౧౫౯

అర్థములు. నరసింహమూర్తి=విష్ణువు, అంతటి భయంకరాకారము వహించెనని భావము. మతంగజంబులు=ఏనుగులు, చాపముక్త = వింటినుండి విడువఁబడిన, రోపనికర=బాణసమూహముల, మారుతాహతికిన్= గాలిదెబ్బకు, వారిదసంఘములట్టులు=మేఘముల సమూహములవలె, తత్=ఆ రాక్షసుల, కనకమణీమయ=బంగారు రత్నములచే నిండిన, ఆభరణ = భూషణముల యొక్క, కాండములన్=సమూహములచే.

తాత్పర్యము

చూచి విష్ణుమూర్తి సింహనాదముచేయఁగా సింహధ్వని విన్న యేనుఁగుల వలె రాక్షసులు దిగ్భ్రమ చెందుచు వింటినుండి విడువఁబడిన బాణముల గాలి దెబ్బకు నా రాక్షసులు వారు ధరించిన బంగారు రత్నముల సొమ్ములు నేల రాలఁగా మేఘములవలెఁ జెదరిపోయిరి.

క. నీలబలాహకతుల్యులు, లోలంబ లలంతికోజ్జ్వ ♦ లులు హరిశర ధా
రాలులితచిత్తు లగుచును, నీలాంజనగిరు లనంగ ♦ నేలం ద్రెళ్ళన్. ౧౬౦

అర్థములు. నీలబలాహకతుల్యులు = నల్లని మేఘముతో సమానులు, లోలంబ=వ్రేలుచున్న, లలంతికా=మెడను వ్రేలాడు హారములు లోనైనవానిచే, ఉజ్జ్వలులు=ప్రకాశించువారు, హరి=విష్ణువుయొక్క, శరధారా=బాణవర్షముచే, లులిత=కలఁతఁబెట్టబడిన, చిత్తులు = మనస్సుగలవారు, నీలాంజనగిరులు=నల్లని కాటుక కొండలు.

తాత్పర్యము

నల్లమబ్బులతో సమానులును మెడలందు వ్రేలాడు మాలికలు గలవారును నగు రాక్షసులు విష్ణు బాణవృష్టిచేఁ జలించిన మనస్సు గలవారై కాటుకకొండల వలె నేలఁబడఁగా.

౮వ సర్గము

చ. పరువిడు రాక్షసోత్కరము ♦ పాటును వెన్కను శౌరిపోటు నా
శరకులనాయకుండు గని ♦ సంద్రము వేలను దాఁకి మర్లిన
క్కరణిని వెన్కకుం దిరిగి ♦ కంజదళాక్షునిఁ జూచి యిట్లనున్
గరువతనంబుతోడఁ గినుకం ♦ గం జలియింపఁగ మౌళి రేఁగుచున్. ౧౬౧

అర్థములు. రాక్షసోత్కరము = రాక్షససమూహము, ఆశరకుల నాయకుండు=రాక్షససమూహాధిపతి, మాల్యవంతుఁడు, సంద్రము = సముద్రము, వేలను=చెలియలికట్టును.

తాత్పర్యము

రాక్షసులు పరువెత్తుచుఁ బడు కష్టము వారిని వెంబడించి తఱుము విష్ణుపరాక్రమముఁ జూచి మాల్యవంతుఁడు సముద్రము చెలియలికట్టవఱకుఁ బోయి వెనుకకు దిరిగినట్లు తిరిగి విష్ణువును జూచి కోపముచే కిరీటము కదలుచుండఁగా గర్వముతో నిట్లనియె.

—* మాల్యవంతుండు విష్ణుని నిష్ఠురమాడుట *—

క. ప్రాకృతజనునట్టులు నీ, వీకరణిని క్షత్త్రధర్మ ♦ మెఱుఁగక యుద్ధా
భాకాంక్షింపనివారల నాకులపడఁ జంపనగునె ♦ నారాయణుఁడా! ౧౬౨

అర్థములు. ప్రాకృతజనునట్టులు=సామాన్యమానవునివలె, ఈ కరణిని=ఈవిధముగ, ఆకాంక్షింపనివారలను=కోరనివారలను, ఆకులపడ=చీకాకుపడ.

తాత్పర్యము

నారాయణా! సామాన్య జనునివలె, పగువెన్నిపోవువారిని జంపఁగూడదను క్షత్రియనీతి పాటింపక యుద్ధము కోరనివారలను నీవు వ్యాకులపడఁజంపవచ్చునా?

క. విను సమరవిముఖులన్ వెనోకని చంపెడి పూరుషుండు॰కోట్కొలందుల్
ఘనసుకృతంబులు చేసియుఁ, జన నేరఁడు స్వర్గమునకు ॰ సత్యవిచారా! ౧౬౩

అర్థములు. సమరవిముఖులన్=యుద్ధమున మాఱుమొగము పెట్టిన వారిని, సత్యవిచార=సత్యమైన యాలోచన గలవాఁడా.

తాత్పర్యము

సమర్థమగు నాలోచన గలవాఁడా! యుద్ధము చేయనొల్లక వెనుకకుఁ దిరిగి పోవువారిని జంపెడివాఁడు కోట్లకొలఁది పుణ్యములు చేసి యుండినను స్వర్గమునకుఁ బోఁజాలఁడు.

క. యుద్ధమొనర్పంగ నంతటి. శ్రద్ధయుఁ గల దేని రమ్ము ॰ చక్రధరుండా!
సిద్ధముగ నున్నవాఁడఁ బ్ర,సిద్ధంబుగఁ జూపు నీదు ॰ చేవయు బలమున్. ౧౬౪

అర్థములు. చక్రధరుండా=సుదర్శనమను చక్రాయుధమును ధరించినవాడా (నారాయణా!) చేవయున్=గట్టితనమును.

తాత్పర్యము

(చక్రధరా! యుద్ధము చేయవలెననెడి శ్రద్ధగలదేని యిదే సిద్ధముగానున్నాను. రమ్ము-నీ బలము నీ చేవ ప్రసిద్ధమగునట్లు చూపుము)

సీ. అని మాల్యవంతంబు॰ననువున నమ్మాల్య, వంతుండు నిలిచిన ॰ వనజపాణి
యిట్లను మీభీతి ॰ బృందారకుల్ నన్ను, శరణంబుఁ జొచ్చినఁ॰గరుణఁదలఁచి
మిమ్ము నుత్సాదింప ॰ మేకొంటి నా నుడి, రక్షించుకొనువాఁడ॰రాక్షసేంద్ర!
నాప్రాణములకంటె ॰ నాకనివాసుల, కార్యంబు ప్రియమయి ॰ క్రాలునాకుఁ
తే. గాన మీరు రసాతల॰గతులరైన, హతులఁ జేయక విడువ దు॰రాత్ములార!
యనిన నసురుఁడు శక్తి చే॰నంబుజాక్షు, వక్షమున నాట దృఢశక్తి॰ వైవనదియు

అర్థములు. మాల్యవంతంబు=మాల్యవంతమను పర్వతము, అనువునన్=విధముగా, వనజపాణి=శంఖమును జేతఁగలఁవాఁడు, పాంచజన్యము=సముద్రమునఁ బుట్టినది, ఉత్సాదింపన్=సమూలము నాశముచేయ, మేకొంటిన్=అంగీకరించితిని, పూనితిని, నుడి=మాట.

తా త్ప ర్య ము

అని మాల్యవంత మను పర్వతమువలె మాల్యవంతుఁడు కదలక నిలువఁగా విష్ణు విట్లనియె. మీకు భయపడి దేవతలు నాశరణు చొచ్చిరి. నేను వారియందు దయఁదలఁచి మిమ్ము నిర్మూలము చేసెదనని మాట యిచ్చితిని. నామాట నేను దక్కించుకొనవలెను. నా ప్రాణముల రక్షించుకొనుటకంటె నన్ను నమ్మి నాపై నాధారపడియుండు దేవతల యోగక్షేమములు భరించుట నాకుఁ బ్రియమైన పని కావున మీరు పాతాళమునకుఁ బోయినను పాపాత్ములారా! మిమ్ముఁ జంపక వదలను అని చెప్పఁగా రాక్షసుఁడు తన బలముకొలఁది శక్తియను నాయుధమును విష్ణువు ఱొమ్మున నాటుకొనవేసెను.

క. జలదంబున సౌదామిని, చెలువునఁ గడు వెలిఁగె దైత్య ◊ జిద్వక్షమునన్
బలియుఁడు శక్తిధరప్రియుఁ, డలవున నద్దాన వైచెనయ్యసురేంద్రున్. ౧౮౮

అర్థములు. జలదంబునన్=మేఘమునందు సౌదామిని = మెఱుపుఁదీఁగ, దైత్యజిత్=రాక్షసుల జయించువాని, విష్ణువుయొక్క, వక్షమునన్ = ఱొమ్ము నందు, శక్తిధరప్రియుఁడు=సుబ్రహ్మణ్యునకుఁ బ్రియుఁడైనవాఁడు. 'షాణ్మాతుర శ్శక్తిధరః కుమారః క్రౌంచదారణః' అమరము.

తా త్ప ర్య ము

నల్లని దేహకాంతిగల విష్ణువు వక్షమునందా మెఱయుచున్న శక్తి మేఘము నందు మెఱుపువలె మెఱసెను. బలవంతుఁడైన విష్ణువు ఆశక్తిని దీసి దానిచేతనే యా రాక్షసేంద్రునిఁ గొట్టెను.

చ. అదియును మాల్యవంతు నుర ◊ మందుఁ బడెన్ గిరికూటసీమపై
భిదురముచందమై యసుర ◊ వీరునివర్మము దాన భేదిలెన్
హృదయముఁ గాఁడు తన్నిహతి ◊ నెంతయు నొచ్చి చలించి క్రమ్మఱన్
మదమునఁ దెప్పిఱిల్లి ధృతి ◊ మంతుఁడు నిల్చి మహానగం బనన్. ౧౮౯

అర్థములు. ఉరమందు=ఱొమ్మునందు, గిరికూటసీమపై=కొండ నెత్తిము మీఁద, భిదురము=ఇంద్రుని వజ్రాయుధము, వర్మము=కవచము, భేదిలెన్=బద్ధ లయ్యెను, నిహతి=దెబ్బ, ధృతిమంతుఁడు=ధైర్యముగలవాఁడు.

తా త్ప ర్య ము

కొండ శిఖరము మీఁదఁబడు వజ్రాయుధము వలె నాశక్తి మాల్యవంతుని ఱొమ్మునందుఁ బడెను. ఆ దెబ్బచే వాని కవచము తెగఁగా నది ఱొమ్మునఁ గ్రుచ్చుకొనెను. ఆ దెబ్బచే వాఁడు మిగుల బాధపడి చలించి మదముచే దెప్ప ఱిల్లుకొని ధైర్యము గలవాఁడు కావున కొండవలె నిలిచెను.

చ. అతులితకంటకావృత మ । హాయసశూలముఁ ద్రిప్పి దైత్యుఁడు
ద్ధతిని స్తనాంతరస్థలిని । దాఁచి దృఢంబుగ నంతఁ బోక యా
దితసుతవైరి ముష్టిహతిఁ । దీవ్రత నొంచియు గ్రుద్ధి తార్క్ష్యున
చ్చతురుఁడు దాఁటె వెన్కకు వె । సన్ నలుమూరకొలంది నేలకున్. ౧౮

అర్థములు. అతులిత=అసమానమైన, కంటకావృత=మేకులతోఁ గూడిన, మహాయస శూలమున్=గొప్ప యినుపశూలమును, స్తనాంతరస్థలిని = ఱొమ్మునందు రెండుచన్నులకు నడిమిప్రదేశమును, తాఁచి=కొట్టి, దితిసుతవైరిన్= విష్ణువును.

తాత్పర్యము

వాఁడిగల మేకులతోఁ గూడిన యినుపశూలమును ద్రిప్పి యా రాక్షసుఁడు విష్ణువు ఱొమ్మున దానిచే గట్టిగఁ గొట్టి పిడికిట నొప్పించి గరుత్మంతుని గ్రుద్ది యా నేర్పరి నాలుగు మూరలదూర మావలికి దాఁటెను.

మ. వినతానందనుఁ డంత రోషవశుఁడై । వీచెన్ గరుద్ద్వంద్వమున్
దనుజాధీశ్వరుఁ డెండినాకువలెఁ ద । ద్వాతూలవేగంబున
జనియెన్ నిల్వఁగ లేక, యగ్రజుగతిం । దద్భ్రాత వీక్షించి త
క్కినసేనాతతిఁ గొంచు లంక దెస నే । గెన్ హ్రీనతాస్యంబుతోన్. ౧౯

అర్థములు. వినతానందనుఁడు=గరుత్మంతుఁడు, గరుత్ = ద్వంద్వమున్= రెండుఱెక్కలను, వాతూలవేగంబునన్-గాలివేగముచే, హ్రీ=సిగ్గుచేత, నత= వంచుకొనఁబడిన, ఆస్యంబుతో=ముఖముతో.

తాత్పర్యము

అంతట గరుత్మంతుఁడు కోపించి రెండు ఱెక్కలు విసరఁగా నా గాలికి రాక్షసుఁడు నిల్వలేక యెండినయాకువలె నెగిరిపోయెను. తనయన్న పడినపాటు చూచి సుమాలి సేన నంతయుఁ బ్రోగుచేసికొని సిగ్గుతోఁ దలవంచుకొనిలంకకుఁబోయెను.

—* రాక్షసులు పరాజితులై లంకఁ జొచ్చుట *—

క. ఈవిధమునఁ బలుమాఱు ర, మావిభుచే భగ్నమగుచు । మనుజాశన నా
థావళి హావళి గొనియెన్, శ్రీవరు నెదిరింప దైత్య । సేనకు వశమే? ౨౦

అర్థములు. రమావిభుచేన్ = లక్ష్మీవల్లభుఁడగు విష్ణువుచే, మనుజాశన నాథావళి=రాక్షసశ్రేష్ఠులగుంపు, హావళి=ఆపద

(ఈవిధముగాఁ బలుమాఱులు శ్రియఃపతిచే నోటుపడి రాక్షసశ్రేష్ఠుల గుంపు లాపదనొందెను. శ్రీమహావిష్ణువు నెదిరింప రాక్షస సేనకు వశమా?)

క. పంకజనేత్రున కడలుచు, లంకాపురి విడిచి యాత్మలలనలతోడన్
బింకం బఱి పాతాళము, తెంకిగఁ గొని నిల్చి రెదలు ♦ దిగ్గన నసురుల్. ౧౭౧

అర్థములు. అడలుచు=వెఱచుచు, ఆత్మలలనలు=తమతమ యాడువాండ్రు, తెంకి=ఉనికిపట్టు, ఎదలు=మనస్సులు, దిగ్గన=దడదడమనఁగా (అడలుపుట్టగా)

తాత్పర్యము

విష్ణువునకు భయపడి పౌరుషము చెడి రాక్షసులు లంక విడిచి యాఁడు వారలతోడ గుండెలు గొట్టుకొనుచుండఁ బాతాళము చేరి యందునిలిచిరి. ఇప్పటి అమెరిక యనునది పాతాళమే. అమేరుక యనునది అమెరిక యయ్యెను. మేరువు Equator భూమధ్యరేఖ, మన భూమధ్యరేఖకు చక్కఁగా క్రింది నైపున నుండు నది అమేరుక, అ+మేరు+క, ఇందు అకారము నఞ్. అతల (Atla) యను గ్రామము నేఁటికిని గలదు. అట్లాంటిక్ (Atlantic) మహాసముద్రము పూర్వము దేశము, (అతలాది) లోకములుగా నుండెను. అందు నెత్తైన భూభాగము అమెరికగా నిలిచెను. తక్కినది నీటమునిఁగి సముద్ర మయ్యెను.

క. సాలకటంకటు లనఁగా, వాలినవా రీ సురారి ♦ వర్యులు రామా!
పౌలస్త్యనామకీర్తితు, లాలంబున నీవు చంపి ♦ నట్టిసురారుల్. ౧౭౨

అర్థములు. వాలినవారు = పేరుబడినవారు, కీర్తితులు=చెప్పఁబడుచున్న వారు, ఆలము=యుద్ధము.

తాత్పర్యము

ఈ మాల్యవంతుఁడు లోనగు వారు సాలకటంకటు లనఁబడుదురు, యుద్ధమునందు నీవు చంపిన రావణాసురుఁడు లోనగువారు పౌలస్త్యు లనఁబడుదురు. సాలకటంకట సుకేశుని భార్య మాల్యవదాదులకు పితామహి దాని వంశము వారు సాలకటంకటులు.

"On the mother's side Revana is even in the present Ramayana represented as having been born of the race of Salakatankata, a name which has undoubtedly an aboriginal sound ab ut it. It reminds one of the name Xicotencatle borne by one of the chiefs of tlascale in the history of the conquest of Mexico' Riddle of Ramayana, Page 130.

క. పౌలస్త్యులకంటెను బల, శాలుఁగ మఱి సాంపరాయ ♦ చతురులు ప్రజ్ఞా
శాలులు ధైర్యస్థైర్యర, మాలసితులు రామచంద్ర! ♦ మాల్యవదాదుల్. ౧౭౩

అర్థములు. సాంపరాయచతురులు = యుద్ధమునందు నేర్పుగలవారు. ప్రజ్ఞాశాలులు=బుద్ధిమంతులు, ధైర్యస్థైర్య రమాలసితులు=ధైర్యస్థైర్య లక్ష్మిచేఁ బ్రకాశించువారు.

తా త్ప ర్య ము

రామా! మాల్యవంతుఁడు లోనగువారు పౌలస్త్యులకంటె యుద్ధమునందు నేర్పుగలవారు, బుద్ధిమంతులు, ధైర్యసంపత్తి, స్థైర్యసంపత్తిగలవారు.

క. సురకంటకు లగు నసురులఁ, బరిమార్పఁగ నెవరివశము ♦ పద్మాక్షుండౌ
నరిదర శార్ఙ్గగదాయుధ,ధరునకు నారాయణునకుఁ ♦ దక్కఁ నొకనికిన్. ౧౨౪

అర్థములు. సురకంటకులు=దేవతల బాధపెట్టువారు, అరి=చక్రము, దర=శంఖము, శార్ఙ్గ=విల్లు, గదాయుధ=గద ఆయుధముల ధరించినవానికి.

తా త్ప ర్య ము

(దేవకంటకులగు రాక్షసుల సంహరింపఁ బుండరీకాక్షుఁడు, శంఖ, చక్ర శార్ఙ్గ గదాయుధధరుఁడునగు నారాయణునకుఁ దక్కఁ నితరులకుఁ దరమా కాదనుట).

తే. నీవ నారాయణుండవు ♦ నీవ యవ్య యుండవు సనాతనుండవు(నుత్పలాంగ!
దివిజవరదచతుర్భుజుం♦డవు నజయ్యుఁడవుఁ బ్రభుండవు నీవ మా♦ధవ!మురారి!

అర్థములు. నీవ=నీవే, ఉత్పలాంగ=నీలోత్పలములవలె మనోహర శ్యామల కోమల వర్ణముగలవాఁడా, దివిజవరద=దేవతల కిష్టములొసంగువాఁడా, అజయ్యుఁడవు=జయింప నసాధ్యుఁడవు.

తా త్ప ర్య ము

నారాయణుఁడనువాఁడు మఱి యెవ్వఁడో కాఁడు. రామచంద్రమూర్తీ! నీవే నారాయణుఁడవు. అవ్యయుఁడవు నీవే. త్రికాలములందు సత్యముగ నిత్యముగ శాశ్వతముగ నుండువాఁడవునీవే. నాలుగుభుజములుగలవాఁడవు, దేవతలకు వరము లిచ్చువాఁడవు నీవ, లక్ష్మీనాథ ! మురారీ! నీవే లోకమునకుఁ బ్రభుండవు. నీవు జయింపసాధ్యపడనివాఁడవు. నిన్ను జయించిన వారెవ్వరును లేరు.

రావణవధ ముగియుటచే నవతారరహస్యము, శ్రీరామచంద్రమూర్తి పరత్వము ప్రకాశము చేయఁబడెను.

చ. అసురుల సంహరింప మను ♦ జాకృతి నొందితి వీవు, ధర్మముల్
పసచెడ నప్పు డప్పుడు వ్య ♦ వస్థ మఱిన్ ఘటించుపొంటె నీ
రస జనియించు చుండుదు వ ♦ రాతులఁ ద్రుంపఁగ సాధుకోటికిన్
వ్యసన మణంచి ప్రోవ శ ♦ రణాగతరక్షణ! ధర్మవీక్షణా! ౧౨౬

అర్థములు. ధర్మముల్=సనాతనములైన వర్ణాశ్రమ ధర్మములు, వ్యవస్థ=శాస్త్రమునందు నిరూపింపఁబడిన నియమము, ఘటియించు పొంటెన్ = చేయు

గొఱకు, ఈరసన్=ఈభూమియందు, అరాతులన్=శత్రువులను, ధర్మవీక్షణా=
ధర్మమునందుఁ జూపుగలవాఁడా, ధర్మము నిలుపు సంకల్పము గలవాఁడా.

తా త్ప ర్య ము

ఇట్టి నీవు రాక్షసులఁ జంపుకొఱకు మానుష్యాకారము ధరించితివి. ఎప్పు
డెప్పుడు ధర్మములు సారహీనములై చెడునో యప్పుడప్పుడు శాస్త్రనిరూపితము
లైన వర్ణాశ్రమ ధర్మనియమములను నిలుపుటకుఁగాను ధర్మమునకు హాని గలి
గించు విరోధుల సంహరించుటకును ధర్మస్థాపనమునందే దృష్టియు శరణాగతుల
రక్షించు దీక్షయుఁ గల నీవు జనించుచుందువు.

ఇచ్చట నగస్త్యుఁడు చెప్పిన యీ యవతార ప్రయోజనమునే శ్రీకృష్ణ
భగవానుఁడు తానే యర్జునున కిట్లు చెప్పెను.

శ్లో॥ యదా యదా హి ధర్మస్య-గ్లాని ర్భవతి భారత।
అభ్యుత్థాన మధర్మస్య-తదాత్మానం సృజా మ్యహమ్॥
పరిత్రాణాయ సాధూనాం-వినాశాయ చ దుష్కృతామ్
ధర్మసంస్థాపనార్థాయ-సంభవామి యుగేయుగే॥

ఎప్పుడెప్పుడు ధర్మ మెడరు చెందెడినో, యెప్పు డధర్మంబు వృద్ధిచెందెడినో
యప్పుడప్పుడ నేన యవని సృజింతుఁ, దప్పక నన్నునో ధర్మజావరజ!
సాధుజనంబులసంరక్ష సలుప, బాధింప దుష్కృతిపరులైనవారి
జగతి ధర్మంబు సంస్థాపనసేయ, యుగ యుగంబునఁ బుట్టు చుందుదు నేను.

ద్విపద భగవద్గీత-౪వ అధ్యాయము.

ఈ యుభయ వాక్యములవలన నవతార ప్రయోజనములు సాధువుల
రక్షించుట, ఆ నిమిత్తమై పైరు వృద్ధిచెందుటకుఁ గాను పొలములోని గడ్డిగాదము
పీకివేసినట్లు పాపాత్ముల శిక్షించుట, వర్ణాశ్రమధర్మల స్థాపించుట యీమూఁడు
కార్యములు నెఱవేర్చుటకుఁగానుఁ శరణాగత రక్షణార్థమై భగవంతుఁడు
కాలోచిత వేషమును ధరించి వచ్చుచుండును. అందు రామావతారము ధర్మ
మును స్వయముగ నాచరించి లోకమునకుఁ జూపినవాఁడు. కృష్ణభగవానుఁడు
ధర్మసందేహము తీర ధర్మ ముపదేశించినవాఁడు.

క. సరసిజనయనా! నీ కీఁకరణిని రాక్షసులజన్మ౦ కథఁ దెలిపితి శ్రీ
కర! యింక రావణాసురు, చరిత వచించెదఁ దదీయ౦జనిసత్త్వంబుల్. ౧౨౭

అర్థములు. సరసిజనయనా=కమలాక్షా (శ్రీరామచంద్రా!) ఈకరణిని=
ఈరీతిని, శ్రీకర=సంపదలిచ్చువాఁడా, తదీయ=వానియొక్క, జని=పుట్టుక,
సత్త్వంబు=బలము.

తాత్పర్యము

శ్రీరామచంద్రా! నీ కీ విధముగ రాక్షసు లనువా రెట్లు పుట్టిరి. యను విషయమును దెలిపితిని. ఇఁక రావణుఁను లోనగు వారు పుట్టిన వృత్తాంతము వారు చేసిన కార్యములు చెప్పెద వినుము.

మ. చిరకాలంబు రసాతలంబునన ల ॥ క్ష్మీనాథుభీతిన్ నిశా
చరయుక్తుఁడు సుమాలి యుండెఁ దనయా ॥ స్యం బుర్విపైఁ జూప, కీ
శ్వరమిత్రుండు సపుత్రపౌత్రుఁ డయి య ॥ క్షస్వామి లంకాపురిన్
స్థిరసౌఖ్యంబున నేలు చుండె నిటు లెం ॥ తేఁగాల మొయ్యాం జనన్. ౧౭౮

అర్థములు. చిరకాలము=చాలాకాలము, ఆస్యము=మొగము, యక్ష స్వామి=యక్షులకు ప్రభువు (కుబేరుడు) ఒయ్యంజనన్=క్రమముగా జరిగిపోగా.

తాత్పర్యము

విష్ణువు వలని భయంబున సుమాలి తల వెలుపలఁ జూపక పాతాళమందే దీర్ఘ కాల ముండెను. కుబేరుఁడు ఈశ్వరుని స్నేహము సంపాదించుకొని కొడుకుల తోను మనుమలతోను లంకానగరమునందు శాశ్వతసౌఖ్యము లనుభవించు చుండెను. ఇట్లు దీర్ఘకాలము గడచెను.

౫వ సర్గము

—* సుమాలి కూఁతుం దోడ్కొని భూలోకంబునకు వచ్చుట *—

సీ. ఒక్కనాఁడు సుమాలి ॥ యుజ్జ్వలగాత్రను బద్మంబుఁ బాసిన॥పద్మఁ బోలు
తనకూతుఁ దోడ్కొని ॥ ధరణికి నేతెంచి, వరుని నన్వేషించు॥వాంఛతోడఁ
జరియించు చొకచోటఁ॥బరికించెఁ దండ్రికి, నభివాదన మొనర్చఁ॥ మరుగువాని
స్వచ్ఛందు ధనవాథు ॥ వాసవనిభునిఁ బు లస్త్యతనూజుని లలితరూపుఁ
తే. గాంచి క్రమ్మఱి తనదులోక॥మున కేగి, యెట్లు సేయఁగ మే లగు॥నీ సురారి
వంశమున కిదియభివృద్ధిఁ॥బరఁగు నెట్లు,టంచునూహించికూఁతుడా॥యంగఁబిలిచి.

అర్థములు. ఉజ్జ్వలగాత్ర=చక్కగాఁ మెఱయుచున్న శరీరముగలది, పద్మఁ బోలు=లక్ష్మీదేవినిపోలు, వరుఁడు=పెనిమిటి వాంఛ=కోరిక, చరియించుచు= తిరుగుచు, అభివాదనము నమస్కారము, స్వచ్ఛందుఁడు స్వతంత్రుఁడు,క్రమ్మఱి= మరలి, కూతు=కూతురిని, డాయంగఁబిలిచి=దగ్గరకు రమ్మని పిలిచి.

తాత్పర్యము

ఒక్కనాఁడు సుమాలి ప్రకాశించు దేహము గలట్టియు కమలముఁ బాసి చరించు లక్ష్మీదేవి వంటిదియు నగు తన పుత్రికను దోడుకొని భూలోకమునకు వచ్చి దీనికిఁ దగిన వరుఁ డెవ్వఁడా యని వెదకుచు నొకనాఁడు తన తండ్రికి

నమస్కరించి పోవుచున్న కుబేరుని స్వేచ్ఛగాఁ జరించువానిని నింద్రునితో సమానుఁడగు వానిని బులస్త్యపుత్రుని సుందరాకారునిఁ జూచి మరల తన లోకమునకుఁ బోయి యీ రాక్షసవంశమువృద్ధియగు నుపాయ మేది? ఏమి చేసిన నిది బాగుపడును? అని ఆలోచించి కూఁతును దన సమీపమునకుఁ బిలిచి యిట్లనియె.

ఉ. బాలిక! నీకు యౌవనము ♦ వర్తిలు చున్నది, పెండ్లి సేయఁగాఁ
గాల మిదే, తిరస్కృతినిఁ ♦ గందునో యంచును సాధ్వసంబునన్ ?
మే లగుచుట్ట మెవ్వఁడును ♦ మేకోనఁ డయ్యెను ని న్వరింప ల
క్ష్మీలలనాసమానవు వి ♦ శిష్టగుణాన్విత వీవు కూఁతురా ! ౧౮౦

తా త్ప ర్య ము

కూఁతురా ! నీవు లక్ష్మీదేవితో సమానురాలవు. శ్రేష్ఠము లయిన సద్గుణములు గల దానవు. నీకు యౌవనము వచ్చినది. ఇదియె నీకుఁ బెండ్లి చేయ సమయము. అయినను మన చుట్టములం దెవఁడును నిన్నుఁ దన కిమ్మని యడిగిన నే నియ్యనందునను భయముతో నిన్ను వరింప వచ్చినవాఁడు కాఁడు, అట్టివారికి నేనై బలవంతముగాఁ బిలిచి ని న్నొట్లొత్తును? వధువును గోరుట వరునకు ధర్మము గాని వధువు వరుని వెదకుచుఁ బోవుట కులధర్మము గాదు. పిలిచియైన ని న్నియ్యఁ దగినంతవాఁడు మనలో లేఁడు.

క. కావున నీ కర్హు మహా, భావునిఁ బెనిమిటినిగూర్పఁ ♦ బడెదఁ బ్రయాసం
బో వెలఁదుక! నీకతమున, నీవంశము వెలయఁగా న ♦ భీష్టము నాకున్ ౧౮౧

తా త్ప ర్య ము

ఈ కారణముచే నీకుఁ దగినవానిని గొప్పమహిమ గలవానిని భర్తగా నీకుఁ గూర్ప నే నెంతో శ్రమపడుచున్నాను. నీవలన నీ వంశము వృద్ధిగావలయునని నాకోరిక.

క. గౌరవముం గాంక్షించెడు, పూరుషునకుఁ గూఁతు రొకతె ♦ పుట్టినయేనిన్
గూరును దుఃఖం బెవఁడా, యీరమణికి మగఁడటంచు ♦ నెసఁగినచింతన్. ౧౮౨

తా త్ప ర్య ము

నానిమిత్తమై నీ వేల యింత శ్రమపడెద వందువా? గౌరవముగోరుపురుషునకుఁ గూఁతురు పుట్టినా యది పుట్టినది మొదలు దీనికిఁ దగిన మగఁ డెవఁడు దొరకునా యను విచార మతని బీడించుచుండును.

కన్యకను తగిన వరునకీయక తన యిచ్చకొలఁది నెవనికో యొకని కిచ్చిన బ్రహ్మహత్య వచ్చును. కావునఁ దగినవరునకే కన్యకనీయవలెను. అయోధ్య కాండము ౨౫౮౦-౨౫౮౧ పద్యములఁ జూచునది.

క. జననీవంశమువారిని, జనకు కులమువారి స్వపతి సంతతివారిన్
దనయా! కన్యక సంశయమునఁ ద్రోయు సదా యకీర్తి ముంచునోయనుచున్

తాత్పర్యము

ఆఁడుపిల్లవలన దుఃఖించువాఁడు తండ్రి యొక్కఁడేకాఁడు. కన్యక యే వేళను నే దుర్బుద్ధి గలదై కామదాసియై యే చేయరాని పనిచేసి యపకీర్తియుఁ బరలోక హానియుఁ గలిగించునోయని దాని తండ్రివంశమువారిని, దన తల్లివంశము వారిని, దన మగనివంశమువారిని సందేహ సముద్రమున నెల్లప్పుడు ద్రోయును. కావునఁ గన్యకను నన్నివిధములఁ దగినవరునకే యివ్వవలయును.

ఉ. కావున నీవు విశ్రవునిఁ గంజభవాన్వయు మౌనివర్యు స
ద్భావమునన్ వరింపు పతి భావముఁ దాలిచి తన్మహానుకం
పావిభవంబునన్ సుతుల భాస్కరతేజులఁ గాంచుదాన వ
మ్మా! విదితప్రభావుల ధ నాధిపునిం బురుడించువారలన్. ౧౦౪

అర్థములు. కంజభవాన్వయున్=బ్రహ్మవంశమునఁ బుట్టిన వానిని, తత్= అతనియొక్క, మహానుకంపావిభవంబునన్ = గొప్పదయయొక్క సమృద్ధిచే, భాస్కరతేజులన్=సూర్యకాంతి కలవారిని, విదిత ప్రభావులన్ = ప్రసిద్ధికెక్కిన మహిమ గలవారిని, పురుడించు=పోలు.

తాత్పర్యము

కాఁబట్టి నీవు పోయి బ్రహ్మవంశమునఁ బుట్టిన విశ్రవసుఁడను మునిని మగనిగా వివరింపుము. ఆయన దయను నీవు సంపాదించుకొంటివా సూర్యునివంటి ప్రకాశము గలవారిని బ్రసిద్ధికెక్కిన మహిమ గలవారిని కుబేరునితో సమానమగు వారిని పుత్రులఁ గనెదవు.

—* కైకసి విశ్రవసు నాశ్రమంబునకు వచ్చుట *—

ఉ. భాసురతేజ! పుణ్యజన వల్లభు నీవును గంటి గాదె యు
ల్లాసము మీఱఁ బోవ నబ లా! చనుమీ యనఁ దండ్రియానతిం
జేసి వధూమతల్లి చని చెచ్చెరఁ గైకసి మౌనియాశ్రమ
క్ష్మా సొబగారఁ జేయుచు వికాసముఖాంబుజయై రహించుచున్. ౧౦౫

అర్థములు. పుణ్యజనవల్లభున్=యక్షులకు రాజగు కుబేరుని 'పుణ్యజన స్సుజనే స్యా ద్రక్షసి యక్షే' నానా ॥౪॥ వధూమతల్లి స్త్రీలయందు శ్రేష్ఠురాలు; ఆశ్రమక్ష్మా=ఆశ్రమభూమి, వికాసముఖాంబుజ=విచ్చిన ముఖకమలము గలది, రహించుచున్=ప్రకాశించుచు.

తా త్ప ర్య ము

ప్రకాశించు తేజస్సు గలదానా! కుబేరుఁడు సంతోషముతోఁ బోవ నీవు కూడఁ జూచితివికదా. కావున నీవుకూడఁ బొమ్ము అని చెప్పగా నా కన్యారత్నము కైకసి పోయి మునీశ్వరు నాశ్రమభూమిని నలంకారము గలదానినిగాఁ జేయుచు సంతోషముచే విచ్చిన ముఖముగలదై ప్రకాశించుచు.

చ. వినుతసుశీలుఁ జేరఁ జన ◊ విశ్రవు డప్పుడు వేల్చి సంజవే
ళను వెలుఁగొంద నాల్గనజ్వ ◊ లద్దహనుం డనఁ గ్రూరకాలమం
చను గణియింప కా యువతి ◊ చూచుచు మక్కువ నమ్మునీశ్వరున్
దన కొనయుంగుటంబునను ◊ ధారిణి గీయుచు నేలఁ జూచుచున్. ౧౭

అర్థములు. సంజవేళను=సాయంకాలమున, జ్వలత్=మండుచున్న. దహనుఁడు=అగ్నిహోత్రుఁడు, ఉంగుటంబునను=కాలి బొటన వ్రేలిచే.

తా త్ప ర్య ము

ప్రసిద్ధి కెక్కిన మంచి యాచారముగల విశ్రవుని చేరఁబోఁగా నప్పుడాయన సంధ్యవేళఁ జేయవలసిన హోమము నెరవేర్చి యామూఁడగ్నులతోఁదాను నాలుగవ యగ్నివలెఁ బ్రకాశించుచుండఁగా నది సాయంకాల మనియుఁ గ్రూరకాల మనియుఁ గూడ లక్ష్యపెట్టక యా యువతి యా మునీశ్వరుఁ గామముతోఁ జూచుచుఁ దనకాలి బొటనవ్రేల నేల రాయుచు నేలఁ జూచుచు.

చ. నిలిచినఁ బూర్ణచంద్రముఖి ◊ నీరజలోచన సింహమధ్య నా
కులపతి గాంచి యిట్టు లనుఁ ◊ గోమలి యెవ్వరిదాన వేల యిం
దుల కరుదెంచి తేమిపని ◊ తొయ్యలి పల్కు మటన్న హస్తముల్
సలలితశీల మోడ్చి ముని ◊ సత్తము మ్రొక్కి వచించె నీగతిన్. ౧౮

అర్థములు. కులపతి=పదివేల శిష్యుల కన్నముపెట్టి చదువుచెప్పు వానికి కులపతి యనిపేరు. "మునీనాం దశసాహస్రం యోన్నదానాది పోషణాత్, అధ్యాపయతి విప్రర్షి రసౌ కులపతి స్మృతః" ఇందులకున్=ఈప్రదేశమునకు.

తా త్ప ర్య ము

నిలువఁబడఁగా పూర్ణచంద్రునివంటి ముఖము, కమలములవంటి కనులు, సింహము నడుమువంటి నడుము గలదానిని జూచి కులపతి యగు విశ్రవసుఁడు ఓ కోమలీ! నీవెవ్వరిదానవు? ఇచ్చటికేల వచ్చితివి? చెప్పుమని యడుగఁగా నది చేతులు జోడించి మ్రొక్కి మునీశ్వరునితో నిట్లు చెప్పెను.

చ. మునివర తండ్రియాజ్ఞను మి ♦ మ్ముం గన వచ్చితి, బేరఁ గైకసిన్
వనజభవాన్వవాయమణి! ♦ నామత మాత్మమహానుభావత
న్గన నగు నన్న నాతఁడు క్ష ♦ ణంబు తలంచి యెఱింగి సర్వమున్
వనితకు నిట్లు పల్కె మగు ♦ వా! భవదాశయ మే నెఱింగితిన్. ౧౮౮

అర్థములు. వనజభవాన్వవాయమణి = బ్రహ్మవంశమున శ్రేష్ఠుఁడా, నా మతము=నా యభిప్రాయము, ఆత్మమహానుభావతన్=నీ తపోమహిమచేత, భవదాశయము=నీయభిప్రాయము.

తా త్ప ర్య ము

మునీశ్వరా! తండ్రియాజ్ఞప్రకారము మిమ్ము నేను జూడవచ్చితిని. నాపేరు కైకసి. నే నేల వచ్చితినో దానిని మీ తపోమహిమచే మీరే తెలిసికొనవలయును అని చెప్పఁగా క్షణకాల మాలోచించి సర్వము తెలిసికొని దానితో నిట్లనెను. ఓసీ! నీయభిప్రాయము నేను దెలిసికొంటిని.

క. తనయాభిలాష వచ్చితి, కననై తివి క్రూరవేళ ♦ కావునఁ గ్రూరల్
తనయులు క్రూరాకారులు జనియింతురు నీకు రాక్ష♦సప్రాగ్రసరుల్. ౧౮౯

అర్థములు. తనయాభిలాష=కొడుకులు కావలయునను కోరికచేత, రాక్షసప్రాగ్రసరుల్=రాక్షస శ్రేష్ఠులు.

తా త్ప ర్య ము

కొడుకులు కావలయు నను కోరికతో వచ్చితివి కాని యిది క్రూరవేళయని నీ వాలోచించినదానవు కావు ఇట్టి క్రూరవేళ నీకీ సంకల్పము గలిగెను గావున నీకు క్రూరులైన రాక్షసశ్రేష్ఠులు పుత్రులుగాఁ బుట్టుదురు.

సాయంసంధ్యాసమయంబున దితి కశ్యపునితో రమించుటచే హిరణ్యాక్ష హిరణ్యకశిపు లుదయించిరి. భాగవతము తృతీయస్కంధము ౪౬౦వ పద్యము.

గీ. తరళలోచన! నీవు సంతానవాంఛఁ, జేసి వచ్చితి పొంగులశీల వర్త
నములుగల భార్య మనమున నమరుకోర్కెఁ, దవిలితీర్చుట పతికిఁగర్తవ్యమరయ.

మ. తరుణీ! యొక్కముహూర్తముండు మిది సంధ్యాకాల మికాలమం
దరయం భూతగణావృతుం డగుచుఁ గామారాతి లీలన్ వృషే
శ్వరయానంబున సంచరించుట నభ్యావం బయ్యె నీ యుగ్రవే
ళ రమింపంగ నిషిద్ధకర్మ మగు నేలా ధర్మమున్ వీడఁగన్.

ఇట్లు చెప్పినను వినక దితి.

క. మునుకొని లజ్జావనతవ, దనయై ప్రాణేశు కొంగుఁ దాలిమి దూలం
బెనఁగొనియె వార కామిని, యనువును వినిషిద్ధకర్మమందభిముఖియై, ౪౭౦పద్యము

ఫలము—క॥ పరఁగిన దర్పోద్ధతు లి,ద్ధలుకొడుకులు నీకుఁ బుట్టి ధరణికి వ్రేఁగై
నిరతము బుధజనపీడా,పరులై వర్తింతు రాత్మబలగర్వమునన్.

శివుఁడు తమోగుణ విశిష్టుఁడు కావున సాయంసమయమునఁ గ్రీడించినచో నాయనదృష్టివలనఁ దమోగుణ విశిష్టులై క్రూరులైన పుత్రులు కలుగుదురు. గర్భము నిలిచినపుడు బ్రాహ్మవేళ యయ్యేనేని బ్రహ్మదృష్టి యగుటచే రజోగుణ విశిష్టు లగు పుత్రు లుదయింతురు. విష్ణువుదృష్టి పడెనేని సాత్త్వికులుదయింతురు.

'యా నపశ్యే జాయమానాన్ పాపినో మధుసూదనః. బ్రహ్మరుద్రోధవా పశ్యే(ద్రజసా తమసా వృతాన్, తై రాలాపం నకుర్వీత నాసద్భిః కించి దాచరేత్'॥ ఏ పాపాత్ముల విష్ణుదృష్టి పడని వేళ, బ్రహ్మరుద్రుల దృష్టి పడినవేళ జనింతురో యట్టి రాజస తామసులతో మాటలాడరాదు వారి కొఱకే కార్యము చేయ రాదు.

దీనివలన విశ్రవసునకుఁ గైకసి వివాహిత భార్య కాదని యేర్పడుచున్నది.

—* రా వ ణ కుం భ క ర్ణ వి భీ ష ణ జ న న ము *—

సీ. అనవుడుఁ గైకసి ♦ యనియె నో'బ్రహ్మవా,దీశ్వర! నను క్షమి.♦ యింపు నీకుఁ
గలిగెడు పుత్రులు ♦ కఠినచిత్తులు దురా,చారులు గావుట ♦ సమ్మతింప
ననిన నీ కడగొట్టు ♦ తనయుఁడు ననునంటి, వాఁడు ధర్మాత్ముఁడై ♦పరఁగునిజము
కొమ్మ యన్నను సతి ♦ నెమ్మది నట నుండి, కొంతకాలం బేగఁ ♦ గొడుకుగనియె
తే. దీర్ఘదంష్ట్రు దశగ్రీవు♦దీప్తకేశు, నంజనచయాభుఁ దామ్రోష్ఠు♦నతులభయద
రూపు వింశతిభుజు మహా♦క్రూరు రాక్ష,సాకృతిని నప్పు డశని చ♦యంబులురలె

అర్థములు. దీర్ఘదంష్ట్రున్ = నిడివికోరలు గలవానిని, దశగ్రీవున్=పది మెడలు(శిరస్సులు)గలవానిని, దీప్తకేశున్=ప్రకాశించు వెండ్రుకలు గలవానిని, అంజనచయాభున్=కాటుకకుప్పవంటి వానిని, తామ్రోష్ఠున్ = ఎఱ్ఱని పెదవులు గలవానిని, అతుల=అసమానమైన, భయద=భయము కలిగించు రూపున్= ఆకారము గలవానిని, వింశతిభుజున్=ఇరువది చేతులుగలవానిని, మహాక్రూరున్= బొత్తిగ దయలేనివానిని, రాక్షసాకృతిని=రాక్షసరూపము గలవానిని, అశనిచయంబులు=పిడుగుల సమూహములు, ఉరలెన్=పడెను.

తా త్ప ర్య ము

విశ్రవసుఁ డిట్లు చెప్పఁగాఁ గైకసి, యోబ్రహ్మవేత్తలందు శ్రేష్ఠుఁడా! నన్ను క్షమింపుము. నే నెట్టిదాననైనను నీకుఁ గలిగెడు పుత్రులు క్రూరులుదురాచారులు నగుట కంగీకరింపనని చెప్పఁగా విశ్రవసుఁ డిట్లనియె. చేయరానిపని చేసి

దానిఫలము నేను సమ్మతింప ననిన నెట్లు తప్పును ? అయినను నీకడగొట్టుకొడుకు నన్నుఁ బోలి ధర్మాత్ముఁడై యుండును. అనిన నది సమ్మతించి కొంతకాల మచటనే యుండెను. ఇట్లు కొంతకాలము పోఁగా నది నిడుపాటి కోఱలు, పదితలలు, ఎఱ్ఱని వెండ్రుకలు, ఎఱ్ఱని పెదవి, ఇరువది చేతులు భయంకరమైన యాకారము గల వానిని కాటుకసమూహమువలె నల్లనివానిని మిక్కిలి క్రూరుని రాక్షసాకారునిఁ గనెను. అప్పుడు పిడుగులు రాలెను.

క. కురిసెను నెత్తురువానలు, మొరసె ఖరస్వనము లగుచు ◊ మొగుళులు సత్త్వో
త్కర మపసవ్యము దిరిగెను, ధరణి వణఁకె దేజు మాసెఁ ◊ ధరణియునంతన్

అర్థములు. మొరసెన్=ధ్వనించెను, సత్త్వోత్కరము=జంతుసమూహము, అపసవ్యము=అప్రదక్షిణము.

తాత్పర్యము

నెత్తురువానలు గురిసెను. మేఘములు కఠినస్వరముల ధ్వనించెను. జంతువుల ప్రదక్షిణము తిరిగెను. భూమి వణఁకెను. సూర్యునికాంతి మాసెను.

రావణునకుఁ దండ్రి బ్రాహ్మణుఁడైనను, దల్లి రాక్షసరాజకన్య కావున బ్రాహ్మణునకు క్షత్రియ స్త్రీయందు క్షత్రియుఁ డగునే కాని బ్రాహ్మణుఁడు కానేరడు.అందు కైకసి వివాహితయుఁ గాదు. దానికిఁదోడు రావణుని వృత్తియు క్షత్రియ వృత్తియే.

ఈ పద్యమువలన రావణాసురుఁడు పుట్టినపుడే పదితలలతోఁ బుట్టెననియుఁ బదితలలు కృత్రిమములు గావనియు నేర్పడుచున్నది.

క. విశదయశుండును ధాతృసదృశుఁ డగునమ్ముని వచ్చి ◊ దృష్టించి సుతున్
దశకంధరుఁ డగుకతమున, దశకంధరుఁ డనుచు నిడియెఁ ◊ దన్నామంబున్.

అర్థములు. విశదయశుఁడును=తెల్లని కీర్తిగలవాఁడు, ధాతృసదృశుఁడు=బ్రహ్మతో సమానుడు, దశకంధరుఁడగు కతమునన్=పదిమెడలు గలవాఁడగుటచే, తన్నామంబున్=వానిపేరును.

తాత్పర్యము

నిర్మలకీర్తి గలిగి బ్రహ్మతో సమానుఁడగు విశ్రవసుడు వచ్చి కొడుకును జూచి పదిమెడలుగల వాఁ డగుటచే దశకంధరుఁ డని వానికి బేరు పెట్టెను.

సీ. కొలఁది చెప్పఁగరాని ◊ క్రూరరూపమువాఁడు, కుంభకర్ణుం డను◊కొడుకుపుట్టె
నావల శూర్పణ◊ఖాఖ్య సంభవమందెఁ గుటిల విరూపాస్య ◊ కూఁతు రగుచుఁ
బశ్చిమసుతుఁ డయి◊ప్రభవించె ధర్మాత్ముఁ, డగు విభీషణుఁ డంబ◊హర్ష మంద
నతఁడు జనించిన ◊ యదనునఁ బుష్పవర్షము రాలె దుందుభి◊రవము నెఱసె

ఆ. మింట భూతవితతి ॰ మేలు మే లని మెచ్చె, వారలెల్ల మౌనివర్యునాశ్ర
మంబునంద పెరిగి ॰ మహితతేజస్కులై, తనరుచుండఁ జిన్నతనమునుండి.

అర్థములు. పశ్చిమ సుతుఁడు=కడపటి కొడుకు, అంబ=తల్లి, హర్ష మందన్=సంతోష మందఁగా-అనుటచేఁ దక్కినవారి యెడ నామె సంతోషింప లేదని భావము. అదనునన్=సమయమందు.

తాత్పర్యము

(ఇంత ప్రమాణమని చెప్ప వీలులేని క్రూరమయిన రూపముగల కుంభకర్ణుఁడను కొడుకు పుట్టెను. తరువాతఁ గుటిలాత్మురాలు వికటరూపమయిన ముఖముగల శూర్పణఖ యనెడు కూఁతురు పుట్టెను. అందఱకు కడకొట్టు కొడుకయి ధర్మాత్ముఁడయిన విభీషణుఁడు పుట్టెను. అతఁడు జన్మించిన సమయమున పూలవాన గురిసెను. దుందుభులు మింట మొఱసెను-భూతము లన్నియు మేలు మేలని మెచ్చుకొనెను. వారందఱు తండ్రియయిన విశ్రవసు నాశ్రమమందే పెరిగి గొప్ప తేజఃగల వారయి యుండఁగా, చిన్నతనము నుండియు)

తే. క్రూరులయి దశకంఠుండుఁ ॰ గుంభకర్ణుఁ డుర్వికిని బాధఁగలిగించు ॰ చుండిరందుఁ
గుంభకర్ణుండు మునులఁ ॰ గూల్చి తినుచు, దుష్టచరితల మిగుల సం ॰ తుష్టిగనియె.

తాత్పర్యము

(క్రూరాత్ములయి దశకంఠుఁడు, కుంభకర్ణుఁడు భూమియందలి ప్రాణులను బాధించుచుండిరి అందులోఁ గుంభకర్ణుఁడు మునులనుజంపి తినుచు, దుష్టవ్యాపారములు చేయుచు మిగుల సంతోషించెను.)

క. శ్రుతులఁ బఠించుచు నింద్రియ తతి గెల్చి మితాశనుండు ॰ ధర్మాత్ముండై
మతిమంతుండు విభీషణుఁ, డతులిత సాధుత్వగరిమ ॰ యశముం గాంచెన్ ౧౬౫

అర్థములు. శ్రుతులన్=వేదములను, మితాశనుండున్=మితమైన యాహారము గలవాఁడు, సాధుత్వగరిమన్=మంచితనముయొక్క యతిశయముచే.

తాత్పర్యము

(వేదములను జదువుచు, నింద్రియములను గెలిచి, మితాహారమును గొనుచు ధర్మాత్ముఁడై బుద్ధిమంతుఁడగు విభీషణుఁడు పరమ సాధువనెడి ప్రఖ్యాతి పడసెను.)

చ. అరుగఁగఁ గొంతకాల మిటు ॰ లావల నొక్క దినంబునందుఁ గి
న్నరపతి ప్రమొక్క తండ్రికి ఘ ॰ నం బగు తేజముతోడఁ బోవ నా
సురపతి పంక్తికంఠుఁ గని ॰ చూచితె పుత్రిక ! నీదుభ్రాత యే
కరణి మహానుభావతన ॰ గ్రాలెడినో విభవాభి రాముఁడై. ౧౯౬

అర్థములు. కిన్నరపతి=కుబేరుఁడు, మహానుభావతను=గొప్ప మహిమచే విభవాభిరాముఁడై=సంపదచే నొప్పినవాఁడై.

తాత్పర్యము

రావణాదులు పెద్దవారైన పిమ్మట నొకనాఁడు తండ్రికి నమస్కరించి మిక్కిలి తేజస్సుగలవాఁడై పోవుచున్న కుబేరునిఁ దన కొడుకునకుఁ జూపి చూచితివా నాయనా! మీయన్న యెంత సంపదగలవాఁడై గొప్పమహిమగలవాఁడై యున్నాఁడో.

చ. అటువలె మీర లెప్పు డొకొ ◊ యాట యటన్నను బంక్తికంఠుఁడున్
స్ఫుటతర రోషమూని తల్లిఁ ◊ జూచి వచించెను, బాసఁ జేసెదన్
బటుతర వైభవంబునను ◊ వానికంటె మిన్ననై
యటు లొనగూడకున్న సరి ◊ యయ్యెద వీడుము నీమనోవ్యథన్. ౧౯౭

తాత్పర్యము

వానివలె మీ రెప్పుడౌదురో కదా యనఁగా దల్లినిజూచి దశకంఠుఁడు రోషము గలవాఁడై యిట్లనియె. తల్లీ! నీ మనోవేదన వదలుము. ప్రమాణము చేయుచున్నాను. వైభవమునందు వీనికంటె గొప్పవాఁడ నయ్యెదను. అట్లు కాఁజాలనేని సమానుఁడుగ నైన నయ్యెదను.

క. పెనుదపమున నాకార్యముఁ, గొనసాగించెద నటంచు ◊ గోకర్ణంబున్
జని తమ్ములతోఁ దపముం, బొనరించె నభీష్టవరముఁ◊బొందెన్ విధిచేన్. ౧౯౮

తాత్పర్యము

(పెద్ద తపస్సుచేసి నా కార్యమును గొనసాగించెదనని తమ్ములతో గోకర్ణమునకుఁ బోయి దప మొనరించి బ్రహ్మచే నభీష్టవరములను బొందెను.)

—౧౦వ సర్గము—

—: అగస్త్యుఁడు శ్రీరామునకు రావణాదుల తపోవిధంబుఁ జెప్పుట :—

క. నావుడు నాదేవాహితు, లేవిధమునఁ దపముచేసి ◊ రెఱిఁగింపుము పా
రావారపానచణ యని, క్ష్మావిభుఁ డడుగంగఁ గలశసంభవుఁడనియెన్. ౧౯౯

అర్థములు. పారావార పానచణ=సముద్రమును బానముచేసిన సమర్థుఁడా, కలశసంభవుఁడు=ఘటమునందుఁ బుట్టినవాఁడు, ఈకథ ముందు రాఁగలదు.

తాత్పర్యము

సముద్రమును ద్రావిన మహానుభావా! ఆరాక్షసు లెట్టుల దపస్సుచేసిరి తెలియ జెప్పుఁడు.)

సీ. ధర్మమార్గంబును ◊ దలఁగక తపియించె, గుంభకర్ణుం డతి ◊ ఘోరభంగి
మండు నెండల నైదు ◊ మంటలనడుమను, వానకారున జడి ◊ వానలందు
మంచుకారున నీటి ◊ మధ్యంబునను నిల్చి, పదివేలవర్షముల్ ◊ పరమతపము
సలిపె విభీషణుం ◊ డలఘు ధర్మస్థితి నేకపాదంబున ◊ నిలను నిల్చి
తే. నైదువే లబ్దములు తప ◊ మాచరించి
యంతకాలంబ మఱియు సూ ◊ ర్యాభిముఖుఁడు
నగుచు స్వాధ్యాయదృఢచిత్తుఁ ◊ డగుచు నూర్ధ్వ
మూర్ధ్వ బాహుఁడు డగుచు ని ◊ ర్మోహమతిని. ౨౦౦

అర్థములు. వానకారున=వర్షాకాలమందు, మంచుకారునన్=మంచుకురియు హేమంతమునందు.

తా త్ప ర్య ము

ధర్మపద్ధతి వదలక కుంభకర్ణుఁడు ఎండలు మండుచున్న గ్రీష్మమందు పంచాగ్ని మధ్యమునను, వానకాల మందు జడివానలందును, మంచుకాలమున నీళ్ళనడుమను నిలిచి పదివేల సంవత్సరములు తపస్సు చేసెను. విభీషణుఁడు ధర్మమందున్న వాఁడై యొంటికాలిమీఁద నిలబడి యైదువేల సంవత్సరములు తపస్సుచేసి యావల సూర్యుని జూచుచు దృఢముగ మంత్రము జపించుచు చేతులు తలమీఁది కెత్తి మోహము వదలినవాఁడై యైదువేల సంవత్సరములు.

క. నందనమున నాకాలయుఁ, చందంబునఁ దప మొనర్ప ◊ సదయాత్మునిపైఁ
జిందెను సుమనోవర్షము, బృందారకు లంత సంక్షు ◊ భితులై యడలన్. ౨౦౧

అర్థములు నాకాలయు చందంబునన్=దేవతలవలె, సదయాత్మునిపై= దయగల మనస్సు గలవానిపై, సుమనోవర్షము=పూలవాన, బృందారకుఁలు=దేవతలు, సంక్షుభితులు=కలఁత చెందినవారు.

తా త్ప ర్య ము

(నందన వనమునందు దేవతవలెఁ దప మొనరింపఁగా దయగల మనస్సు గల వానిపైఁ బూలవాన గురిసెను. దేవతలు కలఁతచెందిన వారయి భయపడునట్లుగా.)

సీ. పదివేలయేఁడులు ◊ పంక్తికంఠుఁడు నిట్టు, పాసంబు గాఁగఁ దంపం బొనర్చె
వర్షసహస్రంబుఁపరిపూర్తి యగుడును, దల నొండు గోసి యంగ్నిలను వేల్చె
వేయింటి కొకటి నిఁవిధిఁ దలల్ తొమ్మిది,యగ్ని కాహుతిఁ జేసెంనజునిగుఱిచి
పదియవ వేయేఁటి ◊ తుదఁ బదియనతల, హోమంబుఁ గావింపఁనున్నయంత
తే. సర్వరాస్వేతుఁ డగుచు వాంణీవిభుండు వానిఁ జేరంగ వచ్చి యోంపంక్తివదన!
మెచ్చితిని నీమతపము నీఁయిచ్చఁ జెపుమ,సఫలమొనరింతు నీపరిశ్రమమువత్స!

అర్థములు. నిరుపాసంబు = శుష్కోపవాసము, వర్షసహస్రంబు=వేయి యేడులు, నిర్జరాన్వితుఁడు=దేవతలతోఁ గూడినవాఁడు, వాణీవిభుండు=బ్రహ్మ, పరిశ్రమము=కష్టము, వత్స=నాయనా.

తా త్ప ర్య ము

దశకంఠుఁడు పదివేల సంవత్సరములు నిరాహారియై తపము చేసెను. అందు వేయి సంవత్సరములు పూర్తి కాఁగానే తన తలలలో నొక తలఁ గోసి యగ్ను లందు హోమము చేసెను. ఈ ప్రకారము వేయి సంవత్సరముల కొకటి వంతున తొమ్మిది తలలు బ్రహ్మదేవు నుద్దేశించి యగ్నిలో హోమము చేసెను. ఆవలఁ బదియవ వేయి సంవత్సరములు తపస్సుచేసి పదియవ తల హోమము చేయఁ బ్రయత్నించుచుండఁగా దేవతలతోడ బ్రహ్మదేవుఁడు ప్రత్యక్షమై యోయి పంక్తికంఠా! నీ తపమునకు మెచ్చితిని. నీయిష్టము చెప్పుము. నీవు పడిన శ్రమము సఫలము చేసెదను అనెను.

—* బ్రహ్మ రావణునకు వరములిచ్చుట *—

క. అనవుడుఁ బంక్తిగ్రీవుం డనుపమ హర్షాబ్ధిఁ దేలి ♦ యాడఁగ జిత్తం
బనిమోఁ గరంబుల మోడిచి, వనజాసన! వరద! భక్త ♦ వత్సల! దేవా! ౨౦౭

అర్థములు. అనుపమ హర్షాబ్ధిన్=అసమానమైన సంతోష మను సముద్రమందు.

తా త్ప ర్య ము

(అని చెప్పఁగా దశగ్రీవుఁడు సాటిలేని సంతోష సముద్రమున మునిఁగి చేతులు జోడించి, వనజాసనా! వరదా! భక్తవత్సల! దేవా!)

క. జీవికి మరణభయము గా,కావల భయ మేది గలుగ ♦ దనవరతంబున్
జీవికి మృత్యువుతో సరియౌ వైరియు లేదు గాన ♦ నమరత నిడవే. ౨౦౮

తా త్ప ర్య ము

ప్రాణముగలిగి జీవించువానికిఁ జావునకు మించిన భయములేదు. సర్వదా ప్రాణికి మరణముతో సమానమైన శత్రువు లేఁడు కావున నాకుఁ జావు లేకుండ వర మిమ్ము.

క. నావుడుఁ బద్మజుఁ డిట్లను నేవారికి నైన వచ్చు ♦ నే యీాయ దశ
గ్రీవా! యమరత్వంబును, నీ వొండువరంబుఁ గోరుమిా గున నతఁడున్. ౨౦౯

అర్థములు. పద్మజుఁడు=బ్రహ్మ. అమరత్వము=చావులేమి.

తా త్ప ర్య ము

దశకంఠా! అమరత్వము నెవరి కనిన వారికెల్ల నీయరాదు కావున వేఱొక వరముఁ గోరుము అని బ్రహ్మ చెప్పెను.

చ. అనిమిషదైత్యయక్షదను ♦ జాహిసుపర్ణ పలాశికోటిచే
వనజజ! మృత్యువుం గనమి ♦ వాంఛిత మీ వర మిమ్ము సత్కృపన్
మనుజులఁ దక్కువారిఁ దృణ ♦ మాత్రము గాఁగ గణింతు లెక్కగాఁ
గొనుదునె వారి నన్న నల ♦ కోర్కి యొసంగి విధాత వెండియున్. ౨౦౬

అర్థములు. అనిమిష=దేవతలయు, దైత్య=దైత్యులయు, యక్ష=యక్షులయు, దనుజ=దానవులయు, అహి=పన్నగులయు, సుపర్ణ=గరుడులయు, పలాశి=రాక్షసులయు, కోటిచేఁ=సమూహముచే, వనజజ=బ్రహ్మదేవా, వాంఛితము=కోరిక.

తా త్ప ర్య ము

బ్రహ్మదేవా! దేవతలు మొదలగు వారిచే నాకుఁజావు లేకుండ వర మిమ్ము. మనుష్యులను నంతకుఁ దక్కువ జీవులను దక్కిన వారిని తృణముగా నేను జూతును కావున వారిని లక్ష్యము సేయను అని చెప్పఁగా నట్లులే యగునని బ్రహ్మ మఱియు నిట్లనియె.

ఉ. ప్రీతుఁడ నైతి నీవలన ♦ వేఱొక మేలు ఘటింతు మస్తక
వ్రాతము నీవు వేల్చినది ♦ క్రమ్మఱ నెప్పటియట్ల గల్గు, నీ
చేతమునం దలంచినటు ♦ చేకొనఁజాలుదు నెట్టిరూపమేన్
ఖ్యాతచరిత్ర నావరము ♦ కల్మినటం చన నింతలోపలన్. ౨౦౭

తా త్ప ర్య ము

నీ విషయమున నేను సంతోషించితిని. కావున నీవు కోరినది గాక మఱి యొక మేలు సమకూర్చెదను. నీవు నన్నుద్దేశించి హోమము చేసిన తలలు మరల నెప్పటియట్ల కలుగును. అదిగాక నీ వేరూపము నెత్తఁదలఁచిన నారూప మెత్తఁ గలవాఁడవగుదువు అని చెప్పుచున్నంత.

క. రాక్షసుఁడు మున్ను లోకము, వీక్షింపఁగ నగ్నులందు ♦ వేల్చినశిరముల్
లక్షింపఁగలిగెఁ దొమ్మిది, యాక్షణమున నెల్లవార ♦ లౌరా యనఁగన్.

తా త్ప ర్య ము

లోకమంతయుఁ జూచుచుండఁగా రాక్షసుఁడు ముందగ్నులందు హోమము చేసిన తలలు తొమ్మిది మరల మొలిచెను. చూచినవా రాశ్చర్యపడిరి.

—* బ్రహ్మ విభీషణునకు వరంబు లిచ్చుట *—

చ. అవల విభీషణుం గదిసి ◊ యంబుజగర్భుఁడు ధర్మబుద్ధివై
భవకలితుండ వీ వగుటఁ ◊ బల్మఱు మెచ్చితి ధర్మశీల! నేఁ
డివుట నొనర్తు నీమతముఁ ◊ దెల్పుము నీయభికాంక్షితంబు నా
దివిజనుతుండు హస్తములు ◊ దెప్పున మోడ్చి వచించె నీగతిన్. ౨౯

అర్థములు. తివుట=కోరిక.

తాత్పర్యము.

ఆ పిదప విభీషణు నొద్దకుఁ బోయి బ్రహ్మ యిట్లనియె. ధర్మస్వభావము గలవాఁడా! నీవు ధర్మబుద్ధి గలవాఁడ వగుటచే నివిషయమున మెచ్చుకొంటిని. నీకోరిక సంతోషముతో నెఱవేర్చెదను అని చెప్పఁగా విభీషణుఁడు రెండు చేతులు జోడించి నమస్కరించి యిట్లనియె.

క. లోకగురుం డఁట తానై, నా కెదురుగ నిల్చి మెచ్చెనాఁడ నటంచున్
వాకొనె నఁట యింతకు వే, ఱే కలదే భద్రమైన ◊ నిచ్చెద వేనిన్. ౩౦

అర్థములు. వాకొనెన్=చెప్పెను.

తాత్పర్యము

(లోక గురుఁడఁట తానయి నా కెదురుగ నిలచి మెచ్చితినననఁట యింతకు మించి వేఱే శుభము కలదా? అయినను వరమిచ్చెదవేని,)

క. పరమాపత్కాలము నను, దొరసినయేనియు మనంబు ◊ వొలఁగక యెప్పుడున్
బరఁగుత ధర్మమునం దే, నెరయుత బ్రహ్మాస్త్రమెవరు ◊ నేర్పక నాకున్. ౩౧

అర్థములు. పరమాపత్కాలము=ప్రాణము పోవునంతటి కీడుదశ, తొరసిన యేనియున్=కలిగినను.

తాత్పర్యము

ప్రాణము పోవునంత కీడుదశ నాకుఁ గలిగినను నా మనస్సు ధర్మమునందే నిలువవలయును నా కెవరు నేర్పకయే బ్రహ్మాస్త్రము లభింపవలెను.

క. ఏయే యాశ్రమమందును, నేయేమతి సంభవించు ◊ నీశ్వర ! నిరతం
బాయా యది ధర్మమునం, దే యనువర్తించుఁ గాక ◊ హితమిటు సేయన్. ౩౨

తాత్పర్యము

నేను బ్రహ్మచర్యము లోనగు నాశ్రమములందు దేనియందున్నను నా యాశ్రమ ధర్మములు నిర్వహించుటయందు, ధర్మబుద్ధియే నాకు దృఢముగా నిలుచునుగాక.

క. పరమాభీష్టము లగు నీ, వరములు నా కమరవినుత ॥ వాణీనాథా
పరధర్మరక్తునకు దుష్కర మెందును లేదు నాఁగఁ ॥ గమలజుఁ డనియెన్. ౨౧౩

అర్థములు. పరమాభీష్టములు=మిక్కిలి యిష్టములైనవి, వరధర్మవర్తనకున్=ఉత్తమధర్మమందుఁ బ్రీతిగలవారికి, దుష్కరము=చేయఁ గష్టమైనది, కమలజుఁడు=బ్రహ్మ.

తాత్పర్యము

ఇవి నేను గోరు నుత్తమవరములు. ఉత్తమ ధర్మమునందుఁ బ్రీతిగలవానికి సాధింపరాని కార్యములేదు అనగా బ్రహ్మ యిట్లనియె.

చ. ఒసఁగితి నీవు కోరిన వ ॥ రోత్తమముల్ సుకృతాత్మ! నీవు రా
క్షసకులమందుఁ బుట్టియును ॥ గల్గ దధర్మమునందు రక్తి; నీ
కసమశుభంబుఁ గూర్తు నహి ॥ తాంతక! నీ కమరత్వ మిచ్చితిన్
రస మెసఁగంగ నంచు విధి ॥ క్రచ్చఱ నాఘటకర్ణుఁ డాయఁగన్. ౨౧౪

అర్థములు. సుకృతాత్మ=పుణ్యాత్ముఁడా, రక్తి=ప్రేమ, అహితాంతక=విరోధులకు మృత్యుస్వరూపుఁడా, అమరత్వము=చావులేమి, అమరత్వమనఁగా నన్ని కల్పములైనఁ జావులేకయుండుట యని యర్థము కాదు కల్పాంతమున బ్రహ్మకే వినాశ ముండఁగాఁ దనకు లేనిది యితరుల కేమి యియ్యఁగలఁడు? కావున నమరత్వ మనఁగా ప్రలయమువఱకనియే యర్థము, లేదా దీర్ఘకాలమని యైన గ్రహింపనగు, రసము=సంతోషము, విధి=బ్రహ్మ, డాయఁగన్=సమీపింపఁగా.

తాత్పర్యము

నీవు కోరిన యుత్తమవరము లిచ్చితిని. నీవు రాక్షసులకులమందుఁ బుట్టినను నీకు నధర్మమందుఁ బ్రీతిలేదు కావున నీవు నితరుల కెవ్వరికిని లేని మేలుచేసెదను. నీకు సంతోషముతో నమరత్వము నిచ్చితినిఅని కుంభకర్ణునియొద్దకుఁబోవుచుండఁగా

బ్రహ్మదేవుఁ డడిగినరావణునకు నమరత్వమీయలేదు, ధర్మాత్ముఁడగుటచే విభీషణుఁ డడుగకున్నను నమరత్వ మిచ్చెను. కావున మనము ధర్మమునే యాధారము చేసికొని దానిని విడువక యుంటిమేని మనకుఁ గావలసిన శుభములు మనమడుగకున్నను భగవంతుఁ డిచ్చును. అడిగితిమా యడిగినంతమాత్రమే యిచ్చును. అడుగకుండిన సర్వము నిచ్చును.

—* బ్రహ్మ కుంభకర్ణునకు నిద్ర నిచ్చుట *—

చ. అడుగఁగ వేల్పు లో సురహి ॥ తా! వర మీయఁగరాదు వీనికిన్
సురపరిపంథి వీఁ డమిత ॥ శూరుఁడు లోకభయంకరుండు న
చ్చరలను మ్రింగె నేడ్వురను ॥ సౌరవనంబున శక్రభృత్యుని
ర్జరదశకంబుఁ జంపె నర ॥ సంయమివర్గముఁ ద్రుంచెఁ గ్రూరుఁడై. ౨౧౫

అర్థములు. సురహితా=దేవతల మేలుకోరువాఁడా, సురపరిపంథి=దేవతలకు శత్రువు, శక్రభృత్య=ఇంద్రుని భృత్యులగు, నిర్జరదశకంబున్=పదుగురు దేవతలను, నరసంయమి వర్గమున్=మనుష్యులను ఋషుల సమూహములను, పౌరవనంబునన్=నందనమందు.

తా త్ప ర్య ము

దేవత లిట్లు చెప్పిరి- దేవతల మేలుకోరువాఁడా! వీనికి నీవు వరమీయ రాదు. ఏలన వీఁడు దేవతలకు శత్రువు. వీనికి వరమిచ్చిన దేవతలకు నీవు కీడు చేసినవాఁడవగుదువు. వీఁడిప్పుడే గొప్ప శూరుఁడు; ప్రజలకు భయము గలిగించు వాఁడు. నందనంబున ఏడుగు రప్సరః స్త్రీలను భ్రమింగెను. పదుగురు దేవేంద్ర భృత్యుల వధించెను. క్రూరుఁడై మనుష్యసమూహములను ఋషుల సమూహమును జంపెను.

క. ఏ వరములు లేకయె యీ, కై వడి హానడి ఘటించు ♦ కలుషాత్మునకున్
నీవు వరంబులనిచ్చిన, లే వాతన్ వేసికొనఁడె ♦ విశ్వం బెల్లన్. ౨౧౬

అర్థములు. ఈకైవడిన్=ఈవిధముగ, హానడి=కీడు, కలుషాత్మునకున్=పాపపు మనస్సుగలవానికి, వాతన్=నోరను.

తా త్ప ర్య ము

వరము లేవియు లేకయే లోకముల కీవిధముగాఁ గీడుచేయువాఁడు వర ములుకూడఁ బొందెనేని ప్రపంచము నంతయు నొక్కసారిగ వాతనేసికొనఁడా?

క. వర మని తెలివి దొలంగఁగఁ, గరుణించిన జగములకును ♦ కల్యాణంబా
సురనాయక ! యన వాణీ, తరుణీమణి నవ్వి్రంచి ♦ తలఁచెఁ దలఁచినన్. ౨౧౭

అర్థములు. తెలివి దొలంగఁగన్=స్మృతి తప్పియుండునట్లు.

తా త్ప ర్య ము

వరమని చెప్పినీవు స్మృతి తప్పియుందువుగాక యని వర మిచ్చిన లోకము నకు మేలుకలదు అని చెప్పఁగా బ్రహ్మదేవుఁడు సరస్వతిని దలఁచెను.

క. ప్రాంజలియై నిలుచంబడి, సంజ యనను వేల్పుసాని ♦ సమ్మతి మైనా
కుం జలుపఁ గర్జ మెయ్యది, రంజితసుజనా! యటన్న ♦ బ్రహ్మవచించెన్. ౨౧౮

అర్థములు. సంజ యనను వేల్పుసాని=సరస్వతి, ప్రాతఃకాల సంధ్యాధిదేవత గాయత్రి, మధ్యాహ్నాధిదేవత సావిత్రి, సాయంకాలాధిదేవత సరస్వతి.

తా త్ప ర్య ము

(సాయంకాలాధి దేవతయగు సరస్వతి చేతులు మోడ్చి నేను జేయవల సిన పనియేమి యని ప్రియమారఁ బలుక బ్రహ్మ చెప్పెను.)

క. దేవీ! రాక్షసునోరను, నీ వుండి వరంబువేళ నిర్జరవాంఛన్
గావింపుము నా భారతి, తీవరమున నేగి నిలిచె దితిజునినోరన్. ౨౧

తాత్పర్యము

(దేవీ! రాక్షసుఁడు వరమడుగు వేళ వాని నోరను నీవుండి దేవతల యభీష్టమును నెఱవేర్పుము. అనఁగానే భారతి శీఘ్రముగాఁ బోయి రాక్షసుని నోరను)

ఉ. ఆవలఁ గుంభకర్ణు నికటావనికిం జతురాస్యుఁ డేగి నీ
భావగతంబుఁ జెప్పు మన వాఁడును నిద్దురఁ గోరెఁ బెక్కు లేం
డ్లావిధి యట్టు లౌతమని స్వాలయముం జనె దేవయుక్తుఁడై
దేవవిరోధి వా వెడలి దేవి సరస్వతి పోనోఁ బోయినన్. ౨౨

అర్థములు. నికటావనికిన్=సమీపభూమికి, దేవవిరోధి వా=రాక్షసుని నోరు, వాక్ శబ్ధభవము వా - వాయి

తాత్పర్యము

ఇట్లు ముందు సరస్వతీదేవిని బంపి పిమ్మట బ్రహ్మ కుంభకర్ణుని యొద్దకుఁ బోయి నీ మనస్సునం దేమి యున్నదో చెప్పుమన వాఁడు సత్యత్వమనఁబోయి నిద్రాత్వమును బెక్కులేం డ్లనుభవింపఁ గోరెను.

ఆ బ్రహ్మదేవుఁ డట్టులే నిద్రపొమ్మని చెప్పి తన లోకమునకు దేవతలతోఁ దాను బోయెను. సరస్వతీదేవియును రాక్షసుని నోరు వెడలి పోయెను. ఇట్లు పోయిన తరువాత.

క. తెలివి గొని తనదునుడికిం, బలువిధముల వగచి యేమి పలికితి నయ్యో
తెలిసి యిటు మోహపడుటలు, ఖలమతులగు సురలచేతఁగా యని మఱఁగెన్
అర్థములు. ఖలమతులు=దుష్టబుద్ధులు, చేఁత=చేసినపని, మఱఁగెన్=తపించెను.

తాత్పర్యము

(తా నన్నమాట తెలిసికొని, యనేక విధముల విచారపడి, యయ్యో! యేమంటిని? తెలిసియు భ్రమపడితినిగదా! ఇది దుష్టబుద్ధులగు దేవతలు చేసిన పని యని పరితపించెను.)

తే. భ్రాత లీరీతి విధిచేత వరములొంది చనిరి శ్లేష్మాత్మకవనంబు జాడఁ బట్టి
జనకుఁ డారఁదపంబుననుజలుపునెడకు, నందు సుఖముండి రిచ్ఛావిహారములను.
అర్థములు. విధిచేత=బ్రహ్మచే, శ్లేష్మాత్మకవనంబు=విరిగి చెట్లతోఁపు.

తాత్పర్యము

ఇట్లన్నదమ్ములు బ్రహ్మచే వరములు పొందినవారై తమతండ్రి తపము చేయు విరిగితోపునకుఁ బోయి యచ్చట నిష్టము వచ్చినట్లు సంచరించుచుండిరి.

౧౧వ సర్గము

—* సుమాలి రావణాదులఁ జూడ భూలోకంబునకు వచ్చుట *—

సీ. రాక్షసుల్ వారు వరంబులఁ గాంచుట, యాలకించి సుమాలి ♦ హర్షవశత
నాత్మమంత్రులు విరూ ♦ పాక్షమారీచప్ర, హస్తమహోదరు ♦ లనెడివారు
గొలువ నిర్భయమతిఁ♦గుతలంబునకు వచ్చి, పంక్తికంఠునిఁ గ్రుచ్చి♦ప్రమదమునను
నాయనా! నెఱవేఱె ♦ నాకోర్కి యజునిచే, నుత్తమవరము నీ♦వొందుకతన
ఆ. మనది సుమ్ము లంక ♦ యనుపురం బందుండ, విష్ణుభీతి వెఱచి ♦ వీడు విడిచి
చనినవార మా ర ♦ సాతలసీమకు, మేము పడెడిపాటు ♦ లేమి చెప్ప. ౨౨౩

అర్థములు. కుతలము=భూలోకము, నిర్భయమతిన్=భయములేని మనస్సుతో; రావణుఁడు దేవతలచే చావులేకుండ వరము తీసికొనెను గావున దేవతల భయము వదలెనని భావము.

తాత్పర్యము

రావణాది రాక్షసులు వరముల సంపాదించుట విని సుమాలి సంతోషపడి తన మంత్రులు విరూపాక్షుఁడు మారీచుఁడు ప్రహస్తుఁడు మహోదరుఁడు నను వారిని గూడికొని దేవతలవలన విష్ణునివలన భయము వదలి భూలోకమునకు వచ్చి దశకంఠుని గౌఁగిలించుకొని సంతోషముతో నిట్లనియె. నాయనా! నీవు బ్రహ్మచే నుత్తమవరములను బొందుటచే నాకోరిక నెఱవేఱెను. లంకయను పురముమనది, విష్ణువునకు భయపడి యందుండక పాతాళమునకుఁ బోయితిమి. అచ్చట మేము పడు కష్టము లేమని చెప్పుదును.

ఆ. రాక్షసోచితంబు ♦ రహిమీఱు నా లంక, మనది తండ్రి! యిపుడు♦ధనవిభుండు
నీ విమాతృజుండు♦నెలవుగా జేకొన్న, వాఁడు దాని మరలఁ♦బాడి పడయ. ౨౨౪

అర్థములు. రాక్షసోచితంబు=రాక్షసులకుఁ దగినది, నీ విమాతృజుండు=నీ సవతితల్లి కొడుకు, ధనవిభుండు=కుబేరుఁడు.

తాత్పర్యము

(తండ్రీ! సొంపు మీఱు లంక రాక్షసుల కుచితమైనది. మనది ఇప్పుడు నీ సవతి తల్లి కొడుకు కుబేరుఁడు నివాసముగాఁ జేసికొనియున్నాఁడు. దానిని మరలఁబడయుట న్యాయము.)

ఉ. సామముచేత నొండె బలి ♦ సత్తమ! దానముచేత నొండె దు
ర్దామపరాక్రమంబుననొ ♦ క్రమ్మఱఁ దత్పురి నీవు గొమ్ము, దుః
ఖామితవార్ధి మున్గిన సురారికులంబు సముద్ధరించి లం
కామహిప ప్రశస్తి నెసఁ ♦ గాంచు మనన్ దశకంఠుఁ డిట్లనున్. ౨౨౫

అర్థములు. బలిసత్తమ=బలవంతులలో శ్రేష్ఠుఁడా, దుఃఖామితవార్థిన్=దుఃఖ మనెడి మితిలేని సముద్రమునందు, లంకామహిప=లంకారాజు, అనెడి ప్రశస్తి=కీర్తి.

తాత్పర్యము

మంచి మాటలచేతఁగాని లేక దానముఁగాగాని లేక అధికపరాక్రమముచే గాని యీ పురమును నీవు మరలఁ దీసికొని దుఃఖసముద్రమున మునిఁగిన రాక్షసుల నుద్ధరింపుము. లంకారాజనెడి కీర్తి వహింపుము. అనిన దశకంఠుఁ డిట్లనియె.

ఉ. అన్నయనంగఁ దా జనకు సంతతివాఁడు గదయ్య యిట్లు నీ
విన్నుడి తాత! చెప్పఁ దగునే? యన వానిమనం బెఱుంగుచున్
మిన్నక యుండె, రక్కసుల మేటి యొకానొకనాఁడు నట్టులే
యన్నఁ బ్రహస్తుఁడా దశముఖాసురుతో వినయంబు దోఁపఁగన్. ౨౨

అర్థములు. ఇన్నుడి=ఈ మాట.

తాత్పర్యము

(తాతా? అన్నయనఁగాఁ దండ్రితో సమానుఁడుగదా. నీవిట్టి లీమాట చెప్పఁదగునా? యనఁగా వాని యభిప్రాయము దెలిసి యూరకుండెను. దశకంఠుఁ డొకానొకనాఁడును నట్టులే చెప్పఁగాఁ బ్రహస్తుఁడతనితో వినయముగా.)

—* ప్రహస్తుఁడు లంక గ్రహింప రావణునకు బోధించుట *—

క. ఇన్నీతి నీవు పలుకఁగఁ, జన్నే శూరాగ్రణీ! ప్రశస్తబలుఁడవై
యన్నదమ్ములవావులు, నున్నవొకో! శూరులం దనుత్తమచరితా! ౨౩

అర్థములు. అన్నాదమ్ముల వావులు=అన్నయని తమ్ముఁడని బంధుత్వము వరుసలు, "కొన్ని యెడల మహద్ద్వంద్వంబునఁ బూర్వపదాంత్యస్వరంబునకు దీర్ఘంబును జూపట్టెడు. అన్నాదమ్ములు, ఉ, హరి, ౪ ఆ అప్పాచెల్లెండ్రు నిర్వ. ౯ఆ. తల్లీదండ్రులు, భల్లా. ౪ ఆ. అక్కాచెల్లెండ్రయ్యును దక్షురు నాతోడిపోరు దానుం దితియున్" భాగ ౫ స్కంధము-౪౭౧. ప.

తాత్పర్యము

శూరులందు శ్రేష్ఠుఁడవై ప్రశస్తమైన బలము గలవాఁడవై నీ వీ రీతి నీతులు చెప్పఁదగునా? మిగుల నుత్తమములైన గుణములు గలవాఁడా! శూరులందు నన్నయని తమ్ముఁడని బంధుత్వములు గలవా?

క. అక్కాచెల్లెండ్రై పెను,మక్కువ నదితియును దితియు మలయుచు నాండ్రై
రక్కశ్యపమౌనికి నం దక్కఁ గనియె భువనపతులనమరోత్తములన్. ౨౪

తా త్ప ర్య ము

కశ్యపునకు నిరువురు భార్యలు-అదితియని దితియని. వా రిద్ద ఱక్క-చెల్లెండ్రు. అం దక్క-యగు నదితి లోకపాలకుల దేవతా శ్రేష్ఠులను గనియెను.

చ. దితియును గాంచె దైత్యవిత । తిన్, సనగార్ణవకాననంబుగా
క్షితితల మెల్ల వారలది । కీర్తిధనా! యలవంశమందు నీ
వతులితశౌర్యవిక్రమధ । నాఢ్యుఁడవై జనియించి తయ్య, శ్రీ
పతి దితిజాళిఁ జంపి యని । వారితవిక్రముఁడై జగత్త్రయిన్. ౨౯

అర్థములు. సనగార్ణవకాననంబుగన్=కొండలతో సముద్రములతో అడవులతో

తా త్ప ర్య ము

చెల్లెలగు దితి దైత్యులను గాంచెను. కొండలు పర్వతములు సముద్రములు గల యీ భూమి యంతయు వారిదే. వారివంశమందు నీ వసమానశౌర్యము విక్రమ సంపత్తి గలవాఁడవై పుట్టితివి విష్ణువు దైత్యులను జంపి నివారింపరాని బలముగల వాఁడై మూఁడు లోకములను.

ఉ. దైవతకోటి కిచ్చె, నల । దాయలు తమ్ములటంచు నన్నలం
చీవిధి నీతు లాడరు సు । మీ, చరియింపు మదుక్తి నా దశ
గ్రీవుఁడు యోజనం జలిపి । హృష్టమనంబున వల్లె యంచుఁ దెం
పావహిలంగ స్వీయము వ । నావనిఁ జేరి తదన్వితంబుగన్. ౩౦

అర్థములు. దాయలు=జ్ఞాతులు, వనావనిన్ = వనప్రదేశమును, తదన్వితంబుగన్=ఆ ప్రహస్తునితోడ.

తా త్ప ర్య ము

దేవతలకిచ్చెను. ఆ జ్ఞాతులు తమ్ములని యన్నలని నీవలె వావి వరుసలు గణించినవారు గారు. నా మాట విని నేను జెప్పినట్లు చేయుము అని చెప్పఁగా దశకంఠుఁడు ఆలోచించి సంతోషించి సరియని యంగీకరించి సాహసించి తన వనప్రదేశమునకు వానిని తోడఁ దీసికొనిపోయెను.

క. ఆనాఁడ త్రికూటస్థుం,డై నుడికారంపుఁబ్రోడ । యనియె బ్రహస్తున్
గానఁగఁ బొమ్మి ధనపతి, నానుడిగా నిట్టు లనుము । నయపూర్వముగన్.

అర్థములు. నుడికారంపుఁ బ్రోడన్ = చమత్కారముగా మాటలాడుట యందు సమర్థుని;

తా త్ప ర్య ము

ప్రహస్తుఁ డుపదేశించిన దినమందే త్రికూటపర్వతమం దున్నవాఁడై నేర్పుగా మాటలాడ సమర్థుఁడగు ప్రహస్తునితో నీవు కుబేరుని జూడఁ బొమ్ము, వినయముతో నేను జెప్పినట్లుగాఁ జెప్పుము.

—* రావణుఁడు ప్రహస్తునిఁ గుబేరునొద్దకుఁ బంపుట *—

సీ. ఈలంక రాజేంద్ర! ◊ యింతకు మున్ను ప, రాక్రమశాలులౌ ◊ రాక్షసులది
నీ విందుఁ జేరుట ◊ నీయట్టి యనఘున, కర్హ మగా దని ◊ యాడవలెనె?
కావున నీపురిఁ ◊ గ్రమ్మఱ నా కిచ్చి తేని నే సంప్రీతి ◊ నెసఁగువాఁడ
నీవును ధర్మంబు ◊ నెఱి గాచి నటు లగు, నని చెప్పుమీ యన్న◊నాతఁడరిగి

తే. యత్యుదారునిఁ గిన్నరా◊ధ్యక్షుఁ జూచి యధిప! నీతమ్ముఁడైన ద◊శాననుండు
పనిచె నను దూతఁగాఁగ నీ◊పాలి కిప్పు, డతని వాక్కులవినిచెద◊నాలకింపు. ౨౩౨

అర్థములు. అత్యుదారుని=మిగుల దానశీలుని, "కామేశ్వరో వైశ్రవణో దదాతు" అని శ్రుతి, వినిచెద=వినిపించెదను.

తాత్పర్యము

రాజరాజా! యీ లంక పూర్వము పరాక్రమవంతులైన రాక్షసులది. ఇట్టి దీనియందు నీ వుండుట తగినపనిగాదు. కావున దీనిని మరల నా కిచ్చితివేని సంతోషించెదను. నీవును ధర్మము రక్షించినవాఁడ వగుదువు అని చెప్పుమనిన వాఁడును దానశీలుఁడగు కుబేరునొద్దకుఁ బోయి, రాజా! నీ తమ్ముఁడు దశకంఠుఁడుపంపఁగా దూతనై వచ్చితిని ఆయన చెప్పినమాటలు చెప్పెదను వినుము.

ఉ. దేవ! సుమాలిముఖ్యులు ది ◊ తిప్రభవుల్ మహనీయశక్తి సం
భావితు లేలి రీ పురిని ◊ బ్రాక్తనవేళల, నియ్యెడన్ దశ
గ్రీవుఁడు నీసహోదరుఁడు ◊ కీర్తిధనా! నిను నీయ వేఁడెఁ దం
డ్రీ! విహితంబు గాదె యిపు ◊ డిచ్చుట వారల సొత్తు వారికిన్. ౨౩౩

అర్థములు. దితిప్రభవుల్=దైత్యులు, ప్రాక్తనవేళల=పూర్వకాలమందు.

తాత్పర్యము

దేవా! మహాశక్తిసంపన్నులైన సుమాలి మొదలగు దైత్యులు పూర్వకాలమం దీ లంకను బరిపాలించిరి. ఇప్పుడు నీ తమ్ముఁడు దశకంఠుఁడు దీనిని దన కిమ్మని కోరుచున్నాఁడు. కీర్తిధనా! వారలసొత్తు వారి కిచ్చుట ధర్మమే కదా!

—* కుబేరుఁడు లంక విడిచిపోవ సమ్మతించుట *—

చ. అనవుడు విత్తనాథుఁ డను ◊ రావళి దీనిని బాసిపోవఁగా
జనకుఁడు నన్ను నిల్ప నిజ ◊ జనకులతోడుత నున్న వాఁడ నో
దనుజవరా! దశాస్యునకుఁ ◊ దక్షిణ మేగి నచింపు మిందు ర
మ్మనుము మదీయరాజ్యనగ ◊ రాఖిలవిత్తము లేల హాయిగన్. ౨౩౪

తా త్ప ర్య ము.

ఇట్లు ప్రహస్తుఁడు చెప్పఁగాఁ గుబేరుఁ డిట్లనియె. దనుజశ్రేష్ఠుఁడా! రాక్షసులు దీనిని వదలిపోయిన కారణమునఁ దండ్రి నీ విందుండు మని నన్ను నియమించుటచే నాయన యాజ్ఞప్రకారమిం దున్నాను. నేనై యాక్రమించినవాఁడఁ గాను. నీవు పోయి నా తమ్ముఁడు దశకంఠునితో నీ విపుడే వచ్చి యిందుఁజేరి నారాజ్యము నగరము సమస్తధనము సుఖముగ బాలింపుమని తత్క్షణము చెప్పుము.

ఉ. పొమ్మని పంచి తత్క్షణమ ◊ భూవర! యాయన దండ్రిఁ జేరి పా
దమ్ముల వ్రాలి రావణును ◊ దంతము సర్వముఁ జెప్పె లంక పూ
ర్వమ్మున వానివారి దఁట ◊ క్రమ్మఱ దానిని గోరె నంట నే
నెమ్మెయిఁ బోవువాఁడ వచి ◊ యింపుము నాకు యథార్థమం చనన్. ౼౩౫

అర్థములు. ఉదంతము=వృత్తాంతము.

తా త్ప ర్య ము

పొమ్మనిపంపి తండ్రిగొద్దకు వెంటనే పోయి సాష్టాంగనమస్కారము గావించి రావణుఁడు తనకుఁ జెప్పి పంపినవార్త తెలిపి లంక తనవారి దఁట, దానిని మరలఁ గోరుచున్నాఁడఁట. నే నెచ్చటికిఁ బోయి యెందుందును? తగిన మార్గము చెప్పుము అని చెప్పఁగా.

ఉ. ఇట్టు వచించె విశ్రవసుఁ ◊ డీ విషయంబు మదీయసన్నిధిన్
దిట్టతనంబునం బలికె ◊ దీమస మారఁగ బెక్కుమార్లు ఛీ
కొట్టితిఁ గాని వాఁడు మదిఁ ◊ గొంకఁడు నా నుడి చీరికింగొనం
డెట్టును వాఁడు మానఁ డిఁక ◊ నేటికిఁ దేరకు రచ్చ వానితోన్. ౼౩౬

తా త్ప ర్య ము

విశ్రవసుఁ డిట్లనియె. ఈ విషయము నాయెదుటనే వాఁడు సగర్వముగాఁ జెప్పెనుగాని నేను వలదని ఛీ కొట్టితిని. కాని వాఁడు మానఁడు కావున వానితో నీ కేల వృథాకలహము.

ఉ. మత్తిలియున్నవాఁడు తన ◊ మానితమైన వరంబు నెంచుచున్
జిత్తమునందుఁ బెద్ద లని ◊ చిన్న లటంచు నెఱుంగ లేఁడు, నై
మిత్తికమద్వచస్సరణి ◊ మిక్కిలి దారుణమా స్వభావమున్
హత్తెను వానికిన్ విను శు ◊ భావహధర్మ్యపథంబుఁ జెప్పెదన్. ౼౩౭

అర్థములు. మత్తిలి=మదించి, నైమిత్తిక=కారణముగల, మద్వచస్సరణి= నామాట ప్రకారము నీకుఁ గ్రూరులగు రాక్షసులు పుట్టెదరని కైకసితోఁ దాను జెప్పినమాట, దారుణము=క్రూరము, శుభావహా=మేలు కలిగించు, ధర్మపథంబు= ధర్మముతోఁ గూడిన మార్గము.

తాత్పర్యము

వాఁడు బ్రహ్మ తన కిచ్చినవరములఁ దలచి మదించి యున్నాఁడు. వానికి మనస్సునందు వీరు పెద్దవారని వీరు చిన్నవారని చిన్నవారు పెద్దవారియందుభయ భక్తులుగలవారై ప్రవర్తింపవలయునని తలంపు లేదు. ఒకానొక కారణముగ నేను జెప్పిన ప్రకారము వానికి క్రూరమైన స్వభావము లభించినది కావునవానితో నీకు విరోధము వలదు. నీకు మేలగు మార్గము చెప్పెద వినుము.

శా. కైలాసంబున కేగి నీవు తనయా! ◊ కావించు కొమ్మాలయం
బాలంకన్ విడుమీ సహానుగుఁడ వై ◊ యారమ్యమందాకినీ
కూలంబంగు వసింపు తజ్జలము వ్యా ◊ కోచార్కసంకాశస
న్నాళీకాళిసమావృతంబు కడు నా ◊ నందంబుఁ గల్గించెడున్. ౪౧

అర్థములు. వ్యాకోచ=వికసించిన, అర్కసంకాశ=సూర్యునితో సమాన మైన, సన్నాళీకాళి=మంచికమలములగుంపుతో, ఆవృతంబు=కప్పఁబడినది.

తాత్పర్యము

నీవు కైలాసపర్వతమునకుఁ బొమ్ము కుమారా! నీ వందు వాసస్థాన మేర్పఱుచుకొమ్ము. లంకను నీవు నీపరిచరులతోడ వదలిపెట్టి మనోహరమైన మందాకినీతీరమందు వసింపుము. అచ్చట జలము వికసించిన కమలములతోఁ గూడి మిగుల సంతోషము గలిగించును.

క. అచ్చట నచ్చర చెలులు వి,యచ్చర గంధర్వకిన్న ◊ రాంగులతోడన్
బెచ్చుముదంబున నాటల, మచ్చిక విహరించుచుంద్రు మానుగ సతమున్. ౪౨

తాత్పర్యము

ఆ ప్రదేశమందు నప్సరసలు దేవగంధర్వకిన్నరాంగులతోడ మిక్కిలి సంతోషముతో నాడుచుఁ బాడుచు సంచరించుచుందురు.

క. ఆకూళరక్కసునితోఁ, వాకాటుల కీవు పోరకు ◊ వనజాసను నేఁ
జేకొన్నవరముచందము, నీకెఱుక యె కాదె యన వినీతుం డగుచున్. ౪౩

అర్థములు. వాకాటులకున్=కలహమునకు, వినీతుఁడు=వినయముగలవాడు

తాత్పర్యము

ఆ క్రూరరాక్షసునితో నీవు కలహమునకుఁ బూనకుము. బ్రహ్మచే వాఁడు దీసికొనిన వరము నీకుఁ దెలియును గదా యనినఁ గుబేరుఁడు వినయవంతుఁడై.

క. ఆనతిగొని ధనదుఁడు భా,ర్యా నందన సచివ వాహనార్థయుతుండై
యానిమిషమ కైలాస మ,హానగదేశంబుఁ జేరి ♦ హాయిగ నుండెన్. ౨౪౧

తాత్పర్యము

తండ్రిచే నాజ్ఞ దీసికొని కుబేరుఁడు పెండ్లాము కొడుకులు మంత్రులు వాహనములు ధనములు నన్ని తీసికొని యానిమిషమందే కైలాసముఁ జేరి యందు సుఖముగ నుండెను.

—* రావణుఁడు లంకా ప్రవేశము సేయుట *—

ఉ. అంతఁ బ్రహస్తుఁడా దశము ♦ ఖాసురుఁ జేరి వచించె నెల్లవృ
త్తాంతము విత్తపాలుఁడు య ♦ థాగతి నేగెను లంక వీడి యే
చింతయు లేదు పట్టనముఁ ♦ జేరి స్వధర్మము రక్ష సేయుమీ
కాంతుఁడవై సురాహిత ని ♦ కాయముపాలికి నంచుఁ బల్కినన్. ౨౪౨

అర్థములు. విత్తపాలుఁడు=కుబేరుఁడు, సురాహిత నికాయము=రాక్షస సమూహము.

తాత్పర్యము

కుబేరుఁ డట్లు చెప్పిన పిమ్మటఁ బ్రహస్తుఁడు దశకంఠునొద్దకుఁ బోయి వృత్తాంత మంతయుఁ దెలిపి కుబేరుఁడు తనగతి కొలఁది లంక వదలిపోయెను. ఇఁక నాలోచింప వలసినదిలేదు. నీ వా పట్టణమందుఁ జేరి రాక్షసులకెల్ల రాజవై స్వధర్మ ముద్ధరింపుము.

క. సానుజుఁడై శూన్యము లం,కానగరవరంబుఁ బంక్తి ♦ కంఠుఁ డమందా
నూనానందంబున నిం,ద్రాణీపతి నాకపురివి ♦ ధంబునఁ జొచ్చెన్. ౨౪౩

అర్థములు. సానుజుఁడై=తమ్ములతోఁ గూడినవాఁడై, శూన్యము=జనులు లేనిది, ఇంద్రాణీపతి=ఇంద్రుఁడు, నాకపురి=స్వర్గపట్టణము.

తాత్పర్యము

(జనులు లేని లంకా పట్టనమును దమ్ములతోఁగూడి దశకంఠుఁ డమందానందముతో నింద్రుఁడు స్వర్గపట్టణమువలెఁ బ్రవేశించెను.)

తే. ఇట్లు లంకఁ బ్రవేశించి ♦ యెలమిమించి, దనుజరాజ్యాభిషేకంబు ♦ ఘనతఁ గాంచి
ప్రాప్తసంపూర్ణకాముఁడై ♦ పరిఢవించి, యెదురుబెదురును లేక రహింపఁ బడప.

అర్థములు. ఎలమిన్=సంతోషముచే, ప్రాప్తసంపూర్ణకాముఁడై=లభించిన కోరిక లన్నియుఁ గలవాఁడై, పరిఢవించి=అతిశయించి.

తా త్ప ర్య ము

(ఇట్లు లంకలోఁ బ్రవేశించి పట్టాభిషిక్తుఁడయి యభీష్టసిద్ధివడసి యెదురు బెదురులేక సంతోషముతో నుండెను.)

౧౨వ సర్గము

క. తనయనుఁగుంజెల్లెలు శూ, ర్పణఖకుఁ దగువరుని వెదకి ♦ పాణిగ్రహణం
బున విద్యుజ్జిహ్వుం డ, న్దనుజుం డగు కాలకేయు♦నకుఁ దా నొసగెన్. ౨౪౫

తా త్ప ర్య ము

తన ప్రియసోదరి యగు శూర్పణఖకుఁ దగిన మగని వెదకి కాలకపుత్రుఁడయి కాలకేయు లనఁబడువారి వంశమునఁ జేరిన విద్యుజ్జిహ్వుం డను వానికిచ్చి వివాహము గావించెను.

—* రావణునకు మయుఁడు మండోదరీ వృత్తాంతముఁ జెప్పుట *—

ఉ. ఆవల నొక్కనాఁడు మృగ ♦ యాభిరతిం జరియించువాఁడు ర
క్షోవరుఁ డొక్కచోఁ గనియెఁ ♦ గోమలి కన్యక యోర్తు కూడరాఁ
ద్రోవను వచ్చువాని మయుఁ ♦ దోడన కానఁగ నేగి పల్కె న
య్యా! వని నిర్మనుష్యతల♦మందుఁ జరించెడి మీర లెవ్వరో. ౨౪౬

అర్థములు. మృగయాభిరతిన్=వేటయందలి మక్కువచే, వనిన్=అడవియందు. నిర్మనుష్యతలమందు=మనుష్యులు లేని ప్రదేశమున.

తా త్ప ర్య ము

ఆ పిమ్మట దశకంఠుఁడు వేటయందలి యాశచేఁ దిరుగుచు నడవిలో నొకచోట నొకకన్యక తనవెంట రాఁగా మార్గమున వచ్చు మయునిఁజూచి యయ్యా! మీ రెవ్వరు? మనుష్యులు లేని యీ యడవిలోఁ దిరుగ గారణమేమి ?

క. ఈమృగలోచనతో మీ, రేమి నిమిత్తంబు తిరుగ ♦ నెంచితి రనఁగా
నా మయుఁడు యథావృత్తం, బా మనుజాశనున కిట్టు♦లాదృతిఁ జెప్పెన్. ౨౪౭

అర్థములు. మృగలోచనతో=జింక కన్నులవంటి కన్నులుగల దానితో, యథావృత్తంబు=జరిగినది జరిగినట్లు, ఆదృతిన్=ఆదరముతో.

తా త్ప ర్య ము

(మీరీ మృగాక్షితో నెందుకుఁ దిరుగ నెంచితిరని యడుగఁగా మయుఁడా రావణునితో జరిగినది జరిగినట్టు లాదరముతో నిట్లు చెప్పెను.)

ఉ. నాయన! నీవు హేమ యను ◊ నాతిని మున్ వినియుందువే కదా
యాయువిదన్ శచీసతి బ ◊ లారికి నిచ్చినయట్లు దేవతల్
జాయగ నా కొసంగ సుఖ ◊ లంపటవృత్తిని దానిఁ గూడి నేఁ
బాయక యుంటి వర్షములు ◊ పంచశతంబులు, నిర్జరాజ్ఞ చేన్. ౨౮౮

అర్థములు. సుఖలంపటవృత్తిని=సుఖమునం దాసక్తిగల వ్యాపారముతో.

నాయనా! నీవు హేమయని ప్రసిద్ధికెక్కిన యప్సరసను వినియున్నావుకదా! దేవత లింద్రునకు శచీదేవి నిచ్చినట్లు భార్యగా దానిని నా కిచ్చిరి. దానిని గూడి యైదునూర్ల సంవత్సరములు సుఖముగాఁ జరించితిని. ఆవల దేవతల ఆజ్ఞచొప్పున.

ఉ. అయ్యలివేణి వాసి చని ◊ హాయనముల్ పదునాలుగయ్యె, నే
నయ్యబలా నిమిత్తమయి ◊ హైమమయంబుఁ బురంబుఁ గట్టి యం
దయ్యెలనాఁగఁ గూడితిని ◊ నాసతి లేమిని నందు నిల్వనో
యయ్య! మనంబు లేదు విర ◊ హానలతప్తుఁడ నౌటఁ గావునన్. ౨౮౯

అర్థములు. హైమమయంబు=బంగారుతో నిండిన, విరహానలతప్తుఁడన్= వియోగ మను నగ్నిచేఁ గాలుచున్నవాఁడను, ఇదియే స్వయంప్రభాగుహ- హనుమదాదులు ప్రవేశించినది దీనియందే.

తాత్పర్యము

ఆ కాంత నన్ను వదలిపోయి పదునాలుగు సంవత్సరము లయ్యెను. దాని నిమిత్తమై బంగారుమయమైన పురముగూడఁ గట్టితిని. అది వదలిపోవుటచే విరహాగ్నిని దపించువాఁడ నగుట నా పురంబున నుండ మనస్సులేదు.

క. ఆపురి విడి హేమాత్మజ, నీపాపను నాదుకూఁతు ◊ నిటు దోడ్కొని భూ
మీపర్యటనముఁ జేసెదఁ, జేపడుఁ గా కర్హవరుఁడు◊చెలువకటంచున్. ౨౯౦

అర్థములు. హేమాత్మజ=హేమకూఁతురు, ఈ పాపను=ఈచిన్న వయస్సు దానిని, భూమీపర్యటనము=భూమియందు సంచారము, చేపడుఁగాక=లభించును గాక, అర్హవరుఁడు=తగిన మగఁడు.

తాత్పర్యము

ఆ హేమయందు నాకుఁ గూఁతురై యీపిల్ల పుట్టెను. దీనికిఁ దగిన మగని వెదకుచు భూలోకమందు సంచరించుచున్నాను.

క. కన్యాజనకత్వ మసామాన్యంబుగ దుఃఖకరము ◊ మానేప్సలకున్
గన్యక రెండుకులంబుల, దైన్యంబున ముంచు శీల ◊ తాశంకఁ జుమీ. ౨౯౧

అర్థములు. కన్యాజనకత్వము=ఆడుపిల్లకుఁ దండ్రియగుట, అసామాన్యంబుగన్=విశేషముగ, మానేప్సులకున్ = గౌరవమందుఁ గోరికగలవారికి, రెండు కులంబులన్=తల్లిదండ్రుల వంశములను, శీలతాశంకన్=సదాచార విషయమైన సందేహముచే, పాతివ్రత్యసందేహముచే.

తా త్ప ర్య ము

గౌరవము గోరువారికిఁ గూఁతురు పుట్టుట విశేషదుఃఖమునకుఁ గారణమగును. ఏలన కన్యక తల్లిదండ్రుల వంశములవారిని నిది యే చెడునడవడి గలదగునో దీని చెడునడత వలన మనము నరకములపాలు గావలసివచ్చునో యని సందేహమున ముంచును.

క. ఇరువురు కొడుకులు నాకు న,మరసుందరియందుఁ గలరు ॥ మాయావియనన్
బరఁగెను జ్యేష్ఠుఁడు దుందుభి, వలబలుఁడు ద్వితీయుఁ డగుచుఁ వర్తిలుజగతిన్

తా త్ప ర్య ము

ఈ మాయావి వాలికి భయపడి పరువెత్తివచ్చి దూఁరఁబడి చచ్చిన కిష్కింధయందలి బిలముగుహాయందే.

క. వాకొంటి నాదుచరితము, నీకథ నికఁ దెలుపవయ్య ॥ నీ వెవ్వఁడవో
యాకాంక్షించెద విన నన,నైకసితనయుండు వినయగరిమ వచించెన్. ౨౪౩

అర్థములు. వాకొంటిన్=చెప్పితిని, ఆకాంక్షించెదన్=కోరెదను, వినయగరిమన్=విశేషవినయముతో.

తా త్ప ర్య ము.

(నాకథ చెప్పితిని. ఇఁక నీ విషయ మేమో తెలుపుము నీ వెవఁడవు? అనఁగా రావణుఁడు వినయముగాఁ జెప్పెను.)

ఉ. నేను బులస్త్యమన్మఁడను ॥ నీరజగర్భునకుం దృతీయుఁడై
మానితుఁడైన విశ్రవుకు ॥ మారుఁడ, బేరను బంక్తికంఠుఁడన్
నా నతనిన్ మునిప్రవరు ॥ నందనుఁ డంచు మయుం డెఱింగి మో
దానఁ దనూజ నాతనికి ॥ దారగ దానముఁ జేయ నెంచుచున్. ౨౪౪

తా త్ప ర్య ము

నేను పులస్త్యమహర్షి మనుమఁడను. బ్రహ్మకు మూఁడవ వాఁడగు విశ్రవసుని కుమారుఁడను, నాపేరు దశకంఠుఁడు. అని చెప్పఁగా నతఁడు మునిశ్రేష్ఠుని కుమారుఁడని తలంచి మయుఁడు తనపుత్రికను వానికి భార్యగా దానముచేయ నాలోచించి.

మయుఁడు రావణునకు మండోదరి నిచ్చి వివాహము చేయుట.

ఉ. ఆదర మారఁ బంక్తిముఖు ♦ హస్తముఁ గేలఁ గదించి పల్కఁ, హే
మా దివిజాంగనా భవయు ♦ మామకపుత్రిక యైన దీని మం
డోదరి పేరికన్య నసు ♦ రోత్తమ! భార్యగ నీకొసంగెదన్
మోదముతోడఁ గొమ్మనిన ♦ నూల్కొని వల్లె యటంచుఁ బల్కెనన్. ౨౪౪

అర్థములు. హేమాదివిజాంగనాభవ=హేమయను దేవతాస్త్రీకి జనించినది, మామకపుత్రిక=నాయొక్క కూఁతురు, నూల్కొని=ఒప్పుకొని, వల్లె=అట్టులే చేసెదనని.

తాత్పర్యము

(ఆదరముతో రావణుని హస్తమును దన చేతితోఁ బట్టుకొని మయుఁడు, 'యిది హేమయను దేవతాస్త్రీకిఁ బుట్టినది నాఁకూతురు. దీనిపేరు మండోదరి. దీనిని నీకు భార్యగా నిచ్చెదను. సంతోషముతో గ్రహింపుము' అనెను. అంత రావణుఁ డొప్పుకొని యట్టులే చేసెదనని చెప్పఁగా)

క. పైతామహకులుఁ డనియును, ఖ్యాతమునిప్రవరశాప♦గతి నెఱుఁగుటఁ గ
న్యాతిలకము మయుఁ డొసఁగెను, దైతేయుఁడు వహ్నిప్రోలఁ♦దరుణిం గొనియెన్

అర్థములు. పైతామహకులుఁడు=పులస్త్యవంశమునఁ బుట్టినవాఁడు. ఖ్యాత=ప్రసిద్ధికెక్కిన, మునిప్రవర=మునిశ్రేష్ఠుఁడైన విశ్రవసునియొక్క, శాపగతి=శాపమువిధము, నీకుఁ గ్రూరులు రాక్షసులు కొడుకులు పుట్టుదురని చెప్పిన మాట-దీనివలన వంశము మంచిదనియుఁ దా నీయకున్నను వాఁడు క్రూరుఁడు కావున బలవంతముగఁ గొట్టియైనఁ బిల్లను గ్రహించుననియుఁ దెలిసి యీ యవమాన మేల పడవలయును అని తానే కన్యాదానము చేసెను. అగ్నిప్రోల=అగ్నికెదురుగ, అగ్నిసాక్షికముగ.

తాత్పర్యము

(మయుఁడు 'పులస్త్యవంశమునఁ బుట్టినవాఁడనియును, ప్రసిద్ధికెక్కిన ముని శ్రేష్ఠుఁడైన విశ్రవసుని శాపవిధము తెలియుట చేతను మండోదరిని రావణునికిచ్చి కన్యాదానము చేసెను. రావణుఁడును దాని నగ్నిసాక్షికముగాఁ బెండ్లియాడెను.)

క. అనఘంబుఁ దపోలబ్ధం,బును గరమాశ్చర్యకర మ♦మోఘంబగు శ
క్తిని మయుఁ డల్లున కొసఁగెను, మనలక్ష్మణు నొంచె దాన♦మనుజాశనుఁడున్

అర్థములు. అనఘంబు=దోషరహితమైనది, తపోలబ్ధంబు=తపస్సుచే సంపాదించినది, అమోఘము=వ్యర్థము కానిది.

తాత్పర్యము

దోషరహితమై తపస్సుచే లభించినదై మిగుల నాశ్చర్యకరమైన వ్యర్థము గాని శక్తిని మయుఁడల్లున కిచ్చెను. ఆ శక్తి చేతనే వాఁడు మన లక్ష్మణు మూర్ఛనొందించెను.

—* రావణుఁడు తన సోదరులకు వివాహములు చేయుట. *—

సీ. స్వీకృతదారుఁడై ♦ చేరి లంకాపురిఁ, బంక్తికంఠుఁడు తన ♦ భ్రాతలకును
బరిణయంబు లొనర్ప ♦ భావించి కుంభక,ర్ణునకు వైరోచను♦తనయతనయ
సారసవదన వ♦జ్రజ్వాల యనునొక్క, ప్రేయసిఁ గూర్చి వి♦భీషణునకు
దారఁగాఁ జేసె గం♦ధర్వ విభుండైన, శైలూషుతనయను ♦ సరమ యనెడి

తే. సాధుధర్మజ్ఞ నామె శై♦శవమునందు, మానసముపొంతఁ జరియింప♦వానలకును
గొలను పొంగిన భీతిల్లి♦కూఁతుఁ గాంచి తల్లి యిట్లని యఱచె వా♦త్సల్యగరిమ

అర్థములు. స్వీకృతదారుఁడు=భార్యను గ్రహించినవాఁడు.

తాత్పర్యము

తాను పెండ్లి చేసికొనినవాఁడై లంకాపురముఁ జేరి దశకంఠుఁడు తన తమ్ములకు వివాహముచేయ నాలోచించి వైరోచను కూఁతు కూఁతును (దౌహిత్రిని) వజ్రజ్వాల యను దానిని కుంభకర్ణునకు నిచ్చి వివాహము చేయించెను. ఆవల గంధర్వుఁడగు శైలూషుని తనయను మంచి ధర్మము తెలిసినదానిని సరమ యను దానిని విభీషణునకు నిచ్చి వివాహము చేయించెను. మానససరోవరము తీరమున నీ కన్యను బ్రసవించి తల్లియందే యుండఁగా వానలకు సరస్సు పొంగి నీళ్ళు పిల్లయొద్దకు రాఁగా నది భయపడి యేడ్చెను. అప్పుడు తల్లి.

క. రామ! సరో మా వర్థయ,నా మాతృతదుక్తిఁ బట్టి ♦ నవలామిహికిన్
భూమి సరమాభిధానము, ప్రేమోక్తిగ వెలసె నంత ♦ వీరవరేణ్యుల్. ౨౬

అర్థములు. సరో మా వర్థయ=సరస్సా! వృద్ధినొందవలదు మాతృతదుక్తి= తల్లియొక్క యా మాట, నవలామిహికిన్=స్త్రీలయందు శ్రేష్ఠురాలగు దానికి, సరమాభిధానము=సరమ యను పేరు.

తాత్పర్యము

రామచంద్రా! సరో మా వర్థయ యను తల్లిమాటనుబట్టి యా యుత్తమ స్త్రీకి సరమ యను పేరు ముద్దు పేరుగ నొప్పెను. ఇటు పెండ్లిండ్లు చేసికొనియున్న వీరవర్యులు.

క. గంధర్వులు నందనమున, బంధురకేళీవిహార • పరు లౌనట్టుల్
సింధురగమనలతో దశ కంధరముఖు లుండఁ గొంత • కాలంబునకున్. ౨౬౦

అర్థములు. సింధుర గమనలతోన్=ఏనుఁగు నడకవంటి నడక గలవారితో.

తాత్పర్యము

నందనవనమందు గంధర్వులు దేవతాస్త్రీలతో మనోహరముగఁ గ్రీడించు నట్లు దశకంఠుఁడు మొదలగువారు తమ స్త్రీలతోఁ గ్రీడించుచుండఁగాఁ గొంత కాలమునకు.

మ. కనె మండోదరి యొక్క పుత్రు నతడున్ • క్ష్మాజాతమాత్రంబునన్
ఘననిర్ఘోషమునన్ ధ్వనించుటయు లం • కాపట్టనం బెల్లఁ ద
ద్ధ్వని నిశ్చేష్టము గాఁగ రావణుఁడు మోదం బారఁగా దానఁ ద
త్తనయుం బిల్చెను మేఘనాదుఁ డనుచుం • దాత్పర్యసంయుక్తుఁడై. ౨౬౧

అర్థములు. క్ష్మా=భూమియందు, జాతమాత్రంబునన్=పుట్టినంత మాత్రము ననే, ఘననిర్ఘోషమునన్=మేఘధ్వనితో, తత్+ధ్వనిన్=ఆ చప్పుడుచే, మేఘ నాదుఁడు=మేఘనాదమువంటి నాదము గలవాఁడు.

తాత్పర్యము

మండోదరి యొక కొడుకును గనెను. వాఁడు భూమిమీఁదఁ బడఁగానే మేఘ ముఱిమినట్లు ధ్వనించెను. ఆ ధ్వనికి లంకానగరము నిశ్చేష్టనుయ్యెను. అది చూచి సంతోషపడి రావణుఁడు ప్రేమతో నా శిశువును మేఘనాదుఁడను పేరఁబిలిచెను.

క. మీఁదింద్రజిత్తుం డనియెడి, పేరఁ బిలుచువాఁడు వాఁడె • పెరిఁగెను రక్ష
స్స్త్రీసరక్షితుఁ డింధనముల, చే రక్షిత మైనవహ్ని • చెలువున నంతన్. ౨౬౨

అర్థములు. రక్షస్స్త్రీ రక్షితుఁడు=రాక్షస స్త్రీలచే రక్షింపబడినవాఁడు, ఇంధనములచే=కట్టెలచేత.

తాత్పర్యము

మీఁదింద్రజిత్తు అని పిలిచెదరే, వాఁడే యీ మేఘనాదుఁడు. కట్టెలచే రక్షింపఁబడు నగ్నివలె రాక్షసస్త్రీలచే వాఁడు కాపాడఁబడి వృద్ధిచెందెను.

౧౩వ సర్గము

—* రావణుఁడు లోకంబుల బాధించుట *—

సీ. నీరజసంభవప్రేరిత మై నిద్ర, యాఁపఁగారాక త • న్నలముకొనుడుఁ
గుంభకర్ణుం డన్నఁ • గొలువఁగ నేగిపై, కొనె నిద్ర సముచితంబు గాటమొందు
కట్టింపుమీ యనఁ గ్రక్కునఁ బనివాండ్రఁ, బనుప రావణుఁడు వారనుపమాన
శాల యోజనము వి • శాలంబుగా రెండు, యోజనంబుల నిడు • పొప్పుచుండ

ఆ. స్ఫటిక కాంచనములఁ స్తంభముల్ కింకిణీ, జాలకములు దాంతచారుతోర
ణములు స్ఫటికవేదులమలవైడూర్యంపు, సోపనములు గలిగిసొబగుమీఱ

అర్థములు. నీరజసంభవప్రేరితమై=బ్రహ్మచేఁ బ్రేరింపఁబడినదై, కింకిణీ జాలకములు=చిఱుగజ్జెలుగల కిటికీలు, దాంత=దంతమయమైన, చారు=మనోహరమైన తోరణములు, స్ఫటికవేదులు=స్ఫటికములతో నిర్మింపఁబడిన యరుగులు, సోపనములు, సోపానములు=మెట్లు.

తా త్ప ర్య ము

బ్రహ్మవాక్యము చొప్పున నిద్రనిలుపరాక తన్నుపై కడఁగాఁ గుంభకర్ణుఁడన్నయొద్దకుఁబోయి నాకు నిద్రనిలుపరాక పైబడి వచ్చుచున్నది. పండుకొనుట కొక యిల్లు కట్టింపుమని చెప్పఁగా వెంటనే యతఁడు పనివాండ్రనేర్పాటుచేసెను. వారును యోజనము వెడలుపు రెండుయోజనములు నిడివి యుండునట్లు స్ఫటికముల బంగారు స్తంభములు గజ్జెల కిటికీలు దంతములతోరణములు స్ఫటికపుటరుగులు వైడూర్యములమెట్లు గలిగి యందమైయుండఁగా.

ఉ. కట్టిరి విశ్వకర్మవలెఁ ॰ గాంచనశైలగుహావిధంబునన్
దిట్టము గాఁగ, నందుఁ, ॰ దను నిద్దుర ద్రెకొనఁ గుంభకర్ణుఁడున్
నెట్టన పెక్కువర్షములు ॰ నెమ్మది నుండె, సురర్షియక్షులన్
బట్టి నిరంకుశుం డగుచుఁ ॰ బంక్తిముఖుండు వధించెఁ గ్రూరుఁడై. ౨౬౮

అర్థములు. కాంచనశైల గుహావిధంబునన్ = మేరుపర్వతము గుహవలె, పెక్కువర్షములు=అనేక సంవత్సరములు, వీని నిద్రాకాలవిషయము యుద్ధకాండమునఁ జర్చింపఁబడెను. ఆఱు నెలలకుఁ దక్కువలేదు గాని యెంత కెక్కువ యెంత కాలమైన నిద్రించును, నిరంకుశుండు=అడ్డగించువారు లేక.

తా త్ప ర్య ము

మేరుపర్వతగుహవలె విశ్వకర్మ కట్టినట్లు కట్టిరి. దానిలోఁ గుంభకర్ణుఁడు పెక్కు సంవత్సరములు నిద్రించుచు హాయిగా నుండెను. దశకంఠుఁడు క్రూరుఁడై యడ్డము లేక దేవతలను ఋషులను యక్షులను జంపెను.

సీ. తోఁటలఁ గనుఁగొన్న ॰ దోఁటంపుఁగాడ్పునా, మించి చెట్టులఁ గంచు ॰ మించుఁజేయు
నేఁకలఁ గనుఁగొన్న ॰ నేనుఁగువలెఁ జొచ్చి, సంచు నశింపఁ గలంచియాడుఁ
గొండలఁ గనుఁగొన్న ॰ జంభవైరిభంగిఁ, బిండిపిండిగ నేలఁ ॰ జెండివైచు
నందనోద్యానంబు ॰ చందంబుఁ గనుఁగొన్న, నేపున నెనరేఁగి ॰ రూపుమాపు

తే. వేల్పులను బట్టు గంధర్వుల ॰ విఱిచి కొట్టు, సిద్ధులను గొట్టు, మగువలఁ ॰ జెఱలఁ బెట్టు
సాధువుల నెట్టు కిన్నరగిరిసమితి మొట్టు, రట్టుమీఱుచుఁ గైకసిం ॰ పట్టి కినిసి. ౨౬౯

అర్థములు. కంచుమించు=అగోచరము, సంచు=అందము, ఎస రేఁగి=విజృంభించి.

తా త్ప ర్య ము

(రావణుఁడు కినిసి, తోఁటలను, జూచినచోఁ బెద్దగాలివలె చెట్లను విఱిచి పాడుచేయును. ఏరులను నేనుఁగువలెఁగలఁచి వాని యందమును జెడఁగొట్టును. కొండలను వజ్రాయుధమువలె పిండి పిండి చేయును. నందనోద్యానము నందము గనిన గర్వమున విజృంభించి రూపుమాపును. దేవతలను బట్టి కొనును. గంధర్వ సమూహమును గొట్టును. సిద్ధులను గట్టును స్త్రీలను జేఁజిక్కించుకొని బట్టును, సాధువులను బాధించును. కిన్నరులను మొట్టును.)

—* కుబేరుండు రావణునకు నీతిఁ దెలుప దూత నంపుట *—

ఉ. ఆతని దుష్టచేష్టల ధ • నాధిపుఁడెల్ల నెఱింగి తిమ్ముఁ డన్
ప్రీతి నిజాన్వవాయము సు • వృత్తము ధర్మము సంస్మరించుచున్
దూతను బుచ్చె లంకకును • దూర్ణము వాఁడును బోయి మున్ను వి
ఖ్యాతయశున్ విభీషణునిఁ • గన్గొని యాతఁడు ప్రశ్న సేయగన్. ౨౬౬

అర్థములు. నిజాన్వవాయము సువృత్తము=తమవంశముయొక్క మంచినడవడి.

తా త్ప ర్య ము

దశకంఠుఁడు చేయు దుష్టచేష్టలను కుబేరుఁడు విని తమ మంచి వంశము యొక్క నడవడి యాలోచించి ధర్మము తలపోసి లంకకు దూతను బంచెను. వాఁడును త్వరగాఁ బోయి ముందు ధర్మాత్ముఁడని పేరు గనిన విభీషణుఁజూచి యాయన ప్రశ్నింపఁగా.

క. తన యాగమనము హేతువు, వినిపించినయంత నతఁడు•వింశతిబాహున్
గనిపింప సభాసీనుని, వినయమున జయోక్తిఁబల్కి•విభుతో ననియెన్? ౨౬౭

అర్థములు. ఆగమనము హేతువు=వచ్చిన కారణము, సభాసీనునిన్=కొలువుకూటమందు గూర్చుండిన వానిని.

తా త్ప ర్య ము

(తాను వచ్చిన కారణమును వినిపించెను. అంత విభీషణుఁడాతని సభలోనున్న రావణునిఁ గనిపింపఁగా వినయమున జయజయయని పలికి రావణునితోనిట్లు పలికెను.)

తే. అధిప! యక్షవిభుండు మీ • యగ్రజుండు
ప్రీతి నను బంపె నిచటికి • దూతఁ గాఁగ
కులము మీతల్లి దండ్రుల • గుణముఁ దలచి
యాడు మనెఁ గొన్ని నుడులు మీ • తోడ వినుము. ౨౬౮

అర్థములు. యక్షవిభుండు=కుబేరుఁడు, అగ్రజుఁడు=అన్న, నుడులు=మాటలు.

తా త్ప ర్య ము

(రాజా! కుబేరుఁడు మీ యన్నగారు, నన్నిచ్చటకు దూతగాఁ బంపెను. మీ కులము. మీ తల్లిదండ్రుల గుణము తలఁచి కొన్ని మాటలు మీతోఁ జెప్పుమనెను. వినుము.)

క. చేసినవి యేమొ పూర్వము, చేసితి వవి చాలు నింకఁ ♦ జేయకు మట్టుల్
వాసిగ శక్యం బేనియు భాసురశుభ మొదవ ధర్మ ♦ పద్ధతి నడుమీ. ౨౧౯

తా త్ప ర్య ము

(ఇంతకుముందు చేసిన వేమో చేసితివి. ఇఁక నా విధముగాఁ జేయకుము, అట్లులయిన నీకు మేలు కలుగును. ధర్మమార్గమున నడువుము.

ఉ. కంటిని నందనంబు బహు ♦ కాల వివృద్ధము పాడుపాడుగా
వింటిని మౌనిసంఘములఁ ♦ బెట్టితి బాధ లటంచు, వెండి నీ
కొంటెతనంబు లాఁపు తమిఁ ♦ గూరిరి దైవతవర్యు లంచు నే
వింటిని, నీకు నిట్లు తగ ♦ వే జగ మేఁచుతలంపు తమ్ముఁడా! ౨౨౦

అర్థములు. బాహుకాల వివృద్ధము=చాలఁ గాలముఁగా బెంపఁబడినది, ఏఁచు=బాధించు, తలంపు=ఆలోచన.

తా త్ప ర్య ము

(తమ్ముఁడా! నందన వనమును జూచితిని. ఎంతకాలము నుండియో పెంపఁబడిన దానిని పాడుపాడు చేసితివి. మునులను బాధపెట్టితివని విన్నాను. దేవతలు నీ దుండగములాఁపవలెనని యున్నారనియు వింటిని. లోకముల బాధించు నాలోచన నీకుఁ దగునా?

క. ఏలిదముగఁ జూచితి నను, జాలఁగఁ బలుమాఱు దాసి ♦ సైఁచితిఁ జుమ్మీ
బాలుఁడు దుడుకం డైనను, బాలించుట నీతి యతని ♦ బాంధవతతికిన్. ౨౨౧

అర్థములు. ఏలిదముగన్=చులుకనగ, అలక్ష్యముగ, దుడుకఁడు=దుష్టుఁడు.

తా త్ప ర్య ము

(నన్నెన్నిసారులో చులకనగఁ జూచితివి. నేనోర్చియుంటిని. బాలుఁడు దుష్టుఁడైనను నతనిఁ బాలించుట వాని చుట్టాలకు ధర్మము.)

ఉ. ఉగ్రతపంబు సేయఁ జని ♦ యుంటితి హైమధరంబుపొంత కం
దుగ్రుఁడు పార్వతీసహితుఁ ♦ డొప్పఁగఁ గంటి నతుల్యతేజ మా
విగ్రహ మార నున్నపృథి ♦ వీధరకన్యకఁ జూచినంతఁ ద
న్నిగ్రహకారణంబునను ♦ నేత్రము సవ్యము దగ్ధమై చనెన్. ౨౨౨

అర్థములు. హైమధరంబు పొంతకున్=మంచుకొండ సమీపమునకు, ఉగ్రుఁడు=శివుడు, విగ్రహము=ఆకారము, పృథివీధరకన్యకన్=పార్వతిని తన్నిగ్రహకారణంబునను=ఆమె నిగ్రహించిన కారణముచే.

తాత్పర్యము

నేను హిమాచలము సమీపమునకుఁ దపస్సు చేయఁబోయి యుంటిని. అక్కడఁ బార్వతీసమేతుఁడైన శివుని జూచితిని. అసమాన కాంతిగల పార్వతి యాకారము చూచినంతనే యామె నిగ్రహించుటచే నా యెడమకన్ను కాలిపోయెను.

తే. రేణుకలుషీకృతజ్యోతి • రాణ దనరఁ, గన్ను తద్గిరి నన్యశృం • గంబుఁ జేరి
నూటయెనిమిదియేఁడులు • గాటమైన, వ్రతము సల్పితి శ్రీమహే • శ్వరునిఁగూర్చి

అర్థములు. రేణుకలుషీకృతజ్యోతి=రేణువులచే మలినముగాఁ జేయఁబడిన కాంతి.

తాత్పర్యము

కన్ను రేణువులచే మలినమైన యగ్ని కాంతివలెఁ గాఁగా నా ప్రదేశము విడిచి మఱియొక శిఖరమునొద్దకుపోయి నూటయెనిమిది సంవత్సరములు శివుని గుఱించి తీవ్రమైన వ్రతము సలిపితిని.

ఇది కేదారేశ్వర వ్రతమని కొందఱ యభిప్రాయము.

సీ. వ్రతము సాంతం బైన • భర్గుఁడు దోఁతెంచి, కరుణాతరంగితే • క్షణము లొప్ప
నను గాంచి పల్కెనో • యనఘ! యీవ్రతమును, నేనొకఁడను మఱి • నీవు నిట్లు
చేసినవారలు • చేయఁ డన్యుం డెనఁ, డీ వ్రతంబును నేన • సృష్టి చేసి
నాఁడఁ బూర్వంబు నీ • నయనంబు దేవిచేఁ, బింగళత్వంబుఁ బ్రా • పించుకతన
తే. నేకపింగళుఁ డనుపేర • నెసఁగ వయ్య, నిర్జితుండను నీ తపో • నిష్ఠచేత
మత్సఖిత్వంబుఁగోరుమీ • మాననీయ, యనుచుఁగరుణించి యిడియెనా • కాజ్ఞ చనఁగ

అర్థములు. భర్గుఁడు=శివుఁడు, తోఁతెంచి=కనఁబడి, కరుణాంతరంగితేక్షణములు=దయారసమలలుగాఁగల చూపులు, దేవిచే=పార్వతిచే. పింగళత్వము=గోరోజనవర్ణము, నిర్జితుండను=గెలువఁబడినవాడను, మత్సఖిత్వంబు=నాస్నేహము.

తాత్పర్యము

వ్రతము పూర్తి కాఁగా శివుఁడు ప్రత్యక్షమై దయచే నన్నుఁ జూచియిట్లనియె. ఈవ్రతమును నేను నీవు తప్ప నిట్లు చేసినవారు మఱి యెవ్వరు లేరు. ఈ వ్రతమును నేనే పూర్వము సృష్టించితిని. నీకన్ను పార్వతీదేవిచేఁ బింగళమైనకారణ

మున నీ వింకమీాద నేకపింగళుఁడని ప్రసిద్ధిగాంచుము. తపస్సుచే నీచేతఁ గెలువఁబడితిని. కావున నా సఖ్యముఁ గోరుము అని దయ యుంచి నాకు సెలవిచ్చెను.

ఉ. ఆతనిచే ననుజ్ఞఁ గొని ♦ స్వాలయముం జనుదెంచి వింటి నీ
యాతతపాపకార్యముఁ గు ♦ లార్హము ధర్మపథంబుఁ దప్పఁగా
నీతి యటయ్య? లోకముల ♦ నింద వహించుట మేలె! నిర్జర
వ్రాతము నిన్నుఁ ద్రుంప సదు ♦ పాయము రోయుచు నున్న దంచనన్. -౨౭౫

అర్థములు. స్వాలయము=నా యిల్లు, ఆతత పాపకార్యము=మిక్కిలి పాపము కలిగించు పని, కులార్హము=వంశమునకు యోగ్యమైనది, ధర్మపథంబు=ధర్మమార్గము, రోయుచున్=వెదకుచు.

తా త్ప ర్య ము

శివునిచే నాజ్ఞదీసికొని యింటికి వచ్చి నీవు చేసిన మిగుల పాపకార్యముల వింటిని. వంశయోగ్యమగు ధర్మమార్గము తప్పినడచుట నీతియగునా? లోకములందు నిందల పాలగుటవలన మెలుకలదా? నీ విట్లు చేయుటచే దేవతలు నిన్నుఁ జంపవలయునని యుపాయము వెదకుచున్నారు- అని చెప్పఁగా.

ఆ. కటము లదరఁ గోప♦గరిమ సంరక్తలో, చనుఁడు పంక్తిగళుఁడు♦ధనదు దూత
మోముఁ జూచి పలికె ♦ నీమాటలందలి, భావమెల్ల దెలియ♦వచ్చె లేర. -౨౭౬

అర్థములు. కటములు=చెక్కిళ్ళు, సంరక్తలోచనుండు=ఎఱ్ఱని కన్నులు కలవాఁడు.

తా త్ప ర్య ము

(రావణుఁడు కన్నులెఱ్ఱఁజేసి కుబేరుని దూతముఖముచూచి యిట్లనియెను. ఓరి! నీ మాటలయందలి భావము తెలిసినది లేరా!)

—* రావణుఁడు కుబేరు దూతను వధించుట *—

ఉ. దూతవు గావు నీవు ఖల ♦ ధూర్తుఁడ! ని న్నిటఁ బంచినాతఁడున్
భ్రాత యటంచు నన్నుఁ దలఁ ♦ పండు నిజంబిఁక నీదు ప్రేలుడుల్
నీతులు గావు, శంకరుని ♦ నెయ్యము గల్గె నటంచు స్వీయ మా
ఖ్యాతియుఁ బెంపు చాటుకొనఁ ♦ గా నిటు పంచెను నిన్ను మూఢుఁడా. -౨౭౭

అర్థములు. ప్రేలుడుల్=వదరుటలు.

తా త్ప ర్య ము

నీవు దూతవుగావు పరమదుర్మార్గుఁడవు, నిన్నుఁ బంపినవాఁడును నన్ను దమ్ముఁడని తలఁచినవాడుకాఁడు, నీవు వదరినవి నీతులుగావు, శివుని స్నేహము తనకుఁ గలిగెనని తనకీర్తి గొప్పతనము చాటించుకొనుటకుఁగా నిన్నుఁబంపెను.

ఆ. పెద్దవాఁడు గురుఁడు పీడింప రాదని, తలఁచి యుంటి నింత • దనుక నోర్చి
యింక సైఁపఁ గూడ • దితఁడు కారణముగఁ, ద్రుంతుఁ గకుబధిప చ • తుష్కమిపుడ

అర్థములు. కకుప్ + అధిప చతుష్కము=దిక్కుల కధిపతులగు నలువురను, ఇంద్ర యమ వరుణ కుబేరులను.

తా త్ప ర్య ము

(పెద్దవాఁడు, గురువుతో సమానుఁడు అని యింతవఱకు బాధింపకుండ నూరకుంటిని; ఇఁక సైరణకూడదు. ఇతని కారణమున నింద్ర యమవరుణులను గూడఁ ద్రుంచెదను)

చ. గెలిచెద మూఁడులోకములఁ • గీర్తిత బాహువిలాససంపదన్
గలఁచెద దేవతావితతి • గండఁడనై యని రాక్షసేశ్వరుం
డలఘుజవంబునన్ నఱకి • యాతని మూర్ధముఁ జెంతనున్న య
ప్పలలభుగుత్కరంబునకు • భక్ష్యము గాఁగ నొసంగెఁ గ్రూరుఁడై. ౨౯

అర్థములు. కీర్తిత=పొగడఁబడిన, బాహు=భుజబలము యొక్క, గండఁడనై = శూరుఁడనై అలఘుజవంబునన్=మిగుల వేగముగ, మూర్ధము=తల, పలభుక్ + ఉత్కరంబునకు=మాంసమును దిను రాక్షసుల సమూహమునకు.

తా త్ప ర్య ము

పొగడఁబడిన భుజబలసంపదచే మూఁడులోకములను గెలిచెదను. శూరుఁడనై దేవతలగుంపులను గలఁతపడఁజేసెదను అని దశకంఠుఁడు మిగుల వేగముగ నామాత తలనఱికి దానిని నందున్న రాక్షసులకుఁ దినుడు పొండని యిచ్చెను.

క. అప్పుడ స్వస్త్యయనంబును, దెప్పునఁ గావించి లేచి • దిగధీశతతిన్
ముప్పున ముంపఁగ నెంచుచు, నప్పిశితాశనుఁడు దగ్గి • శాభిముఖుండై. ౩౦

అర్థములు. స్వస్త్యయనంబును = మేలుకలుగుటకై చేయవలసిన కార్యమును, దిగధీశతతిన్=దిక్కులకుఁ బతులగువారి సమూహమును, పిశితాశనుఁడు= రాక్షసుఁడు, ఉదగ్దిశాభిముఖుండై=ఉత్తరదిక్కు ముఖముగలవాఁడై.

తా త్ప ర్య ము

అప్పుడే మంగళవాచకములు లోనైనవి కావించి వెంటనే లేచి దిక్పాలకులకుఁ గీడుఁ కలిగింపనెంచి యా రాక్షసుఁ డుత్తరదిక్కు ముఖమై.

౧౪వ సర్గము

—* రావణుఁడు కుబేరు జయింపఁ బోవుట *—

సీ. ధనదుని గెలువఁగఁ దరలి రథస్థుఁడై సచివులు ధూమ్రాక్ష • సారణులును
శుకమహోదరులును • శూరవర్యులు ప్రహ, స్తుండు మారీచుండు • తోడ రాఁగ
జగములు దహియించు • చందంబునను గిన్క, సమరకాంక్షను బుర • శైలములును
వనములు నదులు జవంబునఁ దరియించి, కైలాసగిరిఁ జేర • క్షణములోన

ఆ. యక్షచయము సూచి ♦ యక్షపుతమ్ముఁడన్, మతిని దాఁక నోడి ♦ యతనిఁ గలనఁ
జక్కఁ జరిగి యీశ ♦ సఖునకు నెఱిఁగించి, యతని ముదలఁ గాంచి ♦ యరుగుదెంచి.

అర్థములు. సమరకాంక్షను=యుద్ధమందలి కోరికచే, తాఁకనోఁడి=ఎదురింప భయపడి, ముదల=ఆజ్ఞ, ఈశసఖునకు=కుబేరునకు.

తాత్పర్యము

కుబేరుని గెలువవలయునను నుద్దేశముతో రథము మీఁదఁ గూర్చుండిన వాఁడై ధూమ్రాక్షుఁడు శుకుఁడు మహోదరుఁడు ప్రహస్తుఁడు మారీచుఁడు నను మంత్రులు తనతోడ రాఁగాఁ గోపముచే లోకములను గాల్చువానివలె మండి యల్పకాలములోఁ గైలాసపర్వతముఁ జేరఁగా యక్షులు చూచి తమ ప్రభువగు కుబేరుని తమ్ముఁడే యను తలంపుతో యుద్ధముచేయ భయపడి చక్కఁగాఁబోయి కుబేరునకు దశకంఠుఁడు దండెత్తి వచ్చిన వార్త తెలిపి యతని యనుజ్ఞ తీసికొనివచ్చి.

శా. కైలాసంబు చలింపఁబై పఱచు ర♦క్షస్సైన్యమున్ దాఁక నా
భీలం బైన దురంబు చెల్లె నమర♦ద్విడ్యక్షసైన్యాళికిన్
దాళం జాలక యక్షధాటికిని బ్ర♦ద్రావించు సైన్యంబుఁ దా
నాలోకించి దశాననుం డెదిరె సా♦హంకారహుంకారుఁడై. ౨౮౨

అర్థములు. పైపఱచు=తమ మీఁదికిఁ బరువెత్తివచ్చు, దురంబు=యుద్ధము, అమరద్విట్+యక్షసైన్యాళికిన్=రాక్షసులయు యక్షులయు సేనలకు, ప్రద్రావించు=పరువెత్తు, సాహంకార హుంకారుఁడై = అహంకారముతోఁ గూడిన హుంకారము గలవాఁడై.

తాత్పర్యము

కైలాసము వడఁకునట్లు తమమీఁదికిఁ బరువెత్తివచ్చు రాక్షససేనను యక్షు లెదిరింపఁగా నిరువురకు భయంకరమైన యుద్ధము జరిగెను. అందు యక్షుల ధాటికి రాక్షసులు నిలువలేక పరువెత్తగా జూచి దశకంఠుఁడు గర్వముతో హుంకరించి శత్రువుల నెదిరించెను.

—* యక్ష రాక్షస యుద్ధము *—

ఉ. తోడన వానిమంత్రులును ♦ దోడ్పడి వేయికి వేయి యుద్దిగా
వీడని యూసునం బొడర ♦ వింశతిబాహుని యక్షవీరులున్
క్ష్వేడల నించుచుం గవిసి ♦ కేరుచు శక్తి కృపాణికాగదా
తాడితుఁ జేయ వారిదము ♦ ధారలకున్ గిరి నాఁగ ధీరతన్. ౨౮౩

తాత్పర్యము.

దశకంఠుఁడు శత్రువుల నెదురింపఁగానే యతని మంత్రులును వానికిఁదోడై వేయిమంది యక్షులకు వేయిమంది రాక్షసులుగా నెదిరించిరి. అందు యక్షవీరులు సింహనాదములు చేయుచు దశకంఠునిపైఁగవిసి విజృంభించి శస్త్రులచేతను కత్తుల చేతను గదలచేతను గొట్టఁగా వాఁడు మేఘములు గురియు జలధారలకుఁ గొండ వలెనై ధైర్యముచే.

చ. కలఁగక రావణుండు లయ, కాలునిదండము వోని పెన్గదన్
జలమునఁద్రిప్పుచున్ విమత ♦ సైన్యములోఁ జొరబాఱి కుప్పకు
ప్పలుగను యక్షులం దునిమి ♦ వాయుసుహృద్వరుఁ డెండు గడ్డి క
ట్టెల దహియించునట్టులు త్రు ♦ టిం దెగఁగాల్చె నరాతిసైన్యమున్. ౨౮౪

అర్థములు. విమతసైన్యములోన్=విరోధిసేనలో, వాయుసుహృద్వరుఁడు= అగ్నిహోత్రుఁడు, అరాతిసైన్యమున్=విరోధులసేనను.

తాత్పర్యము

చలింపక రావణుఁడు ప్రలయకాలయముని దండమువంటి గదను త్రిప్పుచు శత్రువుల సేనలోఁ దూఱి యక్షులను గుప్పలు కుప్పలుగాచంపి యగ్నిహోత్రుఁడు ఎండినగడ్డిని కట్టెలనుగాల్చు విధమున శత్రుసేనల నల్పకాలములోఁదెగఁగాల్చెను

తే. శుకమహోదరసచివులు♦ప్రకటశౌర్య, లెగవ నెగవంగ యక్షచ♦యేంద్రులెల్ల
గాలికిని దూలు మబ్బుల♦కరణిఁదాల్చి, చనిరి కొందఱు సమసిరి♦సమరభూమి.

తాత్పర్యము

ప్రసిద్ధబలులగు శుకుఁడు మహోదరుఁడు నను మంత్రులు తఱుమఁగాఁదఱు మఁగా యక్షముఖ్యు లందఱు గాలికి మబ్బులవలె నెగిరిపోయిరి. కొందరు యుద్ధ భూమియందుఁ జచ్చిరి.

క. పెదవులు గొఱుకుచుఁ గినుకన్, గుదికొనుచును భ్రష్టశస్త్ర♦కూటంబులతో
నెద నన్యోన్యముఁ గ్రుచ్చుచు, నదిమొరయిక నొడ్డువోలె♦నలఁగిరి యక్షుల్.

అర్థములు. భ్రష్టశస్త్ర కూటంబులతో=పడిన శస్త్రముల సమూహము లతో, నదిమొరయిక=ఏటిరాపిడిచే, ఒడ్డు=గట్టు.

తాత్పర్యము

(కోపముతోఁబెదవులు గొఱుకుచుఁ, బడిన శస్త్రములతోఁ గూలఁబడుచు నొకరి నొకరు పొడుచుకొనుచు నదిమొరయికవలన నొడ్డువిఱిగి కూలిపోవునట్లు యక్షులు నలిగిపోయిరి.)

క. సమరమున నీల్గి ధరణిని, నమరపురికి నరుగువారి • యలజడిచే న
భ్రమునం జూచెడి ఋషి సంఘములకు నిలువంగఁ దలము • కలుగదయెమిన్. ౨౦౭

అర్థములు. అలజడి=సందడి, అభ్రమునన్=ఆకాశమందు, తలము=ప్రదేశము.

తాత్పర్యము

భూమియందు యుద్ధమునఁ జచ్చి స్వర్గమునకుఁ బోవువారి రాయిడిచేత నాకాశమునుండి యుద్ధమును జూచు ఋషులు మొదలగు వారికి నిలువస్థలము లేదాయెను.

క. విచ్చిన సేనలఁ గనుఁగొని, హెచ్చిన కినుపునను గుహ్యా•కేశ్వరుఁ డనుపన్.
వచ్చి సురారుల శరములఁ, గ్రుచ్చెను సంయోధకంట•కుఁడు భీకరుఁడై. ౨౦౮

అర్థములు. కినుపు=కోపము, గుహ్యకేశ్వరుఁడు=కుబేరుఁడు.

తాత్పర్యము

తనసేనల విచ్చిపోవుట చూచి కుబేరుఁడు కోపించి సంయోధకంటకుఁ డను వానిని బంపఁగా వాఁడు రాక్షసులను బాణములచేఁ గ్రుచ్చెను.

ఉ. ఏచిన శౌర్యగర్వమున • నెల్లెడఁ దానయి వచ్చువాని మా
రీచుఁడు దాఁకెఁ దాఁకుటయు • రేఁగి సుదర్శనతుల్యచక్రధా
రాచకితాత్ముఁ జేసి ధర • వ్రాలఁగఁ ద్రోసిన వాఁడు సోలియున్
లేచి బలాతిరేకమున • లీలగఁ బాఱఁగఁ దోలె నాతనిన్. ౨౦౯

అర్థములు. ఏచిన=అతిశయించినఁ, రేఁగి=విజృంభించి, సుదర్శనతుల్య=విష్ణుచక్రముతో సమానమైన, చక్ర=చక్రము యొక్క, ధారా=వాదరచే, చకితాత్మున్=చలించిన మనస్సుగలవానిని, బలాతిరేకమునన్=అతిశయబలముచే.

తాత్పర్యము

అతిశయించిన శౌర్యము వలనఁ గలిగిన గర్వముచే నెందుఁ జూచినను దానే యై విచ్చలవిడి వచ్చువానిని మారీచుఁ డెదిరింపఁగా సంయోధకంటకుఁడు విజృంభించి విష్ణుచక్రమువంటి చక్రముదెబ్బచే వానిని జలించిన మనస్సుగల వానింగాజేసి నేలఁబడఁద్రోయఁగా వాఁడు మూర్ఛిల్లి లేచి బలాతిశయముచే నతనిఁబార దోలెను.

చ. తొలఁగినవానిఁ గాంచి రణ•దుర్జయుఁ డౌ దశకంధరుండు పే
రెలమిని హేమకల్పితచ•యేద్ధము ద్వారముఁ జొచ్చెఁ జొచ్చినన్
బలియుఁడు సూర్యభానుఁ డను • వాఁడు దశాస్యు నెదిర్చి యాఁగి ని
శ్చలుఁ డయి యొక్క స్తంభమునఁ • జయ్యన మోఁదె సురారిమూర్ధమున్. ౨౧౦

అర్థములు. పేరెలమిని=మిగుల సంతోషముతో, హేమరత్న నిచయ+ఇద్ధము=బంగారు రత్నసమూహములచే ప్రకాశించునదియగు, ఆఁగి=నిలువరించి.

తాత్పర్యము

ఇట్లు ద్వారమున కడ్డములేక తొలఁగిపోయిన సంయోధకంటకునిఁ జూచి రణమునందు జయింపరాని దశకంఠుండు మిగుల సంతోషించి బంగారుతోను రత్న సమూహములతోను ప్రకాశించు ద్వారము ప్రవేశించి లోపలికిఁబోఁగా బలశాలి సూర్యభానుఁడనువాఁడు దశకంఠు నెదిర్చి నిలఁబడఁజేసి యచ్చట నున్నయొక స్తంభముతో దశకంఠుని తలమీఁద మిగులవేగముగ మొత్తెను.

తే. తోరణస్తంభహతినిశాచారి గ్రక్కె, రక్తమునుగొండ ధాతువుల్ గ్రక్కుపగిది
వరబలమునఁ జేసి యేబాధ లేక, వాని నద్దాన దానవభర్త వైచె. ౨౯౧

అర్థములు. తోరణస్తంభహతిన్ = తోరణములు గట్టుటకై పాఁతిన స్తంభముయొక్క దెబ్బచే, నిశాచారి=రాక్షసుఁడు, రావణుఁడు.

తాత్పర్యము

తోరణస్తంభము దెబ్బచేత; రావణుఁడు కొండ గైరిక ధాతువులగ్రక్కునట్లు నెత్తురు గ్రక్కెను. కాని బ్రహ్మవరము బలమున నే బాధలేక వాని నా స్తంభము చేతనే కొట్టెను.

క. యక్షుఁడు తత్ప్రహరణమున, నాక్షణమ నశించె భస్మమై వెఱచేతన్
బక్షులకై వడిఁ దక్కిన యక్షులు తటినీగుహాచయంబులఁ జొరఁగన్. ౨౯౨

అర్థములు. తత్ప్రహరణమునన్=ఆ దెబ్బచే, తటినీ=ఏళ్ళను, గుహాచయంబులన్=గుహల గుంపులను, జొరఁబడఁగా.

తాత్పర్యము

ఆ దెబ్బచే యక్షుఁడు వెంటనే చచ్చెను. అది చూచి భయపడి యక్షులు గుహలలో నదులలో దాఁగికొనిరి.

౧౫వ సర్గము

క. పురివిచ్చిన సైన్యముఁ గని, నరవాహుఁడు మాణిభద్రునకు ననె దశకం
ధరుఁ బాపాత్మునిఁ ద్రుంపఁగ, నరుగుము దిక్కగుము శూరయక్షుల కెల్లన్.

అర్థములు. పురివిచ్చిన=చెదరిన, నరవాహుఁడు=కుబేరుఁడు.

తాత్పర్యము

(చెదరిన సేనను జూచి కుబేరుఁడు మాణిభద్రునితోఁ బాపాత్ముఁడగు రావణుని సంహరింపఁ బొమ్ము, శూరులగు యక్షులకు దిక్కుకమ్ము అని చెప్పెను.)

ఉ. నావుడు వాడు నల్లె యని ♦ నాలుగు వేవురు యక్షసూరు లెం
తేవడిఁ దోడరా నరిగి ♦ తీవ్రగదాముసలాసిశక్తులన్
జేవ దలిర్ప నొంచి వెఱ ♦ జేడ్పడ శత్రులు డేగయో యనం
గా విహరించె లాఘవము ♦ కల్మి సురర్షిచయంబు మెచ్చఁగన్. ౫౮

అర్థములు. ఎంతేవ=ఎంతేని వడి, మిక్కిలి వేగముగా, ముసల=రోకండ్ల చేతను, అసి=కత్తులచేతను రెండవపాదంబున నిత్యయతి. "ఏని మున నాంధ్ర శబ్దము, తో నతికిన పూర్వపదము తుది వ్రాయికి న, చ్చెనను వ్యంజన వర్ణం, బైన రచింపుదురు. 'నిత్యయతు లనుచుఁ గవుల్' అప్ప ౩—౧౧౩ ప." క్రొత్తగా నామకరణ మొకటి చేయబడెనే కాని యిది వాస్తవమున నఖండ యతియె. ఏని మొదలైన విట్టివే.

తా త్ప ర్య ము

అని చెప్పగాఁ వాఁడంగీకరించి నాలుగువేల యక్షసూరులు తనతోఁడ రాఁగాపోయి తీవ్రములైనగదలచేతను రోఁకండ్లచేతను కత్తులచేతను శక్తులచేతను శత్రువులు భయపడునట్లు బలముతో నొప్పించి దేవఋషులు మెచ్చఁగా డేగ వలె లాఘవముచే సంచరించెను.

ఉ. యక్షుల నొక్క వేవురఁ బ్ర ♦ హస్తుఁడు ద్రుంచె మహోదరుండునున్
దక్షుల వేవురం దునిమె ♦ దాటకపుత్రుఁ డుదగ్రమూర్తి సం
ధుక్షితరోష వేగమునఁ ♦ ద్రోచె ధరం బడ రెండువేల ధూ
మ్రాక్షుఁడు మాణిభద్రునుర ♦ మం దొకరోఁకటఁ దాఁచె బిట్టుగన్. ౫౯

అర్థములు. వేవురన్=వేయిమందిని, సంధుక్షిత=రాఁజఁబెట్టఁబడిన, రోష వేగమునన్=కోపాతిశయముచే.

తా త్ప ర్య ము

(ప్రహస్తుఁడొక వేయిమంది యక్షులను జంపెను. మహోదరుఁడు వేయి మందిని, మారీచుఁడు రోషాతిశయమున రెండువేలను జంపిరి. ధూమ్రాక్షుఁడు మాణిభద్రుని ఱొమ్మున రోఁకటితోఁ గొట్టెను.)

క. చక్కటిఁబోరాడెడి యా, జక్కులబలగంబు లేడ? ♦ శాంబరిపేర్మిన్
నిక్కెడి రక్కసు లెక్కడ?, నక్కతమునఁ జూవె యెక్కుడగుటాయసురల్.

అర్థములు. చక్కటి=ధర్మపద్ధతి మించనలేక, జక్కుల బలగంబు=యక్షుల సేన, శాంబరిపేర్మిన్=మాయయతిశయముచే, అక్కతమునన్=ఆ కారణముచే.

తా త్ప ర్య ము

యక్షులు న్యాయ్యముగ యుద్ధముచేసిరి, రాక్షసులు మోసయుద్ధముచేసిరి. ఆ కారణముచే రాక్షసు లధికులైరి. కాని వాస్తవబలమునఁ గాదు.

క. ముసలము వ్రేటునకును దా, నిసుమంతయు జంకక కాతఁ డెసఁగినకినుకన్
వెస ధూమ్రాక్షుని గదఁ జే,కసిమిరి తీఱంగ నెత్తుఁ గ్రక్కఁగ మోదెన్. ౨౯౭

అర్థములు. ఇసుమంతయు=కొంచెమైన, చేకసిమిరి=చేతిదురద.

తాత్పర్యము

(రోఁకటిపోటున కిసుమంతయును జంకక మాణిభద్రుఁడు కోపముతోఁ జేతి తీఁట తీఱునట్లు నెత్తురు గ్రక్కఁ ధూమ్రాక్షుని గదతో మోదెను.)

క. వ్రేటు వడి పడినమంత్రి ని, శాటునిఁ గని రావణుండు సక్రోధుండై
దీటొనరని వేగము పరి, పాటిని నమ్మాణిభద్రుపై బఱతెంచెన్. ౨౯౮

అర్థములు. మంత్రి నిశాటుని=మంత్రియగు రాక్షసుని, ధూమ్రాక్షుని, పరిపాటిని=క్రమముగ, దీటొనరని=సమానములేని.

తాత్పర్యము

(వ్రేటుపడిన మంత్రినిఁ గని రావణుఁడు క్రోధముతో అపూర్వన మాణిభద్రుని మీఁదికిఁ బరువెత్తుకొని వచ్చెను.)

క. పఱతెంచు పంక్తిముఖుఁ గని, బిఱుసగుశక్తిత్రయమున వ్రేయ నతండున్
వఱలెడిగదచే బగతుని, మొఱకపడం బిట్టు దాఁచెముకుటస్థలమున్. ౨౯౯

అర్థములు. పగతుని=విరోధిని, మొఱకపడన్=మొక్కపోవునట్లు, ముకుటస్థలమున్=కిరీటప్రదేశము.

తాత్పర్యము

(పరువెత్తివచ్చు రావణునిఁ జూచి మాణిభద్రుఁడు కఠినములగు శక్తియనెడి యాయుధములు మూఁడు రావణుని మీఁద వేయ నతఁడు విరోధి కిరీటప్రదేశము మొక్కపోవునట్టు క్రూరముగ గదతోఁ గొట్టెను.)

తే. ఆప్రహారంబునను మహాయక్షుమకుట, మొఱగెనొకపార్శ్వమున
కాతఁడుత్తలంబు
నొందఁడయ్యెను గాన నాయుఱిదిబంటు, పార్శ్వమౌళి యటంచును వాసిఁ గాంచె.

అర్థములు. ఆ ప్రహారంబునకు=ఆ దెబ్బచే, మకుటము=కిరీటము, ఒఱగె=వ్రాలెను, ఉత్తలంబు=తత్తఱపాటు, ఉఱిదిబంటు=ధైర్యము గల శూరుఁడు, వాసి=కీర్తి.

తాత్పర్యము

ఆదెబ్బకు నా మహాయక్షుని కిరీట మొక్క ప్రక్కకు ఒఱగెను. దానికి వాఁడు చలింపలేదు. కావున యాదార్ఢ్యముగల శూరుఁడు పార్శ్వమౌళియని కీర్తివడసెను.

—* కుబేరుఁడు రావణు నిష్ఠురంబు లాడుట *—

ఉ. దవ్వుననుండి విత్తపతి ♦ దానవనాథునియేపుఁ గాంచి బ
 ల్రివ్వునఁ బద్మశంఖకప ♦ రీవృతుఁడై హితశుక్రయుక్తుఁడై
 యవ్విబుధారిఁ జేరి మరి ♦ యాద దలంపని శాపమూఢునిన్
 గ్రొవ్వునఁ గన్నుఁ గానని య ♦ ఘోరచరిత్రునిఁ బల్కె నివ్విధిన్. ౩౦.౧

అర్థములు. దవ్వుననుండి=దూరమునందుండి, విత్తపతి=కుబేరుఁడు, ఏపు=పరాక్రమము, బల్ ఱివ్వునన్=మిగుల వేగముగ, శకటరేఫములు సంయుక్తములైనపుడు లఘురేఫములగును. కావున రేఫద్వయమునకు యతి చెప్పఁబడెనని భ్రమింపరాదు. "అలఘురేఫము లుత్తాక్షమగుచో లఘురేఫంబగు" ప్రౌ-వ్యా. ముక్తలక్షణవివేచనము ౨ సూ. 'లఘుర్భవేద్గురుః కుత్ర'-చిద్గురుశ్చ లఘుస్తథా ఉచ్చారణస్య కల్ప్యత్వాన్ని దానం తత్ర సద్వచః'॥ అథర్వణ కారికలు సంశ్లేషమందు నలఘురేఫము అలఘువుగా నుచ్చరింప సాధ్యపడదు. పద్మశంఖకపరీవృతుఁడై=పద్మశంఖనిధుల కధిదేవత లగువారిచే చుట్టఁబడినవాఁడై, హితశుక్రయుక్తుఁడై=అనుకూలుఁడగు శుక్రుఁడు ప్రోష్ఠపదుఁడను మంత్రులతోఁ గూడినవాఁడై, శాపమూఢునిన్=విశ్రవసు శాపముచే క్రూరుఁడై మట్టు మర్యాద లెఱుంగని వానిని, అఘోరచరిత్రునిన్=మిక్కిలి భయంకరమైన నడవడి గలవానిని.

తాత్పర్యము

కుబేరుఁడు దూరమున నుండి రావణుని పరాక్రమముఁ జూచి మిక్కిలి వేగముతో శంఖపద్మాది నిధిదేవతలతోను మంత్రులగు శుక్రప్రోష్ఠపదులతోను గూడినవాఁడై యా రాక్షసు సమీపించి శాపముచే మూఢుఁడై పెద్ద పిన్న గౌరవము తలంపని వానిని గర్వముచే నంధుఁడగు వానిని మిగుల క్రూరమైన నడవడి గల వానిని నీ ప్రకారము పలికెను.

చ. వలదుర కీడుచేత లని ♦ భ్రాత వటంచును బుద్ధి చెప్పినన్
 నిలువవు, యాత్మలోఁ దలఁప ♦ నేరవ యుక్తమయుక్త మేనియున్
 దెలిసెదు దుర్గతిం బొరసి ♦ దీనిఫలానుభవంబువేళ హా
 సలిపితి ఘోరపాపమును ♦ సల్పను బుణ్య మటంచు నేచ్చుచోన్. ౩౦.౨

అర్థములు. దుర్గతిన్=నరకము, అధోలోకము.

తాత్పర్యము

నీవు తమ్ముఁడవు గదా యనీ శ్రేయస్సు గోరి చెడుకార్యము లేల చేసెదవని బుద్ధి చెప్పఁగా నిలిచిన వాఁడవు కావు. ఇది యుచితము, ఇది యనుచితమని నీవు మనస్సునం దాలోచించిన వాఁడవు కావు. దీని ఫలము నీవు నరకమునఁ బడి

యనుభవించుచు నయ్యో ఘోరపాపమును జేసితినే, పుణ్యముచేయక పోయితినే యని యేడ్చు సమయమునఁ దెలిసికొందువు.

క. పరికింపక మీఁ దెవ్వఁడు, గరళంబును ద్రావు వాఁడు ♦ కర్మఫలంబున్
 పరిణామవేళఁ దలఁచున్, గురుసుల నయ్యది కసిండి♦కోఁతలు కోయన్. 303

అర్థములు, పరికింపక=చూడక, మీఁదు=ముందు రాఁగలది, గరళంబును=విషమును, పరిణామవేళన్=జీర్ణమగు సమయంబున, గురుసులన్=జీవస్థానముల, కసిండికోఁతలు=కఱుకు కోఁతలు.

తాత్పర్యము

విషము ద్రావిన మీఁద నెట్లగునో యని యాలోచింపక త్రావువాఁడు అది జీర్ణమగు సమయంబున జీవస్థానముల కఱకఱ తెగఁగోయు సమయంబున తాను జేసిన కర్మఫల మిది గదాయని యప్పుడు తలఁచును.

తే. స్వల్ప మేదియొ ధర్మంబు ♦ సల్పినట్టి, నిన్నుఁగని సంతసింపరు ♦ నిర్జరాళి
 యిట్టి క్రూరంపుబుద్ధి వహించి దుష్ట,కార్యముల నిప్పుడొనరించు♦కారణమున

నీ విటువంటి క్రూరమైన బుద్ధిగలవాఁడవై దుష్టకార్యములు చేయుటచే నేదియో కొంచెము పుణ్యము చేసిన నిన్నుఁ జూచి దేవతలు సంతోషింపరు.

క. జననీ జనకుల నాచా,ర్యుని నవమానించు నాతఁ ♦ డోదుర్మతి కా
 లునకున్ వశపడి భృశయా,తనలం దపియించువేళఁ♦దత్కృతిఁ దలఁచున్.

అర్థములు. భృశయాతనలన్=అధిక నరక బాధల.

తాత్పర్యము

ఓరి! చెడుబుద్ధిగలవాఁడా! తల్లిని దండ్రిని ఆచార్యుని అవమానించువాఁడు చచ్చి యమలోకమున నరకబాధపడునపుడు దానుజేసినపనిని దలంచి దుఃఖించును

క. తను వధ్రువంబు ధరణిన్, మనువేళన తపముఁ జలుప ♦ మానినయేనిన్
 దనగతికిఁ జనిన వెనుకన్ ♦ బనవును బో మానవుఁడు ♦ పరితప్తుండై. 304

అర్థములు. అధ్రువంబు=స్థిరముగానిది, మనువేళన = బ్రతికియుండునపుడే, పనవును=ఏడ్చును.

తాత్పర్యము

దేహము శాశ్వతంబు గాదు. జీవించి యున్నప్పుడే తపము చేయఁడేని, తన గతికిఁ దాను బోయిన వెనుక మిగులఁ దపించువాఁడై పుణ్యము చేయక పోయితిని గదా యని యేడ్చును.

క. ధర్మమున రాజ్యధనములు, శర్మంబు నధర్మమునను సంతాపం బౌ
ధర్మము సౌఖ్యార్థము దుష్కర్మమ్ములను వదలి చేయఁగా సుమతికగున్. ౩౦౭

తాత్పర్యము

ధర్మము చేయువానికి రాజ్యము ధనము ఉభయలోక సుఖము కలుగును. అధర్మము చేయువానికి దుఃఖము కలుగును. బుద్ధిమంతుఁ డగువాఁడు దుష్టకార్యములు చేయక సౌఖ్యార్థమై ధర్మమే చేయవలెను.

ఆ. పాపమునకు నెపుడు ఫలము దుఃఖమయగు, దాని నిందుఁ గుడువఁ దగునరుండు
అట్లు గాన మూఢుఁ డాత్మోపఘాతార్థ, మాచరించుచుండు నఘచయంబు. ౩౦౮

అర్థములు. ఆత్మోపఘాతార్థము=తాను నాశమైపోవు కొఱకు, అఘచయంబు=పాపసమూహము.

తాత్పర్యము

(ఎప్పుడయినను పాపమునకు ఫలము దుఃఖమే. దాని మానవు డిందే యనుభవింప దగును. కావున మూఢుఁడు తన వినాశముకొఱకు పాపము చేయుచుండెను.)

క. కట్టిఁడి కెవనికి శుభమతి, పుట్టంగాఁ బోదు గురులఁ బూజింపకయే
యెట్టిది కర్మ మొనర్చునో, యట్టిది ఫల మనుభవించు నసురేశ్వరుఁడా! ౩౦౯

అర్థములు. కట్టిఁడికి=నియమహీనునకు, శుభమతి=మంచిబుద్ధి.

పెద్దలఁ బూజింప నియమహీనునకు మంచి బుద్ధి పుట్టఁజాలదు. రాక్షసరాజా! ఎవఁ డెట్టికర్మము చేయునో దానికిఁ దగిన ఫలమే యనుభవించును.

తే. పుణ్యకర్మవినిర్జితం పురుషులకును, బుద్ధికనురూప మగు ఫలంబులు ఘటిల్లు
శౌర్య మేనియుఁ బుత్రులేని ధైర్యమేని, బుద్ధికొలఁదియయై యుండు బుద్ధిహీన.

అర్థములు. పుణ్యకర్మ వినిర్జిత పురుషులకును=పుణ్యకర్మములచే జయింపఁ బడిన పురుషులకు.

తాత్పర్యము

బుద్ధిలేనివాఁడా! పుణ్యకర్మములచే జయింపఁబడిన పురుషునకు ఫలములు వాని బుద్ధికొలఁదిగ లభించును శౌర్యమైనను కొడుకులైనను ధైర్యమైనను బుద్ధికొలఁది యుండును. బుద్ధి మంచిదైన సర్వము మంచిగానే యుండును.

క. పాపాత్ముఁడ వై నిరయస, మాపాదకకర్మకరుఁడ వగుటను ధీ నీ
తో పాటు పలుకఁ జెల్లదు, పాపులతో సుజనుఁ డెపుడుఁ బలుకఁడు నియతిన్.

అర్థములు. నిరయసమాపాదకకర్మకరుఁడవు=నరకమును గలిగించు కార్యములఁ జేయువాఁడవు, నీతో పాటు=నీకుసమముగా.

తాత్పర్యము

నీవు పాపపు మనస్సు స్వభావము గలవాఁడవై నరకము గలిగించు కార్యములు చేయువాఁడ వగుటచే నీతో మాటలాడరాదు. మాటలాడినఁ బాపము వచ్చును. సత్పురుషుఁడు పాపాత్ములతో మాటలాడఁడు. ఈ సందర్భమున నీ వాక్యంబులు స్మరణీయంబులు.

'యా నపశ్యే జ్జాయమానాన్, పాపినో మధుసూదనః
బ్రహ్మరుద్రోథవా పశ్యే ద్రజసా తమసావృతాన్
తై రాలాపం నకుర్వీత నాసద్భిః కించిదాచరేత్
ఏకశయ్యాసనం పంక్తి భాండం పక్వాన్న మిశ్రణమ్
యాజనాధ్యాపనే యోని స్తథైవ సహభోజనమ్
నవధా సంకరః ప్రోక్తోనకర్త వ్యోధమై స్సహ
సల్లాప స్పర్శన స్వాప విఘానాసనశాయనాత్
యాజనాధ్యాపనాద్యానా త్పాపం సంక్రమతే నృణామ్
సంవత్సరేణ పతతి పతితేన సమాచరన్
యాజనా ధ్యాపనా ద్యానా త్సహశయ్యాసనాశనాత్
పాషండినో వికర్మస్థాన్ బైడాలవ్రతికాన్ శఠాన్
హైతుకాన్ బకవృత్తీంశ్చ వాఙ్మాత్రేణాపి నార్చయేత్'

—౦ రావణ కుబేర యుద్ధము ౦—

మ. అని మారీచముఖాసురుల్ గదియ యక్షాధీశుఁ డా సోఁకులన్
ఘననారాచపరంపరానిహతి వీఁగం జేసి రక్షోధిపున్
దన చేనున్నగదన్ శిరస్థ్సలమునం దాఁచెన్ రవంతేని య
ద్దనుజుం డుత్తలపాటు లేక నిలిచెన్ ధైర్యంబు దీపింపగన్. ౩౧-౨

అర్థములు. కదియన్=సమీపింపఁగా, యక్షాధీశుఁడు=కుబేరుఁడు, సోఁకులన్=రాక్షసులన్, ఘననారాచ పరంపరానిహతిన్=గొప్ప బాణముల వరుసల దెబ్బలచే, వీగన్=వెన్నిచ్చునట్లు, ఉత్తలపాటు=కలఁత.

తాత్పర్యము

ఈ ప్రకారము చెప్పి యింతలో మారీచుఁడు మొదలగువారు సమీపమునకు రాఁగా వారి గొప్ప బాణపరంపరలచే వెన్నిచ్చునట్లు, చేసి తన చేతనున్న గదచే రావణుని తలమీఁద గొట్టఁగా వాఁడు ధైర్యముచే గలఁతజెందకనిలిచెను.

శా. అన్యోన్యంబును శ్రాంతి లేకసురయక్షాధీశ్వరుల్ లోకసా
మాన్యాన్యప్రథమానవిక్రమకళాంమాత్సర్యసందీప్తులై
జన్యోద్రేకిత నొంప యక్షుఁడనలాంశ్త్రంబేయ దైత్యుండు వా
ర్జన్యాస్త్రంబున నార్చి మాయఁ గొనియెన్ శత్రుప్రహారార్థమై. ౩౧౩

అర్థములు. శ్రాంతి=విరామము, లోకసామాన్య అన్య=లోకమున నసాధారణమైన,ప్రథమాన=కీర్తి కెక్కిన,విక్రమకళా=బలవిద్యచేతను మాత్సర్య=మచ్చరము చేతను, సందీప్తులై = వెలుఁగుచున్నవారై, జన్యోద్రేకితన్=యుద్ధమందలి యుద్రేకముచే, నొంపన్=నొప్పింపఁగా, శత్రుప్రహారార్థమై=విరోధిని గొట్టు నిమిత్తమై.

తాత్పర్యము

రావణకుబేరులు లోకమున నసాధారణమై ప్రసిద్ధి కెక్కిన బలముచేతను మాత్సర్యముచేతను వెలుఁగుచు యుద్ధమందలి యుద్రేకముచే నొకరి నొకరు విరామము లేక నొప్పింపఁగా కుబేరుఁడు ఆగ్నేయాస్త్రము వైచెను. దానిని రావణుఁడు వారుణాస్త్రంబునఁ జల్లార్చి శత్రువును గొట్టుటకై మాయచేసెను.

క. పులులయు వృక్షంబుల యేకలముల కొండలయు మబ్బుగములయు మున్నీ
రులయున్ యక్షుల దైత్యుల, పలువిధముల తనులు వేలుంవందలు దాల్చెన్.

అర్థములు. ఏకలములు=అడవిపందులయు, మబ్బుగములయు=మేఘ సమూహములయు, మున్నీరులయున్=సముద్రములయు, తనులు=శరీరములు, వందలు=నూర్లు.

తాత్పర్యము

(పులులు, చెట్లు, కొండలు, అడవిపందులు, మేఘములు, సముద్రములు యక్షులు, రాక్షసులు మున్నగు శరీరములు నూర్లు వేలు ధరించెను.)

క. మాయారూపంబులఁ దై, తేయుని శరవృష్టి నొకఁడ త్రినయనమిత్రుం
డాయెడఁ గనెఁ గాని కనం, డా యసురాధముని సంభ్రమాకలితుండై. ౩౧౫

అర్థములు. త్రినయనమిత్రుండు=కుబేరుఁడు, మాయా రూపంబులన్=అద్భుత శక్తిచే గల్పింపఁబడిన యాకారములను, శరవృష్టి = బాణవర్షము, సంభ్రమాకలితుండై =మిగుల భ్రమచెందినవాఁడై.

తాత్పర్యము

రావణుఁడు తన యద్భుతశక్తిచేఁ గల్పించిన రూపములను, బాణవర్షమును మాత్రము కుబేరుఁడు చూడఁగలిగెనేకాని యదృశ్యుఁడైన రావణాసురుని జూడఁ జాలకపోయెను ఆ కారణమున మిగుల భ్రమగొనెను.

—* రావణుఁడు కుబేరు జయించి పుష్పకంబుఁ గొనుట *—

ఉ. అంత దశాననుండు విష♦మాస్త్రిముఁ బూని మనుష్యధర్ము దు
ర్దాంతజవంబు నై నడవఁ ♦ గ్రమ్మినమూర్ఛ మునింగి వ్రాలె మే
నెంతయు రక్తసిక్తముగఁ ♦ గృత్తమువూల మశోకమో యనన్
జెంతలఁ జేరి పద్మముఖ ♦ శేవధు లా ధనవాథుఁ దేర్చుచున్. ౩౧౬

అర్థములు. మనుష్యధర్మ=కుబేరుని, 'మనుష్యధర్మాధనదో రాజరాజో ధనాధిపః' అమరము, మనుష్యుల యాచారమువంటి యాచారము గలవాఁడు, దుర్దాంతజవంబుమై—అణఁపరాని వేగమున, అడవన్=కొట్టఁగా, రక్తసిక్తము గన్=నెత్తుటఁ దడసినదిగ, కృత్తము మూలము=నఱకఁబడిన వేఱుగలది, పద్మముఖశేవధులు=పద్మము లోనగు నిధుల కధ్యక్షులగువారు, తేర్చుచున్=మూర్ఛ తేరునట్లు చేయుచు.

తాత్పర్యము

కానవచ్చు నాకారములలో రావణుఁ డెవ్వఁడో తెలియక కుబేరుఁడు తికమక గొనియుండఁగా రావణుఁడు మిగుల వేగముగల కఠినాస్త్రము నొకటి ప్రయోగింపఁగా నది తగిలి యతఁడు మూర్ఛపోయి వేఱునఱికినఁ బడు నశోకవృక్షమువలెఁ బడెను. అది చూచి పద్మాధిదేవత లాతనిను మూర్ఛ తేఱఁ జేయుచు.

క. నందనమునకుం గొని చన, నందితుఁడై యసుర ధనదు♦నగరికిఁ జని యం
దందమగు పుష్పకము న,స్పందమదంబునను గొనియె♦జయచిహ్నముగన్. ౩౧౭

అర్థములు. నందితుఁడై=సంతోషించినవాఁడై, అస్పందమదంబునను=చలింపని గర్వముతో, జయచిహ్నముగన్=గెలిచినదానికి గుర్తుగా.

తాత్పర్యము

ఉపచారమునకై నందనవనమునకుఁ దీసికొనిపోఁగా రావణుఁడు సంతోషించి కుబేరుని నగరిఁ బ్రవేశించి దాను గెలిచినదానికి గుర్తుగా మిగుల గర్వముతో పుష్పకమును హరించెను.

సీ. జాతరూపోజ్జ్వల♦స్తంభసంవీతమై, వైడూర్యతోరణ♦భ్రాజిత మయి
సరసముక్తాజాల♦సంప్రతిచ్ఛన్నమై, సర్వకామఫలవృ♦క్షంబు నగుచుఁ
గామరూపం బయి♦కామజవం బయి కామగమం బయి ♦ ఖచర మగుచు
భర్మమణీద్ధ సో♦పానసంఘం బయి, తప్తకాంచన వేది♦తలము నగుచు

తే. నాకనిలయోపవాహ్యమై♦నవ్యమగుచు,దృష్టిహృదయసుఖంబయి♦దివ్యమగుచు
సర్వఋతుసుఖదం బయి♦శైత్యతాప,హీనమై బ్రహ్మనిర్మిత♦మైనదాని. ౩౧౮

అర్థములు. జాతరూప+ఉజ్జ్వల=బంగారువలెఁ బ్రకాశించు, స్తంభ=స్తంభములచే, సంవీతమై=కూడినదై, వైడూర్యతోరణ భ్రాజితమయి=వైడూర్యములతోఁ జేయఁబడిన తోరణములచేఁ బ్రకాశించునదియై, సరస=బంగారుతోఁ గూడిన, ముక్తాజాల=ముత్యాల సమూహముచే, సంప్రతిచ్ఛన్నమై=చక్కఁగాఁ గప్పఁబడినదై, సర్వకామ ఫలవృక్షంబు=కోరినవన్నియు నిచ్చు ఫల వృక్షము గలదై, కామరూపంబు=కోరిన రూపము గలది, కామజవంబు=కోరిన వేగమునఁ బోఁగలది, ఖచరము=ఆకాశమునఁ బోగలది, భర్మ+మణి+ఇద్ధ=బంగారు రత్నములచేఁ బ్రకాశించు, సోపానసంఘంబయి—మెట్ల సమూహములు గలదై, తప్త కాంచన=పుటము వేయఁబడిన బంగారుతోఁ జేయఁబడిన, వేదితలము=అరుఁగుల ప్రదేశము, నాకనిలయ=దేవతలకు, ఉపవాహ్యమై=వాహనముగా నుండఁదగినదై, నవ్యము=మనోహరము, దృష్టి హృదయ సుఖంబయి=చూపులకు మనస్సునకు సుఖము కలిగించు నదియై, సర్వ ఋతు సుఖదంబయి=అన్ని ఋతువులందు సుఖము కలిగించు నదియై, శైత్యతాపహీనమై=చలిమిరి వేడిమిలేనిదై, బ్రహ్మ నిర్మితము=బ్రహ్మచేఁ గల్పింపబడినది.

తా త్ప ర్య ము

బంగారు స్తంభములు వైడూర్య తోరణములు ముత్యములజాలములుగలిగి కోరిన ఫలము లీయగలిగిన చెట్లుగలదై కోరినరూపము గలదిగా మార్ప సాధ్యమైనదై కోరిన వేగమునఁ బోఁగలదై కోరినట్లు మింటను నేలలో నెందైనఁ బోఁగలదై యాకాశమున సంచరించునదియై బంగారు రత్నములచే బ్రకాశించు సోపానములు గలదై పుటము వేసిన బంగారు తిన్నెలు గలదై దేవతలకు నెక్కి తిరుగ యోగ్యమై మనోహరమై కంటికి మనస్సునకు సుఖము గలిగించునదియై దేవతాసంబంధమై అన్ని ఋతువులందు సుఖము గలిగించునదియై చలి వేఁడుములు లేక యెల్లకాలము సమశీతోష్ణములు గలదై బ్రహ్మ నిర్మించినదానిని.

క. కడిమిమెయి నవ్విమానము. నొడిచి దురాత్ముండు విక్ర•మోద్ధతి జగముల్
పడ నడచినట్ల పొంగుచు, వడి దిగియెన్ వెండికొండ•ధ్వజినీయుతుఁడై. ౩౫

అర్థములు. కడిమిమెయిన్=పరాక్రమముచేత. ఒడిచి=హరించి, పడనడచి నట్ల=పడఁగొట్టినట్లే, జయించినట్లే, ధ్వజినీయుతుఁడై=సేనతోఁగూడినవాఁడై.

తా త్ప ర్య ము

(పరాక్రమముచేత నావిమానమును హరించి; విక్రమాతిరేకమునలోకముల న్నిఁటిని గెలిచినట్లే పొంగిపడి సేనతోఁ గూడ వెండికొండనుండి వడిగాదిగెను.)

౧౬వ సర్గము

—* కైలాస ప్రాంతంబునఁ బుష్పకము చన కుండుట *—

క. సేనలతోఁడ విమానము, పై నెక్కి కుమారజన్మ ♦ వసుధ శరవణం
బౌ నెలవు హేమమయమున్, భానూపమ మైనదానిఁ ♦ బర్వతవరమున్. ౩౨౦

అర్థములు. కుమార జన్మవసుధ=కుమారస్వామి పుట్టినభూమి యందు, శరవణంబు=రెల్లువనము వనములో నినకారము రేఫ యోగముచేణకారమయ్యెను. 'రషాభ్యాం నోణస్సమాన పదే' యని పాణిని, త్రినయన శబ్దమపవాదము, హేమమయమున్=బంగారుతో నిండినది, భానూపమము=సూర్యునితో సమానమైనది.

తాత్పర్యము

సేనలతో విమానముమీఁద నెక్కి కుమారస్వామి పుట్టిన భూమి రెల్లుగల ప్రదేశము బంగారుతో నిండినది సూర్యకాంతి గలది యగు పర్వత శ్రేష్ఠమును.

శా. ఆరోహించుచుఁ బోవుచోట నొక రమ్యారామముం గాంచె వాఁ
డా రారాజువిమాన మేగ కటని ♦ ర్వ్యాపారమై నిల్చినన్
జేరం బిల్చి యమాత్యవర్యులను స ♦ ల్చిం బుష్పకం బిష్టసం
చారం బయ్యు నిదేల యెవ్వఁ డిటు సం ♦ స్తంభించెనో దీనినిన్. ౩౨౧

అర్థములు. ఆరోహించుచున్=ఎక్కుచు, రమ్యారామమున్=అందమైన యుద్యానవనమును, రారాజు=కుబేరుని యొక్క, రాజరాజశబ్దభవము రారాజు, నిర్వ్యాపారమై=జరుగుటలేనిదై, ఇష్టసంచారంబు=కోరినట్టు తిరుగునది, సంస్తంభించెనో=కదలకుండఁ జేసెనో.

తాత్పర్యము

ఎక్కుచుఁ బోవుచు నొకచోట నందమైన యుద్యానవనమును జూచెను. అచ్చట నా కుబేరుని విమానము కదలక నిలిచెను. అప్పుడు రావణుఁడు మంత్రులను చేరఁ బిల్చి యిష్టము వచ్చినట్లు పోవఁగల యీ విమానము కదలకుండుటకు గారణ మేమి? ఎవ్వఁడు దీనిని కదలకుండఁ జేసెను?

సీ. అన బుద్ధికోవిదు ♦ లైన మారీచుండు, నిష్కారణమ్ముగ ♦ నిలువ దిద్ది
కత మేదియో గల్గుఁ ♦ గాకున్నఁ గిన్నర, ముఖ్యుఁ దప్పఁగ నన్య ♦ మోవ దేమొ?
యనియిట్లు యోజించు ♦ నవసరంబునఁ గృష్ణ, పింగళుండును ముండి ♦ వికటుఁ డొకఁడు
కురుచ చేతుల వాఁడు ♦ గుజ్జుదేహమువాఁడు. బలవంతుఁడును మిట్ట ♦ పండ్లవాఁడు
తే. ఈశ్వరుని యనుచరుఁడు నంది ♦ దీశ్వరుండు, పంక్తికంఠునిఁ జేరంగ ♦ వచ్చి నిలిచి
కొంచెము మది లేక రాక్షస ♦ కోటి వినఁగ, వానితో నను గంభీర ♦ భాషణముల ౩౨౨

అర్థములు. కోవిదుఁడు=పండితుఁడు, కతము=కారణము, కృష్ణపింగళుండు=నలుపు పసుపు కలిసిన వన్నెగలవాఁడు, ముండి=బోడి, వికటుఁడు=

భయంకరమైనవాఁడు, నందీశ్వరుఁడు=వృషభేశ్వరుఁడు, నందము = ఆనందము, అది కలవాఁడు నంది, అట్టినందులం దీశ్వరుఁడు,నందీశ్వరుడు ఈశ్వరసేవానందము గలవాఁడని భావము.

తాత్పర్యము

(అనఁగా, బుద్ధిమంతుఁడగు మారీచుఁడిది నిష్కారణముగ నిలువదు.కారణ మేదియో యుండును, అటుగాక యిది కుబేరునిఁ దక్క నితరుల మోపదేమొ? అని యోజించుచుండునంతలోఁ, గుఱుచ చేతులవాఁడు, పొట్టివాఁడు, నలుపు పసుపు గలసిన వన్నెగలవాఁడు, బోడితలవాఁడు, భయంకరమైనవాఁడు, శివుని యనుచరుఁడు నగు నందీశ్వరుఁడు రావణుని దగ్గఱకు వచ్చి జంకులేక బిగ్గరగా రాక్షసులు వినుచుండ రావణునితోఁ.)

క. దశకంఠ! మరలి చను మీదిశ రాకుము శంకరుండు దేవియుఁ గ్రీడా
వశులై యున్నారరుగఁగ, వశపడదు సురాహియమరవరులకు నైనన్. ౩౨౩

అర్థములు. ఈదిశ=ఈవైపు, దేవి=పార్వతీదేవి. వశపడదు=సాధ్యపడదు, సుర=దేవతలకు, అహి=సర్పములకు, అమరవరులకు=ఇంద్రుఁడు లోనగువారికి,

తాత్పర్యము

(రావణా! యిటు రాకుము-మరలిపొమ్ము-ఇక్కడ శంకరుఁడు పార్వతితోఁ గ్రీడాపరుఁడయి యున్నాఁడు. దేవతలకు సర్పములకు నింద్రుఁడు మొదలగు వారికిఁ గూడ పోవుటకు సాధ్యపడదు.)

తే. అనినఁ గంపితకుండలుఁడగుచు రోష,సంభ్రమంబున నెవ్వఁ డాశంకరుండు
టంచుఁ బుష్పకమును డిగ్గియద్రిమూల, మరిగియచ్చోట రెండవహరుఁడనంగ.

అర్థములు. కంపితకుండలుఁడు=కదలుచున్న కుండలములు గలవాఁడు, దీనిచేఁ దలయూఁచెనని గ్రాహ్యము, రోషసంభ్రమంబునన్=కోపమువలని వేగిరిపాటుతోఁ, అద్రిమూలము=పర్వతము క్రిందిభాగము.

తాత్పర్యము

అని చెప్పఁగా కుండలములు కదల రోషవేగమునఁ దలయూఁచి యెవ్వఁడురా యీ శంకరుఁడని పుష్పకము దిగి కొండక్రిందివైపుపోయి యచ్చట రెండవ హరునివలె.

తే. దీప్తశూలంబు చేఁగ్రాలఁ దేజరిల్లు, కీశముఖు నందిఁ గనుఁగొని యాశరుండు
వారిదము మ్రోఁగునట్టు లవజ్ఞ దోఁప, బకపకమటంచు నవ్వ నాభద్రుఁడనియె.

అర్థములు, కీశముఖున్=కోఁతిముఖము వంటి ముఖము గలవాని, ఆశరుండు=రాక్షసుడు, వారిదము=మేఘము, అవజ్ఞ=తిరస్కారము.

తాత్పర్యము

మండుచున్న దానివలెఁ బ్రకాశించు శూలమును జేతఁ ధరించి క్రోఁతి ముఖము గల నందిని జూచి యా రాక్షసుఁడు మేఘధ్వనితోఁ దిరస్కారబుద్ధి పకపక నవ్వఁగా నా నంది యిట్లనియె.

—* నందీశ్వరుఁడు రావణు శపించుట *—

ఉ. మర్కటవక్త్రుఁడంచు నవ♦మానము దోఁపఁగ నవ్వెదే ననుం
దర్కమిదేల? విన్ము రణ ♦ దర్పసమగ్రులు మద్బలాకృతుల్
కర్కశవిగ్రహుల్ గిరిని ♦ కాశులు పుత్రకమిత్రభృత్య సం
పర్కభవద్బలంబు రణ ♦ మండలిఁ ద్రుంపఁగఁ బుట్టువారలన్. ౩౨౬

అర్థములు. మర్కటవక్త్రుఁడు=క్రోఁతి ముఖము గలవాఁడు, రణదర్ప సమగ్రులు=పూర్ణమైన యుద్ధగర్వము గలవారు, మద్బలాకృతుల్=నాబలమంత బలము నాయాకారము వంటి యాకారము గలవారు, కర్కశ విగ్రహుల్=కఠిన దేహము గలవారు, గిరినికాశులు=పర్వతములతో సమానులు, పుత్రక=కొడుకుల తోను, మిత్ర=స్నేహితులతోను, భృత్య భటులతోను, సంపర్క=కూడిన, భవద్బలంబు=నీ సేనను.

తాత్పర్యము

ఓరీ రాక్షసుఁడా! నాముఖము క్రోఁతి ముఖమువలె నున్నదని పరిహసించె దవా? కానీ, నీతో నాకు వాద మేల? యుద్ధగర్వము పూర్ణముగాఁ గలవారు నాయంత బలము నాయాకారము వంటి యాకారము గలవారు కఠిన దేహములు గలవారు పర్వతసమానులు కొడుకులతో మిత్రులతో భటులతోఁ గూడిన నీ సేనను యుద్ధమందుఁ జంపగలవారు భూమిపై బుట్టుదురు.

క. మందుఁడ! నిన్నున్ మృత్యువుఁ,బొందింపఁగ నిపుడ శక్తుఁ♦బోరయుదునైనన్
నిందలఁ జచ్చినవాఁడవు, క్రందింపఁగఁ జన్నె మున్నె♦మడిసినవానిన్. ౩౨౭

తాత్పర్యము

బుద్ధిలేనివాఁడ! నిన్ను నే నిప్పుడే చంపగలను గాని నీవు ముందే నిందలచేఁ జచ్చినవాఁడవు. చచ్చినవానిని మరలఁ జంపనేల?

క. అను నందికేశ్వరునిపై, విను తెరవున నుండి పుష్ప♦వృష్టియుఁ గురిసెన్
ఘన దేవదుందుభిస్వన, మొనరెన్ దశకంఠుఁ డద్ది♦యుఱక మదమునన్. ౩౨౮

అర్థములు. ఉఱక=లక్ష్యము సేయక, వినుతెరువు=అకాశము.

తా త్ప ర్య ము

(అనిన నందికేశ్వరుని మీఁద నాకాశమునుండి పూలవాన గురిసెను. దేవ దుంధుభులు మ్రోసెను. రావణుఁడు దానిని లక్ష్యము సేయక పొగరుతో.)

చ. బసవఁడ! మద్విమానగతి ♦ భంగముఁ గూర్చిన యల్లరుద్రునిం
బసచెడ నీధరాధరముఁ ♦ బట్టి పెకల్చెద మూలముట్టుగా
వెస నిదె చూడు మేబలము ♦ పెంపున భర్గుఁడు రాజువోలె నం
దనమునఁ గ్రీడసల్పెడిని ♦ దారొఁకను భీతిఁ దలంప కెప్పుడున్. ౩౨౯

అర్థములు. బసవఁడ=ఎద్దా, మద్విమానగతి=నా విమానము పోవుటకు, భంగము=విఘ్నము, ధరాధరమున్=కొండను.

తా త్ప ర్య ము

ఓసి యెద్దా! నా విమానము నడవకుండ విఘ్నము చేసిన రుద్రుని పసచెడునట్లు నీ కొండను మొదలంటఁ బెకలించెదఁ జూడుము. శివుఁ డేమిబలము నమ్మి రాజువలె భయము లేక యీ నందనవనమునందుఁ గ్రీడించుచున్నాఁడు?

—* రావణుఁడు కైలాసంబుఁ బెల్లగించుట *—

క. ఆమహిమఁ జూతుఁ గా కని, యామహీభృద్వరముఁ బెఱికి ♦ హస్తంబులచే
నా మొఱకుం డాడించిన, నామల యాపాదశిఖర ♦ మల్లలనాడెన్. ౩౩౦

అర్థములు. మహీభృద్వరము=గొప్ప పర్వతము, మొఱకుఁడు=మూర్ఖుఁడు, మల=పర్వతము, ఆపాదశిఖరము=అడుగుపాఁదు మొదలు శిఖరము వఱకు, అల్లలనాడెన్=వణఁకెను.

రావణుఁడు శివభక్తులలోఁ జేర్పఁబడినవాఁడు, శివలింగపూజ చేయువాఁడని ౭౨౫ మొదలగు పద్యములందుఁ జెప్పఁబడెను. అట్లుండియు శివు నిప్పు డింత యవమానదృష్టిఁ జూడఁ గారణమేమో? మొట్టు దేవరకు వెఱతునా, మ్రొక్కు- దేవరకు వెఱతునా యన్నట్టు నీ కథ జరిగిన తరువాత శివభక్తి పుట్టెనేమో.

బలి ప్రహ్లాద విభీషణాదులు కతిపయరాక్షసులుతప్పఁ దక్కిన రాక్షసులందఱు శివభక్తులే. తామసులు, తామస దేవతను గొలుచుట స్వభావమే కదా.

తా త్ప ర్య ము

(ఆ ప్రభావమును జూచెదనుగాక, యని యా మూర్ఖుఁడు తన చేతులతో నా గొప్ప పర్వతమును బెల్లగించి యూఁపింపఁగా నా కొండ, యడుగు పాఁదు మొదలు కొన వఱకు వణఁకెను.)

క. చోద్యంబుగ నతఁ డిగ్గిరి, మాద్యద్గతి నూఁపఁ బ్రమథ♦మండలి వణఁకెన్
ప్రోద్యత్కంపంబున దే,వాద్యుని గిరిరాజతనయ ♦ యాశ్లేషించెన్. 331

అర్థములు. ప్రోద్యత్+కంపంబునన్=మిక్కిలిగాఁ బుట్టుచున్న వణఁకుచే, గిరిరాజతనయ=పార్వతి, దేవాద్యుని=శివుని, ఆశ్లేషించెన్=కౌఁగిలించెను.

తాత్పర్యము.

మదించిన వానివలె వాఁడా కొండ నూఁగులాడింపఁగా ప్రమథు లందఱు వణఁకిరి. పార్వతీదేవి భయపడి శివునిఁ గౌఁగిలించెను.

ఇప్పుడే పార్వతీదేవి రావణాసురుఁడు స్త్రీ నిమిత్తమునఁ జచ్చునుగాకయని శపించెను.

తే. అంతటఁ గపర్ది పాదంబు ♦ నంగుటమున, నదుమ నగ్గిరి తొల్లిటి♦యట్టులుండఁ
గేలిఱికికొన్న దైత్యుండు♦జాలిపుట్ట,బిట్టు వాపోయెఁ బెనునొవ్వు♦పుట్టుటయును

అర్థములు. కపర్ది=శివుఁడు, కపర్దము=జటాజూటము, అది గలవాఁడు కపర్ది, అంగుటమునన్=బొటనవ్రేలిచే.

తాత్పర్యము

(అంతట శివుడు తన కాలి బొటనవ్రేలితో నాకైలాస పర్వతమును మును పటి విధముగా నుండు విధముగా నదిమెను. అందుచేత రావణుఁడు చేతు లా కొండ క్రింద నిఱికి నొప్పికలుగుటచే జాలిపుట్టునట్లు పెద్దగా నేడ్చెను.)

చ. అదరె జగత్త్రియంబు ♦ సకలాబ్ధిచయంబులు క్షోభ మొందె గ్ర
క్కదలె ధరాధరంబులు ది ♦ గాలుప నిర్జరయక్షసంతతుల్
బెదరె ని దే మటంచు సుర ♦ బృందము సేంద్రముగాఁ దలంబులన్
జెదరె నమాత్యకోటి వెఱ ♦ చెన్ లయకాలమహాశనిభ్రమన్. 333

అర్థములు. జగత్+త్రయంబు=మూఁడులోకములు. సకలాబ్ధిచయంబులు= అన్నిసముద్రముల సమూహములు, క్షోభము=కలఁత, ధరాధరంబులు=కొండలు లయకాల=ప్రళయకాలమందలి, మహాశని=పెద్దపిడుగను, భ్రమన్=భ్రాంతిచే.

తాత్పర్యము

రావణుఁ డేడ్చిన యేడుపునకు ముల్లోకము లదరెను. సముద్రము లన్నియు కలఁత చెందెను. కొండలు గడగడ కదలెను, దేవతలు యక్షులు దిగాల్పడి బెదరిరి. ఏమిని యేమిది యని యింద్రునితోడ దేవతా సమూహము తమనెలవు లందుండి చెదరెను. ప్రలయ కాలమందలి పిడుగు పడెనా యేమని రావణుని మంత్రులు దిగ్భ్రమ గొనిరి.

ఉ. రావణుఁ డిట్లు రోదనప ♦ రాయణుఁ డౌటయు మంత్రులెల్ల వా
చావినయంబు దోఁప హరు ♦ శంకరు భర్గు నుమేశునిన్ మహా
దేవుని వేఁడుమీ యతఁడ ♦ దిక్కయి త్రిక్కణగించు నన్న నా
దేవవిరోధి యట్ల విను ♦ తించెఁ గృపాలుని భక్తపాలునిన్. ౩౩౪

అర్థములు. రోదన పరాయణుఁడు=ఏడ్చుటొక్కటే గతిగాఁగలవాఁడు వాచావినయంబు=వినయవాక్కులు, త్రిక్కు=బాధ.

తాత్పర్యము

రావణుఁ డీప్రకార మేడ్చుట తప్పఁ జేతు లూడఁదీసికొనుటకు మఱే మియుఁ జేయ లేకుండుటఁ జూచి మంత్రు లందఱు రాజా! హరుని శంకరు భర్గు పార్వతీపతిని మహాదేవుని బ్రార్థింపుము నీ బాధ పోఁగొట్టునని చెప్పఁగా నతఁ డట్లులే దయావంతుఁడును భక్తరక్షకుఁ డగు శివునిఁ బ్రార్థించెను.

—♦ శివుఁడు రావణునకు వరంబు లిచ్చుట ♦—

ఉ. ఈగతి వేయివత్సరము ♦ లేడ్చిన నంతట నంతకారి యా
ప్రాగమరాధినేత కర ♦ వర్గము నూఁడఁగఁదీయఁ బంచుచున్
రాగరసంబు దోఁప నను ♦ రక్షవరా! భవదీయధీరతా
భోగపరాక్రమంబులకుఁ ♦ బూర్ణముదంబు వహించితిం జుమీ. ౩౩౫

అర్థములు. అంతకారి=యముని జయించినవాఁడు, ప్రాగమర+అధినేత=రాక్షసరాజు, కరవర్గము=చేతులసమూహము, రాగరసంబు=ప్రేమ, భవదీయ ధీరతా భోగ పరాక్రమంబులకు=నీ విస్తార ధైర్య పరాక్రమంబులకు.

తాత్పర్యము

ఈవిధముగ వేయి సంవత్సరములు రావణుఁ డేడువఁగా శివుఁడు వాని చేతులూడఁ దీసికొను మని చెప్పి ప్రేమతో నిట్లనెను. రాక్షసశ్రేష్ఠా నీ విస్తార! ధైర్యపరాక్రమములకు మిక్కిలి సంతోషించితిని.

క. శైలాక్రాంతుఁడ వై నీ, వీలీల మహారవంబు ♦ నెల్లజగంబుల్
వ్యాలోలంబుగఁ జేయుట, హాళిన్ ఘటియింతు రావ♦ణాఖ్యను నీకున్. ౩౩౬

అర్థములు. శైలాక్రాంతుఁడవై=పర్వతముచే నాక్రమింపఁబడినవాఁడవై, వ్యాలోలంబుగన్=మిగులఁ జలించునదిగ, రావణాఖ్యను=రావణుఁ డను పేరును

తాత్పర్యము

కొండక్రిందఁ జిక్కుకొని యీవిధముగ నెల్లలోకములు వ్యాకుల మగునట్లు లేడ్చితివి గావున నీకు రావణుఁ డను పేరు పెట్టితిని.

క. దేవతలు నరులు యక్షులు, భూవలయమునందుఁ గల్గు • భూతము లెల్లన్
రావణుఁ డంచును జగతీ, రావణు నినుఁ బిల్చు నింక • రాక్షసరాజా! ౩౩౭

అర్థములు. జగతీ రావణున్=ప్రపంచము నేడ్చునట్లు చేయువానిని.

తాత్పర్యము

(రాక్షసరాజా! దేవతలు, మానవులు, యక్షులు ప్రపంచమందలి భూతము లన్నియు లోకుల నేడ్పించు నిన్నిఁక రావణుఁడని పిలుచును.)

క. పొమ్మట కేగెదవో యథేచ్ఛమ్ముగ నిశ్శంక మనుడు • సంతసమున నా
ముమ్మొనవాలుందాలుపు, నమ్మనుజాశనచయేశుఁ • డార్తశరణ్యా! ౩౩౮

అర్థములు. ముమ్మొన వాలుందాలుపు=మూఁడు మొనలుగల యాయుధము (త్రిశూలమును) ధరించిన వానిని, శివుని, మనుజాశనచయేశుఁడు రాక్షస ప్రభువు

తాత్పర్యము

(జంకుమాని యిఁక నీ యిష్టమయిన చోటి కెక్కడకుఁ బోయెదవో పొమ్ము అనఁగానే సంతోషముతోఁ త్రిశూలధారియగు శివుని రావణుఁడు 'ఆర్తశరణ్యా!')

ఉ. ప్రీతుఁడ వేని నాయెడల • వేఁడెద నొండు ఘటింపవే దయన్
ధాత మొసంగె దేవఫణి • దానవగుహ్యకయక్ష రాక్షస
వ్రాతముచే నవధ్యత దు • రంబున, దుర్బలమానవావళిన్
జేతమునన్ గణింప, దయ • చేసెను వెండియు దీర్ఘ మాయువున్. ౩౩౯

అర్థములు. అవధ్యత=చావులేకుండుట, దురంబునన్=యుద్ధమందు.

తాత్పర్యము

నాయందు నీవు ప్రీతి గలవాఁడవేని నేను వేఁడొకటి కోరుచున్నాను. దాని ననుగ్రహింపుము. బ్రహ్మదేవుఁడు నాకు దేవ నాగ దానవ గుహ్యక యక్ష రాక్షసులచే యుద్ధమందుఁ జావు లేకుండ వరమిచ్చెను, బలహీనులగు మనుష్యులను నేను లెక్క పెట్టినవాఁడఁ గాను. అంతియ గాక నాకు దీర్ఘాయువు ననుగ్రహించెను.

ఉ. అల్లవిరించిదత్తమగు • నాయువునందు గతించెఁ గొంత నీ
వెల్లను ద్రొల్లియట్ల ఘటి • యింపుము నీమహనీయశస్త్రము
ద్యల్లలితానుకంప గిరి • శా! దయసేయుమ టన్న దేవతా
తల్లిజమిచ్చె భాస్కరశ • తప్రవిభాసముఁ జంద్రహాసమున్. ౩౪౦

అర్థములు. విరించిదత్తము = బ్రహ్మచే నీయబడినది, ఉద్యత్ లలితానుకంపన్=పుట్టుచున్న సంతోషకరమైన దయచే, గిరిశా=శంకరా, దేవతా

తల్లజము=దేవతలందు శ్రేష్ఠుఁడు, భాస్కర శత ప్రవిభాసము=నూర్గురు సూర్యుల కాంతి గలది, చంద్రహాసము=కత్తి.

తా త్ప ర్య ము

ఆ బ్రహ్మ యిచ్చిన యాయుస్సునందుఁ గొంత గతించిపోయినది. నీవు మొదటివిధమున సర్వము పూర్తియగునట్లు చేయుము. నాయందు దయగలవాఁడవై నీ శస్త్రమును నిమ్ము అని వేఁడఁగా దేవతలందు శ్రేష్ఠుఁడగు శివుఁడట్టులే నూర్గురు సూర్యుల కాంతిగల చంద్రహాస మిచ్చెను.

చ. ఇటు తన ఖడ్గ మిచ్చి మది నెంచి గతాయువుఁ బూరణించి ధూ
 ర్జటి సురవైరితో ననియె రావణ! నీవు మదీయ శస్త్రమున్
 స్ఫుటతరభక్తిఁ బూజలను బొల్పుగఁ జల్ప కనాదరించినన్
 గుటిలత మమ్ముఁ జేరు నది గొబ్బున నిక్కము పొమ్మటంచనన్. ౩౪౧

అర్థములు. గతాయువు=కడచిపోయిన యాయుస్సును, పూరణించి=పూర్తి చేసి, ధూర్జటి=శివుఁడు, స్ఫుటతరభక్తి=వంచనలేని పూర్ణమైన భక్తిచే, అనాదరించినన్=అలక్ష్యము చేసినయెడల.

తా త్ప ర్య ము

ఈప్రకారము శివుఁడు తన కత్తినిచ్చి యీ పాపాత్ముని కాయువునెక్కువ చేసిన లోకమునకు బాధ యెక్కువచేసినవాఁడ నగుదునేమో అని కాఁగల కార్యమాలోచించి యాయుస్సు నిండించి యిట్లనియె. నీవీ యాయుధమును స్పష్టమైన భక్తితోఁ బ్రతిదినము పూజింపుము. కుటిలబుద్ధివై పూజింపక యలక్ష్యము చేసితివా యిది నాయొద్దకు మరలివచ్చును. ఇది నిజము పొమ్ము. ఈ కారణముచేఁ గాబోలు రావణుఁడు శివపూజచేయ నారంభించుట.

మ. హరుచే నిట్టులు పేరుగాంచి దురితస్వాంతుండు స్వచ్ఛందసం
 చరణక్రీడ రహించెఁ బుష్పకమునన్ క్ష్మాభర్తలన్ శౌర్యదు
 ర్ధరుల న్నొంచుచు మాఱుకొన్నయెడ సంగ్రామంబునం ద్రుంచుచున్
 శర ణన్నన్ విజితాస్మ యన్నఁ గరుణన్ రక్షించుచున్ గర్వియై. ౩౪౨

అర్థములు. దురితస్వాంతుఁడు=పాపాత్ముఁడు, స్వచ్ఛంద సంచరణక్రీడన్=ఇష్టప్రకారము వేడుకగాఁ దిరుగుటయందు, క్ష్మాభర్తలన్=రాజులను, శౌర్యదుర్ధరులన్=విశేషశౌర్యము గలవారిని,విజితాస్మ=గెలువఁబడితిమి,ఓడిపోయితిమి.

తా త్ప ర్య ము

ఈ ప్రకారము శివునిచే పేరుబొందినవాఁడై పాపాత్ముఁడు తన యిష్టము వచ్చినట్లు పుష్పకమునీఁదసంచరించుచుశౌర్యవంతులనఁబడినరాజులనొప్పించుచు

యుద్ధమందెదిరించిన వారిని జంపుచు నోడిపోయితి మనిన వారిని దయతో రక్షిం చుచు గర్వించి తిరిగెను.

౧౭వ సర్గము

—॰ రావణుఁడు వేదవతితో సంభాషించుట ॰—

చ. ఇటు చరియించుచున్ హిమమ ॰ హీధరచారువనాంతరంబునన్
జటలు మృగాజినంబు నయి ॰ సాధుగతిన్ నిగమైక చోదిత
స్ఫుటశుభసద్వ్రతాఢ్య యగు ॰ సుందరిఁ గన్యక దేవరూపిణిన్
గుటిలుఁడు గాంచి కామవశ ॰ గుం డయి చిక్కఁ రయంచు నవ్వుచున్. ౩౪౩

అర్థములు. హిమమహీధర=హిమవత్పర్వతము యొక్క, చారు=మనోహర మైన, వనాంతరంబునన్=వనములోపల, జటలు=జడలు. మృగాజినంబు=జింక చర్మము, అయి=కలదై, నిగమైకచోదిత=వేదమునందు ముఖ్యముగాఁ జెప్పఁబడిన స్ఫుట=ప్రసిద్ధమైన, శుభ=మేలయిన, సద్వ్రత=మంచివ్రతమను, ఆఢ్య=సంపద గలది, దేవరూపిణిన్=దేవతాస్త్రీల సౌందర్యము గలదానిని, కామవశగుండు= మన్మథునకు వశపడినవాఁడు.

తాత్పర్యము

ఈ ప్రకారము సంచారము సేయుచు హిమవత్పర్వత ప్రాంతమున నున్న మనోహరమైన వనమునందు జడలు కృష్ణాజినము ధరించి వేదోక్తమైన మంచి వ్రతమును సాధుమార్గమున జరుపు దానిని నొక్క సుందరిని కన్యకను దేవతా స్త్రీవంటి దానిని జూచి యాకుచ్చితపుబుద్ధిగల రావణుఁడు కామమునకుఁ బాలు పడి చిక్కఁరా చక్కని చక్కఁరబొమ్మ యని నవ్వుచుఁ జేరఁబోయి.

మ. తరుణీ! యెవ్వతె వీవు? యౌవనవిరుద్ధం బైనయీ నిష్ఠలం
బరివర్తింపఁగ నేటికే? యసమ మౌఁ ప్రాయంబు సౌందర్యమున్
బురుషున్ వేదురుగొల్పఁజాలుఁ, దగవే ॰ పూఁబోణి నీ యట్టి సుం
దరియుం దాపసిలాగె మేనిఁ గసుగందం జేయ శాతోదరీ! ౩౪౪

అర్థములు. వేదురు గొల్పఁజాలు=పిచ్చపట్టునట్లు చేయఁజాలు, కసు గందన్=మిక్కిలి వాడిపోవునట్లు, చేయ, శాతోదరీ=పలుచని కడుపుగలదానా.

తాత్పర్యము

ఓసిపడుచా! నీ వెవ్వతెవు? నీ ప్రాయమునకు విరుద్ధమైన యీ నిష్ఠలం దేల యున్నావు? నీ యసమానమైన వయస్సు సౌందర్యము పురుషుని పిచ్చివానిఁ జేయగలవై యున్నవి ఓసి పలుచని కడుపు గలదానా! పూవువలె మనోజ్ఞమైన దానా! నీ యట్టి చక్కఁదనము గలది తాపసివలె నిష్ఠలచే శరీరమును మిగుల వాడిపోవఁ జేయఁ దగునా!

క. ఎవ్వరిదానవు చెలువా, యెవ్వఁడు నీభర్త? బాలమృగలోచన! నిన్
బువ్విలుతుకేళిఁ దేల్చెడి, యవ్వరపురుషుండె సుకృతి యంబుజవదనా! ౩౮౫

అర్థములు. పువ్విలుతుకేళిన్=మన్మథక్రీడయందు, సుకృతి=పుణ్యాత్ముఁడు.

తాత్పర్యము

(ఓ వనితా! నీ వెవ్వరిదానవు? నీ పెనిమిటి యెవ్వఁడు? నీతో మన్మథక్రీడయందు సుఖంచెడి పురుష శ్రేష్ఠుఁడే పుణ్యాత్ముఁడు.)

క. అడుగుచు నున్నాఁడను నినుఁ, బడఁతీ! నీ విట్లు కష్టపడ నేల వనిన్?
నా కెఱుఁగుము సర్వంబున నాఁ జడదారి నెలంత యతనిశాస్త్రహితముగన్. ౩౮౬

అర్థములు. జడదారి నెలంత=తాపసస్త్రీ.

తాత్పర్యము

(ఓ పడఁతీ! నిన్నడుగుచున్నాఁడను. నీ వీ యడవిలో నిట్లు కష్టపడనేల? నాకు సర్వము తెలుపుము. అనఁగా నా తాపసస్త్రీ యతని శాస్త్రోక్తవిధిగా.)

—॥ వేదవతి రావణునకుఁ దన వృత్తాంతముఁ దెలుపుట ॥—

సీ. ఆతిథ్యమునఁ దన్పి ॥ యనియె బ్రహ్మర్షి నాజనకుండు పేరఁ గుశధ్వజుండు
గీష్పతిపుత్రుండు ॥ గీష్పతితుల్యుండు, బుద్ధివైభవమునఁ ॥ బుణ్యమూర్తి
యాతఁడు దినము వేదాభ్యాస మొనరించు, నప్పుడు వాఙ్మయి ॥ నైన నేను
గన్యనై పుట్టిన ॥ కారణంబున వేద వతి యని పేరు నాకతఁ డొసంగె

తే. దివిజగంధర్వయక్షాహి ॥ దితిజవరులు
నన్నొసంగఁగ వేఁడిన ॥ నాదుతండ్రి
మూఁడులోకంబు లేలెడు ॥ వాఁడు ఘనుఁడు
విష్ణుఁ డొక్కండె యోగ్యుఁడౌ ॥ పెండ్లికొడుకు. ౩౮౭

అర్థములు. గీష్పతి పుత్రుండు=బృహస్పతి పుత్రుండు, గీష్పతితుల్యుండు=బృహస్పతితో సమానుండు,...వాఙ్మయి=వాఙ్మయివేదమూర్తి,...భగవంతుని శక్తియగు లక్ష్మీదేవియే పతివ్రతల పాతివ్రత్యముఁ జెఱుచు రావణుని వధకుఁ దాను నిమిత్తముగాఁ గోరి నిష్కారణముగఁ జంపరాదు గావున నార్ద్రాపరాధుఁ డయ్యేనేని చంపింపవచ్చునని తలఁచి యయోనిజగా జనించెను వాక్కు లక్ష్మీదేవి కళావిశేషమే కదా. పెండ్లికొడుకు=అల్లుఁడు.

తాత్పర్యము

అతిథి సత్కారమున సంతుష్టునిఁ జేసి యిట్లు చెప్పెను. నా తండ్రి బృహస్పతి కుమారుఁ డగు కుశధ్వజుఁ డను బ్రహ్మర్షి, బుద్ధిసంపదయందుఁ దండ్రితో సమా

నుఁడు. మూర్తీభవించిన పుణ్యము. ఆయన ప్రతిదినము వేదాభ్యాసముచేయును. ఒకనాఁడు, వాగ్రూపకమైన నేను నాయన వేదాధ్యయనము చేయునపుడు వా స్వరములనుండి వెలువడితిని, కావున నన్నాయన వేదవతి యను పేరఁ బిలిచెను. దేవ గంధర్వులు యక్షులు నాగులు దేవతాధిపతులు నన్నొసంగ నాతండ్రిని వేఁడిరి కాని నాతండ్రియో మూఁడు లోకములఁ బాలించు విష్ణువొక్కఁడే నా కల్లుఁడు గాఁదగిన వాఁడు, తక్కిన వారు గారు అని వారిని నిరాకరించెను.

వేదాధిష్ఠాత వేదవతికిఁ దగిన మగఁడు కాని తక్కినవా రెట్లగుదురు.

క. అనుచుండు నతనిపల్కులు, విని దంభుం డనెడి దనుజ॰వీరుఁడు కినుకన్
జనుదెంచి యర్ధరాత్రంబున నిద్రితుఁ దండ్రిఁ జంపి॰పోయెన్ ఖలుఁడై. ౩౮౮

తాత్పర్యము

(అనుచున్న నాతని మాటలు విని దంభుఁడనెడి రాక్షసుఁ డర్ధరాత్రమున వచ్చి నిద్రపోవుచున్న తండ్రినిఁ జంపిపోయెను.)

క. జననియు దుఃఖభరంబునఁ, దనభర్తం గౌఁగిలించి॰దహనార్చులకున్
దన మే నర్పించెను నా,జనకుని సంకల్ప మేను॰సత్య మొనర్పన్. ౩౮౯

అర్థములు. దహనార్చులకున్=అగ్నిశిఖలకు, మేను=దేహము, సంకల్పము= కోరిక.

తాత్పర్యము

నా తల్లి దుఃఖాతిశయమున నగ్నులకుఁ దన దేహ మర్పించి సహగమనము గావించెను. నాతండ్రికోరిక నెఱవేర్పఁ గోరినదాననై.

ఉ. చేయుచు నేఁ బ్రతిజ్ఞ నిటు॰ చేసెదుదానఁ దపంబు నిష్ఠ, నా
రాయణుఁడే మదీయధవుఁ॰డౌతఁడుగాక మఱేఁడుఁ గాఁడు, దై
తేయుఁడ! నా చరిత్ర మిది॰ దెల్పితి నెల్లఁ బులస్త్యపౌత్ర! వి
చ్చేయుము నేను శక్తను వి॰శిష్టజగచ్చరితం బెఱుంగఁ గన్. ౩౯౦

తాత్పర్యము

నారాయణుఁడప్పఁ నేను మఱొక్కని వివాహమాడనని ప్రతిజ్ఞచేసి యీ ప్రకారము తపముచేయుచున్నదానను నా మగఁడు నారాయణుఁడే కాని మఱి యెవ్వఁడుకాఁడు. రాక్షసుఁడా! యిది నా చరిత్రము. నీవు పులస్త్యుని మనుమఁడవు కావున గౌరవించి యాతిథ్యమిచ్చి మాటలాడితిని. నే నెవ్వఁడనో నీ కెట్లు తెలిసె నందువా సమస్తలోకముల జరుగు విషయమంతయు నే నెఱుఁగుదును. ఇఁకఁ బొమ్ము. రెండవ పాదంబున నుభయయతి.

తే. అనుచు నమ్మహావ్రత తన్వి • నాడు చుండఁ
బుష్పకము డిగ్గి మరుములికి • పోటుకతన
రావణుఁడు ఋషికన్యఁ జే • రంగఁ బోయి
యిట్టు లనియెను దనమది • యెఱుకపడఁగ. ౩౫౧

అర్థములు. మరుములికిపోటుకతన=మన్మథుని బాణము దెబ్బచేత.

తా త్ప ర్య ము

(ఆమహావ్రత తనతో ననుచుండఁగా రావణుఁడు మన్మథుని బాణము దెబ్బచేతఁ, బుష్పకముదిగి యా ఋషికన్య సమీపమునకుఁ బోయి తన యభిప్రాయము తెలియునటుల నిట్లనెను.)

—* రావణుఁడు వేదవతిని దురుక్తు లాడుట *—

ఉ. సుందరి యెంత గర్వితవె • స్రుక్కఁగఁ జేసెదు కాయమున్, మహా
మందతపంబులన్ నవసి • మానని నిష్ఫల సద్వ్రతంబులన్
వందుర నౌనె జవ్వనులు • బాలికలున్ ముదుసళ్ళుఁ గాక? నీ
యందముచంద మెంచ కిటు • లాడఁగఁ జెల్లునె పల్లవాధరా! ౩౫౨

అర్థములు. గర్వితవె=మదించినదానవే, మహా+అమంద తపంబులన్=గొప్పవై తీవ్రమైన తపస్సుచే, నవసి=శుష్కించి, వందురన్=దుఃఖపడఁగ, ఔనె=తగునా, జవ్వనులు=యౌవనవతులు, పల్లవాధరా=చిగురువంటి పెదవిగలదానా!

తా త్ప ర్య ము

సుందరీ! నీవు దేహమును శుష్కింపఁజేయుచున్నావు. ఎంత మదము పట్టినదానవే నీవు. దేహమనిన లక్ష్యములేదు. ముసలివారు తపములని నిష్ఫలచేగృశింప వచ్చునుగాని పిల్లలు వయస్సు వచ్చిన స్త్రీలు వ్రతములచే దుఃఖింప వచ్చునా? నీ సౌందర్య మెటువంటిదో యాలోచింపక నీవిట్లు పలుకఁదగునా?

క. నీవు జగత్సుందరివై, కేవలముం బిత్తికి వయి మృగీనయన! సుఖా
భావంబున వర్తించెదు, యౌవన ముడి వోవ సౌఖ్య • మావలఁ గలదే! ౩౫౩

అర్థములు. మృగీనయన=ఆఁడుజింక కన్నులవంటి కన్నులు గలదానా, సుఖాభావంబునన్=సౌఖ్యము లేక, ఉడివోవన్=ఉడిగిపోవఁగా.

తా త్ప ర్య ము

(ఓ మృగాక్షీ! నీవు లోకమున మిగులఁ జక్కఁదనము గలిగిన దానవై కేవలము పిత్తికిదాన వగుటచే సుఖములేక యున్నావు. యౌవన ముడిగిపోయిన పిమ్మట సుఖము గలదా?)

ఉ. పోయెడి నీకు యౌవనము ♦ పొల్తుక ! యెన్నఁడొ యింక హాయిగాఁ
గాయజు కేళిఁ దేలుచు సు ♦ ఖంపడె దీ! వటుగాన నేను లం
కాయతరాజ్యనాథుఁడ మ ♦ హాబలవంతుఁడఁ బంక్తికంధరా
ఖ్యాయుతుఁడన్ మదాత్మసతి ♦ వై సుఖయింపుము భోగభాగ్యముల్. ౩౫౪

అర్థములు. కాయజుకేళిన్=మన్మథక్రీడయందు.

తా త్ప ర్య ము

ఓసీ చిన్నదానా! నీకు యౌవనము పోవుచున్నది. ఇఁక నెప్పుడు, నీవు రతి కేళుల సుఖపడు టెప్పుడే? కావున నేను లంకారాజ్యాధిపతిని. మిగులబలవంతుఁడను. దశకంఠుఁడను పేరుగలవాఁడను, కావున నాభార్యవై భోగభాగ్యముల సుఖింపుము.

ఉ. ఎవ్వని నీవు విష్ణుఁ డని ♦ యెన్నెదువాఁ డెవఁడైన నేమి ? యో
జవ్వని భోగదర్పబల ♦ శౌర్యతపోవిభవంబులందు నా
కెవ్వఁడు నీడు లేఁడు నిజ ♦ మియ్యది, నన్ను వరింపు మన్న నా
క్రొవ్వరిభాషణంబులకుఁ ♦ గ్రొవ్విరిఁబోణి వచించె నీగతిన్. ౩౫౫

అర్థములు. జవ్వని=ప్రాయవతి, క్రొవ్వరి=పొగరుబోతు, క్రొవ్విరిఁబోణి= క్రొత్తపుష్పమువలె మనోజ్ఞురాలు.

తా త్ప ర్య ము

ఎవని నీవు విష్ణుఁ డనియెదు? వాఁ డెవఁడైన నేమి? కాని భోగమునందు గర్వమునందు బలమునందు శౌర్యమునందు తపస్సంపదయందు నాకు సమానుఁడు లేఁడు. ఇది నిజము కావున నన్ను వరింపుము. అనఁగా నా పొగరుబోతువాక్యము లకు నామె యిట్లనియె.

ఆ. అట్టు లనకు మోరి ♦ హరిని నారాయణు, సర్వలోకవంద్యు ♦ సర్వలోక
రమణు విష్ణుదేవు ♦ రాక్షసుండా! నీవు గాక సూరి యెవఁడు ♦ కఱకు లాడు.

అర్థములు. సూరి=జ్ఞానము గలవాఁడు,

తా త్ప ర్య ము

(ఓరీ రాక్షసుఁడా! నీ వట్టులనకుము. సకలలోకారాధ్యుఁడు సర్వలోకరమ ణుఁడు, హరి నారాయణుఁడు ఆ మహాత్ముని నీవుగాక జ్ఞానముగలవాఁ డెవఁడు కఠినముగా బలుకును?)

క. అని తోలఁగు వేదవతినిన్, దనుజాధముఁ డొడిసి తిగిచెఁ ♦ దలవెండ్రుకలన్
వనితయు నంతకుఁ గురులం, దన కేలన కత్తిఁబోలెఁ దెటుకున నఱికెన్. ౩౫౬

తా త్ప ర్య ము

అని చెప్పి తొలఁగిపోవుచున్న వేదవతిని నీచరాక్షసుఁడు ఆమె తలవెండ్రుకలను బట్టి లాగెను. ఆమెయు వాఁడు పట్టుకొన్నంత వఱకు వెండ్రుకలను తన చేతితో గత్తితో నఱికినట్లు తటాలున నఱకెను.

—॥ వేదవతి రావణు శపించి యగ్నిలోఁ జొచ్చుట ॥—

చ. తెగ నిటు వ్రేసి రోసమున ॥ దీప్తహుతాశనునట్లు మండుచున్
మగువ నిశాటు దృక్తతుల ॥ మాడ్చెడునట్లయి మేను పాయఁగా
దెగి యసురేంద్రుతో ననియె ॥ దేవవిరోధి! భవత్ప్రధర్షితం
బగు తను వింక నిల్పను, హు ॥ తాశనుఁ జొచ్చెద నీవ చూడఁగన్. ౩౦

అర్థములు. దీప్తహుతాశనునట్లు=మండుచున్న యగ్నివలె, నిశాటున్=రాక్షసుని, దృక్తతులన్=చూపుల సమూహముచే, తెగి=సాహసించి, భవత్+ప్రధర్షితంబు=నీచే నవమానింపఁ బడిన, తనువు=దేహము, హుతాశనున్=అగ్నిహోత్రుని

తా త్ప ర్య ము

ఈప్రకారము వెండ్రుకలు తెగనఱికి కోపముచే మండు నగ్నివలెమండుచు నామె రాక్షసుని జూపులచేత నే మాడ్చుదానివలెనై దేహము వదలిపెట్ట దలఁచి రావణునితో నిట్లనియె. ఓరీ! దేవవిరోధీ! నీ వవమానించిన యీ దేహమును నీక ధరింపఁ జాలను. నీవు చూచుచుండఁగనే యగ్నిప్రవేశము గావించెదను.

శా. పాపీ! నేను వనంబులోఁ దపసినై ॥ వర్తింప నన్నేఁపఁగా
నీపట్లం జనుదెంచితే? యబలనై ॥ యే నుంట నిన్ బూరుషున్
వ్యాపాదింపఁగ రాదు, నాతపము శా ॥ పం బీయ నాశిల్లుటన్
నీపీచం బడఁగింప, వెండియును జ ॥ న్మింతుం జుమీ రావణా! ౩౧

అర్థములు. వ్యాపాదింపఁగరాదు=చంపరాదు. పురుషులు స్త్రీలను జంపరాదు, స్త్రీలు పురుషులను జంపరాదు. దీని కపవాదములు గలవు. విష్ణువు భృగుపత్నిని రామచంద్రమూర్తి తాటకను, దమయంతి యెఱుకలవానిని జంపిరి. నీపీచంబుఁ నీ గర్వము.

తా త్ప ర్య ము

ఓరీ పాపాత్ముఁడా! నే నడవిలో దపసినై యుండఁగా నన్ను బాధించుటకు నీవు వచ్చితివా? నేనాఁడుదానను గావున నిన్నుఁ జంపఁరాదు. నీకు శాపంబిచ్చితినేని నా తపస్సు క్షయించును. అదియుఁ జేయను, అయిన నీవు చేయఁగల దేమందువా, నీ గర్వమణఁచుటకు నేను మరల జన్మింతును.

ఉ. హోమము దానముం జలిపి ♦ యుండితి నేనియుఁ గొంచెమైన ధ
ర్మామితరక్తు నాత్మభవ ♦ నౌచు నయోనిజ నౌచు సాధ్వినై
నే మెయిఁ గొందుఁ జూడు మని ♦ నిర్మలశీలిని చొచ్చె నగ్నులం
దామరసంచయంబు గురి ♦ యన్ సుమవృష్టిఁ దథాస్తటంచునున్. ౩౮-౧

అర్థములు. ధర్మామితరక్తు=ధర్మమందు నమితమగు ప్రేమగల వాని యొక్క, ఆత్మభవ=కూఁతురు, అయోనిజను=మనుష్యస్త్రీ గర్భమునుండి పుట్టని దానను, సాధ్వినై=పతివ్రతనై, మెయిఁగొందున్=దేహముధరింతును,తథాస్తు=అట్టులే యగును.

తాత్పర్యము

నేను గొంచెమైనను హోమము దానము చేసియుంటినా ధర్మమునం దమితమైన యాసక్తి గలవాని కూఁతురునై యయోనిజనై పతివ్రతనై మరల దేహము ధరింతును జూడుము అని యగ్నులందుఁ బ్రవేశించెను. దేవతలు ఆమె చెప్పినట్లు జరుగునుగాకయని చెప్పుచు పూలవాన గురియించిరి. చెడుతనము పూర్వపుణ్య వశమున తత్కాలమునకు మేలుగాఁ దోఁచినను కాలాంతరమున సమూలనాశము చేయక తప్పదు. ఇప్పటికిఁ బార్వతీ శాపము, నందీశ్వర శాపము, వేదవతీ శాపము మూఁడు శాపములైనవి. స్త్రీనిమిత్తముగా నీవు నాశ మయ్యెదవని పార్వతి శపించెను. ఆస్త్రీ నేనే యయ్యెదనని వేదవతి చెప్పెను. కావలసిన వానర సేనకు నందీశ్వరుఁడు తోడుపడెను. ఈ విధముగ రావణవినాశమునకు బీజారోపణ మయ్యెను.

ఆ. అల్ల వేదవతియె ♦ యధిప వైదేహుని, తనయ యగుచుఁ బుట్టి ♦ ధరణియందు
నిఖిలనాథు విష్ణు ♦ నిను సనాతనమూర్తి, విభునిఁ గాఁగఁ బొందె ♦ వెలఁదిమిన్న.

తాత్పర్యము

ఆ వేదవతియే రామచంద్రా! జనకమహారాజు కూఁతురై భూమియందుఁ బుట్టి సర్వలోకనాథు విష్ణు నిన్ను సనాతనమూర్తిని వివాహమాడెను.

ఉ. ఏమె రుషాతిరేకమున ♦ నీల్గెను బూర్వ మెవండు నిర్జర
స్తోమవిరోధి యాతఁడె, వసుంధరఁ బుట్టి యమానుషోగ్రతే
జోమహితుండవౌచు నల ♦ సుందరికే పతివైన నీదు దు
ర్ధామశరాగ్నికీలలఁ బ ♦ తంగమునట్ల నశించె నియ్యెడన్. ౩౮-౨

అర్థములు. రుషాతిరేకమున=కోపాతిశయమువలన, నిర్జరస్తోమవిరోధి=దేవతాసమూహములకు శత్రువు,వసుంధరన్=భూమియందు,అమానుష=మనుష్యులందు లేని, ఉగ్ర=భయంకరమైన, తేజోమహితుండవు=తేజస్సుచే గొప్పవాఁడవు, అల సుందరికే=ఆ యంగనకే, దుర్ధామశరాగ్నికీలలన్=అణఁపరాని బాణములను నగ్నిజ్వాలలందు, పతంగము=మిడుత.

తా త్ప ర్య ము

రామచంద్రా! యేమె కోపాతిశయమున నెవఁడు పూర్వముచచ్చెనో యా రాక్షసుఁడే,భూమియందుఁబుట్టి యమానుషమైనభయంకర తేజస్సుగలిగి యామెకే భర్తవైన నీ బాణాగ్ని జ్వాలలంగు మిడుతయై యిప్పుడు నశించెను.

సీతాదేవి కోపముచేతనే లంకయు రావణుఁడు శవప్రాయమయ్యె ననియు రామచంద్రమూర్తి నిమిత్తమాత్ర మనియుఁ జెప్పిన హనుమంతుని వాక్యములు దీనిచే దృఢపడుచున్నవి.

తే. ఈమహాభాగజనియించెంబిట్లుమర్త్యభువనమునయందుఁబొలమునఁబూజ్యభంగి
వేదియం దగ్నిశిఖవోలెంబిశ్వవినుత? రమ్యగుణభద్ర శిష్టాభిరామభద్ర! ౩౬౩

అర్థములు. మహాభాగ=గొప్ప భాగ్యము కలది, లక్ష్మీదేవి=మర్త్యభువనమునయందు=మనుష్యలోకమందు,పొలమున=నాగుభూమియందు, వేదియందు= యజ్ఞమండలి వేదియందు.

తా త్ప ర్య ము

ఆ భాగ్యవతియే రామచంద్రమూర్తీ! యీవిధముగ సీత యనుపేర మనుష్య లోకమందు భూమియందుఁ బవిత్రమైనరీతిగా వేదియందు నగ్నివలెఁ దన ప్రతిజ్ఞ చొప్పున జనించెను.

తే. వేదవతి యనఁ గృతయుగంబునఁ బుట్టి, త్రేతయందు వధింపఁగందితిజనాథు
సంభవించెను జనకవంశంబునందు, సీతయం దుదయించుటఁ సీతయయ్యె. ౩౬౪

అర్థములు. సీతయందు=నాఁగేటి చాలునందు.

తా త్ప ర్య ము

కృతయుగమందు వేదవతిగా జనించిన యామె త్రేతయందు రావణునిజంప జనకవంశంబున జనించెను. నాఁగేటిచాలునందుఁ బుట్టుటచే సీతయని పేరుగాంచెను. దీనివలన రామావతారము త్రేతాయుగాంతమందు కావున కృతాంతమందునుండి త్రేతాంతమువఱకు రావణుఁ డుండెనని యేర్పడుచున్నది.

సీతాదేవి జననము వైశాఖ శుక్ల నవమియందని మహాసుందరీ తంత్ర మందుఁ జెప్పఁబడినది.

"వైశాఖే శుక్ల నవమ్యా ముత్పన్నా పావనీసుతా
సీతాముఖా త్సా సంజాతా పాలితా జనకేనచ
రామపత్నీ మహాభాగా సీతానామేతి విశ్రుతా
తస్మిన్ దినే రామభక్తాః శ్రద్ధాభక్తి సమన్వితాః
మహోత్సవపరాః సర్వే పిత్తశాఖ్యా ద్వివర్జితాః

గీతవాదిత్ర నృత్యాద్యై రామభక్తిపరాయణాః
వైశాఖసితనవమ్యాం పురాణపఠనం తథా
లక్ష్మీసూక్తం పఠన్ స్తత్ర యాతి రామం సనాతనమ్
సౌభాగ్యం ధనధాన్యంచ పుత్రసంతతి విస్తృతామ్.
రామప్రసాదా ల్లభతే ముచ్యతే సర్వపాతకాన్''.

ఈ చరిత్రము వలన లక్ష్మీదేవియే సీత యని రామచంద్రమూర్తి నారాయణుఁ డనియు రావణ వధయందు సీతాదేవియే (లక్ష్మియే) ముఖ్య కారణ భూతురాలనియు నేర్పడుచున్నది.

౧౮వ సర్గము

—* రావణుఁడు మరుత్తు యజ్ఞశాలకుఁ బోవుట *—

సీ. వహ్నులలో వేదవతి చొచ్చుటను గాంచి, పుష్పకంబెక్కి ◊ యాపుణ్యజనుఁడు
ధరణిఁ జరించుచో ◊ దైవతాన్వితుఁడై, క్రతువు మరుత్తను ◊ క్ష్మాధవుండు
సలుప నుశీరబీ ◊ జంబునఁ గని యందు, జనవర! బలుని దు ◊ స్సాధుఁగాంచి
దేవతలందఱుఁ ◊ దిర్యక్స్వరూపమున్, గొని రందుఁ బాకశాసనుఁడు నెమిలి
ఆ. యయ్యె యముఁడు కాక ◊ మయ్యెఁ గుబేరుఁడు
తొండయయ్యె, జలవి ◊ భుండు హంస
మయ్యెఁ దక్కువార ◊ లన్యరూపంబుల మఱుఁగుపడిరి నిలువ ◊ వెఱచియుచట.

అర్థములు. పుణ్యజనుఁడు=రాక్షసుఁడు, పుణ్యమెట్టిదో యెఱుఁగని జనుఁడు పుణ్యజనుఁడు, విపరీతలక్షణచేత నీ యర్థము. దైవతాన్వితుఁడై = దేవతలతోఁ గూడినవాఁడై, దుస్సాధున్=సాధింపరాని వానిని, తిర్యక్ స్వరూపముల్=పశు పక్షి స్వరూపములు.

తాత్పర్యము

అగ్నిహోత్రమందు వేదవతి ప్రవేశించుట చూచి యా రాక్షసుఁడు పుష్పక మెక్కి భూమియందుఁ దిరుగుచు మరుత్తను రాజు ఉశీరబీజమునందు యజ్ఞము చేయుచుండఁ జూచెను. అప్పు డందున్న దేవతలు జయింపరాని రావణునిఁ జూచి తిర్యక్స్వరూపములు ధరించి కానరాకుండిరి. అం దింద్రుఁడు నెమలి యయ్యెను. యముడు కాకియయ్యెను. కుబేరుఁడు తొండయయ్యెను. వరుణుండు హంస యయ్యెను. తక్కిన దేవతలు అచ్చటనుండి వెఱచి వేఱువేఱు స్వరూపములు ధరించి మఱుఁగు పడిరి.

ఉ. జన్నపువాడ జాగిలము ◊ చందమునన్ సురవైరి చొచ్చి యం
దున్న మరుత్తుఁ గాంచి నృప ◊ యుద్ధము సేయఁగ రమ్ము శక్తి లే
కున్న 'జితోస్మి' యం చనుమ ◊ యూరక పోదు నటన్న దైత్యభ
ర్తన్నరభర్త యెవ్వఁడవు రా యిటు లాడెడి నీ వటం చనన్. ౩౬౬

అర్థములు. జన్నపువాడన్=యజ్ఞశాలను, జాగిలము=కుక్క, జితోస్మి=జయింపబడితిని.

తాత్పర్యము

యజ్ఞశాలయందుఁ గుక్క ప్రవేసించినట్లు ప్రవేశించి రావణుఁ డాశాల యందున్న మరుత్తును జూచి రాజా! యుద్ధము చేయరమ్ము. లేకున్న నోడితి ననుము. ఊరకపోకుము అనిన వానిని జూచి యోరీ! యిటు మాటలాడెడి వాఁడవు నీ వెవ్వాఁడవు అని యడుగఁగా.

క. పక పక నగి యసురుఁడు నీ, యకుతూహల భావమునకు హర్షించితిఁ ద్ర్యం
బకసఖు ననుజాతుని భృశ, వికటబలున్ నన్నె యెఱుఁగవే రావణునిన్. ౩౧౭

అర్థములు. అకుతూహల భావమునకున్=నన్నుఁజూచియు విస్మయముగాని, భయముగాని, ఆదరముగాని లేని తనమునకు, త్ర్యంబకసఖు ననుజాతుని=ఈశ్వరు స్నేహితుఁడగు కుబేరుని తమ్ముని, భృశవికటబలున్ = మిక్కిలి భయంకరమైన బలము గలవాసని.

తాత్పర్యము

రావణాసురుఁ డా మాట విని పకపకనగి రాజా! నన్నుఁజూచి భయముగాని లక్ష్యముగాని యాదరముగాని లేని నిన్నుఁ జూచి సంతోషించితిని. కుబేరుతమ్ముని భయంకర బలుని రావణుని నన్నే యెఱుఁగవా నీవు.

క. అన్నను గెలిచి రణంబున, ని న్నిరుపమ పుష్పకము గ్రహించిన వీరున్
నన్ను నెఱుంగనివాఁడును, మన్నీఁడా నీవు గాక మఱియొకఁ డున్నే. ౩౧౮

తాత్పర్యము

అన్నయగు కుబేరుని గెలిచి యసమానమైన యీపుష్పకమును గ్రహించిన వీరుని నన్ను నెఱుంగనివాఁడు రాజా! నీవు గాక మఱియొకఁడు గలఁడా?

క. నావుడు మరుత్తుఁడనియెన్, నీవే ధన్యుఁడవు జ్యేష్ఠు నిర్జించితనిన్
నీవంటి శ్లాఘ్యపురుషుఁడు, క్ష్మావలయమునందు లేఁడు మాంసాదనుఁడా. ౩౧౯

అర్థములు. మాంసాదనుఁడా=మాంసభక్షకుఁడా.

తాత్పర్యము

(అని పలుకఁగా, మరుత్తుఁడు 'ఓరీ! మాంసభక్షకుఁడా! నీ పెద్దవాఁడగు నన్నను యుద్ధములో గెలిచితివి. నీవే ధన్యుఁడవురా! నీవంటి శ్లాఘ్యమైన వర్తనముగల మానవుఁడు భూమండలమున లేఁడురా!)'

క లోకంబు మెచ్చుకార్యముఁ, బ్రాకటగతిఁ జేసి చెప్పుకొనవాఁ డుండు ధరన్
లోకవిరుద్ధాధర్మము, నీకరణిం జేసి చెప్పు నెఱసరి నెఱుఁగన్. ౩౨౦

అర్థములు. లోకవిరుద్ధాధర్మము=ప్రజలకు శాస్త్రమునకు విరుద్ధమగు నధర్మము, నెఱసరిన్=హూరుని.

తాత్పర్యము

లోకము మెచ్చునట్టి సత్కార్యముచేసి ప్రతిష్ఠకై చెప్పుకొనువాఁడున్నాడు గాని ప్రజల నీతికి శాస్త్రనియమమునకు విరుద్ధమైన కార్యముచేసి యది యొక గొప్పగాఁ జెప్పు హూరుని నే నింతవఱ కెఱుఁగను.

క. కేవలధర్మవ్రతమున, నీవు వరంబులను గొంట ♦ నే వింటిని మున్
నీవే యిప్పుడు చెప్పిన, యా వృత్తాంతంబు వినిన ♦ యది లే దసురా. ౩౮౧

తాత్పర్యము

నీవు కేవల ధర్మమార్గమందే యుండి బ్రహ్మచే వరములను గ్రహించుట వింటినిగాని నీవిప్పుడు చెప్పిన కార్యము చేయుట రాక్షసుఁడా! నేనువినిన వాఁడఁగాను.

చ. నిలు నిలు దుర్మతీ! యిపుడు ♦ నిష్ఠురఘోరకఠోరమార్గణా
వళి నినుఁ గాలు వీటికిని ♦ బంపెద నంచు శరాసనంబు న
మ్ములుఁ గొని క్రుద్ధుఁడై చనఁగఁ ♦ బూనఁగ నడ్డము వచ్చినిల్చి య
బ్బలియునిఁ జూచి దేవగురు♦భ్రాతయు యాజకుఁడున్ మహాత్ముఁడున్. ౩౮౨

అర్థములు. దుర్మతీ=దుర్బుద్ధీ, నిష్ఠుర=పరుషములైనవి, ఘోర=భయంకరము లైనవియు, కఠోర=కఠినములైనవియు నగు, మార్గణావళిన్=బాణసమూహములచే, దేవగురుభ్రాత = బృహస్పతి తమ్ముఁడు, యాజకుఁడు = యజ్ఞము చేయించువాఁడు, మహాత్ముఁడున్=గొప్పమనస్సు గలవాఁడు.

తాత్పర్యము

('ఓరి దుర్బుద్ధీ! నిలు నిలు- ఇప్పుడే కఠినములయి భయంకరములయి కఠినములయిన బాణసమూహముచే నిన్ను యముని పట్టణమునకుఁ బంపెద' ననుచు విల్లు నమ్ములు గొని, కోపముతోఁ బోఁబోవఁగా నడ్డమువచ్చి బృహస్పతి తమ్ముఁడు, యాగము చేయించు నతఁడు మహాత్ముఁడు.)

—♦ సంవర్తుఁడు మరుత్తుని శాంతుఁ జేయుట ♦—

తే. ఆఖ్య సంవర్తుఁడనెడి బ్రహ్మర్షి వరుఁడు, స్నేహసంయుక్తముగ నిట్లు♦చెప్పెరాజ
వినఁదగునయేని నానుడి ♦ వినుము సంగ,రంబు సేయుట నీకు యో♦గ్యంబుగాదు.

అర్థములు. ఆఖ్య=పేరుచే.

తాత్పర్యము

సంవర్తుఁడను పేరుగల బ్రహ్మర్షి శ్రేష్ఠుఁడు స్నేహభావముతో నిట్లు చెప్పెను. రాజా! నామాట నీకు వినఁదగినదాయెనా వినుము. అది యేమంటివా? యుద్ధము సేయుట నీకుఁ దగినపని గాదు.

తే. ఇదియు మాహేశ్వరం బయి ♦ యొసఁగు సత్ర
మంతరాయంబు కొంచెమేన్ ♦ బ్రాప్తమైనఁ
గర్తృవంశంబు దహియించుఁ ♦ గాన తేఁడ!
యింత యోజించి యని సేయ ♦ నెత్తికొనుము. ౩౭౮

తాత్పర్యము

ఇది మహేశ్వర సంబంధమైన యాగము. దీనిలోఁ గొంచెము విఘ్నము కలిగినను యజ్ఞకర్త వంశమును గాల్చివేయును కాఁబట్టి రాజా! యిది యాలోచించి తరువాత యుద్ధముసేయఁ బ్రయత్నింపుము. వంశనాశమైపోవుట శ్రేష్ఠమో, యుద్ధముసేయుట శ్రేష్ఠమో యాలోచింపుము.

తే. దీక్షితుండేడ? యుద్ధంబు♦తెరువదేడ, దీక్ష యెచ్చట? నిట్టిక్రో♦ధిత్వమెచట?
రాక్షసుఁడు దుర్జయుండు దు♦రంబులోన,నీవ గెలిచెద వను టేమి♦నిశ్చయంబు

తాత్పర్యము

క్రోధము మాని యజ్ఞదీక్ష వహించిన వాఁ డెక్కడ? క్రోధము వహించియే చేయవలసిన యుద్ధ మెక్కడ? దీక్ష యేయూరు? క్రోధ మేయూరు? పరస్పర యుద్ధములైన రెంటికి సంబంధము గలదా? యుద్ధమే చేసితివనుకో రాక్షసుఁడు జయింపరానివాఁడు, నీవే జయింతువని యేమి నమ్మకము? యుద్ధమందు నీవు చచ్చితివేని యజ్ఞము గతియేమి? యజ్ఞము సగములో విడిచి చచ్చిన నీగతియేమి?

తే. అనిన గురువాక్యమాలించి♦యవనివిభుఁడు,చాపబాణాళివిడనాడి♦స్వస్థుఁడగుచు
మఖము సంపూర్తిచేయంగ♦మరలిచనియె,దానిఁగనుగొని శుకుఁడను దానవుండు.

తాత్పర్యము

(అనిచెప్పిన గురువు మాటలను విని, ధనుస్సు బాణములను వదలి శాంతుఁడయి మరుత్తు యజ్ఞము పూర్తిచేయుటకు తిరిగిపోయెను. దానిని జూచి శుకుఁడను రాక్షసుఁడు.)

తే. గెలిచె రావణుఁ డనుచును ♦ బలములోనఁ
జాటుఁగాఁ బెంచె నసురుఁ డ ♦ చ్చోటనున్న
నధ్వరాగతఋషులను ♦ హతులఁ జేసి
నెత్తురులు ద్రావి యాపోక ♦ హత్తనరిగె. ౩౭౭

అర్థములు. అధ్వరాగత=యజ్ఞము నిమిత్తమై వచ్చిన, హతులఁ జేసి=చంపి, అపోశహ త్తన్=తృప్తికలుగఁగా.

తాత్పర్యము

(రావణుఁడు గెలిచినాఁడని సేనలోఁ జాటుటకుఁ బంపెను. రావణుఁడచ్చట నున్న యాగమునకు వచ్చిన మునులను జంపి వారి నెత్తురులను ద్రాగి తృప్తిఁ జెంది పోయెను.)

—♦ ఇంద్రాదులు మయూరాదులకు వరములిచ్చుట ♦—

క. దనుజాధినేత యరిగినఁ, దన తన రూపంబుఁ దాల్చి ♦ దైవతనాథుల్
పెనుముదమునఁ దత్సత్త్వము,లను గని యిట్లనిరి ప్రీతి♦లక్షణ మమరన్. ౩౭౦

అర్థములు. దనుజాధినేత = రాక్షసరాజు, తత్సత్త్వములను=ఆ యా జంతువులను.

తాత్పర్యము

రాక్షసరాజు వెడలిపోఁగా దేవతలు తన తన స్వస్వరూపములు ధరించి మిగుల సంతోషించి తామే మృగముల యాకారములు దాల్చిరో యా యా మృగములకు సంతోషముతో నిట్లు వరము లిచ్చిరి.

సీ. నల్లపించెముల నె♦మిళ్ళను గనుఁగొని, హరిహయుఁ డిట్లని ♦ వరము లిచ్చె
లేదు మీ కింక మీఁద ♦ లేలిహానభయంబు, వేయికన్నులపురి ♦ వెలయుగాక
నేను వర్షించుచో♦నెమ్మి మీ కబ్బుత, మని యన్న నవి యేగె♦హర్షమునను
బ్రాగ్వంశమున నున్న♦వాయసంబులఁ గని, ప్రాణులకును రోగబాధ లిడుదు

అ నేన కాన మీకు ♦ నేరోగ భయమును, లేదు మృత్యుభయము♦లేదు మీకు
జనము లెంతదాఁకఁ ♦ జంపరో మి మ్మంత,దాఁకఁ బ్రాణయుక్తి♦దనరు మీకు.

అర్థములు. లేలిహానభయంబు=పాములవలని భయము, నెమ్మి=సంతోషము, ప్రాగ్వంశమున=హవిర్గృహమునకు ముందున్న సభాగృహమందు, వాయసంబులన్=కాకులను, ఇంతకు ముందు నెమలి పించెములు నల్లగా, గన్నులు లేనివై యుండెను.

తాత్పర్యము

నల్లపింఛములుగల నెమిళ్ళను జూచి యింద్రుఁ డిట్లు వరము లిచ్చెను. ఇక మీఁద మీకు సర్పభయము లేదు. నాకు వేయికన్నులున్నట్లు మీకు వేయికన్నులు గల పించెములు గలుగును. నేను వాన గురియునపుడు మీకు సంతోష మతిశయించును అని చెప్పఁగా నవి సంతోషముతోఁ బోయెను. ఆవల యముఁడు ప్రాగ్వంశముననున్న కాకులను జూచి జీవజంతువులకు రోగములు కలిగించువాఁడను

నేనే. కావునమీకు రోగభయము లేకుండ వరమిచ్చితిని. అదియునుగాక పుట్టిన జీవి యెప్పటికైనఁ జావవలయును కావున మి మ్మెంతవఱకు మనుష్యులు చంపరో యంతవఱకు మీకు మృత్యుభయము లేదు. ఎంతకాలమైన బ్రతికి యుందురు. కావుననే కాకులు పదివేలేఁడులు బ్రదుకునని చెప్పుదురు.

క. నాలోకంబున క్షుద్వ్యథ, పాలగునా రిందు మీరు ♦ భక్షించినఁ జు
ట్టాలును దారును దృప్తిం, జాలఁగఁ గనువా రటంచు♦సమవర్తియనన్. ౩౦

అర్థములు. దుర్వ్యథ=చెడ్డబాధకు, సమవర్తి=యముఁడు, రాజని, పేదవాఁడని, ధనికుఁడని, యల్పుఁడని యిట్టి భేదము లేక యెవ రెవరి కర్మానుసారముగ వారికి వారికిఁ దగిన సుఖము దుఃఖము గలిగించు వాఁడు కావున సమవర్తి.

తాత్పర్యము

నాలోకమున నరకబాధ లనుభవించువారు వారి బంధువు లిచ్చిన దానిని మీరింమ భక్షించితిరేని వారు తృప్తిగలుగు వారగుదురు అనియముఁడుచెప్పెను.

ఉ. అప్పతి హంసలం గని సు♦ధాంశుసమంబును ఫేనతుల్యమై
యొప్పు మనోహరాకృతి జ♦వోగ్రతయున్ లభియించు నెండి మీ
రప్పుల నాడ నుప్పతిలు ♦ హారివిభాతిశయం బటన్నమై
కప్పు దొఱంగి హంసములు ♦ గ్రాలె మనోజ్ఞవళక్షకాంతులన్. ౩౧

అర్థములు. అప్పతి=వరుణుండు, సుధాంశు సమంబును=చంద్రునితో సమానమును. ఫేనతుల్యము=నురుఁగుతో సమము. మనోహరాకృతి=అందమైన యాకారము, జవోగ్రత=అధిక వేగము, అప్పులన్=నీళ్ళయందు, ఆడన్=స్నానము సేయఁగా, ఉప్పతిలున్=కలుగును, హారివిభాతిశయంబు=అధికమైన మనోహరకాంతి, కప్పు=నలుపు, వళక్ష=తెల్లని.

తాత్పర్యము

వరుణుఁడు హంసల కీలాగు వరము లిచ్చెను. ఇఁక మీరు చంద్రునివలె మనోహరంమై నురుగువలెఁ గోమలమైన యాకారములు గలవి కండు. మీకు మిగుల వేగముగఁబోవు శక్తి గలుగును. మీరు నీళ్ళలోఁ గ్రీడించితిరా,యెక్కువ కాంతి కలుగును అని చెప్పఁగా హంసలు మునుపటి నల్లని కాంతిపోయినవై తెల్లని కాంతిగలవయ్యెను,

క. రామా! హంసంబులు మును, శ్యామలములు వానిఱెక్క♦యంచులు నలుపై
కోమలమై యుండు జల,స్వామివరముపేర్మి శుభ్ర♦వర్ణములయ్యెన్. ౩౨

తాత్పర్యము

రామచంద్రా! పూర్వము హంసలు నలుపువన్నె గలవి. వాని ఱెక్కల కొనలు నలుపులే, వరుణుని వరముచే తెలుపు లయ్యెను.

క. కృకలాసమ్ములకును గు, హ్యకనాథుఁడు మీఁదు శిరము ◊ హాటకరుచి యై
చకచక మనుచుండు నటం, చకలంకమనీష నిచ్చి ◊ యలరఁగ నంతన్. ౩౪౩

అర్థములు. కృకలాసమ్ములకును=తొండలకు, గుహ్యకనాథుఁడు=కుబేరుఁడు హాటక రుచి=బంగారుకాంతి, అకలంకమనీష=నిర్మలబుద్ధితో, అలరఁగన్=సంతోషింపఁగా.

తాత్పర్యము

కుబేరుఁడు తొండలను మీఁతలలు బంగారుకాంతితోఁ దళతళలాడుచుండునని వర మిచ్చి సంతోషించెను.

క. నరపతి యజ్ఞముఁ దీరిన సురనాథులు తృప్తిఁ జెంది ◊ శుభమతు లగుచున్
ధరణీశ్వరుతో స్వర్గం, బరిగిరి రావణుఁడు సంగ ◊ రాకాంక్ష ధరన్. ౩౪౪

తాత్పర్యము

(రాజు యజ్ఞము సమాప్తమైనంతట దేవతలు తృప్తిపడి నరపతితో స్వర్గమునకుఁ బోయిరి. రావణుఁడు యుద్ధమందలి కోరికచే భూమియందు.)

౧౯వ సర్గము

—* అనరణ్యుఁడు రావణుతో యుద్ధ మొనర్చుట *—

సీ. క్రమ్మరి రాజుల◊ఘోరవిక్రములను, జేరి యుద్ధమున కేఁ తేరుఁ డొండెఁ
విజితాస్మ యనుఁ డొండెఁ◊ నెరవొండు లేదు నా, ధాటి సహింపనా◊ధరణిపతులు
ప్రాజ్ఞు లభీరులు◊బాగుగ యోజించి, యన్యోన్య మతిఁ దు వ◊రాఢ్యుఁ డగుట
దుర్జయుఁడ ◊ నెంచి నిర్జితాస్మ యటంచుఁ, బలికిరి యీరీతిఁ ◊ బలికినట్టి
తే. వారు సురథుండు గాధి పు ◊ రూరవుండు
గయుఁడు దుష్యంతుఁ డనువారు ◊ కంజనయన
వీర లంద ఱి నిటు పల్కి ◊ వీరవరుఁడు
యుద్ధకాంక్షను వచ్చె న ◊ యోధ్య కపుడు. ౩౪౫

అర్థములు. క్రమ్మరి=తిరిగి, ఏ తేరుఁడు=రండు, విజితాస్మ=గెలువఁబడితిమి, నెరవు=ఉపాయము, ప్రాజ్ఞులు=అభీరులు, పిఱికివాండ్రు గాకున్నను బుద్ధిమంతులు, వరాఢ్యుఁడు=వరములచే గొప్పవాఁడు, ఇందుఁ జెప్పఁబడినవారు సమకాలికులు గారు. ఒక్కొక్క కాలమున నొక్కొక్కఁడు ప్రసిద్ధుఁడు వినరాఁగా వానిమీఁదికి రావణుఁడు పోవుచుండెను.

తాత్పర్యము

(తిరిగి, భయంకరమగు పరాక్రమముగల రాజుల కడకుఁ బోయి, 'యుద్ధమునకైన రండు, ఓడిపోయితి మనియైన ననుఁడు నా ధాటికిఁ దాళి నిలువ వేఱొక యుపాయము లేదు' అని నంత, పిఱికివాండ్రు కాకున్నను బుద్ధిమంతులు కావున

వార లాకరితో నొకరు బాగుగ యోజించి 'వీఁడు వరబలముగాఁడు- గెలువ శక్యము గా'దని తలఁచి 'గెలువఁబడితి' మని చెప్పిరి. ఈ విధముగాఁ జెప్పినవారు, సురథుఁడు, గాధి, పురూరవుఁడు, గయుఁడు, దుష్యంతుఁడు, రామా! వీ రంద ఱిట్లు పల్కఁగా రావణుఁడు యుద్ధకాంక్షచే నప్పు డయోధ్యకు వచ్చెను.)

క. ధీరుండు పురందర సమ, వీరుం డనరణ్యుఁ డనెడుఃపృథ్వీపతి పా
కారి దివంబును బోలిక, ధారిణిఁ బాలించుచుండ ♦ దశకంధరుఁడున్. ౩౮౭

అర్థములు. ధీరుఁడు=ధైర్యము గలవాఁడు, పురందర సమవీరుఁడు, ఇంద్రు నితో సమానమైన బలము గలవాఁడు, పాకారి=ఇంద్రుఁడు, దివంబును బోలిక= స్వర్గమును వలె.

తా త్ప ర్య ము

ధైర్యశాలియు, ఇంద్రునంత బలము గలవాఁడగు అనరణ్యుఁడను రాజు ఇంద్రుఁడు స్వర్గమువలె నయోధ్యను బాలించుచుండెను. రావణుఁడు-

ఉ. ఆతనిఁ గాంచి యుద్ధమున ♦ కైనను రమ్ము జితోస్మి యంచు నేన్
భీతి గలంగినం బలుకు ♦ నీవు మదాజ్ఞ యిదన్న ధారిణీ
నేతయుఁ గోపవేగమున ♦ నేత్రయుగం బరుణంబు గాఁగ నో
యాతుఁడ! నిల్వుమీ నిమిష ♦ మాహవ మే నొనరింప వచ్చెదన్. ౩౮౮

అర్థములు. జితోస్మి=జయింపఁబడితిని, ధారిణీనేత=రాజు, యాతుఁడ= రాక్షసుఁడా, ఆహవము=యుద్ధము.

తా త్ప ర్య ము

ఆయనను జూచి యుద్ధమునకైన రమ్ము. భయపడితివా, ఓడితినుము. ఇది నా యాజ్ఞయని చెప్పఁగా ఆ రాజు కోపించి కన్ను లెఱ్ఱజేసి యోరి రాక్షసుఁడా! క్షణమాత్రము నిలువుము, యుద్ధము చేయ వచ్చెదను.

చ. అని మును వానివృత్తము స ♦ మస్తము విన్కలి సిద్ధమైనవా
హినిఁ జతురంగయుక్తము మహీస్థలమెల్లను నావరింపఁగాఁ
గొని చని దైత్యసేనల న ♦ కుంఠితరీతిని దాఁకి పెక్కు నా
దినములు పోరు సల్పె నిన ♦ తేజుఁ డనుత్తమవిక్రమంబునన్. ౩౮౯

అర్థములు. వృత్తము=నడవడి, విన్కలిన్=వినియుండుటచే, వాహినిన్= సేనను, అనుత్తమ=ఎక్కులి గొప్పదగు, విక్రమంబునన్=బలముచే.

తా త్ప ర్య ము

అని చెప్పి వానిచర్య ముందే విన్నవాఁ డగుటచే యుద్ధమునకుఁ సిద్ధపఱిచి యున్న సేనను దీసికొని భూమి యంతయు నావరించునట్లు పోయి రాక్షససేనలతో మహాబలముగాఁ బెక్కునాళ్ళు యుద్ధము చేసెను.

క. జ్వలనజ్వాలలఁ దాఁకెడి శలభంబులు నాఁగ వహ్ని ॥ సంపతిత హవి
స్సులఁ బోలి తనదు యోధులు, పొలియఁగ ననరణ్యనృపతి॥ పురురోషమునన్

అర్థములు. జ్వలన జ్వాలలన్=అగ్నిశిఖలను, శలభంబులు=మిడుతలు, వహ్నిసంపతిత హవిస్సులన్=అగ్నియందుఁబడిన హవిస్సులను, పురురోషమునన్=మిక్కిలి కోపముతో,

తాత్పర్యము

ఆ యుద్ధమందుఁ దనసేనలు మండుచున్న యగ్నిజ్వాలలందు మిడుతలవలె అగ్నియందు హవిస్సువలెఁ బడి నాశ మగుచుండఁగాఁ జూచి కోపించినవాఁడై.

ఉ. అంబుధిలో నణంగెడి వ ॥ నాపగ లట్లు నశించు నాత్మసై
న్యంబులఁ గాంచి వాసవశ ॥ రాసనతుల్యము భీమమైన చా
పంబును గేలఁ బూని దశ ॥ వక్త్రుని దాఁకె మృగేంద్ర మల్పస
త్త్వంబులఁ దోలునట్లుతనుఁ॥దాఁకుప్రహస్తశుకాది మంత్రులన్. ౩౯౦

అర్థములు. వనాపగలు=అడవినదులు, వాసవశరాసనతుల్యము=ఇంద్రధనస్సుతో సమానమైనది, మృగేంద్రము=సింహము, అల్పసత్త్వంబులన్=క్షుద్రజంతువులను.

తాత్పర్యము

అడవినదులు సముద్రములోఁజొచ్చి రూపనామములు లేకపోయినట్లు నశించుచున్న తన సేనలఁ జూచి యింద్రచాపమువంటి చాపము తీసికొని రావణు నెదిరించి తనమీఁదికివచ్చు ప్రహస్తశుకాదిమంత్రులను సింహ మల్పజంతువులఁ దోలునట్లు.

క. పాఱఁగఁ దోలియు నెనిమిది, నూఱులు బాణంబు లామ ॥ నుష్యాదుశిరం
బీఱమ్ముగ నొక్క మొగిం, దూఱఁగ నేయుటయుఁ గొండ ॥ తోరపుజడికిన్.

అర్థములు. ఈఱమ్ముగన్=దట్టముగ, తోరపు జడికిన్=విశేషవర్షమునకు.

తాత్పర్యము

(పాఱఁదోలి యంతనిలువక యెనిమిదివందల బాణములు రావణునితల దూఱిపోవునట్లు దట్టముగ నొకటేవిధముగ వేయఁగా, విశేషవర్షమునకుఁగొండ.)

చ. కలఁగని యట్లు రావణుఁడు ॥ కంపము నొందక మీఁద దూఁకి చే
కోలఁదిని మోఁద భూపతియుఁ ॥ గూలె రథంబున నుండి భూమి వి
హ్వలుఁడయి వేపమానుఁ డయి ॥ వజ్రహతిం బడు చెట్టువోలె; ని
ట్లిలఁ బడియున్న పుణ్యనను ॥ రేశుఁడు గాంచి హసించు చిట్లనున్. ౩౯౧

అర్థములు. విహ్వలుఁడు = వెలఁవెలఁబోయినవాఁడు, వేపమానుఁడయి=వణఁకుచున్నవాఁడై, హసించుచున్=నవ్వుచు.

తాత్పర్యము

(క్రింత చెందనియట్లు రావణుఁడు కంపింపక, మీఁదికిమీఁకి చేతికొలఁది మోఁదఁగా, పిడుగు దెబ్బకుపడు చెట్టువలె రాజును వెలవెలఁబోయి, వణఁకుచు రథమునుండి నేలమీఁదఁ గూలెను. ఈవిధముగా భూమిపైబడియున్న పుణ్యాత్ముని రావణుఁడుచూచి నవ్వుచు నిట్లనెను.

ఉ. ఏమిఫలంబు నొందె తన • నీశ్వర! న న్నెదిరించి? యుద్ధమం
దేమగవాఁడు నన్ జెనకి • యేగు నొకో మెయితోడ? స్త్రీలతోఁ
గామితభోగసక్తుడవు • కావుటనో వినవోటు నాబలో
ద్దామత నన్న భూమిపతి • దానవుతో నను నీరెలుంగునన్. ౩౬౩

అర్థములు. మెయితోడన్=దేహముతో, కామిత భోగసక్తుఁడవు=కోరిక భోగములందు మనస్సుగలవాఁడవు, వినవోటు=వినవేమో కదా, బలోద్దామతన్=అధికబలమును, ఈ రెలుంగునన్=సన్నని గొంతుతో.

తాత్పర్యము

రాజా! నన్నెదిరించి నీవేమి ఫలమనుభవింపఁ గోరితివి? యుద్ధమందునన్ను దాఁకి దేహముతో నే మగవాఁడు పోఁగలఁడు? స్త్రీలతో నిత్యభోగములనుభవించుచు మూల యింట నున్న కారణమున నా బలపరాక్రమాతిశయము నీవు వినలేదు కాఁబోలు. వినియుండిన నాతో యుద్ధమునకు వత్తువా యనఁగా రాజు సన్నని గొంతుతో నిట్లనియె.

—• అనరణ్యుఁడు రావణు శపించుట •—

ఉ. ఏల ప్రగల్భభాషణము • లిట్లు వచించెదు రాక్షసేంద్ర! న
న్గాఁచుప లేను నీ విపుడు గూలితిఁ • గాలముచేత, నెవ్వఁడో
కాలము మీఱఁ జాలెడిని • గారణమాత్రమ వీవు నీనుడుల్
చాలును, ప్రాణ మేగుతఱి • శక్యమె నాకెదియేని చేయఁగన్ ౩౬౪

అర్థములు. ప్రగల్భభాషణములు=పొగరుపోతు మాటలు.

తాత్పర్యము

రాక్షసరాజా! యేల పొగరుపోతు మాటలాడెదవు. నన్నుఁ జంపినవాఁడవు నీవు కావు; కాలము నన్నుఁ జంపెను. నీవు నిమిత్తమాత్రమే. ఎవ్వఁడు కాలము నతిక్రమింపఁ గలఁడు. నీ మాటలు చాలును. ప్రాణము పోవు సమయంబున నిన్నేమి నేను జేయఁగలను.

ఉ. భీరువఁగాక నిన్నెదిరి ♦ వీరుఁడనై సమరంబొనర్చితిన్
 పోరను నన్ను నోంచితివి ♦ పోలును నీకది; యంతఁ బోక దు
 శ్చారుఁడ! నాదువంశము న ♦ సహ్యతరోక్తి నవజ్ఞ చేసెదే
 యోరువఁజాల నయ్యది మ ♦ దుక్తిఁ గవిన్ము పలాశనాధిపా. ౩౦

అర్థములు. భీరువన్=పిఱికివాఁడను, దుశ్చారుఁడ=చెడు నడవడి గల వాఁడా! అసహ్యతరోక్తిన్=సహింపరాని మాటలచే, అవజ్ఞ చేసెదే = అవమాన పఱిచెదవా? పలాశనాధిపా=మాంసభక్షకుల రాజా.

తాత్పర్యము

నేను క్షత్రియుఁడను గావున పిఱికినిగాక వీరుఁడనై యుద్ధముచేసి నాకృత్యము నెఱవేర్చితిని. నీవును యుద్ధమందు నన్ను నోడించితివి. అంతివఱకు నీవు చేసినది న్యాయ్యమే అంతతోఁ బోక దుష్ప్రవర్తనము గలవాఁడా! నా క్షత్రియవంశ మును నీవు వినరాని మాటల నవమానించితివి దానిని నేను సహింపఁజాలనుకావున నేను జెప్పెడి మాట వినుము.

క. దానము హోమము సుకృతం, బే నొనరించినను జనుల ♦ నేలిన ధర్మా
 ధీనుడనై నా వాక్యము, దానవకులపరివృఢుండ! ♦ తథ్యం బగుతన్. ౩౧

తాత్పర్యము

నేను దానము హోమము పుణ్యముచేసియుండి ప్రజలను ధర్మపద్ధతిని బరి పాలించియుంటినేని నేను జెప్పఁబోవునది రాక్షసకులశ్రేష్ఠా! సత్యమగును.

ఉ. రాముఁ డనంగ దాశరథి ♦ రావణ! పుట్టి మదన్వయంబునన్
 శ్రీమహితుండు నిన్ను రణ ♦ సీమ వధించు నటన్న దుందుభి
 స్తోమము మింట మ్రోఁగె సుర ♦ సూనము లానృపుమీఁద వ్రాలె క్షో
 ణీమహిళాధవుండును జ ♦ నెన్ దివికిన్; దశకంఠుఁ డంతటన్. ౩౨

అర్థములు. దాశరథి=దశరథుఁడను వాని కుమారుఁడు, మదన్వయంబు నన్=నా వంశమున దుందుభిస్తోమము=నగారాలధ్వని, మింటన = ఆకాశమందు, సురసూనములు=దేవతల పుష్పములు.

తాత్పర్యము

నా వంశమున దశరథుఁడను వాని కుమారుఁడై రాముఁ డనువాఁడు పుట్టి నిన్ను యుద్ధమందుఁ జంపును, అని చెప్పఁగా నాకాశమున దేవతలు నగారాలు మ్రోయించిరి. దేవత లాయనమీఁదఁ బుష్పవర్షము గురియించిరి. రాజు స్వర్గ మేగెను. రావణుఁడు ఆపిమ్మట,(ఇది రావణునకు నాలుగవ శాపము. ఇప్పటికి రావణ నాశమునకుఁ గావలసిన సామగ్రి కుదిరినది. ఇఁక కాలము వచ్చుటే తరువాయి)

౨౦వ సర్గము

—॰ నారదుఁడు రావణునకు మనుష్యవధ మాన బోధించుట ॰—

క. భూమీధవభీకరుఁడై, దీమసమున నేగుచోట ॰ దివి తెరువున వీ
ణామానిఁ గాంచి మ్రొక్కుచు, నేమము, బ్రశ్నించి కతము ॰ చెప్పుము మౌనీ!

అర్థములు. భూమీధవ భీకరుఁడై=రాజులకు భయంకరుఁడై, దీమసమున=గర్వముతో, దివి తెరువునన్=ఆకాశ మార్గమందు, వీణామానిన్=నారదుని, నారదుని వీణకు మహతి యని పేరు, కతము=కారణము.

తా త్ప ర్య ము

రాజులకు భయంకరుఁడై గర్వమునఁ బోవుసమయంబున నారదుఁ డాకాశ మార్గమున వానికిఁ గానవచ్చెను. వాఁడును నమస్కరించి నేమ మడిగి మునీంద్రా! కారణ మేమి?

ఉ. నీ విట కేగుదేర నన ॰ నీరదపృష్ఠగతుండు నారదుం
డా విబుధారికిం బలికె ॰ నాశరనాథ! పులస్త్యవంశదీ
పా! విని నీదువిక్రమము ॰ బాఢముదంబును గంటి, నిల్వుమీ
నావచియించు నొక్కవచ ॰ నంబును విన్మ వినం దలంచినన్. ౩౯౯

అర్థములు. నీరదపృష్ఠగతుండు=మబ్బుమీఁద నున్నవాఁడు, ఆశరనాథ=రాక్షసరాజా.

తా త్ప ర్య ము

నీవిచ్చటికేల వచ్చితివని యడుగఁగా మేఘములమీఁద నున్న నారదుఁడు రావణుతో నిట్లనియె. రాక్షసరాజా! పులస్త్యవంశదీపా! నీ బలము విని మిగుల సంతోషించితిని. నీవు వినఁదలంచితివేని నిలువుము. నే నొకమాట నీకుఁజెప్పెదను.

క. హరి దైత్యుల వధియింపఁగఁ, బరికించి ముదంబుఁ జెందు ॰ వాఁడను నీ వ
ల్లురగుల గంధర్వాదులఁ, బరిమార్పఁగఁ గాంచి ముదము ॰ పడు టెన్నండో. ౪౦౧

తా త్ప ర్య ము

విష్ణువు రాక్షసులఁ జంపఁగాఁ జూచి సంతోషించువాఁడను నేను, అట్టిసంతోషము నీవు పన్నగులను గంధర్వాదులను జంపఁగాఁజూచి యెన్నడను భవింతునో కదా!

సీ. అనిమిషగంధర్వ ॰ యక్షరక్షోసుర వరులకు నేని య ॰ వధ్యుఁ డీవు
తండ్రి! యేమని చంపఁ ॰ దలఁచితి మృత్యుచేఁ, జచ్చియు యున్నట్టి ॰ జనులఁ జెపుమ
మే లగుదానిని ॰ మేకొనఁజాలని, మూఢు లనిష్టముల్ ॰ మొగి ఘటించి
వ్యాధులచేతను ॰ వార్ధకంబున నేడ్చు, వారలు క్షుధను బి ॰ పాసచేత

ఆ. నిష్టజనులఁ బాసి ♦ యేడ్చుటచే సుక్కి, దైవనిహతులయి స ♦ దా క్షయించు
నరులఁ జంప నీకు♦న్యాయమా నాయనా!, యెంచి చూడవేమొ♦యింతదనుక.

అర్థములు. అనిమిష=దేవతలకు, అసురవరులకు = అసురశ్రేష్ఠులకు, అవధ్యుఁడవు=చంప సాధ్యపడనివాఁడవు, వార్థకంబునన్ = ముసలితనముచే, క్షుధను=ఆఁకలిచే, పిపాసచేన్=దప్పిచేత.

తాత్పర్యము

తండ్రీ! నీవు దేవతలకు, గంధర్వులకు, యక్షులకు, రాక్షసులకు, అసుర ముఖ్యులకుఁ జంపరాని వాఁడవు. వీరు దేవయోనులు-దీర్ఘకాలము బ్రదుకువారు, ఇఁక మనుష్యులో మృత్యువుచేఁ జచ్చినవారే, అట్లు చావనున్నవారిని జంపుట వలన నీకేమి లాభము? పేరా పెంపా? మనుష్యులు తమ కేది మేలో యది యాలోచించి చేయలేరు. చేయరాని పనులు చేసి రోగముల చేతను ముసలితనము చేతను నేడ్చు చుందురు. ఆఁకలి దప్పులచేతను ఇష్టజనులు వదలిపోవుట చేతను నేడ్చుటచే శుష్కించి దైవముచేఁ గొట్టఁబడి సదా యేడుచుచుండు నరులను జంప నీకు ధర్మమా? నాయనా! యింతవఱకు నీకీ యాలోచన మనస్సునకు రాలేదేమో కదా.

చ. గడియకు నేమి వచ్చునది ♦ కానరు క్షుద్రవిచిత్రవస్తువుల్
గడన యొనర్చుటందె తమ♦కాలముఁ బుత్తురు, వాద్యఘోషలన్
గడుముద మందుచుండి జడి ♦ కాఁగ నశ్రువు లర్థరాత్రమం
దుడుగక యేడ్చుచుండుదు. ర♦యో కనుగొంటివె మూఢమర్త్యులన్. ౪౦౨

అర్థములు. గడన=సంపాదనము, అశ్రువులు=కన్నీళ్ళు.

తాత్పర్యము

ఇఁక గడియకు నేమి రాఁగలదో మనుష్యు లెఱుఁగరు. అల్పములైనవిచిత్ర వస్తువుల సంపాదించుటయందుఁ దమ కాలము గడుపుదురు. పగళ్ళు వాద్యధ్వానులతోఁ గడుపుచుఁ నర్థరాత్రమందుఁ గన్నీళ్ళు వానవలెఁ గురియఁగా నయ్యో యని చచ్చినవారికై యేడ్తురు. మనుష్యులెంత మూఢులోఁ చూచితివా?

క. జనని యని జనకుఁడంచును, దనయుం డని భార్య యనుచుఁ♦దమ చుట్టము లం
చును జంజాటం బిడుకొని, వనటం బడువారు స్వకృత♦బంధంబులచేన్. ౪౦౩

తాత్పర్యము

తాముగా బంధములు కల్పించుకొని యిది నాతల్లి. యీయన నా తండ్రి వీఁడు నా కొడుకు, ఇది నా భార్య, వీరు నా బంధువులు అని యీప్రకారము జంజాటము తగిలించుకొని దుఃఖపడు చుందురు.

మానిని. కావున మోహనిరాకృతులం గడు♦కాఱియలం బడు మానవులన్
నీవు జయించినవాఁడవె చాల్, యము♦ని గన నేగుదు రెల్లజనుల్
నావచనంబున దండధరుం గద♦నంబున గెల్వు మవశ్యము నీ
వా విభుగెల్చిన నందఱ గెల్చిన♦యట్ల యగుంజుమి నిక్కముగన్. ౪౦౪

అర్థములు. మోహనిరాకృతులన్=అజ్ఞానముచే స్వరూపము చెడినవారిని; కడుకాఱియలన్=మిగుల బాధలను, కదనంబునన్=యుద్ధమందు.

తాత్పర్యము

కావున నజ్ఞానముచే స్వరూపము చెడి మిగుల బాధలుపడు మనుష్యులను నీవు జయించినవాఁడవే. రావణుఁడు మనుష్యుల జయింపలేఁడయ్యె నని యెవరు ననరు. కావున నీ ప్రయత్నము చాలింపుము. ఎట్టివారైనను యముని జూడ బోదురు. అందఱను యముఁడు చంపును. కాఁబట్టి నీవు యముని యుద్ధమందు జయించితివా యందఱ జయించినట్టు లగును. ఇది నిజము.

—♦ నారదునితో రావణుఁడు తాను యముని జయింపఁ బోయెద ననుట ♦—

తరలము. అనిన నవ్వుచు మ్రొక్కి పల్కె మ♦హాత్మ! గీతకళాప్రియా!
ఘనవిదారణలాలసా! జయ ♦ కాంక్ష నేను రసాతలం
బునకు నీ వచియించినట్టుల ♦ పోయి గెల్చి జగత్త్రియం
బును సురాహుల నాదునానతి ♦ మోపఁ జేసి బలోద్ధతిన్. ౪౦౫

అర్థములు. గీతకళాప్రియా=సంగీత విద్యయందుఁ బ్రీతిగలవాఁడా, ఘనవిదారణలాలసా=గొప్ప యుద్ధమందుఁ బ్రీతిగలవాఁడా, సురాహులన్=దేవతలను పన్నగములను.

తాత్పర్యము

అని చెప్పఁగా నవ్వుచు మ్రొక్కి యిట్లనియె. మహాత్మా! సంగీత విద్య యందుఁ బ్రేమగలవాఁడా! యుద్ధములు చూచుటయందుఁ గోరిక గలవాఁడా! నీవు చెప్పినట్లు జయముకొఱకు పాతాళమునకుఁ బోయి మూఁడులోకములను ఊర్ధ్వమున దేవతలను అధోలోకముల సర్పములను గెల్చి బలగర్వముచే నా యాజ్ఞకు లోపడియుండఁ జేసెదను.

క. అమృతార్థము మథియించెద, నమృతనిధానంబు జలధి ♦ నన నారదుఁడున్
యమపురి మార్గము కడుదుర్గమ మెవ్వఁడు పోవు నీవు♦ కా కసురేంద్రా. ౪౦౬

అర్థములు. అమృతార్థము=అమృతము నిమిత్తమై, అమృతనిధానంబు= అమృతమునకు స్థానమైన, జలధిన్=పాలసముద్రమును.

తాత్పర్యము

ఇట్లు మూఁడు లోకములు జయించి యమృతము సంపాదించి ప్రాపుకొఱకు నమృతస్థానమైన పాలసముద్రమును మథించెదను అనిచెప్పఁగా నారదుఁడు యమ పురమునకుఁ బోవు మార్గము మిగుల గహనము నీవుతప్ప మఱియెవ్వఁడు పోలేఁడు.

ఉ. నావుడు శారదాభ్రనిభు ♦ నారదుఁ బల్కెఁ గృతంబు సర్వమున్
దేవమునీ! యిదో యముని ♦ దేఁకువఁ జంపఁగ దక్షిణాశగాఁ
బోవుచు నున్నవాఁడఁ గినుఁ ♦ బుంగొని బాస యొనర్చినాఁడ నా
శావిభులందు నల్వురను ♦ సంగరభూమి జయింతు నంచొగిన్. ౪౦౭

అర్థములు. శారదాభ్రనిభున్ = శరత్కాల మేఘమువలెఁ దెల్లనైన వానిని, కృతంబు=చేయఁబడినది, తేఁకువన్=ధైర్యముతో, దక్షిణాశగా=దక్షిణ దిక్కుగా, కినుపుంగొని=కోపించి, ఆశావిభులందు=దిక్పాలకులయందు.

తాత్పర్యము

అని చెప్పఁగా శరత్కాల మేఘమువలెఁ దెల్లని కాంతిగల నారదుతో రావణుఁ డిట్లనియె. సర్వము నెఱవేఱినదే దేవమునీ! యిదిగో యముని సాహ సించి చంపుటకై దక్షిణదిక్కుగాఁ బోవుచున్నాను. కోపించి నేను నలుగురుదిక్పా లకులను యుద్ధమున జయింతునని ప్రతిజ్ఞ చేసితిని.

ఉ. ఆ నుడిఁ దీర్చుపొంటె నిదె ♦ ప్రాణుల నెల్లర గాసిపెట్టు నా
భానుతనూజ మృత్యునకుఁ ♦ బాల్పడఁ జేయఁగఁ బోవువాఁడ నం
చా నియమాత్ము మ్రొక్కి సచి ♦ వాన్వితుఁడై మదిలోనఁ బొంగుచున్
దానవనాథుఁ డట్టెచనె ♦ దక్షిణదిక్కుగఁ గాలుప్రోలికిన్. ౪౦౮

అర్థములు. భానుతనూజున్=యముని, నియమాత్మున్=నియమము గల మనస్సు గలవానిని, సచివాన్వితుఁడై = మంత్రులతోఁ గూడినవాఁడై, కాలు ప్రోలికిన్=యమపురమునకు.

తాత్పర్యము

ఆ మాట నెఱవేర్చుకొనుటకుగాను ప్రాణుల నందఱ బాధపెట్టు యమునిఁ జంపుటకై పోవువాఁడనని యా మునీశ్వరునకు నమస్కరించి మంత్రులతోఁ గూడినవాఁడై, మనస్సులోఁ బొంగుచు రావణుఁడు చకచకఁగా దక్షిణదిక్కుగా యమపురమునకుఁ బోయెను.

తే. రావణుఁడు పోవఁగ విధూమ ♦ పావకాభుఁ
డైన విప్రోత్తముండు బ్ర ♦ హ్మాత్మజుండు
నొక్క మార్గంబు యోజించె ♦ యుద్ధభూమిఁ
గాలు నెట్లు జయించునో ♦ కఱకుటసుర. ౪౦౯

అర్థములు. విధూమ పావకాభుఁడు=పొగలేని యగ్నికి సమానుఁడు, విప్రోత్తముండు=బ్రాహ్మణ శ్రేష్ఠుఁడు బ్రహ్మాత్మజుండు=బ్రహ్మమానసపుత్రుఁడు కాలునిన్=యముని, కఠినకుటసుర=కఠిన రాక్షసుఁడు.

తాత్పర్యము

(రావణుఁడు పోయిన తర్వాత, పొగలేని నిప్పువంటి వాఁడు బ్రాహ్మణ శ్రేష్ఠుఁడు, బ్రహ్మమానస పుత్రుఁడు కఠిన రాక్షసుఁడు యుద్ధభూమియం దెట్లు యమునిఁ గెలుచునో యని యొక్క రీతిగా నాలోచించెను.)

—◆ నారదుఁడు రావణుఁ డెట్లు జయించు నని యోజించుట ◆—

సీ. సచరాచరంబులు◆శక్రసమేతముల్, ముల్లోకములు చావు ◆ మూఁడు వేళ
ధర్మవిధానంబు ◆ తప్పక యెవనిచేఁ, గారింపఁబడు నట్టి ◆ కాలు నెట్లు
గెలుచువాఁడొకో దశ ◆ గ్రీవుండు మఱియును, దనతన చేసిన ◆ దానవిధికి
సత్క్రియాదులకును ◆ సాక్షియై యుండు రెండవ, పావకునట్టుల ◆ వఱలువానిఁ

ఆ. ప్రాప్తసంజ్ఞులే మహాత్ము ననుగ్రహ, వశముకలిమిఁ దిరుగుఁ◆వారు క్రియల
నెవని కడలు భీతి ◆ నెల్లలోకంబు లా, దండధరుని నెట్లు ◆ దాయునసుర ౪౧౦

అర్థములు. సచరాచరంబులు=కదలునవి కదలనివియగు వానితోఁగూడినవి, శక్రసమేతముల్=ఇంద్రునితో గూడినవి, కారింపఁబడు=బాధింపఁబడు, ప్రాప్తసంజ్ఞులు=జ్ఞానులు.

తాత్పర్యము

స్థావరజంగమంబులుగలిగి యింద్రునితోఁడి మూఁడు లోకములు మరణించు సమయమందు ధర్మపద్ధతి ప్రకారము వారు వారు చేసిన కర్మముల ప్రకారము ఎవఁడు బాధించునో యటువంటి యముని రావణుఁ డెట్లు గెలువఁగలఁడో అది యునుగాక తాను దాను జేసిన దానాదికార్యములకు సత్క్రియలకు సాక్షి యెవఁడో యెవఁడు రెండవ యగ్నివలెఁ బ్రకాశించునో యెవని యనుగ్రహము వశమున జ్ఞానులు సంచరింతురో యెల్లలోకము లెవనికి భయపడునో యటువంటి దండధరుని వీఁ డెట్లు గెలువఁగలఁడు.

ఆ. పుణ్యపాపములకుఁ ◆ బోలిన పద్ధతి, నింతో యంతో ఫలము ◆ నిచ్చువాఁడు
గెలిచినవాఁడు భువన◆ములనెల్ల దాన యా, కడిఁదిబలుఁడు గెలువఁ◆బడుట యెట్లొ

అర్థములు. ఇంతో=కొంచెమో, అంతో=గొప్పయో.

తాత్పర్యము

(జీవులు చేసిన పుణ్యపాపములకుఁ దగిన విధముఁగా గొంచెమో గొప్పయో ఫలము నిచ్చువాఁడు లోకములన్ని గెలిచిన వాఁడు. అంతటి బలము గలవాఁడు వీని చేత నెట్లు గెలువఁబడునో.)

ఆ. కాల మెల్లపనులఁ ♦ గావింప శక్తంబు, పంక్తికంఠుఁ డన్య♦బలము దేనిఁ
బూని గెలుచువాఁడొ ♦ దా నాహవంబున, దక్షిణాధిపతిని ♦ దండధరుని.

తాత్పర్యము

ఎవ్వఁ డేపని చేయుటకుఁ గాలము సాధనము. కాలము తోడుపడకున్న నెవ్వఁడేదియుఁ జేయఁజాలఁడు కాలమే యన్నిపనులు చేయ శక్తిగలది. అట్టి కాలుఁడు యముఁడు అట్టివానిని మఱేయే సాధనముచేత యుద్ధమందు వీఁడు జయింపఁగలఁడో.

క. ఈ యమరాక్షససాధుల, యాయోధనముం గనంగ ♦ నాసయ్యెడి నే
వే యరిగెద వైవస్వతు, దాయఁగ నని యరిగె దండ♦ధరు పురమునకున్. ౪౧౩

అర్థములు. ఆయోధనమున్=యుద్ధమును, ఆస=ఆశ.

తాత్పర్యము

(ఈ యమునికి రావణునకు జరుగఁబోవు యుద్ధము చూడ వలెనని యాస పొడముచున్నది. నేను శీఘ్రముగా యమునిదగ్గరకుఁ బోయెదనని యమపట్టనమునకుఁ బోయెను)

౨౧వ సర్గము

—* రావణు నుద్దేశంబు నారదుఁడు యమునితోఁ జెప్పుట *—

చ. చని లఘువిక్రమాఢ్యుఁడు కృశానుపురస్కృతుఁ బ్రాణికోటి చే
సినసుకృతాఘపాళులకుఁ ♦ జేకుఱ నర్హఫలంబు లోలి శా
సన మొనరించువానిఁ గనఁ ♦ జయ్యన నాతఁడు ధర్మపద్ధతిన్
మునిజననాథు నర్ఘ్యమునఁ ♦ బూజ మొనర్చి సుఖాసనస్థునిన్. ౪౧౪

అర్థములు. లఘువిక్రమాఢ్యుఁడు=వేగముగా బోవఁగలవాఁడు, కృశాను పురస్కృతున్ = అగ్నిహోత్రుని ముందుంచుకొనిన వానిని, సుకృత+అఘ+ పాళులకున్=పుణ్యపాపముల సమూహములకు, అర్హఫలంబులు=తగిన ఫలములను ఓలిన్=క్రమముగా, సుఖాసనస్థునిన్ = సుఖమైన యాసనమునఁ గూర్చున్న వానిఁ జేసి.

తాత్పర్యము

అతి వేగముగఁ బోఁగల నారదుఁడు పోయి సాక్షిగాన అగ్నిని ముందుంచు కొని ప్రాణులు చేసిన పుణ్యపాపములకుఁ దగినట్లు పుణ్యములు చేసిన వారికి సుఖము, పాపము చేసిన వానికి కష్టము శాసనము గావించుచు నుండు వానిని జూడఁగా, నాయనయు, త్వరగా ధర్మశాస్త్రప్రకార మర్ఘ్యమునఁ బూజించి సుఖాసనమునఁ గూర్చున్నవానిని జూచి.

తే. క్షేమమా మీకు మునినాథ♦ఖిలముగాదు,గాదె ధర్మంబు?గంధర్వ♦కాండ దేవ
సేవితా!మీరలిటకు వేం♦చేయు కార్య,మెద్ది యానతీ యిందునాం♦బుషివరుండు

అర్థములు. ఖిలముగాదు=చెడదు, గంధర్వౌఘ=గంధర్వసమూహముల చేతను, దేవ=దేవతలచేతను, సేవితా=సేవింపఁబడువాఁడా.

తాత్పర్యము.

(మునీంద్రా! మీకు క్షేమమా? ధర్మము చెడదుగదా! మీ రిచటకు వేంచేసిన కార్యమేమి? ఆనతింతు. అని యడుగ నా ఋషి శ్రేష్ఠుఁడు.)

ఉ. అంతక! యాలకింపుమ యుదంతము నంతయు నంత యుక్తముం
జింతన సేయుమీ యసుర శేఖరుఁ డైన దశాస్యు డిష్టు వి
క్రాంతిని నిన్ను దుర్జయ! దురంబున గెల్వఁగ వచ్చుచున్న వాఁ
డింత యెఱుంగుటం దెలుప నేనిటు వచ్చితి మున్న మున్నగన్. ౨౧౬

అర్థములు. అంతక=యముఁడ, ఉదంతము = వృత్తాంతము, విక్రాంతిని= పరాక్రమముచే.

తాత్పర్యము

ధర్మరాజా! వృత్తాంత మంతయు వినుము. ఆవలఁ జేయవలసిన దాలోచింపుము. రాక్షసశ్రేష్ఠుఁడైన రావణుఁడు తన బలముచే నిన్నుఁ జయింపఁగోరి యుద్ధమునకై వచ్చుచున్నవాఁడు. ఇది నాకుఁ దెలియుటచే నీకుఁ దెలుప ముందుగా వచ్చితిని.

తే. కాలదండధరుఁడ వై క్రాలు నీకు, నేమి యగ్వాడునో యని యేగుదెంచి
నాఁడ ననియెడు నీలోన, క్షణనాటవిభుని, వ్యోమయానంబుదోఁచె దవ్వులను మింట.

తాత్పర్యము

(కాలుఁడా! దండధరుఁడవై యున్న నీ కేమిహానియగునో యని తలఁచివచ్చితిని అనుచున్నంతలో రావణుని విమాన మాకసమున దూరముగాఁగానుపించెను.

—* రావణుఁడు యమలోకంబున బాధింపఁబడు జీవులఁ జూచుట *—

ఉ. పుట్టెడు సూర్యుఁ బోలి ప్రభ పూరటిలం దెసలందుఁ జీఁకటిన్
నెట్టుచు నెల్లచో నసుర నేతృవిమానము డాసెఁ బ్రేతరా
ట్పట్టనముం, దశాస్యుఁడును బ్రాణులు పాపఫలంబుఁ బుణ్యమున్
నెట్టన పొందుచుండఁగఁ గనెం బురబాహ్యతలంబులం దొగిన్. ౨౧౭

అర్థములు. పూరటిలన్=నిండఁగా, అసురనేతృ = రాక్షసరాజుయొక్క, ప్రేతరాట్ పట్టనమున్=యముని పురమును, సంయమిని యని పేరుగల దానిని, పురబాహ్యతలంబులన్=నగరము వెలుపలి ప్రదేశములందు.

తాత్పర్యము

ఉదయించుచున్న సూర్యునివలె వెలుతురు దిశలు నించుచు చీఁకటిని పోఁగొట్టుచు రావణుని విమానము యమపురిని సమీపించెను. రావణుఁడును పురము వెలుపల పుణ్యఫలములు పాపఫలములు ననుభవించు ప్రాణులను జూచెను.

సీ. శమనానుచరయుక్త ♦ సైనికులను జూచె, ఘోరరూపుల మహా ♦ క్రూరమతులఁ
గట్టంగఁబడువారిఁ ♦ గొట్టంగఁబడువారి నయ్యోయయ్యోయని ♦ యఱచువారి
బాధ తాళఁగలేక ♦ పలవించువారిని, బురుగులు తొలువంగఁ ♦ బొగులువారి
బెడిదంపుఁగుక్కలు ♦ పీకఁ గండలు నోట, హాహా యటంచును ♦ నఱచువారి

ఈ. వినిన గుండె లగల ♦ విలపించువారిని, రక్తవారి వైత ♦ రణిని లాగఁ
బడెడివారి మఱియుఁ ♦ బడవైచి మండెడు,నిసుక వేఁపఁబడఁగ ♦ నేడ్చువారి. ౮౧౯

అర్థములు. శమనానుచర=యమకింకరులతోడ, యుక్త=కూడిన, సైనికులను=సేనాభటులను, తొలువంగన్=బొక్కలు పడఁజేయఁగా. పొగులు వారిన్=దుఃఖించువారిని. అగలన్=పగులునట్లు, వైతరణిని=వైతరణి యను నదియందు, లాగఁబడెడి=ఈడువఁబడెడి, వేఁపఁబడఁగన్=వేయింపఁగా.

తాత్పర్యము

(భయంకర రూపము గలిగి మిగులఁ గ్రూరమైన మనస్సు గలవారిని యమకింకరులతోఁ గూడిన సేనా భటులను జూచెను. కట్టఁబడు వారినిఁ గొట్టఁబడు వారిని, అయ్యో యయ్యో అని యఱచు వారిని, బాధ కోర్చుకొనలేక యేడ్చు వారిని, పురుగులు తొలుచుచుండఁగా రోదనము చేయువారిని,కుక్కలు నోటితోఁ గండలు పీకుచుండ హా హా యని యఱచు వారిని, బాధ కోర్చుకొనలేక యేడ్చు వారిని, రక్తప్రవాహముగల వైతరణి యందు లాగఁబడుచున్న వారిని మండు చున్న యిసుకలోఁ బడవేసి వేయింపగాఁ నేడ్చువారిని.)

క. అసిపత్రవనాంతరమునఁ గసిమసఁగంబడు నధర్మ ♦ కారుల నీరం
బొసఁగరె యని పెనుదప్పిని, గసమసపడు వారిఁ గాంచెఁ ♦ గష్టాత్మకులన్. ౮౨౦

అర్థములు. అసిపత్రవనాంతరమునన్=కత్తులవంటి యాకులుగల వనములందు, కసిమసఁగబడు=ఖండింపఁబడు, అధర్మకారులన్=పాపములు చేసిన వారిని, కసమస=తొట్రుపాటు, కష్టాత్మకులన్=నీచపు మనస్సు గలవారిని.

తాత్పర్యము

కత్తులవంటి యాకులుగల చెట్లతోఁ పులందు ఖండింపఁబడు పాపాత్ములను మిగుల దప్పిగొని నీళ్ళోనీళ్ళోయని తొట్రుపాటు పడెడివారిని పాపాత్ములను జూచెను.

సీ. ఆఁకటిపెల్లున ♦ నటమటించెడివారి, ఘోరరౌరవమునఁ ♦ గూయువారి
నుప్పుటేఱులలోన ♦ నుమ్మలించెడివారి, మంగలికత్తుల ♦ మలయువారిఁ
బీనుఁగుల్బట్టులై ♦ వెలవెల్లనగువారి, బక్కచిక్కినవారి ♦ స్రుక్కువారి
విరిసిన వెన్ద్రుకల్ ♦ వ్రేలాడువారిని, నేడ్చి స్రుక్కుచుఁ బరు♦విడెడువారి

తే. మన్నుబురదయు మెయినిండి ♦ యున్నవారి వన్నెమారినవారి♦బంక్తిగ ఖుఁడు
వందలుగ వేలుగను దన♦వచ్చుత్రోవఁ, బ్రేతసంఘంబులను గాంచి♦ వేఱుచోట.

అర్థములు. అటమటించెడివారిన్=బాధపడు వారిని, ఉమ్మలించు వారిన్= దుఃఖించు వారిని.

తాత్పర్యము

(ఆఁకలి మంటకు బాధపడు వారిని, భయంకరమైన రౌరవ నరకమునఁ గూఁతలిడువారిని, నుప్పుటేఱులలో దుఃఖపడు వారిని, మంగలికత్తులమీఁదనీడ్వఁ బడువారిని పీనుఁగులవలె నయి వెలవెలఁ బోవువారిని, బక్క చిక్కిన వారిని, స్రుక్కిన వారిని, విరిసిన వెన్ద్రుకలు వ్రేలాడువారిని, యేడ్చి సొక్కి పరుగెత్తి పోవు వారిని, మన్ను బురద మొడలనిండఁ గలిగినవారిని, వన్నె మారినవారిని, ప్రేతలను వందలుగ వేలుగఁ దాను వచ్చెడు దారిలో రావణుఁడు చూచెను.

క. సంగీతవాద్యనిస్వన, భంగుల వీనులకు విందు ♦ పచరించుచు ము
త్సంగతి త్వసుకృతఫలముల,భంగంబుగ ననుభవించు♦వారలఁగనియెన్. ౨౨

అర్థములు. పచరించుచున్=కలిగించుచు, ముత్+సంగతి=సంతోషముతో, స్వసుకృతిఫలములు=తాముచేసిన పుణ్యముల ఫలములు,అభంగంబుగన్=నిర్విఘ్నముగ, వీరు పుణ్యములు చేసినవారు.

తాత్పర్యము

(సంగీత ధ్వనులు, వాద్యముల ధ్వనులు చెవులకింపు గలిగింపఁ దమ చేసిన పుణ్య ఫలము నవిచ్ఛిన్నముగ సంతోషముతో ననుభవించు చున్న వారినిజూచెను)

సీ. ఆవులదానంబు ♦ నాచరించినవారు గోరసంబులు ద్రావి ♦ కొఱలు చుంట
అన్నదాతలు రుచి♦రాన్నంబులను మెక్కి, యామోదమున నడ♦యాడు చుంట
గృహదాత లగువారు ♦ మహితగృహంబుల, సంతోషయుక్తులై♦సౌఖ్యపడుట
హాటకమణిముక్తి♦కాభరణోజ్జ్వల, సుందరీతతితోడఁ గొందఱుండ.

తే. వారు వారలొనర్చిన ♦ పరమపుణ్య, ఫలముకొలఁదిని ధార్మిక♦వరులు కొంద
ఱమల మగుస్వీయదివ్యతే♦జమున వెలుఁగ, వారినెల్లరఁగనుగొని♦పంక్తిముఖుఁడు

అర్థములు. గోరసంబులు=ఆవులపాలు, ఆమోదమునన్=సంతోషముతో, గృహదాతలు=ఇండ్లుదానము చేసినవారు, మహితగృహంబులన్ = పెద్దయిండ్ల

యందు, హాటక మణిమౌక్తిక=బంగారు రత్నములు ముత్తెములు. ఆభరణ= భూషణములచే, ఉజ్జ్వల=ప్రకాశించు, సుందరీతతితోడన్ = అందకత్తెలసమూహముతో.

తాత్పర్యము

(గోదానము చేసినవారు, ఆవులపాలు ద్రావి హాయిగా నుండుట, అన్నదాతలు రుచిగల యన్నములను భుజించి సంతోషముగా విహరించుట. ఇండ్లుదానము చేసినవారు పెద్దయిండ్లయందు సంతోషము కలిగి సుఖపడుట, బంగారు, మణులు, ముత్యాలతోఁ జేయఁబడిన సొమ్ములు పెట్టుకొనిన సుందరీజనముతోఁ గొందఱుండుట, వారు వారు చేసిన పుణ్యాతిశయము కొలఁది ధర్మాత్ములు కొందఱు స్వచ్ఛమగు తమ తేజస్సుతోఁ బ్రకాశించు చుండ వారినందఱును జూచి రావణుఁడు.)

క. తమ తమ దుష్కృతములకున్, శమనభటుల్ బాధపఱుప ♦ సంకటపడు ప్రే
తముల బలాత్కారంబుగ, నమితబలుఁడు విడిచి పుచ్చె ♦ హాయిఁ జరింపన్.

అర్థములు. దుష్కృతములకున్=పాపములకుఁగాను, శమనభటుల్=యమకింకరులు, ప్రేతములన్=యాతనా శరీరముగల జీవులను, బలాత్కారంబుగన్=బలవంతముగ, హాయిన్=సౌఖ్యముగ.

తాత్పర్యము

వారు వారు చేసిన పాపములకు యమకింకరులు తమ్ము బాధింపఁగా కష్టపడుచున్న ప్రేతములను రావణుఁడు సుఖపడఁ బొండని వదలిపెట్టెను.

—♦ యమభటులు రావణుతో బోరుట ♦—

ఆ. అప్రతర్కితమ మవిచింత్య♦మైన భంగి, జీవు లిట్లు ముహూర్తంబు♦చెందసుఖము
ప్రేతరక్షకు లా దశ♦గ్రీవుఁ గినుక రేఁగి తాఁకిరి మూఁకలు ♦ మూఁగి సరగ.

అర్థములు. అప్రతర్కితము=ఊహింపరానిది, అవిచింత్యము = ఆలోచింపరానిది, ముహూర్తంబు=అల్పకాలము, ఇట్లనుటచే యమకింకరులు మరల నా జీవులను బట్టుకొని వచ్చిరని యేర్పడు చున్నది, సరగన్=త్వరగా.

తాత్పర్యము

ఇట్లు జరుగునని యూహింపరాని మనస్సుననైనఁ దలపరాని విధముగ జీవులల్పకాల మట్లు సుఖపడఁగా నా జీవరక్షకు లగు కింకరులు కోపించి విజృంభించి గుంపులు గుంపులుగనై రావణు నెదిరించిరి.

క. హాలహాలరవములఁ గోలాహాల ముదయింపంగ దెసల ♦ నన్నిట యమయో
ధులు గూడి యుద్ధమునకున్, వెలియనిజడివానపోలె ♦ వివిధాయుధముల్.

అర్థములు. హాలహాల రవములన్=హాలహాల యను శబ్దములచే, కోలాహలము=కలకలము, వెలియని జడివాన=నిలువని పెద్దవర్షము.

తాత్పర్యము

హాలహాల ధ్వనులచే నన్ని దెసలఁ గలకల నాదములు పుట్టఁగా యమభటులు గుమిగూడి యుద్ధమునకు బయలుదేఱి యనేక విధములైన యాయుధములు విడువని జడివానవలె,

క. పరిఘములు ప్రాసములు తోమరశక్తులు ముసలములును • మహితబలాఢ్యుల్
సురవైరి విమానముపై, గురిసిరి యెడ తెఱపి లేక • కోటికొలందుల్. ౨౬

అర్థములు. పరిఘములు=ఇనుపకట్ల గుదియలు, ప్రాసములు=ఈటెలు- తోమర-చిల్లకోలలు, శక్తులు, ముసలములు, రోఁకండ్లు, మహితబలాఢ్యుల్= గొప్ప బలసంపదగలవారు.

తాత్పర్యము

(ఇనుపకట్ల గుదియలు, ఈఁటెలు, చిల్లకోలలు, శక్తులు, ముసలములు గొప్ప బలసంపద గలవారు. రావణుని విమానముమీఁద నెడతెఱపి లేకుండఁ గోట్లకొలందిగఁ గురిసిరి.)

క. వారలు మధుకరములవలెఁ, దోరణములు హర్మ్యములును • దోరపు వేదుల్
మూరుతమునఁబుష్పకమున, వారక భేదించి రసుర • వర్గము బెగడన్. ౨౭

అర్థములు. మధుకరములవలెన్=తుమ్మెదలవలె మూఁగి, హర్మ్యములు= మేడలు, తోరపు వేదుల్=పెద్దయరుఁగులు, బెగడన్=భయపడఁగా.

తాత్పర్యము

ఆ కింకరులు తుమ్మెదలవలె ముసురుకొని విమానమునందలి తోరణ స్తంభములను మేడలను అరుఁగులను నల్పకాలములో రాక్షసులు భయపడునట్లువిఱిచిరి.

తే. దేవనిష్ఠానభూత మై • తేజరిల్లు నవ్విమానంబు బ్రహ్మమా • హాత్మ్యమునను
బూర్వవిధమునఁబూర్ణమై • పోలుపుదాల్చె భాస్కరాత్మజభటులచే • భగ్నపడియు.

అర్థములు. దేవనిష్ఠానభూతము=దేవాధినిష్ఠానభూతము, భాస్కరాత్మజభటులచే=యమకింకరులచే, భగ్నపడియు=విఱిగియు.

తాత్పర్యము

బ్రహ్మమహిమచే దేవత లధిష్టించియుండు నవ్విమానము యమకింకరులచే విఱువఁబడియుఁ బూర్వమువలెనే యుండెను.

ఉ. ఆ మహితాత్ము శూరులు స•హస్రములున్ శతముల్ మహోగ్రసం
గ్రామ మొనర్ప వృక్షముల • గ్రావములన్ మఱి ప్రాససంతతిన్
స్తోమముగాఁగ వైచుచును • దోర్బలధుర్యులు రాక్షసుల్ యథా
కామముగా యథాబలము • గర్వ మెలర్పఁగఁ బోరి రుగ్రులై. ౪౩౦

అర్థములు. ఆమహితాత్ము = ఆగొప్పధైర్యము గల యముని యొక్క. సంగ్రామము=యుద్ధము, గ్రావములన్=కొండలను, ఱాలను = ప్రాససంతతిన్= ఈఁటెల సమూహములను, స్తోమముగా=గుంపుగా, దోర్బలధుర్యులు=అతిశయించిన భుజబలము గలవారు. యథాకాలముగాన్=ఇష్టమువచ్చినట్లు, యథాబలము= బలముకొలఁది, ఉగ్రులై=భయంకరులై

తా త్ప ర్య ము

మిగుల ధీరుఁడైన యముని శూరులు నూఱులు వేలు కొలఁదిగా మహా భయంకరయుద్ధము చేయఁగా బలశాలు లగు రాక్షసులు చెట్లను ఱాలను ఈఁటెలను గుంపులుగా వేయుచు నిష్టము వచ్చినట్లు బలముకొలఁది భయంకరులై యుద్ధము చేసిరి.

సీ. నిఖిలాయుధావళి • నిహతసర్వాంగులై, నెత్తుట జొత్తిల్లి • నెఱిదొరంగి
రావణమంత్రులు • రణ మొనరింపఁగ, వైవస్వతామాత్య•వరులు కెరలి
వారల నొప్పించి • బడలించి యటఁ బోయి, పంక్తికంఠుని శూల•వర్ష మునను
నొడలెల్లఁ జిల్లులు • పడ మోఁద శోణిత దిగ్ధాంగుఁడై వాఁడు•తేజరిల్లెఁ

ఆ. బుష్పకాంతరమున • ఫుల్లకింశుకమున, కుద్దియగుచు నాతఁ•డుగ్రశక్తి
నస్త్రబలముఁ జేసి • యశ్మతోమరగదా, శక్తిశూలవృక్ష•సాయకముల. ౪౩౧

అర్థములు. నిఖిలాయుధావళిన్=సమస్తాయుధ సమూహములచే, నిహత= కొట్టఁబడిన, సర్వాంగులై=అన్నియవయవములు కలవారై, చొత్తిల్లి=ఎఱ్ఱవాఱి, నెఱి=కాంతి, వైవస్వత=యముని యొక్క, అమాత్యవరులు = మంత్రిశ్రేష్ఠులు, కెరలి=విజృంభించి, శోణితదిగ్ధాంగుఁడై=నెత్తుటఁ బూయబడిన దేహముగలవాఁడై పుష్పకాంతరమునకే=పుష్పకములో, ఫుల=వికసించిన, కింశుకమునకున్= మోదుగునకు అశ్మ=రాయి, తోమర=చిల్లకోలలను, గదా=గదలను, శక్తి= శక్తులను, శూల=శూలములను, వృక్ష=చెట్లను, సాయకములన్—బాణములను.

తా త్ప ర్య ము.

అన్ని యాయుధముల సమూహములచేఁ గొట్టబడిన యవయవములు గల వారై నెత్తుటఁ దడిసి యెఱ్ఱనై కాంతిచెడి రావణు మంత్రులు యుద్ధముచేయఁగా యముని మంత్రులు విజృంభించి వారిని నొప్పించి గాసిపడఁజేసి వారినిదాఁటిపోయి

రావణుని శూల వర్షముచే తూంటులు పడఁగొట్టగా నెత్తురు క్రమ్మిన దేహము గలవాఁడై పుష్పక విమానమందు పూచిన మోదుగువలెఁ బ్రకాశించుచు భయంకర శక్తిచేతను అస్త్రబలము చేతను ఆలుతో మర శక్తి శూలములను చెట్లను బాణములను.

చ. పరఁగఁగ జేయ నయ్యవియు ◊ వర్షము పోలిక శ్రాద్ధదేవు కిం
కరులపయిన్ వడిం గురియఁ ◊ గాలభటాగ్రణులుం దదీయభీ
కరశరవర్ష మాఁపుచును ◊ గ్రావముపై బలు మబ్బులట్టు లా
సురపతిమీఁద వ్రాలి శిత ◊ శూల పరశ్వథ హేతిహేతులన్. ౪౩౨

అర్థములు. శ్రాద్ధదేవు కింకరులపయిన్=యమకింకరులమీఁద, కాల భటాగ్రణులు=యమకింకర శ్రేష్ఠులు, భీకర శరవర్షము = భయంకరమైన బాణ వర్షమును, ఆఁపుచు = అడ్డగించుచు, గ్రావముపై=కొండమీఁద, ఆ సురపతి మీఁదన్=రావణుమీఁద, శిత=పదునైన పరశ్వథ=గండ్రగొడ్డండ్లయు, హేతి= కత్తులయు, హేతులన్=దెబ్బలచే.

తా త్ప ర్య ము

ప్రయోగింపఁగా నవియమకింకరులమీఁద వర్షమువలె బడెను. వారు దానిని వారించి కొండమీఁద మబ్బులు క్రమ్మునట్లు రావణుమీఁదఁబడి వాఁడి గల శూలములయు గండ్రగొడ్డండ్లయు కత్తులయు దెబ్బలచే.

ఉ. ఊపిరి యాడకుండఁ గడు ◊ నుగ్రత నందొక యింతయాక యా
పాపచరిత్రుఁ బై పయిని ◊ బాఁదఁ దదాహతి ముక్తవర్ముఁడై
యాపగవోలెఁ గాఱు రుధి ◊ రాంబులఁ దోఁగి సమన్యుచిత్తుఁడై
యాపలలాశినేత సుర ◊ యానము వీడి ధరన్ నిలంబడెన్. ౪౩౩

అర్థములు. తదాహతిన్=ఆ దెబ్బలచే, ముక్తవర్ముఁడై=కవచము వదలిన వాఁడై, ఆపగంబోలెన్=ఏటివలె, రుధిరాంబులన్=నెత్తురను జలముల, తోఁగి= స్నానముచేసి, సమన్యు చిత్తుఁడై=కోపముతోఁ గూడిన మనస్సుగల వాఁడై, పలలాశినేత=రాక్షసరాజు, సురయానము=విమానము, వీడి=వదలి.

తా త్ప ర్య ము

ఊపిరి తిరుగకుండునట్లు మిగుల భయంకరముగా కొంచెమైన సందీయక పాపపు నడవడిగల యతనిని మీఁద మీఁద బాఁదఁగా ఆ దెబ్బలచేఁ గవచము వదలిన వాఁడై యేఱువలె నెత్తురు కాఱఁగా నెత్తుటి నీటియందు స్నానముచేసి కోపముతోఁ గూడిన మనస్సుగలవాఁడై యా రాక్షసరాజు విమానము విడిచి నేలపై నిలఁబడెను.

—• రావణుఁడు పాశుపతాస్త్రంబున యమకింకరుల దహించుట •—

చ. నిలఁబడి చాప బాణముల • నిష్ఠురుఁడై కొని లబ్ధసంజ్ఞుఁడై
ప్రళయకృతాంతునట్లు లయి • పాశుపతాస్త్రముఁ గూర్చి మౌర్వికిన్
నిలు నిలుఁ డంచు నార్చి మును • నీలగళుండు పురత్రయంబుపైఁ
బెలుచన వైచినట్లు దృఢ • విక్రముఁడై చెవి సోఁక నీడ్చుచున్. ౪౩౪

అర్థములు. నిష్ఠురుఁడై=కఠిన చిత్తము గలవాఁడై, లబ్ధసంజ్ఞుఁడై=స్మృతి తెచ్చుకొన్నవాఁడై, ప్రలయకృతాంతు నట్టులు = ప్రలయకాల యమునివలె, మౌర్వికిన్=అల్లెత్రాటికి, పెలుచనన్=కోపముతో.

తాత్పర్యము

ఇట్లు నిలువఁబడి స్మృతి తెచ్చుకొని విల్లుబాణములు చేతఁ దీసికొని ప్రలయ కాల యమునివలెనై పాశుపతాస్త్రమును నారికి సంధించి నిలువఁబడుఁడనియఱచి పూర్వము శివుఁడు పురత్రయముమీఁదఁ గోపముతోఁ బ్రయోగించినట్లు దృఢ బలము గలవాఁడై చెవిదాఁక నల్లెత్రా డీడ్చినవాఁడై.

ఉ. వైనవిధూమవహ్నివలె • భర్గునియస్త్రము భూతకోటితో
దావకృపీటజాతుఁడు ని•దాఘము వేళను శుష్కమౌ నర
ణ్యావళి నేర్చునట్టులు ద్రు•మాళుల గుల్మములన్ దహించుచున్
వే విలయంబుఁ గూర్చె యమ • వీరభటాళికి జ్వాలమాలియై. ౪౩౫

అర్థములు. విధూమవహ్నివలెన్=పొగలేని యగ్నివలె, భర్గునియస్త్రము= పశుపతి సంబంధమైన యస్త్రము, దావకృపీట జాతుఁడు = కాఱుచిచ్చు, నిదాఘము వేళల=ఎండకాలమందు, శుష్కమౌ=ఎండిన, ఏర్చు=కాలుచు, గుల్మములన్=పొదలను, జ్వాలమాలియై=శిఖలతోఁ గూడినదై.

తాత్పర్యము

ప్రయోగింపఁగా పొగలేని మంటవలెఁ బాశుపతాస్త్రము భూతలముల సమూహముతో నెండకాలమున నెండిన యడవిని గారుచిచ్చు దెగఁ గాల్చునట్లు చెట్లను బొదలను గాల్చుచు మంటలతోఁబోయి యముని వీరభటుల గుంపును నాశము చేసెను.

తే. కారుచిచ్చునఁ గాలిన•క్ష్మారుహంబు,లట్లు కాలుని సైన్యముల్ •హతముగాఁగ
సచివయుక్తుండు రాక్షస•సత్తముండు, పుడమివడఁకాడ గర్జలఁ•బోరి ఘటించె

అర్థములు. క్ష్మారుహంబులు=చెట్లు.

తాత్పర్యము

(కారుచిచ్చునందుఁ గాలిపోయిన చెట్లవలె యముని సేనలు హతమయి పోవఁగామంత్రులతోఁగూడి రావణుఁడు భూమి వడఁకిపోవునట్లుబొబ్బలుపెట్టెను.)

౨౨వ సర్గము

—• యముఁడు రావణుతో యుద్ధమునకై వెడలుట •—

సీ. ఆ మహానాదంబు • నాలించి యముఁడు నిజవ్యూహ యోధుల • సంక్షయంబుఁ
బగతుని విజయంబు • భావించి క్రోధసం, రక్తనేత్రముల సా • రథిని గాంచి
తెమ్ము తేరన వాఁడు • నిమ్ముగా సమకూర్చి, తెచ్చిన నదియెక్కెఁ • దీవ్రగతిని
నవ్యయం బగు భువ • నావళి దేనిచే, హరియింపఁ బడుచుండ • నట్టిమృత్యు
ఆ. వతని మున్ను నిలిచె • హస్తంబునను పాశ ముద్గరములఁ దాల్చి • మూర్తిమంత
మగుచుఁ గాలదండ • మను యమసాధనం, బతని ప్రక్కనిలిచె • నగ్నిదీప్తి. ౮౩౭

అర్థములు. నిజవ్యూహయోధుల=తన సేనల యందలి భటుల, సంక్షయంబు=చావు. అవ్యయము=నాశములేని.

తాత్పర్యము

ఆ గొప్ప ధ్వని విని యముఁడు తనసేన నాశమైన దనియు విరోధి జయించినాఁడనియు గ్రహించి కోపముచేఁ గన్ను లెఱ్ఱచేసి సారథినిజూచి తేరు సిద్ధముచేసి తెమ్మనఁగా వాఁడును జక్కఁగా సిద్ధముచేసి తెచ్చిన దానిని వేగముగ నెక్కె. ప్రవాహమువలె క్షయింపని భువనములు దేనిచే హరింపఁబడునో యట్టి మృత్యువాయనముందు పాశముద్గరములఁ దాల్చి నిలిచెను. కాలదండమను యమసాధనము ఆకారము ధరించి యగ్నికాంతి కలదై ప్రక్కనిలిచెను.

ప్రపంచము ప్రలయమున నాశనుగును గదా యది యెట్లు నవ్యయమని సందేహింపరాదు. ప్రపంచము నిత్యమైనది-ప్రవాహమువలెనని యెఱుఁగునది. మనకుఁ గానరాకపోఁగానే మఱియొకచోట నది లేదనరాదు. ప్రవాహమునందొక గడ్డి పోఁచ వేసిన నది కొంతసేపటికిఁ గానరాకపోవును. ఆమాత్రమున దానికి నాశము చెప్పరాదు ఆటులే ప్రపంచము ప్రలయమందు భగవంతునందు లీనమైయుండును. వెలుపల జలప్రలయవేళఁ బ్రపంచము నంతయు భగవంతు గర్భమునందు మార్కండేయుఁడు చూచెఁగదా.

తే. కాలపాశంబులతని ప్రక్కల రహించె, ముద్గరము వహ్నితుల్యమౌ • మూర్తిదాల్చి
యతని సేవించె లోకంబు • హావళించె, సర్వలోకభయావహు • శమనుఁ జూచి.

తాత్పర్యము

కాలపాశంబు లతని ప్రక్కనుండెను. ముద్గరము అగ్నిసమానమైనయాకారము ధరించి యతని గొలుచుచుండెను. సమస్తజనులకు భయంకరుఁడైన యమునిఁ జూచి లోకముపద్రవపడెను.

ఉ. సారథి చోదితంబు లయి ◊ స్యందన ఘోటకముల్ మనోజవో
దారము లేగి యా హరిహ ◊ యంబుల భంగి, రణంబు చెల్లు త
ద్ధారిణిఁ జేర మూర్తమునఁ ◊ దద్రథముం గని మృత్యుయుక్తమున్
ఘోరవికారరూపమును ◊ గుండెలు వ్రీలఁ దశాస్యమంత్రుల్. ౨౩౯

అర్థములు. సారథిచోదితంబులు=సారథిచేఁ దోలఁబడినవి, స్యందన ఘోటకముల్=రథమునకు గట్టిన గుఱ్ఱములు, హరిహయంబుల భంగిన్=సూర్యుని గుఱ్ఱములవలె, మనోజవోదారతన్=మనస్సు వేగమువంటి గొప్ప వేగముతోఁ బోయి అల్పకాలములో యుద్ధము జరుగు ప్రదేశముఁ జేరఁగా మృత్యువుతోఁ గూడి భయంకరమైన వికారరూపముగల యా తేరిని జూచి రావణ మంత్రులు గుండెలు పగులఁగా.

సారథి చోదితంబు- ఇందు 'చో' గాయత్ర్యక్షరము- ఇరువది రెండవ యక్షరము.

క. మనమా యీతనిఁ దొడరఁగ, మనుమార్గము కల్లయనుచు◊మదమతి సత్త్వం
బును లేమి భయార్దితులై, చనిరి మదులు సుడివడంగ ◊సహాసోత్థితులై. ౨౪౦

తాత్పర్యము

ఈయనను మనమా యెదిరించి యుద్ధము చేయుట,ఎదురుఁగా బోయితిమా బ్రదుకుట యబద్ధము అని గర్వముడిగి, బలములేమిని భయముచేఁ బీడింపబడిన వారై తటాలున లేచి మనస్సులో భ్రమించుచుండ బోయిరి.

—◊ యమ రావణ యుద్ధము ◊—

ఉ. అట్టి భయానకాకృతి మ ◊ హారథముం గని పంక్తికంఠుఁడున్
దొట్టనిభీతి నెట్టెదుటఁ ◊ దొట్రిలకుండినఁ దోమరాదులన్
నెట్టనవర్షముం బఱపె ◊ నేర్పున గాలుఁడు వానిమీఁద వాఁ
డిట్టల మైనధీరతఁ బ ◊ రేతపు తేరిపయిన్ శరావళిన్. ౨౪౧

అర్థములు. భయానకాకృతి=భయంకరాకారముగల, తొట్టని భీతి=భీతి లేనివాఁడై.

తాత్పర్యము

అట్టి భయంకరాకారముగల తేరిని జూచి రావణుఁడు భయములేక యెట్ట యెదుట చలింపక నిలువఁగా యముఁడు నేర్పుతో వానిమీఁదఁ దోమరములు మొదలైన యాయుధములను వానవలెఁ గురియించెను. వాఁడును చలింపని దృఢమైన ధైర్యముతో యమునిమీఁద బాణసమూహములను బ్రయోగింపఁగా.

ఉ. అంబుధరంబురీతిఁ గురి • యన్ యముఁడున్ విబుధారి పై న్విశా
లం బగుటొమ్ము శక్తులఁ గ • లంబక పంక్తుల వ్రచ్చినన్ మహా
డంబర మూని నొచ్చియుఁ గ • డంకను బోరుచు మారు సేయ లే
కంబరచారివైరి పెనఁ • గాడెను రాతురు లేడు మానియై. ౮౮౨

అర్థములు. కలంబక పంక్తులన్=బాణముల వరుసలచే, వ్రచ్చినన్=చీల్పఁగా, కడంకను=ప్రయత్నముతో, అంబరచారివైరి=రావణుఁడు, మానియై=పౌరుషము గలవాఁడై.

తా త్ప ర్య ము

మేఘమువలె గురియఁగా యముఁడు రావణాసురుని విశాలమైన ఱొమ్మును శక్తుల చేతను బాణములచేతను జీల్పఁగా బాధపడియుఁ బ్రయత్నముతో యుద్ధము చేయుచు బదులు జేయలేక పౌరుషమునకై యేడు రాత్రులు యుద్ధముచేసెను.

క. నానాప్రహరణనిహతుల, నానారీతులను నొచ్చి • నరభక్షకుఁడున్
హీనస్మృతియై విముఖుం డై నెఱిపోఁడఁగియు జయంబు•నందలియాశన్. ౮౮౩

అర్థములు. నానాప్రహరణ నిహతులన్=అనేకములైన యాయుధముల దెబ్బలచే, నరభక్షకుఁడు=మనుష్య భక్షకుఁడు, హీనస్మృతియై=తెలివితొలఁగినవాఁడై, విముఖుండై=మాఱుముఖము పెట్టినవాఁడై, నెఱిదొఱఁగియు = పరాక్రమము వదలియు.

తా త్ప ర్య ము

అనేకాయుధముల దెబ్బలచే ననేకవిధముల నొచ్చియు రావణుఁడుస్మృతి తప్పి మారుముఖము పెట్టి పరాక్రమము చెడినను జయమునందలి యాశచే.

ఉ. వెండియుఁ దాఁకె దండధరు • వీరవరేణ్యులు గెల్వఁ గోరి యు
ద్దండపరాక్రమంబునను • దాఱక మాఱుమొగంబు గాక దో
శ్చండత భండనం బిటులు • సల్పఁగ మింట మహర్షులున్ మరు
త్కాండము వచ్చి నిల్చెను వి•ధాతృఁడు మున్నుగఁ బోరు చూడగన్. ౮౮౪

అర్థములు. తాఱక=వెనుదీయక, దోశ్చండతన్ = భుజబలముయొక్క దీక్ష్ణతచే, భండనము=యుద్ధము, మరుత్+కాండము=దేవతాసమూహము.

తా త్ప ర్య ము

మరల యముని నెదిరించెను, వీరశ్రేష్ఠులైన యిరువురు జయముగోరినవారై యధికపరాక్రమమున వెనుదీయక మాఱుమొగము పెట్టక భుజబలాధిక్యముచే యుద్ధముచేయఁగా నాకాశమున బ్రహ్మను ముందుగా నుంచుకొని మహర్షులు దేవతల గుంపు యుద్ధము చూడ నిల్చిరి.

క. సమవర్తికి దశముఖునకు, సమరము వర్తిల్లె నపుడు • జగముల కెల్లన్
సమయుట లభియించెనొ నాఁ, దమిచరుఁ డవ్వేళ వజ్ర•ధరుదంభోళిన్. ౪౪౧

అర్థములు. సమవర్తికి=యమునకు.

తాత్పర్యము

యమునకు రావణునకు జగము లన్నియు నాశమై పోవుకాలము వచ్చినదా యన్నట్లు యుద్ధము జరిగెను. అప్పుడా రాక్షసుఁడు ఇంద్రుని వజ్రాయుధమును.

క. తలఁపించు చాపదండం, బలఘుధ్వను లీన శరచ•యంబులచే ద్యో
తలము నిరంతర మొనరిచి, యలుకన్ మృత్యువును నాలు•గంబకములచేన్.

అర్థములు. తలఁపించు=జ్ఞప్తికిఁ దెచ్చు, ద్యోతలము = ఆకాశప్రదేశము, నిరంతరము=ఎడములేనిది, అంబకములచేన్=బాణములచే

తాత్పర్యము

జ్ఞప్తికిఁదెచ్చు విల్లు గొప్ప ధ్వనులు గలిగించుచుండ బాణసమూహముచే నాకాశమున సందులేకుండునట్లు చేసి కోపమున మృత్యువును నాలుగు బాణముల చేతను

క. సూతుని శరసప్తకమునఁ, బ్రేతపతిన్ నూఱువేల•యిషువుల నేయన్
జాతరుషావేగసము,త్స్ఫీతుం డగు యముని వదన • వివరము వెంటన్. ౪౪౭

అర్థములు. శరసప్తకమునన్=ఏడు బాణములచేతను, ఇషువులన్ = బాణములచేతను, జాత=పుట్టిన, రుషావేగ=కోపాతిశయముచే, సముత్ + స్ఫీతుఁడు= మిక్కిలి ప్రకాశించువాఁడు, వదన వివరము=నోటిరంధ్రము.

తాత్పర్యము

సారథిని నేడు బాణముల చేతను యముని నూఱువేల బాణములచేతను వేయఁగా మిక్కిలి కోపముచే మండుచున్న యముని నోటివెంట.

క. జ్వాలామాలాభీల వి, శాలవిభావసుఁడు ధూమ•సహితుం డగుచున్
గాలుని నిశ్వాసముతోఁ, బోలం జనియించి వెడలె•భువనము వణఁకన్ ౪౪౩

అర్థములు. జ్వాలా మాలాభీల విభావసుఁడు=జ్వాలల వరుసలచే భయంకరుఁడైన యగ్నిహోత్రుఁడు, ధూమసహితుం డగుచున్ = పొగతోఁ గూడినవాఁడై, కాలుని=యముని, నిశ్వాసముతో=ఊపిరితో.

తాత్పర్యము

జ్వాలల వరుసలచే భయంకరమైన యగ్నిహోత్రుఁడు పొగతోఁ గూడినవాఁడై యముని యూపిరితోఁ బుట్టి ప్రపంచము వణఁక వెడలి వచ్చెను.

తే. ఆ మహాశ్చర్యమును గాంచి ♦ యమరదాన, వాళిసన్నిధి మృత్యువు ♦ కాల మధిక
హర్షమును రోషమును గూరె ♦ నపుడు క్రుద్ధ, తరము మృత్యువు భాషించు ♦ దండధరుని.

తా త్ప ర్య ము

ఆ మహాశ్చర్యమును జూచి దేవదానవుల యెదుట మృత్యువు కాలము సంతోషము రోషమును బొందెను. అప్పుడు మిగులఁ గోపించిన మృత్యువు యమునితో నిట్లనియె.

క. అంపుము నన్నిపు డీవు ని, లింపవిరోధిని వధింతు ? లీలగను స్వభా
వంపుదృఢశక్తి నాకిది, తెంపరి పాపాత్ముఁ డితఁడె ♦ దీకొను నిన్నున్. ౨౫

అర్థములు. నిలింపవిరోధిని=రాక్షసుని.

తా త్ప ర్య ము

నన్నుఁ బంపుము, ఈ రాక్షసుని నిపుడే సులువుగ చంపెదను. అది నాకు సహజశక్తి, సాహసికుఁడైన యీ పాపాత్ముఁడా నిన్నెదిరించువాఁడు.

సీ. హేమకశిపుఁడును ♦ ధూమకేతుండును, శంబర నముచి వి ♦ సంధిబలులు
శంబుఁడన్ దైత్యరా ♦ జన్యుండు బాణుండు, శాస్త్రసంవిదులు రా ♦ జర్షివరులు
దైత్యయక్షాహిగం ♦ ధర్వాప్సరోజనుల్, ఋషులును లోనగు ♦ నెల్లవారు
సద్రుమ సార్ణవా ♦ సగ్రావ సాపగా, వనిచక్ర మెల్ల సం ♦ వర్తవేళ

తే మఱి దురాసదవిక్రమ ♦ మహితులెల్ల, వారిపై నాదుచూపులు ♦ వ్రాలినంత
సమసిపోవరే యీనిశా ♦ చారి యెంత, పంపుమీ నన్ను దేవ! శు ♦ భంబుఁగూర్తు.

అర్థములు. శాస్త్రసంవిదులు=శాస్త్రము నెఱిఁగినవారు, సద్రుమ=చెట్లతో సార్ణవ=సముద్రములతో, సగ్రావ=కొండలతో, సాపగా=నదులతోఁ గూడిన, అవనిచక్రము=భూవలయము, సంవర్తవేళ=ప్రళయకాలమందు, దురాసదవిక్రమ మహితులు=జయింపరాని పరాక్రమము గల గొప్పవారు, నిశాచారి=రేద్రిమ్మరి, రాక్షసుఁడు.

తా త్ప ర్య ము

హిరణ్యకశిపుఁడు, ధూమకేతుఁడు, శంబరుఁడు, నముచి, విసంధి, బలి, శంభుఁడు(దంభుఁడని పాఠాంతరము) బాణుఁడు వేదజ్ఞులు రాజర్షిశ్రేష్ఠులు దైత్యులు యక్షులు గంధర్వులు అప్సరసలు ఋషులు మొదలగు వారందఱు చెట్లు సముద్రములు కొండలు నదులు గల భూచక్ర మంతయుఁ బ్రలయకాలమందు వీరుగాక తక్కిన మహాబలపరాక్రమములు గలవారుకూడ నా చూపులు తమపైఁ బడినంత మాత్రమున నాశమైపోరా? ఈరాక్షసుఁ డెంతమాత్రము? దేవా నన్నుఁబంపుము, నీకు మేలు చేసెదను.

క. ఎంతబలవంతుఁ డేనియు, నంతక ! నాదృష్టి సోఁక • నవనిని మనఁగా
నంతస్వతంత్రుఁ డె? ధర్మస్వాంతా! నను విడుము వీని•పాటుం గనుమీ. ౮౯౨

అర్థములు. ధర్మస్వాంతా=ధర్మబుద్ధి గలవాఁడా.

తాత్పర్యము

(అంతకా! ఎంత బలవంతుఁ డయినను నాదృష్టి సోఁకఁగా భూమియందు బ్రదుకఁగలఁడా! స్వామీ! నన్ను వదలుము. తర్వాత వాని పాటు చూచెదవుగాక.)

తే. దేవ! నాశక్తి గాదు స్వ•భావముగనె, గలిగె నాకట్టి బలము నా•కన్నుఁగవకుఁ
గాన వచ్చినవాఁ డొక•గడియ యైన, బ్రదుకజాలఁడు నిక్కంబు•శ్రాద్ధదేవ!

అర్థములు, శ్రాద్ధదేవ=యముఁడా.

తాత్పర్యము

(దేవా! నాశక్తిగాదు. నాకాబలము స్వభావముతోనే కలిగినది. నా కంటఁబడినవాఁడు గడియయైన బ్రదుకఁజాలఁడు. ఇది నిజము)

—• యముఁడు రావణునిపై యమదండము వైవఁ బూనుట •—

చ. అనవుడు ధర్మరాజు నిలు • మా వధియించెద వీనినంచుఁ బె
ల్లినుక నమోఘభీతికర • నిష్ఠురదండముఁ గేలఁ బూనె నా
తనికెలనన్ సమీరసఖ•దారుణముద్గర మాత్తరూప మై
దనరెను గాలపాశములు ద•ద్దయు నాల్కలు గ్రోయుచుండగన్. ౮౯౮

అర్థములు. అమోఘము=వ్యర్థము పోనిది, భీతికరము = భయంకరము, నిష్ఠురము=కఠినమైనది, కాలము రాకున్న మృత్యు వేమియుఁ జేయఁజాలదు. రావణుని కింకను కాల మనుకూలించి యున్నది కావున మృత్యువు వానినిజంపఁ జాలదని తలఁచి స్వతంత్రించి చంపశక్తిగల దండములు బ్రయోగింప నెంచెను. కెలనన్=పార్శ్వమందు, సమీరసఖ=అగ్నివలె, దారుణ=తీక్ష్ణమైన, ముద్గరము=రోఁకలివంటి యాయుధము, ఆత్తరూపము=ఆకారము పొందినదై, గ్రోయుచుండగన్=విషమముగాఁ జూఁచుచుండఁగా, అగ్నిజ్వాలలవలె, పాముకోరలవలె బుజువుగాఁగాక వంకరటింకరగాఁ జూచుట.

తాత్పర్యము

అని చెప్పఁగా నీవు నిలుము. వీనిని జంపెదనని మిగులఁ గోపించి వ్యర్థము పోనిదియు దిగులు పుట్టించునదియు కఠినమైనదియు నగు దండమును జేతికిఁ దీసికొనెను. అతని ప్రక్కన అగ్నివలె తీక్ష్ణమైన ముద్గరము స్వరూపము ధరించి నిలిచెను. కాలపాశములు పాములవలె నాలుకలు ఆడించుచుండెను.

తే. దర్శనముచేతఁ బ్రాణికదంబకంబు, ప్రాణము వెలార్చునది ప్రేతరాజు కేలఁ
బూని వెసఁ ద్రిప్పివైవంగఁ బూనినంతఁ, బలుక నేటికి దానిరూపంబురీతి.

అర్థములు. ప్రాణికదంబకంబు=ప్రాణి సమూహము, వెలార్చునది=వెడలఁ దీయునది.

తా త్ప ర్య ము

ప్రాణికోటులు దానిని జూచినంత మాత్రముననే భయపడి ప్రాణములు విడుచును. అట్టి స్వభావభయంకరత్వము గలది యిది యముఁడు చేతఁ దీసికొని ప్రయోగింపఁ బూనినపుడు దాని యాకారము గుఱించి యేమని చెప్పుదును?

క. జ్వాలలఁ బరివృతమై యవలీలగ రాక్షసునిఁ దునుములీలలతో నా
భీలమ్ముగ బలవంతుని, కేల మహాసాధనంబు కెరలం గనుచున్. ౨౯౬

అర్థములు. జ్వాలల పరివృతమై=శిఖలతోఁ జుట్టఁబడినదై, ఆభీలమ్ముగన్=భయంకరముగ, కెరలన్=విజృంభించి ప్రకాశింపఁగా.

తా త్ప ర్య ము

(మంటలతోఁ జుట్టఁబడి రాక్షసుని నవలీలగఁ జంపువైఖరితో భయంకరముగ యముని చేతియందు మహాసాధనము విజృంభించి ప్రకాశింపఁగాఁజూచుచు.)

క. అందఱు రణతలము న్విడి, చిందఱవందఱగఁ బాఱఁ జేడ్పడి మింటన్
బృందారకు లుద్యద్దండుం దరణిజుఁ గాంచి కలఁకనూల్కొని రెదలన్. ౨౯౭

అర్థములు. ఉద్యత్=ఎత్తఁబడిన, దండున్=దండము గలవాని, తరణిజున్=సూర్యపుత్రుని, యముని, నూల్కొనిరి=పొందిరి.

తా త్ప ర్య ము

(అందఱు యుద్ధభూమిని విడిచి చిందఱవందఱగఁ బాఱిపోవఁగా, నాకసమున దేవతలు దండమును నెత్తిన యమునిఁజూచి చేష్టలు దక్కి గుండెలు చెదిరినవారయిరి.)

— దండము వైవవల దని బ్రహ్మ యముని నివారించుట —

క. రావణునిమీఁద దండము, వైవఁగఁ దమకింప యముడు వారిజభవుఁ డా
వైవస్వతుముంగలఁ దానే విస విస వచ్చి నిలిచి యిట్లు వచించెన్. ౨౯౮

అర్థములు. తమకింపన్=త్వరపడఁగా.

తా త్ప ర్య ము

రావణుమీఁద దండము వేయ యముఁడు తొందరపడుచుండఁగా బ్రహ్మ తానే వచ్చి యమునిముందు నిలిచి యిట్లు చెప్పెను.

మ. శమనా! తాళుము తాళు, చంపకుము రక్షశ్శ్రేష్ఠునిన్ నీదు దం
డమునన్, నే వర మిచ్చినాఁడను నిశాటస్వామి చావుండఁ గా
న మదీయోక్తి నసత్యముం జలుప నౌనా నీకు? నెవ్వండు దే
వమనుష్యాదులఁ బొల్లు సేసినను మద్వాక్యంబు నయ్యాతఁడున్. ౪౫౯

అర్థములు. శమనా=ధర్మరాజా, నిశాటస్వామి=రాక్షసరాజు.

తాత్పర్యము

ధర్మరాజా! సహింపుము సహింపుము. రాక్షస శ్రేష్ఠుని నీదండముచేఁ జంపకుము. వాఁడు దేవతలచేఁ జావకుండునట్లు నేను వరమిచ్చినాను. నామాట నీవసత్యము చేయవచ్చునా? దేవతలందుఁగాని మనుష్యులందుఁగానీ యెవ్వఁడు నామాట నసత్యముగఁ జేయునో వాఁడు.

క. అనృతంబుగ ముజ్జగములఁ, బొనరించినవాఁడ యగును బుధసత్తమ కా
వున విడువకుమీ దండము, ననుఁ గల్లరిఁ జేయ నీ మనంబున లేదేన్. ౪౬౦

తాత్పర్యము

మూఁడులోకముల నసత్యము చేసినవాఁడేయగును. సత్యమునువదినశించును కావున నన్నసత్యవాదిని జేయ నీకు నిష్టము లేదేని దండమును వేయకుము.

చ. జయ మెదఁ గోరి కోపమువశంబున వైచితి వేని దండమున్
బ్రియుఁడను నప్రియుం డనెడి భేదము నెంచక లోకపాలికిన్
భయ మొదవించుచున్ దునుముఁ బ్రాణుల నెల్లను, నేన దాని దు
ర్జయము నమోఘమై వఱలఁ జల్పితి మృత్యుపురస్కృతంబుగన్. ౪౬౧

అర్థములు. మృత్యుపురస్కృతంబుగన్=మృత్యువు ముందుగాఁగలదిగా.

తాత్పర్యము

నీవు యుద్ధమందు జయముగోరి వీనిని జంపి కీర్తిపొందవలయునని కోరిక గలవాఁడవై యీ కఠినదండము వేసితివా యది వీఁడు ప్రియుడు వీఁడప్రియుఁడను భేదము నెంచక లోకుల కందఱకు భయము గలిగించుచు సమస్తజీవికోటులను జంపును. దానికట్టి యమోఘశక్తి మృత్యువుతోఁ గూడినదానిఁగా నేనేయిచ్చితిని

ఉ. నీ విపు డీ నిశాటుపయి నిష్ఠురదండము వైచితేనియున్
జావక వీఁడు మూర్తమును జాలఁడు ప్రాణముతోడ నుండఁగాఁ
జావక యుండెనేనియును జచ్చినయేని యసత్యమై చనున్
నావచనంబు రెంట శమనా! నను సత్యవచస్కుఁ జేయుమా. ౪౬౨

తా త్ప ర్య ము

నీ వీ యమోఘ దండమును రాక్షసునిమీఁద వేసితివా వీఁడు చావకయొక ముహూర్తమాత్రము కాలమైనను ప్రాణముతో నుండలేఁడు. వీఁడు చచ్చినను జావకుండినను రెంటను నామాట యసత్యమై పోవును. నన్ను సత్యవాదిని నీవు చేయుము.

క. విడువకుమీ దశముఖుపై, బెడిదపుదండం బటన్న ◊ విని ధర్ముఁడున్
విడుచుట మానితి దండము, నొడయండవు మాకు నీదుసూక్తు లెయాజ్ఞల్.

తా త్ప ర్య ము

రావణుమీఁద నీ వీ భయంకర దండము వేయకుము అని చెప్పఁగా ధర్ముఁడుఁ నేను దండము వేయను,నీమాటలే మాకు నాజ్ఞలు,నీయాజ్ఞ నేనే యుల్లంఘింతునా?

చ. వరములు గొంట వీఁ డిపు డవధ్యుఁ డటంటివి యుద్ధసీమ నో
సరసిజ సంభవా! నలుపఁ ◊ జాలుదు నెయ్యది నిల్చి? కాన నా
శరవరు దృష్టిలో నిలువ ◊ సమ్మతి లేదని సాశ్వసూతుఁడై
యదరముతోడ మాయ మయి ◊ యంతకుఁ డేగినఁ బంక్తికంఠుఁడున్. ౪౬౪

అర్థములు. ఆశరవరుదృష్టిలో = రాక్షసునకుఁ గానవచ్చిన నెదుట, సాశ్వసూతుఁడై = గుఱ్ఱములతోను ఆయుధములతోను తేరితోను గానరాక యముఁడు పోయెను. రావణుఁడును—

దేవతలం దిది సమయము-ఒకరు చెప్పినమాటను మఱియొకరు వ్యర్థము చేయ నొల్లరు.

తా త్ప ర్య ము

నీవు వీనికి వరము లిచ్చితివి. కావున వీనిని జంపవల దంటివి. బ్రహ్మదేవా! యిఁక నేనిచ్చట నిల్చి చేయఁదగిన పని యేమున్నది? పనిలేక రావణుకంటెకెదుట నిలువ నిష్టములేదు అని చెప్పి యముఁడు గుఱ్ఱములతోను ఆయుధములతోను తేరితోడను నదృశ్యుఁడయ్యెను. ఇట్లు యముఁడు పోఁగా రావణుఁడు.

క. గెలిచితి యముని నటంచుం, బలుకుచు బీరంబు తనవిమానముపైఁ బే
రెలమిని నారోహించెను, నలకాలునిపురము విడిచియరిగెను స్వేచ్ఛన్. ౪౬౫

తా త్ప ర్య ము

(యముని గెలిచితినని బీరములు పలుకుచు మిగుల సంతసమునఁ దన విమానము మీఁద నెక్కి యమపట్టనమును విడిచి స్వేచ్ఛగాఁ బోయెను.)

క. సమవర్తియు హృష్టుండై, యమరజ్యేష్ఠానుమతముగ ◊ నరిగెం దివికిన్
సుమనోముని నారదుతో, సమరవిధం బెంచికొనుచుం స్వాంతమునందున్ ౪౬౬

అర్థములు. సమవర్తియు=యముఁడును, హృష్టుండై = సంతోషించినవాఁడై, అమరజ్యేష్ఠాన్వితముగన్=బ్రహ్మతోడ, సుమనోముని = దేవముని నారదుతో, స్వాంతమునందుఁన్=యుద్ధమందు.

తాత్పర్యము

(యముఁడును సంతోషించి బ్రహ్మతో దేవర్షి నారదునితో యుద్ధమును గూర్చి మనసులో యోజించుకొనుచు స్వర్గమునకుఁ బోయెను.

౨౩వ సర్గము

—♦ రావణుఁడు నివాతకవచులతో సంధి సేసికొనుట ♦—

సీ. దశకంఠుఁ డనిలోన ♦ ధర్మరాజును గెల్చి, తన సహాయులఁ జూడఁ♦దడయకేగ
సాయకసంఘాత♦జర్జరీకృతదేహు, రక్తసిక్తాంగుని ♦ రాక్షసేంద్రు
విస్మయపరు లయి ♦ వీక్షించ జయ జయ, వాక్కులఁ బొగడిరి♦వారలెల్ల
మారీచుఁ డాదిగా ♦ వారల నందర, నలరించి పుష్పకం ♦ బెలసి యసుర
తే. యురగదైత్యగణాధ్యుష్ట ♦ వరుణరక్షి, తాబ్ధి వాసుకిపాలిత♦మైనభోగ
వతిని గనుఁగొని నాగుల♦భంగపఱచిఁ మణిమయాఖ్యపురిం జేరె♦రణముఁగోరి.

అర్థములు. తనసహాయులఁజూడఁ దడయకేగ ననుటచే మంత్రులు లోనగువారందఱు భయపడి దూరముగాఁ దొలఁగిపోయి రనియు, రావణుఁ డొక్కఁడే నిలిచి యుద్ధము చేసెననియు గ్రాహ్యము, సాయక సంఘాత = బాణసమూహములచే, జర్జరీకృతదేహున్=శిథిలముగఁ జేయఁబడిన దేహము గలవానిని, రక్తసిక్తాంగుని=నెత్తుటఁ దడిసినవానిని, ఉరగ దైత్యగణాధ్యుష్ట=ఉరగులచేతను దైత్యులచేతను గూడినదై, వరుణ రక్షిత=వరుణునిచే రక్షింపఁ బడినదైన, అబ్ధిన్=సముద్రమందు.

తాత్పర్యము

రావణుఁడు యుద్ధమందు ధర్మరాజును గెల్చి తన సహాయు లున్నచోటికి వారిని జూడఁబోగా బాణసమూహముల దెబ్బలచే శిథిలమైనదియు నెత్తుట దడిసినదియు నగు దేహముగల రాక్షసరాజును జూచి యాశ్చర్యపడి జయజయ యని మారీచుఁడు లోనగువారు పొగడిరి. వారి నందఱ సంతోషపఱిచి పుష్పక మెక్కి రావణుఁడు నాగులు దైత్యులు గలదై వరుణునిచే రక్షింపఁబడు సముద్రమందుఁ గల భోగవతీపురమునకుఁ బోయి వాసుకి మొదలగు నాగుల జయించి యుద్ధముఁ గోరి మణిమయ మను పురముఁ జేరెను.

ఆ. పంక్తికంఠుఁ డనికి♦వచ్చుట యాలించి, ప్రాప్తవరులు నౌని♦వాతకవచు
లనెడిదైత్యవర్యు♦లాహవకాంక్షను, వెడలి తాఁకి రోలిఁ♦గడిమి మెఱసి ౯౬౹౭

అర్థములు. ప్రాప్తవరులు=బ్రహ్మచే వరము పొందినవారు.

తాత్పర్యము

(రావణుఁడు యుద్ధమునకు వచ్చుట విని బ్రహ్మచే వరముపొందిన నివాత కవచు లనెడి రాక్షసులు సమరముచేయవలె ననెడి కోరికతో బయలుదేఱి పరాక్రమముతోఁ దాఁకిరి.)

క. దైతేయులకును రక్షో, వ్రాతంబున కయ్యె భీక♦రం బగు నభిసం
పాతంబు శూల శర పరి,ఘాతనపట్టసకుఠార♦కరవాలములన్. ౪౬౯

అర్థములు. అభిసంపాతంబు=యుద్ధము.

తాత్పర్యము

(దైత్యులగు నివాత కవచులకును రాక్షసులకును శూలములు, బాణములు, పరిఘములు పట్టసము కుఠారములతో భయంకరమగు యుద్ధముజరిగెను.)

క. ఒండొరులను భేదించుచు, భండన మొక యేఁడు సాగ ♦ వారలలోనన్
బెండువడద యేపక్షము, గండున విజయంబు నెదియుఁ♦గానద యంతన్. ౪౭౦

అర్థములు. బెండువడద=నిస్సారముకాలేదు, గండునన్=బలమునందు.

తాత్పర్యము

ఒకరినొకరు కొట్టుచు నొకసంవత్సరము రాక్షసులు నివాతకవచులుయుద్ధము చేసిరి. కాని వారిలో బల ముడిగి ఓడినవాఁడు. గెలిచినవాఁడు లేఁడు.

చ. ద్రుతగతి దేవయానమునఁ ♦ దోయజసంభవుఁ డేగుదెంచి యా
దితిజులఁ బోరునిల్పఁగ వి ♦ ధించి వచించెను దైత్యులార! నా
మతిఁ జనుఁ డీగు రావణుఁడు ♦ మద్వరలాభముఁ జేసి దేవతా
తతులకు దానవాళులకుఁ ♦ దథ్య మజయ్యుఁడు మీ విధంబునన్. ౪౭౧

అర్థములు. ద్రుతగతిన్=శీఘ్రగమనమున, దేవయానమునన్=విమానము మీఁద, తోయజసంభవుఁడు=బ్రహ్మ, దితిజుల=నివాతకవచుల.

తాత్పర్యము

బ్రహ్మదేవుఁడు శీఘ్రముగ విమానమునఁ గూర్చుండివచ్చి నివాతకవచులతో నిట్లనియె. దైత్యులారా! నేను జెప్పిన ప్రకారము పొండు. రావణుఁడు మీవలెనే నావలన వరములు పొందినవాఁడగుటచే దేవతలకు దానవులకు నజయ్యుఁడు. వానిని మీరు జయింపలేరు. వాఁడు మిమ్ము జయింపలేఁడు. కలహమే మీకిష్టమయ్యెనా కలకాల మిట్లు కలహించుచుండవలయును.

క. కావున మీలో మీకే,లా వలవనిపోరు మీర♦లందఱు నోఁమన్
జేవ నెసంగుఁడు నెయ్యుర, వేన స్తువులైన భోజ్య ♦ మితరేతరమున్. ౪౭౨

అర్థములు. ఒరిమన్=ఒద్దికతో, సెయ్యర=మిత్రులయొక్క, ఇతరేతరమున్=ఒకరిది మఱొకరు, అన్యోన్యము.

తాత్పర్యము

(కావున మీలో మీకుఁ బనిలేని యుద్ధమెందుకు? మీరందఱు నొద్దికతోఁ గలసిమెలసి చేనగలిగియుండుఁడు. మిత్రులయొక్క వస్తువు లొకరిది మఱొక రనుభవింపఁ దగియుండును.)

అ. అట్టిఫలము గలుగు • నైకమత్యంబున, ననుచు నేగ దశాము • ఖాసురుండు
వహ్ని సాక్షికముగ • వారితో స్నేహంబు, సలిపి ప్రీతుఁడగుచు • సంతసమున. ౪౭౩

తాత్పర్యము

(ఐకమత్యమువలన నట్టి ఫలముగలుగును. అనిచెప్పి పోవఁగా, రావణుఁడు వారితో నగ్నిసాక్షికముగా స్నేహముచేసి ప్రీతిగలిగి సంతోషముతో.)

చ. తనపురియందుఁబోలె నమిత • ప్రియసౌఖ్యము లాపురంబునం
దనివి సనంగ నొందుచును • దా నొకయేఁడు వసించి వారిచే
దనుజులమాయలం దొకశ • తంబును నేరిచి కంధిరాజుప
ట్టనము రసాతలంబున దృఢం బగు యత్నముతోడ రోయుచున్. ౪౭౪

అర్థములు. తనివి=తృప్తి, కంధిరాజు=వరుణుని, రసాతలంబునన్=పాతాళమందు, మాయలు=వచించు విద్యలు.

తాత్పర్యము

(తన పట్టనమునందువలె నాపురమున నమితమైన యిష్టసౌఖ్యములు తనివితీఱ ననుభవించుచు, నొకసంవత్సరముండి, దనుజుల మాయలలో నొకనూఱు నేర్చుకొని వరుణుని పట్టనమును బాతాళమునందుఁ బనిపూని వెదకుచు)

—• రావణుఁడు కాలకేయుల జయించుట •—

సీ. కాలకేయగణంబు • లేలెడు నశ్మన, గరమును గనుగొని • కలహమునకు
వారలఁ బిల్చి దు • ర్వారబలాఢ్యుల, వధియించెఁ బెకుఁగూర • బలము పేర్మి
శూర్పణఖాభర్త • శూరుని మఱఁదిని, దనవారి గ్రుమ్మంగెడి • దనుజవర్యు
బలియు విద్యుజ్జిహ్వుఁ • బటుశక్తిఁ దరవారి, ఖండించి శీర్షమా • క్షణమునంద
తే. నాల్గునూఱుల దైత్యుల • నామడంచి, జయముఁ జేకొని పాండుర • జలధరాభ
మగుచుఁ గైలాసశైలంబు • నగెడిదానిఁ బూర్ణచంద్రప్రభాయుక్తిఁ • బోలుచుదాని

అర్థములు. తరవారిన్=కత్తిచే, పాండుర=తెల్లనై, జలధరాభము = మేఘముతో సమానము, పూర్ణచంద్రప్రభాయుక్తిన్=నిండుచంద్రుని కాంతితో.

తా త్ప ర్య ము

కాలకేయు లనువారు పాలించు నశ్మనగరమును జూచి వారిని యుద్ధమునకు బిలిచి మహాబలవంతులగు వారిని ననేకుల బలాతిశయమునఁ జంపెను. శూర్పణఖ భర్తయగు విద్యుజ్జిహ్వుఁడు (తన మఱఁది) తన వారిని మ్రింగుచుండఁగాఁ గత్తిచే వానితోఁ నఱికి యాక్షణమునందే నాలుగునూర్ల దైత్యులను జంపెను. ఇట్లు జయించి తెల్లని మేఘమువలెఁ బూర్ణచంద్రకాంతితోఁ బొలుచును కైలాస పర్వతమువలె నున్న దానిని.

—౦ రావణుఁడు వరుణనగరంబుపై బోవుట ౦—

తే. వరుణపట్టనముం గాంచి౦పాలధారఁ, గార్చు సురభిని నయ్యెడఁ౦గాంచెనసుర
వర్యుఁ డా యావ తనపాల౦వఱలఁ జేసె,రామ! యుదధిని క్షీరోద౦నామకంబు

అర్థములు. సురభి=కామధేనువును, క్షీరోదనామకంబు = పాలసముద్రమను పేరుగలదానిని.

తా త్ప ర్య ము

(వరుణుని పట్టణమును జూచి యందుఁ బాలధారను గార్చుచున్న కామ ధేనువును రావణుఁడు జూచెను. ఆయావే తన పాలచేత సముద్రమును బాల సముద్రమను బేరుగలదానిఁగాఁ జేసెను.)

ఆ. అందు వృషభేంద్రునంబయు౦హారిశీత, కరుని యుత్పత్తిహేతువై౦కాలుదాని
నురువుద్రావియ జీవించు౦నుత్తమర్షి,వితతులకు జీవగఱ్ఱయై౦ వెలయుదాని. ౪౭౭

అర్థములు. వృషభేంద్రు=శివుని వాహనమైన నందీశ్వరునకు, అంబ=కన్న తల్లి, హారిశీతకరుని=మనోహరమైన చల్లని కిరణములు గల చంద్రుని, జీవగఱ్ఱ= జీవనౌషధము, బ్రతికించు మూలిక, జీవగఱ్ఱ, ఇది యనింద్యగ్రామ్యము, ఆంధ్ర మున సమాసములందు సంస్కృతపదము మొదటిదిగాను రెండవది యాంధ్ర శబ్దముగానుండు సమాసములు లేవు. దినవెచ్చము, జీవగఱ్ఱ ప్రాణగొడ్డము ఇవి ప్రయోగములందుఁ గానఁబడుచున్నవి. ఇవి యనింద్య గ్రామ్యము లని చెప్పఁ బడెను. ఇట్టివి 'అనేకమంది' లోనైనవి కల్పింపరాదు.

తా త్ప ర్య ము

(దానియందు, శివునివాహనమైన నందీశ్వరునకు గన్నతల్లియు, మనోహర మైన చల్లని కిరణములుగల చంద్రుని యుత్పత్తికిఁ గారణమైనదానిని, నురువు ద్రావియే జీవించు ఋషిశ్రేష్ఠులకు జీవనౌషధమై ప్రకాశించుదానిని)

తే. దేవతాళికి సుధ నిత్య౦దేవతలకు, స్వధయు నొసఁగెడిదానిని ౦ జనములెల్ల
సురభి యని పిల్చుదానిని ౦ బరమచిత్ర,మైనదానిని గని పల౦లాశనుండు. ౪౭౮

తాత్పర్యము

దేవతల యాహారమగు సుధను (హవ్యము) పితృదేవతల కాధారమైన స్వధ (కవ్యము) నొసఁగెడిదానిని (అవుపాలే రెండువిధముల నుపయోగింపఁబడును) లోకులు సురభియని పిలుచుదానిని మిగుల నాశ్చర్యకరమైన దానిని రాక్షసుఁడు-మనుష్యులందిను రాక్షసులుకూడ నావులను గౌరవింతురు.

చ. వలగొని మ్రొక్కి యేగి బల ♦ వర్గముచే బహుధాసురక్షితం
బలఘుశరద్ఘనాభము భ ♦ యంకరమున్ జలపూరకీర్ణమున్
లలితము నిత్యహృష్టము జ ♦ లప్రభుగేహవరంబుఁ జూచి కా
వలిభటులన్ వధించి బల ♦ వర్గముచేతను దాడితాంగుఁడై. ౪౭౯

అర్థములు. వలగొని=మ్రొక్కి, ప్రదక్షిణముచేసి నమస్కరించి, బహుధా సురక్షితంబు=అనేకవిధముల రక్షింపఁబడునది, అలఘు=గొప్పదగు, శరత్+ఘనాభము=గొప్ప శరత్కాల మేఘముతో సమానమైనది, జలపూర కీర్ణమున్=నీటి ప్రవాహముచే గప్పఁబడినది, లలితము = అందమైనది, నిత్యహృష్టము= సర్వదా సంతోషముతోఁ గూడినది, జలప్రభు=వరుణుని, గేహవరంబున్= ఉత్తమ గృహమును, బలవర్గముచేతను=సేనా సమూహముచే, తాడితాంగుఁడై= కొట్టఁబడిన దేహముగలవాఁడై.

తాత్పర్యము

ప్రదక్షిణ నమస్కారములు చేసి పోయి సేనా సమూహముచే ననేకవిధముల గాపాడఁబడుచు గొప్పశరత్కాల మేఘముతో సరిపోలి భయంకరమై నీటి ప్రవాహముచేఁ జుట్టఁబడి మనోహరమై నిత్యసంతోషకారణమై వరుణునియుత్తమ గృహముఁ జూచి కావలిభటుల వధించి వారిచేఁ గొట్టఁబడి.

ఉ. యోధులతోడ నిట్టులను ♦ యుద్ధముసేయఁగఁ గోరి వచ్చె దు
స్సాధపరాక్రముండు సుర ♦ శాత్రవుఁ డౌ దశకంఠుఁ డంచు మీ
రేధితవేగ మేగి వచి ♦ యింపుఁడు తేనికిఁ బోర సాహసో
త్సేధము లేద యేనియును ♦ జేతులుమోడ్చి జితోస్మి యంచనన్. ౪౮౦

అర్థములు. దుస్సాధపరాక్రముండు=సాధింపరాని పరాక్రమము గలవాఁడు సురశాత్రవుఁడు=దేవవిరోధి, ఏధిత=వృద్ధియైన, వేగముగ = సాహసోత్సేధము= మిగుల సాహసము, జితోస్మి=ఓడితిని.

తాత్పర్యము

యుద్ధము చేయువారితో నిట్లనియెను. సాధింపరాని పరాక్రమముగలరావణాసురుఁడు యుద్ధము చేయఁగోరి వచ్చియున్నాఁడని వేగమువఁబోయి మీరాజునకుఁ దెలుపుఁడు. యుద్ధముచేయఁ దెంపులేదేని యోడితినని చెప్పినఁ జాలును.

—* వరుణతనయులు రావణునితోఁ బోరి యోడిపోవుట *—

క. చనియెద నని వచియింపుం, డని రావణుఁ డాడుచుండ ♦ నాలో గినుకన్
వననిధినాయకుమనుమలు, తనయులు గోపుష్కరాఖ్య♦దళపతియుతులై. ౪౮౧

అర్థములు. వననిధినాయకు మనుమలు=వరుణుని మనుమలు, గోపుష్కరాఖ్య=గోపుష్కరులను పేరుగల, దళపతి = సేనానాయకులతోడ, యుతులై= కూడికొనినవారై, గోపుష్కరులు, వీరిరువురు సేనానాయకు లని కొందఱ యభిప్రాయము. గో అనువాఁడు సేనానాయకుఁడనియు, పుష్కరుఁడనువాఁడు వరుణుని పెద్దకొడుకనియు గొందఱ యభిప్రాయము. భారతము ఉద్యోగపర్వమందు మాతలి వరాన్వేషణ ఘట్టంబున "ఏషోऽస్య పుత్రోऽభిమతః పుష్కరః పుష్కరేక్షణః, రూపవాన్ దర్శనీయశ్చ సోమపుత్ర్యా వృతః పతిః! జ్యోత్స్నాకాళీతి యాం ప్రాహు ర్ద్వితీయాం రూపతః శ్రియమ్॥

తా త్ప ర్య ము

పోయెదనని చెప్పుఁడని రావణుఁడు చెప్పుచుండ నంతలో వరుణుని కొడుకులు మనుమలు గోపుష్కరుఁ డను సేనానాయకులతోడఁ గూడినవారై.

చ. బలధృతి విక్రమాన్వితులు ♦ వారి యనీకిను లెల్లఁ గొల్వఁగాఁ
జలమునఁ గామగంబు లగు ♦ స్యందనపాళుల నెక్కి పోరికిన్
వెలువడివచ్చి రంత భృశ ♦ భీతిదసంఖ్యము చెల్లె రెండువాఁ
గులభటకోటి కం దసుర ♦ కుంజరసాధనమర్దితంబులై. ౪౮౨

అర్థములు. అనీకినులు=సేనలు, కామగములు=కోరినట్లు పోఁగలవి, స్యందనపాళులన్=తేర్లసమూహములను, భృశభీతిద=మిగుల భయంకరమైన సంఖ్యము= యుద్ధము, అసురకుంజర=రాక్షసశ్రేష్ఠుఁడైన రావణుని, సాధన=ఆయుధములచే, మర్దితంబులై =కొట్టఁబడినవై.

తా త్ప ర్య ము

బలము ధైర్యము పరాక్రమముతోఁ గూడినవారు వారి సేనలనెల్ల దీసికొని చలమునఁ గోరినట్లు పోఁగల రథములనెక్కి యుద్ధమునకు బయలుదేఱివచ్చిరి అంత రెండు పక్షముల వారికి మిగుల భయంకరమైన యుద్ధము చెల్లెను. అందు రావణునాయుధములచేఁ గొట్టఁబడి

ఉ. వారుణసైన్యముల్ చెడిన ♦ వారుణు లాత్మచమూవిధంబుఁ గ్రూ
రారియుఁ బుష్పకంబున న ♦ భోంతరవీథిని నుంటఁ గాంచి దు
ర్వారరయోత్థితంబు లగు ♦ భాస్వరభీమశతాంగపాళితో
వీకలు మింటికై యెగసి ♦ వ్రేసిరి రావణు నారసంబులన్. ౪౮౩

అర్థములు. వారుణ=వరుణ సంబంధములైన, వారుణులు=వరుణుకొడుకులు ఆత్మచమూవిధంబు=తనసేనయుండు విధము నభోంతరవీథిని=ఆకాశమార్గమున, దుర్వార=వారింపరాని, రయోత్థితంబులు=వేగముచే నెగసినవి. భాస్వర=ప్రకాశించు, భీమ=భయంకరమైన, శతాంగపాళితో = రథసమూహములతో, నారసంబులన్=బాణములచే.

తాత్పర్యము

వరుణుని కొడుకులు తమ సేనయున్న విధమును క్రూరశత్రువు ఆకాశమున పుష్పకముననుండి యుద్ధము సేయుటయుఁ జూచి మిగుల వేగముచే నెగసిన తేరులందుండ యాకాశమునకు నెగసి బాణములచే రావణు నేసిరి.

క. పావకసన్నిభశరముల, రావణు విముఖునిఁగఁ జేసి ♦ రంజలి వివిధా
 రావంబుల నించిన తమ భూవిభుదుస్థితియు వరుణ♦పుత్రులయుదుటున్. ౮౮౮

అర్థములు. పావకసన్నిభశరములన్=అగ్నిసమానములైన బాణములచే, విముఖునిఁగన్=యుద్ధమునుండి మరలిపోయిన వానిఁగా, రంజలి = సంతోషించి, వివిధారావంబులన్=పలువిధముల ధ్వనులను, ఉదుటున్=గర్వము.

తాత్పర్యము

అగ్నితో సమానములైన బాణములచేఁ గొట్టి సంతోషించి రావణుని యుద్ధమునుండి మరలినవానిఁ జేసి నానావిధములఁ గేకలు వేయఁగాఁ దమరాజు నీచస్థితియు వరుణుని కొడుకుల గర్వము.

చ. కనుచు మహోదరుండు రణ♦కాంక్షను మృత్యుభయంబు వీడి చ
 య్యన గదఁ గేలఁ బూని గొదు♦రై చనివారల ఘోటకాళి స్యం
 దనముల నేలఁ గూల్చినను ♦ దద్వరుణాత్మజు లుర్విఁ గూల స్యం
 దనరహితారులం గని ము♦దంబున నార్భటి నించె నాతఁడున్. ౮౮౯

అర్థములు. ఘోటకాళిన్=గుఱ్ఱముల వరుసలను, స్యందనములన్=తేరులను, స్యందనరహితారులన్=రథములులేని శత్రువులను.

తాత్పర్యము

చూచి మహోదరుఁడు యుద్ధమందలి కోరికచే చత్తునేమో యను భయము వదలి శీఘ్రముగ గద చేతఁ దీసికొని వారి గుఱ్ఱముల నెల్ల వరుసగఁ జంపి రథముల విఱుగఁదన్ని నేలఁ గూలుపఁగా ఆవరుణుకొడుకులు నేలగూలగా రథములు లేని శత్రువులఁ జూచి మహోదరుఁడు సింహనాదము చేసెను,

క. హారతురగస్యందనులై, క్షితి దొరఁగియు వరుణసుతులు ♦ స్వీయమహిమచే
 వెత గూర కెగసి మింటికిఁ, గృతహస్తు లధిజ్యచాప♦భృతిభీషణులై. ౮౮౯

అర్థములు. హత తురగస్యందనులై=కొట్టఁ బడిన గుఱ్ఱములు తేరులు గలవారై, వెతగూరక=బాధపడ, కృతహస్తులు = చక్కఁగా గుఱికొట్టఁ గల వారు, అధిజ్య=ఎక్కుపెట్టఁ బడిన, చాప=విండ్లయొక్క, భృతి=భరించుటచే, భీషణులై=భయంకరులై.

తాత్పర్యము

వరుణసుతులు రథములు గుఱ్ఱములు నేలఁ బడుటచే వారును నేలఁబడియు తమ మహిమచే గాసిలేక యాకాశమున కెగసి యా గుఱికాండ్రు ఎక్కుపెట్టఁ బడిన విండ్లతో భయంకరులై.

చ. ఉరుతరబాణవృష్టిని మహోదరు దారితగాత్రుఁ జేసి భా
స్వరపరమాయుధంబులను శైలము నబ్దము గప్పురీతి నా
శరపతిఁ గప్ప రావణుఁడు జాజ్వలదుగ్రలయాగ్నితుల్యుఁడై
శరముల వారిమర్మములఁ జక్కడిచెన్ నిపుణత్వమేర్పడన్. ౪౮౭

అర్థములు. ఉరుతరబాణవృష్టిని=మిగుల గొప్పదగు బాణవర్షముచేత, దారితగాత్రున్=చీల్పఁబడిన దేహముగలవానిని, అబ్దము=మేఘము, ఆశరపతిన్=రావణుని, జాజ్వలత్=మండుచున్న, ఉగ్ర=భయంకర, లయాగ్ని=ప్రలయకాల వహ్నికి, తుల్యుఁడై=సమానుఁడై. చక్కడిచెన్=కొట్టెను, నఱికెను.

తాత్పర్యము.

మిగుల గొప్పదగు బాణవర్షముచే మహోదరుని దేహముఁ జీల్చిప్రకాశించు గొప్ప యాయుధములచేఁ గొండను మబ్బుకప్పినట్లు రావణునిఁ గప్పగా వాఁడును మండుచున్న ప్రలయవహ్నికి సమానుఁడై వాఁడి బాణములచే వారి యాయువు పట్టులపై నేర్పుతోఁ గొట్టెను.

చ. ముసలవిచిత్రభల్లశత ముల్ శితతోమరశక్తికుంతప
ట్టిసములు భీషణంబులు పటిష్ఠము లైన శతఘ్నిసంతతుల్
కసగున నొక్కరీతి నవి కారిత దొప్పలు దోర లేయఁగా
నసలున షష్టిహాయన గజావళి మున్గినరీతి వారలున్. ౪౮౮

అర్థములు. భల్లశతముల్=అనేకబాణములు, భీషణంబులు = భయంకరములు, పటిష్ఠములు=దృఢములైనవి, కసరున=కోపమున, అవికారిత = వికారము లేక, మార్పు లేక, దొప్పలు దోరలు=కుప్పలు కుప్పలు, అసలున=బురదయందు, షష్టిహాయన=అఱువదియేండ్లుగల, గజావళి=ఏనుఁగుల గుంపు.

తాత్పర్యము

రోఁకండ్లు, నానావిధములైన యనేక బాణములు, పదునుగల తోమరములు శక్తులు, కుంతములు, పట్టిసములు, భయంకరములు దృఢములు నగు శతఘ్నులు

కోపముచే నొక్క విధముగ మార్పులేక కుప్పలుకుప్పలుగా వేయఁగా బురదలో నలువదియేండ్ల యేనుఁగులవలె మునిఁగిరి.

చ. ఇలఁ బడి లేవ లేక తపి ♦ యింపఁగ వారలఁ జూచి రావణుం
డెలమి మహాంబుదం బనఁగ ♦ నేర్చి ధ్వనించి యనేకసాధనం
బుల దళితాంగులం జలుపఁ ♦ బోరుదొరంగి స్వకీయు లెత్తికొం
చలఘుగతిం జనంగ నిల ♦ యాళికి, వారలతో దశాస్యుఁడున్. ౪౯

అర్థములు. అలఘుగతిన్=వేగముగ, నిలయాళికిన్=ఇండ్లకు.

తాత్పర్యము

నేలఁబడి లేవలేక బాధపడుచుండఁగా వారలఁ జూచి రావణుఁడు సంతోషించి పెద్దమేఘ ముర్మినట్లు ధ్వనించి నానాసాధనములవారి దేహముల జీలుపఁగా వారు యుద్ధము విడిచి తమవా రెత్తుకొని వేగముగ వారి వారి యిండ్ల కెత్తుకొని పోఁగా వారితో రావణుఁ డిట్లనెను.

క. నారాక ప్రచేతసునకు, మీ రెఱిఁగింపుఁడ యనం ద ♦ మీచరవిభుతో
వారుణుఁడైన ప్రభాసుం, డో రాజా! లేఁడు వీట ♦ నుదధీశుండున్. ౫౦

అర్థములు. ప్రచేతసునకు=వరుణునకు, తమీచరవిభుతో = కేద్రిమ్మరి రాజుతో, రావణుతో, ఉదధీశుఁడు=వరుణుఁడు, ప్రభాసునకు ప్రహాసుఁడనియు రూపాంతరము కానవచ్చెడిని.

తాత్పర్యము

వరుణునకు నేను వచ్చినవార్త యెఱింగింపుఁడు అనఁగా రావణునితో ప్రభాసుం డను వరుణుని మంత్రి, రాజా! వరుణుఁ డూర లేఁడు.

తే. ధాతృలోకంబునందు గాం♦ధర్వ మొలయ, నాలకింపఁగ నరగినాఁ♦డయ్యపాశి
రాజు లేనప్పు డీ వృథా♦శ్రమము తగునె?, జితులు నీచేత నాతని♦సుతులువీరు.

అర్థములు. ధాతృలోకంబునందున్ = బ్రహ్మలోకమందు, గాంధర్వము= సంగీతము వినుటకు, పాశి=వరుణుఁడు, జితులు=జయింపఁబడినవారు, గాంధర్వ మాలకింపఁగ=గీతములు వినఁగ, కొందఱు తాము పాడలేకున్నను చక్కఁగా నెవరైనఁ బాడిన విని సంతోషించుటకై పాడెడివారి యొద్దకుఁ బోవుచుందురు. వరుణుఁడు దేవుఁ డయ్యెనే, ఆయనకుఁ బాడరాదా యనిన నాయనకుఁ కంఠము సరిగాలేదు. బొంగురుగొంతువాఁడు. 'కింతేన కంఠం వినా' యన్నట్లు కంఠము సుస్వరము గాదేని యాపాటయేల? వరుణుఁడు విస్వరుఁడని "అపధ్మాతం వరుణస్య వరుణస్యతు విస్వరః" అని ఛాందోగ్యోపనిషద్భాష్యమందుఁ గలదు-నీళ్ళకుక్కవగాఁ

గ్రాగువారికి గొంతురాపు గలదు. అట్టుండ నెప్పుడు నీళ్ళలో నేనానువానికి గొంతు సుస్వరము గలదెట్లగు నని యుక్తియుక్తముగ గ్రహింపనగు ॥౮॥

తా త్ప ర్య ము

(వరుణుఁ డిప్పు డిచట లేఁడు బ్రహ్మలోకమందు సంగీతము వినుటకుఁబోయి యున్నాఁడు. రాజులేనప్పు డీ వ్యర్థమైన శ్రమ మెందుకు? ఆయన కొడుకులు నీచే జయింపఁబడినవారు.)

చ. అనవుడు గెల్చె రావణుఁ డంటంచును జాటఁగఁబంచి హృష్టుఁడై
ఘనగళనాదముల్ నిగిచి ♦ క్రచ్ఛఱఁ దత్పురి వీడి తాను వ
చ్చినసరణిన్ విమానమున ♦ శీఘ్రము లంకకుఁ బోవుచుండెఁ జు
ట్టును సచివాళిగొల్చుచుఁ గండుంగడుఁ బ్రస్తుతి సల్పు చుండఁగన్. ౪౯ ౨

అర్థములు. ఘనగళనాదముల్=పెద్దకంఠధ్వనులు, క్రచ్ఛఱన్=త్వరగా, తానువచ్చిన సరణిన్=అంతయు జలమయమై వేఱుత్రోవ లేకుండుట చేతను ప్రయోజనానంతరము లేకుండుటచేతను పోయిన త్రోవనే వ్యర్థముగమరలి వచ్చె నని సూచితము.

తా త్ప ర్య ము

(అని చెప్పఁగా రావణుఁడు గెలిచినాఁడని చాటించి సంతసించి బిగ్గఱగా నఱచుచు వెంటనే యావరుణుని పత్తనము వదలి, తాను వచ్చినదారిని విమానము మీఁద నెక్కి చుట్టు మంత్రులు గొలచి పొగడుచుండ శీఘ్రముగా లంకకుఁ బోవుచుండెను.)

౨౪వ సర్గము

—* రావణుఁడు నానాస్త్రీలఁ జెరబట్టుట *—

చ. చనుచును రావణుండు బల ♦ సంపద పొంపిరి పోవుచుండఁ ద్రో
వ్వనఁ దనమార్గమందు నృప ♦ పుష్కరనేత్రల మౌనికన్యలన్
దనుజకులాంగనామణుల ♦ దైవతకాంతల వీరు వారటం
చన కగపడ్డసుందరుల ♦ యౌవతముం గులకన్యకాతతిన్. ౪౯ ౩

అర్థములు. నృపపుష్కరనేత్రలన్=రాజస్త్రీలను, దనుజకులాంగనామణులన్=దానవ కుటుంబినులను, దైవతకాంతలన్=దేవతా స్త్రీలను, యౌవతమున్=యువతుల సమూహమును, యౌవతమంపంతు స్త్రీ యువతి, కులకన్యకాతతిన్ గొప్పకులములఁ బుట్టిన కన్యకల సమూహము.

తా త్ప ర్య ము

(రావణుఁడు పోవుచు బలగర్వమునఁ దనత్రోవలో రాజస్త్రీలను, ముని కన్యలను, దానవకుటుంబినులను, దేవతా స్త్రీలను, వీర వారనక కంటికగపడిన సుందరులను, యువతుల సమూహమును, గొప్ప కులములందుఁ బుట్టిన కన్యకల సమూహమును.)

చ. బలిమిని ముట్టి యడ్డపడు । బంధువులం బడఁగొట్టి కేలుఁ గొ
ప్పులు బిగఁబట్టి యచ్చెలులు । బ్రుయ్యఁగఁ దిట్టఁగ మొత్తుకోఁగ నీ
డ్గిలఁబడ నీడ్చికొం చరిగి । తెక్కువపెక్కునఁ బుష్పకంబునన్
దలరక పాప మంచనక । దానవు డందఱ నుంచె మోహియై. ౪౯-౪

అర్థములు. బలిమిని=బలవంతముగ, ముట్టి=తాకి, బ్రుయ్యఁగన్=నాశము కమ్మని, తెక్కువ పెక్కునన్=గర్వముయొక్క యతిశయముచే.

తాత్పర్యము

బలాత్కారముగఁ దాఁకి యడ్డపడుచున్న బంధులఁ నేలఁ బడఁగొట్టి వారు చేతులు విదిర్చికొని పోవ వారిచేతులనుబట్టి నేలఁ బడఁగాఁ గొప్పులు పట్టి లాగి యాస్త్రీలు నీవు నాశమైపోవ నని తిట్టఁగా లబలబ మొత్తుకోఁగా విడువక యీడ్డి గిలఁబడినను నీడ్చికొనిపోయి గర్వాతిశయముచే చలింపక పాప కార్యమని తలంపక మోహావశమున నందఱను పుష్పకముమీఁద వైచెను.

క. ఈనెఱి బన్నగకన్యల, మానవభామలను నసురకామినులన్ ర
క్షోనారుల యక్షసతుల, దానవయోషల విమానతలముం జేర్చెన్. ౪౯-౫

అర్థములు. ఈనెఱిన్=ఈ విధముగ.

తాత్పర్యము

(ఈ విధముగ నాగ కన్యలను, మనుష్యస్త్రీలను, నసుర కాంతలను, రాక్షస వనితలను, యక్షసతులను, దానవాంగనలను విమానమునఁ జేర్చెను.)

సీ. వారలు శోకాగ్ని । భయసంభవంబులౌ, బాష్పంబులను వహ్ని । భాస్వరముల
గార్చిరి వారల । కన్నీరు మున్నీటి, నేళ్ళునాఁ బుష్పకం । బెల్ల నించె
నిడువెంట్రుకలచెలు । లుడు రాజవదనలు, పీనపయోధరల్ । వేదిమధ్య
లలిహృద్యగాత్రలు । హాటకవర్ణలు. రథకూబరకటులు । ప్రాయవతులు

తే. కన్యలును స్త్రీలు దేవతా । కాంతలట్టి, వారు శోకంబు దుఃఖంబు । భయము పేర్మి
విహ్వలాత్మికలై వెలం । వెల్లఁ బాఱి, దీనలై తపియించిరి । దిక్కులేక. ౪౯-౬

అర్థములు. శోకాగ్ని భయసంభవంబులు=తమవారిని బాయుటచే గలిగిన శోకాగ్నిచేతను తమ్మేమిచేయునో యను భయముచేతను కలిగిన, వహ్నిభాస్వరములన్=అగ్నివలె వేఁడిమిచే నొప్పునవి, మున్నీటిన్ = సముద్రమును, ఉడురాజ వదనలు = చంద్రునివంటి ముఖములు గలవారు, పీనపయోధరల్ = బలసిన చన్నులు గలవారు, వేదిమధ్యలు=సన్నని నడుములు గలవారు, వేదియనఁగా

వేలి యుంగరమనియు నర్థము గలదు. "వేది రంగుళిముద్రాయాం" అని విశ్వనిఘంటు, 'మధ్యేన సా వేదివిలగ్నమధ్యా'యని కుమార-౧-౩౯.

▽ రెండు త్రికోణములు ఒక కోణము మఱియొక దాని కోణముతో కలియు
△
నట్లుగా నేర్పఱచిన తిన్నెకు వేది యని పేరు గలదు. రెండు కోణములు కలసిన ప్రదేశము సన్నగా నుండును, హృద్యగాత్రలు=మనోహరమైన దేహములు గలవారు, హాటకవర్ణులు=బంగారు చాయ గలవారు, రథకూబరకటులు=తేరి నొగల వంటి మొలలు గలవారు, ప్రాయవతులు=నడిమి వయస్సునం దుండువారు, విహ్వలాత్మికలై=విరవిరఁబోవు మనస్సుగలవారై, దిక్కు-లేక=రక్షించువారు లేక.

తాత్పర్యము

(వారు, తమవారిని బాయుటచేఁ గలిగిన శోకాగ్నిచేతను, తమ్మేమి చేయునో యను భయముచేతను, పొడమిన వేఁడి కన్నీటిని గార్చిరి. సముద్రమును నదులవలెఁ బుష్పకమంతయు నిండించెను. నిడుపైన వెండ్రుకలు గల స్త్రీలు చంద్రునివంటి ముఖముగల స్త్రీలు, బలిసిన చన్నులు గలవారు, సన్నని నడుములు గలవారు. మనోహరమైన దేహములు గలవారు, బంగారు చాయగలవారు, తేరి నొగలవంటి మొలలు గలవారు, నడిమి వయస్సునం దుండువారు. కన్యలును, స్త్రీలును దేవతా స్త్రీలవంటి వారు శోకము, దుఃఖము, భయము నధిక మగుటచే విరవిరఁ బోవు మనస్సు గలవారై వెలవెలఁ బోయి దీనురాండ్రయి రక్షించువారు లేక తపించిరి.)

క. వారలయూరుపుగాడుపు, వారిగ సందీప్త మగుచుఁ ◊ బర్వఁ నలుగడన్
ఘోరజ్వలనజ్వాలా, పూరితకుండం బనంగఁ ◊ బుష్పక మొప్పెన్. ౪౯౭

అర్థములు. ఊరుపు గాడుపు=వెలుపల విడిచిన నిశ్వాసము, ఘోర=భయంకరమైన, జ్వలన జ్వాలా=అగ్ని శిఖలచే, పూరిత=నిండిన, కుండము=హోమముచేయు గుంత.

తాత్పర్యము

వారు విడిచిన వేఁడియూర్పుగాడుపు దండిగ నుండునట్లు నాలుగుప్రక్కల వ్యాపింపఁగా నుండుచున్న యగ్ని జ్వాలలచే నిండిన గుండమువలెఁ బుష్పకముండెను. కన్యలును స్త్రీలు నగుటచే బ్రాహ్మణ వసిష్ఠ న్యాయమున పెండ్లికాని స్త్రీలు, పెండ్లి యయిన స్త్రీలని గ్రహింపవలయును.

క. దశకంఠాసురపతికిన్, వశపడి యా శ్యామలెల్ల ◊ వనిఁ గేసరికిన్
వశపడిన కరిణులట్లు వి,వశలై దీనంబులైన వదనాక్షులతోన్. ౪౯౮

అర్థములు, శ్యామలు=నడిమివయస్సుస్త్రీలు, పదునాఱు సంవత్సరముల వయస్సుగల స్త్రీకిని శ్యామయనియే పేరు."శ్యామా యౌవనమధ్యస్థా""శ్యామా షోడశ వర్షాస్త్రీ"నానా.ర దీనివలన పదునాఱు మొదలు ఇరువదియైదు సంవత్సరముల ప్రాయము వఱకు శ్యామ శబ్ద మన్వయించును. ముప్పది సంవత్సరము లది తరుణి యనఁబడును. ఇట్లు చెప్పుటచే"వృద్ధస్త్రీం కన్యకాం. త్యజే:" త్తనునట్లు, సమర్థాడని పిల్లలను ముసలి స్త్రీలను వదలిపెట్టెనని యేర్పడుచున్నది. కేసరికిన్=సింహమునకు, కరిణులు=ఆఁడేనుగులు, వివశలై=స్మృతిదప్పినవారై, వదనాక్షుల తోన్=ముఖములతో, కనులతో, దీనంబులు=దుఃఖముతో నిండినవి.

తా త్ప ర్య ము

(రావణునకు వశపడి యాచామలందఱు వనములో సింహము బాఱి పడిన యాఁడేనుఁగులవలె స్మృతిదప్పి దుఃఖముతో నిండిన ముఖములతోఁ గన్నులతో)

—॰ చెఱబడిన స్త్రీలు విలపించుట ॰ —

ఉ. అక్కటా! నన్ను నీ యసురుఁ ॰ డాగ్రహ మెత్తి భుజించు నేమొ యం
చొక్కతె యేడ్వ నీ ఖలజనోత్కరశేఖరుఁ డయ్యొ నన్నుఁ దా
ముక్కలు సేయునో యనుచు ॰ మొత్తలు పెట్టఁగఁ దోడ బుట్టులన్
మక్కువప్రాణవల్లభుల ॰ మాతల దండ్రుల నెంచఁ గొందఱున్. ౮౯

అర్థములు. ఖలజనోత్కరశేఖరుఁడు=దుష్టజన సమూహములందుశ్రేష్ఠుఁడు

తా త్ప ర్య ము

(అయ్యో! యీ రాక్షసుఁ డాగ్రహముతో నన్నుఁ దినునేమో యని యొకతె యేడ్వఁగా, నీదుర్మార్గుఁడు నన్ను ముక్కలు జేయునేమో యని మొఱలు పెట్టఁగాఁ గొందఱు తోఁబుట్టువులను మక్కువగల భర్తలను దల్లిదండ్రులను దలచుచుండ.)

చ. *అనయముఁ గూర్మిమీఱఁ దనప్రాణము నెత్తుగ బుజ్జగించుచున్
ననుఁ గులదీపమా! యని గుణప్రతిమా! యని మెచ్చి పిల్చునో
జనకుఁడ! యిప్పు డెట్లయితొ ॰ సంకట మెట్లు సహింతొ కూఁతు ర
య్యును సుతు నట్టి దంచుఁ గడుఁ నుబ్బుచు నేగతిఁ బట్టినాఁడవో! ౯౦

తా త్ప ర్య ము

(నన్నెల్లప్పుడు ప్రాణముతో సమముగా బుజ్జగించుచు కులదీపమా! గుణముల కుప్పా! యని మెచ్చి పిలుచునట్టి ఓ తండ్రీ! యిప్పుడేమైతివో! ఈ సంకట మెట్లు లోర్చితివో! కూఁతురయ్యును గొడుకువంటి దని సంతోషపడెదవే, యేగతి పట్టితివో.)

ఉ. *ఒక్కతె నాకుఁ గూఁతురు గుణోదధి రూపసి యర్హకాంతుతో
మక్కువఁ గూర్చువాఁడ నని ౦ మానుగఁ జేసితి పెండ్లియత్నమున్
దిక్కఱినట్లు కర్కశమతిన్ హరియించెను రక్కసుండు న
న్నెక్కరణిన్ సహింతునొ గ౦దే యిఁక దండ్రి దురంతతాపమున్. ౫౦౧

అర్థములు. గుణోదధి=మంచిగుణము లను రత్నములకు సముద్రము' రూపసి=అందగత్తె, దిక్కఱినట్లు = దిక్కులేనిదానివలె, కర్కశమతిన్=కఠిన మనస్సుతో, దురంతతాపమున్=అంతములేని దుఃఖతాపము, ఇది పెండ్లికాఁబోవు పిల్లయేడ్పు.

తాత్పర్యము

(ఒక్కతెయే నాకుఁ గూఁతురు-రూపసి గుణవంతురాలు-తగిన వరుని కిచ్చి ఘనముగఁ బెండిలి చేసెదనని యత్నము చేసితివి. దిక్కులేని దానివలెఁ గఠినుఁడయి నన్ను హరించెను. అంతులేని యీ దుఃఖము నెట్లు సహించితివో-)

సీ. *కన్నతల్లీ! నన్ను ౦ గర్భంబునను మోచి, పడరానిపాటులు ౦ పడుటలెల్ల
గంట వత్తిడికొని ౦ కంటికి ఱెప్పనా, నను సాకి పెంచిన౦యనువు లెల్ల
దెలిసి తెలియక నేను ౦ జలిపినదోషముల్, క్షమియించి బుద్ధులు౦గఱపు లెల్లఁ
గులము శీలంబును ౦ గుణము యోగ్యతయును, నలవరింపఁగ నీతు౦లాడు లెల్ల

తే. నడుగు లిలమీఁద నుంచిన౦నఱిగిపోదు,నంచు నఱచేత నిడి పెంచు౦నవధు లెల్ల
మదకు వ్యర్థంబు లైపోయె ౦ దుష్టుఁడైన, కఱకుటసురకు నేఁజిక్కి౦గాసిపడుట

తాత్పర్యము

(అమ్మా! నన్ను పదినెలలు గర్భమున మోచి పడరాని పాటులు పడితివి- కంటవత్తిడుకొని కంటికి ఱెప్పవలె సాగి పెంచితివి. తెలిసీ తెలియక నేను చేసిన తప్పులు మన్నించి, బుద్ధులు గఱపితివి- కులము శీలము గుణము యోగ్యత యలవఱుటకు నీతులు బోధించితివి. నేలమీఁద నడుగుపెట్టిన నఱిగిపోదునని యఱచేతిలో నుంచుకొని పెంచితివి. దుష్టుఁడైన క్రూరరాక్షసుని చేతిలోఁ జిక్కి నేను గష్టపడుటచే నీశ్రమ మంతయు వ్యర్థమయ్యెనుగదా.)

ఉ. *ఆటలకేను బోవఁ ద్రుటి౦మాత్రమైనను గానకయున్న వత్తువే
మాటికి మాటికిన్ వెదక ౦ మక్కువఁ గూర్చుచు వాలకింప నా
మాటలు తేనెమూట లని ౦ మాతె యిఁక కెవ్వరిపల్కు విందువే
పాటిగఁ గూఁతురా యనుచు ౦ వావిడి మొంగిగ నేస్తొ తల్లిరో! ౫౦౩

అర్థములు. వావిడి=నోఁవిడిచి.

తాత్పర్యము

(తల్లీ! నేనాడుకొనంబోయి యొక నిమిషము గానరాకున్న నన్ను వెదకుటకుఁ బలుమాఱు దిరిగెదవు. నా మాటలు తేనెమూటలని విన నెంతో మక్కువ పడెదవు. ఇఁక నెవ్వరిమాటలు విందువమ్మా! నావిడిచి, కూఁతురా యని యెంతగా నేడ్చెదవో?)

చ. *కటకట! యెంతమర్దినమొ ౦ గాడ్పడి పోయెఁ గులంబు మానమున్
బటుతరసద్వ్రతంబు, సరి౦వారలలో నగుఁబాటు కూర్చె, నీ
కుటిల చరిత్రు రాయిడిని ౦కూర్చితిఁ దంద్రికిఁ బ్రాణభర్తకున్
స్ఫుటముగ హీనభాగ్య నయి ౦ భూమిపయిం దలవంపు లయ్యయో. ౫౦౪

అర్థములు. ఇది పెండ్లియయిన స్త్రీ దుఃఖము, తలవంపులు=అవమానము.

తాత్పర్యము

(అయ్యయ్యో! ఎంత పాపిష్ఠిదినయో-కులము మానము శీలము నాశమై పోయెను. సాటివారిలో నగుఁబాటయ్యెను. కుటిలాత్ముని యుపద్రవముచేఁదండ్రికిఁ బ్రాణ భర్తకు భూమిమీఁదఁ దలవంపు కలిగించితిని-ఎంతటి భాగ్యహీనను!)

ఉ. *మానివి నీవు నాథ! యవ ౦ మానము గూరెను మన్నిమిత్తమై
యే నెటి సైఁచెదో? వ్యసన ౦ మేగతి నాఁగెదొ? యెట్టు లయ్యెదో?
దానవుచేతఁ జిక్కి యిటు ౦ తత్తఱ లాడుచు నున్నదాన నీ
యానన మెట్లు నేఁ గనఁగ ౦ నౌనో కదే హృదయేశ! వల్లభా! ౫౦౫

అర్థములు. మానివి=మానమునం దభిమానము గలవాఁడవు!

తాత్పర్యము

(నాథా! మానమునం దభిమానము గలవాఁడవు. నానిమిత్తముగా నీకవమానము చేకూరెను దుఃఖమెట్లు సహించెదవో. ఏమయ్యెదవో? రాక్షసునిచేతికిఁ జిక్కి తత్తఱ లాడుచున్నదాన-నీ మొగమెట్లు చూడఁ గలనో కదా.)

క. *మనమున నెంతటి శోకము, పెనఁగొను చున్నను మదాస్య౦బింబముఁ గనినన్
వనటెల్లఁ బొలఁగ నలరెద, వనయము నింకెట్లు దుఃఖ౦నుండెదొ నాథా! ౫౦౬

అర్థములు. వనట=దుఃఖము, అలరెదవు=సంతోషించెదవు.

తాత్పర్యము

(ప్రాణనాథా? మనస్సులో నెంత శోకముండినను నా మొగము చూడఁగానే దుఃఖమంతయు మాని సంతోషించెదవు ఇఁక నెల్లప్పుడెట్లు దుఃఖపడెదవో.)

క. *బాలా! యని నూతనశశి, ఫాలా! యని నన్ను నొంటిపాటున నేమే
మో లీలలఁ దేల్చెదు గద, బాలిక నీవెట్టు లాదొ ప్రాణేశ యికన్. ౫౦౭

అర్థములు. నూతన శశిఫాలా=క్రొత్త చంద్రుని రేకవంటి నొసలుగలదానా!

తాత్పర్యము

(ప్రాణేశ్వరా! నే నొంటిపాటున నున్నప్పుడు నన్నుఁజూచి! బాలా! నూతన శశిఫాలా! యని యేమేమో లీలలు చేసెడివాఁడవు. నాయందలి వలపుచే నిఁక నెట్టులయ్యెదవో!)

సీ. *అందఱిలోఁ బనిసందడి నే నుండ, మందు నిగతి దప్పి నంద యుండి
గార్యంబుపైఁ గేలు కడకన్ను నాపయి, నెం దెందొ యంచుచు సందువేచి
నర్మగర్భంపుసన్నలఁ జేసి నవ్వింతు, పెద్దలు గన్నను బిడియపడెదు
నీ తహతహకును నే నవ్వ నది యేమి, యన్నవారికి బొంకులాడు చుందు
ఆ. నీకు నెలమిఁ గూర్ప నేఁ దఱిఁ గల్పించి, వచ్చి పోవుచుందుఁ బ్రాణనాథ!
నీదు వలపు పెంపు నీదు కూరిమియింపు, నప్పు డెఱుఁగనైతి ననదనైతి. ౫౦౮

అర్థములు. ఇది మగని యింటికిఁ గ్రొత్తగా వచ్చిన లజ్జావతి యేడుపు.

తాత్పర్యము

(అందఱిలో నేను పనిసందడిలో నుండఁగా నేమియుఁ దెలియని వానివలె దూరమందే యుండి, పనిమీఁదఁ జేయి, నా మీఁదఁ గన్నునుంచుచు సందు చూచుకొని పరిహాస సూచకపు సన్నలు చేసి నవ్వించెదవు. పెద్దలు చూచిన బిడియపడెదవు. నీ తహతహకు నేనవ్విన, 'నది యేమియని యడిగిన వారికేమియు లేదు' అని బొంకెదవు. నీకు సంతోషము గలిగింప నవకాశము గల్పించుకొని నీ దగ్గఱకు వచ్చి పోవుచుండెడిదానను. నీ వలపు, నీకూరిమి యెట్టిదో యప్పు డెఱుఁగఁ జాలనైతిని– ఇప్పు డనాథ నయితిని.)

క. *వనపాళుల జలకేళుల, మనము చరింపంగ నాదు మనసుం దాఁకన్
గనఁబఱిచి గుచ్ఛఫలతతు, లనియెడి నర్మోక్తిఁ దలఁచి యడలెద నాథా! ౫౦౯

అర్థములు. గుచ్ఛ=ఇది స్తనసూచన, ఫలము=మధురోక్తి, అధరామృత సూచన.

తాత్పర్యము

(ప్రాణవల్లభా! ఉద్యానవన విహారమప్పుడు, జలక్రీడ లాడునప్పుడు నా మనస్సునకుఁ దాఁకున్నట్లు పూల గుత్తులను పండ్లను గనఁబఱిచి యనెడిహాస్యోక్తులను దలఁచుకొని యడలుచున్న దానను.)

ఆ. *ఆఁడుబిడ్డ ననుచు ॰ నత్తగారింటికి, నేగుదాన గాని ॰ యింటనుండ
ననుచుమీరు నన్ను॰నధికమౌ కూరిమి, నాదరింత్రు గాదె॰యన్నలార! ॥౧౦

తాత్పర్యము

(అన్నలారా! ఆఁడు బిడ్డ, యత్తగారింటికిఁ బోవును. ఇంటిలో నుండునది కాదుగదా యని నన్నధికమగు ప్రేమతో నాదరించెడి వారుగదా!

ఉ. *అక్కట! యే యపూర్వపుఁబదార్థము మీకు లభించె నేని యిం
పెక్కఁగ నేమిగైకొనక ॰ యింటికిఁ దెచ్చియు, చెల్లెలా! యటం
చక్కా! యటంచుఁ బిల్చి చన॰వారఁగ మీర లొసంగు చుందురే
యెక్కృతిఁ దోడులార! తపి॰యింతురొ నాగతి యిట్టు లౌటకున్. ॥౧౧

అర్థములు. అపూర్వపు=అపురూపపు=క్రొత్తది.

తాత్పర్యము

(అయ్యో! మీకే క్రొత్తవస్తువు దొరికినను, దానిని మీరు తీసికొనక యింటికిఁ దెచ్చి, చెల్లెలా! అక్కా యని పిల్చి చనువుతో నిచ్చుచుండెడి వారలే-నాగతి యీ విధముగా నయినందు కేరీతిగాఁ దపించెదరో.)

ఆ. *సతులతోడ మీరు ॰సంసార మొనరింప, భర్తతోడ నేను ॰ వచ్చి యటకు
నాఁడుబిడ్డతనము ॰ నమరించుకొందుగా, కనుచు నుబ్బుదాన॰నన్నలార! ॥౧౨

తాత్పర్యము

(మీరు మీ భార్యలతోఁ గాపురములు చేయుచుండ, నా భర్తతోఁగూడ వచ్చి యాఁడు బిడ్డతనము చేయుదునుగదా యని యుబ్బిపోవు చుండెడిదానను.)

ఆ. *చన్ను గుడుచుచున్న॰చిన్నారి తొలిచూలు, నీడ్చి వైచి బిగ్గ॰రేడ్చుచుండ
నన్ను లాగి తెచ్చె॰నిన్నిచుఁ డయ్యయో, కన్న ముద్దుబిడ్డ॰గతియదేమొ ॥౧౩

తాత్పర్యము

(తొలికానుపు నాముద్దుబిడ్డ చన్నుగుడుచుచుండ బలవంతముగానీడ్చి వైచి యది బిగ్గరగ నేడ్చుచుండఁగా నన్నులాగి యీ నీచుండు తీసికొనివచ్చినాఁడు అయ్యయ్యో! నాకన్న ముద్దుబిడ్డగతి యేమయినదో కదా.)

సీ. *నాకన్నబిడ్డను ॰ నే కరుణావతి, చన్నిచ్చి జననియై ॰ సాఁకు నొక్కొ?
నో రెఱుంగనిబిడ్డ ॰ కేరామ దయ యుంచి, వేళకు నన్నంబు॰బెట్టు నొక్కొ-
మంచి చెడ్డ లెఱుఁగఁ॰డుంమార్గ్యంబు మానఁడే॰గతి బట్టునో కసుఁగందు నేఁడు
ఆటల మరగుచు ॰ నాఁకలి యెఱుఁగఁడు, పిలిచి యెవ్వరొక్కింత॰పిడుచనిడుదు

తే. కటకటా! పుత్ర! నాయనా! హా కుమార!, యేలరా పుట్టితివి తండ్రి యిట్టి హీన
భాగ్య కడుపున నే గతి బ్రతుకఁగలవో, తల్లి లేనట్టి బిడ్డ వెంతనయకుట్టి. ౧౨౪

అర్థములు. కసుగందు=లేఁతబిడ్డ.

తాత్పర్యము

(నాకన్న పాపనిఁగని జాలిపడి యే తల్లి చన్నిచ్చి సాఁకునో! నోరెఱుఁగని బిడ్డ కాఁకలి తెలిసి వేళకింత యే యింతి యన్నము పెట్టునో, మంచి చెడ్డ తెలిసిన వాఁడు కాఁడు మూర్ఖపుఁబట్టు వదలఁడు. నాకసుగందు నేఁడేగతి పట్టునో ఆటలను మరగుచు నాఁకలి యెఱుఁగఁడు, పిలిచి యింత పిడుచ యెవరు పెట్టఁగలరో అయ్యో! కొడుకా! నాయనా! కుమారా! యిట్టి దౌర్భాగ్యురాలికడుపున నేల పుట్టితివిరా! తల్లి లేనిబిడ్డవై యెట్లు బ్రదుకఁగలవో!)

చ. *అలరుదుఁ జీర చిక్కనది యాదిగ ముద్దుఁగుమారుఁ గందు నా
లలితమనోజ్ఞ మూర్తిఁ గడు లాలనఁ జేయుదు ముద్దులాడుచున్
గలకల నవ్వఁజేసి పని కారణ మంచును దండ్రి చేతికిన్
జెలువుగ నిచ్చి యా నెపము చేఁ బతి హృష్టు నొనర్తు నంచెదన్. ౧౨౫

అర్థములు. చీరచిక్కనది=ముట్టు నిలిచినది.

తాత్పర్యము.

(నెల మసలినది మొదలు మగబిడ్డను గందును, నా చక్కనయ్యను లాలన చేసి కిల కిల నవ్వించి ముద్దులాడెదను. పనియున్నదని చెప్పి బిడ్డ నెత్తికొననిచ్చి యా నెపమున భర్తను సంతోషింపఁజేసెదనని మనస్సులో మురియుచుండెడిదానను.)

ఉ. *అన్న! కుమార! నిన్నుఁ గడు పారఁగ గాంచుటె గాక బాల్యపుం
జిన్నెలొ వన్నెలో గొమరు చేఁతలొ తేనియ లొల్కు మాటలోఁ
జెన్నగు నాటలోఁ గనఁగఁ జేయన పుణ్యము, పూర్వజన్మమం
దెన్నఁడు లామిహీన్ సుతవిహీనను జేసితినో కుమారకా! ౧౨౬

తాత్పర్యము

(నాయనా! కుమారా! పదినెలలు మోచి నిన్నుఁగడుపారఁ గనుటొక్కటే కాని పసితనపుఁ జిన్నెలా, వన్నెలా, ముద్దుమాటలా, యాటలా నే యద్దముద్దు చూచు పుణ్యము చేయనైతిని. పూర్వజన్మము నే తల్లి బిడ్డలకెడఁ బాటుగల్పించితినో.)

చ. కటకట! పూర్వ మెంతటి యఘంబుల నే నొనరించి యుంటినో
యిటు సహింపరాని గతిఁ గష్ట మహాంబుధి మున్గఁగల్గె, నిం
కెటు దరిఁ జేరుదాన నొకో మృత్యువ! నీకు నమస్కరించెదం
దటుకునఁ గొంచుఁబొమ్ము వ్యసనత్రుటి తాత్మిక నన్నుఁ బుణ్యమా. ౧౨౭

అర్థములు. అఘంబులన్=పాపములను, కృచ్ఛ్రమహాంబుధి=కష్టసముద్రమందు. దరి=ఒడ్డు, వ్యసన=శోకముచే, త్రుటిత=ఖండింపఁబడిన, ఆత్మికన్=మనస్సు గలదానిని.

తాత్పర్యము

(ఎంత కష్ట మెంతకష్టము. పూర్వమున నెంతటి మహాఘోరపాపములు చేసియుంటినో యిప్పుడిట్లు భరింపరాని కష్టసముద్రమున మునుఁగవలసిన దాననైతిని. ఏగతి దరిఁజేరఁగలనో! మృత్యుదేవతా! నీకు నమస్కారము చేసెదను. దుఃఖముచే గుండె పగిలియున్న నన్నుఁ దక్షణము తీసికొనిపొమ్ము నీకు బుణ్యమువచ్చును.)

ఆ. ఏల మనుజలోక ౦మిస్సిసీ యంతకు, నధమ మొండుగలదెఱియర్కుఁడుదయ
కాలమందు జుక్కఁ ౦గమిరూపు మాపు న,ట్లితఁడు చంపెఁ బతుల ౦హీనబలుల.

అర్థములు. చుక్కఁగమిన్=నక్షత్రసమూహమును.

తాత్పర్యము

(ఛీఛీ! యీమనుష్యలోకమేల? ఇంతకుమించిన యధమమింకొకటి గలదా? సూర్యుఁడుదయకాలమున చుక్కలను గనఁబడకుండఁ జేయునట్లు వీరాక్షసుఁడుబలహీనులగు మాభర్తలను జంపెను.

శా. వ్యాపాదప్రణయుండు నూతనవధో ౦ పాయంబులన్ సక్తుఁడై
పాపంబుల్ ఘటియించుచుండెడు జుగు ౦ ప్సాహీనుఁడై యెయ్యెడో
పాపాత్ముండు పరాక్రమంబునను దు ౦ ర్వ్యాపారపారీణతా
లేపంబం దసముండు వీనిఁ దునుమన్ ౦ లేఁడే విభుం డొక్కఁడున్. ౫౧౭

అర్థములు, వ్యాపాద ప్రణయుండు = హింసయందుఁ బ్రీతిఁ గలవాఁడు, నూతన వధోపాయంబులన్=చంపుటకు క్రొత్తయుపాయంబులందు, సక్తుఁడై=మనస్సుంచిన వాఁడై, జుగుప్సాహీనుఁడై=దయలేనివాఁడై,దుర్వ్యాపారపారీణతాలేపంబంను=చెడుకార్యములు చేయుటయందు సంపూర్ణ సామర్థ్యముగల వాఁడని గర్వమునందు, అసముఁడు=అసమానుఁడు.

తాత్పర్యము

వీఁడు ద్రోహచింతనచే నొకరిని హింసించుటయందుఁ బ్రీతిగలవాఁడు.వధించుటకుఁగాను క్రొత్త క్రొత్త యుపాయములందు మనస్సుంచినవాఁడై దయలేకపాపములు చేయుచుండును. పరాక్రమమందును చెడుకార్యములుచేయు సామర్థ్యగర్వంబునందు నసమానుఁడు, వీనిని జంపఁగల ప్రభువులేఁడా?

—॥ చెఱఁబడిన స్త్రీలు రావణు శపించుట ॥—

చ. అతులితపాపహేతువు పరాంగనలం దమి సేఁత, వీఁడు దు
ర్మతి పరకాంత లైన మము ॥ రాగమునం జెఱుపంగఁ గోరెడిన్
హతుఁడగుఁగాక యీ చెనఁటి ॥ యన్యతలోదరి కారణంబుగా
సతులమ యేని మే మిదియె ॥ సత్యము గావుత మంచుఁ దిట్టినన్. ౨౦

అర్థములు. పరాంగనలన్=పరస్త్రీలను, తన భార్యలుగాని వారిని, తమి సేఁత=భార్యలుగాఁ జేసికొనఁ గోరుట, అతులిత పాపహేతువు = అసమానమైన పాపమునకు గారణము, దుర్మతి=చెడుమనస్సుగలవాఁడై, పరకాంతలైనమమున్= ఇతరస్త్రీలైన మమ్ము, రాగమునన్=కామముచే, చెనఁటి=దుష్టుఁడు, అన్యతలోదరి=ఇతర స్త్రీ సతులమ యేని=మేము పతివ్రతలమైన పక్షమున.

తాత్పర్యము

తన భార్యలు గాని స్త్రీలను దన భార్యలుగాఁ జేసికొనఁ దలచుటకంటెఁ బాపకార్యము లేదు. వీఁడు పరస్త్రీలమైన మమ్ము చెడ్డ మనస్సుతో కామవశమునఁ జెఱుపఁగోరుచున్నాఁడు. మేము పతివ్రతలమేయైన పక్షమున నిజముగా వీఁడు పరస్త్రీ కారణముగనే చంపఁబడునుగాక యని దిట్టఁగా.

క. మొరసెను దివి దుందుభులున్, గురిసెన్ సుమవృష్టి యంతఁ ॥ గ్రూరుఁడు సత్యు
త్కర శాపనిహతిఁ బ్రభ చెడెఁ, బరమపతివ్రతలు దిట్టఁ ॥ బ్రభ చెడు టరుదే? ౨౧

అర్థములు. మొరసెను=ధ్వనించెను, దివిన్=ఆకాశమందు, దుందుభులు= నగారాలు, సుమవృష్టి=పూలవాన, సతీ+ఉత్కర=పతివ్రతల సమూహముల, శాపనిహతన్=శాపము దెబ్బచే ప్రభచెడెన్=కాంతిహీనుడయ్యెను, పరమపతివ్రతలు దిట్టఁగాఁ గాంతి నాశమగుట వింతయా? అర్థాంతరన్యాసాలంకారము. మగఁడైనను పతివ్రతయగు తన భార్య కంటనీరుగాఱఁ జేసెనేని వాఁడధోగతిం పాలయి నాశమగుట సత్యమని శాస్త్రములు చెప్పుచున్నవి. ఇఁక నితర పురుషుల గతి చెప్పనేల? ఎవఁడు పతివ్రతల కంట నీరు గాఱఁజేయునో వాఁడు వంశనాశమై పోవును. అంకాడ కుండుట మాత్రమే పతివ్రతాలక్షణమని తలఁపరాదు. నందీశ్వరుఁడు లోనగువారు శపించినపుడును రావణుని కాంతి మాయలేదు. ఇప్పుడిందఱు పతివ్రత లేకవాక్యముగాఁ దిట్టఁగా వాఁడు తేజస్సు గోలుపోయెను. వాఁడు తపస్సుచే సంపాదించిన తేజస్సు వీరి శాపముచే నశించెను

శా. ఆ సాధ్వీజనరోషభాష విమనం ॥ డై యాత్మలో రాక్షసా
ళీసంపూజితుఁ డౌచు లంకకును హాళిం బోయెనో లేదో యా
ళో సంతాపితచిత్తశూర్పణఖ జాఁలుంబాఱఁ గన్నీరు బా
ష్పాసారంబునఁ బాదముల్ కడుగుచున్ ॥ హా యంచు వ్రాలెన్ ధరన్. ౨౨

అర్థములు. ఆ సాధ్వీజన రోషభాష=ఆ పతివ్రతల కోపముతోఁడి మాట, అందఱు వేఱువేఱుగా జెప్పినను భావ మొక్కటే కావున భాషయని యేకవచనము ప్రయోగింపఁబడెను. విమనుండై=దుఃఖముతోఁ గూడిన మనస్సు గలవాఁడై. 'దుర్మనా విమనా అంతర్మనా స్స్యాత్' అని యమరము, హాళిన్ = ఆసక్తితో, సంతాపిత చిత్త=సంతాపము కలుగఁజేయఁబడిన మనస్సుగలది, దాని మగనిని జంపుటచే నని భావము, చాలుంబాఱన్=కాలువఁగాఁ బాఱఁగా, బాష్పాసారంబునన్=కన్నీటి వర్షముచే.

తాత్పర్యము

ఆ పతివ్రతలు కోపముతోఁ జెప్పినమాటవిని శోకముతోఁ గూడినమనస్సు గలవాఁడై రాక్షసులచేతఁ బూజింపఁబడినవాఁడౌచు నాసక్తితో లంకకుఁబోయి పోకముందే యొకపాదము కడపకు నావల, నొక పాద మీవల నుండఁగానే యింతలో మగఁడు చచ్చుటచే దుఃఖించు శూర్పణఖ కన్నీళ్ళు కాల్వలుగఁ బాఱఁగాగన్నీళ్ళ చేతనే యన్న పాదములు కడగుచు హాయని భూమిపైఁబడెను.

—॰ శూర్పణఖ రావణు నిష్ఠురంబు లాడుట ॰—

క. వ్రాలినభగినిన్ రక్షః, పాలుఁడు లేవంగ నెత్తి ॰ పరిసాంత్వోక్తిన్
గోలా! యేలా యేడ్చెదు? నీలోఁగలగోర్కి తెలుపఁ॰ నెఱియొనరింతున్. ॥ ౨౩

అర్థములు. భగినిన్=చెల్లెలిని, రక్షఃపాలుఁడు=రాక్షసరాజు, రావణుఁడు-పరిసాంత్వోక్తిన్=ఊఱట మాటలతో, నెఱి=చక్కఁగా, రావణునకు వాని మత్తతచేఁ దానే శూర్పణఖను విధవను జేసిన విషయముకూడ మనస్సున నాటినది గాదు. అది చెప్పువఱకు వానికి స్ఫురింపలేదు.

తాత్పర్యము

(పాదములమీఁదఁ పడిన చెల్లెలిని రావణుఁడు లేవఁదీసి. 'వెఱ్ఱిదానా! యెందు కేడ్చెదవు? నీ మనస్సులోనున్న కోర్కి తెల్పుము-చక్కఁగాఁ జేసెద'నని యూఱట మాటలాడెను.)

చ. అనవుడు రక్తనేత్రనయనాంబులు పాయఁగ ద్రోచి పల్కె నే
మని వచియించు దానను బలాఢ్యుఁడ వీవు భవద్బలంబు చే
ననుఁ బతిహీనఁ జేసితివి ॰ న్యాయమె వీరులఁ గాలకేయులం
దునుముచు మత్ప్రియుం బతిని ॰ ద్రుంచితి వీవమొ చేతులారగన్. ॥ ౨౪

అర్థములు. ఇప్పుడు శూర్పణఖకుఁ దన మగఁడు చచ్చెనని యేడువవలయునో యన్నమత్తతకేడువవలయునో తెలిసినదికాదు,రక్తనేత్ర=(౧)ఏడ్చుటచేఁ

గన్నులెఱ్ఱనైన దని కాని (౨) రావణు నౌదాసీన్యమునకుఁ గోపించుటచేఁ గాని కన్నులెఱ్ఱనయ్యెను. నయనాంబులు=కన్నీరు, బలాఢ్యుఁడవు=బలసంపన్నుఁడవు.

తా త్ప ర్య ము

అని యడుగఁగా నెఱ్ఱని కన్నుల శూర్పణఖ కన్నీరు దుడిచికొని యిట్లనెను. ఏల యేడ్చుచున్నావని యడిగిన నీకు నే నేమని చెప్పఁగలను? నీవు మహాబలవంతు డవు, నీ బలము నామగనిఁ జంపి నన్ను విధవను జేయుటయం దుపయోగించితివి. ఇది నీకు న్యాయమా? వీరు లగు కాలకేయులఁ జంపుచు నాకుఁ బ్రియుఁడును మగఁడునైన వానిని నీ చేతులార నీవే చంపితివి.

క. ఈవిధి స్వబంధుచేతనె, తా విధి మూఁడెన్ మదాత్మనాథవుఁ డస్మత్ప్రా
ణావళికన్నను బ్రియుఁ డో, రావణ! నాసౌఖ్య మెల్లం రహిఁ జెడ నిచేన్. ॥ ౨౬ ॥

తా త్ప ర్య ము

ఈవిధముగఁ దన బంధువుచేతనే నామగఁడు మరణించెను. వాఁడు నా ప్రాణములకంటెఁ బ్రియుఁడు, నా సౌఖ్య మెల్ల నీచే నాశమయ్యెను.

క. అన్నవె నా పాలికి నీ, విన్నాతి విధవనుగఁ జేసి ం హింసించితి ని
న్నన్నన్న నేమి ఫల మిఁక, నన్నలు నీవంటివార ం లవనిం గలరే? ॥ ౨౭

తా త్ప ర్య ము

(రావణా! నీవు నాపాలికి నన్నవా? నన్నీవిధముగా విధవనుజేసి హింసించితివి. ఇఁక నిన్నని యేమి ఫలము? నీవంటి యన్నలు భూమిలో నున్నారా?)

శా. *చెన్నౌభూషలు వస్త్రముల్ ధనములుం ం జెల్లెండ్రకై యిచ్చుచుం
గన్నం బ్రీతిఁ జరించు చుందు రవనిం ం గాకున్న సంప్రీతిచే
మన్నింపన్ మృదుభాషలాడఁ దగదా ం మానంబు మేలే కదా
యన్నా! నీవలెఁ జెల్లెలి న్విధవఁ జేయం జాలిరే యెవ్వరున్? ॥ ౨౮

తా త్ప ర్య ము

(ప్రపంచమున మేలి నగలో, నాణెములో, చీరెలో, సారెలో చెల్లెండ్ర కిచ్చి ప్రేమతోఁ జూచెదరు కాకపోయిన మంచి మాటలాడరాదా! పోనీ! మాట్లా డుట మానివేయ కూడదా! నీవలెఁ జెల్లెలిని విధవను జేయఁజాలిన వా రెవ రున్నారు?)

ఈపద్య మీగ్రంథకర్త తాను దొలుత వ్రాసిన శ్రీ కుమారాభ్యుదయం బునఁ బ్రథమాశ్వాసంబున వ్రాసియున్నాఁడు. దానినే యిందు ననువదించెను. రెండు గ్రంథము లేక కవికృతము లని తెలుపుటయే యుద్దేశము.

చ. దురముల నేని యల్లురను ॰ ద్రుంపగ రాదు గదయ్య యేరు? సం
గరమున నీవె త్రుంచితివి ॰ కాదె మఱందిని? నట్లొనర్చియున్
దురితము లజ్జయుం గనవు ॰ తోరపుదుఃఖము నీకతంబునన్
ధర మనినన్నినాళ్ళొదవె ॰ దాల్చితి నే విధవాఖ్య నయ్యయో. ౫౨౮

అర్థములు. దురములనేని=యుద్ధములందైనను అల్లురను=ఇంటికి నల్లుండగువారిని.

తాత్పర్యము

యుద్ధము నందైనను తమ యింటికి నల్లుఁడగు వానిని పుత్రికా నిమిత్తమునఁ జంపరాదు గదా నీతి యిట్లుండ నీవో నీ మఱఁదినే నీ చేతులారఁ జంపితివి. అట్లు చేసియు పాపమని తలఁపవు, ఇటువంటి చేయరానిపని చేసితినే యని సిగ్గుపడవు. నీ నిమిత్తముగ నేను భూమిమీఁద బ్రతికినన్ని దినాలు దుఃఖ మనుభవించవలసి వచ్చెను. అయ్యో! విధవయను పేరు సంపాదించి యిచ్చితివి, రాక్షసులందును విధవావివాహములు లేవు. అవి యుండిన నాకు మఱియొక మగని సంపాదించి యిమ్మని యడిగి యుందును. మొదటి మగఁడు పోయెనే యని యేడ్చి యుండదు.

—॰ రావణుఁడు శూర్పణఖ నూరార్చుట ॰—

సీ. అని యేడ్చు చెల్లెలి ॰ నాదట నూరార్చి, యమ్మా! యిదేమిటి ॰ కమ్మనీవు
పరితపించెద వేరి ॰ వలన భీతిల్లకు, నెందేని నీయిచ్ఛ ॰ నెలమి నుండు
నీకోరినవి యెల్ల ॰ నెమ్మి నే నిచ్చెద, గారవించెద నేమి ॰ కడమవడక
సంగరమత్తత ॰ జయము నాకాంక్షించి, శరములఁ జిమ్మితి ॰ సాంద్రముగను

తే. నెవరు మనవారొ శత్రువు ॰ లెవ్వరొయెఱుంగనైతిని సంగరరంగమునను
నందడిని నీదుభర్తనుఁజంపినాఁడ, గతమునకు నేడ్చుచుండినఁగలదెఫలము. ౫౨౯

అర్థములు. అదటన్=ప్రేమతో, కడమవడక=కొఱతలేక, సంగర మత్తత=యుద్ధమునందు దేహము తెలియక, ఆకాంక్షించి=కోరి, సాంద్రముగను=దట్టముగను, గతమునకు=కడచి పోయినదానికై.

తాత్పర్యము

అని యేడ్చుచున్న చెల్లెలిని ప్రేమతో సమాధానపఱచి యేలమ్మా! నీవిట్లు దుఃఖించెదవు! ఎవరివలనను నీకే భయము లేదు. నీయిష్టము వచ్చినట్లు నీవెచ్చటనైన సంచరించుచుండుము. ఒకరి యాజ్ఞకు నీవు లోబడి యుండవలసిన పనిలేదు. నీవు దేనిని గోరినను నేను నీకు నిచ్చుచుండెదను. కొఱత లేక గారవించెదను. జయము గోరినవాఁడనై యుద్ధమదమున దేహము తెలియక బాణములనుదట్టముగ

ప్రయోగించితిని. శత్రువులలోనయిన వాఁ డెవ్వఁడో, కాని వాఁ డెవ్వఁడో, యుద్ధ భూమియందు సందడిలో నేను తెలిసికొనలేక పోయి నీమగని జంపితిని. మించి పోయిన దానికి నేఁడిచ్చిన రాఁగల లాభ మేమి?

సీ. ఇప్పుడు కార్యంబుఁ ౦ జెప్పెద వినవమ్మ, తల్లితోఁ బుట్టిన ౦ దానికొడుకు
ఖరుఁడు నీ తోఁబుట్టుఁగలిమియుఁ గలవాఁడు, దండకాటవిఁ జతుర్దశసహస్ర
ములు రాక్షసులుగొల్వ౦బలియుఁడై వసియించుఁ జరియించునీయాజ్ఞ౦సమ్మతమున
దానప్రయాణసం౦మ్మానకార్యములెల్ల, నాతఁడ కూర్చెఁడు ౦ నడలవలదు
తే. వీరి దండక కనిపెద ౦ వేగ దూషణుండు దళవాయిగాఁగ ౦ నీవుండు మతని
యొద్ద నాతండె మనరాక్ష౦సోత్కరమున, కేలికై యందు నాయాజ్ఞ నేలుచుండు.

తాత్పర్యము

ఇఁక జరగవలసినది చెప్పెద వినుము. మన తల్లి తోడఁబుట్టినదాని కొడుకు ఖరుఁడు కావున నీకును దోడబుట్టినవాఁడేకదా! వాఁడు కావలసిన ఐశ్వర్యముగల వాఁడు. పదునాలుగు వేల రాక్షసులతో నాయాజ్ఞప్రకారము దండకాటవియందు వసించును. అతఁడు నీయాజ్ఞప్రకారము నడచుకొనును. నీకు దానము చేయుటకు ప్రయాణమునకు గౌరమునకుఁ గావలసినవన్నియు నతఁడే యిచ్చుచుండును. వీరిని దండకకుఁ బంపెదను. దూషణుఁడు సేనానాయకుఁడగును నీవాతనియొద్దనుండుము. వాఁడు అందలి రాక్షససమూహమునకుఁ బ్రభువై నాయాజ్ఞ చొప్పున నేలుచుండును. నీ యొద్దనే యేల యుంచుకొనరాదందువేమో. నేను దిగ్విజయార్థము సంచారము పోవుచుండువాఁడను. బహు కార్యాంతరాసక్తుఁడను. కావున నిన్ను విచారించుకొనుట యందు లోపములు జరుగును.

క. అని పదునాలుగు వేవురు, ఘనశూరులతోడ ననిచె ౦ ఖరు దండక కం
దున నాతఁ డుండఁగా శూ,ర్పణఖయు వసియించె నతని౦పజ్జనుసుఖతన్. ౫౩౧

తాత్పర్యము

(అని పదునాలుగు వేలమంది గొప్ప శూరులతో ఖరుని దండకాటవికిఁ బంపెను. అందతఁడుండఁగా నాతని యొద్ద శూర్పణఖ కూడ సుఖముగానుండెను.)

౨౬వ సర్గము

—౦ రావణుఁ డింద్రజిత్తుఁ జూడ నికుంభిలకుఁ బోవుట ౦—

తే. పంక్తివదనుండు దండకావనము నేల, ఖరుని నియమించి భగినికిఁ బ్రమదమునఁ
గూర్చి తాస్వస్థచిత్తుఁడై ౦ కొడుకుఁ జూడఁ, జనె నికుంభిలయను న౦పవనమునకును.

తాత్పర్యము

(రావణుఁడు దండకారణ్యము నేలుటకు ఖరుని నియమించి చెల్లెలికి మిగుల సంతోషము గలుగఁజేసి 'పీడ వదలినదిరా' మనస్సు కుదుటఁ బడిన వాఁడయి, నికుంభిలయను తోఁపునందున్న కొడుకును జూచుటకుఁ బోయెను.)

తే. అచట యూపశతాకీర్ణ ♦ మగుచుఁ జైత్య
శోభితం బయి కాంతిచే ♦ సొంపుఁ గూర్చు
యజ్ఞమును జూచి యందు ని ♦ జాత్మసుతుఁ గ
మండలు శిఖాధ్వజునిని మా ♦ ర్తాండతేజు. ౫౩౩

అర్థములు. యూపశతాకీర్ణము=నూఱు యూపస్తంభములతో వ్యాపించినది. చైత్యశోభితంబయి=దేవాలయముతో ప్రకాశించినదై, కమండలు శిఖాధ్వజునిని=కమండలువు శిఖయు దండము ధ్వజము గలవానిని, మార్తాండతేజున్=సూర్యునివంటి కాంతిగలవానిని, నికుంభిల యనునది లంకానగరమునకుఁ బశ్చిమ భాగముననుండు వనము. ఇంద్రజిత్తు దండకమండలుశిఖాధ్వజుఁ డనుటచే బ్రహ్మచర్యదీక్ష సూచితమేకాని యతఁడు బ్రహ్మచర్యాశ్రమమం దున్నాఁడని భావము గాదు. అగ్నిష్టోమాదియాగములందు బ్రహ్మచర్య ముపదిష్టము కావున దానిని స్మరించి చెప్పఁబడెను.

తాత్పర్యము

(అచట నూఱు యూపస్తంభములు గలిగి, దేవాలయముతోఁ బ్రకాశించు యజ్ఞమును జూచి యందు బ్రహ్మచర్య దీక్షబూని మిగులఁ దేజున వెలుగుచున్న కొడుకును.)

క. హరిణాజినధరునిన్ భీకరునిం గని మేఘనాదుఁ ♦ గౌఁగిట నిడి నా
వరతనయా! చెప్పుము సమాచరితం బగు కార్య మేది ♦ సకలంబనినన్. ౫౩౪

అర్థములు. హరిణాజినధరునిన్=జింక చర్మము ధరించినవానిని, భీకరునిన్=భయంకర కార్యము చేయువానిని, సమాచరితంబు=చేయఁబడునది.

తాత్పర్యము

(జింక చర్మము ధరించి భయంకర కార్యము చేయుచున్న మేఘనాదునిఁ జూచి కౌగిలించుకొని నయనా! నీవు చేయుచున్న కార్యమేమి, యంతయు వివరముగాఁ జెప్పుము అని యడుగఁగా.)

సీ. శుక్రుండు పలికె నీసుతుఁడు రాక్షసరాజ!, జన్నముల్ పెక్కింటిఁ జలిపినాఁడు
కెగలి గోమేధ మగ్నిష్టోమ వైష్ణవ, రాజసూయంబులు ♦ వాజిమేధ
మును దక్షిణలతోడఁ ♦ బొవరించినాఁడు దుష్కరముమహేశ్వరాధ్వర మొనర్చి
ప్రత్యక్ష మైన శ్రీభవుచేత నీ సుతుం, డద్భుతవరముల ♦ నందినాఁడు

ఆ. గగనచరము కామగంబు ధ్రువం బగు, దివ్యరథ మొకండు ♦ భవ్యమైన
తామసీసమాఖ్య ♦ దారుణమాయయుఁ, గాంచినాఁడు తేజ ♦ మించినాఁడు. ౫౩౫

అర్థములు. జన్నముల్=యజ్ఞములు, దుష్కరము = చేయంగష్టమైనది, శ్రీభవుచేత=ఈశ్వరునిచే, గగనచరము=ఆకాశమున దిరుగునది, కామగంబు=

కోరినట్టు పోఁగలది, ధ్రువంబు=దృఢమైనది, తామసీసమాఖ్య=తామసి యను పేరు గలది, దారుణ మాయ=భయంకరమైన శక్తియు, ఈ తామసీ విద్యచేతనే కానరాకుండ యుద్ధము చేయఁగలుగుట, తామసి=చీఁకటికి సంబంధించినది. ఈ విద్య తన్ను సాధించిన వానిని, జీఁకటిలో నుండు వానిని వెలుతురులో నుండు వానికిఁ గానరాకుండునట్లును తనలో నుండు వానికి, వెలుతురులో నుండు వారం దఱు గానవచ్చునట్లును జేయునట్లు చేయఁగలదు. కావునఁ దామసి యనిపేరు,

తాత్పర్యము

ఇంద్రజిత్తు మౌనము వహించియుండుటచే శుక్రుఁ డిట్లు చెప్పెను. రాక్షస రాజా! నీకొడుకు పెక్కు యజ్ఞములు చేసినాఁడు. గోమేధము, అగ్నిష్టోమము, వైష్ణవము, రాజసూయము, అశ్వమేధము మొదలగునవి దక్షిణలతోఁడఁ జేసి నాఁడు. ఎవరికిని సాధ్యముగాని మహేశ్వరయాగము చేసి శివుఁడు ప్రత్యక్షము కాఁగా నాయనచే నాశ్చర్యకరమైన వరములఁ బొందినాఁడు. ఆకాశమునఁ దన యిష్టప్రకారము తిరుగఁగల దృఢమైన రథమును తామసి యను విద్యను సంపా దించినాఁడు. అధిక తేజస్సు గలవాఁడైనాఁడు.

క. ఆ మాయాబలమున సం,గ్రామంబున నితఁడు దిరిగి ◆ గగనచరుండై
శ్రీమహిత సురాసురులకు, నేమాడ్కిని గానరాక ◆ యేఁచుం బరులన్. ౫౩౬

తాత్పర్యము.

ఆ విద్యాశక్తిచే యుద్ధమందు దేవదానవులకైనఁ గానరాక యాకాశ మునఁ దిరుగుచు యుద్ధమున శత్రువులఁ బీడింపఁగలడు.

క. తూణంబు లక్షయము లగు, బాణంబులఁ బూర్ణములు న◆పరభేద్యం బో
బాణాసన మస్త్రం బరి, ప్రాణంబుల నపహరింపఁ బటుశక్తం బౌ ౫౩౭

తాత్పర్యము

ఎన్నితీసినను వెలితిపోని బాణములుగల పొదులును, ఇతరులకు భేదింపరాని విల్లు అస్త్రము శత్రువులఁ జంప శక్తిగల దగును.

క. ఈవరముల నన్నిటి నో,రావణ!నీసుతుఁడు గాంచెఁ ◆ గ్రతువును బూర్ణం
బై వెలసె నీవు వచ్చుట,కై వేచియ యున్నవాఁడ ◆ ననుడు నతండున్.

తాత్పర్యము

(రావణా! యీ వరముల నన్నిటిని నీకొడుకు పొందెను. యజ్ఞముకూడఁ బూర్తియైనది. మీ కొఱకు వేచి యున్నాఁడని చెప్పఁగా నతఁడు.)

ఉ. దీనను మేలు లేదు మన • ద్వేషుల నింద్రముఖామరాదులన్
మానితరీతి భక్తిని స•మంచితవస్తువులన్ యజింతురే?
యైనది యేమొ యయ్యె నది • యైనను మేలె నిజంబు పోదమా
మానిలయంబుఁ జేర బుధ • మండలమండన రండు తోడుతన్. ౫౭౯

అర్థములు. ఇట్లు శుక్రాచార్యుఁడు చెప్పఁగా రావణుఁ డిట్లనుచున్నాఁడు. ద్వేషులన్ = విరోధులను, ఇంద్రముఖామరాదులన్ = ఇంద్రుఁడు మొదలగు దేవతలను.

తాత్పర్యము

ఈ యజ్ఞములవలన మేలు నా కేమియుఁ గనఁబడదు. మనము తపస్సుచేసి బ్రహ్మాదుల మెప్పించి యిష్టసిద్ధులు పొందవలయునుగాని మన విరోధులగు నింద్రుఁడు మొదలగు దేవతలను భక్తి గౌరవములతో మంచి పదార్థములచేఁ బూజింపవచ్చునా? కడచినదేమో కడచినది. అదియు నొక విధమున మేలే. ఇఁక నింటికిఁ బోదము, మీరును వచ్చెదరా!

తే. అనుచు దశకంఠుఁడు విభీష • ణాత్మజాత
సహితుఁడై పోయి బాష్పముల్ • జాలువాఱు
కనులవారిని నాసీత • కంజముఖులఁ
బుష్పకమునుండి దింప న • ప్పువ్వుఁబోండ్లు. ౫౮౦

అర్థములు. విభీషణాత్మజాతసహితుఁడై = విభీషణునితోడను కొడుకుతోడను, జాలువారు = ప్రవహించు, ఆసీత = తేఁబడిన, కంజముఖులన్ = స్త్రీలను, పువ్వుబోండ్లు = స్త్రీలను.

తాత్పర్యము

(అనుచు రావణుఁడు విభీషణునితోడను, కొడుకుతోడను, పోయి కన్నీళ్లు కాలువలు గట్ట దుఃఖించుచున్నవారిని, దాను బలవంతముగాఁ దెచ్చిన స్త్రీలను విమానమునుండి క్రిందికి దింపఁగా, నా స్త్రీలు.)

విభీషణుఁడు రావణుతో మధువు కుంభీనసి నపహరించిన వార్తఁ దెలుపుట

చ. కనుఁగొని వారిపట్ల దశ • కంఠుని కాంక్ష గొఱింగి ధర్మధీ
ఖని యగు నవ్విభీషణుఁడు • కార్య మటయ్య యశోర్థవంశనా
శనకర కార్యముం జలుప • జ్ఞాతులఁ జంపి యథేచ్ఛ మీ పరాం
గనలను వార లశ్రులను • గార్పఁగఁ దేఁ దగు నయ్య సేకిటుల్? ౫౮౧

అర్థములు. కాంక్ష = కోరిక, ధర్మధీఖని = ధర్మబుద్ధికి గని, యశ = కీర్తిని, అర్థ = ధనమును, వంశ = వంశమును, నాశనకర = నాశముచేయు, కార్యమున్ = పనిని,

జ్ఞాతులన్=ఈ స్త్రీల బంధువులను, యథేచ్ఛము=ఇష్టప్రకారము, పరాంగనలను=ఇతర స్త్రీలను, అశ్రులను గార్పఁగన్=ఏడుచుచుండఁగా.

తాత్పర్యము

ఆ స్త్రీలనుజూచి వారిని జెఱుచుటకై రావణుఁడు తెచ్చెనని వాని యభిప్రాయముఁ దెలిసికొని ధర్మబుద్ధికి స్థానమైన విభీషణుఁ డిట్లనియె. ఈ స్త్రీలుకన్నీరు గాఱ నేడుచుచుండఁగా వీరి బంధువులఁ జంపి నీ యిష్టమువచ్చిన స్త్రీల తెచ్చితివి. కీర్తిని ధనమును వంశమును నాశముచేయు నిట్టిపనివి నీవు చేయవచ్చునా?

ఉ. ఈ నవలాల చుట్టములఁ ♦ నీవు వధించి హరించి నట్లు నిన్
మానసమందుఁ గైకొనక ♦ మత్తుఁడు బల్మి హరించి యేగెఁ గుం
భీనసి నా మధుం డనిన ♦ వింశతిలోచనుఁ డిద్ది యేదియో
నే నెఱుఁగన్ మధుం డెవఁడు ♦ నీవ వచింపు మటన్నఁ గ్రుద్ధుఁడై. ౫౮౨

అర్థములు. నవలాల=స్త్రీలయొక్క, క్రుద్ధుఁడై=కోపించినవాఁడై.

తాత్పర్యము

ఈస్త్రీల బంధువుల జంపి హరించి వీరిని నీవు తెచ్చినట్లు నిన్ను మనస్సున లక్ష్యముసేయక మదించినవాఁడు మధు డనువాఁడు బలాత్కారముగ మన కుంభీనసిని హరించికొని పోయెను. అనిన, గుంభీనసి యెవతె, నే నెఱుఁగను. మధుఁ డెవ్వఁడు? వీ రెవ్వరో నీవే చెప్పు మనన విభీషణుఁడు కోపించినవాఁడై.

క. నీసలుపుపాపము ఫలము, చేసేతన దాపరించెఁ ♦ జెప్పెద వినుమా
యాసురవర్యుఁడు ప్రాజ్ఞుఁడు, భాసురచరితుండు మాల్య♦వంతుం డనఁగన్. ౫౮౩

అర్థములు. చేసేతన=ఈచేతఁజేసిన నాచేతన, వెంటనే=దాపరించెన్=కలిగెను, ఆసురవర్యుఁడు=రాక్షస సమూహములందు శ్రేష్ఠుఁడు, ప్రాజ్ఞుఁడు=బుద్ధిమంతుఁడు, భాసురచరితుండు=కీర్తిచేఁ బ్రకాశించు నడవడి గలవాఁడు.

తాత్పర్యము

నీవు చేసిన పాపముల ఫలము వెంటనే కలిగెను ఎట్లందువేని చెప్పెద వినుము. రాక్షసులందు శ్రేష్ఠుఁడును బుద్ధిమంతుఁడును కీర్తిచేఁ బ్రకాశించువాఁడు నగు మాల్యవంతుఁ డొకఁడు కలఁడు.

సీ. అన్న మాతామహుఁ ♦ డైన సుమాలికి, మనతల్లికిని జ్యేష్ఠజనకుఁ డతఁడు
కావున మనతాత ♦ యాపెను పుత్రిక, యనల యా యమకుఁ బ్రియాత్మజాత
కుంభీనసీనామ్ని ♦ కూతురు మనతల్లి, చెల్లెలికిని మనచెల్లెలె కద
స్మృతికి వచ్చెనె యిప్పు ♦ డేనియు నవ్వావి?, పెండ్లికి నెదిగినంపిన్న పడుచు

తే. యజ్ఞ మొనరించు చుండె నీ♦యాత్మజుండు, నీళ్ళలోపల నుంటి నే♦నియతిఁబూని
కుంభకర్ణుండు నిద్దురఁ♦గూరి యుండెఁ, గాన నీమంత్రివరుల రా♦క్షసులఁద్రుంచి.

అర్థములు. మాతామహుఁడు=తల్లికిఁ దండ్రి.

తాత్పర్యము

ఆ మాల్యవంతుఁ డెవఁ డనెదవా మన తల్లిదండ్రియగు సుమాలికి నన్న, మన తల్లికిఁ బెదతండ్రి కావున మనకుఁ దాత, ఆయన కూఁతురి పేరనల, కావున మన తల్లికిఁ జెల్లెలు, ఆమె కూఁతురు కుంభీనసి యను పేరుగలది, కావున మనతల్లి చెల్లెలి కూఁతురు (చూ.ప.౯౩) అట్లగుటచే మనకును జెల్లెలే కద. ఇప్పుడైన బంధుత్వము నీ మనస్సునకు వచ్చెనా? ఆ చిన్నది పెండ్లికి నెదిగిన వయస్సుగలది. నీమంత్రుల రాక్షసులఁ జంపి దానిని మధుఁడు బలవంతముగా నెత్తికొనిపోయెను. అప్పుడు ఇంద్రజిత్తు యజ్ఞదీక్ష వహించి యుండెను. కుంభకర్ణుఁడు నిద్రపోవు చుండెను. నేను నీళ్ళలో మునిఁగి జపము చేయుచుంటిని.

క. నీ యంతఃపురమున నిద్రాయుత యై యుండుదాని ♦ రమణిని మధుఁ డ
త్యాయతమదమునఁ గొని చనె, ధీయుత మే మతనిఁ జంప♦దివురమ శాంతిన్.

అర్థములు. నిద్రాయుతయై=నిద్దురగూడినదియై, అత్యాయతమదమునన్=విస్తారమైన గర్వముచే, ధీయుత=బుద్ధిమంతుఁడా! శాంతి వహించి మే మతని జంప యత్నించిన వారముగాము.

తాత్పర్యము

నీ యంతఃపురమందే నిద్రించుచున్న సుందరిని కుంభీనసిని మధుఁడు మిగులఁ బొగరునఁ దీసికొనిపోయెను. తరువాతనైన మీరేల పోయి యతని జంపలేదందు వేమో. వాఁడు దానిని జెఱిచిన పిమ్మట వానిని జంపిన రాఁగల లాభమేమి? దానిని మరియొకఁడు కోరఁడు. విధవయై యుండవలసి వచ్చును. ఒక యాఁడబిడ్డ విధవను నీవు చేసితివి. మేము దీనిని నట్లులే చేయవలయునా యని శాంతివహించి వానిని జంపిన వారముగాము.

ఉ. కన్నియ నర్హుఁడైన యొక♦కాంతున కిచ్చుట యోగ్యకార్య మా
కన్నియతోడఁబుట్టులకుఁ ♦ గాని యయో! యటువంటియీవి నా
పున్నెము గల్గుభాగ్య మది ♦ పొల్లునడెం జుమి, త్వత్కృతాఘమే
యిన్నెఱఁ దాపరించె నిపు♦డే, వృథ పోవునె ఘోరపాపముల్. ౫౮౭

అర్థములు. పొల్లునడెన్=వ్యర్థమైపోయెను. త్వత్కృతాఘమే = నీవు చేసిన పాపమే, ఇన్నెఱన్=ఈవిధముగా.

తా త్ప ర్య ము

కన్నియను నగిన వరునకిచ్చుట యీ చిన్నదాని తోఁడఁబుట్టిన వారికిఁ దగిన కార్యము. దానివలన కన్యాదాన ఫలము లభించును గాని నీవు చేయు పాపమువలన నట్టి పుణ్యము లభింపక పోయెను. అట్టి దానకార్యము లభింపక పోయెను. నీవు చేసిన పాపములు ఫలము వెంటనే లభించెను. ఘోరపాపములు దుష్టఫలములఁ జూపక పోవునా?

— *రావణుఁడు మధునిమీఁదికి దండయాత్ర పోవుట * —

సీ. అనుడు నాత్మీయమహాఘంబునను, బీడి తుం డయి సంత ప్తతోయధిగతి
పై న్యేశతోడ నాస్యందనం బిప్పుడ, సిద్ధంబు సేయింపుఁ సేన లతి ర
యంబున నాలుగు వేలక్షౌహిణుల నిష్ఠ, కదలింపుమీ కుంభకర్ణుఁడాది
గాఁగల రక్షఃప్రకాండముల్ యానాళి,పై నెక్కవా రిప్డ పంక్తికంఠ

తే.నిర్భయుని మధు వధియించి నిర్జరాల, యంబు గెలువంగ నరిగెద ననుచుఁ గ్రోధ
దీప్తుఁడై పల్కి మంత్రియుఁ దీవరించి, నిఖలసేనలతోడఁ దా నిర్గమించె. ౫౮౭

అర్థములు. ఆత్మీయ=తనయొక్క, మహాఘంబునను = గొప్పపాపముచే, పీడితుండయి=బాధింపఁబడినవాఁడై, సంత ప్తతోయధిగతిన్=తపించిన సముద్రమునవలె, స్యందనము=రథము, పంక్తికంఠనిర్భయునిన్ = రావణుని వలన భయములేనివానిని, రావణుఁడనిన భయములేని వానిని, నిర్జరాలయంబు=స్వర్గము క్రోధదీప్తుఁడై=కోపముచే మండుచున్న వాఁడై, తీవరించి=వేగిరపడి,నిర్గమించె= బయలువెడలెను.

తా త్ప ర్య ము

అని చెప్పఁగా బడబానలముచేఁ దపించు సముద్రమువలెఁ దన మహాపాపంబుచే బీడుతుండై సేనానాయకుతో నిట్లనెను. నీవిప్పుడే నాతేరు సిద్ధము సేయుము. నాల్గువేల యక్షౌహిణీసేనలను వేగముగాఁ బ్రయాణము సేయింపుము. కుంభకర్ణుఁడు మొదలగు రాక్షస శ్రేష్ఠులు వాహనములపై నత్తురు. ఇప్పుడే రావణుఁడనిన భయములేని మధుని సంహరించి స్వర్గము జయింపఁబోయెదనని కోపముచే మండుచు బలుకఁగా మంత్రియుఁ ద్వరపడి సమస్త సేనలతో బయలుదేఱెను.

చ. చనియెను మేఘనాదుఁడు సేనసన్ బలఁగంబులమున్న మధ్యమం
దును దశకంఠుఁడుం జనియెందోర్బలఘనుస్యఁడు కుంభకర్ణుఁడున్
వెనుదెసఁ గాచె సేనల,విభీషణుఁ డుండెను లంకయందతోఁ
చినఘనధర్మకార్యములుఁ సేయుచుఁ, బోయిరి తక్కు రెల్లరున్. ౫౮౮

తాత్పర్యము

మేఘనాదుఁడు సేనకంతకు ముందుగాఁ బోయెను. సేనల నడుమ దశకంఠుఁ డుండెను. సేనల వెనుకప్రక్కఁ గుంభకర్ణుండు రక్షించుచుండెను. విభీషణుఁడు లంకను గాచుచు ధర్మకార్యములు దోఁచినవి చేయుచుఁ బురమందే యుండెను. తక్కినవారందఱు యుద్ధమునకై పోయిరి.

క. ఖరశింశుమారపన్నగ, తురగమయువితతుల నెక్కి ♦ తూర్ణంబ నిరం
తర మొనరించుచు గగనం, బరిగిరి మధుపురముఁ బట్టి♦యసురవరేణ్యుల్. ౫౮

అర్థములు. ఖర=కంచరగాడిదలను, శింశుమార=మొసళ్ళను, పన్నగ= సర్పములను, తురగ=గుఱ్ఱములను, మయు=ఒంటెలు, వితతులను = సమూహము లను, తూర్ణంబ=త్వరగా, నిరంతరము=సందులేని.

తాత్పర్యము

కంచర గాడిదలను, మొసళ్ళను, సర్పములను, గుఱ్ఱములను, ఒంటెలు నెక్కి యాకసము పట్టకుండ రాక్షసులు త్వరగా మధుని పట్టనమునకుఁబోయిరి.)

క. దేవతలమీఁది వైరము, భావించుచు దైత్యవరులు♦వందలకొలఁదుల్
రావణు వెన్నడి నడిచిరి, యా వీరుం డింద్రు గెల్వ♦నరుగు టెఱుగుటన్. ౫౯

తాత్పర్యము

ఇంద్రుని గెలుచుటకై రావణుఁడు పోవుటను యెఱుఁగుటచే లంకయందలి వారేకాక యితర దైత్యులు దేవతలకుఁ దమకుఁగల విరోధ మాలోచించి వారిని గెలుచుటకై నూర్ల కొలదులుగా రావణసేన వెంటఁబోయిరి.

—✱ కుంభీనసి మధుని రక్షింప రావణు వేఁడుకొనుట ✱—

సీ. పంక్తికంఠుం డిట్లు ♦ బలువడిఁజని మధు,పట్టణంబుల కందు ♦ వాని గనఁగ
రామిఁ జెల్లెలిఁ గాంచె♦రావణుఁ గనుగొని, కుంభీనసియుం దన♦గుండె లదరఁ
దల్రవాల్చి యతనిప♦దంబులపైఁ మాలె, నతఁడును భీతిల్ల♦కమ్మ! లెమ్మ,
నీ కేమి యొనరింతు ♦ నేను జెప్పుమటన్న, యన్న! నాపై దయ♦యున్న దేని

తే. చంపవలదు నావిభు♦సారశౌర్య!, భయములం దెల్ల దుస్సహ♦భయమటందు
రన్న! వైధవ్యభయము కు♦లాంగనలకు, సాధ్వులకు దాని మించిన♦జడుపు లేదు.

అర్థములు. బలువడిన్=మిగుల వేగముగ, మూలెన్=పడెను.

తాత్పర్యము

దశకంఠుఁ డీ ప్రకారము మిగుల వేగముగఁబోయి మధుపట్టనముఁజేరి మధుని వెదకెను గాని వాఁడు గానరాలేదు. చెల్లెలిని జూచెను. రావణుని జూడఁగానే

కుంభీనసి గుండె లదుర తలవంచి యాతని పాదంబులపైఁబడెను. అతఁడును అమ్మా! భయపడకుము. లెమ్ము. నీకు నేనేమి మేలు చేయవలయునో చెప్పుము అని చెప్పగా నన్నా! నా మీఁద నీకు దయగలదేని నా మగనిఁ జంపవలదు. కుల స్త్రీలకు వైధవ్యభయమును మించిన భయము మఱియొకటిలేదు అదియే పతివ్రతలకు సహింపరాని భయము.

కులాంగనలకు వైధవ్యభయము గలదనుటచే అంకుటాంగ్రడకు వైధవ్య భయము లేదని భావము, ఈమగఁడు పోయిన దొంగమగఁడో బహిరంగముగ మగఁడో లభించుననను ధైర్యము కలవా రగుదురు. కావున వారు వ్యసనపడరు భయపడరు. విధవా వివాహ మనిన బహిరంగ వ్యభిచారముకదా కామదాసికలు దాని నామోదింతురు.

తే. సత్యవచనుండ వగుము రాక్షసకులేంద్ర!,నాదు ప్రార్థన మన్నించి యాదరింపు
నీవు భయపడ వల దని నెమ్మి నంటి, వల్ల వాక్యంబె పాలింపు మసురనాథ!

అర్థములు. సత్యవచనుండవు=నీవు చెప్పినమాట సత్యము చేసినవాఁడవు.

తా త్ప ర్య ము

నీవు నన్ను భయపడ వల దంటివి. నాకు వైధవ్యభయమునకు మించిన భయములేదు. ఆభయము నాకు లేకుండఁజేసి నీవు చెప్పినమాట యథార్థపడ నిమ్ము. నా ప్రార్థన నంగీకరించి నన్ను మన్నింపుము. నీ వాక్యము పాలింపుము.

చ. అనవుడుఁ జెల్లెలిం గని దశాననుఁ డిట్లను నేఁడి నీ విభుం ?
డనిమిషసంచయంబుల రణావని గెల్వఁగఁ బోదు దీనినిన్
వినిచి త్వదీయభర్తకును వేగమ బాసట గాఁగ రమ్మటం
చను మిఁక నీదు నెయ్యమున నాతనిఁ జంపఁగ నొల్ల సోదరీ! ౨౫౩

తా త్ప ర్య ము

చెల్లెలా! నీ మీఁదఁగల ప్రేమచే నీ మగనిఁ జంప నొల్లను. నీమగఁడెక్కడ నున్నాఁడు. నేను దేవతలను యుద్ధమందు జయింపఁ బోవుచున్నాను. దీనిని నీ మగనికి వినిపించి త్వరగా సహాయముగా రమ్మనుము.

కుంభీనసీ వాక్యము వలన రాక్షసస్త్రీలు గూడ విధవావివాహము గోరరని యేర్పడుచున్నది.

ఉ. నావుడు నల్లెయంచు సదనంబునఁ గూర్కెడు నాథు లేపుచున్
రావణుఁ డస్మదగ్రజుఁడు రాక్షసనాథుఁడు శక్రు గెల్వఁగాఁ
బోవుచు నీదు సాహ్యమును బొందెడు కోరిక వచ్చినాఁడు ర
క్షోవర! నీవు నీయనుఁగుఁ జుట్టములుం గని స్నేహయుక్తునిన్, ౨౫౪

అర్థములు. సదనంబునన్ = ఇంటియందు, కూర్కెడు=నిద్రించుచున్న, అస్మదగ్రజుఁడు=మాయన్న, శక్రున్=ఇంద్రుని, సాహ్యమును = తోడ్పాటును, స్నేహయుక్తినిన్=నీయందు స్నేహము గలవానిని.

తాత్పర్యము

అని చెప్పఁగా నట్టులే చేసెదనని యింట నిద్రపోవుచున్న మగనిని లేపి మాయన్న రావణుఁడు రాక్షసరాజు ఇంద్రుని గెల్వఁ బోవుచు నీ సహాయ్యము గోరి వచ్చియున్నాఁడు. రాక్షసశ్రేష్ఠుఁడా! నీవు నీకూరిమి బంధువులు నీ యందు స్నేహము గల మాయనను జూచి.

తే. తగినపద్ధతి నర్ఘ్యపాద్యముల నిడుచు, బాసటలు గండటన్న నవల్లె యనుచు
న్యాయ్యరీతిని రాక్షసనాథుఁ గనుచు, నాదరించి సమర్చించె నర్హభంగి. ॥౭॥

అర్థములు. బాసటలు=తోడుపాటు.

తాత్పర్యము

(తగిన విధముగా నర్ఘ్యపాద్యము లొసఁగి, తోడుపడవలెనని యడుగఁగా "వల్లె" యని రావణునిఁ జూచి న్యాయ్యరీతి నాదరించి రాజు యుచితమగు నట్టుల పూజించెను.)

క. ఈవిధమున మధుపురమున, రావణుఁ డర్చల గ్రహించి రాతిరి యొకఁ డం
దే వాసమునఁ గొని వేకువఁ దావిడిసెన్ వెండికొండ దాపున బలియై. ॥౮॥

తాత్పర్యము

ఈ విధముగా రావణుఁడు మధుపురమునఁ బూజలను బొంది యందే యొక రాత్రి యుండి వేకువను సేనతో వెండికొండ దాపున విడిసెను.

౨౮వ సర్గము

—: రావణుఁడు మధునితోఁ గైలాసప్రాంతంబున విడియుట :—

క. ఇటు లా దశకంఠుఁడు గిరి, కటకంబున విడిసియుండఁ గంజహితుండున్
పటుతచెడి పశ్చిమాచల, తటమునకుం బోయి యందుఁ దనువుం దాఁచెన్. ॥౧॥

అర్థములు. గిరికటకంబునన్=కొండనడుమ, కంజహితుండున్=సూర్యుఁడు, పటుత=వేఁడిమి, తనువుందాచెన్=అస్తమించెను.

తాత్పర్యము

(ఇట్లా రావణాసురుఁడు కొండనడుమ విడిసియుండఁగా సూర్యుడస్తమించెను.)

చ. తన డిగియున్న కొండరుచిఁ దాల్చి మృగాంకుఁడు నిర్మలద్యుతిన్
గొనబుగ నుద్భవించుటయుఁ గూర్కుచు సైన్యములెల్ల నుంటయున్
గని నగమూర్ధమందు దశకంఠుఁడు రాగరసావశాత్ముఁడై
వనజవిరోధిపాదచయభాసితశైల వినోదసంపదల్. ॥౨॥

అర్థములు. తన డిగియున్న=తానువిడిసిన. కొండరుచిన్=కైలాసకాంతిని తెలుపును. మృగాంకుఁడు=చంద్రుఁడు, నిర్మలద్యుతిన్ =స్వచ్ఛకాంతిచే, సొంపు బుగన్=అందముగ, కూర్కుచు=నిద్రపోవుచు, నగమూర్థమందు=కొండశిఖరమందు, రాగరస+అవశాత్ముఁడై=కామరసముచే బరవశుఁడై, వనజవిరోధి =చంద్రుని, పాదచయ=కిరణసమూహముచే, 'పాదోబుధ్నే తురీయాంశే శైలపత్యంతపర్వతే చరణే కిరణే॥ నానా. ర॥ భాసిత=ప్రకాశించు, శైల పర్వతమునందలి, వినోదసంపదల్=అతిశయమైన వేడుకలు.

తాత్పర్యము

తాను విడిసియున్న కొండయొక్క తెల్లని కాంతివంటి కాంతిగలవాఁడై స్వచ్ఛమైన కాంతితోఁ జంద్రుఁ డుదయించుటయు సేనలవారు నిద్రపోవుచుండుటయు జూచి కొండశిఖరము మీఁదికిఁబోయి దశకంఠుఁడు కామముచే బరవశుఁడై చంద్రకిరణములచేఁ బ్రకాశించు పర్వతము నందలి వినోదములను.

క. కనుఁగొన నాసీనుండై, ఘనతరఫుల్లాబ్జినీ వి॰కాసిత మందా
కిని జలముల సొంపును దద్వనముల జగజంపు పెంపుఁ బ్రమదం బొసంగన్. ౫౯

అర్థములు. ఆసీనుండై=కూర్చుండినవాఁడై, ఘనతర=మిగుల గొప్పవగు, ఫుల్లాబ్జినీ=వికసించిన తామర తీఁగలచే, వికాసిత=వికాసము నొందునట్లు చేయఁబడిన, మందాకిని=ఆకాశగంగయొక్క, జలముల=నీళ్ళ, సొంపును = అందమును, తద్వనముల=ఆపర్వతమునందలి వనముల, జగజంపుపెంపు=పూలయు చిగుళ్ళయు కుచ్చుల అతిశయము, ప్రమదంబు=సంతోషము.

తాత్పర్యము

చూచుటకుఁ గూర్చున్నవాఁడై మిగుల గొప్పదై వికసించిన తామర తీఁగలచేఁ బ్రకాశించు గంగజలముల యందమును, వనములందలి పూలు చిగుళ్ళు మొగ్గలు గుత్తులు గుత్తులుగా జాలరుల వలె నుండు పెంపును జూచి యవి సంతోషము కలిగింపఁగా.

క. మందారచూతపాటల, బృందార్జునలోధ్రతగర॰ వేణీగణికా
తిందుక కేతక కదళీ, కుందాశోకాదితరులఁ॰ గొమరగు వనులన్. ౬౦

అర్థములు, మందార=బాడిసములు, చూత=మామిళ్ళు, పాటలబృంద= కలిగొట్టు చెట్ల సమూహములు, అర్జున = మద్దిచెట్లు, లోధ్ర = లొద్దుగుచెట్లు, తగర=నందివర్ధనములు, వేణీ=దావరడంగిచెట్లు, గణికా=నెల్లిచెట్లు తిందుక= తుమ్మికచెట్లు, కేతక=మొగలిచెట్లు, కదళీ = అరఁటిచెట్లు, కుంద = మొల్లలు,

అశోక=అశోకములు, ఆది=మొదలుగాఁగల, తరులన్=చెట్లచే, కొమరగు వను లన్=అందమైన యడవులను

కేతకశబ్ద మకారాంతమును గలదు, కేతకైః సూచిభిన్నైః-మేఘ. ౨౩. రఘు. 6-17; 13-16; ప్రతిభాం త్యద్య వనాని కేతకానాం, ఘటకర్పర. ౧౫. 'అర్జున కేతకై' యనియే మూలమున నున్నది.

తాత్పర్యము

(బాడిసములు, మామిళ్ళు, కలిగొట్టుచెట్ల సమూహములు, మద్దిచెట్లు, లొద్దుగచెట్లు, నందివర్ధనములు, డావరడంగి చెట్లు, నెల్లి చెట్లు, తుమ్మికచెట్లు మొగలి చెట్లు, అరఁటిచెట్లు, మొల్లలు, అశోకములు మొదలగు చెట్లచే నందమైన యడవులను)

—♦ రావణుఁడు వెన్నెలకాఁకకు వేఁగుట ♦—

క. క్రొన్ననవిలుతుని ములుకుల, కన్నఱ రాగమున మధుర♦కంఠులు మోహా
భ్యున్నతిఁ దమవలచిన యా♦కిన్నరులం గూడిపాడి ♦ క్రీడలఁదేలన్. ౫౬-౧

అర్థములు. క్రొన్నన విలుతుని=మన్మథుని, పుష్పధన్వుని, ములుకుల=బాణముల, కన్నఱ=దుఃఖమున, మధురకంఠులు=స్త్రీలు, కమ్మని కంఠస్వరము గలవారు, మోహాభ్యున్నతిన్=మోహాతిశయముచే, తమవలచిన = తాము ప్రేమించిన.

తాత్పర్యము

మన్మథుని బాణములవలనఁ గలిగిన దుఃఖముచేఁ గొంకఱు కిన్నర స్త్రీలు మోహాతిశయమునఁ దాము ప్రేమించిన కిన్నరులతోఁ గూడి పాడి రతికేళులఁ దేలుచుండఁ జూచెను.

క. డెందంబునకుం జూడ్కి క మందానందం బొసంగ ♦ మదనుఁడు మదిలో
దండడి సందడి పెట్టఁగ, మందునివలెఁ జూచు చుండె♦మనుజాశనుఁడున్. ౫౬-౨

అర్థములు. దండడి=దట్టముగ, విశేషముగ.

తాత్పర్యము

(మనసునకుఁ గంటికి మిగుల సంతస మిడుచుండ, మన్మథుఁడు మిగులఁ దొందరపెట్టఁగా రావణుఁడును మందునివలెఁ జూచుచుండెను.)

సీ. కావి పాఱిన వాలుఁ♦గన్నుంగవలతోడ, మత్తున సొక్కిన♦చిత్తములను
దారుణ్య సౌందర్య♦ధన్యలౌ సతులతో, విద్యాధరులు కేళి ♦ వెలయు చుండ
లిబ్బులదొరయింటి ♦ గుబ్బలాఁడుల గీతు, లబ్బురం బగుతీపి ♦ గుబ్బతిల్లఁ
దుంటవిల్తునితియ్య♦వింటికోపున మ్రోఁగు, గంటలరవళినాఁ♦గలయఁ బర్వ

తే. మందమారుతకంపిత • మహీరుహములు తేనె లొలికెడిపూవుల•వానఁ గురిసి
భూధరంబును బుక్కాము•పొళ్ళుముంచు భాతిఁదనరారఁ దిలకించెఁ•బంక్తిముఖుఁడు.

అర్థములు. కాఁపి పాటిన=ఎఱ్ఱనైన, వాలు=నిడుదలగు, తారుణ్య=ప్రాయము చేతను, సౌందర్య=చక్కఁదనము చేతను, ధన్యలు=కృతార్థలు, బిబ్బలదొర=ధన పతి=కుబేరుఁడు, గుబ్బలాఁడుల=స్త్రీల, గుబ్బతిల్లన్ = అతిశయింపఁగా, తుంట విల్తుని=మన్మథుని యొక్క, తియ్యవింటి=చెఱకువింటి యొక్క, కోపున=కొనయందు, మందమారుత=మెల్లని గాలిచే, కంపిత=వణకుచున్న, మహీరుహములు=చెట్లు, భూధరంబును=పర్వతమును, బుక్కాముపొళ్ళు=గంధపొళ్ళు.

తాత్పర్యము

ఎఱ్ఱవాటిన నిడుద కన్నులతోడను, మత్తున మేనులు దెలియని మనస్సులను ప్రాయము చక్కఁదనము ధనముగాఁగల స్త్రీలతో విద్యాధరులు క్రీడలాడు చుండఁగా, కుబేరుని యింటి స్త్రీలు మనోహరత్వ మతిశయిల్లఁ బాటలుపాడఁగా, నది మన్మథుని వింటికొననుగల గంటలధ్వనివలె నుండఁగా మెల్లనిగాలిచేఁ గదలిన చెట్లు తేనెలతో నిండిన పూవులను వర్షముగాఁ గురియఁగా, కొండ గంధపొడిచేత ముంచు నట్లుండఁగా రావణుఁడు చూచెను.

క. మకరందబిందుజలములఁ, బ్రకటం బగు పరిమళంబు • వహియించి మనో
వికలతగొన నసురుఁడు మరు, సెక లీనుచు వీచెఁ గమ్మఁ•జిలువలమేతల్. ౯౬౮

అర్థములు. మకరందబిందు రజములన్=తేనెబొట్లు చేతను పుష్పరజముల చేతను, మనోవికలతగొనన్=మనస్సు చెదరఁగ, మరుసెకలు=మన్మథుని వేఁడిములు, కమ్మఁజిలువల మేఁతల్=కమ్మనివాయువులు, చిలువలమేతల్=సర్పముల కాహార మగునవి వాయువులు.

తాత్పర్యము

తేనెబొట్లచేతను పుప్పొడిచేతను బ్రకటమైన సువాసన గలవై రావణుని మనస్సు చెదరునట్లు మన్మథాగ్నిజ్వాలలు గలిగించుచు కమ్మని వాయువులు వీచెను.

సీ. మానవతీమణి•మంజులగానంబు, పొలుపార విరిసిన • పూలదండ
మొల్లంపువలపుల•చల్లగాడ్పులసొంపు, కొండలతేఁ డెదఁ•గూర్చు నింపు
అఖిలమనోహర • మయి సాగు రేతీరు నిండారుచందురే•యెండసొగసు
మదనతాపంబున • మఱుఁగు జక్కవకూన, జీవజీవకములఁ • జెల్లుబింపు

తే. నేకమై సాగ రక్షోజ•నేశ్వరుండు
కామునకుఁ జిక్కి పస దక్కి • కళవళించి
నగచి తపియించి చంపకు • నంకఁ జూచి
యూర్చి యూరించి తల యూఁచి • యూఁచి నలఁగె. ౯౬౯

అర్థములు. మానవతీమణి = స్త్రీరత్నముల, డంబు=కాంతి, మొల్లంపు వలపుల=మనోజ్ఞములైన వాసనలుగల, కొండలఱేఁడు=కైలాసపర్వతము, రేతీరు= రాత్రి విధము, నిండారుచంద్రుఁడు=పూర్ణచంద్రుని, రేయెండ సొరు=వెన్నెలసొగసు, రేయెండ యనఁగా రాత్రియందలి ప్రకాశము, రేయెండకు సంధ్యాకాల మనియు నర్థము గలదు. జక్కవకుందు=చక్రవాకముల శోకము, జీవజీవకములు=వెన్నెల పులుఁగుల, ఇందుద్దీపన విభావములు వర్ణింపఁబడియె.

తాత్పర్యము

స్త్రీరత్నముల పాటలు, చక్కఁగా వికసించిన పూవుల కాంతులు మంచి వాసనలు చల్లు చల్లనివాయువులు పర్వతకాంతి సౌందర్యము సర్వభూతమనోహర మైన రాత్రివిధము నిండుచంద్రుని వెన్నెల చందము విరహతాపంబునఁ గుందు జక్కవలశోకము వెన్నెలపులుఁగుల సంతోషము అన్నియుఁ గలయఁగా రావణా సురుఁడు మన్మథునకుఁ జిక్కి పరితపించెను.

—॥ రంభ కైసేసికొని రావణ సేనామధ్యంబునఁ జనుట ॥—

సీ. వెడవిల్తుకాఁకల ♦ వేఁగుచు నంతఁ దుండ, దివ్యాభరణదీప్తదేహ యగుచు
నందనసుమమాల్య♦బృందముల్ మెయి వ్రేల, ననువారఁ జందనం♦బలఁది మేన
మందారకుసుమముల్ ♦ పొందించికురులందుఁ బూర్ణచంద్రుని మోము♦పోలుపునవ్వ
గన్నుదోయికి విందు♦గావించు నెఱి ముంచి, రత్యుపాయనమయి ♦ క్రాలుఁబలుపు

తే. పిఱుఁదులను జాఱు మొలనూలు ♦ మెఱయుచుండఁ
జెక్కిటను మోముఁదమ్మిన ♦ జుక్కబొట్టు
దనర ఋతుషట్కభవసుమ♦దామపంక్తి
సౌరభంబుల మొగి వెదఁ ♦ జల్లుచుండ. ౫౬౬

అర్థములు. వెడవిల్తు=మన్మథుని, వేఁగుచున్=తపించుచు, దివ్యాభరణ దీప్తదేహ=దివ్యములైన భూషణములచేఁ బ్రకాశించు దేహము గలదగుచు, నందనసుమ=నందనవనమందలి పువ్వులచేఁ గూర్పఁబడిన, మాల్యబృందముల్= పూలదండల సమూహములు, మెయిన్=దేహమునందు, మందారకుసుమముల్= కల్పవృక్షములందలి పువ్వులు. కురులందున్=వెండ్రుకలందు, నెఱి=చక్కఁదనము, రత్యుపాయనము=రతికానుక, ఋతుషట్కభవ = ఆఱుఋతువులందుఁ బుట్టిన, సుమ=పూవుల, దామపంక్తి=హారముల వరుస, సౌరభంబులన్=సువాసనలను.

తాత్పర్యము

మన్మథతాపమున వాఁడిట్లు తపించుచుండఁగా దివ్యభూషణములచేఁ బ్రకా శించుదేహము గలదై నందనవనమునఁ బుట్టిన పూవులదండలు దేహమున వ్రేలాడ

దేహమునఁ జందన మలఁది కల్పవృక్షముల పూవులు వెండ్రుకలందుఁ దుఱిమి మొగము నిండుచంద్రునివలెఁ బ్రకాశింపఁగా కన్నులకు సంతోషము గలిగించు సౌందర్యము గలదై రతికానుకయైన బలిసిన పిఱుదులందు జాఱుచున్న మొలనూలు మెఱయఁగా చెక్కిటియందు ముఖమునందుఁ జుక్కబొట్టుపెట్టి యాఱు ఋతువుల పూవులదండలు పరిమళములను వెదజల్లుచుండఁగా.

క. హ్రీకాంతిద్యుతికీర్తుల శ్రీకిన్ మా అగుచు సజల॰జీమూత మనన్
జోక వెలుంగు ముసుంగిడి, టీకునఁ జనుచుండె సొగసు॰తీవి రహింపన్. ॥ ౧౨

అర్థములు. హ్రీ=సిగ్గు, కాంతి=ప్రత్యవయవశోభ, ద్యుతి=లావణ్యము, కీర్తికి=యశస్సునకు, శ్రీకిన్=లక్ష్మీదేవికి, మా అగుచు=సమానమై, ద్వంద్వము కావున నేకవచనము, సజలజీమూతము=నీటితోఁ గూడిన మేఘము.

తాత్పర్యము

సిగ్గునకు, నవయవకాంతికి, లావణ్యమునకు, కీర్తికి (‘నారీషురంభా నగరీషు కాంచీ’ యని ప్రసిద్ధి), ఆభరణ సంపత్తికి నెలవై నీటితోఁగూడిన మేఘమువంటి నల్లని ముసుఁగు పెట్టి, నిక్కుతో నడచుచు సొగసుగాఁ బోవుచుండెను.

ఇది వెన్నెల రాత్రి కావున రంభ జ్యోత్స్నాభిసారిక యనియే చెప్పవలసియున్నది. జ్యోత్స్నాభిసారిక యన్నియుఁ దెల్లనివి ధరింపవలయును గాని నల్లని ముసుఁగు పెట్టరాదు. ఇక్కడఁ బెట్టినట్లు వర్ణింపఁబడినది. ఇదియెట్లు?

జ్యోత్స్నాభిసారిక యన్ని తెల్లని పదార్థములే ధరింపవలయు ననుట తెలుపులోఁ దెలుపు కలసి యది కానరాకుండుటకే. ఇది పరకీయల విషయము. ఇక్కడి నాయిక రంభ సామాన్యవేశ్య, ఇది విటునియొద్దకుఁ బోవునపు డెవరైనఁ జూతురేమో యని భయపడునదికాదు, లజ్జపడునదికాదు. పట్టపగటనైనను నిర్భయముగా లజ్జ విడిచి పోవునది. నల్లని ముసుఁగు వేసికొనుట దోషముకాదు. దీనిని గ్రొమ్మించుబోణి యనుటచే మెఱుపుసామ్యము చెప్పఁబడెను. మెఱుపు మబ్బు విడిచి యుండదు కావున ముసుఁగు మబ్బుగాఁ జెప్పఁబడెను. నల్లమబ్బులోని మెఱుపునకుఁగల కాంతి తెల్లమబ్బులోని మెఱుపున కుండదు. తెల్లని వెన్నెలలో నల్లని ముసుఁగు, దానిలో మెఱుపువంటి కాంతియుండుటచే రావణుఁడు సులభముగా దాని పోక గ్రహింపఁ గలిగెను.

క. బొమ్మలు వెడవిల్లునిచా, పమ్ములు నెమ్మోముఁదమ్మి॰పర్వేందుని బిం
బమ్మొరులు శోండాకా, రమ్ములు కిసలమ్ములే క॰రమ్ములు గాఁగన్. ॥ ౧౩

అర్థములు. బొమ్మలు=కనుబొమలు, వెడవిల్తునిని=మన్మథుని, చాపమ్ములు=విండ్లు, ఒకని కేకకాలంబున రెండు విండ్లేల? ‘జగము లొనర్చెడిమ్మ

సాధింపనెత్తిన రతిమన్మథుల విండ్లకరణి బొమలు' నైషధము. అనుటచే బరిహారము చెప్పుకొనవచ్చును. నెమ్మోమ్ముదమ్మి=ముఖకమలము, పర్వేందుని=పున్నమనాటి చంద్రుని, బింబమ్ము, ఊరులు=తొడలు, శుండాకారమ్ములు = ఏనుఁగు తొండములవంటివి, కిసలమ్ములే=చిగుళ్ళే, కరమ్ములు=అఱచేతులు.

తాత్పర్యము

మన్మథుని విండ్లవంటి కనుబొమలు, పూర్ణచంద్రునివంటి ముఖము, ఏనుగు తొండములవంటి తొడలు, చిగుళ్ళవంటి యఱచేతులు కలదై.

క. తన సేనలమధ్యంబునఁ, జనియెడి క్రౌమ్మించుఁబోణి ♦ స్మరశరవశుఁడై
కని దిగ్గనఁ జని కేల్గొని, చెనటియసురుఁడనియెఁ దమిని ♦ సిగ్గరికత్తెన్. ౫౬౯

అర్థములు. క్రొమ్మించుబోణి=క్రొక్కాఱు మెఱుఁగువంటి దేహకాంతి గలది, స్మరశరవశుఁడై=మన్మథ బాణములకు లోబడినవాఁడై, దిగ్గన=తటాలున, తమిని=మోహముచే, సిగ్గరికత్తెన్=లజ్జపడుచున్నదానిని.

తాత్పర్యము

(తన సేన నడుమనుండి పోవుచున్న రంభనుజూచి మన్మథబాణ హతుఁడై సిగ్గుపడుచున్నదానిని దటాలునఁ జేయిపట్టుకొని యిట్లనెను.)

—♦ రంభా రావణ సంవాదము —

సీ. ఎందుల కేగెదే ♦ యిందీవరేక్షణ, యే సిద్ధికై నీవ ♦ యేగె దబల
యెవ్వనిపుణ్యంబు ♦ లిపుడు ఫలించెనే, ప్రమదాబ్ధిఁ దేల్చె దె♦వ్వానిఁజెలువ
యెవ్వఁడే భోగించు ♦ నింతి నీతో నిప్పు, డసమచాపునితాప ♦ మూఱిపోవఁ
బద్మోత్పలసుగంధి♦వదనామృతంబును, సుధవోలెఁద్రావుచు ♦ సొక్కునెవఁడు

ఆ. పిఱికిదాన ! వెలసి ♦ యిఱిసియి నిఱుకుగ, నురము నతిమినచూడిక్కి♦కుత్సవముగ
మిట్టిమిన్ను ముట్టు ♦ మేలిబంగరుగిండ్ల, నెనయకుచము లెవని యెదను♦గ్రుమ్ము.

అర్థములు. ఎందులకున్=ఏప్రదేశమునకు, ఏసిద్ధికై = ఏలాభము పొందఁగోరి, నీవ=నీవే నీయొద్దకై నిన్ను వెదకుచు నితరులు రావలసియుండ నీవేపోవుటకు నేమియుద్దేశము, ప్రమదాబ్ధిన్ = సంతోష సముద్రమున, అసమభాణుని తాపము=మన్మథతాపము, పద్మోత్పల సుగంధి = పద్మములయు కలువలయు మంచివాసనగల, వదనామృతంబును=వదనమందలి యమృతంబును, సుధవోలెన్= అమృతమువలె, సొక్కునః=పరవశుఁడగును, ఇఱిసియు = ఒకదానితో నొకటి కలిసికొని, ఇఱుకుగ=సందులేక, అతిమి = అతిక్రమించి, మిన్ను = ఆకాశము.

తాత్పర్యము

(నల్లకలువలవంటి కన్నులు గలదానా! ఎక్కడఁ బోయెదవే! యే పనికై పోయెదవే? ఇప్పు డెవ్వనిపుణ్యము పండినదే? ఎవ్వని సంతోషింపఁజేయుట కేగుచున్నావే? ఎవ్వఁడు నీతో భోగించునే? మన్మథతాపము శాంతించుట కెవఁడు పద్మములయుఁ గలువలయు మంచివాసనగల నీ ముఖమందలి యమృతము నమృతమువలెఁ ద్రావుటఁ బరవశుఁడగును? ఎవని నీవు కౌఁగిలించుకొనఁ బోవుచున్నావే)

క. హాటకచక్రంబునకున్, దీటగుచున్ స్వర్ణధామ•దీపిత మై స్వ
ర్వాటీసుఖదం బగుకటిఁ, గూటమికై యెవ్వఁ డొక్కొ • కోమలి యెక్కున్.

అర్థములు. హాటకచక్రంబునకున్=బంగారు చక్రమునకు, దీటు=సమానము స్వర్ణధామ దీపితమై=బంగారు సరముచేఁ బ్రకాశించునదియై, స్వర్వాటీ సుఖదంబు=స్వర్గలోకసుఖము నిచ్చునట్టిది, కటి=నడుము, కూటమికై=కలియుటకై.

తాత్పర్యము

(బంగారు చక్రమునకు సాటియయి బంగారు సరముతోఁ బ్రకాశించుచు స్వర్గసుఖమిచ్చు నీకటి నెవ్వఁ డధిరోహించును.)

చ. వనితరొ నన్ను మించు మగ • వాఁ డెవఁడే జగతీత్రయంబునన్
వనరుహనాభుఁ డైన సుర•వల్లభుఁ డైనను వేల్పువెజ్జులేన్
వను సరిపోలువారె? తగు•నా లలనా యిటు నేను రక్తి వే
డ్కొన నను వీడి వే ఱొకనిఁ • గూడఁగఁ బోవ నరాళకుంతలా! ౫౭ ౨

అర్థములు. జగతీత్రయంబునన్=మూఁడులోకములందు, వనరుహనాభుఁడు=ఉపేంద్రుఁడు, సురవల్లభుఁడు=ఇంద్రుఁడు, వేల్పువెజ్జులేన్=అశ్వినీ దేవతలయినను వేడ్కొనన్=ప్రార్థింపఁగా, వేఁడుకొనన్-సంశ్లేషమందర్థానుస్వారలోపము, అరాళకుంతలా=వంకర తలవెండ్రుకలు గలదానా, నలకూబర మణిగ్రీవు లన్నదమ్ములోకజితవారు అట్టులే యింద్రోపేంద్రులు, అశ్వినీదేవతలు, కావున వారు చెప్పఁబడిరి, ఇంద్రోపేంద్రులు మహిమచేతను, ఆశ్వినీదేవతలు సౌందర్యముచేతను గొప్పవారు కావున వారు పోల్పఁబడిరి. ఈ రెండు గుణములు తనయందున్నవనిభావము.

తాత్పర్యము

(మూఁడులోకములందు నన్నుఁబోలినమగవాఁ డెవ్వఁడున్నాఁడు? ఉపేంద్రుఁడైన, నింద్రుఁడైన, నశ్వినీదేవతలైన చక్కఁదనమున వారు సాటియగుదురా? నీ యందలి ప్రేమచే నేను వేఁడుకొనుచుండ నన్నువిడిచి వేఱొకనికొద్దకుఁ బోవఁదగునా?)

తే. మూఁడుజగములయందు నో • ముద్దుగుమ్మ నే విధాతను బతులకు•నేనపతిని
నన్నుఁగాదని వేఱొక • నాయకుండు, గలుగఁ డింతయు నిక్కంబు•కంజనేత్ర!

తా త్ప ర్య ము

(ముజ్జగములందు పతులకు నేను నియంతను. నేనే పతిని - నేనుగాక యింకొక నాయకుఁడు లేఁడు.)

ఉ. అట్టి మహానుభావుఁడ ద•శాననుఁడన్ మృగరాజమధ్య లోఁ
బుట్టిన మారుఁ కాకలను • బొంగరి కేల్ముకుళించి వేఁడెదన్
నిట్టల మైనకూర్మిఁ దరుణీమణి • యేలవె నన్ను సౌఖ్యపున్
నిట్టలఁ దేల్పవే శుభము • నీ కగు నీ శిల విశ్రమింపవే. ౨౭౪

అర్థములు. మహానుభావుఁడన్=గొప్పమహిమగలవాఁడను, దశాననుఁడన్=పదిముఖములు గలవాఁడను, మృగరాజమధ్య=సింహమువంటి నడుముగలదానా లోన్=మనస్సులో, మారు కాఁకలను=మన్మథతాపములచే. పొంగరి = గర్వము చెడి, కేల్ ముకుళించి=చేతులుజోడించి, నిట్టలము=అధికము, రూ, ఇట్టలము, సౌఖ్యపున్ నిట్టలన్=సౌఖ్యము లను ప్రవాహములందు, శిలన్=బండమీఁద, విశ్రమింపవే=పండుకొని గాసి తీర్చుకొనుము.

తా త్ప ర్య ము

ఇటువంటి మహిమ గలవాఁడను, పదిముఖములు గలవాఁడను, సింహమధ్యా! మనస్సునఁ బుట్టిన మదనతాపముచేఁ జేతులు జోడించి ప్రార్థించుచున్నాను. నాయందు విశేషము దయగలదానవై నన్నేలుము. సౌఖ్యప్రవాహమందు నన్నుఁ దేల్చుము. నీకు శోభనము సమకూరును. ఈ బండమీఁద గాసిదీఱఁ బండు కొనుము.

క. అను రావణువచనంబుల, విని గడగడవడఁకు గదుర • వెఱ హస్తయుగం
బును మోడ్చి రంభ రావణు, ననియెన్ నీ కిట్లు పలుక•నర్హమటయ్యా ౨౭౫

అర్థములు. వెఱన్=భయముచే.

తా త్ప ర్య ము

(ఇట్లనుచున్న రావణుని మాటలను విని భయముచే గడగడ వడఁకుచు రెండుచేతులు జోడించి 'నీకిట్లు పలుకుట తగునటయ్యా' యనెను.

చ. గురుఁడవు నీవు, నీయనుఁగుఁ•గోడల నేను గదయ్య, నాపయిన్
గరుణ దలంపవయ్య సరి•గా దిటు పల్కఁగ మానవయ్య, నన్
బరులు బరాభవించినను • బ్రాపయి ప్రోవఁగఁ గర్తనీవ యై
పరునివిధాన నన్ను నగుఁ•బాటులపా లొనరింపఁ జెల్లునా? ౨౭౬

అర్థములు. గురుఁడవు=తండ్రివంటివాఁడవు, మామవు, పరాభవించినను=అవమానించినయెడల, ప్రాపయి=సహాయుఁడవై, ప్రోవఁగ=రక్షింపఁగ.

తాత్పర్యము

(నీవు తండ్రివంటివాఁడవు. నేను నీకుఁ గోడలనుగదా! నామీఁద దయ యుంచుము-ఇట్లనుట సరిగాదు. ఊరకుండుఁడు. ఇతరులు నన్నవమానింపనాయమ్మై రక్షింపఁ దగినవాఁడవు. పరుని విధాన నన్ను నగుఁ బాట్లుపాలు చేయదగునా!)

క. మామా! పలుకకు మీఁగతి, మామా మన్నింపు నన్ను ◊ మానుము నాపై
గామము, మానము దీయకు, మామయె కోడలిని బట్టఁ మఱియాదగునే? ౭౭

అర్థములు. మా మా=వలదు, వలదు.

తాత్పర్యము

(మామా! ఈవిధముగా మాటలాడకుము. వలదు వలదు- నన్ను క్షమింపుము, నామీఁదఁ గామము మానుము, నా పరువు దీయకు. మామయే కోడలిని బట్టఁ మరియాదా?)

క. నావుడు నా రమణీమణి కేవలపుంజూడ్కి-మాత్రఁ ◊ గెలవున భృశహ
ర్షావేశవశుండు దశగ్రీవుఁడు చరణానతాస్యఁ ◊ గేరుచుఁ బలికెన్. ౭౮

అర్థములు. కెలవునన్=సంభోగేచ్ఛచే, భృశహర్షావేశవశుండు=ఆవేశించిన యధికసంతోషమునకు వశుఁడైన వాఁడు, చరణానతాస్యన్ = పాదములందు వ్రాల్పఁబడిన ముఖముగలదానిని, కేరుచున్=పరిహాసించుచు.

తాత్పర్యము

అని చెప్పఁగా నా స్త్రీరత్నముయొక్క చూపుమాత్రముచేతను సంభోగేచ్ఛయందలి యధికసంతోషమునకు వశపడినవాఁడై పాదములందు ముఖముంచి వ్రాలినదానిని పరిహాసించుచు నిట్లనియె.

క. భామామణి! ననుఁ బిలిచెదు మామా యని నీకు నెట్లు ◊ మామను జెపుమా?
యేమీ నాసుతుసతివై, నీమాటి! కాఁపురంబుఁ ◊ జేసితి వటవే? ౭౯

అర్థములు. నాసుతసతివై=నాకొడుకునకుఁ బెండ్లామవై, నీమాటీ=ఓసి యుత్తమురాలా.

తాత్పర్యము

(భామామణీ! నన్ను మామా యని పిలిచెదవు. నేను నీ కెట్లు మామనైతినే-ఏమీ! నీవు నాకొడుకునకుఁ బెండ్లమవై కాపురము చేసితివా?)

చ. అనవుడు రంభ యిట్టు లను ◊ నో యసురేశ్వర! న్యాయ్యరీతి నీ
తనయున కేను బెండ్లమను ◊ దక్షము, నీవును విత్తనాయకుం
డనుజుఁడు నన్నయుం గద! ధనాధిపుపుత్త్రిఁడే కదా
విను నలకూబరుండు భువి ◊ విశ్రుతచర్యుఁడు శౌర్యధుర్యుఁడున్. ౮౦

అర్థములు. ఔను నీ కొడుకునొద్దఁ గాఁపురము చేసినదాననే, న్యాయ్య రీతిన్=ధర్మపద్ధతిని, విత్తనాయకుండు=కుబేరుఁడు.

తాత్పర్యము

అని చెప్పఁగా రంభ యిట్లనియె. ఔను, నీ కొడుకునకు భార్యనే. ధర్మపద్ధతిని నీ కొడుకునకు నేను పెండ్లమును. ఎట్లందువా? నీవు తమ్ముఁడవు, కుబేరుఁడు అన్నకదా! ఆ కుబేరుని కొడుకుగదా, శౌర్యవంతుఁడు ప్రసిద్ధమైన నడవడికగల వాఁడునగు నలకూబరుఁడు!

తే. పరమధర్మగుణంబున ౦ బ్రాహ్మణుండు శత్రుభీకరభుజశక్తి ౦ క్షత్రియుండు
నాగ్రహించిన లయవహ్ని౦యట్టివాఁడు క్షాంతిగుణమున ధారణీ౦సముఁడుసుమ్ము.

అర్థములు. శత్రుభీకరభుజశక్తి=విరోధులకు భయంకరమైన భుజబలము నందు, ఆగ్రహించినన్=కోపించెనేని, లయవహ్ని=ప్రలయకాలాగ్ని యట్టివాఁడు క్షాంతిగుణమున=క్షమ ఓర్పునందు, ధారిణిసముఁడు=భూమితో సమానుఁడు.

ఉల్లేఖాలంకారము.

తాత్పర్యము

గొప్ప ధర్మగుణములనుబట్టి చూచిన బ్రాహ్మణుఁడు, శత్రువులకు భయంకరమైన భుజబలమును బట్టి చూచిన క్షత్రియుఁడు, కోపించెనా ప్రలయకాలమందలి యగ్నిహోత్రుఁడు ఓర్పునందు భూదేవి.

ఉ. అట్టిఁడు నీ సుతుండు, మహి౦తాత్మునితో నొడఁబాటుకల్మి నే
నిట్టిహొయల్ రహింప నట౦ కేగెడుదానను మెప్పువానికిన్
బుట్టఁగఁ జేయ, నా కితర౦పూరుషుపై వల పేమి లేదు, నీ
పట్టిపయిన్ మదీయదృఢ౦భావము పాయ దొకప్పు డేనియున్. ౫౮౨

అర్థములు. అట్టిఁడు=అట్టివాఁడు, ఒడఁబాటు=అంగీకారము, హొయల్=సొగసులు, నీపట్టిపయిన్=నీకుమారునిమీఁద.

తాత్పర్యము

అట్టివాఁడు నీకొడుకు. మేము భార్యాభర్తలుగా నుండవలయునని చేసికొనిన యొడంబడిక ప్రకారము నే నీ సొగసులు చేసికొని వానికి మెప్పు కలిగించుటకుఁగాను పోవుచున్నాను. ఇతరపురుషులపై నాకు కామము లేదు. ఆయనయందు నామనస్సు దృఢముగ నాటి మఱియొకనిపైఁ బోదు.

చ. వినఁగదవయ్య నా మనవి౦వీడఁగదయ్య నను౦ దశాస్య! నీ
తనయుఁడు నామరాక కయి ౦ తత్తఱపాటున వేచి త్రోవలన్
గనుఁగొనుచుండువాఁ డచటఁ ౦ గంతుశరావళి స్రుక్కుచుండఁగా
నను నిట నాఁగ నీకుఁ దగు౦నా? సుతసౌఖ్యముఁ బాప న్యాయ్యమా? ౫౮౩

అర్థములు. కంతు శరావళి = మన్మథబాణపరంపరచే, ఆఁగన్=అడ్డగింపఁగా, సుతసౌఖ్యము=కొడుకు సుఖమును.

తాత్పర్యము

(నా మనవి వినుము. రావణా! నన్ను వదలుము. నీ కొడుకు నాకొఱకు త్రోవచూచుచుఁ దత్తఱ పడుచుండును-అతఁడట్లు మన్మథశరముల కోరువఁ జాలక స్రుక్కుచుండు నన్ను నీ విచ్చట నిర్బంధించుట తగునా? కుమారుని సుఖమును నాశముచేయుట న్యాయ్యమా?)

తే. సజ్జనులు పోవుపథమునఁ ౦ జనఁగదయ్య, మహినిసత్కీర్తియుక్తిని ౦ మనఁగదయ్య
మాన్యుఁడవు నీవు నాకు నో ౦ మామగార, రక్షణీయను నీకు నే ౦ రాక్షసేంద్ర!

అర్థములు. మామగార-తఱచుగా స్త్రీసమంబులగు దేశ్యశబ్దంబులకుఁ గడపటఁ గొన్నింటి కేకవచనంబునఁ బూజ్యతయందు గారు శబ్దంబగు, ప్రౌ. వ్యా. శబ్ద, ౩౯. దీనిని సంబోధనంబునఁ గారూ అనుట తప్పు. మాన్యుఁడవు=పూజ్యుఁడవు, రక్షణీయను=రక్షింపఁ దగినదానను.

తాత్పర్యము

(సజ్జనులు పోవుదారినిఁ బొమ్ము-లోకములోఁ పరువు ప్రతిష్ఠగలిగి బ్రదుకుము-నాకు నీవు పూజ్యుఁడవు-నీకు నేను రక్షింపఁ దగిన దానను.)

క. పతి యిట్లు పలుక వినయాన్విత యై తా నాలకించి ౦ నిశిచరుఁ డనియెన్
శతపత్త్రేక్షణ యేలా, పతి నొక్కనిఁ గూడు సాధ్వీ౦వాదులు పలుకన్. ౫౮౫

అర్థములు. వినయాన్వితయై=అణఁకువతోఁ గూడినదై, శతపత్త్రేక్షణ=కమలములవంటి కన్నులు గలదానా, సాధ్వీవాదులు=పతివ్రతల బంధుత్వంబులు.

తాత్పర్యము

(ఈ విధముగా రంభ వినయముతో నిట్లు పలుకఁగా, రావణుఁడు విని కమలాక్షీ! యొక్క మగనితోఁ గాపురము చేయు పతివ్రతల నీతులాడెదవేల?)

చ. అమరపురిం గలట్టి మరి౦యాదలు వాహ్యలు నే నెఱుంగనా?
కమలదళాక్షి యొక్కఁడె మ౦గం డమరాంగనకన్న న్యాయ మం
దమునసె? యాదితేయులకు ౦ నాలు నొకస్త్రీక యంచు నున్న దే?
యమరుల కెల్ల లంజ వయి ౦ యాడెదవా మగనాలిపోఁడుముల్. ౫౮౬

అర్థములు. అమరపురిన్=స్వర్గమందు, ఆదితేయులకు=దేవతలకు, మగనాలిపోఁడుముల్=పతివ్రతల మర్యాదలు.

తాత్పర్యము

స్వర్గపురమునందుండుగల స్త్రీపురుషుల మరియాదలు బంధుత్వములు నాకుఁ దెలియవా? దేవతా స్త్రీకి మగఁడొక్కఁడన్న న్యాయమందున్నదా? అందలి మగవానికి భార్య యొక్కతె యను న్యాయమున్నదా? దేవతలకందఱకు నీవు లంజవయి పతివ్రతలవిధములు నీవు పలికెద వేల?

—ః రావణుఁడు రంభను జెరిచి విడుచుట ః—

క. అని పట్టి బండమీఁదన్, ననబోఁడిం బండఁబెట్టి ః ననవిల్తుని కే
ళిని గాసి పెట్టి యసురుఁడు, చనుమని విడువంగఁ ద్రిదశోజ్జ్వలజేక్షణయున్. ౪౦౭

అర్థములు. ననవిల్తునికేళిని=రతియందు, త్రిదశోజ్జ్వలజేక్షణ=దేవతాస్త్రీ

ఈ శ్లోకమునకు మూలము:

ఏవ ముక్త్వా స తాం రక్షో నివేశ్య చ శిలాతలే
కామభోగాభిసంసక్తో మైథునా యోపచక్రమే
సా విముక్తా తతో రంభా.
అనునది.

వాస్తవ మిట్లుండఁ గొందఱనభిజ్ఞు లీ పద్యమును సంభోగశృంగార సముచిత విధమున వర్ణింపలేదని తలఁచి యధిక్షేపింతురు.

ఇందు వాల్మీకి రసాభాసము వర్ణించెను.

తనయం దిష్టములేని స్త్రీతో బలత్కారముగ సంభోగించుట రసాభాసమనఁబడును. అట్టి రసాభాసవర్ణనమును అనుకూలనాయికానాయకుల సంభోగవర్ణనమువలె నెట్లుండఁగలదో యొరసజ్ఞులకే తెలియవలయును. బలత్కారముగఁ బట్టి కాలు సేతులు బిగఁబట్టి కుక్కుటవృత్తిఁ జరించునట్టి సంభోగ మన్యవిధముగ మూలమునకు విరోధముగ వర్ణించుట యౌచిత్యజ్ఞానము లేకయే.

క. రాలిన మాల్యంబులతోఁ, దూలినభూషాచయంబుతోడను లీలా
ఖేలామథితాపగనా, హేలాచ్యుతిఁ గలఁకఁబాఱియేగెన్ మెల్లన్. ౪౦౮

అర్థములు. మాల్యంబులతోన్=పూలదండలతో, తూలిన=చెదరిన, భూషాచయంబుతోను=ఆభరణ సమూహములతో, లీలాఖేలా=ఏనుగుయొక్క విలాసక్రీడచే, మథిత=మథింపఁబడిన, కలఁపఁబడిన, ఆపగనాన్ = నదియోయన్నట్టు, హేలాచ్యుతి=విలాసము చెడి.

తాత్పర్యము

(రాలిన పూలదండలతోఁ, జెదరిన నగలతో, నేనుఁగు కలఁచిన నదివలె సొంపు చెడి కలఁతిచెంది మెల్లగాఁ బోయెను.)

చ. చెదరిన కొప్పువెంట్రుకలు ♦ చెన్నుదొఱంగిన కేల్చిగుళ్ళు నై
సుదతి ప్రభంజనాహతము ♦ సూనభరాంచిత మైన తీవె నాఁ
గొదరు వణంకు సిబ్బితియుఁ ♦ గూడఁగ భీతి ధనేశనందనున్
మదవతి చేరఁబోయి యల ♦ మానధనుం గని కేలు మోడ్చుచున్. ౫౮౯

అర్థములు. ప్రభంజనాహతము=పెద్ద గాలిచేఁ గొట్టఁబడినది, పరికరాంకు రాలంకారము, సూనభరాంచితము=విశేషముగఁ బూలచేఁ బ్రకాశించునది, తీవె=తీఁగ. కొదరువణంకు=అతిశయించిన కంపము, సిబ్బితి సిగ్గు, భీతి=భయము, ధనేశనందనున్=కుబేరుని పుత్రుని.

తాత్పర్యము.

కొప్పు వెంట్రుకలు చెదరఁగా చిగుళ్ళవంటి చేతులు కాంతి చెడఁగా రంభ పూలనిండి పెనుగాలికిఁ గొట్టబడిన తీఁగవంటి దేహముతో మిగుల దేహమువణఁకఁగా సిగ్గు భయము కలుగగా నది నలకూబరునిఁ జేరఁబోయి యతనిఁ జూచి నమస్కరించి.

తే. పాదములఁ ద్రెళ్ళ నాసతిఁ బాటుఁ గాంచి, శ్రీదనందనుఁడిది యేమి చిగురుబోణి!
యేల నాచరణంబులఁ ద్రాలి తనిన, వెచ్చనూర్చుచు వణఁకుచుఁ బెలఁది పలికె.

అర్థములు. శ్రీదనందనుఁడు = కుబేరుని కొడుకు, నలకూబరుఁడు, వెచ్చ నూర్చుచు=వేఁడినిట్టూర్పులు పుచ్చుచు.

తాత్పర్యము

(పాదములమీఁదఁ బడఁగా, నా రంభపాటు చూచి, నలకూబరుఁ 'డిదేమి' చిగురుబోణీ 'నాకాళ్ళమీఁదఁబడితి' వని యనఁగా వేఁడి నిట్టూర్పులు పుచ్చుచు వణఁకుచు, రంభ యిట్టులని చెప్పెను.)

—♦ రంభ రావణు వకృత్యంబు నలకూబరుతోఁ దెలుపుట ♦—

సీ. వల్లభా! వాసవఁ భవనంబుపైఁ జన, దుర్వారసైన్యంబుతోడ నేఁడు
పంక్తికంఠుం డిందు ♦ పాళెంబు దిగినాఁడు, త్వత్సన్నిధికి నేనుఁ వచ్చుచుండఁ
గని త్రోవకడ్డమై యుగ్రకుఁడై నను దెంచి, నా కేలొడిసిపట్టి నాతి యెందుఁ
జనెద వెవ్వరిదాన ♦ వనవుడు సర్వంబు, వినఁజేసి మ్రొక్కితి వేఁడుకొంటి
తే. నయ్య యంటిని నీ సుతుఁ జాల నంటిఁ, గోడల నటంటి మామవుఁ గూడ దంటి
వావు లాడితి ధరంబుఁ ద్రోవ లంటి, నేమి చెప్పిన విడువఁడాయె హీనగుణుఁడు.

అర్థములు. వాసవభవనంబు=ఇంద్రలోకము, పాళెంబు=దండు, త్వత్ + సన్నిధికి=నీ సమీపమునకు, అయ్య=తండ్రి.

తాత్పర్యము

(ప్రియుఁడా! విను. రావణుఁ డింద్రలోకము మీఁదికి దండెత్తి పోవుచు నేఁడిందు దండుతో దిగినాఁడు-నేను నీ సన్నిధికి వచ్చుచుండఁగాఁ, జూచి, దారి కడ్డమువచ్చి, నాచేయొడిసి పట్టుకొని 'నీ వెవరిదానవు? ఎందుఁ బోవుచున్నావు' అని యడిగెను, నే నంతయు వినిపించితిని-మ్రొక్కితిని, వేఁడుకొంటిని, అయ్యా యంటిని, నీకొడుకు భార్యను నీకుఁ గోడల నని యంటిని, మామవు నన్నుఁగూడుట వరుస గాదంటిని ధర్మ మార్గము లుగ్గడితిని-ఏమి చెప్పినను నీచపు గుణము గల వాఁడు నన్ను విడువఁ డయ్యెను.)

క. వింటివె యే మందును సుర,కంటకు పై చేత బలిమిఁ ౦ గాంతుఁడ యయ్యో
యొంటిగ జవ్వని చిక్కినఁ, దుంటరి యేది సేయు నట్టిదోసమె చేసెన్. ౫౧-౨

అర్థములు. సురకంటకు పై చేత=రాక్షసుఁ డా మీఁదఁ జేసిన కార్యము, ఏమందును=ఏమని చెప్పుదును, ఎట్లు చెప్పుదును, బలిమిన్ = బలవంతముగా, జవ్వని=వయస్సు స్త్రీ, తుంటరి=దుష్టుఁడు.

తాత్పర్యము

రాక్షసుఁ డాతరువాతఁజేసిన పని నే నేమని చెప్పుదును. నాథా!యయ్యో, వయస్సు స్త్రీ యొంటిగఁ జిక్కిన దుష్టుఁ డగు పురుషుఁడు బలాత్కారముగ నేమి చేయునో యా పనియే చేసెను.

దీనివలన మానమునందు శీలమునందు దృష్టిగల స్త్రీ లొంటరిగాఁ దిరుగఁ బోరాదు. అట్లు పోవునది అంకుటా లనియో, వేశ్య యనియో, చెడిన దనియో తలంచుట తప్పుగాదు.

క. సుగుణాభరణా! సదయం, బగు దృష్టిని నన్నుఁ జూచి ౦ యపరాధంబున్
దగు క్షమియింపఁగ నబలను, మగవానిబలంబు గలదె౦మగువల కెందున్? ౫౧-౩

అర్థములు. సుగుణాభరణా=సుగుణములే యలంకారముగాఁ గలవాఁడా, సదయంబు=దయతోఁ గూడినది, అపరాధంబున్=నేరమును, అబలను=బలహీనురాలను.

తాత్పర్యము

(సుగుణాభరణా! నన్ను దయతోఁజూచి నా యపరాధమును క్షమింపుము నే నబలను. మగవానికున్న బలము మగువలకుఁ గలదా?)

క. అన విని యక్షాధీశ్వరు, తనయుం డొక్కింతసేపు ౦ ధ్యానస్థితుఁడై
కని వృత్తాంతము సర్వముఁ, గనుఁగవ గెం పొదవ జలముఁ౦గైకొని కేలన్.

అర్థములు. ధ్యానస్థితుఁడై=ధ్యానమునం దున్నవాఁడై, ఇది తొలుత నాఁకుది. అంమ వేశ్య, ఇది చెప్పిన దెంతవరకు నిజమో, ఎంతవఱ కసత్యమో.

ఇదియే యెవని యొద్దనైనఁ బండుకొని యీ వేషము వేసికొని వచ్చెనేమోయని సత్యాసత్యములు తెలియుటకై ధ్యానించె నని భావము. దీనివలన స్త్రీలమాట లాలోచింపక తటాలున నమ్మరాదని సూచన. కెంపొదవన్=ఎఱ్ఱనకాఁగా.

తా త్ప ర్య ము

(అని చెప్పఁగా విని నలకూబరుఁడు కొంతసేఁపాలోచించి, జరిగినవృత్తాంత మంతయుఁ దెలిసికొని, కోపించి, చేతియందు జలము తీసికొని.)

—* నలకూబరుఁడు రావణు శపించుట *—

ఆ. ఆచమించి నీట ౦ నాననాదికముల, నంటి శాస్త్రవిహిత ౦ మైనరీతి
పాపశీలి యైన పంక్తికంధరుఁ గూర్చి, శాపమిచ్చె ఘోరరూపముగను. ౫౫

అర్థములు. ఆచమించి=ఆచమనముచేసి, ఆచమనము చేయకయే దైవ పితృకార్యములు చేయరాదు. ఆననాదికముల నంటి=కేశవాది నామములు చెప్పు నప్పుడే యే నామము చెప్పి యే యే ప్రదేశములు తాఁకవలయునో దానిని దానిని దాఁకి, పాపశీలి=పాపపు స్వభావము గలవాఁడు.

తా త్ప ర్య ము

(ఆచమనముచేసి,ముఖము మొదలగు నంగములఁ దాఁకి శాస్త్రవిహితమైన విధముగాఁ, బాపపు స్వభావముగల రావణుని గుఱించి ఘోరమైనశాపమిచ్చెను.)

క. తన్నొల్లని నిను బలిమిని, నన్నీచుఁడు పరిభవించె ౦ నటుగానఁ జెలీ!
తన్నొల్లని జలజాక్షి నిఁ, కెన్నఁ డతఁడు తాఁకకుండ ౦ నేనొనరింతున్. ౫౬

అర్థములు. పరిభవించెన్=అవమానించెను.

తా త్ప ర్య ము

(ఈనీచుఁడు తన నొల్లని నిన్ను బలవంతముగాఁ జెఱిచెను గావున నిఁక నెన్నఁడు వీఁడు తన నొల్లని యాఁడుదానిని దాఁకకుండఁ జేసెదను.)

క. ఎప్పుడిఁకఁ దన్ను నొల్లని యప్పడఁతిం జెఱుచు రావణాసురుఁ డపుడే
యప్పలలాశి శిరంబులు, తప్పక యిలఁ గూలు సప్తధాభిన్నములై. ౫౭

అర్థములు. అప్పలలాశి=ఆ రాక్షసుని, సప్తధాభిన్నములై = ఏడు తునుకలుగాఁ బగిలినవై, సప్తధాతువులు సప్తభేదములుగా నొకదానితో నొకటి సంబంధము లేక విడివడి పోవునని భావము. చూ. యుద్ధ-౨౯

ఇట్టి శాపమే బ్రహ్మయుఁ బెట్టెను. నలకూబర శాపము ప్రథమము సామాన్య దేవతలలోఁ జేరిన నలకూబరుని శాపము అంతకంటెఁ దపోధికుఁడైన

రావణాసురుని బాధింపదు. కావున పుంజికస్థలను రావణుఁడు చెఱిచెను. కావున మరల బ్రహ్మయే శపించెను. పరస్త్రీని జెఱిచినచో చచ్చునట్లు నలకూబర శాపము, దుర్వ్యాపారమునకై ప్రయత్నించినను జచ్చునని బ్రహ్మశాపము. కావుననే సీతా విషయమై యప్రయత్నుఁడగుట.

క. అని జ్వలితాగ్నిసమప్రభుఁ, డనినంతనె కురియఁ దొడఁగె ◊ నలరులవానల్
ఘన మయ్యె దేవదుందుభి,నినదంబులు మింట సురలు◊నీరజభవుఁడున్. ౯౮

అర్థములు. జ్వలితాగ్ని సమప్రభుఁడు=మండుచున్న యగ్నితో సమానుఁడు, అలరుల వానల్=పుష్పవర్షములు, దేవదుందుభి నినదంబులు = దేవతల నగారాల ధ్వనులు.

తాత్పర్యము

(అని మండుచున్న యగ్నితో సమానుఁడయిన యా నలకూబరుఁ డన్న వెంటనే పూలవానలు కురియ నారంభించెను. దేవదుందుభులు ఘనముగా నాకసమున మ్రోగెను-దేవతలు-బ్రహ్మయు)

చ. మునులును బంక్తికంఠునకు ◊ మూఁడిన కీడు దలంచి సంతసం
బును గొని రా దశాస్యుఁడును ◊ బోలఁగ శాపవిధం బెఱింగి యా
దినము మొదల్ పరాంగనలఁ ◊ దియ్యనివిల్తునికేళిఁ గూడఁగా
మనమున నెంచఁ డయ్యెఁ, దగు◊మందు గదా భయ మెట్టివానికిన్. ౯౯

అర్థములు. మూఁడిన=సంభవించిన, అర్థాంతరన్యాసాలంకారము.

తాత్పర్యము

(మునులును రావణునకు మూఁడిన కీడును తలపోసి సంతసపడిరి, రావణుఁడును శాపము విధమును దెలిసికొని, యా దినము మొదలు పరస్త్రీ సంగమమున మనస్సు పోనిచ్చినవాఁడు కాఁడు-ఎట్టివానికైన భయము మందుగదా.)

క. రావణుఁడు బల్మిఁ దెచ్చిన,యావనితలు సాధ్వులెల్ల ◊ యక్షేశసుతుం
డా విధి నొసఁగిన శాపము, వావిరి హర్షమున వినిరి◊భయ మెడఁబాయన్. ౧౦౦

తాత్పర్యము

(రావణుఁడు బలవంతముగా నెత్తికొనివచ్చిన యాపతివ్రతలందఱును నలకూబరుఁ డిచ్చిన శాపము విని మిక్కిలి సంతోషపడి రావణువలన భయము విడిచిరి. ఈ విషయము:-సీత నిర్దోషురాలని-రామునకుఁ దెలుపఁబడెను.

౨౭వ సర్గము

రావణుఁ డింద్రపురిపై దాడిపెట్టుట విని సురలు యుద్ధప్రయత్నులగుట

సీ. కైలాసనగమును ♦ గడచి దశాస్యుండు, సైన్యసమేతుఁడై ♦ శక్రలోక
మరుగ నాకంబుల ♦ నర్ణవమథనవి, రావంబు పోలిన♦రావ మెగసె
నసురవర్యునిధాటి ♦ నాలించి శక్రుండు, వడఁకుచుఁ దనుఁ జూడ♦వచ్చియున్న
విశ్వుల వసురుద్ర♦విబుధుల నాదిత్యులను గాంచి చనుదెంచె ♦ మనల గెలువఁ

ఆ. బాపబుద్ధి యైన♦పంక్తికంఠుఁడు మీరు, సిద్ధపడుఁడు వేగ♦యుద్ధమునకు
ననఁగ వార లెల్ల♦నరిగి సైన్యంబుల,తోడ నుండి రనికి♦దొడరుటకును. ౬౦౧

అర్థములు. శక్రలోకము=ఇంద్రలోకము, అర్ణవమథన విరావంబు=సముద్రమును జిలికిన కలుగుధ్వని.

తాత్పర్యము

కైలాసపర్వతము దాఁటి సేనలతోడ రావణుఁడు ఇంద్రలోకమునకుఁబోఁగా నందు సముద్రమును మథించిన ధ్వనివంటి ధ్వని పుట్టెను. రాక్షసరాజు తనమీఁద దండెత్తుట విని యింద్రుఁడు వడఁకుచుఁ దన్నుఁ జూడవచ్చిన విశ్వేదేవతలను వసువులను రుద్రులను దేవతలను ఆదిత్యులను జూచి పాపాత్ముఁడైన రావణుఁడు మనల గెలుచుటకై వచ్చినాఁడు. మీరును యుద్ధమునకు సిద్ధపడుఁడు అనిచెప్పఁగా వారందఱు పోయి వారి వారి సైన్యములను సిద్ధపఱచికొని యుద్ధము సేయుటకు సిద్ధపడి యుండిరి.

క. నిర్జరనగరంబుపయిన్, దుర్జయుఁ డగు రావణుండు ♦ దో తెంచుటచే
నిర్జితబలుఁ డింద్రుఁడు ధృతి,వర్జితుఁడై యరిగి దీన♦వదనుం డగుచున్. ౬౦౨

అర్థములు. నిర్జరనగరంబుపయిన్=దేవతల పట్టణమగు నమరావతి మీఁద, దుర్జయుఁడు=జయింపరానివాఁడు, తోతెంచుటచే=వచ్చిన కారణమున, నిర్జితబలుఁడు=చంపఁబడినబలుఁడను రాక్షసుని గలవాఁడు, ధృతి వర్జితుఁడై=ధైర్యము వదలినవాఁడై, దీనవదనుఁడు=శోకముతోఁ గూడిన ముఖముగలవాఁడు.

తాత్పర్యము

అమరావతి మీఁద దేవతలకు జయింపరాని రావణుఁడు వచ్చినవాఁడై బలుని జయించిన యింద్రుఁడు ధైర్యము చెడి భయపడి యేడుపుముఖముతోఁ బోయి.

— ♦ ఇంద్రుఁడు విష్ణువుఁ జూడఁ బోవుట ♦ —

చ. హరి గని యేమి సేయుదు మహాత్మ! దురాత్ముఁడు రావణుండు సం
గరమున కాంక్ష సేసి సుర♦కాండము గెల్వఁగ వచ్చినాఁడు నేఁ
డసుతరవీర్యవంతుఁ డిఁక ♦ నూరకపోఁడు వరంబు పేర్మిఁ గా
వరమునఁ గన్నుగానఁడును ♦ బ్రహ్మవరం బడి పాలనీయ మా. ౬౦౩

తాత్పర్యము

హరిని జూచి మహానుభావా! యేమి చేయుదును? చెడు మనస్సుగల రావణుండు యుద్ధముఁ గోరి దేవతల గెల్వవచ్చినాఁడు. వీఁడు మిక్కిలి బలవంతుఁడు, ఊరకపోవువాఁడుగాఁడు. బ్రహ్మవరము వలన వచ్చిన గొప్పతనముచే, గన్నులు తెలియకున్నాఁడు. వీని చంపుదునా యనిన దేవతలచేఁ జావనట్లు బ్రహ్మచే వరమును బొందినాఁడు. ఆయనమాట గౌరవింపవలసి యున్నది.

క. కావున్న వీఁడు లెక్కయె, నీ కరుణన గెలిచినాఁడ ♦ నే నముచి బలిన్
వీకుల వృత్రున్ శంబరుఁ బ్రాకటబలశాలి నరకు ♦ భండనమందున్. ౬౦౪

తాత్పర్యము

ఆ వర మడ్డము లేకున్న వీనిని జంపుటయొక్క గొప్పకార్యమా? నీ దయచేత నేను నముచిని బలిని వృత్రుని శంబరుని మహాబలవంతుఁడైన నరకుని యుద్ధమందుఁ జంపితిని వారికంటె వీఁడు బలవంతుఁడా?

సీ. సచరాచరములైన ♦ జగములకెల్లను, గతియు నాశ్రయమును ♦ గంజనేత్ర
నీవ కావే మఱి ♦ నీకన్న దేవ దే, వేశ! యెవ్వరు నాథు ♦ లింతటికిని
మధుసూదనుండవు ♦ మాధవుండవు పద్మ, నాభుండ వీవె సనాతనుఁడవు
జగముల నన్నిటి ♦ స్థాపించితివి నీవ, నీవలనన కదా ♦ నేను నగుట
ఆ. సర్వలోకములను ♦ జనియింపఁ జేసెద, వన్ని ప్రళయవేళ ♦ నిన్నె చొచ్చుఁ
బలుకవయ్య! యొక యుపాయ మాశరు గెల్వఁ, జక్రమూని నాకుఁ సాయపడుదె.

తాత్పర్యము

స్థావరములు జంగమములు గల సమస్తప్రపంచమునకు గమ్యస్థానము నీవే. ఆశ్రయము నీవే నీవుతప్ప నింతటికి నాథులు వే ఱెవ్వరు గలరు? మధువును జంపినవాఁడవు నీవ, లక్ష్మీపతివి నీవ, పద్మనాభుఁడవు నీవ, నీవే యాద్యంతములు లేక నిత్యముగ శాశ్వతముగ నుండువాఁడవు. ఈ జగముల నీవేకదా స్థాపించితివి. నీవలననె కదా నేను గలిగితిని. నీవే సృష్టివేళ నీయందున్న లోకములను వెలుపల గోచరింపఁ జేసెదవు. దానినే సృష్టియందురు. ప్రళయవేళ నన్నియు నీయందే ప్రవేశించును. అది సంహార మందురు. ఈ రెండు నీవేకదా వాస్తవమునఁ జేయువాఁడవు. కావున నిప్పుడీ రాక్షసుని గెలుచు నుపాయమేదో చెప్పుము. నీవు చక్రము ధరించి సాహ్యపడుదువా?

—♦ విష్ణు వింద్రునితోఁ దాను యుద్ధమునకు రానని చెప్పుట ♦—

ఉ. భీయుత చిత్తుఁడై యిటులు ♦ వేఁడు సురేంద్రునిఁ జూచి పల్కె నా
రాయణుఁ డో మహేంద్ర! భయ ♦ మందకు కార్యము తీరు విన్మ నీ
వీ యసురుం డజయ్యుఁడు సు ♦ మీ విబుధాసురకోటి కింక నే
నాయ వధింప శక్య మగు ♦ నారసగర్భువరంబు పెంపునన్. ౬౦౬

అర్థములు. భీయుతచిత్తుఁడై=భయముతోఁ గూడిన మనస్సు గలవాఁడై, అజయ్యుఁడు=జయింపరానివాఁడు.

తాత్పర్యము

భయపడి యిట్లు వేఁడుచున్న యింద్రునిఁ జూచి విష్ణుమూర్తి యిట్లనెను. మహేంద్రా! భయపడకుము. జరుగవలసినది చెప్పెద వినుము. వీఁడు బ్రహ్మవరము వలన దేవాసుర సమూహములకు జయింపరానివాఁడు. కావున నిప్పుడు వాని నెట్లు జయింపనగును.

చ. తెలిసితి నే నిసర్గమగు ధీమహిమంబునఁ బుత్త్రయుక్తుఁడై
సలిపెడిఁ బంక్తికంధరుఁడు చాలభయంకర మైన కృత్యమున్
బిలిచితి నన్నుఁ దోడ్పడఁగ భీమరణంబున కేను వానితోఁ
గలహ మొనర్ప నిప్పు డరుగన్ మదిగొల్ప దదేల యంటివేన్. ౬౦౮

అర్థములు. నిసర్గమగు ధీమహిమంబునన్=స్వభావబుద్ధిబలముచే, భయంకరమైన కృత్యమున్=భయము గలిగించు కార్యము, ఇది ఇంద్రుఁడు చెఱఁబడుటె గౌతమశాపము వ్యర్థపడరాదుగదా.

తాత్పర్యము

(రావణుఁడు కొడుకుతోఁ గూడి చాల భయంకర కృత్యములు చేయుచున్నాఁడని నేను స్వభావసిద్ధమైన బుద్ధిబలముచేఁ దెలిసికొంటిని. నీవు నన్ను భయంకరమగు యుద్ధమునకు నాయుపడఁ బిలిచితివి. కాని వానితో నిప్పుడు యుద్ధము చేయనచ్చుటకు మనసొప్పకున్నది. ఏలయందువా?

క. వెన్నుండు శత్రువరులన్, మన్నిగొనక సంగరమున మరలఁడు సుమీ బ్రహ్మ
యన్నియమ మిపుడు చెల్లద, యన్నిశిచరవరుఁడు విధివశ రావితుఁడగుటన్. ౬౦౯

అర్థములు. వెన్నుండు=విష్ణుఁడు, మన్నిగొనక = చంపక, విధివర+అవితుఁడు=బ్రహ్మవరముచే రక్షితుఁడు కావున.

తాత్పర్యము

ఇంద్రా! విష్ణు వెన్నడేని యుద్ధమున శత్రువుల జంపక మరలఁడు. బ్రహ్మవరము వానిని రక్షించుచున్నది కావున నా నియమ మిప్పుడు కొనసాగదు.

గౌతముని శాపము నెఱవేఱవలసియున్నది. రావణుని జంప వలను పడదు. ఈ రెండింటికి నడ్డపడరాదు. కావునఁ దాను నాక నిరాకరించెను.

చ. ప్రతిన వచింతు విన్ము సుర వల్లభ! రావణు సేన చంపెదన్
హితమతితో ముకుంబు ఘటియింతు బుధాళికి నిక్క మా శచీ
పతి! సమయంబు వేచి ధృతిఁ బాయకు, భంజన మిమ్ము వానికిన్
వితతబలంబుతో నరిగి వేగ మ టన్నను బాకవైరియున్. ౬౧౦

తాత్పర్యము

నీవు వచ్చి వేఁడితివి కావున నీప్రార్థన వ్యర్థపఱుపరాదు నేనొక ప్రతిజ్ఞ చేసెద వినుము. సమయము చూచి రావణుని నేనే చంపెదను. దేవతలకు సంతోషము కలిగింతును. ఇది నిజమే. ధైర్యము వదలకుము. ఇప్పటికి నీవు సేనతోఁబోయి యుద్ధము చేయుము అని చెప్పఁగా నింద్రుఁడు.

—* దేవ రాక్షస యుద్ధము *—

సీ. ఆదిత్యవసురుద్రు ◊ లశ్వినుల్ మరుతులు, వెంటరా ననికయి ◊ వెడలిచనుఁడు
రజనీక్షయంబున ◊ రావణసేనతోఁ, బలమున సురసేన ◊ తలపడంగ
నక్షయంబైన యా◊యసురసైన్యముఁ గాంచి, సంక్షోభమందిరి◊సకలసురలు
పోరు ఘోరం బయ్యెఁ ◊ గ్రూరనానాయుధ,కోటుల నిరువాఁగు◊కొట్టుకొనఁగ

ఆ. నంతలోన రావణాసురమంత్రు ల కంపనప్రహస్త◊ఖరనికుంభ
యజ్ఞకోపశుకన◊రాంతకసంహ్లాద, జంబుమాలిసూర్య◊శత్రువులును. ౪౦

అర్థములు. అనికయి=యుద్ధములకై; రజనీక్షయంబున=ఉదయమున, ఇరువాఁగు=రెండు పక్షములవారు.

తాత్పర్యము

(ద్వాదశాదిత్యులు, ఏకాదశరుద్రులు, అష్టవసువులు, అశ్వనిదేవతలు, మరుత్తులు తన వెంటరాఁగా యుద్ధమునకై బయలుదేఱిపోయి యుదయమున రావణుని, సేనతో దేవతలసేన బలముగాఁ దలపడిరి. అందు అక్షయమైన రాక్షస సేనను జూచి దేవతలందఱు సంక్షోభమును జెందిరి. రెండు పక్షముల వారును క్రూరములయిన యనేక విధములయిన యాయుధములతోఁ గొట్టుకొనఁగా యుద్ధము భయంకర మయ్యెను. అంతలోన రావణాసురుని మంత్రులు అకంపన, ప్రహస్త, ఖర, నికుంభ, యజ్ఞ, శుక, నరాంతక, సంహ్లాద, జంబుమాలి, సూర్యశత్రువులును.-)

సీ. మారీచసుప్తఘ్న ◊ సారణదుర్ముఖ,ధూమకేతువులును◊దూషణుండుఁ
గరవీరనేత్రత్రి ◊ శిరులు మహాపార్శ్వుఁ, డును మహాదంష్ట్రిండు◊ఘనబలుండు
అతికాయుఁడును విరూ◊పాక్షఘటోదరు, లలమహోదర మహా◊హ్రాదులొగి మ
హాకాయ దుర్ముఖు ◊ లతిబలుఁడైన దే,వాంతకుండును గూడి ◊ యరుగుదేర

తే. రావణునితాత శౌర్యధు◊రంధరుండు, వెస సుమాలి సురావళి◊విచ్చలింప
ఘోరశస్త్రాస్త్రసమితిని◊గూల నడిచి, తోలె వాయువు మబ్బులఁ◊దోలునట్లు.

తాత్పర్యము

(మారీచుఁడు, సుప్తఘ్నుఁడు, సారణుఁడు, దుర్ముఖుఁడు, ధూమకేతువు, దూషణుఁడు, కరవీరనేత్రుఁడు, త్రిశిరుఁడు, మహాపార్శ్వుఁడు, మహాదంష్ట్రిఁడు,

అతికాయుఁడు విరూపాక్షుఁడు, ఘటోదరుఁడు, మహోదరుఁడు, మహాప్రహోదుఁడు, మహాకాయుఁడు, దుర్ముఖుఁడు, మిగుల బలశాలియైన దేవాంతకుఁడు కలిసిరాఁగా రావణుని తాత సుమాలి వాయువు మబ్బులను జెదరఁ గొట్టునట్లు దేవతలు భయపడి పాఱిపోవునట్లు ఘోరములగు నస్త్రశస్త్రములు ప్రయోగించి తఱిమెను.

ఉ. పైపడి తాఁచుచున్న సురవైరుల వేఁడిమి కోహటించి తా
రేపఱి సింహముల్ దఱుమ హీనమృగంబులు పాఱునట్టులై
యోపిక లేకఁ పాఱఁ గని యోధవరాగ్ర్యులు త్వష్టృపూషులా
క్షేపపురస్సరం బరులసేనల మార్కొని విక్రమించిరన్. ౼౧ ౨

అర్థములు. తాఁచుచున్న=కొట్టుచున్న, ఏపఱి=బలముచెడి, యోధవరాగ్ర్యులు=యోధశ్రేష్ఠులం దుత్తములు, త్వష్టృపూషులు=త్వష్ట పూషుఁడు అనువారు, ఆక్షేపపురస్సరంబు=ఆక్షేపవాక్యంబులు చెప్పుచు.

తాత్పర్యము

పైపడి కొట్టుచున్న రాక్షసుల ప్రతాపమునకు వెనుదీసి దేవతలు బలము చెడి సింహములు దఱుమగాఁ బరువెత్తు క్షుద్రమృగములవలె నిలువలేక పరువెత్తఁగా జూచి త్వష్ట పూషుఁడు ననువారు రాక్షసుల నాక్షేపించుచు వారిని నెదిరించి పరాక్రమము చూపఁగా.

తే. అధికబలశాలి వసువుల నష్టముండు, వీరసత్తముఁ డైన సావిత్రుఁ డప్పు
డరులు గగ్గోలువడఁ దాఁక నాహవంబు భూతజాతమహాభీతిహేతువయ్యె.

అర్థములు. గగ్గోలుపడ=కలఁతపడ, ఆహవంబు=యుద్ధము, భూతజాత=ప్రాణిసమూహముయొక్క, మహాభీతి = గొప్పభయమునకు, హేతువయ్యెన్=కారణ మయ్యెను, చూచు ప్రాణికోటి యంతయు మిగుల భయపడియెననియర్థము.

తాత్పర్యము

(మిగుల బలశాలియు వసువులలో నెనిమిదవవాఁడు, వీరులలో శ్రేష్ఠుఁడు నైన సావిత్రుఁ డప్పుడు శత్రువులు కలఁతపడునట్లు తాఁకఁగా, యుద్ధము చూచి ప్రాణి సమూహము చాల భయపడెను.)

క. నిశితాయుధధారాహతి, దశముఖసైన్యంబు దేవతల వధియింపన్
విశసన మొనరించి రమరులు, వశ మతి కూలంగ శత్రుబలసంఘంబున్. ౼౧౮

అర్థములు. నిశిత=వాఁడియైన, ఆయుధ=సాధనములయొక్క, ధారాహతిచే=వాదరల దెబ్బలచే, విశసన మొనరించిరి=చంపిరి, వశము+అతి=స్వాధీనముతప్పి, శత్రుబల సంఘంబున్=విరోధుల సేనాసమూహమును.

తాత్పర్యము

వాఁడియైన యాయుధముల దెబ్బలచే రాక్షసులు దేవతల వధింపఁగా దేవతలు శత్రుసేనలు స్వాధీనము తప్పి పడునట్లు చంపిరి.

ఉ. అప్పుడు నాకలోకనిలయాంబుదమార్గణవృష్టి జోఁపుచున్
తెప్పున భీమమారుతము తీరున వచ్చి సుమాలి శూలముల్
గుప్పలుగాఁ బయిం బఱపి కొండలపాటొదవించి శీర్షముల్
చొప్పలు చేయ దేవతలు దూలిరి పాఱిరి భీతి ముంపగన్. ౬౧౫

అర్థములు. నాకలోకనిలయ=దేవతలయొడి, అంబుద=మేఘముల యొక్క, మార్గణవృష్టి=బాణవర్షము, జోఁపుచున్=ఎగురఁజిమ్ముచు, తెప్పునన్=త్వరగా, భీమమారుతము=భయంకర వాయువు, కొండలపాటు=కలఁత.

తాత్పర్యము

అప్పుడు దేవతలు మేఘములవలె బాణములను వర్షము గురియింపఁగా భయంకర వాయువువలె సుమాలివచ్చి దాని నెగురఁగొట్టి శూలములను గుప్పలు గుప్పలుగాఁ గురియించి కలఁతపడచేసి దేవతల తలలు చొప్పలవలె నగునట్లు పగులఁగొట్టఁగా దేవతలు భయపడి పరువెత్తిరి.

ఆ. ఆ సుమాలి తెంపు నీసుమాలుచు సురల్ దిక్కుమొగములైన తెరువుఁగాంచి
యా సుమాలిఁ బోలి యల్ల సావిత్రుండు, స్వీయసైన్యవితతిఁ జేరి రాఁగ. ౬౧౬

అర్థములు. ఈసుమాలుచు=ఈర్ష్యవదలి, దిక్కుమొగములు = దిక్కుల ప్రక్కముఖములు గలవారు, అనగా దిక్కుల వెంటఁ బరువెత్తినవారు, తెరువు= మార్గము, సుమాలిన్=సూర్యుని

తాత్పర్యము

ఆ సుమాలి సాహసము రోషమువదలి దేవతలు దిక్కుల వెంటఁ బరువెత్తుట చూచి వసువులలో సావిత్రుఁడను నెనిమిదవ వసువు తనసేనకలిసి రాఁగా

క. ఆ మరుదరికెదురుగఁ జని, జీమూతముమాడ్కి నిలిచి చెచ్చెర శరధా
రామండలిఁ గప్పుచు బలభీమునిఁ గుదియింప నుభయులు వీఁకల కచటన్. ౬౧౭

అర్థములు. మరుదరికి=రాక్షసునకు, జీమూతము=కొండ, 'జీమూతౌ మేఘ పర్వతౌ' నానా ॥౪॥. శరధారామండలిన్=బాణధారలచేఁ గప్పుచు.

తాత్పర్యము

(ఆ భయంకరమగు బలముగల రాక్షసులకెదురుగాఁ బోయి, కొండవలె నిలిచి వేగముగా బాణపరంపరలచే మరలింప నాపీరు లిరువుర కచ్చట.)

శా. భీమం బయ్యెను సంగరంబు వసుసద్వీరుండు శాతాంబక
స్తోమంబుల్ గురియించి శత్రురథమున్ ముత్తునకలం జేసి ని
ర్ధూమజ్వాలపరీతవహ్ని కెనయై రూక్షంబు నౌ పెన్గదన్
దా మూర్ధంబునఁ గాలదండ మనఁ గ్రోధస్ఫూర్తిమై వైచినన్. ౬౧౨

అర్థములు వసుసద్వీరుఁడు = మంచివీరుఁడైన వసువు, సావిత్రుండు, శాతాంబకస్తోమంబుల్=వాఁడిబాణముల సమూహములు. ముత్తునకలన్=మూఁడు ముక్కలుగాఁ జేసి, నిర్ధూమజ్వాలాపరీత వహ్నికిన్=పొగలేని శిఖలచేఁ గూడిన యగ్నికి సమానమై రూక్షంబు=కఠినమైన, మూర్ధంబునన్ = శిరమునందు, కాలదండము=యమదండము, క్రోధస్ఫూర్తిమై=విశేషరోషముచే.

తాత్పర్యము

వారి యిరువురకు భయంకరయుద్ధము జరగెను. అంత వీరుఁడగు వసువు సావిత్రుఁడు పదునైన బాణములు గురియించి సుమాలి తేరిని మూఁడుతునుకలు చేసి పొగలేనిజ్వాలలచేఁ గూడిన యగ్నివలెనై కఠినమైన గదను కాలదండమో యనునటు వాని తలమీఁద రోషమున వైచెను.

ఉ. రక్కసుఁ డా గదాహతి శిరం బిది మాంసము నెమ్ము లివ్వి యం
చెక్కడ గుర్తుచిక్కక మహిన్ వెసఁ గూలెను భస్మితుండుగాఁ
దక్కినసోఁకు లద్ది గని తత్తఱఁ బాఱిరి రోదనాదముల్
మిక్కిలిగాఁగ నట్టియెడ మేటిబలిష్ఠుఁడు మేఘనాదుఁడున్. ౬౧౩

తాత్పర్యము

రాక్షసుఁ డా సుమాలి యా దెబ్బచే నిది తల, యిది మాంసము, ఇవి యెముకలు అని గుర్తింపరాక యుండునట్లు భస్మమై నేలఁ గూలెను. తక్కిన రాక్షసు లది చూచి గట్టిగానేడ్చుచుఁ బరువెత్తిరి. అప్పుడు మిగుల బలవంతుఁడైన మేఘనాదుఁడు.

౨౮వ సర్గము

ఉ. వారలనెల్లఁ గ్రమ్మఱఁగ బల్కి మహార్హము కామగంబు నౌ
తేరిపయిం గృశానుఁ డన దీప్తిరహించుచు శత్రుసేనలన్
ధీరతఁ దాఁక వానిఁ గని తేఁకువఁ బాఱెను దేవకోటి, పా
కారియు సేనపాటుఁ గని యందఱ నెల్గిడి పిల్చి యిట్లనున్. ౬౧౪

అర్థములు. క్రమ్మఱగన్=మరుగెత్తక వెనుకకు రండని, మహార్హము= గొప్పయోగ్యతగలది, కామగంబు=కోరినట్లు పోఁగలది, కృశానుఁడు = అగ్ని, తేఁకువన్=భయముతో, పాకారి=ఇంద్రుఁడు.

తాత్పర్యము

పరువెత్తుచున్న వారిని వెనుకకు రండని పిల్చి మిక్కిలి యోగ్యమై కామసంచారము గలిగిన తేరిమీఁద నగ్నియో యన వెలుఁగుచు శత్రుసేనలను ధైర్యముచే నెదిరింపఁగా వానిఁ జూచి భయపడి దేవతలు పరువెత్తిరి. వారిగతి చూచి యింద్రుఁ డందఱ బిగ్గరగాఁ బిల్చి యిట్లనియె.

క. తగునా దేవతలారా!, మగతనముల విడిచి పాఱ ◊ మరలుఁడు పోరన్
దెగ వ్రేయఁగ నా సుతుఁ డిదె, పగవానిన్ మాఱుకొనియెఁ◊బరికింపుఁడనన్.

తాత్పర్యము

(దేవతలారా! మగతనమువదలి యుద్ధమునుండి మరలి పాఱిపోవుటతగునా? యుద్ధమునకు మరలుఁడు; ఇదిగో నా కుమారుఁడు పగవానిని తెగవేయఁబూని యెదురొ్కనెను. పరికింపుఁడు అని చెప్పఁగా.)

—◊ జయంత మేఘనాధుల యుద్ధము ◊—

చ. సురలు పులోమజా తనయు ◊ శూరు జయంతసమాఖ్యు రావణా
సురసుతుఁ దాఁక గాంచి ధృతి ◊ చొప్పడఁ దారును బాసలైన సం
గర మతిరోమహర్షమయి ◊ క్రాలెను రావణశక్రనందనుల్
సరిసరి గాఁగఁ బోరిరి చలంబు బలంబును బాయ కిద్దఱున్. ౬౨౨

అర్థములు. ధృతి=ధైర్యము, చొప్పడన్=కలుగఁగా, బాసలైనన్=సహాయపడఁగా, రోమహర్షము=గగ్గురుపాటు.

తాత్పర్యము

దేవతలు శచీదేవి కుమారుఁడును శూరుఁడును జయంతుఁడను పేరుగలవాఁడు మేఘనాదుని నెదిరింపఁగాఁ జూచి ధైర్యము దెచ్చుకొని దేవతల లాయనకుఁ దోడుపడఁగా జయంత మేఘనాదులకు భయంకరమైన గగ్గురుపాటు గలిగించు యుద్ధము జరగెను. వా రిరువురు చలము బలము వదలక సరిసమానముగఁ బోరిరి.

సీ. మండోదరిసుతుండు ◊ మాతలినందను, గోముఖుఁ డనివాని ◊ క్రూరబాణ
ములను నొప్పించిన ◊ బలిజయంతుం డల్లె, యొనరించి రావణు ◊ నుగ్రబాణ
వితతి నొప్పించిన ◊ వీరుఁడు శోకుఁడు, నట్టె జయంతుని ◊ నడిచె సంత
విడక మాయను గొని ◊ బెడిదంపుఁజీకట్లు, గవియంగఁ జేసి సంగ్రామధరణిఁ

ఆ. బ్రాసశూలఖడ్గ ◊ పరిఘశతఘ్నికా, ముసలభూరిగదల ◊ ముసురు వోలెఁ
గురిసి ధారణీధ్రకూటకోటులు శత్రు, సేనమీఁద వైచెఁ జేద్భుడంగ. ౬౨౩

తాత్పర్యము

మేఘనాదుఁడు, మాతలి కుమారుఁడై జయంతుని సారథి యగు గోముఖుఁడను వానిని గ్రూరబాణములచే నొప్పింపఁగా జయంతుఁ డట్టులే మేఘనాదుని సారథిని నొప్పించి యతనిని గొట్టెను. మేఘనాదుఁడును జయంతుని గొట్టెను. ఇట్లు గొట్టి న్యాయ్యయుద్ధమున గెలుపు లేదని యోచించి తాను నేర్చిన తామసీవిద్యచే గాఢాంధకారము వ్యాపింపఁజేసి యీఁటెలను శూలములను కత్తులను గుదియలను శతఘ్నులను రోఁకండ్లను పెద్దగదలను జడివానవలె గురియించి పర్వతశిఖరముల సమూహములు శత్రుసేనలమీఁద వైచెను.

క. మాయాతిమిరముచేతను, వ్యామోహిత మగుడు నుభయంబలములు రక్షః
స్తోమము రాక్షసుల దివౌకోమండలి దేవతలనుం గూల్పఁగఁ జొచ్చెన్. ౧౮

అర్థములు. మాయాతిమిరముచేతను=తనశక్తిచేఁ గల్పించిన చీఁకటిచే, వ్యామోహితము=మోహముచెందినది, రక్షస్స్తోమము=రాక్షససమూహము.

ఇంద్రజిత్తు తనశక్తిచేఁ గల్పించిన చీఁకటివలన రెండుసేనలవారు దిక్కుఁ దెలియక రాక్షసులను రాక్షసులే చంపిరి. దేవతలను దేవతలే చంపిరి.

క. ధ్వాంతము పెల్లువ నచట జయంతునిఁ గానంగలేక యలమటను మరు
త్సంతతి వితాకుఁ గొనె నిట్లంతట వ్యాపించియున్న యాతిమిరమునన్. ౧౯

అర్థములు. ధ్వాంతము పెల్లువన్=అతిశయమైన చీఁకటిచే, అలమటను=విచారముచే, మరుత్+సంతతి=దేవతాసమూహము, వితాకుఁగొనెన్ = నిశ్చేష్టమయ్యెను.

తాత్పర్యము.

గాఢాంధకారమున జయంతుఁ డెచ్చట నుండినది యేమైనది తెలిసికొన లేక విచారపడుచు దేవతల సమూహము నిశ్చేష్టమయ్యెను. ఇట్లు సర్వత్ర వ్యాపించిన యా చీఁకటియందు.

తే. శచికి జనకుండు దితికుల సత్తముండు
పేరుఁడు పులోముఁ డనువాఁడు వేగ వచ్చి
తనదుదౌహిత్రుఁ గ్రహియించి కొని మఱింగి
యరిగి సాగరమును జొచ్చె నసుర లిచట. ౨౦

అర్థములు. దితికులసత్తముండు=దైత్యులందు శ్రేష్ఠుఁడు, దౌహిత్రుని=కూఁతు కొడుకును, జయంతుని, మఱింగి=కానరాకపోయి.

తాత్పర్యము

(దైత్యులందు శ్రేష్ఠుఁడైన పులోముఁడను వీరుఁడు శచీదేవి తండ్రి, తన మనుమఁడైన జయంతుని తీసికొని కనపడకుండఁ బోయి సముద్రములోఁ బ్రవేశించెను. దేవతలిచ్చట.)

చ. హరిహయపుత్రుఁ గానక మ•హావ్యసనంబున వీతహర్షులై
దరమున నిల్వఁజాలక య•థాయథలై చన మేఘనాదుఁడున్
గురుతరసైన్యయుక్తుఁ డయి • కో యని యార్చుచు నంటఁ దాఁకి త
త్సురులను దోలె, నింద్రుఁడు సు•తుం డటఁ గానఁగరామి వేల్పులున్. ౬ ౨౭

అర్థములు. హరిహయపుత్రున్=ఇంద్రునికొడుకును - జయంతుని, వీతహర్షులై=సంతోషము లేనివారై, దరమునన్ =భయముచే. యథాయథలై= చెదరి పోయినవారై, గురుతర సైన్యయుక్తుఁడై=గొప్ప సేనతోఁ గూడినవాఁడై, తత్సురులను=ఆ దేవతలను, సంస్కృతసమాసము గావున పుంలింగ రూపము.

తాత్పర్యము

(ఇంద్రుని కొడుకగు జయంతునిఁ గానక, సంతోషము లేనివారై మహాదుఃఖమును జెంది భయముచే నిలువఁజాలక చెదరి పోవఁగా, మేఘనాదుఁడుగొప్ప సేనతో 'కో' యని యఱచుచు వెంటఁబడి యా దేవతలను దఱిమెను. ఇంద్రుఁడక్కడఁ దన కొడుకుఁ గానరాకుండుటచే, దేవతలను.)

—• ఇంద్రుఁడు యుద్ధమునకు వెడలుట •—

చ. కలవరపాటు చెందుటయుఁ • గాంచి రథంబును దేరఁ బంప మా
తలి యటు సేయఁగా ననికిఁ • దర్లె మహేంద్రుఁడు హ్రాదినీలతా
కలితపయోధరోత్కరము•గర్జల నించుచు మున్ను వాయుసం
చలితములై చనన్, నటన•సంభ్రమతత్పరలైరి యచ్చరల్. ౬ ౨౮

అర్థములు. అనికిన్=యుద్ధమునకు, తర్లెన్ =ప్రయాణ మయ్యెను, హ్రాదినీలతా=మెఱుపుఁదీఁగతో, కలిత=కూడిన, పయోధరోత్కరము = మేఘముల సమూహము, గర్జలు=ఉఱుములను, వాయు సంచలితములై=గాలిచేఁ గదలినవై, నటన సంభ్రమ తత్పరలు=ఆడుటయందు వేగిరపాటు గలవారు.

తాత్పర్యము

కలత చెందఁగా గాంచి తేరిని దీసికొని రమ్మని పంపఁగా మాతలి యట్లే తీసికొనిరాఁగా నింద్రుఁడు మెఱుపుఁదీగలతోడ మేఘము లుఱుముచు ముందు పోఁగా యుద్ధమునకుఁ బ్రయాణ మయ్యెను. అప్పు డచ్చర లాడిరి.

తే. నవ్యగతి వాద్యములను గం♦ధర్వసమితి, పరగఁ జేసెను నిర్జర♦వసు మరుద్గ
ణములు రుద్రులు సాధ్యులు♦గుములుగాఁగ, సకలసాధనములతోడఁ♦జనిరి కూడ.

అర్థములు. నవ్యగతిన్=మనోహరముగ.

తాత్పర్యము

(గంధర్వసమూహము మనోహరముగ వాద్యములు చేసిరి, దేవతలు వసువులు మరుత్తులు, రుద్రులు, సాధ్యులు, గుంపులుగా సకల సాధనములతో నాతని వెంటఁ జనిరి.)

క. పరుషగతి వీచెఁ బవనుఁడు, దొరలె మహోల్కా-చయంబు♦తోయజహితుఁడున్
బరిభుతతేజుం డయ్యెను, హరిహయుఁ డాలంబు సేయ♦నరిగెడి వేళన్. ౬౩౦

అర్థములు. పరుషగతిన్=కఠినముగా బాధ కలుగునట్లు, మహోల్కా-చయంబు-పెద్ద కొఱవుల సమూహము, తోయజహితుఁడు=సూర్యుఁడు, పరిభుతతేజుఁడు=తేజస్సు పోయినవాఁడు, హరిహయుఁడు=ఇంద్రుఁడు, ఇవి యన్నియు నపశకునములే.

తాత్పర్యము

ఇంద్రుఁడు యుద్ధమునకుఁ బోవు సమయంబున నిష్ఠురముగా గాలివీచెను. కొఱవులు రాలెను. సూర్యుని కాంతి మాసెను.

క. ఈలోన మహాభోగా, భీలాశీవిషవితాన ♦ వృత మగుచును
దద్వ్యాళవినిశ్వాసానిల జాలంబులచేత మండు ♦ చందం బగుచున్. ౬౩౧

అర్థములు. ఈలోనన్=ఇంద్రుఁడు యుద్ధమునకు సిద్ధపడి వచ్చులోపల, మహాభోగ=పెద్ద దేహముగల, అభీల=భయంకరమైన, ఆశీ విష వితాన=సర్ప సమూహములచే, వృతము=చుట్టఁబడినది, తత్=ఆ, వ్యాళ=సర్పముల. వినిశ్వాసానిలజాలంబుచేత=ఊర్పు గాలుల సమూహముచే.

తాత్పర్యము

ఇంద్రుఁడు యుద్ధమునకు వచ్చు లోపల పెద్దదేహములు గలిగి భయంకరములైన సర్పములచేఁ జుట్టఁబడి యా పాముల యూర్పుగాలులచే మండుచున్న దానివలెనె.

తే. విశ్వకర్మకృతం బయి ♦ వెలయుచున్న, స్యందనం బెక్కి దైత్యని♦శాచరాళి
బలసి రాఁ బంక్తికంఠుండు ♦ భండనమున, కేగుదెంచెను శక్రున♦కెదురుగాఁగ.

అర్థములు. స్యందనము=తేరు, బలసి = చుట్టుకొని, భండనంబునకు=యుద్ధమునకు.

(రావణుఁడు, దైత్యుల రాక్షసుల మూఁకలు చుట్టు కొలిచి వచ్చుచుండ, విశ్వకర్మ రచించిన రథమెక్కి యుద్ధమునకై యింద్రుని కెదురుగాఁ బోయెను.)

క. అరుదెంచుచు సుతుతో సం, గరమును జాలింపు మీవు ◊ గాసి దొలంగన్
హరిహయు నే గెలిచెద నన, దురమును జాలించి యతఁడు◊మారం బుండెన్.

తాత్పర్యము

వచ్చుచు కొడుకును జూచి నీవు యుద్ధమును జాలింపుము. గాసి తీర్చుకొనుము. ఇంద్రుని నేను గెలిచెదను. అని చెప్పగా మేఘనాదుఁడు యుద్ధమును జాలించి మారమం దుండెను.

—◊ కుంభకర్ణుఁడు దేవతలతోఁ బోరుట ◊—

ఉ. అప్పుడు దేవతావళికి ◊ నాశరకోటికిఁ బోరు ఘోరమై
యొప్పెను గుంభకర్ణుఁడును ◊ యుద్ధము చేయుట యేరితోడ నా
చొప్పు నెఱుంగ కే యెదుటఁ ◊ జూడ్కికిఁ దోఁచినవారి నెల్ల దా
నుప్పెన మాఱుకోఁ గడఁగె ◊ నుద్యతభీషణశస్త్రజాలుఁ డై. ౩౮

అర్థములు. ఆశరకోటికిన్=రాక్షస సమూహమునకు, ఉప్పెన=విజృంభణముచే, ఉద్యత=ఎత్తఁబడిన, భీషణ = భయంకరమైన, శస్త్రజాలుఁడై=ఆయుధ సమూహము గలవాఁడై.

తాత్పర్యము

అప్పుడు దేవతలకు రాక్షసులకు ఘోరమైన యుద్ధము జరగెను. అందుఁ గుంభకర్ణుఁడు తా నెవరితో యుద్ధము చేయునది తెలియక తన యెదుట నెవరు కనఁబడిన వారితో నెల్ల విజృంభించి ఆయుధములతో యుద్ధము చేయ నారంభించెను.

ఇచ్చట గుంభకర్ణుఁడు పెక్కుదినములు, నాలుగైదు దినములు, మేలుకొని యున్నట్టు చెప్పఁబడెను. కావున వాఁడొకనాఁటికంటె నెక్కువఁగ గూడ మేలుకొని యుండుటయుఁ గలదని యేర్పడుచున్నది

క. కరములఁ బదములఁ గోఱల, గురుతరశక్తులను బాణ◊కోటుల నసి తో
మరముల నిర్జరులను సం, గరమున వధియింపఁ దొడఁగె◊గసిబిసి గాఁగన్. ౩౪

అర్థములు. అసి=కత్తులను, తోమరములన్=చిల్లకోలలతోను, గసిబిసి గాఁగన్=కలఁతపడునట్లు.

తాత్పర్యము

చేతులతో కాళ్ళతో కోఱలతో గొప్ప శక్తులతో బాణసమూహములతో కత్తులతో చిల్లకోలలతో దేవతలు కలఁతచెందునట్లు యుద్ధమందుఁ జంపుచుండెను

క. ఆతనివడిఁ గని రుద్రులు, జాతమహాక్రోధమున నిశాచరు నానా
హేతిముఖ సాధనంబుల, నాతతగతి మోఁదఁ గాఱె నస్రపుధారల్. ౬౩౬

అర్థములు. నానాహేతిముఖ సాధనములన్=అనేకములైన కత్తులు మొదలగు నాయుధములతో, అస్రపుధారల్=నెత్తురు ధారలు.

తా త్ప ర్య ము

అతని వేగము చూచి మిగులఁ గోపించి రుద్రు లా రాక్షసుని ననేకవిధములయిన కత్తులు మొదలగు నాయుధములతో విస్తారముగ మోఁదఁగా నెత్తురు ధారలు గాఱెను.

ఉ. రుద్రులు విక్రమించి యదరుం బెదరుం గొన కుత్సహించి ని
ర్నిద్రపరాక్రమంబునను గ్రీడయపోలె నరాతిసేనలన్
రౌద్రము గాఁగఁ ద్రుంచిరి శరంబుల భీకరసాధనంబులన్
క్షుద్రమృగాళి సింహములు గూల్చువిధంబుగ నేవు చూపుచున్. ౬౩౭

అర్థములు. నిర్నిద్ర=హెచ్చరిక గల, అరాతిసేనలన్=శత్రుసేనలను.

తా త్ప ర్య ము

(రుద్రు లదరు బెదరు లేక యుత్సాహముతో హెచ్చరిక గలిగిన పరాక్రమించి క్షుద్రమృగములను సింహములు చంపునట్లు బాణములు మిగుల భయంకరములగు మున్నగు సాధనములచే భయంకరముగా విజృంభించి శత్రుసేనలను ద్రుంచివేసిరి.)

—౦ మరుత్సహాయుండై యింద్రుఁడు రాక్షసుల వధించుట ౦—

క. మరుతులు నానాప్రహరణ, కరులై యరులైనవారిఁ గదనంబున ని
ర్భరబలజవగరిమంబులఁ, బరుషగతిన్ నఱకి వైవఁబస చెడి సోఁకుల్. ౬౩౮

అర్థములు. మరుతులు=వాయువులు. నానాప్రహరణకరులై=అనేకాయుధములు చేతుల ధరించిన వారై, అరులు=శత్రువులు, కదనంబునన్=యుద్ధమందు, నిర్భర=అతిశయించిన, జలజవ గరిమంబులన్=గొప్ప బలవేగములతో, పరుషగతిన్=నిష్ఠురముగ, సోఁకుల్=రాక్షసులు.

తా త్ప ర్య ము

మరుత్తులు నానావిధసాధనములఁ గేల ధరించి యుద్ధమందు శత్రువులగు వారిని నధికబలముచేతను వేగముచేతను దయ లేక నఱకి వేయఁగా రాక్షసులు బెంకువడి పోయిరి.

సీ. కాలుసేతులు దెగి ◊ క్ష్మాస్థలిఁ బడువారు, వాహనంబులతోడ◊ వ్రాలువారు
రథనాగతురగఖ◊రంబులఁ బన్నగో,ష్ట్రింబుల శింశుమా◊రములఁ గిరుల
నాలింగనము చేసి ◊ యట్లె యుండెడివారు, నిలఁబడినట్టుల ◊ నీల్గువారు
చేష్టావిహీనులై ◊ చేడ్పడువారుగా, రణ మొప్పెఁ జిత్రక◊ర్మంబురీతి
తే. శక్రసంభిన్ననిహతని◊శాచరాళి, తనువులను గాఱు శోణితో◊దకము గృధ్ర
కంకసంఘాకులితమయి◊కాండనక్ర,మగుచు నేఱయి ప్రవహించె◊నద్భుతముగ.

అర్థములు. రథ=తేరులను, నాగ=ఏనుఁగులను, తురగ=గుఱ్ఱములను, ఖరంబులన్=కంచర గాడిదలను, పన్నగ+ఉష్ట్రింబులను=పాములను ఒంటెలను, శింశుమారములను=మొసళ్ళను, కిరులన్=అడవిపందులను, ఏదుపందులను, నీల్గువారు=చచ్చువారు, శక్ర=ఇంద్రునిచే, సంభిన్న=నఱకఁబడిన, నిహత=కొట్టఁబడిన, నిశాచరాళి=రాక్షస పంక్తులు, శోణితోదకము=రక్తజలము, గృధ్ర=గ్రద్దలు, కంక=రాబందులు, వీని సంఘ=గుంపులచే, ఆకులితమయి = కలతచెందినదై, కాండనక్రము=బాణము లనెడి మొసళ్ళుగలది.

తాత్పర్యము

కాళ్ళుచేతులు తెగుటచే భూమిపైఁ బడువారును, కొందఱు వాహనములతోఁ బడువారును, కొందఱు తమకు వాహనములైన రథములను ఏనుగులను గుఱ్ఱములను కంచరగాడిదలను పాములను ఒంటెలను మొసళ్ళను ఏదుపందులను కౌఁగిలించుకొని యట్టులే యుండువారును, నిలునఁబడిన వారు నిలువఁ బడినట్లే చచ్చువారును, కొందఱు కాలుసేతులు కదలింపక బాధపడువారునై యుద్ధము చిత్రకర్మమువలెఁ గాన వచ్చెను. ఇంద్రునిచే నఱకఁబడి కొట్టబడిన రాక్షసులు దేహముల నుండి కాఱు రక్తమను జలము గలదై గ్రద్దలు రాబందులు గుంపులు గలిగి బాణములను మొసళ్ళు గలదై యేఱయి పాఱెను.

చ. తనబలగంబు సర్వము సు◊రదైవతకోటులు ద్రుంపఁగా దశా
ననుఁడు భయంకరాకృతి ఘ◊నస్వన మీనెడి భూరిమార్వికిన్
సునిశితబాణజాలముల ◊ సూర్లకొలందులఁ గూర్చి దేవవా
హిని పొవ రెల్ల మాన్చి విబు◊ధేంద్రునిఁ దాఁకినఁ బాకవైరియున్. ౬౪౦

అర్థములు. బలగము=సేన, భయంకరాకృతిన్=దిగులు పుట్టించు ఆకారము గలవాఁడై, ఘనస్వనము=గొప్పధ్వని, భూరిమార్వికిన్ = గొప్పయల్లెత్రాటికి, సునిశిత = మిగులఁబదనైన, బాణజాలములన్ = బాణసమూహములను, దేవవాహిని=దేవతల సేనయొక్క, పొవరు=గర్వము, విబుధేంద్రుని=దేవేంద్రుని.

తా త్ప ర్య ము

తన సేన నంతను దేవతలు చంపఁగాఁ జూచి రావణుఁడు భయంకరా కారుఁడై మేఘధ్వని వంటి గొప్పధ్వని గలిగించు నల్లెత్రాటికి పదునైన బాణము లను నూర్లునూర్లుగాఁ గూర్చి దేవసేన గర్వమునంతయుఁ హరించి యింద్రుని నెదిరించిన నింద్రుఁడును.

క. పది దిక్కుల గుణరావము, గుదిగొన ననలాభ బాణకోటులు పఱపన్
మదమున దశముఖుఁడు శిత, ప్రదరంబుల నేసెఁ బుష్కరము భువి నిండన్.

అర్థములు. గుణరావము=అల్లెత్రాటిధ్వని, గుదిగొనన్=కుదించినట్లు దట్ట ముగా, అనలాభ=అగ్నితో, సమానమైన, పఱపన్ = ప్రయోగింపఁగా, శిత ప్రదరంబులన్=పదునుగల బాణములను, పుష్కరము=ఆకాశము, భువి=భూమి.

తా త్ప ర్య ము

అల్లెత్రాటి మ్రోఁత పది దిక్కులందు వ్యాపింపఁగా నగ్నివంటి బాణము లను బ్రయోగింపఁగా రావణుఁడు గర్వించి భూమి యాకాశము నిండునట్లు వాఁడి బాణములు ప్రయోగించెను.

౨౯వ సర్గము

—౦ రావణుఁడు సురసేనామధ్యమునఁ జొచ్చి యుద్ధము సేయుట ౦—

చ. ఇరు లలమెం దలంబుగ మహిష్ఠశరోన్నతి, నట్టి చీఁకటిన్
సురలును రాక్షసుల్ పరనిషూదనదక్షతఁ గ్రాల మత్తులై
పరమబలాఢ్యులై పదవ౦భాగము దక్కఁగఁ దక్క రాక్షసో
త్కరముల నాకమందిరులు ౦ కాలుని ప్రోలికిఁ బంచి రుద్ధతిన్. ౬౮౧

అర్థములు. ఇరులు=చీఁకట్లు, అరిమెన్=ఆక్రమించెను, దలంబుగన్=దట్ట ముగ, మహిష్ఠ=గొప్పదగు, శరోన్నతి=బాణాతిశయముచే, పరనిషూదన దక్ష తన్=శత్రువులను జంపు సామర్థ్యముచే, రాక్షసోత్కరములన్=రాక్షస సమూహ ములను, నాకమందిరులు=దేవతలు.

తా త్ప ర్య ము

గొప్ప బాణము లతిశయముగ వ్యాపించుటచే దట్టముగఁ జీఁక ట్లాక్ర మించెను. అట్టి చీఁకటియందు దేవతలు రాక్షసులు మదించి తమ శత్రువులఁజంపఁ జాలిరి. అందు దేవతలు రాక్షసుల సేనలయందుఁ బదియవ భాగము తప్పఁ దక్కిన తొమ్మిది భాగముల సేన నాశము చేసిరి.

సీ. స్వీయ సైన్యంబుల ౦ క్షీణస్థితిని గాంచి, యాశరేశ్వరుఁడు రోషారుణితము
లైన లోచనముల ౦ స్యందనచోదకుఁ, గని యిట్టు లను దివౌకసుల నెల్ల
శక్రునితోఁడుత ౦ సంహరించెద నేఁడు, శత్రుసేనాంతంబుఁ౦జనగ నిమ్ము
మనతేరు, వరుణునింధనమని వాసవుఁ, బేరు యూపెదఁజూడు౦పేర్మి వెలయ

తే. విడువుము విషాద మిరుమాఱునుడివినాఁడ, నాల మేటికి నందనప్రాంతసీమ
నున్నవారము పూర్వాద్రిం యొద్దకిపుడు, పఱుపుమీ తేరు సారథీ! భయమువలదు.

అర్థములు. ఆశరేశ్వరుఁడు=రాక్షసరాజు, రోషారుణితములు = కోపముచే నెఱ్ఱనైనవి, లోచనములన్=కన్నులచే, స్యందన చోదకున్=సారథిని, దివౌకసుల నెల్లన్=దేవతల నందఱి, శత్రుసేనాంతంబు=విరోధుల సేనలోనికి, విషాదము=దుఃఖము, ఆలము=ఆలస్యము, పూర్వాద్రి యొద్దకు=తూర్పుకొండ సమీపమునకు

తాత్పర్యము

తనసేన లిట్లు క్షీణించుట చూచి రావణుఁడు కోపముచేఁ గన్ను లెఱ్ఱచేసి సారథిని జూచి యిట్లులనియె. సారథీ! యింద్రునితోడ దేవతల నందఱిఁ జంపెదను. వరుణుని ధనదుని యింద్రుని పేరులేకుండఁ జేసెదను. మనతేరు శత్రుసేనలోనికిఁ బోనిమ్ము శత్రువుల మధ్యమునకుఁ బోవుట యపాయకరమని విషాద పడవలదు. ఒకటికి రెండుమార్లు చెప్పుచున్నాను. ఏల యాలస్యము చేసెదవు? ఇప్పుడు మనము నందనవన సమీపమున నున్నవారము. తూర్పు కొండయొద్దకుఁ బోనిమ్ము భయపడవలదు.

చ. అనుడు మనోజవంబుల హయంబుల సారథి దోలె శత్రువా
హిని నడుమంతరంబున సురేశ్వరుఁడున్ దశకంఠునిశ్చయం
బును దలపోసి దేవతలపూగముఁ గాంచి వినుండు నిర్జరుల్!
వననిధిఁ బర్వవేళఁ జొఱంబాఱెడు నట్టులు పంక్తకంఠుఁడున్. ౬౪౪

అర్థములు. మనోజవంబులన్=మనోవేగమువంటి వేగము గలవానిని, శత్రువాహిని=విరోధిసేనకు, పూగము=సమూహము, నిర్జరుల్ = దేవతలారా, పర్వవేళన్=పున్నమనాఁడు వననిధిన్=సముద్రమును.

తాత్పర్యము

అని చెప్పఁగా మనోవేగము గల యా గుఱ్ఱములను సారథి శత్రుసేనల మధ్య భాగమునకుఁ దోలెను. ఇంద్రుఁడు రావణు నుద్దేశం బెఱింగి దేవతలతో, దేవతలారా! పున్నమనాఁడు పొంగుచున్న సముద్రమును జొచ్చినట్లు రావణుఁడు.

— ఇంద్రుడుఁ రావణుని బంధింపఁ బ్రయత్నించుట —

చ. సురపృతనాంతరంబునను జొచ్చెడి నిర్భయుఁడౌచు వీనినిన్
బొరిగొనరాదు బ్రహ్మవరముం దలపోసి యపాట బల్మి సం
గరమున బద్ధుఁ జేయఁ దగు గండడఁగం బలి బద్ధుఁ జేసి సా
ఖ్యరమజగత్త్రియంబు నెతఁ గానక యుండఁగ బ్రోవఁగా నగున్. ౬౪౫

అర్థములు. సురపృతనాంతరంబునను=దేవతలసేన నడుమ.

తాత్పర్యము

దేవసేన నడుమ భయములేక ప్రవేశించుచున్నాఁడు, బ్రహ్మవరమునుబట్టి వీనిని జంపరాదు. కావున వీని గర్వ మడఁగునట్లు యుద్ధమున బలవంతముగఁ బైపడి పట్టి కట్టివేసి మూఁడులోకములకు సౌఖ్యము కలిగింపఁవచ్చును.

చ. అని దశకంఠునిన్ విడిచి యన్యతలంబున కేగి పాకశా
సనుఁ డసురౌఘముం దునుమఁ జూఁగె దశాననుఁ డుత్తరంపుది
క్కున సురసేనఁ జొచ్చెడును గొబ్బున వజ్రియు దక్షిణంపువై
పున బలఁగంబుఁ జొచ్చె, మదపూర్ణమనస్కుఁడు రాక్షసేంద్రుఁడున్. ౬౪౬

తాత్పర్యము

ఈ ప్రకారము దేవతలకుఁజెప్పి రావణుతో యుద్ధము చాలించి మఱియొక చోటికిఁ బోయి యింద్రుఁడు రాక్షససేనఁ జంపుచుండెను. రావణుఁడు దేవసేన యందుత్తరపు వైపునఁ దూఱెను. ఇంద్రుఁడు దక్షిణపు వైపుఁగాఁ బ్రవేశించెను. గర్వముచే నిండిన మనస్సుగల రావణుఁడు.

క. యోజనశతంబు శాత్రవ, రాజిని దాఁ జక్కఁ జని శరంబుల సురలన్
వాజులఁ దేరుల వీరులఁ, దేజు చెడన్ నఱికి వైచెం ధృతి బాసటగన్. ౬౪౭

తాత్పర్యము

ధైర్య మొక్కఁడే సహాయముగ శత్రుసేనలోనికి నూఱామడదూరము పోయి దేవతలను వారి గుఱ్ఱములను తేరులను వీరులను వారి తేజము మాయునట్లు బాణంబులచే నఱికెను.

క. రావణుబీరముఁ గాంచి శచీవిభుఁ డవ్వానిఁ బట్టఁ జింతించి దివౌ
కోవారము తోడ్పడ రక్షోవిభునిం దాఁకె నతఁడుం సుడివడ భ్రమచేన్. ౬౪౮

అర్థములు. దివౌకోవారము=దేవతల సమూహము.

తాత్పర్యము

(ఇంద్రుఁడు రావణుని పరాక్రమము చూచి, వానిని బట్టుకొనవలెనని యాలోచించి, దేవతాసమూహము సాయపడఁగా, రావణుఁడు భ్రమచే సుడి బడునట్లు రావణుని నెదిరించెను.)

క. అయ్యెడ నిటు దశవదనుఁడు, కయ్యంబున గ్రస్తుఁడై నంగతి నుండుడు హా!
యయ్యయ్యో! చచ్చితి మేమయ్యో! యని యఱవఁ బోడఁగిరసురులు గుముల్లై.

అర్థములు. గ్రస్తుఁడు=పట్టుపడినవాఁడు. మ్రింగఁబడినవాఁడు.

తాత్పర్యము

రావణుఁడు తన సేననడుమఁ బ్రవేశించి నలుప్రక్కల సేన ధ్వంసముసేయ నాలోచించి దూఱుటకు యత్నింపఁగా నదియు మేలేయని యాలోచించి యింద్రుఁడు వాని కడ్డుపడక దూరముగఁ దొలగెను. రావణుఁ డడ్డములేక దేవ సేన నడుమఁ బ్రవేశించెను. ఇట్లు వాఁడు ప్రవేశించిన పిమ్మట నింద్రుఁడు మఱి యొక ప్రక్కన వచ్చి తాఁకెను. చుట్టు దేవతలసేన నడుమ రావణుఁడు చిక్కు కొనెను. సహాయుఁ డొక్కఁడైన లేఁడయ్యెను. ఆ కారణముచే వానిని శత్రు సేనలు మ్రింగినట్లయ్యెను. అప్పుడు రాక్షసు లందఱు తమ రాజు గానరాకుండుటచే నయ్యో అయ్యో అయ్యయ్యో యని గుంపులుగట్టి యఱవసాగిరి.

—* మేఘనాదుఁడు మాయచే నింద్రుని బంధించుట *—

చ. అది విని మేఘనాదుఁడు శతాంగము నెక్కి రుషోగ్రమూర్తియై
ప్రిదులనివీఁకఁ దూర్ణగతి వేల్పులమూఁకలలోనఁ జొచ్చి యీ
శ దయను లబ్ధమైన భృశశాంబరిఁ గైకొని దేవతాళిలన్
వదలి మహేంద్రు నొక్కరు నవక్రపరాక్రమ ముల్లసిల్లఁగన్. ౬౫౦

అర్థములు. శతాంగము = రథము. రుషా+ఉగ్రమూర్తియై = కోపముచే భయంకరాకారుఁడై, ప్రిదులని వీఁకన్=సడలు పాఱని పరాక్రమముచే, తూర్ణ గతిన్=వేగముగ, ఈశదయను=మహేశ్వర యాగమున నీశ్వరుఁడు మెచ్చుటచే, భృశశాంబరి=గొప్పమాయను.

తాత్పర్యము

ఈ యఱపులు విని మేఘనాదుఁడు రథమెక్కి కోపముచే భయంకర మూర్తియై పరాక్రమించి వేగముగ దేవతలసేనలోఁ బ్రవేశించి యీశ్వర కటాక్షముచే లభించిన గొప్ప మాయ నాశ్రయించి దేవతల నందఱ వదలి యొక్క యింద్రునిపై పడి మిగులఁ బరాక్రమవంతుఁడై.

ఉ. నొంపఁ గడంగ రావణతనూజునిఁ గానక వృత్రవైరి యో
జింప విముక్తవర్ముఁ డయి చేపడి వధ్యుఁడు నయ్యు మాయ ర
క్షింపఁగ మేఘనాదుఁ, బరసేనల నెవ్వఁడు నేమి సేయఁగాఁ
దెంపరిగాఁడు, రావణియుఁ దీవ్రశరంబుల నొంచె మాతలిన్. ౬౫౧

అర్థములు. నొంప=నొప్పించుటకు, కడంగన్=ప్రారంభింపఁగా, విముక్త వర్ముఁడు=కవచము విడిచియుండువాఁడు, తన్ను రావణుఁడు యుద్ధము చేయ వలదు, గాసి తీర్చుకొను మనుటచే యుద్ధప్రయత్నము చాలించి దూరమందు కవచాదుల వదలి తేరు దిగి యొకచో విశ్రమించి యుండినవాఁడు రాక్షసుల కేకలు

వినఁగానే యున్నవాఁ డున్నట్లు లేచివచ్చెను. కావుననే రథ మెక్కెనని ముందు పద్యమునఁ జెప్పఁబడెను. ఇందుఁ గవచము లేనివాఁడని చెప్పబడెను. చేపడి= లభించి, వధ్యుఁడు=చంపఁ బడఁదగినవాఁడు, కవచము లేని కారణముచే సుల భముగాఁ జంప సాధ్యపడువాఁడు, అయినను వాని తామసీశక్తి వానిని గాన రాకుండ జేసి రక్షించెను.

తా త్ప ర్య ము

నొప్పించుటకుఁ బ్రారంభింపఁగా నింద్రుఁడు తనకు దెబ్బలు తగులుచే కాని కొట్టుచున్న మేఘనాదుని గానలేక యోజింపసాగెను. అప్పుడు వాఁడు కవచము లేనివాఁడై సమీపమందే తన సేననడుమనే యుండుటచే సులభముగ వానినిజంపి యుండవచ్చును గాని వాఁడు చీఁకటిలో నుండుటచే గానరాకుండెను. కావునవాని నెవ్వఁ డేమియుఁ జేయ సాహసించినవాఁడు కాఁడు. మేఘనాదుఁడును మాతలిని గలకు బాణములచే నొప్పించెను.

చ. తికమక లాడ దీలుపడఁ • దేకునఁ గూరంగ శాతమార్గణ
ప్రకరము లన్నివంకల ఘు•రంబు లనం దను నాట శక్రుఁడున్
వికలుఁడు గాక మాతలిని • వీడి రథంబును బాసి వెల్లయే
నికపయి నెక్కి వైరిసుతు•నిన్ వెమకెన్ దివి నాల్గువంకలన్. ౬౫౨

తా త్ప ర్య ము

అవయవములు సడలు పాటి దిగ్భ్రమ గొన భయము పడునట్లు పదునగు బాణములు వాఁ డాకాశమునఁ దిరుగుచుఁ గొట్టుచుండుటచే నన్ని ప్రక్కల నుండి తన్ను నాటఁగా నింద్రుఁడు మనస్సు చెదరనీక మాతలిని వదలి రథమున నుండిన నన్నిప్రక్కల చూడ సాధ్యపడకుండుటచే రథము దిగి యైరావతము నెక్కి విరోధి కుమారుని నాకాశమున నాలుగుప్రక్కల వెదకెను.

శా. మాయారక్షితుఁ డౌట రావణియు జం•భద్వేషికిం దోఁప కే
చాయం దానుగ నుండి శాతశరపుం•జంబుల్ మహావేగముల్
కాయం బంతయుఁ గ్రుచ్చి గాసిగొనఁగాఁ • గావించి శ్రాంతాత్ముఁడౌ
నా యాదిత్యవిభున్ మహేషువుల మా•యాబద్ధుఁ గావించుచున్. ౬౫౩

అర్థములు. జంభద్వేషికిన్=ఇంద్రునికి, శాతశరపుంజంబుల్=వాఁడిబాణ ముల సమూహములు, శ్రాంతాత్ముఁడౌ=బడలిన దేహము గలవాఁడగు, ఆదిత్య విభున్=దేవతల రాజును, మాయాబద్ధున్=తనశక్తిచే బంధింపఁబడినవానిని.

తా త్ప ర్య ము

తన యద్భుతశక్తిచేఁ గాపాడఁబడినవాఁడై మేఘనాదుఁ డింద్రునకుఁ గాన రాక యేప్రక్కను దానైనై మిగుల వేగముగల వాఁడి బాణములచే నతని దేహం బంతయు గ్రుచ్చి గాసిపడఁ జేసి బడలిని యతని తన శక్తిచేఁ గట్టివైచి.

క. కొనిపోవ నిర్జరాళులు, గని యే మిది యెవ్వఁ డొకొ్కొ • కనరాక సురేం
ద్రుని మాయావిద్యావిను, దనమాయం గట్టె బలిమి • దారుణరీతిన్ ౨౮

తాత్పర్యము

ఈడ్చుకొని పోవుచుండఁగా దేవతలు చూచి యేమిది యెవ్వఁడువీఁడు కంటికి గనఁబడక యింద్రుని కట్టివేసి తీసికొని పోవుచున్నాఁడు, ఎవఁడు రాక్షస మాయలను జెఱుచు సదుపాయములు దెలిసిన యింద్రునిఁ దన మాయచేఁ గట్టివైచెను?

మ అని రోషంబున రావణాసురుని వ•స్వాదిత్యులత్యుగ్రులై
ఘననారాచపరంపరానిహతులన్ • గాసిల్లఁగాఁ జేసినన్
దనుజేంద్రుండు ప్రతిక్రియాకలనకున్ • దార్ఢ్యంబు లేకా ద్విష
జ్జనతాతాడన మోర్చి డీల్పడెఁ, దనూ•జాతుండు దా నంతలోన్. ౨౯

అర్థములు. వస్వాదిత్యులు=వసువులు ఆదిత్యులు, ఘననారాచపరంపరానిహతులన్=గొప్ప బాణముల వరుసల దెబ్బలచే, ప్రతిక్రియాకలనకున్=మాఱుచేయుటకు, దార్ఢ్యంబు=శక్తి, ద్విషత్+జనతా+తాడనము=విరోధిజన సమూహముల దెబ్బలను, ఓర్చి=సహించి, తనూజాతుండు=వానికొడుకు.

తాత్పర్యము

ఈ ప్రకారము చెప్పి రోషమున రావణాసురుని వసువులు ఆదిత్యులు మిగుల భయంకరమూర్తులై పెద్దబాణముల వరుసల దెబ్బలచే రావణుఁడు బడలునట్లు చేయఁగా రావణుఁడు దానికి బదు లేమియుఁ జేయఁజాలక యా విరోధులు కొట్టు దెబ్బల సహించి డిల్లపోయెను, ఇంతలో నతని కొడుకు మేఘనాదుఁడు.

—* రావణుఁడు యుద్ధముఁ జాలించి మేఘనాదునిఁ బ్రశంసించుట *—

సీ. గాటంపుటేటులఁ • బోటులఁ దూఁటులౌ, మేనితో గాసిల్లి • మిడుకువాని
జనకునిఁ గనుఁగొని•చాలింపు నాయనా!, సంగర మిం కేల•జయము మనది
సత్య మెఱుంగుము • స్వస్థచిత్తుండ వై, మరలింపు సేనల • సురవిభుండు
మూఁడులోకములకు•ఱేఁడై నవాఁ డిప్డు, బద్ధుఁ డయ్యెను సుర•పటలి పఱచె
ఆ. బలిమి నరిని గెలిచి • యెలమి ముల్లోకంబు. లీవయేలు మేల •వృథగ శ్రమము
రణము నిష్ఫలంబు•రమ్ము బృందారకుల్, కదనమున నివృత్త•కర్ములైరి. ౩౦

అర్థములు. గాటంపు-గాటమైన, ఏటులన్=దెబ్బలచేతను, పోటులన్=ఆయుధముల జోడుపుల చేతను, తూటులౌ=రంధ్రములు పడిన, మేనితో=దేహముతో, సురపటలి=దేవతాసమూహము, పఱచెన్=పరువెత్తెను, బృందారకుల్=దేవతలు, నివృత్తకర్ములు=యుద్ధకార్యములు చాలించినవారు.

తా త్ప ర్య ము

గాఢమైన దెబ్బలచేతను, బోటులచేతను, జిల్లులుపడిన దేహముతో బడలి దుఃఖపడువానిని పుత్రుని జూచి నాయనా! యుద్ధము చాలింపుము. ఇంక యుద్ధ మేల? జయము మనది. ఇది సత్యము. మనసు కుదుటఁబడఁజేసికొని సేనల మర లింపుము. మూఁడులోకములకు రాజైన యింద్రుఁడు నాచే బద్ధుడై మనకు వశపడి యున్నాఁడు. దేవత లందఱు పరునెత్తిరి. శత్రువులను నీ బలముచే గెలిచినవాఁ డవై మూఁడు లోకములు నీవే పాలింపుము ఇఁక యుద్ధమువలనఁ బ్రయోజనము లేదు. రమ్ము. దేవతలు యుద్ధము చాలించిరి.

క. నావుఁడు గుదుట, బడన్ మది రావణుఁడు నితాంతహర్ష♦రసవివశుండై
పోవిడిచి యుద్ధకర్మం, బా పీఁకునిఁ జూచి యనియె ♦ నన్నా! తనయా! ౭౫౭

తా త్ప ర్య ము

(అని చెప్పఁగా, మనసు కుదుటఁ బడఁగా రావణుఁడు సంతోషాతిశయ ముచే, బరవశుఁడయి, యుద్ధము మాని, వీరుఁడైన యా మేఘనాదునిఁ జూచి, అన్నా! తనయా!)

ఉ. ఏమి భవద్బలంబు త్రిది♦వేశ్వరు బద్ధు నొనర్చి దేవతా
స్తోమముఁ బాఱఁదోలితివి ♦ తోరపుఁగీర్తి గడించి తీవు పు
త్రా! మనయన్వయంబు ప్రథి♦తం బొనరించితి కాన నీవు, సు
త్రాముఁడు త్వద్రథస్థుఁడుగఁ ♦ దర్లుము లంకకు నెల్ల సేనతోన్. ౭౫౮

అర్థములు. భవత్ + బలంబు = నీబలము, త్రిదివేశ్వరున్ = మూఁడులోకము లకుఁ బ్రభువగువానిని, బద్ధునొనర్చితివి = కట్టివేసితివి, గడించితివి = సంపాదించితివి, అన్వయము = వంశము, ప్రథితంబు = కీర్తిగలది, సుత్రాముఁడు = ఇంద్రుఁడు, త్వత్ + రథస్థుఁడుగన్ = నీరథమం దున్నవానిగా, తర్లుము = ప్రయాణము కమ్ము.

తా త్ప ర్య ము

కుమారా! యేమి నీ బలము! ఆశ్చర్యమైనది. ముల్లోకములకుఁ బ్రభువగు నింద్రునిఁ గట్టివైచితివి, దేవతల నందఱఁ దఱుమఁగొట్టితివి. విస్తారకీర్తి సంపాదించి తివి. నాయనా! మన వంశము ప్రసిద్ధికెక్కఁ జేసితివి. కావున నీవు నీ రథమందే యింద్రుని నుంచుకొని సేనకు ముందుగా లంకకుఁ బయనము కమ్ము.

క. నీ వెనుక నేను వచ్చెద, సేవింపఁగ నాదుమంత్రి♦శేఖరు లెల్లన్
నీచే కద జిష్ణుండవు, నీ విజయముఁ బొగడఁబడెడి ♦ నెఱి నం చనినన్. ౭౫౯

అర్థములు. జిష్ణుండవు = జయించిన వాఁడవు

తాత్పర్యము

నీవెనుక నేను నామంత్రులతోఁడ వచ్చెదను జయించినవాఁడవు నీవే. కావున నీవు ముందుగాఁబోదువేని లోకమున నీగెలుపును జనులు పొగడుదురుఅనిచెప్పఁగా

తే. మేఘనాదుండు బంధించి ♦ మేఘవాహుఁ, దనరథంబునఁగొని నిజ♦ధ్వజినిఁగొల్వ
స్వీయభవనంబునకు నేగి ♦ వీరవరుల, నెల్లఁ దమతమయిండ్లకు♦నేగఁబనిచె.

అర్థములు. మేఘవాహున్=ఇంద్రుని, నిజధ్వజిని=తనసేన, స్వీయ భవనంబునకున్=తనయింటికి.

తాత్పర్యము

ఇంద్రుని దన తేరికిఁ గట్టివేసి మేఘనాదుఁడు తనసేన తన్ను సేవించుచుండఁగాఁ దన యింటికిఁ బోయి వీరుల నందఱ వారివారి యిండ్లకుఁ బంపెను.

౩౦వ సర్గము

—* బ్రహ్మ లంకకుఁ బోయి రావణ మేఘనాదులఁ బ్రశంసించుట ♦—

క. రావణతనయుం డిటు లై, రావణవాహనునిఁ దనపు♦రంబునకుం బెం
పావహిలం గొని యేగిన, దేవత లజుఁ దోడుకొనుచు ♦ దీనత దోఁపన్ ౧

అర్థములు. ఐరావణ వాహనుని=ఐరావతమును వాహనముగాఁ గల యింద్రుని, పెంపు=గొప్పతనము, దీనత తోఁపన్=ముఖములు వెలవెలఁబోగా.

తాత్పర్యము

(రావణుని కొడుకు మేఘనాదుఁ డింద్రునిఁ దీసికొని పోఁగా, దేవతలుముఖములు వెలవెలఁ బోవ, బ్రహ్మను దోడుకొని.)

ఉ. లంకకుఁ బోవ మింటన ని♦లంబడి పద్మభవుండు దేవతా
సంకటహేతుభ్రాతృతను♦జాతసమావృతుఁ బంక్తికంఠు ని
శ్శంకమదోద్ధతుం బలుకు ♦ సాహసశీలక! వత్స! రావణా!
యంకమునన్ భవత్సుతప♦రాక్రమ మెంతయు మెచ్చు గూర్చెడిన్. ౨

అర్థములు. మింటన=ఆకాశమందే, దేవతాసంకటహేతు=దేవతలబాధకుఁ గారణమైన, భ్రాతృ=తమ్మునితోను, తనుజాత=కొడుకులతోను, సమావృతున్=చుట్టుకొనఁబడిన వానిని, నిశ్శంకమదోద్ధతున్=భయములేని మదాతిశయము గల వానిని, అంకమునన్=యుద్ధమందు.

తాత్పర్యము

దేవతలు దుఃఖించుచు నిట్లు బ్రహ్మను బిలుచుకొని లంకకుఁ బోఁగానాయన యాకాశమందే యుండి దేవతలకు బాధాకరులగు తమ్మునితోను,కుమారులతోను గూడిన రావణుని భయములేని గర్వగరిష్ఠుని జూచి నాయనా! రావణా! మహాసాహసికా! యుద్ధమందు నీ కొడుకు చేసిన యద్భుత పరాక్రమమును మెచ్చుకొంటిని.

క. నీకొడుకు నీకుఁ దుల్యుఁడొ, నీకును నధికుండొ ప్రతిన ♦ నీసుతుబలిమిన్
ప్రాకటముగ నెఱవేర్చితి, లోకంబులు మూఁడు నీకు ♦ లోఁకువ యయ్యెన్.

తాత్పర్యము

నీ కొడుకు నీకు సమానుఁడో నీకంటె నధికుఁడో యగును, గాని నీకంటెఁ దక్కువవాఁడు కాఁడు. ఆతని బలమువలన దిక్పాలుర నందఱ జయించెద నన్న ప్రతిన నెఱవేర్పఁ గలిగితివి. మూఁడు లోకములు నీకు లోఁబడెను.

క. అతిబలుఁడు వీరుఁ డగు నీ,సుతుఁ డింద్రజి యనెడికీర్తి ♦ శూరవరా! శా
శ్వతముగఁ గాంచెడు నమర,క్షితి దుర్జయుఁ డగును విను శ♦చీవిభు నింకన్. ౬౬౮

తాత్పర్యము

అధికబలము గలవాఁడును వీరుఁడు నగు నీ కొడుకు ఇఁకమీఁద లోకముల నింద్రజిత్తను పేరు శాశ్వతముగఁ గాంచును. నీకోరిక నెఱవేఱినది. కావున నిఁక నింద్రుని వదలిపెట్టుము.

చ. ప్రతిఫల మెద్దికోరెదవు ♦ వాసవమోక్షము పొంటె నావుడున్
శతధృతిఁ జూచి పంక్తిముఖ♦నందనుఁ డిట్లను నో పితామహా!
శతముఖు వీడెదన్ దయ నొ♦సంగవె నా కమరత్వ మన్న వా
క్పతి భువిఁ బ్రాణికోటులను ♦ గల్గునొకో సకలామరత్వమున్. ౬౬౯

అర్థములు. ప్రతిఫలము=బదులు లాభము, వాసవమోక్షము పొంటెన్=ఇంద్రునివిడుచుకొఱకు, శతధృతిన్=బ్రహ్మను, అమరత్వము=చావులేమి, వాక్పతి=బ్రహ్మ, సకలామరత్వమున్=ఎవ్వరిచేత నేకాలమందు జావుఁ లేకుండుట.

తాత్పర్యము

ఇంద్రుని విడుచుటకుఁగాను బదులు ఫలమేమి కోరెదవు అనఁగా బ్రహ్మను జూచి యింద్రజిత్తిట్లనియె. ఓ పితామహా! యింద్రుని వదలెదను. నాకుఁ జావు లేకుండ వర మిమ్ము అని యడుగఁగా బ్రహ్మయిట్లనియె. ప్రాణములు గల్గు వానిలో నెవ్వరిచే నెప్పటికిని జావు లేకుండుట లోకమునఁ గలదా?

క. పులుఁగులలో నాలుగుపద,ములజంతులలోన నిఖిల♦భూతంబులలోఁ
గలకాల మెట్టిదానికి, నలవడునే బ్రదుక మిత్తి♦నందక యెపుడేన్.

అర్థములు. పులుఁగులలో=పక్షులలో, మిత్తి=మృత్యువు, మరణము.

తాత్పర్యము

(పక్షులలో, నాలుగుకాళ్ళ జంతువులలో నననేల ప్రాణులన్నిటిలో శాశ్వతముగా మరణము లేకుండ బ్రదికి యుండుటకు సాధ్యపడునా?

బ్రహ్మ మేఘనాదుఁడు కోరిన వర మిచ్చి యింద్రుని విడిపించుకొని పోవుట

చ. అనవుఁడు నింద్రజిత్తనియె ♦ నట్టిదయేని రణంబువేళ నేఁ
దునుమఁగ శత్రులన్ నియతిఁతో యజియించెద వీతిహోత్రు, దా
నన జనియించు నశ్వయుత ♦ నవ్యశతాంగము నెక్కి సంగరం
బొనరుచుచో నమర్త్యతను ♦ నొందఁగ ని, మ్మసమాప్తి యద్దియై. ౬౬౭

తాత్పర్యము

అని చెప్పఁగా నింద్రజిత్తిట్లనియె వ్యవస్థలేని యమర్త్యత్వము లేదేని యుద్ధ సమయమునందు నేను శత్రువులఁ జంపుటకై యగ్నిని బూజించెదను. అందు జనించిన గుఱ్ఱములతోఁడి రథమునెక్కి యుద్ధము చేయునపుడు చావులేకుండ నాకు వర మిమ్ము. అది పూర్తికాక నడుమ విఘ్నమై.

క. దురమున కేఁ గడఁగినచో, మరణంబున కీయకొంటి ♦ మఘవుని విడుతున్
సరసిజసంభవ! నీ వీ వరమున్ దయచేసితేని ♦ వాత్సల్యమునన్. ౬౬౮

తాత్పర్యము

యుద్ధమునకుఁ బూనితినా మరణించుట కంగీకరించితిని నా యందు దయ యుంచి నాకీ వరమిచ్చెదవేని యింద్రుని వదలిపెట్టెదను.

క. అందరుఁ దపమున ని న్నా, నందింపఁగఁ జేసి కడు నఁణంకువ దీనిన్
బొందెద రే భుజబలమున, నందెద దేవా! యమర్త్యతాతిమహిమమున్. ౬౬౯

తాత్పర్యము

లోకములో నందఱు నిన్నుఁ దపముచేఁ దృప్తునిచేసి వరములు సంపాదింతురు నేను భుజబలమున చావు లేకుండునట్లు వరము నీ వలనఁ బొందెదను.

క. అన నట్లకాక యన వజ్రిని విడిచెన్ దాశకంఠి ♦ త్రిదివేసులు నా
తనిఁదోడ్కొని నాకమునకుఁ, జనునెడ దుఃఖమునఁ జింతఁసంకటపడుచున్. ౬౭౦

అర్థములు. దాశకంఠి=ఇంద్రజిత్తు, దశకంఠుని కుమారుడు.

తాత్పర్యము

(అని చెప్పఁగా నింద్రజిత్తు యట్లే చేసెదనని యింద్రుని విడిచెను. దేవతలాతనిఁ దోడుకొని స్వర్గమునకుఁ బోవునప్పుడు దుఃఖమున విచారముచేఁ గష్టపడుచు.)

క. దీనుండై యమరద్యుతి, హీనుండై నేలఁ జూచు ♦ చెంతో వగచే
మ్లానుం డగు పాకారికి, జ్ఞానం బుదయింప నబ్జఁసంభవుఁ డనియెన్. ౬౭౧

అర్థములు. దీనుండై=గర్వ ముడిగినవాఁడై, అమరద్యుతి హీనుండై= దేవతల కాంతి బోయినవాఁడై, వగచే=వ్యసనముతో, మ్లానుండు=వాడినవాఁడు

తా త్ప ర్య ము

గర్వ ముడిగి దేవతాకాంతి తొలఁగి వాడి, యవమానముచే క్రిందఁజూచుచు మిగుల వ్యసనపడుచున్న యింద్రునకు జ్ఞానము కలుగునట్లు బ్రహ్మ యిట్లనెను.

—॥ బ్రహ్మ యింద్రునితో నతఁడు బద్ధుఁ డగుటకుఁ గారణముఁ జెప్పుట ॥—

క. నవ్వుచుఁ జేసినపాపం, బెవ్వరుఁ గుడువంగ వలదె ॥ యేడ్చుచుఁ బిదుపన్?
గ్రొవ్వున నీచేసినయఘ, మివ్విధిఁ దలకొనియె నేల ॥ యేడ్చెద విట్టుల్? ౬౭౨

తా త్ప ర్య ము.

ఎట్టివాఁడైనను నవ్వుచుఁ జేసిన పాపము నేడ్చుచు ననుభవింపవలయును అది తప్పదు. కండగర్వముచే నీవు చేసిన పాపముయొక్క ఫల మివ్విధముగఁ తటస్థించెను. ఇప్పు డిట్లేల యేడ్చెదవు?

సీ. ఇంద్ర! నాబుద్ధిచే ॥ సృజియించితిని బ్రజ నేకవర్ణంబుగ ॥ నేకరూప
ముగ నేకభాషగ ॥ మొదల వారలలోన, దృష్టికి భేదమే ॥ యెరుకపడదు
పదపడి వేఱొక॥పద్ధతి దానికి, మిన్నగఁ గన్పింప ॥ నెన్ని నేను
బ్రజల విశిష్ట మౌ॥ప్రత్యంగమును దీసి, రూపగుణంబుల ॥రూఢిఁ గన్న

తే. మెలఁత నొక్కయహల్య ని॥ర్మించినాఁడ
హల మనంగ వైరూప్యంబు ॥ హల్య మనఁగఁ
దద్భవం బట్టిహల్య మా ॥ తరుణి కెందు
లేమిని నహల్య యనఁగ నే ॥ నామ మిడితి. ౬౭౩

తా త్ప ర్య ము

ఇంద్రా! తొలుత నేను బుద్ధిచే నాలోచించి యందఱ నేకవిధముగ సృష్టిఁ జేసిన భాగని తలఁచి యందఱును నొక విధమేయైన వన్నెయు నేకవిధమైన రూపమును నేకవిధమైన భాషయుఁ గలవారినిగఁ జేసితిని. అప్పు డొకరికి నుఱి యొకరికి కాంతి స్వర సౌందర్య వయనాద్యవయవ సౌష్ఠవంబుల భేదము కనఁబడలేదు. తరువాత దానికంటె శ్రేష్ఠమైన పద్ధతి నాలోచించి ప్రజలయందలి శ్రేష్ఠమైన ప్రత్యవయవమును దీసి రూపముచేత గుణముచేతఁ దక్కిన వారికంటె గొప్పదని ప్రసిద్ధిగన్న యొక్క స్త్రీని గల్పించితిని దానికి నహల్య యనిపేరు హలమనఁగా వికారరూపము, అట్టిదానినుండి కలిగినది హల్యము. అట్టి నింద్యమైనది లేనిది యహల్యము, ఆ స్త్రీ యట్టిది కావున నహల్య యనిపేరు పెట్టితిని.

చ. ఇటు సృజియించి యెవ్వనికి ♦ నీకుటిలాలక నిత్తు నంచు సం
కటపడుచుండఁ జిత్తమునఁ ♦ గామినిఁ గోరితి వింద్ర! నీవు ను
త్కటపదగౌరవంబున జ♦గత్ప్రభుతం దగు నాకుఁ గాక యీ
స్ఫుటజలజాక్షి నిస్తులిత♦సుందరి యెవ్వని కర్హ యం చెదన్. ౬౭౪

తాత్పర్యము

ఈ ప్రకారము సృజించి యీ సుందరి నెవరికి భార్యగా నిత్తునా, దీనికిఁ దగిన వాఁ డెవఁడు లేఁడే యని నేను బరితాపపడుచుండ నింద్రా! నీవు గొప్ప పదవి నలని గౌరవంబునను ప్రపంచమునకుఁ బ్రభువ నను తలంపు చేతను, నేనే దీనికిఁ దగిన భర్తను, ఇటువంటి వికసించిన కమలములవంటి కన్నులు గల సుందరికిఁ దగిన వాఁడను నేనుగాక మఱియెవ్వఁడు గలఁడని తలఁచి నాకిమ్మని నీ వడిగితివి. నేనిచ్చిన వాఁడఁ గాను.

ఉ. ఇల్లడగాఁగ గౌతముని♦యింటన యుంచితిఁ బెక్కులేఁడు లు
త్ఫుల్లసరోజలోచనను ♦ దోసపుఁగర్జముపొంతఁ బోక తాఁ
గల్లరి గాక తత్సతిని ♦ గ్రమ్మఱఁ బంచె నతండు, దాని కే
నల్లములోనఁ దన్నియతి ♦ కూర్జితమైన తపంబుసిద్ధికిన్. ౬౭౫

తాత్పర్యము

నేనా స్త్రీని గుదున సొమ్మువలె నిల్లడగా గౌతమునొద్ద పెక్కు సంవత్సరము లుంచితిని. ఆమె విషయమై యతఁడు దోష మేమియు నెంచినవాఁడుకాఁడు, ఇల్లడసొమ్ము నే నెట్లనుభవింతును; అనుభవింపరాదని దోషకార్యమును దలఁపక మోసము లేక యుంచుకొని మరల యథాపూర్వకముగ నా యొద్దకుఁ బంపెను. ఆయన మనోనిగ్రహమునకుఁ దపస్సిద్ధికిని నేను సంతోషించితిని.

క. మెచ్చి జలజాక్షి నతనికి, యిచ్చితి నిల్లాలుగాఁక ♦ నీ వెఱఁగి మదిన్
మచ్చరమున మునివనికిం, జెచ్చెరఁజని యందు నగ్ని♦శిఖ కెన యగుచున్. ౬౭౬

తాత్పర్యము

(సంతోషించి యహల్య నతనికే భార్యగా నిచ్చితిని. నీ వది తెలిసియు మచ్చరము పూని మునియున్న వనమునకుఁ బోయి యం దగ్ని జ్వాలను బోలి.)

క. రాజిలు రాజీవాక్షిని, రాజీవశరార్తిఁ జిక్కి ♦ రతిఁ గూడఁగ నా
లో జటి యాశ్రమగతుని బిడౌజా! నిను దుర్దశాప్తు ♦ నుగ్రతఁదిట్టెన్. ౬౭౭

అర్థములు. రాజీవశర+అర్తి=మన్మథ తాపమునకు, జటి=ముని, ఆశ్రమగతుని=ఆశ్రమమం దున్నవానిని, ఇంద్రా! దుర్దశకు వచ్చిన నిన్ను భయంకరముగఁ దిట్టెను, బిడౌజా=ఇంద్రా.

తాత్పర్యము

(ఒప్పియున్న యహల్యను, మన్మథ తాపమునకు వశమై రతిక్రీడలఁ దేలుచుండఁగా, నాశ్రమమందున్న వానిని దుర్దశకువచ్చిన నిన్ను ముని భయంకరముగ దిట్టెను.)

క. ఏమిర వాసవ! నీవే, కాముకమతి నాదుపత్నిఁ ♦ గవిసితి వటరా!
దీమసమున నిర్భీతిని, నీమార్తునిచేతఁ జిక్కి ♦ నెవ్వాగఁ గనుమీ. ౬౭౮

అర్థములు వాసవ=ఇంద్రా, దీమసమునన్=గర్వమున, నిర్భీతిని=భయము లేక, మార్తునిచేత=పగవానిచేత.

తాత్పర్యము

ఏమిరా యింద్రా! నీవే భయములేక గర్వమున గాముకుఁడవై నాభార్యను గామించితివటరా! నీ పగవాని చేతిలో నీవు చిక్కి దుఃఖింపుము. బాలకాండమునఁ జెప్పఁబడిన (౯౭౫ వ పద్యము) శాపమునకు సహస్రయోనిత్వమున కిది పర్యాయముగాదు. రెండు నొకసారి చెప్పినవే. అయినను వాల్మీకి తన శైలి ననుసరించి యందొకటి యిందొకటి చెప్పెను. రెండును గలిపి చదువవలయును.

మ. కుమతీ! నీ విపు డాచరించిన మహా♦ఘోరాఘకర్మంబు లో
కములన్ మానవులందునుం బరఁగెడిం♦గా కింక, జారత్వపా
పమునం దర్ధము కర్త నొందెడు, నినుం♦బ్రాపించు శేషార్థ, ము
త్తమమా నీదుపదం బశాశ్వత మగుం♦దథ్యంబు నీకీపయిన్. ౬౭౯

అర్థములు. కుమతీ=కుత్సితబుద్ధి గలవాఁడా, మహాఘోరాఘకర్మంబు= వ్యభిచారమను మిగుల భయంకరమైన పాపకార్యము-పరఁగెడిన్=నీవు శ్రేష్ఠుఁడవు చేసితివి కావున నిన్నుఁ జూచి నీ మార్గ మనుసరించి లోకములోఁ గొందఱు పాపులును జేయుదురు, శేషార్థము=మిగిలిన సగము.

తాత్పర్యము

కుత్సితబుద్ధిగలవాఁడా! నీ విపుడు చేసిన మహాభయంకరమైన జారత్వమను పాపకార్యమునకు నీ వంటి గొప్పవాఁడు మార్గదర్శి యగుటచే నీ వంటి పాపాత్ములు కొందఱు నీ వలెనే 'యథా రాజా తథా ప్రజా' యని జారత్వము చేయుదురు. అట్టి జారుల సగముపాపము వారిని, 'రాజా రాష్ట్రకృతం పాప' మన్నట్లు సగము పాపము మార్గదర్శియైన నిన్నుఁ బొందును. అంతియకాదు. నీ కీయుత్తమ పదవి యికమీఁద శాశ్వతము గాదు. నీవు పదభ్రష్టుఁడవు కాఁగలవు.

క. నీకే కాదుర దుర్మతి నీకై నడి నెవ్వఁ డెనఁడు ♦ నిర్జరపతి యౌఁ
బ్రాకటగతి నాతండును, నీకరణిని భ్రష్టుఁడగును ♦ నిజ మని మఱియున్. ౬౮౦

తాత్పర్యము

ఈపదభ్రష్టత్వము నీ యొకనితోఁ బోదు. నీ వెనుక నింద్రులుగా వచ్చు వారి కందఱకు నిట్టి పదభ్రష్టత్వమే ప్రాప్తించును. ఆ కారణమున నుత్తమఫలము గోరువాఁడు నీ యింద్రపదమును గోరకుండును.

క. సతిఁ గని గర్జించుచు ముని,పతి యనియెన్ దుష్టురాలఁ పడియుండుము నీ
యతిసౌందర్యము పాడుగ, క్షితిపై నీ యాశ్రమంబుఁ జెంతన యసతీ! ౬౮౧

తాత్పర్యము

(భార్యను జూచి గర్జించుచు గౌతముఁడు 'దుష్టురాలా, అంకులాఁడీ నీయతి సౌందర్యము పాడుగా నీ యాశ్రమ సమీపమున నేలపైఁబడి యుండుము—' అని గౌతముఁడు పలికెను.)

క. సౌందర్యము ప్రాయంబును, బొందియు మది చంచలత్వఁముం బొరయుటచే
సుందరి నీ వొకతవె గా, కుందువుగా కిలను నీమఁనుదు టణఁగంగన్. ౬౮౨

తాత్పర్యము

చక్కఁదనము వయస్సుగల దానవై మనస్సు చపలమైన కారణముచే నీ(క) లోకములో చక్కని స్త్రీ యనునది నీ వొకతెవే కాక పెక్కు రుదయింతురు. అప్పుడు నేనే చక్కని దాన నను నీ గర్వము సమయును.

క. ఏ సౌందర్యము కలిమిని, నీసరణిని మిడిసిపడితి ఁ వీవు కృతఘ్నీ!
యీ సౌందర్యము జనములతో సాధారణమ యగుతఁ లుప్తవివేకా! ౬౮౩

అర్థములు. కృతఘ్నీ=చేసిన మేలు మఱచినదానా, లుప్తవివేకా=వివేకము లేనిదానా.

తాత్పర్యము

(కృతఘ్నురాలా! యే చక్కఁదనము చూచుకొని నీవిట్లు మిడిసి పడితివో యోసీ! వివేకము లేనిదానా! యీ సౌందర్యము జనములలో సాధారణ మగును గాక!)

క. అని తిట్టె నాఁడు మొదలుగ, వనితలు సౌందర్యవతులు ఁ ప్రభవించిరి భూ
మిని లొల్లిగ నెల్లయెడన్, వనజాక్షి విధేయ యగుచుఁ ఁ బతి కిట్లనియెన్. ౬౮౪

అర్థములు. లొల్లిగన్=తఱచుగ.

తాత్పర్యము

(అని తిట్టెను. నాఁటినుండి భూమిపై నంతటఁ దఱుచుగ సౌందర్యవతులు వనితలు పుట్టిరి. అహల్య విధేయురాలయి పెనిమిటితో నిట్లనెను.)

క. నీయాకృతిఁ గొని యింద్రుం, డీ యాగడమున్ ఘటించెనెఱుఁగక చెడితిన్
నా యజ్ఞానము సైఁపుము, చేయను జుమి కామమదముచేఁ బాపంబున్. ౧౫౫

అర్థములు. ఇందు నహల్య కామమదముచేఁ బాపము చేయలేదనిచెప్పెను. కామమదముచేఁ జేయలేదుగాని యింద్రుఁడు కదాయను దాక్షిణ్యముచేఁ జేసెను. అంకాడ నేర్చినమ్మ బొంకాడ నేర్వదా? బాలకాండము చూచునది.

తా త్ప ర్య ము

(ఇంద్రుఁడు మీ రూపమును దాల్చి యీ తుంటరిపని చేసెను. ఎఱుఁగక చెడిపోతిని. నా తెలివి తక్కువకును సైరింపవలెను. నేనుఁ గామమదముచేఁ బాపము చేయలేదు సుమా!)

సీ. అని వేఁడుకొనిన మంహర్షి యాసతికి నిక్ష్వాకువంశంబున ♦ సత్యరతుఁడు
రామనామంబునఁ ♦ బ్రథితుండు జనియించు, మానుషవిగ్రహంబూనియున్న
యావిష్ణుమూర్తి బ్రాహ్మణుని నిమిత్తమై, యరుదెంచు నితకు నీవతనిఁగాంచి
పూత వయ్యెదవు తత్పుణ్యుండు దక్క నీ, పాపంబు నెవ్వఁడుఁ ♦ బాపలేఁడు
తే. తథ్య మియ్యది యతని కాతిథ్య మిచ్చి
వెండి ననుఁ జేరఁగలవు వేదండయాన
యవల నాతోడ వసియింప ♦ నగును నీకు
ననుచు స్వాశ్రమమును జొచ్చె ♦ నమ్మహర్షి. ౧౫౬

అర్థములు. బ్రాహ్మణుని నిమిత్తమై=విశ్వామిత్రుని కొఱకు, దీనివలన జారత్వ దోషము భగవదనుగ్రమున నాయన దర్శనస్పర్శనములచేఁ బోవలయునే కాని మఱియొక ప్రాయశ్చిత్తకర్మచే నిశ్శేషముగ నశింపదు. అంతవఱ కదిపవిత్రురాలు గాదు.

తా త్ప ర్య ము

(అని వేఁడుకొనఁగా గౌతముఁ డహల్యతో 'ఇక్ష్వాకువంశమున రామనామమునఁ బ్రసిద్ధుఁడు సత్యరతుఁడు పుట్టును-అతఁడు మానుష శరీరము దాల్చిన యా విష్ణుమూర్తి. ఒక బ్రాహ్మణుని కొఱకిచ్చటకు వచ్చును. నీ వతని దర్శించి పవిత్రురాల వయ్యెదవు ఆ పుణ్యాత్ముఁడు దక్క నీ పాపము నితరుఁ డెవఁడు పోఁగొట్టలేఁడు. ఇది నిజము-అతని కాతిథ్య మొసఁగి నన్నుఁ జేరఁగలవు-అటు పిమ్మట నాతోఁ వసింప నగును' అనుచు నా మహర్షి తన యాశ్రమములోనికిఁ బోయెను.)

ఆ. బ్రహ్మవాదిపత్ని ♦ పచరించె నట్టు లే యమ్మహర్షి తిట్టినట్టులెల్ల
దాపరించె నీకుఁ ♦ దప్పనే యొండైనఁ, గాకఫలము విప్రశాపఫలము. ౧౫౭

అర్థములు. బ్రహ్మవాదిపత్ని=అహల్య, పచరించెను=చేసెను.

తాత్పర్యము

(అహల్య యట్టులే చేసెను. ఆ మహర్షి తిట్టినట్లంతయు దాపరించెను- నీకుఁ బాపఫలము బ్రాహ్మణ శాపఫల మెందయినఁ దప్పునా?)

క. స్మరియింపుము నీచేసిన, దురితంబును శక్ర! యిట్టి♦దోషంబున నీ
కరణి నరిచేతఁ జిక్కితి, వరయఁగ నిద్దాని హేతు ♦ వదియే వింటే. ౬౮౮

తాత్పర్యము

(నీవు చేసిన పాపమును దలఁచుకొనుము. ఇంద్రా! యిట్టి దోషముచేత నీ విధముగా శత్రువుచేతఁ జిక్కితివి-వింటివా! దీనికదియే కారణము.)

క. నీ తనయునకై వగవకు, నీతుం డై యతఁడు జలధి♦నీరంబులలో
మాతామహరక్షితుఁడై, చేతో మోదంబుఁ గనెడిఁ♦జింతాచ్యుతుఁడై. ౬౮౯

అర్థములు. నీతుండై=తీసికొని పోఁబడినవాఁడై, మాతామహరక్షితుఁడై= తల్లి యొక్క తండ్రిచేతఁ గాపాడఁ బడువాఁడై చింతాచ్యుతుఁడై=విచారము లేనివాఁడై.

తాత్పర్యము

(నీ కొడుకునకై విచారపడకుము-వానిని మాతామహుఁడు తీసికొనిపోయి సముద్రములోఁ గాపాడుచున్నాఁడు-వాఁడు దిగులు లేక సంతోషముగ నుండ గలఁడు.)

క. కావున వైష్ణవయాగముఁ, గావింపుము దానఁ దొలఁగుఁ ♦ గల్మషచయముల్
దేవేంద్ర! నాకమునకుం, బోవచ్చు నటన్న నట్ల పొనరిచె నతఁడున్. ౬౯౦

తాత్పర్యము

పాపఫల మనుభవమునకు వచ్చెను గావున నపవిత్రుఁడవైతివి. ఇట్టులే స్వర్గమునకుఁ బోరాదు. వైష్ణవయాగముఁ జేసి పరిశుద్ధుఁడవై స్వర్గమునకుఁ బొమ్ము.

ఉ. ఇంద్రజితుం డనంగ నతఁ ♦ డెంతటివాఁడొ నృపాల వింటివే
యింద్రునిఁబట్టి కట్టెనన ♦ నేమిటి లెక్క తదన్యులం చనన్
సాంద్రతరాద్భుతంబు గొని ♦ రామతనయాపతి లక్ష్మణుండు కీ
శేంద్రులు మెచ్చి రౌర యని ♦ యిట్లు మునీరిత గాథ యంతయున్. ౬౯౧

తాత్పర్యము

రామచంద్రనృపాలా! యింద్రజిత్తనఁగా నెంతటివాఁడో వింటివా? ఇంద్రుని బట్టి కట్టెననిన తక్కినవారు వానికొక లెక్కా? అని చెప్పఁగా మిగుల దట్టమైన ఆశ్చర్యము పొంది ఔరా యని రామచంద్రమూర్తియు లక్ష్మణుఁడు వానరులు మెచ్చిరి. ఇట్లు ముని చెప్పిన చరిత మంతయు విని.

తే. విని రఘూత్తముకెలని వి♦భీషణుండు, పూర్వమెప్పుడో కనినది♦పూర్ణముగను
స్మృతికివచ్చెను నేడన♦క్షితిధవుండు, మెచ్చెను నగస్త్యమానీంద్రు♦వేలినుతుల.

తా త్ప ర్య ము

పూర్వ మెప్పుడో చూచినది సంపూర్ణముగ నేడు మరల మనస్సునకు వచ్చెను అనిన రామచంద్రమూర్తి యగస్త్యుని మెచ్చెను.

అనుభవజ్ఞుడైన విభీషణుఁడు మెచ్చె ననుటచే నగస్త్యుఁడు చెప్పినది సర్వము సత్యమని యేర్పడెను.

క. ఈవిధమున దశవదనుఁడు, దేవేంద్రజితుండు తనకు ♦ దేనికిఁ దోడై
రా విశ్వకంటకుండై, యేవారిని సరకుగొనక ♦ యెసఁగుచునుండెన్. ౬౯౩

అర్థములు. విశ్వకంటకుండు=లోకమును బాధించువాఁడు.

తా త్ప ర్య ము

(ఈవిధముగ రావణుఁ డింద్రజిత్తు తనకుఁ బ్రతిపనికిఁ దోడైయుండుటచే లోకకంటకుండై యెవరిని లెక్కచేయక విఱ్ఱవీగు చుండెను.)

౩౧వ సర్గము

—* రావణుఁడు కార్తవీర్యార్జును గెలువఁబోవుట *—

సీ. అని యిట్లు మునిపల్క♦నాశ్చర్యమగ్నుఁడై, జననాయకుం డను♦మునివరేణ్య
క్రూరుడైఁ నోఁకుండు ♦ గ్రుమ్మర లోకంబు, శూరత్వశూన్యమై♦ సుక్కెనయ్యా?
రాజొండెఁ గాకున్న రాజమాత్రుండైనఁ, గలుగఁడా యొక్కఁడా♦బలియు గెలువ
నక్కటా! క్షత్రియుల్♦హతవీర్యులైరికా, నిర్జితులైరికా♦నిఖిలనృపతు
తే. లేమి! పరమాస్త్రవిదులు బ♦హిష్కృతులుగ
నైరె యనుడును మునివర్యుఁ ♦ డమ్మహాత్ముఁ
గాంచి నవ్వుచు నీశ్వరుఁ ♦ గమలభవుఁడు
పలుకునట్టులు ప్రీతిమైఁ ♦ బలికె నిట్లు. ౬౯౪

తా త్ప ర్య ము

ఈప్రకారము ముని చెప్పఁగా రామచంద్రమూర్తి యాశ్చర్యమున మునిఁగినవాఁడై యిట్లనియె. మునీంద్రా! క్రూరుఁడగు రాక్షసుఁడు లోకమునందు స్వేచ్ఛగా విహరింపఁగా లోకమున శూరత్వ మనునది శూన్యమయ్యెనా? రాజగు వాఁడో రాజనిపేరు పెట్టుకొన్నవాఁడో యీ బలవంతుని గెలువఁగలవాఁడొక్కఁడును లేఁడయ్యెనా? అయ్యో! క్షత్రియు లందఱు వీర్యహీనులైరి కదా! రాజు లందఱు నోడిపోయిరి కదా! పరమాస్త్రములు తెలిసినవారు దేశమున లేకయే పోయిరా యని యడుగఁగా నగస్త్యుఁడు నవ్వుచు నీశ్వరుని బ్రహ్మ సంబోధించినట్లు లిట్లు చెప్పెను

లోకములోని ప్రభువులు తాము జయించిన వాని బలపరాక్రమములు వినఁగోరుచుందురు. అంతటి బలశాలులను దాము జయించితి మని గర్వింతురు. రామచంద్రమూర్తి యట్లు గాక తాను జయించిన వాని పరిభవములు వినఁగోరుచున్నాఁడు కదా యని నవ్వె.

మ. ధరణీపాలుర నెల్ల నేఁచుచును దో♦ర్దర్పాంధుఁడై ధారిణిం
జరియించెన్ దశకంఠుఁ డట్లు చనుచున్ ♦ సత్త్వాఢ్యు మాహిష్మతీ
పురినాథున్ విని శక్రపత్తననిభం♦బున్ వహ్నిసాన్నిధ్యమున్
శరకుండస్థితపావకంబు నగుచున్ ♦ సప్తార్చికిం దుల్యుఁ డై. ౭౯౮

అర్థములు. దోర్దర్పాంధుఁడై=భుజబలగర్వముచే గన్నులు గాననివాఁడై, సత్త్వాఢ్యు=బలసంపన్నుని, శక్రపత్తన నిభంబున్=ఇంద్రుని పట్టనముతో సమానమైనది. వహ్నిసాన్నిధ్యమున్=అగ్నిసన్నిధానము గలది, శరకుండస్థిత పావకంబు=శరము లాస్తరణములుగా నగ్నికుండమందుండు నగ్నిని కలది, వహ్నిసాన్నిధ్యము ఈ విషయము భారతంబున సభాపర్వంబున సహదేవుని దిగ్విజయ యాత్రయం దిట్లు చెప్పఁబడెను.

తొల్లి నీలుని వంశంబున నిషధుం డను రాజు రాజ్యంబున జాతవేదుఁడు విప్రుండయి వేదాధ్యయనంబు సేయుచు మాహిష్మతీపురంబున నుండి యొక్కనాఁడు ప్రమాదవశంబునఁ బరదారగమనుఁ డయిన నెఱింగి వానిం బట్టుకొని తలవరులు రాజసమక్షంబునకుం గొనిపోయి శాస్త్రవిహితదండంబు దండింపఁబోయిన.

క. అవమానదుఃఖితుం డయి, పోవయుచుఁ గోపానలంబు పొడమి వెలుంగం
బవనసఖుఁ డగ్నికణములు, నెవయఁగఁ దన పొడవు సూపె నిషధునిమ్రోలన్.

వ. వాఁడును నతిభీతుండై యగ్నిదేవునకు నమస్కరించి మహాపురుషా! నాయాజ్ఞానంబు సహింపవలయు నని ముకుళితకరకమలుం డయిన వానికి వైశ్వానరుండు ప్రసన్నుండై నీ కోరిన వరం బిచ్చెద వేఁడు మనిన నతం డిట్లనియె.

గీ. ఇప్పురంబు జయింపఁగ నెవ్వరేని, వత్తు రుద్ధతులయి శత్రువరులు వారు
దర్ప మేది నీచేత నిర్దగ్ధులగుచు, హీనులగు నట్లుగా వర మిమ్ము నాకు.

ఈ వరము కారణమున నగ్నిహోత్రుం డా పురమును రక్షించుచుండు... సప్తార్చికిన్=అగ్నిహోత్రునకు, తుల్యుఁడు=సమానుఁడు.

తా త్ప ర్య ము

రాజుల నందఱ బాధించుచు భుజబలము గర్వముచేఁ గన్నులు గానక భూమియందుఁ దిరుగుచు దశకంఠుఁ డొకనాడు మాహిష్మతీ ప్రభువు బలవంతుఁడని విని

దేవనగరముతో సమానమై యెప్పుడు నగ్నిసాన్నిధ్యము కలిగి శరాస్త్రరణము లందు నగ్నికలదై యగ్నికి సమానుఁడైన.

క. అర్జునుఁడేలెడి తత్పురి, కర్జునుతో రణము సలుపు ♦ నభిలాషను న
త్యూర్జితజవమునఁ జనినం, దర్జితశాత్రవచయుండు ♦ తరుణులతోడన్. ౬౮

అర్థములు. అత్యూర్జిత జవమునన్=మిగుల వృద్ధినొందిన వేగముతో, తర్జిత శాత్రవ చయుండు=శత్రుసమూహముల దండించినవాఁడగు నర్జునుండు, తరుణుల తోడన్=స్త్రీలతో.

తాత్పర్యము

(అర్జునుఁడు పరిపాలించుచున్న యాపత్తనమున కర్జునునితో యుద్ధము చేయు నభిలాషముతో నతివేగముగాఁ బోఁగా శత్రుసమూహముల దండించిన నాతఁడు స్త్రీలతో.)

—♦ కార్తవీర్యార్జునుఁడు నర్మదయందు స్త్రీలతోఁ గ్రీడించుట ♦—

చ. వనజదళాక్ష! రావణుఁడు ♦ వచ్చిననాఁడ యతండు నర్మదా
వనములఁ గేళిఁ దేలఁ జనెఁ ♦ బంక్తిముఖుండును మంత్రికోటి న
ర్జునుఁ డెట నున్నవాఁడు రణ♦శూరుఁడు రావణుఁ డేగుదెంచె నిం
దని కని మీర లేగి సర♦యంబుగఁ దెల్పుడు పొండటం చనెన్. ౬౯

తాత్పర్యము

రామచంద్రా! వినుము. రావణుఁడు మాహిష్మతికి వచ్చిన దినమందే యర్జునుఁడు నర్మదాజలములందు క్రీడించుటకై పోయెను. తరువాతి రావణుఁడా యూరికిఁబోయి మంత్రులఁ జూచి యర్జునుఁ డెచ్చట నున్నవాఁడు, రణశూరుఁడు రావణుఁడు యుద్ధమునకై యిచ్చటికి వచ్చినాఁడని త్వరగాఁ బోయి తెలుపుఁడు పొండని చెప్పఁగా.

సీ. వారలు మహిపతి ♦ యూర లేఁ డన విని పురమును బాసి యా♦భూరిబలుఁడు
నీహారశైలస♦న్నిభ మైనదానిని, నభ్రంబుగతి మింటి ♦ నంటుదానిఁ
బుడమి నుద్భేదించి ♦ పుట్టినాఁ డగుదాని, గగనమార్గం బరి♦కట్టుదాని
వేశిఖరంబుల ♦ వెలుగుచుండెడిదాని, హరిచయనిబిడకం♦దరముదానిఁ

తే. దటుల, బడియెడు నంకల ♦ ధ్వనులచేత, నట్టహాస మొనర్చున♦ట్లమరుదాని
స్త్రీలతోఁ గ్రీడసల్పెడి ♦ దేవదనుజ, కిన్నరులు గల్గి దివ మన ♦ నున్నదాని. ౭౦

అర్థములు. నీహారశైల సన్నిభము = మంచుకొండతో సమానము, అభ్రంబుగతిన్=మేఘమువలె, ఉద్భేదించి = పగులఁజీల్చుకొని, అరికట్టు=అడ్డ

గించు, వే=వేయి, హరిచయ = సింహసమూహములచే, నిబిడ=దట్టమైన, కంద రము=గుహలుగలదాని, తటులన్=పార్శ్వములందు.

తా త్ప ర్య ము

ఆ మంత్రులు రాజూరలేఁడని చెప్పఁగా విని యూరువిడిచిపోయి యా మహాబలశాలి మంచుఁగొండతో సమానమైన దానిని, మేఘమువలె నాకాశము దాఁకు దానిని, భూమినిఁ బగులఁదీసికొని పుట్టినదా యనునట్లుండు దానిని, నాకాశమునడ్డగించుదానిని, వేయి శిఖరములచేఁ బ్రకాశించు దానిని, సింహములచే నిండిన గుహలు గలదానిని, పార్శ్వములందఁ బడుచున్న వంకలధ్వనులచేతఁ బెద్దగా నవ్వుచున్నదా యనున ట్లుండుదానిని, ఆఁడువారితోఁ గ్రీడించు దేవదనుజ కిన్నరులు గలిగి స్వర్గ మన నుండుదానిని.

—♦ రావణుఁడు నర్మదాతీరమున విడియుట ♦—

చ. పటికపుఱాలఁబోలి కడు ♦ స్వచ్ఛములౌ సెలయేళ్ళనీరముల్
తటములనుండి జాఱెడివి♦ధంబుల నాలుకలు గ్రోయు వాయుభు
క్పటలముపాఱురీతిఁ దల♦పన్ ఘటియించెడుదాని వింధ్యముం
గుటిలచరిత్రకుండు గని ♦ గొబ్బునఁ జేరఁగఁబోయె నర్మదన్. ౧౯౯

అర్థములు. పటికపుఱాలన్=స్ఫటికములను, తటములనుండి=చఱుల నుండి, వాయుభుక్పటలము=సర్పసమూహము, కుటిల చరిత్రకుండు = వక్రపు నడవడి గలవాఁడు.

తా త్ప ర్య ము

స్ఫటికమువలె మిక్కిలి నిర్మలములైన సెలయేటి నీళ్ళు చఱులనుండి జాఱు విధములను నాలుకలాడించు పాముల గుంపు పరుగెత్తుటలు జ్ఞప్తికిఁ దెచ్చు వింధ్యమును నా వంచకుఁడు చేరఁబోయి నర్మదను.

చ. పడమటివారిధిం గలియ♦బాఱెడిదాని శిలాచలోదకన్
వడఁబడి యెండకుం దలరి ♦ వారణ ఘోణిమృగేంద్రముల్ తృషన్
వడి జలమందు దూఁకి కలఁ♦పన్ మలినం బగుదాని నింపుగా
విడువక కోళ్ళు జక్కవలు ♦ బెగ్గురు లంచలుఁ గూయుదానినిన్. ౨౦౦

అర్థములు. శిలాచలోదకన్=ఱాలమీఁదఁ బాఱు జలము గలదానిని, తలరి=చలించి. వారణ=ఏనుఁగులు, ఘోణి=పందులు-మృగేంద్రములు=సింహములు, తృషన్=దప్పిచే.

తా త్ప ర్య ము

పడమటి సముద్రమును గలియుటకై పాఱుచున్నదానిని, ఱాలమీఁదఁబాఱు నీళ్ళు గలదానిని,ఎండకు బడలి చలించి దప్పిగొని యేనుఁగులు పందులు సింహ

ములు నీళ్ళలో దూఁకి కలియఁబెట్టఁగా మురికియైనదానిని, నీటికోళ్ళు జక్కవలు బెగ్గురులు హంసలు గూయుచుండు దానిని.

సీ. ఉత్ఫుల్లభూజకృ♦తోత్తంసయును జక్ర, వాకయుగస్తని♦ వారి ఫేన
నిర్మలాంశుక నీల♦నీరజలోచన, హంసావళీమేఖ♦లానుబద్ధఁ
బ్రాకటవిస్తీర్ణ♦సైకతసుశ్రోణిఁ బుష్పరేణ్వనులి ప్త♦పుణ్యసుభగ
సలిలావగాహసు♦స్పర్శయౌ నర్మద, స్రోతస్వినీవరఁ ♦ జూచి యసుర

ఆ. యిష్టురాలితోడ ♦ నెలమిఁ గ్రీడించెడి, భంగి స్నానమాడి ♦ పరమమౌని
సేవ్యమానమైన ♦ భవ్యతరంగిణీ, తీరమందు నిసుక♦దిన్నె మీఁద. ౨౦౧

అర్థములు. ఉత్ఫుల్లభూజ = వికసించిన చెట్లచే, కృత=చేయఁబడిన, ఉత్తంసయు=శిరోభూషణము గలదియు, చక్రవాకయుగ = చక్రవాకములజంట, స్తని=స్తనములుగాఁ గలదియు. వారిఫేన=నీళ్ళనురుఁగను, నిర్మలాంశుకయు= తెల్లచీర గలదియు, నీలనీరజ=నల్లకలువలు, లోచన = కన్నులుగా, గలదియు హంసావళీ=హంసలవరుసలను, మేఖలా=ఒడ్డాణముచే, బద్ధ = కట్టఁబడినదియు, ప్రాకట విస్తీర్ణసైకత=స్పష్టముగాఁ దెలియుచు పెద్దవైన యిసుకదిబ్బలను, సుశ్రోణి=పిఱుఁదులు గలదియు, పుష్పరేణు=పుప్పొడిచే, అనులిప్త=పూయఁబడిన, పుణ్యా=పుణ్యాకరమైన, సుభగ=సౌందర్యము గలదియు, సలిలావగాహ= నీటస్నానము చేయుటకు, సుస్పర్శ=సుఖస్పర్శగలదియు, స్రోతస్వినీవరన్=నదుల యందు శ్రేష్ఠమైనదానిని.

తాత్పర్యము

వికసించిన చెట్లు శిరోభూషణములుగాను చక్రవాకములజంట స్తనములు గాను నురుఁగు తెల్లని చీరగను నల్లకలువలు కన్నులుగను హంసలవరుసలొడ్డాణ ముఁగను వెడలుపాటి పెద్ద ఇసుక దిబ్బలు పిఱుఁదులుగను పుప్పొడి పూఁతగనునై స్నానమునకు సుఖస్పర్శము గలిగి నదులందు శ్రేష్ఠమైన నర్మదయందుఁ బ్రియు రాలితోఁ గ్రీడించునట్లు జలకమాడి పరమమునులచే సేవింపఁబడు నాపుణ్యనదీ తీరమందు నిసుక దిన్నె మీఁద.

చ. ఎలమిని గూరుచుండి యిది♦యే చుఁడీ గంగ యటంచు మెచ్చి మం
త్రుల శుకసారణాఖ్యుల స♦నున్ జగమంతయుఁ బైడివోలె నీ
జలజహితుండు తీవ్రకర♦సంతతులన్ ఘటియించి మింటిపైఁ
దలఁకుచు సూటిగా నిలిచె ♦ దానవసత్తములార! కంటిరే? ౨౦౨

అర్థములు. ఎలమిని=సంతోషముతో, గంగ = పంచగంగలలో నొకటి, ప్రాత గంగ.

తాత్పర్యము

సంతోషముతోఁ గూర్చుండినవాఁడై గంగ యనిన నదియే సుఁడీ యని మెచ్చి తన మంత్రులు శుకసారణు లను వారితో నిట్లనియె. సూర్యుఁడు లోక మంతయుఁ దన కిరణములచే బంగారు కాంతి గలదిగాఁ జేసి యిప్పుడాకాశమున సరిగా నిలచెను చూచితిరా ?

దీనిచే మధ్యాహ్న మైన దని సూచన.

చ. ఖరకరుఁ డయ్యు నాయిచటఁ ♦ గ్రాలెడిరీతి నెఱింగి భీతిచేఁ
బరఁగెఁ దుషారభానుగతి ♦ వాయువో శైవలినీజలార్ద్రుఁడై
సరససుమావళీసురభి ♦ సంపద కానుకగాఁగఁ దెచ్చి నా
కరుసము గూర్చి నిర్భరసు♦ఖావహుఁడై చరియించెఁ గంటిరే! ౨౦౩

అర్థములు. ఖరకరుఁడు=తీక్ష్ణకిరణములు గలవాఁడు, తుషారభానుగతి= మంచుకిరణములు గలవానివలె, శైవలినీ జలార్ద్రుఁడై=ఏటినీటిచే తడిసినవాఁడై, సరస=అందములైన, సుమావళీ=పూలగుంపుల, సురభీ సంపద = అతిశయమైన పరిమళము, అరుసము=సంతోషము, నిర్భరసుఖావహుఁడై = అతిశయసుఖము గలిగించు వాఁడై, చరియించెన్=వీచెను.

తాత్పర్యము

సూర్యుఁడు తీక్ష్ణములైన కిరణములు గలవాఁడయ్యు నేనిచట నుండుట యెఱిఁగి మంచు కిరణములుగల చంద్రునివలె నయ్యెను. వాయువు నదీజలములఁ దడిసి పూల వాసనలు దీసికొని కానుకగా నిచ్చి సంతోషము గలిగించి మిగుల సుఖము గలిగించిన వాఁడయ్యెను చూచితిరా?

తే. నర్మవర్ధన యగుచును ♦ నర్మదయును, నక్రమీనవిహంగోర్మి♦నవ్యయగుచు
నివ్వెరను దటకాపడి ♦ నిలిచియున్న,జవ్వని యనంగ ఘటియించె♦సమ్మదంబు

అర్థములు. నర్మవర్ధన=సంతోషమును వృద్ధిచేయునది, నక్రమీన విహంగోర్మి నవ్య=మొసళ్ళు, చేఁపలు, పక్షులు, అలలు వీనిచే మనోహరమై, నివ్వెరను=నిండు భయముచే, తటకాపడి=దిగాలుపడి.

తాత్పర్యము

నర్మదయుఁ బ్రీతిని వృద్ధిచేయుచు మొసళ్ళు మీనములు పక్షులు అలలు వీనిచే మనోహరమై భయమున దిగాలుపడి నిలిచిన యువతివలె మనస్సునకు సంతోషము గలిగించెను. నక్రములు పిక్కలు మీనములు కన్నులు, విహంగములు చన్నులు, ఊర్ములు వళులుగా నెఱుంగునది.

ఉ. కావున నింద్రతుల్యమహి•కాంతులతోడఁ బెనంగి వారిశ
స్త్రాళి గాయముల్ పడితి • రంగములన్ హరిచందనద్రవం
బై విలసిల్లె నెత్తురులు హాయిగ • శర్మద మైన నర్మదన్
వావిరి సార్వభౌమముఖ•వారణవర్గము జాహ్నవిం బలెన్. ౭౦౬

అర్థములు. ఇంద్రతుల్య=ఇంద్రునితో సమానులైన, మహికాంతులతోన్= రాజులతో, పెనంగి=యుద్ధముచేసి, హరిచందనద్రవంబు=శ్రీగంధరసము, శర్మద= సౌఖ్యము కలిగించునది, సార్వభౌమముఖ = సార్వభౌమము మొదలుగాఁగల, వారణ=దిగ్గజముల, వర్గము=సమూహము, జాహ్నవింబలెన్ = గంగానదియందు వలె.

తా త్ప ర్య ము

కావున మంత్రులారా! మీరు ఇంద్రునితో సమానులైన రాజులతో యుద్ధముచేసి వారిచే గాయపడితిరి, మీ దేహములకు నెత్తురే గంధపుఁబూఁత యయ్యెను. కావున నిఁక సుఖముగా సౌఖ్యము కలిగించు నర్మదయందు సార్వభౌమాది దిగ్గజములు గంగ యందువలె.

ఉ మీ రవగాహనంబునకు • మేకొనుఁడీ, నది సర్వపంకని
స్తారక, మేనునన్ మునిఁగి • శారదసారసశాత్రవోపమం
బై రహియించు సైకతము • నందుఁ గపర్దిని బూజఁ జేసెదన్
మీరరుగుం డనంగ రజ • నీచరవల్లభునాజ్ఞ మంత్రులున్. ౭౦౭

అర్థములు. అవగాహనంబునకున్=స్నానమునకు, మేకొనుఁడీ=ప్రయత్నింపుఁడు, సర్వపంక నిస్తారక=సమస్త పాపములను బోఁగొట్టునది, శారద=శరత్కాల మండలి, సారసశాత్రవ=చంద్రునితో, సమంబై=ఈడై, సైకతము=ఇసుకదిబ్బ, కపర్దిని=శివుని, రజనీచర వల్లభు నాజ్ఞ=రాక్షసరాజు నుత్తరువు ప్రకారము.

తా త్ప ర్య ము

(మీరు స్నానమునకుఁ బ్రయత్నింపుఁడు. ఇది సర్వపాపములను బోఁగొట్టు నది. నే నిందు స్నానముచేసి తెల్లని ఇసుక దిబ్బలమీఁద శివునిఁ బూజించెదను. మీరు పొండు. అని చెప్పఁగా రావణుని యాజ్ఞప్రకారము మంత్రులు.)

సీ. శూర్పణంబ సారణ•ధూమ్రాక్షశుకులు ప్రహ, స్తమహోదరుల్•హర్ష మెసఁగ
నదిఁ జొచ్చి రా సుర•నాగసంక్షుభితమై, వామనాంజన పద్మ•వారణముల
చేత క్షుబ్ధం బైన•శ్రీజాహ్నవినిబోలె, వారును జలకేళి • వఱలి లేచి
రావణునకు బలి•కై వన్యసుమములు, దేరంగ నేగి త•త్తీరమునను

ఆ. గోరి నన్ని పూలు ♦ కొల్లలుగానుంట, రాశిపోసి రందు ♦ గ్రావ మనఁగఁ
బంక్తిముఖుఁడు దోఁగి ♦ పరమజప్యంబున, జపమొనర్చి దరికిఁ♦జియ్యవచ్చి.

అర్థములు. అసురనాగ=రాక్షసశ్రేష్ఠులచే, సంక్షుభితమై=కలఁపఁబడినదై వామనాంజన పద్మ వారణములచేత=వామనము అంజనము పద్మము అను దిగ్గజములచేత, క్షుబ్ధంబు=కలఁపఁబడినది, శ్రీజాహ్నవిని=శ్రీకరమైన గంగనుబోలె, వన్యసుమములన్=అడవియందుఁ బుట్టిన పూలను, గ్రావము=పర్వతము, తోఁగి=స్నానముచేసి, పరమ జప్యంబునన్=ఉత్తమ మంత్రముచే, గాయత్రీమంత్రముచే, 'న గాయత్ర్యాః పరం మంత్ర'మ్మని కలదు కదా, దరికిన్=తీరమునకు.

తాత్పర్యము

శుకసారణ ధూమ్రామాత్యులు ప్రహస్త మహోదరులు శీఘ్రముగాఁ బోయి సంతోషముతో నదియందుఁ బ్రవేశించి వామనాంజనపద్మములను నేనుఁగులు గంగను గలియఁ బెట్టినట్లు కలియఁబెట్టి స్నానముచేసి లేచి రావణునకు వైశ్వదేవబలికై పూల నిమిత్తము పోయి యవి యాతీరమందే దండిగా నుండుటచేఁ గోసితెచ్చి కొండవలె రాసిపోసిరి. రావణుఁడును స్నానముచేసి నీళ్ళలో నిలఁబడి గాయత్రి జపించి, వేగముగ నొడ్డునకు వచ్చి.

—♦ రావణుఁడు శివలింగపూజ సేయుట ♦—

క. తడిచేల విడిచి వేఁడొక, పొడివస్త్రముదాల్చి లింగ♦మున కర్హంబౌ
పుడమిన్ వెదకుచుఁ గరములు, ముడిచికొనుచు నరిగె, నసుర♦ముఖ్యుల వెంటన్

అర్థములు. తడిచేల=తడిసిన వస్త్రము, పొడివస్త్రము=ఎండినవస్త్రము.

తాత్పర్యము

(తడిసిన వస్త్రము విడిచి పొడివస్త్రము గట్టుకొని లింగము నుంచుటకుఁ దగిన స్థలము వెదకుచుఁ జేతులు ముడుచుకొనుచుఁబోయెను. రాక్షసులతన వెంట.)

క. రూపములు కొనిన కొండల, కోపున నతఁడరుగు నెడకుఁ ♦ గొని చనిరి దినం
బాపంక్తిముఖుఁడు పూజా, వ్యాపారితఁ దన్పుజాళు♦వాలింగంబున్. ౨౦౯

అర్థములు. కొండల కోపున=కొండలవలె, జాళువా లింగంబున్=బంగారు లింగమును.

తాత్పర్యము

(కొండలవలె నతఁడు పోవుచోటికిఁ బ్రతిదినము రావణుఁడు పూజించు బంగారు లింగమును దీసికొని పోయిరి.)

క. ఆకనకలింగ మొకచో, సైకతవేదికను నిల్పి • శ్రద్ధాయుతుఁడై
శ్రీకరగంధసుమాదులఁ, బ్రాకటగతిఁ బూజ చేసె • రావణుఁ డంతన్. ౨౧౦

అర్థములు. కనకలింగము=బంగారులింగము, సైకత వేదికను=అరుఁగు వంటి యిసుకదిబ్బను, శ్రీకర=సంపత్కరమైన. గంధసుమాదులన్=గంధము పూలు ధూపదీపాదులచే.

దీనివలనను నికుంభిలవలనను రాక్షసులందును విగ్రహారాధన మనాదిగఁ గలదని తోఁచుచున్నది.

క. వరదుఁడు చంద్రకళాలం కరణసమంచితుఁడు గరళ•కంఠుండు వ్యథా
హరుఁ డగుశివుఁ బాడుచుఁ దాఁ గరములు పైకెత్తి నటన•కార్యముఁదీర్చెన్.

అర్థములు. వరదుఁడు=కోరిన వరముల నిచ్చువాఁడు, చంద్రకళాలంకరణ=చంద్రరేఖ యను నాభరణముచే, సమంచితుఁడు = ప్రకాశించువాఁడు, గరళకంఠుండు=విషము కంఠమునఁ గలవాఁడు, వ్యథాహరుఁడు = బాధల హరించు వాఁడు, నటనకార్యము=నృత్యము.

తాత్పర్యము

(వరము లిచ్చువాఁడు చంద్రరేఖ నాభరణముగా ధరించి ప్రకాశించు వాఁడు విష కంఠుఁడు, బాధలఁ బోగొట్టువాఁడు నగు శివుని గుఱించి కీర్తనము చేతులెత్తి నృత్యము చేసెను.)

ప్రతిదినము దేవపూజానంతరము దేవుని యెదుట నృత్యము చేయవలెను. పాటలు పాడవలెను. ఇది సంధ్యావందనమువలె నిత్యకర్మము విడువరాదు. కైలాసముక్రిందఁ జేతులు నలిగినది మొదలు రావణునకు శివభక్తి కుదిరినది. రావణుఁడు పాడినది సామగానము, వాఁడు సామవేదమందు సహస్రశాఖాపారంగతుఁడని ప్రసిద్ధి. శైవతంత్రములందు నైశ్వర్యము గోరువారు బంగారు లింగముల బూజింపవలయునని యుండుటచే రావణుఁ డైశ్వర్య కాముఁడై లింగపూజ చేసెనని యూహింపనగు.

విష్ణో ర్గానంచ నృత్యంచ నటనంచ విశేషతః
బ్రహ్మన్ బ్రాహ్మణజాతీనాం కర్తవ్యం నిత్యకర్మవత్॥

౩౨వ సర్గము

— • అర్జునుఁడు తన భుజములచే నర్మద నడ్డగించుట • —

సీ. ఆతఁ డీవిధి శివు నర్చించునెడకు దా, పునను మాహిష్మతీ•పురవిభుండు
నానాలోచనా • సహితుఁడై జలకేళిఁ, దేలుచునుండె నాళి స్త్రీలనడుమ
నాఁడేనుగుల నడు • మంతిరమందు వే తండమో యన నర్జు•నుండు పొలిచె
బాహువుల్ వేయింటి•బలమును బరికింప, నర్వేటి నాఁకట్టె•నద్భుతముగ.

ఆ. వాని మీఁఱ రాక • వాహిని యెదురొడ్డి, నక్రమకరమీన•నవ్యపుష్ప
దర్భసంస్తరసహి•తంబుగాఁ బ్రవహించె, వానకాలమందు•వలెఁ గసంగ. ౭౧౨

అర్థములు. సారసలోచనా సహితుఁడై=స్త్రీలతోఁగూడి, వేలంకమోఁ= ఏనుఁగో, ఆఁకట్టి=అడ్డగించెచు, నక్ర=ఒకజాతి, మొసలి=ఇది యేనుఁగునుబట్టును, మకర=సామాన్యములైన మొసళ్ళు, మీన=చేపలు, నవ్యపుష్పములు=మనోహరములైన పూవులు, దర్భసంస్తర=కుశాస్తరణములు, ఋషులు కర్మములకై పఱచినవి, సహితంబుగా=కూడునట్లుగ.

తాత్పర్యము

రావణుఁ డీ ప్రకారము శివపూజ చేయు ప్రదేశమునకు సమీపమందే యర్జునుఁడు స్త్రీలతోఁగూడి జలక్రీడ లాడుచు నా స్త్రీల నడుమ నాఁడేనుఁగుల నడిమి మగయేనుఁగు వలె నుండెను. అతఁడు తన వేయి చేతుల బలము పరీక్షింప నయ్యేటి నీళ్ళను పాఱకుండ నడ్డగింపఁగా వానిని మీఱ సాధ్యపడక యేటి నీ ళ్ళెదురెక్కి మొసళ్ళతోను జేఁపలతోను పుష్పములతోను ఋషులు పఱచిన దర్భసంస్తరణములతోను వానకాలమందువలెఁ బ్రవహించెను.

క. రావణు కార్యముఁ జెఱుపఁగ, నీవహి నర్జునుఁడె పంపె•నేమో నదినా
నా వాహిని దశముఖు కుసుమావళి నంతయును వఱద•యందుం గలిపెన్. ౭౧౩

తాత్పర్యము

రావణు పూజాకార్యము చెఱుపుమని యర్జునుఁడు నదినిబంపె నేమోయన్నట్లు లానది యెదురెక్కి వచ్చి రావణుని పూల నన్నిటిని వఱదపాలు గావించెను.

—• నర్మద యెదురొడ్డి పాఱి రావణు పూజా ద్రవ్యంబుల ముంచుట •—

చ. సగము సమాప్తమైన గిరి•జాపతిపూజను మాని నర్మదా
పగ ప్రతికూలకాంత యనఁ • బై నెదురై చనుదేర, బశ్చిమం
బుగఁ బ్రవహించు నీతటిని • పూర్వముఖంబుగఁ బాఱ హేతువే
మిగ ఘటియిల్లె, నింతకును • మీఁద స్వభావపుశాంతిఁ దాల్చుచున్. ౭౧౪

అర్థములు. గిరిజాపతి=శివునియొక్క, నర్మదాపగ=నర్మదానది, ప్రతికూల కాంత=విరోధించిన స్త్రీ, పూర్వ ముఖంబుగన్=తూర్పుముఖముగ.

తాత్పర్యము

(సగము ముగిసిన శివపూజను మాని, నర్మదానది, యెదురుతిరిగిన కాంత వలె, నెదురెక్కి రాఁగా నింతకు ముందు స్వభావము శాంతముగా నుండి పడమటి మొగముగఁ బాఱు నీ నది యిప్పుడు తూర్పు ముఖముగాఁ బ్రవహించుట కేమి కారణము గలిగినది?)

తే. ఉరుతరభ్రాంతి విహగంబు ॰ లొప్పుచుండ
నిర్వికారాంగనయుఁబోలె ॰ నీటు మెఱయు
నాపగను గాంచి కుడి కేలి ॰ యంగుళమున
సైఁగఁ గావించె నా శుక ॰ సారణులకు. ౭౧౫

అర్థములు. ఉరుతరభ్రాంతి=విస్తార భ్రమచే, విహగంబులు = పక్షులు, నిర్వికారాంగన=మనోవికారము లేని స్త్రీ.

తా త్ప ర్య ము

(విస్తారమగు భ్రమచేఁ బక్షులుండ, మనోవికారములేని స్త్రీవలెనీటుగులుకు నదిని జూచి కుడిచేతి వ్రేలితో శుకసారణులకు సైగచేసెను.)

శుకసారణులు నర్మద యెదురెక్కిపాఱు కారణము రావణుతోఁ జెప్పుట

ఉ. అన్నయుఁ దమ్ముఁడా నృపుని॰యానతిఁ గైకొని పశ్చిమంబుగాఁ
గ్రన్నన మింటిత్రోవఁ జనఁ॰గా నఱయామడదూరమందుఁ దాఁ
గ్రొన్ననఁబోఁడిపిండులను ॰ గూడి జలంబులఁ గ్రీడఁ దేలు చ
త్యున్నతసాలమో యనఁగ ॰ నుండెడివానిని బూరుషోత్తమున్. ౭౧౬

అర్థములు. అన్నయుఁ దమ్ముఁడు=శుకుఁడు సారణుఁడు, క్రన్ననన్=శీఘ్రముగా, క్రొన్ననఁబోఁడి పిండులను=స్త్రీల సమూహములను,అత్యున్నతసాలమో=మిక్కిలి పొడవైన వృక్షమో, పూరుషోత్తమున్=పురుషశ్రేష్ఠుని.

తా త్ప ర్య ము

అన్నదమ్ములైన శుకసారణు లిరువురు రాజాజ్ఞ దీసికొని యాకాశమార్గంబునఁ బడమటదిశగా నఱయామడ దూరము పోయి యచ్చట స్త్రీలతో జలక్రీడ లాడుచు నెత్తైన వృక్షమువలె నున్న యొక పూరుషుని జూచిరి.

క. తోయవ్యాకులకుంతలుఁ, డై యెఱ్ఱని కనులతో మ ॰ దాకులతేజుం
డై యుర్విని హాటకగిరి, వేయిపదంబులను నిలుపు॰విధ మొప్పారన్. ౭౧౭

అర్థములు. తోయవ్యాకుల కుంతలుఁడై=నీటియందు చెదరియున్న తల వెండ్రుకలు గలవాఁడై, మదాకుల తేజుండై=మదముచేఁ గలఁత చెందిన తేజస్సు కలవాఁడై, హాటకగిరి=మేరువు, పదము=కొండలతఱి తిప్ప, ప్రత్యంత పర్వతము.

తా త్ప ర్య ము.

నీటియందుఁ జెదరిన వెండ్రుకలు గలవాఁడై యెఱ్ఱని కనులతో, మదముచేఁ గలఁత చెందిన తేజస్సుతో భూమిని మేరువు తన వేయి పాదంబులతో నిలుపునట్లు

సీ. తనవేయికరములఁ దటినీలలామంబు, నాఁకట్టి క్రీడించు నతులశౌర్య
సమదవశాసహస్రములతోఁ గ్రీడించు, మద వారణమునకు మ్మాద్రియగుచు
బాలావరాంగనాజాలవృతుం డయి, కేళీవిలోలుఁడై క్రాలువాని
నరిజనభయదుఁడై యద్భుత చరితుఁడౌ, నర్జునుఁ జూచి దశాస్యుఁ జేరి
తే. వార లిట్లని రధిప వేయిబాహు లొప్ప, వాఁడు జలకేళిఁ దేలుచున్నాఁడు నదిని
నంగనలతోడఁ దనవేయిహస్తములను, నడ్డగట్టఁగ నిది యెదురొడ్డి పాఱె ౭౧౮

అర్థములు. తటినీ లలామంబున్ = శ్రేష్ఠమైన నదిని, ఆఁకట్టి=అడ్డగించి, సమద=మదము పట్టిన, వశా=ఆఁడేనుఁగుల, మదవారణమునకున్=మదపుటేనుఁగునకు, మాద్రి=సమానము, బాలా=బాల నాయికల యొక్కయు పదునాఱు సంవత్సరముల స్త్రీకి బాల యని పేరు, వరాంగనా = యువతుల యొక్కయు, జాలావృతుండయి=సమూహములతో చుట్టుకొనఁ బడినవాఁడై, కేళీవిలోలుఁడై= క్రీడయం దాసక్తి గలవాఁడై, అరిజనభయదుఁడై=విరోధులకు భయము గలిగించువాఁడై.

తాత్పర్యము

తన వేయి చేతులతో నేటిని నడ్డకట్టి యాఁడేనుఁగులతో గ్రీడించు మదపుటేనుఁగువలె బాలా నాయికలతోడను తరుణులతోను చుట్టఁబడినవాఁడై క్రీడయం దాసక్తి గలవాఁడై విరోధులకు భయంకరుఁడై యాశ్చర్యకరమైన నడవడికలవాఁడై యున్నయర్జునుఁ జూచి మరలి పోయి రావణునితో వారిట్లనిరి. రాజా! వేయి చేతుల వాఁడు నదీజలములందు స్త్రీలతో జలక్రీడ లాడుచున్నాఁడు. తన వేయి చేతులతో నదిని నడ్డగించుటచే నిది యెదు రెక్కి పాఱుచున్నది.

—॥ రావణుఁడు కార్తవీర్యార్జునుతోఁ బోరఁ జనుట ॥—

చ. అని శుకసారణుల్ పలుక నాతఁడె యర్జునుఁ డంచు రావణుం
డనిపయిఁ గల్గుకాంక్ష వసుధాధిపుఁ డున్నెడ కేగుచుండ నిః
స్స్వనయుతమై రజంబుఁ గొని వాయువు వీచెను సమ్ముఖంబుగా
వనదము రక్తవర్షమును వ్రాల్చె సకృత్కృతభీమరావమై. ౭౧౯

అర్థములు. అనిపయిఁ=యుద్ధముమీఁద, నిస్స్వనయుతమై=ధ్వనితోఁ గూడినదై, రజంబుఁగొని=దుమ్ముతో, సమ్ముఖంబుగాన్ = ఎదురుగా, వనదము= మేఘము, సకృత్+కృత+భీమరావమై=ఒక్కసారి చేయఁబడిన భయంకర ధ్వని కలదై. ఇవి యపశకునములు.

తాత్పర్యము

అని యిట్లు శుకసారణులు తెలుపఁగా వాఁడే యర్జునుఁడని యుద్ధకాంక్షచే రావణుఁడు రాజున్న చోటికిఁ బోవు చుండఁగా దుమ్ముతో నెదురుగాలి యువ్వని వీచెను. ఒక్కసారియే యుఱిమి మేఘము రక్తవర్షము గురిసెను.

తే. అపుడు శుకసారణులును ధూమ్రాక్షుఁడును మ
హోదరుండు మహాపార్శ్వుఁ ◊ డుఁ దక్క మెఱసి
తోడ రాఁ జని మేచకతోయదాభుఁ
డనతిదూరంబునను గాంచె ◊ నవనినాథు. ౭౨౦

అర్థములు. మేచకతోయదాభున్=నల్లని మేఘముతో సమానుని, అనతి దూరంబునను=సమీపమందు, అవనినాథున్=రాజును.

తాత్పర్యము

(అపుడు శుకసారణులును, ధూమ్రాక్షుఁడును, మహోదరుఁడు మహాపార్శ్వుఁడు వెంటరాఁగా నల్లని మేఘముతో సమానుఁడగు సమీపమందుఁ నర్జునుని జూచెను.)

క. తొయ్యలులతోడ నీటను, నెయ్యంబునఁ గ్రీడ సలుపు ◊ నెఱసరిఁ గని తాఁ
జయ్యనఁ జని కన్నెఱ్ఱగ, నయ్యవనిపుసచివతతికి◊ననియె ముదమునన్. ౭౨౧

అర్థములు. తొయ్యలులతోడన్=స్త్రీలతో, నెయ్యంబునన్=చనువుతో, నెఱసరిన్=శూరుని, సచివతతిన్=మంత్రిసమూహమునకు.

తాత్పర్యము

(నీటిలో స్త్రీలతోఁ జనవుతోఁ గ్రీడించుచున్న శూరుఁడగు కార్తవీర్యార్జునునిఁ జూచి, తాను వెంటనే పోయి కన్నెఱ్ఱచేసి గర్వముతో నతని మంత్రులతో ననెను.)

క. తెప్పునఁ జని మీపతికిం, జెప్పుఁడు దశకంఠుఁ డసుర◊శేఖరుఁ డనికై
కప్పరపడి వచ్చె నటం చప్పలుకుల నాలకించి ◊ యమ్మంత్రివరుల్. ౭౨౨

అర్థములు. కప్పరపడి=సంభ్రమము గలవాఁడై.

తాత్పర్యము

(రాక్షసశ్రేష్ఠుఁడయిన రావణుఁడు యుద్ధమునకై తొరపడి వచ్చినాడని మీ రాజునకుఁ జప్పునఁ బోయి చెప్పుఁ డనఁగా విని యా మంత్రి శ్రేష్ఠులు.)

క. బలెబలె రాక్షసనాయక, కలనికి, దగువేళఁ జక్కఁ◊గా నెఱిఁగితి వాఁ
జెలువలను గూడి మత్తునఁ, జెలువారెడు వేళ ◊ రణముఁ◊ జేయఁగఁ బిలుతే? ౭౨౩

అర్థములు. కలనికిన్=యుద్ధమునకు, మత్తునన్=పారవశ్యముచే.

తాత్పర్యము

బలేబలే రాక్షసరాజా! యుద్ధము చేయఁదగిన సమయము చక్కఁగా నెఱిఁగిన వాఁడవు. ఆఁడువాండ్రతోఁ గ్రీడించుచు ముత్తుగా నుండెడి సమయమందా, నీవు యుద్ధమునకుఁ బిలుచుట?

క. కుంజరగమనలకూటమి, రంజిల్లుచు నాఁడుకరులు ◊ గ్రాలఁగఁ జుట్టున్
గుంజర మన నుండెడి నృప,కుంజరుతో నిదియ యదనొకో పోరంగన్. ౭౨౮

అర్థములు. కుంజరగమనల=స్త్రీలయొక్క, కూటమిన్ = సాంగత్యముచే కుంజరము=ఏనుఁగు, అదనొకో=సమయమా?

—◊ అర్జున రావణ మంత్రుల యుద్ధము ◊—

సీ. సైరింపు దశకంఠ! ◊ యీరేయి చన నిమ్ము; యుద్ధమందాసక్తి◊యున్న దేని
వఱువాతఁ జనుదెమ్ము ◊ పతితోడఁ బోరఁగఁ, గాదుకూడ దటంచుఁ◊గడఁగె దేని
రారమ్ము మము గెల్చి◊రాజుడాయఁగఁ బొమ్ము,టన్న రావణమంత్రు◊లన్నృపాలు
ప్రెగడలఁ దాఁకిన◊బీభత్సముగఁ బోరు, భయద,మై హాలాహలా◊ర్భటులఁజెలఁగె
తే.నృపతి సచివులు శూలఖ◊డ్గేషునికర,పాతముల రావణుని ముంప◊బ్రబలులౌ ప్ర
హస్తశుకసారణులు వారి◊నతులశక్తి,నేలపాలొనరించిరి◊నిమిషమునను. ౭౨౯

అర్థములు. తరువాత=ఉదయమున, ప్రెగడలన్ = మంత్రులను, శూలఖడ్గేషునికరపాతములను=శూలములయు కత్తులయు బాణములయు సమూహములవైచుటచే.

తాత్పర్యము

(ఓర్చుకో రావణా! యీ రాత్రి పోనిమ్ము. యుద్ధముచేయఁ గోరికకలదేని నుదయమున రమ్ము. రాజుగారితోఁ బోరవచ్చును. కాదు కూడదని పూనితివా, రా, రమ్ము మమ్ముగెలిచి యావల రాజు దగ్గఱకుఁ బొమ్ము. అని చెప్పఁగా,రావణుని మంత్రులా కార్తవీర్యార్జునుని మంత్రుల నెదిరించిన యుద్ధము భీతిగొలుపునదయి ప్రబల సింహనాదములు మెండయ్యెను, రాజమంత్రులు శూలములయు కత్తులయు బాణములయు సమూహములను వైచి రావణుని ముంచివేయఁగా బలవంతులైన ప్రహస్తుఁడు శుకుఁడు సారణుఁడు అనువారు సాటిలేని శక్తితో నిమిషమాత్రమున వారిని నేలపాలు చేసిరి.)

ఉ. ద్వారము రక్షసేయుభటు◊వర్గము దెల్పఁగ నీయుదంత మా
భూరమణుండు లేచి పువు◊బోణులకున్ ధృతిసూక్తులాడి యా
నీరము నుండి వెల్వడి చ◊నెన్ గదఁ గొంచెదఁ గొంతు లేక రో
షారుణనేత్రకంజుఁ డయి ◊ యాశరుమాద మణంప వేగిమై. ౭౨౬

అర్థములు. ఉదంతము=వార్త, ధృతిసూక్తులు = ధైర్యమువచ్చు మంచి మాటలు. రోషారుణనేత్రకంజుఁడు=కోపముచే నెఱ్ఱనైన నేత్రకమలములు గలవాఁడు, ఎదన్=హృదయము నందు, కొంకు=కొతుకు, ఆశరు=రాక్షసుని, మాదము=మదము.

తాత్పర్యము

ఈ వార్త వాకిలి కావలిగాచువారు దెలుపఁగా నారాజు లేచి స్త్రీలకు ధైర్యము చెప్పి నీరు విడిచి లేచి బయటవచ్చి గదతీసికొని జంకక కోపముచే నెఱ్ఱనైన కన్నులతో రాక్షసుని గర్వ మణంప శీఘ్రముగా వచ్చెను.

—♦ కార్తవీర్యార్జునుఁడు ప్రహస్తునిఁ బడనడఁచుట ♦—

ఉ. గారుడవేగమైనగద ♦ గ్రాలఁ గరంబున వచ్చు నర్జునున్
వీరవరుం బ్రహస్తుఁడును ♦ వింధ్యము భాస్కరునట్లు నాఁగుచున్
గ్రూరము లోహబద్ధ మగు ♦ రోఁకలి రివ్వున యార్చినన్
మారుతమిత్రునట్టు లయి ♦ మండుచు వచ్చెడుదాని భూపుఁడున్. ౭౨౭

అర్థములు. గారుడవేగము=గరుడుని వేగము, లోహబద్ధము=ఉక్కుతో జేయఁబడినది, మారుతమిత్రునట్టులు=అగ్నివలె.

తాత్పర్యము

(గరుడునితో సాటియైన వేగముగల గద, చేబూనిఁ వచ్చు నర్జునునిఁబ్రహస్తుఁడు, వింధ్యపర్వతము సూర్యుని నడ్డగించినట్లు, లాఁగుచు, భయంకరమగు నుక్కు రోఁకలి ఱివ్వునవేసి బొబ్బపెట్టఁగా, నగ్నివలె మండుచువచ్చు దానిని రాజును)

క. లీలగఁ దనగదచేతం, దూలించి ప్రహస్తుమీఁద ♦ దుమికి జవమునన్
గాలాయసగద బాహా, జాలంబులఁ ద్రిప్పి యడువ ♦ శతకోటిహతిన్. ౭౨౮

అర్థములు. కాలాయసగద=ఉక్కుగద, శతకోటి హతిన్=వజ్రాయుధము దెబ్బచే, అడువన్=కొట్టఁగా.

తాత్పర్యము

(విలాసముగఁ దనగదచేతఁబడఁగొట్టి, ప్రహస్తుని మీఁద దుమికి, వడిగా, నుక్కుగదను, దనచేతులతోఁ ద్రిప్పి, కొట్టగా, వజ్రాయుధపు దెబ్బచే.)

క. పర్వతముపోల్కినాతం, డుర్విపయిఁం గూల మిగిలి♦యున్న యమాత్యుల్
గర్వంబు వీడి తొలఁగిరి పర్వున భక్తికిని మిన్న ♦ ప్రాణభయంబే. ౭౨౯

తాత్పర్యము

పర్వతమువలె నతఁడు నేలఁపడెను. అది చూచి తక్కిన మంత్రు లందఱు గర్వము విడిచి రాజెట్టులైనఁ బోనీ, మన ప్రాణము కాపాడు కొందమని పరువెత్తిరి. భక్తికంటె భయమే గొప్పది.

క. మారీచమహోదరశుక, సారణధూమ్రాక్షు లడలి ♦ చనుటఁ బ్రహస్తుం
డీ రీతిఁ ద్రెళ్ళుటయుఁ గని, భూరమణునిఁ దాఁకెఁ బంక్తి♦ముఖుఁ డుగ్రుండై ౨౩౦

తా త్ప ర్య ము

(మారీచుఁడు, మహోదరుఁడు శుకుఁడు, సారణుఁడు, ధూమ్రాక్షుఁడు, భయపడి పాఱిపోవుటయుఁ, బ్రహస్తుఁ డీవిధముగాఁ బడుటయుఁజూచి రావణుఁ డుగ్రుఁడై రాజును దాకెను.)

—♦ రావణ కార్తవీర్యార్జునుల గదా యుద్ధము ♦—

సీ. పదినూర్ల చేతుల ♦ వసుమతీ నాథుండు, నిరువదిచేతుల ♦ సురవిరోధి
గదలను జేకొని♦కదిసి రొండొరుఁ బొంగు, కడలులో మూలముల్♦విడిచి తాఁకు
కొండలో మండు మార్తాండులో దహియించు,నగ్నులో కరిణికై♦యాగ్రహించి
దాఁకెడు మదయుక్త♦దంతావళంబులో, గర్జిల్లు మబ్బులో♦కడిమిమీఱు
తే. బొబ్బ మెకములో క్రుద్ధుఁడౌ ♦ గిబ్బరౌతొ
గుదియదాలుపొ నాఁ బోర ♦ గదలు దాఁకు
నులివు పిడుగులరవళికి ♦ నుద్ది యగుచు
దండి ధ్వను లీను చుండె ది♦ఙ్మండలముల. ౨౩౧

అర్థములు. పొంగుకడలులు=ఉబ్బివచ్చు సముద్రములు, మూలముల్=పాఁదులు, కరిణికై=ఆఁడేనుఁగునకై, మదయుక్త=మదముతోఁ గూడిన, దంతావళంబులో=ఏనుఁగులో, కడిమిన్=బలముచే, బొబ్బమెకములు = సింహములు, గిబ్బరౌతు=శివుఁడు, గుదియతాల్పు=యముఁడు, ఉలివు=ధ్వని, రవళికి=ధ్వనికి.

తా త్ప ర్య ము

వేయిచేతుల యర్జునుఁడు, ఇరువదిచేతుల దుర్జనుఁడు రావణుఁడు, గదలు తీసికొని యొకరి నొకరు పొంగు సముద్రములో, పాఁదులు విడిచిన కొండలో, మండు సూర్యులో, కాల్చునగ్నులో, యాఁడేనుఁగునకై కోపించి, కలహించు మదపుటేనుఁగులో, ఉఱుము మేఘములో,బలముగల సింహములో, శివయములో యనునట్లు యుద్ధముచేయఁగా గదలొకదాని నొకటి కొట్టుధ్వని పిడుగుల ధ్వనికి సమానమై విస్తారముగ ధ్వనులు గలిగించుచుండెను.

క. మెఱుఁగుందీగె నభంబు, న్మెఱయించెడిమాడ్కిఁ దనరె♦నృపవరుఁడు గదన్
జిఱజిఱ త్రిప్పి సురాహితు, పఱపగు వక్షమునఁ బడగ ♦ బరఁగింపన్. ౨౩౨

అర్థములు. నభంబున్=ఆకాశమును, సురాహితు=రాక్షసుని, పఱపగు=విశాలమైన.

తాత్పర్యము

రాజు గద గిర గిర త్రిప్పి రావణుని వెడలుపాటి యురమున వేయఁగానది యాకాశమున మెఱుఁగు దీఁగవలె నుండెను.

క. రక్షోధిపుగద యర్జును, వక్షంబున గిరిని నుల్క పగిది వెలింగెన్
దక్షులకు మున్ను బలికి బు; భుక్షునకుంబోలెఁ జెల్లెఁ బోరు భయదమై. ౨౩౩

తాత్పర్యము

రావణుఁడు వేసినగద యర్జును వక్షమందు కొండమీఁదఁ గొఱవివలె నుండెను. రావణార్జునులకు బలికి నింద్రునకు జరిగిన యుద్ధమువలె జరగెను.

క. కొమ్ములతోఁ గోడెలు దం, తమ్ములతోఁ గరులు కెరలి తాఁకెడిగతి వా
రిమ్మగ నొండొరుఁ దాఁకి భ,యమ్ము కలంకువయు లేక యడిచిరి గదలన్. ౨౩౪

తాత్పర్యము

(కొమ్ములతోఁ గోడెలును, దంతములతో, నేనుఁగులును జెలరేఁగిపోరాడిన విధముగా వారొకరినొకరెదిరించి భయము, కలతఁ లేనివారై, గదలతోఁ గొట్టుకొనిరి.)

ఉ. ఆయెడఁ గార్తవీర్యుడు ని జాఖిలశక్తి కొలంది మాంసభు
గ్నాయకువక్షముం గదను గాటముగాఁ బ్రహరింప దేవతా
గ్రీయవరావితుం డగుటఁ గీడ్పడఁ డాతఁడు బెండువోలె రెం
డై యొఱగెన్ ధరాస్థలిని నా గద, యట్టుల యయ్యు, దద్ధతిన్. ౨౩౫

అర్థములు. నిజాఖిల శక్తి కొలంది=తన సమస్తశక్తి కొలఁది, మానవభుక్ + నాయకు=రాక్షసరాజుయొక్క, ప్రహరింపన్=కొట్టఁగా, దేవతాగ్రీయ = దేవ శ్రేష్ఠులైన, శివబ్రహ్మలు, వర=వరములచే, అవితుఁడు=రక్షింపఁబడినవాఁడు, శివ బ్రహ్మలు దీర్ఘాయు విచ్చిరి గావున నా దెబ్బకుఁ జావఁడయ్యె, మనుష్యులచేఁజావ నట్లు వరములేదు, కీడ్పడఁడు=కీడు పొందినవాఁడు కాఁడు, తద్ధతిన్=ఆ దెబ్బచే.

తాత్పర్యము

ఆసమయమందు నర్జునుఁడు తనశక్తికొలఁది గదతో రావణుని వక్షముపైఁ గొట్టఁగా బ్రహ్మశివుల వరములచే రక్షింపఁబడువాఁడు కావున వాఁడు కీడు పొందినవాఁడు కాఁడు. ఆగదయే రెండు తునుకలై బెండువలె నేలఁ బడిపోయెను, గాని యా దెబ్బచే.

—* కార్తవీర్యార్జునుఁడు రావణు బంధించి పురికిఁ గొనిపోవుట *—

క. సోలుచుఁ బిఱిఁదికి వెసఁ జని, నాలుగు మూఁ[illegible]లతలంబు నం బడె బాధా
లోలితుఁడై విహ్వలుఁడై, యాలావరిపాటుఁ గాంచి యవనీవిభుఁడున్. ౨౩౬

అర్థములు తూలుచున్=బాధచే నఱచుచు, పిఱిఁదికి=వెనుకకు, బాధా లోలితుఁడై=బాధచేఁ జలించినవాఁడై విహ్వలుఁడై = వెలవెలఁబోయినవాఁడై, లావరి=బలశాలి.

తాత్పర్యము

అఱచుచు వెనుకకు నాలుగు మూరల దూరముపోయి యచట నేలఁబడి బాధ పడెను. ఆ బలశాలి పాటుచూచి యర్జునుఁడు-

క. పాముసకై కవిసెడి గరు, టామంతునిఁబోలు చుం దటాన నతనిపై
భూమీశుఁడు వడి బలినిన్, వామను గతిఁ బట్టి కట్టె బలవంతముగన్. ౭౩౭

అర్థములు. గరుటామంతుని=గరుత్మంతుని తటాన=ఉన్నట్టుండి.

తాత్పర్యము.

(పాముసకయి కవిసెడి గరుత్మంతునివలెఁ దటాలున పైపడి కార్తవీర్యార్జునుఁడు రావణుని, బలిచక్రవర్తిని వామనమూర్తి పట్టికట్టినట్లు బలవంతముగా కట్టివేసెను.)

ఉ. రాక్షసనాథుఁగట్టిన ధరాపతి మెచ్చిరి సిద్ధచారణుల్
యక్షులు దేవతావళి యిలాపతిపై సుమవృష్టి రాల్చె హ
ర్యక్షము దంతినింబలె సురారిని బట్టి గళార్భటుల్ జగ
త్ప్రక్షుభితంబుగా నినిచెఁ బంక్తిముఖాసురుఁ డున్న దుస్థితిన్. ౭౩౮

అర్థములు. ఇలాపతిపై=రాజుమీఁద, హర్యక్షము=సింహము, దంతినింబలెన్=ఏనుఁగునువలె, గళార్భటుల్=కంఠధ్వనులు, జగత్+ప్రక్షుభితంబుగాన్=లోకము కలఁత చెందునట్లు, నినిచెన్=నిండించెను.

తాత్పర్యము

(రావణునిఁ గట్టివేయఁగా రాజును సిద్ధచారణులు యక్షులు మెచ్చుకొనిరి. దేవతలు పూలవాన గురిసిరి. సింహ మేనుఁగునువలె రావణునిఁ బట్టుకొని సింహనాదమున జగములు కలఁతచెందునట్లు నిండించెను. రావణాసురుని దుస్థితిని.)

తే. తెప్పిఱిల్లి ప్రహస్తుండు తెలిచూచి, కల సురారుల జతఁగూర్చుఁ గారుమబ్బు
లోలి మూఁగెడికీతి భూపాలు ముసరి, వివిధసాధన చయములవిసరి విసరి. ౭౩౯

అర్థములు. కల=అచ్చటనున్న, కారు మబ్బులు=వానకాలము మబ్బులు.

తాత్పర్యము

(ప్రహస్తుఁడు తెప్పిఱిల తెలిపాఱఁజూచి, తక్కిన రాక్షసులను జతఁగూర్చుకొనఁగా వారు, కారుమబ్బులు క్రమ్మిన విధముగా, రాజును ముసురుకొని, వివిధములయిన యాయుధములను విసరి విసరి.)

చ. నిలు నిలు పోకు పోకు రజనీ • చరనాయకు వీడు వీడు మం
చలఘురవంబునం బలుకు • చర్జును పైఁ బలలాశి సంఘముల్
పిలపిల మూఁగి శూలములఁ • బెద్దకటారుల వైవ వాని న
బ్బలియుఁడు పట్టి వారిపయి • వైచె భయంపడి వారు పాఱఁగన్. ౭౮౦

అర్థములు. పలలాశి సంఘముల్=రాక్షసుల గుంపులు.

తాత్పర్యము

(నిలు-నిలు-పోకు-పోకు-రావణుని విడిచిపెట్టు, విడిచిపెట్టు, అని పెద్దగా నఱచుచు, నర్జునుని మీఁద రాకాసి మూఁకలు, బిల బిల మూఁగి శూలములను బెద్దకత్తులను వేయఁగా వాని నా బలవంతుఁడు పట్టుకొని భయపడి పాఱిపోవునట్లు వారిమీఁదఁ దిరిగి వేసెను.)

క. పెనుగాలికి మబ్బులనన్, దనుజావళి దూలి పఱవ • దశవక్త్రునితోఁ
దననగరము పౌరులు జయ, నినదంబుల మెచ్చ ధారి•ణీపతి చొచ్చెన్. ౭౮౧

తాత్పర్యము

(పెద్దగాలికి మబ్బులు చెదరిపోవునట్లు రాక్షసులు చెదరి పాఱిపోవఁగా, దన పత్తనములోని పౌరులు జయ జయ ధ్వనులు చేయుచు మెచ్చుకొనుచుండ రాజు రావణునితోఁ బత్తనములోఁ బ్రవేశించెను.)

—• పులస్త్యుఁడు రావణుని విడిపించుకొని పోవుట •—

ఉ. అలవునగాలి మూటనిడి • నట్టిది రావణు బంది నుంచుటల్
జలదపథంబునన్ సురలు • సమ్మతిఁ జెప్పికొనం బులస్త్యుఁడా
పలుకులు నాలకించి తన•పట్టిసుతుం డను నెయ్య మూని తాఁ
బెలుచని వేగమార నుడు•వీథిని వచ్చె మరుజ్జవంబునన్. ౭౮౨

అర్థములు. అలవునన్=బలముచే, బందిన్=చెఱసాలయందు, జలద పథంబునన్=ఆకాశమున, పెలుచని=అధికమైన, మరుజ్జవంబునన్=వాయువేగమున.

తాత్పర్యము

(దేవత లాకసమున నిలిచి, రావణునిఁ బట్టి, కట్టి చెఱసాలయం దుంచుట బలముచే గాలిని మూట కట్టుట వంటిది సుమా యని చెప్పుకొను చుండఁగా, విని, పులస్త్యుఁడు, తన కొడుకు కొడుకుగదా యను ప్రేమతో వాయు వేగమున నాకాశ మార్గము నుండి గబ గబ వచ్చెను.)

తే. వచ్చి యమరావతీసన్ని•భంబు పుష్ట, హృష్టలోకాన్వితంబు మా•హిష్మతీ పు
రంబు మునిచొచ్చి తనరాక•రాజునకును, జెప్పిపుచ్చిన వారలు•క్షితితలేంద్రు.

అర్థములు. అమరావతీ నిభంబు=ఇంద్రుని నగరముతో సమానమైనది. పుష్ట=బలిసినట్టియు, హృష్ట=సంతోషముతోఁ గూడినట్టియు, లోక=జనులచే, అన్వితంబు=కూడినది, క్షితితలేంద్రున్=రాజును.

తాత్పర్యము

(వచ్చి, యమరావతితో సాటియై, పుష్టి సంతుష్టిగల జనులతోనున్న మాహిష్మతీపట్టనములోఁ బ్రవేశించి, తాను వచ్చిన సంగతి, రాజునకుఁ జెప్పి పంపఁగా, వారు, రాజును-)

క. చేరంజని నృప! పదసంచారుం డగు రవినిబోలి ♦ చండమహాతే
 జోరాజిదుర్నిరీక్షుం,డై రాజిలుముని పులస్త్యుఁ ♦ డరుదెంచెనన్. ౨౮౮

అర్థములు. పదసంచారుఁడు=కాళ్ళతో నడచువాఁడు, రవిని=సూర్యుని, చండమహాతేజోరాజి = తీక్షణమైన గొప్ప తేజస్సు సమూహముచే, దుర్నిరీక్షుండై=తేఱిచూడరానివాఁడై.

తాత్పర్యము

సమీపించి రాజా! కాళ్ళతో నడచు సూర్యుని వలెఁ దీవ్ర తేజస్సుచేఁ జూడరాని వాఁడైన పులస్త్య మహాముని వచ్చినాఁడని చెప్పగాఁ

సీ. అర్ఘ్యంబు మధుపర్క ♦ మాత్మపురోహితుల్,గొని వెంటరాఁగ శ ♦ క్రుండుగురుని
 నెదురుకొనం బోవు ♦ చదురున శిరమునఁ, గరములు చేరిచి ♦ కదిలిపోయి
 యర్ఘ్యంబు పాద్యంబు ♦ నావును మధుపర్క,మిచ్చి సంతోషంబు ♦ హెచ్చమదిని
 లోనికిఁ దోడ్తెచ్చి ♦ మానితసూక్తుల, సంస్తుతించుచు హర్ష ♦ సంభ్రమమున
తే. గద్గదోక్తుల నిట్లనుఁ గంజసంభ, వాభ! నీ విందు వచ్చుట ♦ నమరపురికి
 దీటుగా నయ్యె మాహిష్మ ♦ తీపురంబు, నేను జేసిన భాగ్యంబు ♦ నిస్తులంబు. ౨౮౯

అర్థములు. చదురున=విధముగా, గద్గదోక్తులన్=డగ్గుత్తికతోఁ గూడిన మాటలచే, కంజసంభవాభ=బ్రహ్మతో సమానుఁడా, నిస్తులంబు=అసమానము.

తాత్పర్యము

తన పురోహితు లర్ఘ్యము పాద్యము తీసికొని రాఁగా నింద్రుఁడు బృహస్పతిని వలె నెదురుగా శిరస్సునందుఁ జేతులు జోడించుకొనిపోయి యర్ఘ్యము పాద్యము గోవు మధుపర్క మిచ్చి సంతోషముతో నింటిలోనికిఁ దోడితెచ్చి గౌరవోక్తుల స్తుతించుచు సంతోష సంభ్రమంబున డగ్గుత్తికతో నిట్లనియె. బ్రహ్మసమాన! నీవిచ్చటికి వచ్చిన కారణమున మాహిష్మతీపురము దేవేంద్రునగరమునకు సరియయ్యెను. నేను జేసిన పుణ్య మసమానము.

క. ఎవ్వారికి గోచరింపక, యవ్విబుధులచేతఁ బూజ ♦ లందెడి నిన్నే
నివ్వీటఁ గాంచి పూజల, నివ్విధి నర్చించుటను ద్వి♦జేంద్రుఁడ నైతిన్. ౭౮౬

తా త్ప ర్య ము

నీవు మనుష్యుల కెవ్వారికిఁ గానవచ్చువాఁడవు కావు. దేవతలు నిన్నుఁ బూజించుచుందురు. అట్టి నిన్ను నా యింటిలోఁ జూచి యీ విధముగఁ బూజించుటచే నేనే ద్విజులందు శ్రేష్ఠుఁడను

క. ఇప్పుడువో నా కుశలం, బిప్పుడువో నా వ్రతంబు ♦ లీడేఱెను నా
కిప్పుడు జన్మము సార్థక, మిప్పుడువో తపము పండెఁ ♦ గృతమతి నైతిన్. ౭౮౭

తా త్ప ర్య ము

(ఇప్పుడేకదా నాకు కుశలము. ఇప్పుడేకదా నా వ్రతములు నెఱవేఱినవి. నా జన్మమిప్పుడు కదా సార్థకమైనది? ఇప్పుడుకదా నేను జేసిన తపస్సుపండినది. నేను గృతార్థుఁడనయితి నిప్పుడుకదా.)

క. ఈరాజ్యం బీపుత్రులు, నీ రమణులు నెల్లవార ♦ లేను మునీ! నీ
వారము కార్యం బెయ్యది, కారుణ్యామతీ! యనుజ్ఞఁ ♦ గావింపగదే? ౭౮౮

తా త్ప ర్య ము

(ఈ రాజ్యము యీ పుత్రులు, యీభార్యలు నేను, మునీంద్రా! నీవారము ఏమిపని? దయాశాలీ! సెలవిమ్ము)

ఉ. నావుడు హైహయాధిపుని ♦ నందను లెల్లరు లెస్సలా? సుఖం
బా వరవర్ణినీతతికి? ♦ నగ్నులు చక్కఁగ నున్నె? ధర్మ మెం
దేవిధలోపముం గలుగ ♦ కెప్పుడు వర్తిలునే? యటంచు స
ద్భావుఁడు ప్రశ్నచేసి దశ ♦ వక్త్రుని గెల్చిన కీర్తిపూరితా! ౭౮౯

అర్థములు. హైహయాధిపునిన్ = హైహయవంశాధిపతిని, వరవర్ణినీతతికిన్ = స్త్రీలకు, భార్యలకు.

తా త్ప ర్య ము

(అని చెప్పఁగా, హైహయవంశప్రభువగు కార్తవీర్యార్జునునిఁ జూచి, నీ కొడుకులు సుఖముగా నున్నారా? నీ భార్యలకు క్షేమమా? అగ్నులు చక్కఁగ నున్నవా? ధర్మమునందెట్టి లోపములేక చక్కఁగ సాగుచున్నదా? యని మంచి మనసుగల యా పులస్త్యముని కుశలప్రశ్నముచేసి, రావణునిఁ గెల్చిన కీర్తిదిక్కుల నింపితివి!)

తాత్పర్యము

ఉ. ఎవ్వని పేరు విన్నఁ జలి • యింపక నిల్చు మరున్మహోదధుల్
నివ్వెఱ; నట్టి పేరు నవ • నీధవ! దుర్జయు నాదు మన్మనిన్
జివ్వను బట్టి బద్ధునిఁగఁ • జేసి కుమారుని కీర్తిపూరమున్
గ్రొవ్వఱఁ గ్రోలివైచితివి • కోటివిధంబుల నిన్ను మెచ్చితిన్. ౭౫౧

అర్థములు. మరుత్+మహోదధుల్=గాలి, సముద్రము, నివ్వెఱన్=నిండు భయముతో, అవనీధవ దుర్జయున్=రాజులకు జయింపరాని వానిని, చివ్వను= యుద్ధమునందు, కుమారుని=చిన్నవాని, కీర్తిపూరమున్ = కీర్తిప్రవాహమును, క్రొవ్వఱన్=వాని గర్వము క్షయించునట్లు, క్రోలి=త్రాగి.

తాత్పర్యము

ఎవని పేరు వినినంత మాత్రముననే భయపడి గాలి సముద్రుఁడు కదలక నిలుతురో, యెవఁడు రాజులకు జయింపరానివాఁడో యట్టి నా మనుమని యుద్ధమునందు బట్టి కట్టి వైచితివి. వాని యశఃప్రవాహమును వాని గర్వ మణఁగునట్లు ద్రాగితివి. నిన్నుఁ గోటివిధంబుల మెచ్చితిని.

క. మా పిల్లవానిపై నీకఁ, గోపంబును మాను నాదు • కోరిక యిది వే
పాపుము చెఱనుండి నృపాలా! పంక్తిగ్రీవు ననఁ ద • లంపక నెయ్యిండున్. ౭౫౨

తాత్పర్యము

(రాజా! మాపిల్లవాని మీఁదఁ గోపము మానుము. వెంటనే రావణుని జెఱసాల నుండి విడిచి పుచ్చుము. ఇది నాకోరిక; అనియనఁగానే, మఱుమాటాడక.)

క. మునివర్యుని ప్రీతికినై, జనవర్యుఁడు విడిచి పుచ్చె • సమ్మదమున స
ద్దనుజాధిపు వారిరువురు; జనసుత గావించి రగ్ని • సాక్షిగఁ జెలిమిన్. ౭౫౨

తాత్పర్యము

(మునిరాజు సంతోషించుటకయి, రాజు, సంతోషముగా రావణునిఁ జెఱ నుండి విడిపించెను. వారిరువు రగ్నిసాక్షిగ స్నేహము చేసిరి.)

క. ఒండొరు లీక బాధింపక, యుండఁగ నెయ్యంబు చేసి • యుర్వీంద్రుండున్
నిండారుభక్తి మునివే, తండమునకు మ్రొక్కి- చనియెఁ • దనగృహమునకున్. ౭౫౩

అర్థములు. మునివేతండమునకు=మునిశ్రేష్ఠునకు

తాత్పర్యము

(ఒకరి నొకరు బాధించుకొనకుండ స్నేహముచేసికొని, రాజేంద్రుఁడు పులస్త్యమునికి నిండారు భక్తితో దండము సమర్పించి తన యింటికిఁ బోయెను.

క. ఆతిథ్యముఁ గొని నృపుచే, నీతులు బోధింపఁ దాత ♦ నెఱి విని లజ్జా
స్వీతుండై లంకకుఁ జనె, నై తేయుఁడు చనియె ముని పి♦తామహుభువికిన్. ౨౫౪

అర్థములు. లజ్జాస్వీతుండై=సిగ్గుగలవాఁడై, పితామహు భువికిన్=సత్య లోకమునకు.

తా త్ప ర్య ము

(రాజుచే నాతిథ్యమును బొంది, తాతయైన పులస్త్యుండు నీతులు బోధింపఁగా విని సిగ్గుతో రావణుఁడు లంకకుఁ బోయెను. ముని సత్యలోకమునకుఁ బోయెను.)

ఉ. వింటివె రామచంద్ర! నృప♦వీరునిచే దశకంఠుఁ డెట్లు దా
గంటున బద్ధుఁడై పిదపఁ ♦ గాంచె విముక్తిఁ బులస్త్యువాక్కుచే
గొంటుతనాన నన్యులకుఁ ♦ గూడ దవజ్ఞ యొనర్ప నెంత దా
బంటయినన్, ధరిత్రి బల♦వంతులకున్ బలవంతు లుండరే? ౨౫౫

అర్థములు. అవజ్ఞ=అవమానము, బంటు=శూరుడు, బలవంతులకున్= బలవంతుల కంటెను త్రాడు తన్నెడి వారిని దల దన్నువారు లేరా?

తా త్ప ర్య ము

(రామచంద్రా! వింటివికదా? కార్తవీర్యార్జునునిచే రావణుఁడే ప్రకారము పోరిలో నోటుపడి పట్టుపడి పులస్త్యుని మాటచే బిదప విడువఁబడినది. తానెంత యొనఁగాడయినను నితరుల నవమానింపరాదు. బలవంతులకు పైన బలవంతు లుండరా. త్రాడుతన్నెడి వారిని దలదన్నువారు లేరా!)

తే. రక్కసులఱేఁడు హైహయ♦రాజుతోడ
మైత్రి యొనరించి యెండియు♦ధాత్రిఁ దిరుగు
చుండెఁ బొవరున ధారిణీ♦శోత్కరమున
కోటమిని గూర్ప లజ్జయన్ ♦ మాట లేక. ౨౫౬

అర్థములు. ధారిణీశోత్కరమునకున్ = రాజసమూహమునకు, ఓటమి= పరాజయము.

తా త్ప ర్య ము

(రావణుఁడు కార్తవీర్యార్జునునితో స్నేహము చేసి, తరువాత మరల రాజుల నోడింపవలె నని, పొగరుచే బిడియములేక భూమిమీఁదఁ దిరుగుచుండెను.

—♦ రావణుఁడు వాలితో యుద్ధంబు సేయఁ గిష్కింధకుఁ బోవుట♦—

ఉ. గంధగజేంద్రసన్నిభుఁడు ♦ క్ష్మాజనులందును రాక్షసాళి నే
బంధురవిక్రమున్ వినినఁ ♦ బంక్తిముఖుం డటకేగి పిల్చు ద
ర్పాంధత నాజి కిట్లు భువ♦నాళిఁ జరించుచు నొక్కనాఁడు కి
ష్కింధకు వచ్చి పిల్చె రణ♦కేళికి వాలిని హేమమాలినిన్. ౨౫౭

అర్థములు. గంధగజేంద్రసన్నిభుఁడు=మదపుటేనుఁగుతో సమానుఁడు, బంధుర విక్రమున్=అధిక పరాక్రమము గలవానిని, దర్పాంధత=గర్వము వలనఁ గన్నులు గానక, ఆజికిన్=యుద్ధమునకు, హేమమాలినిన్ = బంగారు హారము గలవానిని.

తాత్పర్యము

మదపుటేనుగుతో సమానుఁడైన రావణుఁడు భూమియందలి మనుష్యులను గాని రాక్షసులందుఁగాని పరాక్రమవంతుఁ డను పేరు వినినా యచ్చటికిఁ బోయి వానిని యుద్ధమునకుఁ బిల్చుచు నీ విధముగ లోకములఁ దిరుగుచు నొక్క నాఁడు కిష్కింధకువచ్చి బంగారుహారము ధరించిన వాలిని యుద్ధమునకుఁబిలిచెను.

క. తారుండును సుగ్రీవుఁడు, తారాజనకుండు వచ్చి ♦ దశకంధరుతో
నూరను లేఁడు భవత్ప్రతి, వీరుం డగు వాలి యెవరిఁ ♦ బిలిచెద వనికిన్. ౫౦

అర్థములు. తారాజనకుండు=సుషేణుఁడు భవత్=నీకు, ప్రతి వీరుఁడు=ఎదురగు వీరుఁడు.

తాత్పర్యము

(తారుఁడు సుగ్రీవుఁడు సుషేణుఁడు వచ్చి రావణునితోఁ నీకుఁదగినవీరుఁడు వాలి యూరలేఁడు, యుద్ధమున కెవరిఁ బిలిచెదవు?)

సీ. ఎవ్వనచారి ని♦న్నెదిరింపఁ జాలెడి, వాలి దక్కఁగ దశ♦వక్త్ర! యతఁడు
సంధ్య వార్వఁగ నాలు♦సంద్రంబులకు నేగె, నించుక నిలు మత♦డిపుడ వచ్చు
వాలితో నని సేయ♦వచ్చినవారల, శంఖవళక్షాస్థి♦చయముఁ గనుము
అమృతంబుఁ ద్రావి నీ♦వరుదెంచితేన్ వాలి, జెనకిన నంతతోఁ ♦ జెల్లెదీవు
తే. సర్వజనచిత్రశీలి మా♦స్వర్ణమాలిఁ, దొడరితివ యేని నీ మనికి ♦ దుర్లభంబు
గానఁ జక్కఁగ నూరికిఁ గదలుగాక, చావవలతేని వాలికై ♦ సరగఁ జనుము.

అర్థములు. సంద్రంబులకున్ = సముద్రములకు, శంఖవళక్షాస్థిచయము= శంఖమువలెఁ దెల్లనైన యెముకల సమూహము, చెల్లెదు=చచ్చెదవు.

తాత్పర్యము

దశకంఠా! నిన్ను వాలిదప్ప నెవ్వానకుఁ డెదిరింపఁజాలును? వాలి సంధ్య వార్చుటకై నాలుగు సముద్రములకుఁ బోయి యున్నాఁడు. కొంచెమునేపు నిలిచిన నతఁడు వచ్చును. వాలితో యుద్ధముచేయ వచ్చినవారి శంఖమువలె తెల్లనియెముకలరాశి చూడుము. నీ వమృతము ద్రావి వచ్చినను వాలితో నెదిరించితివా చచ్చిన వాఁడవే. సమస్తజనులకు నాశ్చర్యకరమైన శీలము గల మా స్వర్ణమాలిని నెదిరించితివా నీవు బ్రదుకుట కష్టము. కావునఁ జక్కఁగా నూరికిఁ బొమ్ము చావఁ గోరిక యుండెనా వాలిని వెదకుచుఁ బొమ్ము.

శా. ఆతం డిప్పుడు దక్షిణాబ్ధితటి సం◆ధ్యాసక్తుఁడై పావక
స్ఫీతాతుల్యమహోగ్రతేజుఁ డయి యు◆ర్వీస్థుండు నై యుండునా
నా తారప్లవగేంద్రునిం గదిమిచ◆య్యం బుష్పకారూఢుఁ డై
దైతేయాగ్రణి దక్షిణాంబునిధికై◆ తాఁ బోయి యం దొక్కచోన్. ౭౬౦

అర్థములు. దక్షిణాబ్ధితటిన్=దక్షిణసముద్రతీరమునందు, సంధ్యాసక్తుఁడై= సంధ్యవార్చుటయం దాసక్తుఁడై, పావక=అగ్నిహోత్రునియొక్క, స్ఫీత=ప్రసిద్ధమైన, అతుల్య=అసమానమైన, మహోగ్ర=మిగుల భయంకరమైన, తేజుఁడయి= తేజస్సు గలవాఁడై, ఉర్వీస్థుండు=భూమి యందున్నవాఁడు, నాన్=ఇట్లు చెప్పఁగా కదిమి=అదలించి.

తాత్పగ్యము

(ఆతఁడిప్పుడు దక్షిణ సముద్రము తీరమున నగ్నితో సాటియైన గొప్ప భయంకరమయిన తేజస్సుగలవాఁడై సంధ్యవార్చుటకై భూమియం దున్నవాఁడు. అని చెప్పఁగా, తారుఁడను వానరేంద్రుని నదలించి వెంటనే పుష్పకమెక్కి రావణుఁడు దక్షిణ సముద్రమునకుఁ బోయి, యందొక్క చోట.)

క. భాసురహాటకగిరినిభు, వాసవసుతు బాలసూర్య◆వదనుని సంధ్యో
పాసనతత్పరుఁ గనుఁగొని, యాసోఁకులఱేఁడు వ్యోమ◆యానము డిగియెన్. ౭౬౧

అర్థములు. భాసుర=ప్రకాశించు, హాటకగిరి=మేరు పర్వతముతో, నిభ= సమానమైన వానిని, వాసవసుతున్=ఇంద్రుని కుమారుని, బాలసూర్య వదనుని= లేఁత సూర్యుని వంటి ముఖము గలవానిని, సంధ్యోపాసనతత్పరున్=సంధ్య నుపాసించుటయందు ఆసక్తి గలవానిని, సోఁకులఱేఁడు=రాక్షసరాజు.

తాత్పర్యము

మేరు పర్వతముతో సమానుఁడైన యింద్రపుత్రుని బాలసూర్యుని కాంతి గలవానిని సంధ్యవార్చ ప్రయత్నమందున్న వానిని చూచి రావణుఁడు విమానము దిగెను.

స్నానము చేసి సంధ్య వార్చవలయును గావున స్నానము చేయుటకై యత్నించు వాని నని యర్థము.

క. నెప్పున నీఁగి తనపదములు, చప్పుడు గాకుండ నరిగి◆ సౌత్రామిని దా
దప్పక పట్టఁ దలంచుచు, నెప్పునఁ జనుచుండ వాని◆ నిర్భాగ్యమునన్. ౭౬౨

అర్థములు. సౌత్రామిని= వాలిని, సుత్రాముని కొడుకు సౌత్రామి, సుత్రాముఁడు=ఇంద్రుఁడు, నెప్పునన్=నేర్పున, ఉపాయముగ, వాని నిర్భాగ్యమునన్=వాని దురదృష్టముచే.

తా త్ప ర్య ము

(చప్పున దిగి, చప్పుడుగాకుండ నడుగులో నడుగు పెట్టుచుఁ బోయి వాలినిఁ దప్పక పట్టవలె నని నేర్పునఁ బోవుచుండ వాని దురదృష్టముచే.)

క. ఎట్టులొ యదృచ్ఛ నింద్రుని, పట్టియుఁ గడకంటఁ జూచి ॰ పాపాశయుఁ దా
నిట్టట్టు కదల కేమియు, దొట్టగిలంబడక యుండె ॰ నొల్లిటిరీతిన్. ౭౬-౩

అర్థములు. యదృచ్ఛన్ = ఆకస్మికముగ, పాపాశయున్=పాపపు టభిప్రాయము గలవానిని, మోసగించి తన్నుఁ బట్టదలంచిన వానిని, తొట్టగిలంబడక= తొట్రుపడక, సంభ్రమపడక.

తా త్ప ర్య ము

ఆకస్మికముగ నుద్దేశము లేకయే యెట్లో వాలి యా దురభిప్రాయము గల రావణుఁ జూచి వాని యభిప్రాయ మెఱింగి యిట్టట్టు కదలక యేమియు సంభ్రమ పడక మునుపటివలెనే కదలకుండెను.

తే. చెవులపిల్లిని జూచిన॰సింహ మనఁగఁ బాముఁ గనుఁగొన్న గరుడుని॰పగిదిగాఁగ
సరకు సేయక తనుఁ బట్టఁ॰జిక్కఁ వచ్చు, పంక్తికంఠునిగూర్చి యా॰వాలితలఁచు

తా త్ప ర్య ము

(చెవుల పిల్లినిఁ జూచి సింహమువలెఁ, బామును జూచిన గరుడుని పగిది, వాలి, తనను బట్టవచ్చెడి రావణుని లెక్క చేయక, తనలో నిట్లని తలఁచెను.)

ఉ. పాపపుబుద్ధి వీఁడు ననుఁ ॰బట్టఁదలంచెను బొంచి వీనినే
నేపునఁ జంకలో నిఱికి ॰ యేగెద నబ్ధులమూఁట నాడఁగా
ద్యోపథమందు వ్రేలఁ దన ॰ యూరులు హస్తము లంబరంబునన్
జేపడి వైనతేయునకుఁ ॰ జేడ్పడుపామునుబోలి స్రుక్కఁగన్. ౭౬-౫

అర్థములు. ఏపునన్=బలముచే, ఇఱికించుకొని, ద్యోపథమందు = ఆకాశ మార్గమున, వైనతేయునకు=గరుత్మంతునకు.

తా త్ప ర్య ము

పాపపు బుద్ధిగల వీఁడు నన్నుఁ బొంచి పట్టదలఁచి వచ్చుచున్నాఁడు. రానిమ్ము. వీనిని జంకలో నిఱికించుకొని మూఁడు సముద్రములలో స్నానముచేయ బోయెదను, అప్పుడు వీని తొడలు చేతులు నాకాశమున వ్రేలాడుచు గరుత్మంతునకుఁ జిక్కి బాధపడు పామువలె స్రుక్కును.

క. అని తలపోయుచుఁ జెవి యా,తనిమీఁదనె యుంచి మునితఁ॰దగు శ్రుతిమంత్రం
బును జపియించుచు నుండెను, ఘనబలు లొండొరును బట్టఁ॰గా జతనమునన్.

తాత్పర్యము

అని మనస్సులో నాలోచించుచు వాని కాలి చప్పుడు తెలియుటకుఁగాను చెవి వానియందే యుంచి మౌనియై వేదమంత్రమును జపించుచు నుండెను. ఈ ప్రకారము మహాబలశాలు లిరువురు నొకరి నొకరు ప్రయత్నించి పట్టఁగా.

ఇందు వాలికి వేదమంత్రము, గాయత్రి కలిగినట్లు చెప్పుటచే నతఁడు మృగజాతిలోఁ జేరినవాఁడు కాఁడనియు మనుష్యులలో, క్షత్రియజాతిలో చేరిన వాఁడనియు వాలము గలవాఁడనియు నేర్పడుచున్నది.

—ః వాలి రావణుఁ జంక నిఱికి సముద్రంబుల ముంచుట ః—

చ. తలఁపఁగ నంత రావణుఁడు ః దాసినజాడ పరాఙ్ముఖుండు నై
వలిముఖనాయకుం డతని ః పాద రవాన నెఱింగె, నింతలో
పల దనుజుండు వానరునిఁఃబట్టఁగఁ జేతులు సాఁప గ్రక్కునన్
బలియుఁడు వాసవాత్మజుఁడు ః పాము సుపర్ణుఁడు పట్టునట్లు పట్టుకైవడిన్. ౭౬౭

అర్థములు. దాసిన జాడ=సమీపించిన విధము పరాఙ్ముఖుండు నై= మాఱు మొగమై యుండియు, వలిముఖనాయకుండు=వానరరాజు, వాలి, పాద రవాన=కాలి చప్పుడుచే.

తాత్పర్యము

ఆలోచింపఁగా నంత రావణుఁడు సమీపించె నని వాలి పరాఙ్ముఖుండయ్యు వాని కాలిచప్పుడుచేఁ దెలిసికొనెను. ఇంతలో రావణుఁడు వాలిని పట్టుకొన చేతులు చాఁపఁగా బలశాలి వాలి తటాలున పామును గరుత్మంతుడు పట్టు కొనునట్లు.

చ. తటుకున నట్టెపట్టి దృఢఃదర్పసమగ్రుడు చంక నొత్తి ప్ర
స్ఫుటజవయుక్తుఁడై యెగసి ః చుక్కలత్రోవకు వాని గిచ్చుచు
న్బొటమఁగ నెత్తువాఁక శ్వసఁనుండు మహాభ్రముఁబోలె వెంట న
క్కుటిలచరిత్రు లాగుకొని ః గొబ్బునఁ బోవుచు నుండ నింతలోన్. ౭౬౮

అర్థములు. తటుకున = తటాలున, దృఢదర్పసమగ్రుడు=పూర్ణమైన బల గర్వము గలవాఁడు, ప్రస్ఫుట జవయుక్తుడై =విశేష వేగముతోఁ గూడినవాఁడై శ్వసనుఁడు=వాయువు, మహాభ్రముఁ బోలెన్ = పెద్ద మేఘమునువలె.

తాత్పర్యము

తటాలున గట్టిగాఁ బట్టుకొని పూర్ణబల మదము గల వాలి వానిని జంకలో నిఱికించుకొని మహావేగముతో నెగసి ఆకాశమార్గమునఁ బోవుచు నెత్తురు వంక పాఱునట్టు వానిని గిచ్చుచు పెద్దగాలి మేఘమును దనవెంటఁ దీసికొని పోవునట్లు వాని నీడ్చుకొని పోవుచుండెను.

సీ. రావణుగతిఁ జూచి • రావణుమంత్రులు, విడిపింప వానరు•వెంటఁ బడఁగ
నతఁ డభ్రపదగుఁ డౌ•నరుణునిఁ బోలుచు, విలసిల్ల నెయిద లే•కలసి యతని
బాహూరుజవభవ•వాయువిధూతులై, సడలిరి యవ్వాలి•చనెడిచోట
వసుధాధరములైనఁ • బాయుచుఁ దెరు విచ్చు, జీవయుక్తులమాటఁ•జెప్పనేల

ఆ. పక్షివితతికైనఁ • బఱవంగ రాని య,చ్చోటఁ జనుచు శక్ర•సూనుఁ డోలి
సర్వసాగరముల • సంధ్య నుపాసించె, మెచ్చఁ దన్ను దమివి•యచ్చరాలి. ౨౬౯

అర్థములు. అభ్రపదగుఁడు=ఆకాశమార్గమును బొందినవాఁడు = ఆకాశమునఁ బోవువాఁడు. అనఁగా నంత యెత్తున నంతవేగముగఁ బోవువాఁడు, ఎయిద లేక=కలసికొనలేక, బాహూరుజవభవ=బాహువుల యొక్కయు తొడల యొక్కయు వేగమునఁ బుట్టినఁ వాయు=గాలిచే, విధూతులై = ఎగురఁగొట్టఁబడినవారై, వసుధాధరములు=కొండలు, జీవయుక్తులు=ప్రాణముతో నుండువారు, వియత్+చర+ఆళి=ఆకాశమున సంచరించువారి, యనఁగా దేవతల సమూహము.

తాత్పర్యము

రావణునికి లభించిన దశఁ జూచి రావణునిమంత్రులతని విడిపింపఁగోరి వాలి వెంబడి పోయిరిగాని యతఁ డాకాశమున సూర్యునివలెఁ బోవుటచేఁ గలిసికొనలేక అతని చేతుల తొడలవలనఁ గలిగిన గాలిచేఁ గొట్టుకొనిపోయి వెనుకఁబడిరి. ఆ వాలి పోవుచోటఁ గొండ లడ్డమైనను నవి త్రోవ యిచ్చును. ఇఁక ప్రాణము లున్నవానిమాట చెప్పనేల? పక్షులు పాఱుటకును సాధ్యముగాని యెత్తునఁబోవుచు వాలి యన్ని సముద్రములందు దేవతలు తన్ను మెచ్చునట్లు సంధ్యవార్చెను.

అన్ని సముద్రముల సంధ్యవార్చె ననఁగా దక్షిణమున సంధ్యాంగశౌచము పశ్చిమమున మంత్రపూర్వక సంధ్యాంగ స్నానము, ఉత్తరమున ప్రోక్షణాదికము, తూర్పుసముద్రమున అర్ఘ్యప్రదానాదికము అని గ్రహింపనగు.

క. ఇడుకొని రావణుఁ జంకన, పడమటికడలికిని బఱచి • వారిచి సంధ్యన్
వడి నుత్తరజలధికి నెం,బడి రావణు సీడ్చికొనుచు • మసలక యరిగెన్. ౨౭౦

అర్థములు. కడలి=సముద్రము.

తాత్పర్యము

(రావణునిఁ దనచంకలో నిఱికించుకొని పడమటి సముద్రమునకుఁ బోయి యచట సంధ్యవార్చి, వడిగా నుత్తర సముద్రమునకు రావణునిఁ దనవెంబడి నీడ్చుకొనుచు నెచ్చటను జాగుసేయక పోయెను.)

ఉ. ఆమడ లెన్నివేలో యసు ♦ రాధిపుతో వినువీథిఁ బాఱి సు
త్రామసుతుండు వాయువువి♦ధంబున మానసవైఖరిన్ జవో
ద్దామత నుత్తరంబు విడి ♦ దాశరథీ! చని తూర్పువార్ధికిన్
నేమముతోడ నంధ్యఁ దన♦నిష్ఠను దీర్చి సహాసురేశుఁడై. 221

అర్థములు. సుత్రామసుతుండు=వాలి, జవోద్దామత=అధిక వేగముచే, మానసవైఖరిన్=మనస్సువలె-అంతవేగమున.

తా త్ప ర్య ము

(ఎన్నివేల యామడలో రావణునితో నాకసమున నెగిరి, వాలి, గాలివలె, మనస్సునట్టు లంతవేగముగా నుత్తర సముద్రమును విడిచి, తూర్పుసముద్రమునకు వచ్చి యచ్చట దన నిష్ఠను నియమముతోఁ దీర్చుకొని, రావణునితో.)

క. క్రమ్మఱి కిష్కింధాప్రాం,తమ్మునఁ గల వనిని డిగ్గి ♦ దశకంఠుని భా
రమ్మున గాసిలి బలియుని, నమ్మొఱకుం జంకనుండి♦యచ్చట విడిచెన్. 222

తా త్ప ర్య ము

(తిరిగివచ్చి కిష్కింధ సమీపమున నున్న యడవియందు దిగి రావణుని నింతదవ్వు మోసిన భారముచే బడలి బలవంతుడైన యా మూర్ఖుని చంకనుండి యచ్చట విడిచెను.

క. ఇక్కరణి విడిచి రావణు, ప్రక్కకుఁ దా మరలి యెపుడు♦వచ్చితి వయ్యా!
యిక్కడకుం బనియేమో, యెక్కనుండియొకొ యనుచు♦నెలనవ్వొలయన్. 223

తా త్ప ర్య ము

ఈ విధముగ నేల విడిచి వెనుకప్రక్కగాఁ దిరిగి యేమియుఁ దెలియనివాని వలె రావణునిఁ జూచి యెప్పుడు వచ్చినావయ్యా? ఇచ్చటికి నేమిపనియుండివచ్చి నావు? ఎక్కడినుండి వచ్చితివి? అని చిఱునవ్వుతో నడిగెను.

—♦ రావణుఁడు వాలితో స్నేహ మొనర్చుట ♦—

చ. పలికిన విస్మయంబుపడి ♦ పంక్తిముఖుండు కపీంద్రుచంకలో
నలఁగుడుపాటు చెంది నయ♦నంబులఁ బ్రాణము లుండ గాసిఁ జూ
డ్కులు చలియింప నిట్టు లను ♦ స్రోతులనాయఁక రాక్షసేంద్రుఁడన్
గలహముఁ గోరి వచ్చితిని ♦ గావర మాఱగ నీకుఁ జిక్కితిన్. 224

అర్థములు. విస్మయంబుపడి=ఆశ్చర్యపడి.

తాత్పర్యము

ఇట్లు చెప్పఁగా నాశ్చర్యపడి రావణుఁడు వాలి చంకలో నలిగి ప్రాణములు కన్నులయం దుండగా కన్నులు తిరుగుడు వడ నిట్లు లనెను. వానరరాజా! నేను నీతో యుద్ధము చేయవచ్చితినిఁ రాక్షసరాజను, గర్వముచెడి నీకు జిక్కితిని.

క. రావణుఁడను శక్రాభుఁడ నీ, వగచరనాథ! యహహ ॥ యేమీా బల మా
హా! వేగము గాంభీర్యం, బీవిధి నే నెందు నెఱుఁగ ॥ నీజగమందున్. ౭౭౭

తాత్పర్యము

(వానర రాజా! నేను రావణుఁడను-ఇంద్రునితో సమానుఁడను. అహహా! యేమి నీ బలము! ఆహా! వేగము! ఆ గాంభీర్యమేమీా! నేనిదివఱ కీజగమున నెచ్చటఁ జూచి యెఱుఁగను-)

క. ననువంటివానిఁ బసరము, ననువున నీడ్చికొనియేఁగి ॥ యబ్ధిచతుష్కం
బున ముంచి లాగి తెచ్చితి, మనమున నేన్ గాసి గొనవు ॥ మర్కటనాథా! ౭౭౮

తాత్పర్యము

(కపిశ్రేష్ఠా! నావంటి బలముగలవానిని, బసరమువలె నీడ్చికొని, పోయి నాలుగు సముద్రములలో ముంచి,యీడ్చి తెచ్చితివి-మనస్సునం దయిన నుస్సురు మనిన వాఁడవు గావు.)

క. మనమునకున్ వాయువునకు, వినతాతనయునకు నిట్టి ॥ వేగము భువనం
బున విదితం బట్టిడ వో, వనచరవర! సందియంబు ॥ పని లే దిందున్. ౭౭౭

తాత్పర్యము

(వనచర రాజా! మనస్సునకు, వాయువునకు, గరుత్మంతునకు నిట్టి వేగము లోకములోఁ జూచి యెఱుఁగుదుము. అంతటి వాడవే-సందేహము లేదు.)

క. నీ వేగము నీ శౌర్యము, వావిరి నా కెఱుక యయ్యె ॥ బాగుగ నీతో
నే వాంఛించెద స్నేహము, పావకసాక్షికము గాఁగ ॥ వనచరనాథా! ౭౭౪

అర్థములు. పావక సాక్షికముగ=అగ్ని సాక్షిగ.

తాత్పర్యము

(నీ వేగము నీ శౌర్యము యొక్క నిజము బాగుగ నా కిప్పుడు తెలిసి వచ్చినది-నీతో నిప్పు డగ్నిసాక్షిగ స్నేహము చేయఁ గోరుచున్నాను-)

క. దారలు పుత్రులు పురమున్, శ్రీరాష్ట్రము భోగములును ॥ జేలలు సకలా
హారంబులు నవిభక్తము, లారగ మన కిరువురకు వంనాశేశ! యగున్. ౭౭౯

అర్థములు. అవిభక్తములు=నీది నాది యని వేఱులేనివి, నావన్నియు నీవే, నీవి నావే.

తా త్ప ర్య ము

భార్యలు కొడుకులు నగరము సంపద రాష్ట్రము భోగములు వస్త్రములు అన్ని విధములైన యాహారంబులు మన కిరువురకు నవిభక్తములు. దీనివలన నైకమత్యము గ్రహింపవలయును గాని, నీ పెండ్లామే నా పెండ్లాము, నా పెండ్లామే నీ పెండ్లామని కేవల మైక్యము గ్రహింపరాదు. అవిభక్తకుటుంబము లందు నన్న దమ్ములు భార్యలను బంచుకొనరు గదా

క. రగిలిచి యగ్నుల నీగతి, నగచరనిశిచరవిభుల్ సమాలింగితులై
దగఁ జేతఁ జేయి వైచుచు, జగ మెఱుఁగఁగఁ జలిపి రపుడు సౌభ్రాత్రంబున్.

అర్థములు. రగిలి=మంటచేసి, అగచర నిశిచరవిభుల్=వాలి రావణులు, సమాలింగితులై = కౌగిలింపఁ బడినవారై, సౌభ్రాత్రంబున్ = అన్నదమ్ముల భావమును.

తా త్ప ర్య ము

(అగ్నిని రగులజేసి వాలి, రావణులు చేతిలో చేయి వైచుచు లోకవిఖ్యాతిగ స్నేహము జేసికొనిరి.)

క. అంత హరిరాక్షసులు మృగ, కాంతులు గుహలోనఁ జొచ్చు కైవడి శుద్ధ
స్వాంతములఁ గేలు కేలన్, సంతసమునఁ గొలుచు మెల్లఁ జనికిష్కింధన్. ౪౪౧

అర్థములు. మృగకాంతులు=సింహములు, ఇట్లు చెప్పుటచే నిది కిష్కింధకు వెలుపలనే జరిగె నని సూచితము.

తా త్ప ర్య ము

(అట్లు వాలి రావణు లగ్నిసాక్షిగాఁ జెలిమిచేసికొనిన పిమ్మట, వారిరువురు సింహములు గుహలోఁ బ్రవేశించు విధమున నొకరిచేతి నొకరు పట్టుకొని సంతోషముతో మెల్లఁగాఁ గిష్కింధకుఁ బోయిరి.)

క. ఎలమిఁ జరియించి రట నొక, నెల సుగ్రీవునివిధాన నిశిచరవిభుఁడున్
గలఁ కేమి లేక యుండఁగ,బిలువఁగ వచ్చిరి యమాత్యవీరుల్ వానిన్. ౪౪౨

తా త్ప ర్య ము

(అచట సంతసమున నొక నెల చరించిరి. రావణుఁడు సుగ్రీవునివలె నిర్మల చిత్తముతో నుండ నాతని మంత్రులు పిలువవచ్చిరి.)

దీని వలన వాలి సుగ్రీవులు వేఱుపడకముందే యీకార్యము జరిగెనని భావము.

క. లోకంబుల నేఁపఁగఁ జన, నా కర్కశశీలుఁ డరిగె ♦ నసురులబడిఁ దా
నీ కరణిఁ బురావృత్తము, కాకుత్స్థాభరణ! చెల్లెఁ గంజదళాక్షా! ౨౮౩

అర్థములు. కర్కశశీలుఁడు=కఠినస్వభావుఁడు, పురావృత్తము = ముందు జరిగిన చర్య.

తాత్పర్యము

(లోకులను బాధించుటకా కఠిన స్వభావముగల రావణుఁడు రాక్షసులతో పోయెను-రామచంద్రా! ముందు జరిగిన రావణుని చర్య యీ విధముగాఁ గడచి పోయినది.)

క. వింటివి కద రావణుకథ, వింటివి గద వాలిశక్తి ♦ విధ మంతటి బ
ల్దంటయు నీ శరమునఁ దా ♦ మంటం బడు మిడుతయయ్యె ♦ మహితబలాఢ్యా! ౨౮౪

తాత్పర్యము

(పుండరీకాక్షా! రావణుని కథ విన్నావుకదా- వాలి సామర్థ్యము వింటివికదా! అంతటి బలశాలియు నీ బాణమునకు, మంటలోఁ బడు మిడుతవలె నయ్యెనుగదా.)

—♦ శ్రీరాముఁ డగస్త్యుని హనుమంతుఁ గూర్చి ప్రశ్నించుట ♦—

చ. అన విని దక్షిణాశ నిల ♦ యంబుగ నున్న మునీంద్రుఁ జూచి భూ
తనయమనోహరుండు ముని ♦ తల్లజ! వాలియుఁ బంక్తికంఠుఁడున్
ఘనబలశాలులై యతుల ♦ గాఢపరాక్రమవంతు లయ్యు మా
హనుమకు నీడు గా రని మ ♦ హాత్మక నామదిఁ దోఁచె నారయన్. ౨౮౫

దక్షిణాశనిలయంబుగ నున్న మునీంద్రుఁ=దక్షిణ దిక్కు కాఁపురముండు మునీశ్వరుని-అగస్త్యుని.

తాత్పర్యము

(దక్షిణపుదిక్కునఁ కాపురముండు మునీశ్వరు నగస్త్యునిఁ జూచి రామచంద్రమూర్తి మునివర్యా! 'వాలియు రావణుఁడు గొప్పబలశాలు లయ్యు, సాటిలేని గట్టి పరాక్రమము గలవారయ్యు, మా హనుమకు సరిరారని నామనస్సు నందాలోచింపఁగాఁ దోఁచినది-'

క. శౌర్యము నయసాధనమును, ధైర్యంబు పరాక్రమంబు ♦ దాక్ష్యము బలమున్
స్థైర్యము ప్రాజ్ఞత మహిమయు, నార్యగుణా! నెలవుకొనియె ♦ హనుమంతునెడన్.

అర్థములు. నయసాధనమును=నీతిని సాధనముగఁ గొనుటను, దాక్ష్యము=కార్యము సాధించుశక్తి.

తాత్పర్యము

(శౌర్యము, నీతిని సాధనముగాఁ గొనుటను, ధైర్యము పరాక్రమము, కార్యము సాధించుశక్తి, బలము, స్థయిర్యము, ప్రాజ్ఞత, ప్రభావము హనుమంతుని యందు స్థిరప్రతిష్ఠితములయి యున్నవి.)

సీ. వననిధిఁ గని స్రుక్కు◊వనచరుల్ మోదింప, యోజనశతకముఁ జే◊రోజదాఁటె
రావణు నంతః◊పురంబు శోధించి సీ◊తను జూచి మాట్లాడి◊యనునయించె
దళవాయులను మంత్రి◊తనయకింకరులను, నక్షుని నొక్కఁడ◊హతులఁ జేసె
బంధ మూడఁగ దన్ని◊ భాషించి రావణు◊తో లంక మసిసేసె◊లీలవోలె

ఆ. సంగరమున హనుమ◊ సలిపినకృత్యముల్, కాలుఁడైన విబుధ◊పాలుఁడైన
హవ్యవాహుఁడైన◊యక్షేశ్వరుండైన, నాచరింప వింటి◊మా? మహాత్మ! ౨౮౨

అర్థములు. శోధించి=వెదకి, అనునయించెన్=సమాధాన పఱిచెను, దళవాయులను=సేనానాయకులను, బంధము=ఇంద్రజిత్తుని బ్రహ్మాస్త్రబంధము, విబుధపాలుఁడు=ఇంద్రుఁడు, హవ్యవాహుఁడు=అగ్ని, యక్షేశ్వరుఁడు=కుబేరుఁడు.

తాత్పర్యము

(సముద్రమును జూచి దిగులొందియు వానరులు సంతోషించునట్లుగ నూఱామడ లోకపెట్టున దాఁటెను. రావణు నంతిపురములోఁ బ్రవేశించి, శోధించి, సీతను జూచి మాటలాడి యోదార్చెను. సేనానాయకులను, మంత్రి కొడుకులను, కింకరులను, నక్షకుమారుని, నొక్కఁడే చంపెను-ఇంద్రజిత్తుని బ్రహ్మాస్త్ర బంధమును వదలించుకొని, రావణునితో సంభాషించి, లంకను నవలీలగాఁ గాల్చిబూదిగావించెను-యుద్ధరంగమున హనుమంతుఁడు చేసిన సాహస కార్యములు, యముడు గాని, యింద్రుఁడు గాని, యగ్నికాని, కుబేరుఁడు గాని చేసినట్లు వినియుంటిమా?)

క. ఈతని బలవిక్రమముల, చేతనె కద లంక గెల్చి◊చినతమ్మునితో
సీతాసతితో బంధు◊వ్రాతముతో నలరఁగంటి◊ రాజ్యమునందున్. ౨౮౩

అర్థములు. చినతమ్మునితో=లక్ష్మణునితో.

తాత్పర్యము

(ఈ హనుమంతుని బల పరాక్రమముల చేతనేకదా నేను లంక గెల్చి లక్ష్మణునితో, సీతతోఁ, జుట్టపక్కాలతో రాజ్యమునందు సంతోషముగా నుండఁ గలిగితిని.)

క. వానరపతిసఖుఁడీ హనుమానుఁడు లేకున్న నెవరు◊క్ష్మాసుతవార్తన్
దే నేర్చువార లంతటి◊భూనుతవిక్రములు గలరె◊ భువనంబులలోన్? ౨౮౪

అర్థములు. వానరపతిసఖుఁడు=సుగ్రీవుని స్నేహితుఁడు.

తా త్ప ర్య ము

(సుగ్రీవుని స్నేహితుఁడగు హనుమానుఁడే లేకున్న నెవరు సీత సమాచారమును దీసికొని రాఁగల నేర్పు గలవారు, జగత్ప్రసిద్ధ మగు పరాక్రమముగలవారు జగములలో నున్నారు?)

చ. రవిజునిమేలు గోరుచుఁ జి•రంబుగ నాతనియొద్ద నుండియున్
బవనజుఁ డేల యాతనికి • వాలికి వైరము గల్గ నింద్రజున్
దవము పొదన్ దహించుగతి • నాశము చేయక యాత్మమిత్రుఁ డ
ట్లవిరళదుఃఖతప్తుఁడయి • యారట మందఁగఁ జూచుచుండెనో? ౭౬౦

అర్థములు. రవిజుని=సుగ్రీవుని, పవనజుఁడు=హనుమంతుఁడు, ఇంద్రజున్=వాలిని, దవము=కాఱుచిచ్చు, అవిరళ=దట్టమైన, దుఃఖతప్తుఁడు = దుఃఖముచే బాధపడువాఁడు.

తా త్ప ర్య ము

(సుగ్రీవుని మేలుగోరి వదలక యాతని యొద్దనుండియును, నాతనికి వాలికి వైరము గలిగినప్పుడు పొదను గార్చిచ్చు కాల్చునట్లు వాలిని నాశము చేయక, తన స్నేహితుఁ డట్లు దట్టపు దుఃఖముచే నారాట పడుచుండఁగా హనుమంతుఁ డేలయూరక చూచుచుండెనో?)

క. తనబలము తనకుఁ దెలియదు, హనుమ కటం చేను దలఁతు •ననఘా! చెపుమా
వినవలఁతు దీని ననవుడు, హనుమంతు సమక్షమంద•యతఁ డిట్లనియెన్. ౭౬౧

తా త్ప ర్య ము.

(అనఘా! హనుమంతునకుఁ దన బలము తనకుఁ దెలియదని నేను దలఁచుచున్నాను-దీనిని వినవలయును. చెప్పుఁడు. అని యడుగఁగా, హనుమంతుని సమక్షమందే యగస్త్యుఁ డిట్లని చెప్పెను.)

సీ. నీ యభిప్రాయంబు•నిక్కంబు శ్రీరామ, బలగమనంబులఁ•బ్రజ్ఞయందు
హనుమకుఁ దుల్యుండు•గనరాఁడు లోకండేని, మును మునివర్యుల•మోఘశాప
మొసఁగుటఁ జేసి యా•యుత్తమగుణరాశి,తనశక్తి యెఱుఁగండు•ఘనమదయ్యు
బిన్నటనాఁడ ని•ర్వీరుఁడు చేసిన, యది తెలియండు బా•ల్యమునఁ జేసి

తే. పావమాని చరిత్ర స•ర్వంబు నీవు, విన నభిప్రాయ ముండిన • వినఁగదయ్యా
వినుచువాఁడను సకలంబు•విశ్వవినుత, రమ్యగుణసాంద్ర! దశరథ•రామచంద్ర!

అర్థములు. బలగమనంబులన్=బలమునందు గమనమునందు, అమోఘశాపము=వ్యర్థముగాని శాపము, పావమాని=హనుమంతుని.

తా త్ప ర్య ము

(రమ్యగుణసాంద్ర! దశరథరామచంద్రా! వినుము - నీ యభిప్రాయము నిజము బలమున వేగమునఁ బ్రజ్ఞలో హనుమకు సముఁ డొకఁడైనను గాన రాఁడు; పూర్వము మునివర్యులు తిరుగని శాప మిచ్చుటచేత నా యుత్తమగుణ రాశి, గొప్పదయినను తన సామర్థ్య నెఱుఁగఁడు. చిన్నతనమున నితఁడు చేసినది పసివాఁడగుటచేఁ దెలియఁడు. హనుమంతుని చరిత్రమంతయు నీవు విన నభిప్రాయ ముండినచో సకలము వినిచెద-వినుము.)

— ♦ ఆంజనేయోపాఖ్యానము ♦ —

సీ. భాస్కరవరమున ♦ బంగారువన్నెల, రాణించు మేరుప♦ర్వతము గలదు
అచట రా జయి ♦ యలరాగు కేసరి, పేరిటిబలియుఁ డీ♦వీరుతండ్రి
యతనికి భార్యయై♦యంజనాఖ్యరహించు, నామెవాయువున కీ♦యనఘుఁగాంచె
వరిగింజకొనముల్లు♦వంటి వన్నెఁగలాని, ఫలములు గొనితేరు♦వాంఛఁ జేసి

ఆ. యడవి కామె పోవ ♦ నాఁకటిపెల్లునఁ దల్లి విడిచిచనుట ♦ తాళ లేక
శరవణంబునందు ♦ షణ్ముఖుపోలికఁ రోదనం బొనర్చి ♦ ఖేదయుక్తి. ౭౮౩

అర్థములు. శరవణము=తెల్లువనము. షణ్ముఖుపోలిక=కుమారస్వామివలె.

తా త్ప ర్య ము

(సూర్యుని వరముచే బంగారు రంగుతోఁ బ్రకాశించు మేరు పర్వతము కలదు-ఈ వీరుని తండ్రి కేసరియను బలశాలి యచ్చట రాచయి యలరారు చుండును. అతని భార్య యంజన. ఆమె వాయుదేవుని వలన నీ యనఘు వరిముల్లు కొనవంటి కాంతిగల హనుమంతునిఁ గనెను- ఆమె ఫలములు దీసికొని వచ్చుట కడవికిఁ బోయెను-ఆఁకలి చిచ్చునఁ దల్లిదగ్గఱ లేకపోవుటచే నోర్వలేక, తెల్లు వనమునందుఁ గుమారస్వామివలె రోదనము చేసె)

క. అప్పుడు దాసనపుంబువు, చొప్పున జిగి మీఱి ప్రాగ్వ♦సుమతీధ్రమునం
దుప్పరమున నుదయించెడి, యప్పంకజమిత్రుఁ గాంచి♦యాతనిఁ బట్టన్. ౭౮౪

అర్థములు. దాసనపుంబువు=దాసానిపువ్వు, జిగి=ఎఱ్ఱని కాంతి, ప్రాక్+వసుమతీధ్రమునన్=తూర్పుకొండయందు, ఉప్పరమునన్=ఆకాశమునందు, పంకజ మిత్రున్=సూర్యుని.

తా త్ప ర్య ము

అప్పుడు తూర్పుకొండ మీఁద దాసానిపువ్వువన్నెతో నుదయించు సూర్యునిఁ జూచి యాయనను బట్టుకొనఁ దలఁచి.

చ. ఫల మనుబుద్ధి మింటికిఁ జి♦వాలునఁ దా నెగిరెన్ నవార్కుతోఁ
 దులితుఁడు బాలసూర్యునకుఁ ♦ దూర్ణమ సమ్ముఖమౌచుఁ దా జనన్
 బలిముఖబాలు మింటఁ జను♦వాని మహర్షులు దేవదైత్యయ
 క్షులు కడు విస్మయంపడుచు ♦ జూచుచు మానసవాయువేగునిన్. ౭౫

అర్థములు. నవార్కుతోఁ=క్రొత్తసూర్యునితో, తులితుఁడు = సమానుఁడు, వలిముఖబాలున్=బాలవానరుని, తూర్ణము=త్వరగా, మానసవాయు వేగునిన్= మనస్సుయొక్కయు వాయువుయొక్కయు వేగము గలవానిని.

తాత్పర్యము

పండని తలఁచి తటాలునఁ దానాకాశమునఁ కెగిరెను. బాలసూర్యునితో సమానుఁడు, బాలసూర్యునకు నెదురుగాఁ బోగాఁ నాకాశమునఁ బోవుపిల్లకోఁతిని జూచి మహర్షులు దేవతలు దైత్యులు యక్షులు వాయువేగ మనోవేగములు గల వానిని జూచి మిక్కిలి యాశ్చర్యపడి.

క. పిల్లతనంబునయందే, చెల్లంబో యిట్టిశక్తి ♦ చేకూరిన చో
 మొల్లమగు యౌవనంబున, నెల్లీలం గ్రాలునొకొ ♦ యితఁ డనుకొనఁగన్.

అర్థములు. చెల్లంబో=ఔరా, ఆశ్చర్యార్థకము, చేకూరినచో=లభించెనేని

తాత్పర్యము

ఇప్పుడే పిల్లతనమందే యింతశక్తిగలవీఁడు పెద్దవాఁడై యౌవనవంతుఁడై నపు డింక నెంతటి శక్తిమంతుఁ డగునో యనుకొనుచుండఁగా.

చ. తనయుఁడు మింటనేగ రవి♦దగ్ధుఁడుగాక సుఖంబు గూరఁగాఁ
 దనుపుగ శీతలుం డయి స♦దాగతి వెంటనె పోవుచుండె, న
 య్యనుఁడును బాలుఁ గాంచి మది ♦ నేమియెఱుంగని బిడ్డఁ డంచునీ,
 తనివలనన్ మహాకృతులు ♦ దప్పక కాఁగల వంచు నెంచుచున్. ౭౬

అర్థములు. రవిదగ్ధుఁడు=సూర్యునిచేఁ గాలినవాఁడు, తనుపుగన్=శైత్యోపచారముగ, శీతలుండయి=చల్లనివాఁడై, సదాగతి=వాయువు, మహాకృతులు= గొప్పకార్యములు.

తాత్పర్యము

ఆకాశమునఁ దనకొడుకు పోవునెడ సూర్యకిరణములచేఁ గాలిపోకుండుటకై వాయువు చల్లనై శైత్యోపచారము చేసినట్టు వెంటనే పోవుచుండెను. ఆ యినుఁ డును వీఁడేమియుఁ దాఁకు తప్పు తెలియని పిల్లవాఁడనియు వీఁడు పెద్దవాఁడై గొప్పకార్యములు చేయుననియుఁ దెలిసికొని.

క. తనవేఁడిమి చూపక యుం, డెను సీతఁడు జనకుశక్తి ♦ నిజఘనశక్తిన్
జని మింట వేనవేల్ యో, జనములు రవి డాసె నాఁడ♦స్వర్భానుండున్. ౭౯౮

అర్థములు. స్వర్భానుఁడు=రాహువు.

తాత్పర్యము.

(తన వేఁడిమి చూపకుండెను. ఈతఁడు తండ్రి శక్తి, తనగొప్పశక్తి తోడుగా నాకసమున వేన వేలామడలెగిరిపోయి సూర్యుని సమీపించెను. ఆనాఁడే రాహువును.)

చ. దినకరుఁ బట్టవచ్చి ఖర♦దీధితు డాయఁగ వచ్చుచున్న యీ
వనచరబాలుఁ గాంచి భయ♦పాటునఁ బాఱి మహేంద్రుఁ జేరి పెం
గనరునఁ బల్కెముున్న దిన♦కాంతమృగాంకుల మేము పట్టఁగా
వినియతిఁ జేసి యేమిటికి ♦ వేఱొకనిన్ నియమించి తీవెడన్. ౭౯౯

అర్థములు. ఖరదీధితున్=సూర్యుని, వనచరబాలున్ = క్రోఁతిపిల్ల వానిని, పెన్గనరునన్=మిగులఁ గోపముతో, దినకాంత మృగాంకులన్=సూర్యచంద్రులను

తాత్పర్యము

(సూర్యునిఁ బట్టుకొనవచ్చి, యాసూర్యుని సమీపమునకు వచ్చుచున్న యీక్రోఁతి పిల్లవానిఁజూచి, భయపడి పాఱిపోయి, యింద్రునిఁజేరి, మిగులఁగోపముతో, సూర్యచంద్రులను మేము పట్టునట్లు నియమమొనరించి, యిప్పుడు వేఱొకని నేల యేర్పాటు చేసితివి?)

క. ఈనాఁడు పర్వకాలం, బే నేగ మఱొండు రాహు♦వే తెంచెఁ జుమీ
భానునిఁ బట్టఁగ నావుఁడు దీనుని దా నూఱడించి ♦ తెప్పున లేచెన్. ౮౦౧

అర్థములు. పర్వకాలము=అమావాస్య.

తాత్పర్యము

(ఈ నాఁడమావాస్య. నేను సూర్యునిబట్టుకొనఁలో మఱొక రాహువువచ్చినాఁడు సుమా, యని చెప్పఁగా నా దీనుని నోదార్చి తాను వెండనే లేచెను.)

ఉ. వాసవుఁ డిట్లు లేచి యతి♦భాసురకాంచనమాలఁ దాల్చి కై
లాసనగాగ్ర సన్నిభము ♦ లాలితభూషణ భూషితంబు ఘం
టాసముదాయ ఘోషితము ♦ నాలుగుకొమ్ములగారు నెక్కి వే
వే సని రాహుమున్నగ ర♦విప్లవగార్భకు లున్నచోటికిన్. ౮౦౨

అర్థములు. అతిభాసుర=మిగులఁ బ్రకాశించు, కాంచనమాల = బంగారు హారము, దీనినే కాబోలు వాలి కిచ్చినది. కైలాసనగాగ్రసన్నిభము=కైలాస

పర్వత శిఖరముతో సమానము, లాలిత భూషణ భూషితంబు=అందమైన యా భరణములచే నలంకరింపఁ బడినది, ఘంటాసముదాయ ఘోషితము=గంటల సమూహముల ధ్వనిగలది, నాలుగు కొమ్ములగారు=ఐరావతమును, రవిప్లవగార్భకులు=సూర్యుఁడు వానరబాలకుఁడు.

తాత్పర్యము

(ఇంద్రుఁడీ విధముగా లేచి, మిగుల ప్రకాశించు, బంగారు హారమును ధరించి కైలాస పర్వతముతో సమానమై యందమైన యాభరణములచే నలంకరింపఁబడి గంటల చప్పుడుగల యైరావతమునెక్కి నడివడిగా రాహువు ముందునడువ, సూర్యుఁడు హనుమంతుఁడు నున్న చోటికిఁ జనెను.)

ఉ. రాహువు మున్ను మున్న దిన॰రాజు గ్రహింపఁగఁ బాఱె నో మహా
బాహు! మహీధ్రకూట మన ॰ వాలి రయంబున వచ్చునాతనిన్
సాహసిఁ జక్కఁగాంచి కపి॰సత్తముఁ డియ్యది మేలటంచుఁ దా
రాహువు వెంట నంటె గ్రహ॰రాజును వీడి యతండు భీతిచేన్. ౪౦

అర్థములు. దినరాజున్=సూర్యుని, మహీధ్రకూటము=పర్వత శిఖరము, వాలి=విక్రమించి.

తాత్పర్యము

(దీర్ఘములైన చేతులుగల రామచంద్రమూర్తీ! రాహువు ముందు ముందుగా సూర్యుని బట్టుకొనఁబోయెను. పర్వతశిఖరమువలెఁ బరాక్రమించి వచ్చు నా తెంపరిని జూచి హనుమంతుఁడు సూర్యుని వదలి యిది మంచిపండని రాహువు వెంటఁ బడెను. అతఁడు భయపడి,

క. గ్రక్కునఁబరాఙ్ముఖుండై, దిక్కువే యింద్ర! యింద్ర! ॰ తెంపరికపిచేఁ
జిక్కక యుండఁగఁ గావవె, మక్కువ నన్ననుచు మాటి॰మాటికి నఱచెన్.

తాత్పర్యము

(వెంటనే వెనుకకు మరలి, యింద్రా! యింద్రా! నీవే దిక్కు. ఈ సాహసి యగు క్రోఁతి చేతిలోఁ జిక్కకుండ నన్ను దయతోఁ గాపాడు మనుచు మాటి మాటికి నఱచెను.)

ఉ. అమ్ముఖ శేషుఁ డిట్టులు భ॰యమ్మునఁ దా నభయంబు వేఁడఁగా
నమ్మఘవుండు భీతిలకు॰మర్భకుఁ ద్రుంచెద నంచుఁ బల్కుచో
నిమ్మరుదాత్మజుండు విబు॰ధేంద్రుకరీంద్రముఁ గాంచి నిండుమో
దమ్మునఁ బెద్దపండనుచు ॰దానిని బట్టఁ జనెన్ రయంబునన్. ౪౧

అర్థములు. ముఖశేషుఁడు=దేహముపోయి ముఖము మాత్రము మిగిలినవాఁడు, అమృతప్రాశన సమయంబున రాహు కేతువులు దేవతల రూపములు ధరించి

దేవతల నడుమ గూర్చుండఁగా నిరువురకు మోహిని యమృత మిచ్చెను. వారు ద్రావిరి. సూర్యచంద్రములు వారు రాక్షసులని మోహినికిఁ దెలిపిరి. ఆయన చక్రముచే వారి తలలు ఖండించెను. అమృతస్పర్శమువలన రాహువుతల, కేతువు దేహము మిగిలెను. రాహువునకు దేహము లేదు, కేతువునకుఁ దలలేదు, మఘవుండు=ఇంద్రుఁడు, భీతిలకుము=భయపడకుము, అర్భకున్=బాలుని, విబుధేంద్రు కరీంద్రము=ఇంద్రుని యేనుఁగు.

తాత్పర్యము

రాహువిట్లు భయపడి యింద్రుని యొద్దకుఁబోయి యభయము వేఁడఁగా కపిబాలుని జంపెద, భయపడవల దని చెప్పుచుండఁగా, నింద్రుని యేనుఁగుఁజూచి యిది పెద్దపండని తలఁచి హనుమంతుఁడు దానిని బట్ట త్వరగా, బరువెత్తెను.

క. అభ్రమువల్లభుఁ బట్టఁగ, నభ్రంబునఁ బాఱుదెంచు ♦ నంజనసుతుపై
నభ్రపతి చేతికులిశ మ,దభ్రం బగు కినుక నేసెఁ ♦ దద్ధతిఁ గపియున్. ౨౦౫

అర్థములు. అభ్రమువల్లభున్ = ఐరావతమును, ఐరావతము భార్యపేరు అభ్రము, అభ్రపతి=ఇంద్రుఁడు, కులిశము=వజ్రము, అదభ్రము=గొప్పది, తత్ + హతిన్=ఆ దెబ్బచే.

తాత్పర్యము.

ఐరావతమును బట్టుటకై యాకాశమునఁ బరువెత్తి వచ్చు క్రోఁతి మీఁదఁ గోపించి యింద్రుఁడు తనచేత నున్న వజ్రముతోఁ గొట్టెను. ఆదెబ్బచే వానరుఁడు

క. అవనీధరశిఖరంబున, వివశుండై పడియె బాధ ♦ విహ్వలుఁడై భూ
ధన! తత్పాతంబునఁ, బవనజునకు వామహనువు ♦ భగ్నం బయ్యెన్. ౨౦౬

అర్థములు. అవనీధరశిఖరంబునన్=కొండ పేటుమీఁదఁ,వివశుఁడై=మూర్ఛపోయి, విహ్వలుఁడై=స్వాధీనత తప్పినవాఁడై, తత్పాతంబునన్ = ఆపడుటచే, వామహనువు=ఎడమ చెంప, భగ్నంబయ్యెన్=గాయపడెను.

ఆ దెబ్బచే స్వాధీనత తప్పినవాఁడై కొండ శిఖరము మీఁద పరవశుఁడై పడెను. ఆ పడుటచే నెడమ చెంప పగిలి గాయపడెను.

—* వాయు నిరోధంబున లోకంబులు బాధపడుట *—

చ. హరిహయుఁ డాత్మపుత్రునకు ♦ నాపదగూర్చినఁ గోపగించి యా
హరిణహయుండు లోకముల ♦ కన్నిటి కెగ్గొనరింపఁ బుత్రుతో
గిరిదరిలోని కేగి ప్రజ ♦ కీడ్పడ దేహములందు నాత్మ సం
చలనము మాని యుండె నట ♦ శక్రుఁడు వర్షము నాఁగు కై వడిన్. ౨౦౭

అర్థములు. హరిహయుఁడు=ఇంద్రుఁడు, హరిణహయుండు=జింకవాహనముగాఁ గలవాఁడు, వాయువు, ఎగ్గు=కీడు, గిరిదరిలోనికి = పర్వతగుహాలోపలికి, ఆత్మసంచలనము=తన సంచారము.

తాత్పర్యము

ఇంద్రుఁడు తన కొడుకునకు నాపద గలిగించె నని వాయువు కోపించి లోకములకుఁ గీడు చేయఁ దలంచి కొడుకును దీసికొని గుహాలోనికిఁబోయి యింద్రుఁడు వర్షము నిలిపినట్లు ప్రజలు బాధపడునట్లు వారి దేహములందు దాను సంచరించుట మానియుండెను.

క. వెడలవు విణ్మూత్రంబులు, వెడలదు నిశ్వాస మేమి ♦ భేదిలె సంధుల్
జడము లయికట్టెలట్టులు, ముడుచుట చాఁచుట యసాధ్య♦ముగఁ బ్రజకయ్యెన్.

అర్థములు. విట్+మూత్రములు=మలమూత్రములు.

తాత్పర్యము

దేహములందు వాయువు సంచరించుట మానుటచే ప్రజలకు మలమూత్రములు వెలుపల రాకుండెను. ఊపిరాడకుండెను. సంధులు (కీళ్ళు) భేదిల్లెను. కాళ్లు చేతులు జడములవలెనై కట్టెలవలెఁ జాఁచుటకు ముడుఁచుటకు నసాధ్యమై యుండెను.

తే. శ్రుతులపఠనంబు హోమంబు♦సున్న యయ్యె,నిత్యకర్మంబు లెల్లను♦నిలిచిపోయె
ధర్మకార్యంబులెల్లను♦దలఁగిపోయె నాగ్రహంబున వాయువు♦నిగ్రహింప.౮౦౯

తాత్పర్యము.

(వాయుదేవుఁడాగ్రహముతో నిగ్రహింపఁగా, వేదాధ్యయనము, యజ్ఞములు సున్నయయ్యెను. సంధ్యావందనాది నిత్యకర్మము లన్నియు నిలిచిపోయెను. ధర్మకార్యము లాఁగిపోయెను.)

తే. అపుడు గంధర్వు లసురులు ♦ నమరులెల్లఁ, జూడ నేగిరి మిక్కిలి♦గోడుకొనుచు
నుబ్బు పొట్టలతోడ మ♦హోదరములు, గలుగు వారలఁబోలుచుఁ♦గదలలేక.౮౧౦

తాత్పర్యము

(ఆ సమయమున గంధర్వులు, అసురులు, దేవత లందఱు మహోదరమను రోగము గలవారివలె నుబ్బిపోయిన పొట్టలతోఁ గదలలేక దుఃఖపడుచుఁ జూచుటకుఁ బోయిరి.)

క. కంజభవు డాయఁగాఁ జని, ప్రాంజలులై నలువిధముల♦ప్రజలను నీవే
రంజిల్లఁ జేసి మాకుఁ బ్ర,భంజనునిం బ్రాణములకుఁ ♦ బతిఁ జేసితిగా. ౮౧౧

అర్థములు. కంజభవున్=బ్రహ్మను, నలువిధముల ప్రజలను=దేవతిర్య

జ్మనుష స్థావరము లను నాలుగువిధముల జీవులను, ప్రభంజనునిన్=వాయువును.

తాత్పర్యము

(బ్రహ్మమొద్దకుఁ బోయి దోసిలొగ్గి దేవ, తిర్యఙ్మనుష్య స్థావరములనెడి నాలుగు విధములయిన జీవులను నానందింపఁజేసి మాకు వాయుదేవుని రక్షకునిఁగాఁ జేసితివి కదా.)

క. అట్టి జగత్ప్రాణుఁడు నేఁ డిట్టులు మము నంతిపురపు ♦ టింతులవలె ని
ట్టట్టు జరింపక యుండఁగఁ బెట్టెం బెనుబాధ లెట్లు ♦ వేఁగుదు మభవా. ౮౧౨

అర్థములు. అంతిపురపు టింతులవలెన్=అంతఃపుర స్త్రీలవలె.

తాత్పర్యము

(అటువంటి జగత్తులకుఁ బ్రాణమైన వాయువు మమ్మీప్రకార మంతఃపుర స్త్రీలవలె నటునిటు కదలిపోకుండఁ బెనుబాధలు పెట్టెను. ఏవిధముగా వేఁగెదము.)

చ. శరణము నీవె మాకు మముఁ ♦ జంపఁ గడంగెను వాయు వీ వ్యథా
భరముఁ దొలంచు మన్న జన ♦ వర్గముఁ జూచి యజుండు కారణాం
తరమున మారుతుం డిటు లొ ♦ నర్చెడి, సింహికసూనుమాటచే
సురపతి వాయుపుత్రకుని ♦ సొమ్మలు వోవఁగ వజ్రధారచేన్. ౮౧౩

అర్థములు. శరణము=ప్రాపు, రక్షకుఁడవు, కారణాంతరమునన్ = వేఱొక కారణముచే, మయూరవ్యంసక సమాసము, సింహికసూనుని=రాహువుయొక్క, సురపతి=ఇంద్రుడు, సొమ్మలుపోవ=మూర్ఛపోవ.

తాత్పర్యము

(నీవే మాకు రక్షకుఁడవు. వాయువు మమ్ముఁ జంపఁబూనెను. ఈ గొప్ప దుఃఖమును దొలఁగింపుము. అని మొఱపెట్టుచున్న జనసమూహమును జూచి బ్రహ్మ; కారణాంతరమున వాయుదేవుఁ డిట్టులు చేసెను. రాహువుమాట విని యింద్రుఁడు వాయుపుత్రుఁడగు హనుమంతుని వజ్రాయుధముతో మూర్ఛపోవు నట్లు.)

చ. అడిచినఁ గోప మూని కద ♦ లాడక గంధవహుండు నిల్చెఁ జుం
డొడలను వాయువే తనువు ♦ లుంచు సుఖస్థితి దాని లేమిచే
జడత వహించి కట్టియల ♦ సాటి యగుం గద, గాడ్పుఁ దేర్చి మీ
యడ లుడుగంగఁ జేయుదు జ ♦ నావళులార! పదండు వచ్చెదన్. ౮౧౪

అర్థములు. అడిచినన్=కొట్టఁగా, కదలాడక=చలింపక, గంధవహుండు=వాయువు, ఒడలను=దేహమునందు, తనువులు=దేహములు, గాడ్పున్=వాయువును, తేర్చి=సమాధానపఱిచి, అడలు=బాధ.

తా త్ప ర్య ము

(కొట్టినందు వలనఁ గోపము వచ్చి వాయువు చలింప నిలిచెను సుండీ, శరీర మందు వాయువే శరీరమును సుఖస్థితిలో నుంచును. అది లేకుండుటచే దేహులు మొద్దుపాఱి కట్టెలతో సాటియగును కదా. ఓజనులారా! వాయువును సమాధాన పఱిచి మీ బాధలు పోవునట్లు చేసెదను. పదుఁడు)

క. పవమాను శాంతుఁ జేసెద, భువనంబుల బాధఁ దీర్తు॰బొందుఁడని వాణీ
ధవుఁడు సురగుహ్యకాహులు, దవిలినభక్తిన్ భజించి॰తనతో రాఁగన్. ౮౧౫

తా త్ప ర్య ము

(బ్రహ్మ వాయుదేవుని శాంతింపఁ జేసెద, లోకముల బాధఁ దీర్చెదపొండు. అని బ్రహ్మదేవతలు, గుహ్యకులు, పన్నగులు, భక్తితోఁ దనవెంట రాఁగా.)

చ. చని దినవాథకాంచనకృ॰శాను సమానతనుం దనూజునిన్
దనతొడఁ జేర్చి యుండెడు స॰దాగతిఁ జేరఁగఁ బోయి యాదరం
బున శిశువుం గనంగ నలు॰మోముల వేలుపురాకఁ గాంచి స్ప
ర్శనుఁడు కుమారు నెత్తుకొని॰గ్రక్కున లేచి సుతార్తితప్తుఁడై. ౮౧౬

అర్థములు. దినవాథ=సూర్యునితోను, కాంచన=బంగారుతోను, కృశాను= అగ్నితోను, సమాన=ఈడైన, తనున్=దేహము గలవానిని, సదాగతిన్=వాయువును, నలుమోముల వేలుపు=బ్రహ్మ, స్పర్శనుఁడు=వాయువు,సుతార్తి=కొడుకు బాధచే, తప్తుఁడై=తపించినవాఁడై.

తా త్ప ర్య ము

(పోయి, సూర్యుతో, బంగారుతో. నగ్నితో సమానమైన శరీరకాంతి గల కుమారునిఁ దన తొడమీఁద నుంచుకొని యుండిన వాయుదేవుని దగ్గఱకుఁబోయి, యాదరముతో శిశువునుఁ జూడఁగాఁ, వాయువు బ్రహ్మవచ్చుటఁ జూచి, కొడుకు బాధచేఁ దపించినవాఁడై కుమారునెత్తుకొని వెంటనేలేచి.)

—॰ బ్రహ్మాదులు హనుమంతునకు వరంబు లిచ్చుట ॰—

సీ. చలితకుండలమాళి॰స్రక్తపనీయభూ॰షణుఁ డయి ముమ్మా॰ఱు సా॰గిమ్రొక్కఁ
బవను లేవఁగ నెత్తి ॰ బాలుని దేహంబు నిజకరాంబుజముల ॰ నిమిరినంత
వాడిన సస్యంబు ॰వారి సోఁకినభంగి మరల జీవించుడు ॰ మారుతుండు
తతము హర్షించి యథాపూర్వముగను శరీరంబులందుఁ జరించుచుండె
ఆ. వాయుబాధ విడిచి॰ ప్రజ లుల్లసిల్లిరి, వీతశీతవాత ॰ జాతబాధఁ
దోయజములతోడి ॰ తూడు లనంగను, ననిలహితమనస్కుఁ॰డబ్జభవుఁడు.౮౧౭

అర్థములు. చలిత=కదలుచున్న, కుండలములు-మౌళి = కిరీటము స్రక్=హారములు, తపనీయభూషణుఁడు=బంగారు సొమ్ములు గలవాఁడై పవనున్=వాయువును, నిజకరాంబుజములన్ = తనహస్తకమలములచే, సస్యంబు=పైరు, వారి=నీళ్ళు, మారుతుండు=గాలి, యథాపూర్వముగను=మునుపటివలె, వీత=పోయిన, శీతవాత=చలివాయువువలన, జాత=పుట్టిన, బాధన్=బాధచే, అనిలహిత మనస్కుఁడు = వాయువునకు మేలుచేయు కోరికగలవాఁడు, అబ్జభవుఁడు=బ్రహ్మ, శీతవాతజాతబాధ-వాయువు దేహమున సంచరించుటచే నెత్తురు పాఱును, నెత్తురు పాఱుటచే దేహమున వేఁడిమి యుండును. వాయువు సంచారము లేకున్న వేఁడిమిలేదు. కాళ్ళు చేతులు దేహము చల్లపడును.

తా త్ప ర్య ము

చెవులకుండలములు తలయందలి కిరీటము, మెడయందలి హారములు, దేహము నందలి సొమ్ములు కదలుచుండ మూఁడు మార్లు బ్రహ్మకు వాయువు నమస్కరింపఁగా బ్రహ్మ యాయనను లేవనెత్తి బాలుని శరీరమును తన చేతులతో నిమురఁగా వాడినపైరుమీఁద నీళ్ళు చల్లిన మరలఁ గాంతితోఁ గూడినట్లు హనుమంతుఁడు ప్రాణయుక్తుఁడయ్యెను. వాయువు సంతోషించి మునుపటివలె మరల దేహములందు సంచరింప నారంభించెను. వాయువు నిరోధించిన బాధ తొలఁగి జనులు శీతవాయువు వలని బాధ తొలఁగి తామరల తోడి తూండ్లవలె సంతోషించిరి. అప్పుడు వాయువునకు మేలు చేయు మనస్సు గల బ్రహ్మదేవుఁడు.

చ. హరిహయ! యీశ! యప్పతి! ధనాధిప! దండధరా! మరుత్సుతుం
డరుదగు భావికార్యము సమర్థతఁ దీర్పఁగలాఁడు, మీకు నె
ల్లర కిది చక్కఁగాఁ దెలియు నలావరి యానటు గాఁప్పఁబట్టికిన్
వరము లొసంగుఁడీ, ముదము వర్ధిలుఁ గావుత వాయుమూర్తికిన్. ౮౧౮

తా త్ప ర్య ము

ఇంద్రుఁడా! ఈశ్వరుఁడా! వరుణుఁడా! కుబేరుఁడా! యముఁడా! యీవాయుపుత్త్రుఁడు రాఁగల కాలమున గొప్ప కార్యము నెఱవేర్చు వాఁడై యున్నాఁడు. ఇది మీ కందఱకుఁ దెలియును, కావున వీనికి బలము గలుగునట్లు మీరు మీరు వరములిండు. వాయువునకు సంతోష మతిశయించును గాక.

చ. అనవుడు శక్రుఁ డంబుజమయం బగు మాలిక నిచ్చి యీమరు
త్తనయునకున్ మదీయపవిధారఁ జిక్కఁబడ హను విట్లు నొచ్చె దా
నన హనుమత్సమాఖ్య భువనంబుల నెల్లెడఁ గాంచుఁ గాక యిం
కను శతకోటిపాతమునఁ గాంచక యుండెడుఁ గాక మృత్యువున్. ౮౧౯

అర్థములు. శక్రుఁడు=ఇంద్రుఁడు, అంబుజమయంబు=కమలములతో నిండిన, మదీయ=నాయొక్క, పవిధారన్=వజ్రము వాదరచే, హనువు=చెంప, ఇంకను=ఇఁక మీఁద, శతకోటిపాతమునన్=వజ్రము పడుటచే.

తా త్ప ర్య ము

బ్రహ్మ యిట్లు చెప్పఁగా నింద్రుఁడు కమలములతో నిండిన మాలిక నిచ్చి నా వజ్రాయుధము దెబ్బచే నతనికి హనువు నొచ్చెను గావున నికమీఁద నితఁడు లోకమున హనుమంతుఁడను పేరఁ బ్రసిద్ధుఁడగునుగాక. ఇఁకమీఁద నితనికి నావజ్రాయుధముచే మరణము లేకుండును గాక యని వరమిచ్చెను.

చ. అనవుడు భాస్కరుండు కరుణార్ద్రమనంబునఁ బల్కె నాదు తే
 జునను శతాంశ మిచ్చితిని శూరవరుం డగు గాడ్పుపట్టికిన్
 సనయుఁడు శాస్త్రముల్ చదువుశక్తి రహించిననాఁడు వీని వా
 గ్మిని ఘటియించు శాస్త్రమును గీర్తి రహింపఁగ నేర్పఁ బూనెదన్. ర ౨౦

అర్థములు. భాస్కరుఁడు=సూర్యుఁడు, కరుణార్ద్రమనంబునన్ = దయారసముచేఁ దడిసిన మనస్సుతో శతాంశము=నూఱవ భాగము, వాగ్మిని=చక్కఁగా బలుకనేర్చిన వానిని.

తా త్ప ర్య ము

సూర్యుఁడు, నా తేజస్సులో నూఱవభాగము తేజస్సితనికి నిచ్చితిని. అదిగాక యితఁడు విద్యనేర్చు ప్రాయము వచ్చినపుడు చక్కఁగా మాటలాడఁ గల శాస్త్రమును నేర్పెదను.

తే. శాస్త్రదర్శనమున వీనిసముఁడు లేక యుండఁజేసెద నన వరుణుండు పల్కె
నీళ్ళనైనను మత్పాశనిహతినైన, మృతిని గాంచఁడు పదిలక్షలేండ్లకైన. ర ౨౧

తా త్ప ర్య ము

శాస్త్రజ్ఞానమునందు వీనికి సమానుఁడు లేకుండఁజేసెదను అని చెప్పఁగా వరుణుఁడు నీళ్ళచేనైనను నా పాశములచేనైనను పదిలక్ష లేండ్లకైనను చావు నొందఁ జాలఁ డని వరమిచ్చెను.

తే. కాలదండాదులను జావుగాన కునికి, యెల్లపుడు వ్యాధియనునది యెఱుగకుంట
 యుద్ధభూమి విషాదంబు నొందకుంట వరములుగ నిత్తునని దండధరుఁడు పలికె.

తా త్ప ర్య ము.

కాలదండము లోనగు వానిచేఁ జావకుండునట్లును నేయే కాలమందైనను వ్యాధియనునది లేక యుండునట్లును యుద్ధభూమియందు దుఃఖవిచారము లేకుండునట్లు యముఁడు వరము లిచ్చెను.

చ. తనగదచేత మృత్యువశుఁడుగం గనకుండఁగ యక్షనాయకుం
డనుపమమైన యాత్మ మహితాయుధసంతతి నీల్గమిం, ద్రిలో
చనుఁడు వరంబు లీయ జలజప్రభవుండు చిరాయు విచ్చి యీ
యనఘుఁడు బ్రహ్మదండముల కన్నిటి కౌత మవధ్యుఁ డంచనన్. ౭ ౨౩

తాత్పర్యము

కుబేరుఁడు తన గదచేతఁ జావకుండునట్లును శివుఁడు తన యే యాయుధము చేతను చావకుండునట్లును వరము లీయఁగా బ్రహ్మ చిరాయువు నిచ్చి యీపుణ్యాత్ముఁడు బ్రహ్మాస్త్రముల వేనిచేతను జావకుండ వరమిచ్చెను.

తే. బాలసూర్యోపమాను నర్భకునిఁ గాంచి, విశ్వకర్మ వచించె నీవిశ్వనుతుఁడు
మద్వినిర్మితశస్త్రాళిమడియ కుండుఁ; గాత దీర్ఘాయు వగుచును గాలుగాత.

తాత్పర్యము

బాలసూర్యునితో సమానుఁడైన బాలుని జూచి విశ్వకర్మ నేను నిర్మించిన యే యస్త్రశస్త్రము చేతను వీఁడు చావకుండెడుఁగాక, దీర్ఘాయువగునుగాక యని వర మిచ్చెను.

చ. అనవుడు సంతసించి నలినాసనుఁ డిట్లను గాడ్పుతోడ నీ
తనయుఁ డమిత్రభీప్రదుఁడు తప్పక మిత్రముదావహుం డగున్
ఘనబలశాలి దుర్జయుఁడుఁ గామచరుండును గామరూపి యెం
దును నెదు రేది గల్గని యనుత్తమకీర్తియుఁ గామగుం డగున్. ౭ ౨౪

అర్థములు. నలినాసనుఁడు=బ్రహ్మ, అమిత్రభీప్రదుఁడు= శత్రువులకు భయంకరుఁడు, మిత్రముదావహుఁడు=స్నేహితులకు సంతోషము గలిగించువాఁడు కామచరుఁడు=కోరినట్లు లే ప్రదేశమునందైన చరింపఁ గలవాఁడు, కామరూపి= కోరినరూపము ధరింపగలఁవాఁడు, కామగుఁడు=కోరినంత వేగమునఁ బోఁగల వాఁడు, అనుత్తమకీర్తి=మిక్కిలి యుత్తమమైన కీర్తిగలవాఁడు.

తాత్పర్యము

ఇట్లందఱు వరము లీయఁగా సంతోషించి బ్రహ్మ యిట్లనియె. వాయుదేవా! నీకొడుకు శత్రువులకు భయంకరుఁడు; మిత్రులకు సంతోషకరుఁడు నగును. అదిగాక మిగుల బలశాలియు జయింపరాని వాఁడును, ఇష్టము వచ్చిన ప్రదేశముల నిప్పు లలో నీళ్ళలో నేలోక మందైన సంచరింపఁగలవాఁడును, కోరిన రూపము ధరింపఁ గలవాఁడును, కోరిన వేగమునఁ బోఁగలవాఁడును, ఎందు నెదురులేని వాఁడును, మిక్కిలి యుత్తమకీర్తిగలవాఁడు నగును.

క. రావణు నిధనంబున నీ, తావిభునకు బాసటగుచుఁ ♦ దా నద్భుతకా
ర్యావళి ఘటియించును జ,న్యావని నని బిడ్డ నిచ్చి ♦ యరిగెద ననుచున్. ర ౨౬

అర్థములు. జన్యావనిన్=యుద్ధభూమియందు, రావణునిధనంబునన్=రావణు వధించుట యందు.

(రావణునిఁ జంపుటయందు శ్రీరామచంద్రమూర్తి యుద్ధములోఁ దోడయి యద్భుతములగు కార్యములు చేయునని బిడ్డనిచ్చి, పోయి వచ్చెద ననుచు)

ఆ. సురలతో విరించి ♦ యరుగఁగ గరువలి, బిడ్డతోడ వచ్చి ♦ ప్రేమమీఱ
నఖిలవార్త దెలిపి ♦ యంజనచే నిడి, యరిగెనంత నితఁడు ♦ వరముబలిమి. ర ౨౭

అర్థములు. కరువలి=వాయువు.

తాత్పర్యము

(దేవతలతో బ్రహ్మ పోఁగా, వాయువు బిడ్డనెత్తుకొని వచ్చి, ప్రేమతో సమాచారమంతయుఁ దెలిపి, యంజనాదేవి కాబిడ్డనిచ్చి వాయుదేవుఁడేగెను.అటు తరువాత నీతఁడు వరబలముచేత)

—♦ మునులు హనుమంతు శపించుట ♦—

చ. జలనిధియట్లు పొంగి ముని ♦ సత్తమకోటులయాశ్రమస్థలుల్
దలరక చొచ్చి వల్కలవి ♦ తానముఁ జించుచు నగ్నిహోత్రముల్
నులపుచు స్రుగ్ఘటంబులను ♦ మాయఁగఁ దన్నుచు అంపు చేయుచున్
వలిముఖబాలుఁ డుండ ముని ♦ వర్యులు బ్రహ్మవరం బెఱుంగుటన్. ర ౨౮

అర్థములు. జలనిధి యట్లు=సముద్రమువలె, వల్కల వితానము=నార చీరల సమూహము, మలపుచున్ = ఆర్పుచు, స్రుగ్ఘటంబులను=స్రుక్కులను ఘటంబులను, స్రుక్కు=కొయ్యమిళ్ళ, వలిముఖ బాలుఁడు=క్రోఁతి పిల్లవాఁడు.

తాత్పర్యము

(సముద్రమునవలె విజృంభించి, మునిశ్రేష్ఠుల యాశ్రమ ప్రదేశములందుఁ బ్రవేశించి, వారి నారచీరలను జించివేయుచు, నగ్నిహోత్రముల నార్పుచు, కొయ్యమిళ్లలను కుండలను బగులఁదన్నుచు, అంపుచేయుచుఁ గ్రోఁతిపిల్లవాఁడుండగా, మునులు బ్రహ్మవరము దెలిసిన వారగుటచే.)

ఉ. శాంతముఁ దాల్చియుం గపి యొ ♦ సంగెడి కష్టము సైఁపలేక య
త్యంతముకోప మూనక వ ♦ నాటుఁడ! యే వరశక్తిబల్మిచే
నింతలు సేసె దట్టి బల ♦ మెల్లను విస్మృతి నొందె దీవు, ని
న్నెంతయు నెవ్వరేఁ బొగడి ♦ రేనియు నప్పుడు దోఁచుఁ గావుతన్. ర ౨౯

అర్థములు. శాంతము=శాంతి=కోపము లేనితనము, వనాటుఁడ=వానరుఁడా! విస్మృతి=మఱపు, తోఁచున్=స్మృతికి వచ్చును.

తా త్ప ర్య ము

(శాంతము పూనియు, క్రోఁతి పెట్టు కష్టము సైఁపలేక, మిగులఁగోపమును బూనక మునీశ్వరులు ఓ క్రోఁతీ! నీ వే వరము బలముచూచుకొని యింతింత పనులు చేయుచున్నావో, యట్టి బలమును నీవు మఱచిపోయెదవు గాక. ఎవరైనను నిన్నుఁ బొగడినప్పుడు నీకు మరల నది స్మృతికి వచ్చును.

క. అని ఋషులు శపింపఁగనీ యనఘుఁడు తనశక్తి మఱచి • యది మొదలుగ నె
దును గడు మృదుభావంబున, జనవర! చరియించుచుండె • సాధుచరితుఁడై. ౪౩౦

తా త్ప ర్య ము

(అని ఋషులు శాపము పెట్టిరి. ఆ కారణమున నీ హనుమ తనశక్తిమఱచి యది మొదలు చాల నెమ్మదిగ సాధువర్తనుఁడై యుండెను.)

సీ. పదపడి కపికుల • వర్గంబులకు వాలి, సుగ్రీవజనకుండు • సూరనయుఁడు
ఋక్షరజుండు దాఁ • నేలికయై యుండె, రవితేజుఁ డతఁడు చి • రంబు గాఁగ
రాజ్యంబు నేలి స్వా • రాష్ట్రంబుఁ జేరిన, సచివులు వాలిని • జనకపదము
నందు, సుగ్రీవుని • నగ్రజుపదమున, నిలిపి రీ హనుమయు • నిర్మలంబు

ఆ. ఛిద్రవర్జితంబు • స్నేహ మద్వైధంబు, బాల్య మాదిగాఁగ • భాస్కరాత్మ
జాతుతోడఁ జలిపె • జానకీవల్లభ! వింటె హనుమజనన • వీర్యములను. ౪౩౧

అర్థములు. స్వారాష్ట్రంబు=స్వర్+రాష్ట్రంబు=స్వర్గలోకము, సచివులు=మంత్రులు, జనకపదమునందు=తండ్రిస్థానమునందు, రాజుగా-అగ్రజుపదమునన్=అన్నయగు వాలి యున్న పదవియందు యువరాజుగా, ఛిద్రవర్జితంబు=రంధ్రము లేనిది, లోపము లేనిది, అద్వైధంబు • ఏకవిధమైనది.

తా త్ప ర్య ము

(అటు పిమ్మట వాలి సుగ్రీవుల తండ్రియైన ఋక్షవరజుఁడు మహాశూరుఁడు కపుల మూఁకలకుఁ దాను రాజై చాలకాలము రాజ్యము చేసి స్వర్గమునకుఁ బోఁగా, మంత్రులు వాలిని తండ్రియొక్క పదవియందును, సుగ్రీవుని యన్న యధికారి మందును నిలిపిరి ఈ హనుమంతుఁడు పసితనము నుండి సుగ్రీవునితో నెప్పుడు నట్టి లోపము భేదము లేకుండ స్నేహముచేసెను. శ్రీరామచంద్రా! హనుమంతుని జన్మము-బలమును వింటివికదా.)

క. మౌనుల శాపవశంబునఁ, దా నెఱుఁగక తనదుశక్తిఁ ॥ దనుచరపతి యా
భానుజుఁ దఱుముఁగ వెంటనె, తానును బరువెత్తుచుండెఁ ద్రాబయపోలెన్. ౭౩౨

అర్థములు. ద్రాబయపోలెన్=అధమునివలె, బలహీనునివలె,

తాత్పర్యము

(మునుల శాపముచేతఁ దన శక్తి తనకుఁ దెలియక వాలి సుగ్రీవునిఁ దన్ని తఱిమివేయఁగా, వానివెంటఁ దానును ద్రాబవలెఁ బరుగెత్తుచుండెను.)

క. తెలియమి సుగ్రీవుండును, దలఁపింపఁడు దానఁ గాదె ॥ దంతి గవసినన్
బలవంతము హరి పఱచెడి, చెలువున నతఁ డుండె యుద్ధసీమన్ వింటె ౭౩౩

అర్థములు. తెలియమి=ఈ శాపవిధము తెలియక పోవుటచే, తలపింపఁడు= జ్ఞప్తికిఁ దీసికొని వచ్చినవాఁడుకాఁడు, దంతి=ఏనుఁగు, పఱచెడి చెలువునన్=పరుగెత్తు విధముగా.

తాత్పర్యము

(సుగ్రీవునకీ శాపవిధము తెలియకపోవుటచే నాతఁడును జ్ఞప్తికి దీసికొని వచ్చిన వాఁడు కాఁడు. ఏనుఁగు తఱుముకొని వచ్చిన సింహము పరుగెత్తు విధముగా నతఁడు యుద్ధభూమి యందుండెను.)

మత్తకోకిలము స్థైర్యధైర్యపరాక్రమక్రమ॥సాహసంబుల శౌర్యగాం
భీర్యబుద్ధులఁ జాతురీనయ॥వీర్యయుక్తుల సూక్తి మా
ధుర్యకార్యధురీణతాజన॥తుష్టి కారణచర్యలన్
సూర్యశిష్యున కీ ప్రభంజన॥సూతికిన్ సము లుందురే. ౭౩౪

అర్థములు. నయ=నీతి, సూక్తిమాధుర్య=తియ్యని మాటలాడుట, కార్య ధురీణతా=కార్యము సాధించుట, జనతుష్టి కారణచర్యలన్=జనులకు సంతోషము గలిగించు నడవడులందు, ప్రభంజనసూతికిన్=వాయుపుత్రునకు.

తాత్పర్యము

(స్థైర్యమునందు, ధైర్యమునందు, పరాక్రమమున. సాహసమునందు శౌర్య గాంభీర్యము, బుద్ధి, చాతుర్యము, నీతి, బలము, యుక్తి, తియ్యనిమాటలాడుట, కార్యమును సాధించుట. జనులకు సంతోషము గలిగించు నడవడులందు సూర్యుని శిష్యుఁడగు వాయుపుత్రునకు సమానులున్నారా?)

క. పుట్టమునుండి గ్రుంకుడు, గట్టుదనుక సూర్యుతోడఁ ॥ గదునఁ జనుచున్
బట్టుగ వ్యాకరణంబును, గట్టిగ నల్లించె నితఁడు ॥ కంజదళాక్షా! ౭౩౫

అర్థములు. పుట్టుమల=ఉదయపర్వతము, క్రుంకుఁడుగట్టు=అస్తాద్రి, కడు వడిన్=మిగుల వేగముతో.

తా త్ప ర్య ము

వయస్సు వచ్చిన పిమ్మట హనుమంతుఁడు విద్యనేర్చుకొనఁగోరి సూర్యుని యొద్దకుఁ బోయి నీ విచ్చినవరము ప్రకారము నాకు విద్యనేర్పుమనెను. నేనొక చోట నిలుచువాఁడను గానే, నీవెట్లు చదివెద వనగా, నీవెంట నేను వచ్చెదనని యాయన వెంటఁబోవుచు నాయన చెప్పిన విద్య గ్రహించెను.

తే. సూత్రములతోడ వృత్తియు ॰ సూత్రములకు
నర్థము పదంబు మరియు మ॰హార్థ మన్య
శాస్త్రనిచయంబు ఛందస్సుఁ ॰ జక్కఁ నేర్చెఁ
గీర్తితచరిత్రుఁ డీతండు ॰ కేవలుండె. ౧౩౬

అర్థములు. వృత్తి=వివరణ గ్రంథము.

తా త్ప ర్య ము

(సూత్రములతో వివరణ గ్రంథమును, సూత్రముల కర్థమును మఱియుపద మును విశేషార్థమును యితరశాస్త్ర సముదయమును ఛందస్సును జక్కఁగానేర్చు కొనెను. ఇతఁడు సామాన్యుఁడా?)

తే. సకలవిద్యల దేవతా॰చార్యుతోడ, నెనయఁ జాలెడి యీతండు॰జనవరేణ్య!
యభ్యసించెను దొమ్మిది॰వ్యాకరణము, లగును బ్రహ్మగఁ దావకీ॰నానుకంప.

అర్థములు. దేవతాచార్యుతోడన్=బృహస్పతితోడ, ఎనయఁజాలెడిన్= సమానుఁడగును, తావకిన=నీయొక్క, అనుకంపన్=దయచే, అగును బ్రహ్మగ= బ్రహ్మ గాఁగలఁడు. ఇప్పు డుండు బ్రహ్మదేవుఁడు కల్పాంతమునఁ బోఁగానే యా స్థానమునకు హనుమంతుఁడు బ్రహ్మగా వచ్చును. ఈశరీరముతోఁగాదు. దేవ శరీరముతో

తే. జగములను ముంపఁ బూనిన ॰ సాగరుండు
భువనములఁ గాల్పఁ బూనిన ॰ భువనభవుఁడు
ప్రళయవేళను రేఁగు వై॰వస్వతుండు
వాయుజుఁడు వాని యెదుట నె॰వ్వాఁడు నిలుచు? ౧౩౭

అర్థములు. భువన భవుఁడు=నీటఁబుట్టినవాఁడు, అగ్ని.
నీటఁ బుట్టినవాఁడు కాఁ డోటు నసిన్నె,
కాల్చుచున్నాఁడు జగమెల్లఁ గరుణలేక ॥మను॥
వైవస్వతుండు=యముఁడు, వాయుజుఁడు=హనుమంతుఁడు.

తాత్పర్యము

(లోకములను ముంచివేయఁ బూనిన సముద్రుఁడు. లోకములను గాల్పఁ బూనిన యగ్నిదేవుఁడు ప్రళయకాలమున విజృంభించు యముఁడు సుమా హనుమంతుఁడు-వాని యెదుట ఎవఁడు నిలువఁ గలఁడు?)

ఉ. పావనివోలె నీకు నని ♦ బాసటగా విబుధాళిచేత సు
గ్రీవుఁడు మైందుఁడున్ ద్వివిద♦నీలుఁడు రంభుఁడు సైన్యనాథుఁడున్
దైవతనాథపౌత్రుఁడును ♦ దారుఁడు జన్మము గాంచి గుర్వి రా
మా! వినిపించితిన్ సకల ♦ మంజనసూనువిధంబు నావుడున్ ౨౩౯

అర్థములు. బాసటగా=సహాయపడఁగా, దైవతనాథపౌత్రుఁడు=అంగదుఁడు.

తాత్పర్యము

(హనుమంతునివలె నీకు యుద్ధములోసహాయముగా, సుగ్రీవుఁడు, మైందుఁడు, ద్వివిదుఁడు, రంభుఁడు, నీలుఁడు, అంగదుఁడు, తారుఁడు దేవతలచేత జన్మమును గాంచిరి-రామా! యాంజనేయుని విషయమంతయు వినిపించితిని-)

నాలుగవ పాదంబునఁ బ్రుతయతి.

క. రాముఁడు సౌమిత్రియు శాఖామృగవరు లద్భుతంబు ♦ గాంచిరి మఱి లో
పాముద్రాహృదయేశుఁడు, ప్రేమంబునఁ బలికె రామ♦పృథ్వీశ్వరుతోన్. ౨౪౦

అర్థములు. లోపాముద్రా హృదయేశుఁడు=అగస్త్యుఁడు.

తాత్పర్యము

(రాముఁడు, లక్ష్మణుఁడు, వానరవర్యు లందఱు నచ్చెరువుపడిరి. మఱియు నగస్త్యుఁడు రామచంద్ర భూపాలునితోఁ బ్రేమమీఱ నిట్లని చెప్పెను.)

—* అగస్త్యాదులు శ్రీరామునిచే ననుజ్ఞగొని పోవుట *—

చ. వినిచితి నెల్లవృత్తములు ♦ వింటివి నీ వఖిలంబు నింక మా
కనుమతి యిచ్చెదే చనఁగ ♦ నార్తజనావనదక్ష! యన్న న
మ్మునివరుఁ బల్కఁ రాఘవుఁడు ♦ మోదమునం గరము ల్మొగిడ్చి యో
యనఘ! భవద్విలోకనమ♦హాసుకృతం బిటు నేఁడు గల్గుటన్. ౨౪౧

అర్థములు. ఆర్తజనావనదక్ష=దీనజనుల రక్షించు సామర్థ్యము గలవాఁడా, భవద్విలోకన=నిన్నుఁ జూచుట యనెడి, మహాసుకృతంబు=గొప్ప పుణ్యము.

తాత్పర్యము

(ఆర్తులను రక్షించుటయందు సమర్థుఁడవగు రామచంద్రా! సమస్తవిషయములు నీకు వినిపించితిని. నీ వన్నియు వింటివి-పోయెదము. ఇఁక మా కనుమతి

యిచ్చెదవా యనఁగా, రామచంద్రమూర్తి సంతోషముతోఁ చేతులు జోడించి, యా మునివర్యునితో, యగస్త్యునిఁ జూచి యనఘా! నేఁడీ విధమున మీ దర్శన మహా పుణ్యము కలుగుటచేత.)

చ. తనిసిరి నాదు దేవతలు ♦ తాతలుఁ♦ దండ్రియుఁ దుష్టి గూరిరో
మునివర! నాదు బాంధవులు ♦ మోదముఁ గాంచిరి శాశ్వతంబుగా
వినుఁ డొక విన్నపంబు మిము ♦ వేఁడితి నేనియు నిందు రాఁగ నా
మనవి గ్రహించి మీరు దయ♦మాలక యిం దరుదేరఁగాఁ దగున్. ౧౮౨

అర్థములు. తనిసిరి=తృప్తిపడిరి, తుష్టి=సంతోషము, దయమాలక=దయ వదలక.

తాత్పర్యము

(నా పితృదేవతలు తృప్తిపడిరి-తాతలు మా తండ్రి దశరథుఁడు సంతోషించిరి- నా చుట్టాలు శాశ్వతమైన సంతోషమును బొందిరి, నా విన్నపమొకటి గలదు వినుఁడు-ఇచ్చటకు రావలసినదిగా నేను వేఁడినప్పుడు నా మనవి నంగీకరించి దయవదలక విచ్చేయఁ దగును-)

చ. అడవులనుండి క్రమ్మరితి ♦ నందఱుఁ బౌరులు స్వీయకార్యముల్
తడబడకుండఁ జేయఁగ య♦థావిధి నిల్పి సవం బొనర్పఁగాఁ
గడఁగెద, మీర లధ్వరము ♦ కాలమునందు నజస్ర మిచ్చ్యోడన్
గడుకొని నిల్వఁగా నలయుఁ ♦ గార్యము లన్నియుఁ దీర్పఁగా దయన్. ౧౮౩

అర్థములు. తడఁబడకుండ=వ్యత్యాసపడకుండ, యథావిధి=నియమ ప్రకారము, సవము=యజ్ఞము, కడఁగెదన్=ప్రారంభించెదను, అధ్వరము=యజ్ఞము, అజస్రము=ఎల్లప్పుడు, యజ్ఞము పూర్ణమగువఱకు మరలిపోక.

తాత్పర్యము

(అడవులనుండి తిరిగి వచ్చితిని. పౌరులందఱు తమ తమ పనులు తడబడక నియమ ప్రకారము చేయునట్లు నిల్పి యజ్ఞము ప్రారంభించెదను- మీరాయజ్ఞము పూర్ణమగు వఱకు మరలిపోక యిక్కడనే యెల్లప్పుడుండి, కార్యము లన్నియు దయతో నెఱవేర్పవలెను-మునులారా!

క. ధుతకల్మషజాలుర మిము, హితమతి నే నాశ్రయించి♦యీడేరఁ గ్రతుల్
పితరులయనుగ్రహమునకు, స్తుతగతి నేఁ బాత్ర మగుదుఁ♦జుం డన మానుల్.

అర్థములు. ధుత కల్మష జాలుర=ఎగురఁగొట్టఁబడిన పాపసమూహములు గలవాండ్రు, ఈడేరన్=నెఱవేఱఁగా.

తాత్పర్యము

(పాపరహితులరగు మిమ్ము నే నాశ్రయించి, కార్యములన్నియు నెఱవేఱఁగా నా పితరుల యనుగ్రహమునకుఁ బాత్రుఁడ నయ్యెదను.)

క. అందఱు నగుఁ గాకని యరు, గం దశరథనందనుండు ♦ క్రతువిషయక చిం
తం దవిలి యుండి, సూర్యుఁడు మందకరుం డగుచుఁ బనిచి ♦ మర్కటవరులన్.

అర్థములు. క్రతువిషయక చింతన్=యజ్ఞవిషయమైన విచారము, ఏ యజ్ఞము చేయవలె, ఎచ్చటఁ జేయవలె నని యాలోచన, మందకరుండు=వేడి లేని కిరణములు గలవాఁడు.

తాత్పర్యము

(అందఱును నట్లే, యని పోయిన పిమ్మట రామచంద్రమూర్తి యజ్ఞవిషయమైన యాలోచనలో మునిఁగి యుండి, యెండ చల్లబడిన తరువాత, వానరనాయకులను బంపి.)

ఆ. తాను సంధ్యవార్చి ♦ తమి ప్రవర్తిల్లగ, నంతిపురమునందు ♦ హాయినుండెఁ
బట్ట మందినట్టి ♦ ప్రథమరాత్రం బిట్టు లేగెఁ బౌరహర్ష ♦ వృద్ధి యెసఁగ. ౨౮౬

అర్థములు. తమి=రాత్రి, ప్రథమరాత్రంబు=మొదటిరాత్రి.

తాత్పర్యము

(తాను సంధ్యవార్చి, రాత్రికాఁగానే, యంతఃపురమునకుఁ బోయిహాయిగా నుండెను. పట్టముగట్టుకొనిన మొదటిరాత్రి పౌరులందఱకు సంతోషమతిశయిల్ల నీప్రకారము జరిగెను.)

సీ. ఆరాత్రి వేగుచో ♦ నతిమనోహరకంఠ, వందిజనంబులు ♦ సుందరముగఁ
గౌసల్యానందనా! ♦ కరుణాఢ్య మేల్కొమ్ము, నీవు నిద్రించిన ♦ నిఖిలజగము
నిద్రించు వీరాగ్ర♦ణీ! నీవు విక్రమం,బున విష్ణుఁడవు రూ♦పమునకు నశ్వి
లను బోలెదవు బుద్ధి ♦ నెనయుదు సురగురుఁ, బరమేష్ఠికిని సీడు♦వత్తు వీవు

ఆ. క్షమను గాశ్యపికిని ♦ సముఁడవు తేజున, భాస్కరుండ వీవు ♦ పవను నద్ది
ఘనజవంబునందు ♦ గాంభీర్యగుణమున, సాగరంబుఁ బోలఁ♦జాలు దీవు. ౨౮౭

అర్థములు. వేగుచోన్=ఉదయము కాఁగా, అతి=మిగుల, మనోహర=ఇంపైన, కంఠ=కంఠస్వరముగల, వందిజనంబులు=స్తోత్రపాఠకులు, ఎనయుదు=సరిపోలెదవు, పరమేష్ఠి=బ్రహ్మ, క్షమను = ఓర్పునందు, కాశ్యపికిన్=భూమికి పవను=వాయుదేవునకు, ఘనజవంబునందున్=మిగుల వేగమునందు.

తాత్పర్యము

ఆరాత్రి తెల్లవాఱఁగానే మంచి యింపైన కంఠస్వరములుగల స్తోత్రపాఠకులు వచ్చి యిట్లు స్తుతియించిరి. కౌసల్యానందనా! దయాసంపన్నా! మేలుకొనుము నీవు నిద్రించితివేని లోకము లన్నియు నిద్రించును. వీరులందు శ్రేష్ఠుఁడా! నీవు విక్రమంబున విష్ణుఁడవు, సౌందర్యమున నశ్వినీదేవతలఁ బోలుదువు, బుద్ధియందు బృహస్పతి బ్రహ్మలకు సమానుఁడవు ఓర్పునందు భూమివి తేజమునందు భాస్కరుండవు వేగమునందు వాయువునకు సమానుఁడవు, గాంభీర్యమున సముద్రమువంటి వాఁడవు.

క. స్థాణుండ వప్రకంప్యత, నేణాంకుఁడె, సౌమ్యతను సదృక్షుఁడు నీకున్
క్షోణీపాలుర మున్ను ప్రమాణంబుగ, లేరు నీదు మాదిరి రాజుల్. ౮౮౮

అర్థములు. అప్రకంప్యతన్=చలింపకుండుటయందు, స్థాణుఁడవు=శివుఁడవు, ఏణాంకుఁడె=చంద్రుఁడే, సౌమ్యతను=ప్రసన్నతయందు, సదృక్షుఁడు=సమానుఁడు

తాత్పర్యము

(స్థయిర్యమున నీవు స్థాణుఁడవే యనఁగా శివుఁడవు. ప్రసన్నతయందు చంద్రుఁడే నీకు సమానుఁడు పూర్వము రాజులలో నీ మాదిరి రాజులు లేరు.)

క. అతిదుర్ధర్షుఁడ వగుటను, క్షితిజనహితకరణవృత్తిఁ జెలఁగుట సతమున్
క్షితిపా! కీర్తియు లక్ష్మియు, సతతము నిన్నాశ్రయించుఁ జన కెచ్చటికిన్. ౮౮౯

అర్థములు. అతిదుర్ధర్షుఁడవు=మిక్కిలి తిరస్కరింపరాని వాఁడవు, క్షితిజన=భూప్రజలయొక్క, హిత=మేలును, కరణవృత్తి=చేయు వ్యాపారమందు, క్షితిపా=రాజా.

తాత్పర్యము

(నీవు మిక్కిలి తిరస్కరింపరానివాఁడవు. భూప్రజలకు మేలుచేయు వ్యాపారమునందు నెల్లప్పుడుండుటచేత కీర్తియు సంపదయు నెచ్చటకుఁబోక నిన్నే యాశ్రయించును.)

క. సిరియును ధర్మము నృపతీ!, తిరముగ నీయంద కడుఁ బ్రతిష్ఠతము లటం
చరుసంబున నిటు పల్కఁగఁ గరము మధురసూక్తి సూతకాండము పొగడన్.

అర్థములు. ప్రతిష్ఠితములు=స్థాపింపఁబడినవి, అరుసంబునన్=సంతోషముతో.

తాత్పర్యము

శ్రీయును ధర్మము నీయందు స్థిరముగ స్థాపింపఁబడి యున్నవని యిట్లు వచనములు పొగడఁగా సూతసమూహము తియ్యని మాటలచే ప్రశంసింపఁగా.

క. ఫణిరాజశయ్య నారా, యణుచందంబుగను బాండు • రాచ్ఛదిత మహా
మణిమయ మగు శయ్యను ధా, రణితనయాధవుఁడు లేవఁ • బ్రాంజలులగుచున్.

అర్థములు. ఫణిరాశెజయ్యాన్ = ఆదిశేషతల్పమునందు, పాండురాచ్ఛాదితము = తెల్లని వస్త్రములచేఁ గప్పఁబడిన, మణిమయము = రత్నములతో నిండిన దగు, ధారిణితనయాధవుఁడు = రామచంద్రమూర్తి, ప్రాంజలులు = నమస్కరించువారు.

తాత్పర్యము

(ఆదిశేష తల్పమునందు నారాయణమూర్తివలెఁ దెల్లని వస్త్రములచేఁ గప్పఁబడిన మణిమయమగు శయ్యనుండి సీతాపతియగు శ్రీరామచంద్రమూర్తి లేవఁగా, నమస్కరించువారగుచు.)

ఉ. ప్రాకట శుభ్రపాత్రముల • వారి నొసంగఁగ శుద్ధిమంతుఁడై
శ్రీకరు హవ్యవాహుని న • రీణగతిన్ యజియించి రాముఁ డి
క్ష్వాకుసుసేవితంబును శు • భం బగు దేవగృహంబుఁ జొచ్చి శ్ర
ద్ధాకలితుండు దేవపితృ • ధారిణినిర్జరపూజ లన్నిటిన్. ౧౪౨

అర్థములు. శుభ్రపాత్రములన్ = నిర్మలములైన తెల్లని గిన్నెల, శుద్ధిమంతుఁడై = స్నానాదులొనర్చినవాఁడై, శ్రీకరున్ = సంపత్కరుని, 'ఆరోగ్యం భాస్కరా దిచ్ఛేత్, శ్రియ మిచ్ఛేత్ హుతాశనాత్,' అని యుండుటచే అగ్ని శ్రీకరుఁ డనఁబడెను. హవ్యవాహునిన్ = అగ్నిహోత్రుని, అరీణగతిన్ = క్రమప్రకారము, యజియించి = పూజించి, దేవగృహంబున్ = దేవుని నుంచిన యింటియందు శ్రద్ధాకలితుండు = శ్రద్ధగలవాఁడు, దేవ = దేవతలయొక్కయు, పితృ = పితృదేవతల యొక్కయు, ధారిణి నిర్జర = బ్రాహ్మణులయొక్కయు పూజలను.

తాత్పర్యము

మిక్కిలి నిర్మలములైన పాత్రములందు జలము లీయఁగా స్నానాదులచే దేహము శుద్ధి చేసికొనిన వాఁడై సంపత్కరుఁడైన యగ్నిహోత్రుని బూజించి ఇక్ష్వాకువంశమువారు వంశపరంపరగాఁ బూజించు దేవమందిరము ప్రవేశించి శ్రద్ధ గలవాఁడై దేవపూజలు పితృపూజలు బ్రాహ్మణపూజలు గావించినవాఁడై —

పితృదేవతపూజలు చేసిన తరువాత దేవపూజలు చేయరాదు. కావున దేవ పితృపూజ లనఁబడెను.

క. ఓలి యథావిధిఁ దీరిచి, క్రాలు ముఖంబునను బాహ్య • కక్ష్యకు రామం
డ్రాళులు వశిష్ఠముఖులున్, గీలులవలె వెన్నడింపఁ • గీర్తింప జనుల్ ౧౪౩

అర్థములు.. ఓలిన్=క్రమముగా, యథావిధి=శాస్త్రప్రకారము, బాహ్యకక్ష్యకున్=వెలుపలి తోట్టికట్టునకు, రాన్=రాఁగా, మంత్ర్యాళులు=మంత్రుల సమూహములు, కీలులవలెన్=అగ్నులవలె.

తా త్ప ర్య ము

(శాస్త్రప్రకారము క్రమముగా నెఱవేర్చి, సంతోషముతో వెలుపలితొట్టికట్టునకు రాఁగాఁ మంత్రుల సమూహములు వసిష్ఠుఁడు మున్నగు వారును నగ్నులవలె వెంబడింపఁగా, జనులు పొగడఁగా.)

క. నానాభూపతులు సమా సీనుండగు రామవిభుని♦చెంతల నుండన్
మానుగఁ ద్రయినాఁగ సుమిత్రానందనయుగముకైక♦తనయుఁడు తనరన్.

అర్థములు. సమాసీనుండు=ఆసనమందుఁ గూర్చుండినవాఁడు, త్రయి=ఋగ్యజుస్సామవేదములు, సుమిత్రానందనయుగము=లక్ష్మణ శత్రుఘ్నులు.

తా త్ప ర్య ము

(సింహాసనమున నాసీనుఁడైన శ్రీరామచంద్ర ప్రభువు వారి పార్శ్వముల రాజు లందఱు నుండ. ఋగ్యజుస్సామ వేదములవలె లక్ష్మణ భరత శత్రుఘ్నుల నిలువఁగా.)

క. సేవకులు పెక్కు రానం, దావిష్టులు మ్రొక్కి పార్శ్వ♦మందు సమచితం
బౌ వివిధాసనతతిపై, వారిరిఁ గూర్చుండ ముఖ్య♦వానరవర్యుల్. ౧౯

అర్థములు. ఆనందావిష్టులు=ఆవేశించిన సంతోషము గలవారు.

తా త్ప ర్య ము

(సేవకు లనేకులు సంతోషావేశమున మ్రొక్కి పార్శ్వభాగమున వారి వారికిఁ దగిన వివిధములగు నాసనముల మీఁదఁ గ్రమముగాఁ గూర్చుండఁగా, ముఖ్యులగు వానర నాయకులు.)

క. ఖరకరసుతముఖు లిరువదు,గురు సచివచతుష్కయుతుఁడు♦గురుమతి దశకం
ధరసోదరుఁడును, గొల్వఁగ ధరణీశుఁడు గుహ్యకవృత♦ధనదునిఁబోలెన్. ౨౦

అర్థములు. ఖరకర సుతముఖులు=సుగ్రీవుఁడు మొదలగువారు, సచివచతుష్కయుతుఁడు=నలువురు మంత్రులతోఁ గూడినవాఁడు, గురుమతి=గొప్ప మనస్సు గలవాఁడు, దశకంధర సోదరుఁడు=విభీషణుఁడు, గుహ్యకవృత=గుహ్యకులతోఁ జుట్టఁబడిన, ధనదుని=కుబేరుని, ఇరువదుగురు, సూ.౯ ౨౦-అంగదుఁడు.

తా త్ప ర్య ము

(సుగ్రీవుఁడు మొదలగువా రిరువదుగురు నలుగురు మంత్రులతో రావణుని తమ్ముఁడు విభీషణుఁడును సేవింప గుహ్యకులతోఁ గూడిన కుబేరునివలె శ్రీరామ చంద్ర ప్రభువు.)

తరలము. నిగమవృద్ధులు సత్కులీనులు • నీరజాక్షుని హస్తముల్
మొగిచి మ్రొక్కి నిజోచితాసనముల్ గ్రహించి భజింపఁగన్
జిగి దొలంకఁగ మౌనివర్యులు • నిర్జరుల్ గొలువన్ దివిన్
నగవిరోధిని మించు తీవిఁ దనర్చె రాముఁడు గొల్వులోన్. ౨౫౭

అర్థములు. నిగమవృద్ధులు=పౌరులయందు ముసలివారు, నిగమో నిశ్చయే పుర్యాం పథి వేదే వణిక్పథే నానా॥ర సత్కులీనులు=గొప్పవంశములఁ బుట్టిన వారు, నీరజాక్షుని=రామచంద్రునీ, మొగిచి=ముకుళించి=మోడ్చి, నిజోచితాసన ముల్=తమకుఁ దగిన యాసనములు, జిగి=కాంతి, నగవిరోధిని=ఇంద్రుని, కొల్వు లోన్=సభయందు.

తా త్ప ర్య ము

(పౌరులయందు ముసలివారు, గొప్పవంశములఁ బుట్టినవారు శ్రీరామ చంద్రునికి, చేతులు మోడ్చి మ్రొక్కి, తమకుఁ దగిన యాసనములను గ్రహించి సేవింపఁగా, మునివర్యులు, దేవతలు గొలువఁగా స్వర్గమున నింద్రుని నతిశయించిన తీవితో రామచంద్రమూర్తి కొలువులోఁ గాంతి మిగుల నొప్పెను.)

క. కౌసల్యాతనయుం డిటు, భాసిల, పేరోలగమునఁ • బౌరాణికు ల
త్యాసక్తిఁ బురాణకథా, వ్యాసంగము జరపి రర్హమగు మార్గమునన్. ౨౫౮

అర్థములు. పేరోలగమునన్=పెద్ద సభయందు.

తా త్ప ర్య ము

శ్రీరామచంద్రమూర్తి యిట్లు పెద్ద సభలోఁ బ్రకాశింపఁగా, పౌరాణికులు మిగుల నాసక్తితోఁ దగిన విధమునఁ బురాణ కథలను జెప్పిరి.)

—• శ్రీరాముఁడు జనకాదిరాజుల కొరివారి పురంబుల కనుమట •—

చ. దినము దినంబు నిట్లు జగతీపరిపాలన మర్మపద్ధతిన్
జనపదరాష్ట్రదేశజనసమ్మతిగా నొనరించు చొక్కనాఁ
డనఘుని మైథిలుం గని కృతాంజలియై జననాథ! నీవె మా
కనయము దిక్కు, పంక్తినదనాసురు నీ మహిమన్ జయించితిన్. ౨౫౯

అర్థములు. జనపదములు=గ్రామములు, రాష్ట్రము=కొన్ని గ్రామముల సమూహము, దేశము=రాష్ట్రసమూహము, మైథిలున్=జనకరాజును, కృతాంజలియై=చేతులు జోడించినవాడై, పంక్తివదనాసురున్=రావణుని.

తాత్పర్యము

(ప్రతిదిన మీవిధముగా, గ్రామములు, రాష్ట్రములు దేశములందలి జనులను సమ్మిశ్రముగా సర్వ్వమగు పద్ధతితో భూమిని బరిపాలన మొనరించుచు నొకనాఁడు పాపరహితుఁడగు జనకునిఁ జూచి, 'మహారాజా! నీవే మాకెల్లప్పుడు రక్షకుఁడవు-నీ మహిమచేతను రావణుని గెల్చితిని.')

ఉ. నీకృప రక్షణీయులము॥నిర్మలశీల! విదేహభూమిపే
క్ష్వాకుల బాంధవంబు భృశ॥సమ్మదహేతువు కీర్తిదంబు మీ
రీకడ కేగుదెంచి చని॥యెం బలునాళ్ళు జనావనక్రియా
స్తోకరతాత్ము లీరు పురిఁ॥జూడఁగఁ బోయెదరేని ప్రేముడిన్. ౮౬

అర్థములు. రక్షణీయులము=కాపాడఁ బడఁదగినవారము, విదేహభూమిప=విదేహరాజులయొక్కయు, ఇక్ష్వాకుల=ఇక్ష్వాకు వంశరాజులయు, బాంధవంబు=చుట్టఱికము, భృశసమ్మదహేతువు=మిక్కిలి సంతోషకారణమైనది, కీర్తిదంబు=కీర్తికరమైనది, జనావన క్రియా=జనరక్షణ కార్యమందు, అస్తోకరతాత్ములు=మిక్కిలి ప్రీతిగలవారు, ప్రేముడిన్=ప్రేమచే.

తాత్పర్యము

పవిత్రచరిత్రా! మమ్ము రక్షించునది నీ దయయే. విదేహరాజులయు నిక్ష్వాకులయు సంబంధము మిక్కిలి సంతోషకరమైనది, కీర్తికరమైనది, మీరిచ్చటికి వచ్చి చాల దినము లయ్యెను మీరు ప్రజారక్షణమందు మిక్కిలి యాసక్తిగలవారు, మీరూరికి పోవదలఁచెదరేని నాయందుఁ బ్రేమ యుంచి.

క. ఈ రత్నంబులఁ గొనిచనుఁ, డీరలు భరతుండు వెంట ॥ నేతెంచెడు నా
శ్రీరాముని వాక్కుల విని, గారామున జనకుఁ డనియె॥గాకుత్థ్సవరా! ౮౭

తాత్పర్యము

(ఈరత్నములను మీరు తీసికొని చనుఁడు-భరతుఁడు మీ వెంట వచ్చును. అనిన శ్రీరామచంద్రమూర్తి మాటలను విని ప్రేమతో జనకమహారాజు-కాకుత్థ్స వంశమణీ!)

క. నీదర్శనమున రాజా!, నీమువిధేయతకు మనము ॥ నెఱి మోదించెన్
నా దుహితల కీరత్నము, లాదృతి నొసఁగితి నటంచు॥నరిగెం బురికిన్. ౮౮

అర్థములు. దుహితలకు=కూఁతురులకు.

తాత్పర్యము

(నీ దర్శనము చేతను, నీ విధేయతను గనియు నా మనస్సు పూర్ణముగ సంత
సించెను. ఈరత్నములను నాకూఁతుల కిచ్చితినని చెప్పి తన రాజధానికిఁబోయెను.)

తే. అవలఁ గేకయుతోఁ రాముఁ॰డనఘశీల! భరతుఁడును

లక్ష్మణుండుమా ॰ సిరియు రాజ్య

మెల్ల మీయదిమీ రెమా॰కెపుడు దిక్కు.

నైన మీరిందుఁ బెక్కు నా॰ళ్ళయ్యెవచ్చి.

తాత్పర్యము

(అటుపిమ్మటఁ గేకయరాజుతోఁ రామచంద్రమూర్తి పుణ్యమూర్తీ! భర
తుఁడు, లక్ష్మణుఁడు, మాయైశ్వర్యము- రాజ్యము మీదే-మీరే మాకెల్లపుడు
రక్షకులు-అయినను మీరిక్కడకు వచ్చి చాలదినము లయినది.)

ఉ. అచ్చట వృద్ధుతండ్రి మది ॰ నారట మొందెడు మీరు లేమి మీ

రిచ్చ చెలంగ నేఁడ చన ॰ నెంచెద రేనియు లక్ష్మణుండు తో

వచ్చు మహార్ఘ్య రత్నధన॰వర్గముఁ గొంచు నటండు మ్రొక్కి నీ

కెచ్చును నిచ్చ రత్నము లం॰హీనగుణా! యని మ్రొక్కెఁ గ్రమ్మఱన్. ౮౬౮

అర్థములు. మహార్ఘ్య=మిక్కిలి వెలగల.

తాత్పర్యము

(అచ్చట మీ తండ్రి పెద్దవాఁడు మీరు దగ్గఱలేకుండుటచేఁ జాలదిగులు
పడును. మీరీనాఁడే పోవఁదలచితిరేని లక్ష్మణుఁడు మిగుల వెలగలరత్నములు ధన
మును దీసికొని మీతోఁ రాఁగలడు. అని నమస్కరింపఁగా, రామచంద్రా! నీకు
నిరంతరము రత్నములు వృద్ధియగుఁ గాత మని మరల మ్రొక్కెను.)

క. వృత్రవధానంతరమున. జైత్రుఁడు వాసవుఁ డుపేంద్ర॰సహితునివలె సౌ

మిత్రిసహాయుఁడు గేకయ,ధాత్రీపతి చనియెఁ బిదప॰దశరథసుతుఁడున్. ౮౬౯

అర్థములు. వృత్రవధానంతరమునన్=వృత్రునిఁజంపిన పిమ్మట, జైత్రుఁడు=
జయించిన వాఁడు.

తాత్పర్యము

(వృత్రునిఁ జంపిన తరువాత జయమును బొందిన యింద్రుఁ డుపేంద్రునితో
వలె, లక్ష్మణసహితుఁడయి కేకయరాజు చనెను. తర్వాత రామచంద్రమూర్తి;)

రావణయుద్ధమునఁ దనకుఁ దోడ్పడమూఁగిన రాజుల

శ్రీరాముఁడు సత్కరించి పంపుట.

చ. తనదు సుహృజ్జనాగ్రణిఁ బ్రతర్దనుఁ గాశిపతిన్ దయారతిన్

జనవునఁ గౌఁగిటం బొదివి ॰ శుష్మవర! ప్రీతియు నిండు నెయ్యమున్

గనఁబడఁగా మహోద్యమము ॰ కైకతనూభవుతోడఁ జేసి తే

మని నిను మెచ్చువాఁడ సుగుణాభరణా! పురి కేగి వచ్చె దే. ౮౬౬

అర్థములు. సుహృజ్జనాగ్రణిన్=స్నేహితులయందు శ్రేష్ఠుని, మహోద్యమము=గొప్పప్రయత్నము.

ఈప్రతర్దనుఁ డను కాశిరాజు రామచంద్రమూర్తి మిత్రుఁడు. సీతాహరణవార్త విని భరతుని యొద్దకు వచ్చి లంకపై దండెత్తుటకు రాజుల నెల్లఁ బిలిపింపుమని పెద్ద ప్రయత్నము చేసినవాఁడు.

తా త్ప ర్య ము

(తనకు ముఖ్య మిత్రుఁడును కాశిరాజు నగు ప్రతర్దనునిఁ బ్రేమమీఱఁ గౌఁగిలించుకొని నెచ్చెలీ! ప్రేమయు స్నేహము ప్రకటమగునట్లు భరతునితోఁ జేరి గొప్ప ప్రయత్నము చేసితివి. నిన్నెమని మెచ్చుకొనఁ గలను; పురమునకుఁ బోయి వచ్చెదవా?)

క. తోరణయుతమై సుప్రా, కారావృత మగుచు మిగులఁ గ్రమంబగుచున్
 శూర! భవత్పరిపాలిత, వారాణసి వఱలుచుండుఁ బరమగుణాఢ్యా! ౧౬౭

అర్థములు. తోరణయుతమై=తోరణములతోఁ గూడినదై, సుప్రాకార+ఆవృతము=కోటగోడలచేఁ జుట్టఁబడినది, వారాణసి=వారాణాసి, కాశి.

తా త్ప ర్య ము

(తోరణములతో నలంకరింపఁబడి, మంచి కోటగోడలతో నావరింపఁబడి మీరు పరిపాలించు కాశీపత్తనము మిగుల నందమై యొప్పుచుండును.)

క. అని సింహాసనమును రఘుతనయుఁడు డిగి డాయ వచ్చి ధరణిపువక్షం
 బునఁ గ్రుచ్చి గౌరవోక్తుల, ననుమతి యిడ నాతఁ డరిగె నావల విభుఁడున్. ౧౬౮

తా త్ప ర్య ము

(అని సింహాసనము నుండి దిగి దగ్గఱకు వచ్చి గట్టిగా ఱొమ్మునఁ గ్రుచ్చి గౌరవముగ మంచి మాటలాడి యనుమతి సేయ నాతఁడు తన పురమున కరిగెను. ఆవల రామచంద్రప్రభువు.)

తే. మూఁడువందలనృపసత్తములను జూచి, మందహాసంబు మోమున నందగింప
 స్వీయతేజంబునను సురక్షితులు మీర, లతులసంప్రీతి నంచితి రనఘులార!

తా త్ప ర్య ము

(మూఁడువందలమంది రాజశ్రేష్ఠులను జూచి, చిఱునవ్వు మోమున నొప్పుచుండ పాపరహితులారా! మీప్రభావము చేతనే మీరు సురక్షితులు. మా యందసమానమయిన ప్రేమ నంచితిరి.)

చ. నిరతము ధర్మనిష్ఠులరు ♦ నిత్యము సత్యము నునికిపట్టులున్
వరబలశాలులుం ద్వదనుభావము తేజముచేతఁ; బంక్తికం
ధరుఁ డఘశీలి దుష్టమతి ♦ దండధరుం గన నేగె బాంధవో
త్కరములతోడఁ, దత్క్రియను ♦ గారణమాత్రమ నేను జూడఁడీ. ౭౭౦

అర్థములు. నిరతము=ఎల్లవేళ, ధర్మనిష్ఠులరు=ధర్మము నిర్వర్తించుటచే నిష్ఠగాఁ గలవారు, త్వదనుభావము=మీ మహిమ, అఘశీలి = పాపపు నడవడి గలవాఁడు, దండధరున్=యముని, బాంధవోత్కరములతోడన్ = చుట్టములతో, తత్క్రియను=ఆ కార్యమందు.

తాత్పర్యము

రాజులారా! సర్వదా మీరు ధర్మమునందు నిలుచుటచే వ్రతముగాఁగల వారు, సర్వదా సత్యమునకు స్థానములయినవారు. మిగుల బలవంతులరు. ఇట్టి మీ మహిమ చేతను తేజస్సుచేతను రావణుఁడు బంధువులతోడఁ జచ్చెను. ఆకార్యము నందు నేను గారణమాత్రమే.

క. జనకావనీశునందిని, వనముల హృత యైనవార్త ♦ భరతుఁడు విని మి
మ్మనఘాత్ములారా! పిలిపించిన వచ్చితి రెల్లరీరు ♦ స్నేహము పేర్మిన్. ౭౭౧

అర్థములు. జనకావనీశునందిని=సీత, హృత=అపహరింపఁబడినది, దీనివలన రామచంద్రమూర్తి యరణ్యములో నుండఁగా నప్పుడప్పుడు మనుష్యులఁ బంపి వారి క్షేమవార్త తెలిసికొనుచుండెనని యేర్పడుచున్నది. సీతారామలక్ష్మణులు పంచవటిలో నుండువఱకిట్లే జరగెను.

తాత్పర్యము

(అడవులలో సీత, హరింపఁబడిన సమాచారము విని భరతుఁడు మిమ్ముఁ బిలిపింపఁగా మా యందుఁడు స్నేహముచే వచ్చితిరి.)

క. ఎత్తిచనన్ రావణుపై నెత్తుకొనిన మీకు నిచట ♦ నేగెను బలునా
ళ్ళుత్తమమతులారా! మీ, రిత్తఱిఁ బురి కేగు టొప్పు ♦ నిష్టం బేనిన్. ౭౭౨

అర్థములు. ఎత్తిచనన్=దండెత్తిపోవ, ఎత్తుకొనిన=ప్రయత్నించిన.

తాత్పర్యము

(రావణుని మీఁద దండెత్తిపోవఁ బ్రయత్నించిన మీకిచ్చటనే చాల దిన ములు జరిగిపోయినవి. మీ కిష్టమేని నిప్పుడు మీమీ పత్తనములకుఁ బోవచ్చును.

క. అనవుడు నృపాలు రందఱు, జనకసుతా ప్రాణనాథుఁ స్వామా త్ములకున్
మనమున నలరి వచించిరి, వినయము నీ సహజగుణము ♦ విశ్వస్తుత్యా! ౭౭౩

అర్థములు. స్వాదు+ఉక్తులకున్=తియ్యని మాటలకు, అలరి=సంతోషించి.

తాత్పర్యము

(అని చెప్పఁగా రాజు లందఱు శ్రీరామచంద్రమూర్తి తీయని మాటలకు మనములందు సంతసించి, ఎల్లరచేఁ బొగడఁదగిన రామనృపాలా! వినయము నీ సహజ గుణమని చెప్పిరి.)

—॰ రాజులు శ్రీరాముఁ గొండాడి సెలవుగొని పోవుట ॰—

సీ. మాయదృష్టంబున ॰ మహీపతీ! సుఖముగా, వనములయం దుండి॰వచ్చితయ్య
మాయదృష్టంబున ॰ మహిమ పెంపారఁగఁ, బట్టమందితి వీవు ॰ భద్రచరిత!
మాయాదృష్టంబున ॰ మార్తుర నెల్లర, రణసీమఁ ద్రుంచితి ॰ రామచంద్ర!
మాయదృష్టంబున॰మరల భూమిసుత, గ్రహింపఁ గంటివి ॰ కౌనలేయ!

ఆ. శాత్రవులను జంపి జయశాలి వగు నిన్నుఁ, గన్నులారఁ గనఁగ॰గలిగెఁబుణ్య
మిదియే మాయభీష్ట॰మిదియె మాప్రీతియు, రమ్యసుగుణసాంద్ర॰రామచంద్ర

అర్థములు. మార్తురన్=పగవారిని.

తాత్పర్యము

రమ్యగుణసాంద్రా! రామచంద్రా! మాయదృష్టమువలన నడవుల నుండి సుఖముగా వచ్చి మహావైభవముగాఁ బట్టము గట్టుకొంటివి. యుద్ధములో శత్రువుల నందఱ జయించి సీతాదేవిని మరలఁబడయగంటివి. పనివారినిఁ దెగటార్చి గెలుపుగొన్న నిన్నుఁగన్నులారఁ గాంచఁగలిగితిమి. మా కిదియె పుణ్యము, మా యభీష్టము నిదియె. మా ప్రీతికిదియె కారణము.)

ఉ. ఎంతప్రశంసకేన్ దశర ॰ థేశ్వరనందన! నీవ యర్హుఁ డి
ట్లింతగ మమ్ము మెచ్చి వచి॰యించెదవేమన? నిట్టి చర్య నీ
కెంతయు యోగ్య మీకరణి॰నేని వచింపఁగ మేము నేర, మో
చింతిత సత్ఫలప్రద విశిష్ట చరిత్రక! పోయి వత్తుమే? ౧౭౮

అర్థములు. ప్రశంసకున్=పొగడ్తకు, చింతిత=కోరిన, సత్ఫల=మంచి ఫలములను, ప్రద=ఇచ్చువాఁడా.

తాత్పర్యము

(దశరథ రాజనందనా! రామచంద్రా! యెంతటి పొగడ్తకయినను నీవేతగిన వాఁడవు. మమ్మింతగా మెచ్చి పలికెదవు, ఏమనగలము? ఇట్టిచర్య నీకే యోగ్యమైనది. ఈ విధముగానైన మేము మాటలాడఁగలమా? కోరిన మంచి ఫలమిచ్చు వాఁడా! పోయి వత్తుమా!)

క. ఒకట్టి మాకోరిక మే, మొక్కరణిని నిన్నునిరతి మెద నుంచెదమో
యక్కరణిని నీవును మము, నక్కఱ మది నిలుపవయ్య యవనిసుతేశా! ౮౭౬

తాత్పర్యము

భగవంతుని మన మెంత ధ్యానించినను నది యాయన మనస్సున కెక్కదేని వ్యర్థము. కావున మేము నిన్నుఁదలఁచునట్లు నీవు మమ్మును వీరు మనవారని స్మరింపుమని భావము. మేము నీవార మనినట్టు మీరు నావారని యనవలయునని ప్రార్థన.

క. అన నట్టుల కానిండని, జనవరుఁడు వచింపవారు సమ్మదము నా
తని చే సత్కృతు లగుచుం, జని రాత్మపురంబులకును సైన్యంబులతోన్. ౮౭౭

తాత్పర్యము

(అని చెప్పఁగా 'నట్టులేకానిం'డని రామచంద్ర ప్రభువు పలుకఁగా, వారా తని చే సత్కరింపఁబడి సేనలతోఁ దమ తమ పట్టనములకుఁ బోయిరి.)

—* సకలరాజులు వారి వారి రాజ్యంబులకుఁ బోవుట *—

క. భరతుని యానతిచొప్పున, ధరణీశులు దెచ్చియున్న ధ్వజినీచయముల్
కరితురగము లక్షోహిణు, లరు దారఁగ నడఁచెఁ బుడమి యాకంపింపన్. ౮౭౮

అర్థములు. ధ్వజినీచయముల్=సేనాసమూహములు ఆకంపిపన్=వణఁకఁగా.

తాత్పర్యము

(భరతుని యాజ్ఞననుసరించి రాజులు కొనివచ్చిన సేనాసమూహము లేనుఁగులు, గుఱ్ఱము లక్షోహిణుల కోలఁది భూమి వణఁకునట్లు నడచెను)

సీ. అప్పుడు దర్పబలాన్వితుల్ భూపతుల్, పలికి రొండొరులతో భరతుఁ డకట
రణమునకై మమ్ము రప్పించు టదియెల్ల, వ్యర్థమై పోయె దశాస్యుపోరుఁ
గనమైతి మసురుల క్ష్మావరు లేశీఘ్రు, మునఁజంపి వైచిరేమనఁగ వచ్చు
రామసౌమిత్రులప్రాపునఁ జింత లే, కంబుధి దాఁటి ప్రత్యర్థి వితతిఁ

తే, దునుమఁజాలమె యని కొంద అనుకొనంగఁ
గొంద అవనీశ చరిత లానందయుక్తిఁ
బలికికొంచును ధనధాన్యపటలపూర్ణ
రాష్ట్రములకేగి రామహర్షంబు పొంటె. ౮౭౯

అర్థములు. దర్పబలాన్వితుల్=బలగర్వముతోఁ గూడినవారు, ప్రత్యర్థి వితతిన్=శత్రుసమూహమును, ధనధాన్యపటల = ధనముయొక్కయు ధాన్యము యొక్కయు సమూహముచే, పూర్ణ=నిండిన, రాష్ట్రములకు=రాజ్యములకు, రామ హర్షంబు పొంటెన్=రామునికి సంతోషము కలిగించుకొఱకు.

తా త్ప ర్య ము

(అప్పుడు బలగర్వముతోఁగూడిన రాజులొండొరులతోఁ భరతుఁ'డయోధ్య మనలను యుద్ధమునకై రప్పించెను. కాని వ్యర్థమై పోయినది కాదా. రావణుని యుద్ధము చూడమైతిమి. అసురులను రాజుతే శీఘ్రముగఁ జంపివేసిరి. ఏమన వచ్చును? రామలక్ష్మణు లండగా నుండిన మనమెట్టి చింతలేక సముద్రము దాఁటి, శత్రువులఁ జంపలేమైతిమా?' యని కొందఱనిరి, కొందఱు రామ ప్రభువు చరిత్రము లానందముతోఁ జెప్పికొనుచు, ధనధాన్యరాసులతో సమృద్ధమైయున్న తమ రాజ్యములకు రామునికి సంతోషము కలిగించుకొనుఁబోయి.)

ఉ. స్యందన వాజివారణ మ౹హా రమణీచయ యానసంతతుల్
చందనలేపనంబులును ౹ సర్వవిభూషణ మౌక్తికంబులున్
సుందరులైన దాసులును ౹ జొక్కపుఁ గంబళము ల్ప్రవాళముల్
వందలుగా సభక్తిక ము౹పాయనరాజుల నిచ్చి రందఱున్. ౨౨౦

అర్థములు. స్యందన=రథములయు, వాజి=గుఱ్ఱములయు, వారణ=ఏనుగులయు, మహార్హ=మిగుల వెలగల, మణీచయ=రత్నసమూహములయు, యాన=వాహనములయు, సంతతుల్ = సమూహములు, చందన లేపనంబులును=పూసికొనుట కుపయోగపడు గంధను లోనైనవియు, స్వర్ణవిభూషణ = బంగారు సొమ్ములు, మౌక్తికంబులున్=ముత్తెములును, ప్రవాళముల్ = పగడములును, సభక్తికము=భక్తితోఁ, ఉపాయన రాజులన్=కానుకల సమూహమును.

తా త్ప ర్య ము

రథములను గుఱ్ఱములను ఏనుఁగులను వెలగల రత్నములను వాహనములను శ్రీగంధాదులు మైపూఁత వస్తువులను బంగారు సొమ్ములను ముత్తెములను అందగత్తెలగు దాసీజనులను మంచి కంబళ్ళను పగడములను నూర్లకొలఁదిగాభక్తితోఁ గానుక లిచ్చిరి.

తే. భరతలక్ష్మణశత్రుఘ్ను ౹ లరుసమునను, వానిగైకొని పురిఁజేర౹వచ్చి రామ విభున కిచ్చిరి వేర్వేఱ౹విశదపఱిచి, రాముఁ డవియెల్ల గ్రహియించి౹రాగమునను.

తా త్ప ర్య ము

(భరత లక్ష్మణ శత్రుఘ్నులు సంతోషముతోఁ దీసికొని పత్తనమునకు వచ్చి వేఱువేఱ వానినెల్ల విశదపఱిచి రామ ప్రభువునకు సమర్పించిరి. రామచంద్రమూర్తి యవి యన్నియు ననురాగమున గ్రహించె.)

—* శ్రీరాముఁడు సుగ్రీవాంగదహనుమదాదుల బహూకరించుట *—

చ. ఒసఁగెను భాస్కరాత్మజున • కుత్తమ మన్యము భూషణాళి రా
క్షసపతి కిచ్చె వెండియును • జారువిభూషణముల్ వనాటరా
క్షసతతికీయ నందఱును • సంతసమార శిరఃకరంబులం
దసదృశభక్తిఁ దాల్ప వసు•ధాధిపుఁడుం బరిహృష్టచిత్తుఁడై. ౪౪౨

అర్థములు. భాస్కరాత్మజునకున్=సుగ్రీవునకు, చారు=మనోహరములైన; భూషణముల్=ఆభరణములు, శిరఃకరంబులన్ =శిరస్సులంకుంచుకొనఁ దగినవి శిరస్సులంను, చేతులం దుంచుకొనఁ దగినవి, చేతులందు=కడియములు ఉంగరములు బాహుపురులు లోనైనవి, పరిహృష్ట=మిగుల సంతోషించిన, చిత్తుఁడై= మనస్సుగలవాఁడై.

తాత్పర్యము

ఇదివఱ కిచ్చినవిగాక యిప్పుడు మరల సుగ్రీవునకు నాభరణము లిచ్చెను అట్టులే విభీషణునకును వానరులకు రాక్షసులకు నాభరణము లీయఁగా వారు తలలందుఁ జేతులందు వాని నసమాన భక్తితో ధరింపఁగా రామచంద్రమూర్తి మిగుల సంతోషించెను.

క. అంగదహనుమంతుల నుత్సంగంబునఁ జేర్చి సూర్య•తనయునితో నీ
యంగదుఁడు నీసుతుం డఁట, సంగాతియు మంత్రి పవన•జాతుఁడు నీకున్. ౪౪౩

అర్థములు. ఉత్సంగంబునన్=తొడలయందు, సంగాతి=సహాయుఁడు.

తాత్పర్యము

అంగదుని హనుమంతుని దొడలపైఁ గూర్చుండఁబెట్టుకొని సుగ్రీవునితో నిట్లనియె. ఈయంగదుఁడు నీకొడుకఁట! ఈహనుమంతుఁడు నీకు మంత్రి సహాయుఁడునఁట. వీరిరువురు నీకు.

ఉ. మేలగుయోజన ల్దెలిపి • మేలు దలంచుచు నుంద్రు, నాకు స
చ్చీలురు వీర లిర్వురు వి•శేషము పూజ్యత త్వన్నిమిత్తమై
పోలఁగఁ గాంచ నర్హులని • భూషణముల్ తనమేనివెల్ల భూ
పాలుఁడు వారికిం దొడిగె • వానరులెల్లరు మేలు మే లనన్. ౪౪౪

తాత్పర్యము

మంచియాలోచనలు దెలిపి నీకు మేలుగలుగు నాలోచనలే చేయుచుందురు. నాకో వీర లిరువురు నీనిమిత్తముగ విశేషముగ గౌరవింపఁబడఁదగినవారు అనితాను ధరించి యుండిన యాభరణము లన్నియుఁ దీసి వారి దేహముల నలంకరించెను. చూచిన వానరు లందఱు మేలు మేలని రామచంద్రమూర్తిని బొగడిరి.

సీ. పదపడి నలనీల•పనసకేసరిగంధ, మాదనకుముదుల • మైందు ద్వివిదు
జాంబవంతుని నింద్ర•జాను దరీముఖు దధిముఖు సన్నాద•తరుచరేంద్రు
వినతు సుషేణు ధూ•మ్రుని దధిముఖునిఁ బ్ర•జంఘు గవాక్షుని•సారబలుని
వినుతవీర్యుల మహా•విక్రమశీలురఁ, బతికార్యసాధన•రతులఁ గీశ

తే. యూథపులఁగాంచి తియ్యని•సూక్తులొప్ప, నాకు నెయ్యురుమీరెల్ల•నాదుతనువు
సోదరులయట్టివారలు•శూరులార!, యేమి ప్రతికృతి సెయనే•నేమిసేర్తు?౧౧౫

అర్థములు. పతి కార్యసాధన రతులన్=తమరాజుపని నెఱవేర్చుటయందుఁ బ్రీతిగలవారిని, యూథపులన్=యూథములకు నాయకు లగువారిని, నెయ్యురు=మిత్రులరు, నాదు తనువు సోదరులు=నాకు నా దేహము తమ్ము లెట్లో మీరు నట్టివారు, ప్రతికృతి=ప్రత్యుపకారము.

తాత్పర్యము

(తరువాత నలుని, నీలుని, పనసునిఁ, గేసరిని, గంధమాదనుని, కుముదుని, మైందద్వివిదులను, జాంబవంతుని అంగదుని, దరీముఖుని, దధిముఖుని, సన్నాదుని, వినతుని, సుషేణు, ధూమ్రుని, దధిముఖుని, ప్రజంఘుని, గవాక్షుని, పొగడఁ దగి వీర్యముగలిగి, మహా పరాక్రమము గలవారినిఁ దమ రాజుపని నెఱవేర్చుట యందుఁ బ్రీతిగల వారిని యూథనాయకులను జూచి తియ్యని మాటలతో శూరులారా! నాకు మీరు స్నేహితులరు. నాకు నా దేహము, నా తమ్ము లెట్టివారో మీరు నట్టివారు-మీకుఁ బ్రత్యుపకారము చేయ నాచేత నేమగును?)

ఉ. అంత మెఱుంగరాని వ్యస•నాబ్ధిని మున్గి తపించు నన్ను వి
క్రాంతి సముద్ధరించితిరి • కాఁగల దెయ్యది దానిపాటి? మీ
యంతలు నెయ్యురైన తప•నాత్మజుభాగ్యమెభాగ్య మౌర! స
త్స్వాంతముచేత నాయిడెడి•స్వల్పము మీరు పరిగ్రహింపరే ౧౧౬

అర్థములు. విక్రాంతిని=మీ విక్రమముచేత, సముద్ధరించితిరి=మునుఁగకుండ రక్షించితిరి, సత్స్వాంతముచేతన్=మంచి మనస్సుతో, పరిగ్రహింపరే = తీసికొనుఁడు.

తాత్పర్యము

దరికానరాని శోక సముద్రము నందు మునిఁగియుండిన నన్ను మునుగకుండ మీ పరాక్రమముచేత లేవఁదీసితిరి. నే నేమిచేసిన దానితో సమానము కాఁగలదు? మీయంతటివారు మిత్రులయిన సుగ్రీవుని భాగ్యమే భాగ్యము? మీ యోగ్యతకుఁ దగినంత నే నీయఁజాలను, నే నిచ్చు నల్పమును, మీరు మంచి మనస్సుతో గ్రహింపవలయు నని కోరెదను.

చ. అనుచు యథార్హరీతి మణు ◊ లాభరణంబు లొసంగి కౌఁగిటం
జనవరుఁ డందఱం బొదివి ◊ సమ్మదవారిధిఁ దేల్చె నీగతిన్
దనివి సనంగఁ దేనియలు ◊ ద్రావుచు మాంసఫలాళి మెక్కఁగన్
జనియెను సాగ్రమాసము క్షణంబు బనఁ; రాక్షసకీశ పాళితోన్. ౪౪౭

అర్థములు. యథార్హరీతిన్ = వారి వారి యోగ్యతకుఁ దగినట్లు, సాగ్ర మాసము=నెలపైనవారము, నెలమీఁద ౭, ౮ దినా లని గోవిందరాజీయము.

తాత్పర్యము

(అని చెప్పుచు వారి వారి యోగ్యతకుఁ దగినట్లు మణులు ఆభరణములు నిచ్చి వారి నందఱ రామచంద్ర ప్రభువు కౌఁగిలించుకొని, సంతోష సముద్రమునఁ దేలియాడఁ జేసెను. ఈ ప్రకారము తృప్తిదీఱఁ దేనెలు త్రాగుచు, మాంసములు ఫలములు మెక్కుచునుండ నొక నెలపైన వారము వారికి క్షణమువలెఁ గడచి పోయెను.)

క. అవనీవిభుఁడు వినోదం, బవురీతిని గడుపుచుండ ◊ నట్టులె చనె రెం
డవశిశిరమాస మీగతి నవిరళసుఖపరత వార ◊ లలరుచు నుండన్. ౪౪౮

అర్థములు. రెండవ శిశిర మాసము=శిశిర ఋతువునందలి రెండవ నెల యనఁగా ఫాల్గునమాసము, అవిరళ=దట్టమైన, సుఖపరతన్=సుఖాసక్తిచే, అల రుచున్=సంతోషించుచు.

చైత్రమునఁ బట్టాభిషేకము ఫాల్గునము వరకు వానరాదు లుండుటచే నొక సంవత్సర ముండిరని యేర్పడుచున్నది.

ఈ ప్రకారము రామచంద్రమూర్తి వినోదముగా వానరులతోడఁ గడపు చుండ శిశిరఋతు వగు నెలలలో రెండవనెల యగు ఫాల్గునము గడచెను.

—౦ శ్రీరాముఁడు సుగ్రీవాదుల కిష్కింధ కనుచుట ౦—

సీ. సుగ్రీవుతోడ దశగ్రీవపరిపంథి, యనియెఁ గీశేంద్ర ! సురాసురులకుఁ
జేరంగరాని కిష్కింధకుఁ జను మీవు, సపరివారుండవై ◊ జాగు లేక
మంత్రియుక్తుండవై మహిఁ జక్కఁ బాలింపు, శాత్రవచయముల సంహరింపు
మీయంగదుని నితాంతాయతప్రీతితోఁ, జూడుమీ పవమానసూనునట్ల

ఆ. మహితబలుని నలుని ◊ మామ సుషేణుని, మైందు ద్వివిదు గంధమాదనునిని
దారుఁ గుముదు నీలు ◊ వీరుని శతవలి, గజు గవాక్షు శరభు గవయు ఋషభు.

అర్థములు. దశగ్రీవ పరిపంథి=రావణుశత్రువు, రామచంద్రమూర్తి, సపరివారుండవై=సేనలతోఁ గూడినవాఁడవై, నితాంతాయత ప్రీతితోన్= మిక్కిలి హెచ్చైన ప్రేమతో.

తాత్పర్యము

సుగ్రీవునితో రామచంద్రమూర్తి యిట్లనియె. సుగ్రీవా! నీవు సేనలతో కిష్కింధకుఁ బొమ్ము. మంత్రులతోఁ గలసి యాలోచించుచు భూమిని జక్కఁగాఁ బాలింపుము. విరోధుల సంహరింపుము. ఈ యంగదుని మిక్కిలి యధికప్రేమతో నాదరింపుము. ఆంజనేయు నల్లే చేయుము. విస్తార బలముగల నలుని, నీ మామ సుషేణుని, మైందుని, ద్వివిదుని, గంధమాదనుని, తారుని, కుముదుని, నీలుని, శతవలిని, గజగవయగవాక్షులను, ఋషభుని.

క. ఈకమలాసనతనయునిఁ, బ్రాకట మగుప్రేమతోడఁ ◊ బాలింపనయా
నాకై ప్రాణము లిచ్చిరి, యీకీశుల ఋణ మదెట్టు ◊ లేఁ దీర్పఁగలన్. ౪౯౦

అర్థములు. కమలాసన తనయుని=జాంబవంతుని.

తాత్పర్యము

(ఈ జాంబవంతుని మిగులఁ బ్రేమతోఁ బాలింపుము. వీరు నాకై ప్రాణము లిచ్చిరి. వీరి ఋణము నే నెట్లు తీర్పఁగలను?)

—◊ శ్రీరాముఁడు విభీషణు లంక కనుచుట ◊—

ఉ. వీరల కెప్పుడేమియును ◊ విప్రియమున్ ఘటియింపఁబోకు మం
చారఁగఁ బల్కి రాక్షసకులాధిపతిం గని యవ్విభీషణున్
ధీరచరిత్ర ! విత్తపతిదివ్యపురంబును లంక నేలుమీ
సారసుధర్మమార్గమునఁ ◊ జారుగుణా ! యవినీతిఁ బాయుచున్. ౪౯౧

అర్థములు. విప్రియమున్=ప్రియమునకు విరుద్ధమైనది, ప్రియముకానిది, విత్తపతి దివ్యపురంబును=కుబేరుని దివ్యనగరము - లంక - ఈమాట విభీషణుని ప్రశ్నమున కుత్తరము. కుబేరుని విమానము కుబేరుని కిచ్చినట్లు లంకకూడ నియ్యవలయునా? అట్లైన నే నెందుండవలయును? ఆయన నాలంక నాకిమ్మని చెప్పి పంపిన నేనేమి చెప్పుదును అని యడుగఁగానీవు లంకవిడిచి పోవలదు, లంకయందే యుండుమని చెప్పెనని గ్రాహ్యము, అవినీతి=అన్యాయ మార్గము.

తాత్పర్యము

(వీరి కెప్పుడు గాని ప్రియము కాని మాటలాడకుము. అని గట్టిగాఁ జెప్పి, రాక్షసరాజగు విభీషణునిఁ జూచి, కుబేరుని దివ్యమగు లంకాపత్తనమును శ్రేష్ఠమగు ధర్మమార్గమునఁ బాలింపుము, అన్యాయమార్గమును విడువుము.)

ఆ. ధర్మనీతి విడక ◊ ధరణీతలేంద్రు ద్రసు, బుద్ధిమంతుఁ డగుచుం బుడమి నేల
నవనిఁ బ్రాభవంబు ◊ నఖిలసంపదలును, నిత్య మతనియొద్దనిలిచియుండు. ౪౯౨

తా త్ప ర్య ము

(రాజు బుద్ధిమంతుఁడయి ధర్మమార్గమున విడువక భూమినిఁ బాలించిన దొరతనము, సమస్తసంపదలు నిత్యమతని యొద్ద స్థిరముగా నిలిచియుండును.)

క. నన్నును సుగ్రీవుని, నీ వెన్నండును మఱవ కుండుఁ • మీ నెమ్మదిఁ బొ
మ్మన్నను గపిరాక్షసతతు, లన్నన్నా మేలటంచు • నధిపుం బొగడెన్. ౮౬౩

తా త్ప ర్య ము

నన్నును సుగ్రీవుని నీ మనస్సులో నెప్పుడు మఱచిపోకు మని రామప్రభువు పలుకఁగా, రాక్షసుల సమూహము అన్నన్నా! మేలు మేలు అని రామభూపాలునిఁ బొగడెను)

క. నీమతి విధియందుంబలె, నేమంబున వెలసియుండు • నిర్వక్రంబై
నీ మాధుర్యము నీ యతులామితవీర్యంబు శక్య•మా పొగడంగన్. ౮౬౪

అర్థములు. నీ మతి=నీ మనస్సు, విధియందుంబలెన్=బ్రహ్మయందున్నట్లు, నిర్వక్రంబై=ఋజుత్వము గలదై.

తా త్ప ర్య ము

(నీ మనస్సు బ్రహ్మయందున్నట్లు ఋజుత్వము గలిగి నియమముతో నుండును. నీ మాధుర్యము నీ సాటిలేని యమితమైన నీ వీర్యమును బొగడ శక్యమా?)

—• శ్రీరాముఁడు హనుమంతునకు వరంబు లిచ్చుట •—

చ. అనునెడ వాయుసూతి వినయంబున నిట్లను రామచంద్ర! నా
మన మెదివేళ నీయెడల • మానని నెయ్యముఁ బూనుఁ గాక, నా
కనయము నీదుభక్తి చెలు•వారెడుఁ గాక, మనం బిఁ కెందునున్
జనకయ యుండుఁ గాక మహి•జాధవ! నన్ను ననుగ్రహింపుమీ. ౮౬౫

తా త్ప ర్య ము

ఈ ప్రకార మందుఁ జెప్పఁగా హనుమంతుఁ డిట్లనియె. శ్రీరామచంద్రమూర్తీ! నామనస్సు సర్వకాల సర్వావస్థలయందు నీ యందు స్నేహభావము గలది యగునుగాక! నాకు సర్వకాల సర్వావస్థల నీభక్తి తొలఁగక యుండును గాక! నిన్ను విడిచి నా మనస్సు మఱి యెందును బోకుండునుగాక! ఇట్లగునట్లు నాయందను గ్రహింపుము.

ప్రియునందుఁ బ్రియురాలికివలె నిరంతరస్మృతి స్నేహము. ఇది యైహిక విచారము. భక్తియనఁగా పరలోకగతి యని యుపాసించు బుద్ధివిశేషము. నితర

మనుటచే నీళ్ళకుఁ జేఁపకు నున్న సంబంధము నంటిది. నీళ్ళను విడిచిన చేఁపఁ బ్రతుకదుగదా. దీనికే పరమభక్తియని పేరు. ఏకాంతభక్తునకు నిష్ఠామభక్తునకు భగవత్కార్య తత్కీర్తన వర్ణనాదులు తప్ప మఱియొకటి తలఁపునకురాదు.

'యత్ర యత్ర రఘునాథ కీర్తనమ్, తత్ర తత్రకృతమస్తకాంజలిమ్' అని నేఁటికిని రామకథ ప్రస్తావింపఁబడు చోటుల నాంజనేయుఁ డుండును. ఆ కారణముచేతనే రామకథ చదువునపుడు చెప్పునప్పుడు చెప్పెడివానికెదుట నెవరు నుండరాదు. అది యాంజనేయుని స్థానమని గ్రంథములు చెప్పుచున్నవి.

క. నీదివ్యచరిత్రం బీ, మేదిని నెందాఁక నిలుచు ♦ మిహీకకులేంద్రా!
నా దేహంబునఁ బ్రాణము, లాదరమున నిలువ నిమ్ము ♦ యందాఁకఁ బతీ! ౧౭-౧౮

తపస్వులు భక్తులు దేహము నిలుపఁ గోరుట దేహాభిమానము చేతఁగాదు. దేహము సాధనము, వాహనమనియు దానిని విడిచినచో నేకార్యము చేయసాధ్య పడదనియు మఱియొక జన్మమనిన నెంతోకాలము వ్యర్థమగుననియుఁ గావున సాధింపవలసినది సమగ్రముగ నొక జన్మమందే సాధించుట యుక్తమనియు అల్పాయువైనచో నది సాధ్యపడ దనియుఁ గాపున దీర్ఘాయువు కావలయుననియుఁ గోరుదురు. ఇట్టిదే సంధ్యయందును మంత్రము గలదు. నీనామామృత పానమున జీవింతు నని భావము.

తాత్పర్యము

(ప్రభో! రామచంద్రా! మీదివ్య చరిత్ర మీ భూమి మీఁదఁ నెందాఁక నిలుచునో యందాఁక నా దేహమునఁ బ్రాణములు నిలుచునట్టు లాదరమున వరమిమ్ము)

క. అచ్చరలు నీ చరిత్రము, సచ్చరితా! వినుచువారు ♦ సత మది వినుటన్
హెచ్చగు నుత్కంఠను నే, వ్రచ్ఛేద ననిలుండు మేఘ♦పటలంబు ననన్. ౧౯-౨౦

అర్థములు. ఉత్కంఠను=రామచంద్రుని నెప్పుడు చూతునా యను తహతహపాటు, నిన్ను విడిచియుండు సంకటము నీపాటలు మాటలు చెప్పఁగా విని తొలఁగించెదను.

ఇట్లు చెప్పుటచే భక్తులకు మోక్షసుఖముకంటె నెక్కువసుఖము భగవన్నామామృత రసాస్వాదనంబునఁ గలదని తెలియనగు. 'సత్యం శపే వారణశైల నాథ! వైకుంఠవాసేపి న మేఽభిలాష'అని కదా భక్తుఁడు చెప్పును.భగవత్కథా శ్రవణముండెనేని దర్శనముతోఁ బనిలేదు. అది లేదని విచారముపడఁ బనిలేదు. దర్శనమున కంటె శ్రవణమే శ్రేష్ఠము.

చ. అనవుడు రామభద్రుఁడు వరాసనమున్ విడి లేచి యాంజనే
యునిఁ దనకౌఁగిటం బొదివి యుత్తమరక్తి వచించె నీమనం
బునఁ గలయట్లు కాఁగలదు మోదము దాల్పుము నాచరిత్ర భూ
మిని గలదాఁకఁ గీర్తియును మేనను బ్రాణము నీకు నుండెడిన్. ౯౮

తాత్పర్యము.

(అని చెప్పఁగా, రామచంద్రమూర్తి సింహాసనము నుండి దిగి వచ్చి యాంజనేయునిఁ దన కౌఁగిటఁ జేర్చి పరమానురాగమున నీ మనసులో నున్నట్లే కాఁగలదు సంతోషింపుము. భూమియందు నా చరిత్ర యుండుదాఁకఁ గీర్తియును నీదేహమునఁ బ్రాణమును నుండుఁగాక యని వచించెను.)

ఇది రామచంద్రమూర్తి యమానుషత్వమును దెలిపెడిని. ఇట్టి వరమిచ్చుటకుఁ దక్కిన వారి కెవ్వరి కధికారము గలదు?

క. లోకంబు లుండుదాఁకను, నాకీర్తియు నిలిచియుండు నా ప్రాణములన్
నీకొక్కొకయుపకృతికే, యోకేసరితనయ! యీయఁ నో పనివడినన్. ౯౯

తాత్పర్యము

(ఓ యాంజనేయా! లోకములుండు నంతవఱకు నా కీర్తియు నిలిచి యుండును. నీవు చేసిన యొక్కొక్క యుపకారమునకే పని పడినచో నా ప్రాణముల నీయకుందునా?)

క. ఉపకృతి చేసినవానికి, నుపకారముఁ జేయఁదలఁచు చుండుట తానా
యుపకారి యాపదం గనఁ, గపివర! ధ్యానించుచుంట గాదే యరయన్. ౧౦౦

తాత్పర్యము

ఉపకారము చేసిన వానికి మరల నే నెప్పు డుపకారము చేయుదునా యని తలఁచుచుండరాదు. ఏలన వాని కీడు కోరిన వాఁ డగును కావున, వానికి నేదైన కీడువచ్చినఁగదా తన యుపకారముతోఁ బనిపడును. వాని కెప్పుడు కీడువచ్చునా, ఎప్పుడు నే నుపకారము చేయుదునా యనుకొనుట సరిగాదు. పరోపకారము కోరఁదగిన దశ రాకుండ వలయునని కోరవలెను.

క. అని చంద్రాభము హారం, బనుపమ వైదూర్యతరళ మాత్మగ్రీవం
బుననుండి తీసి కంఠం,బున వయిచెన్ గంధవహునిపుత్రున కర్థిన్. ౧౦౧

అర్థములు. చంద్రాభము=కాంతియందు చంద్రునితో సమానమైనది, అనుపమ=అసమానమైన, వైదూర్యతరళము=వైదూర్యములుగల పతకముగలది ఆత్మగ్రీవంబుననుండి=తనకంఠమునుండి, గంధవహుని పుత్రునకున్=వాయుపుత్రునకు, అర్థిన్=ప్రేమతో.

తా త్ప ర్య ము

వైదూర్యముల పతకము చంద్రకాంతిగల హారమును తన మెడలో నుండి తీసి రామచంద్రమూర్తి హనుమంతుని కంఠంబున నిండు ప్రేమతో వైచెను.

క. ప్రాలేయకిరణబింబము, మౌళిని ధరియించు కనక॥మహీధర మనఁగా
మాలాదీపితతనుఁడై, వాలాయము పవనసుతుఁడు ॥ ప్రభ రాణించెన్. ౯౦౨

అర్థములు. ప్రాలేయ కిరణబింబము=మంచుకిరణములు గల చంద్రబింబమును, మౌళిని=శిరస్సున, కనక మహీధరము = బంగారుకొండ, మాలాదీపిత తనుఁడై =హారముచేఁ బ్రకాశించు దేహము గలవాఁడై, వాలాయము=విశేషముగ

తా త్ప ర్య ము

ఆ మాలికను గంఠమంను ధరించిన హనుమంతుఁడు మంచుకిరణములుగల చంద్రబింబముచే మేరుపర్వతమువలె రాణించెను.

క. రామునివాక్కులఁ గీశ, స్తోమము విని లేచిలేచి॥తోరపుభక్తిన్
రాముని పదకంజములకు, వేమఱు నతులన్ ఘటించి ॥ వెడలెను బోవన్. ౯౦౩

అర్థములు. కీశస్తోమము=వానర సమూహము.

తా త్ప ర్య ము

(రాముని మాటలను విని వానరులగుంపు లేచి లేచి యధికమగు భక్తితో శ్రీరామచంద్రమూర్తి శ్రీపాదపద్మములకు ననేక పర్యాయములు దండము సమర్పించి పోవుటకు బయలు దేఱెను.

ఉ. భానుజుఁడున్ విభీషణుఁడుఁ ॥ బార్థివవర్యుడుఁ దమ్ముఁ గౌఁగిటన్
మానని రక్తిఁ జేర్చి బహు॥మానపురస్సరసాంత్వవాక్కులెం
తేఁ నయమారఁ బల్కఁ గను॥నీళ్ళను గార్చుచు మూఢులై ధరా
జానిని బాసిపోవుటకు ॥ సమ్మతి లేక తపించుచుండగన్. ౯౦౪

అర్థములు. బహుమాన పురస్సర=గౌరవ పూర్వకములైన, సాంత్వన వాక్కులు=సమాధాన వాక్యములు, మూఢులై=ఏమియుఁ దెలియనివారై, ధరాజానిని=రాజును, రామచంద్రుని.

తా త్ప ర్య ము

(రామచంద్రమూర్తి తమ్ముఁ గౌఁగిలించుకొని యపరిమితానురాగముతో గౌరవ పూర్వకముగ సమాధానవాక్యములు స్నేహముమీఱఁ బలుకుచుండఁగాఁ సుగ్రీవుఁడును విభీషణుఁడును గన్నీరు కార్చుచు నేమియుఁ దెలియనివారై రామ ప్రభువును వదలిపెట్టి పోనిష్టములేక పరితపించుచుండగా.)

అర్థములు. ముదల=ఆజ్ఞ, ఆమోదముతోడన్=సంతోషముతో, నన్ను జయించి రావణుఁడు నిన్ను హరించెను. గావున రావణుదాన వైతివి. రావణుని రామచంద్రమూర్తి జయించెను కావున రామచంద్రమూర్తి దానవు గావున నాయన నీపై నెక్కి తిరుగఁదగినవాఁడు.

తాత్పర్యము

(నీవు రామచంద్రుని దానవు- మరల నీవక్కడికే పొమ్ము-నేనాజ్ఞ యిచ్చితిని. ఆ మహనీయుఁడు సంతోషముతో నీ మీఁద నెక్కి తిరుగఁ దగినవాఁడు అని చెప్పఁగా,)

ఉ. వచ్చితి నిందు రాఘవ! ప్రభావమునం గనరాక యెరికిన్
నిచ్చఁ జరించుచుందు నవనీతనయేశ! త్వదాజ్ఞచేత నీ
యిచ్చకు వచ్చునట్లన మహీపతి యట్లగు నేని నీకు నే
నిచ్చెద స్వాగతంబు కొనుమిూ యనుచున్ సుమధూపలాజలన్. ౯౦౮

అర్థములు. సుమధూపలాజలన్=పూలు, ధూపము, పేలాలు.

తాత్పర్యము

(రామచంద్రా! యిచ్చటకు వచ్చితిని. నీ యాజ్ఞచేత నా ప్రభావమున నెవరికిని గానరాకుండ నీ యిష్టము వచ్చిన రీతి సంచరించెదను. అని చెప్పఁగా, శ్రీరామభూపాలుఁ డట్టులయినచో, నేను నీకు స్వాగతమిచ్చెదను. గ్రహింపుము- అని చెప్పుచుఁ బూలు, ధూపము, పేలాలు- మొదలగువానితో)

ఆ. పూజచేసి యనియెఁ బుష్పకంబా! నిన్నుఁ గెలసమున్న వేళఁ దలఁచువాఁడ
నపుడు రమ్ము యంత కరుసంబుతో నీవు తిరుగు మడ్డులేక సురపథమున.

అర్థములు. కెలసము=కార్యము, అంతకున్=నేను దలఁచువఱకు, సురపథమునన్=ఆకాశమందు.

తాత్పర్యము

(పూజచేసి ఓ పుష్పకమా! పనిపడినప్పుడు నిన్నుఁ దలఁచెదను. అప్పుడు రమ్ము, అంతవఱకు నీ వాకాశమందు సంతోషముతో నడ్డులేక తిరుగుచుండుము. అని చెప్పెను.

— భరతుఁడు శ్రీరామునకుఁ బ్రజల సుఖస్థితిఁ దెలుపుట —

చ. అనవుడు నట్లకాక యని యయ్యది యేగినయంతఁ గైకయీ
తనయుఁడు లేచి కేల్మొగిచి దాశరథీ, నెలమొక్కడంతలోఁ
గనుఁగొన నీవు దేవుఁడవుఁగాఁ గనిపించెదు, వీతరోగులై
మనుగడ గూడి రెల్లరు నమానుషసత్త్వము లారఁ బల్కెడిన్. ౯౧౦

అర్థములు. ముదల=ఆజ్ఞ, ఆమోదముతోడన్=సంతోషముతో, నన్ను జయించి రావణుఁడు నిన్ను హరించెను. గావున రావణుదాన వైతివి. రావణుని రామచంద్రమూర్తి జయించెను కావున రామచంద్రమూర్తి దానవు గావున నాయన నీపై నెక్కి తిరుగఁదగినవాఁడు.

తాత్పర్యము

(నీవు రామచంద్రుని దానవు- మరల నీవక్కడికే పొమ్ము- నేనాజ్ఞ యిచ్చితిని. ఆ మహనీయుఁడు సంతోషముతో నీ మీఁద నెక్కి తిరుగఁ దగినవాఁడు అని చెప్పఁగా,)

ఉ. వచ్చితి నిందు రాఘవ! ప్రభావమునం గనరాక యేరికిన్
నిచ్చఁ జరించుచుందు నవనీతనయేశ! త్వదాజ్ఞచేత నీ
యిచ్చకు వచ్చునట్లన మహీపతి యట్లగు నేని నీకు నే
నిచ్చెద స్వాగతంబు గొనుమీ యనుచున్ సుమధూపలాజలన్. ౯౦౮

అర్థములు. సుమధూపలాజలన్=పూలు, ధూపము, పేలాలు.

తాత్పర్యము

(రామచంద్రా! యిచ్చటకు వచ్చితిని. నీ యాజ్ఞచేత నా ప్రభావమున నెవరికిని గానరాకుండ నీ యిష్టము వచ్చిన రీతి సంచరించెదను. అని చెప్పఁగా, శ్రీరామభూపాలుఁ డట్లులయినచో, నేను నీకు స్వాగతమిచ్చెదను. గ్రహింపుము- అని చెప్పుచుఁ బూలు, ధూపము, పేలాలు- మొదలగువానితో)

ఆ. పూజచేసి యనియెఁ ◦ బుష్పకంబా! నిన్నుఁ, గెలస మున్న వేళఁ ◦ దలఁచువాఁడ
నపుడు రమ్ము యంత ◦ కరుసంబుతో నీవు తిరుగు మడ్డులేక ◦ సురపథమున.

అర్థములు. కెలసము=కార్యము, అంతకున్=నేను దలఁచువఱకు, సురపథమునన్=ఆకాశమందు.

తాత్పర్యము

(పూజచేసి ఓ పుష్పకమా! పనిపడినప్పుడు నిన్నుఁ దలఁచెదను. అప్పుడు రమ్ము, అంతవఱకు నీ వాకాశమందు సంతోషముతో సడ్డులేక తిరుగుచుండుము. అని చెప్పెను.

—◦ భరతుఁడు శ్రీరామునకుఁ బ్రజల సుఖస్థితిఁ దెలుపుట ◦—

చ. అనవుడు నట్లకాక యని ◦ యయ్యది యేగినయంతఁ గైకయీ
తనయుఁడు లేచి కేల్మొగిచి ◦ దాశరథీ, నెలయొక్కఁ డంతలోఁ
గనుఁగొన నీవు దేవుఁడవుగాఁ గనిపించెదు, వీతరోగులై
మనుగడ గూడి రెల్లరు నరమానుషసత్త్వము లారఁ బల్కెడిన్. ౯౧౦

అర్థములు. మనుగడ=బ్రతుకు, తెరువులమానుష సత్త్వము=దేవతలకు సంబంధించిన జీవములు, పుష్పకము లోనైనవి. నీవు దేవుడవు కాకుండిన పట్టాభిషేకమైన నెలలోనే యిట్టి యాశ్చర్యకార్యములు జరుగునా?

తాత్పర్యము

(అని యానతీయఁగా, నది 'మహాప్రసాద' మని పోవఁగా, నంతట భరతుఁడు లేచి, నమస్కరించి, దాశరథీ! నీవు దేవుఁడవుగాఁ గనుపించుచున్నావు. పట్టాభిషేకమైన నెలలోనే యందఱు, రోగములు లేక జీవనము కలవారయి యున్నారు. దేవతలకు సంబంధించిన పుష్పకము మున్నగు జీవనములు మాటలాడుచున్నవి. నీవు దేవుఁడవే కానిచో నిట్టియాశ్చర్యము కలుగునా?)

ఆ. పూర్ణ వార్ధకమునఁ◆జీర్ణ మయ్యును మేను మరణభయము లేదు◆మానవతులు
నెగులు దిగులు లేక ◆ నీళ్ళాడుచున్నారు, ప్రజలు బలిసి యున్న◆వార లెందు,

అర్థములు. పూర్ణ వార్ధకమునన్=నిండు ముసలితనముచే, జీర్ణము=శిథిలము మేను=దేహము, మానవతులు=స్త్రీలు, నెగులు=బాధ.

తాత్పర్యము

నిండు వయస్సుచేఁ బండ్లు వలెనైనను మనుష్యులు మరణించుట లేదు. స్త్రీలు ప్రసవవేదనగాని, గర్భము పోవునో, శిశువు పోవునో గర్భవతియే పోవునో యను భయములేక ప్రసవించుచున్నారు. మనుష్యులు దేహపుష్టి మనస్సంతుష్టిగల వారై యున్నారు.

ఉ. మానవకోటు లెందు నసమానముదంబునఁ గ్రాలుచుండెడున్
వానలు కారునం దొనరె ◆ వాయువు లెల్లెడ వీచె హాయిగా
నీనృపుఁడే స్థిరంబుగ మహీపతి యై యలరారుఁ గాక యం
చీ నెఱి నెల్లవారు వచియించెద రన్న ముదంబుఁ గాంచుచున్. ౧౧౨

అర్థములు. అసమానముదంబునన్=ఎందు నెవ్వరికిలేని సంతోషముచే, కారునన్=ఏయే సమయములఁ గురియవలయునో యాయా యదనులందు, ఈ నెఱిన్=ఈ విధముగా.

తాత్పర్యము

(మనుష్యు లెందును సాటిలేని సంతోషమున నలరారుచున్నారు. వాన లేయేసమయములందుఁ గురియ వలయునో యాయాయదనులందుఁ గురియుచున్నవి. వాయువన్నిస్థలములందు హాయిగా వీచుచున్నది. ఈ నరపాలుఁడే స్థిరముగాభూమిపాలన మొనర్చుచు రాజై యానందపూర్ణుఁడై యుండుఁ గాక యని జనులీవిధముగాఁ జెప్పుకొనుచున్నారు. అని చెప్పఁగా సంతోషమును గాంచుచు,)

—• శ్రీరాముఁ డశోకవనంబున సీతాదేవితోఁ గ్రీడించుట •—

సీ. చందనాగరుచూత•మందారపున్నాగ, పనసకాలేయక • పారిజాత
చంపకదాడిమ•జంబూ ప్రియంగు నీ, పార్జున సప్తప•ర్ణాతిముక్త
తుంగకకదలిమ•ధూకనాగకదంబ, భూజముల్ సర్వదా•పుష్పగుచ్ఛ
ఫలసమానతము ల•బ్బంగిని దివ్యముల్, శిల్పి కల్పితములు•చెన్నుమీఱ

తే. మత్తహిందోళఝంకార•మానితంబు, భృంగరాజవనప్రియ•హృద్యవివిధ
వర్ణపక్షిమనోజ్ఞంబు • స్వర్ణహేతి, మేచకాంజననిభనగ•మేదురంబు. ౯౧౩

అర్థములు. చందన=శ్రీగంధము, చూత=మామిడి, కాలేయక=గంధకాష్ఠ విశేషము పరిమళించు నొక విధమైన చెక్క, ప్రియంగు=ప్రేంకణము, నీప=మంకెన అర్జున=మద్ది, సప్తపర్ణి=ఏడాకుల యరఁటి, అతిముక్త = పువ్వుల కురువింద, తుంగక=జమ్మి, కదళి=అరఁటి, మధూక=ఇప్ప, నాగ=పొన్న, కదంబ=కడప, భూజముల్=చెట్లు, పుష్పగుచ్ఛఫలసమానతములు=పూల గుత్తులతోను ఫలముల తోను గూడినవి, మత్త=మదించిన, హిందోళ-తుమ్మెదలు, ఝంకారమానితం బులు=ఝుమ్మను ధ్వనులచే నొప్పినవి, భృంగరాజ=గండు తుమ్మెదలయు, వన ప్రియ=కోకిలలయు, హృద్య=మనోహరములైన, వివిధ=పలు తెగలుగల, వర్ణ= వన్నెలు గల, పక్షి=పక్షులచే, మనోజ్ఞంబు=ఇంపైనది, స్వర్ణహేతి = బంగారు కాంతులుగల, మేచక=నల్లని, అంజననిభ=కాటుకతో సమానమైన, నగ=పర్వత ములచే, మేదురంబు=దట్టమైనది.

తాత్పర్యము

శ్రీగంధము, అగరు, మామిడి, మందారము, పున్నాగము, పనస, కాలేయ కము, పారిజాతము, సంపెఁగ, దానిమ్మ, నేరేడు ప్రేంకణము, మంకెన, మద్ది, ఏడాకుల యరఁటి, పువ్వుల కురువింద, జమ్మి, అరఁటి, ఇప్ప, పొన్న, కడప చెట్లును, ఎల్లప్పుడు పూలగుత్తులతో పండ్లతోఁ గూడినవియు, అటువంటి దేవతా వృక్షములు శిల్పులు కల్పించినవి యందము మీఱఁగా మదించిన తుమ్మెదల ఝుంకారముతో నొప్పినది గండుతుమ్మెదలచేతను కోకిలల చేతను ఇంపైన నానా విధములగు పక్షులచేతను మనోజ్ఞమైనది బంగారు జ్వాలలు, నల్లని కాటుక, వీనితో సమానమైన పర్వతములతో దట్టమైనది.

ఆ. సురభిపుష్పములును•సురుచిరమాల్యముల్, నిగ్గుదేఱు పెక్కు•డిగ్గియలును
మంజులంబు లైన•మాణిక్యసోపాన, కోటి స్ఫటికకలిత•కుట్టిమములు. ౯౧౪

అర్థములు. సురభీపుష్పములును=మంచివాసనగల పూవులును, సురుచిర మాల్యముల్=అందమైన పూలదండలు, డిగ్గియలు = దిగుడు బావులు, మంజు

లంబులైన=అందములైన, మాణిక్య సోపానకోటి = మాణిక్యములతోఁ జెక్కఁబడిన మెట్ల సమూహములు, స్ఫటికకలిత=స్ఫటికములతోఁగూడిన, కుట్టిమములు=ఱాతి=కట్టడపు నేలలు,

తాత్పర్యము

పరిమళించు పూవులు, అందములైన పూలదండలు మెఱయుచున్నదిగుడు బావులు, వానిలో నందముగఁ గట్టబడిన మాణిక్యముల మెట్లు స్ఫటికములు పఱచిన నేలకట్లు.

క. ఫుల్లోత్పలపద్మంబులు, సల్లలితరథాంగమిథున౦సంచయములు ను
త్ఫుల్లప్రసూనవత్తరు, లుల్లాసము గొలుపఁదీర ౦ మొప్పారంగన్. ౯౧౫

అర్థములు. ఫుల్లోత్పల పద్మంబులు=వికసించిన కలువలు, తామరలు, సల్లలిత=మిగుల మనోహరములైన, చక్రవాక దంపతుల గుంపులు, ఉత్ఫుల్ల=మిక్కిలి వికసించిన, ప్రసూనవత్తరులు=పూలుగల చెట్లు ఉల్లాసము=సంతోషము.

తాత్పర్యము

వికసించిన కలువలు తామరలు మనోహరము లయిన చక్రవాక దంపతులు పూచినచెట్లు సంతోషింపఁజేయు నొడ్డులు గలిగి.

క. సారసదాత్యూహశుకీ, వారములు మరాళములు ర౦వంబులు నింపన్
జారుతరం బగుచును న, య్యారామము మీఱె హృదయ౦హరమై శ్రీవిన్ ౯౧౬

అర్థములు. సారస=బెగ్గురులు, దాత్యూహ=వానకోయిలలు, శుకీవారములు=ఆఁడు చిలుకలు గుంపులు, మరాళములు=హంసలు, రవంబులు=ధ్వనులు, హృదయహరమై=హృదయమును నాకర్షించునదియై, శ్రీవిన్=అందపు నిక్కచే.

తాత్పర్యము

బెగ్గురులు వానకోయిలలు ఆఁడు చిలుకలు హంసములు గుంపులై ధ్వనులచే దిక్కులు నించుచుండఁగా మిగుల మనోహరమై యందమై యా యుద్యాన మతిశయించెను.

సీ. బహుళగోపంబులౌ ౦ ప్రాకారములను వి, శాలంబులౌ నునుఁజాపరాలు
వై డూర్యమణిసన్ని౦భములు పచ్చికపట్లు, క్రమముల్ పుష్పిత౦కాననములు
వినువీథి జుక్కల౦విధమున రాలపై, రాలినపూవులు ౦ రమణ మీఱ
నందనంబో బ్రహ్మ౦మందిరంబో చైత్ర, రథమొ నా మిక్కిలి౦రమ్య మగుచు

ఆ. మిసిమిమెఱయుపట్ల౦కుసుమాసనంబులు, పూవుఁబొదరుటిండ్ల౦పొలుపుఁగనిన
తన యశోకవనము ౦ దశరథతనయుంకు, చొచ్చి మెచ్చుగొలుపు౦ శుభతలమున

తాత్పర్యము

అనేకము లయిన యాకారములుగల ప్రాకారములును వెడలుపాటి చాఁపఱాలును వైడూర్యమువంటి పచ్చని పచ్చికనేలలును ఇంపుగాఁబూచిన వనములును ఆకాశమున జుక్కలనలె ఱాతిమీఁద రాలిన పూవులు కలిగి యింద్రుని నందన వనమో బ్రహ్మ మందిరమో కుబేరుని చైత్రరథమో యనునట్లుమిగుల రమ్యమైన మిన మిన మెఱియు పూల పీఁటలు పూవుల పొదరుటిండ్లు గల తన యశోకవనమును రామచంద్రమూర్తి ప్రవేశించెను.

క. జనకసుతాహస్తంబును, దనకేల గ్రహించి వజ్రి తనసతివలెఁ బా
వనమధుమైరేయముఁ, దనివారఁగ ద్రావఁజేసెందత్ప్రియురాలిన్. ౧౮

అర్థములు. వజ్రి=ఇంద్రుఁడు, తన సతివలెన్=తనభార్యయగు శచీదేవిని వలె, మధు=తియ్యని, మైరేయము=ఆసవము, 'మైరేయ మాసవేధాత్రీధాతకీ గుడవారిభిః'=వైజయంతి, ఆరెపూలు, ఉసరిక, బెల్లపునీళ్ళుకలిపి భాపుటము వేసినది.

తాత్పర్యము

(తన ప్రియురాలగు సీతాదేవిచేయి పట్టుకొని, యింద్రుఁడు శచీదేవినివలెఁ దనివితీఱ నాసవమును ద్రావించెను.)

క. తేరఁ బనివాండ్రు ఫలములఁ జారుసుమృష్టామిషంబుఁ జవిగొనఁ బిదపన్
ధారిణీధవుసంప్రీతికి, నారఁగ నృత్యంబు గీత మటవర్తిల్లెన్. ౧౯

అర్థములు. చారు=మనోహరమైన, సుమృష్టామిషంబు = చక్కఁగాఁ బక్వమైన మాంసము, చవిగొనన్=రుచిచూడఁగా.

తాత్పర్యము

సేవకులు ఫలములను, సుపక్వములైన మాంసములను దీసికొనిరాఁగా వానిని రుచి చూచిన పిదప రాజును సంతోషపెట్టవయునని యాట పాట జరిగెను.

క. రామలు మనోభిరాములు, రాముని రంజింపఁజేయ రమణులకెల్లన్
శ్రీమహితుం డాభరణ, స్తోమాంచితుఁ డార, గూర్చెందోరపుఁదృప్తిన్. ౨౦

అర్థములు. రమణులకు=ఆటలాడి పాటలుపాడిన స్త్రీలకు, ఆభరణస్తోమ=భూషణసమూహముచే, అంచితుఁడు=ఒప్పుచున్నవాఁడు.

తాత్పర్యము

మనస్సునకు సంతోషము గలిగించు స్త్రీలాటలచే పాటలచే సంతోషము గలిగింపఁగా ఆ స్త్రీలకందఱకు రామచంద్రమూర్తి యాభరణము లిచ్చి సంతోషింపఁజేసెను.

క. సీతాసహితుఁడు కౌసల్యాతనయుఁ డరుంధతీస♦హాసీనుండై
భాతిం దనరు వసిష్ఠునిరీతిం జెన్నారె నిట్లు♦శ్రీరాముండున్. ౯ ౨౧

తాత్పర్యము

(సీతతోఁ గూడినవాఁడై శ్రీరాముఁ డరుంధతితోఁ గూడియుండిన వసిష్ఠుని రీతి నొప్పియుండెను. శ్రీరాముఁడును.)

ఆ. సురతనూజఁ బోలు ♦ ధరణీకుమారితో, నమరునట్లు సుఖము ♦ లహరహంబు
ననుభవింప నిరత♦మతిభోగదం బైన, శిశిరకాల మెల్లఁ♦జెల్లె మెల్ల. ౯ ౨౨

అర్థములు. అహరహంబు=దినదినము, అతిభోగదంబు=మిగుల సుఖకరము, శిశిరకాలము=చలికాలము.

తాత్పర్యము

(దేవకన్యవంటి సీతతో దిన దినము నొప్పిదమగునట్లు సుఖము లనుభవింపఁగా మిగుల సుఖకరమైన చలికాలమంతయు నెమ్మదిగాఁ గడచిపోయెను.)

క. వివిధభోగములను ♦ వేడుక మీఱఁగ ననుభవించు చుండ ♦ నమ్మహాను
భావులకును గడచెఁ♦ బదివేలవర్షముల్, శిశిరకాల మిట్లు♦చెల్లుటయును. ౯ ౨౩

దీనికి మూలశ్లోకమునకు గోవిందరాజు వ్యాఖ్య లేదు. తిలక కారుఁడు దీనిని ప్రక్షిప్తమని గ్రహింపవలెను లేదా యిట్లు సమాధానము కుదుర్చుకొనవలయునని వ్రాసెను. పదివేల సంవత్సరములు పదివేల దినములుగా లెక్కింపవలెను. ఇది వివాహము మొదలుకొని గణింపవలెను. అట్లయినచో అయోధ్య యందు పన్రెండు సంవత్సరములు, అరణ్యమందు పదునాలుగు సంవత్సరములు, పట్టాభిషేకానంతరము రెండు సంవత్సరములు కలిసి యిరువది యెనిమిది సంవత్సరము లగుచున్నవి. అనఁగా ౨౮ × ౩౬౫ = ౯౯౮౦ దినములగుచున్నవి. ఇరువదిదినములు తక్కువగా పదివేలు సరిపోవుచున్నవి. రామచంద్రమూర్తి రాజ్యము పాలించినది పదునొకండువేల సంవత్సరములు కావున నీ పదివేల సంవత్సరములకు దానికి సంబంధము లేదు. తిలకమునఁ జెప్పఁబడిన ప్రకారము సంవత్సరములను దినములుగా గణించిన పదునొకండువేల సంవత్సరము లనఁగా ముప్పది సంవత్సరములు ఏఁబది దినములగుచున్నవి. ఇందు సీతాదేవి వాల్మీకాశ్రమమున నుండునది పన్రెండు సంవత్సరములు నూఱు యజ్ఞములనుటకు అనేక యజ్ఞములని యర్థము గ్రహింపనగు. అప్పుడు రామచంద్రమూర్తి జీవితకాలము ౧౨+౧౨+౧౮+౩౦=౬౮,౬౯ సంవత్సరము లగుచున్నవి. రామనిర్యాణకాలమునకు కుశలవులకు పదునెనిమిది సంవత్సరముల ప్రాయమగుచున్నది.

తాత్పర్యము

(అనేక విధములైన భోగము లనుభవించుచుండఁగా సీతారాములకుఁ బది వేల యేండ్లు కడచిపోయెను. ఇట్లు చలికాలము దాఁటిపోవుటయు;)

ఆ. దినము పూర్వభాగ • మున ధర్మకార్యముల్ ధర్మవిదుఁడు నడపి • ధర్మవిధిని
  దక్కుసగముదినము • మక్కువతో నంతి, పురమునందుఁ జేరి • ప్రొద్దుపుచ్చు.

అర్థములు. దినము పూర్వభాగమునన్=మధ్యాహ్నము గడచువఱకు, సాయంకాలమున సాయాహ్నకృత్యము లుండును గనుక నీనడిమికాలము అంతః పురమున తల్లులతోఁ గొంతకాలము సీతాదేవితోఁ గొంతకాలము గడుపుచుండెను

క. ఉర్వీతనయామణియును, బౌర్వాహ్ణిక కార్యములు సు • పర్వార్చనలున్
  సర్వంబుఁ దీర్చి యత్తల, గుర్వీగఁ బూజించి తనదు • కూటంబునకున్. ॥ ౨౫

అర్థములు. పౌర్వాహ్ణికకార్యములు=పగటి పూర్వభాగమునఁ జేయఁదగిన పనులు, సుపర్వార్చనలున్=దేవతారాధనలు, గుర్వీగన్=అధికముగ, కూటంబునకున్=ఇంటికి.

తాత్పర్యము

సీతాదేవి యుదయముననే లేచి దినము పూర్వభాగమునఁ జేయవలసిన కార్యములు చేసి దేవతలఁ బూజించి అత్తలను మిక్కిలి పూజించి తన యింటి నుండి రాముని యింటికి.

క. చిత్రాభరణాంబర యై, వృత్రహరుం జేరవచ్చు • నింద్రాణివలెన్
  గోత్రాసుత వచ్చిన వై, చిత్రిం గని మెచ్చ భూప • శేఖరుఁ డెలమిన్. ॥ ౨౬

అర్థములు. చిత్రాభరణాంబరయై=అందములైన యాభరణములు చీర ధరించినదియై, వృత్రహరున్=ఇంద్రుని, ఇంద్రాణి=శచీదేవి, గోత్రాసుత= భూపుత్రి=సీత, వైచిత్రిన్=అందమును.

తాత్పర్యము

అందములైన యాభరణంబులు వస్త్రములు ధరించి యింద్రునిఁ జేరవచ్చు శచీదేవివలెఁ దా నున్నయింటికి సీతాదేవి రాఁగా నామె యందమును జూచి రామచంద్రమూర్తి మెచ్చుకొనెను.

—✻ సీతాదేవి ఋష్యాశ్రమంబులకుఁ బోవఁ గోరుట ✻—

క. నుతగతిఁ గల్యాణసమ, న్వితపత్నిం గాంచి పూనినీ! నీయెడలన్
  సుతలాభచిహ్న దోఁచెను, నతివా! నీకోర్కె దెలుపు • మది ఘటియింతున్. ॥ ౨౭

అర్థములు సుతగతిన్=శ్లాఘ్యముగురీతి, కల్యాణసమన్వితః=శుభచిహ్నములు గల, పత్నిన్=భార్యను, నీయెడలన్=నీయందు, సుతలాభచిహ్న=కొడుకు గలుగు గుర్తు, గర్భము.

తాత్పర్యము

అంతట శ్లాఘ్యమైన విధముగ శుభగుణచిహ్నములు గల భార్యను జూచి రామచంద్రమూర్తి దేవీ! నీయందుఁ గుమారుఁడు గలుగఁబోవు లక్షణములుగాన వచ్చుచున్నవి. నీకోర్కె యేమో చెప్పుము, సంతోషముతో నెఱవేర్చెదను.

గర్భిణిగా నున్న భార్యకోరిక నెఱవేర్పఁబడదేని గర్భిణికి శిశువునకు హాని కరమని శాస్త్రము చెప్పుచున్నది. శీలహానికరములు ప్రాణహానికరములు లోనగు చెడుకోరికల నెఱవేర్పరాదుగాని సౌమ్యములగు వానిని నెఱవేర్పవలెను.

చ. అన స్మితచంద్రికావికసితాననపద్మ తపోవనంబులం
గనుఁగొన వల్లభా! మదిని గల్గెను గోరిక గాంగతీరమం
దొనరిన యాశ్రమస్థులు నున్న తపస్విలఁ జూచి పూజలం
దనిపెద నొక్కరేయి యయినన్ మన సయ్యెడి నందు నిల్వఁగన్. ౧౨౪

అర్థములు. స్మితచంద్రికా=చిఱునవ్వనెడు వెన్నెల చేత, వికసిత = వికసించిన, ఆననపద్మ=ముఖకమలము గలది, గాంగతీరమందు=గంగకు సంబంధించిన యొడ్డులందు.

తాత్పర్యము

అని చెప్పఁగా వెన్నెలవంటి చిఱునవ్వుచే పద్మమువంటి ముఖమువికాసము నొందఁగా సంతోషించి నాథా! గంగానదీ తీరములందున్న తపోవనంబులం జూచి యం దొక్క రాత్రియైన నుండఁగోరెదను.

గొంతెమ్మ కోరికలని కుంతీదేవి కోరికలు వ్యర్థములు. సీతాదేవి కోరిక లనర్థకములు. కోరక కోరక యామె జన్మమునందు రెండు కోరికలు కోరెను. రెండును దనమెడకు గండకత్తెర లయ్యెను.

ఇదివఱకు పదునాలుగు సంవత్సరములు ఋషులను జూడలేదా, ఋష్యాశ్రమములు చూడలేదా. ఈ విపరీతపు కోరికకుఁ గారణ మేమి? 'బలీయసి కేవల మీశ్వరాజ్ఞా', భగవత్సంకల్పము బలిష్ఠమైనది.

క. నావుడు నీరజనయనా!, నీవలచినయట్ల తేప నే బంతు మదిన్
నీవనుమానము విడుమని, తావచ్చెన్ నడిమికక్ష్యఁదనమంత్రులతోన్. ౧౨౫

అర్థములు. నీవలచినయట్ల=నీవు కోరిన ప్రకారమే, తేప=ఉదయము కాఁగానే, నడిమికక్ష్యన్=నడిమికట్టునకు.

తాత్పర్యము

(అని చెప్పఁగా సీతా! నీవు కోరినట్లు రేపే నిన్నుఁ బంపెదను. నీ వనుమాన పడకుము, అని మంత్రులతో నడిమికట్టునకు శ్రీరామప్రభువు వచ్చెను.)

—॰ శ్రీరాముఁడు భద్రుని లోకవార్త అడుగుట ॰—

సీ. ఇటు లుపవిష్టులై హితులు విచక్షణుల్ భజియింపఁ బెక్కురూపము లుగలుగు
హాస్యకారులు విజయ కుట కాశ్యపమధు, మత్తకాయులు సుమాగధుండు
భద్రుండు మఱి దంతవక్త్రి సురాజులు, పింగళుల్ తమ నేర్పుం బెంపు మెఱసి
పరిహాసవార్తలు పలుకుచు శ్రీరాము, నలరించుచుండఁ గథాంతమందు

తే. భద్రుఁడనువానిఁ గని రామభద్రుఁడనియె, వార్తలేమిర పల్లెలఁ బట్టణముల
భరతలక్ష్మణశత్రుఘ్నధరణిసుతులఁ, గైకయినిఁ గూర్చి యేమంద్రు లోకులెల్ల.

అర్థములు. ఉపవిష్టులై=కూర్చుండినవారై, విచక్షణుల్=పండితులు హాస్యకారులు=నవ్వునట్టి మాటలు చెప్పువారు.

తాత్పర్యము

(ఈవిధముగాఁ గూర్చుండినవారై స్నేహితులు, పండితులు, సేవించుచుండ ననేకవిధముల హాస్యములు చెప్పువారు, విజయ కుట కాశ్యపమధు మత్తకాళియులు, సుమాగధుఁడు భద్రుఁడు దంతవక్త్రుఁడు సురాజుఁడు పింగళులు ననువారు.)

చ. జనులకు మేలు గూరఁగఁ బ్రజాపరిపాలన సేయురాజు దా
వినఁదగుఁ దన్నుఁగూర్చి తనవీటను రాష్ట్రమునందు లోకు లే
మనుకొనువారో సర్వవిషయంబుల రాజటు సేయఁ డేనియున్
వనములఁ బల్లెలం బురమునన్ జననిందితుఁడౌ నిజంబుగన్. ౯౩౧

ఏల యిటు లడిగెద వందువా! ప్రజలకు మేలుచేయఁగోరి రాజ్యము చేయు రాజు తన్నుఁగూర్చి తన కార్యములఁగూర్చి ప్రజలు పల్లెలందుఁ బట్టణములందు సర్వవిషయంబులందు మేలుఁగాఁ జెప్పుచున్నారా? కీడాడుచున్నారా యని విచారించి సవరించుకొనవలసినవి సవరించుకొనవలయును. అట్లు చేయఁడేని యారాజు పల్లెలందు పట్టనములందు లోకులచే నిందింపఁబడును.

చ. అనవుడు భద్రుఁ డిట్లనియెఁ బ్రాంజలియై ధరణీశ! పట్టనం
బున మరి పల్లెలందు జనముల్ భవదద్భుత వార్తలే సదా
యనుకొనువారు మేలుగ దశాననుఁ జంపుట లజ్జయంబు వా
కొనియెడివార లెల్ల యెడఁ గూరిమితోడ ననన్ నరేంద్రుఁడున్. ౯౩౨

అర్థములు. భవదద్భుతవార్తలే=నీవు చేసిన యాశ్చర్యకరములైన కార్యములను గుఱించిన ముచ్చటలే, మేలుగన్=మంచిగ.

తాత్పర్యము

(అని యడుగఁగా, భద్రుఁడు చేతులు జోడించి యిట్లని విన్నవించెను. రాజా! పట్టనములోను పల్లెలందును జనులు నీవు చేసిన యాశ్చర్యకరములైన ముచ్చటలే మంచిగ చెప్పుకొనుచున్నారు. రావణునిఁ జంపుట, ఆ జయము నెల్లతావులఁ బ్రేమతోఁజెప్పుచుందురు. అని చెప్పఁగా రామచంద్రమూర్తి.)

చ. కలదికలట్లు చెప్పుము జ♦గజ్జన మే మని మేలు పల్కెడున్
బలికెడి నేమికీడులను ♦ వార్తల నన్నిటిఁ జెప్పు, మన్నియుం
దెలిసినఁ గాదె కీడులను ♦ దీర్చి శుభంబులు గూర్పవచ్చు, లోఁ
గలఁగకు పాప మే మనెడి ♦ క్ష్మాజనము ల్విన వాంఛ చేసెదన్. ౯-33

తాత్పర్యము

అనిన రామచంద్రమూర్తి యిట్లనియె ఓరి యున్నదున్నట్లు చెప్పుము. లోకులు మే లేమని చెప్పుచున్నారు. ఏవి చెడ్డలని చెప్పుచున్నారు. లోకమునందు నన్నియు సుగుణములే, అన్నియు దుర్గణములే కలవాఁడుండఁడు గదా. కావున లోపములు దెలిసినఁ గదా సవరించుకొనవచ్చును. నీవు భయపడకుము. ప్రజలు నాయం దేమి దోషములు చెప్పుచున్నారు? వానిని వినఁగోరెదను.

—♦ భద్రుఁడు శ్రీరామునకు సీతావిషయకాపవాదంబుఁ దెలుపుట ♦—

సీ. ధృతి గూరఁ బలికిన ♦ పతికి వాఁ డిట్లనుఁ దోటలఁ బాటలఁ దోఁపులందు
సంగళ్ళ శాలల ♦ నఖిలతలంబులఁ రామభద్రుం డర♦రే! మహాత్ముఁ
డమరదానవనిర్జ♦రాళి కసాధ్య మౌ, సేతువుఁ గట్టించె ♦ సింధువునను
సేనలతోడ ని♦ర్జించెను రావణు వానరులను వశ♦పడఁగఁ జేసె

ఆ. ఋక్షతతుల నేలె ♦ రాక్షస కోటులఁ కేలి కయ్యెనైన ♦ నేమికాని
దనుజుఁ డపహరింపఁ దనభార్య నయ్యాది, మఱచినాఁడు మరల ♦ మరగినాడు.

అర్థములు. ధృతి గూరన్=ధైర్యము వచ్చునట్లు, అసుర=దానవ నిర్జరాళి కిన్=అసురులకు దానవులకు దేవతలకు, సింధువునను=సముద్రమందు, దనుజుఁడు=రాక్షసుఁడు.

తాత్పర్యము

(అని ధైర్యము వచ్చునట్లు చెప్పఁగా, రామ ప్రభువునకు భద్రుఁడిట్లని చెప్పెను. తోటలందు బాటలలోఁ దోఁపులందు, అంగడులందు, గృహములందు సకల ప్రదేశములందు 'అరరే! రామభద్రుఁడు మహాత్ముఁడు-దేవతలకు రాక్షసులకు నసాధ్యమైన పని సముద్రమందు సేతువు గట్టించెను. రావణుని ససైన్యముగా జయించెను. వానరులను లోపఱచుకొనెను. ఎలుగులు నేలెను. రాక్షసులకుఁ

బ్రభువయ్యెను అయిన నేమి కాని రాక్షసుఁడు తనభార్య నపహరింపఁగా నా విషయమున మఱచి, మరలఁ దెచ్చుకొని యేలుకొనుచున్నాఁడు.)

మ. బలవంతంబుగఁ జేర్చి స్వాంకమున దే♦వ ద్వేషి కొంచేగ, నా
ఖలుఁడే లంక నశోకవాటి నునిచెం ♦ గాపుంచె స్వస్త్రీల, న
చ్చెలువం గ్రమ్మఱఁ దెచ్చి యింట నునిచెన్ ♦ సీ! యాత్మగర్హింపఁడా
పొలఁతిం గూడి నృపుండు మోహమున సం♦భోగింప నే సౌఖ్యమో. ౯౩౫

అర్థములు. స్వాంకమునన్=తనతొడయందు, దేవద్వేషి=రాక్షసుఁడు ఖలుఁడే=ఆదుష్టుఁడే.

తాత్పర్యము

రాక్షసుఁడు బలాత్కారముగ తన తొడమీఁద నుంచుకొని తీసికొనిపోయెను ఆ దుష్టుఁడే లంకలో నశోకవనములో నుంచెను. తన స్త్రీలనే కాపుగా నుంచెను. అట్టి దానిని మరలఁ దెచ్చి యింటిలో నుంచుకొన్నాడు. ఛీ - మనస్సులోనైన రోఁతపడఁడు. అటువంటి యాఁడుదానిని గూడి మోహమున సంభోగింపఁగానేమి సౌఖ్యము గలదో.

క. తామసుఁ డగు రాక్షసుగృహ, సీమను జిరకాలమట్లు ♦ చెఱఁబడిన సతిన్
రాముఁడు రోయక కూడెడిఁ, గాముకు లగువారి కెందుఁ ♦ గన్నులు గలవే?

తాత్పర్యము

తామసుఁడు=తమోగుణము ప్రధానముగాఁ గలవాఁడు, కావుననే పాపమునకైన భయపడనివాఁడు=అందు రాక్షసుఁడు, అందు వాని గృహసీమను వాని యింటియందే, చిరకాలము, ఒకగడియకాదు, ఒకనాఁడు కాదు, ఒక నెలకాదు. దీర్ఘకాలము పదినెలలు. కాముకులగువారికి నిది తప్పు, ఇది యొప్పని తెలిసికొనఁ గన్నులుఁ గలవా? 'కామాంధోపి న పశ్యతి' 'Cupid is blind' మన్మథుఁ డంధుఁడు అని సామెతలు కలవుగదా.

క. రాజానుమతము ధర్మము, రాజువిధం బనుసరింపఁ ♦ బ్రజ కర్హంబౌ
రాజునటె మనకు నాత్మస, తీజనచర్యలు సహింపఁ ♦ దీరగు నింకన్. ౯౩౭

అర్థములు. రాజానుమతము ధర్మము=రాజంగీకరించినదే ధర్మము, ఆత్మసతీజన చర్యలు=మన భార్యలుచేయు చేష్టలు.

తాత్పర్యము

ఏది ధర్మమో యేది యధర్మమో మనకేమి తెలియును? రాజేదిసమ్మతించి యాచరించునో యదియే మనకు ధర్మము. ఆరాజు మార్గమున మనము నడచుట తగును. పూర్వరాజులు పరుఁ డెత్తుకొనిపోయిన యాఁడు దానిని మరల గ్రహింప

నుండిరి. కావున మనము గ్రహింప కుంటిమి. ఇప్పుడీ రాజు మరల గ్రహించెను. గావున మన పెండ్లాలే చేష్టలు చేసినను రాజువలె మనము సహించి గ్రహింప వచ్చును.

క. అని వారు వారు దోఁచిన, యనువునఁ బురి జనపదముల ♦ ననుకొనువారల్
జను లెల్లననిన రాముఁడు, మనమునఁ బరమార్తి కతనమల్లడిఁగొనుచున్. ౯౩౮

అర్థములు. అనువునన్=విధమున, పురిన్=పట్టనమందు, జనపదముల్= గ్రామములందు, మల్లడి గొనుచున్=పరితపించుచు.

తాత్పర్యము

(అని వారు వారు తమకుఁదోఁచిన విధమునఁ బట్టనమందుఁ బల్లెలందు జనులందఱు ననుకొనుచున్నారు. అని చెప్పఁగా శ్రీరామచంద్రమూర్తి మిక్కిలి దుఃఖముచేఁ బరితపించుచు)

క. అని నందఱ మిత్రులఁ గని, వినినారలె మీర లిట్టివిధము లటన్నన్
వినతశిరంబుల వారలు, వినతు లొనర్చుచును, ధరణివిభునిన్ దీనున్. ౯౩౯

అర్థములు. వినతశిరంబులన్=తలలు వంచుకొని, వినతులు=నమస్కారములు, దీనున్=చింతాక్రాంతుని.

తాత్పర్యము

(స్నేహితులందఱను జూచి మీరలీవిధములయిన వార్తలను విన్నారుకదా యని యనఁగానే యందఱు తలలు వంచుకొని నమస్కారము లొనరించుచు, చింతాక్రాంతుఁడైన రామప్రభువుతో.)

క. అందఱుఁ బలికిరి దీనన్, సందియ మేమియును లేదు ♦ జనవర ! యనఁగా
డెందము విచారభరడో, లాందోళిత మగుడు వారి ♦ నందఱఁ బనిచెన్. ౯౪౦

అర్థములు. విచారభర=అధిక చింతచే, డోలాందోళితము = ఉయ్యేలవలె నూఁగుచున్నది.

తాత్పర్యము

(రాజా! దీనిలో సందేహమేమియు లేదని యందఱుఁ బలికిరి. అని చెప్పఁగా నధికమగు చింతచే మనసు యుయ్యేలవలె నూఁగగా వారి నందఱను బంపివేసెను.)

— శ్రీరాముఁడు సోదరులఁ బిలిపించుట —

ఉ. అందఱఁ బోవఁ బంచి తదనంతర కార్యము నిశ్చయించి సం
క్రందనతేజుఁ డం దఱులఁ కావలివానిని బిల్చి కైకయీ
నందనుఁ బుణ్యశీలు శుభనవ్యసులక్ష్మణు లక్ష్మణుం బరా
స్పందితుఁ దత్సహోదరునిఁ ♦ జయ్యనఁ దోడ్కొని రమ్ము నాప్రడున్. ౯౪౧

అర్థములు. తదనంతర కార్యము=ఆవలఁ జేయవలసిన కార్యము, సంక్రందన తేజుఁడు=ఇంద్రుని తేజస్సువంటి తేజస్సుగలవాడు, అభిత=సమీపమందున్న పర=శత్రువులచే, అస్పందితున్=చలింపఁ బడని వానిని.

తా త్ప ర్య ము

(అందఱను బంపివేసి, యావల జేయవలసిన కార్యమును నిశ్చయించి, యింద్రుని తేజస్సునంటి తేజస్సుగల, రామచంద్రమూర్తి సమీపమున నున్న కావలి వానిని బిలిచి, భరతుని లక్ష్మణుని శత్రుఘ్నుని, శీఘ్రముగఁ బిలుచుకొని రమ్ము అని చెప్పగా)

చ. జవమున వాఁడు లక్ష్మణుని ◊ శాలకు నేగి నమస్కరించి రా
ఘవ! మిము రాజు రాఁబిలిచె ◊ గ్రక్కున నంచు వచింప వెంటనే
భవనము వీడి తేరిపయి ◊ భ్రాతృగృహంబున కేగె లక్ష్మణుం
డననిపువీటి కేగఁ గని ◊ యావల ద్వార్థుఁడు కైకయీసుతున్. ౯౭౧

అర్థములు. జవమునన్ = వేగముగ, శాలకు=ఇంటికి, భవనము=ఇల్లు, ద్వార్థుఁడు=ద్వారపాలకుఁడు.

తా త్ప ర్య ము

(వాఁడు లక్ష్మణుని యింటికిఁబోయి 'రాఘవా! మిమ్ముఁ ద్వరగా తీసికొని రమ్మని రాజుగారు పంపినా'రని చెప్పఁగా, వెంటనే బయలుదేఱి రథమెక్కి యన్న గారి యింటికిఁబోయెను. లక్ష్మణుఁడు రామచంద్రప్రభువు వారి యింటికిఁ బోవుట నూచి ద్వారపాలుఁడు భరతుని)

క. చేరఁ జని మ్రొక్కి నృపనుడి, తీరు వచించుచు నతండుఁ ◊ దెప్పునఁ బదసం
చారంబునఁ జనె నది గని, ద్వారాధ్యక్షుండు చూచి ◊ త్వర శత్రుఘ్నున్.

అర్థములు. పదసంచారంబునన్=కాలినడకతో.

తా త్ప ర్య ము

సన్నిధికిఁ బోయి, నమస్కరించి, రాజుగారు సెలవిచ్చిన విషయమునువిన్న వింపఁగా, నతఁడు తత్క్షణము కాలినడకతోఁబోయెను. అది చూచి ద్వార పాలుఁడు, తొందరగా శత్రుఘ్నుని)

క. డాసికైమోడ్పుతోఁబలి, శాసన మెఱిఁగింపఁ జక్కఁ ◊ జనె నాతండున్
గౌసల్యానందనునకుఁ, దాసరగన్ గొల్ల వినిచెఁ ◊ దమ్ములరాకల్. ౯౭౨

అర్థములు. గొల్ల=ద్వారపాలుఁడు.

తా త్ప ర్య ము

(ఒద్దకుఁ బోయి కేలుమోడ్పుతో రాజుగారి శాసనమును దెలుపఁగా, రామచంద్రమూర్తి సన్నిధికిఁ దాను నాక్షణముసంద పోయెను. ద్వారపాలుఁడు, రామచంద్రమూర్తితోఁ దమ్ములు వచ్చిరని విన్నవించెను.)

చ. అనుజులు వచ్చి రంట విని ♦ వ్యాకులచిత్తుఁ డవాఙ్ముఖంబుతో
 ననియెను ద్వారపాలకుని ♦ నందఱ లో విడు, వారె నాప్రియుల్
 తనువునఁ బ్రాణవాయు లనఁ ♦ దద్విధ మాతఁడు దెల్ప మువ్వురున్
 వినయ నతోత్తమాంగు లయి ♦ వే ముకుళీకృతహస్తపద్ములై. ౯౪౫

అర్థములు. అనుజులు=తమ్ములు, వ్యాకులచిత్తుఁడు=కలఁతఁజెందిన మనస్సు గలవాఁడు, సీతాదేవికి మరలఁ గష్టము వచ్చెఁగదా యని కలఁత, అవాఙ్ముఖంబుతో=వంచిన తలతో, వినయనత+ఉత్తమాంగులయి=అణఁకువచేత వంపఁబడిన శిరస్సులు గలవారై, ముకుళీకృత హస్తపద్ములై=ముకుళించిన పద్మములవంటి చేతులుగలవారు.

తా త్ప ర్య ము

(తమ్ములు వచ్చిరని విని కలఁత చెందిన మనస్సుగలవాఁడై తలవంచుకొని ద్వారపాలకునితో వారే నాకుఁ బ్రియులు. శరీరమునఁ బ్రాణవాయువులు, వారిని లోనికి రానిమ్ము అని చెప్పఁగా, నతఁడావిధమంతయుఁ దెల్ప ముగ్గురును, నణఁకువచేఁ దలలు వంచుకొని, చేతులు కట్టుకొని,)

చ. చని యుపరాగసంకలిత♦చంద్రుఁడో? సంజను సూర్యుఁడో? యనన్
 ఘనతరకాంతి మాసి నయ♦నంబుల నీరు తొలంక నున్నయ
 న్నను హతశోభ మైన నళి♦నంబును బోలు తదాస్యబింబమున్
 గని చరణంబులం దొఱఁగఁ ♦గన్నులనీరము లోన మ్రింగుచున్. ౯౪౬

అర్థములు. ఉపరాగ సంకలిత చంద్రుఁడో=గ్రహణము పట్టిన చంద్రుఁడో సంజను=సంధ్యాకాలమందలి, హతశోభము=నశించిన కాంతిగలది, నళినంబును= కమలమును, తత్+ఆస్యబింబమును=ఆయన ముఖబింబమును.

తా త్ప ర్య ము

లోపలికిఁబోయి గ్రహణము పట్టిన చంద్రుఁడో, గ్రుంకఁబోవు సంధ్యాకాల సూర్యుఁడోయనునట్లు గొప్పదగు కాంతిఁబాసి కన్నులనీరుకాఱఁగానున్నయన్నను కాంతిచెడిన కమలములవలె నున్న యాయన ముఖమండలమును జూచి పాదముల వ్రాలఁగా రామచంద్రమూర్తియు కంటినీరు వెలికిరాకుండ లోపలనే మ్రింగుచు

ఉ. తమ్ములఁ గౌఁగిలించి యుచి•తమ్మగు పీఠుల నుండఁ బంచి నె
యమ్మునఁ బల్కెనో యనఘు•లారా! సహోదరు లన్న మీరె ప్రా
ణమ్మన మీరె సర్వము ధ•నం బన మీరె త్వదార్జితమ్ము రా
జ్యమ్మును నేను బాలనము • సల్పెద భూపతులార! వింటి రే? ౯౪౭

అర్థములు. త్వదార్జితము=మీరు సంపాదించినది.

తా త్ప ర్య ము

(తమ్ములను గౌఁగిలించుకొని పాపరహితులారా! సోదరులనిన మీరే. ప్రాణమనిన మీరె-సర్వధనము మీరె, మీరార్జించిన రాజ్యమును ప్రియము మీరు నేను పాలించుచున్నాను. విన్నారు కదా! యని చెప్పెను.)

క. మీరలు కృతశాస్త్రార్థులు, ధీరులు మతినిష్ఠితులును • దెలిపెద నొండున్
గారియము నాకుఁగా నది, గారా దని యనక మీరు•గావింపఁ దగున్. ౯౪౮

అర్థములు. కృతశాస్త్ర+అర్థులు=చక్కఁగా సాధించిన శాస్త్రార్థము గలవారు, ధీరులు=భయము లేనివారు, మతినిష్ఠితులును=నిష్ఠగల మనస్సు గలవారు. కారియము=పని

తా త్ప ర్య ము

మీరందఱు శాస్త్రార్థములు చక్కఁగాఁ దెలిసినవారు. భయము లేనివారు. నిష్ఠతోఁ గూడిన మనస్సుగలవారు. నాకుఁగా నేనొకపని చెప్పెదను. అది నేను చేయము అనక మీరు చేయవలయును.

క. అనవుడు నేమి వచించునో, యని యుద్వేగంపుమతుల • నవధానముతో
ననుజాతు లుండ దీనా,ననముల నవ్వారి కుర్వి•నాథుం డనియెన్. ౯౪౯

తా త్ప ర్య ము

(అని పలుక, నేమి చెప్పనో యని దిగులొందిన మనస్సుగలిగి వెలవెల బోవు మొగములతోఁ దమ్ములుండఁగా వారినిఁ జూచి రామచంద్రమూర్తి చెప్పెను.)

—• శ్రీరాముఁడు భరతాదులకు లోకాపవాద విధంబుఁ దెలుపుట •—

మ విను డేకాగ్రతఁ జక్క నానుడులఁ బ్ర•స్వేకన్యకం గూర్చి భూ
జనము ల్పల్కెడిచందముల్ పురములన్ • సర్వప్రదేశంబులన్
వినరానట్టివి కుత్సితంబు, లవి, నే • విన్నాదిగా మర్మభే
దన మయ్యెం దలపోయ నెట్టు లల నిం•దావాక్యము ల్పల్కెదన్? ౯౫౦

అర్థములు. ఏకాగ్రతన్=చలింపని మనస్సుతో, కుత్సితంబులు=నీచములు, విన్నాదిగా=విన్నది మొదలు, మర్మభేదనములు = ఆయువు పట్టులు పగులఁ జీయునవి.

తాత్పర్యము

తమ్ములారా! నేను జెప్పుమాటలు మనస్సు చలింపనీక వినుఁడు సీతను గూర్చి లోకులు పల్లెలందుఁ బురములందు సర్వప్రదేశములందు మిక్కిలి నీచములై వినరానివి యనుచున్నారు. అవి నేను విన్నది మొదలు నా ప్రాణములు పోవునట్లున్నవి. వినుటకే యిట్లుండ నా నిందావాక్యములను నేను నానోరార నేమని చెప్పుదును.

సీ. లోకసత్ప్రథితు లిక్ష్వాకు లవ్వారల, పుణ్యవంశంబునఁ బుట్టినాఁడ
సీత మహాత్మాళిఁ శ్రేష్ఠుఁడౌ జనకుని, సద్వంశమందుఁ దాఁసంభవించె
దండకాటవియందుఁ దశకంఠుఁ డుర్వీజ నపహరించుటయు నే నతనిఁ జంపు
టీ వెఱుంగవె యప్పుడే నాకు మదిలోనఁ, బరు నింట నుండినఁపడఁతి సీత

తే. నెట్లుగొనిపోదు బురికనిఁయే జుడుంగఁ బ్రత్యయార్థంబు సతివహ్నిఁబడఁగ లేదె
యగ్ని సీత పతివ్రత యనఁగ లేదె?, నీవు సౌమిత్రి? యచ్చటఁ లేవె యపుడు?

అర్థములు. లోకసత్ప్రథితులు=ప్రపంచమున మిక్కిలి కీర్తి గలవారు మహాత్మాళి=మహాత్ముల సమూహములో, జుడుంగనే=వెనుదీయఁగా, ప్రత్యయార్థంబు=నమ్మకము కొఱకు.

తాత్పర్యము

తమ్ములారా? నేనా ప్రపంచమం దన్ని విధముల మంచి కీర్తి సంపాదించిన యిక్ష్వాకు మహారాజుల పుణ్యవంశమునఁ బుట్టినాఁడను. ఇట్టి నేను జేయరాని పని చేసి పూర్వుల కపకీర్తి తెత్తునా? ఇఁక సీతయో మహాత్ములని పేరు పడ్డవారిలో శ్రేష్ఠుడైన జనకుని వంశమందు జనించెను. ఆమె చేయరాని పనిచేసి తండ్రికి నాయన వంశము వారికి నపకీర్తి తెచ్చునా? దండకారణ్యమందు రావణుఁడామె నపహరించుటయు నేనాతని జంపుటయు లక్ష్మణా! నీకుఁ దెలియదా! ఇట్లుండియు అప్పుడే నాకుఁ బరునింట నున్నదాని నెట్లు పురమునకుఁ బిలుచుకొని పోదునని సందేహించి వెనుదీసితిని. అప్పుడు తాను నిర్దోషురాలని నమ్మించు కొఱకు సీత యగ్నిలోఁ బడలేదా? అగ్నిహోత్రుఁడు సీతాదేవి పతివ్రత యని చెప్పలేదా? లక్ష్మణా! నీ వప్పు డచ్చట లేవా?

ఉ. సీత యపాప యంచు సరసీరుహబాంధవచంద్రమారుతుల్
ఖ్యాతిగఁ బల్కలేదె? సురకాండము మొదల ఋషీశులెల్ల భూ
జాత యపాప యం చనరె? సాధ్వి సతీమణి యంచు దేవతా
నేత మదీయహస్తమున నిర్మలశీల నిడండె లంకలోన్. ౧౧

అర్థములు. అపాప=దోషములేనిది, సరసీరుహబాంధవ=సూర్యుఁడు,మారుతుల్=వాయువు, దేవతానేత=బ్రహ్మ,నిర్మలశీల=దోషములేని నడవడిగలదానిని

తాత్పర్యము

సూర్యుఁడు చంద్రుఁడు వాయుదేవుఁడు సీత పాపాత్మురాలు గాదని యందఱుఁ దెలియునట్లు పలుకలేదా? ఋషీశ్వరు లందఱు దేవతల యెదుట సీతయందు దోషము లేదని చెప్పలేదా? బ్రహ్మదేవుఁడు సీతను లంకలో నాచేతిలోఁ బెట్టలేదా?

తే. అంతె కాదయ్య నాయంత । రాత్మకూడఁ బూత యంచు నెఱుంగును । భూమిజాత
గావునఁ గదా యయోధ్యకుఁ । గ్రమ్మఱంగఁ, దోడి తెచ్చితి లక్ష్మణా! । తోయజాక్షి!

తాత్పర్యము

ఇతరులు చెప్పినా రనుటయే కాదు. ఎందఱు చెప్పినను నామనస్సున సందేహమున్న నే నెట్లు లంగీకరించి యుందును. నా యంతరాత్మకూడ సీతయందు దోషము లేదని యెఱుంగును. నా యంతఃకరణము శుద్ధముగా నామె విషయమున నుండుటచేఁ గదా నే నయోధ్య కామెను దోడి తెచ్చితిని.

క. అపవాదము దుస్సహమై, తపియింపఁగఁ జేసె నన్నుఁ । గద్దయుఁ జిత్తం
బిపుడు పురంబులఁ బల్లెల, విపరీతపువార్తలెల్ల । వినఁబడెడిఁ జూడీ! ౯౧౪

అర్థములు. అపవాదము=నింద, దుస్సహమై=సహింపరానిదై.

తాత్పర్యము

నేనింత హెచ్చరికగాఁ బ్రవర్తించినను సహింపరాని నింద నన్ను దహించుచున్నది. ఇప్పుడు పల్లెలందు నూళ్ళయందు పురములందు విపరీతవార్తలు పుట్టినవి.

చ. ఎవని యకీర్తి లోకమున । నెందనుకన్ వినఁ గల్గునో, యథో
భువనములందు నందనుకఁ । బూరుషుఁ డుండెడుఁ బాపభోజియై
దివిజు లకీర్తినిం దెగడి । తెల్పుచు నుంద్రు సుకీర్తిఁ గాన మా
నవుఁడు సుకీర్తిఁ గోరి మో । యనారతముం బను లొప్పఁజేయఁగన్. ౯౧౫

అర్థములు. అకీర్తి=అపకీర్తి, అథోభువనములందు=క్రిందిలోకములందు, పాపభోజియై=పాపఫల మనభవించువాఁడై, తెగడి=తిరస్కరించి, తెల్పుచు=పొగడుచు, అనారతముల్=ఎల్లవేళ.

తాత్పర్యము

అజ్ఞానలోక మేమో వదరినంతనే నీవు దాని లక్ష్యపెట్టవలయునా? వారేమి తెలిసి యనుచున్నారందువేమో! నాదు తెలిసి యననీ, తెలియక యననీ ఎవని యపకీర్తి లోకములో నెంతదాఁక వ్యాపించియుండునో యెంతకాలము వ్యాపించి యుండునో యంతకాల మాపురుషుఁడు పాపఫల మనుభవించుచు నధోలోకము

లంపుండవలయును. దేవత లపకీర్తిని నిందింతురు. సత్కీర్తిని శ్లాఘింతురు. కాబట్టి యూర్ధ్వలోకములకుఁ బోవఁగోరువాఁడు సత్కీర్తినే సంపాదింపవలెను.

క. విడిచెద మిమ్మెల్లర నే, విడిచెద నా ప్రాణమేని ♦ విమలయశముకై
పొడమిన యకీర్తి భీతిని, విడుచుట చిత్రంబె నేను ♦ పృథివీతనయన్. ౧౫

తా త్ప ర్య ము.

ఇట్లుండుటచే సత్కీర్తి సంపాదించుటకై మిమ్ము వదలవలసి వచ్చెనేని వదలుదను. మీవలన నాకపకీర్తి వచ్చుట సహింపను. అట్టులే నా ప్రాణములనైన నిచ్చి సత్కీర్తి దక్కించుకొందును. కావున నపకీర్తి భయమున సీతను విడుచుట చెప్పవలెనా?

క. ఎట్టి యపవాదమునకుం, బట్టైతినో మీరె కనుఁడు ♦ పార్థివులారా!
యిట్టి మహాదుఃఖము నే, నెట్టి దశలఁ గాంచి యెఱుఁగ ♦ నేమందు నికన్.

అర్థములు. అపవాదమునకున్=నిందకు, పట్టు=నెలవు, స్థానము.

తా త్ప ర్య ము

నేను నిష్కారణముగ నెటువంటి నిందలకుఁ బాలయితినో చూడుఁడు. నే నెన్ని దుఃఖములో యనుభవించితిని, గాని యిట్టి దుఃఖ మనుభవింపలేదు.

శ్రీరాముఁడు సీతాదేవిని వాల్మీకియాశ్రమంబు పొంత విడువ లక్ష్మణు నాజ్ఞాపించుట

సీ. ఎల్లియ వఱువాతఁ ♦ బృథ్వీజఁ దోడ్కొని, తేరు సుమంత్రుండు ♦ తేర నీవు
సౌమిత్రి! చని సర్వ♦జనపదాంతంబున, గంగ కాయొడ్డునఁ ♦ గ్రాలుచున్న
వాల్మీకి యాశ్రమ♦వనములఁ దమసాధుని తీర వసుమతి ♦ నిర్జనంపుఁ
దలమున విడిచి గ్ర♦ద్దన రమ్మనేఁ జెప్పి, నట్టులు చేయు మా♦టాడవలదు

తే. దీని యోజింపఁ దగిన దే♦దియును లేదు, కూడదం చన నీపయిఁ♦గోపగింతు
మచ్చరణ జీవితములపై♦మాన్యచరిత, శపథ మిడితిని బనులాడఁ♦జనదు నీకు.

అర్థములు. ఎల్లియ=రేపే, వఱువాతన్ = ఉదయమున, తేరన్=తీసికొని రాఁగా, సర్వజనపదాంతంబునన్ = అన్నియూళ్ళ కావల ఆయొడ్డునన్=ఆవలి యొడ్డున, తమసాధుని తీరవసుమతి=తమసానది యొడ్డునగల భూమియందు, నిర్జనంపుఁదలమునన్=జనులు లేని ప్రదేశమున, గ్రద్దనన్=శీఘ్రముగ.

తా త్ప ర్య ము

లక్ష్మణా! రేపటి యుదయము నీవు సీతను దీసికొని సుమంత్రుడు తెచ్చిన తేరిమీఁద పోయి గ్రామములన్నిటి కావల గంగ కాయొడ్డున, తమసానదీ తీరప్రదేశమున వాల్మీకి యాశ్రమమున జనులులేని చోటవిడిచి వెంటనే రమ్ము. నేను జెప్పి

నటులు చేయవలసినది. బదులు చెప్పవలదు. దీనిలో నాలోచింపవలసినది లేదు. ఇది రాజాజ్ఞగా నెంచుము. వలదంటివా నీమీఁద గోపింతును. పూజ్యమైన నడవడి గలవాఁడా! నా పాదముల మీఁదఁ బ్రాణములమీఁద నొట్టు పెట్టితిని. బదులు చెప్పవలదు.

క. అడ్డం బెవరేఁ బలుకుచు, నొడ్డారించినను వారి ♦ నూహించెద నా
దొడ్డపగవారికైవడి, నెడ్డము గలిగించుటన్ మ♦దిష్టమునందున్. ౯౫౯

అర్థములు. ఒడ్డారించినను=మాటొడ్డినను.

తాత్పర్యము

దీని కెవరైన నడ్డము చెప్పుచు లెదురొడ్డి ప్రవర్తించిరా వారు నాయిష్టమునకు నడ్డము వచ్చిన వారగుటచే నా పగవారని తలంచెదను.

క. నాయాజ్ఞ నుందు రేనియు, నా యెడ గౌరవము మీమ♦నంబుల నున్నన్
నాయాడినట్ల చేయుం, డాయీ నుడు లాడకుండ ♦ నానతి యిడితిన్ ౯౬౦

అర్థములు. అయీనుడులు=ఆ మాట లీమాటలు, సమాధానములు= అడ్డమాటలు.

తాత్పర్యము

మీరు నాయాజ్ఞ ప్రకారము వర్తించెదరేని నాయందు మీకు మనస్సులందు గౌరవబుద్ధి యున్నను నేను జెప్పినట్లు మీరు చేయవలసినది. ఆమాట యీమాట అడ్డమాట యాడకుండ నాజ్ఞచేసితిని.

క. గంగాతీరంబున కేగంగా వాంఛిత మటంచుఁ ♦ గామిని పలికెన్
సంగతిగా నవ్వాక్యం, బంగనఁ దోడ్కొంచు లక్ష్మణా! చను సరగన్. ౯౬౧

తాత్పర్యము

ఏమి నెపము పెట్టి పిలుచుకొని పొమ్మనెదవా? గంగాతీరమునకుఁ బోవఁ గోరిక గలదని యామె చెప్పెను. ఆ మాటప్రకారము లక్ష్మణా! నీవు తోడ్కొని పొమ్ము.

క. అనివారిఁ బొమ్మటంచును, ననుమతి యిడి బాష్పపూరి♦తాననుఁడగుచున్
జని తనమందిరమున క, య్యనఘుఁడు నిట్టూర్చుచుండె♦నాగంబనఁగన్. ౯౬౨

అర్థములు. భాష్పపూరితాననుఁడు=కన్నీట నిండిన ముఖముగలవాఁడు, నాగంబు=ఏనుఁగు, పాము.

తాత్పర్యము

(వారినిఁ బొమ్మని యాజ్ఞయిచ్చి తాను తనమందిరమునకుఁ బోయి, దుఃఖమునఁ గన్నీరు కార్చుచు పామువలె నిట్టూర్పు పుచ్చుచుండెను.)

—♦ లక్ష్మణుఁడు సీతాదేవిని ఋష్యాశ్రమంబుల కని పిలుచుకొని పోవుట ♦—

సీ. వరువాత నతిదీన♦వదనుఁడై సౌమిత్రి, సారథిని సుమంత్రు ♦సరగఁ బిలిచి
వాడినమోముతోఁ♦బలికెనోయి సుమంత్ర!, యరదంబుఁబన్నుమీ♦యతిజవమున
స్వామిస్తీర్ణ మఘపుగృ♦హంబునఁ గొనితెచ్చి, పరువుము నృపునాజ్ఞ♦వలన సీత
ఋష్యాశ్రమములకు ♦ నేన తోడ్కొనిపోదు, ననవుడు నతఁడట్ల♦యన్ని దీర్చి

తే. తేరు సిద్ధమయ్యె♦దేవ! నా నాతండు, క్షితిపుగృహముఁ జొచ్చి♦సీతఁ గాంచి
వదినె! నీహృదీశు♦వరముఁ గోరితివఁట, యాయనయును వల్లె♦యనియె నంట.

అర్థములు. వఱువాతన్=ఉదయమున, అతిదీనవదనుఁడై = మిగుల శోకముచే గాంతిమాసిన ముఖముగలవాఁడై, స్వామిస్తీర్ణము=రామచంద్రుని పఱుపు.

తా త్ప ర్య ము

ఉదయముననే లేచి శోకముచే వాడుపాఱిన ముఖము గలవాఁడై లక్ష్మణుఁడు సుమంత్రుని త్వరగాఁ బిలిపించి సుమంత్రా! రథము త్వరగా సిద్ధము సేయుము. రాజుగారి యింటినుండి వారి సొంతపఱుపు తెచ్చి పఱుపుము. రాజాజ్ఞ ప్రకారము సీతాదేవిని ఋష్యాశ్రమములకు నేనే తోడుకొని పోయెదను. అని చెప్పగా నతఁడన్నియు నట్టులే చేసి తేరు సిద్ధమైనదని చెప్పఁగా లక్ష్మణుఁడు రాజగృహముఁ జొచ్చి సీతాదేవిని జూచి వదినే! నీవు నీపతిని వరము గోరితివఁట. ఆయనయు నంగీకరించెనఁట!

తే. జాహ్నవీతీరమునముని♦సత్తమాశ్ర,మమ్ములకు నిన్నుఁదోడ్కొని♦పొమ్మటంచు
నాజ్ఞయిడెనాకుభూవిభుఁ♦డరుగుడెమ్మ, దేవి!శీఘ్రంబయనఁగవై♦దేహియెలమి.

అర్థములు. జాహ్నవీతీరమునన్=గంగయొడ్డున, ఎలమిన్=సంతోషముతో

తా త్ప ర్య ము

(దేవీ! రామచంద్రమూర్తి గంగయొడ్డున నున్న మునీశ్వరుల యాశ్రమములకు నిన్నుఁ దీసికొని పొమ్మని నా కానతిచ్చెను. వెంటనే పయనము గమ్ము. అని చెప్పఁగా సీతాదేవి సంతోషముతో.)

క. నిన్ననె చుమి లక్ష్మణ! మీ,యన్నను నేనడుగ నట్టు ♦ లౌఁగా కనియెన్
నిన్నింతలోనఁ బుచ్చెనె? వెన్నగదే నాదు ప్రాణ♦విభుహృదయంబున్. ౯౬౫

తా త్ప ర్య ము.

(లక్ష్మణా! నిన్ననే సుమా మీ యన్నగారిని నేనడిగితిని, సరే యనెను. నిన్నింతలోనే పంపెను. నా ప్రాణేశ్వరుని హృదయము వెన్నవంటిదికదా.)

ఉ. ఏమని రిత్తచేతుల ము ♦ నీంద్రులపత్నులఁ జూడఁ బోదు నే
భూమిపుపత్నినై, వసన ♦ ముల్ రుచిరంబులు భూషణంబులున్
బ్రేముడిఁ గొంచుబోయి ముని ♦ భీతమృగాక్షుల కే నొసంగెదన్
దామస మేదిలే దనుచుఁ ♦ దన్విసమస్తము నేఱె లక్ష్మణా! ౯౬

తాత్పర్యము

నేను రాజభార్యనై యేమియుఁ దీసికొనక రిత్తచేతుల నేమని మునిపత్నులను జూడఁబోదును, వారికిచ్చుటకుఁ గావలసిన వస్త్రములు, సొమ్ములు తీసికొని పోయి ప్రేమతో నిచ్చెదనని, ఇదిగోఁ ద్వరగా వచ్చెదనని కావలసినవన్ని తీసికొని లక్ష్మణా!

క. ఇవి వారికిఁ గొన యోగ్యమె, యివి మన కీయంగఁ దగునె ♦ యివి మంచివెకా!
యవుఁ గా దనవేలన నతఁడవు నవు ననె నణఁచికొనుచు ♦ నలమట తనలోన్.

తాత్పర్యము

(ఇవి వారు తీసికొనఁ దగినవే? ఇవి మనమీయవచ్చునా? ఇదిగో నివి మంచివేగదా, ఔను కాదని చెప్పవేమి యని సీత యడుగ దుఃఖము మనస్సులో నణఁచుకొనుచు, అవును ఔను అనెను.

క. ఎంతెంత ముదము సతిగొను, నంతంత సుమిత్రతనయుఁ ♦ డడలెన్ మదిలోన్
సుంతయు వెలిఁదోఁపద, ధృతి, మంతుఁడు గావుటను జెలి స ♦ మస్తముఁ గొనుచున్.

అర్థములు. అడలెన్=దుఃఖించెను, సుమంతయున్=కొంచమైనను, వెలిన్=వెలుపలికి.

తాత్పర్యము

సీతాదేవి యెంతెంత సంతోషపడెనో లక్ష్మణుఁ డంతంత తనలో దుఃఖపడెను గాని ధైర్యవంతుఁడు కావున తన దుఃఖము వెలుపలికిఁ దెలియ నిచ్చినవాఁడు కాఁడు.

క. పయనింపఁగ నరదముపై, నయమున నెక్కించి సతిని ♦ సాధునమజ్ఞన్
హయములఁ దోలుము సూతా! రయమున నన నాతఁడట్లె ♦ రథముం గడపన్.

తాత్పర్యము

(సీత ప్రయాణము కాఁగానే లక్ష్మణుఁడు రామునాజ్ఞ చొప్పున నామెను రథముపై నెక్కించి, సూతా! రథమును ద్వరఁగాఁ దోలుమని చెప్పఁగా నతఁడట్లె రథమును దోలెను.)

—♦ సీతాదేవి యపశకునంబులఁ గని పరితపించుట ♦

క. అనుఁగుమఱందిం గని యి, ట్లను జానకి లక్ష్మణా! మ ♦ హాపశకునముల్
గన నయ్యెడి నిదియేమో, మన నేటికొ తేర కిపుడు ♦ మల్లడి గొనియెన్. ౧౦౦

అర్థములు. అవశకునముల్=చెడ్డశకునముల్, మల్లడిగొనియెన్=పరితపించుచున్నది.

తాత్పర్యము.

(సీత ముద్దుమఱంది యగు లక్ష్మణునిఁ జూచి లక్ష్మణా! దారుణమగు నపశకునములు గనవచ్చుచున్నవి. అదియేమో నిర్హేతుకముగా మనస్సు పరితపించుచున్నది.)

క. కుడికన్నదరెడి నేటికొ! యొడలు వణంకెడిని జిత్త ♦ ముదిలగొనెన్ నా
యెడఁదయుఁ దలతట లాడెడిఁ గడఁకయు జెడె నేమి కీడు♦కలుగంగలదో. ౯౭౧

అర్థములు. ఎడఁద=హృదయము, గుండె, కడఁక=ప్రయత్నము, ఉదిలగొనెన్=పరితపించెను.

తాత్పర్యము

(ఏలనో కుడికన్నదరుచున్నది. దేహము వణఁకుచున్నది. చిత్తము పరితపించుచున్నది- నా గుండె తట తట గొట్టుకొనుచున్నది- ప్రయత్నము చెడిపోయినది ఏమి కీడు మూడనున్నదో.)

సీ. ఆశ్రమంబులఁ జూడ ♦ నాశమెం డయ్యెను, ధృతియేమియును లేదు♦ధీరచరిత!
పాడుగాఁ దోఁ చెఁ బ్ర ♦ పంచమంతయు నారు, నిబ్బరమెల్లను♦నీటఁ గలసె
నయ్య లక్ష్మణ! పలుకు♦మా భ్రాతృవత్సల, మీయన్నకును నేమ♦మే కదయ్యా!
యత్తలందఱకు సౌ♦ఖ్యంబెకా? చెప్పుమా,యని కేలుమోడ్చిక్ష్మా♦తనయపలుకు

ఆ. పౌరులకును జాన♦పదులకు సుఖమిడ, వేల్పులారా! మిమ్ము ♦ వేఁడుదాన
ననుచు మ్రొక్కె-నామె♦కభివాదనముసల్పి, యెల్లరకు సుఖంబ♦యెల్ల కడల.

అర్థములు. ధృతి=ధైర్యము, భ్రాతృవత్సల=అన్నయందుఁ బ్రేమగలవాఁడా.

తాత్పర్యము

(లక్ష్మణా! ఆశ్రమములను జూడవలె ననెడికోరిక యతిశయించుచున్నది. ధైర్యము రవ్వంతయు లేకున్నది. నాకుఁ బ్రపంచమంతయుఁ బాడుపడునట్లు కానవచ్చుచున్నది. నిబ్బరము నీటఁ గలిసినది. 'భ్రాతృవత్సలా! చెప్పుము- మీయన్న క్షేమముగా నున్నాఁడుఁకదా! అత్తలందఱకు సౌఖ్యమేకదా!' యని చేతులుమోడ్చి దేవతలారా! పురవాసులకును, గ్రామములందున్న జనులకును సుఖమును బ్రసాదింప మిముఁ బ్రార్థించుదాన' ననుచు మ్రొక్కె- సీతాదేవికి లక్ష్మణుఁడునమస్కరించి 'యందఱకు నన్ని తావుల సుఖమే')

క. అని పలికి మతిని వెత గొదకొను లక్ష్మణుఁ డరిగి కనియె♦గోమతి నట రే
యిని నాశ్రమమునఁగడుపుచు, నినుఁ డుదయింపఁగనె నూతు♦సెట్లునురథమున్.

అర్థములు. గొదకొను=అతిశయించు.

తా త్ప ర్య ము

(అని చెప్పి మనస్సునందు దుఃఖ మతిశయింప లక్ష్మణుఁడు పోయి గోమతి యను నదిని జూచెను. ఆరాత్రి యాశ్రమమునఁ గడపిఁ బ్రొద్దు పొడువఁగానే సూతునితో నిట్లు చెప్పెను. రథమును,)

క. తెమ్మా! భాగీరథి నీ, రమ్మును ధరియింతు నే శి♦రమ్మున భూమీ
ధ్రమ్మున హరుగతి నన శీ♦ఘ్రమ్మున నతఁడట్లచేసి♦క్ష్మాసుతతోడన్. ౬౭౪

అర్థములు. భూమీధ్రమ్మునన్=త్ర్యంబకపర్వతమునందు, హరుగతిన్= శివునివలె స్నానార్థమై శివుఁడు గంగను ధరించునట్లు నేను ధరించెద నని భావము.

తా త్ప ర్య ము

(దీసికొని రమ్ము 'త్రంబకపర్వతమందు స్నానార్థము శివుఁడు గంగను ధరించినట్లు నేను ధరించెదను' అనఁగానే త్వరఁగా సారథి రథమును దెచ్చి సీతా దేవితో.)

క. దేవీ! రథ మెక్కు మనన్, క్ష్మావిభుసతి యెక్కె నెక్కె ♦ సౌమిత్రిఁయు నెం
తోవేగ మరిగె నరదము, పావనగంగాతటంబుఁ ♦ బ్రాపింపంగన్. ౬౭౫

తా త్ప ర్య ము

దేవీ! రథ మెక్కుమనెను- అంత సీతాదేవి రథముమీఁద నెక్కెను. లక్ష్మ ణుఁడును నెక్కెను- ఎంతో వేగముగా రథము పవిత్రమగు గంగయొద్దను జేరఁ బోయెను.)

క. అరదినమున భాగీరథిఁ, బరికించి సుమిత్రపట్టి ♦ వ్యసనము పట్టం
దిరుఁ డెట్లుఁ గాక హా! యని, గురురవమున నేడ్వఁ వొడఁగె♦గుర్వగునార్తిన్.

అర్థములు. అరదినమునన్=సగము దినము ప్రయాణముచేసి, తిరుఁడు= స్థిరచిత్తము గలవాఁడు, గురురవమునన్=పెద్ద ధ్వనితో, గుర్వగు=గొప్పదగు, ఆర్తి=వ్యసనముచే.

తా త్ప ర్య ము

(సగము దినము ప్రయాణముచేసి గంగను జూచి, లక్ష్మణుఁడు దుఃఖమును బట్ట స్థైర్యము చాలక, అధికమగు నార్తిచే హా! యని పెద్ద ధ్వనితో నేడువ నారంభించెను.)

—♦ సీతాదేవి లక్ష్మణుఁడు దుఃఖింప నూరార్చుట ♦—

ఉ. ఆతనిరీతిఁ గాంచి జన♦కాత్మజ యిట్లను నేల యేడ్చెదో?
పూతచరిత్ర! యిత్తెఱఁగు ♦ పోలునె? యెన్ని దినాలనుండియో
చేతమునందుఁ గల్గినది ♦ సిద్ధిలె నేఁటికి నాకుఁ, బుణ్యగం
గాతటినీతటంబుఁ గనఁ♦గల్గియు నేడ్చెద వేల? లక్ష్మణా! ౬౭౭

అర్థములు. చేతము నందున్=మనస్సునందు.

తా త్ప ర్య ము

(సీతాదేవి లక్ష్మణుని వైఖరి చూచి, పవిత్ర చరిత్రముగల లక్ష్మణా! యెందుల కేడ్చెదవు? ఇది తగునా? ఎన్ని దినాల నుండియో మనస్సులో నున్న కోరిక నేటికి నాకుఁ జేకూఱినది. పావన గంగానదీ తీరము చూడఁ గలిగియు నేడ్చెద వేల? యని యడిగెను.)

క. సంతోషకాలమున నిటు, లింతగ నేడ్చుచును నాకు♦నెంతో మదికిన్
వంతఁ గలిగింపఁ దగునే?, వింతాయెను జూడ నీదు♦విధము మఱందీ! ౯౭౮

తా త్ప ర్య ము

(మఱఁదీ! లక్ష్మణా! సంతోష పడవలసిన కాలమున నీ వింతగా నేడ్చుచు నాకు విచారము కలిగింపఁ దగునా? నీవైఖరి చూడఁగా నాశ్చర్యముగానున్నది.)

ఉ. ఎప్పుడు రాముకొల్వుఁ ద్రుటి♦యేనియుఁ బాయవు నే నెఱుంగుదున్
దప్పె ద్వి రాత్రముల్ నిజము♦ దానికి నింతగ నేడ్చె దన్న? నా
కప్పురుషోత్తముండు విను♦ప్రాణముకంటెఁ బ్రియుండ యయ్యు నే
నిప్పగిదిన్ వెతం గొనితి♦నే? విడు లక్ష్మణ బాలిశత్వమున్. ౯౭౯

అర్థములు. ద్విరాత్రముల్ = రెండురాత్రులు, బాలిశత్వము = మూఢత్వము.

తా త్ప ర్య ము

(అన్నా! లక్ష్మణా! రామచంద్రమూర్తి సేవ క్షణమైన విడిచి యుండవని నే నెఱుఁగుదును. రెండు రాత్రులు విడచి యుండవలసి వచ్చిన దానికై యింతగా నేడ్చెదవు, నిజము. ఆ పురుషోత్తముఁడు నాకుఁ బ్రాణములకంటెఁ బ్రియమైన వాఁడు-అయినను నేను నీవలె దుఃఖపడు చుంటినా? దుఃఖింపవలదు,మూఢత్వము వదలుము.)

క. గంగానది దాఁటింపు ము, భంగురగతి నేగి ఋషుల ♦ పత్నుల కెల్లన్
బంగారు నగలు చేల లొ, సంగుచు నభివాదనంబు ♦ సలిపి సభక్తిన్. ౯౮౦

తా త్ప ర్య ము

(గంగానదిని దాఁటింపుము- వేగముగాఁ బోయి మునుల భార్యల కంఱకు బంగారునగలు, చీరెలు సమర్పించి భక్తితో నమస్కరించి,)

క. ఒక్కనిశయె మన మక్కడ, మక్కువ మై నుండి పురికి♦మరలుదము వెసన్
జక్కని నాపతిఁ గన నా, కెక్కువ తమాతమా జనించె ♦ నెద త్వరపడెడిన్. ౯౮౧

తాత్పర్యము

(ఒకరాత్రి మాత్రమే యక్కడ నుండి, వెంటనే యయోధ్యకు మరలి పోదము- సుందరుఁడగు నా పెనిమిటిని జూచుటకై నాకెంతో తహతహ కలిగినది హృదయము తొందర పెట్టుచున్నది.)

—♦ లక్ష్మణుఁడు శ్రీరామాజ్ఞ చెప్పలేక యేడ్చుట ♦—

చ. అనవుడు లక్ష్మణుండు నయ♦నాశ్రులు పాయఁగఁ ద్రోచి నావికా
జనముల నామతించుఁడును ♦ జయ్యన వారలు నావఁ గూర్చి చె
ప్పినఁ జని దాని నెక్కి పృథి♦వీసుతతో రథయుక్తుఁ డౌ సుమం
త్రుని నిలువంగ నాన యిడి ♦ తూర్ణమ జాహ్నవి దాఁటి తత్తటిన్. గా౹౧

అర్థములు. నయినాశ్రులు=కన్నీళ్ళు, ఆమతించుఁడును=పిలువఁగా, తత్తటిన్=ఆతీరమందు.

తాత్పర్యము

(అని సీత చెప్పఁగా లక్ష్మణుఁడు కన్నీళ్ళు తుడుచుకొని, నావ నడపు బెస్త లను బిలువఁగా, వారు తత్క్షణమే నావను గొనివచ్చి 'స్వామీ' నావ సిద్ధముగా నున్నదని చెప్పఁగానే సీతాదేవితో నావ నెక్కి- లక్ష్మణుఁడు, సుమంత్రుని రథముతో నక్కడ నిలువ నాజ్ఞాపించి, శీఘ్రముగా గంగను దాఁటి యావలి యొడ్డున.)

క. అన్నులమిన్నను మైథిలిం, గన్నొని గని దేహమెల్లఁ ♦ గంపం బెత్తన్
గన్నులనీటం దడియుచు, విన్నప మొనరించె నిట్లు ♦ విహ్వలమతియై. గా౹౩

అర్థములు. అన్నులమిన్నను=స్త్రీరత్నమును, విహ్వలమతియై = విరవిరఁ బోవు మనస్సుగలవాఁడై.

తాత్పర్యము

(స్త్రీరత్నమగు జానకిని జూచి దేహమంతయుఁ గంపమెత్తఁగా, గన్నీరు కార్చుచు విరవిరబోవు మనస్సుగలవాఁడై యిట్లు విన్నపము చేసెను.)

చ. కటకట నన్ను నిట్టి కడు♦కష్టపుఁగార్యముఁ జేయఁ బంచి ప్ర
స్ఫుటముగ లోకనిందలను ♦ బ్రుంగఁగఁ జేసెఁ గదమ్మ యన్న యే
పటుతరశల్యమై యదియ ♦ బాధలు పెట్టెడి నన్ను, శ్రేయమాఁ
దటుకున మృత్యువేన్ దొడర ♦ దారుణశీలున కిట్టివానికిన్. గా౹౪

అర్థములు. బ్రుంగఁగన్=మునుఁగఁగ, పటుతరశల్యమై=మిగుల దృఢమైన మేకై, దారుణశీలునకున్=క్రూరపు నడవడి కలవానికి.

తా త్ప ర్య ము.

అయ్యో! నన్నింత కష్టకార్యముచేయ నాజ్ఞాపించి యన్న యే నన్ను లోక నిందల మునుఁగగాఁ జేసెఁగదా! అదియే నన్ను గట్టి మేకు హృదయమున నాఁటి నట్లు బాధించుచున్నది. నావంటి క్రూరమైన నడవడి గలవానికిఁ దటాలున చావు వచ్చినను మేలే.

క. ఘోర మగు నిట్టికృత్యము దీరుపఁగా నేను దొరకితిన్ భూపతికిన్
ధీరమతీ యిది తగునే? చారుగుణుం డైన రామచంద్రునకయ్యో! ౯౫౫

తా త్ప ర్య ము

ధైర్యపు మనస్సు గలదానా! యిటువంటి ఘోరకార్యము చేయుటకు రాజునకు నేను దొరకితిని గదా. ఎంతో మంచి గుణములుగల రామచంద్రునకిట్టి కార్యము తగునా?

క. పాపపు బని యిదియైనను, బాపాత్ముఁడ నంచుఁ దలఁపవలవదు తల్లీ!
నాపాపము క్షమియింపుము, భూపుత్రీ యనుచు నతఁడు పుడమిం ద్రెళ్ళెన్. ౯౫౮

తా త్ప ర్య ము

(అమ్మా! యిది పాపపుఁబనియే. అయినను నేను బాపాత్ముఁడనని యనుకొనకుము. నీవు భూదేవి కూఁతురవు కావున నాపాపమును క్షమింపుము. అని చెప్పుచు లక్ష్మణుఁడు నేలమీఁదఁ బడిపోయెను.)

క. రాదే మృత్యు వటంచును, రోదనముం జలుపువాని రోహిత నయనున్
మేదుర దుఃఖాన్వితుఁ బ్రసాదింపఁగఁ గేలుమోడ్చు సౌమిత్రి వరున్. ౯౫౭

అర్థములు. రోహితనయనున్=ఏడ్చుటచే నెఱ్ఱనైనఁ గన్నులు గలవానిని, మేదుర=దట్టమైన,దుఃఖాన్వితున్=దుఃఖముతోఁగూడిన వానిని, ప్రసాదింపఁగన్= అనుగ్రహింపఁగ, సౌమిత్రివరున్=లక్ష్మణుని.

తా త్ప ర్య ము

ఇట్టి ఘోరకృత్యముచేయ సాహసించిన నాకుఁ జావురాదే,యని రోదనము చేయుటచేఁ గన్ను లెఱ్ఱనైనవాని దట్టమగు దుఃఖముతోఁ గూడిన వానిని, అనుగ్రహింపమని, నమస్కరించు లక్ష్మణుని.)

క. కని మిక్కిలి వెఱపుం గొని, జనకజ యిదియేమి యెఱుఁగఁజాల నొకండున్
వనరెద వేటికి లక్ష్మణ!, యనుమా కతమెల్ల సేమమా? రాజునకున్. ౯౫౮

అర్థములు. కతము=కారణము, వనరెదవు=దుఃఖించెదవు.

తాత్పర్యము

(చూచి, మిగుల భీతిచెంది, సీత 'లక్ష్మణా! నాకొకటియును దెలియదు నీవేల యేడ్చెదవు, కారణము తెలుపుము. రాజుగారికి క్షేమమే కదా')

క. ఆన యిడితి భూపతిపై మానక వచియింపు నాన♦మక్షమునం దే
లా నీవు వగచె దీగతి? నానతి నీ కిడినదాన ♦ నని యెసకొలుపన్. ౯౮౯

అర్థములు. ఆన=ఆజ్ఞ, ఒట్టు ఆనతి=ఆజ్ఞ, ఎసకొలువన్=ప్రేరింపఁగా.

తాత్పర్యము

(రాజుమీఁద నొట్టు పెట్టితిని. తప్పక చెప్పుము. నాయెదుట నీవిధముగా నేల యేడ్చెదవు! నీ కాజ్ఞ చేసెదనని ప్రేరింపఁగా.)

—♦ లక్ష్మణుఁడు సీతాదేవికి శ్రీరామాజ్ఞ నెఱింగించుట ♦—

క. తల వ్రేలవైచి బాష్పం, బుల గద్గదపాటు దనరఁ ♦ బొక్కుచు మదిలోఁ
గలది గలయట్లు సర్వం, బలివేణికి విన్నవించె ♦ నాతం డిట్టుల్. ౯౯౦

తాత్పర్యము

(తలవ్రేలవైచి, కన్నీరు కార్చుచు గద్గద స్వరముతో, మనస్సులోఁ బరితపించుచు, సీతతో నున్న దున్నట్టు లంతయు లక్ష్మణుం డీవిధముగాఁ జెప్పెను.)

ఉ. తల్లి వచింతు నే మనుచు? దారుణ వార్తలు పట్టణంబులం
బల్లెల నిన్నుఁ గూర్చి జన♦వర్గము పల్కుట తాను గొల్వులో
నెల్లరుఁ జెప్పఁగా విని మ♦హీంద్రుఁడు దుఃఖము పేర్మి హృద్గతం
బెల్ల వచించి నాకుఁ దన♦యింటికి నేగెఁ బతివ్రతామణీ! ౯౯౧

అర్థములు. హృద్గతంబు=హృదయమున గలది, పతివ్రతామణీ=ఇది నీయందు దోషము లేదని తెలుపఁ బ్రయోగింపబడెను.

తాత్పర్యము

(తల్లీ! యేమని చెప్పుదును? పట్టనములందుఁ బల్లెలందుఁ నిన్నుఁగూర్చి జనులాడుకొను దారుణపు మాటలు గొల్వులో నెల్లరు చెప్పఁగా విని, రాజు మిగుల దుఃఖమును జెంది మనస్సులోనున్న విషయము నాకుఁ జెప్పి, పతివ్రతా శిరోమణీ! తన గృహమునకుఁ బోయెను.)

క. ఆ మాటలన్నియును నే, నీముంగలఁ జెప్పరాదు ♦ నేఁ గన్నారన్
నీ మహిమ గంటి; నిన్నున్, భూమిజనుల నడికి వెఱచి♦భూపతి విడిచెన్. ౯౯౨

తాత్పర్యము.

రామచంద్రమూర్తి చెప్పిన మాటలన్నియు నీతో నేను జెప్పరాదు. నీ మహిమ నేను గన్నారఁజూచి యున్నాను నీ శీలవిషయమున సందేహము లేదు. జననింద సహింపఁజాలక నిన్ను రాజు వదలిపెట్టెను.

ఉ. అంతియ కాని వేఱొకటి ♦ నాత్మఁదలంపకు, మాశ్రమంబుల
న్పొంతల నిన్ను నే విడిచి♦పోఁగలవాఁడను రాజునాజ్ఞ, భూ
కాంతుఁడు నీకు వేఁకటిని ♦ గల్గిన కోర్కుల సాకు పెట్టి యి
ట్లింతలు చేయు మం చనియె ♦ నియ్యవి గాంగతటీతపోవనుల్. ౯౯౩

తాత్పర్యము

వాస్తవ మియ్యదియే నీశీలమును సందేహించి నిన్ను విడిచెనని తలఁప వలదు రాజాజ్ఞ ప్రకారము నిన్ను ఋష్యాశ్రమసమీపంబున వదలి నేనుబోదును. నీకు వేఁకటి వలనఁ గలిగిన కోరిక నెపము పెట్టి రాజింత కార్యము చేయుమని చెప్పెను. నీవు చూడఁగోరిన గంగాతీర తపోవనము లియ్యవియే.

క. రమణీయంబులు కఁడుబు, ణ్యములున్ వెతపడకు మమ్మ♦యట దశరథభూ
రమణుసఖుం డగు విప్రుఁడు, విమలమనస్కుఁడు తపస్వి♦వితతయశుండున్. ౯౯౪

తాత్పర్యము

ఈ వనములు మిక్కిలి మనోహరములు, పుణ్యవంతములు, కావున వ్యసన పడకుము. ఇచ్చటనే దశరథమహారాజు మిత్రుఁడును, బ్రాహ్మణుఁడును, నిర్మలమై మనస్సుగలవాఁడును, మహాతపశ్శాలియు, విస్తార కీర్తిపరుఁడును.

క. ముని వాల్మీకి వసించును, జనకసుతా! యతనిపాద♦సంసేవను నీ
దినములు గడుపుము రాముని, మనమున నిలుపుచు సతీత్వ♦మానితనియతిన్. ౯౯౫

అర్థములు. సతీత్వ=పాతివ్రత్యముచే, మానిత=గౌరవింపఁబడిన, నియతిన్= నియమముచే.

తాత్పర్యము

(జానకీదేవీ! వాల్మీకి మునీశ్వరుఁడు నివసించును, ఆ వాల్మీకి పాదసేవ చేయుచు మనస్సులో శ్రీరామచంద్రుని నిలిపి, పాతివ్రత్యనియమముచే దినములు గడుపుము.)

ఏనాఁడు సీతాదేవి కోరెనో యానాఁడే యామె చర్యను గుఱించి విచారించుటయు, వాల్మీకి యాశ్రమమందని పేరుచెప్పి యందు విడిచి రమ్మనుటయు నాలోచింపఁగా రామచంద్రమూర్తి భూతభవిష్యత్తులు తెలిసియే యిట్లు చేసెనని యెఱుఁగనగు.

సీతాదేవిని వదలుటకు చాకలివాని మాట కారణమని వాల్మీకి చెప్పలేదు. ఒకని నిమిత్తమై యింత పని చేయలేదు.

—♦ శ్రీరామాజ్ఞ విని సీతాదేవి విలపించుట ♦—

ఉ. నీకు శుభంబు గూడు నన ♦ నిష్ఠురవాక్యము లాలకించి సు
శ్లోక మహావిషాదమున ♦ సోలి ముహూర్తము లబ్ధసంజ్ఞయై
శోకము మీరఁగా గమల♦సూతి సృజించె మదీయ దేహమున్
జేకుఱ సర్వదుఃఖతతి ♦ చెప్పుకొనన్ ఫల మేమి లక్ష్మణా! ౯౯౬

అర్థములు. సుశ్లోక=మంచికీర్తి గలది, మహావిషాదమునన్=మిక్కిలి శోకముతో, సోలి=మూర్ఛపోయి, లబ్ధసంజ్ఞయై=స్మృతి పొందినదై, కమలసూతి=బ్రహ్మ.

తా త్ప ర్య ము

నీకు మేలు కలుగు నని చెప్పఁగా నా కఠినవాక్యములు విని సత్కీర్తిశాలిని యయిన సీతాదేవి తీవ్రదుఃఖముచే మూర్ఛపోయి పడి తెప్పరిల్లి కొంచెము సేపునకు లేచి యిట్లనియె. లక్ష్మణా! బ్రహ్మదేవుఁడు నన్ను దుఃఖమే యనుభవింపుమని నా దేహమును సృజించెను. ఎన్ని దుఃఖములు లెం లెంత రావలయునో యన్నియువచ్చినవి. ఏమి చెప్పుకొని యేమి ఫలము.

ఉ. ఎట్టి యఘోరపాపముల ♦ నే నొనరించితి నొక్కొ, పూర్వమం
దెట్టిమహాత్మురాలిఁ బతి ♦ నే నెడఁబాసితి నొక్కొ, కాదయే
నిట్టుల నిర్నిమిత్తముగ ♦ నేయఘ మై నెఱుంగనట్టి న
న్నట్టడవిన్ విడంగ నర♦నాథుఁడు పంచునె? దోస మెంచునే? ౯౯౭

అర్థములు. అఘోర=దేనికంటె ఘోరమైనది లేదో యది యఘోరము-మిక్కిలి భయంకరములైనవి- ఏ యఘము=ఏపాపము.

తా త్ప ర్య ము

లక్ష్మణా! నే నింతకు ముందెట్టి మహాభయంకరములైన క్రూరపాపములు చేసితినో, ఏపుణ్యాత్మురాలిని బతితోడ నుండనీయక యెడఁబాపితినోకదా. అట్లు కాదేని యేనిమిత్తము లేక యేదోషము నెఱుంగనినన్ను నట్టడవిలో విడువ నాజ్ఞాపించునా? నాయందు దోషము తలఁచునా?

'అత్యుత్కటైః పుణ్యపాపై రిహైవ ఫలమశ్నుతే' యని ప్రమాణము. మిగుల నధికమైన పుణ్యఫలముగాని పాపఫలముగాని యీజన్మయందే యనుభవించును. మానసం మనసైవాయ ముపభుంక్తే శుభాశుభమ్, వాచా వాచాకృతం కర్మ

కాయేనైవచ కాయికమ్' మను, మనస్సుతోఁ జేసిన పుణ్యపాపములు మనస్సుతో ననుభవింపవలయును. వాక్కుతో జేసినవి వాక్కుతో ననుభవింపవలయును. దేహముతోఁ జేసినవి దేహముతో ననుభవింపవలెను.

ఉ. స్వామిరఘూత్తమాంఘ్రిపరి♦చర్యమొనర్చు ముదాన బూర్వము
ద్గ్రామితదుఃఖసంతతుల ♦ నమ్మెయి నోర్చితి నాశ్రమంబులం
దేమని నిర్జనాటవుల ♦ నిప్పుడు నే వసియింతు నొంటిగా
నే మని నాదు దుఃఖముల ♦ నేరికి నే వచియింతు లక్ష్మణా! ౯౯౮

అర్థములు. స్వామి=సొమ్ముకలవాఁడు, యజమానుఁడు, అంఘ్రిపరిచర్య=పాదసేవ, ముదానన్=సంతోషముతో, పూర్వము=పదునాలుగు సంవత్సరము లరణ్యమందున్నప్పుడు, ఆశ్రమంబులందు=ఋషీశ్వరులుండు స్థలములందు, నిర్జనాటవులన్=మనుష్యులు లేని యడవులందు.

తాత్పర్యము

లక్ష్మణా! నేను రామచంద్రుని సొమ్మని, ఆయన యా సొమ్ముగలవాఁడని తలఁచి యాయన పాదసేవసేయు సంతోషముతో పూర్వము ఋషులుండు నాశ్రమములందు భయంకరములై మితిమీఱిన దుఃఖముల వహించితిని. ఇప్పుడో యేమి కార్యము చేయుటకై జనులు లేని యడవులందు నొంటిగా జీవింతును. నాదుఃఖము లెవరికి నే నేమని చెప్పుదును.

ఉ. ఏటికిఁ బుణ్యశీలుఁడు న♦రేంద్రుఁడు రామవిభుండు నిన్వనీ
వాటికిఁ బంచె నిందు? నటు♦వంటి యసత్కృతి యేమి చేసితో
బోటి! యటంచు నన్ను ముని♦పుంగవు లాడఁగ నేమి పల్కుదున్
బాటిదొఱంగి నా విభుని♦పై నెటు చెప్పుదు నిర్దయత్వమున్ ౯౯౯

తాత్పర్యము

రామచంద్రమహారాజెంతో పుణ్యాత్ముఁడే, నిష్కారణముగ నెవరినిదండింపఁడు. అట్టివాఁడు నిన్నేల యీ యడవులందు విడిచించెనని, అటువంటి ఘోర పాపము నీవేమి చేసితి వని ఋషీశ్వరులు నన్నడిగిన నేనేమని చెప్పదును. నామగఁడు దయలేనివాఁడై యిట్లు చేసెనని యాయనయందు నే నెట్లు దోషము చెప్పుదును, అది వాస్తవమేయైనను నేను జెప్పుట క్రమముగాదే

క. నా మగని రాజవంశము, భూమిపయిన్ ఛిన్నమగుచుఁ♦బోవదయేనిన్
సౌమిత్రీ? జాహ్నవిలో, నా మేను త్యజింపకుందు♦నా యీత్రుటిలోనే? ౧౦౦౦

తాత్పర్యము

నా మగని రాజవంశము భూమిమీఁద నిలిచిపోకుండునేని లక్ష్మణా? యీ గంగలో నీ నిమిషమున నా దేహమును వదలకుందునా.

శ్రీరామచంద్రమూర్తికి వేఱొక భార్య యుండినను మఱియొక స్త్రీతో రామచంద్రమూర్తి సంభోగించునని తోఁచియుండినను సీతాదేవి యీమాట చెప్పఁగారణము లేదు. ఇది యాయన యేకపత్నీవ్రతత్వమును స్థాపించెడిని.

క. అదిగాక దుఃఖపాటున, మది రోసి శరీర మేను ♦ మానినచో ని
ష్ఠదయుఁ డని రఘుకులంబున, వలదని యపకీర్తి నాదు♦పతికిం గలుగున్. ౧౦౧

తాత్పర్యము

ఆ కారణము గాక మఱియొక కారణము గలదు. ఈ దుఃఖముచే నీదేహము నందు రోఁతపుట్టి యీ దేహముతో నే నిఁకఁ జేయవలసిన కార్యము లేదు. కావున, వదలి పెట్టితినా నామగఁడు దయలేని వాఁడని రఘువంశమున శాశ్వత మైన యపకీర్తి తప్పక కలుగును. ఆ నాఁడు లంకలో జరగిన వారు దేవతలు, వానరులు, రాక్షసులు లోనగువారు- కలరుగదా- వారు లోకమున నేను నిర్దోషు రాలని చెప్పుదురు. కాని చెప్పకపోరు. ఇంత పాపము లోకము సహింపదు. నే నిప్పుడు మరణించితినా రామచంద్రమూర్తి కేవలము నిర్దయుఁడు, నిష్కారణ ముగా భార్యను జంపెనని చెప్పుదురు. కాని చెప్పకపోరు. నా మగఁ డట్టి నింద పొందుటకు నేను గారణము కారాదు. అది నాకుఁ దగదు.

తెలిసి తెలిసి యింతటిఘోరకార్యము చేసి భర్తయందిట్టి భావముగల భార్య సీతాదేవి యొకతెయే. ఇట్టిభావ మితరస్త్రీలయందు దుర్లభము.

—♦ సీత శ్రీరామాదులకుఁ గడవాక్యంబులు చెప్పి పంపుట ♦—

ఉ. కావున రాజు నానతి ప్ర♦కారముఁ జేయఁగదయ్య లక్ష్మణా!
యీవనవాటి నన్ను దుర♦దృష్టను వీడుము దుఃఖభాగినిన్
భూవరునాజ్ఞలో నిలుము ♦ పుణ్యము నీ కగు నాదుపల్కులన్
వావిరి విన్మ ప్రొక్కితిని ♦ ప్రాంజలినై యను మత్తగార్లతోన్. ౧౦౨

తాత్పర్యము

ఈ కారణముచే నీవు రాజాజ్ఞ ప్రకారము వర్తింపుము. నీకు నేనేమియు నష్టము చెప్పను. ఈ నిర్భాగ్యురాలిని నీ యడవిలో విడిచిపొమ్ము. రాజాజ్ఞ యందు నిలుము. నీకుఁ బుణ్యము గలదు. నేను నమస్కరించితి నని మా యత్త గార్లకుఁ జెప్పుము.

క. నామాఱుగ భూపతికిన్, సౌమిత్రీ! ప్రొక్కి వ్రాలి ♦ చరణంబుల మీా
సేమంబు నడిగె ననుమీా, యీా మాఁటని జెప్పవన్న ♦ యత్తలకెల్లన్. ౧౦౩

తా త్ప ర్య ము

(నాకు మాఱుగా రాజునకు మ్రొక్కి లక్ష్మణా! యా ప్రభుని శ్రీపాదముల మీఁదఁ బడి సేమమడిగితి నని విన్నవింపుము. అన్నా! నా యత్తలకందఱ కదే విధముగఁ దెలుపుము.)

సీ. ధరణీశ్వరునితోడ ♦ ధర్మమార్గంబున, దృష్టి పాయక ప్రవ♦ర్తిల్లు మనుము
జానకి నిర్మల♦స్వాంత యంచును దత్త్వ మంత నీయెఱిఁగిన♦యదియనుము
నీ హితకాంక్షిణి ♦ నీ భక్తురాలనే, సత మంచు నీమది ♦ స్పష్ట మనుము
అపవాదమునకు భ ♦ యంపడు నీచేత ననద యట్టులు త్యక్త ♦ నైతి ననుము
ఆ. నీవు పరమ గతివి ♦ కావున నాకు నీ,యపయశంబుఁ బాప ♦ నర్హ మనుము
నాదువాక్యములుగ♦నాయనా! మీయన్న,తోడ నిన్ని కరుణ♦తోడ ననుము.

అర్థములు. అనద=దిక్కులేనిది, త్యక్త=విడువఁబడినది.

తా త్ప ర్య ము

లక్ష్మణా! రాజుగారితో ధర్మమందే దృష్టియుంచి కామాదులచే నధర్మ మార్గమునఁ బోవలదనుము. లోకులు నన్ను నిందలాడిరని వారిపైఁ గోపింపవలదని చెప్పుము. జానకి నిర్మలమైన మనస్సు గలది యనునది నీ మనస్సునకుఁ దెలిసిన విషయమే యనుము. నేను నీ మేలు కోరుదానను. నీ భక్తురాల ననునది నీ మనస్సున స్పష్టమని చెప్పుము. ఇట్లుండియు లోకనిందకు భయపడి దిక్కులేని దానివలె వదలి పెట్టఁబడితిని గాని దోషురాలను కాదని నే నెఱుఁగుదు ననుము. కావున నీవే నాకు నుత్తమ గతి వగుటచే నీకు వచ్చిన యపకీర్తి తొలగించుట నాకును దగిన కార్యమే యనుము. నాయనా! యవి యన్నియు నా మాటలుగా నాయందు దయ యుంచి మీ యన్నతోడ ననుము.

ఉ. పౌరుల నెల్ల వారిఁ దన♦భ్రాతలరీతిని జక్కఁ బ్రోచుచున్
సారఘధర్మమార్గమున ♦ సంతత ముర్వి భరించు టేఁడు ధా
త్రీరమణా! యనుత్తమగ♦తిన్ భజియించును ధర్మమున్ సదా
భూరిసుకీర్తియుం బడయఁ ♦బోలు నటంచును విన్నవింపుమీ. ౧౦౫

తా త్ప ర్య ము

(పౌరులను తన సోదరులట్లు రక్షింపు మనుము. నిరంతర ధర్మమార్గమున భూమి నేలుమనుము. శాశ్వతకీర్తి వహింపుమని విన్నవింపుము.)

క. స్వశరీరము దుఃఖంబునఁ, గృశియించెడి ననుచు నేను ♦ ఖేదమువడ బా
లిశు లగు పౌరులభృశక,ర్కశవాక్కులఁ దలఁచి తలఁచి♦కడుదుఃఖింతున్. ౧౦౬

అర్థములు. స్వశరీరము=నా దేహము, కృశియించెడిన్=చిక్కిపోవునని, బాలిశులు=మూఢులు, భృశ=మిక్కిలి, కర్కశ=కఠినములైన, వాక్కులన్=మాటలను.

తా త్ప ర్య ము

నా దేహము దుఃఖముచే నేడ్చుటవలనఁ జిక్కిపోవునే యని నేను దుఃఖింపను. వాస్తవము తెలియని మూఢులు పౌరులు నన్నాడిన మిక్కిలి కఠినములైన మాటలు తలఁచి తలఁచి మిక్కుటముగ దుఃఖించెదను.

ఉ. పౌరుల రిత్తనిందలకుఁ ♦ బాల్పడ కుండెడునట్లు ధారిణీ
భారముఁ బూను మం చనుము ♦ భార్యకుఁ బ్రాణవిభుండె దైవతం
బారఁగఁ జుట్టమున్ గురువు ♦ నౌటను బ్రాణముకంటె మిన్నగా
సారసనేత్ర భర్తకెల♦సంబులు దీర్చుటె యుక్త మెప్పుడున్. ౧౦౦౭

అర్థములు. కెలసంబులు=కార్యములు.

తా త్ప ర్య ము

(పురజనులాడు నిందలకుఁ బాలుగాకుండునట్లు రాజ్యభారమును బూనుమని చెప్పుము. భార్యకుఁ బ్రాణవిభుఁడే దైవము చుట్టము గురువు కావునఁ బ్రాణముకంటె నాఁథుని తనపెనిమిటికార్యములు నెఱవేర్చుటయె యెప్పుడును యుక్తము.)

క. అని నా సంగ్రహవాక్యం,బును జెప్పుము పతికి నింకఁ ♦ బురికిం బొమ్మా
కనుమీ నను గర్భము చి,హ్నను దాల్చినదాన నెట్టి♦యలజడి గలిగెను. ౧౦౦౮

తా త్ప ర్య ము

ఇట్లు సంగ్రహముగా నేను జెప్పిన మాటలు నాభర్తకుఁ జెప్పుము, ఊరికిఁ బొమ్ము లక్ష్మణా! నేను గర్భచిహ్నము ధరించినదానను చూడుము, ఇట్టి దశయందు నా కెట్టి బాధ కలిగెనో చూడుము.

—♦ లక్ష్మణుఁడు సీతాదేవిచే ననుజ్ఞ గొని మరలి గంగ దాఁటుట ♦—

చ. అనవుడు దీనచిత్తుఁ డబ♦లాంఘ్రుల మ్రోల ధరిత్రి సోఁకఁగాఁ
దనదుశిరంబు వ్రాల్చి వసు♦ధాతనయామణితోడ నొక్కప
ల్కును వచియింప లేకవల♦గొంచు మహారవ మార నేడ్చుచున్
దనమది నొక్కమారుతము ♦ ధ్యాన మొనర్చుచుఁ బల్కు సీతతోన్. ౧౦౦౯

అర్థములు. దీనచిత్తుఁడు=శోకముతోఁ జిన్నవోయిన మనస్సుగలవాఁడు, ధరిత్రి సోఁకఁగా నసుటచే పాదము లంటక, వలగొంచున్ = ప్రదక్షిణము చేసి, మహారవము=పెద్దధ్వని.

తా త్ప ర్య ము

(అని చెప్పఁగా, లక్ష్మణుఁడు శోకముతో, జిన్నవోయిన మనస్సుగలవాఁడై యామె పాదముల సన్నిధిలో నేల నంటునట్లు తలవోఁచి సీతతో నొక్క మాటయైనఁ బలుకలేక, ప్రదక్షిణము చేసి, బిగ్గరగా నేడ్చుచుఁ దన మనస్సులో నొక ముహూర్త కాలము ధ్యానము చేయుచు సీతతోఁ జెప్పెను.)

చ. అనఘచరిత్ర! యే మనుచు ♦ నాడితి వేను భవత్స్వరూపమున్
గనినది లేద యింతదను♦కన్ భవదంఘ్రియుగంబుఁ దక్కఁగా,
జనములు లేని యీయడవి ♦ సాధ్వి!రో రాముఁడు లేని వేళ నేఁ
గనుటయుఁ గల్గునే? యనుచు ♦ గ్రక్కున మ్రొక్కి కలంబు జేరఁగన్.౧౧౧

తా త్ప ర్య ము

పుణ్యాత్మురాలా! యేమని యంటివి, నీ గర్భము చూడుమంటివా? నేనింత వఱకు నీ రూపమును జూచినవాఁడఁగాను నిపాదములను మాత్రమే నేనుదర్శించితిని. ఇట్లుండ నిప్పుడడవిలో జనులులేనిచోట నీభర్తయు నెదుటలేని యప్పుడు నేను నిన్నుఁ జూతునా? చూడను, అని వెంటనే మ్రొక్కి పడవచేరఁబోయెను. గర్భవిషయమైన యపనింద మరల నేమి వచ్చునో యని సాక్షికై లక్ష్మణుని జూడమనెను. ఇదివఱకుఁ జూచిన నిషయమున నేమి చేయఁ గలిగెను? ఇఁక నేమి చేయఁగలఁడు. ఆర్యచరిత్ర రత్నావళి యందలి సీతాదేవి చరిత్రమందును సీతోపదేశమందును సీతామాహాత్మ్య మెఱుఁగనగు.

క. చని నావ యెక్కి నడుపుమ, యని నావికుఁ దీవరించి ♦ యావలియొడ్డుం
గని డిగ్గి దుఃఖభరమునఁ వనరుచు మూర్ఛాత్మునట్లు♦పడెరథమందున్. ౧౧౨

తా త్ప ర్య ము

(పోయి, పడవమీఁద నెక్కి 'నావ పోనిమ్మని' నావికునిఁ బొందరించి యావలి యొడ్డునకుఁబోయి, యచటఁ దిగి దుఃఖాతిశయమున నేడ్చుచు మూర్ఛుని వలె రథములోఁ బోయి పడెను.)

క. మాటికి మాటికి నృపుసీ,మాటిం గనుఁగొనుచు ననద♦మాడ్కిని హృదయ
స్ఫోటముగా ధరఁ బొరలుచు, గాటంబుగ నేడ్చు కాంతఁ♦గనుచుం జనియెన్.

అర్థములు. నృపుసీమాటిన్=రాజుయొక్క యుత్తమస్త్రీని, అనదమాడ్కిని=దిక్కులేనిదానివలె, హృదయస్ఫోటముగాన్=చూచువారి గుండెలు పగులునట్లు.

తా త్ప ర్య ము

(మాటి మాటికి సీతను జూచుచు, దిక్కులేనిదానివలె నేలఁబడి పొరలుచు గుండెలు వ్రక్కలగునట్లు గట్టిగా నేడ్చుచున్న సీతను జూచుచుఁ బోయెను.)

క. అరదంబును దవ్వవ్వగ, నురవడిఁ జనఁ జూచి చూచి ♦ యుదరఁగ గుండెల్
తరుణీమణి యేకాంతము, దురసిల్లుచు నుండె నేల ♦ బొరలుచు నుండెన్. ౧౦౧౩

అర్థములు. ఏకాంతము=ఒంటరితనము, దురపిల్లుచున్=సంతాపపడుచు.

తాత్పర్యము

(రథము దూరము దూరముగాఁ బోవుట చూచి చూచి, గుండెలు చెదర మిక్కిలి దుఃఖపడుచు సీత నేలఁమీద దొర్లుచు నుండెను.)

క. దిక్కుచెడి దుఃఖభరమున, స్రుక్కుచు కేకానినాద♦సుభగాటవిలో
నక్కమలాక్షి యశస్విని, మిక్కిలి యెలుఁగొప్ప నేడ్చి♦మిడుకుచు నుండన్.

అర్థములు. కేకానినాద=నెమలికూఁతలచే, సుభగాటవిలోన్=అందమైన యడవిలో.

తాత్పర్యము

(దిక్కుమాలి యతిదుఃఖముతో స్రుక్కిపోవుచు, నెమలికూఁతలచే నందమైన యడవిలోఁ దామర ఱేకులవంటి కన్నులుగల యా సీత మిక్కిలి బిగ్గరగ నేడ్చి పరితపించు చుండఁగా.)

—♦ మునికుమారులు వాల్మీకికి సీతావృత్తాంతముఁ దెలుపుట ♦—

క. మునిబాలు రా యశోధనఁ గని పరువున వాల్మీకి మునిఁ ♦ గనఁ జని నతులం
బొనరించి యామె తెఱఁగును, వినిపించిరి తాము గనిన♦వృత్తాంతంబున్. ౧౦౧౫

అర్థములు. యశోధనన్=యశస్సే ధనముగాఁ గలది, మఱి యే ధనము లేదని భావము, నతులన్=నమస్కారములను.

తాత్పర్యము

(మునిబాలకు లా యశస్సేధనముగాఁ గల సీతను జూచి పరుగెత్తిపోయి వాల్మీకి మహర్షినిఁ జూచి నమస్కరించి తా మామెను జూచిన విధమంతయును వినిపించిరి.)

సీ. ఏ మహాత్ముని♦యిల్లాలో మునినాథ, శ్రీమహాసతి యని ♦ చెప్పవచ్చు
నింతకు మున్నామె ♦ నెన్నఁడు గనలేదు, దివి నుండి వ్రాల్చిన♦దేవకాంత
యన నొప్పుచున్నది♦యనఘ యాలోచింపు, మేటిమొద్దున నామె♦యేడ్చుచున్న
దేము కంటిమి యది♦యేటికో యెఱుఁగరా, దొక్కతె యున్నది♦దిక్కులేని

ఆ. దానియట్లు మనుజ♦తరుణిగాఁ దోఁపదు, దుఃఖముల కనర్హ♦దుఃఖపడెడి
నాశ్రమంబుపొంత♦ననతిదూరంబున, నుంట సేవె శరణ♦మువిద కింక ౧౦౧౬

అర్థములు. శ్రీమహాసతి=శ్రీమహాలక్ష్మీదేవి, అనర్హ=తగినదిగాదు, అనతి దూరంబునన్=సమీపమందు, శరణము=రక్షకుఁడవు, ఉవిదకున్=స్త్రీకి.

తాత్పర్యము

(మునిశ్రేష్ఠా! ఆమె యే మహనీయుని యిల్లాలో కాని శ్రీ మహాలక్ష్మీదేవి యని చెప్పవచ్చును. ఇంతకు మును పెన్నఁడట్టి యామెను జూచునది లేదు-స్వర్గమునుండి జారి పడిన దేవతా స్త్రీవలె నున్నది-మీరాలోచింపుడు ఆమె యేటి యొడ్డున నేడ్చుచున్నది-మేము చూచితిమి - ఎందు కేడ్చుచున్నదో మాకుఁ దెలియలేదు. దిక్కు లేని దానివలె నొక్కతె యున్నది మనుష్య స్త్రీగాఁ దోఁపదు. దుఃఖములొందఁ దగినది కాదు కాని దుఃఖపడు చున్నది. - ఆశ్రమము పొంత సమీపములో నుండుటచే నామెకిఁక నీవె రక్షకుఁడవు.)

క. కాపాడువాఁడు లేమిని, దాపంబునఁ బడెడిఁ మిగుల • త్రాతవు నీవై
కాపాడుమా యశోవతి, నీపట్ల నటన్న మాని యెద యోజించెన్. ౧౧౮

అర్థములు. త్రాతవు=రక్షకుఁడవు.

తాత్పర్యము

రక్షకుఁడు లేని కారణమున మిక్కిలి పరితాపపడుచున్నది. నీవే రక్షకుఁడనై యా యశోవతిని గాపాడుము, అని చెప్పఁగా నాయన యలోచించెను.

ఆ. జ్ఞానదృష్టిచేత • సర్వంబుఁ బరికించి, పాదములనఁ బరువు • పారి త్రోడ
శిష్యులెల్ల రాగఁ • శీఘ్రంబ యర్ఘ్యంబుఁ, గొంచు గంగఁ జేరి • కాంచెసకిని

తాత్పర్యము

జరిగిన వృత్తాంతమంతయు జ్ఞానదృష్టిచే చూచి తెలిసికొని తనవెంట శిష్యులర్ఘ్యంబు తీసికొని త్వరగా రాఁగా పాదుక లయినఁ బొడుగుకొనక పరువెత్తుచు గంగ యొద్దకు వచ్చి యచ్చట సీతాదేవిని జూచెను.

—• వాల్మీకి సీతాదేవి నూరార్చి యాశ్రమంబునకుఁ దోడ్కొని చనుట •—

క. రాముని ప్రియురాలిని దుఃఖామిత పరితప్త ననద • యటు లుండెడి సీ
తామహిళామణిఁ గని ముని, యామోదము దనర నిట్టు • లను నాసతికిన్. ౧౧౯

అర్థములు. దుఃఖామిత పరితప్తన్ = దుఃఖముచే మిక్కిలి పరితపించుదాని,అనద యటుల=దిక్కులేని దానివలెఁ, ఆమోదము=సంతోషము, ఆమె శ్రీ మహాలక్ష్మి యని వాల్మీకి యెఱుఁగును. అటువంటి జగన్మాత తనయాశ్రమమునకు వచ్చెఁగదా యని సంతోషము.

సీ. దశరథధారిణీ♦ధవుకోడలవు నీవు, మహిషివి శ్రీరామ♦మహీపునకును
జనకనృపాలుని ♦ తనుజాతవును బతి, వ్రతల మేల్బంతి! స్వా♦గతము నీకు
నీరాక హేతువు ♦ నిఖిలంబు నే యోగ, దృష్టిని జూచితి ♦ శిష్టవినుత
సర్వలోకంబుల ♦ జరగెడు నవి యెల్ల, విదితముల్ నాకు నో వెలఁదిమిన్న
తే. మత్తపోలబ్ధచక్షుల ♦ మహిమఁ జేసి, కంటి నీయందుఁ బాపమొకండునైనఁ
గలుగనేరదు, భీతిల♦వలదుతల్లి యుండుమీ యిందు నీమది ♦ నుదిలగొనకు

అర్థములు. మహిషివి=పట్టపు దేవివి, తనూజాతవు=కూఁతురవు, శిష్ట వినుత=సాధువులచే స్తోత్రము=చేయఁబడినదానా, విదితముల్=తెలిసినవి, మత్తపో లబ్ధ చక్షుల మహిమ=నా తపస్సుచే లభించిన కన్నుల గొప్పతనముచే, ఉదిల గొనకు=పరితాపపడకుము.

తాత్పర్యము

(అమ్మా! నీవు దశరథమహారాజు కోడలవు-శ్రీరామచంద్రప్రభువు పట్టపు దేవివి-జనకమహారాజు కుమార్తెవు-పతివ్రతాశిరోమణివి- సాధువులచే స్తోత్రము చేయఁబడినదానా! నీ విచ్చటకు వచ్చిన కారణము నేను యోగదృష్టితోఁ జూచి తిని. నా తపో మహిమచే నాకెల్ల లోకముల జరగునవి యన్నియుఁ దెలియును-చూచితిని-నీయందు బాపమొక్కటియును లేదు - భయపడవలదు- నీ విచట నుండుము-పరితాపపడకుము.)

శా. అమ్మా నమ్ముము నన్ను నార్తివిడుమీ ♦ యర్ఘ్యంబుఁ గై కొమ్ము సొం
తమ్మౌ గేహమునందు నున్నయటు లా♦నందింపుమీ తల్లి! ని
త్యమ్మున్ ని న్నరయన్ మదాశ్రమము ప్రాం♦తంబందు నున్నారు నే
మమ్మున్ గల్గు తపస్వినుల్ సుతవలెన్♦మన్నించి రక్షింపఁగన్. ౧౦-౧౭

తాత్పర్యము

తల్లీ! నన్ను నమ్ముము దుఃఖము వదలుము, అర్ఘ్యంబు గ్రహింపుము, నీ సొంత యింటి యందున్నట్లు లిందు వసింపుము. సర్వకాలముల నీసుఖము విచారించుటకు జాలిన నియమవతు లగు స్త్రీలు నాయాశ్రమము సమీపమందే యున్నారు. వారు నిన్నుఁ దమ కుమారితవలెఁ గాపాడుదురు.

క. అనవుడుఁ బరమాద్భుత మగు, మునిపల్కుల నాలకించి ♦ ముగ్ధ శిరమునన్
బ్రణతి ఘటియించి కరముల, వినయమ్మున మోడ్చి యొప్పి♦వెంబడి నరిగెన్.

అర్థములు. ఒప్పి=వాల్మీకి చెప్పిన మాటల నంగీకరించి, ఇది మొదలు సీతా దేవి మౌనవ్రతము ధరించెను. కడపటి ప్రయాణసమయమందుఁదప్ప నీలోకల

నెవరితోను భాషించినదికాదు. వచ్చినవారందఱు నేలమ్మ నీమగఁడు నిన్ను విడిచె నని యడుగుచుందురు. ఎవరి కేమి చెప్పను. కావున మౌనమే శ్రేష్ఠ మని దాని నంగీకరించెను.

తా త్ప ర్య ము

(అని చెప్పఁగా, మిగుల నాశ్చర్యకరములగు వాల్మీకి మహర్షి మాటలు విని సీతాదేవి తలవంచి నమస్కరించి వినయముతోఁ జేతులు మోడ్చి యాయన నెంబడించెను.)

—♦ వాల్మీకి సీతాదేవిని మునిసతుల కప్పగించుట ♦—

ఉ. జానకితోడ వచ్చు ముని ♦ స త్తముఁ గాంచి తపస్వినుల్ ముదా
ధీనమనంబులన్ మునివరేశ్వర! స్వాగత మెన్నినాళ్లొ మీ
రీనెల వేగుదెంచి, దయ ♦ నిందఱ మ్రొక్కులు గొంచుఁ గార్య మే
మానతి యిందు నా ననియె ♦ నమ్మునిపత్నులకున్ మునీంద్రుఁడున్. ౧౦-౨౩

అర్థములు. తపస్వినుల్=తపము చేయు స్త్రీలు, ముదాధీనమనంబులన్= సంతోషమునకు స్వాధీన పడిన మనస్సులతో, ఈనెలవు=ఈప్రదేశమునకు.

తా త్ప ర్య ము.

జానకీదేవితో వచ్చు వాల్మీకి మహామునిని జూచి యా మునిభార్యలు మిక్కిలి సంతోషించి మునీంద్రా! స్వాగతము! మీరీ ప్రదేశమునకు వచ్చి యెన్ని దినాలో కదా యైనది, మాయందఱ నమస్కారములు గ్రహించి మేము చేయ వలసిన కార్యమేమో చెప్పఁడు అనిన వాల్మీకి యా ఋషి భార్యల కిట్లనియె.

సీ. ఈమె సీతాదేవి ♦ రాముని ప్రియపత్ని, దశరథుకోడలు ♦ తనయ జనక
నరపాలునకు సాధు♦చరిత పతివ్రత, పాపహీనయ యయ్యు ♦ భర్త చేత
సంత్యక్త,సతము మ♦త్సంపరిపాల్య యీ,యమను నచ్చంపునె♦య్యమునమీరు
కాపాడవలయును ♦ గౌరవంబుగ మఱి, నాదువాక్యమున నో ♦ నారులార

ఆ. యనుచు మీఁద మీఁద ♦ నాదరంబున నొక్కి, చెప్పి సతిని వారి♦కప్పగించి
శిష్యయుక్తుఁ డగుచుఁ ♦ జేరె స్వాశ్రమమును, సీత యాశ్రమంబుఁ♦జేరు జెల్ల.

అర్థములు. పాపహీనయ = పాపములేనిదే, సంత్యక్త=విడువఁబడినది, సతము=ఎల్లవేళ, మత్సంపరిపాల్య=నాచేఁ బరిపాలింపఁబడఁదగినది.

తా త్ప ర్య ము

(ఈమె సీతాదేవి, శ్రీరామచంద్రమూర్తి భార్య-దశరథమహారాజుకోడలు; జనకరాజు కూఁతురు - సాధువర్తనము కలది - పతివ్రత - పాపము లేనిది యయ్యును భర్తచే వదలిపెట్టఁబడినది - ఎల్లవేళ నేను పరిపాలింపఁదగియున్నది

నా మాటమీాద మీారు నిష్కపటమగు ప్రేమతో-గౌరవముగా నీమెను గాపాడ వలెను - అనుచు మునిపత్నులకు మీాఁద మీాఁద నొక్కి చెప్పి సీతను వారికొప్ప గించి తాను శిష్యులతోఁ గూడి తన యాశ్రమమునకుఁ బోయెను. సీత వాల్మీకా శ్రమమునకుఁ బోవుటంతయు-)

—♦ లక్ష్మణుఁడు శ్రీరాముని గుఱించి సుమంత్రునితోఁ జెప్పి యేడ్చుట ♦—

చ. కనుఁగొని లక్ష్మణుండు వెతఁ ♦ గాతరభావమునన్ సుమంత్రుతోఁ
గనితివె జానకీవిరహ ♦ కారణమౌ రఘురామ దుఃఖమున్
జనకతనూజ లోకనుత ♦ సాధ్విని దా విడనాడె, నింతకం
టెను వెత యొండు రాఁ గలుగు♦నే నుతకీర్తికి రామమూర్తికిన్. ౧౦౩౫

అర్థములు. కాతరభావమునన్=ధైర్యముచెడిన మనస్సుతో, జానకీ విరహ కారణము=సీతాదేవిని నెడఁబాయుట యనునది నిమిత్తముగాఁ గలది, లోకనుత సాధ్విని=ప్రపంచముచే స్తోత్రము చేయఁబడు పతివ్రతను, వెత=దుఃఖము

తా త్ప ర్య ము

(లక్ష్మణుఁడు చూచి, దుఃఖముచే దీనుఁడై సుమంత్రునితోఁ సీతనువిడుచు టచే రామునికిఁ గలిగిన దుఃఖమును జూచితివిక దా! ప్రపంచముచే స్తోత్రముచేయఁ బడు పతివ్రతయగు సీతను దాను విడనాడెను. లోకమునఁ బ్రఖ్యాతిగల రామ మూర్తి కింతకు మించిన దుఃఖ మింకొకటి గలదా?)

క. శ్రీవై దేహీరహితుం,డై వనరుట రామభద్రుఁ ♦ డరయఁగ సూతా
దైవంబుచేష్టయే చుమీ, దైవంబు నతిక్రమింప ♦ ధర నరు వశమే. ౧౦౩౬

తా త్ప ర్య ము

రామభద్రుని వంటివాఁడు లక్ష్మీదేవి వంటి సీతను వదలి దుఃఖపడుట చూడఁగా నిది దైవము చేసిన కార్యమే. ఇది నిప్పులేని పొగగదా. దైవమును మించి పోవుటకు నెవరికి శక్యము, ఈ నీతి రామాయణంబునఁ బలుమా ఱుపదే శింపఁబడినది.

సీతాదేవియందు దోషము లేదు. రామునందు ద్వేషము లేదు. పరస్ప రానురాగమునకు లోపము లేదు. వియోగమునకుఁ గారణము లేకుండియు నేదో కారణము గోడమీాఁది పిల్లివలె నడుమ దూఁకి నేఁటుపఱుచుట దైవతంత్రముగాక మఱియేది కాఁగలదు కారణము లేక యేదియు జరుగదు. కారణము మనకుఁ దెలియకుండిన నిష్కారణ మందుము.

క. దేవతలన్ గంధర్వుల, దేవారుల రాక్షసులను ♦ దెగనడిచిన సీ
తావిభుఁడు నేఁడు దీనత, దైవమునకు లొంగ దాని♦దాఁటఁగ లేమిన్. ౧౦౩౭

తాత్పర్యము

(దేవతలను గంధర్వులను, రాక్షసులను సంహరించిన రామమూర్తి నేఁడు దీనుఁడై విధినిదాఁటఁజాలక దానికి లొంగిపోయెను.)

పూర్వము దైవమునకంటె బౌరుషము బలీయమనియు దైవమును పౌరుషముచే నివర్తింప వచ్చుననియు వాదించిన లక్ష్మణుఁ డిప్పుడు దైవము బలిష్ఠమని యంగీకరించుచున్నాఁడు ఇట్టి సందర్భమందు పౌరుషమేమి చేయఁగలదు. ఈవిధముఁగ బౌరుషము వ్యర్థమగు సందర్భము గలవు గాని దైవము వ్యర్థమగు సందర్భములు లేవు. కావున రెంటిలో దైవమే బలీయము. పదునాలుగు లోకములుజయించినవాఁడైనను దైవమును జయింపలేఁడు.

చ. జనకునిమాటఁ బట్టి వన ◊ సంతతి నిర్జనదండకాటవిన్
వనటలఁ గుందెఁ దాఁ బదియు ◊ నాలుగు వర్షము, లంతకంటె నీ
జనకసుతావియోగమును ◊ సైఁచుట కష్టము పౌరవాక్యముల్
విని ప్రియురాలి సచ్చరిత ◊ వీడఁగ నెంత దయావిహీనుఁడో. ౧౦-౨౮

తాత్పర్యము

తండ్రిమాటను బురస్కరించుకొని యడవులలో మనుష్యులు లేని దండకారణ్యములలోఁ బదునాలుగు సంవత్సరములు బాధపడెను. ఇప్పుడీ సీతను విడిచియుండుట యంతకంటె దుఃఖకరము. ఊరివారి మాటలు విని తనకుఁ బ్రాణసమానురాలయిన దానిని పతివ్రతను వదలిపెట్టుటకు నెంత కఠినచిత్తుఁడో! దయయనునది కొంచెమైన నుండిన నిట్లు చేయునా?

చ. ఎఱుఁగును సీత సాధ్వి యని ◊ హీనవచస్కులు పౌరు లంచుఁ దా
నెఱిఁగియుఁ గానలో విడిచె ◊ నింతిని, నింతట నింద దప్పెనే?
కఠకరి యంచుఁ బల్కరొకొ ◊ కాఁగల దేమిక? నేమి ధర్మ మె
త్తెఱఁగున నేకరించు? మతిఁద్రిప్ప డయా యెటువంటి ధీరుఁడో? ౧౦-౨౯

తాత్పర్యము

సీతాదేవియం దేదోషము లేదని యెఱుఁగును లోకులు కాకులన్నట్లువారు నీచపు మాటలాడు వారనియుఁ దెలియును. ఇంత తెలిసియు సీతను నడవుల పాలుచేసెను. గాని యీమాత్రముతోనే నింద తప్పెనా? ఇప్పుడా లోకులే రాముఁడు కఠినచిత్తుఁడు, దయాహీనుఁడు భార్యను, నడవుల పాలుచేసెనని యనరా? దానికేమి చేయఁగలఁడు? ఇఁక నేధర్మమునైనను నెట్లు నేయఁగలఁడు? భార్యయుండియుఁ జచ్చినట్లాయెఁ గదా, ఎంత చెప్పినను మనస్సు ద్రిప్పుఁడు, ఆహా! యెంతగుండె నిబ్బరము గలవాఁడో!

—॥ సుమంత్రుఁడు లక్ష్మణునకు మనస్తాపోపశమనంబు సేయుట ॥—

క. అని పలుతెఱంగుల దుఃఖం,బునఁ బలుకు సుమిత్రతనయు॥మోముం గని ధీ
ధనుఁడు సుమంత్రుం డిట్లని, యనునయసూక్తులఁ దదార్తి॥నణఁగఁగఁ, జేసెన్.

అర్థములు. ధీధనుఁడు=బుద్ధిసంపద గలవాఁడు, అనునయ సూక్తులన్=ఊరడింపు మాటల, తదార్తి=ఆయన వ్యసనము.

తాత్పర్యము

(అని యనేకవిధముల దుఃఖించుచుఁ బలుకుచున్న లక్ష్మణుని మొగము చూచి, బుద్ధిసంపన్నుఁడగు సుమంత్రుఁ డీక్రిందఁ జెప్పిన విధమున నూరడింపు మాటలతో నతని వ్యసనమును బోగొట్టెను.)

సీ. సంతాప మేటికి ॥ సౌమిత్రి! జానకీ, విషయంబునను మున్నె॥విదిత మద్ది
సౌఖ్యార్హుఁడగు రామ॥చంద్రుండు ప్రేయసి,విరహంబునను దుఃఖ॥విషయమగును
గొంతకాలం బేగ ॥ గురుమతీ! నిన్నును, భరతశత్రుఘ్నుల॥ధరణితనయ
నెడఁబాయు; దీని నీ॥వెవ్వరితోడను, భరతుతో శ్రీరామ॥భద్రుతోడ

ఆ. నైనఁ జెప్పకుండు ॥ వేని దుర్వాసుండు, క్షితివిభుండు నే వ॥సిష్ఠమౌని
వినఁగఁ జెప్పినట్టి ॥ వృత్తాంత మెల్లను, నీకుఁ జెప్పువాఁడ॥నిర్మలాత్మ. ౧౦౩౧

తాత్పర్యము

లక్ష్మణా! నీ వేల దీనికి వ్యసనపడెదవు? జానకీవిషయమిట్లు జరుగునని ముందే తెలియును. ఎంతో సౌఖ్యమనుభవింపఁదగిన వాఁ డయ్యును రామచంద్రమూర్తి ప్రియురాలినిబాసి దుఃఖించును. ఇంక గొంతకాలమునకు నిన్నును, భరతశత్రుఘ్నులను సీతను దేహములతోనే వదలును. ఒక రహస్యమును దుర్వాసుఁడు నేను వసిష్ఠముని వినుచుండ దశరథమహారాజునకుఁ జెప్పెను. నీవు దాని నెవ్వరికి భరతునకైనను రామచంద్రునకైనను జెప్పకుండువేని నేను నీకుఁ జెప్పెదను.

చ. మనుజవిభుండు దీనిని సుమంత్ర! రహస్యము చెప్పఁబోకు మె
వ్వని కని యాజ్ఞ చేసి, నృప॥వర్యుని యానతి నేను భక్తితో
వినయముతోడ నెప్డు నెఱ॥వేర్చుచు నుండుదు, నీకు నైన నే
ననఁ దగ, దట్టులయ్యు వశ॥మా నొకొ దాఁటఁగ దైవతంత్రమున్. ౧౦౩౨

తాత్పర్యము

దశరథ మహారాజు, సుమంత్రా! యీ రహస్యమును ఎవరితోడను జెప్ప వలదని యాజ్ఞాపించెను. ఆయాజ్ఞను దేనినైనను నేను భయముతోను భక్తితోను నెఱవేర్చువాఁడను గావున నీకును దీనిని జెప్పరాదు. దైవతంత్రమునఁ దటాలున నోరు జాఱి చెప్పితిని.

ఉ. ఈదృశ మైన దుఃఖమున ♦ నీవు శ్రమంపడు చుంటఁ జూడఁగా
నీ దురవస్థ నాఁపుటయె ♦ నేఁడు శుభం బని తోఁచెఁ గావునన్
భూదయితా! వచింప నిటు♦వూనితి నీకు వినంగ నిష్ట మే
నేదశయందు నైన వచి♦యింపకు తమ్మున కన్నగార్లకున్. ౧౦౩౩

అర్థములు. ఈదృశము=ఇటువంటి.

తాత్పర్యము

ఇటువంటి తీవ్రదుఃఖముచే నీవు బాధపడుచుండఁగాఁ జూచి సహింప లేక నీ దుఃఖము పోఁగొట్టుట బాగని తోఁచి నేను నీకు దీనిఁ జెప్పఁ బూనితినిఁ నీకు విన నిష్టమేని చెప్పెదను. నీవు మాత్రము దీనిని నీ తమ్మునికిఁ గాని యన్నలకుఁ గాని చెప్పకుము.

క. నావుడు సుమిత్రపట్టియు, నీవచనముభంగి నడతు ♦ నేను సుమంత్రా!
యావార్తల నెఱిఁగింపు యథావృత్తమ టన్న నతఁడు♦దడయక పలికెన్.

తాత్పర్యము

(అని చెప్పఁగా,లక్ష్మణుఁడు సుమంత్రా! నీవు చెప్పినట్లు నడుచుకొందును. ఆ వార్తలున్న వున్నట్లు తెలుపుము. అనఁగానే యతఁడు వెంటనేచెప్పెను.)

దశరథ దుర్వాసుల సంభాషణము సుమంత్రుఁడు లక్ష్మణునకుఁ దెలుపుట

తే. అత్రితనయుండు దుర్వాసుఁ♦డనుమహర్షి,
వాననెలలఁ జాతుర్మాస్య♦పరమ నియతి
జరుపఁగ వసిష్ఠు నాశ్రమ♦స్థలమునందు, నుండ నచటికి మీ జన♦కుండు గురుని.

తాత్పర్యము

అత్రికుమారుఁడైన దుర్వాసుఁడు వసిష్ఠునాశ్రమమున నాలుగునెలల వర్షాకాలము జరుపుచుండెను. అచటికి మీతండ్రి గురుని.

క. సందర్శింపఁగ కని మధ్యందినమార్తండునట్లు ♦ లతికాంతి వెలుం
గొందెడు వసిష్ఠు సవ్యం బందుండు యతీంద్రుఁ గాంచి♦యతులితభక్తిన్. ౧౦౩౬

తాత్పర్యము

చూడఁబోయి మట్టమధ్యాహ్నమందలి సూర్యునివలెఁ బ్రకాశించుచుండు వసిష్ఠుని యెడమప్రక్క నుండు యతిశ్రేష్ఠునిఁ గాంచి యసమానభక్తితో.

క. మునియుగ్మమునకు మ్రొక్కిన, ననఘులు పాద్యంబు ఫలము♦లాదిగ నిడి య
మ్మనుజేంద్రు సత్కరించిరి, వినిచిరి మధురోక్తి నర్హ♦విధ మగుగాథల్. ౧౦౩౭

తాత్పర్యము

(మును లిద్దఱకు నమస్కరింపఁగా పాపరహితులగు వారు రాజున కర్ఘ్య పాద్యాము లిచ్చి ఫలములు మున్నగునవి నొసఁగి సత్కరించిరి. తీయని మాటలతోఁ జెప్పఁ దగిన విషయములను జెప్పిరి.)

ఉ. అంబరమధ్యసీమ వన•జాప్తుఁడు వెల్గుచు నుండఁగా గథాం
తంబునఁ గేలు మోడ్చి వసు•ధావరుఁ డిట్లను నత్రిసూనుతో
నంబుజసంభవోపమ! మ•హాత్మ వచింపవె భూమి నాదువం
శంబు ప్రమాణ మెంత? ముని•సత్తమ! రాముని యాయు వెంతయో? ౧౦౭౩

అర్థములు. అంబర మధ్యసీమ=ఆకాశము నడిమి భాగమున, వనజాప్తుఁడు= సూర్యుఁడు, అంబుజసంభవోపమ=బ్రహ్మతో సమానుఁడైన వాఁడా.

తాత్పర్యము

(మట్టమధ్యాహ్నమైనది-కథ ముగింపులో దశరథ మహారాజు నమస్కరించి దుర్వాసునితో! బ్రహ్మతో సమానుఁడవైన మహాత్మా? నా వంశము భూమిమీఁద నెంతకాల ముండును. రాముని యాయు వెంత? చెప్పుమనియడిగెను.)

తే. తక్కసుతు లెన్నినాళ్ళు లీ•ధరణినుండు వారో?
కొడుకులు శ్రీరామ•భద్రునకును
గలుగుదు రె? వారియాయుఃప్ర•కార మెంత?, వేఁడుకొనియెద నావంశ•విధము జెపుమ.

తాత్పర్యము

(తక్కిన కొడుకు లెంత కాలము జీవించెదరు? శ్రీరామభద్రునకుఁ గొడుకులు గలిగెదరా? వా రెంతకాలము జీవింతురు - నా వంశము యొక్క విధ మంతయుఁ జెప్పుము-నిన్ను ప్రార్థించెదను.)

—• భృగుమహర్షి విష్ణువును శపించుట •—

క. ఉర్వీవిభుఁ డిటు లడిగిన, దుర్వాసుం డనియె వినుము•తొల్లి సురారుల్
గర్వింప వారి నెల్లసు,పర్వులు దఱుమంగ వారు•పఱచి భయమునన్. ౧౦౪౦

అర్థములు. సురారుల్=రాక్షసులు, సుపర్వులు=దేవతలు.

తాత్పర్యము

(దశరథ మహారాజీ ప్రకార మడుగఁగా, దుర్వాసుఁడు రాజా! వినుము. పూర్వము రాక్షసులు గర్వింప వారి నందఱను దేవతలు తఱిమివేసిరి. భయపడి వారు పాఱిపోయి.)

క. భృగుపత్ని శరణుఁ జొచ్చిన, మగువయు నభయం బొసంగె•మనుజాదులకున్
దిగు లేమి లేక వారలు, దగుగతి సుఖియింపఁ జక్రి•తన్భృగుపత్నిన్! ౧౦౪౧

అర్థములు. మనుజాదులకున్=రాక్షసులకును, తత్+భృగుపత్నిన్=ఆ భృగు మహర్షి భార్యను.

తాత్పర్యము

ఆ భృగు భార్యను శరణము చొచ్చిరి. ఆమెయు వారికి భయపడవలదని చెప్పి దేవతల వలన రక్షించెను. ఆకారణముచే వారు దేవతల భయము లేక సుఖముగా నుండి వారు చేయు దుష్ట కార్యములు చేయుచుండిరి. అప్పుడు విష్ణుమూర్తి లోకుల కపకారపరులైన రాక్షసుల రక్షించిన యా భృగుభార్యను.

క. శితచక్రధారఁ ద్రుంచిన, సతిపాటున కలిగి భృగువు • శాపం బిడె నా
సతిని నవధ్యను జంపుట, క్షితిపై జన్మించి నీవు • శ్రీవత్సాంకా! ౧౦౪౨

అర్థములు. శితచక్రధారన్=వాఁడియైన చక్రము వాదరచే, సతిపాటునకు=భార్యచచ్చుటకు, అవధ్యను=స్త్రీ యగుటచేఁ జంపరాని దానిని, శ్రీవత్సాంకా=శ్రీవత్సము చిహ్నముగాఁ గలవాఁడా.

తాత్పర్యము

(వాఁడియైన చక్రధారచేఁ దునిమెను. భార్య చచ్చుటకుఁగోపించి భృగువు శాప మిచ్చెను. శ్రీవత్సము చిహ్నముగాఁ గలవాఁడా! స్త్రీనిఁజంపరాదు. నీవు చంపఁదగని యాఁడుదానిఁజంపితివి. కావున నీవు భూమిమీఁదఁబుట్టి)

క. దారవియోగవ్యధచే, శౌరీ తపియింపు మెక్కు • సమ లని తనవ్యా
హారములకుఁ దపియించుచు, వారని దృఢభక్తిఁ గొలిచి • భజియించె హరిన్.

అర్థములు. దారవియోగ వ్యధచేన్=భార్యను వదలిన దుఃఖముచే, సమలు=సంవత్సరములు, వ్యాహారములకున్=మాటలకు.

తాత్పర్యము

భార్యను విడిచిన దుఃఖముచేఁ దపింపుమని శపించి కోపము చల్లారఁగానే తన మాటలకుఁ దానే సంతాపపడి క్షమింపుమని హరిని దృఢభక్తిచే భజించెను.

ఉ. పాపుల కాపొసంగిన స్వ • భార్య కువృత్తము లోకనాథుఁ డాఁ
గోపముతో శపించుటయుఁ • గుంజరరక్షకుఁడున్ స్వదత్తమౌ
శాపము నిగ్రహించిన భృ • శం బగు నారకబాధ యున్నియుం
దాపముఁ గూర్ప శాంతుఁ డయి • తన్ను మునీంద్రుఁడు పూజసేయఁగన్. ౧౦౪౪

తాత్పర్యము

శపించి తాను జేసినది యవివేక కార్యమని యోజించుచున్నాఁడు, పలన, పాపాత్మునకు సహాయపడిన తనభార్య చెడ్డనడవడి యాలోచించి,యట్టిదానినాడు

దానినైనను జంపుట దోషము గాదనియు, అట్టి దానిని జంపిన జగత్ప్రభువును తాను గోపముతో నిష్కారణముగ శపించుటయు, గజరాజరక్షకుఁ డగు భగవంతుఁడు తానిచ్చిన శాపము నంగీకరింపక నిగ్రహించెనా దానివలనఁ దనకు రాఁగల నరక బాధయు నిన్నిటిని నాలోచించి సంతాపపడి కోపము వదలినవాఁడై విష్ణువును బూజించెను. తనశక్తికంటె నెక్కువశక్తి గలవానిని శపింపరాదు. ఏలన వాఁడు దానికిఁ బ్రతిక్రియ చేసెనా యాశక్తి మరలివచ్చి తన్నుఁ బ్రయోగించిన వానినే వధించును. ప్రయుక్తమైన శక్తి యెదుటివానినో ప్రయోగించిన వానినో బాధింపక వ్యర్థమైపోదు. కావున విష్ణువు తన శాప మంగీకరింపక పోయెనా తనకుఁ గీడు తప్పదు. కావున సంతాపపడెను.

ఆ. భక్తవత్సలుండు ♦ పరమదయాళుండు, భువన సంప్రియార్థ♦మునకు మౌని శాపమును గ్రహించె♦జన్మాంతరంబునఁ, బూర్వవృత్తమిదియు♦భూపవర్య. ౧౮౫

తాత్పర్యము

విష్ణువు భక్తులయందుఁ బ్రేమగలవాఁడగుటను మిక్కిలి దయయే స్వభావముగఁ గలవాఁడగుటచే లోకము ప్రియపడుటకై తాను నిరాకరించిన నీ మునీశ్వరుఁడు చెడునే యని కనికరము గలవాఁడై జన్మాంతరమందు నీ శాప మనుభవించెద నని చెప్పెను. ఇది పూర్వము జరిగిన చర్య.

ఇది శ్రీరామచంద్రమూర్తి యేకపత్నీవ్రతుఁ డనియు నవతరించిన విష్ణుమూర్తి యనియు స్థాపించుచున్నది.

—♦ శ్రీరాముని వృత్తంబు దుర్వాసుఁడు దశరథున కెఱింగించుట ♦—

ఉ. నీ తనయుం డటం చిటకు ♦ నెమ్మి మెయిం జనుదెంచి రాముఁ డన్
ఖ్యాతి నెసంగ లోకముల ♦ నమ్ముని శాపఫలంబు నొందెడిన్
క్ష్మాతలనాథ! రాజగుచుఁ ♦ జాలఁగఁ గాల మయోధ్య నేలు, సు
శ్రీతత సౌఖ్యవృద్ధులను ♦ జెంది తదాశ్రితు లుందు రెప్పుడున్. ౧౮౬

తాత్పర్యము

ఆ విష్ణుమూర్తియే యిప్పుడు నీ కొడుకయి యిచ్చటికి వచ్చెను. రాముఁ డను పేర లోకమునఁ బ్రసిద్ధిగాంచెను. ఆముని శాపము ననుభవింపఁ గలఁడు. అయోధ్యకు రాజై చాలఁగాలము భూమి పాలింపఁగలఁడు. ఆయన నాశ్రయించిన వారు మిగుల సంపత్తు సౌఖ్యము గలవారగుదురు.

క. పదివేలవత్సరంబులు, పదినూర్లేఁడులును భూమిఁ ♦ బాలించి జనుల్
ముదమునఁ దేలఁగ రాముఁడు, పదపడి చను బ్రహ్మలోక♦పదముం జేరన్. ౧౮౭

అర్థములు. బ్రహ్మలోకపదము=పరబ్రహ్మలోకపదము, వైకుంఠము.

తాత్పర్యము

(శ్రీరాముఁడు పదునొకండు వేలేండ్లు జనులానంద పడునట్లు భూమిని బాలించి తరువాత వైకుంఠమునకుఁ బోవును.)

గీ. అశ్వమేధంబు లెన్నియో ♦ యాచరించు, దండిగాఁగ నొసంగును♦దక్షిణలను
రాజవంశంబులను బెక్కు ♦ రామవిభుఁడు, ధరణి స్థాపించు ధర్మత♦త్పరతరాజ.

తాత్పర్యము.

(అశ్వమేధముల నెన్నిటినో చేయును. దండిగా దక్షిణల నిచ్చును. ధర్మమందాసక్తి గలిగి రామచంద్రప్రభువు పెక్కు రాజవంశములను భూమిమీఁద స్థాపించును.)

క. రామునకు సీతయందున్, భూమీశా! కవలు సుతులు ♦ పుట్టెడు వారల్
భూమిపతులై యయోధ్యను, సామంబున నేలు చంద్రు♦జనవల్లభులై. ౧౦౪౯

అర్థములు. కవలు=అమడలు.

తాత్పర్యము

(రాజా! శ్రీరామునకు సీతయందు నమడలు కొడుకులు పుట్టి యయోధ్యకు రాజులయి ప్రజారంజనముగాఁ బరిపాలనము చేయుదురు.)

క. రాముఁడె యభిషేకించును, ధీమహితా సుతుల ననుచుఁ♦దెలియఁగ సకలం
బా మౌని చెప్ప నాఋషి, భూమీశుఁడు గౌరవించి♦పురి కరుదెంచెన్. ౧౦౫౦

తాత్పర్యము

(శ్రీరాముఁడే తనకుమారులకుఁ బట్టము కట్టును. అని యంతయు దుర్వాసుఁడు చెప్పగా విని దశరథమహారాజా ఋషిని గౌరవించి తనపట్టణమునకుఁ జనుదెంచెను.)

చ. ఇది ముని చెప్పఁగా వినితి ♦ నిన్నిదినాలుగ నుంచినాఁడ నా
యెద నిది తప్పఁబోవ దిటు ♦ లేటికి రిత్తకు సంతసింప నా
సుదతికి రామచంద్రునకు ♦ శుద్ధమనంబున నిబ్బరించు కో
మ్మదవద మాను మన్నఁ బర♦మాద్భుత సూక్తికి నిచ్చ మెచ్చుచున్. ౧౦౫౧

అర్థములు అదవద=కలఁత.

తాత్పర్యము

(ఇది ముని చెప్పఁగా వింటిని ఇన్నిదినాలుగా నా మనస్సులోనే యుంచుకొంటిని. ఇది తప్పిపోదు. ఏల? సీత కొఱకు రాముని కొఱకు వృథాసంతాపమును జెందెదవు. పరిశుద్ధమగు మనస్సుతో నిబ్బరించుకొనుము. కలఁతమానుము అని తెలుప మిగుల వింతయాగు నాతని సూక్తికి నెంతయు మెచ్చుకొనుచు.)

క. మేలని దుఃఖము విడిచె నృ, పాలుఁడు వారిరువు రిట్లు ♦ భాషించుచుఁ బో
నాళీకాప్తుఁడు పడమటి, శైలముఁ జేరంగఁ జనియె♦సంధ్యయు మిగిలెన్. ౧౦౫౭

అర్థములు. నృపాలుఁడు=లక్ష్మణుఁడు, నాళీ కాప్తుఁడు=సూర్యుఁడు.

తా త్ప ర్య ము

(మంచిదని లక్ష్మణుఁడు దుఃఖమును వదలెను. వారిరువు రీవిధముగామాటలాడుచుఁ బోవుచుండ సూర్యుడు పడమటి గొండను జేరబోయెను. సంధ్యాకాలమాయెను.)

—♦ లక్ష్మణుఁడు శ్రీరాము దర్శింపఁ బోవుట ♦—

క. అంతట వారల కేశిని, పొంతన రేయెల్లఁ గడపి ♦ ప్రొద్దు పొడవ న
త్యంతరయంబునఁ జని దిన, కాంతుఁడు నడిమింట నిలువఁ♦గాఁ బుఁరిదఱియన్

అర్థములు. కేశిని=కేశినియను నది, దినకాంతుఁడు=సూర్యుడు.

తా త్ప ర్య ము

(అంతట వారు కేశినియను నది సమీపమున నా రాత్రి యంతయుఁగడపి, ప్రొద్దుపొడునఁగా మిగులఁద్వరగాఁబోయి, సూర్యుఁడు నెత్తిమీఁదకు రాన యోధ్యదాపునకు.)

చ. చను నెడ లక్ష్మణుండు తన♦స్వాంతమునం దలపోయు నిట్టు లే
మని వచియింతు రామునకు ♦ నాయన మోమది యెట్లు గందు? సీ
తను విడి తన్నకుం దగిన ♦ దమ్ముఁడ వీ వని పలుకు తల్లులం
గని బదు లేమి చెప్పుదును ♦ గట్టిఁడి యందురు నన్ను నెల్లరున్. ౧౦౫౮

అర్థములు. స్వాంతమునన్=మనస్సునందు, మోము=ముఖము, కట్టిఁడి=మర్యాదహీనుఁడు. దుష్టుఁడు - విడితి=వదలిపెట్టివచ్చితిని.

తా త్ప ర్య ము

పోవునప్పుడు లక్ష్మణుఁడు తన మనస్సులో నిట్లని తలపోసెను. రామునకేమని చెప్పెదను ఆయన మొగమెట్లు చూచెదను? సీతను వదలిపెట్టి వచ్చితిని. ఆ యన్నకుఁ దగిన తమ్ముఁడవే నీవు అని పలుకు తల్లులకేమి బదులు చెప్పఁగలను. మట్టుమర్యాద లేని వాఁడని నన్నందఱాడి పోసికొందురు.)

ఉ. ఔర! యటంచు నూర్చుచును ♦ నారట మందుచు రాజమందిర
ద్వారము గాంచి యందు డిగి ♦ వ్రాల్చిన మోమున నేగి తన్మహా
గారమునందు దీనమతిఁ ♦ గాంచనపీఠి వసించువానిఁ గ
న్నీరు దొలంకు నేత్రముల ♦ నివ్వెఱ గూరిన వాని రామునిన్. ౧౦౫౯

అర్థములు. మహాగారమునందున్=గొప్పయింట, నివ్వెర=నిశ్చేష్టతచే.

తాత్పర్యము

(ఔరా! యనుచు నిట్టూర్పు విడుచుచు, నారాటపడుచు రాజమందిర ద్వారము చూచి యచటఁ దేరు దిగి, తలవంచుకొని పోయి యా గొప్పయింటిలో దీనుఁడయి బంగారుపీఁట మీఁదఁ గన్నీరు గార్చుచుఁ జేష్టలుడిగి యున్న రాముని)

—• లక్ష్మణుఁడు సీతావృత్తాంతంబుఁ దెలిపి శ్రీరాము నూరడించుట •—

క. కని లక్ష్మణుఁ డతిదీనత, వినయంబున విన్నవించె•విహితాంజలి యై
జనవర! యానతిమేరకు, జనకజ నే విడిచినాఁడ • జాహ్నవి పొంతన్. ౧౦౫౬

తాత్పర్యము

(చూచి లక్ష్మణుఁ డతిదీనుఁడై వినయముగాఁ జేతులు జోడించి రాజా! దేవర యానతి మేరకు జానకిని గంగపొంతను విడిచి వచ్చితి; నని విన్నవించెను.)

క. విమలంబగు వాల్మీకా,శ్రమమున శుభశీల సద్య•శస్విని విడి వే
గమునం దావకచరణా,బ్జములన్ సేవింప మరలి • వచ్చితి నిటకున్. ౧౦౫౭

తాత్పర్యము.

(ప్రభూ! నిర్మలమగు వాల్మీకి యాశ్రమమందు - దేవరయాజ్ఞ మేరకు, గంగాతీరమున - సీతాసతీ లలామను డించి, తమ పాదములు సేవింప మరలి యిటకు వచ్చితిని.)

క. పురుషోత్తమ దుఃఖింపకు, దరిసింపఁగఁ గాలగతి వి•ధం బిట్టిది కా
నరవర దుఃఖింతురె, ధృతినిరతులు సర్వజ్ఞులైన•నినుఁబో ల్సుమతుల్? ౧౦౫౮

అర్థములు. దరిసింపఁగన్=ఆలోచింపఁగా, ఇట్టిదాకా=ఇట్టిదేకదా, ధృతి నిరతులు=ధైర్యమునందుఁ బ్రీతిగలవారు.

తాత్పర్యము

(పురుషశ్రేష్ఠా! దుఃఖింపకుము. ఇది కాలగతియొక్క ధర్మము. సర్వజ్ఞులు, దమవంటి వారిటుల ధైర్యము వోనాడి చింతింతురా)

క. ధనములు నిధనాంతంబులు, విను వృద్ధిమదర్థములును•విలయాంతంబుల్
జననము మరణాంతం బగు, నొనరెడి సంయోగములు వి•యోగాంతంబుల్.

అర్థములు. నిధనాంతంబులు=నాశమే యంతముగాఁ గలవి, ధనము స్థిరముగా నుండునది కాదు, నశించునదే, వృద్ధిమదర్థములు = వృద్ధినొందుచున్న వస్తువులు, పెరుగునవి, విలయాంతంబుల్, నశించునవే, పెరుఁగుట విఱుగుట కొఱకే, సంయోగములు=కూడుటలు, వియోగాంతంబుల్ = వీడుటయే యంతముగాఁ గలవి.

తాత్పర్యము చూ- అయోధ్య- ౨౩౭౦ పద్యము.

రామచంద్రమూర్తి భరతునకుఁ జెప్పిన మాటలే యాతనికి మరల స్మృతికిఁ దెచ్చుటకై చెప్పఁబడెను.

క. కావునఁ బుత్రులయెడ భా, ర్యావిత్తములందు మిత్రులం దతిరక్తిం
గావింపరాదు సుమతికి, నే వేళనొ విప్రయోగ • మేర్పడి యునికిన్. ౧౦౬౦

తాత్పర్యము

కూడుట యనునది యున్నచోట వీడుట యనునది యుండును గావునను నది యేనాఁడో యొకనాఁడు వచ్చుట తప్పదు కావున బుద్ధిమంతుఁ డగువాఁడు కొడుకులందు భార్యయందును ధనమందును మిత్రులందును నెక్కువ యనురాగ ముంచరాదు వ్యవహారము జరుగుట కెంత కావలయునో యంత మాత్ర ముంచిన నని పోయినను వ్యసన ముండదు.

క. నిను నీవు మనసుచే మది, జనముల నెల్లరను దిద్దఁ జాలెద వనఘా
వన రెద వేలా ప్రాకృతు, ననువున? నీ కిట్టిచేఁత • యగునె? మహాత్మా! ౧౦౬౧

తాత్పర్యము

మహాత్మా! నీవు నిన్నును నితరులను దిద్దఁగలవాఁడవు. ప్రాకృతుని విధమున దుఃఖపడెద వేల? నీకిట్లు చేయుట తగునా?

ఉ. నీ నపవాదభీతి నవ • నీసుత వీడిత కాదె? వెండియున్
నీ విటు లేడ్చుచున్నఁ జన • నేరదు నింద, మఱింత యెక్కుడై
భూవలయంబునన్నిలుచుఁ • బోలదు నీ కిది మాను తాపమున్
భూవరచంద్ర! దుర్బలపు • బుద్ధిని నెట్టుము గొమ్ము ధీరతన్. ౧౦౬౨

అర్థములు. అపవాదభీతి=నిందవలన భయముచే.

తాత్పర్యము

రామచంద్రా! నీవు లోకనిందకు భయపడి కదా సీతాదేవిని వదలిపెట్టితివి. వదలి పెట్టిన తరువాత నీవిట్లు లింటఁగూర్చుండి యేడ్చుచుండిన నిందపోవునా? మఱింత యెక్కుడగును. లోకమున శాశ్వతముగ నిలుచును. కాఁబట్టి నీ కిది సరి గాదు. సంతాపము వదలిపెట్టుము. సంతసించి నీ వేమి చేయఁగలవు? మరల సీతా దేవిని రప్పించెదవా? అది లేదు కదా! అది లేనప్పు డూరక యేడిచి యేమి లాభము? కావున బుద్ధిదౌర్బల్యమును వదలి ధైర్యము తెచ్చుకొమ్ము.

చ. అనవుడు రామచంద్రుఁ డనుజా! నిజ మాడితి నీవు హర్షముం
గనితి మదాజ్ఞఁ దీర్చుటను • గ్రమ్మఱ ధైర్యముఁ గొంటి, శోకమున్
బనిచితి దూరమున్, మధుర • వాక్కులు త్వద్గదితంబులన్ వినన్
మనమునఁ దుష్టి గూరె నవి • మాటికి మెచ్చుచు నెండి యిట్లనున్. ౧౦౬౩

అర్థములు. త్వత్+గదితంబులు=నీచే జెప్పఁబడినవి.

తా త్ప ర్య ము

(అని చెప్పఁగా రామచంద్రమూర్తి తమ్ముఁడా! నీవు నిజము చెప్పితివి-నేను జెప్పినట్లు నీవు చేయుటచే సంతోషించితిని, మరల ధైర్యము వచ్చినది-దుఃఖమును మానితిని, నీవు తీయనిమాటలు వినఁగా మనస్సునకుఁ దుష్టికలిగెను. అని మాటి మాటికి మెచ్చుచు మరల నిట్లనెను.)

—• శ్రీరాముఁడు లక్ష్మణునకు నృగుచరిత్ర దెలుపుట •—

క. అక్కఱఅవేళల నీవలె, మక్కువఁగలచుట్ట మున్నె • మన్మతమునకున్
జక్కఁగఁ జెప్పితి వన్నా, నిక్కం బొకఁ డున్నె యిట్టి•నీతిజ్ఞుండున్. ౧౦౬౮

అర్థములు. మన్మతమునకున్=నా యభిప్రాయమునకు.

తా త్ప ర్య ము

(అక్కఱఅగల వేళలందు నీవలె సాయపడు ప్రేమగల చుట్టము గలఁడా? నా యభిప్రాయమునకుఁ జక్కఁగాఁ జెప్పితివి-నీవంటినీతి తెలిసిన వాఁడు నిక్కముగ నింకొక్కఁడు గలఁడా)

సీ. నామనంబున నొండు • నాటి యున్నది చింత, చెప్పెద నీ వట్లు • చేయవయ్య
నాలుగునాళ్ళాయె•నాయనా? పౌరుల, కార్యంబు లారసి • క్రమము గాను
గావునఁ బ్రకృతులఁ • గార్యార్థి జనములఁ, బురుషుల స్త్రీలను•సరగఁబిలువఁ
బంపు పురోధకుఁ•బంపుము వార్తను, గొలువుకూటమునందుఁ•గూడుఁడనుచు

తే. ననుదినంబును బౌరకా•ర్యములఁ దీర్ప, బ్రాలుమాలెడి నృపతి ని•ర్వాతనరక
మునను దుఃఖించు నిక్కంబు•మున్ను నృగుని, చరిత వినలేదె నీవు స•త్సాధుశీల.

అర్థములు. ప్రకృతులన్=మంత్రులు మొదలగువారిని, కార్యార్థి జనములన్=కార్యము గోరివచ్చిన వారిని, పురోధకున్=పురోహితునకు,అనుదినంబును=ప్రతిదినము, నిర్వాత నరకము=గాలిలేని నరకమందు.

తా త్ప ర్య ము

నా మనస్సున మఱియొక చింత నాటి యున్నది. దానిని జెప్పెదను. నీవట్లు చేయుము. నేను గొలువుకూటమునకుఁ బోయి నేటికి నాలుగు దినము లయ్యెను. కావున పౌరులపనులు విచారించిన వాఁడఁగాను. కావున మంత్రులు లోనగువారిని కార్యము కలిగిన స్త్రీలను బురుషులను ద్వరగా రమ్మనుము. పురోహితునకు జెప్పి పంపుము.అందఱును గొలువు కూటమునందుఁ గూడుఁడని చెప్పుము. ఏరాజు ప్రతి

దినము పౌరకార్యముల విచారింపఁడో యారాజు నిర్వాతనరకమునఁ బడును. ఈ విషయమున నీవు నృగునిచరిత్రము వినలేదా? చెప్పెద వినుము.

సీ. మున్ను బ్రహ్మణ్యుండు•సన్నుతాచారుండు, సత్యసంధుఁడు నృగు•జనవిభుండు
పుష్కరంబున స్వర్ణ•భూషితధేనుల, దూడలతోఁ గోటి•బాడబులకు
దానంబుగా నిచ్చె • వానిలో నిఱుపేద, యాహితాగ్నియు నగు•నవనిసురుని
యా నొండు కలసిన • నాకస్మికంబుగ, నిచ్చె దానిని మది • నెఱుఁగ లేమి

ఆ. నుంఛవృత్తిబ్రదుకు • నుర్వీసురుండు క్షుధార్తి నిందు నందు•నరసె దానిఁ
బెక్కు వత్సరంబు • లెక్కుడఁ గానక, కడకుఁ గనఖలంబు•గ్రామమునను.

అర్థములు. బ్రహ్మణ్యుఁడు=బ్రాహ్మణప్రియుఁడు, సన్నుతాచారుఁడు=సజ్జనులచేఁ బొగడఁబడిన యాచారము గలవాఁడు, పుష్కరంబునన్ = పుష్కరతీర్థమందు, స్వర్ణభూషిత=బంగారు నగలచే నలంకరింపఁబడిన, ధేనులన్=ఆవులను బాడబులకున్=బ్రాహ్మణులకు = ఆహితాగ్ని=అగ్నిహోత్రములు గలవాఁడు, ఉంఛవృత్తిన్=కళ్ళములోఁ, పొలములోఁబడిన ధాన్యములేఱి బ్రదుకుట జీవనోపాయము, ఒక్కొక్క గింజగా నేఱుట ఉంఛము - ఎన్నులను గోసి ధాన్యము సేకరించుట శిలము, పరులను యాచించి బ్రతుకుటకంటె దున్ని జీవించుటమేలు, దాని కంటె శిలము మేలు, దానికంటె ఉంఛము మేలు, అసత్ప్రతిగ్రహము నిషిద్ధము.

'శిలోంఛమ ప్యాదదీత విప్రో జీవన్ యత స్తతః।
ప్రతిగ్రహా చ్ఛిల శ్రేయాం స్తతో ప్యుంఛః ప్రశస్యతే॥'

మనువు ౧౦-౧౧౨ శ్లో॥

క్షుధార్తిన్=ఆఁకలిబాధచే.

తా త్ప ర్య ము.

పూర్వము బ్రాహ్మణప్రియుఁడు, సదాచార సంపన్నుఁడు, సత్యవ్రతనిష్ఠుఁడు నగు నృగుఁడను రాజు పుష్కర తీర్థమునందు బంగారు సొమ్ములచే నలంకరింపఁబడిన యావులను దూడలతోడ కోటి బ్రాహ్మణులకు దానముగా నిచ్చెను. వానిలో నొక నిఱుపేదయు నిత్యాగ్నిహోత్రియు నుంఛవృత్తిచే జీవించువాఁడు నగు బ్రాహ్మణుని యావు కలిసెను. అది యాయన యెఱుఁగఁడు. ఆవును బోఁగొట్టు కొన్న బ్రాహ్మణుఁ డా పాలచే జీవించువాఁడు గనుక నాఁకలిగొని దాని నిచ్చట నచ్చట వెదకెను. అది గానరాలేదు. ఆ యావు నిమిత్తమై పెక్కు సంవత్సరములు దేశమంతయు వెదకెను. తుదకు కనఖల మను గ్రామము నందు.

క. తనయావు జీర్ణవత్సముఁ గనియొక బ్రాహ్మణునియింటఁ♦గానం బడఁగాఁ
జనుదెమ్మా శబలాయనఁ, దనవిప్రునిస్వర మెఱింగి♦తడయక యదియున్. ౧౦౬౮

అర్థములు. జీర్ణవత్సము=శిథిలమైన దూడను, శబలా=ఆవా.

తా త్ప ర్య ము

తన యావు మరణించిన దూడనుగని యొక బ్రాహ్మణుని యింటనుండఁగా జూచి శబలా! రా, యని పిలిచెను. అది తన్ను సాఁకుచుండిన బ్రాహ్మణుని కంఠ స్వర మెఱిఁగి వెంటనే

క. అనలనిభుం డగు బ్రాహ్మణు, వెనుకంజనె సాఁకుచున్న ♦ విప్రుడు తోడన్
జని నాయది యీ ధేనువు, చను నే తోడ్కొని చనంగ ♦ క్ష్మాసుర దీనిన్?

అర్థములు. అనలనిభుండు=అగ్నితో సమానుఁడు.

తా త్ప ర్య ము

(అగ్నితో సమానుఁడగు బ్రాహ్మణుని వెనుకగాఁ బోయి యావును సాఁకుచున్న బ్రాహ్మణుఁడు, ఈ యావు నాది? బ్రాహ్మణుఁడా! దీనిని నీవు తీసికొని పోఁదగునా?)

క. దానంబు గాఁగ భూమీ,జాని నృగుం డొసగె ననుడు♦క్ష్మాసురుఁ డిది నా
ధేనువు రాజెట్టు లొసఁగె, దానము నీకిచ్చె? ననుడుఁ♦దరతర మిట్టుల్. ౧౦౬౯

అర్థములు. భూమీజాని=రాజు.

తా త్ప ర్య ము

(నృగమహారాజు దీనిని నాకు దానమిచ్చెను.అని చెప్పఁగా బ్రాహ్మణుఁడు ఇది నాయావు రాజేవిధముగా నీకు దానమిచ్చెను? అనఁగా, వారిలో వారు.)

క. వాకాటులకుం జొచ్చి మ,హీకాంతునిఁ దారు చేర ♦ నేగఁగ నందున్
వాకిటికావలివారలు, భూకాంతునిఁ జూడ నరుగఁ ♦ బోనీయమిచేన్. ౧౦౭౦

అర్థములు. వాకాటులకుల్=కలహమునకు.

తా త్ప ర్య ము

(జగడమాడుచు, రాజు నొద్దకుఁ బోవ, నచటఁ గావలివారు రాజు దర్శనమునకుఁ బోనీయకుండుటచేత)

క. పెక్కేఁడు లుండి విసువున, మిక్కిలి కోపించి వారు♦మేదినికాంతున్
గ్రక్కసనుడుల శపించిరి, యిక్కరణిని జన్నె నృపతి ♦ కెం దేఁ జేయన్? ౧౦౭౧

అర్థములు. క్రక్కసనుడులన్=కఠినవాక్కుల.

తాత్పర్యము

(అనేక సంవత్సరములుండి, విసుగుపుట్టి, మిక్కిలి కోపించి, వారు రాజును కఠినవాక్కులఁ శపించిరి. రాజిట్లు చేయుట తగునా?)

ఉ. కార్యము గల్గి యర్థులిటు ♦ కావలి కావఁగ ద్వారమందు నై
శ్వర్యమదంబుచేఁ గొలువు♦శాలను దర్శన మీయ కున్నవాఁ
డార్యుఁడె వీఁడు? భూతనిచ♦యంబుల కెల్ల నదృశ్యుఁ డౌచు నీ
యర్యుఁడు పెక్కులేండ్లు బిల♦మం దొక యూసరవెల్లి గావుతన్. ౧౧౭౩

అర్థములు. అదృశ్యుఁడు=కానరానివాఁడు, అర్యుఁడు=స్యా దర్యస్స్వామి వైశ్యయోః॥నానా॥ర-ప్రభువు.

తాత్పర్యము

(పని కలిగి, యర్థులు వాకిటఁ బడికాపుపడియుండ నైశ్వర్య మదమున దర్శన మీయనివాఁడు వీఁడు పూజ్యుఁడా! ప్రాణులకెవరికిఁ గానరాకుండ నీ రాజు బహుసంవత్సరములు కలుగులో నూసరవెల్లి యయి పడియుండుఁగాత)

తే. నరుఁడు నారాయణుండును♦ధరణిభార,మణఁప జన్మింతు,రుద్వాపర♦మందుఁదుదను
యదుకులంబునఁ బురుషుఁడై ♦యవతరించు, వాసుదేవునిచే వీని♦వనటపాయు.

తాత్పర్యము

(ద్వాపరయుగము తుదను నరనారాయణులు భూభారమును హరింప యదువంశమున నవతరించెదరు. అట్లు లవతరించు వాసుదేవునిచే నీతని యీకష్టము తీరును.

చ. అని శపియించి భూమిసురు♦లా మొదవున్ బలహీన వృద్ధ యా
టను మఱియొండు విప్రున క♦టన్ విడి దానము గాఁగఁ బోయి రా
జనపతి వేఁగు చుండెడిని ♦ శాపవశంబున నిప్పు డోరిమిన్
జనుల విమర్శ సేయమిని ♦ క్ష్మాపతి దుర్గతిఁ జెందు లక్ష్మణా. ౧౧౭౪

అర్థములు. బలహీన=బలములేనిది, మరల, దమవెంట నడచిరాశక్తి లేనిది, వృద్ధ=ముసలిది. ఓరిమిన్=ఓపికతో.

తాత్పర్యము

(అని శపించి యా బ్రాహ్మణు లాయావు ముసలిదై బక్కదైనందుననక్కడనే యింకొక బ్రాహ్మణునకు దానముచేసి పోయిరి. ఆ రాజిప్పటికిని కష్టమనుభవించుచున్నాఁడు. లక్ష్మణా ప్రజలను విమర్శసేయని రాజు దుర్గతి పాలగును.)

క. కలహము కార్యార్థులలో, బలపడుటకుఁ గారణంబు ♦ ప్రభుదోషంబే
కలహములు లేక ప్రజలన్, మెలపున రక్షించుపతికి♦మేలౌనగూడున్. ౧౦౭౫

తాత్పర్యము

ప్రభువు చక్కఁగాఁ బాలింపకుండుట చేతనే ప్రజలయందుఁ గలహములు పుట్టును గావునఁ బ్రజలలోఁ గలహము లేకుండఁ బాలించు రాజునకు క్షేమము గలదు.

క. కావునఁ గార్యముకొఱకై, యేవారేన్ గాచి యున్న ♦ నెఱుఁగం జనుమీ
నీవన; లక్ష్మణుఁడనియెన్, భూవర! యమదండ సదృశ♦మును శాపంబున్. ౧౦౭౬

అర్థములు. యమదండ సదృశము=యమదండముతో సమానమైనది.

తాత్పర్యము

(కావునఁ గార్యార్థులయి యెవరేనిఁ గాచుకొని యున్నారేమో తెలిసికొన నీవు పొమ్ము. అని శ్రీరామచంద్రప్రభువు చెప్పఁగా రాజా! యమదండముతో సాటియైన శాపమును.)

క. విని యేమి చేసె నృగుఁడన, జనపతి తద్వార్త యెఱిఁగి,♦సచివుల హితులన్
దనకడకుఁ బిలిచి దుఃఖం,బునఁ బొగులుచు నిట్టు లనియె♦భూదేవవరుల్. ౧౦౭౭

అర్థములు. భూదేవవరుల్=బ్రాహ్మణ శ్రేష్ఠులు.

తాత్పర్యము

(నృగుఁడేమి చేసెను? అని యడుగ, రాజా సమాచారము తెలిసి మంత్రులను స్నేహితులను దనయొద్దకుఁబిలిచి దుఃఖమునఁ గుములుచు నిట్లనెను బ్రాహ్మణ శ్రేష్ఠులు)

క. నారదుఁడును బర్వతుఁడును, ఘోరం బగు శాప మిచ్చి ♦ గొబ్బున దివికిన్
మారుతులై చనిరే మన, మీరలు నాసుతుని వసువు♦మేదిని నేలన్. ౧౦౭౮

అర్థములు. మారుతులై=వాయువులవలెనై

తాత్పర్యము

దీనిచే సోమరియై ప్రజల మనవులు విచారింపని నృగుని దండించుటకై పర్వత నారదులాప్రకారము శపించిరని యేర్పడు చున్నది.

క. అభిషేకముఁ గావింపుడు, శుభముగఁ బెనుబిల మొకండు♦సుఖకరముగ నా
కభినిర్మింపఁగ శిల్పి,ప్రభువుల నియమింపుఁడీ కృ♦పారతు లగుచున్. ౧౦౭౯

అర్థములు, కృపారతులు=నాయందుఁ గృప ప్రీతి గలవారై

తా త్ప ర్య ము

(పట్టాభిషేకము చేయుఁడు- నాకు సుఖముగ నుండునట్లు లోకపెద్ద బిలమును నిర్మించుటకు శిల్పవరులను దయతోఁ బిలిపింపుఁడు)

సీ. అందుండి శాపంబు•ననుభవించెదను వ,ర్షఘ్నంబు గాఁగ హి•మఘ్నముగను
నాతపఘ్నంబుగ • ననునార బిలములు, మూఁడిటిఁ గావించి• పోఁడిమిగను
వానిచుట్టును మేలి•ఫలవృక్షములఁ బుష్ప,వంతంబు లగు లతా•వళుల నాటి
దట్టంపునీడలు•దనర గుల్మము లుంప, నందు నాశాపాంత•మందు నర్ధ

తే. యోజనము దాఁక బుష్పంబు•లొప్పచుండఁ, జేయుఁడీయని వసువును•జేరఁబిలిచి
ధర్మమార్గంబు విడువకు ఁ తనయ! నీవు, క్షత్ర ధర్మంబుమై నేలు•ధాత్రి నెల్ల.

అర్థములు. వర్షఘ్నము=వాన బాధలేనిది, హిమఘ్నము=మంచు బాధలేనిది, ఆతపఘ్నము = ఎండబాధలేనిది, పుష్పవంతంబులు=పూలుగలవి, లతావళులన్=తీఁగలగుంపుల, గుల్మములు = పొదలు, ఆశాపాంతము = శాపము దీరువఱకు.

తా త్ప ర్య ము

మంత్రులారా! వానబాధ, మంచుబాధ, ఎండబాధ లేకుండునట్లు మూఁడు పెద్దబిలములు నిర్మింపఁజేయుఁడు. శాపము తీరు వఱకు వానియందుండెదను. ఆ మూఁడు బిలముల చుట్టు ఫలవృక్షములను పూల తీఁగలను నాటింపుఁడు. దట్టముగ నీడలుండునట్లు పొదలేర్పాటు చేయింపుఁడు, బిలములచుట్టు యోజనముదాఁక పూల చెట్లుండునట్లు చేయుఁడు అని కొడుకగు వసువును జేరఁబిలిచి కుమారా! ధర్మము విడువకుము, క్షత్రియధర్మము ననుసరించి భూమి పాలింపుము.

క. అపరాధ లేశమునకున్, విపరీతపు శాపమిడిరి • విప్రులుకంటే
తపియింపకు దైవంబే, నిపుణము పో మేలు.గీళ్లు • నెఱి సమకూర్పన్. ౧౦౮౧

అర్థములు. అపరాధలేశమునకున్=అల్పదోషమునకు తాను సభకు రాకుండుట యల్పదోషమని తోఁచెనే కాని దాని వలన నెందఱెంత కష్టపడిరో యతనికిఁ దోఁచినది కాదు, తపియింపకు=పరితాపపడకుము, నిపుణము=నేర్పుగలది.

తా త్ప ర్య ము

(చిన్న తప్పునకు బ్రాహ్మణులు విపరీతపు శాపమునఁ బెట్టిరి చూచితివా? నీవు పరితాప పడకుము-మంచికిఁ జెడ్డకు దైవమే చాలియుండును.)

క. కలుగునవి యేవొ కలుగును,దొలఁగునవో తొలఁగుదా మెం•దొరకొను,శాస్త్రంబులు సుఖములు దుఃఖంబులు,తొలిమనుజుఁడొనర్చుసుకృత•దుష్కృతఫలముల్.

తాత్పర్యము

పూర్వజన్మమున మనుష్యుఁడు చేసిన పుణ్యములయొక్కయుఁ బాపములయొక్కయు ఫలము, మేలు కీడ్లు ఏమి కలుగవలయునో యవి తమకుఁ దామె ప్రాప్తించును. తొలఁగి పోవలసినవి తామే తొలఁగి పోవును. వానిని గుఱించి ఫలకాలమున సంతోషము గాని దుఃఖము గాని పడరాదు.

క. అని చెప్పి నందనునకుం, జనియెన్ నృగుభూవరుండు ♦ సమ్యక్కృత మై
యొనరినబిలంబులోనికి, దినము లటం గడుపుచుండె♦దీనత్వమునన్. ౧౦౪౩

అర్థములు. సమ్యక్ + కృతము=చక్కఁగాఁ జేయఁబడినది.

తాత్పర్యము

(అని కుమారునకుఁ జెప్పి, నృగమహారాజు చక్కఁగాఁ జేయఁబడిన బిలములోనికిఁ బోయి దీనత్వముతో దినములు గడుపుచుండెను.)

—♦ శ్రీరాముఁడు లక్ష్మణునకు నిమికథఁ దెలుపుట ♦—

క. ఈవిషయంబున మఱియొం, డేవినిచెద నీకు విన న♦భీష్టం బేనిన్
బావనకథ నన లక్ష్మణుఁ, డే విస్మయకరకథాళి ♦ దృప్తింగానన్. ౧౦౪౪

అర్థములు. ఏన్=నేను, విస్మయకర=ఆశ్చర్యమును గలిగించు.

తాత్పర్యము

(ఈ విషయమున మఱొకపావనమైన కథ నీ కిష్టమయినచోఁ జెప్పెదను. అని చెప్పఁగా లక్ష్మణుఁ డాశ్చర్యకరమైన కథలను వినుటయందుఁ దనివితీఱకున్నది. ఈ కథలు రామచంద్రమూర్తి యెట్లు రాజ్యము పాలించుచుండునో తెలుపును)

సీ. అనవుడు శ్రీరాముఁ ♦ డనియె నిక్ష్వాకుని, పంద్రెండవసుతుండు♦పరమధర్మ
నిరతుండు నిమి యను ♦ ధరణీశ్వరుఁడు గౌత, మాశ్రమప్రాంతంబు♦నందు శక్ర
దేవపురోపమం ♦ బౌవై జయంత మ,న్నగరంబు నిర్మించి ♦ దగినరీతి
దీర్ఘసత్ర మొనర్పఁ ♦ దివిరి యిక్ష్వాకుని, నామతించి వసిష్ఠు♦యజ్ఞ కార్య

తే. నిర్వహణమునకును బిల్వ ♦ నేను మున్న, వాసవునిచే వరియింపఁ♦బడినవాఁడఁ
దాళుమీ నేనువచ్చునం♦దాఁక ననుచు,నరుగ నిమియత్రిగౌతమాం♦గిరులఁబిలిచె.

అర్థములు. శక్రదేవ పురోపమంబు=ఇంద్రుని నగరముతో సమానము, దీర్ఘసత్రము=చాలఁగాలము జరుగు యాగము, ఆమతించి=పిలిచి.

తాత్పర్యము

రామచంద్రమూర్తి యిట్లు చెప్పెను. ఇక్ష్వాకుని పంద్రెండవ కుమారుఁడు నిమి యనురాజు-ఉత్తమధర్మమం దాసక్తి గలవాఁడు-గౌతమాశ్రమము సమీ

పమున అమరావతివంటి దగు వైజయంతమను పురముఁ గట్టించి యచట దీర్ఘ సత్రము చేయఁ బ్రయత్నించి యజ్ఞకార్యము నిర్వహింప వసిష్ఠునిఁ బిలిచెను. ఇంతకుఁ బూర్వమే యింద్రుఁడు నన్ను వరించి యున్నాఁడు. నే నచ్చటికిఁ బోవలయును. నేను వచ్చువఱకు నీవు యజ్ఞము నిలుపుమని వసిష్ఠుఁడు చెప్పిపోయెను. నిమియంతవరకు యజ్ఞము నిలుప నిష్టపడక యత్రిని గౌతముని అంగిరసునిఁ బిలిచెను.

ఉ. వారలు దోడ్పడంగ హిమ♦వంతముపొంతఁ బురంబుదాపునన్
 క్ష్మారమణుండు జన్నమును ♦ సాగఁగఁ జేయుచు నైదువేల యేం
 డ్లార రహింప వాసవుని♦యజ్ఞముఁ దీర్చి వసిష్ఠయోగి త
 ద్ధారిణిఁ జేరి జన్నము య♦థావిధి గౌతమయోగి దీర్పఁగన్. ౧౦౮౬

తాత్పర్యము

(వారలు సాయపడఁగా, మంచుఁగొండ పొంత పట్టనమున దాపున యజ్ఞమును రాజు సాగించుచు నైదువేలేండ్లు పూర్తిగాఁ జరపెను. అప్పుడింద్రుని యజ్ఞమును బూర్తి చేసి వసిష్ఠుఁ డచ్చటకు వచ్చి, గౌతముఁడు యజ్ఞమును యథావిధిగాఁ జేయించు చుండఁగా.)

క. కని యాగ్రహించి భూమీం,ద్రునకై ముహూర్తంబు వేచె♦దురదృష్టమునన్
 జనవిభుఁడు నాఁడు నిద్రిం, చెను బగటం గాచికొని వ♦సిష్ఠుఁడు కినుకన్. ౧౦౮౭

తాత్పర్యము

(చూచి, యాగ్రహపడి, రాజుకొఱకొక ముహూర్తము వేచియుండెను. దురదృష్ట వశమున నా దినము పగలు రాజు నిద్దురఁ బోయెను. వసిష్ఠుఁడు కాచుకొని యుండి, కోపముతో.)

ఉ. నన్ను నిరాకరించి సవ♦నం బొనరింపఁగ నన్యుఁ దెచ్చి తీ
 విన్నెఱిఁ జెప్పవచ్చినను ♦ నింటన యుండియు నీవు దర్శనం
 బు న్నృప! నీ వచేతనతఁ ♦ బొందు మ టం చని శాప మీయ భూ
 భృన్నళినాహితుం డెఱిఁగి ♦ వేగమ వెల్వల వచ్చి క్రుద్ధుఁడై. ౧౦౮౮

అర్థములు. అచేతనతన్=చైతన్యము లేకపోవుటను,ప్రాణము లేకపోవుటను, భూభృన్నళినాహితుండు=రాజచంద్రుఁడు క్రుద్ధుఁడై=కోపించినవాఁడై.

తాత్పర్యము

(నన్ను నిరాకరించి యితరుని యజ్ఞము చేయించుటకుఁ దెచ్చికొంటివి- ఈ విషయము నీకుఁ జెప్పవచ్చిన నాకు,నీ వింటిలో నుండియు దర్శన మీయకుంటివి- కావున నీకు ప్రాణము లేకపోవునుగాక యని శాపమీయఁగా, రాజెఱిఁగి వేగమె వెలుపలికి వచ్చి కోపించినవాఁడై.)

క. ఒడ లెఱుఁగక నిద్రింపఁగఁ, గడు ఘోరముగా శపింపఁ • గార్యం బగునే
చెడు నీ వచేతనత నీ, యొడలున్ రుచిరత్వ మెడల • కుండెడిఁ గాతన్. ౧౧౦౯

అర్థములు. ఒడలు = దేహము, అచేతనత = చైతన్యము లేమిని, రుచిరత్వము = అందము.

తా త్ప ర్య ము

నేను దేహము తెలియక నిద్రింపఁగా నిటువంటి ఘోరశాప మీయ వచ్చునా? ఇచ్చితివి కావున నావలెనే నీవు చైతన్య హీనుఁడవుకమ్ము. నీదేహము చెడకుండునుగాక.

క. అని రోషవశంబున న, య్యనఘులు శపియించి రిట్టు•లన్యోన్యంబున్
గన లేమి చేయ లేదన, విని లక్ష్మణుఁ డనియె నెట్లు • విగతశరీరుల్. ౧౧౧౦

అర్థములు. కనలు = కోపము, విగతశరీరుల్ = దేహములులేనివారు.

తా త్ప ర్య ము

అని కోపావేశముచే నిరువు రొకరి నొకరు శపించిరి. కోపము చేయలేని పని యే మున్నది అని చెప్పఁగా లక్ష్మణుఁడు దేహము లేనివారలు.

—* వసిష్ఠుఁడు దేహము ధరించుట *—

చ. తనువులు గ్రమ్మఱం గొనిరి • తత్కథఁ దెల్పు మటన్న రాముఁ డి
ట్లను దమ దేహముల్ విడిచి • యాధరణీశ్వరుఁడున్ మహాతపో
ధనుఁడును వాయుభూతు లయి • తారుచు నుండిరి మింటఁ, దండ్రినిన్
గనఁగ వసిష్ఠుఁ డేగెఁ బర•కాయము నొంద(గఁ గాంక్ష చేయుచున్. ౧౧౧౧

అర్థములు. తనువులు = దేహములు, వాయుభూతులయి = వాయువులవలెనై తారుచు = సంచరించుచు, తండ్రినిన్ = బ్రహ్మదేవుని.

తా త్ప ర్య ము

మరల శరీరములు గలవా రెట్లయిరో యాకథ తెలుపుమని కోరఁగా రామచంద్రమూర్తి యిట్లనియె. తమ దేహములు వదలి యారాజు మునీశ్వరుఁ డిరువు రాకాశంబున గాలులై తిరుగుచుండిరి. వీరు కాలము తీఱి చచ్చినవారు కారు కావున వీరి కే లోకములు లేవయ్యెను. అప్పుడు వసిష్ఠుఁడు తన తండ్రియగు బ్రహ్మ యొద్దకు మరల దేహము నొందఁ గోరి యుపాయ మడుగఁబోయెను.

క. అరిగి విధాతకు మ్రొక్కిడి, సరసిజభవ! యండజాత! • సర్వసుపర్వో
త్కరవల్లభ! నేనిమి భూవరు, శాపముచేతఁ దనువుఁ•బాయఁగఁగంటిన్. ౧౧౧౨

అర్థములు. విధాత = బ్రహ్మకు, మ్రొక్కు + ఇడి నమస్కరించి, శరీరము లేనప్పుడు నమస్కారాదులు లేకున్నను తపఃభావపముచేఁ గలిగిన లింగ

శరీరముచే నని గ్రహింపనగు, అండజాత=బ్రహ్మాంశము శరీరముగాఁ గలవాఁడా. అండములోనుండి పుట్టినవాఁడా- "తదండ మభవద్ధైమం సహస్రాంశు సమప్రభమ్. తస్మిన్ జజ్ఞే స్వయం బ్రహ్మా సర్వలోక పితామహః" మనుస్మృతి-౧-౯. సర్వసురగోత్రకారనల్లభ=సమస్తదేవతాసమూహములకు నధిపతియగువాఁడా.

తాత్పర్యము.

(పోయి బ్రహ్మకు నమస్కరించి, దేవాధీశ్వరా! నిమిరాజు శాపము చేత నేను శరీరమును విడువవలసిన వాఁడనైతిని.)

క. మేనులు లేకుండిన న, న్యూనవ్యసనములు దొడరు ♦ నొదవును లోపం
బోనళినాసన! క్రియలకుఁ, గాన నొసంగుము మఱొండు ♦ కాయంబనినన్. ౧౦౫

అర్థములు. మేనులు=దేహములు, అన్యూన=కొఱఁత లేని, వ్యసనములు= దుఃఖములు, తొడరున్=ప్రాప్తించును, క్రియలకున్=కర్మములకు, కాయంబ= దేహము.

తాత్పర్యము

ప్రాకృత దేహముచేఁ గర్మములు చేసికదా జీవుఁడు తరింపవలెను. సమస్త ధర్మకర్మములు శరీరముతోనే కదా చేయవలెను. అది లేకున్న నే ధర్మ మే కర్మము సాగదు. దానివలన జీవుఁడు దుఃఖముల పాలవును కావున నాకు మఱి యొక దేహమిమ్ము.

సీ. ధాత యిట్లనియె మి♦త్రావరుణుల తేజమునఁ జొచ్చి వసుధను♦జనన మొందు
మీ యయోనిజుఁడవై ♦ మేదినీ సురవర్య, మహితతపంబున ♦ మద్వశుండ
వయ్యెద వనిన సం♦యమి మ్రొక్కి చయ్యన, వరుణాలయమునకు♦వచ్చినపుడు
మిత్రుండు వరుణ♦సమ్మేళనంబున రాజ్య, పాలనంబొనరించె♦వచ్చె నటకుఁ

తే. బద్మదళనేత్ర పూర్ణేందు♦వదన చెలుల, తోడనుర్వశి వరుణుఁడా♦చేడెఁగాంచి
వలపు దెలిపిన మిత్రుండు♦వలచెఁ దొలుతఁ జనునేనీతోడఁగూడంగ♦ననినఁనతఁడు

అర్థములు. మిత్రావరుణులు=సూర్యుఁడు వరుణుఁడు, దేవతాద్వంద్వేచ- యను పాణిని VI 3-26 సూత్రప్రకారము పూర్వపదాంత స్వరమునకు ఆదా దేశము. ఇట్టులే సూర్యాచంద్రమసులు. అగ్నామారుతులు, తేజమునన్=తేజస్సుచే, అయోనిజుఁడవై=యోనినుండి పుట్టినవాఁడవు గాక, మేదినీసురవర్య= బ్రాహ్మణోత్తమా, మద్వశుండవు=నాకు వశపడిన వాఁడవు, ప్రాజాపత్యాధికారము కలవాఁడవు, సంయమి=ఋషి, వరుణాలయమునకున్ = వరుణునింటికి, వరుణసమ్మేళనంబునన్=వరుణునితోఁ గూడినవాఁడై, వలపు=కామము.

తాత్పర్యము

బ్రహ్మదేవుఁ డిట్లు చెప్పెను. మిత్రావరుణుల రేతస్సున బ్రవేశించి భూమి యందు నయోనిజుఁడవై జన్మించి, గొప్పతపస్సుచేసి నాస్వాధీనుఁడ వగుము. అనిన ఋషి మ్రొక్కి వరుణుఁ డున్నస్థలమునకు వచ్చెను. అప్పుడు మిత్రుఁడు వరుణుఁడు నిరువురు గలసి రాజ్యమును పాలించుచుండిరి. అచ్చటికి నూర్వశివచ్చెను. దానిని జూచి వరుణుఁడు తన కామమును దానికి దెలుపఁగా నది యింతకు ముందే మిత్రుఁడు నన్ను వలచియున్నాఁడు. కావున నీతోడఁ గూడరా దనెను.

ఉ. ఓరువఁ జాల దర్పకుని♦యుద్ధతి కేను మృగాక్షి! దివ్యభృం
గారువునందుఁ దేజమును ♦ గామిని వీడెద నన్న నుర్వశీ
సారసనేత్ర యిట్టులను ♦ సమ్మత మయ్యది మిత్రుఁ డొందు శా
రీరసుఖంబు, నీయదియ ♦ హృత్కమలం, బది గాదె మిన్నయౌ. ౧౦౫

అర్థములు. దర్పకుని యుద్ధతిన్=మన్మథుని పరాక్రమము, ఓరువజాలన్=సహింపలేను.

తాత్పర్యము

రేతస్సును నేను బిగఁబట్టజాలను. కావున గిండియందు దాని వదలెదను అని చెప్పఁగా నట్టులే చేయుము నాకది సమ్మతమే, శరీరసౌఖ్యము మిత్రునకుఁ గలుగును. మనస్సంగమసౌఖ్యము నీకుఁ గలుగును. అదియే కదా శ్రేష్ఠము.

తే. అనిన జ్వలదగ్ని శిఖకుఁదు♦ల్యంబు తేజ, మతఁడు కుంభంబునం దుంచె♦నతివచనియె
మిత్రుఁ జేరంగ నాతఁడా♦ మెలఁతఁగాంచి, క్రోధకలుషితచిత్తుఁడై♦కొమ్మకనియె.

అర్థములు. జ్వలదగ్నిశిఖకున్=మండుచున్న యగ్నిజ్వాలకు, తుల్యంబు=సమానము, క్రోధకలుషిత చిత్తుఁడై=కోపముచే కలుషమైన మనస్సుగలవాఁడై.

తాత్పర్యము

(అనిచెప్పఁగా నతఁడగ్నిజ్వాలకు సమమైన వీర్యమును గుంభమునందుంచెను. ఆకాంత మిత్రుని యొద్దకుఁ బోవ, నాతఁడు కోపించి యా వనితతో నిట్లని చెప్పెను.)

ఉ. ఓసి దురాత్మికా! కలుష♦యుక్త చరిత్రక! మున్ను మున్ను నా
కాస వచించి యీనడుమ ♦ నన్యునిఁ గూడఁగ లంజవైననున్
దోసము గాదె? యీయతుల ♦ దోషమునన్ ధరపై వసింపుమీ
వాసి తఱుంగ మానవుని ♦ భార్యవుగా నొక కొంతకాలమున్. ౧౦౬

అర్థములు. దురాత్మికా=పాపపు మనస్సు గలదానా, కలుషయుక్త చరిత్రక=పాపముతోఁ గూడిన నడవడి గలదానా, అతులదోషమునన్ = అసమాన పాపముచే.

(ఓసి పాపాత్మురాల! పాపముతోఁ గూడిన నడవడి గలదానా! ముందుగా నాకాసపెట్టి యీనడుమ నింకొకనితోఁ గలియుట నీవు లంజవైనను దోషము గాదా? నాటిలేని యీ పాపముచే నీవు భూమిలో నొక మానవుని భార్యవై కొంతకాలము వసింపుము.)

క. సుతుఁ డయి బుధునకుఁ గాశీఁ పతియైన పురూరవుండు♦పతిగా మనుమీ
మతిహీన! యనఁ బురూరవు, సతి జేరఁగ నేగి యతని ♦ సతియై మెలఁగెన్.

తాత్పర్యము

(బుద్ధిలేనిదాన! నీవు బుధునికిఁ గొడుకు కాశీరాజునకు పురూరవుఁడు భర్తగా బ్రదుకుము. అని పలుక నా సతి పురూరవుని యొద్దకుఁ బోయి యతనికి భార్యయై యుండెను.)

క. అతని సుతుం డాయువు తత్, తిపతికిన్ నహుషుఁ డొదవెఁ♦గీర్తితగతి భూ
పతియై యింద్రుఁడు వృత్రుని, హతుఁజేసి భ్రమింప నింద్రుఁ♦డై దివమేలెన్.

తాత్పర్యము

(అతని పుత్రుఁడాయువు-అతనికి నహుషుఁడు పుట్టెను. ఇంద్రుఁడు వృత్రాసురునిఁజంపి బ్రహ్మహత్యచే భ్రమించుచుండ నహుషుఁ డింద్రుఁడై లక్షసంవత్సరములు స్వర్గము నేలెను.)

తే. నూఱువేలేఁడు; లిచ్చట ♦ నూత్న చంద్ర,ఫాల కంజదళాక్షి యు♦ర్వశి ధరిత్రి
చాలసంవత్సరము లుండి ♦ శాప మంత, మొందగఁ గ్రమ్మఱజేర బి♦డౌజువీడు.

అర్థములు. బిడౌజువీడు=ఇంద్రపట్టనము.

నాలుగవ పాదంబున నుభయయతి.

తాత్పర్యము

(ఇచ్చట నుర్వశి భూమియందుఁ జాలసంవత్సరములుండి, శాపము తీఱి పోఁగా మరల నింద్రపట్టనమును జేరెను.)

—♦ **వసిష్ఠుఁడు మైత్రావరుణుఁ డయి జన్మించుట** ♦—

చ. అనవుడు లక్ష్మణుం డనియె ♦ నమ్మునిపార్థివు లెట్లు క్రమ్మఱన్
దనువులు గాంచి రవ్విధము ♦ దాశరథీ! వినిపింపు మన్న న
య్యనుజునిఁ బల్కె రాముఁడు మ♦హాత్ముల వారల తేజు నుండి సం
జననము గాంచి రాఘుటెని ♦ సంయమివర్యులు పూర్ణతేజులై. ౧౧౦౧

తాత్పర్యము

(అని చెప్పఁగా లక్ష్మణుఁడు మరల నడిగెను. ఆ వసిష్ఠమునియు నిమిభూపతియు మరల దేహము లెట్లు పడసిరి. దాశరథీ! వినిపింపు మని యడుగ, రామచంద్రమూర్తి తన తమ్మునితో మహాత్ములగు వారి వీర్యమునందుండి కుంభమున నా ముని శ్రేష్ఠులు పూర్ణమగు తేజస్సుగలవారై జన్మించిరి.

తే. ఊర్వశీకారణంబుగఁ ◆నుంచెఁ దొలుత, దివ్యఘటనమున మిత్రుండు◆తేజు దాన
వరుణుఁ డావల నుంచెఁ ద◆ద్వ్యాజమున న,గస్త్యముని గ జన్మించి◆కాంచిమిత్రు.

అర్థములు. తద్వ్యాజమునన్=ఆ నెపమున.

తాత్పర్యము

(మొదట దివ్యఘటమునందు మిత్రుఁడు తన వీర్యమును నూర్వశినెపమున నుంచెను. దానియందే తరువాత వరుణుఁడు తన తేజస్సునుంచెను. ఆ కారణమున ముందుగా నగస్త్యుఁడు పుట్టి మిత్రునిఁజూచి.)

తే. నేను నీదుతనూజుఁడఁ◆గా నటంచుఁ, జనియె మఱి కొంతకాలంబు◆చన వసిష్ఠుఁ
డందు జన్మించె నుభయశు◆క్లాప్తి దాన,నతఁడు మైత్రావరుణుఁడన◆ఖ్యాతిఁగాంచె

అర్థములు. ఉభయ శుక్లాప్తి=ఇరువుర రేతస్సు కలియుటచే.

తాత్పర్యము

(నేను నీ కొడుకును గాననిపోయెను. మఱి కొంతకాలము కడచిపోఁగా, మిత్రావరుణు లిరువురి వీర్యమున వసిష్ఠుఁడందులోఁ బుట్టెను. ఆ కారణమున వశిష్ఠుఁడు మైత్రావరుణుఁడని ఖ్యాతిగాంచెను.)

ప్రత్యగాత్మ దేహియై సుఖదుఃఖము లనుభవించుటకు సకామకర్మమే కారణము ఈ విధముగా జేసిన కర్మములఫలము లన్నియు ననుభవించువఱకు జన్మములొకటి వెంట నొకటి వచ్చుచునే యుండును. ఇట్లు దుఃఖములు సుఖములు నందు ననుభవించిన తుదకు వానియందు రోఁతపుట్టి జన్మములు లేకుండఁ జేసికొనఁగోరిజన్మములకుఁ గామము కారణముగావున జన్మరాహిత్యముకై ఫలాభిసంధి రహితముగఁ గర్మము లాచరించి వాని ఫలము భగవంతునకు సమర్పించును. అట్లు చేయుటచే నూతనకర్మముల సృష్టి మానును. పాతవి సమయ నారంభించును, ఇట్టి జన్మము సామాన్యజీవులందు స్త్రీ పురుషసంయోగము లేక కలుగదు. ఇందు స్త్రీ క్షేత్రము, పురుషుఁడు బీజము నగుచున్నాఁడు. ఈ రెంటిలో నేది ప్రధానమని యొక వివాదము కలదు. ఈ విషయము మనుస్మృతి తొమ్మిదవ యధ్యాయంబునఁ జర్చింపఁబడినది.

తే. ఆమహాతేజు నిక్ష్వాకుఁ◆డాశ్రయించి, తమ పురోహితుఁగాఁ గొనె◆ధర్మవిదుని
నింక వచియింతువినుము నిమి◆మాశ్వరుండు,తనువుఁగాంచినవిధముఁ ద◆త్త్వజ్ఞవినుత.

తాత్పర్యము

(మహా తేజశ్శాలియగు వసిష్ఠుని నిక్ష్వాకుఁ డాశ్రయించి తనకుఁ బురోహితునిఁగా గ్రహించెను. ఇఁక నిమిరాజు శరీరమును బొందిన విధము. తెలిపెద వినుము.

—* దేవతలు ఋషులు నిమికోరినవర మిచ్చుట *—

చ. ఋషులు విదేహనాయకు శ•రీరముఁ బ్రోచుచు గంధమాల్యకి
ల్బిషరహితాంబరంబులను • వేలిమిఁ దీర్చుచుఁ బ్రత్యగాత్మతో
ఋషిభృగు విట్లు పల్కె నిమి!•యేమివరంబును గోరె దీవు క
ల్మషరహితా! వచింపు మెట • మానుగ నిల్పుదు నీదు జీవమున్. ౧౧౦౫

అర్థములు. విదేహనాయకు=విదేహ రాజు, గంధమాల్య కిల్బిషరహితాంబరంబులను=గంధముల చేతను పూలదండల చేతను నిర్మలవస్త్రముల చేతను-రక్షించుచు, వేలిమి=యజ్ఞము, ప్రత్యగాత్మతో=దేహములేని యాత్మతో, కల్మషరహితా=దోషము లేనివాఁడా.

తాత్పర్యము

నిమిచే యజ్ఞము చేయించు ఋషు లాతని శరీరమును గంధమాల్యాదుల చేతను, మంచి నిర్మలవస్త్రముల చేతను, నలంకరించి పోషించుచు యజ్ఞము నెఱవేర్చుచు నిమి ప్రత్యగాత్మతో ఋషులందు భృగుమహర్షి నిమీ! నీవేమి వరముఁ గోరెదవు? తెలుపుము. నీ జీవము నెందుండఁ జేయుదువు తెలుపు మనెను.

చ. పలికిరి తుష్టులై సురలు • పార్థివసత్తమ! నీదుజీవమున్
నిలుపుద మెందుఁ గోరు మన • నిర్జరులార! సమస్తభూతదృ
ష్టుల నిలువంగ నామనసు•చొప్పన, వారలు వాయురూపమై
నిలువుమ యల్లె నీకతన • నేత్రనిమీలన మొందు భూతముల్. ౧౧౦౬

తాత్పర్యము

దేవతలును సంతోషించినవారై నిమితో నీజీవ మెందు నిలుపుదుము, చెప్పుమనిరి. అప్పు డాయన దేవతలారా! అన్ని భూతముల దృష్టులయం దుండఁగోరెద నన వారును నాగాదివాయురూపమై నీవు కోరినట్లే ఱెప్పలయం దుండుము. నీవలననే ప్రాణులు కన్నులు మూయఁ గలుగును.

క. అలఁత దొలంగఁగ ఱెప్పలు, పలుమాఱును మూయు భూత•పటలియటంచున్
బలికి సుర లేగ మౌనులు, చిలికిరి నిమిమేన నరణిఁ • జేర్చి సవిధిగన్. ౧౧౦౭

తాత్పర్యము

ప్రాణులకు బడలిక తొలఁగుటకై ఱెప్పలు పలుమాఱు ప్రాణులుమూయునని చెప్పి దేవతలు పోవగా మునులా నిమి దేహమున నరణి యథావిధిజేర్చిమథించిరి.

క. తనయార్థంబుగ దానన్, జనియించెను మిథి యనంగ ♦ క్ష్మాపతి మథనం
బునఁ బుట్టుట మిథి యయ్యెన్, జననం బందుట నతండు♦జనకుండయ్యెన్.

తాత్పర్యము

ఇట్లు పుత్రుని నిమిత్తమై చిలుకఁగా దానియందు మిథి యనువాఁడు జనించెను మథనమున జనించినవాఁడు కావున నారాజు మిథియయ్యెను. జననమందుటచే జనకుఁ డయ్యెను.

క. ఆతఁడు విదేహమున సంజాతుం డగు హేతువునను ♦ జనె వైదేహ
ఖ్యాతిని మథి నిర్మించుట, భూతలమున మిథిలయనఁగఁ ♦ బురవర మొప్పెన్.

తాత్పర్యము

అతఁడు విదేహమున దేహము లేనివానియందుఁ బుట్టినవాఁడు కావుఁన వైదేహుఁడను పేరు గాంచెను. ఆ మిథి నిర్మించిన నగరము మిథిల యయ్యెను.

—♦ శ్రీరాముఁడు లక్ష్మణునకు యయాతి చరిత్రముఁ దెలుపుట ♦—

చ. అనవుడు లక్ష్మణుం డనియె ♦ నౌర! విచిత్ర చరిత్ర మెట్టులా
జనపతి క్షత్రియుండు బల♦శౌర్యధురంధరుఁ డందు దీక్షితుం
డును గద కోపమున్ నిలుప ♦ నూలోకనకట్లు వసిష్ఠునిన్ శపిం
చినకత మేమొ శాంతిని భ♦జింపఁ డదేటికొ? భూవరోత్తమా! ౧౧౧౦

తాత్పర్యము

అని చెప్పఁగా లక్ష్మణుఁ డిట్లనియె, ఔరా, ఆశ్చర్యము! ఆరాజు క్షత్రియుఁడు, బలశాలి, అందు యజ్ఞదీక్ష వహించినవాఁడు కదా! ఇట్టి సమయంబునఁ గోపింపరాదే కోపము నిలుపఁ బ్రయత్నింపక యేల వసిష్ఠుని శపించెను. ఏల శాంతిని బొందఁ డయ్యెను.

ఉ. నావుడు రాఘవుం డనియె ♦ నాయన! కోప మణంప దుస్సహం
బావిధి శక్య మౌనొకొ య♦యాతికిఁ దప్పఁగఁ దక్కువారికిన్
భూవిభులందు సత్త్వగుణ♦పూర్ణుఁ డతండు వచింతు విన్ము త
త్క్ష్మావరుపూర్వవృత్త మని ♦ సమ్మతిఁ జెప్పఁదొడంగె నివ్విధిన్. ౧౧౧౧

తాత్పర్యము

అని యనుగఁగా రామచంద్రుఁ డిట్లనియె, నాయనా! కోపమణఁచుట మిగులఁ గష్టకార్యము. అది యయాతికిఁ దప్పఁ దక్కిన వారికి సాధ్యముగాదు. రాజులలో సత్త్వగుణముచే నిండిన వాఁ డతఁడు. ఆ రాజుయొక్క పూర్వవృత్తాంతము చెప్పెద వినుము. అని యిట్లు చెప్ప నారంభించెను.

సీ. నహుషునకును బ్రియ♦నందనుండు యయాతి, యతని కిద్దఱురూప♦వతులుసతులు
వృషపర్వతనయ శ♦ర్మిష్ఠ యన్ దైతేయి శుక్రునికూఁతురు ♦ సుందరాంగి
దేవయాని యనంగ ♦ నా వరవర్ణినుల్, తనయులఁ గాంచిరి♦దర్పధనులఁ
బూరుండు శర్మిష్ఠ♦పుత్రకుండు, యదుండు దేవయానిసుతుండు ♦భూవిభుండు

తే. తల్లి శర్మిష్ఠ ప్రియ యౌటఁ ♦దనయుఁ బూరు
మిగుల లాలింప యదువు లో ♦ వగవు చెంది
తల్లి డాయంగఁ జని శోక♦దైన్యములను
బలుకఁ దన హృద్గతం బెల్ల ♦ దెలియఁబడఁగ. ౧౧౧౨

అర్థములు. వరవర్ణినుల్=ఉత్తమస్త్రీలు, హృద్గతంబు=మనస్సునఁగలది.

తా త్ప ర్య ము

నహుషునకు యయాతి కొడుకు, అతని కిరువురు భార్యలు. అందు వృషపర్వుఁడను రాజుకూతురు శర్మిష్ఠ. శుక్రాచార్యుని కూఁతురు దేవయాని. ఆయిరువురకుఁ గొడుకులు గలరు. శర్మిష్ఠ కొడుకు పూరుఁడు. దేవయాని కొడుకుయదువు. ఆరాజునకు శర్మిష్ఠయందుఁ బ్రేమ మెక్కువ యగుటచే దాని కొడుకును విశేషముగ లాలించును. అది చూచి యదువు తనమనస్సులో జాలఁ దుఃఖించి తల్లియొద్దకుఁ బోయి తన మనస్సులోని దుఃఖమిట్లు చెప్పెను.

ఉ. పుట్టితి వీవు భార్గవుని♦పుణ్యకులంబున రాజు భార్యవై
యిట్టి మహావమానమును ♦ నీవు సహించెద వెట్లొ? యేల యీ
రట్టడిజీవనంబు? వెస ♦ రమ్మ హుతాశనుఁ జొత్త మిర్వు రీ
వట్టు లొనర్ప వేని యిపు ♦ డానతి నా కిడు మేను జొచ్చెదన్. ౧౧౧౩

తా త్ప ర్య ము

తల్లీ! నీవు పుణ్యాత్ముఁడగు శుక్రుని కడుపునఁ బుట్టితివి. ఈ రాజునకు భార్యవైతివి. అట్టి దాన వీ మహావమానము నెట్లు సహింపఁగలిగియున్నావు ఏల యీ నింద్యమైన బ్రతుకు బ్రదికెదవు. ఈ యవమానపు బ్రదుకు బ్రదుకుటకంటెఁ జచ్చిన మేలు గదా. రమ్ము మన మిరువురము అగ్నిలోఁ బడి ప్రాణము విడుతము. అట్లు చేయ నీ వంగీకరింపవేని నాకనుజ్ఞ నిమ్ము. నేను దూఁకి చచ్చెదను.

కం. మన మిర్వురుఁ బోయిన న మ్మనుజేశ్వరుపీడ తెగును ♦ మఱి దానవితో
మనసారఁగ సుఖయించెడు, నని యేడ్చెడు తనయుఁ జూచి♦యతివయు గినుకన్.

తా త్ప ర్య ము

(మన మిద్దఱము చచ్చిన నీ రాజుపీడ వదలును. మనసువచ్చినట్టులుదానవితోఁ గూడి సుఖపడును. అని యేడ్చుచున్న కొడుకునుజూచి దేవయానియుఁగోపముతో)

చం. తనజనకుం దలంచిన య♦థాత్వర మాతఁడు వచ్చి యేడ్చు న
త్తనయను గాంచి యేటి కిటు ♦ దైన్యము నొందితి కూఁతురా? యనం
దనువు విషాగ్ని నీరముల ♦ నాశముఁ జేసెద. నింక భూమిపై
మన మన సొప్ప, దేల యవ ♦ మానపుమన్గడ బ్రాహ్మణోత్తమా! ౧౧౧౭

అర్థములు. యథాత్వరము=శీఘ్రముగ, తనువున్=దేహమును, విష=విషము త్రాగుటచేఁగాని, అగ్ని=నిప్పులలో దుముకుటచేఁగాని, నీరములన్=నీళ్ళలోఁ బడుటచేఁగాని, మనన్=బ్రదుకుటకు, అవమానపు మన్గడ=అవమానపు బ్రదుకు.

తాత్పర్యము

(తన తండ్రినిఁ దలఁచెను. శీఘ్రముగా వచ్చి యేడ్చుచున్న కూఁతునుజూచి 'కూఁతురా! నీవేల యిట్లు లేడ్చుచున్నా'వని యడుగ, విషము త్రాగిగాని, నిప్పులలో దుమికిగాని, నీళ్ళలోఁబడిగాని యీ దేహమును వదలెదను. ఇఁక భూమి మీఁద బ్రదుకు మనసొప్పకున్నది. అవమానపు బ్రదుకేల?)

కం. ఇచ్చితివికాని యొకనికి, వచ్చితివో? కీడు మేలు ♦ ప్రశ్నించితివో?
చచ్చితినో యున్నానో, మచ్చరితము నీ వెఱుంగ♦మనసొల్లదుగా? ౧౧౧౮

తాత్పర్యము

(ఒకనికి నన్నిచ్చితివి కాని యొకనాఁడేని వచ్చితివా? మంచి చెడ్డలడిగితివా? చచ్చితినో బ్రదికినానో ఈ విషయము నీవు తెలిసికొన నీకుఁబట్టదయ్యెను.)

కం. నా కడుపు మంట యేమని నీకున్ వినిపింతు నెఱుఁగ ♦ నీ వొల్లనిచో
లోకమున వృక్షమెండిన, నాకులు పూ లిగురులుం ద♦మంతటఁ జెడెడిన్. ౧౧౧౯

తాత్పర్యము

(నా కడుపు మంట నీకేమని వినిపింపగలను? నీ కిష్టము లేదాయె. లోకములోఁ జెట్టు యెండిపోయిన నాకులు పూలు చిగుళ్ళు తమంతటనే చెడిపోవును గదా.)

కం. పెద్ద వని నీకె సత్కృతి, దుద్దిడె నఁట యేల నాగ♦తు ల్పలుకంగా
నద్దానవి వలలం బడి, పద్దుగ నీయల్లుఁ డెపుడుఁ♦బలుకఁడు నాతోన్. ౧౧౨౦

అర్థములు. సత్కృతిన్=గౌరవమునందు, దుద్దుఇడెను=సున్నచుట్టెను.

తాత్పర్యము

పెద్దవాఁడవని నిన్నే యతఁడు గౌరవింపకున్నాఁడఁట. ఇఁక నాగతి నేనేమి చెప్పుదును. ఆ దానవరాజు పుత్రిక వలలోఁబడి నీ యల్లుఁడు నాతోఁ బలుకనైన నిష్టపడఁడు.

ఉ. నా మొగ మేనియుం గనఁడు ♦ నాయిలుచాయన ద్రొక్కనొల్లఁడే
మేమొ వినోదము ల్సలుపు ♦ చెప్పఁడు దానవియింట నుండెడిన్
భూమివిభుండు దా నగుట ♦ భూమిధవాత్మజఁ గోరుఁ గాక తా
నేమని కోరుఁ జుక్కఁగమి ♦ నెన్నెడి బాఁపనవాని కన్నియన్. ౧౧౧౯

అర్థములు. భూమిధవాత్మజన్=రాజుకూఁతును, చుక్కఁగమి నెన్నెడి=నక్షత్రము లెంచుకొనుచు నుండెడి, బాఁపనవాని కన్నియన్ = బ్రాహ్మణుని కుమారితను.

తాత్పర్యము

(నా మొగమైనఁ జూడఁడు. నా యింటి నీడమైనఁ ద్రొక్కనిష్టపడఁడు. ఏమేమొ వినోదములు సేయుచు నా దానవి యింటిలో నుండును. రాజు, రాజు కూఁతును, గోరునుగాని, పంచాంగము చెప్పికొను బాపనవాని కూతునేమని యాశించును?)

—♦ యయాతి పూరునకు వార్థక మిచ్చి యౌవనంబుఁ గొనుట ♦—

చం. అనవుడుఁ గోపరక్తనయనాంతుఁడు కావ్యుఁడు భూమినాథుతో
నన నిది యేమి భూపతి! మదాత్మజ నొల్లక న న్నవజ్ఞ సే
సిన సయిరింతునే? కుమతి ♦ చెచ్చెర యౌవన మూడి డొక్కవై
దినములు ద్రోయుమీ యనుచుఁ దిట్టి ప్రసన్నను జేసి యాత్మజన్. ౧౧౨౦

అర్థములు. కోపరక్తనయనాంతుఁడు=కోపముచే నెఱ్ఱనైన కనుగొనలు గలవాఁడు, కావ్యుఁడు=శుక్రాచార్యుఁడు, మదాత్మజన్=నాబిడ్డను, అవజ్ఞ సేసినన్=అవమానించిన, కుమతి=కుత్సితపు బుద్ధి గలవాఁడు, డొక్కవై=బడుగు ముసలివాఁడవై, ప్రసన్నను=సంతోషించినదానిని.

తాత్పర్యము

అని చెప్పఁగాఁ గోపముచేఁ గన్ను లెఱ్ఱచేసి రాజును జూచి యేమిరాజా! నాకూఁతు నొల్లక నన్నవమానించితివి. నే నిచ్చిన దాసిని నీ వవమానించుట నన్న వమానించుటయే కదా! నీ విట్లు చేయుటకు యౌవనబలము కారణముగదా. కావున నీ యౌవనము నశించి బడుగు ముసలి వాడవై జీవింపుము. అని శపించి తనకూఁతు సమాధాన పఱిచెను.

కం. అరిగెఁ దనయింటి కానృప,వరుఁడు జరాక్రాంతుఁడగుచు ♦ వనరుచు యదువుం
బరికించి విషయసుఖములఁ, బరితృప్తుఁడఁ గాను, గలదు ♦ వాంఛ సుఖింపన్.

అర్థములు. జరాక్రాంతుఁడు=ముసలి తనముచే నాక్రమింపఁబడినవాఁడు, వనరుచున్=శోకించుచు.

తాత్పర్యము

(ఆ యయాతి ముసలి తనముచే నాక్రమింపఁబడిన వాఁడయి దుఃఖపడుచుఁ దన యింటికిఁ బోయెను. అందుఁ దన పెద్దకొడుకును జూచి నాయనా! నా కింకను విషయసుఖములందుఁ దృప్తి తీరలేదు. ఇంకను సుఖపడవలెనని యాశగలదు.)

కం. నీ జవ్వన మొసఁగుము నా, కీ జర గ్రహియింపు మనిన ♦ నిట్లను నతఁడున్
రాజా! నిముద్దులసుతు, నీ జర గ్రహియింప నిమ్ము ♦ నే నిందునకా. ౧౧ ౨౨

అర్థములు. జవ్వనము=యౌవనము ప్రాయము, జర=ముసలితనము.

తాత్పర్యము

(నీ యౌవనము నాకిమ్ము నా ముసలితనము నీవు తీసికొనుము. అని చెప్పఁగా నతఁ డిట్లనెను, నీ ముద్దులకొడుకునకు నీ ముసలితనము నిమ్ము-ముద్దు ముచ్చటలకు వాఁడు, దీనికి నేనా?)

చం. జనకుఁడ వై బహిష్కృతునిఁ ♦ జల్పితి వీవు సుఖాళిపట్ల, నన్
జనవునఁ జేర నిచ్చితివె ♦ సమ్మతి నెయ్యెడ నేని? దీనికిన్
దనయుఁడ నైతి నోటు? నిరంతంబును లాలన చేసి పెంచు నీ
తనయుఁడు పూరుఁడే జరను ♦ దాల్చెడు, నే సహియింప దీనినిన్. ౧౧ ౨౩

తాత్పర్యము

నీవు నాకుఁ గన్నతండ్రివై యుండియు సుఖములందు నన్ను దూరముగ నుంచితివి. భోగములందు దేనియందైన నన్నుఁ జనవుగ దగ్గఱఁ దీసితివా! వీని యందు నేను నీకుఁ గొడుకను గాను గాని ముసలిబడుగునై పోవుటకు నీ కుమారుఁడ నైతిఁ గాఁబోలు. ఆ భోగము లనుభవించిన నీ కొడుకే యీ రోగము ననుభవింప నిమ్ము, నేను దీనిని సహింప లేను.

కం. ఆడఁగఁ బాడఁగ వేడుక, గూడఁగఁ బూరుండు జరను♦గొన యదు వహహా
పాడి గదా యిటు ప్రజఁ గా, పాడెడి తేనికిని దాయ♦భాగము పెట్టన్. ౧౧ ౨౪

తాత్పర్యము

(ఆటకుఁ బాటకు నద్దుకు ముద్దుకుఁ బూరుఁడు, ముదుసలి తనము గ్రహింప యదువు-అహహా మంచి న్యాయము ప్రజలఁ బాలించు రా జన్నదమ్ములకు దాయ భాగ పెట్టు న్యాయ మిదికదా.)

చం. అనుడు యయాతి పూరుని మ♦దర్థము సీనె జరన్ గ్రహింపుమీ
యన నతఁ డేనె ధన్యుఁడ మ♦హాత్మక! కాదన నోరు వచ్చునే
జనకుని యాజ్ఞ నా నృపతి ♦ సంతస మొందుచు వార్థకంబుఁ ద
త్తనయున కిచ్చి యౌవనముఁ ♦ దాఁ గొని యేఁడులు పూఁడు లాడటన్.

అర్థములు. మదర్థము=నా నిమిత్తము, జరన్=ముసలితనమును, ఏడులు పూఁడులు=అనేక సంవత్సరములు.

తా త్ప ర్య ము

(అని పలుక, యయాతి పూరునిఁ జూచి, 'వత్సా, నా ముసలితనము నీవు గ్రహింపు మన, నాతఁడు నేనే ధన్యుఁడను తండ్రీ? మీయాజ్ఞ 'నిరాకరింపఁ దగునా?' అనఁగా నా రాజు సంతసించి, తన ముసలితనమును గొడుకున కిచ్చి యాతని పడుచుఁ దనమును దాను దీసికొని యనేక సంవత్సరములు.)

చం. అతులిత సౌఖ్యసంపదల ♦ నందుచు నుండి తదాశ దీఱుడున్
సుతుఁ గని వారకంబుగను ♦ సుందరయౌవన మే గ్రహించి త
త్ప్రతిగ జరాభరం బిడితిఁ ♦ దాల్పఁగ నీకడ, నింక నాజరన్
వెతలు దొలంగ నీకు గుణ ♦ విక్రమధుర్య యొసంగు క్రమ్మఱన్. ౧౧-౨౬

అర్థములు. తదాశ=ఆయాశ, కామసుఖములందలి యాస, తీఱుడున్=క్షయింపఁగా, వారకము=ఇల్లడ, తత్+ప్రతిగ=దానికి మాఱుగ, గుణవిక్రమ ధుర్య=గుణములందు విక్రమ మందు సమర్థుఁడా.

తా త్ప ర్య ము

అసమాన సౌఖ్యాతిశయము లనుభవించుచుండి వానియందలి యాశ నశింపఁగా కొడుకును జూచి నీ యౌవనమును నేను గ్రహించి దానికి మాఱుగ నిల్లడగా నా ముసలితనము నీ కిచ్చియుంటిని. ఇక నా జరబాధ నీకుఁ దొలఁగునట్లు నాజర నా కిచ్చి నీ యౌవనము నీవు గైకొమ్ము.

కం. నా యాజ్ఞం బాలించుట నీ యవనికి న్నిను భర్తృ ♦ నేలికగా నం
చా యవనీశుఁడు కోపముతో యదువుం గాంచి పలికె♦దుష్టాత్మకుఁడా! ౧౧-౨౭

అర్థములు. ఏలిక=ప్రభువు, దుష్టాత్మకుఁడా=చెడు మనస్సుగలవాఁడా

తా త్ప ర్య ము

(నా యాజ్ఞను బాలించుటచేత నీ భూమికి నిన్ను రాజుగాఁ జేసెదను, అని చెప్పుచు నా రాజు కోపముతో యదువును జూచి యిట్లని చెప్పెను. చెడుమనస్సు గలవాఁడా?

కం. తనుజుఁడవు గావు నీ వొక, దనుజుండవు పుట్టి తింటఁ ♦ దనయాకృతివై
నను ధిక్కరించి పలికితి చనునే? రాజ్యాధిపత్య♦సరణిం జెడుమీ. ౧౧-౨౮

అర్థములు. తనుజుఁడవు=పుత్రుఁడవు, దనుజుండవు=రాక్షసుఁడవు, రాజ్యాధిపత్యసరణిన్=రాజ్యమునకు నధిపతి యగు మార్గమునందు.

తాత్పర్యము

పెద్ద కొడుక వగుటచే నా వెనుక నీవు రాజవు కావలసి యుండినను నన్ను ధిక్కరించి పలికితివి కావున నీకు రాజ్యాధిపత్యము లేకపోవునుగాక!

చం. జనకుఁడ నంచు గౌరవము ♦ సల్పక నోరికి వచ్చినట్టు న
నన్నియెదె? యాతుధానుల మ♦హాకఠినాత్ముల నీవు గాంచుమీ
వినయవిదూర! సోమకుల♦విశ్రుతి యొందదు నీదు సంతతిన్
గనియెదు దుర్వినీతులఁ బో♦కాలు మటంచు సుశీలుఁ బూరునిన్. ౧౧౨౯

అర్థములు. యాతుధానులన్=రాక్షసులను, మహాకఠినాత్ములన్=మిగులఁ గఠినమైన మనస్సు గలవారిని, వినయవిదూర=అణఁకువ లేనివాఁడా, దుర్వినీతులన్=వినయము లేనివారిని, చెడునీతి గలవారిని.

తాత్పర్యము

తండ్రియను గౌరవము నెంచక నీ నోటికి వచ్చినట్లు నన్ను మాటలాడితి గదా. కావున రాక్షసులను కఠినమనస్సుగల వారిని నీవు కుమారులుగాఁ గనుము. వినయము లేనివాఁడా! సోమవంశపురాజులను కీర్తి నీ సంతతివారికి లేకుండును గాక ఛీ పో యని చెప్పి మంచి నడవడి గల పూరునిఁ జూచి.

కం ధర కధిపతిఁగా నొనరిచి, యరిగెన్ విదితాత్ముఁ డగుచు♦నాశ్రమమునకున్
జరుగ నటు కొంతకాలము,సురపురి కతఁ డేగ నతని♦సుతుఁడు ప్రభుండై. ౧౧౩౦

అర్థములు. ఆశ్రమమునకున్=వానప్రస్థాశ్రమమునకు.

తాత్పర్యము

(భూమికి రాజుగాఁ జేసి యయాతి వానప్రస్థాశ్రమమున కేగెను. కొంత కాలము జరిగినంత నతండు స్వర్గమునకుఁ బోయెను. ఆ పిమ్మట నాతని కొడుకు రాజై.)

కం. పూరుఁడు కాశీరాజ్యము, ధీరతఁ బాలించెఁ బురి ప్రతి♦ష్ఠానముగాఁ
గ్రూరులను యాతుధానుల, వారక పెక్కుఱను యదువు♦వంశము నిలుపన్.

అర్థములు. పురిప్రతిష్ఠానముగా=ప్రతిష్ఠాన మను నగరము రాజధానిగా.

తాత్పర్యము

(పూరుఁడు కాశీరాజ్యము ప్రతిష్ఠానము (ఝూసి) రాజధానిగా ధీరుఁడై పాలించెను. యదువు వంశము నిలుపుట కనేకులను క్రూరులగు రాక్షసులను గనెను.)

కం. కాంచెను బహిష్కృతుండై, క్రౌంచవనంబునను దుర్గ♦రస వసియించెన్
మించిన కినుకను గవి శపియించిన నాహుషుఁడు మరల ♦ నేమనఁ డయ్యెన్=

అర్థములు. బహిష్కృతుండై=బహిష్కరింపఁబడినవాఁడై, దుర్గరసన్. దుర్గభూమియందు, కవి=శుక్రుఁడు, శపించినను=తిట్టినను, నాహుషుఁడు=నహుషుని కుమారుఁడు యయాతి, మరల నేమనఁడయ్యెన్=బదులు తిట్టినవాఁడుకాఁడు.

తా త్ప ర్య ము

(తండ్రిచే బహిష్కరింపఁ బడి క్రౌంచవనములో దుర్గభూమి యందు వాసము చేసెను. శుక్రుఁడతి కోపముతోఁ దిట్టినను యయాతి బదులు తిట్టిన వాఁడు కాఁడు.)

తే. ఆలకించితె యనుజ య♦యాతి శాంతి
మనల నృగుదోష మంటమి ♦ కనఁగవలయు
ననుచు నుండఁ గుసుంభ వ♦స్త్రావకుంఠి
తము గతిని మిన్ను సాంధ్య రా♦గమునఁ బొలిచె. ౧౧౩౩

అర్థములు. కుసుంభవర్ణ=ఎఱ్ఱవర్ణముగల, వస్త్ర=గుడ్డచే, అవకుంఠిత గతిని=ముసుఁగు వేసికొనిన దానివలె, మిన్ను=ఆకాశము, సాంధ్యరాగమునన్=సంజకెంజాయలచే, పొలిచెను=ఒప్పెను.

తా త్ప ర్య ము

(లక్ష్మణా! వింటివా? యయాతి శాంతి! మనలకు నృగువునకుఁ గలిగిన దోషము రాకుండఁ జూచుకొనవలెను సుమా? అని చెప్పుచునుండఁగా, నెఱ్ఱని వస్త్రము ముసుఁగు వేసికొనిన దానివలె నాకాశము సంజకెంజాయలచే నొప్పెను.)

—* చ్యవనాదులు శ్రీరాము దర్శింప వచ్చుట *—

సీ. అన్నదమ్ములు ముచ్చ♦టాడుచుండిరి యిట్టు లవని రక్షాక్రియా♦నంతరమున
జరుగఁగొన్ని దినాలు♦చలియు వేఁడియుఁగాక, సౌఖ్యంబుఁగూర్చు వా♦సంత రాత్రు
లొదవఁగ నొకనాటి♦యుదయంబునను నాహ్ని,కంబులఁ దీరిచి♦కార్య మొనరి
పౌరులు వచ్చిరే♦పరికింపు మనఁగ సు,మంత్రుండు రాజేంద్ర!♦మౌనివరులు

తే. వచ్చియున్నార, లాఁగివ♦ద్వారమంద, నిలిచియున్నారు, నినుఁజూడఁ♦దలచినారు
వారు చ్యవనుండు మున్నుగా♦వచ్చినారు, కార్యాభర మేదియో వారు♦కలిగినారు.

అర్థములు. అవని రక్షాక్రియానంతరమునన్=భూపరిపాలన కార్యము ముగిసిన తరువాత, వాసంతరాత్రులు = వసంతకాలసంబంధమైన రాత్రులు, ఆఁగినన్=అడ్డగింపఁగా, కార్యభరము=గొప్పకార్యము.

తాత్పర్యము

రాజకీయ కార్యములు ముగిసిన తరువాత నన్నదమ్ము లీప్రకారము ముచ్చట లాడుచుండిరి. ఇట్లు కొన్ని దినాలు జరుగఁగా వసంతకాలము ప్రాప్తించెను. దినములు మిగుల వేఁడిమిగాక చలిగాక సౌఖ్య కరములై యుండెను. అప్పుడొక నాఁటి యుదయమున నిత్యకృత్యములు తీర్చుకొని సుమంత్రా! యెవరైనఁ బనిగలిగి వచ్చిరేమో చూడుమని చెప్పఁగా నతఁడు రాజేంద్రా! చ్యవనుఁడు మొదలగు మునులేదియో గొప్ప కార్యము గలవారై వచ్చినారు. నిలుపఁగా వాకిట నిలిచి యున్నారు.

కం. యమునాతీరనివాసులు, మిముఁజూడఁగఁ దొందరపడి • మీతో భూమీ
 రమణా! చెప్పఁగఁ బంచిరి, విమలాత్మకు లనిన వారి • వేతో డ్తెమ్మా. ౧౧౩౫

తాత్పర్యము

(మహారాజా! యమునానది తీరమున వసించు మహామునులు మిమ్ముఁజూచుటకుఁ దొందరపడి మీతోఁ జెప్పఁగాఁ బంపినారని విన్నవింప వారిని వేగముగాఁ దీసికొనిరమ్ము)

ఉ. నావుడు రాజునాజ్ఞ ముని • నాథులకున్ నతిచేసి లోనికిన్
 గావలివాఁడు పో విడువ • గాఢతపోజ్జ్వలితాంగు లందఱున్
 క్ష్మావిభుమందిరాంతరము • చయ్యనఁ జొచ్చిరి నూర్వ్య రమ్మహా
 భావులఁ బూజ చేసె గుణ • భద్రుడు రాముఁడు యుక్తరీతిగన్. ౧౧౩౬

అర్థములు. నతిచేసి=నమస్కరించి, గాఢతపోజ్జ్వలితాంగులు=అధిక తపస్సుచే నగ్నివలెఁ బ్రకాశించు దేహములు గలవారు, మందిరాంతరము=ఇంటి లోపల, మహాభావులన్=గొప్ప మహిమగలవారిని, యుక్తరీతిగన్=యోగ్యమైన విధముగ.

తాత్పర్యము

(అని చెప్పఁగాఁ గావలివాఁడు రాజునాజ్ఞను బడసి మునీశ్వరులకు నమస్కరించి లోపలికిఁ బోవిడువఁగా నధికతపస్సుచే నగ్నివలె బ్రకాశించు దేహములు గల వారందఱును రాజమందిరములోనికి వెంటనే ప్రవేశించిరి. మహానుభావుల నానూర్వ్యకను యోగ్యమగు విధమున శ్రీరామప్రభువు వారినిఁ బూజించెను.)

చ. మునులు సమస్తతీర్థపరి • పూర్ణసుసంస్కృతపూత పాత్రముల్
 జనపతికిన్ మనోజ్ఞఫల • సంచయ మీయఁగఁ బ్రీతియుక్తుఁ డై
 కొని మునులార! నాయెడలఁ • గూరిమిఁ జేసి సమర్హపీఠులం
 గొనుఁ డన హేమపీఠములఁ • గూరుము కంబునఁ గూరుచుండిరన్. ౧౧౩౭

అర్థములు. సమస్తతీర్థ=అన్ని తీర్థములచే, పరిపూర్ణ=నిండిన, సుసంస్కృత=సంస్కరింపఁబడిన, పూత=పవిత్రములైన, పాత్రముల్ = పాత్రలను,

మనోజ్ఞ=ఇంపైన, ఫల సంచయము = ఫలసమూహము, హేమపీఠములన్=బంగారు పీఁటలయందు.

తాత్పర్యము

(మునీంద్రులు సమస్తతీర్థములతో నింపిన చక్కఁగ సంస్కరింపఁబడిన పవిత్రములగు పాత్రలను, యింపైన ఫలసమూహమును నీయఁగాఁ బ్రీతితో వానిని దీసికొని, మునులారా! నాయెడలఁ బ్రేమముంచి వేంచేయుఁడన వారు బంగారు పీఁటల మీఁద సంతోషముతోఁ గూర్చుండఁగా,)

కం. భూపతి కరములు మోడిచి, తాపసులం గాంచి యనియెఁ దయ సెలవిడుఁడీ
 యేపనికై యిట రా, నాజ్ఞాపింపుఁడు దేనిఁ జేయ సమ్మతి మీకున్. ౧౧3౦

అర్థములు. సెలవిడుఁడీ=చెప్పుఁడీ.

తాత్పర్యము

(రామచంద్రప్రభువు చేతులు జోడించి మునులను జూచి, దయతో సెలవిండు! ఏమిపనికై వేంచేసితిరి? ఆజ్ఞాపింపుఁడు, మీకు సమ్మతమగు నది యేది?)

కం. ఈరాజ్యం బీదేహం, బీ రమయును జీవితంబు నిన్నియు ద్విజసం
 వారనిమిత్తము చూడుఁడు. సారతపశ్శీలులార! సత్యం బంటిన్. ౧౧3౧

అర్థములు. ఈరమ=ఈసంపత్తు, జీవితంబు=ప్రాణము, ద్విజసంవార నిమిత్తము=బ్రాహ్మణ సమూహముల కార్యములు నెఱవేర్చుకొఱకే.

తాత్పర్యము

(ఈ రాజ్యము, యీ దేహము, యీ సంపద, వేయేల నా జీవితము బ్రాహ్మణుల కార్యముల నెఱవేర్చుటకొఱకే-మునిశ్రేష్ఠులార! నిజము చెప్పుచుంటిని.)

—చ్యవనుఁడు లవణవృత్తాంతము శ్రీరామునకుఁ దెలుపుట—

చ. అనవుడు మేలు మేలని మహర్షులు మెచ్చుచుఁ బల్కిరో జనా
 వనకుశలా! మహాత్మ! యిటు పల్కఁగ నీ వొకరుండు గాక యే
 జనపతి శక్తియుక్తుఁ డగు త్మ్మాపతు లెందఱో యాలకించి మా
 పని మఱి కార్యగౌరవము భావనచేసి వచింప నేనుడిన్. ౧౧3౨

అర్థములు. జనావనకుశలా=ప్రజల రక్షించు నేర్పుగలవాఁడా, ఏ జనపతి=ఏ రాజు, శక్తియుక్తుఁ డగున్=శక్తిగలవాఁడగును, కార్యగౌరవము = యందలి భారము, ఏ నుడిన్=ఏ మాటయును.

తాత్పర్యము

అని చెప్పఁగా మునులు మేలుమేలని శ్లాఘించుచు నిట్లు చెప్పిరి. ప్రజారక్షణ దక్షా! మహాత్మా! నీవు చెప్పినట్లు చెప్ప నీ వొకఁడవే సమర్థుఁడవు. మఱి యేరా

జిట్లు చెప్పలేము. మాకార్యములను గుఱించి యెందఱ రాజులతోనో చెప్పితిమి. పనియందలికష్ట మాలోచించి యెవరును ప్రత్యుత్తర మిచ్చినవారు గారు.

క. నీ వన మాకార్యము తెలియఁ గావంతయు నెఱుఁగకయును ♦ నాడితి బాసన్
గావింతు ననుచు విప్రజ నావళిపై గరుణఁ జేసి ♦ యనఘగుణాఢ్యా! ౧౧౪౧

తాత్పర్యము

నీవో మాపని యెట్టిదో తెలియకున్నను బ్రాహ్మణుల యందలి ప్రీతిచే మా కార్యము చేసెద నని ప్రతిజ్ఞ చేసితివి.

క. కావున మా కార్యంబును, గావింపఁగ నీవ నేర్తు♦కాకుత్థ్సవరా!
మావాక్యము విని మఱి మా, కావహిలం జేసి సౌఖ్య♦మణఁపుము భీతిన్. ౧౧౪౨

అర్థములు. ఆవహిలంజేసి=కలిగించి.

తాత్పర్యము

(కావున మాకార్యమును నిర్వహింప నీవే చాలిన వాఁడవు రామచంద్రా! మామాట విని మాకు సౌఖ్యము కలుగునట్లుచేసి మా భయమును బోఁగొట్టుము.)

చ. అనవుఁడు రాముఁ డిట్లను భ♦యం బెది కల్గెను మీకు? దానినిన్
వినిచితి రేని దీర్తు నన ♦ నిస్తుల నిష్ఠుఁడు మౌని భార్గవుం
డను జననాథ? యాదియుగ♦మందు మహాబలశాలి లోలకున్
దనయుఁడు జ్యేష్ఠుఁ డుండె మధు♦దైత్యుఁడు విప్రులకున్ శరణ్యుఁడై. ౧౧౪౩

అర్థములు. వినిచితిరేని=వినిపించిన పక్షమున, నిస్తులనిష్ఠుఁడు=అసమాన నిష్ఠగలవాఁడు, భార్గవుండు=చ్యవనుఁడు, ఆదియుగమందున్=కృతయుగమందు, లోలకున్=లోలయనెడి స్త్రీకి, శరణ్యుఁడై=రక్షకుఁడై.

తాత్పర్యము

అని వారు చెప్పఁగా బ్రాహ్మణులారా! మీకుఁ గలిగిన భయమేది? దానిని దెలిపితిరేని జక్కఁజేసెదను, అని చెప్పఁగాఁ జ్యవన మహర్షి యిట్లనియె. పూర్వము కృతయుగమందు లోల యను దాని కుమారుఁడు మహాబలవంతుఁడు మధు వను దైత్యుఁడు బ్రాహ్మణులకు రక్షకుఁడై యుండె.

క. మఱిఁ బరినిష్ఠితుఁడై సుర, తతులం బూజించి వారి♦దయ కర్హుండై
యతులితతపంబు గౌరీ, పతి మెచ్చఁగఁజేసెఁ బెక్కు♦వర్షములంతన్. ౧౧౪౪

అర్థములు. పరినిష్ఠితుఁడై=మిగుల నిష్ఠగలవాఁడై, సురతతులన్=దేవతా సమూహములను, గౌరీపతి=శివుఁడు.

తాత్పర్యము

(మనస్సునందు మిగుల నిష్ఠగలవాఁడై దేవతాసమూహములను బూజించి వారి దయకుఁ బాత్రుఁడై, శివుఁడు మెచ్చునట్లు లనేక సంవత్సరములు సాటి లేని తపము చేసెను.)

క. వానికి మెచ్చి గిరీశుఁడు, మానిత మై మిగుల దీప్తి♦మంతం బయి య
న్యూనబలం బగు శూలముఁ దా నొసఁగెం బ్రీతి లాగి ♦ తన శూలమునన్.

అర్థములు. గిరీశుఁడు=శివుఁడు, దీప్తిమంతము=కాంతిగలది, అన్యూన బలంబు=పూర్ణబలము గలది, లాగి=ఆకర్షించి, తన శూలమునుండి వేఱొక శూలము లాగి యతని కిచ్చెను.

తాత్పర్యము

(వాని తపస్సునకు మెచ్చి శివుఁడు తనశూలములోనుండి వేఱొక శూల మును లాగి కాంతి గలిగి పూర్ణబలముగలదాని నొసఁగెను.)

ఉ. ఇచ్చుచు వాని కిట్లను ఋషీశ్వర నిర్జరులందు భక్తిమై
సచ్చరితుండ వై తపముఁ ♦ జల్పుట మెచ్చితి దీని నిచ్చితిన్
మచ్చర మూని నీవు సుర♦మండలి విప్రుల నేఁచె దేని నీ
కిచ్చటులాయుధంబు పని♦యేమియుఁ జేయద వ్యర్థమై చనున్. ౧౧౪౬

అర్థములు. ఋషీశ్వర నిర్జరులందున్=ఋషీశ్వరులందు దేవతలందు, మచ్చ రము=మాత్సర్యము, విరోధము.

తాత్పర్యము

(ఆ శూలము నిచ్చుచు వానితో నిట్లనెను. ఋషీశ్వరులందు దేవతలందు భక్తి గలిగి సద్వర్తనము గలిగి తపము చేయుటచేత దీని నిచ్చితిని. నీవు విరో ధించి దేవతలను బ్రాహ్మణులను బాధించినచో నీయాయుధ మేమియుఁ బని చేయదు; వ్యర్థమగును.)

క. నీతో రణమున కెవఁడే, నేతెంచిన యేని వాని♦నిలఁ గూల్చి యథా
రీతిఁ జనుదెంచుఁ జుమి నీ, చేతికి మఱి యనిన దనుజ♦శేఖరుఁ డనియెన్. ౧౧౪౭

తాత్పర్యము

(నీతో నెవఁడైన యుద్ధము చేయవచ్చిన యెడల వానినిఁ జంపి యెప్పటి యట్లు నీచేతిలోనికి మరల వచ్చును సుమా! అని చెప్పఁగా రాక్షసశ్రేష్ఠుఁ డిట్లని యడిగెను.)

తే. ఇమ్మహాసాధనం బమ♦రేంద్రవంద్య!, నాదు వంశంబునందు సం♦తతము నిల్వ
నిమ్ము నావుడుఁ గా దట్టు♦లిచ్చువాఁడ,నీదుసుతునొద్ద మాత్రంబు♦నిల్చునట్లు.

తాత్పర్యము

(ఈ మహాసాధనము నావంశమునందే యెల్లప్పుడుండునట్లు వరమీయవలెనని యడుగ, నట్లులే యగును నీ కొడుకుయొద్ద మాత్రముండునట్లిచ్చెదను.)

చ. అనవుడు వల్లె యంచు నతఁ•డాత్మగృహంబున కేగుదెంచి దా
నిని మహితార్చనాదివిధి • నిత్యముఁ బూజ యొనర్చు చుండె, నా
దనుజుఁడు భూరి మందిరము • దానికి నైరచియించె నమ్మధుం
డనలతనూజ విశ్రవసు•నన్వయమందు జనించినట్టిదై. ౧౧౪౯

అర్థములు. ఆత్మగృహంబునకున్=తన యింటికి, మహితార్చనాదివిధిన్=గొప్పపూజాది కార్యములచే, నిత్యము ప్రతిదినము, అనలతనూజ=అనల యను దాని కూఁతురు.

తాత్పర్యము

(అని చెప్పఁగా 'సరే' యని యాతఁడు తన యింటికి వచ్చి దాని గొప్ప పూజాది కార్యములచేఁ బ్రతిదినము పూజించుచుండెను. ఆ రాక్షసుఁడా శూలమున కొక గొప్పమందిరము కట్టించెను. ఆ మధుఁడు విశ్రవసువంశములోఁ బుట్టిన యనలయను దాని కూఁతురు.)

క. కుంభీనసి యనుపేరం, గుంభిని విశ్రుతిని గన్న•కోమలి నేలెన్
జంభారి భయంకరసం, రంభుఁడు లవణుండు సుతుఁడు•రామ! యతనికిన్. ౧౧౫౦

అర్థములు. కుంభినిన్=భూమియందు, విశ్రుతి=ప్రసిద్ధి, జంభారి భయంకర సంరంభుఁడు=ఇంద్రునకు భయము గలిగించు వేగిరపాటు గలవాఁడు, కుంభీనసిని మధువెత్తికొని వచ్చుట ముందే చెప్పఁబడెను.

తాత్పర్యము

(కుంభీనస యను దానిని పెండ్లముగ నేలుకొనెను. అతని కొడుకు లవణుఁడు-ఇంద్రునకు భయము గలిగించునంతటి వేగిరపాటు కలవాఁడు. రామచంద్రా.)

ఉ. పిన్నటనాఁటి నుండియును • భీకరశీలుఁడు వాఁడు దుష్టుఁడై
యెన్నియొ పాపకార్యముల • నెప్పుడు జేయుచునుండు. దుర్నీ
తి న్నిజనందనుం గని య•తివ్యథఁ జెందియుఁ గోపగించియున్
గన్నకుమారుఁ డౌట యెది•గాదన కూరక యుండెఁ దండ్రియున్. ౧౧౫౧

అర్థములు. భీకరశీలుఁడు=భయంకర స్వభావము గలవాఁడు, దుర్నీతిన్=చెడునీతి గలవానిని.

తాత్పర్యము

(వాఁడు చిన్ననాఁటి నుండియు భయంకర స్వభావము కలిగి దుష్టుఁడై యెన్నియో పాపపుఁ బనుల నెల్లప్పుడు చేయుచుండును. దుర్నీతిపరుఁడయిన తన

కొడుకు చేయు పనులను జూచి మనసులోఁ జాల దుఃఖమును బొందియు వాని మీఁదఁ గోపపడియుఁ గన్న కడుపగుట నేమి చేయఁజాలక యూరకుండెను.)

తే. జనకుఁ డీలోకమునువీడి♦చని యెవరుణు, నాలయమునకు సుతునకు♦శూలమహిమఁ
దెలిపి; యంతటనుండియుఁ♦గలుషహృదయుఁ, డల్లసాధనశక్తి జ♦నాళి నేఁచు.

అర్థములు. వరుణు నాలయమునకున్=వరుణ లోకమునకు, హృదయము నుండి నూఱు నాడులు వెలువడును. ఒక్కొక్కటి యొక్కొక్క లోకమార్గమును గలది, ఏనాడి వెంట జీవము పోవునో ఆలోకము ప్రాప్తించును. నాభికి క్రిందుగా పోయెనా యన్యలోకములకుఁబోవును, ఏఁచున్=బాధించును.

తా త్ప ర్య ము

(తండ్రి కొడుకునకు శూలముయొక్క మహిమను దెలిపి యీ లోకమును వదలి వరుణ లోకమునకుఁ బోయెను. అప్పటినుండి యా శూలముయొక్కశక్తితో జనులను బాధించు చుండెను.)

తే. అందుఁ దాపసులనినఁ బా♦పాత్మకునకుఁ, జేలఁపిండియ; శూలంబు♦విధమువింటె
వానిశక్తి యెఱింగితే♦వారిజాప్త, వంశ్య! మాకింక గతి వీవె♦పరమపురుష.

తా త్ప ర్య ము

(అందును తపము చేసికొను మునులనినచోఁ జేలపిండియే. అనఁగా నంత చులుకన-శ్రీరఘురామా! శూలము విధము వాని శక్తి తెలిసెనుగదా. పరమ పురుషా. ఇఁక మాకు నీవే దిక్కు.)

ఉ. కోరితిమయ్య! యెందఱనో ♦ క్రూరచరిత్రభయార్తిఁ గుందుచున్
వీరవరేణ్యులన్ నృపుల ♦ వీని వధింపుఁ డటంచు, నొక్కరేన్
ధీరత వాని మార్కొనఁగ ♦ దెంపు వహింపరు, పంక్తికంఠసం
హారము నీదుచేఁత విని ♦ హర్షముతో గతి వీవె యన్మతిన్. ౧౧౫౭౮

అర్థములు. క్రూరచరిత్ర భయార్తిన్=క్రూరపు నడవడి గల వానివలని భయము వలనఁ గలిగిన బాధచే.

తా త్ప ర్య ము

క్రూరపు నడవడిగల రాక్షసుని వలనఁ గలిగిన భయముచే బాధపడుచు నెందఱు రాజులనో వానిని జంపుఁడని ప్రార్థించితిమి, ఒక్క వీరుఁడైనను వాని నెదిరింప సాహసించిన వాఁడు కాఁడు, నీవు రావణుఁ జంపినవార్త విని నీవేగతి యని వచ్చితిమి.

క. అరుదెంచితి మిచ్చటికో, ధరణీవర! మాకు నెపుడు, దాతవు నీవే
కరుణింపుము మాపయి నా, శరవమునిన్ లవణుఁ ద్రుంప ♦ సమకట్టి నృపా!

అర్థములు. త్రాతవు=రక్షకుఁడవు, అశరవసునిన్=రాక్షస శ్రేష్ఠుని, సమకట్టి=ప్రయత్నించి.

తాత్పర్యము

(రాజా! యిచ్చటకు వచ్చినాము. మా కెప్పుడును నీవే రక్షకుఁడవు- మాపైఁ గరుణింపుము. రాక్షసశ్రేష్ఠునిఁ జంపఁ బ్రయత్నింపుము.)

క. మాకొదవినయాపద యిది, నీకంటె నెవండు లేఁడు • నిశిచరుఁ ద్రుంపన్
  మాకోరికఁ దీర్పఁగ ననఁ, గాకుత్స్థుఁడు పలుకు మౌని • కాండంబులకున్. ౧౧౫౬

తాత్పర్యము

(మాకుఁ గలిగిన యాపద యిది. రాక్షసునిఁ జంపి మాకోరిక దీరుపఁ గలవాఁడు నీకంటె సమర్థుఁ డెవఁడును లేఁడు, అని చెప్పఁగా శ్రీరామచంద్రమూర్తి మునులతో నిట్లనెను.)

—• శ్రీరాముఁడు మౌనులను లవణు నాహారాదుల నడుగుట •—

క. ఆచారాహారములు ని, శాచరునకు నెవ్వి? యెందుఁ • జరియించును స
  త్యాచారులార! పలుకుఁడు, నీచుని వధియింతు మీకు • నెమ్మదిఁ గూర్తున్.

అర్థములు. నిశాచరునకున్=రాక్షసునకు, ఆచారాహారంబులు=ఆచారము, ఆహారము.

తాత్పర్యము.

(మునీశ్వరులారా! యా రాక్షసుని యాచార మెట్టిది? వాని యాహార మేమి? వాఁ డెక్కడ సంచరించును? తెలుపుఁడు. ఆ నీచునిఁ జంపెదను. మీకు నెమ్మది గలిగించెదను.)

మ. జననాథాగ్రణి జూచి మౌనులు తదా • చారంబు రౌద్రంబ, యా
  తనియాహారము జంతులెల్లను బరా • ర్థ్యం బందు వాచంయముల్,
  మనుజవ్యాఘ్రమృగద్విపాదులను రా • మా! చంపి భక్షించెడిన్
  దినమున్ వేలుగ, వాస మా మధువనీ • దేశంబు భూమీశ్వరా!   ౧౧౫౮

అర్థములు. తదాచారంబు=వాని యాచారము, రౌద్రంబ=రుద్రసంబంధమైనది, తామసమగుటచే భయంకరమైనది, పరార్థ్యము=ముఖ్యము, ద్విపాదులను=ఏనుఁగులు లోనగు వానిని, వాసము=నివసించు ప్రదేశము, మధువనీ దేశంబు=మధువన మను ప్రదేశము.

తాత్పర్యము

రామచంద్రుని జూచి మునులిట్లనిరి. రామా! వాని యాచారము రుద్రసంబంధము, క్రూరము, జంతువులన్నియు వాని కాహారము లే. అందు మునీశ్వరులు

ముఖ్యాహారము. మనుష్యులను పులులను మృగములను ఏనుఁగులను ఈ మొదలైన వాని జంపి వేలకొలఁది ప్రతిదినము దినుచుండును. వాఁడు మధువనమున వసించును.

చంపిన వన్నియు వాఁడొకఁడే తినునని భావము గాదు. వాని యాశ్రితులు పరిచారకు లెందఱో కలరుగదా.

తే. ప్రలయవేళను గాలుండు ప్రజల నెల్ల మ్రింగుమాడ్కి నోరు వావిచ్చి మ్రింగుచుండు
నంతరాంతరములను సత్త్వాళి ననిన రామచంద్రుండు తన్మౌని రాజికనియె.

అర్థములు. అంతరాంతరములను=నడుమనడుమ, సత్త్వాళిన్=జంతుసమూహములను.

తాత్పర్యము

(ప్రలయకాలమునఁ గాలుఁడు జనులనెల్ల మ్రింగునట్లు నోరు తెఱచి జంతుసమూహముల నడుమ నడుమ మ్రింగుచుండు నని చెప్పఁగా శ్రీరామచంద్రమూర్తి యా మునులతోఁ జెప్పెను.)

క. వదలుఁడు భీతిని రాక్షసుఁ, గదనంబునఁ ద్రుంతు ననుచుఁ గని తమ్ముల నా
మదయుతు లవణుం జంపఁగ, గదలెడివం తెవ్వ రిపుడు గైకొనువారో? ౧౧౬౦

అర్థములు. కదనంబునన్=యుద్ధమందు, మదయుతున్=గర్వించిన వానిని.

తాత్పర్యము

(మునులారా? మీరిఁక భయపడవలదు. యుద్ధములో రాక్షసునిఁ జంపెద నని చెప్పుచుఁ దమ్ములవంకఁ జూచి గర్విష్ఠియగు లవణాసురునిఁ జంపఁబోవు వంతెవరు తీసికొనువారు?)

—॰ శత్రుఘ్నుఁడు తాను లవణుఁ జంపఁ బోయెద ననుట ॰—

తే. భరతశత్రుఘ్నులందు నీ పాలు గొనఁగ, నెవ్వరొకొ కోరువా రన నెలమిలేచి
భరతుఁ డిట్లను నేనుండ బాలుఁడైన, లక్ష్మణానుజుఁ బంపఁ దలంప నగునె?

తాత్పర్యము

(భరతశత్రుఘ్ను లిరువురిలో నేపని నెవరు చేయఁగోరెదరు? అని రామచంద్రమూర్తి చెప్పఁగా భరతుఁడు లేచి యన్నా! పెద్దవాఁడను నేనుండఁగాఁ బసివానిని శత్రుఘ్నునిఁ బంపఁదలఁచుట తగునా?

క. నావంతు గాఁగ నిమ్మఁడీ, యా పీకుని లవణుఁ జంపుటన శత్రుఘ్నుం
డావాక్యము లాలించి మహావినయముతోడ ననియె నవనీపతితోన్. ౧౧౬౨

తా త్ప ర్య ము

(ప్రఖ్యాతిగల వీరుఁడైన యా లవణాసురునిఁ జంపుట నా వంతుగా నను గ్రహింపుఁడు అనఁగా, నా మాటలను శత్రుఘ్నుఁడు విని మహావినయముతో శ్రీరామప్రభువుతో నిట్లు చెప్పెను.)

సీ. భరతుండు శూన్యమా•పట్టనంబు నయోధ్యఁ, బాలించె మీరలు•వనుల నుండ
మీ వచ్చునందాఁక • నేవిధసుఖమును, దా నెఱుఁగండు సం•తాపగరిమ
ననుభవించెను మహా•వ్యసనంబు లిన్నన్ని,యని చెప్ప నౌనె దుః•ఖావహంపుఁ
బడకను బన్నుండె•ఫలమూలములు మెక్కె, జడలుధరించె వ•స్త్రములుమాని

తే. నారచీరలు దాల్చె నీ•కారణమున, వనట గూరెను సౌఖ్యంబు•పడఁగవలదె
యిప్పుడైనను నే నుండ•నెల్ల వేళ, బంట నై భరతుని దుః•ఖ•పఱుప నగునె?

అర్థములు. శూన్యము=రాజులేనిది.

తా త్ప ర్య ము

(మీ గడవులందుండునప్పుడు భరతుఁడు రాజులేని పట్టనమగు నయోధ్యను మీరు తిరిగి వచ్చువఱకుఁ బాలించెను. ఏవిధమైన సుఖము నెఱుగఁడు. సంతాపాతిశయమున మహాదుఃఖము లనుభవించెను. అవి యిన్నన్ని యన తరమగునా? దుఃఖమును గలిగించు పడకమీఁదఁ బరుండెను. ఫలములు భుజించెను. జడలుదాల్చెను. వస్త్రములు మాని నారచీరలు కట్టుకొనెను. నీవడవుల నిడుములు పడుచుండుట కోరువక తాను నీకొఱకై కష్టపడెను. ఇప్పుడైనను సుఖపడవలదా? భృత్యుఁడనై నేనెల్లవేళల సేవించుచుండ భరతుని దుఃఖపెట్టఁ దగునా?)

శ్రీరాముఁడు లవణుఁ జంపి మధురాపురి నేల శత్రుఘ్ను నాజ్ఞాపించుట

చ. అనవుడు రాముఁ డిట్లను మ•హాభుజ! యట్టుల యౌత, నాదుశా
సనమునఁ బొమ్ము నీవు సుర•శాత్రవుఁ డౌ మధుపట్టనంబునన్
నిను నభిషిక్తుఁ జేసెదను • నీమతిచొప్పున నింద కైకనం
దనుఁడు నిలంగ నిమ్ము, రణ•దక్షుఁడ వీవు వధించి రాక్షసున్. ౧౧౬౪

అర్థములు. శాసనము=ఆజ్ఞచే.

తా త్ప ర్య ము

అని చెప్పఁగా రామచంద్రమూర్తి బలశాలీ! నీవు చెప్పినట్టులే యగును గాక. నా యాజ్ఞప్రకారము నీవు పొమ్ము. నిన్ను దేవవిరోధి యగు మధుని పురమునకు రాజుగా నభిషేకించెదను. నీ యభిప్రాయప్రకారము భరతుం డిందే యుండనిమ్ము. యుద్ధమున సమర్థుఁడ వగు నీవు రాక్షసుని జంపి.

తాత్పర్యము

తే. మేలిపట్టన మందు నిర్మించి యంద, నీవు రాజ్యంబు చేయుచు ♦ నెమ్మినుండు
శత్రువధ సల్పి రాష్ట్రంబు♦సంగ్రహించి,నృపతినీయని యతఁడేగు♦నిరయమునకు.

తాత్పర్యము

అచ్చటనే పట్టన మొక్కటికట్టించి యచ్చట నీవు రాజ్యము చేయుచుండుము. విరోధిని జంపి వాని రాష్ట్రము నాక్రమించి ప్రజలను బరిపాలింప రాజు నేర్పాటు చేయనివాఁడు నరకమునకుఁ బోవును.

క. బదులాడకు మెదియేనియు, నెదురాడఁగ రాదు సిన్న ♦ జ్యేష్ఠున కతఁడె
యేది చెప్పిన నొనరుపఁ దగు, నద నిదియే కొనుము నేఁడ ♦ యభిషేకంబున్.

అర్థములు. అదను=సమయము.

తాత్పర్యము

పెద్దవాఁడు చెప్పిన దానికిఁ బిన్నవాఁడు బదులు చెప్పరాదు. పెద్దవాఁడు చెప్పినట్లు చేయవలెను. కావున నీవు బదులు చెప్పకుము, ఇదియే సమయము, పట్టాభిషేకము చేసికొనుము.

తె. అవనిబుధులు వసిష్ఠాదు ♦ లర్హాభంగి, నీకు నొనరించువా రభి♦షేక మనిన
సిగ్గుపెలుచశత్రుఘ్నుండు ♦ శిరమువంచి, యల్లనల్లన నిట్లను♦నగ్రజునకు.౧౧౬౭

అర్థములు. పెలుచన్=అతిశయముచే, అల్లనల్లన=మెల్లగా,అగ్రజునకున్=అన్నకు.

తాత్పర్యము

(వసిష్ఠుఁడు లోనగు బ్రాహ్మణు లుచితరీతి నీకుఁ బట్టాభిషేకము చేయఁగల రని చెప్పఁగా, శత్రుఘ్నుఁడు మిగుల సిగ్గుపడి, తలవంచుకొని మెల్ల మెల్లగా నన్నగారితో నిట్లనెను.)

—♦ పట్టాభిషేకం బొల్లక శత్రుఘ్నుడు పరితపించుట —

క. అన్నా! జ్యేష్ఠుం డుండం, భిన్నకు నభిషేక మర్హ♦మే? ధర్మంబే?
యిన్నెరి నీ నుడిఁ బోవుదు,బన్నుగ దాఁటంగ లేమిఁ♦దద్వచ్ఛాసనమున్.౧౧౬౮

తాత్పర్యము

అన్నా! పెద్దవాఁడుండగాఁ బిన్నవానికి రాజ్యాభిషేకము తగునా? అది ధర్మమా? అయినను నీ యాజ్ఞమీఱ శక్తిలేదు కావున నీవు చెప్పినట్లుచేసెదను.

సీ. జ్యేష్ఠునకును బిన్న ♦ యెదురాడ రాదని, నీచేత శ్రుతులందు♦నేను వింటి
వినియు నెఱింగియు ♦ విపరీతబుద్ధిచే, భరతునిఁ గాదని ♦ పలికినాఁడ
లవణు వధించెద ♦ బవరాన నేనని, యాముఱుక్తంబె యో♦యనఘ చరిత!
యిట్టి దుర్గతిఁ గూర్ప♦హేతువయ్యెను నాకు, వెనుకఁ జింతించుట♦వెఱ్ఱితనము.

ఆ. చేసినట్టికృతికి ♦ శిక్షయియ్యది చాలు, నీకు మాఱు పలుక ♦ నిశ్చలాత్మ!
దండనంబు నాకు ♦ రెండవయది కల్గ,కుండ గాక మన వొ ♦ కండు వినుము.

తాత్పర్యము

పెద్దవానికిఁ జిన్నవాఁడు బదులు చెప్పరాదని నీవు చెప్పఁగా వింటిని. శ్రుతులు చెప్పఁగా వింటిని. ఏమిప్రయోజనము? విని తెలిసి విపరీత బుద్ధిచే భరతుని నిరాకరించి పలికితిని. ఆయన లవణుని నేను వధించెదననిన, కాదు నేను వధించెద నంటిని ఆ చెడు మాటయే యిట్టి దుర్గతి నాకుఁగలుగ కారణమయ్యెను. వెనుకఁజింతించుట వెఱ్ఱితనము. ఒకరికి నెదురాడిన దానికిఁ గలిగిన యీశిక్ష చాలును.నీకు బదులు పలికిన నింకేమి శిక్షగలుగునో? కావున రెండవదండమునాకుఁ గలుగకుండుటకై నీవు చెప్పినట్లు చేసెదను. అయిన నొక మనవి చేసెదవినుము.

ఉ. కోరను రాజ్యమేను రఘు ♦ కుంజర! నీనుడిఁ దీర్ప బోయెదన్
దారితవైరిసంచయ! య ♦ ధర్మము నన్ను స్పృశింపకుండగాఁ
గారుణికాగ్రణీ! కరుణఁ ♦ గావు మటన్నను సంతసించి థా
త్రీరమణుండు లక్ష్మణుని ♦ దిక్కుఁ గనుంగొని పల్కెనివ్విధిన్. ౧౧౨౦

తాత్పర్యము

లవణాసురుని నేను జంపగోరితిని గాని పట్టాభిషిక్తుఁడనై రాజ్యమేల నేను గోరలేదు. నీవు తండ్రియాజ్ఞ చొప్పున నరణ్యముల కెట్లు పోయితివో నేను నీ మాట నెఱవేర్ప నట్టులే పోయెదను. శత్రుసంహారకా! పితృవాక్యము పరిపాలించి నీవు ధర్మము సంపాదించితివి. ఇప్పుడు నేను జేయఁబోవు కార్యము ధర్మవిరుద్ధమైనది కావున నా యధర్మము నన్నంటకుండ ననుగ్రహింపుము. దయావంతులలో శ్రేష్ఠుఁడా! యిట్లు చేసి నన్ను దయతో రక్షింపుము. అని కోరఁగా సంతోషించి రామచంద్రమూర్తి లక్ష్మణుతో నిట్లనియె.

—♦ శ్రీరాముఁడు శత్రుఘ్నుని మధుర కభిషిక్తునిఁ జేయుట ♦—

క. భరతుండును నీవును మన, పురజనముల మంత్రివరుల ♦ భూమీసురులన్
సరగం బురోహితుల నిట, కరుదేరఁగఁ బిలువఁ బంపు ♦ డనఁగా వారల్. ౧౧౨౧

తాత్పర్యము.

(భరతుఁడును నీవును మన పురజనులను, మంత్రులను, బ్రాహ్మణులను బురోహితులను వేగముగా నిచటకు వచ్చుటకుఁ బిలిపింపుఁడని చెప్పఁగా, వారు)

క. అటులే యంచఱ బిలువఁగ, భటులం బంపంగ వారి ♦ బడి నెల్లరు రాఁ
నటకున విధియుక్తంబుగఁ బటుబలశాలికి సుమిత్ర ♦ పట్టికిఁ బ్రీతిన్. ౧౧౨౨

అర్థములు. వారిబడి=వారి వెంబడి.

తాత్పర్యము

(ఆ ప్రకారమే యందఱను బిలుచుటకు భటులను బంపిరి. వారు పోయి పిలువఁగా వారివెంట నందఱు వచ్చిరి. తత్క్షణము మిగుల బలశాలియగు శత్రుఘ్నునకు బ్రీతితో యథావిధిగా.)

క. రాముఁ డభిషేక మొనరుప, శ్రీమహితుండై యతండు•చెన్నారెను సు
త్రామాదులచేఁ బూర్వము, సామి వెలింగిన విధాన•జనములు పొంగన్.౧౧౨౩

అర్థములు. సుత్రామాదులచేన్=ఇంద్రుఁడు మొదలగువారిచే, సామి= కుమారస్వామి.

తాత్పర్యము

(రామచంద్రమూర్తి యభిషేకము చేయఁగాఁ బూర్వ మింద్రాదులచేఁ గుమారస్వామి ప్రకాశించిన విధమున జనులు సంతోషమున నుబ్బిపోవ, శత్రుఘ్నుఁడు శ్రీమహితుఁడై వెలిఁగెను.)

ఆ. పౌరు లలరుచుండ•బ్రాహ్మణుల్ మోదింప,ముగురుతల్లులాత్మ•ముదముఁగూర్చి
దీవనల నొసంగఁ దేజరిల్లెడి సుమి, త్రాత్మజాతుఁ గని ప్ర•హర్షమునను.౧౧౨౪

తాత్పర్యము

(పురజనులు సంతోషించుచుండఁగా, బ్రాహ్మణు లానందించుచుండఁగాఁ దల్లులు ముగ్గురు ముదమున దీవనలీయఁగాఁ దేజరిల్లుచున్న శత్రుఘ్నునిఁ జూచి, మిగుల హర్షముతో.)

క. యమునాతీరగులగు సం,యములును లవణాసురుండు•హతుఁడే యంచుం
దమమనములనమ్మఁగ నరి,దమనుఁడు శత్రుఘ్నుఁజేర్చి•తనయంకమునన్.౧౧౨౫

అర్థములు. యమునాతీరగులు = యమునా నది యొడ్డున నుండువారు, సంయములు=మునులు, అరిదమనుఁడు=శత్రువుల నణఁచువాఁడు, అంకమునన్= తొడయందు.

తాత్పర్యము

(యమునానదీ తీరవాసులయిన మునులు, తమ మనస్సులందిఁక లవణాసురుఁడు చచ్చినవాఁడేయన నమ్మిరి. అంతశత్రువుల నణఁచు శ్రీరామచంద్రుఁడు శత్రుఘ్నుని తన తొడయందుంచుకొని)

శ్రీ.రాముఁడు శత్రుఘ్ననకు నారాయణాస్త్రం బొసంగి లవణుఁ జంపు నుపాయంబుఁ దెల్పుట.

సీ.అన్న! శత్రుఘ్న! ది•వ్యంబైన యీశరం,బును గొమ్ము లవణు దీ•ననువధింతు
మున్ను మహార్ణవ•మున స్వాయంభువు దేవుఁ, డజితుండు సర్వాసు•రాసురులకు
నెల్ల భూతాళి క•దృశ్యుఁడై శయనించి, యున్న వేళ సృజించె•నుగ్రరుషను
మధుకైటభాసుర•మథనంబునకు సర్వ, రాక్షసులను ద్రుంప • రణములోన

ఆ. మూఁడులోకములను♦మును కొని సృజియింపఁ, జంపి కైటభు మధు♦జగముసృష్టి
జనులభోగమునకుఁ♦జలిపె నీశరశక్తి, వింటె దీని మహిమ♦వీరవర్య! ౧౧౨౬

అర్థములు. మున్ను=ప్రలయకాలమున, మహార్ణవమునన్=సముద్రమందు, స్వయంభువు=తనంతటఁదానే పుట్టువాఁడు, ఆయన పుట్టుటకు వే ఉపాదాన నిమిత్తసహకారి కారణములు లేవు ఆయన సంకల్పమే కారణము, అజితుండు=జయింపఁబడని వాఁడు, సర్వాసురాసురులకున్=అందఱు దేవతలకు రాక్షసులకు, ఎల్ల భూతాళికిన్=ప్రాణుకోటుల కన్నిటికి, అదృశ్యుఁడై=కానరానివాఁడై, ఉగ్రరుషను=తీవ్రమైన కోపముతో, మథనంబునకున్=సంహారమునకు.

తాత్పర్యము

నాయనా! శత్రుఘ్నా! దివ్యమైన యీ బాణమును గ్రహింపుము. దీనితో లవణు వధింపఁగలవు. దీనిని పూర్వము ప్రలయ కాలమున సముద్రమునందు నారాయణుఁడు దేవతలకు రాక్షసులకు సర్వప్రాణులకు నెవరికిఁ గానరాకుండునట్లు పండుకొనియుండి మధుకైటభులను సర్వరాక్షసులను జంపుటకుఁగాను దీవ్ర కోపమున దీనిని సృజించెను దీనితో మధుకైటభులను జంపి ప్రజల భోగమునకుఁగాను మూఁడు లోకములను దీనిశక్తిచే సృష్టించెను. దీని మహిమ వింటివి కదా.

ఉ. వైవఁగ లేదు రావణుని♦పై నిది యాతనిఁ జంపఁ గోరియున్
హోవడిఁ గూర్చుభూతతతి ♦ కంచును, శూలము నీశదత్తమున్
దా విడి యింటఁ బూజకయి ♦ దానవుఁ డేగుఁ బురంబుఁ బాసి యి
చ్ఛావిధి గ్రాసకాంక్షఁ, దను♦శత్రువు చీరిన యేని పోరికిన్. ౧౧౨౭

తాత్పర్యము

రావణునిఁ జంపగోరియు వాఁడు దీనికిఁ జాలినవాఁడుకాఁడు కావున దీనిని అల్పుఁడగు వానిపై వైచిన వానిని జంపుటే కాక లోకమున నుపద్రవము గలిగించు నని తలఁచి వాని మీఁద దీనిని వేయక సామాన్యములైన యస్త్రముల చేతనే వానిని వధించితిని, వానికంటె బలవంతుఁడు లవణుఁడు ఆహార కాంక్షచే శివుడిచ్చిన శూలమును పూజకై యింటియందే యుంచి పురము వదలి యడవుల లోకిఁ బోవును. ఎవరైన శత్రువులు తన్ను యుద్ధమునకుఁ బిలిచిరేని

క. శూలముఁ గొని వచ్చును నీ, వా లవణుఁడు పురముఁ బా♦సి యాహారముకై
హేళి జరియించునదనున, నాలమునకుఁ బిలిచి యతని♦నాఁగుము వీఁకన్. ౧౧౨౮

అర్థములు. అదనునన్ = సమయమునను, ఆలమునకున్=యుద్ధమునకు, ఆఁగుము=ఊరిలోకిఁ బోకుండ నడ్డగింపుము.

తే. పురముద్వారంబునను నిల్చి•సురవిరోధి; పట్టనముఁజొరకుండఁగ•బవరమునకుఁ
బిలిచితేనియుఁ జచ్చునీ•బలిమినాతఁ, డన్యవిధమునఁ జంప శ•క్యంబు గాదు.

అర్థములు. బవరమునకు = యుద్ధమునకు, అన్యవిధమునన్ = మఱియొక విధముగ.

తాత్పర్యము

(నీవు పత్తనము వాకిట నిలిచి రాక్షసుఁడు పురములోపలికిఁ బోకుండ యుద్ధమునకుఁ బిలిచితివేని వాఁడు నీ బలముచేతఁజావఁగలఁడు. మఱియొక విధమునఁ జంపశక్యము గాదు.)

క. గిరిజానాథునిశూలము. దురతిక్రమ మాట దాని • దోషాటుఁడు దాఁ
గరమునఁ దాల్పని వేళను బరిమార్పు మటంచు నతనిఁ•బరిబోధించెన్. ౧౧౭౦

అర్థములు. దురతిక్రమము=అతిక్రమింపదగనిది, దోషాటుఁడు=రాక్షసుఁడు, పరిమార్పుము=చంపుము. దురతిక్రమ మనుట యవతార మర్యాదను బట్టియని గ్రహింపనగు. ఇంద్రజిత్తు ప్రయోగించిన బ్రహ్మాస్త్రమును మన్నించినట్లు దీనిని మన్నింప వలయుగాని యవమానింపరాదు. లవణుఁడు దానిని ధరించి వచ్చిన నవమానింపవలసి వచ్చును గావున వాఁడు దానిని ధరింపకుండు నపుడు వధింపుమని యుపదేశించెను.

సీ. మఱి యిట్టులను నీవు • మాతంగశతమును, నరదముల్ రెండువే•లశ్వములను
నాలుగువేలును నానాపదార్థంబు, లంగళ్ళు నటవర్తి • కావళులును
నియుతంబు హేమంబు•నీతోడ గొనిపొమ్ము, భటులకు జీతంబు•బత్తెమిచ్చి
సల్లాపములచేత • సంప్రదానంబుల, సంతోషపఱుపుము • సంగరమున

తే. నచటి వారికి భార్యలో • యాత్మభవులో
యైన వారలో స్వీయప•దార్థతతులో
యేవియును లేమి యెఱిఁగి నీ• వే ముదంబుఁ
గూర్పు వారికి మాటల • గుణివతంస ! ౧౧౭౧

అర్థములు. మాతంగశతము=నూఱేనుఁగులు, నటవర్తకావళులు=నటులయు నర్తకులయు (ఆటలాడు వారు) గుంపులు, సల్లాపములచేత=మంచిమాటలచేత, సంప్రదానంబులన్=బహుమానము లిచ్చుటచేత.

తాత్పర్యము

మఱియు నిట్టులనియె నీతోడ నూఱేనుఁగులు రెండువేల రథములు నాలుగు వేలు గుఱ్ఱములు పలువిధములైన పదార్థములు గల యంగళ్ళు నటులయు నర్తకు

లయు గుంపులను నియుతము బంగారునాణెములను దీసికొని పొమ్ము. భటులకు జీతము బత్తెమిచ్చుటయేకాక మంచిమాటలచేత బహుమానము లిచ్చుటచేత సంతోషపఱుపుము. అచ్చట భటులకు భార్యలు, కొడుకులు, బంధువులు తమ పదార్థములు నేవియు లేకుందురు గావున నీవే వారిని మంచి మాటలచే సంతోషపడఁ జేయుచుండుము. వారికి విసుగు గలిగింపరాదు.

ఉ. ముంగల గాఁగఁ బంపుము చమూతతి గంగను దాటుగాక యిం
కం గొదవుండ గ్రీష్మము, సుఖంబుగ నావలి యొడ్డుచేరి యం
దంగఁ జోటులన్ విడిసి యాబల మొప్పఁగ, వెండి నీవు కే
లం గొని చాప మొక్కఁడవె లాఘవ మేర్పడ నేరి కేనియున్. ౧౧౪౨

అర్థములు. ముంగలగాఁగన్=ముందుగా, చమూతతిన్=సేనాసమూహమును.

తాత్పర్యము

సేననంతయు నీకంటె ముందుగాబంపుము. ఎండకాలము ముగియకమునుపే సేన, గంగ దాఁటవలయును. వానలు ప్రారంభించిన దాఁటుట కష్టము కావున సేనయంతయు గంగ కావలి యొడ్డున విడిసి యుండనిమ్ము. అదట్లుండ నీవొక్కఁడవే విల్లు బాణములు ధరించి లఘువుతో.

చ. తెలియఁగ రాక యుండుగతిఁ దెప్పునఁ బొమ్ము, రవంతయేని యా
ఖలుఁ డెద సందియంబు గొనఁగాఁ దగ దీ మును లెల్ల మున్నుగా
బలఁగముతోడఁ బోయెదరు వాహిని యెల్లను జాహ్నవీతటిన్
నిలిచియ యుండ మున్నుగను నీవు చనం దగుఁ జాపపాణివై. ౧౧౪౩

తాత్పర్యము

ఎవరికిఁ దెలియకుండునట్లు శీఘ్రముగఁ బొమ్ము. నీ వెప్పు డెక్కడికిఁబోవునది యెవరికిఁ దెలియరాదు. ఆదుష్టునకు మనస్సున సందేహము కలిగింపరాదు. ఈ మునులందఱు సేనతోడఁ బోయెదరు సేన యంతయు గంగ యొడ్డున నుండఁగా నీవు ముందుగాఁ జాపము ధరించి పొమ్ము.

సేనలతోడ శత్రుఘ్నుఁడు పోయిన శత్రుఘ్నుఁడు లవణు మీఁదికియుద్ధమునకుఁ బోవుచున్నాఁడని లోకవార్త ప్రబలును. అది వానికిని దెలియవచ్చునుగనుక నీవు సేనలతోడఁ బోవలయునని చెప్పెను.

చ. అరి చనుదెంచువార్త తెలియంబడఁగా లవణుండు శూలమున్
గరమునఁ దాల్చి శాత్రవుల గం డడఁచుం జన నిమ్ము వేసవిన్
దొరకొన వానకా లతనిఁ ద్రుంపుము శూలము లేక యొంటిఁ గ్రు
మ్మరు జడివానలం దెవఁడు మార్తుడు మాఱొకఁడనవచ్చు నన్మతిన్. ౧౧౪౪

అర్థములు. అరి=శత్రువు.

తా త్ప ర్య ము

శత్రువు వచ్చుచున్నాఁడను వార్త తెలిసెనా, లవణుఁడు శూలము ధరించి వచ్చి శత్రువులఁ జంపును. కావున నెండకాలము ముగియనిమ్ము వానకాలము రానిచ్చి యప్పుడు వానిఁజంపుము. జడివానలందు శత్రువెవ్వఁడు రాఁడను ధైర్యముతో శూలము లేకయే వాఁడు సంచరించుచుండును.

—♦ శత్రుఘ్నుఁడు సేనల ముందుగ నంపి తానొంటిగ లవణుపైఁబోవుట ♦—

క. అనవుడు నగ్రజుపలుకులు, విని సేనాపతుల వేగఁ ♦ బిలిపించి యనీ
కిను లోలి నిలువ నెలవులు, మనమున మీ రెఱిఁగినవియ♦మాట లిఁకేలా

తా త్ప ర్య ము

(అని చెప్పఁగా నన్నగారి మాటలు విని, సేనాపతులను బిలిపించి, సేనలు నిలుచు స్థలములు మీ రెఱిఁగినవె. ఇఁక మీకుఁ జెప్పవలసిన దేమిగలదు?)

ఉ. కావున మీరు సేనలును ♦ గ్రచ్చఱఁ బోయి దిగంగ యోగ్యమౌ
తావులఁ బాళెమున్ డిగుచుఁ ♦ దద్ధరణీప్రజ నేమి బాధలం
ద్రోవక పొం డటం చని మ♦నోజ్ఞ చరిత్రుఁడు వారిఁ బంపి తా
నావల ముగ్గురమ్మలకు ♦ నంఘ్రుల వ్రాలి కృతప్రణాముఁడై. ౧౧౬

అర్థములు. కృతప్రణాముఁడై=నమస్కరించినవాఁడై.

తా త్ప ర్య ము

(కావున మీరు సేనలును త్వరగాఁ బోయి దిగుటకుఁ దగిన స్థలములందు దండు విడియుఁడు. అందలి జనులను నేమియు బాధింపక పొండు. అని వారినిఁ బంపి, యటు పిమ్మట తల్లులు ముగ్గురికిఁ బాదముల వ్రాలి నమస్కరించి,)

తే. రామునిఁ బ్రదక్షిణించి శి♦రంబుచేత, మ్రొక్కి లక్ష్మణభరతుని♦మ్రొక్కి కేలు
మోడిచి వసిష్ఠునకుభక్తి♦మునుకొనంగ,వినతులొనరించి సెలవొంది♦వెడలిచనియె.

తా త్ప ర్య ము

(రామునికిఁ బ్రదక్షిణముచేసి. తలతో మ్రొక్కి, భరత లక్ష్మణులకు నమస్కరించి వసిష్ఠునకు భక్తితోఁ బ్రణామము గావించి వారి యాజ్ఞపొంది బయలుదేఱి పోయెను.)

చ. తురగ రథాదిసంకులముఁ ♦ దొరపుసైన్యము ముందు పంచి తాఁ
బురమున నిల్చి మొక్కి నెల ♦ పూర్వజ మాతృపురోధలన్ మహా
గురుమతి మ్రొక్కి యాజ్ఞగొని ♦ గొబ్బున నొక్కఁడ యేగి రెండురా
తురులను లక్ష్మణానుజుఁడు ♦ త్రోవన త్రోసి నితాంతపుణ్యమౌ. ౧౨౪

అర్థములు. తురగ రథాది సంకులము=గుఱ్ఱములు తేరులు మొదలగు వానిచే నిండినది, తోరపుసైన్యము=పెద్దదండు, ఒకకనెల=ఎండాకాలముముగియ వచ్చువఱకు, పూర్వజ = అన్నలను, మాతృ=తల్లులను, పురోధలన్=పురోహితులను.

తాత్పర్యము

(గుఱ్ఱములు రథములు మున్నగు వానితో నిండిన పెద్దదండు ముందు పంపి, తా నొకనెల యయోధ్యలో నుండి, యన్నలకుఁ దల్లులకుఁ బురోహితులకు మిగుల భక్తితో మ్రొక్కి వారి యనుమతి వడసి, శీఘ్రముగాఁ దానొక్కఁడే శత్రుఘ్నుఁడు పోయి రెండు రాత్రులు దారిలోఁ గడపి, మిక్కిలి పుణ్యాము కలదైన.)

—♦ శత్రుఘ్నుఁడు వాల్మీకి యాశ్రమంబునఁ జేరుట ♦—

తే. వల్మికోద్భవు నాశ్రమ♦వాటిఁ జేరి, మౌనివరునకు భక్తి న♦మస్కరించి
యంజలి ఘటించి ఋషివర్య!♦యగ్రజాతు, వాక్యమున నేనుబోవుచు♦వచ్చినాఁడ.

అర్థములు. వల్మికోద్భవు = వాల్మీకియొక్క, ఆశ్రమవాటిన్ = ఆశ్రమ ప్రదేశము.

తాత్పర్యము

(వాల్మీకి ముని యాశ్రమమును జేరఁబోయి యా మునీశ్వరునికి భక్తిమీఱ నమస్కరించి, యంజలించి, మా యన్నగారి యాజ్ఞచే నేను బోవుచు వచ్చినాఁడను.)

క. ఈరే యిక్కడ నిల్వఁగ, గోరెద మీక్రియకు హాని ♦ గూరద యేనిన్
దారుణపశ్చిమముగ నా,దారిం జనువాఁడ వేఁగ ద త్త్వజ్ఞ యనన్. ౧౯౦

అర్థములు. దారుణ పశ్చిమముగన్=లవణాసురుఁ డుండుటచే భయంకర మైన పడమర దిశగా, వారుణ పశ్చిమ మని పాఠాంతరము.

తాత్పర్యము

(మీ పనులకు విఘ్నము రాదేని నీ రాత్రి యిచ్చట నిలువవలెననియున్నది. వేకువన లేచి లవణాసురుఁ డుండుటచే భయంకరమైన పడమర దిశగా నా దారిని నేను బోయెద నని చెప్పఁగా.)

క. నరవరు సుతునకు మునిపతి, దరహాసముతోడ స్వాగ♦తము నీకు నృపా
యెరవుగఁ బలికెద వే? రఘు,వరులకు నిది సొంతసొమ్ము♦భావింపు మెదన్.

అర్థములు. ఎరవుగన్=క్రొత్తవానివలె.

తాత్పర్యము

(శత్రుఘ్నుని మాటలకుఁ జెలుపుతో రాజా! నీకు స్వాగతము నీవు క్రొత్త వానివలెఁ బలుకుచున్నావే- ఇది రఘువంశము వారి సొంత సొమ్మని తలఁపుము.)

క. అని పాద్యం బర్ఘ్యం బాసన మొసఁగఁగ నాతఁ డలరి ♦ చారు ఫలాదుల్
తనివార మెసఁగి సమ్మదమున ని ట్లను నాశ్రమంబు ♦ పౌంతనమౌనీ! ౧౮౯

తాత్పర్యము

(అని యర్ఘ్యము పాద్యము నీయఁగా నతఁడు సంతోషించి వా రిచ్చిన యిం పైనపండ్లు మున్నగునవి తనివితీర నారగించి యానందమున నిట్లనెను. మునిశ్రేష్ఠా! యీ యాశ్రమము సమీపమున.)

క. యాగం బెవ్వరో చేసిన, యా గురుతులు కానఁబడెడి ♦ నతఁ డెవ్వఁ డనన్
యోగీంద్రుఁ డిట్లులను గుణ సాగర! మీపూర్వుఁ డొకఁడు ♦ సత్త్వధనుండున్.

తాత్పర్యము

(ఎవరో యాగము చేసిన గుర్తులు కనఁబడుచున్న వే-ఆతఁ డెవ్వఁడని యడుగ వాల్మీకి మహర్షి గుణసముద్రా! శత్రుఘ్నా, మీ పూర్వులలో నొకఁడు సత్త్వగుణ సంపన్నుఁడు.)

—♦ వాల్మీకి శత్రుఘ్నునకు సౌదాసు చరిత్రంబుఁ దెలుపుట ♦—

సీ. పరఁగ సుదాసుఁ డన్ ♦ పార్థివుఁ డాతనిఁ సుతుఁడు వీరసహుండు ♦ శుద్ధచరితుఁ
డతఁడు బాల్యమునంద ♦ యటవికి వేటకై, పలుమాఱుఁ బోవుచు ♦ వచ్చుచుండు
రాక్షసు లిద్ద ఱ ♦ రణ్యమందలి మృగ, కోటులఁ బులులయి ♦ కూల్చి తినఁగ
నిర్మృగ మయ్యె వ ♦ నీదేశమంతయు, నది గని సౌదాసుఁ ♦ డాగ్రహమునఁ

ఆ. క్రూరమార్గణమునఁ ♦ ద్రుంచి యొక్కని వానిఁ జూచుచుండ నమిత ♦ శోకయుక్తి
దోడివాఁడు పల్కె ♦ దోసంబు లే కేమి, నాసహాయుఁ జంప ♦ న్యాయ్యమగునె.

అర్థములు. నిర్మృగము=మృగములు లేనిది, వనీదేశము=అడవిప్రదేశము.

తాత్పర్యము

సుదాసుఁడను రాజొకరుఁ డుండెను. అతని కొడుకు వీరసహుఁడు. వీనికిమిత్ర సహుఁడనియు పేరుగలదు. వీఁడు నిర్మల చరిత్రుఁడు. ధర్మాత్ముఁడు. వీఁడు బాల్యమునందు నడవికిఁ బలుమాఱు వేటకై వచ్చుచుఁ బోవుచుండెను. ఆ యడవియం దిరువురు రాక్షసులుపులులవలెనై మృగములఁ జంపి తినుటచే నడవియందుమృగము లన్నియు నశించెను. అతఁడు వేటాడుటకు మృగములు లేవయ్యెను. అదిచూచి

సౌదాసుఁడు కోపించి యా యిరువురు రాక్షసులలో నొకనిఁ జంపెను రెండవ వాఁడు మిగుల శోకించి యే దోషము చేయని నా సహాయుని నీవు చంపుట న్యాయమా?

ఆ. దీనిమాఱు కీడు • నేను నీకు ఘటింతుఁ, గను మటంచుఁ జెప్పి • కానఁ బడక
చనియెఁ గొంతకాల • మునకు నమ్మిత్ర స, హుండు దాల్చెఁ గలిగె • నుర్విభరము.

వీరసహుఁడే మిత్రసహుఁడు.

తాత్పర్యము

(వీనిని బదులపకారము నేను జేసెదను చూడుమని చెప్పికనఁబడకుండఁ బోయెను. కొంతకాలమునకా మిత్రసహుఁడు రాజయ్యెను.)

ఉ. ఆనృపుఁ డశ్వమేధ మను • యాగ మొనర్ప నిటన్ వసిష్ఠుఁ డ
ద్దానిని నిర్వహించు నెడఁ • దత్పరిపూర్తిని బూర్వవైరమున్
మానసమందు నిల్పి యల • మానవభోజి వసిష్ఠ రూపి యై
మానవనాథ! నా కిపుడు మాంసయుతాన్నముఁ బెట్టు మం చనన్. ౧౯౬

అర్థములు. అలమానవభోజి=ఆ రాక్షసుఁడు.

తాత్పర్యము

(ఆరా జశ్వమేధ యాగము చేయుచుండ వసిష్ఠుఁడాయాగమును నిర్వహించుచుండు సమయమునందు యజ్ఞము సమాప్తి చెందిన తర్వాత నా రాక్షసుఁడు వెనుకటి పగను మనస్సులో నుంచుకొని వసిష్ఠుని రూపముతో వచ్చి, రాజా నాకు మాంసముతోఁ గూడిన యన్నము బెట్టింపు మని యడుగఁగాఁ.)

చ. క్షితిపతి బానసీనిఁ గని • చెచ్చెర నామిషభుక్తినిం బురో
హితునకుఁ దృప్తిగూర ఘటి • యింపు మటంచు నచింప నాతఁడున్
ద్రుతగతి సంభ్రమంబు గొనెఁ • దొల్లిటి సోఁకుఁడు సూద కారునా
కృతి మనుజామిషంబును న • రేంద్రునకుం గొనివచ్చి భూపతీ! ౧౯౭

అర్థములు. బానసీని=వంటవాని, సామిష భుక్తినిన్=మాంసముతోడి భోజనము, ద్రుతగతిన్=త్వరగా, తొల్లిటిసోఁకుఁడు=పూర్వపురాక్షసుఁడు, సూదకారునాకృతిన్=వంటవాని రూపముతో.

తాత్పర్యము

రాజు వంటవానిని జూచి త్వరగా మాంసముతోడి యన్నమును బురోహితునకుఁ దృప్తిగాఁ బెట్టు మని చెప్పఁగా వంటవాని వేషమున నున్న రాక్షసుఁడు మనుష్యమాంసము వండి తెచ్చి రాజునొద్ద నుంచి.

క. ఇది స్వాదు హవిష్యము ముని,మది మెచ్చున్ సామిషంబు • మంజుల మన న
య్యది పత్నీయుతుఁడై ముని, కెదఁ గల్మష మేమి లేక • నృపుఁ డిడెఁగుడువన్.

అర్థములు. స్వాదుహవిష్యము=తియ్యనిది, హవికి యోగ్యమైనది, సామిషంబు=మాంసముతోఁ గూడినది, మంజులము=మనోహరము.

తాత్పర్యము

ఇది తియ్యనిది, హవిస్సు, మాంసముతోఁ గూడినది, మనోహరమైన దని చెప్పఁగా రాజు తన భార్యచేత మనస్సులోఁ గల్మషము లేక మునికి వడ్డింపఁ జేసెను.

భారతమునఁ జెప్పఁబడినదానికి దీనికిఁ గొంచెము భేదము గలదు. అందు రాక్షసావిష్టుఁడైన రాజే మనుష్యమాంసము పెట్టుమని చెప్పినట్లున్నది.

—॰ వసిష్ఠుఁడు సౌదాసుని శపించుట ॰—

క. భాజనమం దుంచినయా, భోజనమున్ మనుజమాంస॰ముగ నెఱిఁగి మదిన్
రాజా! యెది నాకిడి తది, భోజనమగుఁ గాక నిక్క॰ముగ నీ కనుచున్. ౧౧౯౯

అర్థములు. భాజనమందు=పాత్రమందు.

తాత్పర్యము.

పాత్రమందుంచఁగా నా భోజనము మనుష్యమాంస మని ముని తెలిసికొని రాజా! యేది నా కాహారముగఁ బెట్టితివో యదియే నీ కాహారమగునుగాక అనఁగా మనుష్యమాంసము దిను రాక్షసుఁడ వగుదువు గాక.

క. ముని శపియించిన రోషం, బున సౌదాసుండు నీర॰ములఁ గేలఁ గొనెన్
మునిని శపించెద నని యా, తనిసతి మదయంతి ప్రాణ॰ధవు నిల్లనియెన్. ౧౨౦౦

తాత్పర్యము

(ముని శాపమును బెట్టఁగా రోషముతో సౌదాసుఁడు మరల మునిని శపించెద నని జలములు చేత నుంచుకొనెను. అతనిభార్య మదయంతి మగనితో నిల్లనెను.)

క. భగవంతుఁ డగు వసిష్ఠుం, దగవే శపియింప నీకు ॰ ధరణీశ యనన్
మగువవచనంబులం గొని, దిగవిడిచి చలంబు రోష॰దీప్తుం బగుచున్. ౧౨౦౧

తాత్పర్యము

(రాజా! భగవంతుఁడగు వసిష్ఠుని శపింపఁ దగునా యని నివారింప, భార్య మాటల నంగీకరించి తన పట్టుదల వదలి కోపముచే నుడికిన వగుచు.)

క. తేజోబలయుత మగు జల, మాజనపతి తనను నం॰ఘ్రులందున్ విడువన్
దేజోహతి న్నాభూమిబి, ౘౌజుని పాదములు కమ॰రెనది మొద లతఁడున్. ౧౨౦౨

తాత్పర్యము

తేజోబలముతోఁ గూడిన యా జలము భూమిపై విడిచిన దేశమున కనిష్టమని తలఁచి తన పాదముల మీఁదనే విడిచెను. ఆ తేజస్సుచే నా రాజు పాదములు కమరెను. అది మొద లతఁడు.

తే. పరఁగెఁ గల్మాషపాదుఁ డన్ ♦ ప్రథ నరేంద్రుఁ
డాత్మపత్నీ యుతుం డయి ♦ యమ్మహర్షి
వేఁడె నిర్దోషి తా నని ♦ వేయిగతుల
నృపతినుడి మాని తనయోగ♦దృష్టిఁ జూచి. ౧౨౦౩

అర్థములు. ప్రథ=కీర్తి.

తాత్పర్యము

(కల్మాష పాదుఁడను పేరఁ బ్రసిద్ధుఁడయ్యెను- భార్యయుఁ దానును వసిష్ఠుని స్వామీ! నిర్దోషిని- ఏ పాప మెఱుఁగనని యనేక విధములఁ బ్రార్థించెను- వసిష్ఠ ముని యా రాజు మాటలందలి సత్యమును తన యోగదృష్టితోఁ జూచి.)

క. అక్కపటవ్యాపారము, రక్కసుపని యంచు నెఱిఁగి ♦ రాజా! విను నా
వాక్కును ద్రిప్ప నశక్యము,మొక్కవరము నొసఁగువాఁడ♦నూఱడు దానన్.

తాత్పర్యము

(ఆ కపటపుఁ బని రాక్షసునిదని తెలిసికొని, రాజా! విను- నా మాటను ద్రిప్పుటకు శక్యముగాదు-నీకొక వరమిచ్చెదను.దానితో నీవు సమాధానపడుము.)

చ. పదియును రెండువర్షములు ♦ పార్థివవర్య! సహింపు శాపమున్
బదపడి శాపముక్తి యగు ♦ భావమునందు గతంబు విస్మృతిన్
బొదలెదు నాఁగ నట్టు లని ♦ భూపతి శాపము సైఁచి మీఁదఁ దా
సదనముఁ జేరి క్రాలెను బ్ర♦జాపరిపాలనసక్తచిత్తుఁడై. ౧౨౦౪

అర్థములు. విస్మృతింబొదలెదు=నీవు యథాప్రకారము మనుష్యుఁడవై నపుడు నీవు రాక్షసుఁడుగా నుండి చేసిన కార్యములు మఱచెదవు.

తాత్పర్యము

(పండ్రెండు సంవత్సరము లీ శాపమును నోర్చుకొనుము. తర్వాత నీకీశాప విమోచనము కలుగఁ గలదు. శాపము తీఱి మరల నీవు మనుష్యుఁడవైనప్పుడు, రాక్షసుఁడుగా నుండి చేసిన కార్యములు మఱచిపోయెదవు. అని చెప్పఁగా, రాజట్టులే యని శాపము సహించి తరువాతఁ దనయింటికిఁ జేరి ప్రజలను పాలించుట యందాసక్తి కలిగి ప్రకాశించెను.)

క. ఆతని యజ్ఞాయతనం, బీతల మని మౌని చెప్ప ♦ నెలఁమి గని సుమి
త్రాతనయుఁడు మునినాథున, కాతతమతి మ్రొక్కి చొచ్చె♦నాకులగుడిసెన్.

అర్థములు. యజ్ఞాయతనము=యజ్ఞముచేసిన ప్రదేశము.

తాత్పర్యము

(ఆతఁడు యజ్ఞముచేసిన చోటిది. అని వాల్మీకిముని చెప్పఁగా సంతసించి శత్రుఘ్నుఁడు మునివరునకు దండము సమర్పించి పర్ణకుటీరములోనికిఁ బోయెను.)

—♦ సీతాదేవి కుమారులఁ గనుట ♦—

క. యామవతి దేనియం దా, రామానుజుఁ డుండెఁ బర్ణ♦రమ్యగృహమునన్
భూమితనూజాతయు నా, యామవతీ వేళ సుతుల ♦ నమడలఁ గాంచెన్. ౧౨౦౭

అర్థములు. యామవతి=రాత్రి, పర్ణరమ్యగృహమునన్ = రమ్యమైన పర్ణశాలయందు, యామవతీ వేళ=రాత్రిసమయమున.

తాత్పర్యము

ఏరాత్రియందు శత్రుఘ్నుఁడు పర్ణశాలయందుండెనో యా రాత్రియందే సీతాదేవి యమడల కుమారులఁ గనెను.

తే. తపసి బాలకు లర్ధరా♦త్రమున వచ్చి, వాల్మికిం గని రాముని♦పత్ని గనియె
సుతులనిద్దఱ భూతముల్♦సోఁక కుండ బాలచంద్రాభులను గాపు♦బాలకులను.

అర్థములు. భూతముల్=బాలురను బీడించు గ్రహములు అఱువదినాలుగు, బాలచంద్రాభులను=లేఁత చంద్రునితో సమానులను,

తాత్పర్యము

(మునిబాలకు లర్ధమరేయి వచ్చి వాల్మీకినిఁ జూచి రామచంద్రమూర్తిభార్య యిద్దఱు కొడుకులను గనినది. లేఁత చంద్రునితో సమానులగు నా బాలకులకు బూతములు సోఁకకుండ మీరు రక్షచేయవలెను.)

చ. అనవుడు మౌని యోగిజన♦కాత్మజపుత్రులఁ గాంచి భూతనా
శన మగు మంత్రముల్ చదివి ♦ చయ్యన మంత్రిత మైన దర్భలన్
గొనలను బుత్రు నొక్కనిని ♦ గూర్చ మొదళ్ళ మఱొండుపుత్రు మా
ర్జన మొనరింపఁ బంచె ముని ♦ సంయమివృద్ధసరోజనేత్రలన్. ౧౨౦౯

అర్థములు. మంత్రితమైన=మంత్రింపఁబడిన, సంయమివృద్ధసరోజనేత్రలన్= వృద్ధలైన మునిపత్నులను, కూర్చ=దర్భపిడికిలి.

తా త్ప ర్య ము

(అని విన్నవింపఁగా, వాల్మీకిముని పోయి, సీతబిడ్డలను జూచి భూతములను నాశముచేయు మంత్రములు చదివి వెంటనే మంత్రించిన దర్భలను వృద్ధలయిన మునిపత్నులకిచ్చి కొనలతో నొకనిని, మొదళ్ళతో నొకనిని మార్జనము చేయుఁడని యాజ్ఞాపించెను.)

తే. ఆనిమిత్తంబుచేతఁ గుశాఖ్య నొకని, కిచ్చి లవుఁ డను పేరిచ్చియింకొకనికి
నమడలిద్దఱుఁ గుశలవు లనెడిపేరఁ బరఁగువా రిద్దియే నామకరణ మనుడు.

తా త్ప ర్య ము

దర్భ కూర్చకొనలచె మార్జనము చేయఁబడినవాఁడు కుశుఁడనియు, దాని మొదళ్ళచే మార్జనము చేయఁబడిన వాఁడు లవుఁడనియు నమడ లిద్దఱకు కుశలవు లనియు వారి కదియే నామకరణమనియు, వాల్మీకి చెప్పెను.

క. ఆరక్షను గొని చని మునినారులు తద్విధిని మార్జనం బొనరిచి రా
భూరమణుఁడు శత్రుఘ్నుం, డారఁగ మునిసతుల పలుకు లాలిచి నిశన్.

తా త్ప ర్య ము

(ఆ రక్షను దీసికొనిపోయి మునిపత్నులు వాల్మీకి చెప్పిన విధముగామార్జనము చేసిరి. శత్రుఘ్నుఁడా రాత్రి మునిపత్నులాడుకొను మాటలను జక్కఁగావిని,)

క. కవలం గనియెను భూమిజ, భవ భాగ్యము! తల్లి! యనుచుఁ బలికెను హర్షం
బవిరళముగఁ గనుచుండగ, రవి దోఁచెన్ శ్రావణికపురజనియుఁ జనియెన్.

అర్థములు. అవిరళముగన్=దట్టముగ, శ్రావణికపురజని = శ్రావణమాస రాత్రి, ఆషాఢముతో గ్రీష్మము ముగియుటచే శ్రావణమందుఁ బ్రయాణము చేసెనని యెఱుఁగనగు, దీనివలన సీతాదేవి వాల్మీకాశ్రమము చేరు నప్పటికి నిండు మూలుగాదు, నాలుగు మాసములుగా నుండవలెను. వసంతము ముందు చెప్పఁబడెను కావున.

తా త్ప ర్య ము

(భాగ్యము! తల్లీ! సీతాదేవి కవలను గన్నదా! యనుచుఁ బరమానందమునఁ బలికెను. చూచుచుండఁగాఁ బ్రొద్దుపొడిచెను. శ్రావణమాసపు రాత్రియును కడచి పోయెను.)

క. పౌర్వాహ్ణిక కార్యంబుల, సర్వంబును దీర్చి మ్రొక్కి సంయమిమణికిన్
శర్వరు లేడిటిఁ గడపి యఖర్వజవుఁడు త్రోవ మునినికాయముఁ గాంచెన్.

తాత్పర్యము.

అర్థములు. పౌర్వాహ్ణిక కార్యములన్=దినమున పూర్వభాగమునఁ జేయ వలసిన కార్యములను, సంయమిమణికిన్=మునిశ్రేష్ఠునకు, శర్వరులు=రాత్రులు, అఖర్వజవుఁడు=మిగుల వేగము గలవాఁడు, శీఘ్రముగఁ బ్రయాణము చేసెనని భావము, ముని నికాయము=చ్యవనాది మునుల సమూహమును.

తాత్పర్యము

(పగలు మొదటిభాగమునఁ జేయవలసిన కార్యముల నెల్లఁదీర్చి మునిశ్రేష్ఠునకు మ్రొక్కి యతి శీఘ్రముగఁ బయనించి యేడురాత్రులు దారిలోఁ గడపి చ్యవనాది మహాముని సమూహమును జూచెను.)

శత్రుఘ్ననకుఁ జ్యవనుండు లవణువే మాంధాత మడసిన విధంబుఁ దెలుపుట

తే. భార్గవుండాదియైన తపస్విజనుల, యాశ్రమంబుల నుండి సంయములుపల్కు
చిత్రగాథల వినుచు నిశీథ మెల్లఁ, గడపుచో నిట్టు లడిగె భార్గవుని నృపుఁడు

అర్థములు. భార్గవుఁడు=చ్యవనుఁడు, నిశీథమెల్ల=రాత్రియంతయు.

తాత్పర్యము

(చ్యవనుఁడు మున్నుఁగాఁగల మునుల యాశ్రమములందుండి యామునులు చెప్పుచున్న విచిత్రములగు కథలను వినుచు రాత్రియంతయుఁ గడుపునప్పుడు శత్రుఘ్నుఁడు చ్యవనుని నిట్లులడిగెను.)

చ. చ్యవన! మహానుభావ! గిరిజాధవదత్తము శూల మూని యా
లవణుఁడు సంగరంబున నిలాధవులన్ వధియించె నోటు మున్?
లవణుబలంబు శూలముబలంబు విధంబు వచింపుమీ యనన్
జ్యవనుఁడు రామచంద్రు ననుజాతునిఁ గన్గొని పల్కెఁ బ్రీతితోన్. ౧ ౨౧౫

అర్థములు. గిరిజాధవదత్తము=శివునిచే నీయఁబడినది. ఇలాధవులన్=రాజులను.

తాత్పర్యము

(చ్యవన! మహానుభావా! శివుఁడిచ్చిన శూలమును దాల్చి యా లవణుఁడు పూర్వము యుద్ధమున రాజులను జంపెనఁట!! లవణాసురుని బలమెట్టిది? శూలము శక్తియెట్టిది? ఆవిధమంతయు నాకుఁ దెలుపుఁడు. అని యడుగఁ జ్యవనుఁడు శత్రుఘ్నునిఁజూచి ప్రీతితోఁ జెప్పుచున్నాఁడు.)

సీ. ఎందరో మడిసిరి యేటికి నాకథ, లిక్ష్వాకువంశ్యుఁ డహీనబలుఁడు
యువనాశ్వనందనుం డుగ్ర తేజుండు మాంధాత నా నడిసన్నధరణివిభుఁడు
ధారణీచక్రంబుఁ దనయాజ్ఞలో నిల్పి, స్వర్గలోకజిగీషఁ జనియెదివికి
హరిహయుతోడ నర్ధాసనంబునను౦డి. దివిజులు మ్రొక్కంగఁ దేజరిల్ల

తే. గోరు నాతనిపాపపుఁ • గోర్కి నెఱిఁగి, సాంత్వపూర్వోక్తి నతనికి•శక్రుఁడనియె
నేమి రాజేంద్ర! నీయాజ్ఞ • పృథివియంద, చెల్లదే యేలస్వర్గంబుఁ•జేరరాఁగ.

అర్థములు. సఖిసన్న=ప్రసిద్ధికెక్కిన, స్వర్గలోక జిగీష=స్వర్గలోకమును జయించు కోరికతో, హరిహయుతోడన్=ఇంద్రునితో, అర్ధాసనంబున నుండి=ఇంద్రుఁడు కూర్చున్న సింహాసనమున నతనితో సగము పీఠమునఁ దానుండఁగోరి, సాంత్వపూర్వోక్తిన్=మంచి మాటలతో.

తా త్ప ర్య ము

రాజు లెందఱో చచ్చిరి. ఆకథ లేల కాని మీ యిక్ష్వాకువంశమందేమిగుల బలశాలి, యువనాశ్వుని కొడుకు భయంకర తేజస్సు గలవాఁడు మాంధాత యని ప్రసిద్ధికెక్కిన రాజు భూచక్రమంతయుఁ దన యాజ్ఞప్రకారము ప్రవర్తింపఁ జేసి స్వర్గము గెలువఁగోరి యచ్చటికిఁ బోయెను. అచ్చట నింద్రుతో నేకాసనంబుననుండి దేవతలు తనకు మ్రొక్కఁగా గోరు నతని పాపపు టభిప్రాయ మెఱిఁగి మంచి మాటలతో నే రాజా నీ యాజ్ఞ భూమియందే చెల్లుటలేదే. ఇచ్చటి కేల వచ్చితివి అది గెలిచి కదా యిచ్చటికి రావలె ననెను.

క. భూలోకం బంతయు నీ, వేలం గలిగినను దివికి • నే తెమ్ము చమూ
పాళులతో నావుఁడు భూ, పాలుఁడు తలవంచి సిగ్గు • పడి యిట్లనియెన్. ౧౨

తా త్ప ర్య ము

భూలోకమంతయు నీవు పరిపాలింపఁ గలిగిననాఁడు స్వర్గముమీఁదికి సేనలతో రమ్ము అనఁగా రాజు సిగ్గుచేఁ దలవంచి యిట్లనియె.

తే. ఎందునాయాజ్ఞ చెల్లదో•యింద్ర! పుడమిఁ,
బలుకుమీయన లవణుడన్ • పలలభోజి
మధువనంబున నున్నాఁడు • మనుజనాథ!
చెల్లెడినె యందు నీయాజ్ఞ • చెప్పుమనిన,

అర్థములు. పలలభోజి=మాంసభక్షకుఁడు=రాక్షసుఁడు.

తా త్ప ర్య ము

(ఇంద్రా! నా యాజ్ఞ భూమియందెందుఁ జెల్లుటలేదు! చెప్పుమని యడుగ, మధువనములో లవణుఁడనెడి రాక్షసుఁడున్నాఁడు. రాజా! యచ్చట నీయాజ్ఞ చెల్లి చున్నదా? చెప్పుమని పలుకఁగా)

—• మాంధాత లవణుచే హతుఁ డగుట •—

ఉ. ఘోరపువిప్రియంబు సుర•కుంజరుఁ డాడిన సిగ్గు చెంది ధా
త్రీరమణుండు వెండి చను•దెంచెద నంచు నవాఙ్ముఖంబునన్
శూరుఁడు వీడికోల్వడసి • శూలధరున్ గెలువంగ రాక్షసున్
గోరి పురంబుఁ జేరఁ జని • గొబ్బునఁ బంచెను దూత నొక్కనినిన్. ౧౩-౧౪

అర్థములు. ఘోరపు విప్రియంబు=భయంకరమై యనిష్టమైనది, అవాఙ్ముఖంబునన్=తలవంచుకొని, వీడికోలు=సెలవు.

తాత్పర్యము

(భయంకరమయిన యనిష్టము నింద్రుఁడు పలుకఁగా మాంధాత సిగ్గునఁ దలవంచుకొని మరల వచ్చెద నని సెలవుపొంది శూరుఁడైన యారాజు శూలధారియగు లవణాసురుని గెల్వవలెనని వాని పత్తనము నొద్దకుఁబోయి వెంటనె యొక దూతను బంపెను.)

క. మధుపుత్రునొద్దకును వాఁ, డధికంబుగ నందు ద్రేల ♦ నప్రియభాషల్
క్రుధచే లవణుఁడు వానిన్, వధియించి భుజించె నృపతి♦వర్యుం డచటన్. ౧౨౦

తాత్పర్యము

(వాఁడు మధుపుత్రుఁడగు లవణునొద్దకుఁబోయి యప్రియములగు మాటలధికముగఁ బ్రేలెను. లవణుఁడువిని కోపమున నాదూతను జంపితినెను. మాంధాత యచ్చట)

ఆ. తడవు చాల నయ్యుఁ♦దనదూత రాకున్నఁ, దాన యరిగి లవణుఁ♦దాఁకిఘోర
బాణవృష్టి ముంపఁ ♦ బలలాశి శూలంబు, వైచి రాజుమీఁద♦బలముమీఁద.

తాత్పర్యము

(దూత యెంతసేఁపునకు రాకుండుటచేఁ దానేపోయి లవణునెదిర్చి భయంకరముగ బాణవర్షముచే వాని ముంచివేయ రాక్షసుఁడు రాజుమీఁద సేనమీఁద శూలమును వేసెను.)

ఆ. అదియు నృపతితోడ ♦ నఖిలసేనాతతి, దగ్ధముగ నొనర్చి ♦ దనుజనాథు
చేత వచ్చి నిలిచెఁ బూతచరిత్ర శూ,లాయుధంబు మహిమ♦యతులితంబు.

తాత్పర్యము

(ఆ శూలము రాజుతో సేనాసమూహము నంతయుఁ గాల్చి మరల రాక్షసుని చేతిలోనికి వచ్చి నిలిచెను. పవిత్రచరిత్రా! శత్రుఘ్నా! శూలాయుధము యొక్క మహిమ మసమానము.)

ఉ. శూరవరేణ్యా! వేగినను ♦ శూలము నాలయమందు వీడి యా
హారముపొంటె దైత్యుఁడు వ♦నాంతరవీథులఁ ద్రిమ్మరంగ దు
ర్వారపరాక్రమంబునను ♦ వాని వధించెద వీవటంచు నీ
తీరున మందలించునెడఁ ♦ దెల్పి వహించెను దూరు పంతటన్. ౧౨౩

అర్థములు. వేగినను=ఉదయము కాఁగా, ఆలయమందున్=ఇంటిలో, పొంటెన్=కొఱకు, దీనివలన నెవరికిఁ దెలియకుండునట్లు రాత్రివేళ ఋషుల యాశ్రమమునకుఁ బోయి యందే యుదయము వఱకుండెనని యేర్పడుచున్నది.

తాత్పర్యము

(శూరవరేణ్యా! యుదయము కాఁగానే రాక్షసుఁడు శూలమును గృహము నందు వదలి యాహారము కొఱకడవులలోఁ దిరుగఁబోవును. ఆ సందున నీవు పరాక్రమించి వానిని వధింపవలెను. అని ఈవిధము మందలించుచునప్పుడు తూరుపు తెల్లవాఱెను.)

—♦ శత్రుఘ్నుఁడు లవణుఁ బురంబులోనికిఁ బోకుండ నిరోధించుట ♦—

ఉ. ఆవఱువాత దైత్యవరుఁ♦డామిషకాంక్షఁ బురంబు వీడి వ
న్యావళి కేగ, దాశరథి ♦ యంతట సూర్యసుతం దరించి యా
కావలు వీటి వాకిటను ♦ గాంచి శరాసనహస్తుఁ డౌచు స
ద్భావనుఁ డుండె మింటి నడి♦భాగము సూర్యుఁ డలంకరింపఁగన్. ౧-౨-౨౮

అర్థములు. వఱువాతన్=ఉదయమున, ఆమిషకాంక్ష=మాంసము నందలి కోరికచే, వన్యావళికిన్=అడవులకు, సూర్యసుతన్=యమునను, కావలు=దుష్టుని యొక్క, వీటివాకిటను=ఊరి గవనియొద్ద, శరాసన హస్తుఁడు=విల్లుచేత ధరించిన వాఁడు.

తాత్పర్యము

ఆ యుదయముననే రాక్షసుఁడు మాంసము నిమిత్తమై పురమువదలి యడవులకుఁ బోయెను. వాఁడటు పోయిన పిమ్మట శత్రుఘ్నుఁడు యమునదాఁటి విల్లుచేతఁ గొని యాతని యూరివాకిట మధ్యాహ్నము వఱకుఁగాచి యుండెను.

ఉ. క్రూరుఁడు రాక్షసుండు మృగ♦కోటుల నెల్ల వధించి మోచి త
ద్భారముతోడ వచ్చి పురి♦వాకిట లక్ష్మణు తమ్ముఁ గాంచి యే
కారియ మిందుఁ జేసెదవు ♦ కాండ శరాసము లూని నాకు నా
హారము పూర్ణమయ్యె వద♦నాంతర మీ విటు వచ్చి చొచ్చుటన్. ౧-౨-౨౯

అర్థములు. తద్భారముతోడన్=ఆ చచ్చిన మృగముల బరువుతో, కాండ శరాసములూని=బాణములు విల్లు ధరించి, వదనాంతరము=నోటిలోపల.

తాత్పర్యము

(క్రూరుఁడైన రాక్షసుఁడు మృగములను జంపి మోచి యా చచ్చిన మృగముల బరువుతో వచ్చి పత్తనమువాకిట శత్రుఘ్నునిఁ జూచి విల్లు నమ్ములు పూని యిక్కడ నేమి చేయుచున్నావు? నా నోటిలోపల నీవీ విధముగా వచ్చి ప్రవేశించుటచే నాహారము నాకుఁ బూర్తియైనది.)

చ. అని కనుబిగ్గనవ్వు దను♦జాధముఁ గాంచి సుమిత్ర పట్టి పె
న్గినుకను బాష్పము ల్దొరలఁ ♦ గీలలు వెల్వడ గాత్రదేశమం
దసియె దురాత్మ నిన్నొడరి ♦ యాహవ మేనొనరింప వచ్చినాఁ
డను, నినుఁ గాలుప్రోలికి గ♦డంకను బంపెద నేల నవ్వఁగన్. ౧-౨-౩౦

అర్థములు. కీలలు=జ్వాలలు, గాత్రదేశమందున్ = దేహము నందు, తొడరి=ఎదిరించి, కాలుప్రోలికిన్ = యమునిపురమునకు, కడంకను=పరాక్రమముచే.

తాత్పర్యము

అతి పెద్దగా నవ్వు నా రాక్షసాధమునిఁ జూచి శత్రుఘ్నుఁడు కోపముచేఁ గన్నుల నీళ్లురాల దేహమునుండి యగ్నిశిఖలు వెలువడ నిట్లనియె. దుష్టుఁడా! నిన్నెదిరించి యుద్ధముచేయ వచ్చితిని. నిన్నుఁ జంపెదను. ఏల నవ్వెదవు ?

క. తనయుండను దశరథునకు, ననుజుండను రామునకు నిశాటవరేణ్యా!
విసరా! నే శత్రుఘ్నుఁడ, జనరక్షాపరుఁడ నిత్యశత్రుఘ్నుఁడన్. ౧౨౨

అర్థములు. నిశాటవరేణ్యా=రాక్షసశ్రేష్ఠుఁడా, నిత్యశత్రుఘ్నుండన్= నిత్యశత్రువుల జయించినవాఁడను.

తాత్పర్యము

(రాక్షసశ్రేష్ఠా! నేను దశరథ మహారాజు కుమారుఁడను, రామచంద్రమూర్తి తమ్ముఁడను. నాపేరు శత్రుఘ్నుఁడందురు. లోకులను రక్షింపఁ గోరువాఁడను. నిత్యశత్రువుల జయించిన వాఁడను. వినరా,)

తాత్పర్యము.

ఉ. కావున ద్వంద్వ యుద్ధమున కాంక్ష దలిర్పఁగ వచ్చినాఁడ, నీ
చావు నిజంబు నావుడు ల సత్పరిహాసవికాసవక్త్రిర
క్షోవరుఁ డాగ్రహంబునను గూళుఁడ! నాతలితోడఁ బుట్టు వా
రావణుఁ, డాతనిం దునిమె రాముఁ డనిం దరుణీనిమిత్తమై. ౧౨౭

అర్థములు. లసత్=ప్రకాశించు, పరిహాస=నవ్వుచే, వికాస=తెఱచుకొనఁబడిన, వక్త్రి=నోరుగల, రక్షోవరుఁడు=రాక్షస శ్రేష్ఠుఁడు, కూళుఁడ=దుష్టుఁడా, అనిన్=యుద్ధమందు, తరుణీనిమిత్తమై=ఆఁడుదానికొఱకు.

తాత్పర్యము

(కావున నీతో ద్వంద్వయుద్ధము చేయఁ గోరి వచ్చితిని. నీ విఁక జచ్చినవాఁడవే నిజము. అని యనఁగాఁ బెద్దగా నోరుతెఱచి నవ్వి కోపముతో దుష్టుఁడా! నా మేనమామ రావణాసురుఁడు- ఆఁడుదాని కొఱకు రాముఁడు యుద్ధములో నాతనిఁ జంపెను.)

క. మునుపటివారల నధునాతనులను బొరి గొంటి నృపులఁ దక్కిన వారిన్
మనమునఁ దృణీకరించితిఁ, గనుకం జుమి శాంతిఁ దాల్చి కదలక యుంటిన్.

అర్థములు. అధునాతనులను=ఇప్పటివారిని, పొరిగొంటిన్=చంపితిని.

తాత్పర్యము

నా మేనమామకు నేనేల సహాయపడలేదందువా? నేను మునుపటి రాజులను ఇప్పటి రాజులను జంపితిని తక్కిన వారిని నేను లక్ష్యము చేయలేదు. కావున నేను రాముని జంపుటకై రావణునకుఁ దోడుపడలేదు.

ఉ. రావణువంశ మెల్లను దురంబునఁ గూలుటయున్ సహించితిన్;
నీవిట వచ్చినాఁడవె యరిని నన్నుఁ దాఁకఁగ? నేను శూల మెం
తేవడిఁ దెత్తుఁ దాళు మొకయింత యనన్ నృపసూతి నవ్వి నే
జీవముతోడ నుండ నెటుచేకొనఁ బోయెద వోరి శూలమున్. ౧౨౩౦

అర్థములు. దురంబునన్=యుద్ధమునందు.

తాత్పర్యము

(యుద్ధములో రావణుని వంశ మంతయును నాశమగుట కోర్చితిని; నన్నెదిరించుట కిక్కడకు వచ్చితివా? కొంచెము సేపుతాళు. నేను శూలమును ద్వరగాఁ దీసికొని వచ్చెదను. అని చెప్పఁగా శత్రుఘ్నుఁడు నవ్వి నేను జీవముతో నుండఁగా నోరీ! నీవు శూలమును దెచ్చుట కెట్లు పోయెదవురా?)

క. పగతుఁడు యాదృచ్ఛికముగ, నగపడినన్ విడుచు మూఢుఁడవనిం గలఁడే?
జగముల కెల్లను శత్రువ వగునో దుష్టాత్మ! నీకునంతర మొసఁగన్. ౧౨౩౧

అర్థములు. యాదృచ్ఛికముగన్=ఆకస్మికముగ, అంతరము=సందు.

తాత్పర్యము

(పగవాఁ డాకస్మికముగా నగపడినప్పుడు వదలిపెట్టు మూఢుఁడు భూమిలో నుండునా? లోక కంటకుఁడవగు నో దుష్టాత్మా! నీకు సందీయను.)

— లవణ శత్రుఘ్నుల యుద్ధము —

సీ. అనవుడు మధుపుత్రుఁడట్టహాస మొనర్చి, పాణిఁ బాణిని నల్పిపటపట మన
దంతముల్, పోరికి ధరణీశుఁ బిల్వంగ, నతఁడు రక్కసుతోడనియె నోరి!
మున్ను నీ గెలిచిన యన్నృపతులలోని, వానిఁగా నన్నెంచ వలదు నిన్నుఁ
బరిమార్చి ఋషుల నిర్భయులను గావింతు,మత్తీక్ష్ణశర బాణాగ్ని మహినిఁబడిన

తే. నిన్ను రావణు నమరులు గన్నులార, గాంచినట్టులు విప్రులు బ్రాహ్మజనంబు
కాంచుఁగావుత క్షేమంబుఁగ నేఁడిగాక, యాళ్ళుఁబల్లెలు నేఁడాదియుదిలకొనక.

అర్థములు. అట్టహాసము=పెద్దనవ్వు, ఉదిల గొనక=పరితాప పడక.

తా త్ప ర్య ము

(అని చెప్పఁగా లవణుఁడు పెద్దగా నవ్వి చేతినిఁ జేతితో నలిపి పండ్లు పట పట కొఱుకుచు శత్రుఘ్నుని యుద్ధమునకు రమ్మని పిలువఁగా నతఁడు రాక్షసునితో నోరీ! మునుపు నీవు గెలిచిన రాజులలోనివానిఁగా నన్నుఁ దలఁపకుము - నిన్నుఁ జంపి ఋషుల భయము వాపెద - క్రూరములగు నా బాణములచే నేలఁగూలిన నిన్ను రావణుని దేవతలు కన్నులారఁ జూచినట్లు విప్రులు లోకులు చూచెదరు గాత - ఊళ్ళు పల్లెలు నేడు మొదలుగఁ బరితాప ముడిగి క్షేమపడుఁ గాత.)

ఉ. మామకహస్తముక్తశిత ◊ మార్గణరాజులు వజ్రతుల్యతే
జోమయముల్ దివాకరరు ◊ చుల్ సరసీజముఁ జొచ్చు భంగి దు
ర్ధామజవంబునన్ ఖలుఁడ ◊ తావకహృత్స్థలిఁ జొచ్చుఁ జూడుమీ
నా మధునందనుండు రఘు◊నందను వైచె ధరారుహంబునన్. ౧౩౩

అర్థములు. మామక హస్తముక్త=నాచేత విడువఁబడిన, శిత=వాడియైన, మార్గణరాజులు=బాణసమూహములు, వజ్రతుల్య తేజోమయమున్=వజ్రముతో సమానమైన తేజస్సుచే నిండినది, దివాకర రుచుల్=సూర్యకాంతి గలవి, సరసీజము=కమలమును, దుర్ధామజవంబునన్ = అఁపరాని వేగముతో, తావక=నీ యొక్క, హృత్+స్థలి=హృదయప్రదేశము, ధరారుహంబునన్=చెట్టుచే.

తా త్ప ర్య ము

వజ్రమువంటి తేజస్సు సూర్యునివంటి కాంతి కలిగి నాచే విడువఁబడినబాణ సమూహములు తుమ్మెదలు కమలమునందుఁ జొచ్చునట్లు నీహృదయము లోపలఁ బ్రవేశించి నీ ప్రాణవాయువులను దేనెవలెఁ గ్రోలును. దుష్టుఁడా! చూచు చుండుము. అనిన రాక్షసుఁడు శత్రుఘ్నుని చెట్టుతోఁ గొట్టును.

ఉ. దానిని నూరుతునకలుగ ◊ ధారిణి డొల్లఁగ నేయఁ గింకచే
దానవుఁ డుగ్రభంగి వసు◊ధారుహవర్షము మీఁదఁ గొల్పినన్
మానవనాయకుండు ఖర◊మార్గణపంక్తి నణంచె దానిని
కైన నిశాటుఁ డుద్ధతి ద్రు◊మాహతి నొంచె నరేంద్రుమూర్ధమున్. ౧౩౪

అర్థములు. వసుధారుహవర్షము=చెట్లవాన, ఖరమార్గణ పంక్తిన్ = తీక్ష ణములైన బాణముల వరుసలచే, ద్రుమహతిన్=చెట్టుదెబ్బచే, మూర్ధమున్= తలను.

తా త్ప ర్య ము

ఆ చెట్టును నూఱు తుంటలుగ నేలఁబడఁగొట్టగా రాక్షసుఁడు కోపించి చెట్ల వాన గురియించెను. దానిని శత్రుఘ్నుఁడు తీక్ష్ణబాణములచే నణంచెను గాని రాక్ష సుఁడు చెట్టుతో శత్రుఘ్నుని తలపైఁ గొట్టెను.

తాత్పర్యము

క. శత్రుఘ్నుఁడు సడలుడు నిజగాత్రంబున సంధులెల్ల ♦ గడిమి చెడి పడెన్
ధాత్రిపయి మూర్ఛమునుప సుమిత్రాసుతుఁడిట్లు కూలఁ ♦ మింట న్వేల్పుల్. ౧౩౩౧
అర్థములు. కమిడి=బలము.

తాత్పర్యము

(తన దేహమున సంధులు సడలి బలముడిగి శత్రుఘ్నుఁడు నేలమీఁద మూర్ఛిల్లిపడెను. ఆ శత్రుఘ్నుఁడీ ప్రకారము పడిపోఁగా, నాకసమున దేవతలు)

క. చారణగంధర్వులు ఋషి, వారంబులు నప్సరసలు ♦ భయపడి హాహా
కారంబులు నింపఁగ దేవారియు హతుఁ డయ్యె శత్రుఁ ♦ డనుచున్ మదిలోన్.
అర్థములు. దేవారియు=లవణుఁడు కూడ.

తాత్పర్యము

(చారణులు, గంధర్వులు, ఋషిసమూహములు నచ్చరలు భయపడి హాహాకారము లొనరించిరి. దేవవిరోధి లవణాసురుఁడు పగవాఁడు చచ్చినాఁడని తన మనస్సునందు)

తే. సడ్డ సేయక శూలంబు ♦ సంగ్రహింప
జనఁగ, లబ్ధావకాశుఁడై ♦ సత్త్వములను
గొనుచు నుండఁగ శత్రుఘ్నుఁ ♦ డును ముహూర్త
మాత్రమునఁ బ్రాప్తసంజ్ఞుఁడై ♦ మౌను లలర. ౧౩౩౨

అర్థములు. సడ్డచేయక=లక్ష్యములేక, చచ్చినాఁడు వీఁడేమి చేయఁగలఁడను తలంపుతో, చనఁడు=పోయినవాఁడు కాఁడు, లబ్ధావకాశుఁడై=విరామము దొరికినవాఁడై, సత్త్వములను=జంతువులను, వాఁడు తెచ్చినమోపు యుద్ధము వలన నేలపడవై చెను,దాని నిప్పుడు మరల సవరించి కట్టుకొనుచున్నాడు. ప్రాప్త సంజ్ఞుఁడై=స్మృతినొందినవాఁడై, మౌనులలరన్=మునులు సంతోషపడుచుండఁగా దీనివలన మునులు దూరమునుండి యుద్ధము చూచుచుండి రని సూచన.

తాత్పర్యము

(లక్ష్యము చేయక శూలము తెచ్చికొనఁ బోయినవాఁడు కాఁడు సందు దొరికినదని నిదివఱకు యుద్ధము చేయునప్పుడు క్రిందపడవేసిన జంతువుల మోపు మరల సవరించి కట్టుకొనుచుండెను శత్రుఘ్నుఁడు స్వల్పకాలముననే మూర్ఛ తెలిసి మునులు సంతోషపడుచుండఁగా.)

— ♦ శత్రుఘ్నుఁడు లవణు వధించుట ♦ —

సీ. శత్రుపు నెదిరించి శంబానసంబును శతకోటివేగంబు ♦ శాతకుంభ
శైలమందర ♦ సన్నికాశంబును, నతపర్వ ముగ్ర మఁ ♦ నాహతంబు
శోణితచందన ♦ శోభితంబును జారు, పత్రంబు దానవ ♦ భంజనంబు
ప్రలయకాలానలా ♦ భంబు, మహాస్త్రంబు సర్వభూతంబులు ♦ సంభ్రమింపఁ

తే. దీయఁ గిన్నరగంధర్వ ♦ దేవసమితి, మునులతోఁడుత నప్సరో♦జనముతోడ
ధాతఁ గానఁగఁ జని భూత♦ధాత్రియెల్ల, భువనములు నాశనంబగు♦పోల్కిఁదోఁచె.

అర్థములు. శంబానసంబును=వజ్రముఖమును, శతకోటి=వజ్రాయుధము యొక్క, శాతకుంభశైల=బంగారుకొండ మేరువు. మందరధర=మందర పర్వతముతో, సన్నికాశంబును=పోలినదియు, నతపర్వము=వంగిన కణుపులుగలది, అనాహతంబు=కొట్టుపడనిది, శోణితచందనశోభితంబును = ఎఱ్ఱని గంధముచేఁ బ్రకాశించునదియు, చారుపత్రము=అందమైన కణుపులు గలది, దానవ భంజనంబు=రాక్షసుల వధించునది, ప్రలయకాలానలాభంబు = ప్రలయకాలాగ్నితో సమానమైనది.

తాత్పర్యము

వజ్రముఖంబును వజ్రవేగంబును మేరుమందర గౌరవంబును భయంకరమును వంగిన కణుపులు గలదియు పరాభవము లేనిదియు రక్తచందనముచేఁ బ్రకాశించునదియు రాక్షసులఁ జంపునదియు ప్రలయకాలాగ్నితో సమానమైనదియు నగు మహాస్త్రంబును ప్రాణికోటు లన్నియు భయపడునట్లు దీయఁగా కిన్నరులును దేవ గంధర్వులు మునులతోడను అప్సరోజనులతోడను బ్రహ్మను జూడఁబోయి భూమియు సమస్త ప్రాణులు నాశమగు నట్లున్నది.

చ. అనవుడు బ్రహ్మపల్కె నమృ♦తాంధసులార! భయంబు హేతువున్
వినుఁడు సుమిత్రనందనుఁడు ♦ విశ్వపరున్ లవణున్ వధింపఁగా
ధనువునఁ గూర్చినాఁడు భయ♦దం బగునస్త్రము దాని తేజునన్
మన మతిమూఁఢ మయ్యెఁ జూఁడి♦నాకును మీకుఁ బ్రపంచ మంతకున్. ౧౨౩౯

అర్థములు. అమృతాంధసులార = దేవతలారా! విశ్వపరున్=ప్రపంచ ద్రోహిని.

తాత్పర్యము

అని చెప్పఁగా బ్రహ్మ యిట్లనియె. దేవతలారా! భయకారణము చెప్పెద వినుఁడు. విశ్వద్రోహియగు లవణుని జంపుటకు శత్రుఘ్నుఁడు భయంకరమైన యస్త్రమును వింట సంధించినాఁడు దాని తేజస్సుచే మీకు నాకు ప్రపంచమంతకు మనస్సు దిగ్భ్రమ చెందినది.

తే. అది సనాతనుఁడైన లో ♦ కాదికర్త
దగుటఁ దేజోమయంబు ము ♦ న్నసురులైన
మధునిఁ గైటభుఁ దునుమంగ ♦ మాధవుండు
దాని సృజియించె; దాని నా ♦ తం డొకం డె. ౧౨౪౦

అర్థములు. లోకాదికర్త=లోకమునకు మొదటికర్త.

తాత్పర్యము

(ఆ యస్త్రము సనాతనుఁడైన లోకముల కాదికర్త యయిన సర్వేశ్వరునిది. కావునఁ దేజోమయమైనది. పూర్వము మధుకైటభులను రాక్షసులను జంపుటకు శ్రీమన్నారాయణుఁడు దానిని సృజించెను. దాని నాతఁడొకఁడే.)

చ. తెలిసినవాఁడు, వెన్నునకుఁ దేజమ యియ్యది కాన మీరు త
త్తలమున కేగి దైత్యునివధంబును జూడుఁ డటన్న వారలున్
గలహధరిత్రికిం జనిరి కార్ముకమందు శరంబుఁ గూర్చి తాఁ
బిలిచె విరోధి, నాతఁడును, బేర్చిన కింకను బాఱుదెంచినన్. ౧౨౪౧

అర్థములు. వెన్నునకున్=విష్ణునకు, కలహధరిత్రికిన్=యుద్ధభూమికి.

తాత్పర్యము

(తెలిసినవాఁడు, విష్ణుని తేజమది. కావున మీరా చోటికిఁ బోయి రాక్షసుని చావు చూడుఁడు. అనఁగా వారలు యుద్ధభూమికిఁ బోయిరి. శత్రుఘ్నుఁడు వింటియందు బాణమును దొడిగి తాను విరోధినిఁ బిలిచెను. వాఁడును మించిన కోపమునఁ బరుగెత్తికొని రాఁగా.

శా. ఆకర్ణాంతము లాగి తచ్ఛరము దైత్యాధీశునిన్ వ్రేయ న
వ్యాకీర్ణద్యుతిపూర మభ్రపదవిన్ వ్యాపింపఁగా నేగి యా
లోకద్వేషియురంబు వ్రచ్చియు నధోలోకంబుఁ బ్రాపించి యి
క్ష్వాకుప్రోద్భవుతూణిఁ జొచ్చె సుర లాశ్చర్యంబున న్మగ్నఁగన్. ౧౨౪౨

అర్థములు. ఆకర్ణాంతము=చెవినఱకు, అవ్యాకీర్ణ ద్యుతిపూరము=చెదరని కాంతి ప్రవాహము, అభ్రపదవిన్ =ఆకాశమార్గమున, లోకద్వేషి=లోకజనులకుఁ బగవాఁడగు రాక్షసుని యొక్క, వ్రచ్చి=చీల్చి, అధోలోకంబు=పాతాళము.

తాత్పర్యము

అల్లెత్రాడు చెవికొనవఱకు లాగి యా బాణమును రాక్షసుని మీఁద వ్రేయఁగా నాకాశమును కాంతిప్రవాహముచే నిండించుచు పోయి సర్వజనద్రోహి యగు నతని ఱొమ్మును బగులఁజీల్చి పాతాళమునకుఁ బోయి మరలివచ్చి శత్రుఘ్ను నంబుల పొదిలోఁ బ్రవేశించెను, చూచుచున్న దేవత లాశ్చర్యపడిరి.

క. లవణుఁడు శరనిర్భిన్నుం, డవనిం బడె వజ్రహతమహాశైల మనన్
దివిజులు గన శూలము సని, శివుఁ గలసె యమున్ సురారిఁ చేరిన మాత్రన్.

అర్థములు. శరనిర్భిన్నుఁడు=బాణముచే భేదింపఁబడినవాఁడు, వజ్రహత మహాశైలము=వజ్రాయుధముచేఁ గొట్టఁబడిన పెద్ద పర్వతము.

తాత్పర్యము

బాణముచే హృదయము భేదింపఁబడఁగా లవణుఁడు వజ్రముచేఁ గొట్టఁబడిన పర్వతమువలెఁ బడిచచ్చెను. వాఁడు చావఁగానే శూలము శివునిలోఁ గలిసెను.

క. ఖరకరుఁ డిరులం దోలెడి, పరుసన రామానుజుండు॰పటుశర మొకటన్
హరియించెన్ భువనత్రయి, పురుతరసాధ్వసము బుధులు॰ పొగడుచునుండన్.

అర్థములు. ఖరకరుఁడు=సూర్యుఁడు, ఇరులన్=చీఁకటులను, పటుశర మొకటన్=ఒక్క బలిష్ఠమైన బాణముచే, భువనత్రయపురుతరసాధ్వసము = మూఁడు లోకముల గొప్పభయము, బుధులు=దేవతలు.

తాత్పర్యము

(సూర్యుఁడు చీఁకటులను బోఁగొట్టునట్లు శత్రుఘ్నుఁడు బలిష్ఠమగు నొక్క బాణముచే మూఁడు లోకములకుఁ గలిగిన భయము దేవతలు బొగడుచుండఁ బోఁదోలెను.)

ఆ. మధుసుతుండు గూలఁ॰మౌనులు వేల్పులు,పన్నగులును బాము॰వలని భయము
విడిచినట్లు మోద॰విభవంబు పొల్పార, శాంతచిత్తు లగుచుఁ॰జనినయంత

తాత్పర్యము

(లవణుఁడు చావఁగా మునులు దేవతలు పన్నగులు పామువలనఁ గలిగిన భయమువదలిన విధమున సంతోషాతిశయమున శాంత చిత్తులయి చనిన పిమ్మట)

—॰ దేవతలు శత్రుఘ్ననకు వరమిచ్చుట ॰—

సీ. అగ్నిపురోగము ॰ లమరులు పాకారి,తోడ శత్రుఘ్నునిఁ ॰ జూడ వచ్చి
మధురోక్తిఁ బల్కిరి ॰ మధునందను నదృష్ట వశమునఁ జంపితి ॰ప్రథితశౌర్య!
వరమిచ్చుకోరిక॰వచ్చియున్నారము, మా దర్శనం బెప్డు॰పోదు వృథగ
నెద్ది నీకోరిక ॰ యెఱింగింపుమీ యన, శిరమునఁ గరములు॰చేర్చిపలికె

తే. రాజధానిగ నీమధు॰రాపురంబు, దేవనిర్మిత మమరుత ॰ దివ్యులార!
యనిన నౌఁ గాక మఱియు రా॰మానుజన్ము, శూరసేనగ నౌనని॰వారలెల్ల.

అర్థములు. అగ్నిపురోగములు=అగ్ని మొదలుగాఁగలవారు, పాకారి తోడన్=ఇంద్రునితో, మధురోక్తిన్=తియ్యని మాటలచే, ప్రథితశౌర్య=ప్రసిద్ధికెక్కిన శౌర్యము గలవాఁడా! శూరసేనగ=శూరులగు సేనగలది, శూరసేనయను పేరుగలది.

తాత్పర్యము

(అగ్ని మొదలగు దేవతలు దేవేంద్రునితో శత్రుఘ్ను నొద్దకు వచ్చి తీయని మాటలాడిరి. ప్రసిద్ధి శౌర్యశాలివగు శత్రుఘ్నా! అదృష్టవశమున లవణునిఁ జంపి

తివి. నీకు వరమీయఁ గోరి వచ్చినారము. మా దర్శనము వృథాగాఁబోదు. నీ కోరిక యేది తెలుపుము. అని పలుకఁ దలమీఁద జేతులు మోపి వినయమున దేవతలారా! దేవతలచే నిర్మింపఁ బడిన మధురాపురము రాజధానిగ నమరును గాత, మని యడిగెను. దానికి వా రట్టులే యగునుగాక, మఱియు నిదియు శూర సేనగ నౌనని వారలందఱు.)

ఆ. వర మొసంగి దివికి•నరుగ శత్రుఘ్నుండు, పిలువఁ బంచెఁ దనదు•దళము నెల్ల
వచ్చి మథురయందు • వల నగుచోటుల, నెలవు గొనియె జనము•లలితభంగి.

అర్థములు. దళము నెల్లన్=సేననంతయు.

తాత్పర్యము

(వరమిచ్చి స్వర్గమునకుఁ బోవ, శత్రుఘ్నుఁడు తన సేననంతయుఁ బిలువఁ బంచెను. జనము వచ్చి మథురయం దనుకూలమగు చోటుల నివాస మేర్పఱుచు కొనెను.)

మథురయందు రెండవ యక్షరము తవర్గ ద్వితీయాక్షరము.

—• శత్రుఘ్నుఁడు మథురాపురంబు నభివృద్ధి వఱచుట •—

తే. శ్రావణంబున నిట్లు ప్రారంభ మయ్యెఁ, దన్ని వేశన మాది యా•ద్వాదశాబ్ద
మునను నిండారి సేనాస•మూహములను, దద్విషయములు నిర్భయ•తనురహించె!

అర్థములు. తద్విషయములు=ఆ దేశములు, నిర్భయతన్=భయము లేమిచే.

తాత్పర్యము

పురమేర్పాటు శ్రావణమునఁ బ్రారంభమై పండ్రెండు సంవత్సరములకు సేనాసమూహముతో నిండి ఆ దేశములను భయము విడిచిన దయ్యెను.

సీ. కాఁపుకారునను బా•కారి వాన లొసంగెఁ, బైరులుఁ బచ్చలుఁ•బ్రబలమయ్యె
నారోగ్యయుక్తులై•రఖిలమానవులును, సుందరగృహముల•సొగసు లెసఁగె
నంగడివీదులు • రంగారుచుండెను, వాణిజ్యసంపద • బహుళ మయ్యె
లవణ కల్పితమహా•భవనంబు సుకృతమై. పెక్కువన్నెలకల్మిఁ•బేర్మిఁ గాంచె,

తే. నర్ధచంద్రనిభంబయి•యమునతీర,మంచుఁబుర మొప్పుచుండె వా•హ్యాళియోగ్య
సుందరారామములు చాల•శోభఁగూర్చె, హాళి శత్రుఘ్నుఁ డాపురి•నేలు వేళ.

అర్థములు. వాహ్యాళి యోగ్యము=వినోదముగాఁ దిరుగుటకుఁ దగినది.

తాత్పర్యము

(శత్రుఘ్నుఁడు రాజ్యముచేయు కాలమున సంక్రందనుఁడు ప్రతికారున వానకు గురి సెను. పైరుపచ్చలు ప్రబలెను. మనుష్యులందఱారోగ్యవంతులయి యుండిరి. సుంద

రములగు నిండ్లయందు సొగసులతిశయించెను అంగడి వీథుల సొంపుగా నుండెను. వ్యాపారము విస్తరించెను. లవణాసురుఁడు కట్టించిన మహాభవనము మంచి పనితనము కలిగి పలువన్నెల నలరారుచుండెను. యమున యొడ్డున నర్ధచంద్రాకారముగఁ బత్తనము చూడ నొప్పియుండెను. వినోదముగా విహరించుటకుఁ దగిన యందమగు తోఁటలా పురికిఁ జాలశోభఁ దెచ్చెను.)

తే. అన్యతలములనుండి వై♦శ్యాళి వచ్చి, నెలవుకొనెనందు నీ రీతి♦ నిర్భయముగఁ
బురము ప్రోపువహించినఁ ♦ బొంగి లక్ష్మ, ణానుజుఁడు పది రెండవ♦హాయనంబు.

తాత్పర్యము

(ఇతర స్థలములనుండి వైశ్యులు వచ్చి స్థిరనివాసము లేర్పఱుచుకొనిరి. ఈ విధముగాఁ బట్టనమునం దెట్టి భయములేక యభివృద్ధినందుటకు సంతసించి శత్రుఘ్నుఁడు, పండ్రెండవ యేఁడు.)

క. పుట్టిన రామునిపదములు, పట్టి నమస్కృతిని జేయు ♦ భావము దనకున్
బుట్ట మితజనృతుండై, పట్టనమున్ మంత్రిజనుల♦వశమున నిడుచున్. ౧ ౨౪౧

తాత్పర్యము.

పండ్రెండు సంవత్సరములు జరుగగా నన్నను జూచి నమస్కరింప వలయునను తలంపు కలిగి కొలఁది జనములఁ దీసికొని పట్టనము మంత్రుల కప్పగించి పండ్రెండు సంవత్సరము లొకరి నొకరు చూచుకొన కుండిన మరల దర్శన ప్రాప్తి లేదు. వారు వచ్చిన వారితో సమానులు

—♦ శత్రుఘ్నుఁడు వాల్మీకి యాశ్రమంబున విడియుట ♦—

సీ. అరదముల్ నూఱుతో♦నరుదేర నియమించి, యేడెనిమిది తావు♦ లేర్పరించి
యందంద నిలుచుచు♦ననఘుఁడా వాల్మీకి, యాశ్రమంబును జేరి♦యమ్మహాత్ము
పాదంబులకు మ్రొక్కి♦పాద్యంబుఁ గైకొని, యర్ఘ్యమాతిథ్యంబు♦నందియుండ
నెన్ని యోకథలు ము♦నీశుండు వచియింప,వినుచుండె నృపసూతి♦ వేడ్కమీఱ

తే. వాల్మికుండును బ్రస్తావ♦వశముఁ జేసి, లవణువధఁ గూర్చి యిట్లను♦లలితచరిత
దుష్టచరితుని లవణునిఁ ♦ ద్రుంచి నీవు, జగములకు మేలు నేసితి♦సత్యశౌర్య!

అర్థములు. తావులు=దిగుస్థలములు.

తాత్పర్యము

(నూఱు రథములు వెంట వచ్చునట్టులు నియమించి యేడెనిమిది దిగుస్థలము లేర్పాటుచేసి యచ్చట నచ్చట నిలుచుచు శత్రుఘ్నుఁడు వాల్మీకాశ్రమమును జేరి యామహాత్ముని శ్రీపాదములకు మ్రొక్కి, వారివలన నర్ఘ్యపాద్యాదులు గ్రహించి

యాతిథ్యమును బడసియుండ వాల్మీకి మహర్షి యెన్నియో కథలు చెప్పుచుండ వినుచుండెను. వాల్మీకి ముని ప్రస్తావవశమున లవణాసురవధను గూర్చి చెప్పుచు సత్యమయిన శౌర్యముగల నీవు దుష్ట చరిత్రుఁడగు లవణునిఁజంపి లోకములకు మేలు నేసితి.)

క. నీ తేజంబున లోకము భీతి యణంగెను దశాస్యుఁ ♦ బెనుజతనమునన్
సీతాపతి గూల్చెను నీ, వీతనిఁ బొరిగొంటి యత్న♦హీనత నర రే! ౧౨౫౩

అర్థములు. పెను జతనమునన్=పెద్ద ప్రయత్నము చేసి, వానరులనుగూర్చు కొని సేతువు కట్టి యేడు దినములు యుద్ధముచేసి రావణుని రాముఁడు చంపెను. నీవంత కంటె బలవంతుని నే ప్రయత్నము లేక యొంటరివై చంపితివి. ఏమి యాశ్చర్యము.

ఉ. వాసవుతోడ నుండి సుర♦వర్త్మమునం గనుఁ గొంటి నీవు దు
ష్టాసురుఁ జంపు భంగి భవ♦దద్భుతవిక్రమశక్తి కెల్లరున్
వాసి రహింప మెచ్చి రెదఁ ♦ బార్థివనందన! నాకు నెంతో సం
తోసము గల్గె భూతవిత♦తుల్ ప్రియ మందెను నీదు సత్కృతిన్. ౧౨౫౪

అర్థములు. సురవర్త్మమునన్=ఆకాశమున.

తాత్పర్యము

(నే నింద్రునితో నాకసముననుండి నీవు లవణాసురునిఁజంపు విధమంతయుఁ జూచితిని. అద్భుతమగు నీ పరాక్రమము కందఱును మెచ్చుకొనిరి. నాకును సంతోషమైనది. సర్వప్రాణులు నీవు చేసిన సత్కార్యమునకుఁ జాలప్రీతి వహించినవి.)

క. ప్రేమ సమగ్రము నాకును నీ మూర్ధము మూరుకొందు ♦ నే, నే నిపు డో
రామానుజ! యిదియే కద, ప్రేమమునకుఁ బరమగతి వి♦వేకధురీణా! ౧౨౫౫

అర్థములు. మూరుకొందునే=వాసన చూతునా

తాత్పర్యము

(రామానుజా! నాకును నీయెడఁ బ్రేమ సంపూర్ణముగ నున్నది. నే నిప్పుడు నీ శిరము వాసన చూతునా? ప్రేమమున కిదియే కదా పరమావధి)

క. అని శిరమును మూర్కొని తన నెనరుం గనఁబఱిచి యాత♦నిం గొలిచెడి త
జ్జనముల కాతిథ్యంబును, మునివరుఁడు ఘటించె వారు♦మోదముఁ గూరన్.

అర్థములు. నెనరు=ప్రేమ.

తాత్పర్యము

(అని శత్రుఘ్నుని శిరస్సు వాసనచూచి, తన ప్రేమను గనఁబఱిచి, యతనితో వచ్చిన వారు సంతోషపడునట్లు వాల్మీకి మహర్షి వారికాతిథ్యమొసఁగెను.)

—• శత్రుఘ్నుఁడు శ్రీరామాయణమును వినుట •—

సీ. శత్రుఘ్నుఁడాహార•సంతుష్టిఁగాంచి య, కాలంబునను యథా•క్రమముగాఁగఁ
దంత్రీలయయుతంబుఁ • దాలాన్వితంబును, సంగీతమాధుర్య•సంయుతంబు
సంస్కృతంబును సుల•క్షణసముపేతంబుఁ ద్రిస్థానకరణసం•దీపితంబుఁ
బూర్వకృతంబు నై•పొలుపొందు శ్రీరామ, చరిత యథావృత్త•సరణి మొదటి

ఆ. నుండి వినియె సర్వ•ముర్వీశుఁ డది వీత, చేష్టుఁ డగుచుఁ గనులు•చెమ్మగిల్ల
విగతసంజ్ఞుఁడగుచు•వెఱను నిట్టూర్పుచు, వినియె నపుడు జరుగు•విధముదోఁప.

అర్థములు. ఆహార సంతుష్టిన్=ఆహారముచేఁ దృప్తిని, తంత్రీ=వీణెల తంత్రులతోను, లయ=లయతోను, తాలాన్వితంబును=తాలము తోడను గూడినది, సంగీత మాధుర్య సంయుతంబు=మధురమైన సంగీతముతోఁ గూడినది, సంస్కృతంబును=సంస్కృత పదములతోఁ జెప్పఁబడినది, సులక్షణసముపేతంబు=కావ్యలక్షణములతోఁ గూడినది. త్రిస్థాన కరణసందీపితంబు = త్రిస్థానములు= హృదయము, కంఠము, ముఖము, ఇవి వర్ణోత్పత్తి స్థానములు, వీని ప్రయత్నముతో గూడినది, అనఁగా నే యే యక్షరము స్వర మెచ్చటఁ బుట్టవలయునో యే ప్రయత్నము కావలయునో యది సరిగాఁ గలది, పూర్వకృతము = మునుపు జరిగినది, యథావృత్తము=యథాప్రవృత్తము, యథానుభవముగా జెప్పఁబడినది.

తా త్ప ర్య ము

వాల్మీకి యిచ్చిన యాహారముచే సంతోషించి శత్రుఘ్నుఁ డా కాలమున సక్రమముగా వీణెమీఁద లయ తాలము సరిపోవునట్లు సంగీతశాస్త్ర ప్రకారము మధురముగ సంస్కృతభాష యందు వ్యాకరణ దోషములు లేక శాస్త్రసమ్మత మైన రీతిని, ఏ యే యక్షరము ఏయే స్వరము, ఏయే ప్రదేశములఁ బుట్టవల యునో యట్టి స్థానములు ప్రయత్నములు గలదై పూర్వమాయా నాయికా నాయకులచేఁ జేయబడినదై యొప్పు శ్రీరామ చరిత్రము ఎట్లు జరిగినదో యట్లు మొదటినుండి శత్రుఘ్నుఁడు వినెను. విని యాశ్చర్యముచేఁ జేష్టలు మాని కనుల నీరు గాఱ తన్నుదాను మఱచి భయముచే నిట్టూర్పులు విడుచుచు అప్పుడు జరుగుచున్నదా యేమి యను నట్లు వినెను

చ. నరపతితోడి వచ్చిన జ•నంబులు గీతము నాలకించి య
చ్చెరుపడి దీనతం గనుచు • శీర్షము లొయ్యన వ్రాలి వారిలోఁ
బరఁగునె యిట్టిచిత్ర; మిది • స్వప్నము, యెచ్చట నున్నవార, మే
కరణిని గంటిమో మునుపు•కార్యము లయ్యవి యాశ్రమంబునన్. ౧౨౯౮

తాత్పర్యము

(శత్రుఘ్నునితో వచ్చిన జనులు గానమువిని యాశ్చర్యపడి దీనతతోఁ జూచుచుఁ దలలు మెల్లన వ్రాల్చి వారిలో వార లిట్టి చిత్రము కలదా? ఇది కలయా? మన మెచట నున్నాము? మును పెట్లు చూచితిమో యవియె కార్యము లీ యాశ్రమమందు.)

ఆ. వినఁగఁ గలిగె గాన♦విధముగ నేమియీ వింత యనుచు వారు♦విభునిఁ జేరి
యేమియిది యటంచు♦ఋషివర్యనడుగుమీ, యనిన వారికనియె♦నవనివిభుఁడు.

తాత్పర్యము

మును పెట్లు చూచిరో యిప్పుడట్లు విన్నవా రగుటచే వారాశ్చర్యపడి శత్రుఘ్నుని సమీపించి యిదియేమి వింత, ఋషి నడుగుమని చెప్పఁగా శత్రుఘ్నుఁడు వారితో నిట్లనెను.

క. ఇట్టి విచిత్రము లీముని, రాట్టాశ్రమమం దనేకొ♦క్రాలెడి నివి యి
ట్టట్టని మూలము నెఱుఁగం, బుట్టఁగఁ గౌతూహలంబు ♦ పోలదు చుండీ!

అర్థములు. మునిరాట్టు=మునిరాజుయొక్క.

తాత్పర్యము

ఇటువంటి యాశ్చర్యము లెన్నియో యీ మునీంద్రు నాశ్రమమునఁ గలవు. అది యెట్లు లేలయని తెలియుటకై తహ తహ పడరాదు.

శత్రుఘ్నునకు ధ్వనిమాత్రము వినవచ్చెను గాని పాడిన బాలకులు కాన వచ్చినవారు గారు. ఇంతకుఁబూర్వ మిట్టి కావ్య మీ విధముగఁ జెప్పఁబడినది లేదు. ఇవి యాశ్చర్య కారణములు.

క. అనిచెప్పి మౌనివరునకు వినయంబున మ్రొక్కి తనని♦వేశమునకున్
జని రామగీతవిషయం, బునఁ జిత్తము నిలిచి పెక్కు♦పోకలఁ బోవన్. ౧౨౬౧

అర్థములు. తన నివేశమునకున్=తాను దిగినచోటికి, పెక్కుపోకలఁబోవన్= ఎన్నెన్ని విధములైన యాలోచనలో పోవుచుండఁగా.

తాత్పర్యము

(అని చెప్పి వాల్మీకి మునివరునకు వినయమున మ్రొక్కి తాను దిగిన చోటికిఁ బోయి, తానప్పుడు వినిన రాముని కథ విషయమున మనసు నిలిపి యెన్నెన్ని విధములైన యాలోచనలో పోవుచుండగా.)

—♦ శత్రుఘ్నుఁడు శ్రీరాము దర్శింప నయోధ్య కేగుట ♦—

ఉ. నిద్దుర లేక శ్రవ్యమయి ♦ నిండుముదంబును గూర్చు తత్కథన్
ముద్దులమాటలన్ భువ♦మోహనమౌ నునుఁబాటలన్ వినన్
బ్రొద్దుదయింపఁ గల్యవిధి♦పుంజముఁ దీర్చి మునీంద్రు మ్రొక్కుచున్
మద్దయితున్ రఘూత్తముఁ గ♦నన్ మది యుబ్బిత లూఁగెనంయమీ. ౧౨౬౨

అర్థములు. కల్యవిధి పుంజము=ఉదయమునఁ జేయవలసిన నిత్యకృత్యములు, మత్ దయితున్=నాకుఁ బ్రియుఁడైన రామచంద్రుని.

తా త్ప ర్య ము

రాత్రియంతయు నిద్దురలేక విన నింపయి నిండు సంతోషమును గలిగించు నా కథను ఆ ముద్దుల మాటలు జగమును మోహింప జేయుపాటలు వినుచుం డఁగాఁ దెల్లవారెను. అప్పుడు ప్రాతఃకాలమున నిర్వహింపవలసిన కార్యములు చేసి వాల్మీకికి నమస్కరించి నా ప్రియుఁడైన రామచంద్రమూర్తిని జూడ మనస్సు వ్విళులూరు చున్నది.

క. అనుమతి యిచ్చినఁ జనియెద, ననవుడు నెదఁ గ్రుచ్చి చను మటన్న శతాంగం
బున వడి వడిఁ జనె రామునిఁ గను కౌతుహలము దానిఁ గడవం బాఱన్.

తా త్ప ర్య ము

ఆజ్ఞ యిచ్చినఁ బోయెద ననఁగా నట్టులే చేయుమని కౌఁగిలించుకొని పోయి రమ్మనఁగా నాయనయు తే రెక్కి మిగుల వేగముగా బోయెను. ఆ రథమున కంటె ముందుగ రామచంద్రుని జూచుకోరిక దానిని దాఁటి పోవుచుండెను.

సీ. చని యయోధ్యా పురంబును జొచ్చి శ్రీరాముఁ,
డున్నెడ కేగి హేమోజ్జ్వలంపు
సింహాసనంబున శ్రీరాము మంత్రి మ, ధ్యస్థుని రాకామృగాంక వదను
నమరమధ్యస్థుడౌ హరిహయు బోలిన, వానిని దర్శించి వసుధ వ్రాలి
మ్రొక్కెడి కరములు మోడ్చిమీయాజ్ఞ, లవణు వధించితి బవరమునను
ఆ. బట్టనంబుఁ జక్కఁబఱిచితి జనులు ని, వేశనములు గొనిరి క్రీతిమతుల
నేండ్లు పదియు రెండు నేగె మిమ్ములఁ బాసి, యుండనోల్లనందు నొంటినింక.

అర్థములు. హేమోజ్జ్వలంపు=బంగారు మయమై ప్రకాశించుచున్న, మంత్రిమధ్యస్థుని=మంత్రుల నడుమ నున్నవానిని, రాకామృగాంక వదను=నిండు చంద్రునివంటి ముఖము గలవానిని, అమరమధ్యస్థుఁడు = దేవతల నడుమనున్న వాఁడు, హరిహయున్=ఇంద్రుని, బవరమునను=యుద్ధమందు.

తా త్ప ర్య ము

(పోయి, యయోధ్యాపట్టనమునఁ బ్రవేశించి శ్రీరాముఁడున్న చోటికేగి, యందు బంగారు సింహాసనముమీఁద మంత్రుల నడుమ, దేవతలమధ్యనున్న నింద్రుని వలెఁ బూర్ణచంద్రునిఁబోలు నెమ్మోముతోనున్న శ్రీరామచంద్ర మూర్తిని దర్శించి, నేలమీఁద సాగిలపడి మ్రొక్కి, చేతులు మోడ్చి మీ యానతి మేరకు లవణుని యుద్ధములోఁ జంపితిని. పట్టనము చక్కఁబఱిచితిని. జనులు నివాసము లేర్పఱుచుకొని సుఖముగా నున్నారు. పండ్రెండేండులు జరగిపోయి నవి. మిమ్ము విడిచి యిఁక నొంటిగా నుండలేను.)

—* శ్రీరామ శత్రుఘ్నుల సంభాషణము *—

ఉ. తల్లిని బాయునత్సము వి♦ధంబున మి మ్మెడఁబాసి యెన్నియో
నాళ్ళట సంతపించుచు న♦నాథువలెన్ మనయుండ నేర, నీ
యుల్లమునం దలంపు దయ ♦ యుత్తమకారుణి కాగ్రగణ్యా! నాఁ
దల్లడ మందు తమ్ముఁ గని త♦ద్దయుఁ బ్రీతి వచించె రాముడున్. ౧౨౬౫

అర్థములు. వత్సము=దూడ, అనాథువలెన్=రక్షకుఁడు లేనివానివలె, మనియుండనేరన్=బ్రతికియుండఁజాలను, ఉల్లమునన్=మనస్సునందు, ఉత్తమ కారుణి కాగ్రగణ్యా=పరమదయావంతులలో శ్రేష్ఠుఁడా, తల్లడము=పరితాపము, తద్దయున్=మిక్కిలి.

తాత్పర్యము

తల్లిని బాసినలేగవలె నిన్నెడఁబాసి యెన్ని యో దినములా మధుర యందుఁ బరితాప పడుచు దిక్కు లేని వానివలె బ్రతికియుండనేరను. నీవు దయా వంతులలో నుత్తమోత్తముఁడవు. కావున నాయందు మనస్సున దయ దలఁచి యిందే యుండ నాజ్ఞాపింపుము. అని పరితాప పడుచున్న తమ్మునిఁ గని రామ చంద్రమూర్తి ప్రీతితో నిట్లనియె.

చ. వగవకు మన్న యివ్విధపు ♦వర్తన మర్హము గాదు క్షత్రియుం
డగు పురుషాగ్రగణ్యునకు ♦ నర్హము తేనికి క్షత్త్రిధర్మమం
దొగి దృఢచిత్తుఁడై ప్రజల ♦ నోపి భరించుట, కాన నిల్వఁగాఁ
దగ దిట నప్పుడప్పుడు య♦థామతి నచ్చుచుఁ బోవు చుండుమీ. ౧౨౬౬

తాత్పర్యము

నాయనా! నీవు వ్యసనపడకుము. క్షత్రియుఁడగు పురుషశ్రేష్ఠునకు నిది సరి గాదు. క్షత్రియుఁడగు వానికి సంయోగ వియోగములందు దృఢమైన మనస్సు గలవాఁడై యోపికతోఁ బ్రజల రక్షించుట యుత్తమ కార్యము. కావున నిందే యుండెదననుట సరిగాదు. నీ వందే యుండి నీ యిష్టము వచ్చినపుడు రమ్ము, పొమ్ము.

ఉ. కూరిమి నాదు ప్రాణములఁ♦కుం గడు నెక్కుడ నీ వటైనను
ధారణిపాలనంబు విధి ♦ తప్ప దవశ్యము కార్య మాటచేఁ
గోరిక దీర నింక మముఁ ♦ గూడి చరింపుము యేడునాళ్ళ లా
పై రథదంతివాజియుత ♦ వాహినితోఁ బురిఁ జేరఁబోవుమీ. ౧౨౬౭

తాత్పర్యము

నా ప్రాణములందు నాకుఁగల ప్రేమకంటె నీ యం దెక్కువ ప్రేమగలదు. అయినను రాజ్యపాలనము విధి, అది తప్పునది కాదు. కావున నీకోరిక దీర

నిం దేడు దినము లుండుము. ఆవల రథములు ఏనుఁగులు గుఱ్ఱములు వీనితోఁ గూడిన సేనతో నీ పట్టనమునకుఁ బొమ్ము.

చ. అనవుడు ధర్మయుక్తమగు ♦ నప్పలుకుల్ విని దీనుఁడౌచు నా
యన నటు లౌత మంచు నని ♦ యందు వసించెను సప్తరాత్రముల్
జనపతియాజ్ఞఁ గాంచి మఱి ♦ చయ్యన నన్నలు సాగనంపఁగాఁ
దనపురి కేగె నిట్లు పిన♦తమ్ముఁడు పోవఁగ రామభద్రుఁడున్. ౧౨౧౮

తా త్ప ర్య ము

(అని చెప్పఁగా ధర్మయుక్తములైన యా మాటలు విని దీనుఁడై మెల్లఁగా నట్టులే యౌత మని యం దేడు దినములుండి రామప్రభువు వలన సెలవుపొంది, యన్నలు సాగనంపఁగా శత్రుఘ్నుఁడు తన పత్తనమునకు బోయెను. ఈ ప్రకారము పిన్నతమ్ముడగు శత్రుఘ్నుఁడు పోయిన పిమ్మట శ్రీరామభద్రుఁడును.)

బ్రాహ్మణుఁడు మృతబాలకు కళేబరమును శ్రీరాముని
యింటివాకిట వైచి యేడ్చుట

చ. అనుజులతోడఁ గూడి సుఖ♦మార సధర్మవిధిం బ్రజావనం
బొనరుచు చుండ నొకఁయెడ ♦ డొకద్విజుండు మృతాత్మజాతుతో
జనపదమందునుండి రఘు♦చంద్రమునిం గన వచ్చి ద్వారసీ
మను మృతబాలు వైచి పలు♦మార్గములన్ విలపించె నార్తుఁడై. ౧౨౧౯

అర్థములు. ప్రజావనంబు=జనరక్షణము, మృతాత్మజాతుతోన్=మరణించిన కొడుకు నెత్తికొని, జనపదమందు నుండి=గ్రామమందుండి, పలుమార్గములన్= అనేక విధముల.

తా త్ప ర్య ము

(తమ్ములతో సుఖముగా నుండి ధర్మముగాఁ బ్రజలను బాలించు చుండ నొక సమయమున నొక బ్రాహ్మణుఁడు చచ్చిన కొడుకును దీసికొని పల్లెటూరు నుండి శ్రీరామచంద్రునిఁ జూడవచ్చి, ద్వారమునొద్ద మృతబాలునిఁ బడవేసి యార్తుఁడై యనేక విధముల నేడ్చెను.

క. కొడుకా! కొడుకా! యనుచును,గడుపుపయిన్ బాఁదుకొనుచుఁ♦గను నీరంబుల్
జడిగొన నేడ్చుచు నిట్లనుఁ జెడుపాపం బేమి మున్ను♦చేసితి నొకొ. ౧౨౨౦

తా త్ప ర్య ము

(కొడుకా! కొడుకా! యని కడుపుమీఁద బాఁదుకొనుచుఁ గన్నుల నెంటఁ గన్నీళ్లు కాలువలుగఁ గాఱుచుండ నేడ్చుచు నీ విధముగా ననుచుండెను. పూర్వమున నే నెట్టి చెడ్డ పాపము చేసితినో?)

క. ఆ లలి కాదే నొక సుతుఁ, డీలాగున మరణ మొందుఁ నే ప్రాయమునన్
నాలుగు పదివర్షంబుల, కాలంబునఁ జచ్చె నాదుఁ కర్మము బలిమిన్. ౧౨౧

అర్థములు. ఆలలి=ఆవిధము, కాదేన్=కానియెడల, నేను పూర్వము పాపము చేసియుండనియెడల, ప్రాయమునన్ = వయసునందే, కర్మము=పాప కర్మము, పంచవర్ష సహస్రకమ్ అనిమూలమం దున్నది. ఐదువేల సంవత్సర ముల వాఁడు బాలుఁడు కాఁజాలఁడు. కావున నిచట వర్షశబ్దము దినపర్యాయ ముగ గ్రహింపవలెను. అప్పుడు కొంచెము తక్కువగా పదునాలుగు సంవత్సరము లగు చున్నవి. 'సహస్రసంవత్సరే సత్రముపాసీత' యనుచోట సంవత్సరమనఁగా దినమనియేకదా యర్థము. పంచవర్ష సమన్వితమ్మని యొకపాఠము గలదు. అప్పు డైదేండ్ల బాలుఁడనియే యర్థము.

తా త్ప ర్య ము

ఆ విధముగా నేను బాపము చేయక యుండినయెడల పదునాలుగు సంవ త్సరముల వయస్సుగల బాలుఁ డీ విధముగఁ జచ్చునా! ఈ యకాల మృత్యువునకు నా పాపకర్మమే కారణము.

ఉ. నాయన! నిన్నుఁ బాసియు మఁనం గలమా? యిఁక నల్పకాలమం
దే యముఁ గాంతు మయ్య! జనయిత్రియు నేను, నిటేల యయ్యెనో?
యేయెడఁ గల్లలం దలఁచి యేని వచించియ యే నెఱుంగ, నే
నేయెడ నెట్టి ప్రాణికిని హింస స్మరింపను నిక్కువంబుగన్. ౧౨౨

అర్థములు. మనంగలనా=బ్రతుకఁగలనా.

తా త్ప ర్య ము

నాయనా! నిన్ను విడనాడి నేను బ్రదుకఁగలనా? ఇఁక నల్పకాలమందే నేను నీ తల్లి యిరువురము మరణించుట సత్యము. నీ కకాలమరణము వచ్చుటకుఁ గారణమేమి? ఏ సందర్భమందెన్నఁడైన నేనసత్యమాడినది లేదు. నేనే ప్రాణికి హింసయు తలంచినవాఁడను గాను.

దీనివలన వేదోక్తాయువు జీవింపక నడుమంతరమున నల్పాయుల్పై చచ్చుటకు కల్లలాడుట, హింస కారణములని సూచన. ఈజన్మమునఁ బాపము చేయకున్నను పోయిన జన్మమునఁ జేసిన పాపఫల మిట్లు దాపరించె నేమో యందునా? పోయిన జన్మమున నేను బాపము చేసియుండిన నీ జన్మమున దాని వాసన కొంచెమైనఁ జూపవలెను గదా. ఈ జన్మమున నేనే పాపము చేయనపుడు పోయిన జన్మమం దును జేయనివాఁడనే. కావున నీ బాలుఁడు చచ్చుటకు నేను గారణము కాఁజాలను.

క ఏ పాపముచే నీ మా, పాపఁడు మాయిర్వురకును బైతృకవిధిఁ దా
నోపి యొనర్పకమున్నే, యీపగిదిం జనియె దండభృన్నగరంబున్. ౧౨౩

అర్థములు. పైతృక విధి=నివాపములు విడుచుట, శ్రాద్ధాదులు పెట్టుట లోనైన పితృదేవతల నుద్దేశించి చేయు కార్యములు, మా యిర్వురకున్=నాకు, నా భార్యకు, దండభృత్=యముని, నగరంబునకున్=పట్టనమునకు.

చ. కనినది లేదు మున్ను వినఁ • గానము రాముని రాజ్యమందు మా
డ్కిని నిటువంటి ఘోర మగు • కీడు న కాలమునందుఁ జావు, రా
మునిమహితాఘ మిట్టు మము • ముంచెడి, నేదియొ ఘోరపాప మీ
జనపతి సల్పె• నయ్యదియ • చంపెను నాదు తనూజ బాలకున్. ౧ ౨౭౪

తాత్పర్యము

రాముని రాజ్యమందువలె నిటువంటి కీడు, ఆకాలపుఁజావు. ఇంతకుముందు, విన్నది లేదు, కన్నది లేదు, ఈ రాముఁడుచేసిన గొప్ప పాపము మమ్ము నిట్లు ముంచినది. ఈ రాజేదియో ఘోరపాపము చేసెను. ఆయన పాపమే నా కొడుకును బిల్లవానిని జంపెను.

క. బాలురమృతి వినఁబడదు నృపాలా! నీరాజ్యమందు • వలె నితరనృపుల్
పాలించెడివిషయంబుల, బాలకునిన్ నీవ యిపుడు•బ్రతికింపవయా! ౧ ౨౭౫

తాత్పర్యము

రాజా! నీరాజ్యమందువలె నితరరాజులు పాలించు దేశమందు బాలురు చచ్చుట వినరాదు. కావున నీవు చంపిన బాలుని నీవే బ్రదికింపుము.

క. బ్రతికింప వేనియును భూపతి! రాజద్వారమందుఁ•బత్నియు నేనున్
మృతిఁ గందు మనాథులవలె. క్షితిసురహత్యాప్తి నీవుఁ•చెలఁగుము సుఖివై.

అర్థములు. అనాథుడు+అనాథ=ఏకశేషముచే అనాథులు.

తాత్పర్యము

రాజా! నీవు నాకొడుకును బ్రతికింపకపోయితివా నేను నాభార్య యిరువురము నీ రాజద్వారమందుఁ బడి యనాథులవలె ప్రాణములు వదలుదుము. బ్రహ్మహత్య కట్టుకొని నీవు సుఖపడుము.

ఉ. దీనన నీవు తమ్ములును • దీర్ఘతరాయువుఁ గాంచి భోగముల్
మానక యుండుఁడీ! మునుపు • మానవనాయక దుఃఖ మెట్టిదో
కానక నీదు నేలబడిఁ • గామితముల్ కొనసాగ నుంటి మి
ప్డీ నెటి దుస్సహార్తి లభి•యించె సుతుండు మృతుండు గావుటన్. ౧ ౨౭౭

ఇట్లు మా కొడుకును మమ్ముఁ జంపి బ్రహ్మహత్య కట్టుకొని నీవు నీ తమ్ములు దీర్ఘకాలము భోగములనుభవించుచు జీవింపుఁడు. రాజా! ఇంతవఱకు నీరాజ్యమందు

దుఃఖమెట్టిదో యెఱుఁగక కోరుకులన్నియు ఫలింపఁగా సుఖముంటిమి. ఇప్పుడీ కొడుకు మరణించుటచే నిట్లు సహింపరాని దుఃఖములకుఁ బాలుబడితిమి.

క. బాలురను జంపు భూమీ, పాలుం డిటు దాపరింపఁ ♦ బ్రజ లీక నైక్ష్వా
కేలామండలి దెస చెడి, వాలాయముఁ జచ్చువారు ♦ పతిపాపములన్. ౧౨౫

అర్థములు. ఐక్ష్వాక+ఇలా+మండలి=ఇక్ష్వాకు వంశమువారు పాలించు భూమండలమందు, దెసచెడి=దిక్కుమాలి, వాలాయమున్=తప్పక, పతిపాపములన్=రాజుచేసిన పాపము వలన.

తాత్పర్యము

పిల్లవాండ్రను జంపు రాజు దాపరించుటచేత నిక్ష్వాకువంశ రాజులు పాలించు దేశమందు దిక్కుచెడి రాజపాపమున లోకులనేక విధములఁ జత్తురు.

క. రాజు లొనర్చిన దోషము, భూజనములఁ బెక్కుగతులఁ ♦ బొలియించుఁ జుమీ
రాజు లసద్వృత్తులుగా, భూజనులు నకాలమృత్యు ♦ వును గంద్రు గదా? ౧౨౬

తాత్పర్యము

రాజులు చేసిన పాపమువలన లోకులు పలువిధములఁ జత్తురు. రాజులు దుర్వృత్తులయిరేని లోకుల కకాలమృత్యువు లభించును గదా.

క. జనపదములఁ బట్టనముల, ననుచితముల భూమినాథుఁ ♦ డణఁపఁడ యేనిన్
జనముల నకాలమరణము, గన నయ్యెడి సందియంబు ♦ గలుగదు దీనన్. ౧౨౭

తాత్పర్యము

గ్రామము లందును బురము లందును జరుగు నన్యాయములను రాజణఁపక పోయెనా లోకుల కకాలమరణము సంభవించును. ఇందు సందేహము లేదు.

క. రామా! నీవే చేసితి, వేమో పాపంబు దాన ♦ నీ బాలుఁడు దా
నేమియు నెఱుగనివాఁ డ, య్యో! మరణముఁ గాంచె ననుచుఁ ♦ నుర్వీశునకున్.

తాత్పర్యము

రామా! నీవేదో పాపము చేసితివి. కావుననే నాబాలుఁడేమియుఁ బుణ్య పాపము లెఱుఁగనివాఁడు నిష్కారణముగఁ జచ్చెను అని చెప్పుచు.

తే. అడ్డముగఁ బోవుచును బాలు ♦ నగపఱుచుచుఁ
గడుపుదుఃఖంబునను గడుఁ ♦ గ్రాఁగుచున్న
నాతనిం గని రాముఁ డ ♦ త్యంతదుఃఖ
తప్తుఁ డై భ్రాతృయుక్తుఁ డై ♦ ధరణిసురుల. ౧౨౮-౯

తా త్ప ర్య ము

(అడ్డముగాఁ బోవుచు బాలునిఁ జూపుచుఁ గడుపు దుఃఖమున మిగులఁ దపించు నాతనిఁ జూచి రామచంద్రుఁ డంతకంటెను మిక్కిలి దుఃఖతప్తుఁడై తమ్ములతోఁ గూడి బ్రాహ్మణులను.

నారదుఁడు శ్రీరామునకు బాలకుండు మృతుండైన కారణము దెలుపుట

ఉ. పౌరుల మంత్రులం బిలువఁ ♦ బంప వసిష్ఠుఁడు వామదేవుఁడున్
ధారిణీదేవతాష్టకము ♦ తప్పక వే యరుదెంచి దీవనల్
గూరిచి భూమిభర్తకును ♦ గొల్వున యోగ్యపుటాసనంబులం
జేర రఘూత్తముండు నతి ♦ చేసి కరంబులు మోడ్చి భక్తిమై. ౧౭౭౩

అర్థములు. ధారిణీ దేవతాష్టకము=ఎనమండ్రు బ్రాహ్మణులు.

తా త్ప ర్య ము

(పౌరులను, మంత్రులను బిలువనంపఁగా వసిష్ఠుడు వామదేవుఁడు మొన మండ్రు బ్రాహ్మణులు వెంటనే వచ్చి రామచంద్రుని నాశీర్వదించి కొల్వులో యోగ్యమగు నాసనములపైఁ గూర్చుండిరి. అంత శ్రీరామచంద్రమూర్తి వారికి భక్తితో నమస్కరించి చేతులు జోడించి.)

సీ. కాత్యాయనాఖ్య మా♦ర్కండేయ మౌద్గల్యుఁ గౌతమ జాబాలి♦కాశ్యపులను
వామదేవాఖ్య దే♦వమునినారదు మంత్రి, పౌరులఁ గనుగొని♦బ్రాహ్మణుండు
వాకిట కడ్డంబు♦పండిన విధమెల్లఁ, బలికి యేటికి నిట్లు♦దెలుపుఁ డనిన
బార్థివవరు దీన♦భాషణమ్ములు విని, మునులసమక్షమంబు♦నను వచించె

ఆ. నారదుండు రాజ! కారణంబు వచింతు, బాలుఁడిట్లు మరణ♦బాధఁ జెంద
నాలకించి దాని♦కర్హప్రతిక్రియ, నాచరింపఁ దలఁపుమాత్మలోన. ౧౭౭౪

అర్థములు. అర్హప్రతిక్రియ=తగిన బదులు కార్యము.

తా త్ప ర్య ము

(కాత్యాయనుఁడు, మార్కండేయుఁడుఁ మౌద్గల్యుఁడు, గౌతముఁడు, జాబాలి, కాశ్యపుఁడు, వామదేవుఁడు, నారదుఁడు, మంత్రులు, పౌరులు, వీరి నందఱను జూచి బ్రాహ్మణుఁడు వాకిటి కడ్డముగాఁ బడియున్న విధమంతయుఁ జెప్పి యిది యిట్లు లగుట కేమి కారణము తెలుపుఁడని యడుగ, రాజుమొక్క దీనపు మాటలను విని మునుల సమక్షమున నారదుఁడు, 'రాజా' బాలుఁడిట్లు మరణించుటకుఁ గారణము తెలిపెదను. దాని విని దానికిఁ దగిన బదులు కార్యము చేయుటకు మీ రాత్మలో విచారింపుఁడు.)

సీ. పూర్వంబు కృతయుగం•బున బ్రాహ్మణులుమాత్ర,
మధిప! తపంబుల • నా చరింత్రు
బ్రహ్మణేతరుఁడు త•పస్వి యెందును లేఁడు, బ్రహ్మభూతం బయి •ప్రజ్వలించి
యజ్ఞానరహితమై•యయ్యుగంబు రహింప, జనులెల్ల దీర్ఘద•దర్శను లమృత్యు
వులు నయి యుండిరి•భూమీశ! పదపడి, త్రేతాయుగంబుదో•ఁతెంచుటయును

తే. మానవాళివపుష్మంత•మైనకతన, క్షత్రియులు తప మొనరింపఁ•గడఁగిమున్న
కంటె వీర్యంబునను దపః•కలన మిన్న, యైరి పూర్వులకును దక్కు•వైరి రామ!

అర్థములు. బ్రాహ్మణేతరుఁడు=బ్రాహ్మణుఁడు కానివాఁడు, తపస్వి=తపసు చేయువాఁడు, ఉపవాసాదులచే దేహము క్లేశపఱచువాఁడు, బ్రహ్మభూతము=బ్రాహ్మణమయము, అజ్ఞానరహితమై=అజ్ఞాన మనునది లేనిదై, దీర్ఘదర్శనులు=దూరపుఁజూపు గలవారు, అమృత్యువులు=మరణము లేనివారు, తోఁతెంచుటయును=రాఁగా, మానవాళి = మనువంశరాజుల గుంపు, వపుష్మంతము=దేహబలము గలది, కడఁగి=ప్రయత్నించి, మున్నుకంటె=మునుపటికంటె.

తాత్పర్యము

ముందు కృతయుగంబున బ్రాహ్మణులు మాత్రమే యుపవాసాది కాయక్లేశ కార్యములు చేయుచుండిరి. అది వారికి స్వధర్మము. ఆ కృతయుగమున బ్రాహ్మణులు తప్ప మఱియెవరు తపస్సు చేసినవారుగారు. వారి వారి స్వధర్మములం దుండి నిత్యనైమిత్తికాది కార్యములు చేయుచుండిరి. అప్పుడు బ్రాహ్మణులను ముఖ్యులుగా నుంచుకొని క్షత్రియులు జ్ఞాన మార్జించు చుండిరి.

ఆ యుగమున నజ్ఞాన మనునది లేదు. జనులందఱు స్వధర్మనిష్ఠులైన కారణమున భూతభవిష్యత్ జ్ఞానము గలవారును, మరణము లేనివారునై యుండిరి. ఈ విధముగఁ గృతయుగము గడచెను. ఆవలఁ ద్రేతాయుగము రాఁగా క్షత్రియులు దేహబలము గలవారగుటచే బ్రాహ్మణులు తపస్సుచేసిన మనమేల చేయరాదని తపస్సుచేయ నారంభించి మునుపటి రాజులకంటె బలమునందుఁ దపమునందు బలవంతులైరి. కాని పరధర్మమైన తపస్సునందుఁ గొంతకాలము పోవుటచే స్వధర్మ నిర్వహణమునందుఁ గొంచెము లోపము గలిగెను. ఆ కారణముచే స్వధర్మనిర్వహణమందుఁ బూర్వ రాజులకంటెఁ దక్కువ వారైరి.

ఉ. త్రేత మహాత్ములౌ వసుమ•తీజనవర్యులకంటె మున్న వా
రాతతవీర్యవంతులుఁ ద•పోధికులున్, సమవీర్యయుక్తులై
త్రేతను క్షత్రియుల్ ద్విజులు • తేజునఁ గ్రాలిరి, వారిలోన వి
ఖ్యాతిగ నెచ్చులొచ్చుల మ•హాత్మ! వచింప నశక్య మయ్యెడిన్. ౧౨౯౬

తా త్ప ర్య ము

త్రేతయందు మహాత్ములైన రాజులకంటెఁ గృతమున స్వధర్మమునఁనుండిన రాజులు విస్తారముగ బలవంతులు, తపమున నధికులయి యుండిరి, ఈయుగమందు బ్రాహ్మణులు క్షత్రియులు తపస్సునందు సమానులైరి ఒక రెక్కువ మఱియొకరు తక్కువయని చెప్పసాధ్యపడదు.

ఉ. అప్పుడు నాల్గు వర్ణముల ♦ కార సుసమ్మత మైన పద్ధతుల్
చెప్పిరి నిల్చి రప్పటివి ♦ శిష్ట లధర్మము పాద మొండు దా
నుప్పతిలెన్ ద్వితీయముగ ♦ ముద్భవమూట ధరిత్రియందు, నా
ముప్పునఁ దేజుఁ గోల్పడిరి ♦ మోహమతుల్ జను లెల్లవారిలన్. ౧-౨౦౭

తా త్ప ర్య ము

కృతయుగమందు బ్రాహ్మణులు తపస్సు చేయుట క్షత్రియుల తపస్సు చేయక ప్రజాపాలనము చేయుటచే నాయిరువురకు భేదము స్పష్టమై యుండెను, త్రేతయందు నిరువురు తపస్సు చేయుటచే భేదము మాసిపోయెను. ప్రజాపాలన కార్యము కొఱఁతబడెను. ఆకారణమున నధర్మము ప్రవేశించెను. జనులం దజ్ఞానము ప్రవేశించెను. అప్పు డప్పటి శిష్టు లట్లుండిన నధర్మము మించిపోవునని తలచి నాలుగు వర్ణముల వారికి నాచారములు వేఱువేఱుగ విభజించిరి.

కృతయుగము వారికంటెఁ ద్రేతాయుగము వారికి నిర్మల జ్ఞానము లేక పోవుటచే బ్రహ్మజ్ఞానమందు నధికారము లేనివారైరి. కావున వారికిఁ దారకముగ వర్ణాశ్రమధర్మము లేర్పడెను. విమలజ్ఞానము లేకపోవుటచే నధర్మము సంక్రమించెను. దీనివలన విమలజ్ఞానము ప్రబలించిన కృతయుగము నందు వర్ణాశ్రమ విభాగము లేదని యేర్పడుచున్నది. 'నిస్త్రైగుణ్యేపథి విహరతాం కోవిధిః' కోనిషేధః' 'అత్యంతభ_క్తియుక్తానాం నచశాస్త్రం నచక్రమః' ఇత్యాది వాక్యము లనుసంధించునది. ఈ కారణముచేతనే 'ధ్యాయన్ కృతే' యని పరాశరుఁడు చెప్పెను.

క. కృతమున బ్రహ్మజ్ఞానం బతివేలం బగుట మహిమ ♦ మతిశయమగుటన్
మతి విమలజ్ఞానైక స, హితమగుటను నన్నృతమూన♦ రెండును లోకుల్. ౧-౨౦౮

అర్థములు. అతి వేలము=అధికము, మతి=మనస్సు, విమలజ్ఞానైక సహితమగుటను=నిర్మలమైన జ్ఞానముతోఁ గూడిన దగుటను, అనృతము = సేద్యము, 'సేవా శ్వవృత్తి రనృతం కృషి రుంఛశిలం త్వృతమ్' అమరము.

తా త్ప ర్య ము

కృతయుగమునందు బ్రహ్మజ్ఞానము పూర్ణమై యుండుటచేతను, ఆకారణమున ప్రభావము అధికమై యాహారవిచారము లేకుండుట చేతను మనస్సెప్పుడు

నిర్మల జ్ఞానముతోఁ గూడియుండుటను లోకు లెవ్వరు సేద్యమునకై పూనినవారు గారు. వారు సత్యసంకల్పు లగుటచే కోరినది కోరినచోట దున్నకయే లభించు చుండెను.

క. కృతయుగజనము లమేధ్యము, గతిఁ జూచెడిఁ రాజసంపుఁ • గర్షకవృత్తిన్
బ్రతుకునకై త్రేతాజన, తతి గైకొనె మహిమ మన స్వ • తంత్రత లేమిన్.

అర్థములు. అమేధ్యముగతిన్=అపవిత్రపదార్థమువలె, రాజసంపు=రజోగుణముతోఁ గూడిన, కర్షకవృత్తిన్=దున్ని జీవించుటను, మనన్=బ్రతుకుటకు.

తాత్పర్యము.

కృతయుగమున బ్రహ్మజ్ఞానము మహిమ విస్తరించి యుండుటచే నెవ్వరును గూటికై దేవురు లాడినవారు లేరు. కావలసిన యాహారము ఫలవృక్షములే యిచ్చుచుండెను. బ్రహ్మవిచారముచే బ్రహ్మతేజస్సు నిండిన వారగుటచే నాహారముతో వారికిఁ బనియు లేకుండెను. కావున వారు దున్ని బ్రతుకుటకు అమేధ్యమువలెఁ జూచుచుండిరి. అది రాజసవృత్తి కావున, అట్టిమహిమచే జీవింపలేని వారగుటచే లోకులు భూమిదున్ని బ్రదుక మొదలు వెట్టిరి.

సీ. అనృతంబుతో ధర్మ•హానియు జనియించె, నద్దాన దీర్ఘాయు•వణఁగఁ దొడఁగె
నాయువు దఱుఁగుట • నడలి శుభంబులు, సత్యధర్మాసక్తిఁ • జలుపుచుండ్రు
త్రేతాయుగంబున•ద్విజులును క్షత్రియుల్, తప మాచరింపఁగఁ•దక్కువారు
పరిచర్య సలుపుచుఁ • బరిఢవిల్లిరి యందు, శూద్రులకెల్ల శు•శ్రూష పరమ

తే. ధర్మమయ్యెను బదపడి • ద్వాపరంబు, దాపరింప ద్వితీయ పా•దం బధర్మ
ముద్భవిల్లెను దాన న•భ్యుదయ మొందె,ననృతమునుబై నధర్మంబు•నవనియందు

అర్థములు. అనృతంబుతోన్=సేద్యంబుతో, ధర్మహాని=ధర్మమునకు కీడు, సేద్యము హింసాత్మకము కావున నది ధర్మహానికిఁ గారణమయ్యెను, అద్దానన్=ధర్మహానివలన, శుభంబులు = పుణ్యకార్యములు, సత్యధర్మాసక్తిన్=సత్యమునందు ధర్మమునందు ఆసక్తిచేత, పరిచర్య=సేవ, పరిఢవిల్లిరి=ఒప్పిరి.

తాత్పర్యము

హింసాత్మకమైన సేద్యముతో ధర్మహానియుఁ బుట్టెను ధర్మము లోపించుటచే నాయువు క్షీణించెను. కావున కృతయుగ పురుషులకంటెఁ త్రేతాయుగ పురుషులు తక్కువ కాలము బ్రదుకు చుండిరి. ఆయువు క్షీణించుటచే భయపడినవారై త్రేతాయుగమువారు సత్యమునందు వర్ణాశ్రమ ధర్మములందు నాసక్తి గలవారై పుణ్యకార్యములు చేయ మొదలు పెట్టిరి. అవి యెట్టి వనిన త్రేతాయుగంబున బ్రాహ్మణులు క్షత్రియులు తపస్సు చేయఁగా తక్కినవారు కృషి చేయసాగిరి.

అందు శూద్రులకు కృషికంటె శుశ్రూష పరమధర్మమయ్యెను. ఆవల ద్వాపరంబు దాపరింపగా నధర్మము రెండవపాదము ప్రవేశించెను. దానిచే సేద్యము అధర్మము ప్రబలించెను. దానివలన త్రేతాయుగ పురుషులకంటె ద్వాపరయుగము వారు అల్పాయుష్కులైరి. మఱియు

క. ఎక్కువ కృషి కష్టముగాఁ, దక్కువఫల మయ్యె నందుఁ♦దప మొనరింపన్
మక్కువ గొందురు వైశ్యులు, తక్కువ మే మెట్టు లనెడి ♦ తాత్పర్యమున్.

తా త్ప ర్య ము

అధర్మఫలముగా నెక్కువకృషి కష్టము చేయఁగాఁ దక్కువ ఫలముకలుగు చుండెను. కష్ట మెక్కువ, ఫలము తక్కువ యయ్యెను. అప్పుడు వైశ్యులు కృషి మాని తక్కిన వారికంటె మేమెట్లు తక్కువయని వారును దపము చేయసాగుదురు

తే. మూఁడు యుగములయం దిట్లు ♦ మూఁడువర్ణ
ములు జనంబులు తపమును ♦ జలుపఁగలుగు
శూద్రుఁ డిమ్మూఁడు యుగముల ♦ శుభ చరిత్ర!
తపముఁ జలుపంగఁ దగఁడు త♦థ్యంబు రామ! ౧౫౯-౨

తా త్ప ర్య ము

ఈ విధముగ మూఁడు యుగములందును దొలిమూఁడు వర్ణములవారు తపము చేయఁగలుగుదురు. ఈమూఁడు యుగములలో శూద్రుఁడు తపముచేయఁ దగిన వాఁడు కానేరఁడు.

చ. కలియుగవేళ శూద్రులు ప్ర ♦ కాశముగాఁ దప ముందువారు, త
త్కలుషపుపు వర్తనంబు నృప! ♦ ద్వాపరమందె ఘటిల్లె నేనియున్
బలుకఁగ నేల ఘోరమని ♦ పార్థివ! నాలవజాతివాఁ డొకం
డిలఁ దపమున్న వాఁ డదియ ♦ యిట్టియకాలపుఁజావుఁ గూర్చెడిన్. ౧౫౯-౩

తా త్ప ర్య ము

కలియుగమందు శూద్రులు బహిరంగముగానే తపస్సు చేయుదురు. అట్టిది ద్వాపరమందే నిషిద్ధమగుచుండఁ ద్రేతయందు జరుగుట పరమ నిషిద్ధము గదా. ఇప్పు డెవ్వఁడో శూద్రుఁడు తపస్సుచేయుచున్నవాఁడు. కావున నీ యకాల మృత్యువు సంభవించెను. 'సర్వే బ్రహ్మ వదిష్యంతి సంప్రాప్తే తు కలౌయుగే-నానుతిష్ఠంతి కౌంతేయ శిశ్నోదర పరాయణాః కలియుగమున నందఱు బ్రహ్మము బ్రహ్మమను వారే కాని శిశ్నోదరపరాయణులై బ్రహ్మనిష్ఠయం దుండరు.

ఉ. బాలిశుఁ డెవ్వఁడో యిటు భ ♦ వద్విషయంబున నుంటఁ జేసి నీ
బాలకుఁ డీల్గె రాష్ట్రమునఁ ♦ బట్టన మం దెవఁ డే నలక్ష్మికిన్
మూలముఁ బాపముం జలుప ♦ మూఢత శిక్ష యొనర్ప లేని భూ
పాలుఁ డధోగతిం బడెడి ♦ వారిజమిత్రకులావతంసమా! ౧౨౧౪

అర్థములు. బాలిశుఁడు=మూఢుఁడు, భవద్విషయంబునన్=నీ రాజ్యమందు, అలక్ష్మికిన్=సంపద నాశ మగుటకు, మూఢతన్=అజ్ఞానముచే.

తాత్పర్యము

ఎవఁడో మూఢుఁడు శూద్రుఁడు నీ రాజ్యమునఁ దపస్సు చేయుచున్నాఁడు కాఁబట్టి యీ బాలుఁడు మరణించెను. రాష్ట్రమునందుఁగాని పట్టనమందుఁగాని సంపద చెడుటకు మూల మగు పాపమును మూఢుఁడై యెవఁడేని చేసెనేనిదానికిఁ దగిన దండము చేయని రాజు రామచంద్రా! అధోలోకముల పాలగును.

క. తపమున నధ్యయనంబున, విపులేశ్వర! సుకృతకర్మ ♦ వితతులలోఁ దా
నెపు డాఱవభాగము గొనుఁ నృపునకు ధర్మమునఁ బ్రజల♦నేలమి తగునే.౧౨౧౫

అర్థములు. విపులా+ఈశ్వర=భూపతీ,అధ్యయనము=వేదములు వల్లించుట, సుకృతకర్మవితతులలో=పుణ్యకార్యముల సమూహములలో.

తాత్పర్యము

ప్రజలు చేయు తపమునందు అధ్యయనమునందు పుణ్యకర్మములందు నాఱవ భాగము పుణ్యము తీసికొని రాజు ప్రజలను ధర్మ పద్ధతి రక్షింపకుండవచ్చునా?

ఉ. కావున నీదురాష్ట్రమునఁ ♦ గావలుఁ డెవ్వఁ డధర్మశీలమున్
భావన చేసెనో నెమకి ♦ భవ్యవిధిం బ్రతి యాచరింపుమీ
భూవరుఁ డెప్డు ధర్మమును ♦ బ్రో పొనరింపగ వృద్ధిఁగూరెడిన్
జీవిత మెల్ల వారికిని ♦ జీవితుఁ డయ్యెడు బాలకుం డనన్. ౧౨౧౬

అర్థములు. కావలుఁడు=దుష్టుఁడు, అధర్మశీలమున్ = ధర్మవిరుద్ధమైన యాచారమును, నెమకి=వెదకి.

తాత్పర్యము

కావున నీ రాజ్యమం దెవ్వఁడో దుష్టుఁడు ధర్మవిరుద్ధమైన ప్రవర్తనము గలవాఁడై యున్నాఁడు. వానిని వెదకి దానికిఁ దగిన ప్రతిక్రియ చేయుము. రాజగు వాఁడు ధర్మమును రక్షించెనా ప్రజలకు నాయువు వృద్ధియగును. బాలుఁడును జీవించును.

—♦ శ్రీరాముఁడు పుష్పకంబుపై నెక్కి శూద్రమునిని వెదకనేగుట ♦—

చ. అమృతముతోడఁ దుల్య మగు ♦ నమ్ముని వాక్యము లాలకించి హ
ర్షమున సుమిత్రపట్టిఁ గని ♦ బ్రాహ్మణు సువ్రతు నూఱడింపు శీ
ఘ్రమునఁ గుమారు దేహమును ♦ గమ్మనినూనెలకాఁగులోన నుం
పుము చెడిపోక యుండఁ దను ♦ వుం దనుసంధులు ప్రీల కుండగన్. ౧౩౯౭

తాత్పర్యము

(అమృతముతో సమానమగు నా నారదముని మాటలను విని సంతసించి, లక్ష్మణుని జూచి, నీవు బ్రాహ్మణుని నూఱడింపుము. శీఘ్రముగ బ్రాహ్మణ బాలకుని దేహము, దేహసంధులు చెడిపోకుండ, దేహమును గమ్మని నూనెకాఁగులలో నుంపుము.)

చ. అని నియమించి పుష్పకము ♦ నాత్మఁ దలంపఁగ నద్ది వచ్చి యే
పని గలదో మహాత్మ యనఁ ♦ బార్థివవర్యుఁడు మౌనికోటికిన్
వినతు లొనర్చి తమ్ములను ♦ నిల్పి పురిన్ శరచాపధారియై
చనియెఁ బ్రతీచిగా నచట ♦ సర్వము రోసి యుదఙ్ముఖంబుగన్. ౧౩౯౮

అర్థములు. ప్రతీచిగాన్=పడమటి దిక్కుగా, ఉదక్+ముఖంబునన్=ఉత్తర ముఖముగా.

తాత్పర్యము

(అని నియమించి పుష్పకమును స్మరించెను. అంతనది వచ్చి మహాత్మా! యేమి పని? యని ప్రార్థింప, రామచంద్రుఁడు మునులకు నమస్కరించి, తమ్ములను పట్టనమందు నిలిపి, తాను విల్లు నమ్ములు పూని పడమటి దిక్కుగాఁబోయి యచట నంతయు వెదకి, యుత్తరముఖముగా,)

చ. అరిగి హిమావనీధరము ♦ నందలి నేలలు చూచి శక్రది
గ్ధరణిని బుష్పకస్థుఁ డయి ♦ క్రన్నన రోసి యఘంబుఁ గానకా
ధరణివిభుండు దక్షిణపుఁ ♦ దావులు చూడగ శైవలంబు నాఁ
బరఁగు మలన్ సరోవరము ♦ ప్రాంతమునందు నధశ్శిరస్కుఁడై. ౧౩౯౯

అర్థములు. హిమావనీధరము=హిమవత్పర్వతము, శక్రదిక్+ధరణి=తూర్పుప్రదేశమందు, అఘంబు=పాపము, శైవలము=శైవల మను పేరుగల, మలన్=పర్వతమందు, అధశ్శిరస్కుఁడై=తలక్రిందుగా నుంచినవాఁడై.

తాత్పర్యము

పోయి హిమవత్పర్వతమందలి భూములు వెదకి యావల తూర్పుదిక్కునేలలు చూచి యందెందును బాపము గనలేక దక్షిణదిక్కున వెనుకఁగా శైవలమను పర్వతమందు కొలది సమీపమున తలక్రిందుగా.

క. వ్రేలుచు నుత్తమతపమున్, వాలాయముఁ జలుపు నొకనిఁ ♦ బరికించి ధరా
పాలుఁడు చేరం జని యో, శీలీ! ధన్యుండ వీవు ♦ చెపు మెవ్వఁడవో? ౧౩౦౦

తా త్ప ర్య ము

(వ్రేలుచు నుత్తమమగు తపస్సు చేయుచున్న నొకనిఁ జూచి, రామచంద్ర మూర్తి సమీపమునకుఁ బోయి, యో మంచి నడత గలవాఁడా! నీవు ధన్యుఁడవు. నీ వెవ్వఁడవు? చెప్పుము.)

క. జాతి యెది నీకు సువ్రత! కౌతూహలమునను బ్రశ్నఁ ♦ గావించెద ధా
త్రీతలనాథుఁడ దశరథ, సూతిని రాముఁడను నన్నుఁ ♦ జూడు తపస్వీ! ౧౩౦౧

అర్థములు. సువ్రత=మంచివ్రతము గలవాఁడా, కౌతూహలమునను=తెలియ నాశ గలిగి.

తా త్ప ర్య ము

తపస్వీ! నేను నీభూమికి నధిపతిని. దశరథరాజు కుమారుఁడను, రాముఁడని నాపేరు. నేను దెలియఁ గోరి నిన్నుఁ బ్రశ్నించుచున్నాను. నీ వేజాతివాఁడవు? జన్మముచే వచ్చినదానికి జాతియని పేరు, వర్ణములు పుట్టువుచేత వచ్చినవి.

ఉ. ఏమి ప్రయోజనంబు మది ♦ నెంచితి వీవు? దివంబుఁ బొందఁగా
నో? మఱి యొండొ? యింతటిమ♦హోగ్రతపం బొనరింప నేలొకో?
భూమిసురుండవో? నృపతి ♦ వో? మఱి వైశ్యుడవో? జఘన్యజుం
డో? మహితాత్మ! నిక్కముగ ♦ నున్నది యున్నటులే వచింపుమీ. ౧౩౦౨

తా త్ప ర్య ము

ఏమి ప్రయోజనము సాధింపగోరి యిట్లు తపస్సుచేయుచున్నావు? స్వర్గమునకుఁ బోవలయు ననియా? లేక మఱియేదైనఁ గోరికగలదా? ఇంత తీవ్రమైనతపస్సేల చేయుచున్నావు? నీవు బ్రాహ్మణుఁడవా? క్షత్రియుడవా? వైశ్యుఁడవా? శూద్రుఁడవా? గొప్ప మనస్సు గలవాఁడా! ఉన్నదున్నట్టు చెప్పుము:

—♦ శ్రీరాముఁడు శంబుకుని వధించుట ♦—

సీ. అనవుడు నాతండు ♦ నవనతవదనుడై, రామచంద్రున కను ♦ రామచంద్ర!
శూద్రయోనిని నే బ్ర♦సూతిఁ గాంచితి నయ్య, శంబుకుండను పేరఁ♦జనెడివాఁడ
దేహంబుతోడనే♦దేవత్వ మొందెడి, వాంఛను దపమున ♦ వఱలువాఁడ
స్వర్గలోకజిగీష♦వర్తిల్లువాఁడను, గల్లలాడెడివాఁడ ♦ గాను దేవ!

తే. శూద్రుఁడను నేను శ్రీరామ ♦ భద్ర! తపము
సలుపుచున్నాఁడ నన రామ ♦ చంద్రు డపుడ
ఖడ్గ మొరఁ దూసి యాతని ♦ కంఠతలముఁ
దెగఁగ నరకెను దేవతల్ ♦ పొగడుచుండ. ౧౩౦౩

అర్థములు. అవనత వదనుఁడై=తలవంచుకొన్నవాఁడై, స్వర్గలోక జిగీష= స్వర్గలోకమును జయించుకోరికచే.

తా త్ప ర్య ము

ఇట్లడుగఁగా నతఁడు తలవంచుకొని రామచంద్రమూర్తితో నిట్లనియె. రాజోత్తమా! నేను శూద్రజాతి స్త్రీగర్భమునఁ బుట్టిన వాఁడను. శూద్రుఁడను. నాపేరు శంబుకుఁడు. ఈ దేహముతోనే స్వర్గమునకుఁ బోవఁగోరి తపస్సు చేయుచున్నాను. స్వర్గలోకము జయించుటయే నాకోరిక. నేను కల్లలాడెడివాఁడఁగాను. తపము చేయుచున్నాను. అని చెప్పఁగా రామచంద్రమూర్తి యొఱనుండి కత్తి దూసి దేవతలు పొగడుచుండ వాని తల నఱకెను.

ఉ. కమ్మని పూలవాన రఘు ♦ కాంతునిపైఁ గురియంగ దిగ్వితా
నమ్ముల మందమారుతుఁడు♦నవ్యసుగంధవహుండు వీచె మూ
దమ్మున నగ్నియుక్త విబు♦ధవ్రజముల్ దివిజేంద్రుఁ గూడి య
భ్రమ్మున నిల్చి యిట్లనియె ♦ రామవిభుం గరుణాపరాయణున్. ౧౩౧౪

అర్థములు. కరుణాపరాయణున్=పరిపూర్ణదయగలవానిని, నిర్నిమిత్తముగ శంబుకుని జంపిన రామచంద్రుఁడు కరుణాపరాయణుఁ డెట్లయ్యెను. శ్రీరామ చంద్రమూర్తిచేఁ జచ్చుటను మరణకాలమున భగవద్దర్శన ప్రాప్తివలన శ్రీరామ చంద్రమూర్తి సంకల్పముచేతను వానికి మోక్షము లభించెను. స్వర్గము కోరిన వానికి మోక్ష మిచ్చుట కరుణచేత నేకదా! శాస్త్రవిరుద్ధకార్యము చేయుటచే దండింప వలసి దండించెను గాని యతనిపై ద్వేషబుద్ధిచేఁ గాదు. కావుననే యత నికి నతఁడు కోరినదానికంటె నుత్తమఫల మిచ్చెను. ఈ విషయము భవభూతి యుత్తర రామచరిత్రమం దిట్లు స్పష్టముగా వ్రాసెను ద్వితీయాంకము – ౧౧ వ శ్లోకము.

శ్లో॥ దత్తాభయే త్వయి యమాదపి దండధారే
సంజీవితః శిశు రసౌ మమ చేయమృద్ధిః
శంబూక ఏష శిరసా చరణే నతస్తే
సత్సంగజాని నిధనాన్యపి తారయంతి.

రామ॥ ద్వయ మపి ప్రియః నః, తదనుభూయతా ముగ్రస్య తపసః ఫలమ్.
యత్రానందాశ్చ మోదాశ్చ-యత్ర పుణ్యాశ్చ సంపదః
వైరాజ నామ తే లోకా స్తైజసాః సంతు తే శివాః ॥

శంబూకః॥ యుష్మత్ప్రసాదాదైవ మహిమా కిమత్ర తపసా?
అథవా మహదుపకృతం తపసా॥

తాత్పర్యము.

మంచి వాసనగల పూవుల వాన రామచంద్రునిపై గురిసెను. దిక్కుల యందు క్రొత్తయైన పరిమళ యుక్తమైన వాయువు మెల్లగా వీచెను, ఆకాశము నందు నగ్ని మొదలగు దేవత లింద్రునితోడ నిల్చి పరిపూర్ణ దయాశాలి యగు రామచంద్రునితో నిట్లనిరి.

క. సురకార్యముఁ దీర్చితి భూ, వరచంద్రా! లెస్సనీకు♦వర మొసఁగంగా
నరుదెంచితి మీ శూద్రుఁడు, సురపురికిం జనఁడు నీవు♦సూదితుఁ జేయన్.

అర్థములు. సురకార్యముఁ దీర్చితి=దేవకార్యము నెఱవేర్చితివి. శాస్త్రవిహితకర్మములు స్వధర్మమందుండి చేయువానికి స్వర్గప్రాప్తి. శంబుకుఁడు స్వధర్మము విడిచి పరధర్మ మనుష్ఠించి చేయరానిపని చేసెను అందు వాఁడు దేహముతోనే స్వర్గము పోఁదలఁచెను. అది సరిగాదు. సురపురికిన్ జనఁడు=స్వర్గమునకుఁ బోవు వాఁడు కాఁడు. నీవు చంపిన కారణముచే స్వర్గమునకంటె నుత్తమలోకములకుఁ బోవునే కాని స్వర్గమునకుఁ బోడు. మోక్షఫలమున కెవ్వఁడైన నధికారియే, స్వర్గమున కట్టులు గాదు. సూదితుఁ జేయన్=చంపుటచే.

తాత్పర్యము

(రాజా! నీవు దేవకార్యము నెఱవేర్చితివి, మేలు. మేలు. నీకు వరమిచ్చుటకు వచ్చితిమి. నీచేతఁ జంపబడుటచే నీ శూద్రుఁడు స్వర్గమునకుఁ బోఁడు.)

చ. అనుసురనాథు ప్రెుక్కి వసు♦ధాధిపుఁ డిట్లను నాయెడన్ సురల్
మనమున సంతసించిన♦మత్కలుషాహతు విప్రబాలకున్
మనఁగ నొనర్పుఁడీ మరల♦మాట యొసంగితి నీతనూభవున్
మనుగడ గూర్తు నంచు సభ♦మధ్యమునందు ద్విజాతి నేతకున్. ౧౩౦౬

అర్థములు. మత్కలుషాహతున్=నాదోషముచేఁ జచ్చిన వానిని, మనఁగన్=బ్రతుకఁగా, మనుగడ=జీవితము, ద్విజాతినేతకున్=బ్రాహ్మణశ్రేష్ఠునకు.

తాత్పర్యము

ఈ ప్రకారము చెప్ప నింద్రునకు నమస్కరించి రామచంద్రమూర్తి యిట్లనియె. దేవతలారా! నావిషయమున మీరు సంతోషపడితి రేని నాదోషముచే మరణించిన బ్రాహ్మణ కుమారుని బ్రతికింపుఁడు. ఏలన బ్రాహ్మణునకు నీ కుమారు బ్రదికించెదనని మాట చెప్పితిని.

క. నాపుడి యసత్యదోషముఁ, గానక యుండఁగను జలుపఁ♦గాఁ దగు ననినన్
మానుము నాతి ద్విజబాలుఁడు, ప్రాణంబులఁ గాంచి మరల♦బంధులఁ గలసెన్

(నామాట పొల్లువోకుండఁజేయఁదగు నని యడుగఁగా నీవు విచారము మానుము. బ్రాహ్మణ బాలకుఁడు బ్రదికి బంధువులతోఁ జేరెను.)

క. ఏ నిమిషంబున శూద్రుని, నీనిశితతరాసిధార ♦ నీల్గించితివో
యానిమసంబున బాలుఁడు, ప్రాణంబులఁ గాంచి సుఖిత♦వఱలెడుజుమ్మీ. ౧౩౦౮

అర్థములు. నిశితతర=మిగుల పదునైన. అసిధార=కత్తివాదరచే, నీల్గించితివో=చంపితివో.

తాత్పర్యము

(ఏ నిమిషమున శూద్రుని పదునగు కత్తితోఁ జంపితివో, యానిమసమునన బాలుఁడు ప్రాణవంతుఁడై సుఖముగా నుండెను సుమా.)

—♦ శ్రీరాముఁ డగస్త్యుఁ జూడఁ బోవుట ♦—

సీ. అదిపోవ నిమ్ము మే ♦ మరిగెద మిప్పుడు, కలశీతనూభవుఁ ♦ గాంచుతమిని
బదిరెండు వర్షముల్ ♦ పన్నుండె జలముల, దీక్షయు ముగిసె నా♦దేవనిభుని
నభినందితునిఁ జేయ ♦ నర్హాంబువచ్చె దే, మాతోఁ దదాశ్రమ♦మహికి నతని
దర్శింపుమీ నీకుఁ ♦ దవులు శుభంబులు, మానిచేతోబ్జబం♦భర యనంగ

ఆ. నగుత మంచుఁ బుష్ప♦కారూఢుఁడై వ్యోమ, యానగతము దేవ♦తాళితోడ
మునితపోవనంబుఁ ♦ గన నాతఁడును, వారి నర్చ ముదము గూర్చె♦నర్హాభంగి

అర్థములు. కలశీతనూభవున్=అగస్త్యుని, పన్నుండెన్=శయనించెను, అభినందితుని=సంతోషపడినవానిని, మానిచేతోబ్జబంభర=మునుల హృదయకమలములకుఁ దుమ్మెదవంటివాఁడా,వ్యోమయానగతము = ఆకాశమునఁ బోవునది, అర్చన్=పూజచే.

తాత్పర్యము

ఆ ముచ్చట పోవ నిమ్ము అగస్త్యుఁడు పండ్రెండు సంవత్సరములునీళ్ళలోఁ బండుకొని యుండి లేచినాఁడు. ఆయనను జూచి సంతోషపెట్ట మేము పోవుచున్నాము. ఆ యాశ్రమభూమికి నీవు వచ్చెదవా? ఆయనను దర్శింపుము. నీకు మేలగును. అనినట్ల కానిమ్మని దేవత లాకాశమార్గమున రాఁగాఁ దాను పుష్పకమెక్కి ముని తపోవనమునకుఁ బోఁగా నాయన వారికి బూజించి సంతోషింపఁ జేసెను.

ఉ. అంతట దేవతల్ చనిరి ♦ నాకముఁ జేరఁగ, రామధారిణీ
కాంతుఁడు పుష్పకంబు డిగి ♦ కంజభవాభు మునీంద్రు మ్రొక్కినన్
స్వాంతము పొంగ మానియును ♦ స్వాగతమున్ వచియించి భూమిపా!
యెంతయు మోద మయ్యె దయ ♦ నీ విటు రాఁ బరమాదరంబునన్. ౧౩౧౦

అర్థములు. నాకము=స్వర్గము, కంజభవాభున్=బ్రహ్మతో సమానుని, స్వాంతము=మనస్సు.

తాత్పర్యము

(అంతట దేవతలు స్వర్గమునకుఁ బోయిరి శ్రీరామచంద్ర ప్రభువు పుష్పక విమానమునుండి దిగి బ్రహ్మతో సమానుఁడగు నగస్త్యమహామునికి నమస్కరింపఁగా నా మునిచంద్రుఁడు మనస్సులోఁ బొంగి, స్వాగతమిచ్చి రాజా! పరమాదరమున దయకలిగి యిచ్చటకు విచ్చేయుటచే నెంతో సంతోషమైనది.)

సీ. నాకుఁ బూజ్యుండ వ•నంత కల్యాణగు, ణాఢ్యుడవును గొప్పఁయతిథి వీవు
నామానసమున న•నారతంబును రామ, నిల్చియున్నాఁడవు • నీవు దేవ
వింటి నిర్జరులచే • విప్రబాలునకయి, శూద్రమౌనిని నీవు•స్రుక్కఁజేత
యీరేయి నిలుమిందు•నెల్లి వేకువఁ బుష్పకంబునఁ జనెదు పు•రంబునకును

తే. నాదిలక్ష్మీశుఁ డైననా•రాయణుఁడవు, నిలుచు నీయందు సర్వంబు•నీవ ప్రభువు
భూతములకెల్ల నీవె స•నాతనంపుఁ బురుషుఁడవు రామభూపాల! • పుణ్యశీల!

అర్థములు. పూజ్యుండవు=పూజింప యోగ్యుఁడవు, అనంత=అంతములేని, కల్యాణ గుణాఢ్యుఁడవు=మంచిగుణ సంపత్తిగలవాఁడవు, అనారతంబును=ఎల్లవేళలఁ నిర్జరులచే=దేవతలచే.

తాత్పర్యము

నే నితరులకుఁ బూజ్యుఁడను. నాకు నీవు పూజ్యుఁడవు అనంతములైన కల్యాణ గుణములు విస్తారముగఁ గలవాఁడవు, గొప్పయతిథివి. ఎల్లప్పుడు నా మనస్సునందుండువాఁడవు. దేవా! బ్రాహ్మణ కుమారునకై నీవు శూద్రమునిని జంపిన వార్త దేవతలు చెప్పఁగా వింటిని. ఈ రాత్రి యిందు నిలిచి యుదయము కాఁగానే పుష్పకము మీఁద నీ పట్టనమునకుఁ బోవచ్చును. నీ వాదిలక్ష్మికి భర్తయగు నారాయణుండవు. సర్వము నీయందున్నది. సమస్తభూతములకు నీవే ప్రభువు నీవు సనాతన పురుషుఁడవు, పుణ్యస్వభావుఁడవు.

—• అగస్త్యుఁడు శ్రీరామునకు దివ్యాభరణ మొసఁగఁబోవుట •—

సీ. ఈభూషణోత్తమం • బీవు గ్రహింపుము, దివ్యంబు నిజదివ్య•తేజమునను
దివ్యదేహంబున • దీప్యమానం బిది, నీవు గైకొన నాకు • నెమ్మిమీఱు
విశ్వకర్మకృతంబు•వే ఱెవ్వరును దీని, దాల్ప శక్తులుగారు•ధరణియందు
శక్రసమన్విత•సర్వసుపర్వాల, నీవ సంరక్షింప • నేర్తువట్లు

ఆ. గాన నొసఁగువాఁడఁ • గాకుత్స్థ! నీ కిది, శాస్త్రవిహితరీతి•సమ్మతింపు
తనకు దత్తమైన•దాని నుత్తమపదార్థంబు దాన మొసఁగఁ • దతఫలంబు,

అర్థములు. భూషణోత్తమంబు=శ్రేష్ఠమైన యాభరణము, దివ్యంబు=దేవసంబంధమైనది, దీప్యమానము=ప్రకాశించునది, నెమ్మి=సంతోషము, విశ్వకర్మకృతంబు=విశ్వకర్మచేఁ జేయబడినది, శక్రసమన్విత=ఇంద్రునితోఁ గూడిన, సర్వసుపర్వులన్=దేవతల నందఱను.

తా త్ప ర్య ము

ఇది మేలైన యాభరణము. దివ్యము తన దివ్యతేజముచే దివ్యస్వరూపమునఁ బ్రకాశించునది విశ్వకర్మచేఁ జేయఁబడినది. నీవు గ్రహింపుము. నీవు తీసికొనుట నాకు మిక్కిలి సంతోషకరము. దీనిని నీవు తప్ప మఱియెవ్వారు ధరియింప శక్తులుగారు, నీ వింద్రాది దేవతల సంరక్షింపఁగలవాఁడవు. కావున నీకు శాస్త్రపద్ధతి ననుసరించి యిచ్చెదను, సమ్మతింపుము. తన కితరులిచ్చిన యుత్తమవస్తువును దాన మిచ్చిన యెడల విస్తారఫలము గలదు.

క. అనవుడు క్షత్రియధర్మం,బును లోన స్మరించి రామ•భూవరుఁ డనియెన్
మునినాథ! బ్రాహ్మణున కీ విని గొనఁదగు క్షత్రియునకు•విహితం బగునే.

అర్థములు. క్షత్రియధర్మము=క్షత్రియుఁడు దానముపట్టరాదను ధర్మము, ఈవి=దానము.

తా త్ప ర్య ము

(అని చెప్పఁగా, రామచంద్రమూర్తి క్షత్రియ ధర్మమును స్మరించి, మునినాథా! దానము బ్రాహ్మణుఁడు పట్టవచ్చునుగాని క్షత్రియునకుఁ దగునా? యనెను.)

క. భూమీపతి నే నయ్యును. భూమీసురుచేత దాన•మును గొనఁ దగునే?
యేమి సమాధానం బన, రామునితో నిట్లు మౌని•రాజు వచించెన్. ౧౩౧౨

తా త్ప ర్య ము

(నేను భూమికి రాజునై యుండియును బ్రాహ్మణుని వలన దానము గ్రహింప వచ్చునా? ఏమనెదరు? అని యడుగ, రామునితో నగస్త్యుఁ డిట్లు చెప్పెను.)

దివ్యాభరణముఁ గొనవచ్చు నని యగస్త్యుఁడు శ్రీరాము సమాధాన పరచుట

సీ. కృతయుగంబునఁ దొల్లి•క్షితిపతి లేకయే, జనములు గాలఁగఁ బాక•శాసనుండు
సురలకు రాజయి • శోభిల్లుచుండగ, నమరులపోలికఁ•దమకు నొక్క
రా జుండఁ దగు నని • బ్రహ్మకుఁ దప ముంచి, దేవతలకుఁబోలె•దేవ మాకు
రాజు నొసంగుము•రక్షణార్థంబుగాఁ బ్రజలు పాపంబుల•పాలఁ బడక

తే. యుండువా రనఁ దామర•సోద్భవుండు, లోకపాలురతోడ మీ•లో నొకొక్క
యంశ మొసఁగుఁడు దాన ధ•రాధినాథు సృష్టిచేసెద నన వారు • నిచ్చిరట్లు

అర్థములు. తామరసోద్భవుఁడు=బ్రహ్మ.

తాత్పర్యము

(కృతయుగము నందుఁ బ్రథమమున రాజులేకయే ప్రజలుండిరి. ఇంద్రుఁడు దేవతలకు రాజుగా నుండి శోభిల్లుచుండుటఁ జూచి జనులు, దేవతలకువలెఁ దమకును రాజుండఁదగు నని బ్రహ్మనుగూర్చి తపముచేసి దేవా! దేవతల కిచ్చినట్లు మాకు రక్షణకొఱకు రాజునొసఁగుము. ఆ కారణమునఁ బ్రజలు పాపములొనరింప కుందురని వేఁడ, బ్రహ్మ లోకపాలురను జూచి మీలో నొక్కొక్క యంశము నొసఁగుఁడు: భూపతిని సృష్టిచేసెద నన వారట్లే యిచ్చిరి.)

చ. క్షుప మొనరింపఁ దామరస♦సూతి జనించె క్షుపుం డనంగ నొ
క్క పురుషుఁ డాతనిన్ నలువ ♦ క్ష్మాపతిఁ జేసి మహేంద్రువంశమున్
విపులఁ దదాజ్ఞ చెల్లఁగను ♦ నీరపునంశము మేము ప్రోవఁగా
విపులధనం బొసంగఁగఁ గు♦బేరుని యంశము, లోకశాస్తికిన్. ౧౩౧౬

అర్థములు. క్షుపము=తుమ్మ, తామరసూతి=బ్రహ్మ, నలువ=బ్రహ్మ, నీరపునంశము=వరుణాంశము, లోకశాస్తికిన్=లోకము దండించుటకు.

తాత్పర్యము

బ్రహ్మ తుమ్మఁగా క్షుపుఁడను పురుషుఁ డొకఁడు జనించెను. అతనిని బ్రహ్మ రాజు చేసి యింద్రుని యంశమున భూమియందు వానియాజ్ఞ చెల్లునట్లును వరుణుని యంశమున దేహరక్షణము చేయునట్లును కుబేరుని యంశమున విస్తారధన మిచ్చునట్లును లోకులను దండించుటకై.

క. దండధరునంశ మొసఁగెను, దండితఖలసంఘ! నన్నుఁ ♦ దరియింపింపన్
మండన మిది గైకొను మా,ఖండలు భాగమున లేదు♦కల్మష మనఘా! ౧౩౧౭

అర్థములు. దండధరునంశము = యమునియంశమును, దండితఖలసంఘ= దుష్టసమూహమును దండించినవాఁడా, తరియింపింపన్=తరియించునట్లు చేయుటకుఁ గాను, మండనము=ఆభరణము, అఖండలు భాగమునన్=ఇంద్రాంశమున, కల్మషము=పాపము.

తాత్పర్యము

(యముని యంశమునిచ్చెను. దుష్టసంహారకా! నన్నుఁ దరింపఁ జేయుటకీయాభరణము నింద్రాంశమునఁ దీసికొనుము. దీనివలన నీకుఁ బాపము లేదు.)

తే. పరమధార్మికుఁ డగు మహా♦భావువాక్య,మునను దానిని గైకొని♦మునినిగాంచి
యద్భుతం బగునిట్టి ది♦వ్యాభరణము, భద్రచారిత్ర! మీకెట్లు♦ప్రాప్తమయ్యె.

తాత్పర్యము

(పరమ ధర్మాత్ముఁడగు మహానుభావుని మాటలనుబట్టి దానిని గ్రహించి, మునిని జూచి యద్భుతమైన నీ దివ్యాభరణము మీకెట్లు లభించినది?)

ఈ యాభరణము క్షత్రియభావమున గ్రహింపఁ బడలేదు. అగస్త్యుఁడు కోరిన ట్లాయనను దరింపఁజేయ గ్రహింపఁబడెను.

దీనివలన నాత్మార్థముగఁగాక పరులఁ దరింపజేయ 'అచ్యుతః ప్రీయతా' మ్మని గ్రహించిన పరిగ్రహదోషము లేదని సూచితము.

క. అచ్చెరువుల గనులగు మీ,రచ్చరితముఁ జెప్పుఁడనిన ♦ నమ్ముని యనియెన్
సచ్చరితా! నాకడ కది, వచ్చినవిధ మెల్ల సొరిది ♦ వాక్రుత్తు వినన్. ౧౬౭౫

అర్థములు. అచ్చెరువుల గనులు = ఆశ్చర్యములకు స్థానములు, సొరిది= క్రమముగ.

తా త్ప ర్య ము

(ఆశ్చర్యస్థానములగు మీరు నాకా కథఁ జెప్పుఁడని యడుగ, నా ముని సచ్చరిత్రా! నాయొద్ద కాయాభరణము వచ్చిన విధమంతయుఁ గ్రమముగఁ దెలి పెద వినుమని చెప్పెను.)

—♦ శ్వేతోపాఖ్యానము —

సీ. మున్ను త్రేతాయుగ ♦ మున యోజనశతంబు, మృగపక్షివర్జిత♦మగుచునొక్క-
నిర్జనాటవి యుండఁ ♦ నే నందు నిలువఁగఁ, దలఁచి, యేగితి నది ♦ ఫలవితాన
మూలసుమాదుల ♦ మోహన మై యుండె, నా కాననడుమఁ ద♦టాక మొండు
చక్రవాకములచేఁ జక్రాంగములచేతఁ, గారండవములచేఁ ♦ గ్రమ మగుచు

తే. బూర్ణముగఁ బద్మకైరవా♦కీర్ణమగుచు, శైవలాన్విత మయి మహా♦శ్చర్యకరము
సౌఖ్యకర మయి యుండెఁ ద♦త్సవిధభూమి, జనవివర్జితమైన యా♦శ్రమ మొకండు

అర్థములు. మృగపక్షివర్జితము=మృగములచేత, పక్షులచేత విడువఁబడి నది-పక్షులు మృగములు లేనిది. నిర్జనాటవి=మనుష్యులులేని యడవి, ఫలవితాన= పండ్లసమూహముచే, మూలసుమాదులన్=వేళ్ళు, పూలు మొదలగు వానిచే, మోహనమై=రమ్యమై, కాననడుమన్=అడవినడుమ, చక్రాంగములు=హంసలు, కారండవములు=కన్నెలేళ్ళు, క్రమము=మనోహరము. పద్మకైరవాకీర్ణము= కమలములచే కలువలచే వ్యాపించినది, శైవలాన్వితము=పాఁచితోఁ గూడినది, తత్సవిధభూమి=దానిసమీపప్రదేశము, జనవివర్జితము=మనుష్యులులేనిది.

తా త్ప ర్య ము

పూర్వము త్రేతాయుగమునందు మృగములు పక్షులు జనములు లేనినూఱా మడ యడవియుండగాఁ నే నందు నిలువఁదలఁచి పోయితిని, పండ్లు మూలములు పూలు దండిగ మనోహరమై యుండెను. ఆ యడవినడుమఁ దటాక మొకటిగలదు.

అది చక్రవాకములచేఁ హంసలచే, కన్నెలేళ్ళచే మనోహరమై కలువలచేఁదామరలచే నిండి వ్యాపించి నాఁచుగలదై మహాశ్చర్యకరమై సౌఖ్యకరమై యుండెను. దాని సమీపమున జనులు లేని యాశ్రమ మొకటి గలదు.

ఉ. చూచితిఁ దన్నిదాఘనిశ ♦ సుప్తుఁడనై యట వేగఁ గొల్నికై
వేచని యాజలంబు పయిఁ ♦బీనుగ నొందు సుపుష్టమున్ వయ
శ్శ్రీచతురంబు గాంచితి న ♦ జీర్ణముఁ బంక్తివిభేదబుద్ధిచే
బ్రోచినదాని దానిగని ♦ బుద్ధిని నేమియుఁ దోప కయ్యెడన్. ౧౩_౨౧

అర్థములు. నిదాఘనిశ=వేసవిరాత్రి, సుప్తుఁడనై =నిద్రించినవాఁడనై, వేగన్=ఉదయముకాఁగా, సుపుష్టమున్ = మిగుల బలిసినదానిని, వయశ్శ్రీ=వయస్సు సంపదచే, చతురంబు=మనోహరమైనది, అజీర్ణము = శిథిలముగానిది, పంక్తి విభేదబుద్ధిచేతన్=పంక్తిపక్షపాతముచే, ప్రోచినదానిన్ = రక్షింపఁబడిన దానిని.

తాత్పర్యము

దానిని జూచి యా వేసంగిరాత్రి యచట నిద్రపోయి యుదయమున లేచి కొలని యొద్దకుఁ బోయి యానీళ్ళమీఁద బలిసి వయస్సుతోఁగూడిన చివికిపోని యొక పీనుఁగును పంక్తిపక్షపాతముచే రక్షింపఁబడిన దానిని జూచితిని, నాకేమియుఁ దోఁచినదిగాదు.

క. ఎవ్వారి దీ తను వని నే, నివ్విధిఁ దలపోయుచుండ ♦ నీలో వేల్పుం
గ్రొవ్విరిఁ బోఁడులు గొలువఁగ, మవ్వం బగుమేనివాఁడు ♦ మణిభూషలతోన్.

అర్థములు. ఈ తనువు=ఈ శరీరము, వేల్పుం గ్రొవ్విరి బోఁడులు=దేవతాస్త్రీలు, మవ్వంబగు మేనివాఁడు=అందమైన దేహము గలవాఁడు.

తాత్పర్యము

(ఈ శరీర మెవ్వరిదాయని నే నీ విధముగా నాలోచించుచుండఁగా నీలోపల దేవతాస్త్రీలు సేవింప నందమగు శరీరము గలిగి మణి భూషణములతో,)

ఉ. రాజిలువాఁ డొకండు సుర ♦ రాజసమానుఁడు దేవకామినీ
రాజులు వీవఁ జామరలు ♦ రమ్యవిమానమునందుఁ గంటి నీ
రేజదళాక్షు హాటకగి ♦ రిన్ డిగు సూర్యుని బోలి స్వీయ మా
తేజము ముంప దిక్కులను ♦ డిగ్గి విమానముఁ గొల్నియొద్దనన్. ౧౩_౨౩

అర్థములు. సురరాజసమానుఁడు=ఇంద్రునితో సమానుఁడు దేవకామినీ రాజులు=దేవతాస్త్రీ సమూహములు, నీరేజదళాక్షు=కమల దళములవంటికన్నులు గలవానిని, హాటకగిరిన్=మేరుపర్వతమును.

తాత్పర్యము

బంగారు మణుల సొమ్ములతోఁ బ్రకాశించువాఁడు కమలములవంటి కన్నులు గలవాఁడు ఇంద్రునితో సమానుఁ డొకఁడు దేవతాస్త్రీలు చామరలు వేయఁగా విమానమునందుఁ జూచితిని, మేరుపర్వతము దిగు సూర్యునివలె తేజస్సు దిక్కులు నిండఁగా విమానము దిగి కొలనియొద్దను.

చ. బలిసినపీనుఁగుం దినియె ♦ వాచినయట్టులు పొట్టనిండ న
వ్వల సరసీజలంబులను ♦ స్వర్గనివాసకుఁ డాచమించి పోఁ
దలపున వ్యోమయానమును ♦ దాసిన తాతనిఁ గాంచి యంటి స్వ
ర్నిలయుఁడ! చెప్పు మెవ్వఁడవు ♦ నీ కిటు లేవపుఁదిండి యేటికిన్. ౧౩-౨౮

అర్థములు. సరసీజలంబులు = కొలనినీళ్ళు, స్వర్గ నివాసకుఁడు=స్వర్గము నందుండువాఁడు, పోన్=పోవునట్టి, స్వర్ నిలయుఁడ = స్వర్గమందుండు వాఁడ, ఏవపుఁదిండి=రోఁతతిండి.

తాత్పర్యము

ఆ నీళ్ళలోని బలిసిన పీనుఁగును వాఁచినట్లు కడుపునిండఁ దిని కొలని నీళ్ళు త్రావి వాఁడు పోవుటకై విమానమును సమీపింపఁగా నేను వాని యొద్దకుఁ బోయి యోయి స్వర్గవాసీ! నీ వెవ్వఁడవు? ఈ రోఁత తిండి యేల తినెదవు?

ఉ. ఏటికిఁ బీనుగుఁ దినెద ♦ వియ్యది యర్హమె చెప్పవయ్య! స్వ
ర్వాటి వసించువారలకు ♦ భావ్యము గాదని తోఁచె నన్న నా
మాటల నాలకించి సుర ♦ మండలవర్తి నమస్కరించి యి
ప్పాట వచించె మౌనివర ♦ పల్కెద విన్ము మదీయవృత్తమున్. ౧౩-౨౯

అర్థములు. స్వర్వాటిన్=స్వర్గభూమియందు, సురమండలవర్తి=దేవతల సమూహములో నుండు వాఁడు, ఇప్పాట=ఈవిధముగ మదీయ వృత్తమున్= నా చరిత్రమును.

తాత్పర్యము

(ఏటికిఁ బీనుగును దినెదవు? ఇది తగునా? చెప్పుము. స్వర్గమందుండువారికి భావ్యము కాదని తోఁచె నని చెప్పఁగా నా మాటలను దేవతల సమూహమున నుండు నతఁడు నమస్కరించి యీవిధముగాఁ జెప్పెను. మునీంద్రా! నా చరిత్రము చెప్పెద వినుము.)

—* శ్వేతుఁడు తన వృత్తాంత మగస్త్యుతోఁ దెల్పుట *—

సీ. నే ననతిక్రమ ♦ ణీయ మౌ నాదర, వస్థ నే మని చెప్పు♦వాఁడ నయ్య
మున్ను మజ్జనకుండు♦సన్నుతశీలుఁడు, వైదర్భుఁడు సుదేవ♦భూదయితుఁడు
ఇర్వురుసతు లందు♦నిర్వురఁ గాంచెను సుతుల నన్ శ్వేతుని ♦సురథుఁబిదపఁ
బెక్కు వేలేండ్లు నేఁ♦బృథివి బాలించియు, నాయు వస్థిర మని♦యాత్మ నెఱిఁగి

ఆ. యనుజు రాజుఁ జేసి♦ యరుదెంచి యీయరణ్యమున కీసరస్సు♦ప్రాంతమంద
మూఁడు వేలయేండ్లు♦మునివరా! తపమొంటిఁ, దుదకు బ్రహ్మలోక♦పదముగంటి.

అర్థములు. అనతిక్రమణీయము = అతిక్రమింపరానిది, దురవస్థ=చెడ్డస్థితి, సుదేవ భూవయితుఁడు=సుదేవుఁడను రాజు.

తాత్పర్యము

దాటరాని నాదురవస్థ చెప్పెద వినుము. మునీంద్రా! సుదేవుఁడను విదర్భ రాజు నాతండ్రి సాధుజనులు మెచ్చు సదాచారము గలవాఁడు. ఆయన కిరువురు భార్యలు. శ్వేతుఁడను నన్ను, నా వెనుక సురథుఁడను వానిని కొడుకులఁ గనెను. నే ననేక సంవత్సరములు రాజ్యముచేసి యాయువు స్థిరము గాదని యెఱిఁగి నా తమ్మునకు రాజ్యమిచ్చి నేనీ యడవియందు నీకొలని తీరమున మూడు వేలయేండ్లు తపస్సుచేసి తుదకు బ్రహ్మలోకము నార్జించితిని.

క. అక్కడ నాఁకలిదప్పులు, మిక్కిలి బాధింప నన్ను ♦ మిడుకుచు నజునిన్
ప్రొక్కి వచించితి నాగతి, నిక్కరణి సరోజగర్భ♦యెందుం గలదే? ౧౩-౨౮

తాత్పర్యము

(అక్కడ నాఁకలి దప్పులు మిక్కిలి బాధింపఁగాఁ బరితపించి, బ్రహ్మకు నమస్కరించి, నా విషయ మిట్లు చెప్పితిని. దేవా! ఈవిధ మెచటనైన నున్నదా?)

ఆ. బ్రహ్మలోకమంట♦భగవంతుఁడా! యుంట, యాకలియును దప్పి♦యఱుగవంట
గడుసుఁబాప మేది♦పడియెనో నావెంట, గడుపు మంట యెట్లు♦గడుపుచుంట?

అర్థములు. అఱుగవు=క్షయింపవు, గడుసుఁబాపము=కఠినపాపము, కడుపుమంట=ఆఁకలి.

తాత్పర్యము

(ఉండునది బ్రహ్మలోకమఁట. ఆఁకలి దప్పియు క్షమింపవఁట. ఏదియో గడుసు పాపము నావెంటఁబడినది. ఈ కడుపుమంటతో నెట్లు కాలము గడుపుదును?)

చ. అనవుడు బ్రహ్మ యిట్టులనె ♦ నాత్మశరీరము మాంసమెప్పుడున్
దిని క్షుధ నార్చుకొ మ్మిఁక సు ♦ దేవతనూభవ! యేల యంటివా
తనువును జక్కఁబ్రోచితివి ♦ దాన మెఱుంగ వ దెట్టిదో నృపా!
విను మల విత్తు నాటకయె ♦ వృక్షము గల్గునె ధీరసత్తమా! ౧౩-౨౯

అర్థములు. ఆత్మశరీరము మాంసము=నీశరీరమందలి మాంసము, క్షుధ=ఆఁకలి.

తా త్ప ర్య ము

అని యడుగఁగా బ్రహ్మ యిట్లనియె. నీశరీరమాంసము దిని యాఁకలి దీర్చుకొమ్ము, సుదేవనందనా! యది యేల యంటివా? దేహమును బాగుగ రక్షించితివి. దాన మెట్టిదో యెఱుఁగవు, రాజా! విత్తు నాటక చెట్టు గలుగునా? కారణములేక కార్యము పుట్టునా.

చ. తపమును లెస్సచేసితివి ♦ తన్వి ననం దిని మేను ప్రోచి తీ
వెపు డొకకొంచెమేన్ బరుల ♦ కిచ్చిన దెయ్యది లేదు దానిచే
నృపవర! స్వర్గముం గనియు ♦ నిష్ఠురమౌ క్షుధచేత దప్పిచేఁ
గృపణత బాధ నొందెదవు ♦ రిత్తఁగఁ బోవునె కర్మ మేదియున్. ౧౩౩౦

అర్థములు. తన్వి=తృప్తి, తపస్సు=మనసశ్చేంద్రియాణాంచ హ్యైకాగ్రం పరమం తపః, మనస్సు ఇంద్రియములు ఏకాగ్రముగ భగవంతుపై నుంచుట యుత్తమ తపము.

తా త్ప ర్య ము

నీవు తపస్సు చక్కఁగాఁ జేసితివి. ఆ తపస్సు ఫలము బ్రహ్మలోకము లభించెను. నీవు కడుపారఁ దృప్తిదీరఁ దిని దేహమును రక్షించితివి. ఎవరి కేదైన దానమిచ్చినవాఁడవు కావు నీ దేహమునందు నీ కింత యభిమాన ముండుటచే ఆ దేహమునే తిని యీ కొలని నీళ్ళ త్రావి నీ యాఁకలిదప్పు లణఁచుకొమ్ము. నీ యాఁకలి దప్పుల కిదియే కారణము. చేసిన కర్మము వ్యర్థముగఁ బోవునా?

ఉ. కావున నిన్ను నీవ తిని ♦ కాంచుము తృప్తి నగస్త్యమౌని రా
జా! వనిఁ జేర వచ్చి దళి♦తాఘువిఁ జేయు నినున్ నృపాల! దే
వావళి నైన నాయనఘుఁ♦డాదటఁ బ్రోవ సమర్థుఁ డట్టిచోఁ
బ్రోవఁగఁజాలు నిన్ననుచుఁ♦బూని వచింపఁగ నేల నావుడున్. ౧౩౩౧

తా త్ప ర్య ము

కావున నిన్ను నీవేతిని తృప్తి పడుము. అగస్త్యమునీంద్రుఁడా యడవికి వచ్చును. ఆయన నీపాపము హరింపజేయును. ఆయన దేవతలనైన రక్షింపఁజాలువాఁడు. నిన్ను రక్షింపఁగలఁడని వేఱుగఁ జెప్పవలెనా?

క. నీరేజభవుని నుడి నా, హారముఁ జేసితి మునీంద్ర ♦ యాత్మశరీరం
బీరీతిఁ బెక్కు వర్షము, లారఁగఁ జనె గుణప మేము ♦ యఱుగదు కొంతేన్.

అర్థములు. కుణపము=పీనుఁగు, అఱుగదు = క్షయింపదు, కొంతేనిన్ = కొంచెమైనను,

తాత్పర్యము

బ్రహ్మవాక్యము ప్రకారము మునీంద్రా! నా శరీరమే నా కాహారముగాఁ జేసికొంటిని. ఇట్లనేక సంవత్సరములు గడచెనుగాని పీనుఁగుఁలో గొంచెమైనను తగ్గినది కాదు. ఈ దినము కొంతతినిపోయి మఱునాఁడు వచ్చునప్పటికి మునుపున్నట్టు మరల శవము పూర్ణముగా నుండును, శవము క్షయింపదు. నీ రెండదు.

క. ఆపోక నాకు దీనన, చేపడియెడి నన్నుఁ గావు♦చెచ్చెర మౌనీ!
యీ పాప మణఁప గదవే, యోపావనశీల♦తాప సోత్తమ ఘటజా! ౧౩౩౩

అర్థములు. ఆపోక=తృప్తి, చేపడియెడిన్=కలుగుచున్నది, ఘటజా=అగస్త్యమునీ.

తాత్పర్యము

దీనిని దినిననే నాయాఁకలి తగ్గుచున్నది. కాని మఱియేది తినినను తగ్గదు, దీనివలననే నాకుఁ దృప్తి కలుగుచున్నది. మునీంద్రా! నాయీ పాపము క్షయింపఁ జేయుము.

క. కలశీసూనుఁడు తక్కఁగఁ, దలమే యన్యులకు నిందుఁ ♦ దలఁ జూపఁగ నీ
లలితాభరణముఁ గొని న,న్నలఘుమతి తరింపఁ జేయ♦మా నీమహిమన్. ౧౩౩౪

అర్థములు. కలశీసూనుఁడు=అగస్త్యుఁడు, తలమే=తరమే=సాధ్యమా, తలఁ జూపఁగన్=ప్రవేశించుటకు, లలితాభరణము=మనోహరమైన భూషణము.

తాత్పర్యము

నీళ్ళు లేక, పశుపక్షి మృగమనుష్యులు లేక యుండు నీయడవికి వచ్చుటకు నగస్త్యునకుఁ దప్ప నితరులకు సాధ్యపడదు. కావున నిన్నగస్త్యునిఁగాఁ దలఁచితిని. నీ వీ యాభరణమును గ్రహించి నా పాపము శమింపఁ జేసి నన్ను నీ మహిమచేఁ దరింపఁజేయుము.

చ. కరుణ దలంప వయ్య నను♦ గావఁగదయ్య యటన్న శ్వేతభూ
వరు వ్యసనోక్తులన్ విని ద్ర♦వన్మతి భూషణ మేను గొంటి, నా
భరణము నేను గొన్నపిద♦పన్ నృపు తొల్లిటి మర్త్యకాయమా
సరసిని నాశ మొందెఁ గడు♦సంతస మందెను నాకవాసియున్. ౧౩౩౫

అర్థములు. ద్రవన్మతిన్=మనస్సు కరఁగిన వాఁడనై, మర్త్యకాయము=మనుష్యదేహము, సరసిని=కొలని యందు, నాకవాసియున్=స్వర్గము నందుండు వాఁడు, స్వర్గమనఁగా నిచట బ్రహ్మలోకము.

తాత్పర్యము

అయ్యా! నన్ను దయ చూడుము. రక్షింపుము అని యేడ్చుచున్న యతని మాటలు విని మనస్సు గరఁగి భూషణముతో నాకుఁ బనిలేకున్నను, ప్రతిగ్రహము

నాకు నిషిద్ధమైనను నతని రక్షించు కోరికతో నాభరణము తీసికొంటిని. నే నాభరణము తీసికొన్న పిదప, కొలనిలోని మనుష్యదేహము నశించెను. అది చూచి శ్వేతుఁడు సంతోషించెను.

క. ఆరా జొసంగినది యిది, తారాధిపవదన! నేను ♦ దరియింపఁగాఁ
గోరి యొసంగితి నీకున్, గారామునఁ గొమ్ము లేదు ♦ కలుష భయంబున్. ౧౩౩౬

తాత్పర్యము

ఇది యారాజు నా కొసఁగినది. ఆతనిఁ దరింపజేయు తలఁపున నేను బరిగ్రహించితిని. దీనిని నేను, బరిగ్రహించిన నాదోషము పోవుటకై దీని నీవు పరిగ్రహించి నన్నుద్ధరింపుము. నీకు వ్రతహాని లేదు. ప్రేమతో గ్రహింపుము.

—♦ దండకారణ్య చరిత్ర మగస్త్యుఁడు శ్రీరామునకుఁ దెలుపుట ♦—

సీ. అనుడు నత్యద్భుత ♦ మైన వాక్కుల విని, గౌరవవిస్మయ ♦ కారణముల
రామచంద్రుండిట్లు ♦ ప్రశ్నించె మౌనీంద్ర! శ్వేతు నరణ్యంబు ♦ వీతజీవి
యగుట యెట్లొకొ నిర్జ ♦ నారణ్యమునను వైదర్భుండు తపమూనఁ ♦ దలఁచు టెట్లొ
వినిపింపు మనవుడు ♦ ముని వల్కెమును కృత,యుగమున మను వేలె ♦ నుర్వినెల్ల

తే. నతనిపుత్రకుఁ డిక్ష్వాకుఁ ♦ డమితశౌర్యుఁ, డతని రాజుగ నొనరించి ♦ యవనిరాజ
వంశపుకర్తవు గమ్మని ♦ పలుకనట్ల, కాక యంచు వచించె ని ♦ క్ష్వాకువిభుఁడు.

అర్థములు. వితజీవి=జీవజంతువులు లేనిది, నిర్జనారణ్యమునను=మనుష్యులు లేని యడవియందు.

తాత్పర్యము

ఈ ప్రకారముగ చెప్పఁగా మిగుల నాశ్చర్యకరమైన యామాటలు విని గౌరవముచేతను, ఆశ్చర్యముచేతను రామచంద్రమూర్తి యిట్లు ప్రశ్నించెను. మునీంద్రా! శ్వేతుఁ డున్న యరణ్యము ప్రాయము లేనిదేల యయ్యెను? మనుష్యులు లేనిచోట నాయన తప మెట్లు చేసెను? వినిపింపు మనఁగా నగస్త్యుఁ డిట్లనియె.

పూర్వ మీ భూమి నంతయు మనువు పాలించెను. అతని కొడు కిక్ష్వాకుఁడు. ఆ పరాక్రమవంతుని రాజుఁగా జేసి నీవు రాజవంశకర్తవు కమ్మని చెప్పఁగా నాయన దాని నంగీకరించెను.

చ. మనువును సంతసిల్లి గుణ ♦ మండన! నిక్కము నీవ కర్తవీ
జనముల దండపద్ధతిని ♦ జక్కఁగ రక్ష యొనర్పు మెవ్వనిం
గినియకు నిర్నిమిత్తముగ ♦ గీడరి దండితుఁ జేయ రేఁడు వా
నిని నదియే దివంబునను ♦ నిల్పుఁజుమీ సుఖహేతుభూతమై. ౧౩౩౭

అర్థములు. గుణమండన=సుగుణములే యలంకారముగాఁ గలవాఁడా.

తాత్పర్యము

ఆ మాటకు మనువు సంతోషించి నిజముగ నీవే వంశకర్తవు ఈ ప్రజల నందఱను దండపద్ధతిని జక్కఁగా రక్షింపుము. నిష్కారణముగ నెవ్వరిమీఁదను గోపింపకుము. దోషము చేసిన వాని దండించు రాజును నా దండనీతియే స్వర్గము లభింపఁ జేయును. అది పరలోక సుఖమునకుఁ గారణ మగును.

చ. అని హితమున్ వచించి యజు ♦ నాలయ మేగ నతండు పిమ్మటన్
జనకునిమాటబట్టి బహు♦సత్కృతులన్ ఘటియించి నూర్వురన్
దనయుల దేవసన్నిభుల ♦ ధర్మరతాత్ముఁడు గాంచె వారిలో
జనవర! పిన్నవాఁడు కడు♦జ్ఞానవిహీనుఁడు నీతిశూన్యుడున్. ౧౩౩౯

అర్థములు. అజునాలయము=బ్రహ్మలోకము.

తాత్పర్యము

(అని హిత ముపదేశించి బ్రహ్మలోకమునకుఁ బోఁగాఁ, బిమ్మట నతఁడు తండ్రిమాట ప్రకార మనేక సత్కార్యము లొనరించి నూర్వురు కొడుకులను దేవతలతో సమానులను ధర్మపరుఁడగు నతఁడు గనెను. వారిలోఁ గడగొట్టు వాఁడు మిక్కిలి తెలివిమాలిన వాఁడు నీతి లేనివాఁడు.)

చ. చదువరి గాక పూర్వజుల ♦ సమ్మతిఁ గొల్వక తెల్వి లేక దు
ర్మదుఁ డయి సంచరింపఁ గని ♦ మానవపాలుఁడు దండ మెంచుఁ ద
ప్పద యని యెంచి దండుఁ డని ♦ వానికిఁ బేరిడి ఘోరభూమి యె
య్యది యని వింధ్యశైవల న ♦ గాంతరరాజ్యము నిచ్చె నేలఁగన్. ౧౩౪౦

అర్థములు. చదువరి=విద్యావంతుఁడు, పూర్వజులన్=అన్నలను.

తాత్పర్యము

ఆయన కడగొట్టు కొడుకు విద్యావంతుఁడు గాక యన్నల సేవింపక జ్ఞానము లేక మదించి సంచరింపఁగా వీఁ డెందో దండితుఁడగును. దప్పదనితలఁచి వానికి దండుడని పేరుపెట్టి వానికిఁ దగిన స్థల మేది యని యాలోచించి వింధ్యమునకు శైవలమునకు నడిమి భాగము పాలింపుమని యిచ్చెను.

ఉ. చారుతరాద్రిరోధమున ♦ క్ష్మాపతి యై మధుమంత మన్పురిన్
హారివిలాసయుక్తముగ ♦ నందు వినిర్మితిఁ జేసి శుక్రునిన్
గారవమార వేఁడుకొని ♦ కాంచి పురోహితుఁ గాఁగ స్వర్గమున్
దారితవృత్రుఁ డేలుఁ గతిఁ ♦ దాను బ్రహృష్టజనావమర్దమున్. ౧౩౪౧

అర్థములు. చారుతర=మనోహరమైన, అద్రిరోధమున=కొండ సమీపమున, దారిత వృత్రుఁడు=ఇంద్రుఁడు, ప్రహృష్ట జనావమర్దమున్=సంతోషించిన జనులు దట్టముగాఁ గలది.

తా త్ప ర్య ము

మనోహరమైన పర్వతప్రాంతమున రాజై మధుమంత మను నందమైనపురములు నిర్మించుకొని శుక్రుని దనకుఁ బురోహితుఁడుగా నుండఁగోరి స్వర్గమును నింద్రుని వలెఁ దాను సంతోషించిన జనుల సమ్మర్దము గల.

—♦ దండుఁడు శుక్రుకూఁతు నరజను జెఱుచుట ♦—

ఉ ఆవిషయంబు పెక్కు లగు♦ హాయనముల్ నిహతారి యేలుచో
భూవరుఁ డొక్క చైత్రమునఁ ♦ బొల్పగు భార్గవునాశ్రమంబు దు
ర్భావుఁడు చొచ్చి యందు వన ♦ భాగమునం జరియింప దేవతా
భావిని బోలు సుందరిని ♦ భార్గవుకన్యక గాంచి మోహి యై. ౧౩౪౨

అర్థములు. ఆ విషయంబు=ఆ దేశము, హాయనముల్=సంవత్సరములు, నిహతారి=చంపఁబడిన శత్రువులు గలవాఁడు, దుర్భావుఁడు=చెడ్డయభిప్రాయము గలవాఁడు, దేవతాభావిని=దేవతాస్త్రీని.

తా త్ప ర్య ము

అతఁడు శత్రువుల జయించి యా దేశమును బెక్కు సంవత్సరములు పాలించుచు నొకానొక చైత్రమాసమున నందమైన శుక్రాచార్యు నాశ్రమమునకుఁ బోయి యందు దేవతాస్త్రీవలెఁ దిరుగుచున్న శుక్రుని కుమారితను జూచి యామె యందు మోహము గలవాఁడై.

క. పువ్విలుతుబారిఁ బడి యా, క్రొవ్విరిఁబోణిని వచించుఁ ♦ గుంజరగమనా!
యెవ్వతెవు నీ వి టేలా, యివ్వనిఁ గ్రుమ్మరెదు చెప్పు♦మీ నిన్గనినన్. ౧౩౪౩

తా త్ప ర్య ము

(కామ వశుఁడై యా పూఁబోఁడినిఁ గాంచి చెప్పెను. ఓ గజగమనా! నీ వెవ్వతెవు? ఎందు కీ వనములోఁ దిరుగుచున్నావు? చెప్పు. నిన్నుఁ జూడఁగానే.)

క. వలరా జేఁచెడి ననఁగాఁ, గలికి యతని మోహమత్తుఁ♦గా నెఱిఁగి యనెన్
దలఁపుము శుక్రునికూఁతుఁగ, వలఘుమతీ! పేర నరజ ♦ నంటకు నన్నున్.

అర్థములు. వలరాజు=మన్మథుఁడు, ఏఁచెడిన్=బాధించు చున్నాఁడు, మోహమత్తుఁగా=మోహముచే నుచితానుచితము తెలియని వానిఁగా.

తా త్ప ర్య ము

నన్ను మన్మథుఁడు బాధించుచున్నాఁడని చెప్పఁగా మోహముచే నతఁడు మదించి యున్నాఁడని యెఱిఁగి యామె నేను శుక్రాచార్యు పుత్రికను. నా పేరు అరజ. నన్నుఁ దాఁకకుము.

తే. తండ్రివశమున నుండెడు • దాన నేను, గన్యకను నీదుగురువె కా • కవియు? నతఁడు
కోపగించిన భువనముల్ • రూపుమాయు, నీవనఁగ నెంత? చెడియెదు • నిక్క మధిప!

అర్థములు. కవి=శుక్రుఁడు.

తాత్పర్యము

(రాజా! నేను దండ్రిచాటు దానను-నేను గన్యకను, శుక్రుఁడు నీకు గురువే కదా! అతఁడు కోపించిన మూఁడు లోకములు నాశమగును. నీ వనఁగా నెంత? నిజము-చెడిపోయెదవు.)

ఉ. నన్ను వరింపఁ గోరినను • నా జనకున్ నయమార వేఁడుమీ
మన్ననతోడ నాతఁ డను • మానము లేక యొసంగు నీకుఁ బో
మ్మన్నను హస్తముల్ శిరము • నందుఁ గదించి భవన్నిమిత్తమై
కన్నెరో! ప్రాణము ల్చనెడి • గాలవిలంబన మెట్లు లోర్చెదన్. ౧౩౪౬

తాత్పర్యము

(నన్ను వరింపఁ గోరెదవేని పోయి నా తండ్రి నడుగుము-అతఁడనుమానింపక నీ కిచ్చును. అని చెప్పఁగా నతఁడు చేతులు తలమీఁదఁ జేర్చి కన్నెరో! నీ కొఱకు నా ప్రాణములు పోవుచున్నవి-కాలవిలంబ మెటులోర్చు కొనఁగలను?)

ఉ. చంపినఁ జంపుఁ గాక మరి • శాపము నిచ్చిన నిచ్చుఁగాక యో
చంపకగంధి! నన్నిపుడు • చక్కెరవిల్తుసకేలిఁ దెల్పుమీ
చంపెడి వాఁడు నన్ననుచుఁ • జయ్యన గ్రుచ్చి బలాత్కృతిన్ సతిన్
మంపున సిగ్గు దీసి మధు • మంతముఁ జేరె; నెలంత యేడ్చుచున్. ౧౩౪౭

అర్థములు. బలాత్కృతిన్=బలవంతముగా, మంపునన్=మత్తుచే.

తాత్పర్యము

(చంపినఁజంప నిమ్ము. శాపము పెట్టినఁ బెట్టనిమ్ము. ఓ చంపక గంధీ! నన్నిప్పుడు మన్మథక్రీడయందు సుఖింపఁజేయుము. కాముఁడు నన్నుఁ జంపుచున్నాఁడనుచు వెంటనె బలవంతముగాఁ గౌఁగిలించి యా సతిని మత్తుచే సిగ్గు చెఱచి మధుమంతమునకుఁ బోయెను.)

—• శుక్రుఁడు దండుని దేశముపై మట్టివాన గురియ శపించుట •—

చ. దరమున నాశ్రమంబు దరిఁ • దండ్రికి వేచి ధరిత్రిఁ బొర్లఁగా
గురువున కాయుదంతమును • గొబ్బునఁ దెల్పిరి శిష్యులెల్ల, నా
పరమతపోధనుండు విని • బాధరుషావశుఁడై క్షుధార్తుఁడై
సరగ నిజాశ్రమంబునకు • జక్కఁగఁ వచ్చి రజోభిసంప్లుతన్. ౧౩౪౮

అర్థములు. దరమునన్=భయముతో, దరిన్=సమీపమందు. బాఢరుషావశు(డై=మిక్కిలి కోపించినవా(డై, క్షుధార్తు(డై=ఆ(కలిచే(బీడింప(బడినవా(డై, సరగన్=శీఘ్రముగ, రజోభిసంప్లుతన్=దుమ్ముతోనిండిన దానిని ఉదంతము=వార్త.

తాత్పర్యము

(భయముచే నాశ్రమము సమీపమందు(దండ్రి కొఱకు కనిపెట్టుకొని నేల బడుచుండ(గా, శిష్యులందఱా సమాచారమును నాయనకు(దత్క్షణమె తెలిపిరి. ఆ పరమ తపోధను(డు విని మిక్కిలి కోపించినవా(డు, నా(కలిచే(బీడింప(బడినవా(డు నగుచు నాశ్రమమునకు(జక్క(గా వచ్చి దుమ్ముతో నిండిన దానిని.)

క. దీన నరజ(గని శుక్రు(డ, నూన రుషాయుక్తు(డగుచు ♦ నుర్వీశుం డా
యీ నెఱిపాప మొనర్చెను, గాన(డు వోకన్ను లత(డు♦కండపావరునన్.

అర్థములు. దీనన్=ఏడుచుచున్న దానిని, అనూన రుషాయుక్తు(డు=మిక్కిలి కోపముతో(గూడినవా(డు.

తాత్పర్యము

(దుఃఖపడుచున్న యరజనుజూచి శుక్రు(డు మిక్కిలి కోపముతో రాజా యిట్లు పాపము చేసినవా(డు!! అత(డు కండపావరున(గన్నులు కాన(డు పో!!)

చ. అసమున నాశ్రయాశుశిఖ♦లంటగ జూచెడి స్వీయ యుక్తు(డై
మసి యయి పోవు నింక గతి ♦ మాలి దురాత్ము(డు పాపశీలు(డీ
యసమమహాఘకార్యమున ♦ కర్హ్మాఫలంబును గాంచు(గాక యీ
వసుధయు సప్తరాత్రములు(♦ బా డగు(గావుత, బాంసువృష్టిచేన్. ౧౩౪౦

అర్థములు. అసమునన్=మదమున, ఆశ్రయాశు శిఖలు=అగ్నిజ్వాలలు, మసి=బూది, అసమ=సమానములేని, మహాఘకార్యమునకున్=గొప్ప పాపకార్యమునకు సప్తరాత్రములన్=ఏడు దినములలో, పాంసువృష్టిచేన్=దుమ్మువానచే

తాత్పర్యము

మదమున దేహము తెలియక యగ్నిజ్వాలల(దా(క(జూచుచున్నా(డు. దిక్కులేనివా(డై దురాత్ము(డు పాపస్వభావు(డు తనవారితో మసియై పోవును గాక. ఈ మహాపాపమునకు ఫలముగా నేడు దినములకు దుమ్ము వాన గురిసి యీభూమి పాడయి పోవును గాక.

క. యోజనశతంబు ధర యీ, రాజే లెడియంతమేర ♦ రజము గురిసి స్వా
రాజు వినాశ మొనర్చుత, భూజనులు చరాచరములు♦పొలియుత మిచటన్.

అర్థములు. రజము=దుమ్ము, స్వారాజు = స్వర్ + రాజు=ఇంద్రుఁడు, పొలియుత=నాశమగును గాక.

తా త్ప ర్య ము

ఈ రాజేలెడి నూఱామడ దూరమునేలను నింద్రుఁడు దుమ్ము గురియించి నాశము చేయునుగాక! ఈలోనుండు జనులు చరాచరములు నాశమగును గాక.

చ. అని శపియించి యాశ్రమము♦నందలి వారలఁ గాంచి మీర లీ
జనపదసీమ దాఁటి చని ♦ స్థానముఁ గొం డన వార లెల్లరుం
జనఁ గవి కూతుఁ గాంచి మతి ♦ చాలనిదాన! సమాహితాత్మవై
దినములు త్రోయు మియ్యెడన ♦ తీవ్రతపఃపరినిశ్చితాత్మవై ౧౩౫౨

అర్థములు. మతి చాలని దాన=బుద్ధిలేనిదాన, సమాహితాత్మవై= ఇంద్రియ నిగ్రహము గలదానవై, తీవ్రతపఃపరినిశ్చితాత్మవై =తీవ్రమైన తపస్సునందు నిశ్చయపడిన మనస్సుగల దానవై.

తా త్ప ర్య ము

(అని శపించి, యాశ్రమమందున్న వారినిఁజూచి, యీ పొలిమేర దాఁటి పోయి వేఱొకచోట నివాసము చేసికొనుఁడని చెప్పఁగా వారందఱును బోయిరి. అంతట శుక్రుఁడు కుమారితను జూచి బుద్ధి మాలినదానా? యింద్రియనిగ్రహము కలిగి తీవ్రమైన తపస్సు చేయుచు నిందే కాలము గడుపుము.)

క. ఈకొల ని యోజనంబున, నీ కీడు పొసంగ దల్ల ♦ వృష్టిదినములన్
నీకడ వసించుజంతువు, లే కాఱియ నొందకుండు ♦ నింతీ! యనినన్ ౧౩౫౩

తా త్ప ర్య ము

ఈకొలని చుట్టు ఆమడ దూరము ఆ వానదినములందు ఏ కీడు పొందకుండును. ఇందు వసించు జంతువుల కే యుపద్రవము లేకుండును.

క. అటు తొల త మంచుఁ దన్నడిఁ, గుటిలాలక దుఃఖగరిమఁ గొనె నుశనుం డ
ప్పటినుండి వేఱుతావున, వటువులతో నెలవు కొనియె♦వారిజనయనా! ౧౩౫౪

అర్థములు. ఉశనుండు=శుక్రుఁడు, వటువులతోన్=శిష్యులగు బ్రహ్మచారులతో, నెలవుకొనియెన్=స్థాన మేర్పఱుచుకొని యుండెను.

తా త్ప ర్య ము

(ఆమాట నట్టులే కానిండని దుఃఖాతిశయమున నామె గ్రహించెను. శుక్రుఁడప్పటినుండి శిష్యులగు బ్రహ్మచారులతో వేఱొక తావున స్థాన మేర్పఱుచుకొనెను.)

క. దితిజాచార్యుఁడు చెప్పిన, గతి దండునిదండు భటులుఁ • దక్కిన వార
ద్భుతపాంసువృష్టిఁ జచ్చిరి, గతిచెడి దినసప్తకమునఁ • గడు ఘోరముగన్.

అర్థములు. దితిజాచార్యుఁడు=శుక్రుఁడు, అద్భుతపాంసువృష్టిన్=ఆశ్చర్య కరమైన దుమ్మువానచే, దిన సప్తకమునన్=ఏడు దినములలో.

తా త్ప ర్య ము

(శుక్రుఁ డన్నవిధముగా దండుఁడు వాని సేన భటులు తక్కినవారుభయం కరమగు దుమ్ము వానచే నేడు దినములలో గతిమాలి మిక్కిలి భయంకరమగు చావు చచ్చిరి.)

క. దండునివిషయము మునివే, దండముచే శాపమునను • ధరఁ గలయుటచే
దండక యని పేరొక్కనఁబడు, నుండుటచే మాను లిందు•నుర్వీరమణా! ౧౩౪౬

అర్థములు. దండుని విషయము=దండుని దేశము, మునివేతండముచేన్= మునిశ్రేష్ఠునిచే.

తా త్ప ర్య ము

దండుని దేశము మునీశ్వరు శాపముచే నేలపాలయ్యెను గావున దీనికిదండక యను పేరు వచ్చెను. ఇందు మును లుండుటచే.

తే. కనె జనస్థాన మనుపేరు•కంజనేత్ర!, యడిగినది యెల్లఁ జెప్పితి•నబ్జహితుఁడు
పశ్చిమాద్రికి నరిగె వా•ర్వంగ మునులు,స్నాన మొనరించి రవిఁగొల్వ•జనెడివారు.

అర్థములు. వార్వంగన్=సంధ్య వార్వంగ.

తా త్ప ర్య ము

(రామా! జనస్థాన మని పేరు వచ్చెను. నీ వడిగినదంతయుఁ జెప్పితిని. సూర్యుఁడు పడమటి కొండకుఁ బోయినాఁడు. మునులు స్నానమొనరించి సంధ్య వార్చుటకు సూర్యు నారాధించుటకుఁ బోయినారు.)

క. రవి యస్తంగతుఁ డయ్యెను, రవివంశవరేణ్యా! సాంధ్య•రాగం బెసఁగెన్
దవుఁ గాదె నీకు సంధ్యా సువిహితకర్మములు దీర్ప • శుద్ధచరిత్రా! ౧౩౪౮

అర్థములు. అస్తంగతుఁడు=అస్తపర్వతము చేరినవాఁడు, సాంధ్యరాగము= సంజకెంజాయ.

తా త్ప ర్య ము

(సూర్యుఁడస్తగిరికిఁ జేరినాఁడు. రామచంద్రా! సంజకెంజాయ యతి శయించినది. నీకు సంధ్యమున్నగు విహితకర్మములు చేయఁదగును గదా.)

—♦ శ్రీరాముఁ డగస్త్యుచే నాజ్ఞగొని యయోధ్యకు మరలి చనుట ♦—

సీ. అనవుడు శ్రీరాముఁ ♦ డర్చింప సంధ్యను, సురసతీయుతసరో♦వరముఁ జేరి
సంధ్య నాఁచి మునిచంద్రు నా♦శ్రమమున, కరుగ నాతండు శా♦ల్యన్నరుచిర
భోజనంబును ఫల♦ములు మూలములు నిడ, నమృతోపమాన్నంబు♦నారగించి
సంతుష్టుఁడై రేయి♦జరపి యచ్చోటన, వేకువ నాహ్నిక♦విధులఁ దీర్చి

తే. కుంభసంభవునకు మ్రొక్కి ♦ గురుత దోఁప,
నాజ్ఞ యిడవయ్య పురమున♦కరుగువాఁడఁ
దాపసోత్తమ! నీభవ♦ద్దర్శనమున ధన్యతను గంటి త్వత్కృపా♦ధనముఁ గొంటి.

అర్థములు. సురసతీయుత=దేవతాస్త్రీలతోఁ గూడిన, సరోవరము=కొలను, శాల్యన్నరుచిర భోజనము = బియ్యపుటన్నముతోఁ గూడిన మనోహరమైన భోజనము, మునుపటివలె నిర్వీరిధాన్యము కందమూలములు గావు. రాజుదశకుఁ దగినది, అమృతోపమాన్నంబు=అమృతముతో సమానమైన యన్నము, కుంభసంభవునకున్=అగస్త్యునకు, గురుత=గౌరవము, త్వత్కృపాధనము = నీ దయ యనెడి ధనమును.

తా త్ప ర్య ము

(అని చెప్పఁగా, శ్రీరాముఁడు సంధ్యవార్చుటకు దేవతాస్త్రీలతోఁ గూడిన కొలను దగ్గఱకుఁ బోయి, సంధ్యవార్చి, యగస్త్యముని యాశ్రమమునకుఁ బోగా, నతఁడు బియ్యపుటన్నముతోఁ గూడిన మనోహరమైన భోజనము కందమూలముల నియ్యఁగా నమృతముతో సమానమైన యన్నము నారగించి యారాత్రి యచ్చటనే గడపి వేకువన లేచి యాహ్నికక్రియలు తీర్చుకొని యగస్త్యునకు నమస్కరించి యాజ్ఞయొసఁగుఁడు పత్తనమునకుఁ బోయెద మీ దర్శనమున ధన్యుఁడనైతిని, మీ కృపయనెడు ధనమును బొందితిని.)

ఉ. ఏను బవిత్రతం గనఁగ ♦ నిం దరుదెంచుచుఁ బోవుచుందు నా
కానతియే యటన్న వసు ♦ ధాధిపునద్భుతసూక్తి పంక్తికిన్
మౌని వసుండు ధర్మనయ ♦ నప్రవరుండు వచించె రామచం
ద్రా! నినువంటి పావనుఁడు ♦ తథ్యము లేఁ డెట భూతకోటిలోన్. ౧౩౬౧

అర్థములు. పవిత్రతం గనఁగన్=పవిత్రుఁడ నగుటకుఁగాను, ఆనతియే= ఆజ్ఞయే, ధర్మనయన ప్రవరుండు=ధర్మమే కన్నుగా వర్తించు వారిలో శ్రేష్ఠుడు, ధర్మజ్ఞానము కలవాఁడు.

తా త్ప ర్య ము

నేను బవిత్రుఁడ నగుటకుఁగా నిచ్చటికి వచ్చుచుఁ బోవుచు నుందును. నా కనుజ్ఞయే కదా యనిన నా మునిశ్రేష్ఠుఁ డా మాటల కాశ్చర్యపడి యిట్లనియె.

రామచంద్రా! నీ విచ్చటికి వచ్చి పావనుఁడ నయ్యెద నంటివి. నీవంటి పావనుఁడు భూతసమూహములలో లేఁడు ఇది సత్యము.

ఉ. అచ్చెరువయ్యె నీదుమధు♦రాక్షరముల్ విన రామచంద్ర! ని
న్నొచ్చెము లేనిప్రీతినిఁ ము ♦ హూర్తము చూచిన స్వర్గభూతుఁ డై
నిచ్చలు దేవపూజ్యుఁ డయి ♦ నిర్మలుఁ డౌ నరుఁ డెవ్వఁడేని, ని
న్నచ్చనిక్రూరదృష్టి గని♦నన్ యమదండహతుండు తత్త్రుటిన్. ౧౩౬౧

అర్థములు. మధురాక్షరముల్=తియ్యనిమాటలు, ఒచ్చెము=లోపము, నిచ్చలు=సర్వదా, నచ్చని=విశ్వాసములేని, తత్+త్రుటిన్=ఆ నిమిషమందే.

తాత్పర్యము

రామచంద్రా! నీవు చెప్పిన తియ్యనిమాటలు వినఁగా నాశ్చర్యమగుచున్నది. నిండు ప్రీతిచే నెవ్వఁడైనను అల్పకాలము చూచినను వాఁడు స్వర్గమున సర్వదా దేవతలచేఁ బూజ్యుఁడయి దోషరహితుఁ డగును. ఎవ్వఁడు నీయందు విశ్వాసము లేక క్రూరదృష్టిఁ జూచునో వాఁ డప్పుడే యమదండముచేఁ గొట్టబడినవాఁడై.

ఉ. పోవును నారకాధ్వమునఁ ♦ బొక్కుచు; నీవన భూతరాశిలోఁ
బావనమూర్తి విట్టినినుఁ ♦ బాయకకీర్తన సల్పి రేనియున్
భూవర! సిద్ధిఁ గాంచెదరు ♦ భూజను లింక శుభాధ్వసీమఁ బొ
మ్మా! వసుధాతలంబు నయ♦మార్గమునన్ భరియింపు రాఘవా! ౧౩౬౨

అర్థములు. నారకాధ్వమునన్=నరకమార్గమున, పొక్కుచున్=సంతాపపడుచు, నయమార్గమునన్=నీతిమార్గమున.

తాత్పర్యము

నరకమార్గమున నేడ్చుచుఁ బోవును. నీవనఁగా సామాన్యుఁడవా? ప్రాణిసమూహమునందుఁ బావనుఁడవు. ఇట్టి నిన్నుఁ గీర్తించినవారు లోకులు మోక్షము నొందుదురు. ఇంక నీవు శుభమార్గమునఁ బొమ్ము. నీతితప్పక రాజ్యము పాలింపుము.

చ. అనుడు ఘటాత్మసంభవున ♦ కచ్చటి మానుల కెల్ల మ్రొక్కి వా
రనుమతి సేయఁ బుష్పకము ♦ నవ్విభుఁ డెక్కిన వార లెల్ల దీ
వన లిడి యర్చ సేసిరి సు ♦ పర్వులు శక్రునిఁ బోలె, వార్షికా
బ్దనికటచంద్రునట్లు జన ♦ వర్యుఁడు పుష్పకమందు మింటిపై. ౧౩౬౩

అర్థములు. ఘటాత్మ సంభవునకున్ = అగస్త్యునకు, అనుమతి=ఆజ్ఞ, వార్షికాబ్దనికట చంద్రునట్లు=వర్షించు మేఘము సమీపముననున్న చంద్రునివలె.

తా త్ప ర్య ము

అని చెప్పఁగా రామచంద్రమూర్తి యగస్త్యునకు నచ్చట నున్న తక్కిన మునులకు నమస్కరించి వా రనుజ్ఞ యీయఁగాఁ బుష్పకము నెక్కఁగా వారం దఱు దీవించి యింద్రుని దేవతలు పూజించినట్లు పూజించిరి. ఆయనయు వర్షాకాల మేఘము సమీపమున నున్న చంద్రునివలె నాకాశమునఁ బుష్పకమందు.

ఉ. రాజిలి యభ్రమధ్యమునఁ ♦ గ్రాలఁగ నరుకఁ, డయోధ్యఁ జేరి పే
రోజను నడ్మికక్ష్య డిగి ♦ యొయ్యన సూక్తులఁ బుష్పకంబు రా
రాజును గొల్వఁ బంచి తన ♦ భ్రాతలకుం దనరాకఁ దెల్పఁగా
వే జడ నేది లేక యని ♦ పెం దొడిగేరఁగ ద్వారపాలకున్. ౧౩౭౪

అర్థములు. అభ్రమధ్యమునన్=ఆకాశము నడుమ, రారాజును = కుబేరుని, జడను=ఆలస్యము.

తా త్ప ర్య ము

ప్రకాశించుచు మధ్యాహ్నము వేళ కయోధ్య చేరి నగర నడిమికట్టునందు దిగి మంచి మాటలతోఁ బుష్పకమును గుబేరునొద్దకుఁ బంపి తాను వచ్చినవార్త తమ్ములకుఁ దెలిపి వారిని బిలుచుకొని రమ్మని ద్వారపాలునిఁ బంపెను.

—♦ శ్రీరాముఁడు రాజసూయంబుఁ జేయఁ దమ్ములతో యోజించుట ♦—

క. అతఁ డేగి వారిఁ బిల్వఁగ, ద్రుతగతి నరుదేర వారు ♦ తోడన్ చెప్పెన్
బతి కతఁడు వారు వచ్చుట, యతులముదంబునను రాముఁ♦డనుజయుగంబున్.

అర్థములు. ద్రుతగతిన్=శీఘ్రముగ, అనుజయుగంబున్=ఇద్దఱు తమ్ములను.

తా త్ప ర్య ము

(అతఁడు పోయి వారినిఁ బిలువఁగా, వారు శీఘ్రముగా వచ్చిరి. వారు వచ్చిన వార్త వెంటనే రాజున కతఁడు చెప్పెను, సాటిలేని సంతోషముతో రామచంద్రమూర్తి తమ్ముల నిద్దఱను.)

సీ. ఆలింగన మొనర్చి♦యనియె బ్రాహ్మణకార్య,మాచరించితిఁ జక్క♦ననుజులార!
అక్షయ్య మవ్యయం♦బగుధర్మసేతువు, ధర్మవర్ధక మఖ♦దారణంబు
రాజసూయంబు మీ♦రలు తోడుపడఁ జేయ, నిచ్ఛయించెద ధర్మ♦వృద్ధిపొంటె
రాజసూయసమాచ♦రణమునఁ గాదొకో, మిత్రుండు వరుణుఁడై♦మేల్మిగనియె

తే. రాజసూయంబునన ద్విజ♦రాజు శాశ్వతంబు సత్కీర్తినిలయంబు♦ధర్మవిధిని
గాంచె నిప్పుడమీరు యో♦జించి చెప్పుఁడ,యద్వారం బెద్దిసేయ మే♦లగునొ యనిన.

తా త్ప ర్య ము

కౌఁగిలించుకొని యిట్లనెను. నాయనలారా! బ్రాహ్మణకార్యము నెఱవేర్చితిని. అక్షయము, అవ్యయము, ధర్మసేతువు, ధర్మాభివృద్ధి గలది, పాపములఁ బోఁగొట్టునది యగు రాజసూయయాగము మీ సాహాయ్యముతోఁ జేయఁగోరెదను, రాజసూయయాగము చేసికదా మిత్రుఁడు వరుణుఁడై గొప్పవాఁ డయ్యెను. రాజసూయము చేసికదా చంద్రుఁడు శాశ్వతసత్కీర్తి ధర్మమార్గమునఁ గాంచెను. గావున మీ రాలోచించి యే యజ్ఞము చేయుట బాగో చెప్పుఁడు.

ఇది లక్ష్మణ విభీషణుల విషయమునందువలె వారి మనస్సులు తెలియఁ గోరి వేసినప్రశ్న.

—♦ భరతుఁడు రాజసూయ మర్హముగాదని నొడువుట ♦—

క. ప్రాంజలియై భరతుఁడు జన, రంజనశీలా! వసుంధ♦రా ధర్మయశః
పుంజంబు శాశ్వతం బరి, భంజన! నీయందు న్యాయ్య♦పద్ధతి నడువన్. ౧౩౬౭

అర్థములు. ప్రాంజలియై=చేతులు జోడించినవాఁడై, జనరంజనశీలా=ప్రజల సంతోషపెట్టు స్వభావముగలవాఁడా, వసుంధరా ధర్మ యశఃపుంజంబు = భూమియు ధర్మము కీర్తి సమూహము, శాశ్వతము=స్థిరముగా నున్నవి.

తా త్ప ర్య ము

(భరతుఁడు చేతులు జోడించి రామచంద్రప్రభూ! నీవు న్యాయ్య మార్గమున నడుచుటచే భూమి, ధర్మము. కీర్తి నీయందు స్థిరముగా నున్నవి.

చ. అమరులు కంజజున్ గొలుచు ♦ నట్టు మహీభుజు లెల్ల నిన్ను మో
దమున భజింపఁగోరెదరు ♦ తండ్రి వటంచును లోకులెల్ల ని
త్యము నినుఁ జూచువారు, వసు ♦ ధాస్థలిఁ గల్గినభూతకోటి కో
యమలదయాంతరంగ! విను ♦ ప్రాణము నీవ నిజంబు చూడఁగన్. ౧౩౬౮

అర్థములు. కంజజున్=బ్రహ్మను, మహాభుజులు=రాజులు, మోదమునన్= సంతోషముతో.

తా త్ప ర్య ము

దేవతలు బ్రహ్మను సేవించునట్లు రాజు లందఱు సంతోషముతో నీ సేవ చేయఁ గోరుచున్నారు. లోకు లందఱు నిన్నుఁ దండ్రివని తలఁచు చున్నారు. భూమియందుఁ గల సమస్తభూతకోటికి నీవే ప్రాణము.

ఉ. ఇట్టి మహానుభావునకు ♦ నేటికొకో నృపవంశనాశనం
బెట్టునుగూర్చు నధ్వరము ♦ నెత్తికొనం జలుపంగ? రోషముల్
పుట్టెడి రాజసూయమున ♦ భూధవపాళికి, దాన భూజనుల్
బిట్టు వినాశ మొందెదరు ♦ భీషణరోషకృతాజధారిణిన్. ౧౩౬౯

అర్థములు. నృపవంశనాశనంబును=రాజవంశముల నాశముచేయు, రాజసూయ మనిన రాజుల నందఱ యుద్ధమందు గెల్వవలెను. యుద్ధమందు హత్య తప్పదు, పెట్టును=తప్పక, అధ్వరము-యాగము, ఎత్తికొనన్=ప్రయత్నింపఁగా, భీషణ రోషకృతాజిధారిణిన్=భయంకరమైన యుద్ధభూమియందు.

తాత్పర్యము

వీరు వారనక యందఱు నిన్నుఁ దమ ప్రాణమువలె నెంతో ప్రీతితో సేవించుచుండ రాజవంశముల నాశముచేయు యజ్ఞము చేయఁ బ్రయత్నింప నేల? రాజసూయ మనఁగానే రాజుల కందఱకు రోషములు పుట్టును. ఇప్పటి యనుకూలురు కూడ రోషమునఁ బ్రతిఘటింతురు. రోషముచేఁ జేయఁబడు యుద్ధము వలన ప్రజలు నాశ మగుదురు.

క. భూవలయంబు సమస్తము, నీవశమున, వర్తిలంగ ♦ నిస్తులితదయా
శ్రీవిభవ లోకులను దగ, వా విలయముఁ గూర్పఁగా సవవ్యాజమునన్. ౧౩౭౦

అర్థములు. భూవలయము=భూచక్రము, నిస్తులిత=అసమానమైన, దయాశ్రీభవ=దయాసంపత్తియే విభవముగాఁ గలవాఁడా, సవవ్యాజమునన్=యజ్ఞమను నెపమున.

తాత్పర్యము.

భూచక్రమంతయు నీ వశమున నున్నది. నీవు పరమదయామూర్తివై యందఱ రక్షించుచున్నావు. అట్టి వారిని యజ్ఞమని పేరుపెట్టి నాశముచేయఁ దగునా?

చ. అన నమృతోపమాన మగు ♦ నా నుడులం గడు మెచ్చి కైకయీ
తనయునిఁ జూచి యిట్టులనుఁ ♦ దథ్యము పథ్యము భూహితంబుగా
ఘనమతిఁ బల్కి తీవు మదిఁ ♦ గల్గిన తత్క్రతుచింత వీడితిన్
జనులకు బాధఁ గూర్చు పనిఁ ♦ జల్పఁగఁ జెల్లునె భూమినేతకున్. ౧౩౭౧

అర్థములు. అమృతోపమానము=అమృతముతో సమానమైనది, తథ్యము=సత్యము, పథ్యము=హితమైనది, భూహితంబుగా=జనులకు మేలయినదిగా, తత్+క్రతుచింత=రాజసూయము చేయవలయునను నాలోచన.

తాత్పర్యము

ఇట్లు భరతుఁడు చెప్పఁగా రామచంద్రమూర్తి యిట్లనియె. నీవు చెప్పిన మాట లమృతమువలె మధురము శ్రేయస్కరమై యున్నవి. చాల సంతోషించితిని. సత్యముగను మేలైనదిగాను జనులకు హితమైనదిగా చెప్పితివి. ఆ యాగ విషయమైన నాయాలోచన వదలి పెట్టితిని. రాజగువాఁడు ప్రజలకు బాధ కలిగించుపని చేయరాదు.

క. బాలురవాక్యం బైనను, వాలాయము గ్రాహ్య మగు శు ♦ భం బగునేనిన్
శ్రీలక్ష్మణపూర్వజ! నీ, యాలాపము వినెద శుభదమాటను సుమతీ! ౧౩౭౨

తాత్పర్యము

(బాలురు చెప్పినను మంచిమాట వినఁదగును. భరతా! నీమాట శుభప్రదమైనది కావున వినెదను. బాలాదపి సుభాషితమ్మని కలదు గదా.)

—• లక్ష్మణుఁడు వృత్రుకథ శ్రీరామునితోఁ జెప్పుట •—

చ. అను నెడ లక్ష్మణుండు తన • యగ్రజుఁ గన్గొని సర్వపాపముల్
పొనుఁగువడంగ జేయు నతి • పుణ్యము పావన మశ్వమేధముం
బొనరుపనచ్చుఁ గాదె, సుర • ముఖ్యుఁడు వృత్రునిఁ జంపి బ్రహ్మహ
త్యను దొలఁగించుకో నదియ • తా నొనరించె నటంద్రు పెద్దలున్. ౧౩౨౩

అర్థములు. పొనుఁగు వడంగజేయున్=క్షయింపఁజేయును.

తాత్పర్యము

అని చెప్పు సమయంబున లక్ష్మణుఁడు రామచంద్రమూర్తితో సర్వపాపముల నాశనము చేయునది మిగులఁ బుణ్యము కలిగించునదియు పవిత్రమైనదియు నగు నశ్వమేధయాగము చేయవచ్చును గదా. వృత్రుని జంపిన బ్రహ్మహత్య పోఁగొట్టుకొనుటకు నింద్రుఁడు దానినే కదా చేసెనని పెద్దలు చెప్పుదురు.

'సర్వం పాప్మానం తరతి తరతి బ్రహ్మహత్యాం యోశ్వమేధేన యజతే' యని శ్రుతి. మేధ మనఁగా యజ్ఞము.

సీ. శతయోజనంబు వి• స్తృతియుఁ దత్త్రిగుణము,న్నతిగలవాఁడొక్కఁ•డదితిసుతుండు
వృత్రుఁ డన్వాఁడు జ•గత్త్రయిఁ బాలించె; నెయ్యంబు దియ్యంబు•నేర్పు మెఱసి
ధర్మజ్ఞుఁడును బ్రాజ్ఞ•తముఁడు కృతజ్ఞుండు, వానిపాలనమున • వసుధయెల్ల
గామధేనువుఁబోలెఁ • గ్రమమూలఫలాళిఁ, గుసుమచయంబుల•నొసఁగుచుండె

తే. దున్నకయ పండె ధాత్రి సం • పన్న మగుచు
నిట్లు లుండఁగ నాతని • కితరసుఖము
లెల్ల మాయయ తపమె య • హీన ఫలద
మనుచుఁ దోఁచిన వనముల • కరుగఁ దలఁచి. ౧౩౨౪

అర్థములు. విస్తృతి=విస్తారము, తత్త్రిగుణము = మూఁడునూర్ల యోజనములు, ఉన్నతి=ఎత్తు, ధర్మజ్ఞుఁడు=ధర్మమెఱిఁగిన వాఁడు, ప్రాజ్ఞతముఁడు=మిక్కిలి బుద్ధిమంతుఁడు, కృతజ్ఞుండు=మే లెఱిఁగినవాఁడు, మాయయ=శాశ్వతమైనవి కావు, అహీనఫలదము=గొప్ప ఫలము నిచ్చునది.

తాత్పర్యము

నూఱామడ విస్తారము, మూఁడు నూర్ల యోజనము లెత్తుగల రాక్షసుఁడొకఁడు వృత్రాసురుఁడను వాఁడు మూఁడు లోకములు నేర్పుతోఁ బాలించెను.

వాఁడు ధర్మమెఱిఁగినవాఁడు, మిక్కిలి బుద్ధిమంతుఁడు, మేలెఱిఁగినవాఁడు. వాని పాలనమున భూమి కామధేనువువలెఁ గందమూల ఫలములు పూలు నవ్వారిగా నొసఁగుచుండెను. భూమి సర్వసమృద్ధి గలదై యుండెను. దున్నకుండనె పండెను. ఈ విధముగా నుండఁగా వాని కితర సుఖములన్నియు ననిత్యములనియుఁ దపమె గొప్ప ఫలమిచ్చునది యనియుఁ దోఁప నడవులకుఁబోఁదలఁచి,)

క. మధురాపురి కగ్రసుతుం, బ్రథితబలున్ రాజుఁ జేసి ♦ వనములలోనన్
బృథునిష్ఠం దప ముండిన, వ్యథితాత్మకు లైరి యింద్రుఁ♦డాదిగ వేల్పుల్.

అర్థములు. పృథునిష్ఠన్=గొప్పనిష్ఠచే, వ్యథితాత్మకులు=బాధపడు మనస్సు గలవారు, వేల్పుల్=దేవతలు.

తాత్పర్యము

మధురాపురమునకుఁ దన పెద్దకొడుకును రాజుగాఁజేసి యడవికిఁబోయి యందు గొప్ప నియమము గలవాఁడై తపస్సు చేయఁగా దేవతలు మిగుల సంతసించిరి.

చ. హరిహయుఁ డంత జక్రధరు♦నార్తిని జేరి మహాత్మ! వృత్రుఁ డన్
సురరిపు వుగ్రమాతపము ♦ నూల్కొన లోకము తత్తఱించె వాఁ
డురుతరశక్తిశాలి కద ♦ నోర్వి జయింపఁగ నా కసాధ్య మీ
కరణిని దత్తపంబు కడ ♦ గాంచిన లోకము లుండునంతకున్. ౧౩౭౬

అర్థములు. హరిహయుఁడు=ఇంద్రుఁడు. నూల్కొనన్=చేయఁబూనఁగా, కదనోర్విన్=యుద్ధభూమియందు.

తాత్పర్యము

(అంత నింద్రుఁడు విష్ణువు సన్నిధికిఁబోయి దుఃఖముతో మహాత్మా! వృత్రుఁడను దేవ విరోధి యుగ్రమగు తపము చేయఁబూనఁగా లోకము తత్తఱపాటు చెందినది. వాఁడు మిగుల శక్తిగలవాఁడు. వానిని యుద్ధభూమిలో గెలుచుట నాకసాధ్యము. వాని తపము పూర్తియయ్యెనా లోకములుండువఱకు.)

క. మే మతనికి దాసుల మై, యీ మేనులు ప్రోవవలయు ♦ నిప్పుడు వానిన్
శ్రీమహిళేశ్వర! తీర్పఁగ, సామం; బది యెంత నీకు ♦ క్షణ మల్గినచోన్. ౧౩౨౨

అర్థములు. తీర్పఁగన్=చంపఁగ. నామంబు=తగిన కార్యము.

తాత్పర్యము

(మేము వానికి దాసులమై బ్రదుకవలెను. శ్రీలక్ష్మీనాథా! వాని నిప్పుడు చంపుట మంచిది; నీకుఁ గోపము వచ్చిన నది యెంతపని?)

క. నీకరుణ గన్నదాదిగ, లోకంబుల నెల్ల వాఁడు ♦ లోఁగొనె నిపు డీ
వే కరుణాకలితాత్మక, నాకుల రక్షింపఁదలఁపు ♦ నాళీకాక్షా. ౧౩౨౭

అర్థములు. నీకరుణ గన్నది ఆదిగన్=నీదయకుఁ బాత్రుఁడైనది మొదలు వృత్రుఁడు విష్ణుభక్తుఁడు, నాకులన్=దేవతలను, నాళీకాక్షా=కమలము వంటి కన్నులు గలవాఁడా.

తా త్ప ర్య ము

నీ దయ సంపాదించుకొన్నది మొదలు వాఁడు లోకములను లోపఱిచికొనెను. నీవు దయ తలంచి దేవతల రక్షింప యత్నింపుము.

క. నీవలన స్వస్థమానసు,లై వెలయఁగ నెదురు చూచు♦నమృతాంధసులో
దేవా! యున్నా రాశరు, గావర మడఁగించి జగముఁ♦గావంగదవే. ౧౩౨౯

అర్థములు. అమృతాంధసులు=దేవతలు, ఆశరు=రాక్షసుని యొక్క, కావరము=గర్వము.

తా త్ప ర్య ము

(దేవా! దేవతలు నీ వలన మనస్థిమితము గలవారై బ్రదుక నెదురుచూచుచున్నారు. రాక్షసుని పొగరణఁచి లోకమును గాపాడుము.)

తే. ధీరధర! సాధు లైనబృం♦దారకులకు, నిచ్చలును నీవ గతి వయి♦నివ్వటిలుచు
వింక దుస్సహ మెవ్వరి♦కేని దీనిఁ, జక్కఁదిద్దఁగఁ, గాన మా♦దిక్కు నీవ. ౧౩౩౦

అర్థములు. ధీరధర=మందర పర్వతము ధరించినవాఁడా, ధీరస్తునాబుధే, అంబుధౌచ త్రిషు త్వేష మందరే ధైర్యవత్యపి॥నానా॥ర॥ నిచ్చలు=సర్వదా.

తా త్ప ర్య ము

(మందరధరా! సాధువులైన దేవతలకు నీవే గతివై యున్నావు. దీనిదిద్దుట కెవరికిని సాధ్యముగాదు. కావున నీవే మాకు దిక్కు.)

—♦ విష్ణువు వాసవుతో వృత్రుఁజంప నుపాయంబు దెలుపుట ♦—

క. వాసవుఁ డిటు పల్కిన హరి, యే సౌహృదబద్ధుఁడం జుఁ♦డీ వృత్రుసెడన్
మీ సంతోషంబునకై, యే సంపఁగ నొల్లనచటి♦కేతెంచి యనిక్. ౧౩౩౧

అర్థములు. సౌహృదబద్ధుఁడన్=ప్రేమచే గట్టఁ బడినవాఁడను, ఏక్=నేను: సంపఁగన్=చంపుటకు, చంపు హూ, సంపు సారంగాహితమున్, సంపెఁ గనహర్ష మేపునఁ బొదలన్. హా. స. ౨ ఆ.

తా త్ప ర్య ము

(ఇంద్రుఁ డీ ప్రకారము చెప్పఁగా విష్ణు విట్లనియె. వృత్రునియందు నాకు స్నేహభావము గలదు. కావున మీ సంతోషమునకుఁ గాను నేను వానిని యుద్ధమందుఁ జంప నొల్లను.)

ఉ. ఐనను మీకు భద్రము న ♦ యంబునఁ గూర్చెద, నాదు తేజమున్
మానితశీలులార! బల ♦ మర్దనునందు శతారమందు భూ
మీనిలయంబునన్ నిలుప ♦ మేకొనువాఁడను దాన వృత్రహిం
సా నిపుణత్వ మొందుఁ బవి ♦ సాధను డంచన వేల్పు లెల్లరున్. ౧౩౭౨

అర్థములు. భద్రము=శుభము, బలమర్దనునందు=ఇంద్రునియందు, శతారమందున్=వజ్రమందు, భూమినిలయంబునన్ = భూప్రదేశమందు, మేకొనువాఁడను=అంగీకరించెదను, పవిసాధనుఁడు=ఇంద్రుఁడు, వృత్రహింసానిపుణత్వము=వృత్రునిి జంపుటయందు సామర్థ్యము.

తాత్పర్యము

అటు లున్నను మీకు మేలు గలుగు నుపాయము చెప్పెదను. నాతేజస్సును ఇంద్రునియందు వజ్రాయుధమందు భూమియందును నుంచెదను. దానిచే నింద్రుఁడు వృత్రుఁ జంప సమర్థుఁ డగును అని చెప్పఁగా దేవతలందఱు.

క. మ్రొక్కుచు నీ వతికరుణను, దిక్కగుటను మేము బ్రదికి ♦ తిమి లక్ష్మీశా!
రక్కసుఁ దునుమఁగ వాసవు,మక్కువ భరియింపు మాత్మ ♦ మహిమ నటంచున్.

తాత్పర్యము

(శ్రియఃపతీ! నీవు మిగుల దయతో రక్షించుటచే బ్రదికితిమి. రాక్షసునిఁ జంపుటకు నీ ప్రభావమున నింద్రునిఁ గాపాడవలె ననుచు,)

చ. బలరిపుఁ గూడి వృత్రుఁడు త ♦ పం బొనరించు వనంబుఁ జేరి ని
స్తులనిజభూరితేజమునఁ ♦ దోయదమార్గము నిర్దహించు న
ట్లలఘుతపంబునం గొఱలు ♦ నాతని గాంచి భయంబు నొంది రీ
బలియునిఁ జంపు టెట్లు? పరి ♦ భావముఁ బొందక యుండు టెట్లొకో? ౧౩౭౪

అర్థములు. బలరిపున్=ఇంద్రుని, నిస్తుల=అసమానమైన, నిజ=తనయొక్క, భూరితేజమున్=గొప్ప తేజస్సుచే, తోయదమార్గమున్ = ఆకాశమును, పరిభావము=అవమానము.

తాత్పర్యము

ఇంద్రునిఁ గూడి వృత్రుఁడు తపస్సు చేయు వనమునకుఁ బోయి తన తేజముచే నాకాశమును దహించువాని వలెనున్న వృత్రునిఁ జూచి యీబలశాలిని నెవ్విధముగఁ జంపఁగలము? ఎట్టు లవమానపడకుందుమని భయపడిరి.

మ. అని చింతింపఁగ వేల్పు లెల్లరు సహ ♦ స్రాక్షుండు వృత్రాసురున్
దునిమెం గ్రూరత ఘోరవజ్రహతిఁ బ్రో ♦ ద్యద్భాతజ్వాలజ్వాలముల్
జనతాభీతికరంబుగా నెగసెఁ గ ♦ ల్పం బో యనన్ సాధుచిం
తను నిష్కారణ మింద్రుఁ డిట్లు నఱకం ♦ దద్ఘోరపాపం బొగిన్. ౧౩౭౫

అర్థములు. సహస్రాక్షుండు=ఇంద్రుఁడు, ఘోరవజ్రహతిన్=భయంకరమైన వజ్రము దెబ్బచే, ప్రోద్భూత=పుట్టిన, జ్వలత్=మండుచున్న, జ్వాలముల్=శిఖలు, జనతా=జనసమూహమునకు, భీతికరంబుగాన్=భయము కలిగించునదిగా, కల్పంబో=ప్రలయకాలమో, సాధుచింతను = మంచి యాలోచన గలవానిని, నిష్కారణము=కారణము లేక, న్యాయయుద్ధమందుఁ జంపినవాఁడుకాఁడు, తత్+ఘోరపాపంబు=ఆ భయంకరపాపము.

తా త్ప ర్య ము

ఇట్లు దేవత లాలోచించుచుండ నింద్రుఁడు వజ్రముచే దయాహీనుఁడై చంపెను. అప్పుడు ప్రలయమో యనునట్లు మంటలు లోకులకు భయము కలుగునట్లు లెగసె. సాధుచింతగల వృత్రుని నిష్కారణముగఁ జంపఁగా నా ఘోర పాపము.

—• ఇంద్రునకు బ్రహ్మహత్య ప్రాప్తించుట •—

ఆ. బ్రహ్మహత్య వెంటఁ•బడ శచీవల్లభుఁ, డురుక విడువ కదియు•నఱిమె నతని
నాకవిభుఁడు వసరి•లోకంబుకడపలఁ, దమమునందు దాఁగె•నమరు లిచట.

అర్థములు. ఊఱుకన్=పరువెత్తఁగా, ఆయుధములు ధరించిన తమ్ముఁ జంపవచ్చినవారి నెవరిని జంపినను దోషములేదు. అట్లు గాకుండుటచే నింద్రునకు బ్రహ్మహత్య ప్రాప్తించెను.

తా త్ప ర్య ము

(బ్రహ్మహత్య వెంటఁబడఁగా నింద్రుఁడు పరువెత్తెను. అది విడువక నతని నాక్రమించెను స్వర్గాధిపతి దుఃఖించి లోకమున కవలఁ జీఁకటిలో దాఁగెను. అచట దేవతలు.)

చ. హతవిమతుల్ ప్రణష్టవిబు•ధాధిపు లగ్ని పురోగముల్ రమా
పతిఁ గన నేగి పల్కిరి స•పర్యలఁ దన్పి జగత్పితా! జగ
ద్గతి పరమేశ పూర్వజ జ•గత్పరిపాలన హేతు వౌని వి
ష్ణుతఁ గొని తీవు మ మ్మిపుడు•చూడుము సార దయార్ద్ర దృష్టులన్. ౧౬౭౭

అర్థములు. హతవిమతుల్=చంపఁబడిన శత్రువు గలవారు, ప్రణష్ట విబుధాధిపులు=ఇంద్రుని పోఁగొట్టుకొనినవారు, ఇంద్రుడు కానరాకపోయిన, అగ్నిపురోగముల్=అగ్ని మొదలగువారు, రమాపతిన్=విష్ణువును, సపర్యల=సేవలచే,తన్పి=తృప్తిపడఁజేసి, పూర్వజ=మొట్టమొదట పుట్టినవాఁడా.

తా త్ప ర్య ము

శత్రువు చచ్చుటయు ఆదోషమున నింద్రుఁడు కానరాకపోవుటయుఁ జూచి యగ్ని మొదలగువారు విష్ణునొద్దకుఁ బోయి సేవలు సేసి సంతోషపఱిచి పరమేశ్వరా! జగమును బరిపాలింప విష్ణువైన నీవు మమ్ము నిపుడు కనికరమునఁజూడుము.

క. చచ్చెను నీచే వృత్రుఁడు, వచ్చె నిపుడు బ్రహ్మహత్య • వాసవునకు నా
సచ్చరితుఁడు దుష్కృతమున,ముచ్చిర కుండఁగ నుపాయ•మున్ సెల విమ్మా.

తా త్ప ర్య ము

నీచే వృత్రుఁడు చచ్చెను గాని బ్రహ్మహత్య యింద్రునకు వచ్చెను. మంచి నడవడి గల యతఁడు ఆ పాపమున శోకింపకుండ రక్షింపుము. దాని కేదైన నుపాయము చెప్పుము.

క. అనవుడు విష్ణుం డి ట్లను ననుఁగూర్చి సవంబు సలిపి•నన్ శక్రుఁడు పా
వనుఁగా నొనరించెదఁ గావున నొక హయమేధ మతఁడు•పూనఁగ నిండీ

అర్థములు. సవంబు=యజ్ఞము.

తా త్ప ర్య ము

అని చెప్పఁగా విష్ణు విట్లు చెప్పెను. నన్ను గుఱించి యజ్ఞము చేసినచో నింద్రుని పవిత్రునిఁ జేసెదను. కావున నతఁ డశ్వమేధ యాగము చేయనిండు.)

తే. మరల సురలఁ గలయు • నరుగుఁ డటన్నను, వారు నల్లెయనుచుఁ•బని వినంగ
బ్రహ్మహత్యబలిమి • దానవుఁ డంధ త, మసమునందు వేష్ట•మానుఁడగుచు.

అర్థములు. పని వినంగన్=ఆజ్ఞ దీసికొని పోఁగా, అంధతమసమందు= గాఢాంధకారమందు, వేష్టమానుఁడు=చుట్టఁ బడినవాఁడు.

తా త్ప ర్య ము

(మరల దేవతలతోఁ జేరఁగలఁడని చెప్ప వారు 'మహాప్రసాద'మని సెలవు తీసికొని పోఁగా నింద్రుఁడు బ్రహ్మహత్య బలిమిచే గాఢాంధకారముచే నావరింపఁ బడిన వాఁడయి.)

—• ఇంద్రుఁ డశ్వమేధ మొనర్చి బ్రహ్మహత్యఁ దొలఁగించుకొనుట •—

చ. ఉరగముఁ బోలి నష్టమతి • యుం గతచేతనుఁ డౌచు నుండఁగా
ధరణి తపించెఁ, గాననవి • తానము లెండెఁ దరంగిణుల్ సరో
వరములు శోషిలెన్, వఱపు•వర్తిలె, భూతచయంబు లన్నియున్.
దరమునఁ దత్తఱిల్లె, విబు • ధప్రకరం బఖ ణ్డాజ్ఞ రీతిగన్. ౧౪౯౧

అర్థములు. ఉరగముఁబోలి = పామువలె, నష్టమతి=మనస్సు చెడిన వాఁడు, గతచేతనుఁడు=జ్ఞానములేనివాఁడు, కానన వితానములు=అడవి సమూహములు, తరంగిణుల్=నదులు, సరోవరములు=కొలఁకులు, శోషిల్లెన్=నీ రెండిన వయ్యెను, వఱపు = వానలేమిని, దుర్భిక్షము, దరమునన్ = భయముచే.

తాత్పర్యము

(ఇంద్రుఁడు పామువలెఁ జుట్టుకొనిపోయి, మతిచెడి, తెలివిలేక పడియుండ భూమి యుడికిపోయెను, అడవులెండిపోయెను, వదులు వట్టిపోయెను. వానలేద య్యెను, ప్రాణులన్నియు భయముచేఁ దత్తఱపోయెను, దేవతాసమూహా మప్పుడు విష్ణుమూర్తి యాజ్ఞప్రకారము.)

చ. హరిహయు నున్కిఁ బట్టెఱిఁగి • యాతనిఁ దేర్చి సవంబుఁ జేయ న
ధ్వరముతుదన్ మహాఘము బుధప్రతతిం గని నాకు నిల్వఁగా
నిరవు వచింపుఁడీ యనఁగ • నిట్లని రెల్లరు నాల్గుపాళ్ళుగా
దురితమ! కమ్ము, గట్టుపగతున్ విడి యుండుము యెందునేనియున్. ౧౩౯

అర్థములు. అధ్వరము తుదన్=యజ్ఞము కడపట, మహాఘము = బ్రహ్మహత్యా పాపము, బుధప్రతతిన్=దేవతా సమూహమును, ఇరవు=స్థలము, దురితమ=పాపమా, నాలుగుపాళ్ళు=నాలుగు భాగములు, గట్టుపగతున్=ఇంద్రుని

తాత్పర్యము

ఇంద్రుఁడుండు స్థలము దెలిసికొని యతని సమాధానపఱిచి యజ్ఞము చేయఁగా యజ్ఞము కడపట బ్రహ్మహత్య దేవతలారా నే నెందుందును చెప్పుఁడని కోరఁగా నీవు నాలుగు భాగములు యింద్రుని విడిచి యెందైన నుండుము అనిరి.

సీ. అనవుడు నా బ్రహ్మ•హత్య యిట్లు వచించె, వానకారున నాల్గు•పక్షములను
గామవారిణి నయి • కలుషమానసదర్ప, నాశిని నై పూర్ణ•నదులయందు
నేకాంశమున నుందు • నింకొక్క భాగానఁ జవుడుగా నెప్పుడు•క్ష్మానసింతు
దర్పసంపూర్ణలై•తనరు యౌవనయుక్తి, నారులయందు మూ•న్నాళ్ళులుందు

ఆ. వారికామమదము•వారింప మూఁడవ, యంశమునను; మిగులు•నంశమునను
గల్లలను నమాప•క బ్రహ్మణులఁ జంపు, నారియం దమర్త్యు•లార! యుందు.

అర్థములు. వానకారున=వానకాలమందు, నాల్గుపక్షములు=రెండు నెలలు, సింహకర్కాట మాసములందు, శ్రావణాషాఢమాసములు, కామవారిణినై = స్నానము చేయువారి కోరికను వారించు దాననై, కలుషమానస=పాపపుమనస్సు గలవారి, దర్పనాశినినై =దర్పము నాశముచేయుదాననై, పూర్ణనదులయందు= నిండుగాఁబాఱు నదులయందు, ఏకాంశమున=ఒక్కభాగమున.

నదీరజోదోషనిర్ణయము

మార్కండేయః ద్విమాసం సరిత స్సర్వా భవంతి హి రజస్వలాః। అప్రశస్తం తతః స్నానం వర్షాదౌ నవవారిణి॥ వ్యాఘ్రపాదః, సింహ కర్కాటయోర్మధ్యే సర్వానద్యోరజస్వలాః, తాసు స్నానంనకుర్వీతవర్జయిత్వా మహానదీః। ఉపాకర్మణి

చోత్సర్గే ప్రేతస్నానే తథైవచ। చంద్రసూర్య గ్రహేచైవ రజోదోషోనవిద్యతే। అభావే కూపవాపీనా మనపాయి నమో భృతామ్॥ రజోదుష్టేపి పయసి గ్రామ భోగో న దుష్యతి॥ దీనివలన ఆషాఢ శ్రావణములందు క్రొత్తనీటియందు నదు లలో స్నానము చేయరాదు. మహానదులం దనఁగా ఉపనదులు గాక ప్రత్యక్ష ముగా సముద్రములోఁ గలియు గంగా, కావేరి, గోదావరి, తామ్రపర్ణి నర్మద, సింధులోనగు నదులందు స్నానము చేయవచ్చును. ఉపాకర్మమందు, ఉత్సర్గమందు ప్రేతస్నానమందు, చంద్ర సూర్య గ్రహణములందు రజోదోషము లేదు. బావులు తీర్థములు గాని విడువక యుండు జలాశయములు గాని లేని గ్రామములందు నేటి స్నానము దుష్టము గాదు.

తా త్ప ర్య ము

దేవతలిట్లు చెప్పఁగా బ్రహ్మహత్య యిట్లనియె. వానకాలమందు రెండు నెలలు కామము వారించు దాననై పాపాత్ములదర్ప మణఁచు దాననై యొక భాగమున నిండుగాఁ బాఱు నదులందునను, రెండవభాగమున భూమియందు చవుడై యుందును. మూఁడవ భాగమున యౌవనదర్పము గల స్త్రీలు పురుషు లతో సంభోగించి సుఖపడకుండ మూఁడుదినము లుందును. నాలుగవ భాగమున నిర్దోషులగు బ్రాహ్మలను గల్లలచే నపకీర్తిపాలు చేయు వారియం దుందును.

క. అనవుడు నీ కోరినవిధ,మున నుండు మటంచు నమర♦ముఖ్యులు పలుకం
జనె నదియుఁ బూతుఁడౌ శ,క్రుని దోడ్కొని చనిరి సురలు♦కువలయ మలరన్

అర్థములు. కువలయము=భూచక్రము.

తా త్ప ర్య ము

(అని యడుగఁగా నీవు కోరినట్లే యుండుమని దేవతలు చెప్పఁగా నది పోయెను. పవిత్రుఁడైన యింద్రుని తోడ్కొని దేవతలు భూలోకము సంతసిం పఁగాఁ బోయిరి)

—♦ శ్రీరాముఁడు లక్ష్మణునకు నిలుని వృత్తాంతముఁ దెలుపుట ♦—

ఉ. ఇట్టిది యశ్వమేధ మన ♦ నీ వొనరింపుము దానినంచుఁ దో
బుట్టు నచింప రాఘవుఁడు ♦ పొంగి హసించుచు నశ్వమేధ మా
నట్టిద కర్దమాత్మజుఁ డ ♦ నంతయశుం డిలనామధేయధా
త్రీట్టను బాహ్లి కేశ్వరుఁడు♦ నియ్యది సల్పెను మున్న లక్ష్మణా! ౧౩౯౭

తా త్ప ర్య ము

అర్థములు తోఁబుట్టువు=తమ్ముఁడు, కర్దమాత్మజుఁడు=కర్దమ ప్రజాపతి కుమారుఁడు, ఇలనామధేయ=ఇలుఁ డను పేరుగల, ధాత్రీట్టు=రాజు బాహ్లికేశ్వ రుఁడు=బాహ్లిక దేశ ప్రభువు.

తా త్ప ర్య ము

(ఇట్టి ప్రభావము గలది యశ్వమేధ మని చెప్పఁగా, లక్ష్మణుఁడు, అన్నా! నీవు దానిని జేయుమనఁగా సంతసించి, నవ్వుచు అవును. అశ్వమేధమట్టిదే, మిగులఁ బ్రఖ్యాతి వడసిన కర్దమ ప్రజాపతి కుమారుఁడు బాహ్లికదేశమునకుఁ బ్రభువు నగు నిలుఁడను రాజు దీనిని జేసెను.)

చ. తనవశమున్ ఘటించి వసు ♦ ధాతల మంతయు ధర్మపద్ధతిన్
జనులను నాత్మపుత్రకుల ♦ చందమునన్ భరియించె వేల్పులున్
దనుజులు నాగరాక్షసులు ♦ తత్పరులై భయయుక్తి నమ్మహా
త్ముని భజియింతు రీ భువన ♦ ముల్ వణఁకుం గిను కాతఁ డూనినన్. ౧౩౯౬

అర్థములు. కినుపు=కోపము.

తా త్ప ర్య ము

(భూమండలంబంతయుఁ దన స్వాధీనము చేసికొని ప్రజలను దన కన్నబిడ్డల వలెఁ బోషించెను. దేవతలు, దానవులు, నాగులు, రాక్షసులు లోబడి భయముతో నతనిఁ గొలుతురు. ఈ లోకములన్నియు నతఁడు కోపించిన గడ గడ లాడును.)

చ. ఇలుఁ డిటు ధర్మవీర్యమతు ♦ లెంతయు వాసిఘటింప నేలుచోఁ
జెలువపుఁ జైత్రమంతఁ దఱి ♦ సెన్ మృగయాభిరుచిన్ నృపాలుఁడున్
బలభటవాహయుక్తుఁ డయి ♦ బంధురకాననసీమ కేగి జం
తులఁ బరిమార్చి వేలకొల ♦ నుల్ దనివింగనఁజాల కొక్కటన్. ౧౩౯౭

అర్థములు. ధర్మవీర్యమతులు=ధర్మము బలము బుద్ధి, తఱిసెన్=సమీపించెను, మృగయ+అభిరుచిన్=వేఁటయందలి కాంక్షచే, బలభటవాహయుక్తుఁడయి=సేనాభటులతోను గుఱ్ఱములు మొదలగు వాహనములతోను, బంధుర కాననసీమకు=దట్టమైన యడవిప్రదేశమునకు, జంతులున్=మృగములను.

తా త్ప ర్య ము

ధర్మము, బలము, బుద్ధిచేఁ బ్రసిద్ధుఁడైన యిలుఁడు రాజ్యమేలుచు నొక చైత్రమాసమున వేటాడఁగోరి సేనాభటులను గుఱ్ఱములు లోనగు వాహనములను దీసికొని దట్టమైన యడవి కేగి వేఁటాడి తృప్తిలేక.

తే. షణ్ముఖుం డుదయించిన ♦ స్థలముఁ జేరె, నందు గౌరీసమేతుఁడై ♦ హరుడు కేళిఁ
దేలుచుండెను బరిచర ♦ జాలయుక్తి, భార్యప్రీతికి నాఁడురూ ♦ పంబుఁ దాల్చి. ౧౩౯౮

అర్థములు. షణ్ముఖుడు=కుమారస్వామి, పరిచగ జాలయుక్తి=సేవకు రాండ్ర సమూహముతో.

తాత్పర్యము

పోఁ బోయి కుమారస్వామి పుట్టిన స్థలము చేరెను అందు శివుఁడు భార్యను సంతోషింపఁ జేయ నాఁడు రూపము దాల్చి పరిచారికలతోడ భార్యతోఁ గ్రీడించు చుండెను.

ఉ. అందలి భూరుహంబులును ♦ ప్రాణులు సర్వము నాఁడురూపముం
జెంది రహించు చుండె నటఁ ♦ జేరి ధరాపతి వింత చూచుచో
సుందరి యయ్యెఁ దాను నది ♦ చూచి మహావ్యసనాబ్ధి మున్గి బా
లేందు కిరీటుకృత్య మని ♦ యెంచి సభృత్యుఁడు సానుగుండునై ౧౩౯

అర్థములు. భూరుహంబులును=చెట్లును, సుందరి=ఆఁడుది, బాలేందు కిరీటు=శివునియొక్క, కృత్యము=కార్యము.

తాత్పర్యము

అక్కడఁ జెట్లును ప్రాణు లన్నియు నాఁడు రూపములు ధరించియుండెను, అక్కడఁ జేరి యందలి వినోదములు చూచుచుండఁగా నాయనయు నాఁడుదయ్యెను. దానికిఁ జాల శోకించి యిది శివుఁడు చేసినపనియని తలంచి భృత్యులతోను సహచరులతోను.

—•* ఇలుఁడు స్త్రీయై పార్వతీ పరమేశ్వరుల శరణుఁ జొచ్చుట ♦—

క. త్రినయను శరణముఁ జొచ్చినఁ, గని యీశుఁడు నగుచు లెమ్ము ♦ కర్దమతనయా
వనితాత్వచ్యుతి తక్కఁగ, మనుజేశ్వర! వరము కోరు ♦ మా యెది యైనన్.

అర్థములు. త్రినయను=శివుని, వనితాత్వచ్యుతి తక్కఁగన్=ఆఁడుతనము పోవలయుననునది తప్ప.

తాత్పర్యము

(శివుని శరణు చొరఁగా జూచి, నవ్వి రాజా! లెమ్ము! ఆఁడు తనము పోవలయు ననునది తప్ప మఱియేదియైన వరము కోరుము.)

క. శంకరు వాక్యములకుఁ బతి, సంకటపడి యన్య మేది ♦ సమ్మతి లేమిన్
శంకరి పదముల వ్రాలెం గింకరుఁడను దల్లి! ప్రోచి ♦ కీర్తిం గొనుమా. ౧౪౧

అర్థములు. శంకరి=పార్వతి.

తాత్పర్యము

(శంకరుని మాటలను విని సంకటపడి, మఱేది కోరుట కిష్టములేక పార్వతి పాదములమీఁదఁబడి తల్లీ! కింకరుఁడను, నన్ను రక్షించి కీర్తి వడయుము.)

ఉ. ఏలికసాని వీవు జగ ♦ మెల్లను బ్రోవఁగ దేవి కామితా
ర్థాళి ఘటింప శక్తవు ద ♦ యామతివిన్ వరదానకర్త్రి వే
వేళఁ ద్వదీయదర్శనము ♦ విశ్రుతసౌఖ్య నిదానమౌట శ్రీ
లోలవిలోచనా! యఘము ♦ లోఁగొని నన్ను క్షమింపు మీశ్వరీ! ౧౪౦౨

అర్థములు. ఏలికసానివి=ఈశ్వరివి, కామితార్థాళి=కోరిన ప్రయోజనములు శక్తవు=శక్తిగల దానవు, దయామతివి=దయగల దానవు, వరదానకర్త్రివి= వరము లిచ్చు దానవు, అఘము=పాపము.

తాత్పర్యము

(దేవీ! లోకము లన్నియుఁ గాపాడ నీ వీశ్వరివి. కోరిన కోరిక లీయసమర్థురాలవు. దయగల దానవు. వరము లిచ్చు దానవు నీ దర్శనము శాశ్వత సౌఖ్యమునకు నిదానము. నా యపరాధమును లోఁగొని నన్ను క్షమింపుము.)

ఆ. నన్నుఁ గరుణఁ జూడు♦కన్నతల్లివి నీవు, తల్లిగాక యెవరు♦తనయు మొఱల
నాలకించువార♦లంబ! నీ చరణముల్, వదల నన్ను జేయి ♦ వదలితేని. ౧౪౦౩

తాత్పర్యము

(నీవు కన్నతల్లివి. నన్నుఁ గరుణింపుము. తల్లిగాక తనయుల మొఱవినువారెవరున్నారు అమ్మా! నీవు నన్నుఁ ద్రోసివేసినను నీపాదములు నేను వదలను.)

క. నావుడు ధరణీవల్లభు, భావంబు నెఱింగి పల్కె ♦ భవ సమ్మత యో
భూవర నేను వరార్థం, బీనచ్చు హరుండె కర్త♦యీయాయఁగఁ గోఱతన్. ౧౪౦౪

అర్థములు. భవసమ్మత=ఈశ్వరునకుఁ బ్రియురాలు, వరార్థంబు=సగము వరము.

తాత్పర్యము

(అని చెప్పఁగా, పార్వతి రాజు నభిప్రాయము తెలిసికొని రాజా! నేను నీకు సగము వర మీయవచ్చును. తక్కిన కొఱత పూర్తిచేయుటకు శివుఁడే కర్త యని చెప్పెను.)

ఇలుఁ డొకనెల స్త్రీగను నొకనెల పురుషుఁడుగ నుండఁ బార్వతి యనుగ్రహించుట

ఆ. ఏది కోరె దనిన♦ నృపుడు సంతోషించి, శైలతనయ! సుప్రసన్న వేని
మాస మొండు పురుషు♦మాడిక్కనై యొక నెల,యనుపమానసుంద♦రాంగినగుచు.

అర్థములు. అనుపమాన సుందరాంగి = అసమాన సౌందర్యము గల యాఁడుది.

తా త్ప ర్య ము

ఏ వరము కోరెద వని పార్వతి యడుగ, రాజు సంతోషించి అమ్మా! నీవు నాయందుఁ బ్రసన్నవైనచో నొక నెల పురుషుఁడనై యొక నెల యసమాన సౌందర్యముగల యాఁడు దాననై.)

తే. ఉండ వరమిమ్మటన్న వే॰తండయానయుండు మట్టుల నృప! పురు॰షుండవగుచు
నుండువేళల స్త్రీభావ॰ముదిదయైన, వేళ బురుషత్వ మాత్మలో॰విస్మరింపు.

అర్థములు. విస్మరింపు=మఱవుము.

తా త్ప ర్య ము

ఉండునట్లు వర మీయఁగోరెద ననఁగా పార్వతీదేవి నీవు కోరినట్లులే యుండుము. పురుషుఁడ వైనప్పుడు స్త్రీవై యున్న విషయము, స్త్రీవైనపుడు పురుషుఁడుగా నున్న విషయము మఱచి పొమ్ము.

క. వర మొంది యిట్లు కార్దమి, పురుషుండుగ నెలయు నెలయుఁ॰బోలఁతుకయగుచున్
బరఁగె నిలయనఁగఁ బేరను, నరపతియయి రాజ్యపాల॰నము గావించెన్. ౧౮౦౭

అర్థములు. కార్దమి=కర్దముని పుత్త్రుఁడు.

తా త్ప ర్య ము

కర్దముని కొడుకయిన యిలుఁ డిట్లు వరమును బొంది నెల మగవాఁడై, నెల యాఁడుదియై యిల యను పేరుతో నుండెను. రాజయి రాజ్యము పాలించెను.)

—॰ ఇలుఁడు స్త్రీయై బుధుని యాశ్రమంబుఁ జేరుట ॰—

చ. అన విని విస్మయంబున ధ ॰ రాధిపుఁ గన్గొని తమ్ములాడి రా
మనుజవిభుం డ దెట్టులొకొ ॰ మానిని యై చరియించె నంతకం
టెను గలుగంగ నేర్చునొకొ ॰ నీచపు దుర్గతి? యేమిచేసెనో
వనజదళాక్షి యాచు మగ॰వాఁడుగ నై వివరింపుమీ యనన్. ౧౮౦౮

తా త్ప ర్య ము

(అని చెప్పఁగా విని యాశ్చర్యమున రాజాను దమ్ము లనిరి. ఆ రాజు ఆఁడు దియై యెట్లు తిరిగెను? అంతకంటె నీచమైన దుర్గతి కలదా? ఆఁడుదియై యేమి చేసెను? మగవాఁడుగనుండి యేమి చేసెను? వివరముగాఁ దెలుపుమని యడుగఁగా.)

చ. తొలుతటిమాసమం దతఁడు ॰ తోయజలోచన యాచుఁ బూర్వభృ
త్యులు సతు లై భజింపఁగ న॰ తుల్యమనోహరరూపకాంతి ది
క్కులు వెలిఁగింప భూమిరుహ ॰ గుల్మలతాపరికీర్ణ కాననం
బులఁ జరియించెఁ గాల్నడన ॰ మున్పటి యానములెల్లఁ బాయుచున్. ౧౮౦౯

అర్థములు. పూర్వభృత్యులు=మగవాఁడుగా నున్నప్పటి భృత్యులు, భూమిరుహగుల్మలతావరికీర్ణకాననంబులన్=చెట్లుపొదలు తీఁగలు వీనిచే వ్యాపించిన యడవులందు, యానములు=వాహనములు.

తా త్ప ర్య ము

మొదటి నెలయందతఁడు స్త్రీయై మునుపటి భృత్యులందఱు స్త్రీలై తన్ను సేవింపఁగా చెట్లచేతను పొదలచేతను దీఁగలచేతను వ్యాపించిన యడవులందు మునుపటి వాహనములన్నియు వదలి కాలినడకతో సంచరించెను.

క. ఇటు హేళిఁ జరించుచు న,క్కుటిలాలక గాంచెఁ బూర్ణ♦కువలయమిత్ర
స్ఫుటరోచుల వెలిఁగెడుబుధుఁ దట దేశసదేశమునను♦దప మొనరింపన్. ౧౪౧౦

అర్థములు. హేళిన్=విలాసముగా, కుటిలాలక=స్త్రీ, పూర్ణకువలయమిత్ర స్ఫుటరోచులన్=నిండు చంద్రుని విశదకాంతులతో, తటదేశసదేశమునను=ఆ పర్వత ప్రదేశ సమీపమందు.

తా త్ప ర్య ము

ఆ స్త్రీ యిటు విలాసముగఁ దిరుగుచు పూర్ణచంద్రుని కాంతి గలిగి యా పర్వత సమీపమందుఁ దపము చేయు బుధుని జూచెను.

క. జలజారిసుతు వయస్థుని, జలమధ్యమునందుఁ దపము♦సలుపఁగఁ గని యా
యిల పరిజనవనితలతో, జలకేళిం జలుపఁ జొచ్చె♦సరసీవారిన్. ౧౪౧౧

అర్థములు. జలజారిసుతున్=చంద్రుని కుమారిని, వయస్థుని=ప్రాయపు వానిని.

తా త్ప ర్య ము

చంద్రుని కుమారుఁడును ప్రాయపువాఁడు నగు బుధుఁడు నీళ్ళనడుమతపము చేయఁగా జూచి యా కొలని నీటియందే పరిచారికలతో జలక్రీడకై దిగెను.

—* బుధుఁ డిలాదేవిని జూచి మోహించుట *—

చ. నళినదళాక్షిఁ గాంచి శశి ♦ నందనుఁడున్ స్మరబాణపాతసం
చలితమనస్కుఁడై తపము ♦ సల్పుట మాని తదేకచిత్తుఁడై
చెలువ మొగంబుఁ గాంచుచు వి♦శిష్టచరిత్రుఁడు బాసవాలుక
న్నెల తలఁ దన్ను సోయగము♦నీటును గాంచెని దేవాలంతియో? ౧౪౧౨

అర్థములు. శశినందనుఁడు=చంద్రుని కుమారుఁడు, చంద్రునకు తారయందు జనించినవాఁడు బుధుఁడు. స్మరబాణపాత=మన్మథబాణములు పడుటచే, సంచలిత మనస్కుఁడై = చలించిన మనస్సు గలవాఁడై, తదేకచిత్తుఁడై = దాని

యందే మనస్సుంచినవాఁడై, విశిష్టచరిత్రుఁడు=మిగుల శ్రేష్ఠమైన నడవడి గల వాఁడు, బాసవాలు కన్నెల=దేవతాస్త్రీల, తలదన్ను=అతిక్రమించు, సోయగము=చక్కఁదనము.

తాత్పర్యము

బుధుఁడా స్త్రీని చూచి కామ బాణములచే మనస్సు చలించినవాఁడై తపస్సు వదలి దాని మొగమును జూచుచు దానియందే మనస్సు నిలిపి దేవతా స్త్రీల చక్కఁదనమును నీటును మించు దాని చక్కఁదనమును జూచుచుండి యా స్త్రీ యెవ్వతయో.

క. అచ్చరలమిన్నలందు వి,యచ్చరసతులందు నాసు•రాంగనలందున్
మెచ్చిచ్చు పాఁపపాపల, నిచ్చిగురుంబోఁడి నెనయు•నింతిని గానన్. ౧౪౧౩

అర్థములు. అచ్చరలమిన్నలందు=అప్సరః స్త్రీలయం దుత్తమురాండ్రను, వియచ్చర సతులందు=ఇతరదేవతా స్త్రీలయందు, అసురాంగన లందున్=రాక్షస స్త్రీలయందు, పాఁపపాపలన్=నాగకన్యకలందు, ఇచ్చిగురుంబోడిన్=చిగురువలెఁ గోమలమైన దేహముగల దీనిని, ఎనయు=సరిపోలు, ఇంతిని=స్త్రీని.

తాత్పర్యము

(అప్సర స్త్రీలందలి, యుత్తమరాండ్రయందు, నితరదేవతా స్త్రీలయందు, రాక్షస స్త్రీలయందు, మెచ్చఁదగిన నాగకన్యకలం దీ చిగురుఁబోఁడితో సాటియైన స్త్రీని జూడలేదు.)

క. పరునిం బెండ్లాడనిచోఁ, దరుణీమణి నాకుఁ దగిన•దయితయ యంచున్
సరసీజలనిర్గతుఁడై, యరిగి నిజాశ్రమములోని • కబ్జేక్షణలన్. ౧౪౧౪

అర్థములు. దయితయ=ప్రియురాలు, సరసీజల నిర్గతుఁడై=కొలని నీటినుండి వెలువడినవాఁడై, అబ్జేక్షణలన్=పరిచారిక స్త్రీలను.

తాత్పర్యము

ఇంతకుముం దిది యెవ్వరిని బెండ్లాడకుండెనా; యిది నాకుఁ దగిన ప్రియురాలు అని తలఁచుచు కొలని నీటినుండి వెలుపల వచ్చి తన యాశ్రమము లోనికిఁ బోయి యా స్త్రీలను.

చ. పిలిచి మృగాక్షులార! యలి • వేణి యెవర్తుక? యేల యీవనీ
తలమున సంచరించెడి? య • థాస్థితి సర్వముఁ దెల్పరే యనన్
సలలితవాక్యము ల్విని వ • శాగమనామణి మాకు భర్త్రి, య
ప్పొలఁతికి బెండ్లి లేదు, వన•భూముల మాబడి సంచరించెడిన్. ౧౪౧౫

అర్థములు. వశాగమనామణి=ఆఁడేనుఁగు నడకవంటి నడకగలది, భర్త్రి=యజమానురాలు.

తా త్ప ర్య ము

(పిలిచి యో వనితలారా! యీ సుందరి యెవతె? ఈ వనమునం దేల సంచరించు చున్నది? వాస్తవమెఱింగింపుఁ డని యడుగ, వా రాతని మాటలువిని యీ చాన మా యజమానురాలు; ఆమెకుఁ బెండ్లి లేదు-అడవులలో మాతోఁ గూడి సంచరించు చున్నది.)

క. అని శశివదనలు పలికినఁ దనవిద్యామహిమ వారి ♦ త త్త్వం బెల్లన్
మనమున నెఱింగి వారల, కనియెన్ మీ రెల్లఁ బర్వ♦తావనియందున్. ౧౮౧౬

అర్థములు. పర్వతావని యందున్=పర్వతప్రదేశమందు

తా త్ప ర్య ము

(అని యా చంద్రముఖులు చెప్పఁగా వారి యథార్థమును దన విద్యా ప్రభావమున మనస్సులోఁ దెలిసికొని వారలతోఁ జెప్పెను. మీరంద ఱీ పర్వత ప్రదేశమందు.

తే వాసమును గొంచు నుండుఁడు ♦ వనితలార!
వలయు ఫలములఁ గూర్తును ♦ వలసినన్ని
పురుషు లౌదురు మీకుఁ గింపు ♦ రుషు లనిన
నెలవుకొని రందు వా రెల్ల ♦ నిమ్మళముగ. ౧౮౧౭

తా త్ప ర్య ము

(నివసింపుఁడు-మీకుఁ గావలసినన్ని ఫలముల సమకూర్చెదను. కింపురుషులు మీకుఁ బురుషులయ్యెద రని చెప్పఁగా వారందఱు నిమ్మళముగ నచ్చట నివాసము చేసిరి.)

—♦ ఇలాదేవి బుధునితోఁ గలియుట ♦—

క. భరతుఁడు సౌమిత్రియుఁ గిం, పురుషాబ్జేక్షణల పుట్టు♦వున్ విని రామా!
ధరణీనాయకు నావలి, చరితము వినిపింపు మనిన♦క్ష్మాపతి యనియెన్. ౧౮౧౮

తా త్ప ర్య ము

(భరతుఁడు లక్ష్మణుఁడు కిన్నర స్త్రీల జననమును విని రామచంద్రప్రభూ! యిలుఁడు తరువాత నేమి చేసెను? వినిపింపుమని యడుగ రాజు వారికిఁ జెప్పెను.)

క. కిన్నరయోషల దవ్వుగ, నన్నియమివరుండు పంచి♦హాసంబున నం
దున్న యిలాసతికిం దాఁ, జెన్నగు నుడి నిట్టు లనియె♦శీతాంశుముఖి! ౧౮౧౯

అర్థములు. కిన్నర యోషలన్=కింపురుష స్త్రీలను, కిన్నరులు కింపురుషులు వేఱువేఱయినను పురుషశబ్ద పర్యాయముగ నిచట నరశబ్దము ప్రయోగింపఁ

బడెను. దవ్వగన్=దూరముగ, నియమివరుండు=తపస్వి, హాసంబునన్=నవ్వుతో, ఇది కామముచేఁ గలిగిన సంతోషచిహ్నము.

తాత్పర్యము

(ఆ బుధుఁడు కింపురుష స్త్రీలను దూరముగాఁ బంపి, యిలాదేవిని జూచి నవ్వుచు నింపగు మాటలతో నిట్లనెను. చంద్రముఖీ!)

క. సోమునిసుతుఁడను బుధుఁడను, భామిని ననుఁ జూడు స్నేహ•పర్యాకుల దృ
క్స్తోమంబుల నన నిర్జన, భూమిని గామిని వచించె•బురుమోదమునన్. ౧౪ ౨౦

అర్థములు. సోమునిసుతుఁడను=చంద్రుని కుమారుఁడను, స్నేహపర్యాకుల=స్నేహముచేఁ గలఁతపడిన, దృక్+స్తోమంబుల=చూపుగములచే, నిర్జనభూమిని=జనములేని ప్రదేశమందు, జనములేని యడవియందొక్కఁడైన మనుష్యుఁడుకనఁబడెను గదా యనియు, నెవ్వరులేని కారణమున మనస్సు దాఁపక చెప్పవచ్చుననియు భావము, కామినీ=కామముగలది. యిట్లనుటచే బుధుని చూడఁగానే యిలకును గామము జనించెనని భావము. పరికరాంకురాలంకారము, పురుమోదమునన్=అధిక సంతోషముతో.

తాత్పర్యము

(నేను జంద్రుని కుమారుఁడను నన్ను బుధుఁడందురు. ప్రేమపుఁ జూపుల నన్నుఁ జూడుము. అని చెప్పఁగా, నిలాదేవి యధిక సంతోషముతో.)

ఉ. నేను స్వతంత్ర సోమసుత! • నీకడ నుండెద నెద్ది పంచినన్
మానక చేయుదాన నన • మానినిమాటకుఁ బొంగి యాతఁడున్
దానిని గూడియుండ సుఖ•తత్పరుఁడై త్రుటివోలె నెప్పుడో
యా నెల మాధవం బరిగి • నంతట సుప్తుఁడు లేచి దిగ్గనన్. ౧౪ ౨౧

అర్థములు. స్వతంత్రన్=వివాహము కాని దానను కావున నొకనిస్వాధీనమందుండు దానఁ గాను, మాధవంబు=మాధవము వైశాఖమాసము, సుప్తుఁడు=నిద్రపోవువాఁడు, ఆఁడుదిగా నిద్ర పోయినవాఁడు నెల కడపటి దినమందు మగవాఁడుగా నిద్రలేచెనని భావము.

తాత్పర్యము

(బుధా! నేను స్వతంత్రురాలను, నీయొద్ద నుండెదను. నీవేది చెప్పిన నది తప్పక చేసెదను. అని చెప్పఁగా నాతఁడు పొంగి దానిని గూడి సుఖముగా నుండఁగా వైశాఖమాసము క్షణములో నెప్పుడో జరిగిపోయెను. నిద్రపోయిన వాఁడు తత్క్షణమె లేచి)

చ. ఉదకములోన నిల్చి కర • యుగ్మము నెత్తి తపం బొనర్చు నా
సదయునిఁ గాంచి మౌనివర! • సానుచరుండును దుర్గసీమ నేఁ
గదుకొని వేట వచ్చితిని • గానను భృత్యుల నెందుఁ బోయిరో
మదిఁ దలపోసి చెప్పు మన • మానవపాలునితో బుధుం డనున్. ౧౪౨౨

అర్థములు. సానుచరుండను=భటులతోఁ గూడిన వాఁడను, దుర్గసీమన్=అడవియందు, కదుకొని=అతిశయించి.

తాత్పర్యము

(నీటిలో నిలిచి రెండుచేతులు పైకెత్తి తపము చేయుచు నా బుధునిఁ జూచిఁ మునిశ్రేష్ఠా! నేను భటులతోఁ గూడి వేఁటకు వచ్చితిని. నా భృత్యుల నెచ్చటికి బోయిరో కాన రాలేదు. మీరు మనస్సులో యోజించి చెప్పుఁడని యడుగఁగా రాజుతో బుధుఁడు చెప్పెను.)

ఆ. రాలవాన గురిసి • రాజ! నీ సైన్యంబు, మంటిఁ గలసె నాశ్ర•మంబునందు
వాతవర్షభయము•వలన నుండుటఁ జేసి, బ్రతికినాఁడ వేల•భయముపడెదు.

అర్థములు. వాతవర్షభయము=గాలివాన వలన భయము, ఇది యసత్యము అయినను అతని మేలునకే చెప్పఁబడినది.

తాత్పర్యము

(రాజా! నీ సైన్యము రాలవానవలన నశించిపోయినది, ఆశ్రమము నందుండుట చేత గాలివాన వలని భయము లేక నీవు బ్రదికినావు. నీ వెందుకు భయపడెదవు?)

క. ఫలమూలంబులఁ దినుచున్, నిలుమీ నీ విం దటన్న • నిజసైన్యాళీ
విలయంబునకున్ వగచుచుఁ, బలికెం దారేయుతోడ • వ్యసనార్తుండై. ౧౪౨౪

అర్థములు. తారేయు తోడన్=బుధునితో, తారాపుత్రునితో.

తాత్పర్యము

(పండ్లు దుంపలు తినుచు నీ విచట నిలువుము. అని చెప్పఁగా, తనసేన నశించి పోవుటకు దుఃఖించుచు బుధునితోఁ జెప్పెను.)

క. విడచితి రాజ్యము భృత్యులు, మడిసిరి నే నిందు నిలువ • మరియాద గునే?
యిడు మాజ్ఞఁ జనెద నాకుం, గొడుకగు శశిబిందుఁ జలుపఁ గువ • లయపతిగన్.

అర్థములు. కువలయపతిగన్=రాజుగా.

తాత్పర్యము

(రాజ్యము విడిచి వచ్చితిని. భృత్యులందరు చచ్చిరి. నే నిచట నిలుచుట మరియాదగా నుండునా? ఆజ్ఞ నొసఁగుఁడు పోయెదను. నా కొడుకయిన శశిబిందుని రాజుగాఁ జేయవలెను.)

క. చనియెద భృత్యుల దారల, జనముల సౌఖ్యముల విడిచి॰సంయమివలె నే
వనముల నుండఁగఁ దగునే?, మునినాథా! యశుభవాక్య॰ములు పలుక- కవన్.

తా త్ప ర్య ము

(పోయెదను భృత్యులను, భార్యలను, జనులను, సౌఖ్యములను వదలి తపస్వి వలె నేనడవులలోఁ బడియుండఁదగునా? మునీంద్రా! అశుభములయిన మాట లన కుము. అని పలుకఁగా.)

క. రాజేంద్రుని సూక్తులకున్, రాజసుతుం డబ్రపడుచు॰రాజా! యేలా
యోజన చేసెదు? నిలు మిట, రాజితహిత మేను వత్స॰రము గడచనినన్.

అర్థములు. వత్సరము=ఏఁడాది, కడచనినన్=దాఁటిపోఁగా, ఇల గర్భిణి కావున నీ గడువు సంవత్సరము కడవఁగానే నీకు.

తా త్ప ర్య ము

(రాజు చెప్పిన మాటల కాశ్చర్యపడి బుధుఁడు, రాజా! యేల యోజించెదవు ఇచ్చట నుండుము. ఒక యేఁడాది కడచిన పిమ్మట నేను నీకు మేలు)

—॰ ఇలాదేవి పురూరవుం గనుట ॰—

క. కూరుతు నీ కనఁ గార్దమి, కూరిమి నట నిలిచి సలిపె ॰ ఘోరతపంబున్
వారక నెల చనఁ గ్రమ్మఱ,నారీమణి యగుచు నిందు॰నందనుఁగలసెన్. ౧౮-౨౧

తా త్ప ర్య ము

నేను మేలు చేసెదను అని చెప్పగా నిలుఁ డందే నిలిచి ఘోరతపము చేసెను. నెల కాఁగానే మరల స్త్రీయై బుధుని కలయుచుండెను.

క. తొమ్మిదినెల లిటు లరిగినఁ గొమ్మపురూరవుఁ డనంగఁ॰గొడుకుం గని తా
నమ్మాణవకుం దండ్రికిఁ, గొమ్మని యప్పుడ యొసంగెఁ॰గుతుకము మీరన్.

అర్థములు. మాణవకున్=పిల్లవానిని, ఉపనయనాది కార్యములకుఁగా చంద్రునియొద్ద విడిచెను.

స్త్రీగా నున్నప్పుడుంచిన గర్భము పురుషుఁడుగా నున్నప్పుడుండెనాపోయెనా? ఉండినది గాని పార్వతీవరమువలన నది యాయనకుఁ దెలియలేదని కొందఱు, తొమ్మిది నెలలు బుధునియొద్ద నిల యుండిన కాలమే కాని గర్భధారణ కాలము గాదనియుఁ దొమ్మిదవ నెలయందు సద్యోగర్భమునఁ బురూరవుఁ బ్రసవించెననియు మఱికొందఱు తొమ్మిది నెల లనఁగా స్త్రీగానున్న నెలలు తొమ్మిదనియుఁ బమనెనిమిది నెలలు బుధునియొద్దనిల యుండెననియు పురుషుఁడుగా నున్నప్పుడు గర్భము స్త్రీత్వముతోపాటు అదృశ్య మగుచుండెననియు మఱికొందఱు.

తాత్పర్యము

(తొమ్మిది నెలలు జరిగిన తరువాత నిలాదేవి పురూరవుఁడను, కొడుకును గని యాపిల్లవాని నప్పుడే సంతోషముతోఁ దీసికొమ్మని యిచ్చెను)

తే. ఏఁడు గడచిన పదపడి♦ఱేఁడు పురుష, రూపమును గాంచఁగా న♦నురూపసూక్తి
గరిమ హృద్యకథాళులఁ♦గంజవైరి, తనయుఁ డతనికి హర్షంబు♦దనరఁజేసె.

అర్థములు. అనురూపసూక్తిన్=తగిన మాటలచే, కంజవైరి తనయుఁడు=బుధుఁడు.

తాత్పర్యము

(సంవత్సరము కడచిన పిమ్మట రాజు పురుషరూపము గాంచెను. అంత బుధుఁడు తగిన మాటలచే మనోహరమైన కథలు చెప్పి యతని సంతోషపఱిచెను.)

బుధుఁ డిలునకు శాశ్వత పురుషత్వముఁ గలిగింప నశ్వమేధంబు సేయుట

సీ. అన వత్సరాంతంబు♦నందేమి యొనరించె, నిలుఁడని యనుజులు ♦ పలుక రాముఁ
డనియెఁ దారాసుతుం♦డాత్మమిత్రులను సంవర్త్యునిఁ జ్యవనునిఁ♦బ్రమదదాయిఁ
గశ్యపు దూర్వాసుఁ♦గలయోగివర్యుల, రప్పించి యిట్లను♦రాజవరుఁడు
కార్దమేయుఁడు భవ♦త్కరుణకుఁ బాత్రుఁడు, తద్దశ మీకు హృ♦ద్గతమ కాదె
ఆ. సరగ మేలు చేయు♦సదుపాయ మొకటి, చేయవలయు ననుచుఁ♦జెప్పుచుండఁ
గర్దముండు వచ్చెఁ♦గదలి యచ్చోటికి దివ్యతేజులైన♦ద్విజులతోడ. ౧౪౩౧

అర్థములు. ప్రమదదాయిన్=సంతోషము కలిగించువాని, కార్దమేయుఁడు=కర్దముని కొడుకు, ఇలుఁడు, తద్దశ=ఆయన యవస్థ, హృద్గతమ=తెలిసినదే.

తాత్పర్యము

ఇట్లు చెప్పఁగా సంవత్సరము కడపట బుధుఁ డేమిచేసెనని తమ్ము లడుగఁగా రామచంద్రమూర్తి యిట్లనియె. బుధుడు తన స్నేహితులగు సంవర్తుని, చ్యవనుని, కశ్యపుని, దుర్వాసుని మఱికొందఱ యోగివర్యులను రప్పించి యీరాజు నవస్థమీకుఁ దెలియును గదా! ఈయనకు మేలుచేయు నుపాయమేదైనఁ జేయవలయునని చెప్పుచున్న సమయమున కర్దముఁడు దివ్యతేజస్కులగు బ్రాహ్మణులతోడ నచ్చటికి వచ్చెను.

తే. క్రతువును బులస్త్యుఁడును వష♦ట్కారమవల,
నోంకృతియువచ్చెనచటికి ♦ నల్లమలర
నెల్ల వారును నృపతికి♦హితము సేయఁదలఁచిభాషించుచుండఁ గ♦ర్దముఁడుపలికె.

తాత్పర్యము

క్రతువు, పులస్త్యుఁడు, వషట్కారము, ఓంకారము నచ్చటికి వచ్చెను. అందఱు రాజునకు మేలుచేయవలయునని చెప్పుచుండఁ గర్దముఁ డిట్లనియె.

ఉ. దీనికి మందు శంకరునిఁ ♦ దేర్చుట దక్క మఱొండు లేదు శ
ర్వాణి విభుండు మెచ్చెడు స ♦ వంబు తురంగమమేధ మొక్కఁడే
కాన హరుండు ప్రీతి గొనఁ ♦ గా మన మెల్ల నృపార్థమై తగున్
దాని నొనర్ప నన్న ముని ♦ దండము దానికి నీయకొంటయున్, ౧౪౩౩

అర్థములు. తేర్చుట=ప్రసన్నునిఁ జేయుట, శర్వాణివిభుండు=పార్వతిపతి, సవంబు=యజ్ఞము, తురంగమమేధము=అశ్వమేధము, నృపార్థమై=రాజునకుఁగాను మునిదండము=మునుల సమూహము.

అశ్వమేధము లక్ష్మణుఁడు విష్ణుప్రీతికర మని చెప్పెను. ఇచ్చట శివప్రీతికర మని యున్నది. ఇది యెట్లు? 'యజ్ఞోవైవిష్ణుః' అన్నట్లు ఏయాగమైనను విష్ణు స్వరూపము యజ్ఞపురుషుఁ డాయనయే. అయినను అశ్వమేధము సర్వదేవతా ప్రీతికరము ఇచ్చట శపించినవాఁడు శివుఁడు కావున నాయన శాపము నాయనయే మరలింపవలయును. కావున నాయనప్రీతి కని చెప్పఁబడెను.

తా త్ప ర్య ము

ఇది చక్కఁబడు నుపాయము శంకరుని ప్రసన్నుఁజేయుటే గాని వేఱొండు లేదు. ఆయనను బ్రసన్నుఁజేయుటకు నశ్వమేధము చేయుట తగిన కార్యము కావున శివుఁడు ప్రసన్నుఁడగుటకు రాజు నిమిత్తమై మన మశ్వమేధము చేయఁ దగును. అని చెప్పఁగా మును లందఱు అంగీకరించిరి.

ఆ. శంకరార్పితముగ ♦ సప్తతంతువుఁ దీర్ప, విప్రవరులు గడఁగి ♦ విధియుతముగ
సకల వస్తువులను ♦ సంవర్త రాజర్షి, ఛాత్రుఁ డగు మరుత్తు ♦ సంఘటించె. ౧౪౩౪

అర్థములు. సప్తతంతువు=యజ్ఞము, ఛాత్రుఁడు=శిష్యుఁడు.

తా త్ప ర్య ము.

(శంకరార్పణముగా బ్రాహ్మణులు విధ్యుక్తముగా యజ్ఞము చేయఁబూనఁగా సంవర్తుని శిష్యుడైన మరుత్తు సమస్త వస్తువులను సమకూర్చెను.)

క. హరిణాంకతనూజాశ్రమ, ధరణీనికటమ్మునన్ య ♦ థావిధి సవమున్
జరుపఁగఁ బ్రీతుండై య, ధ్వరమునతుదఁ బురహరుండు ♦ ప్రత్యక్షం బై. ౧౪౩౫

అర్థములు. హరిణాంకతనూజ=బుధునియొక్క, ఆశ్రమ నికటమ్మునన్= ఆశ్రమ సమీపమందు, సవమున్=యజ్ఞమును, అధ్వరమునతుద = యజ్ఞము కడపట.

తా త్ప ర్య ము

(బుధుని యాశ్రమము దగ్గఱ యథావిధిగా యజ్ఞము చేయఁగాఁ యాగాంతమున సంతోషించి శివుఁడు ప్రత్యక్షమై.)

—* ఇలుఁ డెప్పటియట్ల పురుషత్వముం గనుట *—

చ. ఇలునకు నేమి మేలు ఘటి ♦ యింపఁగఁ గోరెద రన్న వార ల
స్ఖలితము గాఁగ దేవ! పురు ♦ షత్వమునన్ వసుధామహేంద్రుఁడున్
జెలఁగెడిఁ గాక నా నటుల ♦ చేకుఱు మీయభికాంక్ష యంచు బూ
చులదొర కన్మొఱంగుడును♦సూరిజనుల్ ముగియించి యజ్ఞమున్. ౧౪౩౬

అర్థములు. అస్ఖలితముగాఁగ=లోపము లేకుండునట్లు, కొన్నాళ్ళు స్త్రీగాఁ గాకుండునట్లు, బూచుల దొర=పిశాచప్రభువు శివుఁడు, కన్మొఱంగుడును=అదృశ్యుఁడు కాఁగా, సూరిజనుల్=పండితులు.

తాత్పర్యము

(ఇలున కేమి మేలు చేయఁ గోరెదరని యడుగ, వారు, రాజు లోపము లేకుండునట్లు పురుషత్వమును గలవాఁడు గావలె ననఁగా, నట్టులే యగుత మని శివుఁడు కనఁబడకుండఁ బోఁగా, పండితులు యజ్ఞమును ముగించి.)

క. తమ తమ యాశ్రమముల కు, త్తమమతు లేగుటయు నిలుఁడు♦తరలిచనెన్ రా
జ్యమునకు నట శశిబిందుని, విమలమతిన్ రాజుఁ జేసి♦వెలువడి పురమున్.

తాత్పర్యము

(ఋత్త్విక్కులగు మునులు తమ తమ యాశ్రమములకుఁ బోఁగా నిలుఁడు తన రాజ్యమునకుఁ బోయి శశిబిందుని రాజుగాఁ జేసి, పత్తనము విడిచి.)

తే. మధ్యదేశంబునందు క్ష♦మావిభుండు,స్థాపితు నొనర్చి యొక ప్రతి♦ష్ఠానపురము
నందుఁ బతిగఁ బురూరవు♦నధికనియతి, సంచరించి దివిం జేరె♦సమయమగుడు.

తాత్పర్యము

మధ్యదేశమునఁ బ్రతిష్ఠానపురమునందు పురూరవుని రాజుగాఁ బట్టాభిషేకము చేసి యిలుఁడు తపస్సుచేసి కాలము రాఁగా స్వర్గ మేగెను.

క. వింటిరె హయమేధం బిటు, వంటిమహామహిమ మీఱు♦వసుధాపతి వా
ల్గంటియయి పురుషుఁడయ్యెను, గుంటుపడ దెట్టికోర్కి♦గుఱ్ఱపువేల్మిన్.

అర్థములు. కుంటుపడదు=వ్యర్థము కాదు, గుఱ్ఱపువేల్మిన్ = అశ్వమేధము వలన.

తాత్పర్యము

(వింటిరికదా అశ్వమేధ మిటువంటి మహా మహిమ కలిగినది. రాజుస్త్రీయయి యీ యాగ ప్రభావమున మరలఁ బురుషుఁ డయ్యెను. అశ్వమేధయాగము వలన నది యెటువంటి కోరిక యయినను వ్యర్థము కాదు.)

శ్రీరాముఁడు పురోహితాదులఁ బిలిపించి యశ్వమేధం బొనర్తునని చెప్పుట.

సీ. మనపురోధల వసి♦ష్ఠుని వామదేవుని, జాబాలిఁ గాశ్యపు♦క్ష్మావిబుధుల
సౌమిత్రి! తోడి తెమ్ము-సాగింతు హయమేధ,మఖిలలక్షణయుతం♦బశ్వమొండు
విడిచెద నావుడు♦వెస నతఁ డేగి వా,రలఁ బిల్వ వారెల్లఁ♦గ్రన్నవచ్చి
కృతనమస్కారుని ♦ క్షితినాథు దీవించి, యుచితాసనంబుల♦నుండు నంత

ఆ. రామచంద్రవిభుఁడు♦ప్రాంజలి యగుచును, వారిఁ జూచి నేను♦వాజిసవము
సలుపనెంచినాఁడ ♦ సెలవిత్తురే యన, మదుల వారు హరు న♦మస్కరించి.

అర్థములు. పురోధలన్=పురోహితులను, కృతనమస్కారునిన్=నమస్కరించిన వానిని, వాజిసవము=అశ్వమేధము.

తాత్పర్యము

(లక్ష్మణా! మన పురోహితులైన వసిష్ఠునిఁ వామదేవుని జాబాలిని, కాశ్యపుని తక్కుగల బ్రాహ్మణులను దీసికొని రమ్ము అశ్వమేధము చేసెదను. సమస్త సుభ లక్షణములు గల గుఱ్ఱమును విడిచెను, అని చెప్పఁగా వెంటనే యతఁడు పోయి వారలను బిలువఁగా వారంతయు తత్క్షణమువచ్చి, నమస్కరించిన రామచంద్రునిదీవించి యుచితములగు నాసనములందు వేంచేసి యుండిరి. అంతట రామచంద్రమూర్తి చేతులుజోడించి, వారినిఁ జూచి నే నశ్వమేధ యాగము చేయఁ దలఁచితిని. సెలవిచ్చెదరా యని యడుగ, వారు మనస్సులందు శివునికి నమస్కార మొనరించి.)

తే. అశ్వమేధం బొనర్ప న♦ర్హాంబు సకల, రాజవర్యులకును శుభ♦ప్రద మటన్న
సంతసించి సుమిత్రాత్మ♦జాతు గాంచి, పలికె నిట్లని శ్రీరామ♦భద్రుఁ డపుడు.

తాత్పర్యము

(రాజశ్రేష్ఠుల కందఱకు నశ్వమేధ యాగము చేయఁ దగినది. శుభప్రదమైనది. అని చెప్పఁగా, సంతోషపడి, లక్ష్మణునిఁ జూచి రామచంద్రమూర్తి యప్పుడిట్లని చెప్పెను.)

సీ. యజ్ఞమహోత్సవం ♦ బనుభవింపఁగ సర్వకీశులతోడ సు♦గ్రీవు నిటకుఁ
బిలువంగ దూతల ♦ వేగమ పంపుము, దోషాచరులతో వి♦భీషణుండు,
మత్ప్రియాసక్తు లౌ♦మహీపులు పరివార, ములతోడ రాఁగ దూ♦తలను బంపు
దేశాంతరస్థు లౌ♦ద్విజుల ధర్మాత్ముల, బిలిపించి సతులతో♦వేల్మికొఱకు

ఆ. మునులు నెల్లవారి ♦ మునుకొని రప్పింపు, నటులఁ దాలధరుల♦నర్తకులను
బిలువనంపు యజ్ఞ♦వేశ్మాలి నిర్మింపు, గోమతీతటమున♦నైమిశమున. ౧౭౭౨

అర్థములు. దోషాచరులతో=రాక్షసులతో, మత్ప్రియాసక్తులు=నాకుఁ బ్రియము చేయుట యందు నాసక్తులు, మహీపులు=రాజులు, దేశాంతరస్థులు=

ఇతర దేశముల నుండువారు, ద్విజులన్=బ్రాహ్మణులను, వేల్మికొఱకు=యజ్ఞము నిమిత్తము, తాలధరులన్=తాలము వాయించువారిని, యజ్ఞవేశ్మాళిన్=యజ్ఞము నకు ఇండ్లవరుసలు, గోమతీ తటమునన్=గోమతీనదియొడ్డున, నైమిశమునన్= నైమిశారణ్యమందు.

తా త్ప ర్య ము

(అశ్వమేధ యాగ మహోత్సవము చూచుటకు సమస్తవానరులతో సుగ్రీవుఁడు, సకల రాక్షసులతో విభీషణుఁడు, నాకుఁ బ్రియ మొనరించుటయం దాసక్తులయిన రాజులను నిచ్చటకు వచ్చుటకుఁ బిలువ దూతలను వేగముగాఁ బంపుము. ఇతరదేశములందుండు ధర్మాత్ములగు బ్రాహ్మణులను యజ్ఞము నిమిత్తము భార్యలతోఁగూడ వచ్చునట్లు పిలువనంపుము. మునుల నందఱను ముందుగా రప్పింపుము-తాలము వాయించు వారిని నర్తకులను బిలిపింపుము-నైమిశారణ్యమందు గోమతి నదియొడ్డున యజ్ఞమున కిండ్లవరుసలు నిర్మింపుము.)

చ. అనఘుల ధర్మవేదుల మ॥హాత్ముల నెల్లరఁ బిల్వఁ బంపుమీ
తనివి సనంగ నధ్వరవి॥ధానముఁ జూచి సుఖానుషంగులై
మన మలరంగఁ బుష్టు లయి ॥ మందిరము ల్గన నేగువారుగా
కనుఁడ! నూరువేల్ దృఢమ॥యంబులపై భరతుండు బియ్యమున్. ౧౪౪౩

అర్థములు. అనఘులన్=పాపరహితులను, ధర్మవేదులన్=ధర్మ మెఱిఁగిన వారిని, అధ్వరవిధానము=యజ్ఞము నేర్పాటు, సుఖానుషంగులై=సుఖముతోఁ గూడినవారై, పుష్టులయి=పోషింపఁబడినవారై, దృఢమయంబులపై=బలముగ నొంటెలమీఁద.

తా త్ప ర్య ము

(లక్ష్మణా! పాపరహితులు, ధర్మమెఱిఁగిన వారు, నగు మహాత్ములనందఱను బిల్వనంపుము-వారు యజ్ఞము నేర్పాటు తనివితీఱ చూచి మనసు ఆనందమున మీఱఁ, జక్కఁగాఁ బోషింపఁబడి తిరిగి వారి గృహములకు బోయెదరుగాక-భరతుఁడు లక్ష బలమైన యొంటెలమీఁద బియ్యమును.)

సీ. పదివేలయెద్దుల॥పై బెసల్ నూపులు, సెనగలు నులువలు॥మినుము లుప్పుఁ
దదనురూపంబుగఁ ॥ దైలాదులును మఱి, గంధపుఁజెక్కలు॥ముంద రరుగఁ
గొని కోటిహేమముల్॥కోటులుపది వెండి, నాణెముల్ చనెదుఁ;జ॥నంగ నలయు
నటులు నర్తకులును॥నైగమజనములు, సూదకారులు భటుల్॥సూరవనులు

తే. వర్ధకులుఁ గోశనాథులుఁ॥బనులవారుఁ, దల్లులును జిన్నవాండ్ర య౦॥తఃపురంబు
వారు; నాపత్ని కాంచన॥ప్రతిమ దీక్ష కైన వస్తులఁగొని యతఁ॥డరుగుఁగాక.

అర్థములు. తైలాదులు=నూనె మొదలయినవి, నైగమజనములు=వర్తకులు, సూదకారులు=వంటచేయువారు, వర్ధకులు=వడ్రంగులు, నాపత్ని=నాభార్య యగు కాంచన ప్రతిమ, బంగారు విగ్రహము, నా పత్ని కాంచనప్రతిమ యను టచే రెండవభార్య లేదని యేర్పడుచున్నది. ఈ విషయము యుద్ధకాండమందుఁ జర్చింపఁబడెను. 'కాంచనం జానకీం కృత్వాతయాసార్థం మహాబలః, చకార యజ్ఞాన్ బహుశో రాఘవః పరమార్థవిత్'—పద్మ.

తా త్ప ర్య ము

(బదివేల యెద్దులమీఁద బెసలుఁ నూవులు, సెనగలు, ఉలవలు, మినుములు ఉప్పు వానికిఁ దగినట్లు నూనె మొదలగునవి, గంధపుఁజెక్కలు, కోటి బంగారు నాణెములు, పదికోట్లు వెండినాణెములు తీసికొని ముందుగాఁ బోవలెను. నటులు, నర్తకులు, వర్తకులు, వంటచేయువారు, భటులు, శూరవర్యులు, వడ్రంగులు, కోశాధీశులు, పనులుచేయువారు, మన తల్లులు, పసివాండ్రు అంతఃపురమునందలి వారు పోవలెను. నాభార్య యగు బంగారు విగ్రహము యజ్ఞదీక్షకుఁ గావలసిన వస్తువులను దీసికొని, భరతుఁడు ముందుపోవలెను.)

క. రాజులకు గొప్పవారికిఁ, దేజున గొనబారి నిగ్గు ♦ దేఱి సుఖంబై
రాజిలు నుప్పరిగల గృహ, రాజుల నిర్మింపఁబంపు♦రాజకుమారా! ౧౮౮౫

అర్థములు. ఉప్పరిగలన్=మేడల, గృహరాజులన్=ఇండ్లవరుసలను.

తా త్ప ర్య ము

(లక్ష్మణా! రాజులకు, గొప్పవారికిఁ, గాంతిచే నందమై యొప్పు మేడలను గృహముల వరుసలను సుఖముగా నుండునట్లు నిర్మింప నేర్పాటు చేయుము.)

—* శ్రీరాముఁ డశ్వమేధయాగము సేయ నుపక్రమించుట *—

చ. అనవుడు నట్ల తీర్పఁగ స♦మస్తము రాముఁడు నల్లయిఱ్ఱితో
నెనయు సలక్షణాశ్వమును ♦ ఋత్విజులున్ ఘననాదవైరియున్
గొన కొని కాన వీడి మఱి ♦ గొబ్బునఁ జేరఁగవచ్చి నైమిశం
బును గ్రతువాటిఁ గాంచి ముద♦ముం గనె నద్భుతమంచు నాత్మలోన్. ౧౮౮౬

అర్థములు. సలక్షణాశ్వమును=అశ్వమేధమునకుఁ దగిన లక్షణములు గల గుఱ్ఱమును, ఘననాదవైరి=మేఘనాద, విరోధి=లక్ష్మణుఁడు.

(అని చెప్పఁగా నాప్రకారమే సమస్తము నేర్పాటుచేయఁగా రామచంద్ర మూర్తి నల్లజింకతో సాటివచ్చు నశ్వమేధమునకుఁ దగిన లక్షణములుగల గుఱ్ఱ

మును ఋత్విజులును లక్ష్మణుఁడు సంరక్షించుచుండ, విడిచి, వేగముగా నైమిశారణ్యమునకు వచ్చి యజ్ఞశాలను జూచి తన మనసులో నద్భుతముగా నున్న దను కొనుచు సంతోషించెను.)

సీ. నైమిశంబున రఘు•నాయకుం డుండఁగ, నవనినాయకు లుప•హారములను
కొనిరాఁగఁ గైకొని•కూర్మిఁ బ్రత్యర్చించి, విపులగృహంబుల•విడియఁ బంచి
సానుచరాళికిఁ•బానంబు నన్నంబు, వస్త్రంబు లేవి కా•వలయు నన్ని
సమకూర్ప భరతుండు•శత్రుఘ్నుఁడను బూని, రర్కజుతోడివ•నాటు లెల్ల

తే. క్షితిసురావళి నెమకి పూ•జించుచుండ
వృద్ధులను ఋషిజనుల వి•భీషణుండు
రాక్షసాన్వితుఁ డగుచు న•ర్చావిధాన
ములను సంతుష్టిఁ గూర్చుచుఁ జె•లఁగుచుండె. ౧౪౪౭

అర్థములు. ఉపహారములను=కానుకలను, ప్రత్యర్చించి = బదులుపూజించి, విపుల గృహంబులన్=విశాలమైన యిండ్లయందు, సానుచరాళికిన్ = వారివెంట వచ్చిన వారికి, నెమకి=వెదకి, క్షితిసురావళిన్=బ్రాహ్మణ సమూహములను.

తాత్పర్యము

(నైమిశారణ్యమందు రామచంద్రమూర్తి యుండఁగా రాజులు కానుకలను దీసికొనిరాఁగా వానిని దీసికొని వారలఁ బ్రేమమీఱ మరలఁ బూజించి, విశాలము లయిన యిండ్లయందు వారినుండ నేర్పాటుచేసి, వారివెంట వచ్చినవారి కన్న పానములు వస్త్రములు ఏవేవి కావలయునో వాని నన్నిటిని సమకూర్చుటకు భరతుఁడు శత్రుఘ్నుఁడు పూనుకొనిరి. వెదకి బ్రాహ్మణులను బూజించుటకు సుగ్రీవుని తోడి వానరులు, పెద్దలను మునులను బూజావిధానముల సంతోషము గలిగించు విభీషణుఁడు రాక్షసులతోఁ బూనుకొనియుండిరి.)

క. తురగము సుమిత్రతనయుఁడు, పరిరక్షింపఁగను విహిత•పద్ధతిఁ గ్రతువున్
జరుగఁగ నిడుఁడీ యిడుఁడీ, పరితుష్టిగ ననెను నులివు•బహుళం బయ్యెన్.

అర్థములు. పరితుష్టిగ=మిక్కిలి తృప్తిగ, ఉలివు=ధ్వని.

తాత్పర్యము

(గుఱ్ఱమును లక్ష్మణుఁడు కాపాడుచుండఁగా యజ్ఞము యథావిధిగా జరుగుచుండఁగా, తృప్తిదీఱ నిడుఁడు ఇడుఁడు అనెడు ధ్వని విస్తారమయ్యెను.)

తే. కండచక్కెర బెల్లంబు•పిండివంట
లారఁ జాల్చాలు నంచును•యాచకాళి
పలుకు నందాఁకఁ డెండను•పలుకు రాక
మున్నె యొసఁగిరి వడ్డించు•చున్నవారు. ౧౪౪౮

తా త్ప ర్య ము

(కండచక్కెర, బెల్లము, పిండివంటలు సమృద్ధిగా యాచకుల సమూహము చాలు చాలు ననువఱకు అడుగకముందే వడ్డించువారు వడ్డించిరి.)

చ. మలినుఁడుం దీనుఁడుం గృశుఁడు♦మాటకునైన మహాధ్వరంబునన్
గలుగఁ డొకండు, దీర్ఘ♦తరకాలముగా మనియున్న మౌనివ
ర్యులు మును పెన్నఁ డేని గని♦యుండఁగ లే దిటువంటివేల్మి, కో
ర్కులు దనివారనెల్లరకుఁ♦గోరినయట్లు మణీధనాదులన్. ౧౪౬౦

అర్థములు. వేల్మి=యజ్ఞము, మణీధనాదులన్=రత్నములచే ధనములచే, మలినుఁడు=మురికి దేహము గలవాఁడు, దీనుఁడు=దరిద్రుఁడు, కృశుఁడు=శుష్కించినవాఁడు, మనియున్న=బ్రదికి యుండిన.

తా త్ప ర్య ము

(ఆ గొప్ప యజ్ఞములో, మురికి దేహము గలవాఁడు, దరిద్రుఁడు, శుష్కించినవాఁడు మాటకైనను లేఁడు- దీర్ఘ కాలము బ్రదికియుండిన మునులు మును పెన్నఁడిటువంటి యజ్ఞము మేము చూచియుండలేదు. ఎల్లరకుఁ గోరినట్లు రత్నములచే ధనములచేఁ దనివితీఱినది.)

తే. కాంచనముఁగోరువారలు♦కాంచనంబు,విత్తములఁ గోరువారలు♦విత్తచయము
వస్త్రములఁ గోరువారలు♦వస్త్రములను, గోరిన ట్లెల్లఁ గాంచిరి♦కొఱఁత లేక.

తా త్ప ర్యము

(బంగారు కావలసిన వారికి బంగారు, ధనములు కోరినవారికి ధనరాసులు, వస్త్రములాశించిన వారికి వస్త్రములు కోరినవారికిఁ గోరినట్లు కొఱఁత లేకుండ లభించినవి.)

త. చూచితిమి శక్రుమఖముం, జూచితిమి ధనేశుక్రతువు♦సూర్యజు సవమున్
జూచితిమి వరుణువేల్మిని, జూచితి మది దీనిసాటి♦సుంతయు నగునే. ౧౪౬౨

అర్థములు. శక్రుమఖమున్=ఇంద్రుఁడు చేసిన యజ్ఞమును, ధనేశుక్రతువు=కుబేరుఁడు చేసిన యజ్ఞము. సూర్యజు సవమున్=యముఁడు చేసిన యజ్ఞము, వరుణవేల్మిని=వరుణుఁడు చేసిన యజ్ఞమును, సుంతయు=కొంచెమైనను.

తా త్ప ర్య ము

(ఇంద్రుని యజ్ఞము చూచినాము కుబేరుఁడు చేసిన యాగము చూచితిమి. యముఁడు గావించిన క్రతువు చూచితిమి, వరుణుని జన్నము కంటిమి. కొంచెమైనను దీనితో సాటియగునా?)

క. అని అబ్బురపడుచుఁ దపో,ధనులు వచింపఁగను కీశ•దండము సోఁకుల్
గొని హస్తంబుల వాసో,ధనభోజనవస్తుతతులఁ•దత్తత్స్థలులన్. ౧౪౫౩

అర్థములు. సోఁకుల్=రాక్షసులు, వాసన్=వస్త్రములను, ధన=ధనములను, భోజన వస్తు తతులన్=భోజనపదార్థముల రాసులను, తత్+తత్+స్థలులన్=ఆయాప్రదేశములందు, ఏ వేవి యెక్కడ నుండవలయునో యచ్చటనచ్చట.

తా త్ప ర్య ము

(అని యాశ్చర్యపడుచు మునీశ్వరులు చెప్పుకొనుచుండ, వానరసమూహము, రాక్షసులు, చేతులలో వస్త్రములు, ధనము, భోజన వస్తువులు పట్టుకొని యచ్చటచ్చట.)

ఆ. నిలిచి యాచకులకు • వలసిన వన్నియు, నిచ్చుచుండి రిట్లు•లొచ్చు లేక
సర్వగుణసమేత•సప్తతంతువు సాగె, నబ్దమైన ముగియ•కతులితముగ. ౧౪౫౪

అర్థములు. లొచ్చు=కొఱఁత, సర్వగుణసమేత = అన్నిసుగుణములతోఁ గూడిన, సప్తతంతువు=యజ్ఞము అబ్దమైనన్=సంవత్సరము ముగిసినను, ముగియక=యజ్ఞము సాంతముగాక.

తా త్ప ర్య ము

(నిలిచి యాచకులకు కొఱఁతలేకుండఁగావలసినవి యిచ్చుచుండిరి. అన్ని సుగుణములతోఁ గూడిన యాగము, సంవత్సరము ముగిసినను సంతముగా నసమాన వైభవముతో సాగెను.

వాల్మీకి మహర్షి కుశలవుల రామాయణము గానముసేయ నియమించుట.

ఉ. ఈ కరణిం బ్రవర్తిలు న•హీనసవంబుఁ గనుంగొనంగ వా
ల్మీకి సశిష్యసంఘుఁ డయి •మేదురరక్తిని వచ్చి తాపసా
నీకము లున్న వాటికి స • నీడతలంబునఁ బర్ణశాలలం
గైకొని యుండె మూలఫల•కాండలసచ్ఛకటంబు లొప్పఁగన్. ౧౪౫౫

అర్థములు. అహీనసవంబు=మహాయజ్ఞము, సశిష్యసంఘుఁడు=శిష్యసమూహముతోఁ గూడినవాఁడు, మేదురరక్తిని=అధిక ప్రేమతో, తాపసానీకములు=మునుల గుంపులు, వాటికిన్=ప్రదేశమునకు, సనీడతలంబునన్=సమీప ప్రదేశంబున, మూలఫలకాండ=వేళ్ళు పండ్లు వీని సమూహములచే, లసత్=ఒప్పుచున్న, శకటంబులు=బండ్లు వాల్మీకి తన శిష్యులకుఁ దనకుఁ గావలసిన కందమూల ఫలములు తానే బండ్లమీఁదఁ దెచ్చె ననుటచే నప్రతిగ్రహవ్రతము గలవాఁడనుటచే రాజద్రవ్య మపేక్షింప లేదని సూచన.

తాత్పర్యము

(మహాయజ్ఞ మీ విధముగా జరుగుచుండఁగా వాల్మీకి మహాముని శిష్య సమూహముతో యాగము చూచుటకుఁ బరమ ప్రీతితో వచ్చి బండ్లతో వేళ్ళ పండ్లు గొనివచ్చి మునులుండు ప్రదేశమునకు సమీపమునఁ బర్ణశాలలందుండెను.)

క. రాజవరు చేతఁ దాపస, రాజవరుల చేత నర్చ ♦ గ్రహియించి మహా
తేజుం డాత్మజ్ఞుం డట, రాజిలి నిజశిష్యయుగము♦ రక్తిం బలికెన్ ౧౪౯౬

అర్థములు. రాజవరు చేతన్=రామచంద్రమూర్తి చేతను, తాపస రాజవరుల చేతన్=మునిశ్రేష్ఠుల చేతను, అర్చ=పూజ, మహాతేజుండు=గొప్ప తేజస్సు గలవాఁడు, ఆత్మజ్ఞుండు=ఆత్మజ్ఞానము గలవాఁడు, ఇచ్చట జ్ఞానము సాక్షాత్కారమని భావము, నిజశిష్యయుగమున్ = తన యిరువురు శిష్యులను, రక్తిన్=అనురాగముతో.

తాత్పర్యము

(రామచంద్రమూర్తి చేతను, మునిశ్రేష్ఠుల చేతను బూజలంది గొప్ప తేజస్సు గలిగి యాత్మజ్ఞానము గల వాల్మీకి మహర్షి తన శిష్యుల నిరువుర కనురాగముతోఁ జెప్పెను.)

ఉ. నాయనలార! బ్రాహ్మణజ♦నంబుల పట్టుల మౌనివాడలం
దాయత రాజమార్గముల ♦ క్ష్మాధిపులిండుల రామచంద్రు సం
స్థాయమువాకిటం గ్రతువు ♦ సాగెడి చోటను రథ్యలందు రా
మాయణ మెల్లఁ బాడుఁడు ము♦దార్తిని గర్ణరసాయనంబుగన్. ౧౪౯౭

అర్థములు. నాయనలారా!=బిడ్డలారా! వీరు కుశలవులు. ఇప్పటికి వీరికి పండ్రెండు పదమూఁడు సంవత్సరముల వయస్సు. శత్రుఘ్నుఁడు లవణుఁ జంపఁ బోవుచు వాల్మీకి యాశ్రమంబున నున్న దినమున కుశలవులు పుట్టిరి. శత్రుఘ్నుఁడు మధురయందుఁ బండ్రెండు సంవత్సరము లుండి, మరల నయోధ్యకుఁ బోవునపుడు రామాయణము వినెను. తరువాత నేఁడాదికి యజ్ఞమను కొనినను పదమూఁడు సంవత్సరముల కెక్కువ వయస్సు గలవారు కారు. బ్రాహ్మణ జనంబుల పట్టులన్=బ్రాహ్మణు లున్న చోటులందు మౌనివాడలన్=మునులు దిగిన స్థలములందు, ఆయుత=విశాలమైన, రాజమార్గములన్ = రాచబాటలందు, క్ష్మాధిపులిండులన్=రాజులు దిగిన యిండ్లయందు, సంస్థాయము= రామచంద్రమూర్తి యింటివాకిటను, క్రతువుసాగెడి చోటను=యజ్ఞము చేయఁబడు స్థలమునందు, రథ్యలందు=వీథులందు, ముదార్తిన్=సంతోషముతో, కర్ణరసాయనంబుగన్= చెవులకు సంతోషకరముగా, నాలుగవ పాదంబున నుభయ యతి.

తా త్ప ర్య ము

(కుఱ్ఱలారా! బ్రాహ్మణులుండు తావుల, మునులు దిగిన స్థలములందు విశాల మైన రాచబాటలందు రాజుల యిండ్లయొద్ద రామచంద్రమూర్తి యింటివాకిటను, యజ్ఞము జరుగుచోట వీథులందు, రామాయణము నంతయు సంతోషముతోఁ జెవుల కింపగునట్లు పాడుఁడు.)

క. అందు విశేషము ఋత్వి, గ్బృందంబులు వినఁగఁ బాడుఁ•డీ! యద్రిజముల్
సుందరమధురఫలంబులు, పొందుగ భుజియించి గాన•మును గొల్పఁ దగున్.

అర్థములు. విశేషము=ఎక్కువగ, ఋత్విగ్బృందంబులు=ఋత్విజుల సమూహములు, అద్రిజముల్=కొండలయందుఁ బుట్టినవి,సుందర=చూచుట కందమైనవి, మధుర=తినుటకుఁ దియ్యనైనవి యగు, ఫలంబులు=పండ్లు, వీనిని భుజించి పాడుఁ డనుటచే రాజాన్నము మీరు గ్రహింపవలదని భావము.

తా త్ప ర్య ము

(అందు విశేషించి ఋత్విక్కుల సమూహము వినునట్లు పాడుఁడు-కొండల యందుఁ బుట్టిన, చూచుట కందమై, తినుటకుఁ దియ్యనైన పండ్లు తిని పాడ వలయును జుఁడీ!)

క. పురబాహ్యదేశభవముల, సురచిర ఫలములను మెక్క•సొలపే నలపేన్
బరఁగదు ఆపెక్కదు మీ, స్వరమున కెంతేనిఁ బాడ•బాలకులారా! ౧౮౪౯

అర్థములు. పురబాహ్యదేశభవములన్=ఊరికి వెలుపలి ప్రదేశములందుఁ బుట్టినవి. సురుచిర ఫలములను=మనోహరములైన పండ్లను, మెక్కన్=తింటిరేని, సొలపేన్=వైముఖ్యము, అనఁగా వేసట, అలపు=ఆయాసము, దీని వలన గ్రామ ములందు మనుష్యులు వేసిపెంచిన వాని ఫలములు శ్రేష్ఠములుగావని భావము.

తా త్ప ర్య ము

ఊళ్ళకు వెలుపలి భూములందుఁ బుట్టిన చెట్లపండ్లను దింటిరేని మీ రెంత సేపు పాడినను విసుఁగు వేసట గాసి తోఁపదు. కంఠస్వర మొక్క విధముననే యుండును గాని ఆపెక్కదు.

చ. పిలువఁగఁ బంచె నేని పృథి•వీవిభుఁ డా రఘురాముఁ డీరు త
త్తలమున కేగి తాపసవి•తానము లెల్ల వినంగఁ బాడుఁడీ
లలితమధూక్తి నాకఅపు•లాగునఁ బెక్కు ప్రమాణము ల్మదిన్
నిలిపి దినంబు నిర్వదిగ•నెమ్మిగ సర్గములం గుమారకుల్! ౧౮౫౦

అర్థములు. ఈరు=మీరు, తత్తలమునకున్ = ఆయన యున్నచోటికి, తాపసవితానములు=మునుల సమూహములు, లలితమధూక్తిన్ = మనోహరమై

తాత్పర్యము

తియ్యనైన మాటలచే, నాకటపులాగున=నేను నేర్పినట్లు, పెక్కుప్రమాణముల్=అనేక శాస్త్రప్రమాణములు.

తాత్పర్యము

కుమారులారా! రాజగు రామచంద్రమూర్తి మిమ్ముఁ బిలిపించె నేని మీరచ్చటికిఁ బోయి మును లందఱు వినునట్లు తియ్యని మాటలతో నేను నేర్పిన విధాన రాగతాలాది శాస్త్రప్రమాణములు మనస్సున నిలిపి తప్పులు లేకుండ దినానికి నిరువది సర్గలవంతునఁ బాడుఁడు.

క. ధనకాంక్ష కొంచెమైనను, గొనకుఁడు లోభంబు దగదు • గుణయుతులారా.
ధన మేల యాశ్రమస్థులకును ఫలమూలోపజీవి•కూటంబులకున్. ౧౪౯౧

అర్థములు. ధనకాంక్ష=ధనముమీఁది కోరిక, లోభంబు=ఆశ, ఆశ్రమస్థులకు=ఆశ్రమములందుండువారికి, ఫలమూలోపజీవి కూటంబులకున్=పండ్లు మూలములు దిని జీవించువారికి, ధనమేల=ధనముతో నేమి కార్యము చెట్లపట్టలు కట్టుకొని చెట్లపండ్లు కందమూలములు దినువారు ధన మిచ్చి కొనవలసిన పదార్థము లేవి యున్నవి?

తాత్పర్యము

(ధనముమీఁదించుకయైనను గోరిక నుంచుకొనకుఁడు-ఆశకూడదు. గుణవంతులారా! చెట్లపండ్లు దుంపలు వేళ్ళు దిని జీవించు నాశ్రమవాసులకు ధనముతో నేమికార్యము.)

ఆ. ఎవరిచిన్నవాండ్ర • రీరని రాముండు, పుడమిఱేఁడు మిమ్ము•నడిగె నేని
మీరు చెప్పవలయు•మేము వాల్మీకిమ,హర్షి శిష్యుల మని•యళుకులేక. ౧౪౯౨

అర్థములు. అళుకు=జంకు.

తాత్పర్యము

(రామచంద్రమూర్తిప్రభువు ఎవరిపిల్లవాండ్రు మీరని యడిగినచో మేము వాల్మీకిమహర్షి శిష్యులమని జంకులేకుండ మీరు చెప్పవలెను.)

ఆ. మున్ను వోలె మీరు • మూర్ఛనాపద్ధతి, తప్ప నీక వీణ•తంత్రులందు
పూర్వసుస్వరంబు•పొలుపొంద గానంబు, జంకు లేక లెస్స•సలుపవలయు.

తాత్పర్యము

(మీరు పూర్వమువలె సంగీతసరళి దప్పకుండ వీణెమీఁద శ్రుతికలిపి శ్రావ్యముగా, జంకక పాడవలెను.)

ఆ. పాడుఁ డాదినుండు•వసుధేశుపట్ల న, వజ్ఞ దగదు మీకు•బాలురార!
సర్వభూతములకు•క్ష్మానాథుఁడే జనకుఁ కద, డగును ధర్మ•సరణిఁజూడ. ౧౪౯౪

అర్థములు. వసుధేశుపట్లన్=రాజు విషయంబునందు, అవజ్ఞ=తిరస్కార భావము, పళ్ళనీళ్ళుద్రాగి అడవులయందుఁ గాయగసురులు దినుమాకు రాజుతో నేమి పనియని రాజును దిరస్కరింపరాదు. ధర్మసరణిన్=న్యాయపద్ధతిని, సర్వభూతములకు=ప్రాణుల కందఱకు, క్ష్మానాథుఁడే=రాజేకదా, జనకుఁడు=తండ్రి, తండ్రి రక్షించునట్లు రాజు రక్షించునుగాన రాజు తండ్రియే. రామచంద్రమూర్తి యందు మీరు జనకభావ ముంపవలయును, గాని రాజని తిరస్కరింపవలదు.

ఉ. రేపటి నుండి మీరు పరిహృ ♦ ష్టమనంబుల వీణె లూని నా
నేపినయట్టు పాడుఁ డని ♦ నిర్మలచిత్తుఁడు చెప్ప వారలున్
మీపలు కాచరింతు మని ♦ నిండుముదంబునఁ జెప్పిపోయి యా
మాపు గురూక్తు లాత్మ నిడి ♦ మానుగఁ బుచ్చిరి యుత్సుకాత్ములై. ౧౪౬౫

అర్థములు. పరిహృష్ట మనంబులన్ = సంతోషముతోఁడి మనస్సులతో, నేపినయట్లు=నేర్పిన విధముగ.

తాత్పర్యము

(మీరు రేపటినుండి సంతోషముతో వీణెలుగొని నేను నేర్పిన విధముగాఁ బాడుఁడని నిర్మలమగు మనస్సుగల వాల్మీకి మహర్షి చెప్పఁగా, వారు మీ రాన తిచ్చినట్లు చేసెద మని పూర్ణముదమునఁ జెప్పిపోయి, గురువుచెప్పిన మాట మనస్సునందుంచుకొని యుత్సాహముతో నారాత్రి గడిపిరి.)

—♦ కుశలవులు రామాయణము గానము సేయ శ్రీరాముఁడు వినుట ♦—

తే. వారు వఱువాత మేల్కని ♦ వారి నాడి, యగ్నులను వేల్చి ఋషివర్యు ♦ నాజ్ఞ సరణి
గాన మొనరింప రాఘవ ♦ క్ష్మాధవుండు, వీనులకు విందుగా దాని ♦ వినియె నంత.

అర్థములు. వఱువాతన్=ఉదయమున, వారినాడి=స్నానము చేసి.

తాత్పర్యము

(వారుదయమున మేలుకని, స్నానము చేసి, హోమ మొనరించి, వాల్మీకి మహర్షి యాజ్ఞప్రకారము గానము చేయఁగా రామచంద్రప్రభువు వీనులకు విందుగా దానిని వినెను. అటుపిమ్మట)

సీ. హర్షంబుతోడఁ బూ ♦ ర్వాచారనిర్మిత, మై యపూర్వంబయి ♦ యమరుదానిఁ
బాత్యజాతులగాన ♦ పరిపాటినొప్పి ప్ర, మాణాతిశయము చే ♦ మానితమయి
తంత్రీలయసమన్వి ♦ తంబగు దానిని, బాలురు పాడఁగ ♦ నాలకించి
కౌతూహలపరుండు ♦ కాకుత్స్థతిలకుండు, కర్మాంతరంబున ♦ ధర్మవిదుల

ఆ. మానివరుల బుధుల ♦ మహిపాల నైగమి, జనములం బురాణ ♦ శబ్దవిదుల
సర్వకళానిపుణులఁ ♦ బా వాక్షరసమాస, విదుల జ్యోతిషమున ♦ విజ్ఞవరుల. ౧౪౬౭

అర్థములు. పూర్వాచార నిర్మితమై=సంగీత శాస్త్రకర్త యగు భరతాచార్యునిచే నిర్మింపబడినదై, అపూర్వంబయి = క్రొత్తదై యిదివఱకు విన్నది కానిదై, పాఠ్య=పఠనయోగ్యమై, జాతులన్=షడ్జాది జాతులచే, గాన పరిపాటి=పాటక్రమము, ప్రమాణాతిశయముచేన్=స్వరముల యారోహణము అవరోహణము మర్యాదా సాధనములు గలదై, తంత్రీలయ సమన్విత మగుదానిని=వీణె మీఁద లయతోఁ బాడఁబడునదై, కౌతూహల పరుండు-విస్మయము నొందిన వాఁడు, కర్మాంతరంబులన్=యజ్ఞకార్యముల నడుమ విరామము దొరకినపుడు, ధర్మవిదులన్=ధర్మశాస్త్రము తెలిసిన వారిని, మునివరులన్ = మునిశ్రేష్ఠులను, ఋషులన్=పండితులను, మహీపులన్=రాజులను, నైగమ జనములన్=వైశ్యులను, పురాణశబ్ద విదులన్=పురాణములను తెలిసిన వారిని వ్యాకరణ శాస్త్ర మెఱింగిన వారిని, సర్వకళా నిపుణులన్=అఱువది నాలుగు కళ లన్నియు నెఱిఁగిన వారిని, పాద అక్షర సమాస విదులన్=గురు లఘు సామాన్య జ్ఞానమును, సమాస జ్ఞానమును గలవారిని.

తాత్పర్యము

(సంగీతశాస్త్ర కర్తయగు భరతాచార్యునిచే నిర్మింపబఁడి, యిదివఱకెన్నఁడు విన్నది కాదయి, పఠింపదగినదై షడ్జాతి జాతులచేఁ బాటక్రమమున నొప్పి స్వరముల యారోహణావరోహణముల నతిశయముచేఁ బొగడఁదగినదై పాటను వీణ మీఁద లయతో బాలకులు సంతోషముతోఁ బాడఁగా శ్రీరామచంద్రమూర్తి యజ్ఞకార్యముల నడుమ విరామము కలిగినప్పుడు విని విస్మయము చెంది, ధర్మ మెఱిఁగిన వారిని, ముని శ్రేష్ఠులను, పండితులను, రాజులను, వైశ్యులను, పురాణములను దెలిసిన వారిని, వ్యాకరణ శాస్త్ర మెఱిఁగిన వారిని గురులఘు సామాన్య జ్ఞానము గలవారిని, సమాస జ్ఞానము గలవారిని జ్యోతిషమునఁ బండితులైన వారిని.)

క. సాముద్రికవిత్తములఁ గ, ళామాత్రాభాగకుశలు◆లన్ వేదజ్ఞ
స్తోమము గాయకులను బుర, ధాముల హేతూపచార◆దక్షోత్తములన్. ౧౪౬౦

అర్థములు. సాముద్రిక విత్తములన్=సాముద్రికశాస్త్రము తెలిసినవారిలో శ్రేష్ఠులను, కలా=స్వరముల యొక్క, మాత్రా=ఏకద్విత్రి లక్షణములను, విభాగ కుశలులన్=వానిలోని భాగములఁ దెలిసిన నేర్పరులను, వేదజ్ఞస్తోమము=వేదవేత్తల సమూహము, గాయకులను=పాటలు పాడువారిని, పురధాములన్ = పురములం దుండు వారిని-పౌరులను, హేతూపచార దక్షోత్తములన్=యుక్తి ప్రయోగము లందు సమర్థులగు వారిని.

తాత్పర్యము

సాముద్రికశాస్త్రము తెలిసినవారిని, స్వరముల మాత్రావిభాగము లెఱిఁగిన వారిని, వేదముల నెఱిఁగినవారిని, పాటలుపాడు వారిని, పౌరులను, యుక్తి ప్రయోగ దక్షులను.

తే. కావ్యనిపుణుల సత్క్రియా•కల్పవిదుల, వృత్తసూత్రజ్ఞులను గీత•వృత్తవిదుల
నీతినిపుణుల శాస్త్రజ్ఞ•నిచయములను, నింగితజ్ఞుల భాష న•హీనమతుల. ౧౪౧౯

అర్థములు. కావ్య నిపుణులన్ = కావ్య లక్షణములు దెలిసిన వారిని, సత్క్రియా కల్పవిదులన్=క్రియాప్రయోగ ప్రతిపాదకము కల్పసూత్రము దానిని దెలిసిన వారిని, వృత్తసూత్రజ్ఞులను=వృత్తశాస్త్రము దెలిసిన వారిని, గీతవృత్తవిదులన్=సంగీతశాస్త్రము నెఱింగిన వారిని, నీతి నిపుణులన్=నీతి శాస్త్రమునందు సమర్థులను, శాస్త్రజ్ఞ నిచయములను=వ్యాకరణాది శాస్త్రముల నెఱింగిన వారిని, ఇంగితజ్ఞులన్=ఎదుటివారి యభిప్రాయములఁ దెలిసికొనఁ గల వారిని, భాషన్= అష్టాదశ భాషలందు, అహీనమతులన్=గొప్ప బుద్ధిగలవారిని.

తా త్ప ర్య ము.

(కావ్యలక్షణ మెఱిఁగిన వారిలో నిపుణులను, క్రియా ప్రయోగము తెల్పు కల్పసూత్ర మెఱిఁగిన వారిని, వృత్తశాస్త్రము తెలిసిన వారిని, సంగీత శాస్త్రమునఁ బండితులను నీతిశాస్త్రమునందు సమర్థులను, వ్యాకరణాది శాస్త్రజ్ఞులను, ఎదుటివారి యభిప్రాయములఁ దెలిసికొనఁ గలవారిని అష్టాదశభాషల బాగుగఁ దెలిసిన వారిని-)

క. వేదాంతార్థసుబోధక, వైదిక ఛందోవిదగ్ర • పౌరాణికులన్
వాదవచనకుశలులఁ జిత్రాదికవిత్వజ్ఞులన్ స•భావనిఁ గూర్చెన్. ౧౪౨౦

అర్థములు. వేదాంతార్థ సుబోధక=వేదాం తార్థమును జక్కఁగ బోధించు వారిని, వైదిక వేదముల నెఱింగినవారిని, ఛందో విదగ్ర=ఛందశ్శాస్త్రము నెఱిఁగినవారిని, పౌరాణికులన్=పురాణముల నెఱిఁగిన వారిని, వాద వచనకుశలులన్= తార్కికులను, చిత్రాది=చిత్రకవిత్వము బంధకవిత్వము లోనగు కవిత్వముల నెఱిఁగిన వారిని, సభావనిన్=సభాప్రదేశమందు.

తా త్ప ర్య ము

(వేదాంతార్థమును జక్కఁగ బోధించు వారిని, వేదముల నెఱిఁగిన వారిని, ఛందశ్శాస్త్రము తెలిసినవారిని, తార్కికులను, చిత్ర కవిత్వము బంధ కవిత్వము లోనగు కవిత్వముల నెఱిఁగిన వారిని, సభాప్రదేశమునం దుఁ జేర్చెను.

అన్నివిధముల శాస్త్రములు దెలిసిన వా రా సభయందుండి బాలకులు గానము చేయు విధమును కావ్యకవిత్వ గుణములను తమ తమ శాస్త్రప్రకార ముగఁ బరీక్షించి మెచ్చికొనిరి. అనఁగా రామాయణమం దిన్ని శాస్త్రముల విష యము గలదని భావము. ఈ కారణముచే నిన్ని శాస్త్రము లెఱింగిన వారు గాని రామాయణ తత్త్వము నెఱుఁగఁజాల రని యేర్పడుచున్నది.

క. అందఱు వినుచుండఁగ నా,సుందర బాలకులు గీతి◆సాం పలరింపన్
డెందముఁ గరంపఁ బాడ న,మందానందమున వినుచు◆మతి తజ్జనముల్. ౧౪౭౧

అర్థములు. కరంపన్ = కరఁగింపఁగా, అమందానందమునన్=అమిత సంతోషమున.

తా త్ప ర్య ము

(ఆ సుందర బాలకుల గీతము లచటివారి మనస్సులు కరగించెను. ఆనంద ముతో వినుచు నా జనములు.)

కుశలవులయెడ శ్రీరాముని పోలికలుచూచి జనులు విస్మితు లగుట

క. భూపాలకుగాయకులను, నాపోవక కనులఁ ద్రావు◆నట్టులు కనుచున్
రూపంబున బాలకు లు, ర్వీపతినిం బోలి రిట్టి◆వింతయుఁ గలదే? ౧౪౭౨

అర్థములు. ఆపోవక=తృప్తిలేక.

తా త్ప ర్య ము

రామచంద్రమూర్తిని పాటపాడు బాలకులను మార్చి చూచి యెంత చూచి నను తృప్తిలేక వారని కన్నులతోనే త్రాగుచున్నట్టులె యిది యేమి వింత! ఈ బాలకులు రామచంద్రమూర్తినిబోలి యున్నారే.

క. బింబప్రతిబింబముల వి,ధంబున రాముండు మౌని◆దారకు లౌరా!
డంబున రాణించిరి చి,త్రం బిది యే మొకొ యె◆ట్లుదల మగుఁదెలియన్?

అర్థములు. మౌనిదారకులు=మునిబాలురు, డంబునన్=కాంతిచే.

తా త్ప ర్య ము

అద్దములోఁ గానవచ్చు ప్రతిబింబములవలె నీ బాలకులు కాంతిని రామచంద్ర మూర్తివలె నున్నారే? ఇది యేమి చిత్రము? వాస్తవ మెట్లు తెలియఁగలదు?

క. జడలును వల్కాజినములు, విడిచిన చో బాలకులకుఁ ◆ బృథ్వీశున కే
ర్పడఁ గలదే భేదం బని,నుడువఁగ గానంబు జనమ◆నోహార మగుచున్. ౧౪౭౪

అర్థములు. వల్కాజినములు=నారచీరలుఁ జింకచర్మములు.

తా త్ప ర్య ము

(జడలు, నారచీరలు, జింకచర్మములు వదిలినచోఁ నే బాలకులకు రామ చంద్ర భూపాలునకు భేదము లేదు. అని చెప్పుకొనుచుండగా, పాట జనుల మన స్సున కింపుగా.)

క. అతిమానుషమై వర్తిలె, నతిమధురం బగుచు శ్రోత•లందఱు లవ మేన్
మతిఁ దనివిగొనక విని వి,స్మృతి గాంచఁగ దమ్ము నంత•సీతాతనయుల్.

అర్థములు. అతిమానుషమై=మనుష్య శక్తికి మించినదై, లవమేన్=కొంచె మైనను, విస్మృతి=మైమఱపు.

తా త్ప ర్య ము

(మనుష్యశక్తికి మించి యతిమధురముగా నొప్పెను. వినువారికించు కంత యును దనివి లేకుండిరి. మైమఱచి తమ్ముఁజూచుచుండఁగా కుశలవులు.)

తే. మౌనినారదదర్శిత • మైనప్రథమ, సర్గమున నుండి యిరువది•సర్గములను
గాన మొనరించి రపరాహ్ణ•కాలమునను, సర్గముల నిర్వదిని విని•సంతసమున.

అర్థములు. నారదదర్శితము=నారదుఁ డుపదేశించినది, దీనివలనఁ బ్రథమ సర్గము మొదలు వాల్మీకి కృత మని యేర్పడుచున్నది.

తా త్ప ర్య ము

(నారద మహర్షి చే నుపదేశింపఁబడిన మొదటి సర్గమునుండియు, నిరువది సర్గములను మధ్యాహ్నకాలమునందు కుశలవులు గాన మొనరించిరి. శ్రీరాముఁడు విని సంతోషముతో.)

—• శ్రీరాముఁ డిచ్చిన కానుకలఁ గుశలవులు నిరాకరించుట •—

క. అనుజులఁ గని రాముఁడు పదు,నెనిమిది వేల్ స్వర్ణముల ము•నీంద్ర సుతులకున్
మనసార నిడుఁడు మఱి వే, నిని గోరిన నిండు వేగ•నెమ్మి నటన్నన్. ౧౪౭౭

తా త్ప ర్య ము

(తమ్ములఁజూచి పదునెనిమిది వేల బంగరు నాణెములను యీ మునికుమా రులకు మనస్ఫూర్తిగా నీయుఁడు. ఇంకేమేమి కోరినను ప్రేమతో నిండు అని శ్రీరాముఁడాజ్ఞాపించెను.)

క. భరతుండును సౌమిత్రియు, సరగం దద్ధనముఁ దెచ్చి • సంయమిసుతులన్
గర మనురాగంబున నివి, గుఱుమతి వేర్వేఱ మీరు•గొనుఁడీయనినన్. ౧౪౭౮

తా త్ప ర్య ము

(భరత లక్ష్మణులు ఆధనము దెప్పించి ప్రేమతో మునికుమారుల బిలిచివిడి విడిగా మీరీవిత్తమును గైకొనుఁడు అనఁగా.)

క. పచ్చని బంగరుమాడల, నచ్చెఱతలు గాంచి విస్మి•తాత్మకు లయి తా
రిచ్చగొన రైరి గైకొన, వచ్చెడు ఫల మేద్ది సీన • వనవాసులకున్? ౧౪౭౮

అర్థములు. చిఱుతలు=పిల్లవాండ్రు, విస్మితాత్మకులగు = ఆశ్చర్యముగల మనస్సు గలవారై.

తాత్పర్యము

పచ్చని బంగారు మాడల నా బాలురు చూచి యాశ్చర్యపడి యడవులలో నుండువారికి వీనివలన రాఁగల లాభమేమి యని వానిని గ్రహింప నిష్టపడిన వారుగారు.

చ. వనములలో వసించుచును ♦ పక్వఫలంబులు వేరు వెల్లకుల్
దినుచును ముక్కుఁబట్టికొని ♦ తేఁకువ నెప్పుడు దైవచింతనన్
దినములు ద్రోయు మాకు నృప ♦ తీ! కనకంబు లివేల యెందు నే
పనియగు మాకు వీనిఁగొని ♦ పాతఁబెట్టిన భూమిలోపలన్? ౧౪౨౦

అర్థములు. పక్వఫలంబులు=పండిన పండ్లు. పాతఁబెట్టిన=భూమిలోఁ బూడ్చి పెట్టిన, వీనివలన మాకు రాఁగల లాభమేమి? ఇవి యేపనికి నుపయోగించును?

తాత్పర్యము

(అడవులలో నివసించి పండిన పండ్లు, వేరు వెల్లకులు తినుచు తపముచేసికొనుచు భయమెఱుఁగక దైవచింతనముతో దినములు గడుపు మాకీ ధనమేల? వీనిఁగొనిపోయి భూమిలోఁ బాతఁబెట్టిన మాకు రాఁగల ఫలమేమి? ఇవి యేపనికి నుపయోగించును?)

—♦ రామాయణముఁ గూర్చి శ్రీరాముఁడు కుశలవులఁ బ్రశ్నించుట ♦—

చ. అను నుడు లాలకించి వసు ♦ ధాధిపుఁడున్ సభవారు విస్మయం
బున మునుఁగన్ రఘూత్తముఁడు ♦ మోదిలిపల్కుఁ గుమారులార! యే
ముని రచితంబు కావ్య మిది? మూల మ దెయ్యది? దేనిఁగూర్చి? నే
విన మది నాసఁగొంటి విని ♦ పింపుఁడటన్నను మౌనిబాలకుల్. ౧౪౨౧

తాత్పర్యము

(ఆమాటలను విని రామచంద్రమూర్తియు, సభవారును మిగుల నాశ్చర్యమును జెందిరి. సంతోషపడి రామప్రభువు నబ్బలారా! యేముని యీకావ్యము రచించినాఁడు? దీని కాధారమేది? దేనిని గూర్చి వ్రాసినాఁడు? నాకు వినవలెనని యాసగా నున్నది? వినిపింపుఁడు, అని యడుగఁగా, నా మునిబాలకులు.)

సీ. భగవంతుఁడగు♦మౌని వాల్మీకి కృత్తికర్త, సవనావనీస దే♦శంబునంద
వసియించినాఁడు ♦ కావ్యంబున విషయంబు, త్వచ్చరితంబు స♦ర్వంబు తేఁడ!
యిర్వదినాల్గువే ♦ లెసఁగ శ్లోకంబులు, నూఱుపాఖ్యానముల్ ♦ మీరునట్టు
లేనూరు సర్గంబు♦లిందు రాణింపఁగ, గాండంబు లాఱు మ♦ఱొండు కాండ

ఆ. ము త్తరంబు నాఁగ ♦ నుర్వీశ! శోభిల్ల,మాఁగురుండు పల్కె♦మౌనివరుఁడు
భార్గవుండు నీదు♦వ ర్తనంబె శుభా, శుభములెల్ల దెలియ♦శుద్ధపణితి. ౧౮౮౨

అర్థములు. కృతికర్త=గ్రంథము రచించినవాఁడు, సవనావనీసదేశంబు నందు=యజ్ఞభూమి సమీపమందే, త్వచ్చరితంబు సర్వంబు ననుటచే నేడు కాండములు నని భావము.

తా త్ప ర్య ము

మేము పాడుచున్న గ్రంథమును రచించినవాఁడు భగవంతుఁడగు వాల్మీకి. ఆయన నీవు చేయు యజ్ఞప్రదేశమునకు సమీపమందే యున్నాఁడు. ఈ కావ్యమునఁ జెప్పఁబడిన విషయము నీ చరిత్రమే. ఈ గ్రంథమునందు నిరువది నాల్గు వేల శ్లోకంబులు, ఇలోపాఖ్యానము వఱకు నూరుపాఖ్యానములు, ఐదునూర్ల సర్గములు, ఆఱుకాండములు, మఱియొక యుత్తర కాండము గలుగునట్లు మా గురువు మునీంద్రుఁడు భార్గవుఁడు పలికెను. ఇందు నీ నడవడియందు మంచిచెడ్డలు తెలుపఁ బడెను.

క. వినఁ గోరిక కలదేనియు, జనవర! కర్మాంతరముల♦సహజాతులతో
వినుమీ వినిచెదమన ముని, తనయులతో వల్లె యనుచు ♦ ధరణీశుఁడనన్.

అర్థములు. కార్మాంతరములన్=యజ్ఞకార్యములు చేయు నడిమి విరామ కాలములందు, సహజాతులతో= నీ తమ్ములతో.

తా త్ప ర్య ము

(రాజా! మీకు వినవలెననెడి కోరిక యుండినచో, యజ్ఞకార్యములందుఁ గలుగు విరామ కాలములందుమీ తమ్ములతో వినుఁడు. వినిపించెదమని చెప్పఁగా 'సరే' యని మునిబాలకులతో రామచంద్రమూర్తి పలుకఁగా.)

క. అరిగిరి వారలు ముదమున, గురుఁ జేరఁగ నుటజములకుఁ♦కువలయపతియున్
వర మగుసంగీతము సు, స్వరతాలలయాన్వితంబు♦సర్గాన్వితమున్. ౧౮౮౪

అర్థములు. ఉటజములకున్=పర్ణశాలలకు, సుస్వరతాలలయాన్వితంబు= మంచి స్వరముతోను తాలముతోను లయతోను గూడినది, సర్గాన్వితమున్=సర్గ విభాగములు గలది.

తా త్ప ర్య ము

(వారు సంతోషముతోఁ దమయాశ్రమములకు గురువగు వాల్మీకులవారి యొద్దకుఁబోయిరి. రాజగు రామచంద్రమూర్తి మంచి స్వరము,లయ, తాలముతోఁ గూడి సర్గ విభాగముగల శ్రేష్ఠము గానమును.)

కుశలవులు దనకొమరులని శ్రీరాముఁడెఱింగి వాల్మీకి మహర్షి యొద్దకు దూతల నంపుట.

ఆ. ఆలకించి కర్మ♦శాలకుఁ జనియెను, మునులతోడ నాప్త♦జనులతోడఁ
బిదప దినదినము♦వినియెఁ దద్గీతంబు, నృపులతోడఁ గొల్చు♦కపులతోడ.

తా త్ప ర్య ము

(విని యజ్ఞశాలకు బోయెను. తరువాతఁ బ్రతిదినము మునులతో నాప్తులగు వారితో, రాజులతోఁదనను సేవించు వానరులతో గలిసి యాపాట వినెను.)

క. గీతమువలన నెఱుంగుచు, సీతాతనుజాతు లీకు♦శీలవు లనుచున్
క్ష్మాతలపతి సభ వినఁగా, దూతలఁ బిలిపించి యనియెఁ♦దోడన మీరల్.

అర్థములు. కుశీలవులు=కుశలవులు, పాటపాడు వారు.

ఉత్తరకాండమునఁ గుశలవోత్పత్తి వినువఱకు నా బాలకులు తనకుమారులని శ్రీరామచంద్రమూర్తి యెఱుఁగఁడు. ముందెందు నీ విషయము చెప్పఁబడ లేదు. తమ గానము విను రాజు తమ తండ్రి యని కుశలవు లెఱుఁగరు. సీతాదేవి తమ్ముఁ గన్న తల్లి యనియైన నెఱుఁగుదురో యెఱుఁగరో సందేహమే.

తా త్ప ర్య ము

(పాటవలనఁ గుశీలవులు సీతకొడుకులని తెలిసికొని సభవారు వినుచుండ, దూతలను బిలిపించి చెప్పెను వెంటనే మీరు.)

క. చని నాపలుకుగ నాకుజ, మునితో నిట్లనుఁడు మౌని♦పుంగవ! ధాత్రీ
తనయ పరిపూత యని మీ,మనమునఁ గలదేని తెలియ♦మా కెల్లరకున్.

అర్థములు. నాకుజ=పుట్టలోఁ బుట్టిన, మునితో = వాల్మీకిమునితో, పరిపూత=పవిత్రురాలు.

తా త్ప ర్యము

(పోయి, వాల్మీకి మునీంద్రునితో నిట్లని చెప్పుఁడు. మునీశ్వరా! మీ మనస్సున సీత పవిత్రురాలని యున్నయెడల మా కందఱకుఁ దెలియునట్లు.)

ఆ. పూతశీల యనుచు ♦ వీతకల్మష యని, మీయనుజ్ఞ నొంది♦మెలఁత శపథ
మొండు సేయ♦జాలెడినా? యని, తపసిమతము సీత♦తలఁపు నెఱిఁగి.

అర్థములు. పూతశీల=పవిత్రమైన నడవడి గలది, వీతకల్మష=దోషము లేనిది, మెలఁత=స్త్రీ=సీత.

తా త్ప ర్య ము

(సీత మీ యాజ్ఞపొంది, తాను పవిత్రమైన నడవడిగల దానను, దోషము లేనిదాన నని శపథము చేయఁ గలదా! యని వాల్మీకి యభిప్రాయముఁ సీత యుద్దేశము తెలిసికొని.)

తే. అరుగు డెండన వినువార • లద్భుతం బ
టంచుఁ బలుకంగ దూత ల• త్యంతజవము
తోడఁ జని మ్రొక్కి మునినాథు • తోడ నెల్ల
మృదుమధూక్తులఁ బలుకంగ • ఋషివిభుండు. ౧౮౭౯

అర్థములు. అత్యంతజవము=మిగుల వేగము.

తా త్ప ర్య ము

(రండు-అని చెప్పఁగా, వినువార లచ్చెరువని పలుకుచుండ, దూత లతి వేగమునఁ బోయి, వాల్మీకి మునిపుంగవునిఁ గని మ్రొక్కి తేనెవలెఁ దీయనై మృదువులగు మాటల విన్నవింప, వాల్మీకి మహర్షి.)

సీత శపథంబు సేయునని వాల్మీకమహర్షి శ్రీరామునకుఁ జెప్పి పంపుట.

ఉ. రాముఁడు చెప్పినట్టు ధ•రాసుత సల్పెడుఁ గాక తేపటన్
భామల కెంము దైవతము • ప్రాణవిభుండె కదా య టంచనన్
రామునిదూత లావలుకుఁ • గ్రమ్మఱి తెల్పఁగ మానిభూపతి
స్తోమముఁ గాంచి యిట్లు లనుఁ•దోయజనేత్రుఁడు హృష్టచిత్తుఁడై. ౧౮౮౦

అర్థములు. హృష్ట చిత్తుఁడై=సంతోషించిన మనస్సుగలవాఁడై.

తా త్ప ర్య ము

(సీత తేపు రాముఁడు చెప్పిన ప్రకారమే చేయును 'స్త్రీలకు దైవము భర్తయేకదా!' యని చెప్పఁగా రాముని దూత లామాటలఁ దిరిగిపోయి రామునకుఁ దెలుపఁగా రాముఁడు మునులయు, రాజులయు సమూహమును జూచియిట్లు చెప్పెను.)

చ. పరిచరయుక్తులౌనవని•వల్లభులార! సశిష్యులౌమునీ
శ్వరతతులార! యాత్మలను • సందియ ముండెడి లోకులార! యె
ల్లరుఁ జను డెండు లప్పక యి•లాసుత తేపు జగం బెఱుంగఁగా
వరశపథం బొనర్చు నప•వాదముఁ బాపుకొనంగ నం చనన్. ౧౮౮౧

అర్థములు. పరిచర యుక్తులు=సేవకులతోఁ గూడినవారు, సశిష్యులు= శిష్యులతోఁ గూడినవారు, ఇలాసుత=సీత, అపవాదము=అపకీర్తి, నింద.

తా త్ప ర్య ము

(రాజులారా, మీరు మీ పరిచారకులతో రండు. మునులారా, మీరు శిష్యులతోఁ గూడ విచ్చేయుఁడు, సీతవిషయమున మనస్సునందు సందేహముగల లోకులారా! మీరెల్లరు చనుడెంచు-తేపు సీత జగమునకంతకుఁ దెలియునట్లు

తనకుఁ గలిగిన యపవాదము పోఁగొట్టుకొనుటకు మేలి శపథము చేయఁ గలదు.' అని చెప్పఁగా.)

క. మే లని మెచ్చిరి మౌనులు, వాలాయము పొగడు చవని♦పాలురు రామా!
  యీ లీల నీకె తగెడిం జాలునొకో యెవ్వఁడేని♦సలుపఁగ నిట్టుల్? ౧౪౯౨

తాత్పర్యము

(మునులు,మేలని మెచ్చుకొనిరి. రాజులు రామునిఁ గొనియాడుచు రామా! యీప్రకార మెవఁడు చేయఁగలఁడు? ఇది నీకే తగును?)

క. అని పలుకఁగ మీ రెల్లరు, జనుదెండీ! తె పటంచు ♦ జనపతి సెల వి
  చ్చిన వా రా ముచ్చటలే యనుకొనుచుం జనిరి రాత్రి♦యటు లరుగంగన్.

తాత్పర్యము

(అని పలుకఁగా, రామచంద్రుఁడు 'మీరందఱు ఱేపు రండు' అని సెల వీయఁగా వారా ముచ్చటలే చెప్పికొనుచుఁ బోయిరి. రాత్రి యా విధముగాఁ గడచి పోఁగా.)

—♦ సీతాశపథముఁ జూచుటకు లోకులు గుంపులుగా వేరుట ♦—

సీ. వఱువాత రామభూ♦పతి యజ్ఞవాటంబుఁ, జేరి పిల్పించె వ♦సిష్ఠు వామ
  దేవు జా బాలిని ♦ ధీమంతుఁ గాశ్యపు, గాధిజు దుర్వాసు♦గర్గుఁ జ్యవనుఁ
  బర్వతు నారదు ♦ భార్గవు శక్తిని, వామనునిన్ భర♦ద్వాజమౌని
  గౌతమఋషిని మా♦ర్కండేయునిఁ బులస్త్యుఁ, గాత్యాయనర్షి న♦గస్త్యమౌని
తే. నగ్నిసుతు సుప్రభునిని సు♦యజ్ఞమౌని
  మఱియు మౌద్గల్యుఁ దక్కిన ♦ మౌనివరుల
  వానరుల రాక్షసుల భూమి♦వరుల వైశ్య
  శూద్రజనముల నెల్లరఁ ♦ జూచుటకును. ౧౪౯౪

తాత్పర్యము

(ఉదయమున రామచంద్ర ప్రభువు యజ్ఞశాలకుఁ పోయి, వసిష్ఠుని, వామదేవుని. జాబాలిని, బుద్ధిమంతుఁడగు కాశ్యపుని, విశ్వామిత్రుని, దుర్వాసుని, గర్గునిఁ, జ్యవనుని, బర్వతుని, నారదుని, భార్గవుని, శక్తిని, వామనుని, భరధ్వాజమునిని, గౌతముని, మార్కండేయునిఁ, బులస్త్యునిఁ గాత్యాయనర్షిని, నగస్త్యమునిని, సుప్రభుని, సుయజ్ఞుని, మౌద్గల్యుని వీరుగాక తక్కిన మునులను, వానరులను, రాక్షసులను, రాజులను, వైశ్యులను, శూద్రులను, చూచుటకుఁ బిలిపించెను.)

తే. పెక్కు దేశంబులందుండి♦విప్రవరులు, సంశ్రితవ్రతు లగువారు♦జ్ఞాననిష్ఠ
  కర్మనిష్ఠయు భూరియో♦గమున నిష్ఠ, గలుగువారలు వచ్చిరి♦కాంచుటకును.

అర్థములు. సంశ్రితవ్రతులు=వ్రతనిష్ఠ గలవారు.

తా త్ప ర్య ము

(ఈ విశేషము చూచుటకు దేశదేశములనుండి వ్రతనిష్ఠగల బ్రాహ్మణులు జ్ఞానినిష్ఠులు, కర్మనిష్ఠులు, యోగనిష్ఠులు వచ్చిరి.)

తే. అరుగుదెంచిన వారెల్ల♦నద్రివోలెఁ గదలకుండిరి, దండియౌ♦త్కంఠ్యమునను
జనములెల్లరు మూఁగిన♦జాడ తెలిసి, మైథిలీయుక్తి వాల్మీకి♦మౌనివచ్చె. ౧౮౭

అర్థములు. అద్రివోలెన్=కొండవలె, ఔత్కంఠ్యమునను=తహతహపాటుచే.

తా త్ప ర్య ము

(వచ్చినవారందఱును మిక్కిలి తహతహ పాటుతోఁ గొండవలెఁ గదలక కూర్చుండిరి. జనములెల్లరు మూఁగిన సమాచారము తెలిసికొని సీతాదేవితో వాల్మీకి మహర్షి వచ్చెను.)

—♦ సీతాదేవిని దోడ్కొని వాల్మీకిమహర్షి యజ్ఞశాలకు వచ్చుట ♦—

క. మునివరు వెంటన ధరణీ,తనయయు నెమ్మోము వ్రాల్చి♦దశరథరామున్
దనమనమున ధ్యానించుచుఁ, గనునీరము నిలుపుకొనుచుఁ♦గంఠమునందున్.

అర్థములు. కనునీరము=కన్నీళ్ళు, వెలుపల రాకుండునట్లు కంఠమునందే నిలిపెను.

తా త్ప ర్య ము

(వాల్మీకి మునీశ్వరుని వెంబడి సీతయును తలవంచుకొని మనసులో రాముని ధ్యానించుచుఁ గన్నీళ్ళు కంఠమునందే నిలుపుకొని వచ్చెను)

క. కరకంజంబులు మోడిచి, యరుదేరఁగ బ్రహ్మవెంట♦ననుగమనంబుం
బొనరుచు శ్రుతి చందంబున, మునివరుబడి వచ్చుచున్న♦ముగ్ధం గనుచున్.

అర్థములు. కరకంజంబులు=హస్తకమలములు, మోడిచి=ముకుళించి, శ్రుతి చందనంబున=వేదమువలె.

తా త్ప ర్య ము

(పద్మములవంటి చేతులు ముకుళించి వచ్చుచుండ, బ్రహ్మవెంటఁ జనుదెంచు వేదమునలె మునివరునివెంట వచ్చు ముద్దురాలగు సీతను జూచుచు.)

క. ఘనతరశోకభరంబున, జనములు హాలహాలరవంబు♦సమ్మర్దముగా
నినుచుచు మేల్మేలను చుం, గనుగొని రా భూమితనయ♦కాకుత్స్థవరున్. ౧౮౯

తా త్ప ర్య ము

(మిక్కిలి గొప్ప శోకముయొక్క పెంపున జనులు సందడిగా రొదచేయుచు మేల్మేలని పొగడుచు నా సీతను రాముని జూచిరి.)

క. బాపురె! రామా! యనుచును, బాపు! బళీ! సీత! యనుచుఁ బలుకఁగ జనముల్
బాపురె! యని యా యిద్దఱఁ, జూపఱు మెచ్చిరి నితాంతశోకప్లుతులై.

అర్థములు. చూపఱు=చూచువారు, నితాంత శోకప్లుతులై=మిక్కిలి శోకమున మునిఁగిన వారై.

తాత్పర్యము

(బాపురే! రామా! యనుచు, బళిబళీ! సీతా! యనుచు జనులు మిక్కిలి శోకమున మునిఁగి చూచు వారా సీతారాముల నిద్దఱ మెచ్చుకొనిరి.)

తే. భూమితనయాసహాయుఁడై పుణ్యమూని
వల్మికోద్భవుఁ డరుదెంచి ప్రజలనడుమ
నిలిచి యెల్లరు విన రఘు కులుసిఁ జూచి
బిగ్గ పలికెను రాఘవా! వినుము నీవు. ౧౫౦౧

అర్థములు. వల్మికోద్భవుఁడు=వాల్మీకి.

తాత్పర్యము

(సీతతోఁ గూడి పుణ్యాత్ముఁడు వాల్మీకిమహర్షి వచ్చి, ప్రజలనడుమ నిలిచి, రామచంద్రమూర్తినిఁ జూచి, యందఱు వినునట్లు 'రాఘవా! నీవు వినుము' అని బిగ్గరగాఁ జెప్పెను.)

—సీతాదేవి పతివ్రత యని వాల్మీకిమహర్షి సత్యముఁ జేసి చెప్పుట—

శా. రామా! జానకి సువ్రతాత్మ శుభధ ర్మశ్రీతచారిత్ర నీ
వేమో లోకము నింద మాటలకు నై యీసాధ్వినిన్ మత్తపో
భూమీసక్తవనంబునన్ విడిచి, తీ భూపుత్రి లోకాపవా
దామానస్యుఁడ వీవు నమ్మ శపథం బారంగఁ గావించెడిన్. ౧౫౦౨

అర్థములు. సువ్రతాత్మ=మంచి పాతివ్రత్య మహిమ గలది, శుభధర్మశ్రీత చారిత్ర=శుభకరమై ధర్మముచేఁ బ్రసిద్ధమైన నడవడి గలది, సాధ్వినిన్= పతివ్రతను, మత్తపోభూమీసక్త వనంబునన్ = నాతపోభూమికిఁ జేరి యుండు నడవియందు, లోకాపవాదా మానస్యుఁడవు=లోకనిందచే దుఃఖించు వాఁడవు, శపథంబు=ప్రమాణము.

తాత్పర్యము

రామా! జానకీదేవి నిర్మలపాతివ్రత్యమహిమ గలది. శుభకరమై ధర్మముచేఁ బ్రకాశించు నడవడిగలది. ఇఁక నీవో, లోకము లోనివారు నిందించినారని యీ పతివ్రతను నా యాశ్రమభూమియొద్ద వదలితివి. ఈసీతాదేవి లోకనిందలచే దుఃఖించు నీవు నమ్మునట్లు ప్రమాణము చేయగలదు.

క. అనుమతి యిమ్మా జానకి, తనయుల యీ కవలవారు♦తథ్యము నీకుం
జనియించిరి దుర్ధర్షులు, దినకరకుల నే వచించి ♦ తిన్ సత్యంబున్. ౧౫౦౩

తాత్పర్యము

నీయనుజ్ఞ లేక యామె యేదియుఁ జేయరాదు. చేయదు. కావున నామె ప్రమాణము చేయుట కనుజ్ఞ యిమ్ము. ఈ యమడ బిడ్డలు నీకుఁ బుట్టినవారు. ఇది సత్యము. వీ రనాథ్యులు, రామా! నేను సత్యము చెప్పితిని.

సీ. శ్రీరామ! నేను ప్ర♦చేతసు పదియవ పుత్రుండ మదినైన ♦ బొంకుఁ దలఁప
నీ పుత్రు లిర్వురు♦నీ పుత్రులే చుమ్ము, పెక్కు వేలేఁడు లే♦నుక్కడంపుఁ
దప మొనరించితి ♦ ధరణిజ దుష్టయేన్, దపముఫలం బెల్ల♦దగ్ధమగుత
మనసునఁ గర్మంబు♦నను వాక్కుచేతను, గలుషంబు నే నెప్డు ♦ సలుపలేదు

ఆ. వానిఫలము నాకు ♦ప్రాపించు భూసుత, పాపహీనయేని♦పార్థివేంద్ర
భూతపంచకమున♦బుద్ధినీ జానకి, నెఱిగి పూత యని గ్ర♦హించినాఁడ! ౧౫౦౪

అర్థములు. ఉక్కడంపు=ఉగ్రమైన, భూతపంచకమునన్=ఐదు మహాభూతములచే నేర్పడిన దేహముచేతను, శ్రోత్రము మొదలు పంచేంద్రియములచే నని భావము, పూత=పవిత్రురాలు.

తాత్పర్యము

శ్రీరామచంద్రా! నేను ప్రచేతసుని పదియవకుమారుఁడను. మనసునందైన నబద్ధమాడ వలయునని తలఁచినవాఁడనుగాను. ఈ కుమారు లిద్దరు నీకొడుకు లే. నే ననేక సంవత్సరము లుగ్రమైన తపస్సు చేసితిని సీతాదేవి దుష్టురాలేని నా తపమంతయు దగ్ధమై పోవునుగాక. మనస్సుచేతను, వాక్కుచేతను, దేహముచేతను నేను పాపము చేయలేదు. సీతాదేవి పాపహీనురాలయ్యెనా వానిఫలము నాకుఁ గలుఁగును. పంచభూతములచేతను బుద్ధిచేతను సీతాదేవి పవిత్రురాలని యెఱిఁగి నేను జేరఁదీసితిని, దేహముచేతఁగాని బుద్ధిచేఁగాని యామె యేపాపము చేసినది కాదు. ఈ పద్యము చదివినవారు వాల్మీకి క్రూరవృత్తి నుండెనని యెట్లు విశ్వసింతురో.

ఆ. పాపహీనురాలు♦పతిదేవతామణి, యతిపవిత్రశీల♦యవనిజనుల
నడికి వెఱచు నీకుఁ జక్కఁగ నమ్మిక, గలుగఁజేయ బాస♦సలుపునిపుడు. ౧౫౦౫

అర్థములు. పాపహీనురాలు=పాప మెట్టిదో యెఱుఁగనిది, పతిదేవతామణి=పతియే దైవమని తలఁచు పతివ్రతలలో శ్రేష్ఠురాలు, అతిపవిత్రశీల=మిక్కిలి పావనమైన నడివడి గలది, అవని జనుల నడికి=లోకులాడు నిందకు, వెఱచు=భయపడునట్టి, బాస=ప్రమాణము.

తాత్పర్యము

(పాపమెట్టిదో యెఱుఁగనిది, పతియే దైవమని తలఁచు పతివ్రతలలో శ్రేష్ఠురాలు, మిక్కిలి పావనమైన నడవడిగలది సీత లోకులాడు నిందకు భయపడు నీకు జక్కఁగాఁ నమ్మిక కలుగునట్లు చేయ నిప్పుడు ప్రమాణము చేయును.)

ఆ. దివ్యదృష్టిచేతఁ భవ్యాత్మ యీసతి, యనుచు నెఱిఁగినాఁడ జనుల దూఱు
పడఁగలేక నీవు పడఁతి శుద్ధయటంచు, నెఱిఁగి యెఱిఁగి విడిచితీమె నడవి.

తాత్పర్యము

ఈమె పవిత్రురా లని నీ కెట్లు తెలియు నందువా? నేను దివ్యదృష్టిచేతఁ జూచితిని. ఈమె పతివ్రత. పుణ్యాత్మురాలని యెఱిఁగితిని. నీవో జనులు నిందపడ లేక యీమె పతివ్రత యని తెలిసి తెలిసి యడవిలో వదలితివి, ఈమె నిర్దోషురాలని. నీ వెఱుగుదువు.

ఇటువంటి మహాపతివ్రత కిట్టి నిష్కారణనింద వచ్చెనే, దీనిని వారింపకున్న నదియే లోకమున స్థాపిత మగునే యని తలఁచి కరుణామయాత్ముఁడైన వాల్మీకి యీమె మహిమ లోక మెఱుంగుటకుఁ గాను రామాయణము వ్రాసెను.

లోకాపవాదముఁ బాపుకొన సీతాదేవి శపథము సేయవలయునని శ్రీరాముఁడనుట.

క. అని యిటు వాల్మీకి వచిం, చిన విని కరయుగము మోడ్చి శ్రీరాఘవుఁడున్
జనమధ్యంబున సీతా, వనజాక్షిం గనుచుఁ బలికెఁ బరమ తపస్వీ! ౧౫౦౭

తాత్పర్యము

(అని యీవిధముగా వాల్మీకి మహాముని చెప్పఁగా, విని శ్రీరామచంద్రమూర్తి రెండు చేతులు జోడించి జనుల నడుమ సీతనుజూచి చెప్పెను. ఉత్తమమగు తపస్సు చేయుదానా!)

ఉ. నమ్మితి నేను నీ పలుకు నాయెద సందియ మేమి లేదు నీ
కమ్మని ధరాతనూభవ యకల్మష, మున్ను సురాళిసన్నిధిన్
నమ్మిక ప్రత్యయం బిడియెఁ జాన, యటౌటఁ గదయ్య యప్డు నే
నమ్మన కేను దెచ్చితి, జనావళిదూఱు సహింప శక్యమే? ౧౫౦౮

అర్థములు. అకల్మష=దోషహీనురాలు, ప్రత్యయమిడియె=ప్రమాణముచే నమ్మకము గలిగించెను, చాన=స్త్రీ=సీత, దూఱు=నింద.

తాత్పర్యము

మునీంద్రా! నీమాట నేను నమ్మితిని, ఆవిషయమున నాకే సందేహము లేదు, జానకి నిర్దోషురాలు. దేవతలయెదుట పరీక్ష యిచ్చి నమ్మకము ప్రదర్శించెను.

కావుననే యింటికిఁ దెచ్చితిని. కాని లోకనింద యెట్లు సహింతును? అక్కడ జరిగి నది వీరి కేమి తెలియును? నిప్పులలో దూఁకి బ్రదికినదనిన వీరి కసాధ్యముకావున వీరు నమ్మరు. కల్పితమని యందురు. కావున దానికి నే నేమి చేయగలను?

ఉ. కావున లోకభీతి మహి♦కన్యక శుద్ధ యటం చెఱింగి నే
   నీవిధి వీడఁగా వలసె ♦ నీవు క్షమింపుము నన్ను దానికై
   భావమునం దెఱుంగుదును ♦ బాలకు లిద్దఱు నా కుమారు లీ
   భూవలయంబు సీత పరి ♦ పూత యటన్నను బ్రీతిఁ గూర్చెదన్.   ౧౫౯౮

తా త్ప ర్య ము

ఈ కారణముచే సీతాదేవి శుద్ధాత్మయని యెఱిఁగి యెఱిఁగి లోకనింద తప్పించుకొనుటకై యీ ప్రకారము వదలిపెట్టవలసి వచ్చెను. నీవు మన్నింపుము. ఈబాలకు లిరువురు నా కొడుకులని నేనెఱుఁగుదును. ఈ భూమిిజనులు సీత పవిత్రు రాలు ఆమెయందు దోషము లేదు అని చెప్పిరేని సంతోషించెదను. వాల్మీకి సీత పవిత్రురాలు, పరీక్షయిచ్చునని చెప్పెనేకాని, నీవు పరిగ్రహింపుమని చెప్ప లేదు. రామచంద్రమూర్తియు సీత నిర్దోషురాలని జనులు విశ్వసించిన సంతోషిం చెదననెను గాని పరీక్ష యిచ్చిన నేను మరలఁ గైకొందునని చెప్పలేదు. భవిష్య త్తిరువురకుఁ దెలియును. కావున ఆ విషయము చెప్పలేదు.

సీ. అనవుడు దశరథ ♦ తనయు నభిప్రాయ, మెఱిఁగి దేవత లెల్ల ♦ నింద్రుఁడాది
   బ్రహ్మ మున్నుగ మింట♦వచ్చినిల్చిరి సీత, శపథంబుఁ జూడంగ♦సంభ్రమమున
   వసువులు రుద్రు ల♦ప్సరసలు గంధర్వు, లాదిత్యులు మరుత్తు♦లశ్వు లోలి
   విబుధ సిద్ధులు సాధ్య♦విశ్వదేవులు మహా,ఋషివరుల్ వచ్చిన♦నెల్లవారిఁ

ఆ. జూఁచి రాముఁ డనియె♦సురలార!మునులార!,మౌనివాక్యముఁ ను♦మహితనూజ
   నిర్మలాత్మ యనుచు♦నెఱనమ్మినాఁడను. జగము నమ్మెనేని♦సంతసింతు. ౧౫౯౦

తా త్ప ర్య ము

(అని చెప్పఁగా, రామచంద్రమూర్తి యభిప్రాయము తెలిసి బ్రహ్మ మున్నుగా నింద్రాది దేవతలెల్ల సీత చేయు శపథమును జూడవచ్చి యాకాశ మున నిలిచిరి. అష్టవసువులు, ఏకాదశరుద్రులు, అప్సరసలు, గంధర్వులు, ద్వాద శాదిత్యులు, మరుత్తులు, అశ్వినీదేవతలు, సిద్ధులు, సాధ్యులు, విశ్వదేవులు,మహ ర్షులు సంబరముగా వచ్చిరి. వచ్చినవారి నందరను శ్రీరామచంద్రమూర్తి దేవత లారా! మునులారా! సీత పరిశుద్ధురాలనుచు వాల్మీకి మునీశ్వరుని మాటలను బూర్తిగా నమ్మినాఁడను. లోకముకూడ నమ్మినచో సంతోషించెదను.)

చ. అనవుడు దివ్యగంధము సు ♦ ఖావహామున్ హృదయంగమంబునై
యనిలుఁడు సర్వలోకులకు ♦ హాయిగ వీచెఁ గృతంబునం దనన్
జనము మహాద్భుతం బనుచు♦సంభ్రమ మారఁగఁ జూచు చుండ భూ
తనయయుఁ గావిచేలమును ♦ దాల్చి సభాజన తాంతరంబునన్. ౧౫౧౧

అర్థములు. సుఖావహాము=సుఖముగలిగించునది, హృదయంగమంబు=మనోహరమైనది, అనిలుఁడు=వాయువు, హాయిగన్ = సుఖకరముగ, కృతంబునం దనన్=కృతయుగమునందువలె, కావిచేలమును=కాషాయ వస్త్రమును, సభాజన తాంతరంబునన్=సభాజనుల నడుమ.

తాత్పర్యము

రామచంద్రమూర్తి యిట్లు చెప్పఁగా సుఖము గలిగించునదియు మనోహరమునై కృతయుగంబు నందువలె వాయువు హాయిగా వీచెను. లోకు లిది మహాద్భుతమని తొట్రుపాటుతోఁ జూచుచుండఁగా సీతాదేవి కావిచీర కట్టుకొని సభాజనుల నడుమ నిలిచి.

—* సీతాదేవి శపథంబు సేయుట *—

క. కరకంజంబులు మోడిచి, ధరణిం గనుఁగొనుచు శిరముఁ♦దగ వ్రాలిచి యె
ల్లరు వినఁగా నిట్లనియెను, సరసీరుహానయన దా న♦చంచలమతియై. ౧౫౧౨

అర్థములు. కరకంజంబులు=హస్తకమలములు, అచంచలమతియై=చలింపని మనస్సు గలదై.

తాత్పర్యము.

(హస్తకమలములు ముకుళించి, నేలఁజూచుచుఁ దలవ్రాల్చి చలింపని మనస్సు గలదై సీత యందఱు వినునట్టు లీ ప్రకారము చెప్పెను.)

తే. స్వాంతమందైన శ్రీరామ♦చంద్రుఁ దక్క, వేఱుపురుషుని మదిని భా♦వింపనేని
బరమశీలంబుచేతఁ బా♦వనిన యేనిఁ, దల్లి! యో మాధవీదేవి!♦దారినిమ్ము.

అర్థములు. స్వాంతమందైనన్=మనస్సునందైనను, తక్కన్=తప్ప,పరమ శీలంబుచేతన్=ఉత్తమమైన యాచారముచే, పావనిన=పవిత్రురాలనే, మాధవీ దేవీ, ఓ భూదేవీ మాధవపత్ని-మాధవీ.

తాత్పర్యము

శ్రీరామచంద్రమూర్తిని దప్ప మఱియొక పురుషుని మనస్సునందైన నను రాగముచేఁ దలంపకుండినను ఉత్తమపాతివ్రత్యముచేతఁ బవిత్రురాలనే యగుదు నేని తల్లీ! యోభూదేవి! నాకు దారి నిమ్ము

తే. మనసుచేతను నుడులఁ గర్మములచేతఁ, బ్రాణవల్లభుఁ డైన శ్రీరామభద్రు
నే సదా యర్చనము సేతునేని, తల్లి! యోమాధవీదేవి! దారినిమ్ము.

తా త్ప ర్య ము

మనస్సు చేతను మాటలచేతను కార్యముల చేతను నాభర్తయగు శ్రీరామ చంద్రమూర్తినే నేను సదా పూజించు చుండుట నిజమగునేని యోతల్లీ! భూదేవీ! నాకు దారి నిమ్ము.

తే. ప్రాణవల్లభుఁడౌ రామభద్రుఁ దప్పఁ బరపురుషు నే నెఱుంగ నాభాషితంబు
పొల్లుగాదేని ముమ్మాటికెల్లరుఁ గనఁ దల్లి! యో మాధవీదేవి! దారి నిమ్ము.

తా త్ప ర్య ము

నా ప్రాణభర్తయగు రామచంద్రుని దప్ప నితరపురుషుని కామముచే నేను దలఁచినదానఁ గాను. నాయీ మాట యసత్యము గాదేని ముమ్మాటికి నిందఱు చూచుచుండఁ దల్లీ! మాధవీ దేవి! నాకు దారి నిమ్ము.

—సీతాదేవి రసాతలంబునకుఁ బోవుట—

సీ. అని శపథంబుల నాడిన యంతన, పరమాద్భుతంబుగఁ బ్రజలు గనఁగ
నమితవిక్రములైన యహిపతుల్ శిరమున, ధరియింప దివ్యరత్న జ్వలితము
దేవతాయరచితంబుదివ్యసింహాసన, మిలనుండి వెంటనే యెగయుఁ దెంచె
నందు ధాత్రీదేవి హస్తంబులను సీత,గ్రహియించి కుశలంబుఁ బ్రశ్న సేసి

తే. సింహపీఠిక నుపవిష్టఁ జేసి కొంచుఁ
బోయెను రసాతలమునకు భూమితనయ
పై నవిచ్ఛిన్నముగఁ బుష్ప వర్షమపుడు
గురిసెఁ గొండాడఁ జొచ్చిరి సురలు ఋషులు. ౧౫౧౬

అర్థములు. అహిపతుల్=సర్పరాజులు, దివ్యరత్నజ్వలితము=దివ్యములైన రత్నములచే ప్రకాశించునది, దేవతారచితంబు = దేవతలచే నిర్మింపఁబడినది, ఎగయుఁ దెంచెన్=పై కెగసి వచ్చెను, ధాత్రీదేవి=భూదేవి, సింహపీఠికన్ = సింహాసనమందు, ఉపవిష్టఁజేసి=కూర్చుండఁబెట్టి, అవిచ్ఛిన్నముగన్=తెఱపిలేక, కొండాడఁజొచ్చిరి=పొగడసాగిరి.

తా త్ప ర్య ము

(అని సీతాదేవి శపథములు పలికిన వెంటనే పరమాశ్చర్యముగాఁ బ్రజలు చూచుచుండ, నమితపరాక్రమము గల సర్పరాజులు మోయుచున్నదియు దివ్య రత్నములతోఁ బ్రకాశించునదియు దేవతలచే నిర్మింపఁబడినదియునగు సింహాసనము

భూమిలోనుండి పైకెగసి వచ్చెను. అందుండి భూదేవి సీతాదేవిని చేతులతోఁ దీసికొని కుశలమడిగి సింహాసనమునఁ గూర్చుండఁ బెట్టి రసాతలమునకుఁ దీసికొనిపోయెను. సీతాదేవిమీఁద నెడతెఱిపిలేకుండఁ బూలవాన గురిసెను. దేవతలు, మునులు, పొగడసాగిరి.)

మరల నగ్నిప్రవేశమే చేసి పరీక్ష చూపి యుండరాదా యని కొందఱు తలఁతురు. దానినే మరలఁ జూచినపక్షమున నీమెయొద్ద నేదియో యగ్నిస్తంభన విద్యయో మూలికా ప్రభావమో గలదు. కావుననే ధైర్యముగ నగ్నిలో దూఁకు నని లోకులందురు. అదియునుగాక, లంకలో నందఱియెదుట పరీక్షచూపినను లోకుల నింద తప్పినదికాదు. ఇప్పుడట్టి పరీక్ష చూపినను దేశాంతర కాలాంతరమందు మరల నట్టిది పుట్టనదని యేమి నమ్మకము? ఎన్నిమార్లని పరీక్షచూపుట? అదియునుగాక ప్రమాణము చేసినను మరల గ్రహించెద నని రామచంద్రుని నోర రాలేదు. లోకులు నమ్మినఁ జాలు ననియే జెప్పెను. ఈ కారణముచేత సందేహమున కెడమీయని ప్రమాణము చేసెను. అగ్నిలో దూఁకి బ్రతుకుటకంటె నిది కఠినమైన పరీక్ష. భర్త యాజ్ఞ లేకపోవుటచేతను భర్తవంశము నిలుపవలయునను కోరికతోను అప్పుడే యిట్టి కార్యము చేసినదికాదు. ఆ రెండడ్డములు తీరినవి. కొడుకులు మగనియొద్దఁ జేరిరి. భర్తయాజ్ఞయు నయ్యెను గనుక కలకాలము నింద మోచి బ్రతుకుటకంటె దేహత్యాగము చేయుట మేలని తలఁచెను. మఱియొక యోజన:-ఇప్పుడు వేఱొక శపథముచేసి దేహము నిలిపెనేని రామచంద్రమూర్తి తన్ను గ్రహింపక తప్పించుకొన లేఁడు. అప్పుడా భృగుమహర్షి యిచ్చినది నను భవించెదననియు తన భర్త యంగీకరించినదియు నగు శాపము ననుభవించుటకుఁ దా నడ్డపడిన ట్లగును. కావున దేహము విడువఁదలఁచెను.

తే. మేలు మేలమ్మ!జానకీ!॰మేలు దేవి!, యౌర! బాపురె!భళి భళీ!॰యహహా!చాఁగు
నీసుశీలం బహా! యెంత॰నిర్మలంబొ!, యిట్టిదా నీదు నడవడి॰యిగురుఁబోఁణి!

తాత్పర్యము

(అమ్మా! సీతమ్మా! యేమి నీ పాతివ్రత్యమహిమ! ఔరా! యెంత నిర్మలము! ఎంత నిర్మలము!! ఇట్టి మహిమ కలదా నడవడి!!

క. అని యంతరిక్ష గతులన మనములు విస్మయ మహాబ్ధి॰మగ్నంబులుగా
మునులును యజ్ఞాలయగత, జనవర్యులు ప్రతిమలట్లు॰సంవీక్షింపన్. ౧౬౧౫

అర్థములు. అంతరిక్షగతులు=ఆకాశమం దుండువారు! విస్మయమహాబ్ధి= ఆశ్చర్య మను సముద్రమందు, మగ్నంబులుగాన్=మునుఁగఁగా, యజ్ఞాలయగత= యజ్ఞశాలయం దుండు, జనవర్యులు=రాజులు, ప్రతిమలట్లు=బొమ్మలవలె, సంవీక్షింపన్=చూడఁగా.

తాత్పర్యము

(అని యాకాశమునం దుండువారు పలుకుచుండ, మునులు యజ్ఞశాలయం దున్నరాజులు తమ మనసులాశ్చర్య మను గొప్ప సముద్రమునందు మునుఁగఁగా, బొమ్మలవలెఁ జూడ)

క. భూతలమున గగనంబునఁ, బాతాళమునందు నెల్లఁ • బన్నగదనుజ
వ్రాతము స్థావరజంగమ జాతము క్రియ మాని వీత•చైతన్యం బై ౧౯-౨౦

అర్థములు. పన్నగదనుజవ్రాతము = పన్నగుల దానవుల సమూహము స్థావరజంగమ జాతము=కదలనివి, కదలునవి వీనిసమూహము, క్రియ=వలె, వీతచైతన్యంబై=స్మృతి తప్పినవై.

తాత్పర్యము

(భూమియందు, నాకసమున, పాతాళలోకమునఁ బన్నగుల దానవులస్థావర జంగముల సమూహము స్మృతి తప్పి చేష్ట లుడిగిన వయ్యెను.)

క. కొందఱు ముదమున నఱచిరి, కొందఱు ధ్యానమున మునిఁగి•కూరిరి చింతన్
గొందఱు రాముని జూచిరి, కొందఱు కనుగొనిరి పుడమి•కొమరితె మదులన్.

అర్థములు. ముదమునన్=సీతాదేవి యపవాదము పోయెనని సంతోషముతో, మదులన్=మనస్సులందు, సీతాదేవిని జూచిరి.

తాత్పర్యము

(సీతాదేవికి వచ్చిన యపవాదము పోయెనని సంతోషముతో నఱచిరి కొందఱాలోచనలో మునిఁగి దుఃఖమును బొందిరి. కొందఱు రామచంద్రమూర్తిని జూచిరి. కొందఱు తమ మనస్సులలో సీతాదేవినిఁ గనుగొనిరి.)

క. సీతాప్రవేశనంబును, భూతకదంబంబు చూచి • పొదలినచింతన్
జాతమహావిస్మయమునఁ, జేతము చెడి మోహమునను•జేష్టపడి యుండెన్.

అర్థములు. భూతకదంబంబు=ప్రాణులసమూహము, చేతము=మనస్సు.

తాత్పర్యము

(సీతాదేవి భూమిలోఁ బ్రవేశించుట చూచి ప్రాణుల సమూహము విచారము విస్మయము నధికమగుటచే మనస్సులు చెడి చేతలుడిగి తెలివితప్పి యుండెను)

— • సీతా వియోగంబునకు శ్రీరాముఁడు పరితపించుట • —

సీ. జానకీదేవి ర•సాతలంబున కేగ, మేలు మే లని కపి • జాల మనఁగ
దండకాష్ఠంబు నూఁ•తగఁగొని రాముండు, శిరము వేలఁగ వై చి•చింతమునిఁగి
పరమదుఃఖితుఁ డయి•బాష్పము ల్గార్చుచుఁ, బెద్దకాలం బేడ్చి•వితత శోక
దోషయుక్తుం డయి•భాషించె సీగతి, నెప్పుఁడు దుఃఖ మే•నెఱుఁగ నిప్పు

ఆ. డననుభూతశోక ♦ మావహించెడి మది, నేను జూచుచుండ ♦ శ్రీనిబోలు
నాదుదయిత సీత ♦ నష్టయయ్యె నయారె, యెట్టు సైఁపనచ్చు ♦ నిట్టివెతను.

అర్థములు. దండకాష్ఠంబు=దండరూపమైన కాష్ఠము, దండకాష్ఠము, సోమ క్రియ పర్యంతంబు దీక్షితుఁడు ధరింపవలసిన మేడిదండము, శోకమున నిలువ లేక దండమును నూఁతఁగఁ గొనెను, నష్టయయ్యెన్=అదృశ్యయయ్యెను.

తాత్పర్యము

సీతాదేవి రసాతలమునకుఁ బోఁగా వానరు లందఱు మేలు మేలని మెచ్చుకొనిరి. రామచంద్రమూర్తి దీక్షితుఁడు ధరించు దండము నూఁతగఁ గొని శిరము వ్రేలవైచి మిగులఁ జింతచే దుఃఖించి కన్నీరు గార్చుచుఁ జాల సేపేడ్చి యిట్లు చెప్పెను. ఇదివఱకు ననుభవింపని దుఃఖ మిప్పుడు ప్రాప్తించెను. నేను జూచుచుండ నాకన్నుల యెదుటనే లక్ష్మీదేవివంటి సీత యదృశ్య యయ్యెను. అయ్యో! యీ దుఃఖము నెట్లు సహింతును!

క. జలనిధి యావలితటమున, బలితపులంకన్ నిరుద్ధ ♦ భామిని మరలన్
బలమునఁ దెచ్చిన నాకీ, యిల దాఁచిన సీతఁ దెచ్చు ♦ టెంతటి పనియో.

అర్థములు. నిరుద్ధ=అడ్డగింపఁబడిన, చెఱనుంచఁబడిన.

తాత్పర్యము

(సముద్రము నవలియొడ్డున నున్న బలిష్ఠమైన లంకలోఁ జెఱయందుంచఁబడిన సీతను మరలఁ దీసికొని వచ్చిన నాకీ భూమి దాఁచిన సీతను దెచ్చుట యెంతటిపని? గొప్ప పని కాదని భావము.)

—* శ్రీరాముఁడు భూదేవిపైఁ గోపించుట *—

క. వసుధాదేవీ! సీతను, వెసఁ గ్రమ్మఱఁ దెచ్చి విడుము ♦ విడువవ యేనిన్
గసిమసఁగి నాదురోషం, బసదృశగతిఁ జూపువాఁడ ♦ నాత్మ నెఱుంగన్. ౧౫-౨౮

తాత్పర్యము

(ఓ భూదేవీ! వెంటనె తీసికొనివచ్చి సీతను నా యొద్ద విడువుము. అట్లు విడువకుంటివా, విజృంభించి నీ మనసునకుఁ దెలియునట్లు సాటిలేని నా కోపమును జూపెదను.)

క. హలహస్తుం డగు జనకుఁడు కలికిని నీలోన నుండి ♦ కద దున్ను నెడన్
వెలికిం దెచ్చెను ధర్మము, కలిమిం బరికింప నత్త ♦ గారవు నాకున్. ౧౫-౨౯

అర్థములు. హలహస్తుఁడు=నాఁగేలు చేతఁగలవాఁడు.

తాత్పర్యము

(నాఁగేలు చేతఁబూని కదా జనకమహారాజు నేలలోనున్న సీతను వెలుపలికిఁ దీసికొని వచ్చెను. ధర్మమాలోచించిన నీవు నాకత్తగారవు.)

ఉ. కావున నా తలోదరిని ♦ గ్రమ్మఱ నిమ్మిఁకఁ డీవు కానిచో
దేవిరో! నాకు నిమ్మ చనఁ♦దెర్వు రసాతలమందొ స్వర్గమం
దో వనితామణిం గదిసి ♦ యుత్సుకతం జరియించుచుందు నా
దేవి యథాస్వరూపముగఁ ♦ దేకయె యాలముఁ జేసి తేనియున్. ౧౫౨౬

అర్థములు. ఆలము=ఉపేక్ష.

తాత్పర్యము

(కాఁబట్టి నా భార్యను మరల నాకిమ్ము. కాకున్న నాకు దారిమొసంగుము. నాప్రియురాలు స్వర్గమందే యున్నదో పాతాళమునందే యున్నదో యక్కడకుఁ జేరి యామెతోఁ గలిసి సంతోషముతో విహరించెదను. నా దేవి నిదివఱకున్న రూపముతోఁ దీసికొనిరాక యుపేక్ష చేసితివేని.)

క. అత్తా! జానకికతమున మత్తుఁడఁ గోపమున రూపు♦మాపెద నిన్నున్
బత్తనకాననధరణీ, భృత్తతితోఁ నీటఁ గలిపి♦వేసెదఁ గనుమీ. ౧౫౨౭

అర్థములు. పత్తన కానన ధరణీభృత్ + తతితోన్=పట్టనములు అడవులు కొండలు వీని సమూహముతో.

(అత్తా! సీతలేని కారణమున నేను గోపముచే నొడలు తెలియకున్నాఁడను' పట్టనములతో నడవులతో గొండలతో నిన్ను నీటఁ గలిపివేసి రూపు మాపెదఁ జూడుము.)

—♦ బ్రహ్మ శ్రీరాముని శాంతునిఁ జేయుట ♦—

చ. అనుచు రుషాకషాయితదృ♦గంచలుఁడై వచియించు రామునిన్
గని సురసంచయాన్వితుఁడు ♦ కంజభవుండు వచించె రాఘవా!
కినియకు రామచంద్ర! మదిఁ ♦ గీల్కొలుపం దగుఁ బూర్వభావమున్
మును పొనరించుమంత్రమును ♦ ముగ్ధసరోజవిశాలలోచనా. ౧౫౨౮

అర్థములు. రుషాకషాయిత దృగంచలుఁడై = కోపముచే నెఱ్ఱనైన కనుఁగొనలు కలవాఁడై, సురసంచయాన్వితుఁడు=దేవతాసమూహముతోఁ గూడినవాఁడు, కంజభవుఁడు=బ్రహ్మ, కినియకు=కోపింపకుము, పూర్వభావమున్=విష్ణుత్వమును, మంత్రము=ఆలోచన, ముగ్ధసరోజ విశాలలోచనా=క్రొత్తగా వికసించిన కమలమువంటి కన్నులు కలవాఁడా.

తా త్ప ర్య ము

అనుచు కోపముచేఁ గనుఁగొన లెఱ్ఱచేసి చెప్పుచున్న రామచంద్రమూర్తి యొద్దకు దేవతలతోడ బ్రహ్మ వచ్చి యిట్లనియె. రామచంద్రమూర్తీ! కోపింపకుము. నీ విష్ణుత్వమును అవతారసమయమున దేవతలతో నీవు చేసిన యాలోచనము స్మరింపుము.

క. నిను స్మరియింపఁగఁ జేయగ, ననఘా! నే నెంతవాఁడ♦నాత్మఁ దలఁపుమీ
వనజాక్ష వైష్ణవంబగు, జననం బివ్వేళఁ జిత్త♦శాంతిం గనుమీ. ౧౫౨౯

తా త్ప ర్య ము

(పాపరహితుఁడవగు నో రామచంద్రమూర్తీ! నీ విషయమై నీకు స్మృతికి వచ్చునట్లు చేయుటకు నే నెంతటి వాఁడను. నీవు నీమనస్సులో నాలోచింపుము. పుండరీకాక్షా! నీవు రావణవధనిమిత్త మవతరించిన విష్ణుదేవుఁడవు. చిత్తమున శాంతి నొందుము.)

క. నీపూర్వపరాయణయగు, భూపుత్రిక విమలసాధ్వి ♦ భోగిజగతిఁ ద్వ
త్ప్రాపిత తపోబలంబున, నేపారెడి సర్వసుఖస♦మేతాత్మికయై. ౧౫౩౦

అర్థములు. పూర్వ పరాయణ=పూర్వభావమునందు ప్రేమ గలది, నీ ప్రకృతి ప్రాప్తియందు నౌత్సుక్యము గలది, విమల=దోషరహిత, సాధ్వి=పతివ్రత, భోగిజగతిన్=నాగలోకమందు, నాగలోకమునకుఁ బోయి యచ్చట నుండి వైకుంఠము చేరినదని భావము, త్వత్ప్రాపిత తపోబలంబున = నిన్నాశ్రయించిన తపోబలముచేత, వేదవతిగా నున్నప్పుడు నిన్నుఁ బొందఁగోరి చేసిన తపోబలము చేత, సర్వసుఖ సమేతాత్మికయై=అన్ని సుఖములతో గూడిన మనస్సుగలదై.

తా త్ప ర్య ము.

నీ ప్రకృతి ప్రాప్తియందు విశేషము కోరిక గల సీత నిర్దోషురాలు, పతివ్రత, నిన్నాశ్రయింప చేసిన తపోబలముచే నాగలోకమందు సర్వసుఖము లనుభవించుచున్నది.

—♦ రామాయణశేషము వినుమని బ్రహ్మ శ్రీరాముని వేఁడుట ♦—

క. నినుఁ గలయును స్వర్గంబున, ఘనవేణి నిజంబు నీదు♦కావ్యం బెల్లన్
విను మది సర్వముఁ దెలిపెడు, వనజాక్షా! నిలుపునాదు♦వాక్యము నెదలోన్.

అర్థములు. ఘనవేణి=మేఘమువంటి నల్లని జడగలది, స్వర్గంబునన్=వైకుంఠమందు.

తా త్ప ర్య ము

ఆమె నిన్ను వైకుంఠమునఁ గలసికొనును సత్యము నీకావ్యమంతయు వినుము. సర్వము తెలియఁగలవు నామాట మనస్సునం దుంచుము.

ఉ. ఉత్తమకావ్య మయ్యది త్వ • దుద్భవమాది సుఖంబు దుఃఖముల్
హత్తినరీతిఁ దెల్పెడి య • థార్థముగా సభవిష్యమై మఱిన్
సోత్తరమా నటుల్ పలికె • సొంపుగ వాల్మికి దాని నెల్ల నీ
వి త్తఱి విన్ముసీన యవ•నీశ్వర! యర్హుఁడ వద్ది గైకొనన్. ౧౫౩౨

అర్థములు. త్వదుద్భవము=నీ యవతారము, ఆది=మొదలు, హత్తిన రీతిన్=కలిగిన విధమును, యథార్థముగా=జరిగినది జరిగినట్లు, సభవిష్యమై = రాఁగలదానితోడ, సోత్తరము=సీతోపసంహారమున కావల జరిగినది.

తా త్ప ర్య ము

రామచంద్రమూర్తీ! యిది యుత్తమ కావ్యము. నీవు నీవు జనించినది మొదలు నీకుఁ గలిగిన సుఖములు, దుఃఖములు జరగినవి జరగినట్లు తెలుపును. అందు సీతోప సంహారమున కావల జరుగఁగల భవిష్యద్విషయము చెప్పఁబడినది. దానిని నా యనుగ్రహముచే వాల్మీకి రచించెను. దానిని నీవు వినుము. అది గ్రహింప నీవె యర్హుఁడవు.

క. నీయందు సుప్రతిష్ఠిత, మై యఖిలం బుందు రామ • యాదిమకావ్యం
బీయది దివ్యం బద్భుత, మై యజ్ఞానచ్యుతంబు • నై సత్యంబై. ౧౫౩౩

అర్థములు. సుప్రతిష్ఠితము=చక్కఁగాఁ బ్రతిష్ఠగొనినది, ఆదిమకావ్యంబు= ప్రథమ కావ్యము, కావ్యములందు మొదటిది, దివ్యంబు=మానవ సంబంధమైనది కాదు, అద్భుతము=ఆశ్చర్యకరము, అజ్ఞానచ్యుతము=అజ్ఞానముచేఁ జెప్పఁబడినది కాదు, అజ్ఞానమును దొలగించునది, సత్యంబు = శాశ్వతమైనది, ఉన్నదున్నట్లు చెప్పునది.

తా త్ప ర్య ము

(నీ యందే సర్వము నెలకొనియున్నది, రామా! యిది కావ్యములందు మొదటిది మానవ సంబంధమైనది కాదు. అజ్ఞానమును దొలగించునది. శాశ్వత మైనది. ఉన్నదున్నట్లు చెప్పునది యయి.)

గీ. రాజిలెడి నేను నిర్జర, రాజులతో విననవాఁడ•రామా! దీనిన్
భ్రాజితకీర్తిద సత్కృతి, రాజమునకుఁ దగఁ డెవండు•రాముఁడు దక్కన్.

అర్థములు. నిర్జరరాజులతో=దేవతా సమూహములతో, భ్రాజిత కీర్తిద సత్కృతిరాజము=ప్రకాశించు కీర్తిని గలిగించు మంచి యుత్తమ గ్రంథమునకు. సత్కావ్యమునకు నర్హుడగువాఁడు రామచంద్రుఁడు తక్కఁ దక్కిన వా రెవరు గారని భావము. కావుననే యుత్తమకవు లందఱు కాళిదాస, భవభూతి, మురారి, జయదేవాదులు రామకథనే చెప్పిరి. దీనివలన రామునకు సంబంధింపని కావ్యము దుష్కావ్యము కావునఁ బరిహరింపరాదని యర్థము. కావుననే 'కావ్యాలాపాంశ్చవర్జ యే' త్తని చెప్పఁబడెను.

తా త్ప ర్య ము

(ప్రకాశించును- రామా! నేను దీనిని దేవతాసమూహములతోఁ గూడ వింటిని. ప్రకాశించు కీర్తిని గలిగించు మంచి యుత్తమ గ్రంథమునకు శ్రీరామచంద్రుఁడు తక్కఁ దక్కినవారెవరును యోగ్యులుగారు.)

క. రామా! శేషభవిష్యము, రామాయణ మాలకింపు ♦ రాగమున ముని
స్తోమంబుతోడ నుత్తర,నామక మది మిగిలినది వి♦నందగు దీవే. ౧౫౩౫

అర్థములు. శేషభవిష్యము=రామాయణమందు నీవు వినఁగా మిగిలినది. జరగఁబోవునది.

తా త్ప ర్య ము

(రామా! రామాయణము నీవు వినఁగా మిగిలినది. ఉత్తరకాండము- అది మిగిలిపోయినది. మునుల సమూహముతోఁ గూడి యనురాగముతో వినుము. అది వినఁదగినవాఁడు నీవే.)

క. మిగిలిన రామాయణమును, దగు దీ వొక్కఁడె వినఁగఁ ♦ దగ రితరు లటం
చగపడకుండ దివంబున, ఎగసిచనెన్ సురలతోడ ♦ ఋషికాండముతోన్.

తా త్ప ర్య ము

(మిగిలిన రామాయణము నీ వొక్కఁడవే వినఁదగుదువు. ఇతరులు వినఁదగరు, అని చెప్పుచు దేవతలతో ఋషుల సమూహముతో నగపడకుండ నాకసమున కెగసి పోయెను.)

క. ఆవల రాముఁడు విధివా,క్యావళి మది నిలిపి కొంతఁత♦నాలించుమతిన్
దా వాల్మీకికి నిట్లనె, నే వినియెద భావిచరిత ♦ నిఖిలము వేగన్. ౧౫౩౬

అర్థములు. విధి వాక్యావళి=బ్రహ్మచెప్పిన మాటల సమూహమును, భావిచరిత=జరగఁబోవు చరిత్రము.

తా త్ప ర్య ము

(అటుపిమ్మట రామచంద్రమూర్తి బ్రహ్మచెప్పినమాటలు విని, కొంఁత పడిన కథ వినవలెనని మనస్సు కలిగి వాల్మీకితో నిట్లనెను. 'జరగఁబోవు చరిత్రమంతయు శీఘ్రముగా వినెదను.)

క. అని నిశ్చయించి జనములఁ, బని వినుఁడని చెప్పి కవల ♦ బాలురతో న
మ్మునిపర్ణ శాలకుం జని, జనకజఁ దలపోసికొనుచు ♦ శర్వరి గడపెన్. ౧౫౩౭

అర్థములు. పని వినుఁడు=పొండు, శర్వరి=రాత్రి.

తాత్పర్యము

(అని నిశ్చయము చేసికొని, జనులనందఱఁ బొమ్మనిచెప్పి, కుశలవులతో వాల్మీకిముని పర్ణశాలకుఁ బోయి, సీతను దలచుఁకొనుచు రాత్రి గడపెను.)

—♦ శ్రీరాముఁ డుత్తరకాండ శేషమును వినుట ♦—

క. కమలాప్తుం డుదయించినఁ, గొమరుల డాయంగఁబిలిచి ♦ కొంకక శేషం
బమలగతిం బాడుఁడనన్, రమణీయముగాఁగ వారు♦రామాయణమున్. ౧౫౩౯

తాత్పర్యము

(సూర్యుఁడుదయించిన తర్వాత బాలకులను బిలిచి సందేహింపక మిగిలిన రామాయణమును మనోహరముగాఁ బాడుఁడు అని చెప్పఁగా వారు.)

క. జరుగఁగలదానిఁగల యు-త్తరకాండము శేష మెల్లఁ ♦ దత్త్వజ్ఞ ఋషుల్
ధరణీశుఁడు వినఁబాడిరి, సరగన యజ్ఞంబు దీర ♦ క్ష్మానాథుండున్. ౧౫౪౧

అర్థములు. తత్త్వజ్ఞఋషులు=వాస్తవము తెలిసిన ఋషులు, ధరణీశుఁడు=రాజు, రామచంద్రమూర్తి, దీనివలన సీరు తప్పఁ దక్కిన విన్నవారు కారని సూచన.

తాత్పర్యము

(ముందు జరగఁగల రామాయణమందలి యుత్తరకాండ శేషమునంతయు వాస్తవమెఱిఁగిన ఋషులు రామచంద్రమూర్తి వినఁగాఁ బాడిరి. యజ్ఞముపూర్తి కాఁగా రామచంద్రమూర్తి.)

క. వైదేహి లేమి దుస్సహ, వేదన శూన్యంబుగాఁగ ♦ విశ్వము దోఁపన్
మేదురశోకంబున గోత్రాదయితులకును వనాట♦రాక్షసతతికిన్. ౧౫౪౧

అర్థములు. మేదురశోకంబునన్=గాఢవ్యసనమున, గోత్రాదయితులకున్=రాజులకు, వనాటరాక్షసతతికిన్=వానరసమూహమునకు. రాక్షస సముహామునకు.

తాత్పర్యము

(సీత లేకుండుటచే భరింపరాని వేదనవలనఁ బ్రపంచము పాడుపడినట్లు తోఁచఁగా గాఢమగు వ్యసనమున రాజులకును రాక్షస సమూహమునకును.)

—♦ శ్రీరాముఁడు కొడుకులతోఁ నయోధ్యఁ బ్రవేశించుట ♦—

క. జనములకున్ విప్రులకున్, ధనముల నర్పించి పంపి ♦ తమయాళ్ళలకున్
మనమున సీత స్మరించుచుఁ, జనియె నయోధ్యకును నాత్మ♦జాతులతోడన్.

అర్థములు. ఆత్మజాతులతోడన్=కొడుకులతో.

తాత్పర్యము

(యజ్ఞము చూడవచ్చిన జనులకు బ్రాహ్మణులకును కోరిన ధనమిచ్చి వారి వారి గ్రామములకుఁ బంపి,మనసులో సీతను దలఁచుకొనుచుఁ గొడుకులతో నయోధ్యకుఁ బోయెను.)

క. జానకినిగాక వేఱొక, మానవతి వరింపఁడయ్యె • మహితవ్రతుఁ డ
న్యూనంబుగఁ గార్తస్వర,జానకియే భార్య యజ్ఞ•యజ్ఞమునందున్. ౧౫౪౩

తాత్పర్యము

సీతాదేవిని గాక వేఱొక భార్యను రామచంద్రమూర్తి గ్రహించినవాఁడు కాఁడు, ప్రతియజ్ఞమునందు బంగారు సీతా విగ్రహమే యాయన భార్య ఇది రామచంద్రమూర్తి యేకపత్నీత్వమును స్థాపించుచున్నది.

క. ఆవిధిఁ బదివేలేఁడులు, గావించెను వాజిమేధ•కంబులఁ బెక్కుల్
సౌవర్ణ వాజపేయము, లావారిగదక్షిణాల స•మర్పించెఁ దగన్. ౧౫౪౪

అర్థములు. సౌవర్ణ వాజపేయములు=బంగారు నాణెముల దక్షిణలతోఁ గూడిన వాజపేయ యాగములు, ఆవారిగ=విస్తారముగ.

తాత్పర్యము

ఆ ప్రకారము పదివేలేండ్లు విస్తారముగా బంగారునాణెములు దక్షిణలిచ్చి యశ్వమేధయాగములు ననేకములు గావించెను.

సీ. నియతిమై సలిపె న•గ్నిష్టోమగోసవ, ములఁ బెక్కు లతిరాత్ర•ములను విభుఁడు
కడచెను బెద్దయుఁ • గాల మిట్టులు జను,లెల్లను సంప్రీతి • నెసక మెసఁగ
వానరరాక్షసుల్ వర్తిలఁ దనయాజ్ఞఁ, గాలవర్షంబులు • గలుగుచుండఁ
గాటకంబులు లేక • కలిమిఁదలిర్పఁగ, హృష్టులై పుష్టులై•యెల్లరెసఁగ

ఆ. వ్యాధు లెందు లేవు•ప్రాణికోటి కకాల మరణ మెందు లేదు•పౌరయరెవ్వ
రెట్టికీడునైన న•నిట్టులు బహుదీర్ఘ,సమల నేలె రామ•చంద్రవిభుఁడు. ౧౫౪౫

అర్థములు. ఎసక మెసఁగ=వృద్ధినొందఁగా, కాటకంబులు=కఱవులు, సమలు=సంవత్సరములు.

తాత్పర్యము

అగ్నిష్టోమము గోసవము అతిరాత్రమము అనుయాగముల ననేకములు నియమ ప్రకారము చేసెను. ఇట్టులనేక సంవత్సరములు జరుగఁగా జను లందఱు సంతోషము గలవారై యుండిరి. వానరులు రాక్షసు లాయనయాజ్ఞకు లోబడి వర్తించిరి. అదను తప్పక వానను గురియుచుండెను. కఱవులు లేక సంపద గల

వారై జనులు సంతోషించిన వారును, బలిసినవారినై యుండిరి. రోగములు లేవు. అకాలమరణము లేదు. ప్రజలకెట్టి కీడులు లేవు. ఈ ప్రకార మనేక సంవత్సరములు రామచంద్రమూర్తి రాజ్యము పాలించెను.

—* కౌసల్యా సుమిత్రా కైకేయులు మరణించుట *—

సీ. పుత్రపౌత్రులతోడఁ • బొలుపారు కౌసల్య, చాలకాలము వెనుకఁ • జనియెదివికి
నాయమ వెనుకొని • రనఘ సుమిత్రయుఁ, గైకయు ధర్మముల్ • కడమపడక
సలిపి వా రందఱు • స్వర్గంబునకు నేగి, దశరథుఁ గూడి ము • దంబుఁ గాంచ
వారికై రాముండు • బహుదానములు సల్పి, మునుల బ్రాహ్మణులను • దనివిపఱచి
ఆ. యౌర్ధ్వదైహికముల • నన్నిటిఁ బచరించి, పితరులకును జాలఁ • బ్రీతిఁగూర్చి
యవల రాజ్యమేలెఁ • హాయనంబులు పెక్కు, వేలు రామచంద్ర • విభుఁడు రక్తి.

అర్థములు. ఔర్ధ్వదైహికములన్=మరణించిన పిమ్మట దేహికై చేయవలసిన కార్యములు.

తాత్పర్యము

కొడుకులతో మనుమలతో సుఖపడి చాలకాలమయిన వెనుక స్వర్గమునకు బోయెను. ఆమె తర్వాత సుమిత్ర కైక ధర్మములు కొఱతపడకుండఁ జేసి స్వర్గమునకుఁ బోయిరి. వారందఱు స్వర్గమున దశరథునిఁ గలిసికొని యానందించిరి. వారికొఱకు రామచంద్రమూర్తి యనేకదానములు చేసి మునులను బ్రాహ్మణులను దృప్తి పఱచి పరలోక క్రియలన్నిటిని జేసి పితరులకుఁ జాల సంతోషము గలిగించి తర్వాతఁ జాల సంవత్సరములు రామచంద్రమూర్తి రాజ్యమేలెను.)

—— •యుధాజితుండు గార్గ్యుని శ్రీరామునొద్దకుఁ బంపుట •—

తే. ఒక్కనాఁడు యుధాజితుం • డుగ్రతేజు, నంగిరునిపుత్రు గార్గ్య మ • హర్షి నరునిఁ
దనదుగురువును దశరథ • తనయుకడకుఁ బంచెఁ గంబళరత్నాళి • వస్త్రయుక్తి.

తాత్పర్యము

ఇట్లు రాజ్యమేలు సమయంబున యుధాజితుండు నంగిరసుని పుత్రుఁడును తన గురువునకు గార్గ్యమహర్షిని రామచంద్రు నొద్దకుఁ గంబళములు, రత్నములు, వస్త్రము లిచ్చి పంపెను.

క. వాజుల దశసాహస్రం, బాజిసుతున కీయఁబంచె • నాతని రాకన్
రాజవరుఁడు రాముఁడు విని, రాజితగతి నెదురు చనియెఁ • భ్రాతలతోడన్.

తాత్పర్యము

(పదివేల గుఱ్ఱములను దశరథకుమారు డగు రామచంద్రప్రభువున కిమ్మని పంపెను. ఆతని రాక రాజశ్రేష్ఠుఁడగు శ్రీరామచంద్రమూర్తి విని తమ్ములతోఁ గూడి యెదురుగాఁ బోయెను.)

ఆ. అరిగి క్రోశమాత్ర • మాతనిఁ గనుఁగొని, యమరవిభుఁడు జీవు•నర్చఁ జలుపు
నట్లు పూజచేసి•యాధనంబులఁ గొని, ప్రశ్న చేసెఁ గుశల•వార్త లెల్ల. ౧౫౪౮

అర్థములు. జీవున్=బృహస్పతిని.

తా త్ప ర్య ము

(క్రోసుదూరము పోయి యాగర్గునిఁ జూచి, యింద్రుఁడు బృహస్పతిని బూజించినట్లు పూజచేసి యాయన యిచ్చిన ధనములన్నియుఁ దీసికొని క్షేమ సమాచారము లడిగెను.)

—• గార్గ్యుఁడు యుధాజిత్తు సందేశమును శ్రీరామునితోఁ జెప్పుట •—

సీ. ఉపవిష్టుఁ డైనయా•యుర్వీసురునితోడ, మా మేనమామకు•క్షేమ మగునె
యేమికార్యార్థమై•యిందు మిమ్మనిచెనో, వచియింపు డాయన•వాక్యములను
నావుడు బ్రహ్మర్షి•నయముగ మీమామ, వచియించినది యెల్లఁ•బలుకువాఁడ
విన నభిమత మేని•వినవయ్య! సింధుపు, నుభయపార్శ్వంబుల•నొప్పుమీఱు

తే. దేశ మయ్యది ఫలమూల•దీపితంబు దాని రక్షించువారు గం•ధర్వవరులు
సాయుధుల్ యుద్ధకోవిదుల్•సాహసికులు, మూఁడుఁకోటలు శైలూష•పుత్రకులును.

అర్థములు. ఉపవిష్టుఁడు=కూర్చుండినవాఁడు, ఫలమూల దీపితంబు=పండ్ల చేతను మూలములచేతను ప్రకాశించునది.

తా త్ప ర్య ము

(సుఖముగాఁ గూర్చుండిన గర్గునిఁ జూచి రామచంద్రమూర్తి మా మేన మామ క్షేమమా? ఏమిపనికై మిమ్మంపుటకుఁ బంపించినాఁడు? చెప్పుఁడని యడుగఁగా, బ్రహ్మర్షియగు నాగర్గుఁడు మీకు వినవలెనని యభిలాషయుండినచో మీ మామ చెప్పినదంతయుఁ జెప్పెదను వినుఁడు. సింధునది కిరువైపుల నున్న దేశము ఫలమూలములతో నొప్పియుండును. దానిని గంధర్వ శ్రేష్ఠులు శైలూషునికొడుకు లాయుధములు పూని రణపండితులై సాహసముతోఁ గాపాడుచుందురు.)

తే. దారుణాహవమునను గం•ధర్వపురము, రాఘవా! గెల్చి నీదు రా•ష్ట్రంబునందు
గలుపుకొను మిదియిష్టమేన్•గానికార్య, మహిత మేనాఁడనయ్య శూ•రావతంస!

అర్థములు. దారుణాహవమునను=భయంకర యుద్ధమందు, కాని కార్యము= చేయరానిపని, అహితము=మేలుకానిది, శూరావతంస=శూరులందు శ్రేష్ఠుఁడా.

తా త్ప ర్య ము

(రామచంద్రా! భయంకరయుద్ధమున వారల గెలిచి గంధర్వపత్తనమును నీ రాజ్యమున నీ కిష్టమైనచోఁ గలుపుకొనుము. శూరులందు శ్రేష్ఠుఁడా! యహితమై కానిపని నేను జెప్పను సుమా!

క. ఆరాష్ట్రింబులవంకను, బో రా దేవారికైన ♦ భూపాలక నా
శ్రీరాముఁ డానుడు ల్విని, పేరిమిఁ గై కేయితనయుఁ♦వీక్షించెఁ దమిన్. ౧౫౫౨

తా త్ప ర్య ము

(రాజా! యీరాజ్యముల వైపున కెట్టివారికిని బోవఁదరముగాదు. అని చెప్పఁగా, శ్రీరామచంద్రమూర్తి యీ మాటలను విని, భరతుని ప్రేమమీఱఁ జూచెను.)

క. మునివరుఁ గనుఁగొని భరతుని, తనయులు వీ రిర్వురందు ♦ దమ తాత తమున్
గొనకొని కావఁగ నుండెద, రనుపమబలతక్షపుష్కలాఖ్యుల వీరిన్. ౧౫౫౩

అర్థములు. తమ తాత=యుధాజిత్తు, కైకకుఁ దోడఁబుట్టినవాఁడు, తక్షపుష్కలాఖ్యులన్=తక్షుఁడు పుష్కలుఁ డను పేరుగలవారు.

తా త్ప ర్య ము

(గర్గమునిని జూచి వీరిరువురు భరతుని కొడుకులు, ప్రేమతోఁ దమ తాత కాన నందుండెదరు. వీరు సాటిలేని బలముగలవారు వీరిపేరు తక్షుఁడు,పుష్కలుఁడు వీరిని)

చ. భరతునితోడఁ బంపెదను ♦ వాహినిఁ గూర్చి విరోధిసంఘమున్
దురమునఁ గూల్చి తత్పురము ♦ దోర్బలశక్తి హరించి రెండుగాఁ
బురి విభజించి వీరలకుఁ ♦ బోణిమిఁ బంచి యొసంగి క్రమ్మఱన్
బరమమునీంద్ర యంచుఁ దగు♦భంగి బలంబుల నిచ్చి బాలురన్. ౧౫౫౪

అర్థములు. వాహినిన్=సేనను.

తా త్ప ర్య ము

(మునీంద్రా! సేననిచ్చి భరతునితో వీరిని బంపెదను. శత్రువులను యుద్ధమందు గెలిచి, బాహుబలమున నాపత్తనము గైకొని, దానిని రెండుగా భాగించి వీరికిచ్చి భరతుఁడు తిరిగి రాగలఁడు. అని చెప్పి తగినవిధముగా సేననిచ్చి బాలురను.)

—* శ్రీరాముఁడు సపుత్రు భరతుని గంధర్వుల జయింపఁ బంపుట ♦—

క. అభిషిక్తులుగా నొనరించి, శుభనక్షత్రమునఁ బంపఁ♦సుతులును వేధో
నిభుఁ డగు గార్గ్యుఁడు బడి రా♦విభవంబునఁ గైకసుతుఁడు♦వెడలెం బురమున్.

అర్థములు. వేధోనిభుఁడు=బ్రహ్మతో సమానుఁడు.

తా త్ప ర్య ము

(రాజులుగా నభిషేకించి, శుభనక్షత్రమునఁ బంపఁగా, బాలకులు బ్రహ్మసమానుఁడగు గర్గుని వెంటరాఁగా,భరతుఁడు వైభవముగా నయోధ్యాపత్తనము నుండి బయలుదేఱెను.)

క. రామానుగతము దివిజస్తోమదురాధర్ష మగుచుఁ ♦ దోఁచె దళము సు
త్రామాన్వితం బయినటు, లీమాడ్కిని వెడలి దూర♦మేగుచు నుండన్. ౧౫౫౬

అర్థములు. రామానుగతము=రామునిచే వెంబడింపఁబడినది, ఇట్లనుటచే రామచంద్రమూర్తి సేనవెంట కొంతదూరము పోయెనని సూచన, దివిజస్తోమ=దేవతాసమూహములను, దురాధర్షము=ధిక్కరింపరానిది, దళము=సేన, సుత్రామాన్వితంబు=ఇంద్రునితోఁ గూడినది.

తాత్పర్యము

రామునిచే వెంబడింపఁబడిన యాసేన యింద్రునితోఁ గూడిన సేనవలె దేవతలకును ధిక్కరింపరానిదై తోఁచెను. ఈ ప్రకార మయోధ్య విడిచి దూరము పోవుచుండఁగా.

క. పలలాదము లగు సత్త్వంబులు సోఁకులు భూతములును ♦ బోవం దొడఁగెన్
బలమునకు న్ముంగలగాఁ, గలి గంధర్వామిషంబుఁ ♦ గడుపారఁ దినన్. ౧౫౫౭

అర్థములు. పలలాదములు = మాంసము దినునవి, సత్త్వంబులు=మృగములు, నక్కలు తోడేళ్ళు మొదలైనవి, సోఁకులు=రాక్షసులు, భూతములు=పిశాచములు, బలమునకున్=సేనకు, ముంగలగాన్=ముందుగా, కలిన్ = యుద్ధమందు, గంధర్వామిషంబు=గంధర్వుల మాంసము, వీరు దేవగంధర్వులు కారు. మనుష్య గంధర్వులు.

మాంసము భుజించు మృగములు పక్షులు సేనకు ముందుగాఁ బోవుట శుభశకునము. ఎదురుగా వచ్చుట నపశకునము.

తాత్పర్యము

(మాంసముదిను తోడేళ్ళు, నక్కలు మున్నగు జంతువులు రాక్షసులు, పిశాచములు యుద్ధము నందు గంధర్వుల మాంసమును గడుపునిండఁ దినుటకు భరతుని సేనకు ముందుగా నడవఁజాగెను.)

క. పులులును సింహంబులుఁ బందులు మున్నుగఁ బోవుచుండఁ♦దోయజకులుఁడున్
నెల పదునేనుదినంబులు, లలితగతిం ద్రోవఁ జని బలంగముతోడన్. ౧౫౫౮

అర్థములు. తోయజకులుఁడున్=భరతుఁడు.

తాత్పర్యము

(పులులు, సింహములు, పందులు, ముందుగాఁ బోవుచుండఁగా, భరతుఁడు నెలమీఁద బదునైదుదినములు మార్గమున నడచి సేనతో.)

—♦ భరతుండు గంధర్వుల జయించుట ♦—

సీ. కేకయపురిఁ జేరఁ ♦ గీర్తితశౌర్యుండు, భరతుండు వచ్చిన♦వార్త దెలిసి
తనదు సైన్యముతోడఁ♦దరలె నిట్లిర్వురు, భరతయుధాజితుల్♦ప్రకటబలులు
దటుకున నేగి గం♦ధర్వపురంబును, ముట్టిన వా రాజి♦మోదమునను
బలముతో భటులతో♦వెలువడి తుములంబు,గా సప్తరాత్రంబు♦నోసరిలక
తే. సమర మొనరింపఁ గోదండ♦శక్తిఖడ్గ,నక్రములు శోణితాపగల్♦నరకళేబ
రములతోఁ బ్రవహించె ని♦రంకుశముగ, సకలదిశలను రోమహ♦ర్షంబుగాఁగ.

అర్థములు. ఆజిమోదమునను=యుద్ధమందలి సంతోషముచే, తుములంబుగాన్=సంకులముగా, ఓసరిలక=వెనుదీయక, శోణితాపగల్=నెత్తురు టేర్లు, రోమహర్షంబు=గగ్గురుపాటు గలుగునట్లుగ, నిరంకుశముగన్=అడ్డము లేక.

తాత్పర్యము

(కేకయరాజు పత్తనమునకుఁ జేరఁగా, భరతుఁడు వచ్చినవార్త తెలిసి యుధాజిత్తు తన సైన్యముతోఁ గూడ వెడలెను. ప్రసిద్ధబలశాలులయిన భరతయుధాజిత్తులు తత్క్షణమ పోయి గంధర్వపురమును ముట్టడింపఁగా, నాగంధర్వులు యుద్ధమందలి సంతోషముచే సేనతో భటులతో బయలుదేఱి యేడురాత్రులు వెనుదీయక సంకులముగా యుద్ధముచేయఁగా, విండ్లు శక్తులు ఖడ్గములు మొనళ్ళుగా, నెత్తురుటేర్లు నరుల కళేబరములతో చూచువారి కొడళ్ళు గగుర్పొడుచునటు లడ్డము లేక ప్రవహించెను.)

ఉ. ధూర్తు లతుల్యశౌర్యబల ♦ దుర్ధరులై సరి గాఁగ బోర న
మ్మార్తురపౌరుషంబుఁ గని ♦ మాడ్చెదఁ గాకని దారుణంబు సం
వర్తమనంగ నొప్పుసమ ♦ వర్తిమహాస్త్రము రోషసంజ్వల
న్మూర్తి రఘూద్వహుం డెదురు♦మూఁకలపైఁ బరపంగ నద్దియున్.

అర్థములు. ధూర్తులు=దుష్టులు, అతుల్య=అసమానమైన, శౌర్య బల దుర్ధరులై=అతిశయించిన శౌర్యము బలముగలవారై, నార్తుర = శత్రువుల యొక్క, సంవర్తమనంగన్=సంవర్తనమను పేరుగల, సమవర్తి మహాస్త్రము=యముఁ డధిష్ఠాతగాఁగల యస్త్రము యమదేవతాకము, రోషసంజ్వలత్+మూర్తి=కోపముచే మండుచున్న యాకారము గలవాఁడు, ఎదురుమూఁకలపై=శత్రుసేనల మీఁద, పఱపంగన్=ప్రయోగింపఁగా.

తాత్పర్యము

దుష్టులును అసమాన బలశౌర్యములు గలవారునగు శత్రువుల పౌరుషంబు గని వీరిని మాడ్చి వేయవలయునని తలఁచి కోపముచే మండిపడుచు యమదేవతాకమైన సంవర్తకమను నస్త్రము శత్రువులపై బ్రయోగించెను.

క. కాలానలహవ్యవహ,జ్వాలావళిఁబోలె హేతి•వర్షము గురియన్
గోలాహల మెసఁగఁగ రిపు,జాలంబుల మూఁడుకోట్ల•క్షణమున మాడ్చెన్.

అర్థములు. కాలానల=ప్రలయకాలమందలి యసమానమైన, హవ్యవహ=అగ్నిహోత్రునియొక్క, జ్వాలావళిఁబోలెన్=శిఖల సమూహములవలె, హేతి వర్షము=కత్తులసమూహము, కోలాహలము=కలకలధ్వని.

తా త్ప ర్య ము

(ప్రలయకాలమందలి యగ్నిజ్వాలలవలె గత్తులసమూహమును గురియఁగా కలకలధ్వను లతిశయింపఁగా మూఁడుకోట్ల శత్రువుల సమూహమును క్షణములో మాడ్చివేసెను.)

క. మున్నిట్టిదాని నెన్నఁడు, గన్నట్టు స్మరింపరైరి • ఖచరులు భరతుం
డు న్నెఱి గెలిచి విరోధుల, నన్నగరయుగంబునందు•నాత్మజయుగమున్.

తా త్ప ర్య ము

పూర్వ మిటువంటి కార్య మెన్నఁడు చూచినట్లు దేవతలు స్మృతికిఁ దెచ్చుకొన్నవారుగారు. భరతుఁడు శత్రువుల గెలిచి యా రెండు పురములందుఁ దన యిరువురు కొడుకులను.

—• భరతుండు తక్షపుష్కలులకుఁ బట్టాభిషేకంబు సేయుట •—

తే. తక్షశిలయందుఁదక్షుఁడ• న్తనయునిలిపి,పుష్కలునిఁబుష్కలావతీ•పురమునందు
నిలిపె ధనరత్న కాననః•కలితమైన, దీపితంబగు గాంధార•దేశమునను. ౧౫౬౩

అర్థములు. తక్షశిలయందు = తక్షశిలయను పురమునందు దీని నిప్పుడు **(Taxila)** టాక్సిల యందురు.

తా త్ప ర్య ము

తక్షుఁడను తన పెద్దకొడుకును దక్షశిలయందును, పుష్కలుఁడను చిన్న కొడుకును పుష్కరావతియను నగరమందును ధనము చేతను రత్నముల చేతను బంగారు చేతను నిండిన గాంధారదేశమందు, ప్రభువులుగా నిలిపెను. గాంధారము నిప్పుడు కాండహార్ **(Kandhahar)** అందురు.

సీ. పాపహీనంబులౌ • వ్యవహారములచేతఁ, దతసుందరోద్యాన•తతులచేత
నతులవిభ్రాంత • రాపణంబులచేత, నవ్యంబులౌ విమా•నములచేతఁ
జూడఁజూడఁగఁ గడు•సొంపారునిండ్లచే, హారులౌ దేవాల•యములచేతఁ
దిలక తాలతమాల•లలితద్రుమాళిచే, వకులబంధురసౌర•భములచేతఁ

ఆ. బోటి వేసికొనినఁ•పోలుపున వాదాడు, భంగిఁ బురయుగంబు•వర్ధిలంగ
భరతుఁ డందు నైదు•వత్సరంబులు నిల్చి, క్రమ్మఱంగ వచ్చె•రాముకడకు.

అర్థములు. పాపహీనంబులు=అసత్యములు మోసములేని వ్యవహారముల చేతను, తతసుందరోద్యానతతులచేత=మిక్కిలి యందములైన యుద్యానవనముల చేతను, విభక్త=విభజింపఁబడిన అంతరాపణంబులచేత = నడుమనడుమ నుండు సంగళ్ళ చేతను, నవ్యంబులు=మనోహరములగు, విమానములచేత=మేడలచేతను, హారులు=రమ్యములు, తిలక=బొట్టుగుచెట్లు, తాల=తాటిచెట్లు, తమాల=చీఁకటి మ్రాఁకులు, మొదలయిన, లలితద్రుమావళిచేత=అందమైన చెట్లచేతను, వకుల బంధుర సౌభరములచేత=పొగడ పూవుల విస్తార వాసనల చేతను.

తా త్ప ర్య ము

రెండు పురంబులందును వ్యవహారములందు మోసము అసత్య మనునవి లేవు. అందములైన యుద్యానములు నడుమ నడుమ సంగళ్ళు, మేడలు రమ్యములైన యిండ్లు దేవాలయములు బొట్టుగు చెట్లు తాటిచెట్లు చీఁకటి మ్రాఁకులు, మొదలయిన చెట్లు-వీనిచేతను, పొగడపూవుల వాసనల చేతను, రెండు పట్టణములు పోటి వేసికొనినట్లు వాదించు విధమున వృద్ధిచెందఁగా భరతుఁడు కొడుకుల యొద్ద నైదు సంవత్సరము లుండి రామచంద్రమూర్తి యొద్దకు వచ్చెను.

క. అరుదెంచి ధర్మమూర్తికిఁ. జరణంబుల వ్రాలి మ్రొక్కి-సర్వము వినిచెన్
బరుల వధించుట తనయులఁ, బురముల నిల్పుటయు నన్నః పొంగఁగ మదిలోన్.

తా త్ప ర్య ము

(తిరిగివచ్చి, ధర్మమూర్తియగు రామచంద్రప్రభువు పదముల వ్రాలి నమస్కరించి, శత్రువులను జంపుట, తన యిద్దఱుకొడుకులను రెండుపత్తనము లందు నిలుపుట సర్వమును నన్నగారు సంతోషించునట్లు చెప్పెను.)

శ్రీరాముఁడు లక్ష్మణకుమారులను గారుపథ చంద్రకాంతములకుఁ బ్రభువులఁ జేయుట

తే. సానుజుండైన శ్రీరామచంద్రవిభుఁడు, సర్వమాలించి సంతోషసంభ్రమమున
లక్ష్మణునిఁజూచి నీసుతులర్థవేదు, లంగదుఁడు చంద్రకేతుండు-నమితబలులు.

అర్థములు. సానుజుండు=తమ్మునితోఁ గూడినవాఁడు, ఆలించి=భరతుఁడు చెప్పిన దంతయు విని, సంతోష సంభ్రమమున=సంతోషమువలనఁ గలిగిన వేగిర పాటుతో.

తా త్ప ర్య ము

(శ్రీరామచంద్రప్రభువు తమ్ముఁడగు లక్ష్మణుతో నంతయును విని సంతోషము వలని వేగిరపాటుతో లక్ష్మణునిఁజూచి, నీ కొడుకు లంగదుఁడు, చంద్రకేతుఁడు ధర్మమెఱిఁగినవారు అమితబలము గలవారు.)

ఉ. వీరలు చాలువారు పృథి ♦ వీభరణంబున కే ప్రదేశముల్
తీరగు వీరి నిల్ప నది ♦ తెల్పుమ యాశ్రమపాళి కేనియున్
భూరమణోత్కరంబునకుఁ ♦ బుట్టక యుండఁగఁ బీడ నావుడున్
శ్రీరాఘునాథుఁ గన్గొని వ ♦ చించెను గైకయిసూనుఁ డీగతిన్. ౧౫౬౭

అర్థములు. చాలువారు=సమర్థులు, ఆశ్రమపాళికేనియున్ = ఋషీశ్వరుల యాశ్రమ సమూహములకైనను, భూరమణోత్కరంబునకు=రాజుల సమూహమునకు.

తాత్పర్యము

భరతుని కొడుకులకు శత్రుఘ్ను కొడుకులకు రాజ్యము లేర్పాటుచేసి లక్ష్మణు కొడుకులకు కేర్పాటు చేయఁదలఁచి లక్ష్మణుతో నీ కొడుకులు రాజ్యము భరింప సమర్థులు. వీరి కే దేశము లిచ్చుట తగునో చెప్పుము ఋషీశ్వరుల యాశ్రమములకుఁ గాని యిదివఱకు దాయలుగా నున్న వారికిఁగాని బాధలేకుండ నేర్పాటు చేయవలయుననిన రామచంద్రమూర్తిని జూచి భరతుఁ డిట్లనియె.

ఉ. కారుపథంబనంగఁ గడుఁ ♦ గ్రమ మబాధము నైనదేశమం
దీరమణీయమూర్తి ధర ♦ ణీశ్వరుఁ జేయఁగ నొప్పు నంగదున్
దీరగుఁ జంద్రకాంత మను ♦ దేశమునం దొగిఁ జంద్రకేతునిన్
భూరమణీంద్రుఁ జేయ ననఁ ♦ బొంగి రఘూత్తముఁ డాకుమారులన్. ౧౫౬౮

అర్థములు. అబాధము=ఎవరికి బాధ లేనిది.

తాత్పర్యము

కారుపథం బను దేశమునకు నంగదుని రాజుగాఁ జేయవచ్చును. అది రమ్యమైన ప్రదేశము. దానికి రా జెవ్వఁడు లేఁడు. ఋష్యాశ్రమములకు సమీపమును గాదు. చంద్రకాంతు నట్లులే చంద్రకాంతపురమునకు రాజుగాఁ జేయవచ్చును. అనిన రామచంద్రుఁడు సంతోషించి యా కుమారులను.

ఆ. అంగదీయపురికి ♦ నంగదు రాజుగా, మల్లభూమియందు ♦ మల్లుఁడైన
చంద్రకేతు నిల్పి ♦ చంద్రకాంతాపురి, నాభిషేకవిధుల ♦ నాచరించె. ౧౫౬౯

తాత్పర్యము

కారుపథ దేశమందు నంగదీయ మను పురమునకు నంగదు రాజుగాఁజేసి మల్లభూమియందు చంద్రకాంత పట్టణమున మల్లుడగు చంద్రకాంతుని నిల్పి యిరువురికి నభిషేకము చేయించెను.

చ. పడమటిభూమి కంగదునిఁ ♦ బంపె నలక్ష్మణుఁ, జంద్రకేతు నెం
బడి భరతుం గుబేరదిశ ♦ వైపునఁ బంపెను, వారు ప్రీతి నా
పుడముల కేగి రందు జన ♦ పూజ్యుఁడు లక్ష్మణుఁ, డబ్ద ముండి తాఁ
గొడుకును నిల్పి రాజ్యమునఁ ♦ గోరికఁ గ్రమ్మఱ రాముఁ గొల్వఁగన్. ౧౫౭౦

తాత్పర్యము

(పడమటి దేశమునకు లక్ష్మణునితో నంగదుని బంపెను. ఉత్తరపువైపునకు భరతునిచ్చి చంద్రకేతుని బంపెను. వా రా భూములకుఁ బ్రీతితోఁ బోయిరి. జనులచేఁ బూజింపఁబడువాఁడైన లక్ష్మణుఁ డొక సంవత్సరముండి రాజ్యమునఁ దన కొడుకును నిలిపి. తిరిగి యన్నగారి సేవకై వచ్చెను.)

ఆ. చంద్రకేతుతోడ ♦ సంవత్సరాధిక, కాల ముండి మరలఁ ♦ గదలివచ్చె
మాండవీవిభుండు ♦ మార్తండతేజుఁడై, రామచంద్రుఁ గొలుచు ♦ రాగమునను,

అర్థములు. సంవత్సరాధిక కాలము=సంవత్సరముకంటె నధికకాలము, మాండవీ విభుండు=భరతుఁడు.

తాత్పర్యము

(చంద్రకేతుతో సంవత్సరముకంటె నధికకాలముండి భరతుఁడు సూర్యుని తేజస్సువంటి తేజస్సుగల శ్రీరామచంద్రప్రభువును సేవింపవలె ననెడి ప్రేమతో వచ్చెను)

క. సౌమిత్రిభరతు లీగతి, రామపదాబ్జములఁ గొలుచు ♦ రక్తిని గాలం
బేమాడ్కిఁ జనెడి నెఱుఁగరు, దా మాత్మలఁ దలఁప రెపుడు ♦ దమనందనులన్.

తాత్పర్యము

(లక్ష్మణుఁడు, భరతుఁడు శ్రీరామచంద్రమూర్తి పాదముల సేవించుట యందుఁ గల ప్రేమచేఁ గాలమెట్లు పోయినది తెలియకుండిరి. తమ కొడుకుల విషయమున మనస్సునం దనుకొనరైరి.)

చ. ఇటు పదివేలవత్సరము ♦ లేగె సదాజనకార్యరక్తులై
స్ఫుటపరిపూర్ణచిత్తులును ♦ శోభితభాగ్యరమావిలాసులై
పటుతర తెజులై ముగురు ♦ భ్రాతలు వెల్గిరి యాహుతిన్ విశం
కటరుచి మీఱువహ్నుల త్రి ♦ కంబునకున్ సరిసాటి యాడుగన్. ౧౫౨౩

అర్థములు. సదాజనకార్యరక్తులై=ఎల్లప్పుడు ప్రజల ప్రజల కార్యములు చేయుటయందుఁ బ్రీతిగలవారై, స్ఫుటపరిపూర్ణచిత్తులై=ఏ విషయమందును గొఱఁత లేని మనస్సు గలవారై, శోభిత భాగ్య రమావిలాసులై = ప్రకాశించు భాగ్యసంపదయొక్క విలాసము గలవారై, పటుతర తేజులై=మిగుల దృఢమైన తేజస్సుగలవారై, విశంకటరుచిన్=విస్తారకాంతిచే, అగ్నుల త్రికంబునకున్= త్రేతాగ్నులకు.

తాత్పర్యము

ఈ ప్రకారము పదివేల సంవత్సరములు జరిగెను. అన్నలు దమ్ములు ముగ్గురు సర్వదా ప్రజలకార్యములు చేయుటయం దాసక్తులై నిండిన కోరికలుగల

మనస్సుగలవారై భాగ్యసంపదచేఁ బ్రకాశించువారై దృఢతేజము గలవారై యాహుతులచే త్రేతాగ్నులు మిగుల వెలుఁగునట్లు సరివారలులేక ప్రకాశించిరి.

—॰ శ్రీరాముని సందర్శింపఁ గాలుఁడు వచ్చుట ॰—

ఉ. అంతటఁ గొంతకాలమున ॰ కంబుజనేత్రునిఁ జూడఁగోరి భూ
కాంతుని వాకిటన్ నిలిచి ॰ కాలుఁడు తాపసవేష మూని ధీ
మంతుని లక్ష్మణుం గని కుమారక! దూతను నేను ధారిణీ
కాంతునిఁ జూడఁగోరెదను ॰ గార్యవశంబున వార్తఁ బుచ్చుమీ. ౧౫౨౪

అర్థములు. కాలుఁడు=యముడు.

తా త్ప ర్య ము

ఇట్లు కొంతకాలము జరుగఁగా రామచంద్రమూర్తిని జూడఁగోరి యాయన వాకిట యముఁడు మునివేషము వేసికొని నిలిచి లక్ష్మణునిఁ జూచి కుమారా! నేను దూతనై రామచంద్రుఁ జూడఁగోరి వచ్చితిని. ఆయనకుఁ జెప్పిపంపుము.

క. అమితౌజస్కుండగు సం,యమి యతిబలుఁ డంపె నన్ను ॰నన లక్ష్మణుఁడున్
సుముదంబున సరగం జని,యమి యొకకఁడు దేవ! ఖరక॰రాంశునిభుండున్.

అర్థములు. అమిత+ఓజస్కుండు = అపరిమిత తేజస్సు గలవాఁడు, సంయమి=ముని, సుముదంబునన్=సంతోషముతో, సరగన్=శీఘ్రముగ, యమి=ముని, ఖరకరాంశునిభుండున్=సూర్యునితో సమానుఁడు.

తా త్ప ర్య ము

(అమితమైన తేజస్సుగలిగి మిక్కిలి బలముగల ముని నన్నుఁబంపెను. అని చెప్పఁగా లక్ష్మణుఁడు సంతోషముతో వెంటనేపోయి దేవా! సూర్యునితో సమానుఁడైన యొక ముని)

క. దూత యయి మిమ్ముఁ జూడం, బ్రతిపడె నటన్నఁ దెమ్మ॰వేగ మటన్నన్
స్ఫీతద్యుతి ఋషిని సుమి,త్రాతనయుఁడు లోన విడువఁ॰దాపసవిభుఁడున్.

తా త్ప ర్య ము

(దూతయై వచ్చి మిమ్ముఁజూడ వేడుక పడుచున్నాఁడని చెప్పఁగా, శీఘ్రముగాఁ దీసికొని రమ్మనెను. మిగుల కాంతిగల మునిని లక్ష్మణుఁడు లోనికిఁబో విడువఁగా మునియును)

ఉ. దీవన లిచ్చి రామవిభు ॰ దెల్పిన నర్ఘ్యముఁ బాద్య మిచ్చి నీ
తావిభుఁ డర్హపీఠిపయిఁ ॰ దాపసు నుంచి మహాత్మ నేమమా?
యావిధి రాఁక నేమి కత ॰ మేర్పడ నం జెప్పుఁ డటన్న రాఘవా!
యీవును నే రహస్యలిని ॰ నియ్యది ముచ్చటలాడ నర్హమౌ. ౧౫౨౨

అర్థములు. తెల్చినన్=స్తుతింపఁగా, కతము=కారణము, రహస్+స్థలిని= ఎవ్వరులేని యేకాంతస్థలమున.

తాత్పర్యము

(దీవించి రామప్రభువు స్తుతింపఁగా, రామచంద్రమూర్తి యర్ఘ్యపాద్యము లిచ్చి తగిన యాసనమున మునిని గూర్చుండఁ బెట్టి మహాత్మా! క్షేమమా? మీరీ విధముగా రాఁ గారణ మేమి విశదముగఁ దెలుపుఁడని యడుగ, రామా! నీవు నేను నీ విషయము రహస్యస్థలమున మాట్లాడఁ దగును.)

క. మన వాక్యము లెవఁ డేనియుఁ, వినఁ గూడదు మఱియు మనల♦వీక్షింపఁగనేన్
జన దటు చేసినవానిన్, జనవర! వధియింతు వేని ♦ సంభాషింతున్. ౧౫౭౮

తాత్పర్యము

మనమాట లెవరు వినరాదు. మనము మాటలాడు నపుడు లోపలి కెవ్వరు రారాదు. అటులెవ్వఁడైన వచ్చెనా వానిని నీవు చంపవలెను. అట్లు నీవు చేసెద వేని రహస్యము చెప్పెదను.

క. మునిమతము హితాచరణం,బున నీమది చనెడి నేని ♦ పౌనరింపుము క్ర
న్నన యిట్టు లనఁగ నట్టుల, యొనరించెద ననుచు నిజస♦హోదరుఁ బిలిచెన్.

తాత్పర్యము

మునియభిప్రాయప్రకార మాయనకు నీవు మేలుచేయఁ గోరికగల వాఁడ వేని యిట్టి యేర్పాటు చేయుము అనిన నట్టులే చేసెదనని లక్ష్మణుని బిలిచెను.

తే. పిలిచి సౌమిత్రితో నను ♦ నిలుము నీవ
ద్వారమున ద్వారపాలకుఁ ♦ బంపు దూర
ముభయులము మాటలాడుచు ♦ నుండ లోన
వచ్చువాఁడును వినువాఁడు ♦ వధ్యుఁ డగును. ౧౫౮౦

తాత్పర్యము

(పిలిచి, లక్ష్మణునితో నీవే ద్వారమునందుండుము. ద్వారపాలకుని దూర ముగాఁ బంపివేయుము. మే ముభయులము మాటలాడునప్పుడు లోపలికి వచ్చిన వాఁడును, విన్న వాఁడును మరణదండనమున కర్హులు అని చెప్పెను.)

క. అని ద్వారమున సుమిత్రా,తనుజాతుని నిల్పి నియమ♦ధన! సందేశం
బును దెల్పుఁ డదియె నామన,మున వర్తించెడిని నాఁగ♦ముని యిట్లనియెన్.

తాత్పర్యము

(అని వాకిట లక్ష్మణు నునిచి మునీశ్వరా! సందేశమును దెల్పుఁడు, నామన సులో నదియే కలదు అని చెప్పఁగా, ముని యిట్లని చెప్పెను.)

—: బ్రహ్మ సందేశమును గాలుండు శ్రీరామునకుఁ దెల్పుట :—

తే. వినుము రాజేంద్ర! నాపలుకు విధమునెల్ల, బ్రహ్మపనుపున వచ్చిన వాడ నేను
పూర్వభవమున నే నీకుఁ బుత్రకుఁడను, మాయచేనైతి సర్వసం హారకుఁడను.

అర్థములు. పూర్వభవమునన్=తొలుతటి జన్మమునందు, మాయచే=నీ సంకల్పముచే, సర్వసంహారకుఁడను=సర్వము సంహరించు కాలరుద్రుఁడను.

తా త్ప ర్య ము

రాజేంద్రా! నేను జెప్పునది వినుము. బ్రహ్మ పంపఁగా నేను వచ్చినాఁడను. పూర్వజన్మమందు నేను నీకుఁ బుత్రుఁడను. నీ సంకల్ప ప్రకారము సర్వము సంహరించు కాలరుద్రుఁడను.

సీ. కాలుండ నేను నీ వాలింపు మోదేవ!, వారిజగర్భుని వాక్యములను
స్వీయలోకంబును జేరి రక్షింపఁగ, సమయ మియ్యది నీకుఁ సౌమ్యచరిత!
పూర్వంబుజగముల బోలియించి మాయచే, స్వయముగ జలరాశి శాయివగుచుఁ
దొలుత సృష్టించితి జలములయందు నన్నవల జలేశయం బైన నాగ

ఆ. పర మనంత మనెడి పురుభోగవంతంబు, మాయచేత సత్త్వ మహితు లైన
మధుని కైటభాఖ్యు మర్దింపవారల, యస్థితతి సశైల మవనిగలిగె. ౧౫౩

అర్థములు. వారిజగర్భుని=బ్రహ్మయొక్క, స్వీయలోకమును=భూలోకము గాక పరమ పదమును, మాయచే=స్వసంకల్పముచే, జలరాశిశాయివి=సముద్రమునందుఁ బరుండిన వాఁడవు, జలేశయము=జలమునందుండునది, నాగవరము=సర్ప శ్రేష్ఠము, అనంతము=అనంతమను పేరుగలది, పురుభోగవతంబు=గొప్ప దేహము గలది. మాయచేత=అద్భుతశక్తిచేత, సత్త్వమహితులు=బలముచే గొప్పవారు, అస్థితతిన్=ఎముకలసమూహముచే, సశైలము=కొండలతో గూడినది, అవని= భూమి.

తా త్ప ర్య ము

నేను గాలుఁడను దేవా! బ్రహ్మవాక్యముల వినుము. భూలోకమందుండి యింతకాలము భూపాలనము చేసితివి. ఇఁక నీ లోకమును జాలించి పరమపదమందుండి పాలింపసమయము వచ్చినది. పూర్వము జగములనెల్ల సంకల్పముచేతనే సంహరించి నీ సంకల్పము చేతనే సముద్రమునఁ బండుకొని మొట్టమొదట జలములందుఁ బుట్టిన కమలమందు నన్నుఁ బుట్టించితివి. ఆవల నీ సంకల్పముచే పెద్ద దేహముగల యనంతమను సర్పమును గలిగించితివి. బలవంతులైన మధుకైటభుల నీవు వధియింప వారి యెముకలచే కొండలతోడ భూమి కలిగెను. జలములందుఁ బుట్టిన మకరాదులవలె మేదస్సు గలవాఁడు మధుఁడు, జలములందుఁ బుట్టిన

తాఁబేలు ముత్తెపు చిప్ప మొదలగు వాని వంటివాఁడు కైటభుఁడు, మేదస్సువలనఁగలిగినది భూమి మెత్తని భాగము. ఎముకలవలనఁ గలిగినది కొండలు గట్టి భాగము, మేదిని=పృషోదరాదులలోఁ జేరుటచే సకారలోపము, ఈ భూమిని భరించుటకుఁగా సృష్టింపబడినవాఁడు అనంతుఁడు, దానియందలి జీవకోటులసృష్టింపఁ బుట్టింపఁబడినవాఁడు నేను. వృక్షలతాదులు మేదస్సునుండి పుట్టెను. శిలాదులు అస్థులనుండి పుట్టెను.

తే. దివ్యమై తామరస హితఁదీప్తిఁ దనరు, వారిజంబున నీనాభివలన నన్నుఁ
  గలుగఁజేసి ప్రాజాపత్యఁకర్మమునను, నీవ నిలిపితి వోదేవ! ౦ నిత్యముగను.

అర్థములు. తామరస హిత దీప్తిన్=సూర్యకాంతిచే, ప్రాజాపత్య కర్మమునను=ప్రజల సృష్టించు కార్యమందు.

తాత్పర్యము

దివ్యమై సూర్యకాంతిగల కమలమందు నీనాభివలన నన్నుఁ బుట్టించి ప్రజను సృష్టిచేయు కార్యమందు నిలిపితివి 'యో బ్రహ్మాణం విదధాతి పూర్వ' మ్మని శ్రుతి.

ఉ. శ్రీకర! నేను స్వరమును ౦ సృష్టి యొనర్చియు రక్ష సేయఁగా
  నేక సమస్తభారమును ౦ నీపయి వైచి జగత్పతీ! కృపన్
  లోకము లెల్లఁ బ్రోచి యవిఁలోలతఁ దేజము నాకుఁ గూర్పు మం
  చీకరణిన్ వచింపఁగ మఁహీధవ! యంత దయాంతరంగతన్. ౧౫౮౫

అర్థములు. నేక=నేరక.

తాత్పర్యము

నీవు చెప్పినట్లు సర్వము నేను సృష్టించితినిగాని దానిని రక్షింప నాకు సామర్థ్యము లేదయ్యెను. అప్పుడా రక్షాభారము నీయందు వైచి జగన్నాథా! లోకములను నీవే రక్షించి నాకుఁ దేజస్సు కలిగింపు మని నేను నిన్నుఁ గోరఁగా నీవు నాయందు దయగలవాఁడవై.

సీ. నీవు దుర్ధర్షుండుఁనిత్యుండ వగుటను, భూతరక్షాకార్యంమును దలంచి
  విష్ణుండ వైతివిఁవిశ్వేశ! యావల, నదితిసుతుండ వై ౦ యతులశక్తి
  భ్రాతల నరయుచుఁవలసినచో నెల్ల, సాహాయ్య మొనరింపఁనాగితయ్య
  యట్టినీవు ప్రజాళిఁహావళి గొనఁ గని, రావణుఁ జంప ధఁరాతలమున
ఆ. మానవత్వమునను ౦ మనసు నిల్పితి దేవ, పదియువేలయేండ్లుఁబదియునూర్ల
  వత్సరంబు లుర్విఁవసియింప నియమంబు,నీవ మున్నగొంటిఁనీరజాక్ష! ౧౫౮౬

అర్థములు. దుర్ధర్షుండు=ధిక్కరింపరానివాఁడు, నిత్యుఁడు = సనాతనుఁడు, భూతరక్షాకార్యము=ప్రాణుల రక్షించుపని, విష్ణుఁడవు=ఉపేంద్రుఁడవు.

తాత్పర్యము

దేవా! నిన్నుఁ గాదని తిరస్కరింపగలవారు లేరు; నిత్యుఁడవు. ఇట్టి పరవాసుదేవుఁడవైన నీవు ప్రాణుల రక్షింపఁదలఁచి అదితికిఁ బుత్రుఁడవై యుపేంద్రుఁడవై జనియించి సోదరులగు నింద్రాదుల రక్షించుచు వారికిఁ గావలసిన కార్యములందు సహాయపడసాఁగితివి. అట్టి నీవు ప్రజలు రావణుచే బాధపడుచుండ వానిని జంపుటకై మనుష్యుడఁవు కావలెనని తలఁచి పదునొకండువేల సంవత్సరములు భూమిపై నుందునని నీవే నియమ మేర్పఱచుకొంటివి.

క. నీవు మనోమయపుత్రుఁడవై వెలసితి దశరథునకు♦ననుకొన్న యటుల్
దేవా! కాలము డాసెను,నీవలచినఁ బ్రజలఁ బ్రోవ♦నిలువుము నెమ్మిన్. ౧౫౮౭

అర్థములు. మనోమయ పుత్రుఁడవై=స్వసంకల్ప కృతమైన దశరథపుత్రభావము గలవాఁడు, వలచినన్=కోరెదవేని.

తాత్పర్యము

స్వసంకల్పముచేత దశరథునకుఁ బుత్రుఁడవైతివి. (పరవాసుదేవునుండి మహావిష్ణు నవతారము. ఈయనయే బ్రహ్మ శివుల నడుమనుండువాఁడు. ఆయినవు రంగములు. ఈ మహావిష్ణువునుండి యుపేంద్రావతారము. ఈయన స్వర్గమందుండును. ఈయనయే రామావతార మెత్తినవాఁడని గ్రహింపనగు) నీవు నియమించుకొన్న కాలము సమీపించెను. ఇంకను నీ విందే యుండి ప్రజల రక్షింపఁదలఁచితివేని సంతోషముతో నిలువుము.

క. రామా! యీగతి లోకపి, తామహుఁడు వచించె దేవతా♦భువనంబున్
బో మదిఁ గోరినచో నిఖ,లామరులు సనాథు లగుచు♦హర్షింతు రెదన్. ౧౫౮౮

అర్థములు. లోక పితామహుఁడు=బ్రహ్మ, దేవతాభువనంబున్=దేవలోకమునకు, సనాథులు=నాథుఁడు గలవారు.

తాత్పర్యము

(రామా! యీప్రకారము బ్రహ్మచెప్పెను. నీవు దేవలోకమునకుఁ బోవఁ గోరినయెడల దేవతలందఱు దిక్కుగలవారై సంతోషించెదరు.)

క. అను కాలుని వాక్యంబులు, విని నవ్వుచు రాముఁ డనియెఁ♦బ్రీతి ఘటిల్లన్
జనుదెంచుట నీవే నిల, జనియించుట లోకరక్ష♦సలుపఁగఁ గాదే. ౧౫౮౯

అర్థములు. నవ్వుచున్=తా ననుకొనుచున్నదే బ్రహ్మచెప్పి పంపెను. గదా యని నవ్వు.

తాత్పర్యము

(అనిన కాలుని మాటలు విని నవ్వుచు రామచంద్రమూర్తి నీవే వచ్చుటచే సంతోషమైనది. ఈభూమియందుఁ బుట్టుట లోకమును రక్షించుటకే కదా.)

క. ఎందుండి వచ్చినాఁడనొ, యందులకే మరల వత్తు♦నఖిలంబు క్రియా
బృందము దీరెను నామన, మందుం గలయదియు నేఁడు♦ప్రాప్తంబయ్యెన్.

తా త్ప ర్య ము

నే నెచ్చటనుండి వచ్చితినో యచ్చటికే మరల వచ్చెదను. చేయవలసిన కార్యములు చక్కఁబడెను. నే నేవిషయ మాలోచించు చుంటినో యదియు నేఁడు ప్రాప్తించెను.

తే. సర్వసంహార! వారిజ♦సంభవుండు, పలికినట్లులు మద్వశ♦వర్తులైన
యమరనాథుల సర్వకా♦ర్యంబులందు, నిలువవలయును నాకది♦నియమమగుట.

అర్థములు. మద్వశవర్తులు=న న్నాశ్రయించి నాకు లోఁబడియుండువారు, వారి కేది మేలో యది భక్తిపరతంత్రుఁడనైన నేను జేయవలసియున్నది. బ్రహ్మ సృజింపఁబడె నని చెప్పుటచే బ్రహ్మయందుఁ బరత్వము లేదని యేర్పడెను.

తా త్ప ర్య ము

(సర్వసంహార! బ్రహ్మచే నట్లు నాకు లోఁబడిన దేవతాశ్రేష్ఠులను వారి వారి పనులందు నిలుపవలెను. అది నా నియమము.)

దుర్వాసుండు తనరాక శ్రీరామున కెఱిఁగింపుమని లక్ష్మణుతోఁ జెప్పుట

క. వా రిటు భాషించు నెడన్, ద్వారంబున రామచంద్ర♦దర్శనకాంక్షన్
జేరి నిలిచి దుర్వాసుఁడు, శ్రీరామునిఁ జూపుమిపుడు♦చెచ్చెర నాకున్ ౧౦౫-౨

తా త్ప ర్య ము

(వా రీవిధముగా మాటలాడుచుండఁగా, శ్రీరామచంద్రమూర్తిని దర్శింపఁ గోరి వచ్చి నిలబడి, దుర్వాసుఁడు నాకుఁ దక్షణము శ్రీరామునిఁ జూపుము.)

ఉ. కాల మతిక్రమించెడిని ♦ గాదిఁక జాగు వచింపుమీ ధరా
పాలున కిప్పు డన్న రఘువర్యుని ♦ తమ్ముఁడు మ్రొక్కి యిట్లనున్
జాలము సేయ, నేమిపని ♦ సల్పుదు? నెయ్యది వాంఛ? రామభూ
పాలుఁడు వ్యగ్రుఁ డిప్పుడు క్ష ♦ మారత! సైఁపు నిమేషమాత్రమున్. ౧౦౫-౩

తా త్ప ర్య ము

కాలము మించిపోవుచున్నది. ఆలస్యము చేయరాదు. రాజున కిప్పుడే నా రాక తెలుపుము. అనిన లక్ష్మణుఁడు సమస్కరించి యిట్లనియె ఏమి చేయవలయునో మునీంద్రా! చెప్పుము, ఆలస్యము లేక చేసెదను. మీ రేమి కోరెదరు? రామచంద్రమూర్తి యన్యకార్యమందు మనస్సుంచి యున్నాఁడు. నిమిష మాత్రము నా యందు దయ యుంచి సహింపుఁడు.

క. నాపుడుఁ గన్నుల నిప్పులు, వావిరిఁ గురియంగఁ గ్రోధ•పరితప్తుం డై
భూవిభునకుఁ జని చెప్పుము, నీ వీక్షణమంద చనుము•నిలువకు పోపో. ౧౦౫-౮

తా త్ప ర్య ము

(అని చెప్పఁగాఁ గోపమున మండి కన్నుల నిప్పులురాల నీ వీక్షణమునందే పొమ్మి. రాజునకుఁ జెప్పుము. నిలువకు-పోపో.)

క. ఈ నిమిషంబునఁ జెప్పక, మానెదవా మీపురంబు•మండలమును రా
మానుజ! నిను నీయన్నల, మానక మీవంశములను•మాడ్చెదఁగనుమీ.

తా త్ప ర్య ము

(ఈనిమిషముననే పోయి చెప్పకపోతివా, రామానుజా! చూడు మీపత్తనము-మీరాజ్యమును నిన్ను మీయన్నలను మీవంశములను తప్పక మాడ్చివేసెదను.)

క. పెరిఁగెడి కింక శమింపఁగఁ, దరమా శపియింతు నిపుడ•తాళ నటన్నన్
బరుషము లగుముని వాక్కుల, సరణియు నిశ్చయముఁ దలఁచి•సౌమిత్రియెదన్.

అర్థములు. పెరిఁగెడి కింకన్=వృద్ధిపొందుచున్న కోపమును, తాళన్=సహింపను, నిదానింపను.

తా త్ప ర్య ము

(పెరిఁగిపోవుచున్న కోపమును నోర్చుకొన నిఁక శక్యముగాదు. ఇప్పుడే శపించెద-తాళను. అనిపలుకఁగా గఠినములగు దుర్వాసముని మాటలతీరు, ఆయన నిశ్చయమును మనసునఁ దలఁచి లక్ష్మణుఁడు,)

క. ఏలా యిందఱు నాశిల, మేలు గదా నేనొకండె • మృతిఁ గను టని భూ
పాలునిఁ జేరం జని తా, వాలాయం బత్రిసుతుని•వాక్యము వినిచెన్. ౧౦౫-౯

అర్థములు. నాశిల=నాశమైపోవ.

తా త్ప ర్య ము

(ఇందఱు నశించిపోవుట యెందుకు? నేనొకఁడనె మరణించుట మేలుగదా. యని తాను రాజుదగ్గఱకుఁబోయి, దుర్వాసుని మాటలను వినిపించెను.)

క. సౌమిత్రివాక్యముల విని, రాముఁడు వీడ్కొల్పి కాలు•రయమున దుర్వా
సోమునిఁ జేరంజని ముని, సోమా! కార్యంబుఁ బలుకు • మొప్పుగఁదీర్తున్.

తా త్ప ర్య ము.

(లక్ష్మణుని మాటలను విని రామచంద్రమూర్తి యమునిఁ బంపి, దుర్వాసు దగ్గఱకు వచ్చి మునిచంద్రా! మీరు వచ్చినపని యేమి? చేసెద సెలవిండు.)

చ. అనవుడు వేయివత్సరము♦లద్భుతనిష్ఠఁ దపంబుఁ జల్పితిన్
జనవర! యిప్పుడే ముగిసె♦సర్వము, క్షుత్తు సహింపఁ జాల భో
జన మిడు మున్న మాత్ర మన ♦ క్ష్మావిభుఁ డామునికిన్ సుధోపమం
బును రుచిరాన్నముం గుడువఁ♦బూర్ణముగాసిడెఁ దుష్టచిత్తుఁ డై. ౧౫౯౯

అర్థములు. క్షుత్తు=ఆఁకలి, సుధోపమంబును=అమృతముతో సమానము, రుచిరాన్నము=ఇంపైన భోజనము, తుష్టచిత్తుఁడై=సంతోషించిన మనస్సు గలవాఁడై.

తాత్పర్యము

అని చెప్పఁగా దుర్వాసుఁ డిట్లనియె. వేయిసంవత్సరము లాహారము లేక కఠిన తపస్సు చేసితిని. అది యిప్పుడే ముగిసెను. ఆఁకలి సహింపలేకున్నాను. ఇప్పుడున్నంతమాత్ర మన్నము పెట్టుము అని చెప్పఁగా నా మునికి రామచంద్రమూర్తి అమృతసమానమై యింపైన యన్నము పూర్ణముగాఁ గడుపునిండఁ బెట్టఁగా సంతోషించినవాఁడై.

తే. సంతసించితినని మెచ్చి♦చనియె స్వాశ్ర,మంబునకు రామవిభుఁడును♦మనసునందుఁ
గాలు వాక్యంబు నెంచి యూ♦గాక యింక,నిఖిలసంహార వేళయన్♦నిశ్చయమున.

అర్థములు. నిఖిలసంహార వేళ=సర్వము సంహరించు సమయము, భ్రాతృ భృత్య మిత్ర బంధువులు లోనగు వారి నందఱను తనతోడఁ దీసికొనిపోవు సమయమున.

తాత్పర్యము

సంతోషపడితిని-అని రామచంద్రమూర్తిని మెచ్చుకొని తన యాశ్రమమునకుఁ బోయెను. రామచంద్రమూర్తి తన మనసులోఁ గాలుని వాక్యములను దలఁచుకొని యిఁక సర్వసంహార సమయమనెడి నిశ్చయమున.)

లక్ష్మణుఁడు శ్రీరామునితోఁ దన్ను వధించి సత్యము రక్షింపుమని చెప్పుట

క. దీనుఁ డయి మోము వ్రాలిచి, మౌనంబు వహించి గ్రస్త♦మిహికాకరుచం
దాన విగత తేజుండై, మానవపతి లక్ష్మణుండు♦మధురోక్తులతోన్. ౧౬౦౧

అర్థములు. దీనుడయి=దుఃఖముతో గూడినవాఁడయి, లక్ష్మణుని జంపవలసి వచ్చెఁగదా యని దుఃఖము, గ్రస్త=రాహువుచే గ్రహింపఁబడిన, మిహికాకరు=చంద్రుని, చందానన్=విధముగ, విగతతేజుండు=తేజస్సుపోయినవాఁడు, మధురోక్తులతోన్=తియ్యని మాటలతో.

తాత్పర్యము

లక్ష్మణుఁ జంపవలసి వచ్చెఁగదా యని దుఃఖముచే ముఖము వ్రాల్చి మాటాడక గ్రహణమునాఁటి చంద్రునివలె కాంతి హీనుఁడైన రామచంద్రుని జూచి లక్ష్మణుఁడు తియ్యని మాటలచే.

చ. అలరుమనంబుతోఁ నను మ • దర్థ మిటేల మహానుభావ! చిం
తలఁ దపియింపఁ? బూర్వనియ • తం బగు కర్మముచే నిబద్ధమై
చెలఁగెడికాల మిప్పగిదిఁ • జేకుఱె, నన్ను వధించి సత్యమున్
నిలుపుము, బాస తప్పుధర • ణీజనముల్ నరకంబునం బడున్. ౧౬౦౨

అర్థములు. అలరు మనంబుతోన్=సంతోషముతోఁ గూడిన మనస్సుతో, మదర్థము=నాకొఱకు, పూర్వనియతంబు=ముందే నియమింపఁబడినది, నిబద్ధమై=ఏర్పాటుచేయఁబడినదై, కట్టఁబడినదై, బాస=మాట, లక్ష్మణుఁడు తన వియోగము సుమంత్రునివలన ముందే వినియున్నవాఁ డగుటచే వ్యసనపడ లేదనిభావము.

తా త్ప ర్య ము

మహానుభావా! నన్నుఁ జంపవలసి వచ్చెనని నా నిమిత్తమై నీ వేల వ్యసనపడెదవు? ముందే యేర్పాటుచేఁ గట్టబడిన కాల మిట్లు తటస్థించెను. ఇది యాకస్మికముగ వచ్చినది కాదు. ముందే యిది యిట్లు జరగవలయునని యేర్పాటు చేయబడిన విషయము. కావున నన్నుఁ జంపి నీవు సత్యము కాపాడుము. మాట తప్పువారు నరకమునఁ బడుదురు.

ఉ. నన్నుఁ బ్రసాదదృష్టులఁ గ • నన్ మది గల్గిన యేని, నాపయిన్
సన్నుతశీల! నీకు దయ • చాలఁగఁ గల్గిన యేని నన్నయా!
నన్ను వధింపుమీ యిపుడ • నర్మిలి మానుము ధర్మవర్ధనం
బు న్నెఱి గూర్పుమీ, హృదయ • ముం బదిలం బొనరింపుమీ యనన్. ౧౬౦౩

అర్థములు. ప్రసాద దృష్టులన్=అనుగ్రహముతోఁ గూడిన చూపులతో, నర్మిలి=ప్రేమ, ధర్మవర్ధనంబున్ = ధర్మముయొక్క యభివృద్ధిని, పదిలము=దృఢము.

తా త్ప ర్య ము

అన్నా! నాయందు నీకు నను్గ్రహము గలదేని నామీఁద నీకు నిండుదయ గలదేని నాపయి ప్రేమ వదలి యిపుడే చంపుము; ధర్మమును వృద్ధినొందింపుము హృదయము దృఢపఱచు కొనుము.

క. చలితేంద్రియుఁడై రాముఁడు, వలనుగ మంత్రులఁ బురోధఁ • బనిచెం బిలువన్
దెలిపెను దాపసితోఁ దాఁ, బలికిన బాసయును నతి • ప్రభవునిరాకన్. ౧౬౦౪

అర్థములు. చలితేంద్రియుఁడై=చలించిన మనస్సు గలవాఁడై.

తా త్ప ర్య ము

మనస్సు చలించినవాఁడై రామచంద్రమూర్తి మంత్రులను బురోహితుని వసిష్ఠుని బిలిపించి తపస్వితోఁ దాను జేసిన ప్రమాణము, దుర్వాసుఁడు వచ్చుట తెలిపెను.

—* వసిష్ఠవాక్యంబున శ్రీరాముఁడు లక్ష్మణుని విడనాడుట *—

క. సోపాధ్యాయులు మంత్రులు, భూపాలకువాక్యజాలమును వినుచుండన్
క్ష్మాపతితోడ వసిష్ఠుం, డీపగిది వచించె మున్నెదృష్టం బివియున్. ౧౬౦౫

తాత్పర్యము

ఉపాధ్యాయులతో మంత్రులు రామచంద్రమూర్తి వాక్యములు వినుచుండఁగా వసిష్ఠుఁ డిట్లనియె. 'రామచంద్రా! యీ సందర్భములిట్లు వచ్చునని ముందు తెలిసిన విషయమే. క్రొత్తగా నాకస్మికముగ వచ్చినవి కావు. నాతపోబలమునను నాయాశ్రమమున దుర్వాసుఁడు దశరథునకుఁ జెప్పిన మాటల వలనను నాకుఁ దెలియునని భావము.

క. సౌమిత్రిని నీ విడుటయు, రామా! నీక్షయముఁ గానఁ గ్రచ్చఱ విడుమీ
యీమహితగుణునిఁ దమ్ముని ధీమండన! కాలబలముఁ దెలియని యదియే.

అర్థములు. నీక్షయము=నీవును పోవుటయు.

తాత్పర్యము

(రామా! లక్ష్మణుని వదులుటయనఁగా నీవు పోవుటయేకాన, గొప్ప గుణములుగల నీ తమ్ముని తత్క్షణము వదలివేయుము. కాలముయొక్క బలము నీకుఁ దెలియనిదా.)

ఆ. వ్యర్థపఱుపరాదు ప్రతినను ధర్మజ్ఞ! పలికి తప్ప ధర్మ విలయ మొదవు
ధర్మనష్టముననుఁ ద్రైలోక్యమును జరా, చరము లమరమౌనిచయముఁగూలు.

తాత్పర్యము

(ధర్మము తెలిసినవాఁడా! చేసిన ప్రతిజ్ఞ తప్పరాదు. ఆడి బొంకిన ధర్మము నశించును. ధర్మము నాశమైనందు వలన మూఁడు లోకములు; చరాచరప్రాణులు దేవతలు మునుల సమూహము నశించును.)

క. త్రైలోక్యరక్షణార్థము, పాలింపఁగ ధర్మపథము భ్రాతను విడుమీ
మేలు ఘటింపుము జగతికి, నా లక్ష్మణుఁ జూచి ధర్మనయపరుఁ డనియెన్.

అర్థములు. భ్రాతను విడుమీ=తమ్ముని నీయొద్ద నిక నుంచుకొనక వదలి పెట్టుము చంపవలసిన పనిలేదు.

తాత్పర్యము

(మూఁడు లోకములను రక్షించుట కొఱకు ధర్మమార్గమును పాలించుటకుఁ దమ్ముని వదలివేయుము, జగమునకు మేలుచేయుము-అని చెప్పఁగా ధర్మము నీతియం దాసక్తిగల రామచంద్రమూర్తి లక్ష్మణుని జూచి చెప్పెను.)

క. చెడకుండ ధర్మనిధి నిను, విడిచితి సౌమిత్రి నామ ప్రియసోదరుఁడా!
పుడమిని సాధుల కిష్టుల, విడుచుట చంపుటయు నొక్క విధమై యునికిన్.

తాత్పర్యము

ప్రియసోదరుఁడా! సత్యవాక్య పరిపాలన మను ధర్మమును రక్షించు కొఱకు నిన్ను వదలితిని. చంపుదుననికదా కాలునితో నీవు ప్రతిజ్ఞ చేసితి వందువేమో సాధువులగు వారికి నిష్టుల వదలి పెట్టుట వారిని జంపుటతో సమానము కావున నిన్నుఁ బొమ్మనుట నిన్నుఁ జంపుటే.

— లక్ష్మణుఁడు మేనితో దివంబున కేగుట —

సీ. రాముని వాక్యముల్ సౌమిత్రి యాలించి, కన్నుల నీళులు కార్చి యపుడ
తనగృహంబున కైనఁ జనక చక్కఁగఁ బోయె, సత్వరుండగుచును సరయు కడకు
నంబువు ల్వార్చి కృతాంజలి యగుచును, నఖిలేంద్రియంబుల నాఁక గొనుచు
నూరుపు బిగియించి యుండ సశక్రాప్సరోగణంబులు సురపూగములును

ఆ. బుష్పవృష్టి గురియ బురుహూతుఁ డెవరికిఁ, గానరాక వచ్చి కడుబలాఢ్యుఁ
డనువుతో సుమిత్రాతనయుని గ్రహియించి, త్రిదివమునకుఁ జనియె దివ్యులలర.

అర్థములు. కన్నుల నీళ్ళులు కార్చి=జీవించి యుండఁగానే రామకైంకర్యము విడువవలసి వచ్చెఁగదా యని వ్యసనమున, వార్చి = ఆచమించి, ఆఁక గొనుచు=నియమించి, ఊరుపు బిగియించి=కేవల కుంభకమందుండి, సురపూగములు=దేవతాసమూహములు.

తాత్పర్యము

లక్ష్మణుఁడు రామచంద్రమూర్తి వాక్యములనువిని రామచంద్రవియోగము సహింపలేక కన్నీరుగార్చి వెంటనే తన యింటికైనఁ బోక భార్యకైనఁ జెప్పక సరయువు నొద్దకుఁ ద్వరగాఁ బోయెను. ఇట్లు పోయి యేటినీట నాచమించి చేతులు జోడించి యింద్రియముల నియమించి యేకాగ్రమనమున కేవలకుంభకమున నుండఁగా నింద్రునితోఁడ నప్సరసలును దేవతలును ఆయనమీఁదఁ బూలవాన గురియించిరి. ఎవరికిఁ గానరాక యుండ నింద్రుఁడు వచ్చి శరీరము తోడ లక్ష్మణు గ్రహించి స్వర్గమునకుఁ దీసికొని పోయెను.

ఇట్లు చెప్పుటచే నీ లోకమందలి శరీరమే స్వర్గలోకమందలి శరీరమనియేర్పడెను. దానివలన నీశరీరమును విడిచి వేఱొక శరీరము గ్రహింపలేదని సూచితము. దివ్యశరీరముతోనే భూలోకమునఁ గానవచ్చుచుండెను..

కడుబలాఢ్యుననుటచే నిచ్చట దేహబలమునకుఁ బ్రసక్తిలేదు కావున యోగబలముచేఁ గానరాక పోఁగా నింద్రుఁడు వచ్చి పిలుచుకొని పోయెనని యైనఁ జెప్ప వచ్చును.

క. వెన్నునినాలవభాగం,బు న్నిర్జరవరులు స్వర్గ•మును జేరంగాఁ
గన్నారఁగాంచి మిక్కిలి, మన్ననఁబూజించి రెల్ల•మౌనులతోడన్. ౧౬౧౧

అర్థములు. వెన్నుని నాలవభాగము=విష్ణువు చతుర్థాంశము, చూడు బాల కాండ ౮౭౭వ పద్యము. వెన్నుని నాలవభాగము.

వెన్నుని నాలవభాగము, శేషసుపర్ణ విష్వక్సేన విష్ణురూపములను నాలుగు రూపములలో నాలుగవ భాగమగు శేషుఁడు లక్ష్మణుఁడనియు,సుపర్ణుఁమ భరతుఁ డనియుఁ, విష్వక్సేనుఁడు శత్రుఘ్నుఁడనియు, విష్ణువు రామచంద్రమూర్తి యనియు రహస్యార్థము. ఈ కారణము చేతనే లక్ష్మణుఁడు శేషుఁడని పురాణాం తరము లందు జెప్పఁబడెను. సర్వేశ్వరుఁడు అనంత గరుడ విష్వక్సేన విష్ణురూప ముల నాలుగు వ్యూహములుగా నుండునని తెలియనగు. గోవింద రాజీయము కతక వ్యాఖ్యయు దీనినే యనుమోదించెను గాని తిలకవ్యాఖ్య గరుఁడుడు స్వయ ముగ వచ్చినట్లు యుద్ధకాండ మం దుండుటచే భరతుఁడు గరుడుఁడను విషయము నంగీకరింపలేదు కతకాభిప్రాయమున కిది విరోధింపదని సత్యతీర్థ వ్యాఖ్య.

తాత్పర్యము

(విష్ణు దేవుని నాలుగవభాగము(అనగా లక్ష్మణుడు) స్వర్గమును జేరఁగా దేవతలు గన్నులార జూచి మిక్కిలి గౌరవముతో మునులతోఁగూడి పూజించిరి.)

—• శ్రీరాముఁడు మహాప్రస్థానం బేగ నిశ్చయించుట •—

సీ. సౌమిత్రి విడనాడి• సంతాపభరమున, సచివ పురోహిత•జానపదుల
నెల్లరఁ గనుఁగొని • యిప్పు డయోధ్యకు, రాజుగా భరతు ధర్మవ్రతాఢ్యు
పట్టాభిషేకంబు • పరఁగించి లక్ష్మణుఁ, డేగిన గతికి నే • నేగు నాఁడ
జతఁగూర్పుఁడీ! సర్వ•సంభారముల నన, శిరములు వ్రేల ని • ర్జీవులట్లు

తే. యయిరి పౌరులునిశ్చేష్టుఁ•డగుచుభరతుఁడాత్మ వోయుచురాజ్యంబు•నన్నకనియె
నిన్ను విడనాడి నిర్జర•నిలయమైన, గోర నాకేల రాజ్యంబు • గుణధురీణ!

అర్థములు. సచివ పురోహిత జానపదులన్=మంత్రులను బురోహితులను గ్రామముల వారిని, నిర్జీవులట్లు=ప్రాణములేని వారివలె, నిర్జరనిలయము=దేవ లోకము.

తాత్పర్యము

లక్ష్మణు వదలిపెట్టి మిగులఁ బరితాపపడుచు మంత్రులను బురోహితులను గ్రామజనుల నందఱిఁ జూచి రామచంద్రమూర్తి ధర్మవ్రత సంపత్తి గల భరతుని రాజ్యమునకుఁ బట్టాభిషిక్తునిఁ జేసి నేను లక్ష్మణుఁడు పోయిన త్రోవ బోయెదను. దానికిఁ గావలసిన పదార్థములు సేకరింపుఁడని చెప్పఁగా నందఱు ప్రాణములులేని

వారినలైనైరి. అప్పుడు భరతుఁడు రాజ్యమును గుఱించి మనస్సున నసహ్యించుకొని యన్నతో నిన్ను విడనాడిన పిమ్మట స్వర్గము లభించినను నాకేల? ఇఁక నీరాజ్యము మాట చెప్పనేల?

క. సత్య మిది రామచంద్రా!, సత్యముపైఁ బలుకువాఁడ శపథము స్వీయా
పత్యముఁ గుశుఁ గోసలమునఁ, నిత్యంబుగ నుత్తరమున • నిలుపుము లవునిన్.

అర్థములు. స్వీయాపత్యము= నీ కుమారుని.

తాత్పర్యము

(రామచంద్రా! యిది సత్యము, సత్యముపైఁ బ్రమాణముచేసి చెప్పుచున్నాను. నీ కొడుకు కుశుని దక్షిణకోసలమునకు, లవుని నుత్తరకోసలమునకు నభిషిక్తుఁ జేయుము.

క. దూతల శత్రుఘ్నుం డిట, కేతేరఁగఁ బంపవయ్య • యిపుడు వెస యథా
రీతిని గమనముఁ దెలుపఁగ క్ష్మాతలవర! యంచుఁ బలుక • జనసంఘంబుల్.

తాత్పర్యము

(రాజా! శత్రుఘ్ననకుఁ బ్రయాణము సంగతి యథారీతి తెలిపి యిచ్చటకుఁ దీసికొని వచ్చుట కిప్పుడే త్వరగా దూతలను బంపుమని చెప్పఁగా జనసమూహములు.)

చ. శిరములు వ్రేల వైచి తుద • చెప్పఁగరానిభృశార్తిఁ గుందుటల్
భరతుని వాక్యముల్ కని త • లంచి రఘూత్తముతో నరుంధతీ
వరుఁ డిటు పల్కెఁ దండ్రి! యదె • పౌరులఁ జూడుము వీరికోర్కె నీ
వరసి తదిష్టముం జలుప • నర్హము నీకు మహాత్మ! నావుడున్. ౧౮-౧౯

అర్థములు. అరుంధతీవరుఁడు=వసిష్ఠుఁడు.

తాత్పర్యము

(తలలు వ్రేలవైచి యంతము గానరాని మిక్కిలి దుఃఖముతో దుఃఖపడుట, చూచి. భరతుని మాటలు తలఁచి, రామచంద్రమూర్తితో వసిష్ఠుఁడు తండ్రీ! యిదిగోఁ బౌరులను జూడుము. వీరికోరిక విచారించి వీరికోరిక తీర్చుట మహాత్మా! నీకుఁ దగిన కార్యమని చెప్పఁగా.)

తే. నేలఁ బడియున్న వారలఁ లేల నెత్తియేల యీచింత మీకు మఁదిష్టులార!
యేమి సేయంగవలయు మీ • కెల్లరకును? దెలియఁజెప్పుఁడు మీమది • తెలఁగటన్న.

తాత్పర్యము

(నేలమీఁదఁబడి దుఃఖించుచున్న పౌరులను జూచి వారలను లేవనెత్తినా, క్లిష్టులైన ప్రజలారా! మీ కేలవిచారము? మీ మనస్సులో నున్న విషయమును దెలుపుఁడు-మీకు నేనేమి చేయువలెను-అని యడుగఁగా.)

—• శ్రీరామునివెంటఁ బోవఁ బౌరులనుజ్ఞ గోరుట •—

క. రాముని వాక్యములను విని, భూమిజను లేక వాక్య•ముగ నిట్లని రో
రామా! నీవేగెడు నెడ,కే మరుదెంచెదము వెంట•నిడు మీవరమున్. ౧౬౧౭

తా త్ప ర్య ము

(రామచంద్రమూర్తి మాటలను విని ప్రజలందఱేకవాక్యముగా రామా! నీవు పోవుచోటికి నీ వెంట మేమును వచ్చెదము-మాకీవరమిమ్ము.)

క. పౌరతతిమీఁద, నీయెడఁ గూరిమి నెయ్యంబు గలిగి•కొఁఅలెద వేనిన్
దారలతోఁ బుత్రులతో, వారక నీచనెడి త్రోవ•వత్తుము దేవా! ౧౬౧౮

అర్థములు. పౌరతతిమీఁదన్=పురజనుల సమూహము మీఁద.

తా త్ప ర్య ము

(పురజనుల సమూహముమీఁద నీకుఁ బ్రేమ స్నేహము పూర్ణముగ నుండె నేని దేవా! ఆలు బిడ్డలతో నీవు పోయెడి దారిని మేము తప్పక వచ్చెదము.)

తే. తోలఁగక తపోవనమందొ•దుర్గముననొ, యేటినీటనొ కాక ము•న్నీటియందొ
యెందుఁజొచ్చిననీవు మే•మందుఁజొత్తు,మీశ్వరా! మమ్ముఁదోడ్కొని•యేగు వెంట.

తా త్ప ర్య ము

(నీవు తపోవనమునకే పోయెదవో, దుర్గమునందే యుండెదవో యేటి నీటలోనో సముద్రములోఁ జొచ్చెదవో నీ వెంట మేమును నందుఁజొచ్చెదము ప్రభో! మమ్ము నీ వెంట తోడుకొని పొమ్ము.)

క. ఇదె మాకు బరమవర మగు, నిదియే పర మంపుఁ బ్రీతి•యిందఱు దృఢమౌ
మదిఁ గోరిరి నిను వెనుకొన, సదయమతీ! తోడుకొని యే•చనఁ దగు ననుడున్.

తా త్ప ర్య ము

(ఇదియే మాకు గొప్పవరము. ఇదియే పరమప్రేమ. ఇందఱు గట్టి మనస్సుతో నీ వెంట వచ్చుటకుఁ గోరుచున్నారు. దయాశాలీ! తీసికొనియే పోవలెనని చెప్పఁగా.)

సీ. పౌరవర్గముదృఢ•భక్తిఁ గనుంగొని, యట్ల చేయుదు నని • యాడి యపుడు
కర్తవ్యముల నెంచి•కలఁగక కావించి, కుశు నిల్పి దక్షిణ•కోసలమున
లవుని నుత్తరకోస•లంబున నిలిపి పట్టాభిషేకంబుల • నాచరించి
కొడుకుల నిద్దఱిఁ • దొడలపైఁ జేర్చి, మూర్ధంబు ప్రీతిమై•మూరుకొనుచుఁ

తే. గాఁగిటను గ్రుచ్చి పదివేల•కరుల నరద,ములను వేలను ఘోటక•ములదశాయు
తముల వేర్వేఱ యిచ్చి ర•త్నములవి త్త,ము లొసఁగి హృష్టపుష్ట పౌ•రులనుగలుగు.

అర్థములు. కర్తవ్యములన్=చేయవలసిన పనులను, కలఁగక=మనసున చింత లేక.

తే. పట్టనములకు వారలఁ◆బంచి లక్ష్మ, ణానుజుని దోడి తేర దూ◆తాళిఁ బంప
వారు మూఁడహోరాత్రముల్◆బాటనిలక, తూర్ణముగ నేగి మధురశ◆త్రుఘ్ను గాంచి.

తాత్పర్యము

పురజనముల దృఢమైన భక్తినిఁ జూచి మీరు కోరునట్లే నాతోడ మిమ్ముఁ దీసికొని పోయెదనని చెప్పి చేయవలసిన కార్యము లాలోచించి కుశుని దక్షిణకోసలమునకు, లవుని నుత్తరకోసలమునకు రాజులుగాఁ జేసి వారికిఁ బట్టాభిషేకంబు గావించి కొడుకుల నిద్దఱను దొడలపైఁ గూర్చుండఁ బెట్టుకొని శిర స్సాఘ్రాణించి కౌఁగిలించుకొని యొక్కొక్కనికి పదివేల యేనుఁగులు వేయి రథములు నూఱువేల గుఱ్ఱములను వేఱు వేఱుగ నిచ్చి రత్నములు ధనములు హృష్టులు పుష్టులు నగు జనములు గల పట్టనములకు వారిని బంపి శత్రుఘ్నుని బిలుచుకొని వచ్చుటకు దూతలఁ బంపఁగా వారు దోవలో నిలువక మూఁడు రాత్రులు మూఁడు పగళ్ళు ప్రయాణము చేసి మధురకుఁ బోయి శత్రుఘ్నుని జూచి.

—◆ శత్రుఘ్నుఁడు కొడుకులకుఁ బట్టాభిషేక మొనర్చి యయోధ్యఁ జేరుట ◆—

సీ. రాముని ప్రతినయు◆రాముఁడు లక్ష్మణుఁ, బాయుటయును పౌర◆వర్గ మెల్ల
జనపతి వెంటన ◆ చన నిశ్చయించుట, యభిషేకములఁ దీర్చి◆యాత్మజులకుఁ
గుశునకు వింధ్యాద్రి◆కూలంబునను గుశా,వతి యనుపట్టన◆వరము నిచ్చి
శ్రావస్తి లవునకు◆రాజధానిగఁ జేసి, విజనంబుగ నయోధ్య◆విడిచి రామ

తే. భరతులిర్వురు స్వర్గంబు◆పథముఁ జనెడి, యత్నమున నున్నవారు మ◆హాత్మ! నీవు
వేగ చనుదెమ్మటన్న నా◆వీరవరుఁడు, కులము కూలంగ నుండుట◆ తెలిసి యపుడ.

తాత్పర్యము

రాముఁడు తపసితోఁ జేసినఁ ప్రతిజ్ఞ, యాప్రతిజ్ఞ ప్రకారము లక్ష్మణుని వదలుట పురజను లందఱు రాముని వెంటఁ బోవ నిశ్చయించుట కొడుకుల కభిషేకము చేసి వింధ్యపర్వతము నొద్ద కుశావతి యను పట్టనమును కుశునకు శ్రావస్తి లవునికి రాజధానులుగ నిచ్చి యయోధ్యను మనుష్యులు లేనిదిగఁ జేసి రామభరతులిరువురు స్వర్గమునకు బోవనున్నారని - నిన్ను రమ్మనినారు- వేగముగ రమ్మని చెప్పగాఁ నా శత్రుఘ్నుఁడు కులము కూలిపోవ నున్నదని తెలిసి వెంటనే.

ఉ. పౌరుల నెల్లరం బిలువఁ ◆ బంచి పురోహితుఁ గాంచ నాఖ్యునిం
జేరగఁ జీరి వారలకుఁ ◆ జెప్పి సమస్తము రామవృత్తమున్
వారలతోడి వేగతులు ◆ ప్రాప్తిలు నాకని రాజ్య మంతయున్
గూరిమి నాత్మపుత్రకుల◆కుం దగఁ బంచి కృతాభిషేకులన్. ౧౬-౨౪

తాత్పర్యము

(పౌరుల నందఱను రావించి, కాంచనుఁడను దన పురోహితుని బిలువనంపి, రాముని వృత్తాంతమంతయు వారలకుఁ జెప్పి, నాకును వారితోడి గతులే ప్రాప్తించు నని తన రాజ్యమంతయును దన కొడుకులకుఁ బంచి వారిని రాజులగా నభిషేకించి.)

తే. చేసి మథుర సుబాహు వన్ జ్యేష్ఠసుతున, కిచ్చి వైదిశ మనుపురిం నిచ్చె శత్రు
ఘాతి యనియెడి సుతునకుఁ గలబలంబు, స్వమ్మునటులె సమముగఁ బంచియొసఁగి.

తాత్పర్యము

మథురను తన పెద్ద కొడుకగు సుబాహువను వారికి వైదిశమను నగరము ఘాతి యనియెడి రెండవ కొడుకున కిచ్చి ధనము సేన యట్టులే పంచియిచ్చి.

తే. ఒంటిరథముగ నేగి యయోధ్యకందు జిలుఁగుఁ దెల్లనినుఁ బట్టుంజేలఁ దాల్చి
సంజ్వలత్పావకునిఁ బోలి సంయమీంద్ర, వరులమధ్యంబునందున్న భ్రాతఁ గనుచు.

అర్థములు. ఒంటిరథముగన్=తన్నుఁ బిలువ వచ్చినవారు తప్ప మథుర వా రెవ్వరిని దోడఁదీసికొనక, జిలుఁగు దెల్లని నునుబట్టుచేల=సన్నని తెల్లనిపట్టు వస్త్రము, సంజలత్పావకునిఁబోలి=మండుచున్న యగ్నివలె, సంయమీంద్రవరుల మధ్యంబునన్=మునీంద్రుల నడుమ.

తాత్పర్యము

(తా నొంటిగా రథమెక్కి యయోధ్యకు వచ్చి యచ్చట సన్నని తెల్లని పట్టు వస్త్రము ధరించి మునీంద్రుల నడుమ మండుచున్న యగ్నివలె నున్నయన్న గారిని జూచుచు.)

తే. మ్రొక్కి నిలఁబడి చేతులు మోడ్చి ధర్మ, మర్మవిదుఁ బల్కె రాముని ధర్మవిధిని
సుతుల కభిషేక మొనరించి హితవిధాన, నిన్ను వెన్కొనఁ బఱచితి నిర్మలాత్మ!

తాత్పర్యము.

(మ్రొక్కి, నిలువఁబడి, చేతులు కట్టుకొని, ధర్మ రహస్య మెఱిఁగిన రామ చంద్రమూర్తితో ధర్మము ననుసరించి నా కొడుకులకుఁ బట్టాభిషేకముచేసి నీ వెంట వచ్చుటకుఁ బరుగెత్తుకొని వచ్చితిని.)

క. భవదనుగమనముఁ గోరెద, నవనీశ్వర! మనసునిశ్చయం బిది వింటే
యెవి యడ్డంబులు చెప్పకు, నవురుగ నీయాజ్ఞఁ జనఁగ సమ్మతి పడెదన్.

అర్థములు. భవదనుగమనము=నీవెంట వచ్చుటకు.

తాత్పర్యము

(రాజా! మీవెంట వచ్చెదను. నా మనస్సులోని నిశ్చితాభిప్రాయ మిది. నీ వే యడ్డములు చెప్పకుము-నీ యాజ్ఞ ననుసరించి చేయ సమ్మతించెదను.)

క. అనవుడు రామమహీంద్రుం, డనుజాతునితోడ నట్లొయాత మటంచున్
జనవునఁ బలుకఁగ నీలో, వనచర భల్లూకతతులుఁబలలాశివరుల్. ౧౬-౨౯

అర్థములు. వనచరభల్లూకతతులు=వానరులు, ఎలుఁగులు వీరి సమూహములు, పలలాశివరుల్=రాక్షసశ్రేష్ఠులు, విభీషణునికి సంబంధించినవారు.

తాత్పర్యము

(అని చెప్పఁగా, రామప్రభువు తమ్మునితోఁ నట్లే కానిమ్మని ప్రేమతోఁ జెప్పఁగా, నీ లోపల వానరులయు నెలుఁగులయు సమూహములు విభీషణునికి సంబంధించిన రాక్షసశ్రేష్ఠులు.)

—* సుగ్రీవ విభీషణాదులు శ్రీరామునిఁ జూడవచ్చుట *—

ఉ. వచ్చిరి గుంపు గుంపుగను వారిజమిత్ర సుతుండు మున్నుగా
సచ్చరితున్ రఘూత్తముని స్వర్గమనాభిముఖుం గనుంగొనన్
వచ్చి మహాత్మ! నీబడిని వచ్చెద మిందఱ మెందుఁ బోయినన్
మచ్చిక మమ్ముఁ నెల్లఁ గొనిమానక సత్కృపఁ బోఁ గదే నృపా! ౧౬-౩౦

అర్థములు. వారిజమిత్రసుతుండు=సుగ్రీవుఁడు, స్వర్ + గమనాభిముఖున్= వైకుంఠమునకుఁ బోవఁబూనిన వానిని, నీ బడిని=నీ వెంట.

తాత్పర్యము

(వైకుంఠమునకుఁ బోవఁబూనిన సచ్చరిత్రుడుఁ శ్రీరామచంద్రమూర్తినిఁ జూచుటకు సుగ్రీవుఁడు మున్నుగా గుంపు గుంపుగా వచ్చిరి. వచ్చి మహాత్మా! నీ వెచ్చటకుఁ బోయిన నిందఱము నచ్చటకు వచ్చెదము – మమ్మందఱఁ బ్రేమ మీఱ విడువక మేలి కృపతో నీవు తీసికొని పొమ్ము.)

క. మముఁ బాసి నీవు పోయిన, యమదండముపాలఁ బడిన యట్లగుఁ బురుషో
త్తము! మముఁ గావంగదవే, విమలమతీ! యనిన నవ్విభుఁడౌ ననఁగన్.

అర్థములు. యమదండము పాలఁబడిన యట్లగున్=నరకమున యమునిచే శిక్షింపఁబడిన వారివలె నగును, ఔననఁగన్=అంగీకరింపఁగా.

తాత్పర్యము

(మమ్ము విడిచి పోయినచో నరకమున యమునిచే శిక్షింపఁబడిన వారివలె, నగును–కావున మమ్ముఁ గావుము. అని చెప్పఁగా నవ్వి శ్రీరామచంద్రమూర్తి యంగీకరింపఁగా.)

ఉ. అంతట వానరప్రవరుఁ డంగదు నిల్పి ధరాధిపత్యమం
దెంతయుఁ గోరి మీఁబడిగ నే నరుదేరఁగ నిశ్చయించి దై
త్యాంతక! వచ్చినాఁడ నను న్యాయముగాదు విడంగ నన్నుఁ దా
స్వాంతములోన నాప్లవగ వల్లభుమైత్రిఁ దలంచి యిట్లనున్. ౧౬-౩౨

అర్థములు. వానర ప్రవరుఁడు=సుగ్రీవుఁడు, ధరాధిపత్యమందున్=రాజ్య పరిపాలనమందు.

తా త్ప ర్య ము

(అంతట సుగ్రీవుఁ డంగదుని వానరరాజ్యమునకు రాజుగా నభిషేకించి మీతో వచ్చుటకు నిశ్చయము చేసికొని వచ్చినాఁడను. నన్ను విడిచిపోవుట న్యాయ్యముగాదు. అని చెప్పఁగా నా సుగ్రీవుని స్నేహమును మనస్సులోఁ దలచుకొని యిట్టులనెను.)

క. ఘనమిత్రమ! సుగ్రీవా!, నినుఁ బాసి చనంగ నొల్ల • నే నెం దేనిన్
విను దేవలోకమునకేన్, వనచరరాజేంద్ర! పరమ•పదమున కేనిన్. ౧౬-౩౩

అర్థములు. దేవలోకమునకేన్=స్వర్గమునకైనను, పరమపదమునకైనన్=వైకుంఠమునకైనను.

తా త్ప ర్య ము

(ఘనమైన స్నేహితుఁడా! సుగ్రీవా! వానరరాజా! విను, నిన్ను విడిచిస్వర్గమునకైనను, వైకుంఠమునకైనను మఱెందైనను బోవ నిష్టపడను.)

—• శ్రీరాముఁడు హనుమద్విభీషణాదులకు వరంబు లిచ్చుట •—

సీ. అని విభీషణుఁ జూచి•యజ్ఞాత్ముఁ డిట్లను, రాక్షసనాయకా!•ప్రజలు ధరణి
యుండెడిదాఁక నీ వుండుము మేనితో, లంకాపురమున ని•శ్శంకమతిని
జంద్రుండు సూర్యుండు•క్ష్మాచక్ర మెల్లను, నాకథ యెందాఁక•లోకమునను
దలఁగక యుండునం•దాఁక నీ వుండుము, రాజవై స్నేహకా•రణముఁ జేసి

ఆ. పలికినాఁడ నీవు • పాలింపు నాయాజ్ఞ, బడులు పలుకవలదు•ప్రజల నేలు
ధర్మ మాచరింపు తలఁగకు•మందుండి యేమి చెప్పువాఁడ•నింక నీకు. ౧౬-౩౪

తా త్ప ర్య ము

(అని విభీషణుని జూచి రామచంద్రమూర్తి యిట్లనెను. రాక్షసరాజా! ప్రజలు భూమి యెందాఁకనుండునో యందాఁక నీవు శరీరముతో లంకాపట్టనము జంకులేక యుండుము. చంద్రుఁడు, సూర్యుఁడు, భూలోకమంతయును, నా కథ యెంతవఱకు స్థిరమై యుండునో యందాఁక నీవు రాజువై యుండుము. నీయందలి స్నేహముచేఁ జెప్పితిని-నేను జెప్పినట్లు చేయుము-మాటాడవలదు-ప్రజలను బరిపాలనము చేయుము. ధర్మమాచరింపుము-ధర్మము తప్పకుము- ఇఁక నీకు నేనేమి చెప్పుదును?)

క. స్వారాణ్ముఖ సకల సుధా,శనులు కారాధనీయు•ననిశం బిక్ష్వా
క్వారాధిత కులదైవము, నార జగన్నాథు నీవు నర్చింపు తమిన్. ౧౬-౩౫

అర్థములు. స్వారాణ్ముఖ=ఇంద్రుఁడు మొదలుగాఁ గల, సకలసుధాహారుల కున్=దేవతల కందఱకు, ఆరాధనీయున్ = పూజింపఁ దగిన వానిని, ఇక్ష్వాక్వారాధిత=ఇక్ష్వాకుని చేఁ బూజింపఁబడిన, కులదైవము=ఆయనవంశము పాలి వేల్పు, జగన్నాథున్=విష్ణువును, ఈయనయే శ్రీరంగనాథుఁడు.

'ఇత్యుక్త్వాథ స కాకుత్థ్సః స్వార్చ్యా విష్ణుం సనాతనమ్,
శ్రీరంగశాయినం సౌమ్య మిక్ష్వాకుకులదైవతమ్,
సుప్రీతః ప్రదదౌ తస్మై రామో రాజీవలోచనః' పాద్మపు.

ఇట్లు చెప్పినవాఁడై రామచంద్రమూర్తి విభీషణు నందలి ప్రీతిచే తానారాధించుచున్న సనాతనుఁడగు విష్ణువు విగ్రహమును శ్రీరంగశాయిని నిక్ష్వాకు వంశము వారి యిలువేల్పును నిచ్చెను అని యర్థము. బ్రహ్మ విభీషణున కమరత్వ మిచ్చుటచే దానిని గౌరవింప విభీషణు నిలిపెను.

క. అనవుడు రాముని శాసన,మును నాత్మఁ దలంచి యసుర ♦ ముఖ్యుండౌ నం
చును గ్రహియించెను దశరథ, తనయుని వాక్యంబు వినయ♦తాత్పర్యములన్.

తా త్ప ర్య ము

(అని చెప్పఁగా రాముని యాజ్ఞను మనస్సులోఁ దలచుకొని విభీషణుఁడు మహాప్రసాదము అని రామచంద్రమూర్తి మాటను వినయము భక్తి కలిగి గ్రహించెను.)

ఉ. ఆవల రామభద్రుఁడు గు ♦ ణాంబుధి వాయుజుఁ జూచి ప్రీతితో
జీవితమందు నాశ యెడ ♦ సేయకు, మానకుమా ప్రతిజ్ఞ, యీ
భూవలయంబునందుఁ గపి ♦ పుంగవ! మత్కథ యెంతదాఁకఁ బెం
పై విలసిల్లు నందనుక ♦ హాయి రమింపుము మద్వచఃస్థితిన్. ౧౬౩౮

అర్థములు. జీవితమందు నాశ=బ్రదుక వలయునను కోరిక, ఎడ సేయకు= వదలి పెట్టకుము, ప్రతిజ్ఞ=నాకథ లోకములో నుండునంత వఱకు నుండఁగోరిన నీ ప్రతిజ్ఞ.

తా త్ప ర్య ము

(ఆవల గుణసముద్రుఁడు రామభద్రుఁ డాంజనేయునిఁ జూచి, ప్రేమతో బ్రదుకవలయునను కోరిక వదలి పెట్టకుము. నాకథ లోకములో నుండునంతవఱకు నుండగోరిన నీ ప్రతిజ్ఞ మానవలదు. వానరశ్రేష్ఠా! యెంతదాఁక నా కథ యతిశయమై విలసిల్లునో యంతదాఁక నామాటప్రకారము హాయిగా నానందింపుము.)

చ. అనవుడుఁ బావమాని విన ♦ యంబు దొలంకఁగ హర్ష వార్ధిలో
మునుఁగుచు విన్నవించెఁ గడు ♦ పుణ్యము త్వత్కథలోకమందుఁ బా
వనగతి నుండుదాఁక ధర ♦ వర్తిలుచుందు భవన్నిదేశముం
గొని యన జాంబవంతు రఘు♦కుంజరుఁ డట్ల వచించి యావలన్. ౧౬౩౯

తాత్పర్యము

(అని చెప్పఁగా నాంజనేయుఁడు వినయాతిశయమున నానందసాగరమున మునుఁగుచు పుణ్యము. పుణ్యము మీకథ లోకములోఁ బావనమై యుండునందాఁక మీ యాజ్ఞ ననుసరించి భూమియందుండెదను. అని పలుకఁగా రామచంద్రమూర్తి జాంబవంతునితోఁ గూడ నట్లే చెప్పి తరువాత,)

తే. మైందు ద్వివిదుని నమ్మాడ్కి • నందలించి,
బ్రహ్మసుతునితోడి యేవురఁ • బలికెనిట్లు
ధరణిఁ గలివేళ ప్రాప్తించు • దాఁక మీరు, జీవములతోడ నుండుఁడీ • క్షేమముగను.

వీరు ద్వాపరాంతమున మరణించిరి.

తాత్పర్యము

(మైంద ద్వివిదుల కట్లే చెప్పి జాంబవంతునితో నైదుగురను నీ విధముగానే చెప్పెను. కలివచ్చునందాఁక భూమిమీఁద జీవములతో క్షేమముగానుండుఁడు.)

తే. అనుచు వచియించి తక్కిన • వనచరాళి, భల్లుకంబులఁ గని మీరు • వలచినట్ల
రండు నాతోడ నని పల్కి • రాత్రిగడిపి తరణియుదయింప నిజపురో • ధసునిఁ జూచి.

తాత్పర్యము

(అనుచుఁ బలికి తక్కిన క్రోఁతులగుంపును, ఎలుఁగులను జూచి మీరు కోరిన ప్రకారము నాతో రండని చెప్పి యారాత్రి గడపి ప్రొద్దుపొడువఁగాఁ దన పురోహితునిఁ జూచి.

—• శ్రీరాముఁడు సకలప్రాణులతో మహాప్రస్థాన మేగుట •—

సీ. అగ్రజాతులతోడ • నగ్నిహోత్రంబులు, తొలుతను బోనిమ్ము • త్రోవలందు
వాజపేయచ్ఛత్ర • వర్గంబు వఱలుత, మన వసిష్ఠుం డట్ల • యాచరించి
వైదికవిధి మహా • ప్రస్థానికం బగు, కార్యము దీరిచి • కడమవడక
యుండ శ్రీరామచం • ద్రుండు సూక్ష్మాంబర, ధారి యై దర్భలఁ • దాల్చి వ్రేళ్ళ
తే. సందులనుమాటలాడక • స్వయముగాఁగ,
బరమమగుబ్రహ్మమంత్రంబుఁ • బఠన మొనర
జేసికొను చాత్మలోన ని • శ్చేష్టుఁ డగుచు, మార్గసుఖములపై మది • మరగనీక.

అర్థములు. అగ్రజాతులతోడ=బ్రాహ్మణులతో, మహాప్రస్థానము=మహాప్రయాణము, దీనిని బూనినవారు త్రోవలోఁ గూర్చుండరాదు. నిద్రాహారాదులు లేవు, దోవలో నీళ్ళువచ్చిన నిప్పులు వచ్చినను దానిలోఁబడి పోవలయునే కాని భయపడరాదు. కలికాలమున నిది నిషిద్ధము. సూక్ష్మాంబర ధారియై=సన్నని వస్త్రము ధరించినవాఁడై, బ్రహ్మమంత్రంబు=ప్రణవము నిశ్చేష్టుఁడు=నడచుట తప్ప మఱి యే కార్యము చేయనివాఁడు, ఇంద్రియముల నియమించినవాఁడు,

మార్గసుఖముల పై=ఇటు పోయిన ఱాలు కాళ్ళ తగులునే, అటు పోయిన బాగుండునే యను విచారము లేక

తాత్పర్యము

(బ్రాహ్మణులతో నగ్నిహోత్రములు మొదటఁబోనీయవలెను. త్రోవలందు వాజపేయ ఛత్రసమూహముండవలెను. అని చెప్పఁగా వసిష్ఠుడట్లేచేసి, మహాప్రయాణమునకు వైదికవిధానముగాఁ జేయవలసిన పనులు లోపము లేకుండఁ గావించి యుండఁగా, శ్రీరామచంద్రమూర్తి సన్నని వస్త్రము ధరించి, వ్రేళ్ళ దర్భలనుదాల్చి స్వయముగా నడుమ నడుమ మాటలాడక, శ్రేష్టమగు ప్రణవము మనస్సులో జపముచేసి యింద్రియముల నియమించి దారి సుఖమును జూడక.)

సీ. దీప్యమానార్కునిఁదిరస్కరించెడి కాంతిఁ, దనమందిరము వీడిఁతరలుటయును
అపసవ్యదిశఁ బద్మఁహస్తయై శ్రీదేవి, హ్రీదేవి భజియింపఁ నెడమవంక
సంహారశక్తియుఁఁజనఁగ మున్నుగ శర, చాపముల్ పూరుషఁరూపములను
సకలాయుధావళుల్ఁసరవినిగొలువనంగ, బ్రాహ్మణాకృతులతోఁఁబరఁగ శ్రుతులు

తే. సర్వరక్షిణి గాయత్రిఁచనఁగ వెంట
నోంకృతియును వషట్కార ఁ మొప్పుచుండ
బ్రాహ్మణులు ఋషులును రామఁభద్రు వెంటఁ
జనిరి వాకిండ్లు దెఱచిన ఁ స్వర్గమునకు. ౧౬౪౨

అర్థములు. దీప్యమానార్కునిన్=ప్రకాశించుసూర్యుని, అపసవ్యదిశ=కుడివైపు, పద్మహస్తయై=పద్మమును జేతిధరించినదై, శ్రీదేవి=లక్ష్మిదేవి, హ్రీదేవి=భూదేవి, 'హ్రీశ్చతే లక్ష్మీశ్చపత్నౌ' యని శ్రుతి, సంహారశక్తి=రౌద్రశక్తి. రూపము ధరించి ముందుపోఁగా, శరచాపములు=బాణములు,విండ్లు,పురుషరూపములను=మగవారి యాకారములతో,బ్రాహ్మణాకృతులతో=బ్రహ్మణ రూపములతో, శ్రుతులు=వేదములు, సర్వరక్షిణి=సర్వవేద తన్మాలయజ్ఞ, యజ్ఞాధికృతా శేషజగద్రక్షిక-ఇట్లు చెప్పుటచే హైరణ్యగర్భశక్తియు సేవించుట చెప్పఁబడెను. వషట్కారము=ఇది కర్మయోగమును సూచించుచును, స్వర్గమునకు=సాంతానిక లోకము మొదలు వైకుంఠపర్యంతముగల లోకములకు వారి వారి యోగ్యతాను సారముగ.

తాత్పర్యము

ప్రకాశించు సూర్యుని కాంతితోఁ దన యిల్లు వదలి బయలుదేఱఁగా కుడిప్రక్క శ్రీమహాలక్ష్మియు నెడమప్రక్క భూదేవియు ముందుప్రక్క రుద్రశక్తియు, వెంబడి వేదములు, గాయత్రి, ప్రణవము, వషట్కారము పోఁగా విల్లు బాణములు సమస్తాయుధములు పురుషరూపములు ధరించిరాఁగా బ్రాహ్మణులు

ఋషులు తెఱవఁబడిన వాకిండ్లుగల సాంతానికాది లోకములకు వారి వారి యోగ్యతకొలఁది పోవ వెంట నంటిరి.

తే. దశరథాత్మజుతోడ నంతఃపురంబు, సతులు బాలురతో వృద్ధ•తతులతోడ
వర్షధరకింకరులతోడ•వారిదాసి, మూకతో వెంట నంటిరి•ముదముగూర.

అర్థములు. అంతఃపురంబు సతులు=అంతఃపురమునను్న స్త్రీలు, వర్షధర=కావలికాచు నపుంసకులతో.

తాత్పర్యము

(రామచంద్రమూర్తితో నంతఃపురమున నున్న స్త్రీలు, బాలురు, ముదుసళ్ళు కావలికాచు నపుంసకులతో దాసీజనముతో సంతోషముగా వెన్నంటి పోయిరి.)

ఆ. సాగ్నిహోత్రు లగుచు•నాత్మపత్నులతోడ, భరతుఁడును సుమిత్ర•పట్టి రాము
వెంటఁ జన మహాత్మ•బృందంబు సుతసతీ వహ్నియుక్తి జనియెఁ•బరమరక్తి.

అర్థములు. సాగ్నిహోత్రులు=అగ్నిహోత్రముతోఁ గూడినవారు, ఆత్మపత్నులతోడన్=తమ భార్యలతోడ, శత్రుఘ్నుఁ డొంటి రథమున వచ్చెనని ముందు చెప్పినచోట భార్యాభర్తలిరువు రొక్కరథముననే కూర్చుండి వచ్చిరని గ్రాహ్యము. ఇందు భరతశత్రుఘ్నుల భార్యలు చెప్పఁబడిరి గాని యూర్మిళాదేవి చెప్పఁబడలేదు. కావునను రామరాజ్యమందు వైధవ్యము లేదు. కావున నామె భర్తతోడఁ బోయెనని గ్రహింపనగు, మహాత్మబృందంబు=శ్రీరామచంద్రమూర్తి యందే మనస్సునిలిపిన వారగుటచే మహాత్ములగువారి సమూహము, సుత సతి వహ్నియుక్తిన్=కొడుకులతో, భార్యలతో, నగ్నులతో, పరమరక్తిన్=మిగుల ననురాగముతో, దీనికే పరభక్తియని పేరు. దీనివలన మోక్షప్రాప్తికి భక్తియే యుపాయము. పండితుఁడైనను, పామరుఁడైనను, చేతనమైనను, అచేతనమైనను భగవద్దర్శన స్పర్శన సల్లాపనామ కీర్తనాదులలో నేది లభించినను, ముక్తి గాంచును. వీరిని గర్మబంధము లేమియుఁ జేయఁజాలవు.

తే. సచివవర్యులు భృత్యులు•సపశుపుత్ర, బాంధవులుగాఁగ శ్రీరామ•భద్రు వెంట
రాగమునఁబోయి రిట్టులు•ప్రకృతులెల్ల, రామగుణరక్తిఁ జనిరి ని•ర్మలమనీష.

అర్థములు. నిర్మలమనీషన్=కల్మషములేని మనస్సులతో, రామచంద్రమూర్తి వెంటఁ బోగలిగెనను సంతోషము తప్ప నితర విచారము వారికిలేదయ్యెనని గ్రాహ్యము.

తాత్పర్యము

(మంత్రిశ్రేష్ఠులు. పరిచారకులు, పశువులు, కొడుకులు చుట్టాలు వీరితో ననురాగము మీఱ శ్రీరామచంద్రమూర్తి వెంటఁజనిరి. పురవాసులు మనస్సులం

దెట్టి విచారము లేక రామచంద్రమూర్తి వెంటఁబోఁగలిగెనను సంతోషముతోఁ బోయిరి.)

ఉ. అందఱు స్నానమాడి శుచులై పరిహృష్టమనంబులం గపుల్
సందడిచేయుచుం గిలకిలధ్వను లారఁగ రాము వెన్కొనన్
మందునకైన నందు రుచిమాలిన వాఁడును దుఃఖితుండు సి
గ్గొందెడివాఁడు దీనుఁడెదనొల్లనివాఁడును లేఁ డొకండునున్. ౧౮-౪౮

అర్థములు. రుచిమాలినవాఁడు=మరణభయముచే కాంతి హీనుఁడగువాఁడు, దుఃఖితుండు=పోవలసి వచ్చెనే యని కష్టపడువాఁడు.

తాత్పర్యము

(అందఱు స్నానముచేసికొని పరిశుద్ధులై పరిపూర్ణానందముతో వానరులు కిలకిల ధ్వనులచేయుచుఁ గోలాహలముగా రాముని వెనువెంటఁజనఁగా నందు మరణభీతి వెలవెలఁబోవువాఁడు, బోవలసివచ్చెనే యని కష్టపడువాఁడు, సిగ్గుపడువాఁడు, దీనుఁడైనవాఁడు నిష్టపడనివాఁ డొకఁడైన మందునకైన లేఁడయ్యెను.)

క. అందఱు నద్భుతమగు నానందంబున నుల్లసిలిరి నవ్యాగతి నమ
చ్ఛందను వెంబడి నాతని, సందర్శింపఁగను వచ్చు జనపదజనముల్. ౧౮-౪౯

అర్థములు. నమచ్చందను=నమస్కరించు వారికిఁ దాపమును చందనము వలె హరించువాని.

తాత్పర్యము

రామచంద్రమూర్తిని జూడవచ్చిన పల్లెటూళ్ళవారు కూడ నాయనవెంట సంతోషముతోఁ బోయిరి.

క. నాకారోహణమతిచే, నేకాంక్షయు లేక చనిరి ఋక్షనిశాటా
గౌకసులును బురవాసులు, నేకవిధపుఁ బరమభక్తి నేగిరి శ్రద్ధన్. ౧౮-౫౦

అర్థములు. నాకారోహణమతిచేన్ = మోక్షమునకుఁ బోవు కోరికచే, ఏకాంక్షయు=దేనియందును గోరిక.

తాత్పర్యము

(మోక్షమునకుఁ బోవు కోరికచేత దేనియందును కోరికలేక ఎలుఁగులు, రాక్షసులు, వానరులు, పురజనులు నొకవిధమైనఁ బరమభక్తి శ్రద్ధలతోఁబోయిరి.)

చ. పురిని నగోచరంబులగు భూతములున్ రఘువంశవర్ధనున్
సరసతఁగన్న ప్రాణులును స్థావరముల్ రఘురాము వెన్కొనెన్
బురమున నెద్ది శ్వాసమును బుచ్చెడి దొక్కటియైన లేక శ్రీ
శరుబడి నేఁగె జిత్తముల గాటపుభక్తిని నిల్పి రాముపై. ౧౮-౫౧

తాత్పర్యము

అయోధ్యయందుఁ గంటికిఁ గానవచ్చు ప్రాణులేగాక కానరానివి కూడ, రాముని ప్రేమతోఁ జూచిన స్థావరములుగూడ రామచంద్రమూర్తి వెంట బోయెను. ఆ పురమందు శ్వాసము విడుచునది యొక్కటియైన లేక యన్నియు రామచంద్రమూర్తియందు దృఢమైన భక్తి నిలిపి యాయనవెంటఁ బోయెను.

—* బ్రహ్మాదులు శ్రీరాముని దర్శింప వచ్చుట *—

సీ. రామచంద్రుఁడు జన◆స్తోమంబు వెన్కొన, నధ్యర్థయోజనం◆బరిగి యచటఁ
పశ్చిమముఖ మయి◆ప్రవహించు సరయువు, పుణ్యజలంబులఁ◆బోలఁ గాంచి
యాకులావర్త మా◆నంబులం దిగి, సప్రజుఁ డగుచు దళి◆త్స్థలముఁ జేర
నాముహూర్తంబున ◆ నఖిలలోకపితామ,హుండు విరించి ది◆వౌకసులును

తే. ఋషులు గొలువంగ స్వర్గంబు ◆ నేగుదెంచె
రాముఁ డుండెడిచోటికిఁ ◆ గ్రన్ననచ్చె
గగనతల మెల్ల నిండారఁ ◆ గలితకాంతు
లైనయాకాశయాన వి◆తానములను. ౧౬౫౦

అర్థములు. జనస్తోమము=జనసమూహము, వెన్కొనన్ = వెంబడిరాఁగా, అధ్యర్థయోజనము=ఒకటిన్నర యోజనము, పశ్చిమ ముఖము = పడమటిదిక్కు, పుణ్యజలంబులన్=స్నానముచేసిన వారికిఁ బుణ్యము కలిగించునీళ్ళను, ఆకుల+ఆవర్తము=నీటిసుళ్ళచేఁ గలఁత చెందినది, అంబువులన్=నీటియందు, సప్రజుఁడు=ప్రజలతోఁ గూడినవాఁడు, విరించి=బ్రహ్మ, దివౌకసులు=దేవతలు, వృద్ధియతి-స్వర్గంబు=పరమపదము, ఏగుదెంచెన్=పోవుటకొఱకు, క్రన్ననన్=త్వరగా, ఆకాశయాన=విమానముల, వితానములను=సమూహములచే.

తాత్పర్యము

ఈ ప్రకారము జనులు తన్ను వెంబడించి రాఁగా శ్రీరామచంద్రమూర్తి యొకటిన్నర యామడ దూర మేగి యచట పడమటి ముఖముగాఁ బాఱుచున్న సరయూ నదియొక్క పుణ్యప్రదజలంబుల సుళ్ళచే వ్యాకులమైయున్న జలంబులం గాంచి జనులతో నానీళ్ళలో దిగఁగా ఆసమయమందే సమస్తలోకములకుఁ దాత యగు బ్రహ్మదేవుఁడు దేవతలు ఋషులు గొలువఁగఁ బరమపదము పోన సిద్ధపడి యుండు శ్రీరామచంద్రమూర్తి యున్న స్థలమునకు విమానకాంతులచే నాకాశము వ్యాపింపఁగా త్వరగా వచ్చెను.

క. జ్యోతిర్భాతం బగు నా ద్యోతలము స్వయంప్రభామ ◆ రోత్కరపుణ్య
వ్రాతమ్ములచే సుశ్రీక్షితం బయి వెలిఁగె జనము◆వెఱఁ గొందంగన్. ౧౬౫౧

అర్థములు. జ్యోతిర్భూతము=కాంతి మయము, ద్యోతలము=ఆకాశప్రదేశము, స్వయంప్రభా=ఇతరకాంతుల సహాయము లేక తమంతట తామే వెలుఁగు, అమరోత్కర = దేవతాసమూహముల యొక్కయు, పుణ్య=పుణ్యాత్ముల యొక్కయు, వ్రాతమ్ములచేన్=సమూహములచే, సుశ్రీ=మంచిశోభచే, స్ఫీతంబయి=ప్రకాశించినదియై. వెఱఁగు=ఆశ్చర్యము.

తా త్ప ర్య ము

కాంతిమయమైన యాకాశము! సహజములైన కాంతి సమూహములు గల దేవతల సమూహముచే జూచు ప్రజలు వెఱఁగు పడునట్లు ప్రకాశించెను.

క. దైవతకరముక్తంబై, వావిరి సుమవృష్టి గురిసెఁ బవనుండును సౌ
ఖ్యావహుఁడై శీతలుఁడై, పావనుఁడై పుణ్యగంధవహుఁడై వీచెన్ ౧౬౫౨

అర్థములు. దైవత=దేవతలయొక్క, కర=చేతులచే. ముక్తంబై=విడువఁబడినదై, వావిరి=విస్తారముగ, సుమవృష్టి=పూలవాన, సౌఖ్యావహుఁడై=సుఖము గలిగించువాఁడై, శీతలుఁడై=చల్లనివాఁడై, పావనుఁడై=పవిత్రుఁడై, పుణ్యగంధవహుఁడు=పుణ్యకరమైన వాసనగలవాఁడై, వీచెన్=విసరెను.

తా త్ప ర్య ము

దేవతలు పూలవాన విస్తారముగఁ గురియించిరి, చల్లని కమ్మనివాయువు సుఖకరుఁడై పవిత్రుఁడై వీచెను.

తే. తూర్యరావంబు లెల్లెడఁ దోరముగను, వేల్పుఁగన్నెలు గంధర్వవిసరములును
సంకులంబుగ శ్రీరామచంద్రుఁ డపుడు, పాదచారియై సరయువు వారిఁ జొరగ.

అర్థములు. తూర్యారావంబులు = వాద్యధ్వనులు, తోరముగను=విశేషముగ, స్థూలశబ్దభవము తోరము, విసరములు=సమూహములు, పాదచారియై=కాలినడక గలవాఁడై.

తా త్ప ర్య ము

విస్తారముగ వాద్యధ్వనులు మొరసెను. దేవతాస్త్రీలు గంధర్వసమూహములు గుంపులుగఁ గలసియుండిరి. అప్పుడు శ్రీరామచంద్రమూర్తి సరయూ జలంబులందుఁ బ్రవేశింప (మీఁది పద్యములోని జతనంబుసేయఁగ ననుటతో నన్వయము.)

సీ. జతనంబు సేయంగ సరసిజసంభవు, డాకసంబున నిల్చి యనియె నిట్లు
రా రమ్ము విష్ణు! భద్రం బగు మాయదృష్టంబున వచ్చితి సాధురక్ష
సురనిభు లగు భ్రాతృ నరులతో నీకోరు, విధిని బ్రవేశింపు స్వీయతనువు
వైష్ణవం బగుమహా వర తేజమో సనా, తన మగునభ మో నీ మనసుపగిది
తే. నీవ గతివెల్ల జగతికి నీదుమాయ, శ్రీవిశాలాక్షి పూర్వప రిగ్రహంబు
గాక యెవ్వఁడు తెలియంగఁ గలఁడునిన్ను, నఘచయవిభంగ! విమలద యాంతరంగ

అర్థములు. జతనంబు=ప్రయత్నము యత్నశబ్దభవము, జతనము, సరసిజ సంభవుండు=బ్రహ్మ, రారమ్మ=రమ్మురమ్ము, ఆదరణమున ద్విరుక్తి, సాధు రక్ష=భక్తుల రక్షించువాఁడా, స్వీయతనువు=నీ దేహమును,సనాతనము, నిత్యము, శాశ్వతము, నభము=ఆకాశము, ఇది పరమాకాశము. సర్వశరీరులున్ విగమ సంగతిఁజెంది విశీర్యమాణులై, పర్వినచో నభంబుగతి బ్రహ్మముతోఁ జెడకుండు నెప్పుడున్'' శ్రీ భాగ॥ఆకాశో బ్రహ్మఉపమాయ=మా+యా=యా+మా=ఎవతె లోకములకుఁ దల్లియో యామె మాయ, ప్రకృతి కధిష్ఠానదేవత 'కాంతస్తే పురుషోత్తమః ఫణిపతి శ్శయ్యాసనం వాహనం, వేదాత్మా విహగేశ్వరో యవనికా మాయా జగన్మోహినీ॥ చతుశ్శ్లోకి. ఈమెయే లక్ష్మీదేవి అయినను భూమి, సూర్యుడు లోనగు శబ్దములచేఁ దదధిష్ఠాన దేవతలు బోధింపఁబడునట్లు మాయా ప్రకృతి శబ్దములచేఁ దదధిష్ఠాన దేవత లక్ష్మిబోధింపఁబడును. కావుననే 'మాయాంతుప్రకృతిం విద్ధి మాయినంతు మహేశ్వర'మ్మని శ్రుతి. మాయా ప్రకృతి. దానిని గలవాఁడు మాయి, భగవంతుఁడు అటుగాక మాయ జడప్రకృతి యగునేని శ్రీవిశాలాక్షి యను విశేషణము నిరర్థక మగుచున్నది. జడప్రకృతికి కన్నులు లేవుగదా. అదియును గాక నీ పూర్వ పరిగ్రహము విశాలాక్షిగాక యెవఁడు తెలియఁగలఁ డన్నప్పు డామెకు జ్ఞానము చెప్పఁబడెను. అచేతన ప్రకృతి జ్ఞానము గలది కాదుకదా. భగవత్తత్త్వము శ్రీభగవతి లక్ష్మీదేవిగాక మఱియెవరు పూర్ణముగఁ దెలియఁగలరు. అఘచయ విభంగ=పాపసమూహముల నాశముచేయువాఁడా, విమలదయాంతరంగ=నిర్మలమైన దయతోఁగూడినవాఁడా.

తాత్పర్యము

ప్రయత్నము సేయఁగా బ్రహ్మ యాకాశముననిల్చి యిట్లనియె. రమ్ము రమ్ము విష్ణుదేవా! నీకు మేలగును గాక. మా యదృష్టము కొలఁది భక్తరక్షకా! వచ్చితివి. దేవతలతో సమానములయిన తమ్ములతో నీయిష్టప్రకారము వైష్ణవమైన మహాతేజస్సునందో, నిత్యము శాశ్వతమగు పరమాకాశమందో నీ దేహమునఁ బ్రవేశింపుము. ఇవి యన్నియు నీ దేహములేకదా! సమస్త ప్రపంచమునకు నీవే గమ్యస్థానము. నీవు పూర్వమునఁ బరిగ్రహించిన శ్రీవిశాలాక్షి లక్ష్మీదేవి తప్పఁ దక్కిన వారెవ్వరు నీ తత్త్వము తెలియఁగలరు?

తే. అక్షయుండ వచింత్యుండ వజరుఁడవును, నీవు కోరిన చోఁ బ్రవేశింపు మతనువుఁ
జొరుమ యెద్దానినైన వందించుచు విరించి ప్రార్థనముసేయ శ్రీరామభద్రమూర్తి.

అర్థములు. అక్షయుండవు=నాశములేని వాఁడవు, అచింత్యుండవు=ఇట్టి వాఁడివని మనస్సుచేనైనఁ జింతింప సాధ్యపడని వాఁడవు, అజరుఁడవు = ముసలితనము లేనివాఁడవు, 'అయ మాత్మా అపహతపాప్మా విజరో విమృత్యుర్విశోకో విజిఘత్సోఽపిపాస స్సత్యకామ స్సత్యసంకల్ప'యను శ్రుతి నిట ననుసంధించునది.

తాత్పర్యము

శ్రీరామచంద్రా! నీవు నిత్యుఁడవు, శాశ్వతుఁడవు, సనాతనుఁడవు, కావున నపక్షయ మరణాదులు లేనివాఁడవు. నీ విట్టివాఁడ వని యూహింప మనస్సుచే నైన సాధ్యపడదు మరణము లేకున్న ముసలితనము లేనివాఁడవా యనిన నిర్వికారుఁడవగుట యదియును లేనివాఁడవే. ఇది యదియనక సర్వము నీ శరీరము కావున నీయిష్టప్రకార మేశరీరమందైనఁ బ్రవేశింపుము అని బ్రహ్మ వేఁడఁగా శ్రీరామచంద్రమూర్తి.

—శ్రీరాముఁడు సానుజుఁడై సశరీరుండై వైష్ణవతేజంబుఁ జొచ్చుట—.

క. తా నిశ్చయించి మనమున, సానుజుఁ డై యపుడు చొచ్చెఁ సశరీరుండై
మానితవైష్ణవతేజము, మానసముల వేల్పులెల్లఁ మఱి మఱి పొగడన్.

అర్థములు. సానుజుఁడై=భరత శత్రుఘ్నులతోడ, సశరీరుండై=దేహముతోఁ గూడినవాఁడై. భరతశత్రుఘ్నులు రామచంద్రమూర్తి దేహములతో వైష్ణవతేజము ప్రవేశించి రనుటచే వారిశరీరములు ప్రాకృతములు గావని స్పష్టపడియె. ప్రాకృత శరీరములు అప్రాకృతమందుఁ గలియఁ జాలవు కదా.

తాత్పర్యము

మనస్సులో నిశ్చయించికొనినవాఁడై తమ్ములతోడ దేహముతో వైష్ణవ తేజస్సునఁ బ్రవేశించెను. దేవతలందఱుఁ దమ మనస్సులందు విశేషముగఁ బొగడిరి.

ఆ. అంత విష్ణుమయునిఁ నఖిలలోకేశ్వరు, దేవదేవు నఖిలఁ దేవతాళి
సాధ్యులును మరున్నిఁ చయములుఁ బూజించె, సేంద్రశుక్రమగుచుఁ హితముదోఁప.

అర్థములు. విష్ణుమయుని=విష్ణు స్వరూపుని, అఖిలలోకేశ్వరున్=సమస్త లోకములకుఁ బ్రభువును, దేవదేవున్ = దేవత లనఁబడు వారికిని దేవుఁడు, "దేవానాం దానవానాంచ సామాన్య మధిదైవత"మ్మని ప్రమాణము, అఖిలదేవతాళి=సమస్తదేవతలసమూహము,మరున్నిచయములును=మరుత్తుల సమూహములును, సేంద్రశుక్రము=ఇంద్రునితోను శుక్రునితోను గూడినవారై.

తాత్పర్యము

ఆ సిమ్మట ఇంద్రునితో శుక్రునితోఁ గూడిన దేవతలు సాధ్యులు మరుత్తుంబు సర్వలోక ప్రభువు, దేవాది దేవుఁడు నగు విష్ణుస్వరూపుని పొగడిరి.

ఇచ్చట శుక్రుఁడు చెప్పఁబడుట దానవాదుల కుపలక్షణము. కావుననే క్రింది పద్యమున దైత్యదానవులు చెప్పఁబడిరి.

తే. దైత్యదానవ యక్షగంఁ ధర్వగరుడ, నాగదివ్యర్షు లప్సరఃఁపూగములును
బావనం బయ్యెదివము సఁర్వంబుహృష్ట, పుష్టమయ్యెనుగూరెమాఁయిష్టములును.

తాత్పర్యము

అప్పుడు దైత్యులు దానవులు యక్షులు గంధర్వులు గరుడులు నాగులు దివ్యర్షులు అప్సరల సమూహములు స్వర్గమున సీవు మరలఁ బ్రవేశించుటచే నది పవిత్రమయ్యెను. సమస్తము సంతోషించినది. పుష్టిగొనినది యయ్యెను. మాకోరికలు నెఱవేఱెను.

చ. అని పొగడంగ విష్ణువు స్వయంభువుఁ గాంచి వచించె సువ్రతా!
జనములఁ గంటె యిందఱు నచంచలభక్తిని స్నేహయుక్తులై
యనుగమనంబుఁ జేసి తమప్రాణము లిచ్చిరి నాకు మద్వియు
క్తిని సహియింపరైరి, నిరతిన్ భజితవ్యులు వీర లెల్లరున్. ౧౭౬౯

అర్థములు. స్వయంభువున్=బ్రహ్మను, అచంచలభక్తిన్=చలింపని భక్తిని, అనన్యభక్తిని, స్నేహయుక్తులై=నాయందలి ప్రేమతోఁ గూడినవారై, అనుగమనంబు=వెంటవచ్చుట, మత్+వియుక్తిని=నన్ను విడనాడుటను, నిరతిన్=నిండు ప్రేమతో, భజితవ్యులు=సేవింపబడఁదగినవారు, "యే యథా మాం ప్రపద్యంతే తాంస్తథైవ భజామ్యహమ్"-ఎవరు నావిషయమై యెట్టిభక్తి, జ్ఞానము గలవారగుదురో నేను వారినట్లు భజింతును భ. గీ.

తాత్పర్యము

ఈ ప్రకారము స్తోత్రముచేయఁగా విష్ణుమూర్తి బ్రహ్మనుజూచి యిట్లు చెప్పెను నా మత మనుసరించి మంచి నియమము గలవాఁడా! యీ ప్రజలను జూచితివా? వీరందఱు నాయందు స్నేహముచే నా వెంట వచ్చి నన్ను విడనాడఁ జాలక నాకై ప్రాణత్యాగము చేసిరి. అచంచలమై యనన్యమై పరమభక్తి యిదియేకదా. ఎవరు నా విషయమున నెట్లు వర్తింతురో వారి విషయమున నేను నట్లే వర్తింతును. కావున వీరందఱు నాకు సేవ్యులే.

—ఁ బ్రహ్మ సమస్త జనంబుల నుత్తమలోకంబున నుంచుట ః—

క. ఆకతమున వీరలఁ దగు, లోకంబున నిలుపు మనిన ః లోకగురుండీ
లోకులు సంతానం బను,లోకంబున నుండువారుఃలోకారాధ్యా! ౧౭౭౦

అర్థములు. ఆకతమునన్=ఆకారణముచే, లోకగురుండు=బ్రహ్మ.

తాత్పర్యము

ఆ కారణముచే వీరి నందఱను యోగ్యమైన లోకంబుల నిలుపుమని చెప్పఁగా బ్రహ్మయు వీ రందఱు సంతానమను పేరు గల లోకంబున నుందురు.

క. ఈవిధి నిను దిర్యక్కులు. భావించిన యేని నీదుఃభక్తిని దనువుల్
బో విడిచిన యే నవ్వియు, వావిరి సంతానికమునఃవఱలును దేవా! ౧౭౭౧

అర్థములు. తిర్యక్కులు=పశువులు, పక్షులు, తనువుల్=దేహములు.

తాత్పర్యము

వీరు మాత్రమే కారు, వీరివలెఁ బశుపక్ష్యాదులైనను నిన్నుఁ దలంచుచుండి నను, నీకై దేహములు వదలినను నవికూడ సాంతానిక లోకంబున నుండఁగలవు.

ఆ. బ్రహ్మలోకమునకుఁ బైనిఖిలబ్రహ్మ, గుణ సమేత మగుచుఁ గోఁలు నదియు
వానరాచ్ఛవరులఁ వారల తొల్లింటి, సురలరూపములను జొచ్చువారు.

అర్థములు. నిఖిల బ్రహ్మగుణ సమేతము=పరిపూర్ణ బ్రహ్మగుణములతోఁ గూడినది, భోగమాత్ర సామ్యలింగాత్తను బ్ర॥ సూ॥ ప్రకారము ముక్తులు పర బ్రహ్మ గుణములు(జగద్వ్యాపారము తప్ప) గలిగియుందురు, వానరాచ్ఛవరులు= వానర శ్రేష్ఠులు భల్లూక శ్రేష్ఠులు.

తాత్పర్యము

ఏయే వానరులు భల్లూకములు దేవతల యంశమున జనించిరో వారాయా దేవతలయందుఁ బ్రవేశింతురు. తక్కిన ప్రజలు బ్రహ్మలోకమునకును పైఁగానుండు సాంతానికలోకమున పరబ్రహ్మ భోగగుణములు గలవారై యుందురు.

క. వానరపతి సుగ్రీవుఁడు, భానునిమండలముఁ జొచ్చు వాఁడు మహాత్మా!
వానరు లెల్లరుఁ బితృలను, మానుగఁ బొందెదరు విబుధ మండలి గనఁగన్.

తాత్పర్యము

వానరరాజగు సుగ్రీవుఁడు సూర్యమండలముఁ జొచ్చును. మహాత్మా తక్కిన వానరులు వారివారి తండ్రులందుఁ జొత్తురు.

సీ. అని పితామహుఁడిట్లు వినుచు చుండగఁ గోప్ర, తారతీరంబున ధరణిజనులు
సంతోషమున బాష్పజలధారఁ గన్నులు, గురియింప సరయువుఁ గ్రుంకిరపుడు
రామభక్తిని దమప్రాణము ల్విడిచిన, యెల్లప్రాణులు మేనినింద విడిచి
దివ్యయానంబులఁ దేజరిల్లుచు నేగి, రప్పుడు సరయువునందు మునిఁగి

తే. నట్టితిర్యక్సహస్రంబు లమరతేజ, మొప్ప మేనులు దివి కేగె నుత్సవముగ
ఋక్షవానరరాక్షసు లాక్షణమున, సరయువున దేహముల్విడిచనిరి దివికి.

అర్థములు. పితామహుఁడు=బ్రహ్మ, వినుచుచున్=వినఁజేయుచు, చెప్పుచు గోప్రతార తీరంబునన్=గోప్రతార మను పేరుగల రేవునందు, క్రుంకిరి=మునిఁగిరి, మేనినింద విడిచి=దేహములిచ్చటనే వదలి, రామభరతశత్రుఘ్నులు దేహముల తోనే దివ్యతేజస్సునఁ గలసి రని ముందు చెప్పఁబడిరి. తక్కిన వారందఱు తమ ప్రాకృత శరీరంబు లా నీటియందు విడిచిపోయిరి.

తాత్పర్యము

బ్రహ్మదేవుఁ డీ ప్రకారము చెప్పుచుండ లోకు లందఱు కన్నుల నానంద బాష్పములు రాలుచుండ సంతోషముతో సరయూజలంబుల మునిఁగిరి. రాము నందలి భక్తిచేఁ దమ ప్రాణములు విడిచిన వా రందఱు దేహముల నిందే విడిచి దివ్యవిమానంబులఁ గూర్చుండి పోయిరి. దీనిచేఁ బరమభక్తి ప్రపత్తులు గలవారై దేహములు విడిచిన వారికి నర్చిరాది మార్గము లేదనియుసూటిగఁ బరమ పదమునకు బోదురనియు నేర్పడు చున్నది. దీనికి వరాహపురాణ మందలి యీ వాక్యములు ప్రమాణములు.

శ్లో॥ స్థితే మనసి సుస్వస్థే శరీరే సతి యో నరః ।
ధాతు సామ్యే స్థితే స్మర్తా విశ్వరూపంచ మామిదమ్ ॥
తతస్తం మ్రియమాణంతు కాష్ఠ పాషాణసన్నిభమ్ ।
అహం స్మరామి మద్భక్తం నయామి పరమాం గతిమ్ ॥
యదా కదాచిద్వాతాదిధాతుసామ్యా దరోగతః ।
మనస్థితిః సంభవతి యః కశ్చిత్తు తదానరః ॥
స్మరేత్స్వామిత్ర సౌశీల్యవాత్సల్యాదిమహోదధిమ్ ।
అవతీర్ణం వరాహం మాం శ్రియా దీప్త గుణైర్యుతమ్ ॥
నారాయణం విశ్వరూప మజ మిచ్ఛాత్త విగ్రహమ్ ।
శ్రీమన్నారాయణస్వామిన్ అనన్యశరణస్తవ ॥
చరణౌ శరణం యాంతి ఇతిమాం యః స్మరేత్సకృత్ ।
తతస్త మితరోపాయవ్యవధానవిసర్జితం ॥
తదవస్థం మృతౌ ప్రాప్తౌ కాష్ఠపాషాణసన్నిభమ్ ।
కాష్ఠవత్తు స్వతో దేహే మనశ్చేష్టావిసర్జితమ్ ॥
ప్రబోధా సంజ్ఞంతు విలుప్త హృదయం తత ।
ఆత్మవత్స్వయ మన్యైశ్చ హితస్మరణ వర్జితమ్ ॥
ఆశ్రితేషు ప్రసుప్తేషు పురుషో యో వ్యవస్థితః ।
కామం కామం నిర్మిమాణః తేషాం జాగర్తి సిద్ధయే ॥
సోహ మాశ్రిత తంత్రాత్మా స్మరామిచ తవ స్వయమ్ ।
ఇమం మద్భోగ యోగ్యంతు కృపాపూర ప్రకాశనాత్ ॥
నయామి పరమం స్థాన మర్చిరాదిగతిం వినా ।
గరుడస్కంధ మారోప్య యథేష్ట మనివారిత ॥

దేహ మారోగ్యముగ నుండఁగా మనస్సు తన స్వాధీనమం దుండఁగా నజుఁ డను విశ్వరూపుఁడనైన నన్ను నెవఁడు స్మరించునో యట్టివాఁడు మరణ కాలమునఁ

గఫవాతాదులచే స్మృతితప్పి కొయ్యవలె రాతివలెఁ బడియుండఁగా నా భక్తుని నేను స్మరించి పరమపదమునకుఁ దీసికొని పోదును. ఒకవేళ నారోగ్యవంతుఁడై, మనస్సు స్వస్థముగా నుండువాఁడయ్యేనేని యా యవసాన కాలమున స్వామిత్వము సౌశీల్యము వాత్సల్యము లోనగు గుణములు గల నన్ను నారాయణు స్వేచ్ఛాగత శరీరుని నుద్దేశించి శ్రీమన్నారాయణస్వామీ! వేఱు రక్షకుఁడు లేని వాఁడనై నీ పాదముల శరణుచొచ్చితిని అని యొకసారి స్మరించెనేని యితరోపాయముల వదలి యా యవస్థ యందుండి కొయ్యవలె రాతివలెఁ బడియుండు వానిని గదలలేక యుండువానిని నాశ్రితపరతంత్రుఁడనగు నేను స్మరించి నా దయాప్రవాహము ప్రకాశింపఁజేయ నర్చిరాదిమార్గము వదలి గరుడుని మూఁపుపై వానిని నెక్కించుకొని యథేష్టముగ నే యడ్డము లేక పరమపదమునకుఁ దీసికొని పోదును.

ఆ కాలమున సరయువున మునిఁగిన వేలకొలఁది పశుపక్ష్యాదులు దివ్య కాంతులతో సంతోషముతో పరమపదమునకుఁ బోఁగా వానరులు రాక్షసులు ఎలుఁగులు ఆక్షణమందే సరయువునఁ దమ దేహములు విడిచి స్వర్గమునకుఁ బోయిరి.

క. అంద ఱిటు చేర రా నా, నందంబున లోకగురుఁడు • నవ్యమగు దివం
బం దందఱ నిలిపి ముదం, బంది మహాత్రిదివమునను • నరిగెం బ్రీతిన్. ౧౬౬౫

తాత్పర్యము

అంద ఱీ ప్రకారము రాఁగా సంతోషముతో బ్రహ్మదేవుఁడు మనోహరమగు స్వర్గమున నందఱ నిలిపి సంతోషించి తాను సత్యలోకమునకుఁ బోయెను.

—॰ శ్రీ రామాయణ ఫలశ్రుతి ॰—

ఉ. ఈయది సోత్తరం బయి ర • హించును బ్రహ్మసుపూజితంబు, రా
మాయణ మన్ప్రసిద్ధిఁ గని • నట్టిది, ముఖ్యము, వాల్మికుండు ని
ర్మాయి, చరాచరాత్మకుఁడు • ప్రాగ్విధి విష్ణువు నిల్చె స్వర్గమం
దాయతహర్ష వృద్ధి నమృ • తాంధసు లెల్లరుఁ గూరుచుండఁగన్. ౧౬౬౬

అర్థములు. సోత్తరము=ఉత్తరకాండముతో గూడినది. పట్టాభిషేకానంతరము జరిగిన వృత్తాంతముతోఁ గూడినది, నిర్మాయి=మాయను జయించినవాఁడు, "దైవీహేషా గుణమయీ మమ మాయా దురత్యయా మామేవయే ప్రపద్యంతే మాయా మేతాం తరంతి తే" యను భ. గీతావాక్యము చొప్పున వాల్మీకి ప్రసన్నుఁ డగుటచే మాయను జయించెను, త్రిగుణాత్మక మాయను జయింపభక్తి తప్ప వేఱు మార్గము లేదు. 'మాంచయోఽవ్యభిచారేణ భక్తియోగేన సేవతే, సుగుణా న్సమతీత్త్యైతాన్ బ్రహ్మభూయాయ కల్పతే భ. గీ. ౧౪–౨౬ అని భగవద్వాక్యము. చరాచరాత్మకుఁడు=చరములకు అచరములకు నంతరాత్మయై యుండువాఁడు, చరాచరములు తనకు దేహముగాఁగలవాఁడు. ప్రాగ్విధి=యథాపూర్వము=మునుపటివలె.

తా త్ప ర్య ము

ఈ గ్రంథము శ్రీరామచంద్రమూర్తి పట్టాభిషేకానంతరము జరిగిన చరిత్ర ముతోఁ బ్రకాశించునది. బ్రహ్మచే మిక్కిలి పూజింపఁబడినది. ఇది రామాయణ మను పేరఁ గీర్తికాంచినది. నిశ్శ్రేయస సాభ్యుదయములు గోరువారి కిది మిక్కిలి ముఖ్యమైనది. దీనిని రచించినవాఁడు భక్తిచే మాయను జయించిన వాల్మీకి మహర్షి. అవతార దశకు పూర్వమున్నట్లులు చరాచరముల కంతరాత్మయై చరా చరములు తనకు శరీరముగాఁ గలిగిన విష్ణుమూర్తి దేవత లందఱు సంతోషించు చుండ స్వర్గమందు నిలిచెను.

క. దివిజులు గంధర్వులు ముని, నివహంబులు సిద్ధు లెల్ల ౹ నిత్యము ముద్యౌ
భవమున రామాయణమును, దివమున వినుచుంద రెలమి ౹ దివ్యంబగుటన్.

తా త్ప ర్య ము

ఈ రామాయణము భగవత్సంబంధమైనది కావున దీనిని దేవత లందఱు గంధర్వులు మునులు స్వర్గమునందును సర్వదా సంతోషముతో వినుచుందురు.

సీ. ఆఖ్యాన మియ్యది ౹ యాయుష్కరంబును, బాపనాశనము సౌ ౹ భాగ్యకరము
నామ్నాయసమము రా ౹ మాయణం బియ్యది, శ్రాద్ధకాలంబులఁ ౹ శ్రావ్యమగును
బాదమాత్రంబైనఁ ౹ బఠియింప వాఁడన, పత్యుఁ డేనియు సుత ౹ వంతుఁడగును
ధనహీనుఁ డైనను ౹ ధనవంతుఁ డయ్యెడు, సకల పాపంబులు ౹ సమసిపోవు

తే. దినము పాపంబులను జేయు ౹ దీనుఁడైన
శ్రద్ధతోఁ బద్య మొకఁడేన్ ౹ జదువుచున్న
వానిఁ బాపంబు లంటవు ౹ వాస్తవంబు
వహ్ని సోఁకిన కంట్లంబు ౹ పగిదిఁ జెడును. ౧౭౬౮

అర్థములు. ఆయుష్కరము=ఆయుస్సును వృద్ధిచేయునది, ఆమ్నాయ సమము=వేదముతో సమానము, శ్రావ్యము=వినఁదగినది, శ్రాద్ధకాలములందు నశ్లీలములు గాని గ్రామ్యకథలు గ్రంథములు గాని యుచ్చరింపరాదు. వేదో క్తులే యుచ్చరింపఁదగును. ఇది వేదము గావున దీనిని జదువవలయును. అనప త్యుఁడు=బిడ్డలు లేనివాఁడు, సుతవంతుఁడు = కొడుకులు గలవాఁడు, వహ్ని సోఁకిన=అగ్ని తగిలిన, కంట్లంబు=దూదిమూట, దీని వాస్తవముఁ గోరువారు శ్రీరామనామ మాహాత్మ్యము చదువఁ బ్రార్థితులు.

తా త్ప ర్య ము

(ఈ రామాయణకథ యాయుస్సును వృద్ధిచేయును. పాపము నశింపజేయును. సౌభాగ్యము నిచ్చును. వేదముతో సమానమైనది. శ్రాద్ధకాలములందు వినఁదగిన

దగును. పాదమాత్రమైన పఠించినచో సంతానము లేని వానికి సుతులు కలిగెదరు. ధనము లేనివానికి ధనము కలుగును. సమస్త పాపములు సమసి పోవును. ప్రతి దినము పాపముచేయు దీనుఁడైనను శ్రద్ధతో నొక్కపద్యమైనఁ జదువుచుండెనేని వానిని బాపములు వాస్తవముగా నంటవు. దూది బుంగలకు నిప్పంటుకొనిన విధమున రూపు మాసిపోవును.)

క. వాచకునకు దాతవ్యము, నైచికియుం గాంచనంబు ♦ నవ్యాంబరముల్
వాచకుఁడు సంతసించిన, నేచింతయు లేదు తృప్తు ♦ లెల్లరు విబుధుల్. ౧౭౭౯

అర్థములు. వాచకునకున్=గ్రంథము పఠించిన వానికి, దాతవ్యము ఈయఁదగినది, నైచికి=శ్రేష్ఠమైన గోవు, కాంచనము = బంగారు, నవ్యాంబరముల్=క్రొత్తవస్త్రములు.

తాత్పర్యము

ఈ గ్రంథము పఠించిన వానికి బఠింపఁజేసినవారు గోవును బంగారు, క్రొత్త వస్త్రములు సీయఁదగును. అతఁడు సంతోషించిన దేవత లందఱు సంతోషింతురు.

క. ఆయుష్కర మగు శ్రీరా, మాయణముఁ బఠించు నాతఁ ♦ డాత్మజ పౌత్ర
శ్రీయుతుఁడై సుఖయించుచు, నాయతసుఖమందు స్వర్గ ♦ మందుం బిదపన్.

తాత్పర్యము

(ఆయుస్సును గలిగించు శ్రీరామాయణమును బఠించువాఁడు కొడుకులతో మనుమలతో సంపదతోఁగూడి సుఖపడును. అంతమున వైకుంఠమున శాశ్వతమగు సుఖమును బడయును.)

తే. శూన్యమై యుండి పెక్కేండ్లు ♦ ధన్యమైన
యాయయోధ్య పదంపడి ♦ యవని విభుఁడు
ఋషభుఁడనువాఁడు పాలింప ♦ వృద్ధి గాంచు
జన నివాసోచితం బయి ♦ సౌఖ్యమిడుచు. ౧౭౮౧

తాత్పర్యము

(ధన్యమైన యీయయోధ్య చాల సంవత్సరములు శూన్యమైయుండి యావల ఋషభుఁడను రాజు పాలనమున జనులు నివసింప యోగ్యమై సౌఖ్యకరమై వృద్ధి పొందును.)

తే. ఉర్వి వెలయించె దీని సరిహోత్తరంబు, గాఁగ సభవిస్మయముగ వల్మీకప్రభవుఁడు
లోకకర్తస్వయంబ యం ♦ గీకరించె, దీనిసంపూర్ణముగ ♦ విని దివ్యులలర.

అర్థములు. సహోత్తరము = పట్టాభిషేకానంతరము జరిగినది, సభవిస్మయము=సీతాదేవి భూప్రవేశము చేసిన విమ్మట జరిగినది, లోకకర్త=రామ

మూర్తి ధరించిన విష్ణువు, పుట్టంబుట్టినవాని రచితమైన దీనిని భగవంతుఁడు రామచంద్రమూర్తి తన చరిత్రమును దాను స్వయముగ విని సరియని యంగీకరించుటచే నిది పరమప్రమాణ గ్రంథము. కావుననే దీనిని దేవతలు కూడ విని సంతోషింతురు.

తే. వాజమేధసహస్రముల్•వాజపేయ, శతసహస్రంబుఁ లొనరించు•సత్ఫలంబు
రామచంద్రునిచరితంబుఁ శ్రవణమునను, ధ్యాన మొనరించుటనఁ గాంచుఁ•దథ్యముగను.

తా త్ప ర్య ము

(వేలకొలఁదిగా నశ్వమేధయాగములు లక్షలకొలఁది వాజపేయయజ్ఞములు చేసినఁ గలుగు మంచేఫలము రామచంద్రుని చరిత్రమును వినుటచేతనే, ధ్యానము చేయుటచేతనే వాస్తవముగాఁ గలుగును.)

తే. అమరవాహినిలోనఁగు•నాపగలను, నైమిశాదిమహారణ్య•భూములందు
మఱి ప్రయాగకురుక్షేత్ర•మండలములఁ, గాంచుఫల మొందుదీనినా•లించునతఁడు.

అర్థములు. అమరవాహిని=గంగ, ఆపగలను=నదులందు.

తా త్ప ర్య ము

(గంగ మొదలగు పుణ్యానదులందు స్నానమాడిన ఫలము. నైమిశము మున్నగు పుణ్యారణ్యములను ప్రయాగ కురుక్షేత్రము మొదలగు పుణ్యక్షేత్రములను సేవించినఁ గలుగు ఫలము రామాయణము వినిన వానికిఁ గలుగును.)

క. భానూపరాగ వేళను, దాని గురుక్షేత్రమందుఁ•దపనీయంబున్
దాన మొనర్చిన ఫలమును, దీని న్వినువాఁడు నొందుఁ•దీటీ రెండున్. ౧౬౭౫

అర్థములు. భానూపరాగ వేళకు=సూర్యగ్రహణ సమయమందు, దాని=దానముచేయువాఁడు. దాత, తపనీయము=బంగారు, దీటు=సమానము.

తా త్ప ర్య ము

(సూర్య గ్రహణమప్పుడు కురుక్షేత్రములో బంగారు దానముచేసినఁ గలుగు ఫలము నీ రామాయణము వినినఁ గలుగు ఫలము నీ రెండు సమానము.)

క. మానని శ్రద్ధను శ్రీ సీ, తానాయకుచరిత వినిన•ధన్యుఁడు ఘోరా
ఘానీకంబులఁ బాయుచుఁ, దా నెలకొను విష్ణుసన్ని•ధానమునందున్. ౧౬౭౬

అర్థములు. ఘోరాఘ+అనీకంబులన్=భయంకర పాపసమూహములను.

తా త్ప ర్య ము

(విడువని శ్రద్ధతో శ్రీసీతాపతి యగు రామచంద్రమూర్తి చరిత్రను వినిన ధన్యుఁడు భయంకరములైన పాపముల సమూహములను వదలి విష్ణువు సన్నిధిలో శాశ్వతముగా నుండును.)

ఆ. ఆదికావ్య మిద్ది • యార్షంబు పూర్వంబు, వల్మికోద్భవర్షి•భాషితంబు
నియతి భక్తిచేత•నిరతంబు వినువాఁడు, రూఢిగాఁగ విష్ణు•రూపు గాంచు.

అర్థములు. ఆర్షంబు=ఋషిచేఁ జెప్పఁబడినది, పూర్వంబు = పూర్వంబు, మునుపు, శ్రీరామనిర్యాణమునకు ముందు, రామావతారమునకు ముందనిభావము కాదు. యత్కించిత్కాలమునకు ముందు జరిగినను పురావృత్తమే. ౭౮౩వపద్యము చూచునది, నిరతంబు=ఎల్లప్పుడు, దినదినము.

తాత్పర్యము

(ఇది యాదికావ్యము. ఋషిచేఁ జెప్పఁబడినది-వాల్మీకి మహర్షి శ్రీరామ నిర్యాణమునకు మునుపు రచించినది నియమముగాఁ బ్రతిదినము భక్తితో విను వాఁడు రూఢిగా విష్ణుసారూప్య ముక్తిఁ గాంచును.)

క. దారసుతాదులు వృద్ధిం, గూరెద రెడఁదెగని కలిమిఁ•గొమరారుఁ గులం
బారఁగఁ దామరతంపర,యై రహిఁగను నియతి వినెడి•యనఘాత్మునకున్.

అర్థములు. దారసుతాదులు=భార్యలు, కొడుకులు లోనగువారు, అన ఘాత్మునకున్=పుణ్యాత్మునకు.

తాత్పర్యము

(దీనిని నియమముగా వినెడి పుణ్యాత్మునకు నాలుబిడ్డ లభివృద్ధి నొందెదరు-తెంపులేని భాగ్యము విస్తరించును-కులము తామరతంపరై వెలయును.)

క. నిరతము రాముని చరితముఁ, బరమమతి న్వినెడివాఁడు•భక్తివశమునన్
బరిపూతుండై బహువత్సరములు జీవించి మోక్ష•సంగతి వెలయున్. ౧౬౭

అర్థములు. వాంఛితములు=కోరికలు, బ్రాహ్మణవరు లిది వినిపింపవలయు ననుటచే శూద్రాదులకని భావము. ఈ నియమము సంస్కృత గ్రంథమునకే, ఆంధ్రగ్రంథమునకే నిర్బంధములేదు. ఎవరైనను భక్తిగలవారు చదువవచ్చును.

తాత్పర్యము

(ఎల్లప్పుడు రామాయణమును శ్రేష్ఠమగు మనస్సుతో భక్తిచే వినెడి వాఁడు పవిత్రుఁడై యనేక సంవత్సరములు జీవించి, మోక్షమును బొందును.)

క. నిరతము రాఘవచింతా,పరుఁడగు మనుజుండు కోరు•వాంఛితములఁ దా
నరగన కాంచును బ్రాహ్మణ,వరు లిది వినిపింపవలయుఁ•బ్రతిదివసంబున్.

తాత్పర్యము

(సర్వదా రామధ్యాన పరాయణుఁడయిన మానవుఁడు కోరినకోరిక లెల్లఁ జేకూరును-ప్రతిదినము బ్రాహ్మణుఁడు దీనిని వినిపింపవలెను.)

క. గాయత్రీరూపము రామాయణ మిది యొక్క పదమ ౦ యైనఁ బఠిపన్
  జేయు దురితనాశము సుతు,లాయతధనములును గలుగు ౦ నక్షయ మగుచున్.

అర్థములు. గాయత్రీరూపము = గాయత్రీ స్వరూపము గలది, గాయత్రీ మంత్రముచే గర్భితమైనది, గాయత్రీ మంత్రార్థము గలది కావున గాయత్రియే రామాయణ స్వరూపముగాఁ బరిణమించె నని భావము, ఒక్క పదమయైనన్ = ఒక్కమాట నైనను అనఁగా నిందలి ప్రతిపదము వేదమునందలి దని యర్థము, దీనికి కొందఱు గాయత్రీమంత్రములోని యొక్క యక్షరముచేఁ దెలుపఁబడిన శ్లోకములని యందురు.

తా త్ప ర్య ము

ఈ రామాయణము గాయత్రీ స్వరూపము, దీనియందలి యొక్క మాట నైనఁ జదివిన యెడలఁ బాపము నశించును-కొడుకులు గలుగుదురు - శాశ్వతమై విస్తారమైన ధనములును గలుగును.)

క. సర్వము గాముని చరితము, నిర్వక్రమనీషఁ జదువు ౦ నియతాత్మకు లీ
  యుర్వి విడిచి చనుపిదప ఖ,గార్వాని లోకమువ నందు ౦ రనవరతంబున్. ౧౮౭౨

అర్థములు. ఖగార్వాని లోకమునన్ = గరుడును వాహనముగాఁ గల విష్ణుని లోకమునన్, వైకుంఠమందు, అనవరతంబున్ = సర్వదా, మరల జన్మము లేదని భావము.

బ్రహ్మసూత్రములు బ్రహ్మజిజ్ఞాసతోఁ బ్రారంభించి సృష్టిస్థితిలయములు చేయువాఁడు బ్రహ్మమని నిర్వచించి జిజ్ఞాసాఫలము నపునరావృత్తి శ్శబ్దాత్ అని యుపసంహారము గావించెను.

ఈ గ్రంథమునందును బ్రహ్మలక్షణము జిజ్ఞాసావిధము, మోక్షఫలము చెప్పఁ బడెను.

అయోధ్యా జనులు కర్మయోగముచే, బ్రహ్మజ్ఞాననిష్ఠచే నష్టాంగయోగముచే మోక్షప్రాప్తి గోరినవారు కారు. స్నేహభావమున శ్రీరామచంద్రమూర్తి ననుసరించి యాయన ధ్యానముతో దేహములు విడిచిరి. వారికి ముక్తి లభించెను. ఇది 'సర్వధర్మాన్ పరిత్యజ్య మా మేకం శరణం వ్రజ, అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి' యను భగవద్వాక్యమునకు లక్ష్యమై యున్నది. గోపికలు బృందావనస్థులిట్టు లనురాగముచే మోక్షము గాంచినవారే. కావున శ్రీరామ భక్తి ముక్తి కారణ మని యేర్పడుచున్నది.

క. జనకుండు జనకజనకుఁడు, జనకుని తాతయును నతని ౦ జనకుండును ద
  జ్జనకుఁడును విష్ణులోకం,బున నిలుతురు రాముకథను౦బొరిఁబొరి విన్నన్. ౧౮౭౩

తాత్పర్యము

రామాయణమును విన్నవాఁడు మాత్రమే కాక వాని దండ్రి తాత ముత్తాతలు ముత్తాత తండ్రి దాతలు కూడ విష్ణులోకమున నుందురు. ఈ కారణము చేతనే విష్ణుభక్తిగలవాఁడు మావంశమునఁ బుట్టునా యని పితరులు గోరుచుందురు. ఈకారణము చేతనే వంశ తంతుచ్ఛేదము గాకుండఁ గాపాడవలసి యున్నది. వంశమునునది యుండిన మంచి భక్తుఁ డేనాటికైనఁబుట్టకపోవునా యను నాశతో సత్సంతానము గోరి వంశము నిలుపవలయును. ఇది ధర్మపద్ధతి గలిగిన సంతానమునకే యన్వయించునుగాని జారత్వమువలనఁ గలిగిన సంతానమునకుఁ గాదు. దానివలన నరక ప్రాప్తియే. దీనివలన విష్ణుభక్తుఁడే కాక వానితోడి సంబంధము గలవారు కూడఁ తరింతు రని యేర్పడుచున్నది.

తే. రామచరితంబు ధర్మార్థ కామములను, శాశ్వతంబగు పదము నొసంగునిజము
కాక నిత్యంబు జనులారా!, కార్యమగును, శ్రద్ధతో మీరు దీనినిఁజదువవినుట.

అర్థములు. ధర్మార్థకామములు, శాశ్వతంబగు పదము. ఇట్లు చెప్పుటచే నాలుగు విధములైన పురుషార్థములు రామాయణ పఠనమువలన ఫలించును. కొన్ని కేవల భోగప్రదములు కొన్ని కేవల మోక్షప్రదములు ఇది యట్లు గాదు. ఉభయలోకముల నభ్యుదయ నిశ్శ్రేయసములు గలిగించునది. కొన్నిమతములవారు మోక్షమునకు సన్న్యాసమనియు ఐహికాభ్యుదయమునకు కర్మమార్గ మనియుఁ జెప్పుదురు. దీనిచే నీవాదము నిరస్తము. ధర్మార్థకామముల ననుభవించుచునే గృహస్థుఁడు రామభక్తిచే రామాయణపఠన శ్రవణములచే ముక్తి సాధింపవచ్చును. అని యీ పద్యము స్పష్టపఱుచుచున్నది.

జనులార యనుటచే సర్వసామాన్య మనుటయు అన్నివర్ణములవారుశ్రవణముచే ముక్తి కధికారులే యగుదు రనియు సన్న్యాసమందు విశేషము లేదనియు భావము. కావున రామభక్తి కధికారనియతి లేదు. శ్రద్ధావంతుఁడే యధికారి.

తే. భక్తితోడుతఁ బదమైనఁబాదమైన, ననయ మఘనాశనంబు రామాయణంబు
వినునతం డేగుబ్రహ్మసదనమునకును,బ్రహ్మచేఁబూజితుండయివఱలుసతము.

తాత్పర్యము

ఈ పద్యమునందు రామాయణమందలి యొకపదము వినినను పాదము వినినను బ్రహ్మలోక ప్రాప్తి కలదని చెప్పఁబడెనుగాని సద్యోముక్తి చెప్పఁబడలేదు. సన్న్యాసవ్రతము నిష్ఠమగా జరిపినవారికి బ్రహ్మలోకప్రాప్తియు పరాంతకాలమున బ్రహ్మతోడ మోక్షము శాస్త్రములు చెప్పుచున్నవి. ఆ ఫలమే రామాయణమున నొక పదమో పాదమో భక్తితో వినువారికిఁ జెప్పబడెను. మోక్ష

సుఖానుభవమందుఁ దారతమ్యము గలదు. గావున సంపూర్ణముగ రామాయణమును బలుమాఱు పఠించిన వారికి వినినవారికి లభించు పరిపూర్ణ బ్రహ్మానుభవమువలనఁ గలుగు నంతటి యానందము వీరికి లేదని గ్రహింపనగు. అటుగాదేని యొక పదము వినినవాఁడు పలుమారు వినినవాడు సమానులగుదురు. అట్లు చెప్పుట సరిగాదు.

మానిని. ఈరహి మించుమహత్త్వముఁ గల్గిన • యిట్టి పురాతనవృత్తమణిన్
మీరు పఠింపుఁడు సంశయ మూనక • నిండుమనంబున నమ్మి జనుల్!
దూరములై చను దోషము లన్నియుఁ • దోరపుభద్రము మీ కగుతన్
వారక విష్ణుమహామహిమోన్నతి • వర్ధిలుతం గడు వర్ధిలుతన్. ౧౬౮౬

అర్థములు. పురాతన వృత్తమణిన్=పూర్వము జరగిన చరిత్రములలో శ్రేష్ఠమైనది.

వర్ధిలుతన్ గడు వర్ధిలుతన్ అనునది గ్రంథాంతమును సూచించును.

తాత్పర్యము

(జనులారా! యిట్టి యతిశయమైన మహిమ గలిగి పూర్వము జరిగిన చరిత్రములలో శ్రేష్ఠమైన దీనిని మీరు సంశయము మాని నిండు మనస్సుంచి పఠింపుఁడు మీ పాపములన్నియు నశించును, విశేషశుభములు మీకుఁ గలుగును. విష్ణుమహాప్రభావాతిశయముచేత వర్ధిల్లుఁగాత. మిక్కిలి వర్ధిల్లుఁగాత.)

క. అని యార్ష మాదికావ్యం, బును నగు రామాయణంబు • మును వల్మీకసం
జనితుఁడు తపస్వి సంహిత, గను బల్కెను భూప్రజోప • కారకబుద్ధిన్. ౧౬౮౭

అర్థములు. సంహిత=వేదభాగము.

తాత్పర్యము

(అని ఋషిప్రోక్తము నాది కావ్యము నగు రామాయణమును మునుపు తపస్వియగు వాల్మీకి మహర్షి భూమియందలి ప్రజలకుపకారము గలుగవలెననెడి బుద్ధితో వేదభాగముగ దీనిని జెప్పెను.)

—• ఆంధ్ర కవికృత గ్రంథాంత నమస్కారములు •—

క. ఒదవినవిఘ్నము లణఁచుచుఁ గదిసిన యాపదలఁ దోలఁచి • కడముట్టఁగ నీ
సదయతఁ బల్కించిన కృతి, యిదిగోఁ గైకొమ్ము జాన • కీశ్వరరామా! ౧౬౮౮

అర్థములు. సదయతన్=దయతోఁ, నీ=నీవు.

తాత్పర్యము

ప్రాప్తించిన విఘ్నములను ఆపదలను దొలఁగఁద్రోచి నీవు దయతోఁ బలికించికొనిన గ్రంథమును సీతానాయకా! నీవే కైకొమ్ము. స్వయమేవ కారయతేయను

సూక్తిననుసరించి ఫలభోక్తవు కారయితవైన నీవే కావున నీకృతిని తత్కర్మ ఫలమును నీవే గ్రహింపుము.

క. తప్పొప్పు లెఱుంగను నీ, చెప్పించినయట్లు నేను ♦ జెప్పితిఁ గద మా
యప్పా! దీనం గలిగిన, తప్పొప్పుల కీవే దిక్కు ♦ దశరథరామా! ౧౬౮౯

తా త్ప ర్య ము

ఈ కృతియం దేది తప్పో యేది యొప్పో నే నెఱుఁగను నా స్వతంత్ర బుద్ధిచే నే నేదియుఁ గల్పించి వ్రాయలేదు. నాచేతికలము నాకెట్లో నేను నీకట్లు. మెప్పుదెప్పులకు దానివలె నే నర్హుఁడను గాను. ఏలన నీవు చెప్పించినట్లు నేను జెప్పితిని. నిన్నుఁగాదని యేదైనఁ జెప్పఁగల స్వతంత్రశక్తి నాకెక్కడిది? అప్పా= తండ్రీ. నీవు తండ్రివి కావున బిడ్డలు తప్పులు పలికినను సంతోషించునట్లు నీవును నా తప్పుల క్షమింపుము.

ఉ. హెచ్చుగ నెందు నేని వచించియుంచియ యుండిన రక్తిచేతనే
హెచ్చని వీడియుండిన మునీశ్వర! జ్ఞానము లేమిచేతనే
యచ్చపు యోగిరత్నమ! మ ♦ హాత్మక! నీకృతి యీ ప్రబంధముం
బొచ్చెముగాదు జీవయుత ♦ మూర్తియు చాయ యనంగ నుండెడిన్. ౧౬౯౦

అర్థములు హెచ్చుగన్=మూలమునందు లేనివి, ఔఇట్టి చుక్కలు వేసినవి, రక్తిచేతనే=రామునియందలి యనురాగముచేతను, మునీశ్వర=వాల్మీకి మహర్షీ, హెచ్చని=రామో దశరథాత్మజ యన్నట్లు విశేషణములు పలుమాఱు చెప్పుట మానుటకు నీ వేయభిప్రాయముతో వేసితివో యది తెలిసికొను శక్తిలేకయే, పొచ్చెము=లోపము, జీవయుతమూర్తి=ప్రాణముతో, గూడిన శరీరి, చాయ= నీడ.

ఈ పద్యము వాల్మీకిమహర్షి నుద్దేశించి వ్రాయఁబడినది.

తా త్ప ర్య ము

మునీశ్వరా! నీవు మహానుభావుఁడవు, యోగిపుంగవుఁడవు. జరిగినది జరిగినట్లు నీవు యోగదృష్టిచేతను ప్రత్యక్షానుభవముచేతను దెలిసికొని పలికినవాఁడవు, నీకు రామునందు రాగములేదు, రావణునందు ద్వేషము లేదు. నీవు యథార్థము చెప్పుటయే కార్యమను నియతి గలవాఁడవు. నేనో యజ్ఞుఁడను మూఢాగ్రేసర చక్రవర్తిని, పామరుఁడను, రాగద్వేషములకు దాసుఁడను. కావున నీవు రామచంద్రమూర్తి శైశవక్రీడాదులు వర్ణింపమికి శోకించి కొన్ని పద్యములు హెచ్చుగ వ్రాసితిని. కొన్ని విశేషణాదు లేల నీవు పలికితివో నీ యభిప్రాయము దెలిసికొను శక్తిలేక వదలితిని. సత్యము చెప్పుచున్నాను. నీకృతి ప్రాణయుక్తమైన శరీరమువంటిది; నాకృతి దానినీడ వంటిది. మన యిరువుర కృతులకుఁ దారతమ్య మీమాత్రమే.

ఉ. నీకృతి క్షీరసాగరము ♦ నీవ యెఱుంగుదు తన్మహత్త్వమున్
నాకు వశంబొకో యెఱుఁగ ♦ నన్నుఁ దరింపఁగఁ జేయ దాని నీ
వే కరుణాతిరేకమున ♦ నిట్లు వచింపఁగఁ జేసి నంతనే
నాకు స్వతంత్రతాస్మయము♦నాథ! లవంబును లేదెఱుంగవే? ౧౬౯౧

అర్థములు. నాథ=రామచంద్రమూర్తీ, క్షీరసాగరము=పాలసముద్రము, తన్మహత్త్వము=దాని గొప్ప తనము, దానిన్=ఆసముద్రమును, ఆకృతిని, కరుణాతిరేకమునన్=దయాతిశయముచే, స్వతంత్రతాస్మయము=స్వయముగ బుద్ధి బలము, పాండిత్యబలము గలిగి వ్రాసితినను గర్వము, లవము=కొంచెము.

తాత్పర్యము

రామచంద్రమూర్తీ! నీకృతి పాలసముద్రము వంటిది. దాని లోఁతెంతో వెడలుపెంతో నే నెఱుగను. తెలిసికొన నాకు సాధ్యము కాదు. కావున దానిని దరించుటకు శక్తిలేదు. కావున దానిని దాఁటింప నీవే నీదయావిశేషమునఁ బలుకఁ జేసితివి. ఆకారణమున నాబుద్ధి విద్యాబలముచే సాధించితినను గర్వము నాకులేదు కుంటివాని నొకనియందు నావికుఁడు దయఁదలఁచి పడవలోఁ గూర్చుండఁ బెట్టుకొని గంగను దాఁటింపఁగా నాకుంటివాఁడు వివేకి యగునేని తాను దనశక్తిచే గంగదాఁటితి నని చెప్పునా? తలఁచునా? నేను సత్యము చెప్పుచున్నానో యసత్యము చెప్పుచున్నానో హృదయవాసివి సర్వజ్ఞుఁడవు నీవే యెఱుఁగుదువు.

చ. తరుచుకొలంది తీపి, యమృతంబునుబోలెడి, లోఁ తదెంతయో
తర మఱి చొచ్చి చూడ, గుణతత్త్వ మగమ్యము, పారమార్థిక
స్థిరమతియైన వానికిని ♦ జిత్తము నిల్కడ నొందు నిందుఁ, గే
సరితనుజాతురీతి నసుఁ ♦ జల్పుము రామ! త్వదేక చిత్తుఁగన్. ౧౬౯౨

అర్థములు. కేసరి తనుజాతురీతిన్=హనుమంతునివలె, త్వదేకచిత్తుగన్=నీయొక్కనియందే మనస్సు గలవానిఁగ.

తాత్పర్యము

నీగ్రంథవిషయ మాలోచించు కొలఁది నాలోచించుకొలఁది తియ్యఁదన మెచ్చుచుండును. 'సంగీతమపిసాహిత్యం సరస్వత్యా స్తనద్వయం, ఏకమాపాత మధురం ద్వితీయం చింతనామృత'మ్మని కలదు.సామాన్యసాహిత్య గ్రంథములందే యిట్లుండ వానికంటె సర్వవిధముల విలక్షణమైన రామాయణము గుఱించి యేమి చెప్పవలెను అమృతమువంటిది. తిన్న తీపు-మరణబాధదొలఁగించును. దానిలోఁ తెంత యున్నదో చొచ్చిచూడ సాధ్యముగాదు. గుణతత్త్వము దెలియఁదరము గాదు. ఏది యెట్లుండినను పరమార్థచింతగల వానికి మనశ్శాంతి దీనివలనఁ గలు

గును. 'దదామి బుద్ధియోగం తం యేన మాముపయాంతి తే' భ.గీ. యని నీవే చెప్పి తివి గావున నీవిషయమున కేసరియను క్రోతియొక్క కొడుకు కేరీతి మనస్సు గలఁ వాఁడయ్యెనో యట్లు నీయందే మనస్సుగలవానిఁగా జేయుము. రామచంద్రా! నీ తల్లిదండ్రులు తోడఁబుట్టులు దారపుత్రాదు లందఱు దుఃఖముల పాలయినవారే గాని సుఖపడినవారు లేరు. కావున నీవు నాకుఁ గొడుకవు కావలదు తండ్రివి కావలదు. హనుమంతునివలె దాస్యము నిరంతరధ్యానము కలుగనిమ్ము చాలును.

క. అఘటనఘటనా చాతురి, మఘవస్తుత! తెలుపు పొంటె • మాదృశు చేతన్
లఘుగతి నీదు మహాకృతి, యఘహర! చేయించి తీవ • యన్యము గలదే? ౧౬౬౩

అర్థములు. అఘటనఘటనాచాతురి=అసాధ్యములను సాధించు నేర్పు, మఘవస్తుత=ఇంద్రునిచేఁ బొగడఁబడినవాఁడా, తెలుపు పొంటెన్ = తెలియఁజేయు కొఱకు, మాదృశు చేతన్=నావంటి యల్పునిచే, లఘుగతిన్=తేలికగా, అనాయాసముగ, మహాకృతి=గొప్ప గ్రంథము, అఘహర=పాపము నాశము చేయు వాఁడా.

తాత్పర్యము

ఎట్టి యసాధ్య కార్యమైనను సుసాధముగఁ జేయు నేర్పుగలవాఁడవు, నీవు కావున నీశక్తి లోకమునకుఁ దెలియఁజేయు కొఱకు నెట్టి శక్తియు లేని నాచేత నా పాపములు హరింపఁజేయ నీకృతి రచింపఁజేసితివి గాని యితరముగాదు.

నీ విట్టివాఁడ వనుట కితర నిదర్శనములు గల వనుచున్నాఁడు.

చ. ఎలమి హుళిక్కినుండి • యొక యింతిని జేసితి పాదధూళిచే
బలపరిపంథిముఖ్యుల క • వార్యముఁ జేసితి దర్భపోఁచ, ని
శ్చల మపవర్గ మిచ్చితివి • సత్కృప గ్రద్దకు నట్టినీకు నే
కొలదియొ నన్ను నిట్లు • రఘుకుంజర! త్వత్కృతికర్తఁ జేయఁగన్! ౧౬౬౪

అర్థములు. హుళిక్కి=లోకుల దృష్టికి శూన్యము, వాస్తవమునఁ గాదు- బలపరిపంథి=ఇంద్రుఁడు, అవార్యము=వారింపరానిది, అపవర్గము=మోక్షము.

తాత్పర్యము

గౌతముని శాపముచే లోకులకుఁ గానరాకయున్న దానిని మరల స్త్రీగాఁ గానవచ్చునట్లు చేసితివి. దర్భపోఁచ యింద్రాదులకును నివారింప సాధ్యముగాని బ్రహ్మాస్త్రముగఁ జేసితివి. బ్రాహ్మణుఁడై జ్ఞానియై సన్న్యాసియైనఁ గాని మోక్షము లేదను కొందఱి యభిప్రాయము సరిగాదు. నీసేవచేతనే యెవరైన ముక్తులగుదు రని తెలుప తిర్యగ్జాతి పక్షికి కర్మజ్ఞానయోగమార్గము లెఱుఁగని దానికి మోక్ష మిచ్చితివి. ఇట్టి యసాధ్య కార్యములు చేయు నీకు నన్ను నీ కృతికర్తగాఁ జేయుట యేమాత్రము కార్యము. మిక్కిలి సుకరము.

క. నాసత్త్వము నే నెఱుఁగుట, వీసంబును లేదు మోహ♦విభ్రమ మెద సం
తోసము శ్రద్ధయు హెచ్చెను, వాసవనుత! నీదుకృపకుఁ ♦ బాత్రమ నగుటన్.

అర్థములు. సత్త్వము=బలము, దేహబలము విద్యాబలము బుద్ధిబలము.

తాత్పర్యము

దీర్ఘరోగి నగుట దేహబలము బుద్ధిబలము లేదు. ఆ కారణముచేతనే గురుముఖలబ్ధ విద్యాపాండిత్యము లేదు. ఇది నే నెఱుఁగుదును. కావున నిట్టికార్యము నేను జేసితినని చేయఁగలనని మతివిభ్రమము లేదు. కాని నీవు నాచే నీకృతి చేయించుటచే నీ దయకుఁ బాత్రుడ నైతినని సంతోషము నీవు దీనరక్షకుఁడవు. పోషకుఁడవను శ్రద్ధయు నతిశయించెను. నేను బండితుఁడను మేధావినై యుండిన నాస్వశక్తిచేఁ జేసితినని భ్రమపడి యుందును. ఇప్పు డట్టి భ్రమకుఁ గారణము లేదు.

క. చేసితివి నీవు నాకున్, బాసను దరియింపు మీవు♦వార్ధి నటంచున్
బాసను దప్పవు నీవను, వాసిం జగం బెఱుఁగు సత్య♦భాషణ దీనన్. ౧౬౪౬

తాత్పర్యము

ఈ గ్రంథరచనకు నేను బూనుదునా వలదా యని నిన్ను నేను బ్రశ్నించినపుడు సముద్రము దాఁటుమని చెప్పితివి. నీమాట నమ్మి నేను బూరించితిని. దీనివలన నీవు సత్యసంధుఁడవని లోక మెఱుంగఁగలదు.

క. జలనిధి దాఁటు మ టంటివి, జలనిధి కావ్యంబొ కాక ♦ సంసారంబో
పలుకవు దాఁటించితి కృతి,,దలఁపక భవవార్ధి నట్లు♦దాఁటింపు దయన్! ౧౬౪౭

తాత్పర్యము

మహాసముద్రము దాఁటుమని చెప్పితివి గాని యది కావ్యసముద్రమా సంసారసముద్రమా స్పష్టముగఁ జెప్పవైతివి. కావ్యసముద్రమును దాఁటించితివి. కావున నీనెపమున సంసారసముద్రమును నీ దయచేతనే దాఁటింపుము.

ఉ. కాలము వ్యర్థ మేగు ప్రతి ♦ ఘస్రమునందును గొంత రిక్తగా
థాలపనంబునందు ఫల ♦ మా? యొకమాత్రమ యేని త్వత్కథా
జాలమునందుఁ జిత్తమిడ ♦ సత్ఫలదం బని యెంచి రామ ! నీ
లీల రచింపఁ బూనితిని ♦ లేశము లేశము నాఁడు నాఁటికిన్. ౧౬౪౮

అర్థములు. ఘస్రము=దినము, రిక్తగాథాలపనంబునందు=పనికిమాలిన ముచ్చటలందు.

నేనేపనిచేసినను జేయకున్నను కాలముపోవుచుండును, గాని నిలువదు. కావున నిష్ప్రయోజనములైన ముచ్చటలందుఁ గాలము పోవుటకంటె నీకథలందుమనస్సుం

చిన మంచిఫలము గలదని తలఁచి నీచరిత్రమును దినదినము కొంచెము కొంచెము వ్రాయఁబూనితిని. రోగబాధలేక యుద్యోగమున విరామము దొరకిన కాలమందు దినమున కుదయమున గంట గంటన్నర కాలము దీనికై యీగ్రంథకర్త వెచ్చించెను.

సీ. నీమాట నెద నమ్మి ॥ నేను శార్వరి నాశ్వ, యుజమాసమున శుద్ధ ॥ విజయదశమిఁ
గృతిని ప్రారంభింప ॥ నెడనెడవిఘ్నముల్, కలిగియు నేఁడుల ॥ నెలలకొలఁది
నవియెల్ల నీకరుణావలోకనమునఁ, బాయుట నీమహా ॥ వాక్య మొకఁడె
యాధారముగఁ గొని ॥ యదరక నీసేవ, సలుపఁగ నేఁటికి ॥ శాలివాహ

ఆ. శకమునందు గ్రాలు ॥ చంద్రరామగజేందు, సంఖ్య గొనరి మిగుల ॥ శస్తమైన
కీలకాబ్దమునను ॥ గీర్తిత శ్రావణ, పౌర్ణమాసియందుఁ ॥ బూర్ణమయ్యె. ౧౮౯౯

అర్థములు. చంద్ర=౧, రామ=౩, గజ=౮, ఇందు=౧, అనఁగా ౧౮౩౧ యని యర్థము.

క. సైరింపు దేవ! నాయప, చారము లవి యెన్నొ కలవు ॥ సత్యము కరుణా
పారగ! కైకొనుము నమ, స్కారము లర్పింతు నొంట ॥ శక్తుఁడ గామిన్. ౧౯౦౦

అర్థములు. అపచారములు=చేయరానివి చేసిన దోషములు, ఒంట=మఱి యొక విధమునకు. శక్తుఁడన్=శక్తిగలవాఁడను.

తాత్పర్యము

నీవిషయమున నే నెన్నియో యపచారములు కృత్యాకరణములు, అకృత్య కరణములు చేసితిని. ఇది నిజము అయినను దయావంతుఁడవను బిరుదము గలవాఁడవు కావున నన్ను క్షమింపుము. దానికై నేనితర కార్యములు ప్రాయశ్చిత్తములు చేసికొనఁజాలను. సాష్టాంగనమస్కారము లర్పించెదను.

—॥ కవి యీ గ్రంథము నొంటిమిట్ట శ్రీరాముల కర్పించుట ॥—

సీ. శాంతంబుగాఁగ నీ ॥ చరితంబు సకలంబు, నీగ్రామమం దిది ॥ నీకొసంగఁ
దలఁచు చుండఁగను మి ॥ త్రులము మువ్వురము తత్, సంకల్పతిలక వ ॥ సంతసాహ్య
మునఁ బూచి ఫలియింప ॥ ముదమున నీయబ్ద, మందాశ్వయుజమాస ॥ మందుఁ బూర్ణి
మాతిథి బాడ్యమి ॥ మఱి ద్వితీయాతిథి, వేలకొలంది ప్ర ॥ వంజాలి గనఁగ

తే. నీనుపాలకియందు యీ ॥ నీదుకృతిని, నిల్పి కవులును పండితుల్ ॥ నీదుభక్త
వరులు మోయఁగ ఛత్రంబు ॥ పట్టి రాఁగ, బుణ్యమంగళవాద్యముల్ ॥ బొరుకొనఁగ

అర్థములు. మిత్రులము మువ్వురము=ఈగ్రంథకర్త, క్రొత్తపల్లి పద్మనాభశాస్త్రి, లంక వేంకటసుబ్బయ్య (రఘునాథపురము) ఈ గ్రామమందు=ఒంటిమిట్ట యందు, ఈయబ్దమందు=కీలకయందు, వసంత=వసంతఋతువు, వసంతరావు.

తాత్పర్యము

(శాంతముగా నీ రామాయణ మంతయు నొంటిమిట్టయందు నీకు సమర్పించుటకు స్నేహితులము ముగ్గురము తలఁచుచుండఁగా, నీ సంకల్ప మనెడి తీఁగె వసంతకాలమునఁ బూచి ఫలింపఁగా, (వసంతరావుగారి సాయమువలన మీయాలోచన సఫలమైనదని భావము.) నీ కీలక సంవత్సర మందలి యాశ్వయుజ మాసమునఁ పూర్ణిమ, పాడ్యమి, విదియలందు వేలకొలఁది జనులు చూచుచుండ, నీ రామాయణ గ్రంథమును నీ పాలకి యం దుంచి కవులు, పండితులు, భక్తులు మోయఁగా ఛత్రము పట్టుకొని రాఁగా, మంగళ వాద్యములు మ్రోగుచుండఁగా.)

చ. వలగొని దేవతాయతన ◊ వాటియు నేకశిలాపురంబుఁ దా
రెలమిని జొచ్చి కోవెలను ◊ నెల్లకృతిం బఠియించి యా దినం
బుల, మహిమాభిరాముఁ డగు ◊ భూపతికిం దగుదొడ్డకొల్వులో
పల బిరుదాంకితుల్ కవులు ◊ పండితవర్యులు దూరదేశగుల్. ౧౨౦౨

తాత్పర్యము

(దేవాలయము గ్రామము మెఱవడి చేసి తిరిగి కోవెలకువచ్చి యీ కావ్యము నంతయు నా మూఁడు దినములలోఁ జదివి, మహిమచే మనోహరుఁడగు శ్రీరామ ప్రభువు పెద్దకొలువులో దూర దేశమునుండి వచ్చిన కవులు, పండితశ్రేష్ఠులు)

క. నీకృతిఁ దమిఁ గనుఁగొనఁగా, నేకశిలాపురికి రక్తి ◊ నేతెంచిన సు
శ్లోకులు మూలమునందలి, శ్లోకంబులతోడఁ బోల్చి◊శోధించి మఱిన్. ౧౨౦౩

అర్థములు. శోధించి=మూలమునంగల నానార్థములు, ధ్వన్యర్థములు అలంకారములు, లోనైనవి, కలవా లేవాయని పరీక్షించి, మఱిన్=అపిమ్మట.

తాత్పర్యము

ఈ కృతిఁ జూడ నొంటిమిట్టకుఁ బ్రేమతో వచ్చిన మంచి పేరుపొందిన వారు మూలమందలి శ్లోకములతోఁ బోల్చి శోధించి, మఱియు.)

ఉ. ఈ కృతి నీకు నర్హమని ◊ యేక విధంబుగ నెల్లఁ బ్రాజ్ఞులున్
బ్రాకటరీతిఁ బల్కఁగ స ◊ మర్పణ చేసి తాతండు తావకా
స్తోకమహత్త్వమున్ గరుణ ◊ చూపిన తీరు నుపన్యసించి నీ
యీ కృతి పార మందుటకు ◊ హేతువు నిక్కము నీవ యంచనెన్. ౧౨౦౪

అర్థములు. అతండు=కృతికర్త, తావక=నీ, అస్తోక=గొప్పదగు, మహత్త్వమున్=గొప్ప మహిమ.

తా త్ప ర్య ము

(ఈ కృతి నీకుఁ దగినదని పండితులందఱేక విధముగాఁ బ్రసిద్ధముగా జెప్పఁగా గ్రంథకర్త నీ గొప్ప మహిమను నీవు గరుణించిన విధము నుపన్యసించి యీకృతి సొంత మగుటకుఁ గారణము నీవే యని చెప్పెను.)

క. ఏవంవిధకృతిరచనకు నీ, వేమి వచించె దనుచు ♦ నినుఁ బ్రశ్నింపన్
నీ వా(ఱ్రుచ్చినవాక్యము, దేవా! నీకరుణ కాది♦దృష్టాంత మెకా. ౧౭౦౫

అర్థములు. నీవా(ఱ్రుచ్చిన వాక్యము="లెమ్మా హరిశార్దూలా! యిమ్మహి తార్ణవము దాఁటుమీ నీవు" "ఉత్తిష్ఠ హరిశార్దూల లంఘయస్వ మహార్ణవమ్!" అను వాక్యము ఆదిదృష్టాంతము మొదటి నిదర్శనము.

తా త్ప ర్య ము

(ఈ విధమైన కార్యము రచించుటకు ముందు నీ వేమి చెప్పెదవని యడుగఁగా, 'లెమ్మా! హరిశార్దూలా! యిమ్మహి తార్ణవము దాఁటుమీ నీవు' అని నీవు సెలవిచ్చిన వాక్యము ని దయకు మొదటి నిదర్శనముకదా.)

క. తావుల కనుగుణముగ దుఃఖావళి ప్రాప్తింపఁ జిత్త ♦ మారట గొనఁగా
నే విసివినచోఁ దేర్పవె, దేవా! నీ కరుణ కదియు♦దృష్టాంతమెకా. ౧౭౦౬

అర్థములు. తావులకు=ఆయా కథాసందర్భ ఘట్టములకు, అనుగుణముగన్=తగినట్లు, రామ భరత సమాగమ ఘట్టము వ్రాయునపుడు మాతృమరణము, వాలి వధ వ్రాయునపుడు జ్యేష్ఠభ్రాతృ మరణము, నాగపాశ బంధన దినమున జ్వరపీడ లోనైనవి, విసివినచోన్=విసుఁగుగొనిన వేళల, రోగాది బాధలచే వ్రాయఁ జాలక యేల యీ పని పెట్టుకొంటిని, ఉన్నబాధ చాలక యిదియు నొకటియా యని చాలింపఁదలఁచినపుడు, తేర్పవే=స్వప్నములందును ఉపశ్రుతులందును, నూరార్చి ధైర్యము చెప్పవా?

తా త్ప ర్య ము.

(ఆయా కథా ఘట్టములు వ్రాయునపుడు తగినట్లు మాతృమరణము భ్రాతృ మరణము జ్వరపీడ లోనైన వాని మూలము దుఃఖములు ప్రాప్తించఁగా మనస్సునం దారాటము గలుగ, రోగబాధచే విసువుపుట్టఁగా, స్వప్నములందు, ఉపశ్రుతులందు నూరార్చి ధైర్యము చెప్పవా! నీ దయకిదియు నిదర్శనమేకదా.)

క. నే వేడకయును గృతినిం, గావించుచు నుండ సాత్త్వి♦కత్యాగముగన్
భూవిభుఁ డిది ప్రకటించుట, దేవా! నీమహిమ కదియు ♦ దృష్టాంతమెకా.

అర్థములు. సాత్త్విక త్యాగముగ = ప్రతిఫలాపేక్ష లేక, భూవిభుఁడు= పిఠాపురము రాజుగారు, శ్రీ రాజారావు గంగాధర రామారావు కుమారుఁడు కుమార వేంకట మహీపతి సూర్యారావుగారు.

తా త్ప ర్య ము

(ప్రతిఫలాపేక్ష లేక నే నీ రామాయణమును వ్రాయుచుండఁగా నేను గోరకుండనే పిఠాపురము రాజుగారు దీని నచ్చువేయించి ప్రకటించుట రామా! నీ మహిమ కిది నిదర్శనము కాదా.)

క. నావిధము నీవు కృతిగొను, నావిభవము నిజము పలుక ♦ నత్యుక్తిగఁ దా
భావించుఁ జూడనాతఁడు, దేవా! నీమహిమ కదియు ♦ దృష్టాంతమెకా. ౧౭౦౮

అర్థములు. నావిధము=నాదరిద్ర స్థితి, ఆ విభవము = జగత్ప్రసిద్ధముగా మహారాజ విభవముతో నంకితము కొనిన ఠీవి, అత్యుక్తిగన్=అద్భుతము అసత్యమని తోఁచు విధముగ, నమ్మరాని వాస్తవముగ, చూడ నాతఁడు=చూడని పురుషుఁడు.

తా త్ప ర్య ము

(నా దరిద్ర స్థితి, జగత్ప్రసిద్ధముగా మహారాజ విభవముతో నీ వంకితము గొన్న ఠీవియు నిజము చెప్పినను చూడనివాఁడు నమ్మరాని వాస్తవముగా భావించును. దేవా! నీ ప్రభావమున కదియును నిదర్శనమేకదా.)

ఉ. కమ్మ నిమిత్తమాత్ర మని ♦ కవ్వడి కీవు వచించినట్టి వా
క్యమ్మును నమ్మి నీనుడి ప్ర♦కారము వర్తిలు చున్న నీవె చి
త్రమ్ముగఁ దీర్చుటల్ కనితి ♦ దాశరథీ! కయిగొంటి వీవు నీ
స్వమ్మును బూర్ణచిత్తమునఁ ♦ జల్పుము నీమది వచ్చినట్లిఁకన్. ౧౭౦౯

అర్థములు. కమ్మ నిమిత్త మాత్రము=నిమిత్తమాత్రం భవ సవ్యసాచిన్ అని భ॥ గీ॥ వాక్యము, కవ్వడికిన్=అర్జునునకు, స్వమ్మును=సొమ్మును.

తా త్ప ర్య ము

(నీ వర్జునునకు 'నీవు నిమిత్త మాత్రముండుము' అని వచించినమాట నమ్మి నీ చెప్పిన ప్రకారము నడచుచుండ సర్వము నీవు చిత్రముగా నెఱవేర్చుట చూచితిని-రామా! నీ సొమ్ము నీవు నిండు మనస్సు గ్రహించితివి-ఇఁక నీమనస్సు వచ్చినట్లు చేయుము.)

—♦ ఉత్తరకాండాంత పద్యములు ♦—

క. మసకరిరక్షాదక్ష! న,మసకరణస్మరణతుష్ట♦మా నసకమలా!
భాసకరకులదీపక! శ్రే,యస్కర! వినతాఘతస్క♦రా! రఘువీరా! ౧౭౧౦

అర్థములు. మస్కరి రక్షా దక్ష=జ్ఞానుల రక్షించుట యందు దక్షా. మస్కరి=త్రిదండము ధరించిన వాఁడు, త్రిదండము మనోవాక్కాయముల నియమించినందులకై చిహ్నము, నమస్కరణ = నమస్కారము చేతను, స్మరణ= నామము స్మరించుటచేతను, తుష్ట=సంతోషించిన. మానస కమలా=మనస్సను తామర పుష్పము గలవాఁడా, భాస్కర కులదీపక=సూర్యవంశమును ప్రకాశింపఁ జేయువాఁడా, శ్రేయస్కర=భక్తులకు శ్రేయస్సు గలిగించువాఁడా, వినత= నమస్కరించిన వారి, అఘ=పాపములను, తస్కరా=దొంగిలించువాఁడా.

ఉ. పాలితసర్వలోక చయ! ♦ బ్రహ్మముఖామర నిత్యపూజితా!
క్షాళితభక్తలోక కలు♦షా!యసమానవదాన్య శేఖరా!
శ్రీలలితాంఘ్రి వారినిజ♦చిన్మయ నామపునీతసర్వదే
వాళిమనుష్యసంచయ! న♦రాకృతి భాసిత! కీర్తి భాసితా! ౧౭౧౧

అర్థములు, పాలిత=రక్షింపఁబడిన, సర్వలోకచయ=సమస్తలోక సమూహములు గలవాఁడా, బ్రహ్మముఖ=బ్రహ్మ మొదలైన, అమర=దేవతలచే, నిత్య పూజితా=ప్రతి దినము పూజింపఁబడువాఁడా, బ్రహ్మేంద్రాదు లవతార మూర్తులనే పూజింతురని విష్ణుపురాణమునఁ గలదు. క్షాళిత=కడుగఁబడిన భక్తలోక కలుషా=భక్తసమూహముల పాపములు గలవాఁడా. అసమాన=సమానులు లేని, వదాన్య శేఖరా = శ్రేష్ఠుఁడవైనదాతా, శ్రీలలిత=శోభచే సుందరమైన, అంఘ్రివారి=పాదజలము చేతను, నిజ=తనయొక్క, చిన్మయనామ=జ్ఞానమయమైన పేరిచేతను, పునీత = పవిత్రము చేయఁబడిన, సర్వదేవాళి= సమస్త దేవతలయు, మనుష్య=మనుష్యులయు, సంచయ=సమూహము గలవాఁడా, నరాకృతి భాసిత=మనుష్యాకారమున ప్రకాశించువాఁడా, కీర్తిభాసితా=కీర్తిచేఁ ప్రకాశించు వాఁడా.

సుగంధి. రామ చంద్ర గోత్ర చంద్ర ♦ రమ్యపద్య గేయమా
నామలోత్తర ప్రచార ♦ యాదిదేవ శ్రీహరీ
రామ యొంటిమిట్టధామ ♦ రాజకన్యకాలస
ద్వామభాగ దివ్యభోగ ♦ వాసు దాససేవధీ. ౧౭౧౨

అర్థములు. రామ=౩, చంద్ర=౧, గోత్ర=౭, చంద్ర=౧ అనగా ౧౭౧౩ సంఖ్యగల, రమ్య=మనోహరములైన. పద్య=పద్యములచే, గేయమాన=కీర్తింపఁబడిన, అమల=నిర్మలమైన, ఉత్తర=శ్రేష్ఠమైన, ప్రచార=వర్తనము గలవాఁడా, ఇది యుత్తరకాండార్థమును సూచించుచున్నది. రాజకన్యకాలసత్ = జనక రాజ పుత్రికచేఁ ప్రకాశించు, వామభాగ = ఎడమ పార్శ్వము కలవాఁడా, వాసుదాస=వావిలికొలను సుబ్బరాయదాసునకు, సేవధీ = నిధియైనవాఁడా,

వాసు=ఇది వాసుదేవ శబ్దమున నేకదేశము. ఎవనియందు సర్వము వశించునో ఎవఁడు సర్వమునందు వసించునో యతఁడు వాసుఁడు. అట్టి వానికి దాసుఁడని యర్థము. 'వాసుదేవ స్సర్వమితి స మహాత్మా సుదుర్లభ'యను వాక్యము స్మరించునది.

—• మంగళ మహాశ్రీ వృత్తము • —

మంగళము రామునకు • మంజుగుణ దామునకు• మాన్యసురసోమునకు నెందున్
మంగళము సీతకను • మాన పరిపూతకును • మాత కఘధూతకు సతంబున్
మంగళము భ్రాతృహిత • మండలసమేతునకు • మారుతిసమర్చితునకున్ స
న్మంగళము భక్తజన•మానసనివాసునకు•మా నగుత మంగళమహాశ్రీ. ౧౭౧౨

ఈ మంగళమహాశ్రీవృత్తరూపమున సీతారామాంజనేయులకు మంగళము చెప్పబడెను.

మంగళమహాశ్రీ భ జ స న భ జ స న గ గ లు గుణములు, తొమ్మిదింటఁ దొమ్మింట యతులు.

—• గ ద్య ము •—

ఇది శ్రీ మద్రామచంద్ర చరణారవింద మిళిందాయమాన
మానసత్వ మహావైభవ వావిలికొలను రామచంద్ర
రాయతనూభవ సుజనవిధేయ సుబ్బరాయ నామ
ధేయ ప్రణీతం బైన శ్రీమదాంధ్ర వాల్మీకి
రామాయణ మను నిర్వచన మహా
కా వ్యం బు నం దు
ఉత్తర కాండము
స ర్వ ము సం పూ ర్ణ ము

శ్రీ రా మా ర్ప ణ మ స్తు.
శ్రీ శ్రీ శ్రీ

శ్లో. నమోస్తు రామాయ సలక్ష్మణాయ, నమోస్తు దేవ్యై జనకాత్మజాయై,
నమోస్తు వాతాత్మభువే వరాయ, నమోస్తు వల్మీకభవాయ తస్మై.

—• వ్యాఖ్యాంత పద్యములు *—

చ. జనకసుతామనోహర! య ♦ శంకితవృత్తిని సర్వభారమున్
బనిగొని నీ పయిన్ వయిచి ♦ పల్కుఁదొడంగితి నీ మహాకృతిన్
గనికర మారఁ దద్భరము ♦ గైకొని నీవును దీని సాంతమున్
బనిపడజేసి నీదుమహి ♦ మన్ వెలయించితి ధారిణీస్థలిన్.

సీ. నీదు ప్రేరణమున ♦ నిర్జరుల్ క్షీరాబ్ధి, మథియింపఁ బూర్వంబు ♦ మందరమున
హాలహాలంబు జనింప ♦ నణచిఁ యద్దానిని, గామధేనువు మణి ♦ కల్పనగము
అమృతంబు జనియింప ♦ నదియెల్ల బుధులకు, నీవ కా పంచితి ♦ నీరజాక్ష
అట్టులే రామాయ♦ణాబ్ధి మందరమునఁ, జిలుకంగ జనియింప♦హాలహాలంబు

ఆ. దాని నణఁచి బాలి♦శాసురోద్ధతి మాన్పి, కలఁత మాన్పి తీవు ♦ గ్రామమందు
మోహనాంగ యింక♦బుధుల కీయమృతంబుఁ, బంచిపెట్టవయ్య♦పటిమచూపి.

సీ. ఈయూరగలిగిన ♦ నాయాశ్రమంబున, బాలకాండవ్యాఖ్య ♦ బలికినాఁడ
నగరిమేల్పట్టును ♦ నవ్యగ్రామమున సుబ్రహ్మణ్యా నాయని ♦ భవనమందు
నాయన ప్రాపొంది ♦ యాడితి రెండవ, కాండంబు పూర్ణంబు♦గాఁగఁ బిదప
నడిగడ్డపాళెంబు ♦ నందుఁ గూనంనేని, వేంకటప్పయ్య స ♦ ద్వేశ్మమునను

గీ. బలికినాఁడను నారణ్య♦భాగమెల్ల, నవల నొకయేఁడు శుష్క వే♦దాంతిజనుల
తోడి కలహంబునను బోయెఁ♦దోయజాక్ష, నీదుకృతి రచియింపఁగ♦నేరనైతి.

క. ఎచ్చట స్వపరజనంబుల, రచ్చలు లేకుండఁ గృతిని ♦ రచియింతు నటం
చిచ్చను దోలాందోళన, మెచ్చఁగఁ దలపోయుచుం డ♦ నీ సమయమునన్.

సీ. వీరవరంబును♦విశ్రుత కోలంక, గ్రామాదులకు నెల్ల ♦ రాజ్ఞియగుచు
దాన సుశీలతా ♦ దమ దయా వాత్సల్య ప్రాభవముల కాట♦పట్టు దీన
జనయిత్రియైన రా♦జా బహదూరు చె, ల్లాయమ్మరావుగా♦రామెస్నుషయుఁ
గౌసల్యకును జాన♦కీఁసతి బోలిన, సాధ్వి రామాయమ్మ ♦ సదయహృదయ

గీ. రాజ రాజశ్రీ శ్రీరాజ♦రావు ప్రథిత, మహిత వేంకటసూర్యకు♦మార మహిప
రావు బహదరు వారి య♦ర్ధాంగలక్ష్మి,యిరువు రవ్యాజకరుణనన్♦దరికిఁబిలిచి

క. నీ మందరగ్రంథంబును, మా మందిరమందుఁ బూర్తి♦మానుగఁజలుపన్
మామత మనుచును సెలవిడ, రాముని ప్రేరణ మటంచు♦రంజిలినాఁడన్.

క. అది యట్టు లనుచుఁ దెలిసితిఁ, బిదపన్ మా రామవిభుఁడె♦ప్రేరింపంగన్
ముదితల స్వభక్తిరతలన్, సదయలు నాకట్లు సెలవొ♦సంగి రటంచున్.

చ. పరమపదంబుఁ జేరఁ దన ♦ భక్తిబలంబునఁ బోవువేళ నా
వరగుణ చెల్లమాంబ తన ♦ ప్రాణపదంబును రామయమ్మనున్
దరియఁగఁ బిల్చి మర్వకుము ♦ తల్లిరొ విశ్రుతు నొంటిమిట్ట శ్రీ
హరి రఘురాము నంచుఁ బలు ♦ కాడెను నంతిమ భాషణంబుగన్.

సీ. ఉల్లమందలి భక్తి ♦ హోమాగ్నికిని నత్తగారివాక్యం బాజ్య♦ధార గాఁగ
మరల నన్ బిలిపించి♦మాతృవత్సలతను, నామె నన్ బోషించె♦సాదరముగ
సపరివారంబుగ♦సంవత్సరం బొండు, నూతనాశ్రమ మొందు♦ప్రీతినిలిపె
రామకార్యముదక్క♦నామనంబునయందు, వేఱొండు చింతను♦విడిచియుంటి

గీ. హాయిగాఁగనపూర్వ♦సౌఖ్యంబుఁగనుచు, గ్రంథమంతయుఁదుదఁగన♦వ్రాసినాఁడ
లక్ష్మినరసాపురంబున ♦ లలితశీల, మాసనవకంబునందు క్ష♦మాసుతేశ.

క. ఆశ్వాశ్రమాప్నుపలకు ని, త్యైశ్వర్యము లోకయుగము♦నందు సుఖంబున్
శాశ్వతమాంగల్యంబును, విశ్వనుత! యనుగ్రహింపు♦విడువనికరుణన్.

సీ. ఆ తల్లి గారిట్టు ♦ లాదరంబునఁ బ్రోవ, యామర్తి సుబ్బదా♦సార్యవరుఁడు
శిష్యుఁడై హితుఁడయి♦చేదోడు నగుచును, నిఖిలకార్యంబు♦నిర్వహింప
సీతమ్మ ప్రాపుగా ♦ చిల్లర లక్ష్మమ్మ, యేకపున్నమ్మయు♦నెల్లవిధుల
మేనిని బ్రోవంగ ♦ మేకొన నీ విట్లు, వీరినొసంగిన ♦ కారణమున

గీ. సాంతముగ గ్రంథ మంతయు♦జలుపఁగంటి, నేకచిత్తంబుతోడ నే♦లోకమంద
నైన వీరలతోడి పొ ♦ త్తమరియుండఁ, జేయవే జానకీనాథ ♦ శ్రీసనాథ.

క. అంతేవాసినులను నే, కాంతము నీ సేవసేయు ♦ కాంతల శుభసు
స్వాంతలఁ గాంతులతో నీ యంతికమున నిల్పవయ్య♦యనవరతంబున్.

ఉ. ఎందఱు లేరు లోకమున ♦ నింతకు మించిన విత్తవంతు లా
యందఱ కేల నీవు భవ ♦ దాకృతిఁ జూపవు? భక్తులంచు వీ
రిం దయనీయ లంచుఁగద ♦ ప్రేరణచేసితి నీదు దృష్టికిన్
బొంనుగఁ బాత్రలౌ సతులు ♦ పుణ్యలు మాన్యలు వంద్యలేకదా.

సీ. చేయించుకొంటివి ♦ శ్రీమహాసామ్రాజ్య, పట్టాభిషేకంబు♦ప్రకటరీతి
వ్రాయించుకొం టాంధ్ర♦రామాయణంబును, సవ్యాఖ్యముగ మాని♦జల్పితంబు
కాయించుకొంటివి♦జెయని బుధు లెన్నఁ, గీర్తి వెన్నెలలది ♦ క్ష్మమలంను
బోయించుకొంటివి♦వేయిఘటంబుల, నైదువందల సుతీ♦ర్థాంబువులను

గీ. నీను మహిమంబు వెలయంగ♦నిఖిలజగతి, దేనికిని గొఱమాలిన♦దీను నన్ను
సాధనంబుగఁ గొనుచుఁ బ్ర♦శస్తరీతి. రమ్యసత్కీర్తి కోదండ♦రామమూర్తి.

సీ. కైవల్యమునఁ గాంక్ష ◊ గలవాని తీరున, బ్రహ్మచర్యమునకు ◊ భ్రాంతి సేయ
నాకలోకసుఖంబు ◊ నాశించు తపసి నా, నడవుల నలజడి ◊ కుడువనొల్లఁ
బరపిండనిరతులై ◊ పర్యటించెడి యతి, చందంబునకు నేను ◊ నందగింప
క్రుక్కుమికాక్రుడక ◊ కూర్చుండు యోగుల, కుణపవృత్తముపయి ◊ గోరికసేయ

గీ. తావకీనపదాబ్జాత ◊ సేవనమున, నిత్య నిరవద్య నిరవధి ◊ నిర్వికల్ప
నిస్తులానందవార్ధి ము ◊ నింగి యుండ, నభిలషించెద నేలోక ◊ మందు నున్న.

క. కర్మములకు జన్మములకు, ధర్మములకు వెఱవ నయ్య ◊ తావకసేవా
ధర్మమున భక్తి జనులకు, శర్మము గూర్పంగ నేను ◊ జాలుదు నేనిన్.

క. లోకోపకారకం బగు, నీ కైంకర్యంబునందు ◊ నిలుపుము నన్నున్
వైకుంఠమందె నిల్వఁగ, నా కభిలాషంబు లేదు ◊ నాళీకాక్షా.

సీ. ఆనందవార్ధి నీ ◊ హల్లోహలంబుగ, నను ముంచి యెప్పుడుఁ ◊ దనరు దాని
నేవేళ యాదశ ◊ యేదేశ మనకుండ, ననపాయముగఁ గూడి ◊ యలరు దాని
శైశవ బాల్య జ ◊ రామయములు లేక, నిత్యయౌవనమున ◊ నెగడు దాని
అన్యంబు పై మది ◊ నరుగ నీయక నన్ను, దక్కించుకొను జాణ ◊ తనము దాని

గీ. ప్రకృతివేశ్యకు నను బాలు ◊ పడఁగ నీక, శక్తి భక్తి ననురక్తి ◊ యు జరుగు దాని
నిచ్చి పెండిలి సేయుమీ ◊ యిందిరేశ, యుంకువుగ దీని గైకొని ◊ యుల్లమలర.

సీ. తనవలెనే నేను ◊ ధర్మధీ సలుపనే, నిష్ఠమై యేక ప ◊ త్నీవ్రతంబు
తనవలెనే నేను ◊ వనముల గుట్టలఁ, గొండల నిడుమలఁ ◊ గుడువలేదె
తనవలెనే నేను ◊ వనమూల ఫలములఁ, గందలఁ గాలంబు ◊ గడపలేదె
తనవలెనే నేను ◊ దనరి విధురుఁడనై, జనహితార్థంబుగ ◊ జరుగలేదె

గీ. తనదు సేవయె పరమార్థ ◊ మనుచుఁ దలఁచి, త్రికరణంబులవదల నే ◊ సుకములెల్ల
నీయనే నాదు సర్వస్వ ◊ మెల్లఁ దనకె, యేల మఱచును నన్ను సీ ◊ తేశుఁ డెపుడు.

క. నన్నెట్లు నీవు మఱతువు, నిన్నెట్టులు నేను మఱవ ◊ నేర్తును జెప్పుమా
కన్నాకై యిన్నాళ్ళులుఁ, బన్నుగ రక్షింపఁ జేతి ◊ వాడో డగుచున్,

ఉ. కమ్మ నిమిత్తమాత్రమని ◊ కవ్వడి కీవు వచించినట్టి వా
క్యమ్మును నమ్మి నీ నుడి ప్ర ◊ కారము వర్తిలనన్ని నీవె చి
త్రమ్ముగఁ దీర్చుటల్ గనితి ◊ దాశరథీ, కయికొంటి వీవు నీ
స్వమ్మును బూర్ణచిత్తమునఁ ◊ జల్పుము నీమది వచ్చినట్లికన్.

క. సైరింపు దేవ! నా యపచారము లవి యెన్నొ కలవు ◊ సత్యము కరుణా
పారగ! కైకొనుము నను, సాకారముఁ గావింతు నొంట ◊ శక్తుఁడ గామిన్.